ఓం నమో వేంకటేశాయ

తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి

శ్రీ పద్మావతి మహిళా డిగ్రీ మరియు పి.జి. కళాశాల, తిరుపతి

తెలుగు విభాగము

మరియు అన్నమాచార్య ప్రాజెక్ట్ వారి సంయుక్త ఆధ్వర్యంలో

# జాతీయ సదస్సు

# అన్నమయ్య సంకీర్తనలు - తెలుగు సాహిత్య వైభవం

10, 11, 12 సెప్టెంబర్, 2014





# సావనీర్

శ్రీ పద్మావతి మహిళా డిగ్రీ మరియు పి.జి. కళాశాల
తెలుగు విభాగము
మరియు
అన్నమాచార్య ప్రాజెక్ట్ వారి సంయుక్త ఆధ్వర్యంలో

# జాతీయ సదస్సు

## అన్నమయ్య సంకీర్తనలు - తెలుగు సాహిత్య వైభవం

సెప్టెంబర్ 10,11,12, 2014




సంచాలకులు
డా॥ వి. కృష్ణవేణి
తెలుగు అధ్యాపకులు
శ్రీ పద్మావతి మహిళా డిగ్రీ మరియు పి.జి. కళాశాల, తిరుపతి



ప్రచురణ
తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి
సెప్టెంబరు, 2014

# ఆశయం

క్రీ.శ. 15వ శతాబ్దంలో శ్రీ వేంకటేశ్వరస్వామి వారి నందకాంశ సంభూతుడుగా తాళ్ళపాక అన్నమాచార్యుల వారు జన్మించాడు. తన పదహారవ యేట శ్రీ వేంకటేశ్వరుని సాక్షాత్కారం పొంది స్వామి ఆదేశంతో సంకీర్తన రచనకు శ్రీకారం చుట్టి ఆనాటి నుండి జీవితాంతం వరకు దినమునకు ఒక్క సంకీర్తనకు తక్కువ గాకుండా సంకీర్తన రచన సాగించాడు. అన్నమయ్య పదాలలో సంగీతం, సాహిత్యం, ఆధ్యాత్మికత త్రివేణి సంగమంలా మేళవించాయి.

తాళ్లపాక పద కవిత్రయంగా కీర్తి గడించిన తాళ్లపాక అన్నమాచార్యులు, తాళ్ళపాక పెదతిరుమల్య, చినతిరుమలయ్యల సంకీర్తనల రాగి రేకులు తిరుమలలో శ్రీవారి ఆలయంలో 'తాళ్ళపాక అర'లో లభించాయి. తాళ్ళపాక వారి సాహిత్యాన్ని రాగి రేకుల నుండి పరిష్కరించిన మహాపండుతులు కీ.శే. సాధు సుబ్రహ్మణ్యం శాస్త్రి, రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ, పండిత విజయరాఘవాచార్యులు, వేటూరి ప్రభాకరశాస్త్రి, గౌరిపెద్ది రామసుబ్బశర్మ, పి.టి. జగన్నాథరావు, శ్రీయుతులు ఉదయగిరి శ్రీనివాసాచార్యులు. వీరి కృషి వలన మనము ఈనాడు ఉపస్మృత ప్రాయమైన తాళ్ళపాకవారి సాహిత్యాన్ని ఆశ్వాదిస్తున్నాము. చిత్తశాంతిని, శరణాగతిని ప్రసాదించే దివ్య సంకీర్తనలను లోక విదితం చేయాలనే సంకల్పంతో తిరుమల తిరుపతి దేవస్థానం వారు 1978లో అన్నమాచార్య ప్రాజెక్టును స్థాపించడం జరిగింది. నాటి నుండి సంగీత సభలు, సాహితీ సదస్సులు, క్యాసెట్స్‌ను రూపొందించడం ద్వారా అన్నమాచార్య సంకీర్తనలు దేశ, విదేశాల్లో బహుళ ప్రజాదరణ పొందాయి.

తిరుమల తిరుపతి దేవస్థానములు అన్నమాచార్య ప్రాజెక్టు స్థాపించినప్పటి నుండి తాళ్ళపాక కవుల సాహిత్యంపై వివిధ విశ్వవిద్యాలయాలలో పరిశోధన చేసే పరిశోధకులకు ఉపకార వేతనం ఇచ్చి ప్రోత్సహిస్తున్నది. వివిధ విశ్వవిద్యా లయాల సమన్వయంతో తాళ్ళపాక కవుల సాహిత్యంపై సాహితీ సదస్సులను నిర్వహిస్తున్నది. ఇప్పటివరకు ఎన్నో సిద్ధాంత వ్యాసాలు సమర్పింపబడ్డాయి. సిద్ధాంత గ్రంథాలే గాక ప్రసిద్ధ విద్వాంసులు అనేకులు అన్నమయ్య సాహిత్యం మీద వివిధ దృక్కోణాలతో పలు గ్రంథాలు రచించిన వారున్నారు. ఈ పరంపరలో తి.తి.దే. యాజమాన్యంలో పనిచేయుచున్న శ్రీ పద్మావతి మహిళా డిగ్రీ మరియు పి.జి. కళాశాలలో అన్నమాచార్య సాహిత్యం మీద జాతీయ సదస్సు నిర్వహించడం ముదావహం. రాయలసీమలోనే

ప్రథమ మహిళా కళాశాల అయిన ఈ కళాశాలలో రాయలసీమలో పుట్టి ఆ ప్రాంతానికే ఖ్యాతి గడించిన అన్నమయ్య సంకీర్తనల జాతీయ సదస్సు జరగడం ఎంతైనా సమంజసం. మొక్కై వంగనిది మానై వంగదు అన్నట్లు విద్యార్థి దశ నుండే భగవంతునిపై భక్తిని, అనురక్తిని కల్గించడానికి ఈ జాతీయ సదస్సు ఎంతో ప్రయోజనకరంగా వుంటుందని భావించి అన్నమాచార్య ప్రాజెక్టు శ్రీ పద్మావతి మహిళా డిగ్రీ మరియు పి.జి. కళాశాల సమన్వయంతో మూడు రోజులు వివిధ విశ్వవిద్యాలయాల నుండి సాహితీవేత్తలను, పండితులను ఆహ్వానించి జాతీయ సదస్సును నిర్వహించడం జరుగుతున్నది. ఈ అవకాశాన్ని విద్యార్థినులు, అధ్యాపకులు, సాహిత్యాభిలాషులు సద్వినియోగం చేసుకొని శ్రేయస్సు పొందగలరని ఆకాంక్షిస్తూ...

**పి. మునిరత్నం రెడ్డి**
**సంచాలకులు**
**అన్నమాచార్య ప్రాజెక్టు, తి.తి.దే., తిరుపతి**

***

# ఆకాంక్ష

'అన్నమయ్య సంకీర్తనలు - తెలుగు సాహిత్య వైభవం' అనే అంశంపై నిర్వహిస్తున్న మూడు రోజుల జాతీయ సదస్సు అభినందనీయం. అందునా యాజమాన్యం ద్వారా అన్నమాచార్య ప్రాజెక్టు ఆధ్వర్యంలోని ఈ సదస్సుకు మా కళాశాల వేదిక కావడం మరీ మరీ ముదావహం.

పాశ్చాత్య పోకడలతో ఆధునికత వైపు పరుగులెత్తుతున్న నేటి యువత ఆలోచనా సరళిని మంచివైపు నడిపించాలంటే విలువలు కల సాహిత్య అధ్యయనం తప్పనిసరి. లోకజ్ఞుడయిన అన్నమయ్య సంకీర్తనలలోని భావాలు అందుకు తరుణోపాయాలు. అందుకే అన్నమయ్య సంకీర్తనలలోని సాహిత్యాంశాలపై జాతీయ సదస్సంటే మా అభిరుచి నెరవేరుతుందని ఆశించాము. దేశవ్యాప్తంగా హాజరవుతున్న ఆచార్యులు, అధ్యాపకులు, పరిశోధకులు, విద్యార్థినులకు ఈ సదస్సు విజ్ఞాన వికాసాలను అందిస్తుందని ఆకాంక్షిస్తున్నాము. సదస్సు నిర్వహణకు విజయవంతంగా కృషి చేస్తున్న తెలుగు విభాగం అధ్యాపకులకు అభినందనలు.

మాతృభాష మహోన్నతిని చాటిచెప్పే ఇలాంటి జాతీయ సదస్సులు మరెన్నో జరగాలని ఆకాంక్షిస్తూ...

**డా॥ పి. జ్ఞానకుమారి**
ప్రిన్సిపాల్
శ్రీ పద్మావతి మహిళా డిగ్రీ మరియు
పి.జి. కళాశాల, తిరుపతి

***

# మామాట

తెలుగు భాష గొప్పదనాన్ని మాతృభాషలోని మాధుర్యాలను విద్యార్థులకు అందజేయడం తెలుగు అధ్యాపకురాలిగా నా కర్తవ్యం. తెలుగు భాషాభివృద్ధిని ఆకాంక్షిస్తూ భాషలోని విశిష్ట సాహిత్యాన్ని విద్యార్థులకు, భావితరాలకు అందజేయాలన్న సత్ సంకల్పంతో కళాశాలలోని తెలుగు విభాగం తరపున జాతీయ సదస్సు నిర్వహణ ద్వారా నా ఆశయం నెరవేరుతుందని భావించాను. భక్తి, ముక్తి తత్త్వాలకు సోపానాలయిన అన్నమయ్య పదసాహిత్యంపై సదస్సు జరిపితే మరింత ప్రయోజనం నెరవేరుతుందని తలచాను.

జానపద బాణీని, తెలుగు నుడికారాలను, శ్రీనివాసునిపై శరణాగతి తత్త్వాన్ని బోధించిన అన్నమయ్య సంకీర్తనలలోని సాహిత్య, సంగీత నిధులపై పరిశోధన, పరిశీలన ఈ సదస్సు గమ్యం. అందువలన "అన్నమయ్య సంకీర్తనలు-తెలుగు సాహిత్య వైభవం" అనే అంశాన్ని ఎంపిక చేసుకున్నాను. అన్నమయ్య సాహిత్యం లోని విస్తృతి దృష్ట్యా మూడురోజుల జాతీయ సదస్సు నిర్వహిస్తే ఎన్నుకున్న అంశానికి న్యాయం చేయగలుగుతాము.

**సదస్సు లక్ష్యాలు :**

1. అన్నమయ్య సంకీర్తనలపై పరిశోధనలు నిర్వహించాలనే సృజనాత్మకతను విద్యార్థులలో, పరిశోధకులలో కలిగించటం.
2. పదకవితా పితామహుని సంకీర్తనలలోని సాహిత్యాన్ని వెలికితీయడం.
3. పదాలలోని తాళ, సంగీత మాధుర్యాన్ని ఆస్వాదింపజేయటం.
4. శరణాగతి తత్త్వంలోని ఔన్నత్యాన్ని విద్యార్థి లోకానికి వివరించటం.
5. తెలుగు జానపదాలు, నుడికారాలు, పలుకుబడులు, సామెతలు, జాతీయాలపై అవగాహన కలిగించడం.
6. పత్ర సమర్పకుల పత్రాలను పుస్తక రూపంలో తీసుకువచ్చి భావితరాలకు అందించటం.
7. మాతృభాషపై మక్కువను విద్యార్థులలో పెంపొందించటం.

ఈ సదస్సులో తి.తి.దే. విద్యాసంస్థల్లో పనిచేస్తున్న అధ్యాపకులను భాగస్వామ్యులుగా చేస్తున్నాము. సదస్సులో పత్ర సమర్పన చేస్తున్నవారు ఆచార్యులు, అధ్యాపకులు, ఉపాధ్యాయులు, పరిశోధక విద్యార్థులు తెలుగు సాహిత్యాన్ని పరిశోధించినవారు, వీరే కాకుండా వాణిజ్యశాఖ, ఆంగ్ల, రసాయన, గణిత, వ్యాయామ, గ్రంథాలయ... మొదలయిన విభాగ అధ్యాపకులు, పత్రికా విలేకరులు, రక్షకభటులు. ఇందు వలన సదస్సు ప్రయోజనం నెరవేరిందని భావిస్తున్నాను.

ఇందుకు ఆ దేవదేవుడు నా కందించిన సంకల్పసిద్ధికి సదా ఆ దేవదేవుని పాదాలకు శతకోటి నమస్కారాలు.

**డా॥ వి. కృష్ణవేణి**
**సదస్సు సంచాలకులు**
**తెలుగు అధ్యాపకులు**
**శ్రీ పద్మావతి మహిళా డిగ్రీ మరియు**
**పి.జి. కళాశాల, తిరుపతి**

***

# అన్నమయ్య సంకీర్తనలు - తెలుగు సాహిత్య వైభవం

శ్రీ కామిశెట్టి శ్రీనివాసులు
విశ్రాంత అన్నమాచార్య ప్రాజెక్ట్ సంచాలకులు
హైదరాబాద్

## కీలకోపన్యాసము

అన్నమయ్య నామాంకితమైన సదస్సుకు విచ్చేసిన సాహితీ ప్రియులకు శ్రీనివాసుని అనంత మంగళాశాసనాలు.

తిరుమల తిరుపతి దేవస్థానాల అన్నమాచార్య ప్రాజెక్టు స్థాపించిన నాటి నుండి (1978, డిశెంబరులో) దాని నిర్వహణ బాధ్యతలను చేపట్టి, కొంతకాలం 1. పరిష్కరణ-ప్రచురణ, 2. ప్రచారము, 3. రికార్డింగులు అని మూడు విభాగాలుగ తీర్చిదిద్దినాను. మూడు దశాబ్దాలకు పైగా ఈ ప్రాజెక్టు శాఖోప శాఖలుగ విస్తరించి తాళ్లపాక కవుల వాఙ్మయం విశ్వవ్యాప్తం కావడానికి దోహదపడింది. ఎందరో కవులు, పండితులు, గాయకులు, కళాకారులు ఈ వాఙ్మయ వ్యాప్తికి, దీప్తికి కృషి చేసినవారే. అదొక సింహావలోకనము.

తాళ్లపాక కవులలో ఆద్యుడు అన్నమాచార్యులు. వీరి రచనలుగ మనము దక్కించుకొన్నవి [1]శృంగార అధ్యాత్మ సంకీర్తనలు, (కొన్ని వేలే) శృంగారమంజరి, వేంకటేశ్వర శతకం. వీరి తర్వాత కుమారుడు పెదతిరుమలయ్య, మనుమలు చినతిరుమలయ్య, చినతిరువెంగళనాథుడు (చిన్నన్న) వీరి రచనలు కొన్ని ప్రచురణ కెక్కినవి. సమకాలీన పండితుల ఈసడింపులకు లోనైన పదకవితలను, ద్విపద రచనలను సముద్ధరించి తెలుగు సాహితీ వైభవాన్ని వర్చస్స్వంతంగ నిలిపిన ఘనత తాళ్లపాక కవిపుంగవులదే.

తాళ్లపాక వారి రచనలన్నీ రాగిరేకుల మీద వ్రాసి పెట్టినారో లేదో కాని, మనకు లభించిన రెండువేలకు పైబడ్డ రేకులు, తిరుమల తిరుపతి దేవస్థానాల మ్యూజియంలో ప్రస్తుతం పదిలపరచినారు. ఆ రేకుల మీద వ్రాయబడిన తాళ్లపాక

---

1 "పరమ మంత్రములు ముప్పది రెండు వేలు, యోగ వైరాగ్య శృంగార సరణి చెప్పె" అని చిన్నన్న రచించిన అన్నమాచార్య చరిత్రలో పేర్కొనబడినది. కాని, మనకు అన్నమాచార్యుల సంకీర్తనలు పండ్రెండువేలు మాత్రమే లభించినవి.

వారి రచనలు ముద్రణ భాగ్యం పొందినవి. అందులో అన్నమయ్య, పెద తిరుమలయ్య, చినతిరుమలయ్య రచనలే కొంతవరకు లభ్యమయినవి. రాగిరేకుల మీద అంకెలు భేరీజు చేసినప్పుడు చాలవరకు రేకులు లుప్తమైనవనడం స్పష్టమే. అవి యెక్కడైనా, యెప్పుడైనా లభిస్తాయని ఆశ లేకపోలేదు. రాగం విలువ తెలియని జాతి రాగికోసం వానిని కరిగించుకొన్నది. లేనివానిని గురించి ఆలోచించడం మాని, ఉన్న వానిని తృప్తితో అధ్యయనం చేయడమే మన కర్తవ్యం. రాగిరేకులలో లేని కొన్ని కీర్తనలను నేను, నావంటి వారు, తాళపత్రాల నుండి సేకరించి ప్రచురించినారు. రాగిరేకుల మీది వ్రాత అందంగ తీర్చిదిద్ది నట్లుండడం ఆశ్చర్యాన్ని కలిగిస్తుంది. 'అన్నమరాజు తిమ్మరాజు' అని ఒక త్రాయసగాడి పేరు కనిపిస్తుంది. ప్రపంచ వాఙ్మయంలో యెక్కడ యిన్నివేల రాగిరేకుల మీద సారస్వత రచనలు వ్రాసిన దాఖలా కనిపించదు.

తాళ్లపాక వారి సారస్వతం రాశిలో, వాసిలో గొప్పది. వీరి రచనల్లో సంకీర్తనలే యెక్కువ. ప్రధానంగ పదకవితా పితామహుడు, సంకీర్తనాచార్యుడు, పంచమాగమ సార్వభౌముడని విఖ్యాతిని పొందిన అన్నమాచార్యుల సంకీర్తనలే మనకు యెక్కువగ లభించినవి. తాళ్లపాక కవులు, సంకీర్తన, పదం, కృతి, పాట అని సమానార్థకంగానే వ్యవహరించినారు. సంకీర్తన అంటే పల్లవి, చరణాలతో కూడిన రచన. ప్రతి పాటకు పల్లవి రెండు పాదాలు, చరణాలు మూడు ప్రాయికంగ ఉంటాయి. కొన్నిట రెండు లేక మూడు చరణాలకు మించి కనిపిస్తాయి. పాటలకు పల్లవి, చరణాల వింగడింపుతో పాటు రాగం పేరు కూడ పేర్కొనబడింది. అన్నమయ్య సంకీర్తనల్లో భిన్నరాగాలతో, భిన్నతాళాలతో కూర్చబడిన 'దేశిసూళాది' రాగతాళమాలిక కనిపిస్తుంది. దీనిని పరిష్కరించి, ప్రకటించి, వర్ణమెట్టులు వేయించి 1978లో మదరాసు మ్యూజిక్ అకాడెమీలో సమర్పించినాను.

అన్నమయ్య సంకీర్తనలు రచించి లక్ష్యలక్షణ సమన్వయ దృష్టితో సంకీర్తనా పరిశుద్ధికి 'సంకీర్తన లక్షణ' గ్రంథాన్ని కూడ రచించినాడు. అన్నమయ్య సంస్కృతంలో రచించిన ఆ లక్షణ గ్రంథం కాని, దానికి వ్యాఖ్యానం చేసిన పెదతిరుమలయ్య గ్రంథం గాని మనకు లభించలేదు. చినతిరుమలయ్య పద్య గద్యాత్మకంగ అనువదించిన లక్షణ గ్రంథమే మనకు మిగిలింది. తాళ్లపాక వారి సంకీర్తనలకు ఈ లక్షణ గ్రంథంలో కొంత సమన్వయం కనిపిస్తుంది.

అన్నమయ్య ప్రక్రియలో, భాషలో, భావంలో వినూత్నత్వాన్ని ప్రవేశ పెట్టినాడు. పల్లవి, చరణాలతో కూడిన సంకీర్తనకు వీరే మార్గదర్శకులు. అన్నమయ్యకు పూర్వం పాటలున్నట్లు ఆధారాలున్నా వాని స్వరూప స్వభావాలు తెలుసుకోవడానికి అవకాశం లేకపోయింది. అవి కాలగర్భంలో కలిసిపోయినవి. కాబట్టి మనకు తెలిసినంత వరకు అన్నమయ్యవే తొలి తెలుగు కీర్తనలు. అన్నమయ్యకు పూర్వమున్న కృష్ణమాచార్యుల

'సింహగిరి నరహరి వచనములు'తాళబంధ ఛందోవిరహితములు', అవి ఒట్టి గేయ గంధులే.

అన్నమయ్య 'మనోనూత్నక్రియలు' ముక్తకాలైనా కావ్యరసశోభితాలు. ఉదాహరణకు.,

**'బ్రహ్మ కడిగి పాదము**

**బ్రహ్మము తానె నీపాదము'** ఇది పల్లవి - తాను చెప్పదలచిన భావానికి పల్లవి తలకట్టు వంటిది. పల్లవిలో పొటమరించిన భావాన్నే చరణాలలో విస్తరింప చేస్తాడు.

**చెలగి వసుధగొలిచిన పాదము**
**బలితల మోసిన పాదము**
**తలకక గగనము తన్నిన పాదము**
**బలరిపు గాచిన పాదము**

**కామిని పాపము కడిగిన పాదము**
**పాము తల నిడిన పాదము**
**ప్రేమపు శ్రీసతి పిసికెడి పాదము**
**పామిడి తురగపు పాదము**

**పరమ యోగులకు పరిపరి విధముల**
**పరమొసగెడి నీపాదము**
**తిరువేంకటగిరి తిరుమని చూపిన**
**పరమపదము నీ పాదము.**

సంకీర్తనాచార్యుడు ఆ బ్రహ్మ కడిగిన పాదాన్ని ఉల్లేఖస్తూ వామన త్రివిక్రమ రూపాలను, రామకృష్ణాది అవతారాలను, పరమాత్మ తత్త్వాన్ని జ్ఞాపకం చేస్తున్నాడు. శరణాగతి ధర్మసూక్ష్మాన్ని ఉపదేశిస్తున్నాడు.

ఈ 'కీర్తన' అనే ప్రక్రియ ద్వారా రాగతాళ భావ సౌహార్దాలతో శ్రోతల హృదయాలలో ఆధ్యాత్మిక హర్మ్యాన్ని నిర్మించినాడు.

అన్నమయ్య అధ్యాత్మ సంకీర్తనలో కనిపించేది లోకనీతి, ధర్మం, న్యాయం, మానసబోధ. దేహ-ఆత్మ-ఈశ-వీని వివేకాన్ని, జ్ఞానాన్ని భక్తిమార్గంతో ప్రబోధిస్తాడు. శ్రీవారి పూజలు, ఉత్సవాలు, ఊరేగింపులు, సేవలు, తీర్థాలు, యాత్రా విశేషాలు; కళ్లకు కట్టినట్లు వర్ణిస్తాడు. వారి శృంగార సంకీర్తనలు మధురభక్తి మార్గాన్ని బోధిస్తాయి.

'పుమాన్ విష్ణురితిఖ్యాతః. స్త్రీప్రాయ మితరం జగత్' భగవంతుడొక్కడే పురుషోత్తముడు, ఇతర జగత్తంతా స్త్రీ ప్రాయం. అలమేలుమంగా శ్రీనివాసుల అమలిన శృంగారము, నాయికా నాయక భావం, భగవద్విరహం, జీవాత్మ పరమాత్మలు సంశ్లేషం - అంతా ఆధ్యాత్మిక శిఖరాలను స్పృశించేవే. సంకీర్తన లక్షణం అన్నమయ్య కృతులను "వేంకటశైల వల్లభ రతిక్రీడా రహస్యంబుల్" అని పేర్కొంటొంది. మచ్చుకొకటి -

**"పలుకు తేనెల తల్లి పవళించెను**
**కలికితనముల విభుని కలసినదిగాన"**

పల్లవిలోని భావాన్ని సంస్కార నిష్ఠంగ అర్థం చేసుకొంటే తర్వాతి చరణాలు బోధపడతాయి. నాయిక పలికినది, కలసినది నాయకుని తోడనే.

పతితో కలసి అలసిన ముద్దరాలు చెదరిన సొగసులు పతికి మనసా వచసా కర్మణా అర్పించుకొన్నదట. అది పరిణతిని పొందిన సంయోగ దశ. ఇది జీవాత్మ పరమాత్మల మధ్య పెనవేసుకొన్న బంధం. దివ్యదాంపత్య సుందరము.

**నిగనిగని మేనిపై నెరులు కెలకుల చెదర**
**పగలైన దాక చెలి పవళించెను**
**తెగని పరిణతులతో తెల్లవారినదాక**
**జగదేకపతి మనసు జట్టిగొనె గాన!**

అందం, యౌవనం, ఆభిజాత్యం, ఔజ్జ్వల్యం కలబోసినట్లున్న కులకాంత పరవశయై పరమాత్మ వశమయినది. ధర్మపత్ని తన ధర్మాన్ని నిర్వర్తించినది. పరమైకాంతికమైన సాన్నిధ్యం పరాకాష్ఠను పొందినది.

**కొంగు జారిన మెరుగు గుబ్బలొలయగ తరుణి**
**బంగారు మేడపై పవళించెను**
**చెంగలువ కనుగొనల సింగారములు తొలక**
**"అంగజగురుని" తోడ అలసినది గాన.**

'అంగజగురుడు' అనడం యెంతో గౌరవాన్ని ఆపాదించినది. గృహమేధి కావడం సంతానం కోసమే. 'మన్మథుని కన్నతండ్రి' మరి చెప్పవలసినదేమున్నది.

**మురిపెంపు నటనతో ముత్యాల మలగుపై**
**పరవశంబున తరుణి పవళించెను**
**తిరువేంకటాచలాధిపుని కౌగిట కలసి**
**అదవిరై నునుజెమట నంటినది గాన**

ముద్దరాలు అలసి సొలసి ముత్యాల మంచం మీద మువ్వంక మేనితో ఒరిగిపోయిన దట. దీనినే 'మోట్టాయితం' అన్నారు శృంగార లాక్షణికులు. "మోట్టాయితం ప్రియం స్మృత్వాపాంగభంగ విజృంభణం" అని అమరవ్యాఖ్యలో క్షీరస్వామి (1-6-33)" రాళ్లపల్లి వారి వ్యాఖ్య. అలమేలుమంగ ముద్దుమురిపాలను తిలకించి పులకించిన కన్యాదాత తృప్తితో నిట్టూర్చినాడు. అన్నమయ్య దుహిత అలమేలుమంగ, అల్లుడు శ్రీనివాసుడు, అన్నమయ్యది పితృస్థానం. శ్రీవారి కల్యాణోత్సవం దేవాలయ ఆగమంలో ప్రవేశ పెట్టిన ఘనత అన్నమయ్యదే. అలమేలుమంగను కన్నతల్లిగ భావిస్తాడు. కన్నబిడ్డగ లాలిస్తాడు.

అన్నమయ్య సంకీర్తనల్ని విశ్లేషించడం కొంత ఓర్పుతో సాగించవలసిన పని. స్వతంత్రమైన వారి భావాలు, సూటిగ మనసును తాకే రసాత్మకమైన వాక్యాలు, పదాలు, పదబంధాలు, నుడికారపు సొగసులు. అన్నిటా మించి భావప్రకటనలో గల ఆర్జవత్వము వనల్ని పట్టి నిలుపుతాయి. అన్నమయ్య కీర్తనల్ని బుద్ధిలో రంగరించి హృదయంతో ఆలపించినాడు. అన్నమయ్య రసహృదయాన్ని అందుకో గలిగితే వేంకటపతి సాక్షాత్కార వైభవాన్ని అనుభవించినవార మౌతాము. భక్తి, సంగీత, సాహిత్యాల త్రివేణీ సంగమం అన్నమయ్య సంకీర్తన రసస్పృష్టి.

జనవ్యవహారంలో ఉన్న భాషను, శపథం చేసి, 'జగతి కడ చెల్లుబళ్లైన' నగినా భాషించినట్టి నానుడి పలుకులతో, "తన సంకీర్తనలను ఆవిష్కరించినాడు. సంకీర్తన పాడాలన్నా, చదవాలన్నా ఆ వాక్యాలలో ఉన్న కాకువు, కారకము, నాటి వ్యావహారిక రూఢిని గమనించి అన్వయించుకోవలసి ఉంది. ఆ వ్యవహారంలో తమిళ కన్నడ పదాలు కూడ చోటు చేసుకొన్నవి. ఆలయ సంప్రదాయంలో ఉన్న పదజాలము కూడ వీరి సంకీర్తనల్లో ప్రవేశించినది. అలనాటి వ్యవహారంలో ఉన్న కొన్ని శబ్దాలు, పదాలు నేటి వ్యవహారంలో కనిపించవు. ఉన్నా, కొంత అర్థ విపరిణామాన్ని కూడ పొందినవి. పాట సౌకర్యం కోసం కొన్ని పదాలను స్వతంత్రంగ మలచుకొన్న సందర్భాలు కూడ కనిపిస్తాయి. అన్నమయ్య భాషకు ఒక ప్రత్యేక నిఘంటువు అవసరం. దీనికి పూర్వరంగంగ పూజ్యులు రాళ్లపల్లి, గౌరిపెద్ది, వేటూరి, రామలక్ష్మి, ఉదయగిరి, కామిశెట్టి తదితరులు సందిగ్ధపద సమీక్షలు చేసినారు. రవ్వా శ్రీహరి గారు ఒక నిఘంటువును కూడ సిద్ధం చేసినారు. జానపద సంగీతంతో బాటు, వారి మాటల్లో యాస కూడ చొప్పించినాడు. ఒక్క పాట విందాం.

శిరుతనవ్వుల వాడు శిన్నెకా, వీడు
వెరపెరగడు సూడవే శిన్నెక

చిరునవ్వులు చిందించే శ్రీనివాసుని మూర్తి. సకల ప్రాణులకు అభయమిచ్చే దేవునికి భయమా! శిష్టులను రక్షించి దుష్టులను శిక్షించే పరమాత్ముడు! ధర్మసంస్థాప నార్థం మాటిమాటికి అవతరిస్తూనే ఉంటాడు. ఇది జనపదుల మనసులో పల్లవించిన భావం. శ్రీహరి దశావతారాలను చరణాలలో బిగించినాడు.

**పొలుసు మేనివాడు[1] బొరవీపువాడు[2]**
**సెలసు మోరవాడు[3] సిన్నెకా**
**గొలుసుల వంకల కోరలతో బూమి**
**వెలసినాడు[4] సూడవే సిన్నెకా**

**మేటి కురచవాడు[5], మెడమీద గొడ్డలి**
**సీటకాలు వాడు[6] సిన్నెకా**
**ఆటదాని బాసి అడవిలో రాకాశి**
**వేటలాడే[7] జూడవే సిన్నెకా**

**బింకపు మోతల పిల్లగోవివాడు[8]**
**సింక సూపులవాడు[9] సిన్నెకా**
**కొంకక కలికియై[10] కొసరి కూడె నన్ను**
**వేంకటేశుడు సూడవే సిన్నెకా.**

1. మత్స్య, 2. కూర్మ, 3. వరాహ, 4. నరసింహ, 5. వామన, 6. పరశురామ, 7. దశరథరామ, 8. శ్రీకృష్ణ, 9. బుద్ధ (పురాణ) 10. కల్కి (భవిష్యదవతారం). తెలుగు పదాలతో అవతారాల కథలను సూచించడం అన్నమయ్య విలక్షణత్వం. అన్నమయ్య హృదయ పుష్కరిణిలో యెన్నో శతసహస్రపత్ర కమలాలు ఉదయించినవి. ఆ పద్మసుగంధాన్ని ఆస్వాదించడానికి శబ్దార్థ పరిజ్ఞానంతో పాటు భక్తి జ్ఞాన వైరాగ్యాల అవగాహన కూడ అవసరం. అద్వైత, ద్వైత విశిష్టాద్వైత ధర్మాలు వారి కృతులలో తొంగిచూస్తాయి. అన్నమయ్యది "శ్రీ వేంకటేశాద్వైతం" సకలాన్ని సర్వేశ్వరుడైన వేంకటేశ్వరునిలోనే దర్శించినాడు. వారి అంతరంగ బహిరంగాలలో ఆ తిరుమూర్తి తత్త్వమే అలము కొన్నది. అతడు ఆడినా, పాడినా, కలసినా, కలహించినా, పొగడినా, తెగడినా అంతటా అన్నిటా 'ఆతడే'. అంతా శ్రీనివాసమయం.

వేంకటేశ్వరుడు ఆదిమూలానికి సంకేతం. మనం చూసే మూర్తి మనమనుకొనే ఏ ఒక్క స్వరూపానికి పరిమితం కాదు. కేవలం ఒక విశ్వాసానికి నిదర్శనం కాదు. మన తృప్తికోసం మనమొక ఆరాధనక్రమాన్ని యేర్పరచుకొని వ్యవహ రిస్తున్నాము. అన్నమయ్య సమయము వచ్చినపుడెల్లా ఆ "పదతత్త్వాన్ని" విశద పరుస్తూనే ఉన్నాడు. "ఎంత మాత్రమున యెవ్వరు తలచిన అంత మాత్రమె నీవు". శివుడిగా, మాధవునిగా,

భైరవునిగా, శక్తిగా పలువురికి పలువిధాలుగ గోచరిస్తావు - అని భగవత్తత్వాన్ని సంకుచితంగా గాక విశాల దృక్పథంతో అనుభవించ మంటున్నాడు. తాత్విక సుందరమైన పరమాత్ముని లీలావిభూతుని జ్ఞానంతో సాధించమంటున్నాడు. వేంకటేశ్వరుని మూర్తిలో దేవుడున్నాడు. ఆ మూర్తే దేవుడు కాదు. "తిరువేంకటేశునికి దివ్యవిగ్రహమేడ" అంటూ అన్నమయ్య గానం చేసిన కీర్తనలో "పరమాత్మ తత్త్వ రహస్యం" ప్రపంచింపబడింది.

**విశ్వప్రకాశునకు వెలియేడ లోనేడ**
**శాశ్వతున కూహింప జన్మమిక నేడ**

**సర్వపరిపూర్ణునకు సంచార మిక నేడ**
**నిర్వాణమూర్తికి నిలయమికనేడ**
**ఉర్వీధరునకు కాలూన నొక చోటేడ**
**పార్వతీస్తుత్యునకు భావమిక నేడ**

**నానా ప్రభావునకు నడుమేడ మొదలేడ**
**ఆనన సహస్రునకు అవ్వలివ లేడ**
**మౌని హృదయస్థునకు మాటేడ పలుకేడ**
**జ్ఞానస్వరూపునకు కానవిన నేడ**

**పరమ యోగీంద్రునకు ఫలులేడ తానేడ**
**దురితదూరునకు సంస్తుతి నిందలేడ**
**"తిరువేంకటేశునకు దివ్యవిగ్రహ మేడ"**
**హరికి నారాయణున కవుగాములేడ.**

అన్నమయ్య జ్ఞాన నేత్రాలు విచ్చుకొని శ్రీనివాస పరతత్వాన్ని దర్శించినవి. ఆ అనుభవాన్ని తన 'వచో నూత్న క్రియలలో' ఆవిష్కరించినాడు. భావం-భాష- ప్రక్రియ కేవలం అవలంబాలే. "తెలిసటే తనలో దేవుడున్నాడు" ఇది అన్నముని ఆత్మవిశ్వాసం. సాధన చతుష్టయంతో మర్మాలను ధర్మాలను అందుకొని మనకందించినాడు. అన్నమయ్య ధన్యుడైనాడు. ఆ కీర్తనల ననుభవించి మనము ధన్యుల మౌదాము.

ఎంతో భక్తి శ్రద్ధలతో యేర్పాటు చేసిన ఈ సదస్సు వర్చస్వంతంగ సాగాలని నా ఆశంస.

శ్రీనివాసో రక్షతు

***

# అన్నమయ్య సందేశం

డా॥ మేడసాని మోహన్
ప్రత్యేకాధికారి
శ్రీనివాస వాఙ్మయ అధ్యయన సంస్థ
తిరుమల తిరుపతి దేవస్థానములు
తిరుపతి

పదకవితా పితామహుడు, ద్రవిడాగమ సార్వభౌముడు, సంకీర్తనాచార్యుడు - అని చరిత్ర ప్రసిద్ధుడైన తాళ్ళపాక అన్నమాచార్యులు కారణ జన్ములు. మహాకవిగా మహాభాగవతోత్తముడుగా తెలుగు భాషా సరస్వతిని తన శిల్పబంధు రచనా విశేషములతో అలంకరించినాడు. అన్నమయ్యకు పూర్వము తెలుగులో కవిత్రయము, శివకవులు, నాచన సోముడు, శ్రీనాథుడు వంటి మహాకవులు చాలమంది ఉన్నారు. వారందరు అనుపమాన ప్రతిభా విశేషములతో, అనన్య సామాన్యమైన పాండితీ సంపదలతో ప్రకాశించిన వారే. కాని సంస్కృత పద భూయిష్ఠమైన, సామాసిక చాలనములతో కూడిన వారి రచనా శిల్పము జన సామాన్యమునకు చేరువకాలేదు. శివకవులు ద్విపద వాఙ్మయమును, శతక వాఙ్మయమును సృజించినను అవి కూడ మితిమీరిన మతావేశ బంధురములై యుండుట వలన సమాజములోని అన్ని వర్గములను ఆకట్టుకొనలేక పోయినవి. అన్నమయ్యకు పూర్వము అన్నమయ్య వలె అచ్చ తెలుగు పలుకుబడులకు విశేష ప్రాచుర్యము కల్పించిన మహాకవి ఒక తిక్కనయే - అని చెప్పవచ్చును. కాని తిక్కన రచన కూడ పద్య గద్య భూయిష్టమై సముచిత భాషా సాహితీ పరిజ్ఞానము కలిగిన చదువరులను మాత్రమే మెప్పింప జాలినది.

ఈ పరిస్థితులన్నియు క్షుణ్ణముగా అధ్యయనము చేసిన అన్నమయ్య ఆబాల గోపాలమును అలరింపగలిగిన పదకవితలకు శ్రీకారము చుట్టినాడు. సమాజము లోని జీవులందరికి అధ్యాత్మ చింతనతో కూడిన భక్తిభావన అవసరము - అని గుర్తించిన అన్నమయ్య తదున్ముఖముగానే తన రచనలను సాగించినాడు. పుట్టుకతోనే ప్రహ్లాదుని వలె భాగవతోత్తముడైన అన్నమయ్య కలియుగ ప్రత్యక్ష దైవమైన శ్రీ వేంకటేశ్వరుని తత్త్వమహత్త్వ వైభవములను తన రచనలలో వర్ణించుచు జానపదుల అంతరంగములతో మధుర భక్తి బీజములను అంకురింపజేసినాడు. అన్నమయ్య కవితా వస్తువు శ్రీ వేంకటేశ్వరస్వామి దివ్యమంగళ విగ్రహమే. జగన్మోహనాకార దివ్యమంగళ విగ్రహుడైన ఆ అర్చామూర్తిని ఆలంబనముగహా చేసికొని మానవ సమాజమునకు అవసరమైన భక్తి జ్ఞాన వైరాగ్యములను, దేహాత్మ విచారములతో కూడిన అధ్యాత్మ విజ్ఞానములను, సాంఘిక ప్రబోధముతో కూడిన సందేశముగా

భవిష్యత్ తరముల కందించినాడు. భారతీయ విజ్ఞాన సర్వస్వమునకు మూలకందములైన వేదములు, ఉపనిషత్తులు, ఆగమములు, రామాయణ భారతేతిహాసములు, అష్టాదశ పురాణాంత 'రీతి' విశేషములు - ఇవన్నియు అలతి అలతి పదాలతో మన కందించినాడు. విశిష్టాద్వైత సిద్ధాంతములు, శ్రీ వైష్ణవ సంప్రదాయములతో కూడిన ప్రబోధములు గావించినను అన్నమయ్య రచనలలో రసానుభూతిని మించిన ఆవేశము కానరాదు.

వేదములు, వేదముల సారాంశమును అందించిన రామాయణాది ప్రాచీన గ్రంథములు, ఆగమ సంప్రదాయములు భగవంతుని విరాణ్మూర్తిని ఆకాశ తత్త్వముతో పోల్చుచున్నవి. ఆకాశమనగా శూన్యము. శూన్యము నుండియే సమస్త బ్రహ్మాండ భాండములు ఉద్భవించుచున్నవి. మరల అందే లయించుచున్నవి. అప్రమేయ ప్రభావాతీతుడైన పరమేశ్వరుడు అవాఙ్మానస గోచరుడు - అనగా వాక్కునకు మనస్సునకు అందనివాడు - అనుటలోని అంతరార్థ మిదియే.

**"దృశ్యసే సర్వభూతేషు గోషుచ బ్రాహ్మణేషు చ**
**దిక్షు సర్వాసుగగనే పర్వతేషు నదీషు చ"**

(వాల్మీకి రామాయణము - యుద్ధకాండ)

**"ఆకాశవత్ త్వం సర్వత్ర బహిరంతర్గతో౽మలః**
**అసంగోహ్యచలో నితః శుద్ధో బుద్ధః సదవ్యయః"**

(ఆధ్యాత్మ రామాయణము - బాలకాండ)

పై రెండు శ్లోకముల లోని సారాంశ మేమనగా పరమాత్మ యైన రాముడు ఆకాశము వలె అంతటా వ్యాపించి యున్నాడు. ఆకాశతత్త్వమూర్తి యైన ఆ రాముని చైతన్యాంశయే సృష్టిలోని సమస్త వస్తువులతో భాసించుచున్నది. అనంతుడైన ఆ పరమాత్మ నిరంజనుడు, నిర్లిప్తుడు, ఆచలుడు, నిత్యుడు, శుద్ధుడు, జ్ఞానస్వరూపుడు, సత్ స్వరూపుడు, అవ్యయుడై ఎల్లెడల ప్రకాశించుచున్నాడు.

ఈ యంశమునే వ్యాస భాగవతాంతర్గతమైన రుద్రగీత (చతుర్థ స్కంధము - 24 వ అ.) కూడా ఈ క్రింది విధముగా ప్రతిపాదించుచున్నది.

**"అర్థలింగాయ నభసే౽నమోంతర్బహిరాత్మనే**
**నమః పుణ్యాయ లోకాయ అముష్మై భూరివర్చసే"**

సారాంశము : సృష్టిలోని సమస్త పదార్థములకు మూలమైన ఆకాశము శ్రీహరి రూపమే అంతరిక్షములో ఉన్న సకల లోకములు ఆ శ్రీహరి విరాణ్మూర్తి లోని అంతర్భాగములే.

పై శ్లోకాదుల సారాంశముల ననినంటిని క్రోడీకరించి అన్నమయ్య తన సంకీర్తనలో ఎంత హృద్యముగా వర్ణించి యున్నాడో ఇక్కడ చూడవచ్చు.

"చూడ చూడ మాణిక్యాలు చుక్కల వలె ఉన్నవి
యూడి లేని చంద్రులవే యిన చంద్రులు ॥

కంటిగంటి వాడె వాడె ఘనమైన ముత్యాల
కంటమాలలవే పదకములు నవె
మించి పొడవైనట్టి మించు కిరీటంబదె
జంటల వెలుగు శంఖ చక్రాలవె ॥

మొక్కు మొక్కు వాడె వాడె ముందరనే ఉన్నాడు
చెక్కులవే నగవులతో జగిమోమదె
పుక్కిట లోకములవె భుజకీర్తులును నవె
చక్కనమ్మ అలమేలు జవరాలదె ॥

ముంగై మురారులును నవె మొలకతారును నదె
బంగారు నిగ్గుల వన్నె పచ్చబట్టదె!
యింగిత మెరిగి వేంకటేశుఁడిదె కన్నులకు
ముంగిటి నిధానమైన మూల భూతమిదే ॥" (సం. 1, సంకీర్తన 133)

మూలభూతము – అనగా పంచభూతములలో మొదటిదైన ఆకాశము. ఆకాశ తత్త్వమే తానైన శ్రీ వేంకటేశ్వరుని దివ్యమంగళ విగ్రహమును చూచినచో, సువర్ణ రత్నాభరణములు, పచ్చని పట్టువసనం, శంఖచక్రాదుల వంటి ఆపాదమస్తక రత్న కిరీట పర్యంతమైన సమస్తాలంకార సంశోభితమైన ఆ దివ్యరూపమును చూచినచో సూర్య చంద్రులు, నక్షత్రములు, గ్రహ గోళాదులతో కూడిన సువిశాల గగనమునే చూచినట్లుండును – అని భావించిన అన్నమయ్య భావుకతలో రచనా శిల్ప సౌందర్యము శోభించుచున్నది.

అన్నమయ్య సృష్టించిన ఈ అద్భుత రచనా శిల్ప సౌందర్యమే అల్లసాని పెద్దనాదులు సృజించిన ప్రబంధ కవితా సౌందర్య సృష్టికి ప్రేరణ యైనది. అలంంకార క్రాంతదర్శనములతో కూడిన అన్నమయ్య భావజాలమును తరువాతి పదకర్తలు ప్రబంధకవులు యథేచ్ఛగా వాడుకొనినారు.

"ఎన్ని మహిమల వాడే యీ దేవుడు
కన్నుల పండువు లెల్లా కదిసినట్లుండెను ॥

పోలింప కప్పుం కాపు రురుషోత్తమునికి
యే లీల నుండెనని ఎంచి చూచితే
పాల జలనిధి లోన పవళింపగా మేన
మేలిమి మీగడంటిన మెలుపుతో నుండెను" (17-507)

అని ఒక సంకీర్తనలో పెదతిరుమలయ్య "శ్రీనివాసుని దివ్యమంగళ విగ్రహమునకు లేపనము చేసిన కప్పురపు కాపు ఆయన పవ్వళించి యున్న పాలసముద్రము నందలి పాలమీగడ ఒడలికి అంటినట్లున్నది" – అని వర్ణింపగా ఈ భావమునే కొలది మార్పులతో శ్రీకృష్ణదేవరాయల వారు తన ఆముక్త మాల్యదలో వాడుకొనినాడు.

**"ఇనిగిలికంబునన్ గలిపి యెత్తుక సీసపు రెంటెయమోయనక**
**నింగి గరుత్ పరంపరల నెక్కొన లే దొగరొత్తె నంత వీ**
**చెంగలశాబ్ధి మీగడల జిడ్డెరిగించెడి కమ్మగాడ్పు నిం**
**దెంగడు మోత పెన్దిరువడింగని రాన్ ఖగరాజు మూపునన్"**

**సారాంశము :** విష్ణుచిత్తునకు గరుడ వాహనారూఢుడైన శ్రీమన్నారాయణుడు గగన భాగమునందు సాక్షాత్కరించినాడు. గరుత్మంతుని రెక్కల అల్లార్పుల తాకిడిచే ఏర్పడిన గాలి తరగల చేతను, విష్ణుదేవుని ఆగమనము చేతను ఒక వింత వర్ణముతో గగనాంతరాళము భాసించుచున్నది. పాలసముద్రము నుండి మీగడ జిడ్డు వాసనలు వీచుచున్నవి.

మరొక కీర్తనలో అన్నమయ్య శ్రీమన్నారాయణుని అనంత విరాణ్మూర్తిని వర్ణించు "చేరి పారేటి నదులు శ్రీపాద తీర్థమే భారపు ఈ భూమి తన పాదరేణువే" – అని వర్ణించినాడు. అనగా స్వామి విరాట్ స్వరూపములో ఈ భూమి ఒక ధూళికణమే – అన్న అన్నమయ్య భావాన్ని తెనాలి రామకృష్ణకవి తన "పాండురంగ మాహాత్మ్యము"న కొలది మార్పులతో ఈ విధముగ వాడుకొనినాడు.

**"దండిత బలివై, జగములు**
**నిండ బెరుగుచున్న వేళ, నీ యడుగున భూ**
**మండల మతి సూక్ష్మాకృతి**
**కొండిక మచ్చయును బోలె కొమరెందు హరీ!"**

**సారాంశము :** బలిచక్రవర్తిని శిక్షించుటకై వచ్చిన వామనుడు త్రివిక్రముడుగా మూడు లోకములకు తన విరాణ్మూర్తిని వ్యాపింపజేయు చుండగా ఆ స్వామి యొక్క అడుగు భాగమున భూమి ఒక చిన్న పుట్టుమచ్చవలె నున్నది.

ఈ విధముగా అధ్యయనము చేసినచో అన్నమయ్య కవితా సందేశము వేదపురాణాదుల సందేశమే. శ్రీ వేంకటేశ్వర తత్త్వాత్మకమైన ఈ సందేశమును అన్నమయ్య తన వర్ణనా నైపుణ్యముతో, ఆలంకారిక శిల్ప రచనా వైదగ్ధ్యంతో మెరుగులు దిద్ది భవిష్యత్ తరాలకు అందించినాడు. అందులకే ఆ దివ్య సందేశముచే ప్రబంధకవుల నుండి ఆబాలగోపాలము ప్రభావితులైనారు.

***

# శ్రీ తాళ్ళపాక విజయరాఘవాచార్యులు గారు (అన్నమయ్య వంశస్థులు)

We belongs to 12th Generation of Talapakam Annamacharya.

As my father settled at Tamil Nadu, I totally lived at Tamil Nadu.

I served as an officer, in State Bank of India upto 2007. I got my voluntary retirement. I am an SBI pensioner.

Three of my cousin brothers serving as Kainkaryadars to Lord Venkateswara at Tirumala as an date.

I served as Nithya harathi Kainkaryadar from 2010-2013 May at Tirumala, Srinivasa Temple.

Presently, I am transliterating the Annamacharya songs from Telugu to Tamil. And also translating the songs to Tamil. I wrote articles in Sapthagiri Tamil edition and also in Nrusimha Priya, the journal from Ahobila Mutt.

So for I transliterated four volumes of Adyatmik Sankeerthanam of Annamacharya. Of which I submitted Volume 2, for Publication to T.T.D. They accepted to publish the same.

I transliterated, the sanskrit sankeertanas of Annamacharya into Tamil, which was published during 606th Annamayya Jayanthi at Talapakam.


THALAPAKA ANNAMACHARYULU
1
Narasimha
Pedda Tirumalacharyulu 2
Thimmalamba
Chinna Tirumalacharyulu 3
Annamaiah
Pedda Tiruvengalanatha
Tiruvengalanatha 4
Chinna Tiruvengalappa
Koneti Tiruvengalanatha
Appalacharyulu 5
Konappacharyulu
Seshacharyulu 6
Srinivasacharyulu 7
Seshacharyulu
Raghavacharyulu 8
Ananthacharyulu 9
Seshacharyulu
Raghavacharyulu 10
Anantha charyulu
Venkataramana charyulu
Krishnama charyulu
Srinivasa charyulu
Ramamurthy charyulu
Sathyanarayana charyulu
11
Vijaya Raghavacharyulu 12

# అభినందనలు

అన్నమాచార్య సంకీర్తనలు కోటి రతనాల మూటలు. రాయలసీమ ప్రాంతమయిన తాళ్ళపాకలో జన్మించిన అన్నమయ్య విశ్వకవిగా పేరుగాంచారు. మూడుతరాల వంశం వారు తెలుగు సాహిత్యానికి అందించిన సాహిత్యం అమూల్యమైనది. ప్రజల జీవన శైలిని ఆకళింపు చేసుకున్న అన్నమయ్య వారి భాషలోని పద సంపదతోనే 32,000 సంకీర్తనలను రచించడం శ్లాఘనీయం. రాయలసీమ ప్రాంత పదాలు గ్రామీణ యాసలోనివి. సాధారణంగా కవులు వీటిని త్యజించి ప్రామాణిక భాషలోనే రచనలు సాగిస్తారు. అందుకు భిన్నంగా అన్నమయ్య ప్రజల భాషకు పట్టం కట్టాడు. వెన్నెల పదాలు, గొబ్బి పాటలు, జాజర పాటలు... వంటి అచ్చ తెలుగు పల్లె పదాలకు రాజభాషగా గౌరవించాడు అన్నమయ్య.

సామాన్య వాక్యాలతో సంక్లిష్ట అర్థాలుండటం అన్నమయ్య సంకీర్తనలలోని ప్రత్యేకత.

**'తెలిసితే మోక్షము తెలియకున్న బంధము'**

**'ఊరకే దొరకునా ఉన్నతోన్నత శిఖరము'**

వంటి కీర్తనలు ఈ కోవలు చెందినవి.

సాహిత్య నిధి వంటి అన్నమయ్య సంకీర్తనలలోని తెలుగుభాషా మధిరమలు త్రవ్విన కొద్దీ నిక్షిప్తాలు, మిగిలే ఉంటాయి. వివిధ విశ్వవిద్యాలయాలు వీరి సాహిత్య, సంగీత, భాషా అంశాలపై పరిశోధనలు జరిపాయి. అయినా శేషము అలాగే ఉంది. వాటిని శోధించడం తెలుగు భాషాభివృద్ధికి తోడ్పడే విశ్వవిద్యాలయాలు, కళాశాలల కర్తవ్యం.

డిగ్రీ స్థాయి నుండి విద్యార్థులలో పరిశోధనపై ఆసక్తిని కలిగించి వారిలోని సృజనాత్మకు పదును పెట్టాలి. ఈ విషయంలో ఎల్లప్పుడు ప్రథమస్థానంలో వుంటుంది శ్రీ పద్మావతి మహిళా డిగ్రీ మరియు పి.జి. కళాశాల. నేను ఆ కళాశాలలో విద్య నభ్యసించిన పూర్వ విద్యార్థినిని ఉపకులపతి స్థాయికి చేర్చిన ఘనత కళాశాలకు దక్కుతుంది. కళాశాలలో జరుగుతున్న ఇలాంటి గొప్ప సదస్సులు విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దుతాయి. మానవీయ విలువలను పెంచే మరెన్నో జాతీయ సదస్సులు తెలుగు విభాగంలో జరగాలని ఆశిస్తున్నాను.

**విశ్రాంత ఉపకులపతి ఆచార్య పి. కుసుమకుమారి**
**శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం, అనంతపురం**

# నివేదన

మహామహోపాధ్యాయ
డా॥ సముద్రాల లక్ష్మణయ్య
స్పెషల్ ఆఫీసర్
పురాణ-ఇతిహాస ప్రాజెక్టు
తి.తి. దేవస్థానం

అన్నమయ్య అన్న పేరు నేడు ఆబాల గోపాలానికీ పరిచితమే. ఆయన సంకీర్తనలను ఆలపించని సంగీతజ్ఞుడూ లేడు, వినని సంగీత శ్రోతా లేడు.

పదకవితా పితామహుని కీర్తి విస్తృతంగా వ్యాపించడానికి కారణం ఆ రచనలలోని శబ్దసౌందర్యం, అర్థచమత్కారం, గాయనీ గాయకుల పరిశ్రమ, వాటితో పాటు నేడు అందుబాటులోకి వచ్చిన ప్రసారమాధ్యమాలు అని నిస్సంశయంగా చెప్పవచ్చు.

అన్నమయ్య తల్లిదండ్రులు అన్నమునే బిడ్డకు పేరుగా ఎందుకు ఎన్ను కొన్నారా? అని సామాన్యులు ఒకింత ఆశ్చర్యానికి లోనవుతారు. అందలి తత్త్వాన్ని కొంచెం విశ్లేషించుకొందాం.

'అన్నం బ్రహ్మేతి వ్యజానాత్' అని వేదవచనం. అన్నాన్ని బ్రహ్మంగా వేదర్షులు భావించారు. అన్నం వల్లనే ప్రాణులు పుడుతున్నాయి, దానితోనే జీవిస్తున్నాయి. అన్నం లేకపోతే ప్రాణికోటి లేదు.

అంచేత అన్నమయ్య అంటే 'బ్రహ్మయ్య' అని గ్రహించాలి. ఇక్కడ బ్రహ్మ శబ్దం చతుర్ముఖ బ్రహ్మను కాక త్రిమూర్తులకూ మూలమైన పరబ్రహ్మమునే నిర్దేశిస్తున్నది.

సర్వానికీ హేతుభూతమైన బ్రహ్మమునే సర్వత్రా సందర్శించిన తాత్త్విక గాయకుడు అన్నమయ్య. అంచేతనే

**"బ్రహ్మ మొక్కటే పరబ్రహ్మ మొక్కటే"**

అని తన్మయత్వంతో కీర్తించినాడు. ఏ సంకీర్తన పద్ధతితో పరమాత్మను కీర్తించినాడో, ఆ సంకీర్తనను గూడా ఆయన బ్రహ్మంగానే భావించాడు.

**'చాలదా బ్రహ్మ మిది - సంకీర్తనం'**

అన్న సంకీర్తన ఇందుకు నిదర్శనం.

బ్రహ్మప్రాప్తికి సాధనాలైన భక్తి జ్ఞాన వైరాగ్యాదులనూ, వాటి ప్రశస్తినీ ఈ సంకీర్తనాచార్యుడు పుష్కలంగా వర్ణించాడు. 'భక్తి నీపై దొకటె పరమసుఖము' ఇత్యాది కీర్తన లిందుకు తార్కాణం.

భగవద్గీతలో 'నిర్దోషం హి సమం బ్రహ్మ' అని భగవంతుని మాట. బ్రహ్మం దోషం లేనిది, సమమైనది. అది సర్వత్రా సమంగా వ్యాప్తమై వున్నది. సమదృష్టి గలవారికే అది గోచరిస్తుంది.

బ్రాహ్మణుదు, గోవు, ఏనుగు, కుక్క, చండాలుడు – వీరందరియందూ "పండితాః సమదర్శినః" అన్నట్లు ఆత్మజ్ఞాన సంపన్నులు సమదృష్టి కల్గివుంటారు అని శ్రీకృష్ణుని ప్రబోధం.

ఈ ప్రబోధాన్ని చక్కగా ఆకళింపు చేసుకొన్న అన్నమయ్య –

**"సమబుద్ధే యిందరికీ – సర్వ వేదసారము**
**సముడిందరికీ హరి – సాధనమోయయ్యా!**
**చీమకు తన జన్మము – చేరి సుఖమై తోచు**
**దోమకు తన జన్మము – దొడ్డ సుఖము,**
**ఆమని ఈగకు సుఖ – మా జన్మమై తోచు**
**ఏమిటా ఎక్కువ సుఖ – మెవ్వరికేదయ్యా!"**

అని పాడి సకల వేదాల సారాంశం సమబుద్ధియే అని చాటాదు.

కాని మన సమాజంలో ఈ సమదృష్టి లోపించింది. వేదాలు, గీతాది శాస్త్రాలు సమదృష్టి ప్రాముఖ్యాన్ని ఎంతగానో ఉద్ఘోషించాయి. అయినా ఆచరణలో సమత్వానికి బదులు, విషమత్వమే రాజ్య మేలింది. దాని ఫలితంగానే అస్పృశ్యతాది దురాచారాలు ప్రబలాయి.

ఈ జాతి భేదాలు అన్నమయ్య కాలములో గూడా స్వైరవిహారం చేశాయి. గుణానికి బదులు కులానికే పెద్దపీట వేయడం జరిగింది. ఈ దుఃస్థితిని నిరసిస్తూ–

**"విజాతులన్నియు – వృథా వృథా**
**అజామిళాదుల – దదియే జాతి?**
**జ్ఞాతి భేదములు – శరీర గుణములు**
**జాతి శరీరము – సరితోడనె చెడు,**
**ఆతుమ పరిశుద్ధం చెప్పుడును – అది నిర్దోషం బనాది**
**ఈతల హరివిజ్ఞానపు దాస్యం – బిది యొక్కటెపో నుజాతి"**

అని ఆత్మశుద్ధిని కీర్తించాదు.

'తలమేల కులమేల – తపమే కారణము' అని తపోనిష్ఠయే ప్రధానం కాని కులగోత్రాలు ప్రధానం కావని చాటాదు.

సమాజంలో వెనుకబడిన వర్గాలకు తగిన అవకాశమివ్వకుండా తదితరులకే అన్ని సౌకర్యాలూ కలిగించే సమాజస్థితిని నిరసిస్తూ - "చీకట్లో దీపం పెట్టాలి గాని వెలుగులో దీపమెందుకు?" అంటూ ఒక చక్కని అర్థవంతమైన సంకీర్తన పాడాడు.

**"తెలియ జీకటికి - దీపమెత్తక పెద్ద**
**వెలుగు లోపలికి - వెలుగేలా?"**

దీనులను, అనాథులను, ఆర్తులను రక్షించడమే భగవంతుని ముఖ్య కర్తవ్యమంటూనే భంగ్యంతరంగా దేశ పరిపాలకుల ముఖ్య కర్తవ్యం కూడా ఇదే అని నిర్ద్వంద్వంగా హెచ్చరించాడు.

అన్నమయ్య సంకీర్తనలన్నీ ముక్తకాలే. ముక్తకం గూడా లోకోత్తర భావ బంధురమైనప్పుడు ప్రబంధం లాగా ఆదరణీయ మవుతుందని ధ్వనికారుడు మున్నగు ఆలంకారికులు చెప్పియున్నారు.

కావ్యానికి అనేక ప్రయోజనాలను పూర్వులు నిర్దేశించారు -

**కావ్యం యశస్యేఽర్థకృతే వ్యవహారవిదే శివేతర క్షతయే,**
**సద్యః పరనిర్వృతయే కాన్తా సమ్మితతయోపదేశయుజే** (కావ్యప్రకాశం)

కీర్తి, ధనం, వ్యవహారజ్ఞానం, అమంగళక్షతి, పరానందం - సమాజానికి ఇంపైన పద్ధతిలో సదుపదేశం - అనే ప్రయోజనాలలో చివరిదైన ఉపదేశం చాలా ముఖ్యమైనది.

ఈకాలంలో సమాజానికి సరి యయిన త్రోవ చూపే కవితకే అగ్ర తాంబూలం లభిస్తున్నది.

ఈ దృష్టితో చూస్తే అన్నమయ్య రచనలలో పైన పేర్కొన్నట్లు సమాజం ఆదరించి ఆచరించవలసిన ప్రబోధాలు కోకొల్లలుగా వున్నాయి.

600 సంవత్సరాలకు ముందే అట్టి ఉపదేశాలతో సమాజాన్ని ప్రభావితం చేసిన అన్నమయ్యకు జోహార్లు.

**సకల వేదములను సంకీర్తనములుగా**
**సంఘటించి హరిని సన్నుతించి**
**ముక్తి చూరగొన్న మునివర్యు నన్నమా**
**చార్యు భక్తితోడ సంస్మరింతు.** (అన్నమాచార్య సంకీర్తనామృతం)

***

# సుహృదాకాంక్ష

దేవదేవుడైన శ్రీ వేంకటేశ్వరుని కీర్తిని అన్నమయ్య వ్యాప్తి చేశాడు. అన్నమయ్య సారస్వతాన్ని, ఆయన వ్యక్తిత్వాన్ని జనబాహుళ్యంలోకి తీసుకుపోవడానికి తిరుమల తిరుపతి దేవస్థానం వారు కంకణం కట్టుకున్నారు. ఇదంతా కూడ స్వామి సంకల్పమే కావచ్చు.

"ఎనలేని తిరువేంకటేశుడే దైవమని
వినగలిగినదికదా వినికి..."

అని విశ్వసించిన అన్నమయ్య ఆ వినికినే అందరికీ కలిగించాలనుకున్నాడు. మధురభావాలతో మాణిక్యాల సూక్తులతో మైమరపించే భాషతో కఠిన చిత్తాలను కూడ కరిగించే కమనీయ తలపులతో కీర్తనలు రచించాడు. వేంకటేశ్వరుని కీర్తిని, తన కీర్తిని కీర్తనాకీర్తిలో ఇమిడ్చి విశ్వమంతా వెదజల్లాడు.

అన్నమయ్య సారస్వతం క్షీరసముద్ర సదృశం. దీనిలోని అనేక విషయాలను వెలికితీసేందుకు అనేకులు ప్రయత్నించారు. ప్రస్తుతం ప్రయత్నిస్తున్నారు కూడ. అన్నమయ్య ఆలోచనలకు వేదికలుగా సదస్సులను ఏర్పాటుచేసేందుకు తిరుమల తిరుపతి దేవస్థానం వారు పూనుకోవడం ముదావహం. ఇందులో భాగంగా శ్రీ పద్మావతి మహిళా డిగ్రీ కళాశాల వారు సదస్సు ఏర్పాటు చేసేందుకు ముందుకు రావడం, సంచాలక బాధ్యతను తన భుజస్కంధాల మీద వేసుకొని సదస్సు ఏర్పాటుకు, సముచిత రూపకల్పనకు, నిర్విరామ కృషి చేసేందుకు డా॥ కృష్ణవేణి గారు సంసిద్ధత వ్యక్తపరచడం సమాదరణీయం. అభినందనీయం కూడ.

చిరంజీవి కృష్ణవేణి నేతృత్వంలో ఈ సదస్సు సదస్యుల సర్వతోముఖ వికాసానికి దోహదం చెయ్యాలని సర్వేశ్వరుడైన శ్రీ వేంకటేశ్వరుని అనుగ్రహం ఈ సదస్సుకు లభించాలని ఆకాంక్షిస్తున్నాను. దీనికై తిరుమలేశుణ్ణి ప్రార్థిస్తున్నాను. డా॥ కృష్ణవేణి గారు మున్ముందు కూడ ఎన్నో సత్కార్యాలను నిర్వహించి సత్కృతులు పొందాలని కోరుకుంటూ పొందగలరని విశ్వసిస్తున్నాను.

**విశ్రాంత ఆచార్య జక్కంపూడి మునిరత్నం**
తెలుగు శాఖ
శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయము, తిరుపతి

***

# తాళ్ళపాక అన్నమాచార్యులు

ఆంధ్ర సాహిత్యంలో విష్ణుభక్తిని గురించి యింత పెద్ద ఎత్తున ప్రచారం చేసిన కవులు తాళ్ళపాక అన్నమయ్య తరువాతే ఎవరైనా. ప్రజల భాషలో ఆ కాలానికే రచనలు చేయడం విశేషం. ఒకే కుటుంబం వారు యిలాంటి గొప్ప రచనలు చేయడం, ఎక్కువ కాలం సాహితీ సేవ చేయడం (150 ఏండ్లు) మరొకరు సాధించలేనిది.

అన్నమాచార్యులు మొదటి పదకవి. తెలుగులో తొలి వాగ్గేయకారులు. దివంగత ఆచార్య జి.ఎన్. రెడ్డి చెప్పినట్లు తాళ్ళపాక కవులు, వారి స్థానం విలక్షణమైంది. ఎందుకంటే అన్నమయ్య మొదలు ఐదు తరాల వరకు వివిధ ప్రక్రియల్లో గ్రంథాలు రచించారు. తెలుగు భాషా సాహిత్యాలకెంతో సేవ చేశారు. దేవుని సన్నిధిలో ఉండి (రాజాస్థానాలను కోరుకోకుండు) సంగీత, సాహిత్యకర్తలుగా రాశిలోను, వాసిలోను మంచి రచనలు చేశారు. రాజులు దానం చేసిన గ్రామాలను స్వామి కైంకర్యానికే ఉపయోగించారు. అన్నమయ్య సంకీర్తనలతో పాటు స్వామి కైంకర్యానికి వేనవేలుగా ద్రవ్యదానం చేశారు. గాన సాంప్రదాయాన్ని ఈరోజుదాక స్వామి సేవలో భక్తి ప్రపత్తులతో కొలుస్తున్నారు. తాళపత్రాలోని వేలకొలది సంకీర్తనలను కొన్ని లఘు రచనలను అక్షయమైన రాగిరేకుల మీద వ్రాయించి ఒక భాండాగారాన్ని స్థాపించుకొన్న కవి వంశీయులు తాళ్ళపాక వారు.

అన్నింటికంటే ప్రధానంగా సాంప్రదాయంగా వస్తున్న గ్రాంధిక శైలిని ఒకవైపు ఆదరించి, మరొకవైపు వ్యావహారిక భాషను కూడా రచనల్లో చూపిన ఘనత వీరిది. అభ్యుదయ భావాలున్న సంకీర్తనలూ ఉన్నాయి.

తెలుగులో సంగీత సాహిత్యాలతో కూడి అభినయానికి అర్హమైన సంకీర్తన వాఙ్మయానికి మొదటివారై జానపద కవిత్వపు ఛాయల్ని తమ రచనల్లో చూపిన ప్రజాకవి తాళ్ళపాక అన్నమయ్య.

వీరి తండ్రి తాతలు ప్రసిద్ధులు కారు. సామాన్యులైన వారి కీర్తి ప్రతిష్టల్ని వంశోద్ధారకుడైన అన్నమయ్యే నిలిపారు. 32 వేల సంకీర్తనలకు కర్తగా 'పదకవితా పితామహుడు'గా పేరు తెచ్చుకున్న గొప్పవారు. ప్రాచీన తెలుగు కవులు స్వీయ చరిత్రలు రాయలేదు. వారి జీవిత చరిత్రలను ఆనాటి వారు రాసిపెట్టలేదు. కాని అన్నమాచార్యుల జీవిత చరిత్రను మనుమడు తాళ్ళపాక చిన్నన్న ద్విపదలో గ్రంథస్థం

చేయడం విశేషం. జీవిత చరిత్రకు నోచుకున్న తొలి తెలుగు కవి అన్నమాచార్యులే. కవి జీవితాన్ని యితివృత్తంగా జీవిత చరిత్ర రాసిన తొలి తెలుగు కవి కూడ తాళ్ళపాక వంశీయుడే.

అన్నమయ్య కీర్తనలు పలురకాలు. సంకీర్తనల్లోని గొప్పతనం భక్తి ప్రధానం. శృంగార పరమైనవీ ఉన్నాయి. అందులోని భాషా విశేషాలను వింగడించి, పరిశోధనచేసి అన్నమయ్య కీర్తిని చాటవలసిన అవసరం ఉంది. ఎన్నో పరిశోధనా వ్యాసాలు, సిద్ధాంత వ్యాసాలు లెక్కకు మిక్కిలిగా వచ్చాయి. నన్నయ, తిక్కనల కంటే మరే యితర తెలుగు కవులకంటే తీసిపోని రచనలు చేసిన అన్నమయ్య తెలుగు సాహిత్యంలో భాషలో మేటి కవివరేణ్యులు.

అన్నమయ్యపై జరుగుచున్న జాతీయ సదస్సు శ్రీ పద్మావతీ కళాశాల తెలుగు శాఖ నిర్వహించడం ముదావహం. ఈ కార్యభారాన్ని సంతోషంగా శాఖవారు ప్రత్యేకించి డా॥ కృష్ణవేణికి మనస్ఫూర్తిగా అభినందనలు. మరిన్ని సదస్సులు వారు చేపట్టాలి.

**డా॥ డి.ఎమ్. ప్రేమావతి**
**విశ్రాంత తెలుగు విభాగాధిపతి**
**శ్రీ పద్మావతి మహిళా డిగ్రీ మరియు పి.జి.కళాశాల, తిరుపతి**

***

# శుభాకాంక్షలు

భారతీయ విజ్ఞాన సర్వస్వానికి మూలకందాలు వేదాలు, ఉపనిషత్తులు, ఆగమశాస్త్రాలు, అష్టాదశ పురాణాలు, ఇతిహాసాలు భగవద్గీత మొదలైనవి. వీటిలో దాగివున్న నిత్యసత్యాలను ధర్మసూత్రాలను వెలికితీసి అలతి అలతి పదాలతో తన పదకవితలలో ఆవిష్కరించిన అపరవ్యాసుడు తాళ్లపాక అన్నమాచార్యుడు, తొలి సలక్షణ సంకీర్తన కర్త. తొలి సంకీర్తన లక్షణకర్త, తొలి వైష్ణవ శతకకర్త అన్నమాచార్యుడే కావడం విశేషం.

తాళ్లపాక అన్నమాచార్యుల 600 వ జయంతి సందర్భంగా - అంటే 2008వ సంవత్సరంలో తి.తి. దేవస్థానం అన్నమాచార్య ప్రాజెక్టు వారు అన్నమయ్య స్వస్థలమైన తాళ్లపాక గ్రామంలో, నివాస స్థలమైన తిరుమల తిరుపతుల్లో అత్యంత వైభవంగా సంగీత సాహిత్య కార్యక్రమాలు నిర్వహించారు. ఆ సందర్భంలోనే తాళ్లపాక గ్రామానికి వెళ్లే దారికి ఎడమ ప్రక్కన 108 అడుగుల అన్నమాచార్య విగ్రహాన్ని కూడ ఆవిష్కరించారు. తి.తి. దేవస్థానం ఆర్థిక వనరులతో తెలంగాణాతో కూడిన ఆంధ్రరాష్ట్రంలో ఇంచుమించు చిన్నపెద్ద అన్ని విశ్వవిద్యాలయాలలో సాహిత్య సదస్సులు నిర్వహించి ఆనాటి విద్యార్థినీ విద్యుర్థులకు అన్నమయ్య సాహిత్యం పట్ల అవగాహన కలిగించే ప్రయత్నం చేశారు.

అన్నమయ్య సంకీర్తనోత్సవాలు గ్రామస్థాయి నుండి దేశవిదేశాల వరకు వ్యాపించాయి. 'అన్నమాచార్య ప్రాజెక్టు' తి.తి. దేవస్థానముల తమ ఆర్థిక సహకారంతో వివిధ విశ్వవిద్యాలయాల్లోను, కళాశాలల్లోను అన్నమయ్య సాహిత్యం విద్యార్థినీ విద్యార్థులకు అందుబాటులోకి రావాలనే ఉద్దేశ్యంతో అన్నమయ్య సాహిత్యంలో అనేక సదస్సులు నిర్వహిస్తున్నారు. నిరంతరంగా కొనసాగుతున్న ఈ ప్రచారయజ్ఞం నిర్విఘ్నంగా కొనసాగి నిండుదనాన్ని తెలుగు గుండెల్లో నింపాలని ఆకాంక్షిస్తున్నాను.

శ్రీ పద్మావతి కళాశాల వారు డా॥ కృష్ణవేణి నేతృత్వంలో అన్నమయ్య సదస్సు నిర్వహించడానికి పూనుకోవడం ముదావహం. వారికి అభినందనలు. ఈ సదస్సు విజయవంతం కావాలని, ఇలాంటి సదస్సులు ఎన్నింటినో శ్రీమతి కృష్ణవేణి మున్ముందు కూడ నిర్వహించాలని కోరుతూ సదస్సుకు నా శుభాకాంక్షలు అందజేస్తున్నాను.

**విశ్రాంత ఆచార్య చిట్రాజు గోవిందరాజు**
**కో-ఆర్డినేటర్, రాజకైంకర్య ప్రాజెక్టు**
**అన్నమాచార్య కళామందిరం, తి.తి.దే., తిరుపతి**

***

# కృతజ్ఞతలు

'అన్నమయ్య సంకీర్తనలు - తెలుగు సాహిత్య వైభవం' అనే అంశంపై జాతీయ సదస్సును తిరుమల తిరుపతి దేవస్థానములు అన్నమాచార్య ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో కళాశాలలో నిర్వహించుట నాకు కలిగిన మహద్భాగ్యం.

"కళాశాల కోసం చేసే ఏ మంచిపనికైనా నా అనుమతి ఉంటుంది" అంటూ ఈ సదస్సు నిర్వహణకు అడిగిన వెంటనే అనుమతి మంజూరు చేసిన మా కళాశాల ప్రిన్సిపాల్ డా॥ పి. జ్ఞానకుమారి గారికి కృతజ్ఞతలు.

"మన దేవస్థానం కళాశాల విద్యార్థులకు అన్నమయ్య సాహిత్యం తెలియ జేయడం మన విధి. ప్రపోజల్ తయారుచేస్తే అనుమతి లభించేలా సిద్ధం చేయాలి" అంటూ ప్రతి చిన్న అంశాన్ని నాకు వివరించి సదస్సు నిర్వహణ బడ్జెట్‌ను రూపొందించుటకు సలహాలు సూచనలు అందించి, సదస్సు నిర్వహణ ప్రాముఖ్యతను అధికారులకు వివరించి, మూడు రోజుల జాతీయ సదస్సు దస్త్రం అనుమతికై కృషి సల్పిన అన్నమాచార్య ప్రాజెక్ట్ సంచాలకులు శ్రీ పి. మునిరత్నం రెడ్డి గారికి మనఃపూర్వక కృతజ్ఞతలు.

'తి.తి.దే. విద్యాసంస్థలలోని విద్యార్థులకు నైతిక విలువలతో కూడిన విద్యను బోధించాలి' అనే సత్‌సంకల్పంతో అన్నమయ్య సంకీర్తనలలోని భక్తి, ఆధ్యాత్మిక శరణాగతి తత్వం విద్యార్థులు గ్రహించాలని కార్యనిర్వహణాధికారి గారు, సంయుక్త కార్యనిర్వహణాధికారి గారు ఈ సదస్సుకు అనుమతి నివ్వడం మా కళాశాలకు మహాభాగ్యం. అందుకు వారికి హృదయపూర్వక ధన్యవాదాలు.

కళాశాలలో తెలుగు విభాగానికి ఉన్నతమైన చరిత్ర ఉంది. 1952లో కళాశాలకు పునాదిరాళ్ళు వేసిన నాటి నుండి తెలుగు విభాగం ఒక భాగస్వామి. పేరు ప్రఖ్యాతులున్న రచయిత్రులయిన కీ॥శే॥ ఆచంట శారదాదేవి గారు, కీ॥శే॥ డా॥ అరవింద గారు, డా॥ స్వర్ణాంబ గారు, బాధ్యతలు నిర్వహించిన విభాగమిది. ఎందరో విద్యార్థినులకు తెలుగు సాహిత్యంలోని తీయదనాన్ని రుచి చూపించి మరెందరికో ఆదర్శంగా నిల్చిన డా॥ ప్రేమావతిగారు, డా॥ సుజాతగారు, డా॥ రాజ్యలక్ష్మిగారు వంటివారు మహనీయులు మలచిన విభాగమిది.

ఇంతటి ఘన చరిత్రల విభాగాభివృద్ధికి నావంతుగా ఓ ఇటుక పేర్చాలను కున్నాను. అదే ఈ జాతీయ సదస్సు నిర్వహణ. గత మూడు సంవత్సరంల నుండి

జాతీయసదస్సుపై ప్రయత్నిస్తున్నాను. ఈ సంవత్సరం ఈ భాగ్యం దక్కింది. తెలుగు విభాగంలో మొదటి జాతీయ సదస్సు ఇది. అందునా అన్నమాచార్యుల సాహిత్యంపై నిర్వహించడం... ఆహా... ఏమి నా భాగ్యం ఆ దేవదేవునికి సహస్రాభి వందనములు.

మొదటి సదస్సు, అందునా అన్నమయ్య సాహిత్యంపై సదస్సంటే సముద్రాన్ని ఈదడమంత సాహస మనుకున్నాను. అయితే సదస్సు నిర్వహిస్తున్నామనగానే ప్రముఖులెందరో ముందుకు వచ్చారు. ఆచార్యులయిన సాహితీప్రియులు చేయూత నిస్తామన్నారు. పరిశోధకులు భరోసా ఇచ్చారు. కళాకారులు ఆడిపాడతామన్నారు. ఇంకేం అందరివాడు అన్నమయ్య. అందుకే నాపని కరతళామలక మయింది.

కీలకోపన్యాసానికి అంగీకరించిన శ్రీ కామిశెట్టి శ్రీనివాసులు గారికి ధన్యవాదాలు. "వారి ఉపన్యాసం వినడానికి మొదటి రోజు హాజరవుతాం" అంటూ రెండవ, మూడవ రోజు సదస్సులోని పత్రసమర్పకులు అనుమతి అడగటం వీరి ఉపన్యాసంలోని జ్ఞానబోధ విలువెంతో అర్థమవుతుంది.

సరస్వతీ పుత్రులు డా॥ మేడసాని మోహన్‌గారి వాక్కులను వినాలనే శ్రోతల శ్రద్ధ తీరటానికా అన్నట్లు వారు అతిథిగా అంగీకరించడం మా అదృష్టం.

అన్నమయ్యను చూడలేకపోయినా వారి వంశస్థులలో అన్నమయ్యను దర్శించే భాగ్యం మాకు కలిగించిన శ్రీ తాళ్ళపాక విజయరాఘవాచార్యుల వారికి కృతజ్ఞతలు.

విద్యాశాఖాధికారి డా॥ విజయకుమార్ గారు ప్రారంభోత్సవ, ముగింపు సమావేశాలకు అతిథిగా పాల్గొనుటకు అంగీకారం తెలిపినందుకు ధన్యవాదాలు.

ఆచార్య పి. కుసుమకుమారి గారు నాకు గురువు. వీరు అడిగిన వెంటనే సమాపనోత్సవ సందేశాన్ని అందించటానికి అంగీకరించినందుకు పాదాభి వందనాలు.

పెద్దలు పూజ్యులు డా॥ సముద్రాల లక్ష్మణయ్య గారికి ప్రత్యేక కృతజ్ఞతలు.

ఈ సదస్సు రూపకర్తలు ముఖ్యంగా ముగ్గురు. ఒకరు విశ్రాంత ఆచార్యులు సి. గోవిందరాజులు గారు, విశ్రాంత ఆచార్య జక్కంపూడి మునిరత్నం గారు, విశ్రాంత ఆచార్యులు శ్రీ సర్వోత్తమరావు గారు. వీరికి సదా కృతజ్ఞతాభివందనాలు.

మధురమైన మాటలతో మంచి సలహాలు ముందుంచే ఆచార్య కొలకలూరి మధుజ్యోతి గారికి కృతజ్ఞతలు.

'చేద్దాం మేడం అదెంత పని' అంటూ ప్రతి పనిని శాంతంగా చేస్తూ సహాయ సహకారాలందించిన అన్నమాచార్య ప్రాజెక్ట్ సీనియర్ అసిస్టెంట్ మునిరత్నం గారికి, ఏ అనుమానాలనయినా చిరునవ్వుతో తీర్చే శ్రీమతి లత గారికి ధన్యవాదాలు.

తెలుగు విభాగంలో ఈ సదస్సు నిర్వహణ మనందరిదంటూ ముందుకు నడిచిన అధ్యాపక బృందం విభాగాధిపతి డా॥ యస్. వసంతకుమారి గారికి, డా॥ తేజోవాణి గారికి, డా॥ కస్తూరిగారికి, డా॥ రాజ్యలక్ష్మి గారికి ధన్యవాదాలు.

పత్ర సమర్పణకు అంగీకరించిన ఆచార్యులు, అధ్యాపకులు, పరిశోధక విద్యార్థులకు, విద్యార్థినులకు పేరుపేరునా కృతజ్ఞతలు.

సాంస్కృతిక కార్యక్రమాలలో అన్నమయ్య సంకీర్తనలకు నృత్యం చేయటానికి అంగీకరించిన అధ్యాపక బృందానికి ధన్యవాదాలు.

మంచి 'వ్రాత' రాయగంలో సిద్ధహస్తులు శ్రీ వై. రవీంద్రగారికి, డి.టి.పి చేసిన శ్రీ బి. ప్రసాద్ గారికి, పుస్తకాన్ని అందంగా ముద్రించిన తి.తి.దే. ప్రెస్ వారికి హృదయపూర్వక కృతజ్ఞతలు.

ఈ సదస్సు మనది - ఈ విజయం మనందరిది.

**డా॥ వి. కృష్ణవేణి**
**సదస్సు సంచాలకులు**
**తెలుగు అధ్యాపకులు**
**శ్రీ పద్మావతి మహిళా డిగ్రీ మరియు**
**పి.జి. కళాశాల, తిరుపతి**

***

# విషయసూచిక


| | | పేజి నెం. |
|---|---|---|
| 1. | **అన్నమయ్య జీవితం, వ్యక్తిత్వం** - ఆచార్య మాడభూషి సంపత్ కుమార్ | 1 |
| 2. | **అన్నమయ్య సంకీర్తనలు-స్త్రీ వర్ణన** - డా॥ గుమ్మనూరు ఉషారాణి | 10 |
| 3. | **తాళ్ళపాక అన్నమయ్య సాహిత్యం-సాంఘిక దృక్పథం** - డా॥ ఎన్. భీమన్న | 18 |
| 4. | **అన్నమయ్య సంకీర్తనల్లో భక్తితత్త్వం** - డా॥ సూరపరాజు వసంతకుమారి | 20 |
| 5. | **అన్నమయ్య సంకీర్తనలు-చైతన్య స్వరాలు** - సి.యన్. క్షేత్రపాల్ రెడ్డి | 29 |
| 6. | **అన్నమయ్య కవిత్వాంశములు-ఒక పరిశీలన** - ఆచార్య భమిటిపాటి విశ్వనాథ్ | 32 |
| 7. | **అన్నమయ్య సంకీర్తనలు పలుకుబళ్ళు-సామెతలు** - డా॥ కె. వెంకటరమణ | 38 |
| 8. | **అన్నమయ్య సంకీర్తనాలలో కళ్యాణోత్సవ విశేషాలు** - డా॥ తమటం రామచంద్రారెడ్డి | 42 |
| 9. | **అన్నమయ్య వైరాగ్య పదాలు** - డా॥ వి. కృష్ణవేణి | 45 |
| 10. | **అన్నమయ్య కీర్తనలు-15వ శతాబ్ది నాటి సమాజ జీవన చిత్రణ** - శ్రీమతి అవ్వారి భద్రాపతి | 56 |
| 11. | **అన్నమయ్య-చారిత్రక భక్తులు** - డా॥ డి. నల్లన్న | 65 |
| 12. | **అన్నమయ్య సంకీర్తనలు-సామాజికాంశాలు** - ఆచార్య జి. యోహాన్‌బాబు | 73 |
| 13. | **తాళ్ళపాక పెదతిరుమలాచార్యుల మధుర కవితా వైభవం** - విశ్రాంత ఆచార్య కె.జె. కృష్ణమూర్తి | 77 |
| 14. | **అన్నమయ్య సంకీర్తల్లో మనస్సంబంధ సూక్తులు** - డా॥ యం. మాదన్న | 81 |
| 15. | **అన్నమయ్య-పోతన** - డా॥ బి. తేజోవాణి | 85 |
| 16. | **తాళ్లపాక పదకవుల సంకీర్తనలలో శ్రావణ భాద్రపద పర్వాది దేవతలు** - శ్రీమతి సి. లత | 91 |
| 17. | **అన్నమయ్య కవితా వైభవం** - డా॥ కె. ఆశాజ్యోతి | 94 |
| 18. | **అన్నమయ్య సంకీర్తనల్లో ఆచార వ్యవహారాలు** - డా॥ పి.సి. వెంకటేశ్వర్లు | 101 |

19. అన్నమయ్య సంకీర్తనల్లో క్రీడా సంస్కృతి – డా॥ ఎల్. కస్తూరి 115

20. అన్నమయ్య సంకీర్తనల్లో వస్త్ర విశేషాల చిత్రణ 124
– శ్రీ యం. దేవరాజులు

21. తాళ్లపాకవారి పదాలలో 'ధరాధరతుల చిత్రణ' 126
– విశ్రాంత ఆచార్య కె. సర్వోత్తమరావు

22. తాళ్లపాక అన్నమయ్య-శ్రీ వేంకటేశ్వర శతకం : పరిశీలన 133
– ఆచార్య గాలి రాధాకృష్ణ

23. భావుక చక్రవర్తి అన్నమయ్య – డా॥ సి.ఆర్. హరినాథ్ 146

24. అన్నమయ్య-మాతృవిధి – శ్రీ ఈ.జి. హేమంతకుమార్ 155

25. రాయలసీమ కవుల్లో అన్నమయ్య ప్రత్యేకత – శ్రీ యమ్. ఆదిశేషయ్య 167

26. అన్నమయ్య సంకీర్తనలు-సమాపక క్రియలు 171
– ఆచార్య మూలె విజయలక్ష్మి

27. కడప జిల్లాలో అన్నమయ్య దర్శించిన వైష్ణవ క్షేత్రాలు 176
– డా॥ యస్. చిన్న రెడ్డెయ్య

28. తాళ్లపాక కవుల లఘుకృతుల పరిశీలన 189
– 'అవధాన కళానిధి' శ్రీ ఆముదాల మురళి

29. అన్నమయ్య సంకీర్తనల్లో భావ విలక్షణత 202
– డా॥ నాదెండ్ల శ్రీమన్నారాయణ

30. అన్నమయ్య కీర్తనలలో శ్రీ నరసింహుని లీలలు – శ్రీమతి జి. నీలిమ 206

31. అన్నమయ్య సంకీర్తనల్లో అభ్యుదయ భావాలు 208
– డా॥ మన్యం నరసింహులు

32. అన్నమయ్య సంకీర్తనల్లో సామాజిక స్త్రీల చిత్రణ 222
– ఆచార్య యన్. మునిరత్నమ్మ

33. అన్నమయ్య సంకీర్తనలు-తెలుగు సాహిత్య వైభవం 232
– డా॥ విస్తాలి శంకరరావు

34. అన్నమయ్య సంకీర్తనల్లో శ్రీ వేంకటేశ్వరస్వామి వర్ణన – జె. కొండలరావు 238

35. అన్నమయ్య కీర్తనలలో రామకథ – డా॥ వై. విజయలక్ష్మి 242

36. అన్నమయ్య సంకీర్తనల్లో వృత్తులు – శ్రీ ఎస్.మణి 248

37. అన్నమయ్య సంకీర్తనల్లో జానపదాంశాలు 260
– ఆచార్య పేట శ్రీనివాసులు రెడ్డి

38. అన్నమయ్య పదాలు-అలంకార పదప్రయోగాలు 270
– డా॥ టి. మాలకొండయ్య

39. సుభద్రాకల్యాణంలో కనిపించే తిమ్మక్క – డా॥ బి. కల్పన 276

40. అన్నమయ్య-త్యాగయ్య – శ్రీమతి జి. నీరజ 281

41. అన్నమయ్య సంకీర్తనల్లో బాలకృష్ణుని లీలలు – కుమారి వై. మంజుల 289

42. అన్నమయ్య సంకీర్తనలు-సాంఘిక చైతన్యం 292
– ఆచార్య కొలకలూరి మధుజ్యోతి

43. అన్నమయ్య సంకీర్తనల్లో హనుమంతుని భక్తి ప్రశంస 297
– డా॥ ఎ. రాజ్యలక్ష్మి

44. తాళ్ళపాక అన్నమాచార్య సంకీర్తనలు-భగవ'న్నామ' మహాత్మ్యం 307
– డా॥ యర్రదొడ్డి సుభాషిణి

45. అన్నమయ్య పదాలు-పురుషార్థ ఫలాలు – డా॥ వై. పరమేశ్వరయ్య 314

46. అన్నమయ్య సంకీర్తనల్లో దశావతార వర్ణనలు – శ్రీ. ఎస్. చంద్రయ్య 317

47. అన్నమయ్య-వేమన – డా॥ జి. పార్వతి 322

48. అన్నమయ్య - నవవిధ భక్తి వైశిష్ట్యం – డా॥ టి. సునీత 328

49. అన్నమయ్య సంకీర్తనల్లో చిన్నికృష్ణుడు – డా॥ గెంజి అరుణ 338

50. అన్నమాచార్య సంకీర్తనల్లో ఆత్మానుభూతి – డా॥ చిట్టే స్వర్ణలత 340

51. అన్నమయ్య సంకీర్తనల్లో అష్టవిధ నాయికలు – డా॥ సి. చిన్నపాపమ్మ 343

52. అన్నమయ్య సంకీర్తనల్లో వర్ణనాత్మక దృష్టి – డా॥ టి. రఘునాథ్ 347

53. అన్నమయ్య దృక్పథంలో శ్రీ వేంకటేశ్వరస్వామి స్వరూపం 351
– డా॥ డి. మస్తానమ్మ

54. అన్నమయ్య కీర్తనలు-సామాజిక సందేశం – శ్రీమతి ఎం. హేమలత 354

55. అన్నమయ్య సంకీర్తనలలో ఆటపాటలు – శ్రీమతి యం. ఉషారాణి 360

| | | |
|---|---|---|
| 56. | **అన్నమయ్య సంకీర్తనల్లో సుగంధ ద్రవ్యాలు, పుష్పాల ప్రాధాన్యం** – డా॥ పి. మాధవి | 361 |
| 57. | **అన్నమయ్య-త్యాగయ్యల రచనా సామ్యాలు** – శ్రీ సి.యస్. కృష్ణారెడ్డి | 365 |
| 58. | **అన్నమాచార్య సంకీర్తనలు-వాత్సల్య భక్తి** – శ్రీమతి నూతంకి గౌరి | 370 |
| 59. | **అన్నమయ్య-తరిగొండ వెంగమాంబ** – డా॥ వి. లోకేశ్వరి | 373 |
| 60. | **అన్నమాచార్య సంకీర్తనలలో-స్త్రీ స్వభావం** – శ్రీమతి కె. అరుణ | 379 |
| 61. | **అన్నమయ్య-భక్తితత్త్వం** – డా॥ సి. సరళాదేవి | 384 |
| 62. | **అన్నమయ్య సంకీర్తనలు-పుష్ప వర్ణన** – జి. సుభాషిణి | 388 |
| 63. | **మోక్షమార్గము-అన్నమయ్య సంకీర్తనలు** – కుమారి యస్. వరలక్ష్మి | 392 |
| 64. | **తెలుగు పదకవులలో అన్నమాచార్యుల-ప్రత్యేకత** – శ్రీమతి టి.కె. పద్మజ | 394 |
| 65. | **ఆదర్శప్రాయుడు-అన్నమయ్య** – డా॥ జి. శైలమ్మ | 395 |
| 66. | **శ్రీ వేంకటేశ్వరస్వామి వారి శతక ఆవిర్భావము** – శ్రీమతి పి. యామిని | 400 |
| 67. | **అన్నమయ్య నవ్వులు** – శ్రీమతి కె. విజయకుమారి | 402 |
| 68. | **అన్నమయ్య బాల్య జీవితంలోని భక్తి విశేషాలు** – డా॥ యన్. కల్పలత | 405 |
| 69. | **తాళ్ళపాక పదసాహిత్యము-ఆధ్యాత్మ శృంగార సంకీర్తనలు** – డా॥ డి. సుజాత, డా॥ డి. ఉమామహేశ్వరి | 408 |
| 70. | **అన్నమయ్య పదసాహిత్యంలో-జానపదాలు** – డా॥ పొక్కళ్ళ సుభద్ర | 410 |
| 71. | **అన్నమయ్య-శరణాగతి తత్త్వం** – శ్రీ పి. జయచంద్రుడు | 412 |
| 72. | **అన్నమయ్య-సారంగపాణి** – డా॥ జి. నాగమణి | 416 |
| 73. | **అన్నమాచార్య సంకీర్తనలలో సాంఘిక జీవన విధానం** – శ్రీ వి. ఢిల్లిబాబు | 423 |
| 74. | **అన్నమయ్య కీర్తనలలో దాగివున్న హరినామ వైశిష్ట్యము** – డా॥ కె. పద్మిని | 427 |
| 75. | **అన్నమయ్య-పాదార్చన** – డా॥ రాజేంద్ర అనురాధ | 430 |
| 76. | **అన్నమయ్య సంకీర్తనలు-కుటుంబ సమస్యలు** – డా॥ ఎస్. కాంచనలత | 432 |
| 77. | **అన్నమయ్య సంకీర్తనలలో సామాన్య మానవుడు** – డా॥ సి. అరుణ కుమారి | 434 |

78. **అన్నమయ్య సంకీర్తనల్లో జానపదుల పాటలు** - కుమారి కె.సి. లావణ్య 436

79. **అన్నమయ్య సంకీర్తనలలో భక్తి** - శ్రీమతి యం. వెంకటలక్ష్మమ్మ 439

80. **తాళ్ళపాక అన్నమాచార్యుల ఉత్సవ సంకీర్తనలు** - సి. దుర్గ 442

81. **తాళ్ళపాక పదకవుల మంగళాత్మక సంకీర్తనలు** 445
- డా॥ వి. స్వర్ణలత యాదవ్

82. **అన్నమయ్య సంకీర్తనలలో దశావతారాల వర్ణన** - యం. మల్లమ్మ 447

83. **వాగ్గేయకారుల్లో అన్నమయ్య స్థానం** - డా॥ సంగుల సునీల్ కుమార్ 450

84. **సామాజిక స్పృహతో అన్నమయ్య పదసాహిత్యం** 455
- డా॥ మానమ మునిరత్నం

85. **అన్నమయ్య సంకీర్తనల్లో విష్ణుతత్త్వం** - డా॥ డి. యువశ్రీ 461

***

# అన్నమయ్య జీవితం, వ్యక్తిత్వం

**ఆచార్య మాడభూషి సంపత్ కుమార్**
**తెలుగు విభాగాధిపతి**
**మద్రాసు విశ్వవిద్యాలయం**
**చెన్నై**

అన్నమయ్యది పరిపూర్ణమయిన జీవితం. పరిపుష్టమయిన వ్యక్తిత్వం. తన జీవితాన్ని, సాహిత్యాన్ని శ్రీ వేంకటేశుడికి అర్పించి నిస్వార్థంగా సార్థకమయిన జీవితాన్ని గడిపినవాడు అన్నమయ్య. వేంకటేశుడి ఆశీర్వాదబలంతో జన్మించిన అన్నమయ్య వేంకటేశుడి కీర్తి ప్రతిష్ఠలను ఇనుమడింపజేయడానికి తన జీవితాన్ని అంకితం చేశాడు. అన్నమయ్య జీవితాన్ని గురించి తెలుసుకోవడమంటే వ్యక్తిగా ఆయన్ను గురించి తెలుసుకోవడమే కాదు, సాహిత్య చరిత్రను కూడా తెలుసుకోవడమే.

పదమూడో శతాబ్దంలో ఉత్తర భారతదేశంలోని వారణాసి పరిసర ప్రాంతాల్లో తీవ్రమయిన క్షామం సంభవించింది. వారణాశి వేదవిద్యకు పెట్టింది పేరు. కరువుకు భయపడి చాలామంది వేదపండితులు దక్షిణ భారతానికి వలసగా బయలుదేరారు. యాదృచ్ఛికంగా అదే సమయంలో కృష్ణా నదీ పరివాహక ప్రాంతాన్ని పరిపాలిస్తూ ఉన్న నందుడనే రాజు వారణాశికి వెళ్ళి తిరిగివస్తూ తనతోపాటు కొంతమంది వేదపండితులను తీసుకొని వచ్చాడు. వాళ్ళే ఆంధ్రదేశంలో స్థిరపడిన తరువాత నందవరీక వంశానికి చెందిన పండితులుగా ప్రసిద్ధికెక్కారు. ఈ నందరీక వంశానికి చెందిన వారు కొంతమంది కొంతకాలానికి పక్క జిల్లాలకు కూడా వెళ్ళి స్థిరనివాసం ఏర్పరచుకొన్నారు. అలా వెళ్ళి స్థిరపడిన వారిలో కొంతమంది పోతప్పినాడులో స్థిరపడ్డారు. పోతప్పినాడులోని ఒక గ్రామమే తాళ్ళపాక. ప్రస్తుతం కడపజిల్లాలో ఉంది. సర్వసంపన్నమయిన ఆ గ్రామానికి వన్నె తెచ్చింది అక్కడ ఉన్న చెన్నకేశవాలయం. ఆ ఊళ్ళో ఉన్నవాళ్ళందరూ చెన్నకేశవ భక్తులే. అలాంటివారిలో అమితమయిన భక్తిప్రపత్తులు కలిగినవారు నందవరీక వంశంలో జన్మించిన నారాయణగారు. వీరు భరద్వాజ గోత్రం, ఆశ్వలాయన సూత్రం, ఋగ్వేదశాఖకు చెందినవారు. పరమ విష్ణుభక్తులు. వేదాధ్యయనంలో మునిగితేలినవారు. ఈయనకు ఒక కుమారుడు, ఆయన పేరు విట్టల్. విట్టల్‌కి ఒక కుమారుడు. ఆ కుమారుడి పేరు నారాయణ. ఈ రెండవ నారాయణుడికి ఒక కుమారుడు ఆయన పేరు విట్టల్. ఆయనకు ఒక కుమారుడు ఆయన పేరు నారాయణ. ఈ ఆరు తరాల వారు తాళ్ళపాకలోనే నివసించారు. వీళ్ళందరూ చెన్నకేశవస్వామి భక్తులే. ఈ చిట్టచివరి నారాయణకు తన పూర్వీకుల్లా చదువుసంధ్యలు అబ్బలేదు. తల్లిదండ్రులు

కొంతదూరంలో ఉన్న ఊటుకూరు అన్న గ్రామంలో తమ బంధువుల ఇంట్లో ఉంచి చదువు చెప్పించాలనుకొన్నారు. వాళ్ళు నారాయణుణ్ణి ఒక పండితుడు దగ్గర చదువు నేర్చుకోవడానికి చేర్చారు. నారాయణకు చదువు అబ్బలేదు. ఉపాధ్యాయుడు ఎన్నో రకాలుగా చెప్పిచూశాడు, కొట్టిచూశాడు. కానీ ప్రయోజనం లేదు. ఉపాధ్యాయుడు పెట్టే బాధలు భరించలేక నారాయణ తాళ్ళపాకకు తిరిగి వెళ్ళిపోయి, చెన్నకేశవ స్వామి సన్నిధిలో తనకు చదువు అబ్బేట్టు చేయమని ప్రార్థించాడు. మళ్ళీ గురువు దగ్గరికి వచ్చి చదువుకోవడం ప్రారంభించాడు. అద్భుతంగా వేదాధ్యయనం వంటబట్టింది. నారాయణ పెద్దవాడయ్యాడు. ఆయనకు ఒక కుమారుడు కలిగాడు. అతనిపేరు నారాయణసూరి. నారాయణసూరి చిన్నప్పటినుంచీ మంచి తెలివితేటలతో వేదాలు, శాస్త్రాలు అభ్యసించాడు. చెన్నకేశవుడికి పరమ భక్తుడు. తాళ్ళపాకకు దగ్గరలో ఉన్న మదుపూరుకు చెందిన లక్కమాంబతో నారాయణసూరికి వివాహం చేశారు. లక్కమాంబ మదుపూరులో ఉన్న మాధవుడి భక్తురాలు. ఆమె ఆండాళ్‌లాగా మాధవస్వామితో ప్రత్యక్షంగా మాట్లాడేదట. దంపతులిద్దరూ పరమ విష్ణుభక్తులు. సత్సాంగత్యంతో, సకల సంపదలతో సుందరమైన జీవితాన్ని అనుభవిస్తున్నప్పటికీ సంతానం లేదన్న కొరత వాళ్ళను పీడించసాగింది. పరమ విష్ణుభక్తులయిన ఆ దంపతులకు శ్రీ వేంకటేశ్వరస్వామి దయవల్ల తమకు సంతానం కలుగుతుందన్న నమ్మకం కలిగింది. వెంటనే వాళ్ళు శ్రీనివాసుడి దర్శనం కోసం తిరుమలకు బయలుదేరారు. తమకు సంతానం కలగాలని శ్రీ వేంకటేశుని ప్రార్థిస్తున్నప్పుడు లక్కమాంబకు స్వామి దగ్గరున్న నందకమనే ఖడ్గం మెరిసినట్టు అనిపించింది. అదే రాత్రి ఆమె కలలో నందకం కనిపించింది. ఆ కలను గురించి పదేపదే చెప్పుకొంటూ ఇంటికి తిరిగివచ్చారు. కొన్నాళ్ళకు వాళ్ళకు పుత్ర సంతానం కలిగింది. ఆ పుత్రుడే అన్నమయ్య. అన్నమయ్య శాలివాహన శకం 1330, సర్వధారి నామ సంవత్సరం, వైశాఖ మాసం, విశాఖ నక్షత్రంలో పౌర్ణమి తిథినాడు జన్మించాడు. అంటే క్రీ.శ. 1408వ సంవత్సరం మే నెల 9వ తేదీన జన్మించాడు.

> **"రాజీవ నయన వరప్రసాదమున**
> **దేజంబు మఱియు నెంతే విస్తరిల్ల"**
> (అన్నమాచార్య చరిత్ర, పు.9, తాళ్ళపాక చినతిరువేంగళనాథుడు)

అని అన్నమయ్య జననాన్ని వేంగళనాథుడు చెప్పాడు. అయితే ఇందులో నక్షత్రం, లగ్నం ఉన్నాయి తప్ప జన్మించిన తేదీ లేదు. అన్నమయ్య సంకీర్తనల రాగిరేకుల్లో "స్వస్తిశ్రీ జయాభ్యుదయ శాలివాహన శక వరుషంబులు 1346 అగునేటి క్రోధినామ సంవత్సరమందు తాళ్ళపాక అన్నమాచార్యులు అవతరించిన పదారు యేండ్లకు తిరువేంగళనాథుండు ప్రత్యక్షమైతేను అది మొదలుగాను శాలివాహన శక వరుషంబులు 1424 అగు నేటి దుందుభి సంవత్సరం ఫాల్గుణ బహుళ 12 నిరుధానకు తిరువేంగళనాథుని మీదను అంతికముగాను తాళ్ళపాక అన్నమాచార్యులు విన్నపము

చేసి అధ్యాత్మ శృంగార సంకీర్తనలు" అన్న వాక్యాలను ఆధారం చేసుకొని ఆయన జన్మించిన తేదీని నిర్ణయించారు. అన్నమయ్య పదహారు సంవత్సరాలకే సంకీర్తనలు చెప్పడం మొదలుపెట్టాడు. 1346వ సంవత్సరం పదహారో యేడు వస్తుంది. అప్పటినుంచి పదహారు తీసివేస్తే 1330 అవుతుంది. అంటే క్రీ.శ. 1408 మే 9-10వ తేదీకి సమానం. అదే ఆయన జన్మ సంవత్సరం. నిజానికి అన్నమయ్య ఎనిమిదవ ఏటనుంచే పాటలు పాడటం ఆరంభించాడు.

అన్నమయ్య శ్రీహరి ఖడ్గమయిన నందకం అంశలో పుట్టినప్పటికీ సాత్వికమయిన తత్వం కలిగినవాడు. చిన్నప్పటినుంచీ ఆయన సహజంగానే దైవచింతన కలిగినవాడు. ఎవరయినా అన్నం పెట్టినా తినేవాడు కాదు, అమ్మ ఇది తిరుమలప్ప ప్రసాదం అని చెబితే మాత్రం వెంటనే తినేవాడట. అన్నమయ్యను నిద్రపుచ్చడానికి తల్లి ఎప్పుడూ వేంకటేశ్వరుని పాటలే పాడేది. అలా చిన్నప్పటినుంచీ అన్నమయ్యకు వేంకటేశ్వరుడు ఆరాధ్యదైవమయ్యాడు. అయిదేళ్ళు వచ్చేసరికి యజ్ఞోపవీతధారణ అయింది. విద్యాభ్యాసం ప్రారంభమయింది. మిగిలిన విద్యార్థులకన్నా అన్నమయ్య అన్ని విద్యల్లోనూ ముందుండేవాడు. వేదవిద్యల్లో ఆరితేరాడు. ఆయన నోటినుంచి వచ్చే ప్రతిమాటా పాటగా మారేది. వేంకటేశ్వరుని ప్రార్థించడమంటే అది పాటరూపంలోనే ఉండేది. అన్నమయ్య తాత నారాయణకు తాళ్ళపాక గ్రామదేవత కలలో కనిపించి మీ వంశంలో మూడోతరం వ్యక్తి పరమ భాగవతోత్తముడుగా జన్మిస్తాడని చెప్పిందట. అన్నమయ్యకు చిన్నతనంలోనే భక్తిచింతనలో ధ్యాస కలగడాన్నిబట్టి అందరూ అన్నమయ్యే ఆ భాగవతోత్తముడని భావించడం మొదలుపెట్టారు. చివరకు అదే నిజమయింది. అన్నమయ్యకు ఎనిమిదేళ్ళు నిండేసరికి ప్రహ్లాదుణ్ణి తలపించేవిధంగా పూర్తిగా విష్ణు భక్తుడిగా మారిపోయాడు. తల్లిద్వారా తిరుమలలోని శ్రీ వేంకటేశ్వరుని లీలలను విని విని ఆయనమీద అపారమయిన భక్తిని ఏర్పరచుకొన్నాడు. రోజంతా వేంకటేశ్వరుని కీర్తిస్తూ కాలం గడిపేవాడు. చేతిలో చిన్న తంబురలాంటిది పెట్టుకొని 'గోవింద, నారాయణ, కేశవ మధుసూదన' అంటూ తిరుగుతూ ఉండేవాడు. ఏ పనిచెప్పినా ఆ పనిమీద శ్రద్ధ చూపించేవాడు కాదు. ఆ పనిని పక్కనపెట్టి హరినామ సంకీర్తనలో మునిగిపోయేవాడు. ఒక్కమాటలో చెప్పాలంటే ప్రహ్లాదుడిలా :

**"పానీయంబులు ద్రావుచుం గుడుచుచున్ భాషించుచున్ హాసలీ**
**లా నిద్రాదులు సేయుచుం దిరుగుచున్ లక్షించుచున్ సంతత**
**శ్రీ నారాయణ పాదపద్మయుగళీ చింతామృతాస్వాద సం**
**ధానుండై మఱచెన్ సురారిసుతు దేతద్విశ్వమున్ భూవరా"**

అన్నట్లు ఉండేవాడు. ఎప్పుడూ చెన్నకేశవస్వామి ఆలయ గోపురాన్ని తదేకంగా చూస్తూ, తరిస్తూ, ఆలపిస్తూ, ఆలకిస్తూ, నర్తిస్తూ, పులకిస్తూ లోకాన్ని మైమరచిపోయేవాడు. అసలు అన్నమయ్యకు ఆ పేరు పెట్టడంలోనే ఉంది రహస్యం. పేరుకు తగ్గట్టు తన

వ్యక్తిత్వాన్ని [illegible]న్నాడు అన్నమయ్య. తల్లిదండ్రులు అన్నమయ్యను దేవుడు తమకు ప్రసాదించిన వరంగా భావించారు. అందుకే అన్నమయ్య అని నామకరణం చేశారు. 'అన్నం బ్రహ్మేతి వ్యజనాత్' అంటే అన్నమే బ్రహ్మస్వరూపం. విష్ణు సహస్రనామంలో అన్నం అన్నది విష్ణునామాల్లో ఒకటిగా కనిపిస్తుంది. 'అన్నాయనమః' అంటే అన్నం రూపంలో ఉన్న విష్ణువుకు నమస్కారం అని అర్థం. అన్నాన్ని మనం ఎలా ఆస్వాదించి భుజిస్తామో అలాగే విష్ణువు కూడా ఆస్వాదించదగినవాడని ప్రసార భట్టారకుడు విష్ణుసహస్రనామాన్ని వ్యాఖ్యానించాడు. భగవద్గీతలో 'అన్నాద్ భవంతి భూతాని' అన్నాడు. అంటే సకల జీవరాశులు అన్నంనుంచే ఆవిర్భవించాయని అర్థం. వీటన్నిటినీ పరిశీలిస్తే అన్నానికి, విష్ణువుకి అభేదమన్న విషయాన్ని గ్రహించవచ్చు. అందుకనే విష్ణువుకు మారుపేరయిన అన్న శబ్దాన్ని నారాయణసూరి తన కుమారుడికి పెట్టాడు. అన్నం ఎలాగయితే ఆస్వాదించదగిందో, అలాగే అన్నమయ్య కీర్తనలు ఆస్వాదించదగినవి అన్న విషయాన్ని ప్రత్యేకించి చెప్పనవసరం లేదు. అన్నం పరబ్రహ్మ స్వరూపమయితే, అన్నమయ్య పదబ్రహ్మ స్వరూపుడు. ఇలా అన్నమయ్య పేరుకు ఎంతో వైశిష్ట్యం ఉంది. అన్నమయ్యను ఇంట్లోను, వీధిలోను చాలామంది అన్నమయ్య, అన్నప్ప, అన్నయ్య, అన్నమాచార్య, అన్న అని అనేక రూపాంతరాలతో పిలవడం కద్దు.

అన్నమయ్య తననుతాను మరచి భగవత్కీర్తనామృతంలో తేలియాడుతూ ఉంటే, వదినగారు అన్నమయ్యను పనికిరానివాడని, పనిలేనివాడని నిందిస్తూ ఉండేది. అన్నమయ్య తల్లిదండ్రులతోపాటు తండ్రి సోదరుడి కొడుకు ఇంట్లో ఉండేవారు. ఆ సోదరుడి కొడుకు, కోడలు రోజూ అన్నమయ్యను పనికిమాలినవాడని, అన్నం పెట్టడమే దండగని నిందిస్తూ ఉండడంవల్ల తల్లిదండ్రులు బాధపడి అన్నమయ్యకు ఏదో ఒక పని పెట్టాలనుకొని దర్భలు గడ్డి కోయడానికి పంపించారు. దర్భలు కోస్తూ అన్నమయ్య వేలు కోసుకుంటాడు. అన్నంకోసం లౌకికమయిన ఈ వ్యాపారాలు చేయడంకన్నా పరబ్రహ్మస్వరూపుడయిన ఆ నారాయణుణ్ణి సేవించడం ద్వారా ఆకలి తీర్చుకోవడం ఉత్తమమని భావించి తిరుమలకు బయలుదేరుతాడు. హరినామ సంకీర్తన చేస్తూ తిరుమల కొండ ఎక్కుతాడు. భక్తులతో కలిసి పరమభక్తుడిగా తిరుమల కొండకు చేరుకొంటాడు. అప్పటిదాకా వినడమే తప్ప చూసి ఎరుగని ఏడుకొండల దర్శనం కలిగే లోపల అన్నమయ్యలో పెల్లుబికిన పాటే 'అదిగో అల్లదిగో శ్రీ హరివాసము' అన్న అద్భుతమయిన కీర్తన. అప్పటికీ పాటలు పాడడం అలవాటుగా ఉన్న అన్నమయ్య ఎప్పుడయితే తిరుమలలో అడుగుపెట్టాడో, అప్పుడే ఆయనకు పాటే జీవితంగా మారిపోయింది. అన్నమయ్య ఒక్కొక్క కొండే ఎక్కి ఏడుకొండలవాడి దర్శనార్థం ఎంతో ఆనందంగా, ఉత్సాహంగా వెళుతున్నాడు. అయితే ఆ ఉత్సాహం ఎంతోసేపు నిలవలేదు. వందలాది మెట్లు ఎక్కిన తరువాత, మోకాలి మెట్టు ఎక్కాడు. ఆ తరువాత మెల్లగా అడుగులేస్తూ వెళుతున్నాడు. బాగా అలసిపోయాడు. ఒకచోట సొమ్మసిల్లి

అలాగే పడుకొన్నాడు. కొంతసేపటికి లేచేటప్పటికి కళ్ళు బైర్లుకమ్మాయి. లేవడానికి శక్తి లేదు, నడవడానికి వీలుకాలేదు. కడుపులో ఆకలి. తనకు ఇక వేంకటేశుని దర్శనం కలగదనుకొన్నాడు. అయినా ఆయన్ని దర్శించాలన్న తపన మనసులో ప్రగాఢంగా ఉండడంవల్ల లేవడానికి ప్రయత్నిస్తున్నాడు. ఆ సమయంలో ఆ దారిలో వెళుతున్న ముసల్ది అన్నమయ్య అవస్థను చూసి తన చేతిలోని ప్రసాదాన్ని అన్నమయ్య చేతిలో పెట్టి, ఇది తింటే నీ సమస్యలన్నీ తీరిపోతాయి, అంతేకాదు చెప్పులు వేసుకొని నువ్వు మెట్లు ఎక్కలేవు. ఇది సాక్షాత్తు కలియుగ వైకుంఠం, వేంకటేశుని దర్శించాలన్న నీ దృఢసంకల్పం నిన్ను తప్పకుండా ఆయన దగ్గరకు చేరుస్తుంది అని చెప్పి వెళ్ళిపోయింది. అంతవరకూ నిస్సత్తువలో ఉన్న అన్నమయ్యకు ఎవరో దివ్యోపదేశం చేసినట్టయింది. అలిమేలుమంగమ్మే ఆ రూపంలో వచ్చి రక్షించిందని భావించి అన్నమయ్య చెప్పులు దూరంగా పడేసి, ప్రసాదం తీసుకొని కొత్త ఉత్సాహంతో కొండపైకి ఎక్కడం ప్రారంభించాడు. అలమేలు మంగను స్తుతిస్తూ పద్యాలు చెబుతూ కొండపైకి ఎక్కిన అన్నమయ్యకు సమయమే తెలియలేదు. నూరు పద్యాలు చెప్పేలోపు తిరుమలకు చేరుకొన్నాడు. అలమేలు మంగపై శతకం పూర్తయింది.

తిరుమల కొండకు చేరిన అన్నమయ్య భూదేవిని, వరాహస్వామిని, నరసింహస్వామిని, రామానుజాచార్యుల్ని దర్శించుకొని గరుడస్తంభం దగ్గరకు చేరుకొన్నాడు. తరువాత ప్రహరీగోడ చుట్టూ ప్రదక్షిణం చేసి, గరుడస్తంభం దగ్గర ఇస్తున్న తీర్థప్రసాదాలు తీసుకొని గుడిలోపలికి వెళ్ళడానికి అడుగుపెట్టాడు. దివ్యమంగళ స్వరూపమయిన వేంకటేశుని విగ్రహాన్ని చూసిన వెంటనే అన్నమయ్య తన్మయత్వం చెందాడు. కళ్ళార్పకుండా విగ్రహాన్నే చూస్తూ నిశ్చేష్టుడై నిలబడిపోయాడు. తేరుకొని నారాయణ, గోవిందా, కేశవా అని పదేపదే అంటూ:

"పొడగంటిమయ్య మిమ్ము పురుషోత్తమా మమ్ము
నెడయక వయ్య కోనేటి రాయడు"

అని తన్మయత్వంతో పాడడం మొదలుపెట్టాడు. పాట ముగియగానే అక్కడున్న పూజారులు ఆయన్ను అక్కున చేర్చుకొని ఆశీర్వదించి, ఇంత చిన్నవయసులో ఇంత అద్భుతంగా ఆలపిస్తున్నావంటే అంతా దైవకృప అని అన్నమయ్యకు తీర్థప్రసాదాలు ఇచ్చి ఆశీర్వదించారు. అప్పటికి గుడి తలుపులు మూసివేయడంతో అన్నమయ్య ఆ రాత్రి ఆనందమండపంలో పడుకొని ఉదయాన్నే లేచి, స్నానకృత్యాలు పూర్తిచేసుకొని శ్రీ వేంకటేశుడి మీద పద్యాలు చెబుతూ అక్కడున్న తీర్థాలన్నీ సేవించాడు. సుబ్రహ్మణ్యస్వామిని, అంజనాదేవిని, ఆంజనేయుణ్ణి, ఆకాశగంగను చూసి వచ్చేలోపల మధ్యాహ్నమయింది. అప్పటికి వేంకటేశుని గుడి తలుపులు మూసివేశారు. పూజారులు తరువాత రమ్మన్నారు. ఎంతో ఆశతో వచ్చిన అన్నమయ్యకు నిరాశ మిగిలింది. గుడిముందే కూర్చొని వేంకటేశుడిమీద పద్యాలు చెప్పడం ప్రారంభించాడు. శతకం పూర్తయింది. పూజారులు ఏమనుకున్నారో ఏమో తలుపులు తెరచి అన్నమయ్యకు

దర్శనం కలిగించారు. ప్రధాన పూజారి నంబి ఆశ్చర్యంతో అన్నమయ్యను అక్కున చేర్చుకొని అన్నమయ్యకు సుగ్రీవ, ఆంజనేయ, అంగద, అనంత, గరుడ, విశ్వక్సేన, సీతారామలక్ష్మణ, కులశేఖర మొదలయిన విగ్రహాలను దర్శింపజేశారు. అన్నమయ్య మళ్ళీ ఒకసారి వేంకటేశునిమీద చెప్పిన నూరు పద్యాలను అలవోకగా చెప్పాడు. నంబి ఆశ్చర్యబడి అతనికి వేంకటేశ్వరుని ప్రసాదంగా ఒక హారాన్ని బహూకరించాడు. జన్మ ధన్యమయిందని భావించిన అన్నమయ్య స్వామి పుష్కరిణి దగ్గర కూర్చొని నిన్నటి నుంచి జరిగిన సంఘటనలన్నియు నెమరువేసుకొంటూ ఆ రాత్రి నిద్రపోయాడు.

ఒక ఏకాదశి రోజు శ్రీ వేంకటేశ్వరుడు తన భక్తుడు, వైష్ణవ గురువు అయిన ఘన విష్ణువునకు కలలో కనిపించి అన్నమయ్యకు 'వైష్ణవ సంస్కారాన్ని' నెరవేర్చాలని కోరాడు. ఘనవిష్ణువు మరుసటి రోజు ద్వాదశినాడు గుడి దగ్గర తంబుర పట్టుకొని పాటలు పాడుకొంటూ, నల్లగా ఉన్న అబ్బాయిని అన్నమయ్యగా గుర్తించి అతనికి వైష్ణవాన్ని ప్రసాదించాడు. వైష్ణవాన్ని తీసుకోవడం అంటే అంతకుముందు అన్నమయ్య వేరే మతాన్నో, వేరే విధానాన్నో అనుసరిస్తూ ఉండి వైష్ణవాన్ని తీసుకొని విష్ణుభక్తుడుగా మారాడని అర్థం కాదు. అన్నమయ్య పుట్టుకతోనే వైష్ణవుడు, వాళ్ళ తాతముత్తాతలు ఆరుతరాలుగా వైష్ణవులు. వైష్ణవ సంస్కారాన్ని పొందడమంటే యుక్తవయస్సు రాగానే కుడిఎడమ భుజాలపై శంఖుచక్రాలను కులగురువుచేత ధరింపజేసుకొని (శంఖు చక్రాలను ముద్ర వేయించుకొని) పరిపూర్ణంగా వైష్ణవాన్ని మాత్రమే అనుసరించడం, వైష్ణవ ప్రపత్తిని పొందడం. శైవాన్ని అనుసరించేవాళ్ళు లింగధారణ చేయడంలాంటిది. లింగధారణ చేయనంత మాత్రాన వాళ్ళు శైవులు కాకుండాపోరు. అయితే అనుసరించడంలో కొంత అలక్ష్యం ఉండవచ్చు. అందుకనే సంస్కారం చేయడం ద్వారా వాళ్ళను పరిపూర్ణంగా అందులో నిమగ్నులయ్యేట్లు చేస్తారు. అన్నమయ్య అప్పటికే పూర్తి విష్ణు భక్తుడయిపోయాడు. ఈ సంస్కారం కేవలం లౌకికమయింది మాత్రమే తాళ్ళపాక చిన్నన్న అన్నమయ్యను గురించి :

> **"హరిపూజ హరిసేవ హరికీర్తనంబు**
> **హరినామము ధ్యాన మనిశంబు దనకు**
> **ఘనతర సకల భోగంబులుగాగ"**

అన్నాడు. అన్నమయ్యకు సకల భోగాలు హరి మాత్రమే. అందువల్ల ఆయనను ప్రత్యేకించి విష్ణుభక్తుడిగా మార్చాల్సిన అవసరం లేదు. ఇది కేవలం ఆయన వైష్ణవుడని ధృవీకరించడం మాత్రమే. అలా ఆరోజు అన్నమయ్య జీవితంలో మరో మరపురాని ఘటన జరిగింది. ఆరోజునుంచి అన్నమయ్య తిరుమలలో ప్రతిరోజూ కనీసం ఒక కీర్తనకు తక్కువకాకుండా ఆలపిస్తూ తిరుమలను తన సంగీతంతో మరపిస్తూ తిరుమలంతా కలియదిరుగుతూ ఉండేవాడు. ఘనవిష్ణువును గురువుగా స్వీకరించి ఆయన దగ్గర అనేక విద్యలు అభ్యసించాడు. వాళ్ళిద్దరి అనుబంధం రోజురోజుకూ

పెరుగుతూ వచ్చింది. విష్ణువుకు అన్నమయ్యంటే అమితమయిన ప్రీతి, అన్నమయ్యకు విష్ణువంటే అనంతమయిన భక్తి. ఇలా గురుశిష్యులిద్దరూ ఒకరినొకరు వదలకుండా వేంకటేశుని సేవలో తరిస్తూ ఎనిమిదేళ్ళు గడిపారు.

ఎనిమిదేళ్ళుగా దైవప్రసాదంగా పుట్టిన కొడుకు కనిపించకుండా పోవడంతో నారాయణసూరి, లక్కమాంబ వెదకనిచోటు లేదు. పడని వేదన లేదు. చెప్పాపెట్టకుండా వెళ్ళిపోయిన కొడుకు మీద బెంగతో లక్కమాంబ చిక్కి శల్యమయిపోయింది. తాళ్ళపాకలోని చెన్నకేశవాలయంలో కూర్చొని ఆ దేవుడికి తన మొర వినిపిస్తూ, తన బిడ్డకోసం దేవుడితో వాదిస్తూ లోకాన్ని మరచి రోదిస్తూ ఉండడమే ఆమె నిత్యకృత్యమయింది. నారాయణసూరి ఆమెను ఓదార్చడానికి ఎంతో ప్రయత్నం చేశాడు. ఫలితం శూన్యం. ఒకరోజు లక్కమాంబ తిరుమలకు వెళ్ళి శ్రీ వేంకటేశుని దర్శించుకొంటే తన బిడ్డ దొరుకుతాడేమోనని భర్తతో చెప్పింది. అనారోగ్యంతో ఉన్న లక్కమాంబను తిరుమలకు తీసుకెళ్ళడానికి ఆయనకు ఇష్టం లేకపోయినా, కనీసం ఊరు మారితే ఆరోగ్యమయినా కుదుటపడుతుందేమోనన్న ఆశతో సరేనని బయలుదేరాడు. తిరుమలలో లక్కమాంబ, నారాయణ సూరి వేంకటేశుని దైవదర్శనార్థం వేచి ఉన్న సమయంలో ఘనవిష్ణువు, ఆయన వెనుక అన్నమయ్య వేంకటేశుని సన్నిధిలోకి వచ్చారు. అన్నమయ్యను చూసి లక్కమాంబ దంపతులు ఆశ్చర్యానందంలో మునిగిపోయారు. తమ బిడ్డను చూడగలగడం ఒక సంతోషమయితే, మరోపక్క వేంకటేశుని సన్నిధిలోకి ఆచార్యులతో సమానంగా తమ బిడ్డ వెళ్ళగలగడం మరో ఆనందం. అన్నమయ్యను కలుసుకొని అన్నమయ్య కీర్తిప్రతిష్టలను తెలుసుకొని తల్లిదండ్రులు ఎంతో సంతోషించారు. కొన్నాళ్ళపాటు అక్కడే ఉన్నారు. తరువాత అన్నమయ్యను తమతో తాళ్ళపాకకు రమ్మని ప్రాధేయపడ్డారు. హరినామ సంకీర్తన తప్ప మరో విషయంపై ధ్యాసలేని అన్నమయ్య రాలేనని చెప్పాడు. అన్నమయ్యను ఒప్పించలేని తల్లిదండ్రులు చివరకు ఘనవిష్ణువును ప్రాధేయపడ్డారు. గురువాజ్ఞను కాదనలేక చివరకు అంగీకరించాడు. తాళ్ళపాకకు తిరిగి వచ్చిన తరువాత కూడా అన్నమయ్య లౌకిక విషయాలపై ఆసక్తిని చూపలేదు. ఎప్పుడూ చెన్నకేశవ స్వామి ఆలయంలో కూర్చొని కీర్తనలు పాడుతూ ఉండడం తప్ప మరో విషయాన్ని గురించి పట్టించుకోలేదు. ఊర్లో అందరూ అతణ్ణి పిచ్చివాడనుకొన్నారు. పెళ్ళి చేస్తేగానీ పిచ్చి కుదరదని భావించి తల్లిదండ్రులు పెళ్ళి ప్రయత్నం మొదలుపెట్టారు. లక్కమాంబ తన అన్నదగ్గరికి వెళ్ళి ఆయన కూతుర్ని ఇచ్చి పెళ్ళి చేయమంది. ఎప్పుడూ పాటలు పాడుకొంటూ తిరిగేవాడు సంసారం ఏంచేస్తాడు? కుదరదు పొమ్మన్నాడు. వేరే బంధువులను అడిగిచూశారు. పిచ్చివాడికి పిల్లనివ్వడానిక్ కుదరదన్నారు. లక్కమాంబ చెన్నకేశవ స్వామికి తన గోడును వినిపించుకొంది. ఆరాత్రే అమ్మాయిని ఇవ్వనని చెప్పిన ఆ తల్లిదండ్రుల కలలో కనిపించి చెన్నకేశవుడు అన్నమయ్య గొప్పతనాన్ని వివరించి, వెంటనే పెళ్ళికి అంగీకరించమని చెప్పాడు. దాంతో మరుసటిరోజు ఇద్దరూ

వచ్చి తమ అమ్మాయిని ఇస్తామని బలవంతం చేశారు. లక్కమాంబ ఇద్దరమ్మాయిలను అన్నమయ్యకు ఇచ్చి పెళ్ళిచేసింది. అప్పటికి అన్నమయ్యకు పదిహేడేళ్ళు. తిరుమలాంబ, అక్కమాంబ అన్న ఇద్దరు భార్యలతో అన్నమయ్య సాంసారిక జీవితంతోపాటు ఆధ్యాత్మిక జీవితాన్ని కూడా సాగిస్తూ వచ్చాడు. ఈ ఇద్దరు భార్యలు ఏనాడూ అన్నమయ్య భక్తిమార్గానికి అడ్డుతగలలేదు. నీళ్ళలో ఉన్న తామరాకులా ఆధ్యాత్మిక జీవితాన్ని, తామరాకుపై నీటిబొట్టులా సంసార జీవితాన్ని భావించాడు. అందుకే ఆయన సంకీర్తనా వ్యవసాయం కొనసాగుతూనే వచ్చింది. అన్నమయ్య తన ఇద్దరు భార్యలను తీసుకొని తిరుమలకు బయలుదేరాడు. వాళ్ళను కూడా స్వామిసన్నిధికి తీసుకొని వెళ్ళి భక్తిమార్గంలోకి మళ్ళించాలన్నది ఆయన ఉద్దేశం. అన్నమయ్య పెళ్ళి చేసుకొని రావడం చూసిన ఘన విష్ణువు చాలా సంతోషించాడు. తిరుమలాంబ, అక్కమాంబలకు కూడా ఆయన పంచసంస్కారం చేశాడు. భార్యలిద్దరికీ అన్నమయ్య వేంకటేశునితోపాటు తిరుమలలో ఉన్న అందరి దేవతల దర్శనం చేయించాడు. అన్నమయ్య గురువును దైవంగా భావించేవాడు. శఠగోపయతి దగ్గర ఆయన సకల విద్యలను అభ్యసించాడు, భార్యలను కూడా గురువు సేవలో తరించమన్నాడు. అహోబిలంలో కొన్ని సంవత్సరాలుండి వైష్ణవమత తత్త్వం, రామానుజ తత్త్వం, వేదాంత రహస్యం మొదలయినవన్నీ శఠగోపయతి దగ్గర అభ్యసించాడు. మరోపక్క ప్రతిరోజూ కనీసం ఒక సంకీర్తనయినా రాయకుండా నిద్రపోడు. అన్నమయ్యకు దివ్యదేశాల దర్శనం చేయాలన్న కుతూహలంతో గురువుగారి అనుజ్ఞతో భార్యలతో సహా ఒక్కొక్క ప్రదేశాన్ని దర్శిస్తూ కంచికి చేరాడు. యమునాచార్య, తొండరడిపొడి ఆళ్వార్, తిరుప్పాన్ ఆళ్వార్, తిరుకచ్చి నంబి, నమ్మాళ్వార్, ఆండాళ్ మొదలయిన వైష్ణవ భక్తుల క్షేత్రాలను దర్శనం చేసుకున్నాడు. అన్ని వైష్ణవాలయాలను దర్శించుకొని తిరుపల్లాచ్చి, చంద్రగిరి, నెల్లూరు, ఉదయగిరి, టంగుటూరు, మంగళం, కోవెలకుంట్ల, గుత్తి, కదిరి, పుష్పగిరి, ఊటుకూరు మొదలయిన ప్రదేశాలను చూసి తాళ్ళపాక చేరుకున్నాడు.

తాళ్ళపాక గ్రామానికి పక్కనే టంగుటూరు అనే చిన్న రాజ్యం ఉంది. దాన్ని సాళువ నరసింహరాయలు పరిపాలిస్తూ ఉండేవాడు. తాళ్ళపాక గ్రామం గురించి, అక్కడ నివసిస్తున్న అన్నమయ్య గురించి, అన్నమయ్య మహిమలను గురించి సాళువ నరసింహుడికి బాగా తెలుసు. నరసింహుడు కూడా పరమ వైష్ణవ భక్తుడు. వైష్ణవులకు విష్ణువుకన్నా విష్ణుభక్తులు మిన్న. అందువల్ల విష్ణు భక్తుడయిన అన్నమయ్య అంటే నరసింహరాయలకు భక్తిప్రపత్తులున్నాయి. అలాంటి భక్తాగ్రేసరుడి ఆశీస్సులు తనకుంటే తాను విజయం సాధించగలనన్న నమ్మకం ఉండేది. అందుకని నరసింహరాయలు అన్నమయ్యను తన రాజ్యానికి తీసుకొని రావాలని నిశ్చయించుకొన్నాడు. తానే స్వయంగా తాళ్ళపాకకు వెళ్ళి రాచమర్యాదలతో, భక్తిపూర్వకంగా తనకు గురుస్థానంలో ఉండాల్సిందిగా అన్నమయ్యను కోరాడు. విష్ణుభక్తుడయిన నరసింహుని కోరికను

అన్నమయ్య మన్నించాడు. అన్నమయ్య ఆశీస్సులతో నరసింహరాయలు చుట్టుపక్కలున్న రాజ్యాలను జయించి పెనుగొండను రాజధానిగా చేసుకొని మహారాజుగా వెలుగొందాడు. ప్రతిరోజూ అన్నమయ్య వేంకటేశుని కీర్తిస్తూ ఉంటే విని తరించేవాడు. ఒకరోజు అతని బుర్రలో పురుగు తొలిచింది. శ్రీహరిని కీర్తించినట్టే తననుకూడా కీర్తించమని కోరాడు. అందుకు అంగీకరించని అన్నమయ్యను బంధించి కారాగారంలో వేశాడు. అయినా అన్నమయ్య అంగీకరించలేదు. అన్నమయ్యకు ఆ వేంకటేశుని మీద ఉన్న గాఢమయిన భక్తిని తెలుసుకొని, తన తప్పును గ్రహించి అన్నమయ్యను క్షమించమని వేడుకొని చెరసాల నుంచి ఆయన్ను విడిపించాడు. అక్కణ్ణుంచి బయలుదేరి అన్నమయ్య మళ్ళీ తిరుమలకు వచ్చాడు. అప్పుడే శృంగార మంజరి రాసి వేంకటేశుడికి అంకితం చేశాడు. ఆ తరువాత కూడా ఆయన చాలాసార్లు దివ్యదేశాల దర్శనార్థం వెళ్ళాడు. ఎక్కడున్నా బ్రహ్మోత్సవాల సమయంలో మాత్రం తప్పకుండా తిరుమలకు వచ్చేవాడు. అన్నమయ్య మార్గంలోనే తిమ్మక్క కూడా సుభద్రాకళ్యాణమనే ద్విపద కావ్యాన్ని రాసింది. అన్నమయ్య కీర్తనలు నాలుగు దిక్కులకూ వ్యాపించి పురందరదాసు లాంటి కన్నడ కీర్తనాకారులు అన్నమయ్యను దర్శించుకొన్నారు.

తన జీవితాన్ని, సాహిత్యాన్ని శ్రీ వేంకటేశుడికి కైంకర్యం చేసిన అన్నమయ్య 95 ఏళ్ళ పరిపూర్ణమయిన జీవితాన్ని అనుభవించి 1503 ఫిబ్రవరి 23 గురువారం నాడు తనువు చాలించాడు. చివరిరోజుల్లో ఆయన శరీరం శుష్కించినా మనసు మాత్రం సంకీర్తనలతో పరిమళిస్తానే ఉండేది. తన కుమారుడు పెదతిరుమలాచార్యుడితో కలిసి గుడిని చుట్టివచ్చేవాడు. ఆయన చేతిలో ఎప్పుడూ ఆయన రాసిన సంకీర్తనల తాళపత్రాలుండేవి. వాటిని వేంకటేశుడి ముందు పెట్టి నైవేద్యంగా అర్పించేవాడు. ఆరోజు ద్వాదశి యథాప్రకారం ఆలయానికి వెళ్ళి వేంకటేశుని దర్శించాడు. ఇక వయోభారంతో కృశించిన ఈ శరీరాన్ని నేను మోయలేను, దీన్నుంచి నాకు విముక్తి ప్రసాదించమని వేడుకొన్నాడు. అక్కణ్ణుంచి అనంత, గరుడ, విశ్వక్సేన, రామానుజాది విగ్రహాలను దర్శించుకొని, మళ్ళీ ఆ వేంకటేశుని హృదయస్థానంలో ఉన్న అలిమేలు మంగమ్మను దర్శించుకొని ఆమె అనుమతి తీసుకొని ఇంటికి బయలుదేరాడు. ఇంటికి వెళ్ళిన తరువాత పెద తిరుమలాచార్యుని పిలిచి తన తంబురను అతని చేతిలో పెట్టి ఈరోజు నుంచి వేంకటేశుడికి సంకీర్తనార్చన చేసే బాధ్యత నీపై పెడుతున్నాను అని చెప్పాడు. మధ్యాహ్నం సంధ్యావందనం చేసి పెద తిరుమలాచార్యుని అంకంపై తలను పెట్టుకొని పడుకున్నాడు. ఆరోజు ద్వాదశి, దుందుభినామ సంవత్సరం, ఫాల్గుణ బహుళ శాలివాహన శకం, 1424వ సంవత్సరం. అన్నమయ్య తన సంకీర్తనలను లోకానికి వదిలిపెట్టి లోకాన్ని విడిచిపెట్టాడు. ఆయన కుమారులు, మనువలు, మునిమనుమలు ఆయన వారసత్వాన్ని కొనసాగించారు. నేడు ప్రతి ఒక్కరూ ఆయన సంతతికి చెందినవారే. ఆయన సంకీర్తనలను ఆలపిస్తూ తరిస్తూ ఉన్నవారే.

సుమారు 30 వేల సంకీర్తనలు రాసిన అన్నమయ్య తన ఆధ్యాత్మిక జీవితాన్ని ప్రజలకే అంకితం చేశాడు. ఆయన కీర్తనల్లోని ఆధ్యాత్మ సంకీర్తనలు ప్రజాబాహుళ్యానికి, శృంగార సంకీర్తనలు వేంకటేశ అలమేలు మంగమ్మలకు అంకితమయినవి. ప్రజలందరూ ఆధ్యాత్మిక జీవనాన్ని అనుభవించి జీవితంలో తరించాలన్నదే అన్నమయ్య ఆశయం. కేవలం తాను మోక్షం పొందాలన్నది ఆయన ధ్యేయం కాదు. ప్రజల్ని భక్తిమార్గంలో నడిపించి లోకాన్ని సన్మార్గంలో ఉంచాలన్న తపన ఆయన సంకీర్తనల్లో మనం చూడవచ్చు. అందుకే అన్ని ఊళ్ళూ తిరుగుతూ భక్తి ప్రచారం చేస్తూ ప్రజల్లో ఆధ్యాత్మిక చైతన్యం తీసుకురావడానికి ప్రయత్నం చేశాడు. అన్నమయ్యకు లోకం పోకడ తెలుసు. లోకాన్ని చదివి కీర్తనలు రాశాడు. సామాన్య ప్రజలు కూడా దైవత్వాన్ని అర్థం చేసుకోవడానికి అనుగుణంగా ఆయన పాటను తన మాధ్యమంగా ఎంచుకున్నాడు. ఆ పాటలోని భాష కూడా సామాన్య ప్రజలదే. లోకంలోని మాటల్నే పాటల రూపంలో మలచి లోకాన్ని వేంకటేశుడి వైపు మళ్ళించాడు. ప్రజల్లో ఉన్న అంతరాలను పోగొట్టడానికి ప్రజల్లో కులమత బేదాలు, పేద ధనిక తారతమ్యాలు లేవని చాటిచెప్పాడు. హరిభక్తిలో అందరూ సమానమన్నాడు. భక్తి మార్గం ద్వారా మాత్రమే అందరూ సమానంగా ఉండగలమన్న విషయాన్ని ఆయన సంకీర్తనల్లో అక్కడక్కడా చెబుతూ వచ్చాడు. ఆయన కీర్తనల్లోని ఆంతర్యాన్ని అర్థం చేసుకొని ఆచరించగలిగినప్పుడే అన్నమయ్య సంకీర్తనలకు సార్థకత ఏర్పడుతుంది. కేవలం వాటిని ఆలపించినంత మాత్రాన సరిపోదు. అదే మనం ఆయనకు అందించగలిగే నివాళి.

***

# అన్నమయ్య సంకీర్తనలు - స్త్రీ వర్ణన

**డా॥ గుమ్మనూరు ఉషారాణి**
**అసోసియేట్ ప్రొఫెసర్ ఆఫ్ తెలుగు**
**పి.వి.కె.ఎన్. ప్రభుత్వ కళాశాల**
**చిత్తూరు**

దాక్షిణాత్య భాషల్లో ప్రప్రథమ వాగ్గేయకారుడు, పదకవితా పితామహుడు తాళ్ళపాక అన్నమాచార్యులు. భక్తికవిగా కలియుగ ప్రత్యక్షదైవమైన తిరుమల శ్రీనివాసుని 32 వేల సంకీర్తనా పుష్పాలతో అర్చించిన భక్తశిఖామణి. అన్నమయ్య సంకీర్తనా సాహిత్యం ఒక సారస్వత క్షీరసాగరం. దానిని పరిశోధించి వెలికితీసే కొద్దీ అనర్ఘరత్నాలు బయట పడుతూనే ఉంటాయి. ఒక్కమాటలో చెప్పాలంటే అన్నమయ్య పదసాహిత్యం ఒక విజ్ఞాన సర్వస్వం. కేవలం పండితులకు మాత్రమే

సుబోధకమయ్యే వేదాలు, ఉపనిషత్తులు, శాస్త్రాలు, పురాణాలు, ఇతిహాసాలు ఇత్యాది సాహిత్యం ప్రజలకు చేరువకావాలన్న తపనతో పదసాహిత్యాన్ని సాధనంగా చేసుకున్నాడు అన్నమయ్య.

వస్త్వాశ్రయ కవిత్వంలో పాత్రోన్మీలనం, వర్ణనలు మొదలైనవి వేయడం/రాయడం సులభం. కానీ పదసాహిత్యం ఆత్మాశ్రయ కవితారీతికి చెందింది. అన్నమయ్య తన సంకీర్తనల్లో అల్పాక్షరాలలో అనల్పార్థాన్ని నిక్షిప్తం చేశారు. ఈ కీర్తనల్లో ప్రౌఢకవులను మించిన వర్ణనలు కోకొల్లలుగా దర్శనమిస్తాయి.

భగవంతుని సృష్టిలో స్త్రీ పురుషులిరువురికీ సమాన భాగస్వామ్యం, బాధ్యత ఉన్నాయి. స్త్రీ లేకపోతే పురుషుడే కాదు, సృష్టి కూడా ఉండే అవకాశం లేదు. అందువల్లే మన ప్రాచీన సాహిత్యం స్త్రీకి పెద్దపీట వేసింది. స్త్రీని పురుషులు అబలగా పరిగణించారు. కానీ ఆమెలోని అందం, మార్దవం, ఆత్మవిశ్వాసం, ఆత్మాభిమానం పురుషుడ్ని కూడా అబలుణ్ణి చేశాయి. ఆ ఇరువురూ కలసి సృష్టిని సంపూర్ణం చేశారు.

శృంగార కావ్యాలకుగానీ, శృంగారసంకీర్తనలకు గానీ ఆలంబన "మధుర భక్తి". ఒకరకంగా చెప్పాలంటే జీవాత్మ, పరమాత్మల సంగమ తపనే మధురభక్తి. వైష్ణవ సంప్రదాయాన్ని అనుసరించి...

**"పుమాన్ విష్ణురితిఖ్యాతః । స్త్రీప్రాయమితరం జగత్ ॥"**

అన్న వాక్యం మధురభక్తికి మూలస్తంభం. అందుకే అన్నమయ్య ఆ వేంకటేశ్వరుణ్ణి పురుషునిగా భావించి తనను ప్రేయసిగా, ఇల్లాలిగా, స్వీయగా, పరకీయగా, దాసిగా... ఇలా స్త్రీ స్వరూపమంతా తానే అయ్యి ఆరాధించాడు. పైన పేర్కొన్నట్టు అన్నమయ్య కవితాతత్త్వం "మధురభక్తి". దీనికి ఆలంబన నాయిక లేదా స్త్రీ. ప్రకృతితో స్త్రీని పోల్చడం వల్ల ప్రకృతిలాగే స్త్రీ సైతం సౌందర్యవంతమైనది అనడం అతిశయోక్తి కాదు. అందం ఉన్నచోట పొగడ్త, పొగడ్త ఉన్నచోట వర్ణన సహజంగానే చోటు చేసుకుంటాయి.

అన్నమయ్య తన సంకీర్తనల్లోని స్త్రీ స్వరూపాన్ని పలు సంకీర్తనల్లో అద్భుతంగా వర్ణించాడు. అది నాయిక ముగ్ధమనోహర రూపవర్ణన కావచ్చు లేదా ఆమె మానసిక స్థితి వర్ణన కావచ్చు. ఆ వర్ణన అనితరసాధ్యం. వర్ణన అనేది ఒక వస్తువుకుగాని సంబంధించి ఉండొచ్చు. ఆయా విషయాల బాహ్య, అంతర విశేషాల వివరణే వర్ణన అని చెప్పుకోవచ్చు. వర్ణనలతో కూడుకొన్నదే కవిత్వమన బడుతుంది. కాబట్టి "కవయన్తీత కవయః" అన్న ఆభాణకం ఏర్పడింది.

ఒక చిత్రకారుడు తన మనోఫలకంలో ఉదయించిన భావాల్ని వివిధ వన్నెలతో కుంచె ఆధారంగా చిత్రిస్తాడు. కవి తన మనస్సులో ఉదయించిన భావాల్ని వివిధ వర్ణనలనే వర్ణాలతో పాఠకుడి ఎదుట ప్రత్యక్షం చేయిస్తాడు. తన ఉద్దేశ్యాన్ని పఠితల హృదయాల్లో చొప్పించటానికి కవి వర్ణనల్ని ఆశ్రయిస్తాడు. ఏ విషయాన్నైనా సీదాసాదాగా

చెబితే దానిమీద ఎవరికీ ఆసక్తి కలుగదు. ఆ విషయాన్నే వర్ణనలు చేర్చి చెబితే పఠితలో ఉత్సుకత పెరుగుతుంది. వర్ణనా నైపుణ్యం ఉండే కవి ఎలాంటి నీరస విషయాన్నైనా రసవత్తరం చేయగలుగుతాడు.

అన్నమయ్య సంకీర్తనల్లోని నాయిక వర్ణనలను ప్రకృతి – స్త్రీ వర్ణనలు, మత సంబంధిక ఉపమానాలతో నాయిక వర్ణనలు, నాయిక సౌందర్య ప్రశంసాత్మక వర్ణనలు, శృంగారసామాగ్రితో నాయిక వర్ణనలు, నాయక సామాగ్రిగ నాయిక వర్ణనలు – అనే ఐదు అంశాలుగా వింగడించి అనుశీలించడమైంది.

**ప్రకృతి అందాలతో నాయిక వర్ణన :**

అనాదిగా భగవంతుని కవిగానూ, స్త్రీని ప్రకృతితోనూ వర్ణించడం కవితా సంప్రదాయంగా కనిపిస్తోంది. అన్నమయ్య కూడా తన కీర్తనల్లో నాయికను సాగరసంపదతో, కనుమలతో, నవరత్నాలతో, ఋతువులతో, అడవి అందాలతో వెరసి ప్రకృతి అందాలతో పోలుస్తూ నాయికను వర్ణించాడు.

అన్నమయ్య క్రింది కీర్తనలో నాయిక అందాలను వర్ణిస్తూ వాటికి తగిన కారణాలను సైతం జోడించి పాఠకులకు ఇలా అందిస్తున్నారు –

**"చూదరమ్మా చెలులాల సుదతి చక్కదనాలు**
**కూడుకొన్న పతి కాంతి గురులే పోలెను"** ॥పల్లవి॥

నాయిక ముఖం చంద్రబింబంలా ఉండడానికి కారణం చంద్రుడు ఆమె తోబుట్టువు కావడమే! అమృతము ఆమె పుట్టింటి ధనమే కనుక ఆమె చిరునవ్వు అమృతంలా ఉండడంలో ఆశ్చర్యం లేదు. ఎల్లప్పుడూ ఉవ్వెత్తున ఎగసిపడే తరంగాలతో చంచలంగా ఉండే సముద్రుని కుమార్తె కావడంవల్ల ఆమెలో చంచలత్వం అత్యంత సహజం. మీనాలు ఆమె పుట్టింటి నేస్తాలు కనుక ఆమె కళ్ళు గండు మీనాలను పోలడంలో విచిత్రమేమీలేదు. కల్పతరువు ఆమె వెన్నంటి వచ్చింది కనుక ఆమె పాదాలు కల్పతరువు చిగుళ్ళను పోలివున్నాయి. ఈ విధంగా లక్ష్మీదేవి సముద్రుడి కూతురు కావడంవల్లే అందులోని లక్షణాలను పుణికిపుచ్చుకుని ఉందని అన్నమయ్య సహేతుకంగా వివరించారు.

అన్నమయ్య ఒక నాయిక అందానికి అడవిలోని అందాలకు అబేధం పాటిస్తూ ఆ నాయిక జవ్వనపు అడవి స్వామి రాగానే మురిసిపోయింది అన్నాడు.

**"అతండు వొచ్చిన వేళ నలరు యడవి**
సతి నీదు మురిపెంపు జవ్వనపుటడవి" ॥పల్లవి॥

"నాయిక యౌవనమనే అడవి నాయకుడు అడుగుపెట్టగానే విరబూస్తోంది. ఆ అడవి పెద్దవైన కుచాలనే గిరులతో, యౌవనపు బాహువులనే లతలతో, వాలుచూపులతో తేటగా, దేహపరిమళమనే కర్పూరవాసనతో నిండివుంది. ఆ యింతి నల్లని కురులనే దట్టమైన చీకట్లతో, గొప్పవైన జఘనాలనే అగడితాలతో, మంద్రమైన అడుగులనే

ఏనుగులతో, సన్నని నడుమనే సింహాలతో నిండివుంది. అతివ ఊరువులనే అరటులతో, లలన మాటలనే చిలుకలతో ఉంది" అంటూ పై కీర్తనలో అన్నమయ్య నాయిక అందాన్ని వనసంపదతో చమత్కారంగా వర్ణించాడు.

ప్రకృతిలోని ఏదో ఒక భాగంతోనో, ఏదో పరిణామంతోనేకాక సమూహంగా ప్రకృతి అందాలతో పోటీపెడుతూ నాయికను వర్ణించిన వర్ణన ఇది.

**"చక్కని దానవు నీవు జవరాలవు**
**మక్కువ నీపైఁజేయక మానచ్చునా"** ॥పల్లవి॥

ఈ నాయిక చాలా సొగసరి. ఇక ప్రియునికి ఈమె మీద అనురక్తి కలుగక పోతుందా? ఆమె చూపులే గండుతుమ్మెదలు. నవ్వుల సైగలే మల్లెలు. మోములోని సిగ్గే మెరుపు. ఆమె పలుకులు మన్మథుని చిలుకులు. ఆమె ఘనమైన కొప్పే మేఘం. చక్కదనమే యవ్వనం. ఎఱ్ఱని పెదవే కావిరంగు. నిశితమైన గోళ్ళ మెరుపులే వజ్రపుకాంతులు అంటూ ప్రకృతిలోని సుందరసంపదతో అన్నమయ్య నాయిక సౌందర్యాన్ని వర్ణించాడు.

ఇవేకాక కనుమలతో, ఋతువులతో పలు ఇతర ప్రకృతిలోని వస్తువులతో నాయిక అందాలను వర్ణించాడు అన్నమయ్య.

**నవరత్నాలతో నాయిక వర్ణన :**

నాయిక సౌందర్య సంపదను నవరత్నాలతో పోల్చి వర్ణించడం అన్నమయ్య భావనాశక్తికి చిన్న ఉదాహరణ మాత్రమే.

**"పడఁతి నెమ్మోమునకు బంగారు కళలు దేరీ**
**వెడలే సెలవినవ్వే వెండిగనులు"**

నాయిక అందమే ఆ వేంకటేశునికి నిండు బండారం. ఆమె మోముకు బంగారుకళ అబ్బింది. ఆమె చిరునవ్వులే వెండిగనులు. మగువ పెదవి పగడాల తీగె. పొడవైన వాలుజడే నీలాలరాశి. పడతి పాదాలగోళ్ళే వజ్రాలు. చేతిగోళ్ళు పద్మరాగాలు. కన్నుల తేటలు ఆణిముత్యాల హారాలు. ఆమె చనుమొనలే పచ్చల కొండలు. తరుణి తీయనిమాటలే పుష్యరాగాలు. సిగ్గులే వైఢూర్యాలు. తొలికే అనురాగాలే గోమేధికాలు. అన్నీ చేరి ఆ వేంకటేశ్వరుని కౌగిలిలో నాయికగా మారిపోయాయి. అన్నమయ్య ఈ సంకీర్తనలో నాయికను నవరత్నాలతో కూడిన భాండాగారంగా మార్చాడు. ఈ నిండుబండారమే నాయకుని వశమైనందువల్లే అతడు లక్ష్మీకాంతుడైనాడు.

**మత సంబంధిత ఉపమానాలతో నాయిక వర్ణన :**

నాయిక తన ప్రియుని పొందుకోరి పూజ చేయాలని నిర్ణయించుకుంది. అయితే ఆ పూజకోసం ఆమె వాడిన పూజా సామాగ్రి అపూర్వం. అలాంటి ప్రత్యేకమైన పూజమెచ్చిన నాయకుడు ఆమెకు ప్రత్యక్షము కాకుండా ఉండలేరు కదా!

**"ప్రతిలేని పూజ దలంపగఁగోటి మణుగులై**
**అతివ పరవశము బ్రహ్మానందమాయె"** ॥పల్లవి॥

ఆ మానినీమణి తన మనసునే స్వామికి ఆసనంగా చేసి, తన కనుల నుండి స్రవించి ఆనంద భాష్పాల్నే అర్ఘ్యాదులుగా చేసింది. ఆమె కన్నులజంటే రెండు దీపాలుగా వెలిగాయి. ఆమె అధరామృతమే అభిషేకమైంది. తన చిరునవ్వుల్నే క్రొవ్విరులుగా అర్పించింది. ఆమె శరీర సుగంధమే ప్రియునికి గంధలేపనమైంది. ఆమె తన శరీరకాంతినే నీరాజనంగా చేసింది. ఆమె అలుకలే అతని పాలిటి ఉపచారాలయ్యాయి. నైవేద్యంగా అతనికి తన పొందునిచ్చింది. స్వామి కౌగిట్లో చేరి ఆమె చేసే వినయపు విన్నపాలే మొక్కులయ్యాయి. ఇలా సాటిలేని మన్మథపూజ చేసి ఆ అతివ పరవంశంతో బ్రహ్మానందాన్ని పొందింది.

క్రింది కీర్తనలో అన్నమయ్య స్త్రీ పురుష యోగాన్ని యాగంగా వర్ణించడం అతని భావనాశక్తికి అద్దం పట్టినట్లు.

**"వెలయు నీ కల్యాణ వేదిగా మతి నుండి**
**కలికి జవ్వనపు యాగము సేసెనతఁడు"** ॥పల్లవి॥

ఇక్కడ నాయికే యజ్ఞవేదిక. యాజ్ఞికుడు నాయకుడు. అతడు చేసే యాగం నాయిక యవ్వనపు యాగం. ఆ యాగానికి హోమగుండం నాయిక నాభి. ఆ హోమగుండంలో అతడు విరహాగ్నిని నిండుగా పోశాడు. నాయిక నిట్టూర్పుల వీవెనతో విసురుతూ, ఆమె చెమటలనే ఆజ్యంగా పోశాడు. నెయ్యి పడగానే గగన సదృశమైన నాయిక నడుమనే ఆకాశం పొగలతో నిండిపోయింది. వెంటనే ఆ నాయిక మానమనే బలిపశువును అతి చాకచక్యంగా బలియిచ్చాడు.

పై సంకీర్తనలో అన్నమయ్య స్త్రీ, పురుష యోగాన్ని యాగంగా వర్ణిచడం ఎంతో రమణీయంగా ఉంది.

నాయిక సౌందర్యానికి, జ్యోతిష్యానికి పొంతన కుదర్చడం అన్నమయ్యకే సాధ్యం. జ్యోతిష్యంలోని ద్వాదశరాశులను నాయిక అంగాలతో పోల్చి, ఆ రాశుల రాశిని ఆయన చివరికి "చెలువురాశి"గా నిర్ణయించాడు.

**"ఇన్ని రాశుల యునికి ఇంతి చెలువపు రాశి**
**కన్నె నీ రాశి కూటమి కలిగిన రాశి"**

పై సంకీర్తన అన్నమయ్య నాయిక కనుబొమ్మల్ని ధనూరాశితో, మీనాల్లాంటి కన్నుల్ని మీనరాశితో, కుంభాల్లాంటి కుచాల్ని కుంభరాశితో, నడుమును సింహరాశితో, మకరచిహ్నాం గల పైటను మకరరాశితో, లేతవయసులో ఉండే కన్నెను కన్యరాశితో, పసుపువన్నెతో తూగే ఆమె శరీరాన్ని తులారాశితో, సౌందర్యాతి శయంతో వ్యాపించే అతివను వృషభరాశితో, నాయిక గుట్టు మాటల్ని కర్కట రాశితో, చిగురులాంటి

పెదవి కలిగిన కోమలిని మేషరాశితో, వేంకటేశుని కూడిన సతిని మిథునరాశితో పోల్చాడు. ఇన్నిరాశుల ఉనికి గలిగిన ఇంతి కాబట్టే ఆమె "చెలువపురాశి" కాగలిగింది.

**నాయిక సౌందర్య ప్రశంస :**

ఒక కవి వర్ణనానైపుణ్యం స్థిరవస్తువు వర్ణన కన్నా, చలద్వస్తువు వర్ణనలోనే ఎక్కువగా బయట పడుతుంది. అన్నమయ్యకు చలత్సౌందర్య వర్ణనలో ఉన్న నేర్పు క్రింది సంకీర్తనను పరిశీలిస్తే తెలుస్తుంది.

**"అదె వచ్చె చెలియ యొయారమ్ముతో ప్రియుని**
**సదనంబు వెడలి తన సఖులు గనకుండా" ॥పల్లవి॥**

. నాయిక తన ప్రియుని కూడి, తన సదనానికి తిరిగి వస్తోంది. ఆ సమయంలో ఆమె నుదుటి కస్తూరి చెమటతో చేరి కిందకి జారింది. జారే చీరను అదిమిపట్టి, జారిపోయిన కొప్పును సర్దిపెట్టి, పెదవిపైని గుర్తును దాచుకొంటూ తనకెవరైనా ఎదురు వస్తారేమో అని ఒదిగి ఒదిగి వెళ్తోంది. తన గుబ్బమీది నఖక్షతం ఎవరి కంటాపడకుండా చీరచాటుచేసి, చిక్కుపడ్డ హారాల్ని సరిచేసుకొని, వచ్చే నిట్టూర్పును అణచుకొంటూ, కంట నిదుర తేలుతుండగా, తత్తరపాటుతో అటూయిటూ చూస్తూ, నాయకునితో కలిగిన సరసపు కలయికను తలచుకొంటూ వయ్యారంగా వెళ్తోంది.

తాను నాయకుని చేరి వస్తున్న విషయం యెవరికీ తెలియరాదనే ఆలోచన, యెవరి కంటా పడకుండా ఉండాలనే తాపత్రయం, తన శరీరంపైని సంభోగ చిహ్నాల్ని దాచటానికి ఆమె చేసే ప్రయత్నం, వీలైనంత త్వరగా ఇంటికి చేరాలనే ఆత్రుత, వీటితో సతమతమయ్యే ఒక ఇంతి మన యెదుట నుంచి నడిచి వెళుతున్నట్టు అన్నమయ్య సహజ సుందరంగా వర్ణించాడు.

సహజ సౌందర్యవతి అయిన నాయికకు అలంకరణ అనవసరం అంటూ ఆమె అందాన్ని అత్యంత రమణీయంగా వర్ణించాడు.

**"మూసిన ముత్యాలకేలె మెఱుగులు**
**ఆసల చిత్తాన కేల అలవోకలు" ॥మూసిన॥**

ఈ నాయికకు అలంకారముతో పనియేమి? అందమైన ముత్యానికి మెరుగు పట్టాల్సిన అవసరమేమి? గొప్పదైన ఆ కొప్పుకు చామంతులెందుకు? మెల్లని ఆ నడకలకు మట్టెల మోతలెందుకు? కమ్మని తావులు వెదజల్లే ఆ మేనికి గంధపు పూతయెందుకు? అద్దాల్లాంటి ఆ చెక్కిళ్ళకు అరవిరి పూతలెందుకు? తరుణి అందాన్ని ఆ వేంకటేశుని కౌగిలిలోనే చూసుకొమ్మంటున్నాడు అన్నమయ్య.

నాయిక ప్రేమను పొందిన నాయకుడు మురిసిపోతున్నాడు. అందుకే అన్నమయ్య క్రింది కీర్తనలో "స్వామీ! నీకన్నా నీచెలి గొప్పది చూడవయ్యా!" అంటూ నాయిక సౌందర్యాధిక్యతను వర్ణిస్తున్నాడు.

**శృంగార సామగ్రితో నాయిక వర్ణన :**

అన్నమయ్య నాయికలంతా జవ్వనులే శృంగార రసాధిదేవతలే. వారిని ఆయన శృంగార సామాగ్రితో ఆలంకారికంగా వర్ణించాడు.

**"మోహము సేయించుకొని మురిసేవు నీ**
**సాహసము లెదురా చదురాలి కిపుడు"** ॥పల్లవి॥

ఇక్కడ నాయకుడు శ్రీ మహావిష్ణువు. అతడు చక్రధారి. నాయిక రెండు గుబ్బలు రెండు చక్రాలు. విష్ణువుకు ఉండేది ఒకే చక్రం కాబట్టి నాయిక అతని మీద ఆధిక్యాన్ని సంపాదించుకొంది. స్వామి శరీరచ్ఛాయ నీలమేఘమైతే, నాయిక పెద్దతురుము నీలమేఘమే కదా! నాయకుని ప్రతినిధి మన్మథుడు. ఆ మన్మథుని సంపదే నాయిక! దీంతో నాయకునికన్నా నాయిక గొప్పదని తీర్మానమై పోయింది. అలాంటి సౌందర్యం స్వామి కోసమే కదా! అందువల్ల పరోక్షంగా స్వామి ఆధిక్యతను కూడ అన్నమయ్య స్థాపించాడు.

ప్రాచ్య ఆలంకారికులు శృంగార, వీరరసాల్ని అంగిరసాలుగా, తక్కిన హాస్య, కరుణ, భీభత్స, భయానక, రౌద్ర, అద్భుత, శాంతరసాల్ని అంగరసాలుగా పరిపోషించాలన్నాడు.

అన్నమయ్య క్రింది సంకీర్తనలో నవరసాలొలికించే నాయికను నిలిపాడు.

**"అవధరించ గదయ్య అన్ని రసములు నీవు**
**తివురుచు నబ్బెనిదె తేనె మోవి రసము"** ॥పల్లవి॥

అతివ అందాలతో శృంగారరసాన్ని, ఆమె బెదిరింపులో వీరరసాన్ని, రతి కాంక్షల్లో కరుణరసాన్ని, మైపులకింతల్లో అద్భుతరసాన్ని, తరుణి సరసాల్లో హాస్యరసాన్ని, విరహంలో భయానకరసాన్ని, నిబ్బరాల్లో భీభత్సరసాన్ని, మరుయుద్ధంలో రౌద్రరసాన్ని, ఆనందాల వేగంలో శాంతరసాన్ని వర్ణించి, నవరసాలతో మంతనాలాడి స్వామివారిని బ్రహ్మాండ సహోదరమైన రసానందాన్ని ఆస్వాదించమంటున్నాడు అన్నమయ్య.

**"పలుకుదేనెల తల్లి పవళించెను**
**కలికి తనముల విభునిఁ గలిసినది గాన"** ॥పల్లవి॥

ఆమె మనస్సును భర్త ఆక్రమించాడు. వేంకటేశుని కౌగిట్లో మైపూత చెమట ఆమెకు అంటింది. శ్రీమహావిష్ణువును కలిసి వచ్చిన ఆ పలుకు తేనెలతల్లి అలసి సొలసి పవళించింది. ఆమె మోము మీద కురులు చెల్లాచెదురయ్యాయి. ఆమె కలువకన్నుల్లో అందంచిందింది. పైజ జారింది. ముత్యాలమలగు మీద ఆమె తెల్లవారేదాకా నిదురపోయింది.

ఈ కీర్తనల్లో నాయిక యొక్క రత్యనంతర సుఖనిద్రను అన్నమయ్య సహజ సుందరంగా వర్ణించాడు.

**నాయక సామాగ్రిగ స్త్రీ వర్ణన :**

రాచరిక వ్యవస్థలో నాయకుని యొక్క ధన, కనక, వస్తు, వాహనాలతో పాటు స్త్రీ కూడా అతని ఆస్తిగా పరిగణింపబడేది. ఈ సంప్రదాయానుసారంగానే అన్నమయ్య తన సంకీర్తనల్లోని నాయికలను నాయకుని పట్టాభిషేక, శయ్యా, మజ్జన సామగ్రితో పోల్చాడు. అంతేకాక నాయకునికి చెందిన ద్రవ్య విశేషాలుగా, అతనికి చవులూరించే, ఆస్వాదయోగ్యమైన వంటకాలతో కూడా పోలుస్తూ స్త్రీని వర్ణించాడు.

క్రింది కీర్తనలో అన్నమయ్య వేంకటేశ్వరునికి అలమేలుమంగ పట్టాభిషేక సామాగ్రిగా మారిన తీరును రమణీయంగా వర్ణించాడు.

**"యిట్టి భాగ్యము గంటిమి ఇద్దరూ బదుకరయ్య**
**పట్టము గట్టుకొంటివి పచ్చదేరనయ్యా"** ॥పల్లవి॥

నాయిక సహవాసమే నాయకునికి సింహాసనం. చూపులవిరులే రత్నాభి షేకాలు. చల్లని చిరునవ్వులే ఛత్రచామరాలు. ఆమె కుచాలే సామ్రాజ్యదుర్గాలు. మెరిసే ఆమె అధరాలే నిత్యవిందులు. ఆమె ఆలింగనమే నాయకుడు నివాసముండే నగరం. రతి చెనకులు నాయకునికి ఆభరణాలు. ఆమెతో కూటమే సర్వసంపద. నాయిక అనే పట్టాభిషేకపు సామాగ్రితో పట్టం కట్టుకొని నాయకుడు ప్రణయ సామ్రాజ్యాన్ని ఏలాడు.

**"చొక్కపు నీ పెండిల నేఁడె సుక్కురారము**
**అక్కరతో నిన్నియు నవధరించవయ్యా"** ॥పల్లవి॥

శుక్రవారం నాడు నాయకునికి పెళ్ళి, పెళ్ళికొడుకును చేయడానికి అతనికి మజ్జనం చేయిస్తున్నారు. ప్రియురాలి చెమటలే అతడికి పన్నీటిస్నానాలు. ఆమె ముద్దుమాటలే మంత్రపఠనాలు. ఆమె కొంగే తడివొత్తే వస్త్రం. ఆమె చిరునవ్వే కర్పూరపుకాపడం. ఆమె చూపే తట్టుపుణుగు. ఆమె పరిమళాల నిట్టూర్పులే అతనికి విసిరే చల్లనిగాలి అలమేల్మంగ ఆలింగనమే అతనికి తామరలపూజ. ఆమె తనుకాంతే అతనికి ఆభరణాలు. చివరికి వారిద్దరూ కూడగానే అన్నివైభవాలు వారి సొంతమయ్యాయి. ఇలా నాయికే అతడికి మజ్జనసామాగ్రియై అపురూపమైన సేవల్ని అందించింది.

నాయిక నాయకుణ్ణి విందుకు ఆహ్వానించింది. ఆ విందులో నాయిక వడ్డించిన వంటకాలేమిటో యీ క్రింది కీర్తనలో అన్నమయ్య వర్ణించాడు.

**"చవులు సేసుక నీవు సారెసారెకు**
**అవసరములతోడ నారగించవయ్యా"** ॥పల్లవి॥

నాయిక మాటలు చద్దిమూటలు పాటలనే పంచదారల్ని, పచ్చి మోవనే తేనెల్ని బెదిరింపు చూపులనే కారాల్ని, పొంకపు చూపులనే అంబళ్ళను, నవ్వులనే పచ్చళ్ళను,

రతి అనే బువ్వాల్ని ఆ వేంకటేశునికి వడ్డించింది. ఇలా నాయిక తనఅందాన్ని నాయకునికి వడ్డించిన విస్తరిని చేసింది. మధురమైన ఆమె పొందు నాయకునికి అసలైన నిండైన విందైంది.

మొదటే విన్నవించినట్లు అన్నమయ్య సంకీర్తన మహాసాగరం. అందులోని స్త్రీ సంబంధిత వర్ణనలను పరిశోధించదమంటే సముద్రంలో నీటి బొట్లను లెక్కించినట్లే. ఈ పరిశోధనా వ్యాసం బహుముఖ ప్రజ్ఞాశాలియైన అన్నమయ్య వర్ణనా భాస్కరునికి దివిటీ చూపినట్లు. ఈ జాతీయ సదస్సు తెలుగు సాహితీ జగత్తులో అన్నమయ్య కీర్తిపతాకాన్ని చిరస్థాయిగా నిలుపుతుందని భావిస్తున్నాను.

***

# తాళ్ళపాక అన్నమయ్య సాహిత్యం - సాంఘిక దృక్పథం

**డా॥ ఎన్. భీమన్న**
**తెలుగు అధ్యాపకులు**
**శ్రీ వేంకటేశ్వర ఆర్ట్స్ కళాశాల**
**తిరుపతి**

తెలుగు సాహిత్యంలో పదకవితకు దేదీప్యమానమైన కీర్తిని తెచ్చింది అన్నమయ్య. భారతీయ సమాజం అన్నమయ్యను భక్తి కవిగా, ఆధ్యాత్మిక కవిగా, సాంఘిక చైతన్యాన్ని నింపిన కవిగా గుర్తించి గౌరవించింది. 32 వేల కీర్తనలు రచించి, స్వరకల్పన చేసి, సమాజంలో ప్రచారం చేసి మానవీయ విలువలను వెలికి తీసిన కవి అన్నమయ్య.

**"ఏ కులజుడైన నేమి? ఎవ్వరైన నేమి?**
**ఆకడ నాతడే హరి నెరిగిన వాడు"** **(ఆ.సం.-సం.1, సంకీ. 292)**

ఇది ఆనాడు బ్రాహ్మణవాదం మీద తిరుగుబాటే. దేవుని పేరు చెప్పుకొని సకల భోగాలను అనుభవిస్తున్న సోమయాజులను, పురోహిత వర్గాన్ని అన్నమయ్య తన కీర్తనల్లో దుయ్యబట్టడం భక్తి కవితోద్యమానికి తిరుగుబాటు వంటిది.

అన్నమయ్య తన సమకాలీన సమాజంలోని అంతరాలను, విభజన రేఖలను మరుగుపరచే సాహిత్యాన్ని సృష్టించే ప్రయత్నం చేయలేదు. తను నమ్మిన భక్తి మార్గంలోనే కపటం లేని సమాజాన్ని ఆవిష్కరించాడు. గ్రామీణుల జీవన స్థితిగతుల లోతుల్లోకి కూడా వెళ్ళి ఆనాటి సాంఘిక అసమానతలను తన కీర్తనల ద్వారా ఎత్తి చూపాడు.

వివిధ కులాలు, వృత్తాలకు సంబంధించిన ప్రజల జీవన వైవిధ్యాలను, ఆచార వ్యవహారాలను తన కవిత్వంలో ప్రదర్శించాడు. నిమ్న వర్గాలు అనబడే సాటి మానవుల పట్ల ఆనాటి సమాజం వ్యవరిస్తున్న తీరును, దానికి మద్దతు తెలిపే ధర్మ సంబంధమైన వాటిని నిరసించాడు.

ఏ సమాజమైన తనకు కావలసిన సాహిత్యాన్ని తానే సృష్టించుకుంటుంది. స్త్రీవాదం దళితవాదులను దీనికి ఉటకింపుగా చెప్పుకోవచ్చు. కాబట్టి ఏ కవి అయినా తన సమకాలీన సమాజపు పరిస్థితులను ఎక్కడో ఒకచోట ప్రస్తావించడం అనేది అసందర్భం కానే కాదు.

అన్నమయ్య సాహిత్య దృక్పథం భక్తి. తను వేంకటేశ్వరస్వామి భక్తుడు. దైవభక్తిని మార్గంగా ఎంచుకొని ఆనాటి సమాజంలో తన చుట్టూ ఉన్న నడుస్తున్న సామాజిక సమస్యలను దేవునికి విన్నవించుకున్నాడు. రాజరిక వ్యవస్థను వ్యతిరేకించాడు. ఒకవిధంగా సమాజంలోని అసమానతలను, సామాజిక రుగ్మతలను దేవునికి విన్నవించడం అనేది గుర్రం జాషువా కూడా అన్నమయ్య చూపిన మార్గంలోనే పయనించాడేమో అనిపిస్తుంది.

ఆస్థాన కవులు కీర్తించిన కులవ్యవస్థను అన్నమయ్య విమర్శించాడు. దేవుడు ఒక సామాజిక అంశం అయినప్పుడు ఆ దేవున్ని ఆరాధించే హక్కు సమాజంలో నివసించే అందరికీ ఒకే రకంగా ఉందన్నాడు. వేంకటేశ్వరుని భక్తులు కావడానికి కులం అడ్డుకాదని చెప్పాడు. (పేజి 415, అన్నమయ్య బహుముఖ ప్రాభవం, రాచపాళెం చంద్రశేఖర్ రెడ్డి). ఏ దేశంలోనైనా మతానికి దేవుడికి సంబంధం ఉంటుంది. ఒక మతంవారు ఆ మతానికి చెందిన దేవున్నే పూజిస్తారు. కానీ భారతీయ సమాజం కోట్లాది దేవుళ్ళను సృష్టించింది. సమాజాన్ని కులాల వారిగా విడగొట్టి వాళ్ళ సాంఘిక స్థాయిని బట్టి దేవుళ్ళ ఏర్పాటు జరిగింది. అందరు దేవుళ్లను అన్ని కులాల వాళ్ళు పూజించే ఆచారం లేదేమో అనిపిస్తుంది. కారణం మాతమ్మ, మారెమ్మ, సుంకులమ్మ వంటి దేవతల గుళ్ళు కేవలం దళిత బహుజనుల వాడల్లోనే కనిపిస్తాయి.

ఇలాంటి దురాచారాన్ని, అనాగరికతను అన్నమయ్య సహించలేక పోయాడు. అన్నమయ్య దృష్టిలో దేవున్ని సేవించే వాడెవడైనా గొప్పవాడు.

"ఎక్కువ కులజుడైన హీనకులజుడైన
నిక్క మెఱిగిన మహానిత్యుడే ఘనుడు" (అ.సం.-సం.1, సంకీ.318)

ధనం, కులం కలిగి వుండటం, వేదాలు చదివిన సోమయాజులైన సరే విష్ణుభక్తి లేని వాడు వృథా అని, ఇవేవి లేకున్నా విష్ణువుని ఆరాధించే కింది కులం వాడైనా గొప్పవాడని అన్నమయ్య భావించాడు.

**"పరమగు వేదాంత పఠన దొరికియూ సదా**
**హరిభక్తి లేని సన్న్యాసికంటె"** (ఆ.సం.-సం.1, సంకీ.318)

అన్నమయ్య తాను జీవించిన కాలంలో కులం కలిగివున్న వాళ్ళు ఎలా ఉన్నారో, ఎలాంటి వాళ్ళో అన్నమయ్య విశదపరిచాడు.

**"కులమెంతగలిగెనది కూడించు గర్వంబు"** (ఆ.సం.-సం.9, సంకీ.33)

విష్ణువును పూజించడానికి కులం అక్కరలేదని చిడిపిరాళ్ళలో సైతం విలువైన వజ్రాలు పుడతాయని అన్నమయ్య బలంగా నమ్మాడు.

**"తలమేల కులమేల తపమే కారణము**
**యెలమి హరిదాసులు యే జాతియైన నేమి?**
**చిడిపిరాళ్లం బుట్టవా విలువైన వజ్రములు"** (ఆ.సం.-సం.2, సంకీ.293)

ఏ కవైనా, రచయిత్రైనా, దార్శనికుడైనా ఎదుటి వారికి చెప్పడం కన్నా, మొదట తన చుట్టూ వున్న తప్పుల్ని సరిదిద్దుకోవాలి. తనకు మూలమైన సమాజాన్ని దర్శించి, అందులోని లోటుపాట్లను గుర్తించి అక్కడి నుంచే సామాజిక మార్పు దిశగా, తాను చేరుకోవాల్సిన లక్ష్యం దిశగా ప్రయాణం మొదలు పెట్టాలి. ఈ విషయంలో చాలామంది అభ్యుదయవాదుల కన్నా, అగ్రకుల ధనుకులకన్నా అన్నమయ్య ముందున్నాడని ప్రముఖ రచయిత్రి ఏమ్.ఎమ్. వినోదిని అభిప్రాయ పడ్డారు.

***

# అన్నమయ్య సంకీర్తనల్లో భక్తితత్త్వం

**డా॥ సూరపరాజు వసంతకుమారి**
**తెలుగు విభాగాధిపతి**
**శ్రీపద్మావతి మహిళా డిగ్రీ మరియు పి.జి. కళాశాల**
**తిరుపతి**

పదకవితా పితామహుడు అన్నమయ్య అఖిలాండకోటి బ్రహ్మాండనాయకుడైన శ్రీ వేంకటేశ్వరస్వామివారిని 32 వేల శృంగార ఆధ్యాత్మిక సంకీర్తనా సుమాలతో అర్చించాడు. అందులోని ప్రధాన వస్తువు భక్తి. 'భజ' అనే ధాతువు నుండి భక్తి శబ్దం ఏర్పడింది. భగవంతుని భజించుటయే భక్తి అని అర్థము.

మానవజన్మ పరమావధి మోక్షం. మోక్ష సాధనకు భక్తి, జ్ఞాన, కర్మ, యోగాలు మార్గాలు. ఈ నాలుగు మార్గాలలోను భక్తి మార్గము అత్యంత సులభమైనది. పారమార్థిక

జీవితానికి ప్రథమ సోపానము భక్తి. జీవుడు దేవునికి దగ్గరై స్వామిలో ఐక్యం కావటానికి తోడ్పడే మహోన్నత సాధనం భక్తి.

మహా భక్తుడైన అన్నమయ్య మానవాళికి భక్తి మార్గాన్ని ప్రబోధించాడు. తన అలతి అలతి పదాలతో పండిత పామర జనావళికి అర్థమయ్యేలా, శిశుపశుపక్ష్యాదులను సైతం ఆనంద పరవశులను చేసేలా తన శ్రావ్య సంగీతాలాపనలతో భక్తితత్త్వాన్ని వివరించాడు. భక్తి శక్తి అనంతమని, భగవంతుణ్ని చేరుటకు భక్తే సులభమైన మార్గమని, పాపపరిహారిణీ ముక్తి ప్రదాయిని అయిన భక్తి సకల శాంతికరమైన పరమ సుఖానిస్తుందని, హరి భక్తులకు ఏ కొరతా వుండదని ప్రబోధించాడు. భగవదైక్యాన్ని పొందటానికి వివిధ భక్తి మార్గాలను వివరించాడు. అన్నమయ్య సంకీర్తనల్లో ఆద్యంతము నిండిన ఈ భక్తి యొక్క తత్త్వాన్ని తరచి చూస్తే మనకు క్రింది విధంగా బహుముఖంగా దర్శనమిస్తుంది.

**భగవంతుని చేరుటకు సులభమైన మార్గము భక్తి:**

కొందరు భగవంతుని చేరుటకు ఎన్నో ఉపాయాలు, ప్రయాసలు పడుతుంటారని వాటివలన ప్రయోజనము లేదని భగవంతుని చేరుటకు భక్తి ఒక్కటే సులభమైన మార్గమని అన్నమయ్య ఈ క్రింది కీర్తనలో తెలిపాడు.

**ఏవీ నుపాయాలు గావు యెక్కువ భక్తేకాని**
**దావతిఁ బడక యిది దక్కితే సులభము .. (2-49)**

భగవంతుని చేరుటకు భక్తి యొక్కటే శ్రేష్టమైన ఉపాయము కాని, మరియేమియు కావు, లేనిపోని ప్రయాసలకు లోనుగాక జీవునికి భక్తి యొక్కటి పూర్తిగా వశమైనచో భగవత్ప్రాప్తి సులభమగును. ప్రాణాయామ పద్ధతి, కర్మ మార్గము, ఉపవాసాదుల ద్వారా ఇంద్రియ నిగ్రహము, మనోనిగ్రహ పూర్వకమైన ధ్యానయోగము మున్నగు త్రోవలలో నడచి విష్ణుసాన్నిధ్యము చేరుకొనుట సాధ్యము కాని పని. భక్తి యొక్కటే అందుకు చాలా సులభమైన ఉపాయము అని తెలిపాడు.

తనపట్ల ఎంత భక్తిచూపుతారో భక్తులపై భగవంతుడు అంత ప్రసన్నత చూపుతాడు:

ఎంత భక్తి పరమాత్మపై కలిగివుంటే అంతగా భక్తులపై స్వామి తన ప్రసన్నతను చూపుతాడని ఇటు భుక్తిని, అటు ముక్తిని ప్రసాదించే భక్త సులభుడు పరమాత్మ అని అన్నమయ్య ఈ క్రింది కీర్తనలో తెలిపాడు.

**భక్తి కొలఁది వాఁడే పరమాత్ముఁడు**
**భక్తి ముక్తిఁదానే యిచ్చు భువిఁబరమాత్ముఁ డు (1-410)**

పరమాత్ముడు భక్తి కొలదివాడు. అనగా పిండి కొలది రొట్టె యన్నట్లు తనపట్ల జీవుడెంతగా భక్తి చూపుదురో అంతగా వారిపట్ల ప్రసన్నత జూపుతాడు. సకల జీవులకు ఇటు భుక్తిని, అటు ముక్తిని ప్రసాదిస్తాడు.

పరమాత్ముడు తన్ను పట్టినవారికెల్ల చేతి బిడ్డ వంటివాడు. కొందరు చిన్న బిడ్డలు పిలిచిన వారందరి దగ్గరకు పోయి వారిచే లాలించబడుదురు. అట్లే భగవంతుడు గూడా తనను శ్రద్ధతో తలచిన భక్తుల కెల్లా స్వాధీనమగుచున్నాడు. భూమి లోపలినున్న నిధిని వెలికి తీయడానికి పలుప్రయత్నాలు చేయవలెను, కానీ బయటే వున్న ధనమైనచో సులభముగా గ్రహింపడానికి వీలు కలుగును కదా? అలాగే భగవంతుడు మరుగులేక భక్తి గల వారికెల్లరికి సులభ సాధ్యుడగుచున్నాడు. పట్టపగటి వెలుగు ఎలా సంశయానికి తావివ్వక వెలుగునిస్తుందో అలానే భగవంతుడు కూడా సంశయముల తావివ్వక దివ్యతేజము కలిగి ప్రకాశించుచున్నాడు. పచ్చిపాలలో వెన్న ఎలా అంతటా వ్యాపించి వుంటుందో, అలా భగవంతుడు సర్వత్ర వ్యాపించి యున్నాడు. కానీ పాలలో వెన్న కాచి తోడ బెట్టనిదే చేతికందదు. కానీ పరమాత్ముడు అట్టి కష్టములేవీ లేకుండానే భక్తి మాత్రముచే స్వాధీనమవుతున్నాడు అని పరమేశ్వరుని భక్తి సౌలభ్యమును అన్నమయ్య వివరించాడు.

**ఎడతెగని నిరంతర భక్తిని కలిగివుండాలి:**

భగవద్భక్తి ఎలా వుండాలంటే అది ఎడతెగనిదై నిరంతరం ఉండాలని అన్నమయ్య ఉద్బోధించాడు.

**పరమ సుజ్ఞానులకు ప్రపన్నులకు**
**మరుగురుని మీఁదట మనసుండవలదా (15-46)**

శ్రేష్ఠమైన సుజ్ఞానము గలవారికి ప్రపత్తి మార్గము ననుసరించువారికి మాధవునిపై సదా మనసు లగ్నమై వుండవలెను. ఆకలి గొన్న వానికి అన్నముపై ఆపేక్ష నుండునట్లు భక్తునికి పరమేశ్వరునిపై తీవ్రమైన ఆపేక్ష వుండవలెను. పసిబిడ్డలకు పాలచంటిపైననే ఆశవున్నట్లు భక్తులకు గోవిందునిపైననే భక్తి స్థిరమై వుండవలెను. బాటసారి ఆపేక్ష అంతయూ తాను విడియుచోటనే వున్నట్లు ప్రపన్నులకు శ్రీనాథునిపైననే లక్ష్యముండవలెను. ధనికుడు ఏమరుపాటులేక నేర్పుతో తన ధనపేటికను కాచుకొనియుండినట్లు శరణాగతుడు శ్రీవేంకటేశ్వరునే అనుసరించి వుండవలెను. అలజాలములకు నీటిపై ఎడతెగని భ్రమణమున్నట్లు ఈ దేవునిపై భక్తులకు నిరంతర ప్రేమ వుండవలెను. ఎప్పుడో ఒకసారి గాక ఎప్పుడూ స్వామిపైనే భక్తి యుండాలని అన్నమయ్య తెలిపాడు.

**భక్తుడిని ఏవీ ఏమీ చేయలేవు, ఆపలేవు, భక్తి శక్తి అనంతం:**

భక్తుడిని ఏవీ, ఏమీ చేయలేవని, ఆపలేవని, భక్తి యొక్క శక్తి అంత గొప్పదని అన్నమయ్య ఈ క్రింది కీర్తనలో తెలియజేసాడు.

**ఎండగాని నీడగాని యేమైనాఁగాని**
**కొండలరాయఁడే మాకు కులదైవము (1-214)**

**పాపములు తొలగించుకొని ముక్తిని పొందుటకు హరిభక్తే సులభమైన ఉపాయం:**

పాపములు తొలగించుకొని పునర్జన్మ లేకుండా ముక్తిని పొందటానికి హరి భక్తియే సులభోపాయమని అన్నమయ్య క్రింది కీర్తనలో తెలిపాడు.

**ఇది నమ్మలేఁడు పుణ్యాలేమేమో చేసీ దేహి**
**పొదలి యిందు వంకనే పొడవెక్కలేఁడా.. (3-375)**

దేహ ధారి యైన జీవుడు తనకు మేలు కోరి ఏమేమో పుణ్యకార్యములు చేయుచున్నాడు. సులభ సాధ్యమైన ఈ హరిభక్తి మార్గమును నమ్మలేడు. ఈ తెరవున నడచినచో అతడు ఉన్నత గతి నొందలేడా? గొప్ప గొప్ప రోగములకు గురియైనవాడు తగిన మందు సేవించి ఆ రోగములను బాపి సుఖించుచున్నాడట! ఇక పూజితమైన హరినామమనెడు ఔషధమును సేవించినవాడు పాపములనెడు వ్యాధులను పోగొట్టుకొన లేడా? కవచమును దాల్చిన వాడు సూటిగా తగిలిన వాడి ములుకులు కేమాత్రమూ జంకక రణరంగమున విజయ మొందుచుండుట ప్రసిద్ధము. ఇక హరిదాస్యమనెడు వజ్రపంజరమున నున్నవాడు పునర్జన్మలనెడు బాణములను విదిలించు కోజాలడా ? అనువైన నిధి ఆర్జించిన వాడు పేదరికము వీడి తులలేని సంపదలతో తులతూగుచూ జీవించుచున్నాడట. ఇక ఎప్పుడునూ శ్రీవేంకటేశ్వరుని దివ్య పాదములనే తన పెన్నిధిగా భావించి సేవించు వాడు గొప్పవాడు(ముక్తుడు) కాడా ? తప్పక కాగలడని భావము.

**అంతటా, అన్నింటా అందరిలో దైవాన్ని దర్శించగలగడమే పరిపూర్ణ భక్తి:**

సంపూర్ణ భక్తి భావన కలిగిన భక్తులకు ఈ సృష్టిలో ప్రతి ఒక్కరూ నారాయణ మూర్తుల్లాగా, ప్రతిదీ శ్రీహరి ప్రసాదములాగానే కనిపిస్తుందని భక్తి యొక్క పరిపూర్ణతను క్రింది విధంగా వివరించాడు అన్నమయ్య.

**ఎదుట నెవ్వరు లేరు యింతా విష్ణుమయమే**
**వదలక హరిదాస వర్గమైన వారికి (1-502)**

**భక్తులను బ్రతికించునది సకల శాంతి కరమైన భక్తే:**

భక్తి సకల శాంతికరమని, భక్తులను బ్రతికించునది భక్తియే యని అన్నమయ్య ఇలా తెలిపాడు.

**సకల శాంతి కరము సర్వేశ నీపై భక్తి**
**ప్రకటమై మాకు నబ్బె బదికించు నిదియె .. (3-377)**

**భక్తులకు పరమసుఖాన్నిచ్చేది భక్తే:**

భక్తునికి పరమసుఖానిచ్చేది భగవంతునిపై వున్న భక్తి మాత్రమే తప్ప మరేవి సుఖాన్నివ్వలేవని పదకవితా పితామహులు ఇలా తెలిపారు.

**భక్తి నీపై దొకటె పరమసుఖము**
**యుక్తి చూచిన నిజం బొక్కటే లేదు (3-322)**

**భక్తికి ఇనుప సంకెళ్ళు ఊడి క్రిందబడ్డాయి, రాజు భక్తుని పాదాలపై పడ్డాడు:**

పెనుగొండరాజైన సాళువ నరసింహరాయలు అన్నమయ్య మధురభక్తి సంబంధిత కీర్తనలకు ముగ్ధుడై తనపై కూడ ఆ శ్రీహరిపై చెప్పిన విధంగా పదాలను చెప్పమన్నాడు.

**పరమ పతివ్రతా భావంబు పూని**
**హరి మకుందుని కొనియాడు నా జిహ్వా**
**నిను గొనియాడంగ నేరదు** (అన్నమయ్య చరిత్ర ద్విపద .. పుట .. 37)

అని హరిభక్తుడైన అన్నమయ్య సమాధానం ఇచ్చాడు. గర్వాంధకారి యైన రాజు అన్నమయ్యకు సంకెళ్లు వేసి చెరసాలలో బంధించాడు.

**ఆఁకటి వేళల నలపైన వేళలను**
**తేఁకువ హరినామమే దిక్కు మఱి లేదు (1-158)**

అని అన్నమయ్య స్వామిని వేడుకొనగా సంకెళ్ళు వీడి క్రిందపడ్డాయి. రాజు అన్నమయ్య భక్తి తత్పరతను చూసి ఆయన పాదాలపై బడి తనను క్షమించమని ప్రార్థించాడు. అన్నమయ్య జీవితంలో జరిగిన ఈ సంఘటనలు ఆయన ఏ విధంగా జీవించాడో, ఆయన భక్తి తత్త్వమెటువంటిదో, ఎంతటి మహా భక్తుడో తెలియజేస్తాయి. అంతేకాదు భగవంతుడు అనుక్షణం తన భక్తులను ఎలా కాపాడుతాడో తెలియజేస్తున్నాయి.

**భక్తితో సాధించలేనిది లేదు - శ్రీహరి భక్తులకు ఏ కొరత ఉండదు:**

భక్తితోసాధించలేనిదేది లేదని శ్రీహరిని ఆశ్రయించిన భక్తులకు ఎందులోను, ఏవిధమైన కొరత వుండదని అన్నమయ్య ఈ కీర్తనలో తెలియజేశాడు.

**చాలుఁజాలు నీ హరియే మాకును సకల క్రియలకు నాయకుఁడు**
**నాలుక తుదనే యీతఁడుండఁగా నలుగడ నెవ్వరి వెదకేము (3-371)**

ఇదే మాకు చాలు. ఇంతకంటే మాకేమియు వలదు. ఈ శ్రీహరియే మాకు ఎల్ల పనులకు నాయకుడై యున్నాడు. ఇతడు మా నాలుక తుదనే ఉన్నాడు. ఇట్లుండగా నలువైపుల మేమింకెవ్వరిని వెదకుదుము ? వేరొకరికోసమై వెదకవలసిన అవసరము మాకు లేనే లేదు. ఈతడు సకలైశ్వర్యముల కధిదేవతయైన శ్రీ మహాలక్ష్మికే మగడు. మమ్మేలిన వాడితడే. ఇంక మాకెందైన కొరత కలదా? సర్వలోకములను సృష్టించి ఆయువు బోయు బ్రహ్మను గన్న తండ్రి నాలోనే ఉన్నాడు. ఇక నా కాయువునకు కొదువయా ? పాలకడలిపై పవళించు దేవుని వారము మేము. ఇక ఇతరుల చెంత చేయి చాపాల్సిన అవసరము లేదు. మేము భూదేవత భర్తయగు శ్రీహరికి దాసులము. ఈ పొలములన్నియు మా సొమ్మే. తిరుగులేని సుదర్శన చక్రమును చేపట్టిన నారాయణుడే మాకు దిక్కు. ఇంక మాకేమి భయము, కొరత? మేము వైకుంఠుని

దాసులము మాకు మోక్షము అరచేతనే వున్నది. పాపములను కడిగివేయు పవిత్ర గంగానదికి తండ్రియగు హరిసేవకులము కాన అన్ని విధముల పాపములనుండి మేము విడవడితిమి. సర్వైశ్వర్య నిధియగు శ్రీ వేంకటేశ్వరుడే మాకు వరములిచ్చు దేవుడు. మాకిక వెలితి ఏమీలేదు. శ్రీహరి భక్తులైన మాకు ఏ కొరతాలేదు, ఎవరినీ యాచించవలసిన పనిలేదు. ఇది భక్తి యొక్క ఫలము అని అన్నమయ్య వివరించాడు.

**వివిధ భక్తి మార్గాలు:**

వ్యాసుడు శ్రీ మద్భాగవతంలో భక్తి తొమ్మిది రకాలని తెలిపాడు.

**"శ్రవణం కీర్తనం విష్ణోః స్మరణం పాదసేవనమ్**
**అర్చనం వందనం దాస్యం సఖ్యమాత్మ నివేదనమ్."**

(భాగవతం – సప్తమ స్కంథం)

బమ్మెర పోతన ఈ శ్లోకాన్ని సప్తమ స్కంథంలో ఈ క్రింది పద్యరూపంలో ప్రహ్లాదుడి ద్వారా హిరణ్యకశిపునికి వివరించాడు.

**తను హృద్భాషల సఖ్యమున్ శ్రవణమున్ వందనా**
**ర్చనముల్ సేవయు నాత్మలో నెఱుకయున్ సంకీర్తనల్ చింతనం**
**బను నీ తొమ్మిది భక్తి మార్గముల సర్వాత్మున్ హరిన్ నమ్మి స**
**జ్జనుడై యుండుట భద్రమంచుదలతున్ సత్యంబు దైత్యోత్తమా**

ఈ నవవిధ భక్తి మార్గాలను అన్నమయ్య కూడ తన ఆధ్యాత్మిక సంకీర్తనల్లో పలుమార్లు ప్రస్తావించారు.

**శ్రవణం:** భగవత్సంబంధమైన విషయాలను శ్రద్ధగా వినడమే శ్రవణభక్తి. ఈ మార్గాన్ని అనుసరించి మోక్షాన్ని పొందిన మహానుభావుడు పరీక్షిన్మహారాజు.

**అన్నమయ్య శ్రవణభక్తి గురించి ఇలా కీర్తించాడు.**
**ఘాతలఁజెవుల వినఁగా నంటిన పాపము**
**నీతితో నీకథ వింటే నిమిషానఁబాయును (3-377)**

**వినరో భాగ్యము విష్ణుకథ**
**వెను బలమిదివో విష్ణుకథ (3-355)**

**కీర్తనం:** భగవంతుని గురించి కీర్తిస్తూ పాడడం కీర్తన భక్తి. ఈ మార్గము ద్వారా తరించిన భక్తుడు నారదుడు. అన్నమయ్య సంకీర్తనలన్నీ స్వామిని కీర్తనం చేసినవే అయినా అందులో ప్రత్యేకంగా కీర్తనం గురించి ఈ క్రింది విధంగా సంకీర్తనాచార్యులవారు తెలిపారు.

**వినికి గనవలసినను విష్ణుకీర్తన చెవికి**
**వినికి చేసిన నడియె వేదాంత బోధ (1-52)**

**చాలదా బ్రహ్మమిది సంకీర్తనం మీకు**
**జాలెల్ల నడంగించు సంకీర్తనం (1-343)**

**స్మరణం:** సర్వకాల సర్వావస్థల్లోనూ భగవంతుని స్మరిస్తూ వుండడం స్మరణ భక్తి. ఈ మార్గాన తరించిన భక్తుడు ప్రహ్లాదుడు. అన్నమయ్య ఈ క్రింది కీర్తనల్లో ఈ స్మరణ భక్తిని ప్రస్తావించారు.

**చాలదా హరినామ సౌఖ్యామృతము దమకు (1-52)**

**అన్నిటికి నిది పరమౌషధము**
**వెన్నుని నామమే విమలౌషధము (4-358)**

**ఆంకటివేళల నలపైన వేళలను**
**తేంకువ హరినామమే దిక్కు మఱిలేదు (1-158)**

**పాదసేవనం:**

భగవంతుని పాదపద్మాలను సేవించడం పాదసేవనాభక్తి. ఈ మార్గము ద్వారా కైవల్యాన్ని పొందిన భక్తుడు సుధాముడు. అన్నమయ్య పాదసేవనభక్తి గురించి ఇలా తెలిపాడు.

**శ్రీమన్నారాయణ శ్రీమన్నారాయణ**
**శ్రీమన్నారాయణ నీ శ్రీపాదమే శరణు (1-155)**

**సదానందము సర్వేశ్వర నీ**
**పదారవిందముపై భక్తి (2-369)**

**అర్చనం:** భగవంతుని 'పత్రపుష్ప ఫలాలతో, ధూపదీప నైవేద్యాలతో పూజించడం అర్చన భక్తి. ఈ మార్గమున మోక్షాన్ని పొందిన భక్తుడు పృథుడు. అన్నమయ్య అర్చన భక్తి గురించి ఇలా గానం చేశాడు.

**నిండుమనసే నీ పూజ**
**అండంగోరకుండు టదియు నీపూజ (3-320)**

**నిత్యపూజలివిగో నేరిచిననోహూ**
**ప్రత్యక్షమైనట్టి పరమాత్మునికి (2-82)**

**వందనం:** భగవంతునికి భక్తిశ్రద్ధలతో నమస్కరించడం వందన భక్తి ఈ మార్గాన ముక్తి పొందిన భక్తుడు అక్రూరుడు. వందన భక్తిని క్రింది కీర్తనలో ప్రస్తావించాడు అన్నమయ్య.

**నలినాక్షా నీకు నమస్కరించిన**
**ఫలము పొగడనిక బ్రహ్మకువశమా (3-131)**

**నారాయణతే నమో నమో**
**నారద సన్నుత నమో నమో (4-49 నిదురేకు)**

**దాస్యం:** భగవంతుని ప్రభువుగా, తనను అతనికి దాసునిగా భావించి సేవించడం దాస్య భక్తి. ఈ భక్తి మార్గములో తరించిన భక్తుడు హనుమంతుడు. అన్నమయ్య కీర్తనల్లో దాస్య భక్తి ఇలా దర్శనమిస్తుంది.

**కూడి శ్రీవేంకటేశ్వరుఁగొలిచి దాసుడౌటే**
**వీడని బ్రహ్మానంద వేదాంత రహస్యము (2-233)**

**యీ మాట గర్వము గాదు నీ మహిమే కొనియాడితి గాని**
**చేముంచి నా స్వాతంత్ర్యము చెప్పిన వాడ గాను (2-338)**

**సఖ్యం:** భగవంతుని స్నేహితునిగా భావించి ఆరాధించడం సఖ్య భక్తి. ఈ భక్తి మార్గాన తరించిన భక్తుడు అర్జునుడు. అన్నమయ్య క్రింది కీర్తనల్లో ఈ సఖ్య భక్తిని ప్రస్తావించాడు.

**పాండవ రక్షణ పరుఁడై నరునకు**
**నండనే తెలిపే మహామహిమ (1-295)**

**కానరో కానరో మీరు కూరిమి మందు**
**వునికి మనికి కెల్ల నొక్కటే మందు (1-237)**

**ఆత్మ నివేదనం:** భగవంతుని మహిమలను, లీలను తెలుసుకుని ఆయన అనంతతత్వాన్ని నమ్మి తనలోని అహంకార, మమకారాలను చంపి నిస్వార్థంతో, త్రికరణ శుద్ధితో తన ఆత్మను పరమాత్మకు నివేదించడం ఆత్మ నివేదన భక్తి. ఈ మార్గాన ముక్తి పొందిన భక్తుడు బలిచక్రవర్తి.

**భావము పారవిడిచి బ్రహ్మాండమెల్ల నిండి**
**వేవేలుఁగోరికల వేడుక తోడ (1-465)**
**శ్రీ వేంకటేశ్వరునిఁజింతించి పరతత్వ**
**భావంబు నిజముగాఁబట్టిఁ జెలియాత్మ (5-17)**

అన్నమయ్య సంకీర్తనల్లో మధుర భక్తి, వాత్సల్య భక్తి కూడా కనిపిస్తాయి.

**మధురభక్తి:** వైష్ణవ సంప్రదాయంలో భక్తుడు భగవంతుని తన హృదయంలో ప్రతిష్ఠించుకొని, ఆ స్వామి తన ప్రియుడుగా తాను ప్రేయసిగా భావించుకొని అతని అనుగ్రహం కోసం చేసే ప్రయత్నాన్ని మధురభక్తి అంటారు. ఈ తత్వంలో విష్ణువొక్కడే పురుషుడు తక్కిన జగత్తు అంతా స్త్రీగానే భావిస్తారు.

అన్నమయ్య మధురభక్తి రీతిలో స్వామిని ఆరాధిస్తూ ఎన్నో శృంగార కీర్తనలను ఆలపించాడు. కొన్ని సంకీర్తనల్లో నాయికలు లక్ష్మీదేవి, పద్మావతి దేవి, గోపికలు కాగా మరి కొన్నింటిలో అన్నమయ్యే. ఉదాహరణకు

**కాటుక కన్నుల నిన్ను గదు నలయించి**
**బూటకముల చిటిపొటి సిగ్గుల (5-288)**

**శ్రీవేంకటేశ నీనా చేతలే వేరులుగాని**
**కేవలమిద్దరికి కాగిలి వొకటే** **(24-206)**

**వాత్సల్య భక్తి:** భక్తుడు భగవంతుని వత్సగ, తనను మాతృమూర్తిగా భావించుకొని ప్రేమ చూపుతూ అనుక్షణం ఆ స్వామి సేవలోనే కాలం గడపడం వాత్సల్య భక్తి. కౌసల్య దశరథులు శ్రీరామచంద్రమూర్తిని, దేవకీ వసుదేవులు, యశోదానందులు, గోపికలు శ్రీకృష్ణపరమాత్మను ఈ వాత్సల్య భక్తితో సేవించి తరించారు. అన్నమయ్య సంకీర్తనల్లో ఈ వాత్సల్య భక్తి ఇలా మనకు కనిపిస్తుంది.

**చిన్ని శిశువు - చిన్ని శిశువూ**
**ఎన్నడూ చూడమమ్మ ఇటువంటి శిశువూ** **(6-1)**

**పరమ పురుషుఁడు గోపాల బాలుఁడైనాఁడు**
**మురహరుడు ఎదుట ముద్దుగారీ నిదివో** **(12-17)**

అన్నమయ్య తన క్రింది కీర్తనలో ఇంకా అనేక భక్తి మార్గాల్ని వివరించాడు.

**నానా భక్తులివి నరుల మార్గముల**
**యేనెపాననైనా నాతఁడియ్యకొను భక్తి** **(2-469)**

హరికోసం వాదిస్తే అది ఉన్మాద భక్తియని, ఇతరులను సేవించకుంటే అది ప్రతివ్రతా భక్తియని, భగవంతుని ఆత్మలో దర్శించగల్గితే అది విజ్ఞాన భక్తియని, తన్మయత్వం చెందితే ఆనందభక్తియని, హింసాత్మకమైన సాహస పూజలు చేస్తే రాక్షస భక్తియని, భగవంతుని దాసులకు సేవచేయడం తురీయ భక్తియని, ఏదైనా పని సాధించడం కోసం చేసేది తామస భక్తియని, భగవంతుడే గతి అనుకొని జీవించడం వైరాగ్య భక్తియని, స్వతంత్రించి వుండడం రాజస భక్తియని, భగవంతుని శరణు వేడటం నిర్మల భక్తియని, భగవంతునికి పూజలు చేసి శుచిగా వుండడం నిజభక్తియని అన్నమయ్య తెలిపాడు.

కలియుగ దైవమైన శ్రీవేంకటేశ్వర స్వామి వారి ప్రియభక్తుడైన అన్నమయ్య కారణజన్ముడు. వారిచే విరచితమైన సంకీర్తన సంద్రంలో దాగివున్న నిధులు అనంతం. అందులోనుంచి వెలికితీసిన భక్తితత్వమనే ఈ దగదగాయమైన రత్నాలు మచ్చుకు కొన్ని మాత్రమే. పరిశోధించి పైకి తీయవలసినవి ఇంకా ఎన్నో ఎన్నెన్నో... అన్నమయ్య సంకీర్తనల్లో అణువణువున నిండివున్న భక్తి యొక్క తత్వము అనంతము, అద్వితీయము. అశేష మానవాళికి మార్గదర్శకం.

***

# అన్నమయ్య సంకీర్తనలు - చైతన్య స్వరాలు

**సి.యన్. క్షేత్రపాల్ రెడ్డి**
**పరిశోధక విద్యార్థి**
**శ్రీ వేంకటేశ్వర ప్రాచ్య పరిశోధనా సంస్థ**
**తిరుపతి**

సాహిత్యం అసలైన సామాజికతకు ప్రతిరూపం. అందుకే సమాజాన్ని అర్థం చేసుకోకపోతే ఎంతటి వారికైనా సాహిత్యాన్ని అర్థం చేసుకోవడం దుర్లభమవుతుంది. ఏనాటి సాహిత్యం అయినా అందులో ఆనాటి సమాజం, ఆనాటి సామాజిక స్థితి దర్శనమిస్తుంది. ఈ నేపథ్యం నుండి ప్రతి రచయిత, కవి సాహిత్యకారుడూ తను నిజజీవితంలో ఎదుర్కొన్న ప్రతి సంఘటననూ, అనుభవాన్నీ తద్వారా తాను పొందిన ప్రతీ మనోభావాన్ని తక్కిన సామాజికులతో పంచుకోవాలన్న తపన, అభినివేశం కల్గివుంటాడు. ఈ కోవలోకి చెందినవాడు తాళ్ళపాక అన్నమాచార్యుడు.

పద కవిత్వానికి స్పష్టమైన రూపురేఖల్ని, ప్రచారాన్ని కల్పించి తొలి తెలుగు "వాగ్గేయకారుడిగా", "పదకవితా పితామహుడు"గా పదకవితా త్రిమూర్తులలో మొదటివాడిగా తెలుగు సాహితీ వినీలాకాశంలో వెలుగొందుచున్నాడు. తెలుగు సాహిత్యాన్ని రాగం, గానం, సంగీతాలతో పరిపుష్ఠ చేసిన మహనీయుడు అన్నమయ్య.

కడప జిల్లా, రాజంపేట తాలూకా తాళ్ళపాక గ్రామంలో నారాయణమూర్తి, లక్కమాంబ దంపతులకు జన్మించిన అన్నమయ్య తిరుమల శ్రీనివాసుని కరుణా, కటాక్షాలతో తన జీవితకాలంలో 32 వేల సంకీర్తనల్ని రచించినట్లు చరిత్ర చెబుతోంది. అంటే అన్నమయ్య తన నిజ జీవితంలో ఎదురైన ప్రతి అనుభవాన్ని, సంకీర్తనగా మలిస్తే తప్ప అంతటి సాహితీ భాండాగారాన్ని సృజియించడం అసాధ్యం. తన చుట్టువున్న సమాజాన్ని తరచి చూసి అక్షర రూపం అందించాడేమో అనిపిస్తుంది. అందుకే అన్నమయ్య "ఆడిన మాటెల్ల అమృత కావ్యము - పాడిన పాటెల్ల పరమ గానము" అనటం అతిశయోక్తి కాదు.

**"సంతోషకరమైన సంకీర్తనం**
**సంతాప మణగించు సంకీర్తనం"**

ఇలా అన్నమయ్య సంకీర్తనల విశిష్ఠతల్ని ఎంత చెప్పినా తక్కువే అవుతుంది.

**"పావనములు హరిభక్తివి**
**భావనములు స్వరమంత్ర రహస్యో"**

అని కీర్తి గడించిన అన్నమయ్యను తిరుమల శ్రీనివాసుని వరప్రసాదంగా భక్తులు భావిస్తారు. తన 16వ ఏట శ్రీనివాసుని సాక్షాత్కారం పొంది మధురమైన భక్తి భావాలతో ఆధ్యాత్మిక తత్వాలతో, ప్రజల్ని దైహికమైన లంపటాల నుండి సన్మార్గంలో నడిపించటంలో అన్నమయ్య "పద కవిత్వం" సాఫల్యత పొందింది.

అన్నమయ్య సంకీర్తనలోల చాలామందికి భక్తి, ఆధ్యాత్మిక, వైరాగ్యం, శృంగారం అధికం అన్న భావన అధికం. అయితే అన్నమయ్య కూడా సంఘజీవి. సాంఘిక జీవితానికి అవసరమైన చైతన్య దీప్తుల్ని ఆయన సంకీర్తనల్లో మనం గమనించవచ్చు. సాంఘిక దృక్పథంతో సామాజిక ధర్మాల్ని, మానవీయ విలువల్ని, సాంఘిక చైతన్యాన్ని ప్రజలకు, భక్తులకు కలిగించడానికి కూడా సంకీర్తనా యజ్ఞాన్ని చేశాడు అన్నమయ్య. అయితే మనిషిలోని అజ్ఞానాన్ని తొలగించి, చెడు వాసనల్ని తొలగించి విజ్ఞానాన్ని పెంచి ధర్మాన్ని నిలబెట్టేది నిర్మలమైన భక్తి ఒక్కటే అన్నది అన్నమయ్య ప్రబోధం.

**సంఘ సంస్కరణ – చైతన్యం :**

అన్నమయ్య గొప్ప సంఘసంస్కర్త. కుల, మత, జాతి, వర్గ రహిత సమాజాన్ని కోరుకున్నాడు. అదే భావజాలాన్ని చైతన్యవంతంగా తన సంకీర్తనల్లో వినిపించాడు. "జాతి, మతము, కులము అన్నవి మాసిపోతాయి – జ్ఞానం ఒక్కటే వెలుగుతూ నిలుస్తుంది" అన్న గురజాడకు సుమారు 500 సం॥లకు ముందే ఇదే అంశాన్ని అనేక సంకీర్తనల్లో మనం గమనించవచ్చు.

**పల్లవి : విజాతులన్నియు వృథా వృథా**
**అజామిళాదులు కదియే జాతి ॥**

అంటూ సాగిన సంకీర్తన అసలైన సమాజిక చైతన్యానికి నిలువుటద్దంలా దర్శన మిస్తుంది. సమాజంలో జాతులన్నీ వృథా అని లౌకికము, వైదికము అనేవి అవశ్య కర్తవ్యాలనీ, సమాజానికి విజ్ఞానము ధర్మమూలాలే. సుజాతి అనే సందేశాన్ని మనం దర్శించవచ్చు.

ఆదిమ సమాజంలో కులం లేదు. తర్వాతి కాలంలో వృత్తుల ఆధారంగా కులాలు ఏర్పడ్డాయి. కాలక్రమంలో ఈ కులం ప్రజల మధ్య అడ్డుగోడగా మారింది. ఉన్నతకులాలు, నీచకులాలు అన్న భావనతో సమాజంలో అగాధం పెరిగిపోయింది. ఈ క్రమంలో అన్నమయ్య కుల బేధాల్ని నిరసించాడు. పేద, ధనిక అన్న తారతమ్యాల్ని ఆక్షేపించాడు. "బ్రహ్మ మొక్కటే పరబ్రహ్మ మొక్కటే" అంటూ సమాజాన్ని విచ్ఛిన్నం చేస్తున్న కులబేధాల్ని, పేద, ధనిక భావజాలాల్ని నిరసిస్తూ చైతన్య స్వరాల్ని అందించాడు. బ్రాహ్మణుడు, చండాలుడూ, రాజూ, బంటూ అంతా సృష్టిలో సమానమే అని ప్రబోధించాడు.

"ఏ కులజుడైన నేమి... ఎవ్వడైన నేమి"... అంటూ ఎక్కువ కులంలో పుట్టిన వాడైనా, హీనకులజుడైనా నిజం తెలిసినవాడు, ధర్మాధర్మ విచక్షణ, నిస్వార్థ బుద్ధి కల్గినవాడే సమాజ ప్రగతికి మూలమవుతాడని పేర్కొన్నాడు. అలాంటి వాడిని కులం కట్టుబాట్లు ఏమీ చేయలేవు అని తన విశాలమైన సామాజిక చైతన్య దృక్పథాన్ని, మానవతని ప్రకటించాడు. సమతావాదిగా పేరు పొందాడు.

అన్నమయ్య తన సంకీర్తనలోల విశ్వమానవ కల్యాణాన్నే ఆకాంక్షించాడు. అన్నమయ్య భక్తి చాందసవాదం కాదు. సామాజిక రుగ్మతల మీద విమర్శతో కూడినదిగా కనిపిస్తుంది. సమాజంలో లింగబేధం సరికాదని, స్త్రీ, పురుషులిద్దరూ సమానమేనని, బేదభావం తగదని సామాజిక దిక్సూచి అయ్యాడు.

**"పొలతులు జీవులే పురుషులు జీవులే**
**తలప భావ భేదములే కాని"**

అంటూ స్త్రీ, పురుష భేదాల్ని నిరసించాడు.

**సాంఘిక దృక్పథ స్వరాలు :**

సమాజం అనేక సమస్యలతో నిండివుంటుంది. అసమానమైన సామాజిక వ్యవస్థ సృష్టిస్తున్న రుగ్మతుల్లో వేశ్యాలోత్వం ఒకటి. రారికపు వ్యవస్థ ఈ వ్యవస్థను ప్రోత్సహించింది. ఆనాటి సమాజంలో ప్రధానమైన సమస్యగా వేశ్యాలోలత్వాని అన్నమయ్య గుర్తించాడు. ఆ సామాజిక రుగ్మతపట్ల చైతన్యం కల్గించడానికి రాసిన కీర్తనను పరిశీలిద్దాం.

**పల్లవి : లంజకాడ వౌదువురా**
**లంజకాడ వౌదువురా నీ లోగులెల్ల గానవచ్చె**
**ముంజేత బెట్టిన సొమ్ముల కద్దమేలరా ॥**

అంటూ వేశ్యాలోలున్ని, దానివల్ల కలిగే అనర్థాల్ని సంకీర్తనా రూపంలో వివరించాడు అన్నమయ్య. సమాజాన్ని పట్టి పీడించే బ్రహ్మరాక్షసి ఈ వేశ్యాలోలత్వం. మనుష్యుల్ని రాక్షసి అంతం చేసినట్లు ఈ వేశ్యావ్యవస్థ సమాజాన్ని ఛిద్రం చేస్తోంది. అలాంటి ఈ సమస్య పట్ల తనకున్న ఏహ్య భావనను అన్నమయ్య పై సంకీర్తనలో మనం గుర్తించవచ్చు.

విజ్ఞానం ద్వారా మానవుడికి వికాసాన్ని కల్గించడమే విద్య యొక్క ప్రధాన లక్ష్యం. ఈ అంశం పట్ల అన్నమయ్య ఆలోచనలు ఉన్నతమైనవి. సమాజంలో ధర్మాన్ని, మానవతని, విజ్ఞానాన్ని, సాంఘికంగా చైతన్యాన్ని కలిగించడానికి విద్యనే ప్రధాన సాధనంగా అన్నమయ్య గుర్తించగలిగాడు. మనిషిలో వున్న అనేక విపరీత బుద్ధుల్ని, చంచలత్వాల్ని నిరసించాడు. జడత్వం వున్న వాడికి చదువు నిరర్థకం అన్న భావనను గురించి పలికిన సంకీర్తనాన్ని గమనిద్దాం.

పల్లవి : తనకేడ చదువులు తనకేడ శాస్త్రాలు
మనసు చంచల బుద్ధి మానీనా ॥తనకేడ॥

అంటూ చదువు యొక్క ఔన్నత్యాన్ని, చదువుకున్న వారికి ఉండాల్సిన మౌలికమైన లక్షణాల్ని ఎంతో హృద్యంగా రచించారు. ఇలా సామాజికంగా చైతన్యాన్ని నింపుతూ అనేక సంకీర్తనల్ని అన్నమయ్య విరివిగా వెలువరించారు.

**ముగింపు :**

అన్నమయ్య జానపద కవి. ప్రకృతి ఆరాధకుడు. కాబట్టే అన్నమయ్య స్వరాలు వ్యవహారిక పదజాలంతో పండితులకైనా, పామురులకైనా ఆహ్లాదాన్నందిస్తాయి. తెలుగు నుడికారం, స్వచ్ఛమైన భావ సంపద, సూటిదనం అతని సంకీర్తనల్లో ప్రత్యేక ఆకర్షణ. తనకు పరిచయమైన గ్రామీణ వాతావరణాన్నే, ప్రజల ఆచార వ్యవహారాల్ని, సామాజిక లోటుపాట్లని చక్కగా ఎప్పటికప్పుడు వివరిస్తూ ప్రజల్లో సాంఘిక చైతన్యాన్ని నింపడంలో అన్నమయ్య కృతులు సఫలీకృతాలు.

***

# అన్నమయ్య కవిత్వాంశములు-ఒక పరిశీలన

**ఆచార్య భమిడిపాటి విశ్వనాథ్**
**తెలుగు శాఖాధిపతి**
**బనారస్ హిందు విశ్వవిద్యాలయం, వారణాసి**

తెలుగులో మొట్టమొదటిసారిగా సంకీర్తనల రచనకు శ్రీకారం చుట్టి మొత్తం 32,000 సంకీర్తనలు రచించిన తొలి తెలుగు కీర్తనాచార్యుడు తాళ్ళపాక అన్నమాచార్యులు. వీరి కీర్తనలు నేటికీ తెలుగు వారి నోళ్ళలో నానుతున్నాయంటే అతిశయోక్తి కాదు. అంతటి వ్యాప్తి చెందిన, ప్రసిద్ధి చెందిన అన్నమయ్య సంకీర్తనలు పరిశోధనకు చాలా ఉపయోగపడతాయి. అన్నమయ్య తన సంకీర్తనలను అధికంగా భక్తి, వైరాగ్య, శృంగార, ఆధ్యాత్మిక మార్గాన నడిపించి ఆంధ్రమున "పద కవితా పితామహునిగా", "సంకీర్తనాచార్యులుగా తన హరి కీర్తనతో ప్రసిద్ధి కెక్కారు అన్నమాచార్యులు.

తాళ్ళపాక కవులలో ప్రథముడు, తాళ్ళపాక కవుల వంశకర్త అయిన అన్నమాచార్యుని జీవిత చరిత్రను అతని మనుమడు చిన్నన్న ద్విపదలో సమగ్రగా రచించాడు. కాబట్టి చిన్నన్న రచించిన గ్రంథాన్ని ప్రమాణికంగా విమర్శకులు స్వీకరించారు. అన్నమాచార్యుల కాలాన్ని గురించి భిన్నాభిప్రాయాలు ఉన్నప్పటికి ఎక్కువ మంది విమర్శకులు వీరి కాలాన్ని '1424-1503'గా నిర్ధారించారు.

**అన్నమాచార్యుల సంకీర్తనలలోని ప్రముఖ కవితాంశములు-విశిష్టత:**

అన్నమయ్య తనదైన విశిష్టశైలితో సంకీర్తనల ద్వారా ఆంధ్ర ప్రజానీకాన్ని భక్తి పారవశ్యంలో తేలియాండించారు. ఇప్పటికీ ఆయా సంకీర్తనలను గానం చేస్తూ ఆంధ్రదేశం అంతటా ప్రాచుర్యం పొందారు అనేక సంగీత విద్వాంసులు. అంతటి ప్రసిద్ధి పొందిన అన్నమయ్య సంకీర్తనలలో ఎన్నో అద్భుతాంశాలు, కవితాంశాలు దాగివున్నాయి. అందులే భక్తి, ఆధ్యాత్మిక, సామాజిక, జానపద, శృంగార, నీతి, జ్ఞాన, వైరాగ్య ప్రధానమైనవి ఎన్నో ఉన్నాయి. వీరి కీర్తనలలో అధికశాతం పదసాహిత్యం కనిపిస్తుంది. అందువలననే అన్నమయ్య "పదకవితా పితామహుడు" అనే సార్థక బిరుదు లభించింది.

**పదం - పదకవిత :**

పదం అంటే పాట అని సామాన్యార్థం వాడుకలో ఉంది. ఇది జానపద సాహిత్యంలో స్పష్టంగా తెలుస్తుంది. పదం పాడమన్నది జన వ్యవహారం. ఇది రాగ తాళ సహితమై లేదా కేవలం స్వర సహితమై ఉంటుంది. దీనిని గూర్చి భరతుడు -

> **"గాంధర్యం" యన్మనా ప్రోక్తం స్వరతాళ పదాత్మకమ్**
> **పదం తస్యభవేద్వస్తు స్వరతాళ సుభావకమే"**

అని నిర్వచించాడు. మన సాహిత్యంలో కూడా మార్గదేశీ అని రెండు రకాలున్నాయి. వీటికే పద్యకవితా పదకవితా అనే పర్యాయ పదాలు ఉన్నాయి.

మానవుడు సుఖదుఃఖాల అనుభూతులను పొందినపుడు దానికనుగుణంగా ఆడి పాడుట చేత పదకవిత పుట్టింది. అదే కాలనుగునంగా సంస్కరింపబడి పద్యకవితగా, పండితకావ్యంగా ఆమోదం పొందింది. నియమ రహితంగా ఉంటూ కేవలం జనరంజకమై శాస్త్ర సమ్మతం కాకుండా జన వ్యవహారంలో మిగిలి పోయింది ఈ పదకవిత. పదకవిత పండితామోదం పొందక పోయినా దాని దారిన అది సాగుతూ వస్తున్నది అని చెప్పడానికి అన్నమాచార్యుల సంకీర్తనలే ప్రముఖ తార్కాణాలు.

అన్నమాచార్యుల కవిత్వంలోని వివిధ అంశములైన వస్తువు, వర్ణనలు, అలంకారాలు జానపద రీతులు సామాజిక అంశాలు, జ్ఞాన, వైరాగ్య సంకీర్తనలు మొదలైన అంశాలను సంక్షిప్తంగా విశ్లేషించే ప్రయత్నం ఈ వ్యాస ప్రధాన ఉద్దేశం.

**వస్తువు :**

అన్నమాచార్యుల సంకీర్తనలను పరిశీలిస్తే మనకు ముఖ్యంగా ఆవగత మయ్యేది అతని భక్తి. స్వామి వారినే ప్రధాన వస్తువుగా చేసుకొని గోపిక కృష్ణుల లీలా వినోదాలను శృంగారాది వర్ణనలతో, భక్తితత్వ జ్ఞాన, వైరాగ్యాది అంశాలతో మేళవించి అద్భుతమైన సంకీర్తనలను అన్నమయ్య రచించాడు. కాల పరిణామంలో సామాజికాంశలు నీతి పరమైన అంశాలను వస్తువుతో జోడించాడు. ఏ అంశాలు తీసుకున్నా ఎక్కడా

స్వామివారిని ప్రస్తావించక మానదు. వస్తువు ఏదైన సరే శ్రీ వేంకటేశ్వరస్వామి వారితో సమన్వయాన్ని అద్భుతంగా మనోహరంగా చిత్రించాడు అన్నమయ్య.

**వర్ణనలు :**

> **"అపారేకావ్య సంసారే కవిరేవ ప్రజాపతిః**
> **యధాస్మై రోచతే విశ్వమే తదేదమ్ పరివర్తతే"**

అనే అంశం కవి యొక్క స్వతంత్రతను చాటి చెపుతుంది.

**శృంగార వర్ణన :**

అన్నమయ్య శ్రీ వేంకటేశ్వరుని పరమతత్వంగా, కులదైవంగా, శృంగార భక్తి భావనలో నాయకునిగా భావించినట్లే అరమరులు కాని నెచ్చెలికానిగా కూడా భావించి ఈ శృంగార వర్ణనలు సాగించి నట్లుంది. విషయం శృంగారం కాబట్టి సాంప్రదాయక సఖి, సపత్ని, ముగ్ధ, మధ్యాది నానా విభేదములతో ఇతర కవులు స్పృశించని మార్గంలో రచన చేశారు. కాని ఎక్కడా శ్రీ వేంకటేశ్వరస్వామి వారి భావన విడువలేదు. ఈ సంకీర్తనలలో వాత్సల్య అధ్యాత్మ భావనలు చాలా కీర్తనలలో చోటు చేసుకున్నాయి.

> **"భవరోగ - వైద్యుదవు పాటించ నిహొకడవె**
> **నవనీత చోర నీకు నమో నమో"**

ఇలా అనేక ఉదాహరణలు గమనించ వచ్చు. శంగారమునకు -

> **"ఏమొకొ చిగురు టధరమున ఎడనెడ కస్తూరి నిండెను**
> **భామిని విభునకు వ్రాసిన పత్రిక కాదు గదా"** అను కీర్తన ఉదాహరణ.

**భక్తితత్వం :**

అన్నమాచార్యుల సంకీర్తనలలో ప్రధానంగా కనిపించేది భక్తితత్వం. కలియుగ దైవం విష్ణుమూర్తి స్వరూపుడైన శ్రీ వేంకటేశ్వరస్వామిని సేవించి తరించిన గొప్ప భక్తిపరుడు అన్నమయ్య. అందుకే తన కీర్తనలలో ఎక్కువ భక్తిభావమే కానవస్తుంది. తన సంకీర్తనలతో ప్రజానీకాన్ని భక్తి మార్గములతో నడిపించి ప్రజల మనో నేత్రాలను తెరపించిన గొప్ప భక్తిపరుడు, భాగవతోత్తముడు అన్నమాచార్యులు.

> **"శ్రవణం కీర్తనం విష్ణోఃస్మరణం పాదసేవనం**
> **అర్చనం వందనం దాస్యం సఖ్యమాత్మనివేదనమ్"**

అని "శ్రీ మద్భాగవతం"లో వ్యాసుల వారు చెప్పిన నవ విధ భక్తి మార్గాలు అన్నమయ్య సంకీర్తనలలో పరిపూర్ణమై, నిక్షిప్తమై ఉన్నవి. అవి -

**1. శ్రవణం :** భగవంతునికి సంబంధించిన పురాణాలు, హరికథలు, ఉపన్యాసాలు, చరిత్రలు మొదలైన వాటిని శ్రద్ధగా వింటే అవి శ్రవణా భక్తి రాశి అందురు. అలా వాటిని వినడం ద్వారా భగవంతునిపై అపారమైన భక్తి, ప్రేమ, జ్ఞానం

కలుగుతాయి. పరీక్షితుడు, జనమేజయుడు వంటివారు శ్రవణ భక్తికి ఉదాహరణ. అలాగే అన్నమయ్య శ్రవణ భక్తి గూర్చి ప్రజలకు చాటి చెప్పారు.

**"వినరో భాగ్యము విష్ణుకథ**
**వెను బలమిదిగో విష్ణుకథ...."** అనునది ఉదాహరణ.

**"షోడశ కళానిధికి షోడశోపచారములు**
**జాడతోడ నిచ్చటను సమర్పయామి..."**

అని అంటూ తన కీర్తనలతో శ్రీ మహావిష్ణువు పదహారు కళలకు నిలయుడు, అలాంటి షోడశ కళానిధికి అన్నమయ్య శాస్త్రోక్తమైన షోడశోపచారాల్ని సమర్పించాడు. ఈ కీర్తనలతో స్వామి వారిని షోడశ కళానిధిఅని అభివర్ణిస్తూ - షోడశోపచారాలైన ఆవాహనం, అసగపాద్యం, అర్ఘ్యం, ఆచమునియం, అభిషేకం, వస్త్రం యజ్ఞోపవీతం, గంధం, పుష్పం, ధూపం, దీపం, దైత్న తాంబూలం, ప్రదక్షిణం, నమస్కారం వంటి వాటి ద్వారా భగవంతునికి అర్చన చేయాలని అన్నమయ్య భావన.

భక్తితో భగవంతునికి ఏది సమర్పించిన ఆనందంగా స్వీకరించి అనుగ్రహిస్తాడు భగవంతుడు. కాని స్వామిని నిత్యం అర్చించడానికి తగిన పరిస్థితులు పూజా ద్రవ్యాలు ఏవీ కానప్పుడు నేర్పుతో శరీరంలోని ఒక్కో భాగం ఒక్కో వస్తువుగా భావించి తనలో అంతర్లీనంగా వున్న స్వామిని అర్చించవచ్చు.

**"నిత్య పూజలివిగో తరిచిన నా హూ**
**ప్రత్యక్ష మైనట్టి పరమాత్మునికి"**

తనువే గుడియట... అంటూ శరీరమే గుడి (గుడిగా) శిరస్సే శిఖరంగా, నిండు హృదయం పీఠంగా, భావాలే దీపాలు మాటే మంత్రంగా, నాలుకే ధ్వనిచే విడిగంటగా ఆపేక్షకల్గిన జీవుడే దాసుడుగా, భగవంతుడిని అర్చించవచ్చు. ఇలా భగవంతుడిని అర్చించిన యెడల విష్ణుమూర్తిని పుష్పాలతో చేసే ఆరాధనతో సమానమైన నిత్యానందం కలిగిస్తుంది అని అన్నమాచార్యులు తన సంకీర్తనల ద్వారా వర్ణించిన విధానం అర్చనా భక్తికి నిదర్శనం. అందులో -

**"అచ్యుత మిమ్ముఁదలచేయూతే పనివలెనా**
**యిచ్చట మీవారే మాకు నిహపరమియ్యంగా"**

అను కీర్తన ఒకటి ఇందులో దైవాన్ని చనువుగా స్నేహరీతిలో పేరు పెట్టి పిలిచి ప్రత్యక్షంగా మాట్లాడటం గోచరిస్తుంది. అచ్యుత! అని ప్రీతిగా పలికి మీవారే మాకు ఇహపరాలిస్తుండగా మిమ్మును తలచే పని కూడా అక్కరలేదంటూ స్వామి వారిపై తనకు ఉన్నటువంటి సఖ్యతను ప్రదర్శిస్తారు.

**ఆత్మనివేదనం** : నవ విధ భక్తి మార్గాలలో చివరిది ఆత్మ నివేదనం. తనలోని అహంకారాన్ని స్వార్థాన్ని చంపుకొని భగవంతుని మహిమలను లీలలను తెలుసుకుని

ఆయన అనంత తత్వాన్ని నమ్మి నిస్వార్థం త్రికరణ శుద్ధితో తన ఆత్మను పరమాత్మను నివేదించడాన్ని ఆత్మనివేదనం అవుతుంది.

అన్నమాచార్యుల సంకీర్తనలను పరిశీలిస్తే ఎన్నో సంకీర్తనలు ఆత్మ నివేదనమునకు నిదర్శనముగా నిలుస్తాయి. అందులో -

**"సదానందము సర్వేశ్వరా నీ**
**పదార విందము పై భక్తి"**

అను కీర్తనములో "భగవంతుని పూర్తిగా ఆత్మనివేదనం చేసుకొని అతని పాదపద్మాలపై భక్తి కలిగిన అన్నమాచార్యులకు శ్రీ వేంకటేశ్వరుడే సర్వస్వం ఆయనే భగవంతునిగా కొలిచినారు. ఆ స్వామి తనకు చెప్పిన ఎన్నెని విధాలు భాసిల్లుతున్నాడొ ఈ క్రింది సంకీర్తన ద్వారా మన కవగతమవుతుంది.

**"పొడగంటి మయ్యా విమ్ము పురుషోత్తమా, మమ్ము**
**నెడవకు వయ్యా కోనేటి రాయడా"**

**అన్నమయ్య సంకీర్తనల సామాజిక అంశాలు :**

ఏ దేశ జాతీయ సమైక్యతకైన ఏ ఉద్యమానికైన కవిత్వమే ఒక ఆయుధం దేశంలో సంస్కృతంలో తప్ప దేశభాషల్లో కవిత్వం వ్రాస్తే చెల్లుబాటు కాని రోజుల్లోనే 11వ శతాబ్దంలో తెలుగున "భారత రచనతో వెలుగు కవిత్వోద్యమం" మొదలైంది. 15వ శతాబ్దంలో అన్నమయ్య ఈ వెలుగును పటిష్టం చేశాడు.

**"నిండార రాజు నిద్రించు నిద్రయు నొక్కటే...**
**... మెండైన బ్రాహ్మణుడు మట్టిభూమి యొకటే**
**చండాలుండేటి సరిభూమి యొకటే"**

ఈ ఒక పాట చాలు అన్నమయ్యను కొలవడానికి, భానిసత్వంపై తిరుగుబాటు, కులమతాల పట్ల నిరసన, ధార్మిక ప్రబోధం ముప్పేటగా అల్లి సర్వమత సమానత్వాన్ని ప్రభవించాడు అన్నమయ్య. భగవంతుని దృష్టిలో అందరూ సమానమేనని హెచ్చుతగ్గులు లేవని విశాల దృక్పధాన్ని ప్రకటించాడు. ఏ కులజుడే ఎవ్వడైనేమి ఆకడనాతడే హరి నెరిగిన వాడు ఎక్కువ కులజుడైన హీనకులజుడైన నిక్కమెరిగిన మహానిత్యుడే ఘనుడు.

ఆనాటి ప్రాచీన సాహిత్యంలో ఇటువంటి సంఘ సంస్కర్త కనిపించడు. జాతి, మత, కుల, ప్రస్తావన చేసి వాటిని నిరసించి ప్రాణులందరూ సమానమేనని మానవత్వాన్ని, జాతీయతా భావాన్ని ప్రకటించాడు. భారమైన వేపమానును పాలు పోసి పెంచినను / తీరని చేదే గాక తియ్యనుండేనా / పాయదీసికున్న తోక బద్దలు నెట్టి బిగివి / బాయకెంత గట్టినాను చక్కనుండెన సమాజంలో ప్రజలకు చైతన్యం కలిగించడానికి మానవతను నెలకొల్పడానికి ఇటువంటి కీర్తనలు ఉపయోగ పడతాయి.

**భాష** : అన్నమయ్య పద కవిత్వంలో కనపడే భాష గ్రాంథిక వ్యావహారిక పదాలతో సమ్మిళితమై కన్పిస్తుంది. నాటి వ్యావహారిక భాషలోని పదములెన్నో అన్నమయ్య పదకవిత్వంలో విరివిగా ప్రయోగింపబడి ఖ్యాతికెక్కాయి.

**శైలి** : అన్నమయ్య, పదకవిత్వంలోని శైలి ప్రబంధశైలిగా సాగిపోయింది. పదములు సమాస ఘటన వర్ణనలు ఇవన్నీ ప్రబంధ ధోరణిలోనే సాగాయి.

**అలంకారాలు :**

**శబ్దాలంకారాలు** : అంత్య, ప్రాసలతో కూడిన సంకీర్తనలను అన్నమయ్య రచించాడు. ఇవి సంగీతానికి అనువుగా ఉండి గానయోగ్యంగా మలచ బడినాయి. ఈ విధంగానే అర్థాలంకారాలు వీరి కీర్తనలలో చోటుచేసుకున్నాయి.

**ఆధ్యాత్మిక, నీతి, వైరాగ్య, సంకీర్తనలు :**

గురుభక్తి పరస్పరంగా భగవద్భక్తిని జ్ఞానమనే యజ్ఞంతో పోల్చి వైరాగ్య భావ పూరితంగా అత్యంత మనోహరంగా అలంకార శైలితో రంగరించి తన సంకీర్తనలను అన్నమాచార్యులు తీర్చిదిద్దారు.

**"జ్ఞాన యజ్ఞ మీగతి మోక్షసాధనము**
**నానార్థములు నిన్నేనదపె మా గురుదు"**

అనునది చక్కటి ఉదాహరణ.

పరులను కొలుచుట కంటె ఇతరులను యాచించుటకంటే హైన్యము, దైన్యము లేదంటాడు అన్నమాచార్యులు.

ఇటువంటివే వీరి వైరాగ్య సంకీర్తనలు నీతి సంకీర్తనలు కొన్ని ఉన్నాయి.

**జానపద రీతులు :**

ఇవి అన్నమయ్య కాలం నాటికి ఉన్నాయి. చిన్నపిల్లలకు అన్నం తినిపించే సందర్భంలో పదములు, ఉయ్యాల పాటలు, సంక్రాంతి పండుగ రోజున యువతులు ముగ్గులు తీర్చి గొబ్బిళ్ళు పెట్టి ఆడిపాడిన పదములు అన్నమయ్య సంకీర్తనల్లో కనిపిస్తాయి. జానపద రీతుల్లో జానపద పదములు రచన చేసి ఆ పదములలో కూడా శ్రీ వేంకటేశ్వర స్వామిపై సమన్వయం చేకూర్చినాడు అన్నమయ్య.

**"చందమామ రావో జాబిల్లి రావో**
**కుందనపు పైడి కోర వెన్నపాలు తేవో"**

అన్న సంకీర్తన అన్నమయ్యదే అంటే ఆశ్చర్యం కలగకమానదు.

**ముగింపు** : తెలుగు సాహితీ లోకంలో రాజులు ఆదరించనటువంటి జన వ్యవహారమైన పద సాహిత్యానికి ప్రాణం పోసినటువంటి వారిలో అన్నమాచార్యులు ప్రథములు. తన సంకీర్తనల ద్వారా పదకవిత్వాన్ని ఆంధ్ర జాతికి పరిచయం చేసి పదకవితా

పితామహునిగా ఖ్యాతి గడించాడు. అన్నమయ్య తన కీర్తనల్లో అధిక భాగం శ్రీ వేంకటేశ్వర స్వామి వారిని కీర్తిస్తూ హరి కీర్తనాచార్యులుగా, అంతియే గాక సామాజిక పరమైన అనేక సమస్యలను ఎత్తిచూపుతూ జనులను చైతన్య పరిచిన గొప్ప సాహితీ చైతన్యమూర్తి అన్నమయ్య.

శ్రీ రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ గారు అన్నమాచార్య రచనను మించినది ఆంధ్ర వాఙ్మయం మరియొకటి లేదనియు, నగుబాటు పాలైన ద్విపద పద కవితలను ఆదరించి ఉన్నతస్థాయిని కలిగించిన ప్రతిష్ఠ అన్నమాచార్యునిదే అని ప్రశంసించారు.

అన్నమయ్య ఖ్యాతిని మనం ఆంధ్ర దేశానికే పరిమితం కాకుండా యావద్భారత దేశంలో మరియు ఖండఖండాంతరాలకు వ్యాపింప జేయవలసిన బాధ్యత మనందరిది.

***

# అన్నమయ్య సంకీర్తనలు పలుకుబళ్ళు-సామెతలు

**డా॥ కె. వెంకటరమణ**
**అసిస్టెంట్ ప్రొఫెసర్**
**యు.జి.సి. అకడమిక్ స్టాఫ్ కాలేజ్**
**శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం, తిరుపతి**

భాష సజీవమైంది. ప్రతి భాషలోను పదజాలం నిరంతరం చేరుతూనే ఉంటుంది. ఏ భాషా సౌందర్యమైనా ఆ భాషలోని పలుకుబళ్లపై ఆధారపడి ఉంటుంది. భాషకు పరిపుష్టిని అందచందాలను అందించేవి ఆ భాషలో గర్భితమైన జాతీయాలని చెప్పవచ్చు.

ఎందరో కవులు తమ తమ రచనల్లో ఆయా ప్రాంతాల్లో ప్రస్ఫుటంగా వినిపించే జాతీయాలను (పలుకుబళ్ళు) చాలావరకు భద్రపరుస్తూనే వచ్చారు. అన్నమయ్య, సారంగపాణి వంటి కవుల సాహిత్యంలో మౌఖిక రూపమైన జానపద సాహిత్యంలో అనేక జాతీయాలు నిక్షిప్తమై ఉన్నాయి.

భాషకు చేవను, పరిపుష్టిని ప్రత్యేకతను విశిష్టతను చేకూర్చేవి జాతీయాలు. జాతీయాలు ఒక్కో భాషా లక్షణాన్ని బట్టి, ఆ భాష మాట్లాడుకునే వాళ్ళ ఆలోచనా దృక్పథాన్ని బట్టి, వ్యవహారాలను బట్టి ఏర్పడుతాయి.

అన్నమయ్య సంకీర్తనల్లోని జాతీయాలను పరిశీలిస్తే ఆనాటి సాంఘిక, సామాజిక, సాంస్కృతిక అంశాలెన్నో స్పష్టంగా మనకు కనిపిస్తాయి. కుటుంబ జీవనానికి సంబంధించి ముఖ్యంగా సంసారం, ఆలుమగలు, సవతిపోరు చుట్టాలకు సంబంధించిన జాతీయాలు అన్నమయ్య సంకీర్తనల్లో విశదీకరించబడ్డాయి.

**సంసారం** : "ఇల్లులేని ముంగిలి"
"ఎండనీడ బతుకు"

ఇల్లులేని ముంగిలి ఉండదనీ, సంసారంలో సుఖదుఃఖాలు సర్వసాధారణమనీ ఎండ, నీడ లాంటిది జీవులబ్రతుకు అని పై జాతీయాలు తెలియజేస్తున్నాయి.

**ఆలుమగలు** : "ఈడు జోడు", "మగడు లేని సింగారములు"

భార్యాభర్తలిద్దరూ ఈడుజోడుగా ఉండాలని, భర్త లేనప్పుడు భార్య అలంకరణ వృథా అని పై జాతీయాలు తెలియజేస్తున్నాయి.

**"సవతి పోరు"** : నిరంతరాయంగా ఉండే పోరును "సవతి పోరు" అనే జాతీయం సూచిస్తుంది.

**చుట్టాలు** : "కంచం పొత్తు", "కొండవంటి చుట్టాలు"

చుట్టాలు యింటికి వచ్చినప్పుడు ఇంటివాళ్ళు తాము తినే కంచాలు, పడుకునే మంచాలు చుట్టాలకిస్తారని "కంచం పొత్తు" అనే జాతీయం తెలియచేస్తుంది. చుట్టాలు వచ్చినపుడు ఎంతో ఆప్యాయతతో నెత్తిమీద పెట్టుకొని చూసుకుంటారని "కొండవంటి చుట్టాలు" అనే జాతీయం వెల్లడిస్తుంది.

**కులం** : "కోమటి మేనరికం", "గొల్లలెక్కలాడేవు"

పై జాతీయాల వల్ల కోమట్ల నైజం, గొల్లవారి అమాయకత్వం తెలుస్తాయి.

**వ్యవసాయం** : "తెరవు పెసర", "నడివీధి పెసర"

నలుగురు నడిచే దారిలో పెసర పంట వేస్తే, అది సొంతదారునికి దక్కదని పై జాతీయాల వల్ల తెలుస్తుంది.

**పడుపు వృత్తి** : "చీకటి తప్పు", "అంగడి వలపులు"

పడుపు వృత్తి చేపట్టిన వారికి నిజమైన ప్రేమ ఉండదనీ, సమాజ కట్టుబాట్లకు వ్యతిరేకంగా స్త్రీ పురుషులు తప్పు చేస్తే దాన్ని పై జాతీయాలను ఉపయోగిస్తారు.

**వ్యాపారం** : "అంగడి బెట్టు", "సంత మాటలు"

గుట్టుగా ఉన్న విషయాన్ని బహిరంగ పరచదాన్ని "అంగడి బెట్టు" అనే జాతీయం ద్వారా తెలియజేస్తారు. ఒక క్రమం లేకుండా అడ్డదిడ్డంగా మాట్లాడే మాటలను "సంత మాటలు" అనే జాతీయంలో చెప్తారు.

**ఆహారపు అలవాట్లు** : "కంచము కాలదన్ను", "కంచము కూడు"

ఆదరంతో పెట్టినదాన్ని తిరస్కరించినపుడు "కంచము కాలదన్ను" అనే జాతీయాన్ని వాడతారు. అందుబాటులో ఉన్నది అని చెప్పడానికి "కంచము కూడు" అనే జాతీయం ద్వారా చెప్తారు.

**పరిపాలన** : "పట్టము గట్టు", "పెట్టని కోట"

ఏదైనా ఒక విషయాన్ని స్థిరీకరించి ప్రకటించడాన్ని "పట్టం గట్టు" అనే జాతీయం తెలియచేస్తుంది. ఒక వ్యక్తికి అండదండగా వుండి వేరొకరు రక్షించడాన్ని "పెట్టనికోట" అనే జాతీయంలో తెలియజేస్తారు.

**నాణెలు :** "కాసుకును కొరగాని", కాసు=రాగినాణెము

దేనికీ పనికి రాని వాటిని గురించి చెప్పేటప్పుడు "కాసుకును కొరగాని" అనే జాతీయాన్ని వాడుతారు.

**విద్య :** "చిలుక పలుకులు", "చిత్రగుప్తుని లెక్కలు", "నీటిపై వ్రాత"

ఒకరు చెప్పిన దాన్నే తిరిగి పలకడం "చిలుక పలుకులు" అనే జాతీయం తెలియచేస్తోంది. ఒక పట్టాన తేలని లెక్కలను "చిత్రగుప్తుని లెక్కలు" అనే జాతీయం ద్వారా వెల్లడిస్తారు.

***

సామెత జాతి యొక్క సూక్తి. దేశ చరిత్రకూ, జాతి సంస్కృతికీ మానవ నిజస్వరూపానికి అద్దం పడుతుంది సామెత. ఒక బాష మాట్లాడే వారి సాంఘిక మర్యాదను, సాంస్కృతిక జీవితాల్ని గూర్చి తెలియజేస్తుంది సామెత. సాంఘిక జీవితం మారినా సామెత మారదు. తరతరాలుగా మనకు అందించబడిన ప్రాచీన విజ్ఞానం సామెత. సాంఘిక జీవితంలోని అనేక సంఘటనలు సామెతలకు వస్తువులయ్యాయి.

అన్నమయ్య సంకీర్తనల్లోని సామెతల్ని మనం పరిశీలిస్తే అన్నమయ్య తనకున్న లోకానుభవాన్ని ప్రజాబాహుళ్యంలో సామెతలు రూపంలో ప్రయోగించాడు. ఈ సామెతల్లో ఆనాటి ప్రజల జీవనవిధానం, ఆచారవ్యవహారాలు, సంస్కృతీ సాంప్రదాయాలు కళ్ళకు కట్టినట్లుగా కనిపిస్తాయి. ఇలాంటి సామెతలు అన్నమయ్య సంకీర్తనల్లో కోకొల్లలు.

**కుటుంబం :** "తల్లికి లేని ముద్దు దాదికి కలదా!"

కన్నతల్లి మురిపాలు దాదికి ఉండవనీ, తల్లి కన్నబిడ్డను కసురుకున్నా మళ్ళీ మళ్ళీ తల్లి దగ్గరకే వస్తుందని పై సామెత వల్ల తెలుస్తుంది.

**వ్యవసాయం :** "వరిచెడ ఊదర బలిసినట్లు"

'ఊదర' వరిలో పెరిగే కలుపుమొక్క. ఇది పైరుకు వేసిన ఎరువునంతా స్వాహా చేస్తుంది. దీన్ని తొలగిస్తేనే వరిపైరు బాగా ఎదుగుతుంది.

**కుమ్మరం :** కుమ్మర వృత్తికి చెందిన సామెతలు.

"కుమ్మరావమున చెంబుకోరి వెదకనేల"

"కుమ్మరివాడు లేకే కుండతా పుట్టునా"

కుమ్మారావంలో ఎంత వెదికినా కుండలే వుంటాయి కానీ చెంబు దొరకదనీ. కుమ్మరివాడు లేకుంటే కుండ తయారు కాదనే విషయం పై సామెతల వల్ల తెలుస్తుంది.

**ఆహారపు అలవాట్లు :** "కోటి విద్యలు కూటి కొరకే"

"పాసిన కూటికంటే పస్తైనా మేలు".

మానవుడు ఎన్ని విద్యలు నేర్చినా పట్టెడన్నం కోసమే అనీ, పాసిపోయిన అన్నాన్ని తినేకంటే పస్తుండటమే మేలు అని పై సామెతల వల్ల తెలుస్తుంది.

**పరిపాలన :** "రాజు వలసినది దేవులు"

"రాజు వద్దనున్న బంటు రాజే తానౌనా"

రాజు అధికారాన్నీ, నిరంకుశత్వాన్ని పై సామెత తెలియచేస్తుంది. రాజువద్ద ఉన్న సేవకుడు తానే రాజు కాదనే విషయం పై సామెత చెప్తుంది.

**మతం :** "గుడి కొంచెమయినా గుడిలో దేవుని మహిమ ఘనము"

"దిక్కులేని వారికెల్ల దేవుడే దిక్కు"

**ఆచార వ్యవహారం :** "మగడు లేని మనువు కలుగునా"

"శిరసుండ మోకాల సేసవెట్టు"

పెళ్ళికొడుకు లేనిదే పెళ్ళి జరగదనీ, తలమీద పెట్టాల్సిన సేస మోకాలికి పెట్టడం మూర్ఖత్వమనీ పై సామెతలు తెలియచేస్తాయి.

**నమ్మకాలు :** "పుట్టుటము నిజము, పోవుటము నిజము"

"నట్టినడిమి పని నాటకము"

పుట్టిన ప్రతీ ప్రాణి గిట్టక తప్పదని, జీవితమే ఒక నాటకం అని పై సామెతలు తెలియజేస్తాయి.

**రోగాలు - వైద్యం :** "గోరుచుట్టుపై రోకటి పోటు"

"రోగికి పత్యం, చవిగానట్టు"

కష్టాలు ఒకదాని వెంట ఒకటి వస్తుంటే "గోరుచుట్టుపై రోకటి పోటు" అనే సామెత. ద్వారా చెప్తారు. రోగికి పత్యం రుచింపదు అనే విషయం పై సామెత తెలియచేస్తున్నది.

**ముగింపు :**

అన్నమయ్య సంకీర్తనల్లోని పలుకుబళ్ళు, సామెతలను నిశితంగా పరిశీలిస్తే అన్నమయ్య తన సంకీర్తనలను సునిశిత బుద్ధితో రచించినట్లు తెలుస్తుంది. లోక వ్యవహారంలో నలిగిన పలుకులను వాడుకోవాలనీ అవి అపభ్రంశాలని తోసిపుచ్చుట తగదని అన్నమయ్య సంకీర్తనల్లోని పదాల ద్వారా తెలుస్తుంది. సాహిత్యం ప్రజా జీవితాన్ని ప్రతిబింబిస్తుందనే విషయం జగమెరిగిన సత్యం. అన్నమయ్య తన సంకీర్తనల్లో పలుకుబళ్ళు, సామెతలు ఎక్కువగా ప్రయోగించాడు అని అనడం కంటే అవే వచ్చి అన్నమయ్య సంకీర్తనల్లో చేరాయి అనడంలో అతిశయోక్తి లేదు.

***

# అన్నమయ్య సంకీర్తనాలలో కళ్యాణోత్సవ విశేషాలు

**డా॥ తమటం రామచంద్రారెడ్డి,**
**తెలుగు అధ్యాపకులు**
**ఎస్.వి.ఎ. గవర్నమెంట్ డిగ్రీ కళాశాల**
**శ్రీకాళహస్తి**

**ఉపోద్ఘాతం :**

ఆంధ్ర వాగ్గేయకారులలో తాళ్లపాక అన్నమయ్య ప్రసిద్ధుడు. ఇతడు క్రీ.శ. 1434-1503 ప్రాంతం వాడు. కడప జిల్లా రాజంపేట తాలూకా తాళ్లపాక గ్రామంలో భారద్వాజ గోత్రుడయిన నారాయణసూరి, లక్కమాంబ దంపతులకు స్వామి నందవంశంలో జన్మించిన వారు. రోజుకు ఒక సంకీర్తన తక్కువ కాకుండా 32 వేల కీర్తనలు వ్రాసిన పదకవితా పితామహుడు. తెలుగు సాహిత్యంలో బీజప్రాయంగా ఉన్న పదకవితకు పరిపుష్టం చేసిన ఘనత అన్నమయ్యదే. తన కాలం వరకు ఉన్న పదాలను జానపద గేయ ధోరణులను వాడుకొని వాడవాడలా సంచరిస్తు కీర్తనలు వ్రాసి ప్రజలలో భక్తి మార్గాన్ని ప్రచారం చేసినవాడు. కృష్ణమాచార్యుల తరువాత ప్రసిద్ధుడయిన పదకవి తాళ్లపాక అన్నమాచార్యులు.

**ఉత్సవం :**

నిత్యారాధన కంటె భగవంతునికి సంతోషదాయకం ఆకర్షణీయమయింది ఉత్సవం. 'సవ' అంటే సాంసారిక మయిన దుఃఖ సముద్రం. ఆ దుఃఖ సాగరాన్ని తరింపచేసేది ఉత్సవం. భగవద్భక్తులు ఉత్సవం ద్వారా దుఃఖాన్ని మరచిపోయి ఆనంద సముద్రంలో మునిగి తేలియాడుతారు. దుఃఖ సముద్రాన్ని దాచివేసేది. నిత్యోత్సవం కంటే ఆకర్షణీయమయింది. దుఃఖాన్ని పోగొట్టేది. మంగళకర మయింది. ఉత్కృష్టమయింది ఉత్సవం అని స్పష్టం.

**కల్యాణోత్సవం :**

> **"శ్వశ్శ్రేయసం శివంభద్రం**
> **కళ్యాణ మంగళం శుభమ్"**

అని అమరం. కల్యం సుఖం అణయతి ప్రాపయతి ఇతి కళ్యాణం. అణగతో సుఖమును పొందించునది అని ప్రబోధకలోని వివరణ.

వ్యక్తుల కళ్యాణం ఆయా వ్యక్తులకి, కుటుంబాలకి మంగళకరమయితే స్వామివారి కళ్యాణం లోకాలకంతా మంగళకరమయింది. అందువల్లనే దేవాలయాల్లో ఇతర ఉత్సవాలతోబాటు కళ్యాణోత్సవాలకు ప్రాముఖ్యం హెచ్చింది. విశేషించి

వైష్ణవాలయాలలో కళ్యాణోత్సవం చేయించడం శుభప్రదంగా ప్రజలు భావిస్తారు. శ్రీ వేంకటేశ్వరస్వామి వారి ఆలయంలో జరిగే ఉత్సవాలలో కళ్యాణోత్స వానికి ఉన్న ప్రాముఖ్యం ఇతర ఉత్సవాలకు లేదనడం అతిశయోక్తికాదు. తిరుమలలో కళ్యాణోత్సవం చాలాకాలం నుండి జరుగుతుందనడానికి సంకీర్తనాధారం ప్రధానంగా చెప్పుకోవచ్చు.

**సంకీర్తనలలో కళ్యాణోత్సవం :**

అన్నమయ్య సంకీర్తన రాశిలో కల్యాణోత్సవానికి సంబంధించి ఎన్నో కీర్తన లున్నాయి. ఈ కీర్తనల వల్ల తెలిపే ప్రధానాంశాలను మూడు రకాలుగా వర్గీకరింప వచ్చును.

1. ఆనాటికి ఆచరణలో ఉన్న ఆగమ విధానం. 2. భక్తి భావన. 3. దేశీయాచారాలు.

అన్నమయ్య సంకీర్తనలలో వివాహోత్సవానికి సంబంధించిన శేష, వైకుంఠ విమానం, హంస, పల్లకీ, గజ వాహనాల ప్రశంస కానరాదు. పెండ్లికి సంబంధించిన రెండు రథ కీర్తనాలు కన్పిస్తాయి.

**"కనకపు గొండవంటి ఘనమైన రథముపై**
**దనుజ మర్దను డెక్కెదరుమెలలో"**

అనే వాక్యాలను బట్టి స్వామివారు తిరువీధులలో రథంలో ఊరేగే వారని వ్యక్తమవుతుంది.

**భక్తి భావన :**

'భజసేవాయం' అని భక్తి వ్యుత్పత్తి చెప్పబడుతుంది. సేవించడం యిందులో ప్రధానాంశం. వైష్ణవులలో సేవకు అగ్రస్థానం ఉంది. 'బంటు బంటుకు' బంటువై వుండటం వైష్ణవం. స్వామివారికి జరిగే జరుగబోయే అన్ని కైంకర్యాలలోను భక్తునికి ప్రధానస్థానం ఉంది. అటువంటప్పుడు భక్తుడు రెండు రకాలైన భావనలు పొంది ఉంటాడు.

మొదటిది అలౌకిక భావన. రెండవది లౌకిక భావన.

**అలౌకిక భావన :** భక్తుడైన వాగ్గేయకారునికి భగవంతుడు ప్రత్యక్ష స్వరూపంతో దర్శనమిస్తుంటాడు. భగవంతుడు తన యెదుట ఉన్నాడనే భావన భక్తునికి ఎప్పుడూ ఉంటుంది. భగవంతుని దివ్యమంగళాకారం, దివ్యలీలలు, అతని కళ్ల ఎదుట తిరుగుతుంటాయి. అట్టి వానిని అన్నమయ్య తదాత్మ్యంతో వర్ణించాడు. వీటిని అలౌకిక భావనగా చెప్పవచ్చు.

**లౌకిక భావన :** సాధారణంగా నిత్యజీవితంలో మానవులు చేసుకొనే పెండ్లి తదంగమంతా కూడి భగవంతునికి గూడా అదేవిధంగా జరిగినట్లు భావించి వర్ణించడం లౌకిక భావనలో చేరుతుంది. బాసికాలు కట్టడం, చేతులకు సేసకాలు అందించడం కంకణ దారాలు కట్టడం, సుంకుల పెండ్లిపీటపై గూర్చొండ బెట్టడం, పూలదండలు మార్చడం, కట్నాలు చదవడం మొదలైనవి లౌకిక భావనలు.

అన్నమయ్య సంకీర్తనలలో లౌకిక భావన మూడు రకాలుగా కన్పిస్తుంది.

1. తాను మంగమ్మ పక్షంగా నిరూపించడం. 2. తాను స్వామి పక్షంగా చెప్పడం.
3. తాను ప్రేక్షకుడుగా పాల్గొనడం.

**తాను మంగమ్మ పక్షంగా నిరూపించడం :**

· సాధారణంగా వివాహాలలో మగపెళ్లివారని, ఆడపెళ్లివారని చెప్పడం అలవాటడు. మగపెళ్లి వారికి గౌరవ సత్కారాలలో లోటు ఉండదు. లోకంలో పెళ్లి నిశ్చయం చేసినవారు. అమ్మాయిలతో తాము నిర్ణయించిన అబ్బాయి అందచందాల్ని విశదీకరించి అమ్మాయి మనస్సు ఇష్టపడేలా చేయడం ఉంది. అందరికి పెట్టని కోట వంటివాడు. వలపించె జక్కన సిరివాడు. నిన్ను పెండ్లి యాడినవాడు, సింగరాయుడు, చిత్తగురుడు, కాంచనపట్టివాడు అని అన్నమయ్య మంగమ్మతో పెండ్లి కొడుకు గుణగణాలను వర్ణించాడు.

అట్లే తన అమ్మాయి రూపవతి, గుణవతి అని స్వామికి అన్ని స్వామికి అన్ని విధాలా తగింది అని చెప్పడం కూడా చేరుతుంది.

**తాను స్వామి పక్షంగా చెప్పడం :**

అన్నమయ్య శృంగార సంకీర్తనలలో తన్ను చెలికత్తెగా, ప్రేయసిగా, దాసిగా, సాక్షాత్తూ దేవేరిగా భావించుకొని వ్రాశాడు. చెలికత్తెగా, భావించుకొన్న కీర్తనలలో కొన్ని అమ్మవారికి సంబంధించినవి, కొన్ని అయ్యవారికి సంబంధించినవి.

· **ఇద్దెనిన్ను రమ్మనె నేమమ్మ**
**నెట్టుకొన్న తమ మేలునే జూడవలెనా**

అనే కీర్తనలో స్వామి కీర్తించాడు.

**తాను ప్రేక్షకుడుగా పాల్గొనడం :**

స్వామికి మంగమ్మపై ఎనలేని అనురాగం అలాగే మంగమ్మకు, కాని ఏవో కారణాల వల్ల తాను ప్రేక్షకుడుగా పాల్గొంటాడు.

**"కాంతకును నీకును కనురెప్పలె తెర**
**దంతపు నవ్వులె మీకు తలబాలు"**

– అనే కీర్తనలో ప్రేక్షకుడిగా అన్నమయ్య పాల్గొన్నాడు.

**దేశీయాచారాలు :**

సంస్కృతంలో వ్రాయబడ్డ గ్రంథాన్ని అనువదించే కవికిగాని, అనుసరించి వ్రాసే కవికిగాని, వస్తువు విషయంలోగాని, వర్ణన విషయంలోగాని స్వాతంత్ర్యం వుండదు. కాని జానపద ధర్మవైపు మొగ్గిన కవికి జానపదుల ఆచార వ్యవహారాలను వర్ణించాలనే తపన ఉంటుంది. విశేషించి ప్రజలలో భక్తి భావన పెంపొందించా లనే వాగ్గేయకారునికి ఈ ఆచారాల వర్ణనలలో పట్టుదల ఉండడం అనివార్యం. అన్నమయ్య

ఈ భావనతోనే స్వామి కల్యాణోత్సవాన్ని, ఆంధ్రుల వివాహ పద్ధతుల కనుగుణంగా వర్ణించాడు. దీనివల్ల రెండు ప్రయోజనాలు సమకూరాయి.

మొదటిది వస్తువు పట్ల, వర్ణనపట్ల పాఠకునికి, గాయకునికి సన్నిహిత సంబంధం ఏర్పడడం.

రెండవది వైష్ణవం తళమిళులకి మాత్రం గాకుండా ఆంధ్ర, వైష్ణవంగా భాషించడం, వీటిలో బాసికం, పెండ్లిపీట, తెర, మంగళాష్టకాలు, ముహూర్తం, అక్షింతలు, తలంబ్రాలు, కొంగుముళ్ళు, సెదలు, కట్నం, అరతులు, శోభనపు టక్షంతలు మొదలైనవి కనిపిస్తాయి.

అన్నమయ్య కాలానికి పూర్వం కల్యాణోత్సవానికి సంబంధించి శాసనాలు లేవు. కల్యాణోత్సవ సేవాదులలో శాసనాలకున్ను అన్నమయ్య సంకీర్తనలకున్ను తేడాలు కన్పిస్తున్నాయి.

**ముగింపు :**

తెలుగు వాఙ్మయంలో తొలి సంకీర్తనాచార్యుడు శ్రీ కృష్ణమాచార్యులు. అతని రచనలు సింహగిరి వచన మాలికా గేయాలుగా ప్రసిద్ధం. కర్నాటక వీరశైవ రచనలు. సంస్కృతంలో రామానుజస్వామి గద్యత్రయాల ప్రభావంతో కృష్ణమాచార్యులు వచనాలు వ్రాసి ప్రజలను ఉత్తేజపరచారు. కృష్ణమాచార్యుల తరువాత ప్రసిద్ధుడయిన పదకవి తాళ్లపాక అన్నమాచార్యులు. ఇతని రచనలపై ఆళ్వారుల దివ్య ప్రబంధం కన్నడ హరిదాసుల, పురందరదాసుల ప్రభావం ఉంది. ఈ ప్రభావంతో సంకీర్తనలలో అన్నమయ్య ఉత్సవాలను రచించాడు. కీర్తనలను రచించడంలో అన్నమయ్య ద్రష్ట.

***

# అన్నమయ్య వైరాగ్య పదాలు

**డా॥ వి. కృష్ణవేణి**
**తెలుగు అధ్యాపకులు**
**శ్రీ పద్మావతి మహిళా డిగ్రీ మరియు**
**పి.జి. కళాశాల, తిరుపతి**

పదకవితా పితామహుడు అన్నమయ్య సాహిత్యంలోని ఆధ్యాత్మిక, శృంగార సంకీర్తనలు తెలుగుభాషా మాధుర్యాన్ని చాటుతున్నాయి. 32,000 ల సంకీర్తనలలో 13,718 మాత్రమే లభ్యమవుతున్నాయి. రోజుకొక సంకీర్తనను స్వామికి అర్పించాలన్న సంకల్పంతో అన్నమయ్య తన సంకీర్తనలను రచించారు. వీరు 16వ యేట నుండి

రచనను కొనసాగించినట్లు తాళ్ళపాక చినతిరువేంగళనాథుని (చిన్నన్న) విరచితమయిన శ్రీ తాళ్ళపాక అన్నమాచార్యుల జీవిత చరిత్ర ద్వారా విశదమవుతుంది.

రోజుకొక సంకీర్తనను రచించడమంటే సాధారణ విషయం కాదు. అందులో పునరుక్తలు వుండకూడదు. రచయితకు విస్తృత పదసంపద, సాహిత్యంపై పట్టు వుంటేనే కార్యం సాధ్యమవుతుంది. ఈ విషయం వీరి సంకీర్తనలను పరిశీలిస్తే అర్థమవుతుంది.

అన్నమయ్య సంకీర్తనలు అమృత భాండాగారాలు. ఈ సంకీర్తనల వెల్లువ తెలుగు సాహిత్యాన్ని ఉక్కిరిబిక్కిరి చేసింది. ఇందులో వెలకట్టలేని వైరాగ్య భావనలు, భజన పారవశ్యాన్ని నింపే భక్తిగీతికలు, తన్మయత్వాన్ని రుచి చూపే రాసక్రీడలు, భావనా జగత్తులో మైమరిపించే సౌందర్య లాలసలు... ఒక్కటేమిటి? రుచి తెలియాలే కానీ అజీర్ణమంటూ ఉండని ప్రకృతి మాధుర్యాలు వీటిలో ఇమిడి ఉన్నాయి.

'తాళ్ళపాక పద సాహిత్యము' అనే సంపుటాల రూపంలో తిరుమల తిరుపతి దేవస్థానముల వారు అన్నమాచార్య ప్రాజెక్టు ద్వారా ముద్రించి వెలువరించిన సంపుటాలలో ఆధ్యాత్మిక సంకీర్తనల సంపుటాలు ఐదు. వీటిలో ఒకటి (15వ సంపుటి) పెదతిరుమలాచార్యుని సంకీర్తనలు. మొదటి నాలుగు (1,2,3,4 సం॥) సంపుటాలలోని సంకీర్తనలు అన్నమాచార్యులు వ్రాసినవి.

అన్నమయ్య ఆధ్యాత్మిక సంకీర్తనల్లో మనకు ప్రధానంగా కనిపించే అంశం భక్తి, వైరాగ్య, జ్ఞాన మార్గాల ప్రబోధ. అన్నమయ్య అందుకున్న వైరాగ్యం ఇందుకు పునాది. అతని జీవితంలో కలిగిన వైరాగ్యాలు ఒక తార్కాణం.

**బాల్య వైరాగ్యం :**

అన్నమయ్యకు బాల్యంలోనే వైరాగ్యం పుదుతుంది. బాలకుదయిన అన్నమయ్యను వదిన పశువులకై కసువును తెమ్మంటుంది. చేతికి గాయం చేసుకున్న అన్నమయ్యలో విరక్తి భావన మొలకెత్తుతుంది.

**"అయ్యో పోయెఁ బాయము గాలము**
**ముయ్యంచు మనసున నే మోహమతి నైతి"** (1-179)

ఈ కుటుంబ విరక్తి భావనను సుస్థిరం చేయుటకా అన్నట్లు తిరుమలయాత్రకు వెళుతున్న భక్తబృందం కంటపడుతుంది. వారు పారవశ్యంతో పాడుకొనే...

**"వేడుకుందామా వేంకటగిరి వేంకటేశ్వరుని"** (అన్న. చరిత్ర. పీఠిక, పు. 6)

అనే గీతంతో తనూ శృతి కలిపి వారి అడుగులో తన పాదం కలుపుతాడు. అన్నమయ్యలో కలిగిన ఈ బాల్య వైరాగ్యం తెలుగు సాహిత్య జగత్తుకు 32,000 సంకీర్తనలను అందించడం ఒక గొప్ప అంశం.

మంజరీ ద్విపదలో సుభద్రాకళ్యాణం వ్రాయడానికి తన భార్య తిమ్మక్కను ప్రోత్సహించి తొలి తెలుగు కవయిత్రిని రూపుదిద్దారు అన్నమయ్య. మొదటి తెలుగు

భగవద్గీతను అన్నమయ్య పెద్ద కుమారుడు పెదతిరుమలాచార్యుడు అందించారు. అంతేకాకుండా అన్నమయ్య వంశస్థుల సాహితీసేవ ప్రశంసనీయ మైనది. తొలి తెలుగు చారిత్రక జీవిత చరిత్ర 'శ్రీ తాళ్ళపాక అన్నమాచార్యుల జీవిత చరిత్ర'ను చిన్నన్న రచించారు. ప్రపంచ సాహిత్యంలోని ఏ కవికీ దక్కని గౌరవం తన రచనలు రాగిరేకుల వంటి శాసనరూపంలో నిక్షిప్తం కావడం అందునా ఏ దైవాన్ని శరణాగతి కోరెనో ఆ దేవదేవుని సన్నిధిలోనే భద్రపరచగల భాగ్యం దక్కడం.

ఈ విధంగా బాల విరాగి అయిన అన్నమయ్యను ఓదార్చిన తల్లిదండ్రులు తిమ్మక్క, అక్కలమ్మల నిచ్చి వివాహం జరిపించారు.

**"తిరుమలమ్మను నొక్క తిరువాలు గంటి**
**నరుదైన యక్కలమ్మను నొక్కకన్య"** (అన్న. చరిత్ర. ద్విపద-పుట-291)

సంసారి అయిన అన్నమయ్య అందులో మునిగిపోలేదు. 'తామరాకుపై నీటి బొట్టు'లా జీవిస్తూ తన వైరాగ్య భావజాలాన్ని అంతకంతకూ వృద్ధి చేసుకున్నాడు. సంసారిగా అన్నమయ్య చూపిన సంసార విరక్తి యవ్వన దశలోనిది. ఈ యవ్వన విరక్తి వైరాగ్య పద బాటను పటిష్ఠం చేసింది.

**యవ్వన వైరాగ్యం :**

యవ్వనదశలో సాళువ నరసింహరాయల అధికారదర్పం వలన వైరాగ్యం ఎక్కువవుతుంది అన్నమయ్యలో.

ఉరకలు వేసే యవ్వనంలోని వైరాగ్య భావనలు మోక్షానికి దగ్గర దారులు. యవ్వనంలోనే విరక్తిని వృద్ధి చేసుకోవాలని శ్రీకాళహస్తీశ్వర శతకంలో ధూర్జటి పిలుపునిచ్చారు.

శా॥ **దంతంబుల్పడనప్పుడేవునం దారూఢి యున్నప్పుడే**
**కాంతాసంఘము రోయనప్పుడే జరా క్రాంతంబుగా నప్పుడే**
**వింతల్మేన చరింపనప్పుడె కురు ల్వెల్లంగగా నప్పుడే**
**చింతింపన్వలె నీ పదాంబుజములన్ శ్రీకాళహస్తీశ్వర!**

భావం : శ్రీకాళహస్తీశ్వరా! ముసలితనము వచ్చి పండ్లు ఊడకముందే, శరీరములో ఓపిక ఉండగానే, స్త్రీలు శరీరమును చూచి అసహ్యించుకొనక ముందే, వెంట్రుకలు బాగా తెల్లబడక ముందే, శరీరపుష్టి తగ్గి అవయవములలో వింతలు కనిపించకముందే, నీ పాదపద్మము లాశ్రయించి నిన్ను ధ్యానించుచూ జీవించవలెను.

అన్నమయ్య సంసార విరక్తిని ఈ విధంగా చూపారు.

**"సడిబెట్ట గటకటా - సంసారము చూడ**
**జలధి లోల యాత - సంసారము"**

సంసారాన్ని సాగరంతో పోల్చడం లోకోక్తి. ఆ భావన చెబుతూనే అనేక ఉపమానాలను ఉపయోగించి, అందులోని నిస్సారతను తెలియజేశాడు అన్నమయ్య. సంసారం చంద్రుని జీవనంలాంటి దన్నాడు. అంటే శుక్లపక్ష, కృష్ణపక్షాల చంద్రకళలు, సంసారం యముడి నోటిలో బ్రదుకన్నాడు.

**"అప్పులేని సంసారమైన పాటే చాలు**
**తప్పులేని జీత మొక్క తీరమైన జాలు"** (1-114)

అప్పులేని సంసారముందదంటారు. కానీ, ఉన్నంతలో సర్దుకొని బ్రతికే జీవనమే మేలంటున్నాడు. రంధ్రాలు లేని గుడిసె గంపంతదయినా చాలంటు న్నాడు. గంప అంటేనే రంధ్రాల భరితం. ఇక్కడ చిన్నగూడు చాలనే అర్థంలో తీసుకోవచ్చు.

**"సంతలే చొచ్చితిగాని సరుకు గాననైతి**
**యింతట శ్రీహరి నీవే యిటు దయజూడదే"** (2-27)

ఒక వస్తువు కొనాలని దుకాణానికి వెళితే అది కనపడకపోతే కలిగే మానసిక స్థితిని ఉపమానాలుగా తీసుకొన్నారు. జీవన పరమావధి అయిన మోక్షం గురించిన మరుపును తెలుపుతున్నారీ కీర్తనలో. సంసారంలో వెదకి వైరాగ్య రత్నాన్ని తేలేకపోయానంటున్నారు.

**"కటకటా కర్మమా కాలములో మర్మమా**
**మటుమాయైపోతివంటా మది నమ్మివుంటిగా"** (2-155)

వయస్సు పెరుగుతున్న కొద్దీ మనలో కలిగే స్వార్థాన్ని వివరిస్తుందీ కీర్తన. నరకానపడి నలిగిన నాడు ఈ సంసారభోగాలు అగుపడునా? అంటూ సంసార జలధిలో పడి నరకానికి దారులు వెదకరాదంటూ హెచ్చరిస్తున్నాడు అన్నమయ్య.

**"కొలది పుణ్యపాపాలే - కొంగు రిక్కములు వెట్టి**
**వెలదెంచి బేరమాడ - వేగిమేరారో"** (3-170)

ఇందులో సంసారాన్ని దినసంతతో పోల్చాడు. పుణ్యపాపాలను కొంగున కట్టుకున్న డబ్బుగా వర్ణించాడు. అనగా సంసారభోగాలను సంపాదించిన పుణ్యంతో కొంటున్నామని, వాటిద్వారా పుణ్యం ఖర్చయిపోతుందని జాగ్రత్త పడమంటున్నాడు. (పుణ్యమన్నది ఒక బ్యాంకు ఖాతా వంటిదట. ఖర్చయిపోతే అప్పులే మిగులుతా యన్నది లౌకిక అర్థం). స్త్రీలు వలపులనే అంగళ్ళను చింతచెట్టు క్రింద పెట్టుకున్నారని, వాటిని తొలగద్రోసి ప్రోవుట మనకు సాధ్యం కాదన్నాడు. చింతచెట్టునే ఎందుకు ఉపమానంగా ఎన్నుకున్నారంటే, ఆ వనితల వలన మీకు చింతలు కలుగుతాయని హెచ్చరించడం.

**"సంసారమే మేలు - సకల జనులకు**
**కంసాంతకుని భక్తి - గలిగితే చాలు"**

అంటూ 'మేలు' అంత్యప్రాస పదాలలోని ఈ కీర్తన బహుమేలు.

**"సతత విరక్తుడు సంసారిగాడు**
**రతిసమ్మదుడు విరక్తుడు నితడె"** (1-272)

ఈ విధంగా సంసారంలోని భవబంధాలను దూరం చేసుకోవాలని పిలుపునిచ్చే అనేక కీర్తనలు మనకు దర్శనమిస్తున్నాయి. తరువాత ప్రాప్తించే నడివయస్సు బరువు బాధ్యతలను బంధాలను పెంచుతుంది. ఈ దశను జయించి వ్రాసిన కీర్తనలేమో అన్నవి విస్తృతంగా కనిపిస్తాయి.

**నడివయస్సు వైరాగ్యం :**

నడివయస్సు లోని వైరాగ్యం పంచేంద్రియాలపై, మనస్సుపై అది చేసే మాయ గురించిన అవగాహన కలిగిస్తుంది. అందుకే జీవుడు నడివయస్సు అనగా నలభై వచ్చే నాటికి (నాలుగు) పురుషార్థాలను, యాభై నిండే సరికి పంచేంద్రియా లపై (అయిదు) పట్టు సాధించాలంటారు. వర్ణాశ్రమ ధర్మాలలో ఈ వయస్సు వానప్రస్థాశ్రమం.

పంచేంద్రియాలు జీవుడిని ఆడించుటలో బలమైనవి. మోహంతో చేసే తప్పులకు ఇంద్రియాలు కారణాలు. వీటి గురించి అన్నమయ్య ఈ కీర్తనలో వివరించారు.

**"ఇదివో సంసార మెంత సుఖమో కాని**
**తుదిలేని దుఃఖమును తొడవు గడియించె"** (1-308)

పంచేంద్రియాలను పాపాత్ములతో పోల్చాడు. సంసార మోహానికవి గురి చేశాయన్నాడు. కామమనే గడుసరి కొడుకు తనలో పుట్టి పెరిగి పాపమనెడు ధనమును కొల్లలుగా ఆర్జించాడన్నాడు.

ఇంద్రియాలను అదుపు చేయాలనే మరో కీర్తన.

**"వెలుపల వెదకితే వెస నాత్మ గనునా**
**పలుమారు నిదే యభ్యాసము గావలెను**
**యిన్ని చింతలు మఱచి యింద్రియాల గుదియించి"** (2-198)

ఇంద్రియ నిగ్రహం గురించి భగవద్గీత శ్లోకాల సారాంశం పై కీర్తనలో కనపడుతుంది.

**ఇంద్రియాణాం హి చరుతాం యన్మనోను విధీయతే ।**
**తదస్య హరతి ప్రజ్ఞాం వాయుర్నావ మివామ్భసి ॥**

**తస్మాద్యస్య మహాబాహో । నిగృహీతాని సర్వశః ।**
**ఇ । న్ద్రియాణీ । న్ద్రియార్థేభ్యః తస్య ప్రజ్ఞా ప్రతిష్ఠితా ॥** (గీత. 2-67,68)

విచ్చలవిడిగా పరుగులుదీయు ఇంద్రియాలను భగవంతునివైపు దారి మళ్ళించాలని అన్నమయ్య వైరాగ్య పదాలు బోధిస్తున్నాయి.

పంచేంద్రియాలపై పట్టుసాధించినా కర్మేంద్రియాలలోని మనస్సు ప్రధానమైనది. మనసు చేసే మోసానికి లొంగిననాడి జీవితం పతనం ఖాయం. మనస్సంటే ఆలోచనల సమాహారం. వెల్లువలా వచ్చిపడే ఆలోచనలను నివారించకపోతే మనిషి నిలువునా మునిగిపోవలసిందే. మనస్సు గురించి అన్నమయ్య చెప్పిన మర్మాలు కొన్ని కీర్తనల్లో కనిపిస్తాయి.

**"మనసు నమ్మి నేర్చితే మనుజుడే దేవుడౌను**
**తనలోనే వున్నవాడు తావుకాని దైవము"** (అ. 2-352)

మనసును లాలించి నేర్పితే అదే భగవంతున్ని చూపుతుంది. నీలోనే భగవంతున్నాడని, సకల జీవులలోని దైవత్వాన్ని దర్శింపచేస్తుంది.

ఇదే వేదాల సారం 'అహం బ్రహ్మాస్మి' నేనే భగవంతుడను. దైవం నాలో, నీలో, మనందరిలోనూ ఉందని తెలిపే తదాత్మ్య భావన.

**"వెనకేదో ముందరేదో - వెఱ్ఱి నేను నా**
**మనసు మరులుదేర - మందే దొకో!"**

ఈ కీర్తనలోని సారాంశం చాలా ఉన్నతమైనది. భూత, భవిష్యత్ కాలములు తెలియని నా మనసుకు ఎలా తెలిసేది. మంచేది కావాలో? తరువాత జన్మలో మంచి సిరిసంపదలు కావాలని నోములు నోస్తాను. ఏ జన్మనెత్తుతానో తెలియదు. మంచి పాన్పుపై నిద్రిస్తాను. నిద్రనుంచి లేస్తానో లేదో తెలియదు. నిద్రలేచి జరిగినదంతా గుర్తు తెచ్చుకుంటాను. గాఢనిద్రలో ఈ లోకమేమైపోయిందో? పాపాలు చేసి మరచిపోతున్నాను గానీ, ప్రతి చిన్న విషయాన్ని లెక్కవ్రాస్తున్న చిత్రగుప్తుడిని మరిచాను కదా! అంటూ వాపోయాడు అన్నమయ్య.

'పాపములకు ఫలములనుభవింపక తప్పదు కనుక పాపముల జోలికి పోకుండుటే ముముక్షువునకు ముఖ్యకర్తవ్య మనుట పదకవితా పితామహుని ప్రబోధ సారాంశము' అంటూ అన్నమయ్య సంకీర్తనలలోని సారాంశాన్ని డా॥ సముద్రాల లక్ష్మణయ్యగారు 'అన్నమాచార్య సంకీర్తనామృతము'లో వివరించారు.

భగవంతుని చేరాలంటే 'మాయ'ను జయించమంటుంది భగవద్గీత. అన్నమయ్య తన జీవితాన్ని వైరాగ్య దృష్టితో దర్శించాడు కనుక మాయను అర్థం చేసుకున్నాడు. నిద్ర మేల్కొన్న వెంటనే 'కల' ఏవిధంగా చెదిరిపోయి వాస్తవం తెలుస్తుందో, ఆ రీతిన జీవి నుండి ఆత్మ వెడలిపోగా జీవన్నాటకం కళ్ళముందే కదులుతుందట. అందుకే జరుగుతున్నదొక నాటకమనే స్పృహలో వుండాలని ఉపనిషత్తులు తెలియజేస్తున్నాయి. ఈ అంశాన్ని అన్నమయ్య -

**"నానాటి బదుకు నాటకము**
**కానక కన్నది కైవల్యము"**
మాయలోని శ్రీహరి లీలలను తెలియజేయు మరో కీర్తన.

**"నీమాయ కల్లగాదు నిజము దెలియరాదా**
**కామించి హరి నీ వొక్కడవే నిజము"** (2-458)

'ఒక్క సంకీర్తనే చాలు' అనే అన్నమయ్య పదం నిజం. ఈ ఒక్క సంకీర్తనలో మొత్తం సృష్టి రహస్యం ఇమిడి ఉంది.

మాయను గెలవని వాడు కర్మబంధానికి బానిసవుతాడు. తిరిగి తిరిగి జన్మలు తీసుకుంటూ జననమరణ చక్రంలో కొట్టుమిట్టాడుతాడు. ఈ అంశం గురించి శంకరాచార్యుల వారి 'భజగోవిందం' వివరిస్తుంది.

**పునరపిజననం పునరపిమరణం**
**పునరపి జననీ జఠరేశయనం**
**ఇహసంసారే బహుదుస్తారే**
**కృపయాంపారే పాహిమురారే**

అన్నమయ్య తన కీర్తనలలో కర్మబంధం గురించి వివరించారు. రామాయణ, భారత, భాగవత కథలలోని ఉపకథలను ఉదాహరిస్తూ కర్మబంధం కూడదన్నాడు.

**"కలదిదివో సుఖము గలిగినను గర్భము నిలువక మానును**
**మలసి కామ్య కర్మములకు జొచ్చిన మగుడ బుట్టువులు మానునా"** (2-22)

జడభరతుడి కథ భాగవతంలోనిది. ఇతను రాజ్యాన్ని వదిలి అడవిలో తపస్సు చేసుకుంటూ వుంటాడు. ఆశ్రమంలోని నీటివద్ద ఒక జింక, పిల్లను కని మరణిస్తుంది. పిల్లజింక పెంపకంలో మునిగిపోతాడతడు ముని. తాను ముని అన్న మాట మరచి దానితోనే లోకమనుకుంటాడు. కొన్ని రోజులకది మరణిస్తుంది. ఆ దిగులుతో జింకను కలవరిస్తూ అతనూ చనిపోతాడు. తిరిగి జింకగా జన్మిస్తాడు. జింకలపై వ్యామోహాలు తీర్చుకొని, తరువాత జన్మలో మునిగా జన్మించి కైవల్యం పొందుతాడు.

ఇలాంటి సూక్ష్మ అంశాలను అన్నమయ్య తన సంకీర్తనల్లో పొందుపరచి లోకానికి అందించాడు. ఫలితంగా జీవులలో వైరాగ్యం పొడసూపాలన్నదే అన్నమయ్య రచనల పరమావధి.

కర్మవశుడైన మానవుడికి ఆశతీరదు. ఆశలో కొట్టుమిట్టాడుతూ దురాశ దరిచేరి, తీరు తెన్నులేక పాపాలను మూటగట్టుకుంటాడు. అందుకే ఆశ వలదంటూ అన్నమయ్య తన కీర్తనలలో ఆదేశించాడు.

**"కదుపెంత తాగుడుచు కదుపెంత దీనికై**
**పదని పాట్లనెల్ల బడిపొరల నేలా"** (1-302)

జానెడు పొట్ట నింపుకొనుటకు మానవులు పడే కష్టాల గురించి పల్లవి తెలియజేస్తుంది. ఇతరులకు కష్టం కలిగించడం, ఇతరుల గెలుపును చూసి ఓర్వలేక పోవడం... ఇలాంటి ఆశలతో సతమతమయ్యే బ్రతుకెందుకని ప్రశ్నిస్తున్నారు అన్నమయ్య.

**"తానెంత బ్రదుకెంత దైవమా నీమాయ యెంత**
**మానవుల లంపటాలు - మరి చెప్పగలదా?"**

చీమ, ఈగ, గిజిగాండ్లు వంటి చిన్న జీవులు తమ సంసార బ్రతుకుకు ప్రాకులాడి లంపటాలు తెచ్చిపెట్టుకుంటాయి. వాటిని చూసి మనం నవ్వుకుంటాం. మరి మనల్ని చూసి ఆ భగవంతుడు నవ్వడా? - అంటూ సందేహాన్ని వెలిబుచ్చారు అన్నమయ్య.

ఈ వైరాగ్య భావనలన్నీ వార్ధక్య దశలో తారాస్థాయికి చేరుకుంటాయి. దేహం అనిత్యమనే వాస్తవం గ్రహిస్తుంది మనసు. ఈ దశను వార్ధక వైరాగ్యంగా భావించవచ్చు.

**వార్ధక్య వైరాగ్యం :**

వైరాగ్య భావనలు ఎక్కువగా వార్ధక్యదశలో చాలామందిలో అగుపిస్తాయి. తోలుతిత్తిలాంటి శరీరాన్ని ఈసడించుకుంటారు. ఛీ...ఛీ... మానవజన్మం అంటూ అసహ్యించు కున్నారు అన్నమయ్య.

**"ఇంకనైనా రోయరాదా - యీపాటి వారమింతే**
**మంకుదనమేల మా - మాట వినరాదా!" (3-334)**

దేహం ఈవిధంగా అడుగుతోందంట...

ఓ సంసారులారా? ఇకనైనా మీరు మాపై రోతపడి మమ్ము విడిచి పోరాదా? మా బ్రదుకే ఎంతో హీనమైనది - మమ్ము పట్టుకొని వ్రేలాడిన మీకు ఏమి లాభము? ఎందుకింత మొండితనము? మా మాట వినకూడదా? తొమ్మిది రంధ్రాలు గల తోలుబొంతను కట్టుకున్న ధోరను నేను... అంటుంది శరీరం.

పంచభూతాలు, ఇంద్రియాలు, ఆశ...వంటి అంశాలన్నీ ఈ కీర్తనలో పొందుపరచబడ్డాయి.

దేహం అశాశ్వతమని తెలిసి, చుట్టూ ఎన్నో జీవులు మరణిస్తున్నా, తాను మాత్రం శాశ్వతమనుకుంటాడు జీవుడు. మహాభారతంలోని యక్షప్రశ్నల్లోని చివరి ప్రశ్న ఈ అంశాన్ని వివరిస్తుంది.

భగవద్గీతలో వివరించినట్లు దేహం జీర్ణమైన వస్త్రాన్ని విడిచి, నూతన వస్త్రంను ధరించినట్లు దేహం విడిచిన ఆత్మ మరో దేహాన్ని ఆశ్రయిస్తుందని, ఆత్మనిత్యం, సత్యమన్న వాక్కులను క్రింది కీర్తనలో వివరించాడు అన్నమయ్య.

**"గుది పాత చీరమాని కొత్తచీర గట్టినట్టు**
**ముదిమేను మాని దేహి మొగి గొత్తమేను మోచు"**

మరో కీర్తనలో జీవుడు వెనక జన్మలెన్ని తీసుకున్నాడోననే వేదాంత సమాలోచన అగుపడుతుంది.

**"ఎవ్వరెవ్వరివాడో యీ జీవుడు చూడ**
**నెవ్వరికి నేమౌనో యీ జీవుడు"** **(1-97)**

బ్రతుకులోని పసలేని తనాన్ని వివరించే మరో కీర్తన.

**"పసలేని యీ బ్రదుకు**
**అసలు చొచ్చి చొచ్చి అలసినట్లాయె"** **(1-203)**

బ్రతుకునే అసహ్యించుకునే కీర్తనలున్నాయి.

**"ఛీఛీ వో బదుకా సిగ్గులేని బదుకా**
**వాచవికి బతిమాలి వద్దబద్ద బదుకా"** **(1-467)**

తెల్లవారుతుంది, రాత్రి వస్తోంది. రోజులు గడిచిపోతున్నాయి. హరిని దలచడానికి వేళలేదంటూ, లంపటాలు తెచ్చుకోవద్దు అంటూ హితవు పలికాడు అన్నమయ్య.

**"చీచీ వివేకమా చిత్తపు వికారమా**
**యేచి హరి గొలువక హీనుడాయ జీవుడు"** **(2-13)**

అన్నమయ్య బాల్యం నుండి వార్ధక్యం వరకూ భక్తి వైరాగ్య భావనలో మునిగి తేలాడు. జ్ఞానాన్ని తన సంకీర్తనలనే సంపదలతో మేళవించి తెలుగువారికి వారసత్వంగా అందించారు.

మంచిచెడుల విచక్షణ తెలియనినాడు అజ్ఞానమనే అంధకారంలో పడిపోతాం. అందుకే భక్తి, కర్త మార్గాలనే కాక జ్ఞానమార్గాన్ని అందించారు అన్నమయ్య.

**"తెలిసితే మోక్షము తెలియకున్న బంధము**
**కలవంటిది బదుకు ఘనునికిని"** **(2-19)**

'తెలిసితే మోక్షము తెలియకున్న బంధము' అనే వాక్యాన్ని అర్థం చేసుకుంటే అదే మోక్షానికి దారి.

**"భారమైన వేపమాను పాలుపోసి పెంచినాను**
**తీరను చేదేకాక తీయనుండునా"**

'ఏ విత్తనం నాటితే అదే వృక్షం వస్తుందని' మంచి ఆలోచనల గురించి ఆధునిక వ్యక్తిత్వ వికాస నిపుణులు నేటికాలంలో శిక్షణా తరగతుల్లో నేర్పుతున్నారు. ఈ అంశం 15వ శతాబ్దం నాటికే అన్నమయ్య వెల్లడించారు. అందునా శరీరాన్ని వేపమానుతో పోల్చి, పాలుపోసి మరీ జాగ్రత్తగా పెంచినాను, అయినా దాని గుణమయిన చేదుపోలేదంటూ వేదన చెందాడు.

వేదాంత రహస్యాలను ఈ క్రింది విధంగా తెలుపుతున్నాడు.

**"మూదే మాటలు మూడు ముండ్ల తొమ్మిది**
**వేడుకొని చదువరో వేదాంత రహస్యము"** **(2-233)**

ప్రతి నిమిషయం వైరాగ్యభావనతో ఎందుకు మునికి తేలాలి? అసలు జీవులెందుకు మోక్షం కోరాలి? అనే ప్రశ్నలు ప్రతివారిలో ఉదయిస్తాయి.

ఎందుకనగా సకల జీవరాసులలో ఉత్కృష్టమైనది మానవజన్మ. 84 లక్షల జన్మలలో కర్మావశేషాలను అనుభవిస్తుంది జీవాత్మ. ఏ ఔన్నత్యాన్ని (పరమాత్మను) వదిలిపెట్టి వచ్చిందో తిరిగి ఆ గమ్యం చేరటమే జీవుడి లక్ష్యం. ఆ ఆశయం నెరవేరేది ఒక్క మానవజన్మలోనేనని చతుర్వేదాలు చాటి చెబుతున్నాయి. కావున మానవ జీవితానికి మోక్షమే పరమ ప్రయోజనం. దీనర్థం జీవాత్మ పరమాత్మను చేరడం.

అద్వైతము, విశిష్టాద్వైతము ద్వైతము ఏదయినా ప్రకటించేది మోక్షవిద్య గురించే.

**'చావు పుట్టుకలేని చదువేల చదవరో?'** అంటాడు వేమన.

**'చదువులోని మర్మమెల్లా చదివితి'** అంటూ పోతన ప్రహ్లాదునిచే భాగవతంలో పలికించాడు. ఇటువంటి గొప్ప సందేశాలను లోకానికి అందించడం కవి కర్తవ్యం. కవి తాను మనోనేత్రం ద్వారా దర్శించిన భావనలను లిఖిత, మౌఖిక రూపంలో పొందు పరుస్తాడు. అవి భావితరాల వారికి బంగారు బాటను వేస్తాయి. కవి కుండవలసిన మరో విశిష్ట లక్షణం సమాజంపై అవగాహన.

ఈ లక్షణాలన్నీ కలిగిన విశిష్ట సాహిత్యకారుడు అన్నమయ్య సంచారం ద్వారా వివిధ ప్రాంతాల జనజీవన విధానాన్ని ఆకళింపు చేసుకొని తన సంకీర్తనల ద్వారా వైరాగ్య పదాలను అల్లి గానం ద్వారా ప్రజల గుండెల్లోకి తీసుకువెళ్ళ గలిగారు.

కోతిలాంటి మనసుకు కళ్ళెంవేసి, దురాశకు లోనుకాక, ఇంద్రియాలనే గుర్రపు కళ్ళాలను అదుపు చేయుటకు భక్తి ఒక ఆయుధం. శరణాగతే శరణ్యం. అందుకే మోక్షాన్ని పొందాలంటే ఎంత కష్టమో ఈ కీర్తనలో వివరించారు.

**"ఊరికే దొరకునా వున్నతోన్నత సుఖము**
**సారంబు దెలిసికా జయము చేకొనుట"** **(2-104)**

ఇందులోని 'తలపు లోపలి చింత దాటినప్పుడు గదా అలరి దైవంబు ప్రత్యక్షమౌట' అనగా దైవము ప్రత్యక్షం కావాలంటే ఆలోచనలు శూన్యం కావాలి. అంటే కోరికలు నశించాలి. ఆశలు అడుగంటాలి.

అందుకే...

**ఎక్కడి మానుష జన్మం బెత్తిన ఫలమేమున్నది**
**నిక్కము నిన్నే నమ్మితి నీచిత్తం బింకనూ**

అంటూ వైరాగ్య పదాలందించిన అన్నమయ్య భగవత్ స్వరూపుడు.

ఈ అంశాలను మనం గ్రహించలేక పోతున్నామని కీ॥శే॥ గౌరిపెద్ది రామసుబ్బశర్మ గారు ఈ విధంగా అభిప్రాయపడ్డారు.

"ఆధ్యాత్మిక విద్య మనబోటి మూఢ సంసారులకు ఎన్ని విధములుగ ఎన్ని సారులు వివరించి చెప్పినా బోధపడుట కష్టము".

కావున అన్నమయ్య సంకీర్తనల లోని సాహిత్య విలువలను లోకానికి చాటి చెప్పాల్సిన అవసరం ఎంతైనా వుంది. ప్రపంచభాష అయిన ఆంగ్లంలోనికి ఈ కీర్తనలను అనువాదం జరిపి అంతర్జాతీయ స్థాయిలో విస్తృతంగా ప్రజల్లోకి తీసుకువెళ్ళాల్సిన ప్రాముఖ్యత వుంది. ఈ ప్రయత్నం ఇప్పటి వరకూ స్వల్పంగా మాత్రమే జరిగింది. గ్లోబలైజేషన్ సంస్కృతిలో అన్నమయ్య పాఠాలు రతనాల మూటలవుతాయని ఆశిద్దాం.

**ఆధార గ్రంథాలు :**


1. అన్నమాచార్య, ప్రముఖ వాగ్గేయకారుల తులనాత్మక అధ్యయనం - ఆచార్య గంగప్ప.
2. అన్నమయ్య-ఆళ్వారులు - తులనాత్మక పరిశీలన - ఆచార్య జక్కంపూడి మునిరత్నం.
3. అన్నమాచార్య సంకీర్తనామృతము - డా॥ సముద్రాల లక్ష్మణయ్య.
4. అద్వైత విశిష్టాద్వైత భేదములు - శ్రీ యస్. నరసింహాచార్యులు.
5. ఆధ్యాత్మిక సంకీర్తనలు - సం॥ తి.తి.దే. - 1, 2, 3, 4.
6. ఆంధ్ర మహాభాగవతము - బమ్మెర పోతన.
7. తాళ్ళపాక పదసాహిత్యం-పరిశీలన - గంగప్ప వ్యాసాలు.
8. తాళ్ళపాక సంకీర్తన కవులు - ఆచార్య సర్వోత్తమరావు.
9. తాళ్ళపాక అన్నమయ్య వైదుష్యము-ఒక పరిశీలన - డా॥ ఎ. ఇంద్రాణి.
10. తెలుగు సాహిత్య చరిత్ర - జి. నాగయ్య.
11. ప్రథమ వాగ్గేయకారుడు-అన్నమాచార్యులు - ఆచార్య ఎస్. గంగప్ప.
12. వ్యాస సంపుటి - ఆచార్య సర్వోత్తమ రావు.
13. వ్యాస భాండారము - డా॥ జి. చలపతి.
14. వ్యాస మంజరి - ఆచార్య సర్వోత్తమరావు.
15. సందేశ రత్నావళి - ఆచార్య పొన్ను లీలావతి.
16. శ్రీ తాళ్ళపాక అన్నమాచార్యుల జీవిత చరిత్ర.


***

# అన్నమయ్య కీర్తనలు - 15వ శతాబ్ధి నాటి సమాజ జీవన చిత్రణ

**శ్రీమతి అవ్వారి భద్రావతి**
**పరిశోధక విద్యార్థిని**
**బాపట్ల**

తెలుగు సాహిత్యంలో పదప్రక్రియకు శ్రీకారం చుట్టినవాడు అన్నమయ్య. ఈయన మహా వాగ్గేయకారుడు. పదకవితా పితామహుడనీ, సంకీర్తనాచార్యుడనీ అన్నమయ్యకు బిరుదులు ఉన్నాయి. ఈయన రాయలసీమ ప్రాంతం, కడప జిల్లా, రాజంపేట సమీపంలోని తాళ్ళపాక అనే గ్రామంలో జన్మించాడు.

అన్నమయ్య శ్రీ వేంకటేశ్వరుని కీర్తిస్తూ 32 వేల శృంగార, ఆధ్యాత్మిక సంకీర్తనలు రచించారు. వీరు 1503 దుందుభి నామ సంవత్సరం, ఫాల్గుణ బహుళ ద్వాదశినాడు స్వామి సన్నిధిలో భౌతికదేహాన్ని చాలించారు.

అన్నమయ్య నాయకుడు బాహ్యదృష్టికి పురుషుడు. అంతర దృష్టికి పరమపురుషుడు. అన్నమయ్య నాయిక బాహ్య దృష్టికి స్త్రీ, అంతర దృష్టికి ఆత్మ. పరమాత్మ ఏకైకం. ఆత్మలు అనంతం. ఆత్మలు ఆవిర్భవిస్తూనే ఉంటాయి. పరమాత్మ ఒక్కరే శాశ్వతం. ఆత్మ ప్రతీకలైన నాయికలను శృంగార నాయికలుగా, నాయకుడిని వేంకటేచలపతిగా వర్ణించారు.

హిమాలయోన్నతమైన సంయోగవాంఛ శారీరక జనితమైతే అది బాహ్యరతికి దారితీస్తుంది. అదే వాంఛ ఆధ్యాత్మికమైనప్పుడు అది ఆత్మరతికి కారణభూతమవుతుంది. మొదటి దశ భౌతికం. రెండవ దశలో స్త్రీ, పురుష భేదం లేకుండా కేవలం ఆత్మలన్నీ స్త్రీలుగా వర్ణించి ఏకైక పురుషోత్తముడైన పరమాత్మ కోసం పరితపించే మధుర దృష్టిని కల్గించారు ఆధ్యాత్మిక గుణసంపన్నులు అన్నమయ్య.

ఆయన రచనలలో సమాజంలోని స్థితులు, పరిస్థితులు, స్త్రీ పురుషుల స్వభావాలు, పాటించాల్సిన ధర్మాలు, ఆహార వ్యవహారాలు, వస్త్రధారణ, వేషాలంకరణలు, శృంగారం, వృత్తులు మొదలగునవి అన్నింటినీ స్పృశిస్తూ రచనలు గావించిన సామాజిక, మానసికవేత్త, భవిష్యద్రష్ట, అభ్యుదయవాది అన్నమయ్య.

**15వ శతాబ్దిలో సమాజ జీవన చిత్రణం :** సాహిత్యం మానవ జీవన ప్రతిబింబం, వ్యక్తిత్వ వికాసదాయకం, విశ్వశ్రేయోదాయకం సాహిత్యం. అటువంటి సాహిత్యం సమాజాన్ని చైతన్యపరచి సన్మార్గంలో వ్యక్తులను శక్తులుగా మారుస్తుంది. పదకవితా సాహిత్యంలో భక్తిమార్గంలో రక్తిని చొప్పించిన ఆత్మజ్ఞాని, నాటి సమాజద్రష్ట. భక్తిని భగవంతుని కీర్తనల ద్వారా ప్రజలుక చేరువచేశారు. పనిపాటలతో, సంసార సాగరంలో

కొట్టుమిట్టాడే ప్రజలను భక్తిమార్గానికి తన శృంగార, ఆధ్యాత్మిక కీర్తనల ద్వారా అయస్కాంతంలా ఆకర్షించి ఆత్మ పరమాత్మల ఐక్యాన్ని ఉద్బోధించి వైష్ణవాన్ని బోధించి ముక్తిబాటలో నడిపించిన భక్తి ఉద్యమనాయకునిగా అగుపిస్తారు అన్నమయ్య. విద్యాగంధం లేని సామాన్యులకు సైతం అర్థమయ్యే విధంగా, తమ చుట్టుప్రక్కల ప్రదేశాల్ని, సందర్భాలను వస్తువులుగా స్వీకరించి జానపదంను కూడా చొప్పించారు. నాటి సమాజ జీవనాన్ని అన్నమయ్య సంకీర్తనల ద్వారా కొంతవరకు ఊహించవచ్చు.

**కుటుంబం**

**స్త్రీ పురుష ధర్మాలు :** ప్రతి వ్యక్తికీ ఆధారం కుటుంబం. దానిలో అత్యున్నత స్థానాన్ని ఆక్రమించేది స్త్రీ. అన్నమయ్య కీర్తనల్లో స్త్రీ, ప్రియురాలిగా, ఇల్లాలుగా, తల్లిగా, సవతిగా, అత్తాకోడళ్ళుగా, చెలికత్తెగా ఎన్నో సంకీర్తనల్లో దర్శనమిస్తుంది. ఈ కీర్తనల్లో స్త్రీని, స్త్రీ రూపంలోనే చూడటం భగవద్ద్రోషం చేసినట్లే అవుతుంది. శృంగార కీర్తనల్లో అంతరార్థం గ్రహిస్తే ఆత్మజ్ఞానం అవగతమవుతుంది. ఈ కీర్తనల్లో స్త్రీకి వివిధ వరుసలు ఆపాదించి నాటి, నేటి తరాల వారికి స్త్రీ ధర్మాలను ఉద్బోధించారు అన్నమయ్య.

> **"కాఁక సేయఁదగనా కలయఁగఁదగుఁగాక**
> **మూఁక లాయఁబులకలు మొకమియ్యరాదా"** ॥ పల్లవి ॥

అంటూ నాడు బహుభార్యత్వం ఉన్న సమాజంలోని స్త్రీలకూ, అదేవిధంగా నేటి స్త్రీలకు కూడా భర్తను ఎల్లప్పుడూ అనురక్తుడై ఉంచుకోవాలో బోధించారు.

**పురుషులకు ప్రబోధం :** అన్నమయ్య కేవలం స్త్రీలకే కాక పురుషులకు కూడా సాంసారిక ధర్మాలను ప్రబోధించారు.

1. అప్పుడే మరతురా అంగన చేసిన మేలు (29-448)
2. కన్నచోట నెల్లాను కాంతను తూరకుమీ (32-273)

> **కపటాలు వద్దుకాక కాంతలతోను (29-509)**
> **కోపము పనికిరాదు కొమ్మల యెడలను (27-350)**
> **మంకు విడచిన నదెమంచి బుద్ధి (25-485)**
> **చంచల చిత్తునకు నిశ్చయమే లేదు (3-121)**

> **"పొలతులు జీవులే పురుషులు జీవులే**
> **తలప భావ భేదములే కాని"**

**గృహోపకరణాలు :** అందరికీ బాగా పరిచయమైన వస్తువులతో భక్తి జ్ఞానాంశాల్ని తెలియజెప్పితే సులభంగా అర్థం చేసుకొంటారని పదకవులు భావించారు. భగవంతుడు మానవులచే కర్మలను చేయిస్తున్నా వాటి మంచి, చెడు ఫలితాల్ని మానవులే అనుభవించాలి. కానీ దేవునికి అంటవు. కొబ్బరి చిప్పకు మూరెడు కర్రలాంటిది అమర్చి చేసిన అబక వేడిని చితిదాకా ప్రసరించదు కదా అంటారు.

**"ఆతల అబక ముంచినట్టి వేడి చెయ్యంటదు**
**జాతి దేహము మోచిన సహజమింతె" (7-54)**

ఇటువంటి గృహోపకరణాలు ఇంకా "తిత్తిలో సుఖమునకు తిరిగె ప్రాణి" (1-159), కంచం (12-155), కూటికుండ (24-191), పళ్ళేలు (9-10), బిందె (17-389), మూత (11-3-5), ఉయ్యాలమంచం (12-13), దివ్వె (29-127), వంటశాల (7-184) మొదలగునవి తెలిపారు.

**వంటకాలు :** భారతదేశంలో ఏ దేవునికి గాని లేని పద్ధతుల్లో రకరకాల వంటకాల్ని శ్రీ వేంకటేశ్వరునికి అర్పిస్తారు. అందువల్లే వాటిని అన్నమయ్య భావితరాల వారికి తెలియజేయడానికి తమ కీర్తనల్లో అమర్చారు.

అదుకులు, చక్కిలాలు, ఆనవాలు, మరుగులు, వడపప్పు మొదలగు వంటకాలు చెప్పబడ్డాయి.

**"ఇందిర వడ్డించగా ఇంపుగా చిందకుండా**
**అక్కాళ పాశాలు నప్పాలు వడలు**
**పెక్కైన సయుందంపు పేణులును" (1-22)**

వర్ణించారు. ఇంకా మిరియపు తాళింపు కూరలు, కమ్మని పచ్చళ్ళు, పిండివంటలు, పెరుగులు, దధ్యన్నములు (4-4), నానబియ్యాలు (5-159), పరమాన్నములు (4-4) మొదలగు చద్ది, పంచదార, తేనె, అంబలి, బువ్వ మొదలగునవి నాయికను వర్ణిస్తూ భోజనంతో పోల్చారు.

కుటుంబం తదుపరి స్థానం ఆక్రమించేది జీవనోపాధి కుటుంబ పోషనార్ధం నాటి నుండీ నేటివరకూ మానవుడు అనేక వృత్తులను చేసుకుంటూ జీవిస్తున్నాడు.

## వృత్తులు

**వ్యవసాయం :** రాయలసీమ ప్రాంతంలో కాపులు అంటే రైతులు అనీ, రెడ్డి కులస్థులు వ్యవసాయం చేసేవారనీ నాటికాలంలో "కాపులము మేము కర్తవు నీవు" (9-198), వీరి పేర్ల చివర రెడ్డి చేర్చబడి ఉంటుందని :

**"తిమ్మిరెడ్డి మాకు నిచ్చె దిష్టమైన పొలము**
**బొమ్మిరెడ్డి కప్పగించి పోదిసేసి పొలము" (10-52)**

**వర్తకం :** నాటి కాలంలో వ్యవసాయం తరువాత నేత వర్తకం, చల్ల అమ్మకం, వైద్య వృత్తి మొదలగునవి కీర్తనల్లో కనిపిస్తాయి.

**"వాడవాడల వెంట వాడివో వాడివో**
**నీడ నుండి చీరలమ్మే నేత బేహారి"**

**చల్ల అమ్మకం :** అన్నమయ్య తమ సమకాలంలో ప్రాతఃకాలంలో గోపికలు తమ సమీప పట్టణాలకు చల్ల అమ్మడం, వారి నడక, కరచరణాల కదలికలు, వారు చల్ల అమ్మేటప్పుడు పాడే పాటలు బాగా పరిశీలించి వర్ణించాడు.

**"సంపెంగల తురుముతో చల్లలమ్మీనిదివో**
**వంపు మోము గొల్లెత వాడలను"   (12-372)**

**వైద్యవృత్తి :** పూర్వకాలంలో ఆయుర్వేదంలో భస్మాలు, లేహ్యాలు, చూర్ణాలు, రసాయన కషాయాలు మొదలగునవి రోగ నివారణకు వాడేవారు. శ్రీహరిని ముందుగా అభివర్ణించి ఈ మందు ప్రీతికరమనీ, చల్లనిదని, భవరోగాల్ని పోగొట్టెదనీ, ఆయుష్షును పెంచేదనీ, కోనేటి సమీపంలో ఉందనీ, లోకమంతా నిండిందనీ పేర్కొన్నారు.

**"కొనరో కొనరో మీరు కూరిమి మందు**
**వునికి మనికి కెల్ల నొక్కటే మందు"   (1-237)**

ఆనాటి వైద్యులు వూరూరా తిరుగుతూ జబ్బుల్ని నయం చేసుకొన్న వారి పేర్లను తెల్పి రోగులకు, రోగులకు ఉత్సాహం కలిగించేవారు. పూర్వం ధృవుడు, ప్రహ్లాదుడు, నారదుడు మొదలగువారు నాలుగు యుగాల రాజులు ఈ ముందునుకొని చరితార్థులయ్యారని వర్ణించారు. ఇవేకాక కమ్మరి, కుమ్మరి, బొమ్మల వృత్తులలో రాతిబొమ్మ, మాని బొమ్మ, తోలు బొమ్మ(5-189) వృత్తులున్నాయని చెప్పవచ్చు. చెంబుమీది కనకపు బూత (7-1), పూస పనిని గూర్తి ఛక్కపూస కపురులు (7-34) లో కీర్తనల్లో ప్రస్తావించారు.

**వస్తుమారకం :** అన్నమాచార్యుని కీర్తనల్లో 5, 6, 11 సంపుటలయందలి కీర్తనల ద్వారా తెలుయుచున్నది :

**"రూకలై మాడలై రువ్వలై తిరిగీని**
**దాకొని ఉన్నచోట తానుండ దదివో"   (5-283)**

వీనిలో రూక, మాడ, రువ్వలు బంగారునాణేలనీ, కాసు అనేది రాగి నాణెమనీ ఆచార్య వేటూరి ఆనందమూర్తి గారు తాళ్ళపాక కవుల పదకవితలు - భాషా ప్రయోగ విశేషాలు (పుట 498)లో చెప్పారు.

**కొలతలు :** అన్నమయ్య నాయికల సౌందర్యాన్ని, ఆమె చేష్టలను చెప్పడానికి కొలతల్ని ప్రయోగించాడు. ఉదాహరణకి పట్టెడేసి గుబ్బలు, చారెడేసి కన్నులు, మాటల్ని గాదెడేసే, పొందుల్ని పుట్టెడేసి వలపుల్ని, నిలివెడేసి (13-154) వర్ణించగా ఇప్పటికీ రాయలసీమలోని పల్లె ప్రాంతాలలో చాటడేసి, పుట్టెడేసి, చిట్టెడేసి, దుత్తడేసి అనే కొలతల్ని వాడుతున్నారు.

**వేషాలంకరణ :** వ్యక్తి జీవితంలో విడదీయరాని ముఖ్యాంశం వేషభాషలు. వీటిని నాటి భారతీయ సంస్కృతీ సాంప్రదాయాలకు పట్టుగొమ్మలనవచ్చును. ఈ కీర్తనలలోని వేషాలంకరణలను వస్త్రాలు, మైపూతలు, ఆభరణఅలు, పూలు, కేశాలంకరణగా విభజిటంచడం జరిగింది.

**(1) వస్త్రాలు :** పదకవితా పితామహుడు వారి కీర్తనలలో నాటికాలంలో స్త్రీ పురుషులు ధరించే రకరకాల వస్త్రాలను ఆయా సందర్భాలలో వర్ణించారు.

మెరుగు పయ్యెద (27-196), నీలి చీర (27-154), బంగారు పువ్వుల జీర (28-212), పసుపు చీర (73-370), పసిడి చీర (28-64), దుప్పటి (32-209), అంచుల తీగరు చీర (12-103).

**(2) మైపూతలు** : దివ్య నాయికా నాయకుల సౌందర్యాన్ని వర్ణించేటప్పుడు మైపూతలను పేర్కొన్నారు. వీరి కీర్తనల్లో చల్లని గంధం (27-424, 26-7, 420, 537), చందనం (31-4), కస్తూరి (26-7, 28-168, 563), పన్నీటి సోనలు, కర్పూరం, జవ్వాది, లత్తక, తట్టుపుణుగు (32-110) మొదలగు రకాలుగా ప్రస్తావించబడ్డాయి.

**ఆభరణాలు** : స్త్రీ సౌందర్యాన్ని ఇనుమడింపజేసి, ఆకర్షణను, అందాన్ని కల్గించేవి ఆభరణఆలు. అన్నమయ్య తమ కీర్తనల్లో అలంకరణలు, ఆభరణాలు పేర్కొన్నారు. ఒడ్డాణం (13-434), ముంజేతి సొమ్ములు (32-60), ఉంగరం (32-381), ముత్యాల కమ్మలు (32-60), కంఠసరులు (32-242), నీలాలదండ (32-95), ముద్దుటుంగరం (32-320), అందెలు (32-218), ముక్కెర (32-301), మాణిక్యం (32-218), చంద్రవంక బొట్టు (32-60), కస్తూరి వజ్రువ బొట్టు (32-239), లత్తుకబొట్టు (32-224) మొదలగు అరంకరణలు కనిపిస్తాయి.

**పూలు** : స్త్రీ వేషభూషాలంకరణలో పూలు ప్రముఖ స్థానం వహిస్తాయి. ఈ కీర్తనలలో నాయికా నాయికలు ధరించిన, ప్రస్తావించిన పూలను పేర్కొనటం జరిగింది. ఉదాహరణకు మొల్ల విరులు (28-210), సంపెంగలు (26-213), కలువదండ (27-418), జాజిదండ (30-236), దవనం (30-236), తామరపూలు (30-236) మొదలగు పూలను కోకొల్లలుగా పేర్కొన్నారు.

**కేశాలంకరణ** : స్త్రీ అలంకరణలో వెంట్రుకలకు సముచిత స్థానం ఉంది. కేశాలంకరణను జడ, కొప్పు, తురుము, నీలాలు, ముంగురులు అనే పదాలను కీర్తనలలో వాడారు. ఆనాటి ఆచారంలో కొప్పుకు పర్యాయపదాలుగా కొప్పు నీలాలు, జారు కొప్పు, నిలువు కొప్పు, వీడిన తురుము, నిలువు తురుము మొదలగునవి వాడారు. వీనిలో పెను కొప్పు, ఉన్నత కొప్పు, మూరదంత కొప్పు మొదలగునవి కేశాల బలాన్ని, వత్తుదనాన్ని సూచిస్తున్నాయి (28-117, 211, 212, 205, 117, 301).

**సామాజికాంశాలు**

**భాషావిశేషాలు** : ఈ సంకీర్తనల్లో సామెతలు, జాతీయాలు, జంటపదాలు, పూలలో దారంలా ఒదిగిపోయి ఉంటాయి. అన్నమయ్య రచనల్లో వాడబడిన పదాంశాలు కొన్ని సామెతలుగా, జాతీయాలుగా జనవ్యవహారంలో నిలిచిపోయాయి.

**కులము :** ఆనాటి కాలంలో బ్రాహ్మణులు మిగతావారికన్నా వేషభాషల్లో, ఆచారాల్లో భిన్నంగా ఉండేలిరు. వారు జంధ్యాలు ధరించేవారని, జోడి తలలతో ఉండడం, గోచీ కట్టుకోవడం చేసేవారని ఈ క్రింది కీర్తనల ద్వారా తెలుస్తున్నది.

> **"పేగుల జంధ్యాలు వేసి పెంచపు నెమలి పురి...**
> **బత్తుడైన చక్కని నా బాపన్నయ్య వీడివో" (12-254)**

వీరేకాక నాటి సమాజంలో బోయవారు, చెంచితలు, రెడ్లు, గొల్లవారు మొదలగువారు ఉండేవారని కొన్ని కీర్తనల ద్వారా తెలుస్తున్నది. ఉదాహరణ :

> **"కొంగు పట్టకంత నీవు గొల్ల బోయడా**
> **కుంగక నీకు మొక్కేము గొల్ల బోయడా"**

అని దశావతారాలను వర్ణించారు.

ఎన్ని కులాల గురించి పేర్కొన్నా, చివరకు కుల భేదాలను ఖండించారు. వేదాంత పఠనం చేస్తున్నా, హరి భక్తిలేని సన్యాసికన్నా దేవుని వెతకి తెలుసుకొన్న అంతిమ జాతి కులస్తుడు గొప్పవాడు అని ప్రబోధించాడు. సృష్టిలో హీనం, అధికం లేవని, పంచభూతాలకు లేని కుల, జాతి భేదాలు మానవాళిలో ఉండనక్కరలేదని లోకానికి చాటిచెప్పాడు.

**మతాలు :** మతం ప్రజల జీవన విధానానికి సంబంధించినది. దేశకాల పరిస్థితులు, ప్రజల అభిరుచి, మనస్తత్వం మొదలగువాటిపై మతం ఆధారపడి వుంటుంది. మహనీయుల సిద్ధాంతాల ద్వారా మతాలు ఏర్పడతాయి. ఎందరో మహానుభావులు ఈ భారత భూమిలో అవతరించి సంస్కారాలను ఆచరించారు. ఎన్నో నీతులనువదేశించారు. వారు ప్రబోధించిన మార్గాలే మతాలుగా వ్యవహరింపబడుతున్నాయి. ఆనాటి ప్రజలు ఆరు శాస్త్రాలతో, ఆరు మతాలతో వాదించుకొంటూ ప్రధాన దైవమైన శ్రీ వేంకటేశ్వరుని పూజించనివారిపట్ల ఎంతో ఆవేదన వ్యక్తం చేశారు అన్నమయ్య.

> **"ఆరు శాస్త్రములవారు మతంబుల వారు కర్మములనైనాను**
> **ఈ రీతుల మిము కొలువగ ఎవ్వరికుపాయము లేదు" (7-128)**

ఆకాలంలో రామానుజులవారు వచ్చి ఆ శ్రీహరి అవతారమే శ్రీ వేంకటేశ్వరుడని తెలిపారని తనకు రామానుజ మతమే ప్రామాణికమని తెలిపారు.

> **"మతి రామానుజ మతమే నాకును**
> **చతురత మెరిసిన సంధ్య" (1-10)**

**విశ్వాసం :** తమ తమ కాలాల్లో ప్రజల్లోనో లేక పెద్దల ద్వారా సంప్రాప్తించిన విశ్వాసాలను కొన్నింటిని తమ కీర్తనలలో పొందుపరిచారు అన్నమయ్య. కొన్నింటికి

కారణాలుండవచ్చు. కొన్నింటిని లేకపోనూవచ్చు. కానీ విశ్వాసాలను ఏర్పరచుకొంటారు.

**"నారాయణ నీ నామము మంత్రించి వేసి**
**పారేటి యీ జంతువుల భ్రమ విడిపింపవే" (3-494)**

అని నారాయణుపై తనకుగల ప్రగాఢ విశ్వాసాన్ని తెలియజేస్తారు.

**పండుగలు, నోములు :** భారతీయ సంస్కృతికి అద్దం పట్టేవి పండుగలు, నోములు, వ్రతాలు మొదలగునవి. ఇవి మనుషులను దగ్గరచేసి అనుబంధ బాంధవ్యాలను పెంచుతాయి. ఆరోగ్యాన్ని, ఆనందాన్ని కలిగిస్తాయి. ప్రజలలో ఉత్సాహాన్ని నింపి దైవభక్తిలో పారవశ్యాల్ని చేసేవే ఉత్సవాలు.

**"కొలని దోపరికి గొబ్బిళ్ళో యదు**
**కులము స్వామికిని యదు కులము స్వామికిన్ గొబ్బిళ్ళో" (12-98)**

**"వట్టి వలపు చల్లకు విష్ణుమూర్తి నాతో**
**వెట్టి దీర మాటాడు విష్ణుమూర్తి" (2-250)**

మొదలగు పాటలేకాక ఛాంగుభళా వంటి కోలాట పాటలను బట్టి ఆ కాలంలో దసరా, దీపావళి, సంక్రాంతి, ఉగాది మొదలగు పండుగలను ప్రజలు జరుపుకొనేవారని చెప్పవచ్చు.

**"జగడపు చనవుల జాజర**
**సగినల మంచపు జాజర" (12-274)**

అనే జాజర పాట వసంతోత్సవం నాటి పాటయని ఫాల్గుణ పౌర్ణమి నాడు కాముని పున్నమి లేక హోలీ పండుగను వివిధ రంగులు, సుగంధ ద్రవ్యాలు చల్లుకొంటూ ఆనందంగా జరుపుకొనేవారని చెప్పవచ్చు.

అన్నమయ్య సంకీర్తనలలో శ్రీరామ, శ్రీకృష్ణ, హనుమ, నరసింహ జయంతులు కన్పిస్తాయి.

**"నరులాల నేడువో నారసింహ జయంతి**
**సురలకు నానందమై శుభములొసగెను" (11-14)**

**"విజయ పుటమువేసే వేంకటేసుడు**
**విజయ సఖుడు ఈ వేదము రీతి" (9-183)**

అనే సంకీర్తనలనుబట్టి చెప్పవచ్చు.

**నోములు, వ్రతాలు :** నాటికాలంలో ప్రజలకు మతంపట్ల, దైవంపట్ల అనురక్తి, దైవభక్తి ఎక్కువేనని చెప్పవచ్చు. ఈ సృష్టిలో అతీతమైన శక్తి ఉందని వారు భావించేవారు.

నాటి కాలంలో స్త్రీలు వ్రతాలు, నోములు ఎంతో భక్తిశ్రద్ధాసక్తులతో జరుపుకొనేవారని కొన్ని సంకీర్తనల ద్వారా తెలుస్తున్నది. స్త్రీలు తమ కోర్కెలు తీరడం కోసం వ్రతాలు, నోములు ఆచరించడం నేటికీ ప్రబలంగానే వుంది. నాటి నోముల విశేషాలను అన్నమయ్య ఈ క్రింది సంకీర్తనల్లో పొందుపరిచారు :

**"భామనోచిన నోము ఫలము సఫలముగాను**
**కామ తాపంబునకు కాండవము నోమే"**

ఇంకా చిట్టిబొట్ల నోము, మొలకనోము, మోనదాగెల నోము, ననుకుల నోము, వెన్నెల మించులటు నోము మొదలగు నోములు నోచిన శ్రీ పద్మావతీ దేవికి శ్రీ వేంకటేశ్వరుని కౌగిలిలో నిత్య కళ్యాణపు నోము సిద్ధించిందని అన్నమయ్య వర్ణించాడు.

**కనుమలు, కోటలు :** తమ గ్రామ పరిసరాలపై ఎంతో మక్కువతో అన్నమయ్య వైష్ణవులు అభిమానించే దివ్య తిరపతులతోపాటు పరిసరాలలోని కోటల్నీ, కోనల్నీ ఎంతో చక్కగా వర్ణించి, వాటి పేర్లని కీర్తనల్లో శాశ్వతం చేశారు.

**"సొంపుల నీ వ దనపు సోమశిల కనుమ**
**ఇంపులెల్ల జేకొనంగ నిల్లు నీపతికి"**

అనే కీర్తనలలో నాయికా సౌందర్యాన్ని వర్ణిస్తూ, కటిని గద్దెరాతి కనుమతో పోల్చగా కాలాంతరంలో ఇది సుద్దరాతి కనుమగా వ్యవహరించబడుతుంది. కడపజిల్లా రాజంపేట తాలూకా తాళ్ళపాక సమీపంలో ఉన్నది. అధరాల్ని ఎఱ్రశిల కనుమతో పోల్చగా ఇది ప్రస్తుతం కడియాల పల్లె కనుమగా వ్యవహరించబడుతూ పోలి అప్పరాజుపేట సమీపంలో ఉంది. మనసున దొంగలసాని కనుమతో పోల్చారు. ఇది సిద్ధవటం తాలూకా ఓబుళం దగ్గరలో ఉంది. వక్షస్థలాన్ని గుబ్బలికొండతో పోల్చారు. నాగేళ్ళ కనుమగా వ్యవహరించబడుతూ లేబాకు సమీపంలో నడిగడ్డ దగ్గర ఉంది. ఈ కనుమల్లో ప్రతి కనుమ దగ్గర ఏదో ఒకవైపు చెన్నకేశవ స్వామి వారి ఆలయాలు ఉన్నాయి. వీటిలో కొన్ని శిధిలావస్థలో ఉన్నాయి. ఇవి షట్చక్రాకృతిలో ఉన్నాయనీ, షట్కోణాంతర్గతాలనీ ప్రతీతి.

అన్నమయ్య మానవ శరీరాన్ని కోటలతో పోల్చారు. తన కాలంలోని దుర్గాలలోని పలురకాల కోటలను మనం వారి కీర్తనల్లో చూడవచ్చు.

**"నడచప్పరములనే నలువైన కోట**
**దఱిసిన చెవుల మించు సవరణకోట" (6-84)**

ఈ కీర్తనలో బలుకోట, దొడ్డతోలు కోట, కొత్తలాలుకోట, వంకదార కోట, తవుకుల కోట, దంతెరాల కోట, నలువైన కోట ఉండేవని చెప్పవచ్చు.

**రాజకీయ పరిస్థితులు :** అన్నమయ్యకాలంలో రాజుల పాలన ఉండేది. రాజుల ఆగ్రహం, అనుగ్రహం, వారివారి మనస్తత్వాల మీద, పరిస్థితుల మీద ఆధారపడి ఉండేది. తన మీద కీర్తనలను వ్రాయలేదని సాళువ నరసింహరాయలు అన్నమయ్యను కారాగారములో ఉంచాడు.

**"అకటివేళల నలపైన వేళను తేకువ హరినామము**
**దిక్కు మరిలేదు సంకెల పెట్టిన వేళ, చంపబిలిచిన వేళ"**

అని గానం చేసి శృంఖలావిముక్తుడయ్యాడు. దీనినిబట్టి నాటికాలంలో రాజులు అహంకారులు, విలాసవంతులుగా ఉండేవారని, వారు సాహిత్య పిపాసకులని చెప్పవచ్చు. అడవిలో ఏ జంతువుగానో, పక్షిగానో పుట్టవచ్చుగానీ ఇతరులను సేవించగూడదనీ, పోకూడని చోట్లకు పోకూడదని ప్రబోధించారు.

**ఆటలు, వినోదాలు :** మానసికోల్లాసానికి, శారీరక ఆరోగ్యానికి పిల్లలు, పెద్దలు నాటి నుండి నేటివరకు ఆటలు, వినోదాలలో పాల్గొంటూనే ఉన్నారు. ఈ సంకీర్తనలలో శ్రీకృష్ణుని లీలా వర్ణనలతో నాయికానాయకుల సరససల్లాపాలను వర్ణించే సందర్భాలలోను అనేక ఆటలను వ్యక్తం చేశారు.

ఉదాహరణకు గునిసి ఆట, పిల్లదీపు ఆట, చెట్టాపట్టాలాట, దాగిలిముచ్చులాట, సముద్ర బిళ్లలాట, చదరంగం మొదలగునవి వినోదాలుగా పులిజూదం, తోలుబొమ్మలాట, కీలుబొమ్మలాట, నాటకాలు, ఇంద్రజాల విద్యలు ఉండేవి.

**జానపద సంకీర్తనలు :** పదకవులైన అన్నమయ్య తాను చెప్పవలసిన ధర్మాలను, భక్తి అంశాలను, దైవ సంబంధ విషయాలను జానపదుల రీతిని చొప్పించి పండిత పామర జనరంజకంగా వ్రాశారు. ఉదాహరణకు మేల్కొల్పు పాటలు, సువ్వి పాటలు, అల్లో నేరెళ్ళు, గొబ్బి పాటలు, తందాన పాటలు, కోలాటం పాటలు, సంవాద గీతాలు, పెండ్లి పాటలు, శోభనం పాటలు, హారతి పాటలు, లాలి జోలపాటలు, చందమామ, తాత్విక గేయాలు, దశావతార కీర్తనలు మొదలగు కీర్తనల ద్వారా నాటినుండి నేటివరకూ జానపద రీతులతో రచించిన కీర్తనలు ఆబాలగోపాలాన్ని అలరిస్తున్నాయి.

ఈవిధంగా అన్నమయ్య సాహిత్యం రంజింపజేస్తుంది, పరవశింపజేస్తుంది, తుదకు ఉపదేశమిస్తుంది. ఎల్లరి మనసు ఆయన కీర్తనలలో ఆనందడోలికలూగి, శృంగార కీర్తనలలో మునకలు వేసినా చివరకు ఆధ్యాత్మికత ఆత్మను పరమాత్ముని వైపు మళ్ళించి మోక్షమార్గం వైపు పయనింపజేస్తుంది.

***

# అన్నమయ్య - చారిత్రక భక్తులు

**డా॥ డి. నల్లన్న**
**అసిస్టెంట్ ప్రొఫెసర్**
**తెలుగు విభాగం**
**రాష్ట్రీయ సంస్కృత విద్యాపీఠం, తిరుపతి**

ఆంధ్రుల అదృష్టం వరించిన అభ్యున్నత రూపమే అన్నమయ్య. తెలుగు తేజాన్ని నేల నాలుగు చెరుగులా వ్యాపింపజేయడమే గాక వైకుంఠం దాకా తీసుకెళ్లిన ఘనత కూడా ఆయనకే దక్కుతుంది. సంకీర్తనోన్ముఖంగా సాగినప్పటికి సరైన రూపురేఖలు కోసం ఆరాటపడి అలమటించిన తెలుగు గేయాన్ని సంకీర్తనగా మలచి సమున్నత స్థితికి చేర్చిన సంకీర్తనాచార్యుడు తాళ్లపాక అన్నమయ్య. పల్లవి, అనుపల్లవి, చరణాలు, అంకితముద్ర వంటి అనేక అంశాలతో కూడుకొన్న సంకీర్తన ఈ మహనీయుని మస్తిష్కం నుంచే మనకు లభించింది.

అన్నమయ్య సంస్కృత సంకీర్తనలు రాయడమేగాక ఆనాటి పండితభాషను కూడా వాడి పండితుల మేధస్సుకు కూడా పదునుపెట్టాడు. వారి మెప్పుకు పాత్రుడయ్యాడు. జానపదుల భాషను, జానపద బాణీలను జనపదాలలో చోటుచేసుకొనే సాధారణాంశాలు తన పాటలలో నిక్షిప్తం చేసి జానపదుల హృదయాలను కదిలించి ద్రవింపజేసి మొనగాడనిపించుకున్నాడు. అటు పండితులను, పామరులను మెప్పించి వీరి ఆలోచనలను తిరువేంకటాదీశుని వైపుకు నడిపించాడు.

వేంకటేశ్వర మహిమలను, విష్ణుదేవుని వివిధ లీలలను తెలుగువారికి తెలియజేసి విష్ణుభక్తి విరాజిల్లేట్టు చేశాడు. నీతులు, లోకరీతులు, భక్తుల చేతలు శ్రోతల దృష్టికి తెచ్చి మంచి అవగాహన ఏర్పడేందుకు దోహదం చేశాడు. అలిమేలుమంగ వేంకటేశ్వరుల, గోపికా కృష్ణుల ప్రణయ తత్వాన్ని ప్రస్తుతించి మధురభక్తి మార్గాన్ని మనోదృగ్గోచరం చేశాడు. వీటన్నిటిని దృష్టిలో పెట్టుకొని తాళ్లపాక చినతిరుమలాచార్యుడు అన్నమయ్య కృతులను అత్యుత్తమాలుగా అభివర్ణించాడు.

**"శృతులై శాస్త్రములై పురాణకథలై సుజ్ఞాన సారంబులై**
**యతిలోకాగమ వీధులై వివిధ మంత్రార్థంబులై నీతులై**
**కృతులై వేంకటశైల వల్లభ రతిక్రీడా రహస్యంబులై**
**నుతులై తాళులపాకయన్నయవచోనూత్నక్రియల్ చెన్నగున్"**

ఇవేగాక పలురకాలుగా పడిదవిల్లే అన్నమయ్య కీర్తనల్లో చారిత్రక భక్తులను సంస్మరించే కీర్తనలు కూడా ఉన్నాయి. వాటిని ఆధారంగా చేసుకొని అన్నమయ్య స్మరించిన చారిత్రక భక్తులను సదస్సుకు పరిచయం చేయడమే పత్ర పరమావధి.

అన్నమయ్య తన అధ్యాత్మిక సంకీర్తనల్లో అనేకమంది భక్తులను స్మరించి కీర్తించాడు. వివిధ కాలాలకు చెందిన వారిని వినుతించి వినుతికెక్కాడు. ఈ విధంగా భక్తులను కొనియాడడంల్లో అన్నమయ్య ఆశించిన ప్రయోజనాలు రెండు. 1. తనను స్మరించడం కంటే తన భక్తులను స్మరిస్తే భగవంతుడు పరమప్రీతుడవు తాడని ప్రతీతి. కాబట్టి భక్తులను స్మరించి భగవంతుణ్ణి ప్రసన్నుణ్ణి చేసుకోవడం మొదటి ప్రయోజనం. భక్తుల చరిత్రలు విన్నప్పుడు వాటిని మననం చేసుకొన్నప్పుడు మనం కూడా వారిలాగే జీవించాలనే కోరిక కలుగుతుంది. తద్వారా సామాన్యులు కూడా భక్తులయ్యే అవకాశముంది. దీన్ని దృష్టిలో ఉంచుకొని భక్తుల సంఖ్య పెంచాలన్నదే అన్నమయ్య రెండవ ఉద్దేశం కావచ్చు. ఈ సందర్భంగా ఆంధ్ర మహాభారతం పద్యం ఒకటి గుర్తు చేసుకోవడం సమంజసం. యయాతి మహారాజు కుమారుడికి పట్టాభిషేకం చేసి అతనికి కొన్ని నీతులు చెప్పాడు. వాటికి సంబంధించినదే ఈ పద్యం.

**"ఎరుక గలవారి చరితలు**
**గరచుచు సజ్జనుల గోష్ఠి కదలక ధర్మం**
**బెరుగుచు నెరిగినదానిని**
**మరువకనుష్ఠించునది సమంజస బుద్ధిన్"**[1]

అన్నమయ్య స్మరించిన భక్తులను రెండురకాలుగా వర్గీకరించుకోవచ్చు. మొదటివర్గానికి చెందినవారు పౌరాణిక భక్తులు కాగా, రెండవ వర్గానికి చెందినవారు చారిత్రక భక్తులు. అన్నమయ్య స్మరించిన చారిత్రక భక్తులను రేఖామాత్రంగా మీ ముందుంచే ప్రయత్నం చేస్తాను.

అన్నమయ్య స్మరించిన చారిత్రక భక్తుల్లో మొదట పేర్కొనదగినవారు ఆళ్వార్లు. ఈ ఆళ్వార్లు పన్నిద్దరు. వీరంతా తమిళులే. తమిళదేశంలోని వివిధ ప్రాంతాలకు చెందినవారు. వివిధ కులాలకు చెందినవారు. వైష్ణవాన్ని వసుధతలం మీద వ్యాప్తి చేసేందుకు విష్ణుదేవుని వస్తువాహన పరిజనమే ఆళ్వార్లుగా జన్మించారనీ వైష్ణవుల విశ్వాసం. పన్నెందు మంది ఆళ్వారులలో పదుగురు తిరుమల శ్రీ వేంకటేశ్వరస్వామిని, తిరుమల ఘనతను తమ పాశురాలలో ప్రస్తుతించారు. ఆళ్వార్లు రచించిన పాశురాలన్నింటినీ శ్రీమన్నాథముని అనే ఆచార్యపురుషుడు సంకలనం చేసి ప్రచారంలోకి తీసుకువచ్చాడు. ఈ పాశురాలను నాలాయర్ దివ్యప్రబంధం అని వ్యవహరిస్తారు. నాలుగువేలతో కూడిన ఈ ప్రబంధం వైష్ణవులకు పారాయణ గ్రంథం.

అన్నమయ్య తిరుమలకు వచ్చి ఘనవిష్ణువు దగ్గర దీక్ష పొంది వైష్ణవుడయ్యాడు. ఇక్కడే కొంతమేరకు వైష్ణవాగమాలను విని ఉండవచ్చు. ఆళ్వార్లు గురించి వినే అవకాశం కూడా తిరుమల మీదనే లభించి ఉండవచ్చు. తరువాత అహోబిలం వెళ్లి అక్కడి

---

1. శ్రీమదాంధ్ర మహాభారతం; ఆదిపర్వం, తృతీయాశ్వాసం-(203), పుట-295.

మతసంస్థాపకుడయిన ఆదివన్ శఠగోపయతి దగ్గర అన్నమయ్య వైష్ణవ ఆగమాలను అభ్యసించాడు. అప్పుడే ఆళ్వార్లు గురించి, వారి దివ్య ప్రబంధం గురించి క్షుణ్ణంగా అతడు తెలుసుకొని ఉంటాడు.

**నమ్మాళ్వారు :**

అన్నమయ్య కీర్తనలలో అనేకచోట్ల 'తిరువాముడి' అనే శబ్దం కనిపిస్తుంది. తిరువాముడి అంటే 'తిరువాయుమొళి'. ఇది నమ్మాళ్వారు రచించిన ప్రబంధం. దీన్నిబట్టి అవయ నమ్మాళ్వారు గురించి ఈయనకు తెలిసినట్లు బోధపడుతుంది. అన్నమయ్య ఒక కీర్తనలో-

**"కారిమార సుతుని చక్కని మాటలకు జొక్కి**
**చూరగా వేదాలగుట్టు చూపినవాడు"** **(1-121)**

అని విష్ణుదేవుడు అన్నమయ్యకు వేదరహస్యాన్ని బోధపరచిన వైనం తేటపరచాడు.

నమ్మాళ్వారుకు 'మారన్', 'కారిమారన్', 'వకుళాభరణుడు', శఠగోపుడు మొదలైన పేర్లెన్నో వున్నాయి. విష్ణువు ఇతనిని మన ఆళ్వారు అని సంబోధించాడట. తమిళంలో 'నమ్' అంటే 'మన' అని అర్థం. అందుకే మన ఆళ్వారు 'నమ్మాళ్వారు' అయ్యాడు. ఈయన తిరువాసిరియం, పెరియతిరువందాది, తిరువిరుత్తమ్, తిరువాయిమొళి అనే పేర్లతో నాలుగు ప్రబంధాలు రచించాడు. వీటినే చతుర్వేద తుల్యాలని, చతుర్వేదసార నిక్షిప్తాలని వైష్ణవులు చెబుతారు. నమ్మాళ్వార్ తన ప్రబంధాలేగాక తక్కిన ఆళ్వార్ల ప్రబంధాలు కూడా జనంలోకి వెళ్లేందుకు దోహదం చేశాడు. అందుకే నమ్మాళ్వారు ఆళ్వార్లలోను, ఆచార్యుల్లోను అగ్రతాంబూలం అందుకోవడమే కాకుండా వైష్ణవులందరికీ ఆదర్శప్రాయుడుగా విష్ణు సదృశుడుగా వాళ్ల మనసుల్లో నిలిచిపోయాడు.

**పెరియాళ్వారు :**

**"పెరియాళువారి బిడ్డ పిసికి పై వేసిన**
**విరుల దండల మెడ వేసినవాడు"** **(1-121)**

అని అన్నమయ్య తన సంకీర్తనలో పేర్కొనడం వల్ల పెరియాళ్వారును అతని పెంపుడు బిడ్డ 'ఆండాళ్'ను స్మరించినట్లయింది.

పెరియాళ్వారునే విష్ణుచిత్తుడంటారు. ఈయన గరుడాంశంలో జన్మించినట్లు వైష్ణవుల నమ్మకం. పెరియాళ్వారు శ్రీవిల్లిపుత్తూరులో వెలసిన వటపత్రశాయికి మాలాకైంకర్యం చేస్తుండేవాడు. ఆ స్వామి సూచనమేరకు మదురై నగరానికి వెళ్లి పాండ్యరాజు కొలువులో అన్యమతస్తులతో వాదించి నారాయణుడే పరదైవమని, వైష్ణవమే శ్రేష్ఠమని నిరూపించాడు. పాండ్యరాజు సంతృప్తుడయి, సంతుష్టుడయి

విష్ణుచిత్తుణ్ణి ఏనుగుపైన నగరవీధుల్లో ఊరేగించి సన్మానించాడు. లక్ష్మీనారాయణులు స్వయంగా వచ్చి ఆ దృశ్యాన్ని తిలకించారు. విష్ణుచిత్తుడు 'తిరుపల్లాండు' పాడి విష్ణుదంపతులకు మంగళాశాసనం చేశాడు.

తన నందవనంలో ఒక తులసిమొక్క కుదురులో శిశువు రూపంగా లభించిన గోదాదేవిని విష్ణుచిత్తుడు పెంచి పెద్దచేశాడు. ఆమెకు విష్ణులీలలను, విష్ణు మహిమలను వినిపించి విష్ణుభక్తిని కలిగించి రగిలించాడు. ఆమె విష్ణుదేవున్ని చేపట్టేందుకు దోహదం చేశాడు. తనలాంటి ఆళ్వారుగా ఆమె ఎదిగేందుకు అన్నిరకాల సదుపాయాలను సమకూర్చాడు.

పెరియాళ్వారు విష్ణువును శిశువుగా భావించి అతని పట్ల వాత్సల్య భక్తిని ప్రదర్శించాడు. తమిళ సాహిత్యంలో 'పిళ్లైతమిళ్' (శైశవ తమిళం) అనే కొత్త శాఖకు శ్రీకారం చుట్టాడు. ఈయన రచించిన ప్రబంధాలు రెండు 1. తిరుప్పల్లాండు 2. పెరియాళ్వారు తిరుమొళి.

**అండాళ్ :**

పైన తెలిపిన "పెరియాళువారి బిడ్డ పిసికి పైవేసిన
విరుల దండల మెడ వేసినవాడు" (1-121)

అనే సంకీర్తన చరణపాదంలో పెరియాళ్వారుతో పాటు అండాళ్ కూడా స్మరింప బడింది. ఆ పాదం ప్రకారమయితే అండాళే ప్రధానవ్యక్తి. సూడికొడుత్త నాచ్చియార్ అని, సూడికొడుత్త అమ్మ అనీ, అండాళ్‌ను అన్నమయ్య అనేకచోట్ల సంస్మరించాడు.

అండాళ్ మొదటిపేరు కోదై. కోదై అంటే స్త్రీ అని అర్థం. ఈ పేరును ఆధారంగా చేసుకొనే తెలుగువారు ముఖ్యంగా శ్రీకృష్ణదేవరాయలు 'గోదాదేవి' అనీ ఆమెను సంభావించాడు. ఈమెను సూడికొడుత్త అనీ సూడికొడుత్త నాచ్చియార్ అని తమిళులు వ్యవహరిస్తారు. పన్నిద్దరు ఆళ్వారులలో చోటుచేసుకొన్న ఏకైక మహిళ 'అండాళ్'.

గోదాదేవి పెరియాళ్వారు దగ్గర వైష్ణవాన్ని అభ్యసించింది. ఆకళింపు జేసుకుంది. జీర్ణంప జేసుకుంది. చిన్నప్పటి నుండి విష్ణుమూర్తినే వరుడుగా వరించి తరించింది. అతనికోసం ఆరాటపడింది. విరహంతో వేగిపోయింది. తాను స్వామికి తగిన విధంగా ఉందోలేదో అని తెలుసుకొనేందుకు తన తండ్రి విష్ణుచిత్తుడు స్వామికి సమర్పించబోయే మాలను దొంగచాటుగా ధరించి తన సౌందర్యాన్ని చూసుకొనేది. దీన్ని అపచారంగా భావించిన విష్ణుచిత్తుడు మాల లేకుండా వటపత్రశాయి దగ్గరకు వెళ్లినప్పుడు గోదాదేవి ధరించిన మాలలే తనకు అత్యంత ప్రియాలనీ వటపత్రశాయి సెలవిచ్చాడు. అప్పటి నుంచి ఆమె 'ఆండాళ్'గా (ఏలిన ఏణాక్షిగా) ప్రసిద్ధికెక్కింది.

మార్గశిర మాసంలో కన్నెపిల్లలు విష్ణువును ఉద్దేశించి నోచే నోమును దృష్టిలో పెట్టుకొని ఈమె 'తిరుప్పావై' అనే ప్రబంధాన్ని రచించింది. స్వామి పట్ల తనకు గల

విరహాన్ని, ఆర్తిని ఆవిష్కరించే విధంగా 'నాచియార్ తిరుమొళి' అనే ప్రబంధాన్ని రచించింది.

**తిరుమంగై ఆళ్వార్ :**

> **"తీరని వేడుకతో తిరుమంగయాళువారి**
> **ఆరడిముచ్చిలి కూటి కాసపడ్డవాడు"** (1-121)

అనడంవల్ల తిరుమంగై ఆళ్వారును, అతడు దారిదోపిడి చేసి భాగవతులకు అన్నదానం చేయడాన్ని అన్నమయ్య స్మరించినట్లయింది.

తిరుమంగై ఆళ్వారు మహాపండితుడు. మహాకవి. 'నార్కవి పెరుమాళ్' అనే బిరుదం కూడా ఇతనికి ఉండేది. కలియన్, కలికన్ఱి, నీలన్, పరకాలన్, అరుళ్‌మారి, అరట్టముకి అని ఈయనకు అనేక పేర్లుండేవి.

తిరుమంగై రాజధానిగా 'తిరువాళినాడు' ప్రాంతాన్ని పరిపాలించినందువల్ల ఈయనకు తిరుమంగై రాజు, తిరుమంగై ఆళ్వారు అనే పేర్లు ఏర్పడ్డాయి. నాలుగు విధాల కవిత్వం చెప్పే నేర్పు సంపాదించిన ఈయన చోళరాజు ప్రధాన సేనాధిపతిగా చోళుల కీర్తి విస్తరింపజేసాడు. తాను ప్రేమించిన మానిని మక్కువ మేరకు వైష్ణవదీక్ష తీసుకున్నాడు. రోజు 1008 మంది వైష్ణవ భాగవతులకు భాగవత సంతర్పణ చేశాడు. తన సంపద అంతా తరిగిపోవడంతో దారిదోపిడి చేసి వచ్చిన దానితో అన్నదానం చేశాడు. విష్ణువే స్వయంగా వచ్చి ఈయనకు 'అష్టాక్షరి' మంత్రోపదేశం చేశాడు. ఈ ఆళ్వారు శ్రీరంగంలోని ఆలయాన్ని పునరుద్ధరించాడు. ఎనభైకి పైగా దివ్యతిరుపతులను సందర్శించి వచ్చిన ఈ ఆళ్వారు వైష్ణవ వ్యాప్తిని దృష్టిలో ఉంచుకొని ఆరు ప్రబంధాలు రచించాడు. అవి పెరియతిరుమొళి, తిరుక్కురుందాండగం, తిరునెడుందాండగం, తిరువెళుక్కూర్ఱిరుక్కై, శిరియ తిరుమడల్, పెరియతిరుమడల్.

ఆళ్వారులు పన్నిద్దరు అయినప్పటికీ వారిలో నలుగురిని గురించి మాత్రమే అన్నమయ్య ప్రస్తావించినట్లు తెలుస్తుంది. ఆళ్వారుల తరువాత పేర్కొనదగినవారు ఆచార్య పురుషులు, ఆళ్వారులతో సమానంగా వైష్ణవ వ్యాప్తికి దోహదం చేసిన పెద్దలు. వీరి కోవలో మొదట పేర్కొనదగినవాడు తిరుక్కచ్చి నంబి.

**తిరుక్కచ్చినంబి :**

> **"కంచిలోన నుండ దిరుకచ్చి నంబి మీద గరు**
> **ణించి తన యెడకు రప్పించినవాడు"** (1-121)

అని అన్నమయ్య తిరుక్కచ్చినంబిని స్మరించాడు. తిరుక్కచ్చినంబిని కంచిపూర్ణుడు అని కూడా వ్యవహరిస్తారు. ఈయన చెన్నైయ్ సమీపంలోని పూందమల్లీలోని

వైశ్యకులంలో జన్మించాడు. వైష్ణవుడయ్యాడు. కంచి వరదరాజస్వామికి అంతరంగిక భక్తుడయ్యాడు. ఆ స్వామికి వింజామర వీస్తూ కైంకర్యం చేసేవాడు. వరదరాజ స్వామి తిరుక్కచ్చినంబితో మాట్లాడేవాడు. రామానుస్వామి సైతం తిరుక్కచ్చినంబి ద్వారానే వరదరాజస్వామి నుంచి సూచనలు పొందినట్లు ఐతిహ్యం. తిరుక్కచ్చినంబి భక్తికి మెచ్చి శ్రీవేంకటేశ్వరుడు తన దగ్గరకి రప్పించుకున్నాడట. తిరుక్కచ్చినంబి కొంతకాలం తిరుమలలో ఉన్న తరువాత అగ్నిగుండంలో ఉద్భవించిన వరదరాజ స్వామికే వింజామర కైంకర్యం చేయమని పంపివేసినట్లు చెబుతారు.

**తిరుమలనంబి :**

**"మచ్చిక దొలఁక దిరుమలనంబి తోడుత**
**నిచ్చనిచ్చ మాటలాడి నొచ్చినవాడు"** **(1-151)**

అనడం వల్ల తిరుమలనంబిని స్మరించినట్లయింది. తిరుమలనంబి అంటే తిరుమల భక్తుడు అని అభిప్రాయం. ఈయన రామానుజస్వామికి మేనమామ అని చెబుతారు. ఆయన రోజు తిరుమల శ్రీవారి సన్నిధి నుంచి క్రిందికి అలిపిరిదాకా వెళ్లి అక్కడ భగవద్రామానుల వారికి రామాయణ రహస్యాలను బోధించేవాడట.

తిరుమలనంబి శ్రీవారి అభిషేకం కోసం పాపవినాశ తీర్థం నుంచి నీరు తీసుకొని వచ్చేవాడు. శ్రీవారికి అతనిని అనుగ్రహించాలనిపించింది. నంబి నీరు తీసుకొని వస్తుండగా జలఘటానికి రంధ్రం వేసి ఆ నీరు తాగేవాడు. నంబి మళ్ళీ వెళ్లి నీరు తెచ్చేవాడు. తరువాత కొంతకాలానికి స్వామి ప్రత్యక్షమయి అంతదూరం పోవలసిన పనిలేదని ఆకాశగంగను సృజించి అక్కడి నుంచే నీరు తెచ్చే ఏర్పాటు చేశాడని పెద్దలు చెబుతారు. స్వామి అప్పుడు తిరుమలనంబితో మాట్లాడినట్లు తెలుస్తోంది.

**రామానుజస్వామి :**

**గతులన్ని ఖిలమైన కలియుగమందును**
**గతి యీతడే చూపే ఘన గురుదైవము** ॥పల్లవి॥

త్రిమతాచార్యులలో విశిష్టాద్వైత సంస్థాపకుడయిన రామానుజస్వామి మిక్కిలి ప్రసిద్ధి వహించాడు. ఇతడు వైష్ణవ వ్యాప్తికి ఎనలేని కృషి చేశాడు. అందువల్ల వైష్ణవులందరికి ఆరాధ్యుడయ్యాడు. ప్రస్థాన త్రయానికి విశిష్టాద్వైత పరంగా భాష్యం రచించి భాష్యకారుడని పేరు తెచ్చుకున్నాడు. రామానుజస్వామిని ఆదిశేషుని అవతారమని కూడా అంటారు. ఈయన యతిరాజు అనే పేరుతో కూడా పిలువబడ్డాడు.

రామానుజులు చెన్నై సమీపంలోని శ్రీ పెరుంబుదూరులో ఒక బ్రాహ్మణ కుటుంబంలో జన్మించాడు. కంచిలోని వేదప్రకాశుల వారి దగ్గర మొదట విద్య నభ్యసించాడు. తరువాత అతనికి దూరమై వైష్ణవాన్ని చేపట్టాడు. తిరుక్కచ్చినంబిని

ఆశ్రయించి వరదరాజస్వామి నుంచి హితోపదేశం పొందాడు. తిరుక్కోటియూర్‌కు పద్దెనిమిదిసార్లు కాలినడకన వెళ్లి తిరుక్కోటినంబి నుంచి మంత్రోపదేశం పొందాడు. శ్రీరంగాన్ని ప్రధాన కేంద్రంగా చేసుకొని విశిష్టాద్వైత వ్యాప్తికి చివరి శ్వాసదాకా కృషి చేశాడు. వైష్ణవులకు అనేక నియమాలు ఏర్పరచి విష్ణు సాయుజ్యం పొందేందుకు దోహదం చేశాడు: తిరుమలలో పూజాది విధులను ఏర్పరచి స్వామికి నిత్యకైంకర్యం చక్కగా జరిగేటట్టు కట్టిడి చేశాడు. తాను బ్రాహ్మణుడయినప్పటికీ బ్రాహ్మణేతరులను కూడా సమానంగా ఆదరించి వైష్ణవులకు కులం లేదని జగద్వితం చేశాడు. అందుకే వైష్ణవులు రామానుజస్వామిని మాటలాడే దైవమని వ్యవహరిస్తారు.

**అనంతళ్వార్ :**

> **"అచ్చపు.వేడుకతోడ ననంతాలు వారికి**
> **ముచ్చిలి వెట్టికి మన్ను మోచినవాడు"   (2-372)**

అనంతళ్వార్ భగవద్రామానుజుల వారి ఆదేశం మేరకు కైంకర్యం నిమిత్తం తిరుమలకు వచ్చాడు. స్వామికి మాలా కైంకర్యం చేస్తూ కొండమీదనే నివసించాడు. పుష్పవనాన్ని నిర్మించేందుకు అక్కడ గుంట తవ్వుతుండగా అనంతళ్వారుకు సహాయం చెయ్యాలనీ స్వామే స్వయంగా వచ్చాడు. గర్భిణి అయిన అనంతళ్వారు భార్య దగ్గర తట్ట తీసుకొని మట్టి మోశాడు. తన కైంకర్యంలో భాగస్వామి కావడం వల్ల తనకు లభించే పుణ్యంలో కొంతభాగం అతనికి వెళ్లిపోతుందని భావించిన అనంతళ్వారు అలా చెయ్యవద్దని అడ్డుకున్నాడు. అయినా యువకుడు రూపంలో ఉన్న స్వామి అలాగే చేస్తుండడం చూసి వెంటబడి తరిమినా దొరకక పోయేసరికి చేతిలోని పలుగును విసిరాడు. అది స్వామి గడ్డానికి తగిలింది. శ్రీనివాసుడు ఆలయంలోకి వెళ్లి అంతర్హితుడయ్యాడు. ఈయన తవ్విన గుంటను ఆళ్వారు కోనేరు అని వ్యవహరించేవారు.

ఇంతవరకు వైష్ణవ పరంపరకు చెందినవారిని గురించి ఆలోచించడం జరిగింది. వైష్ణవ పరంపర భక్తుల తర్వాత ఆలోచింపదగ్గవారు తిరుమల భక్తులు. వారిలో ముఖ్యంగా పేర్కొనదగినవారు ఇద్దరు. ఒకరు కురువరతినంబి కాగా మరొకరు తొండమాన్ చక్రవర్తి.

**కురువరతినంబి :**

> **"కుమ్మర దాసుండైన కురువరతి నంబి**
> **ఇమ్మన వరములెల్ల నిచ్చినవాడు"   (1-151)**

కుమ్మర కులానికి చెందిన కురువరతినంబి శ్రీ వేంకటేశ్వరస్వామికి దాసుడు. ఈయన నిత్యం స్వామిని స్మరించేవాడు. తాను కుండలు చేసే మట్టితోనే పూలను కూడా

తయారుచేసి స్వామికి సమర్పించే వాడు. తన కైంకర్యం గురించి ఎవరికి చెప్పవద్దని స్వామిని కోరాడు. అలా చెప్పవలసి వస్తే ఆ సమయంలోనే నాకు తప్పక మోక్షం ఇవ్వాలని కోరాడు.

తొండమాన్ చక్రవర్తి కోరగా స్వామే స్వయంగా కురువరతినంబి వృత్తాంతం చెప్పాడు. తొండమాన్ చక్రవర్తి స్వయంగా వచ్చి కురువరతినంబిని చూసి ఆయన కైంకర్యానికి ఆశ్చర్యపోయాడు. తనకంటే కురువరతినంబే గొప్పవాడని గ్రహించాడు. ఆ సందర్భంలో తిరుమలేశుడు తాను వాగ్దానం చేసినట్టే కురువరతినంబికి మోక్ష మిచ్చాడు.

**తొండమాన్ చక్రవర్తి :**

> **"దొమ్ములు సేసినయట్టి తొండమాంజక్కురవర్తి**
> **రమ్మన్నచోటికి వచ్చి నమ్మినవాడు"** **(1-151)**

తొండమాన్ చక్రవర్తి నారాయణపురాన్ని పాలించిన ఆకాశరాజు తమ్ముడు. శ్రీనివాసుని ఇల్లాలు పద్మావతిదేవికి స్వయంగా పినతండ్రి. ఆకాశరాజుకు తొండమానుకు శ్రీనివాసుడే స్వయంగా భాగాలు పంపిణీ చేసినట్లు చెబుతారు. తొండమానుడు స్వయంగా కొండమీద శ్రీవారికి ఆలయం నిర్మించి ఇచ్చాడు. రోజు వెళ్లి బంగారు పూలతో పూజ చేసేవాడు. ఒకరోజు రాజువేసిన పువ్వులు స్వామి పాదాలనుంచి కిందపడి ఉన్నాయి. ఆ పువ్వుల స్థానంలో మట్టిపూలు ఉన్నాయి. ఆ దృశ్యాన్ని చూసి రాజు ఖిన్నుడయ్యాడు. వేంకటరాజును ప్రశ్నించాడు. శ్రీనివాసుడు కుమ్మరదాసుడయిన కురువరతినంబి భక్తిని వివరించాడు. చక్రవర్తి ఆ భక్తుడి దగ్గరకు వెళ్లి చూసి అతని భక్తికి పరవశించాడు. తిరుమలేశునికి భక్తే ప్రధానం కాని ఐశ్వర్యాడంబరాదులు కాదని గ్రహించాడు.

తొండమాను చక్రవర్తి రోజు తిరుమలరాయుడిని దర్శిస్తూ ఆయనతో మాట్లాడే వాడు. శ్రీ వేంకటేశ్వరుడు కూడా ఎంతో ప్రీతితో చక్రవర్తితో మాట్లాడే వాడు. ఒకసారి ఒక బ్రాహ్మణుడు వచ్చి తన భార్యను కుమారుణ్ణి రాజు సంరక్షణలో వదలి కాశీకి వెళ్లాడు. రాజు వారిని ఒక గృహంలో పెట్టి తాళం వేసి వారి సంగతి మరచిపోయాడు. ఆరు మాసాల తరువాత బ్రాహ్మణుడు తిరిగివచ్చాడు. తన భార్య పిల్లలను చూడగోరాడు. ఇంటి తలుపు తీసి చూడగా తిండిలేక మరణించి ఉన్నారు. తొండమానుడు చేసేదిలేక తిరుమలప్పను వేడుకున్నాడు. వారిని ఎలాగైనా బతికించమన్నాడు. తొండమాన్ చక్రవర్తి కోరిక మేరకు శ్రీనివాసుడు వారిని బతికించాడు గానీ అంతవరకు మాట్లాడుతూ ఉండిన శ్రీనివాసుడు అప్పటి నుంచి ఎవరితోనూ మాట్లాడటం మానివేశాడు.

అన్నమయ్య అనేకసార్లు అనేకమంది భక్తులను స్మరించాడు. వారిలో చారిత్రక భక్తుల సంఖ్య అధికం. వ్యాస విస్తరణ భీతి కారణంగా కొంతమందిని గురించి

మాత్రమే రేఖామాత్రంగా ఇక్కడ పరిచయం చేయడం జరిగింది. ఈ మహనీయుల జీవిత గాథలను చదివి వారి భక్తి నిష్ఠలను, వారి వ్యక్తిత్వాలను గ్రహించి అనుకరించేందుకు ప్రయత్నించి ధన్యులు కావాలని మనవి.

**ఆధార గ్రంథాలు :**

1. అధ్యాత్మ సంకీర్తనలు-అన్నమాచార్యులు - పరిష్కర్త: గౌరిపెద్ది రామసుబ్బశర్మ
2. అన్నమయ్య - ఆళ్వారుల తులనాత్మక పరిశీలన - జె. మునిరత్నం.
3. అన్నమయ్య బహుముఖ ప్రాభవం - సంపాదకుడు : చిత్రాజు గోవిందరాజు, ప్రాచ్య పరిశోధన సంస్థ, యస్వీ.యు., తిరుపతి.
4. అన్నమయ్య సంకీర్తనామృతము, ద్వితీయ సంపుటం వ్యాఖ్యాత : సముద్రాల లక్ష్మణయ్య.
5. తాళ్ళపాక కవుల సాహితీ కిరణాలు - జె. మునిరత్నం, కల్పనా పబ్లికేషన్స్, తిరుపతి.

***

# అన్నమయ్య సంకీర్తనలు-సామాజికాంశాలు

**ఆచార్య జి. యోహాన్‌బాబు**
**తెలుగు శాఖ**
**ఆంధ్ర విశ్వవిద్యాలయం**
**విశాఖపట్నం**

**నీ వొక్కఁడవే సర్వాధారము నిన్నే యెరిగిన నన్నియు నెఱుగుట**
**భావించి యింతయుఁదెలియఁగ వలసిన బ్రహ్మవేత్తలకు నిది దెరువు ॥పల్లవి॥**

ఇష్టదైవాన్ని ఎన్నోవిధాలుగా, ఎన్నో సంకీర్తనలతో నుతించిన అన్నమయ్య కారణజన్ముడిగా, అవతారపురుషుడిగా తదనంతర పదకారులతో కీర్తింపబడ్డ అన్నమయ్య నిజంగా కారణజన్ముడే. అన్నమయ్య పుట్టే కాలానికి ముందు పదకవిత్వం సృష్టించేనాటికి సమాజ పరిస్థితులు అన్నమయ్య అవసరమనే అంశాన్ని తెలియజేస్తున్నాయి. అదెలాగంటే సాహిత్యపరంగా చూస్తే అన్నమయ్య కాలానికి రెండు లేక మూడు వందల సంవత్సరాలు ముందుకు వెళ్ళి ప్రాచీనాంధ్ర సాహిత్య పరిస్థితుల్ని గమనిస్తే ప్రధానంగా శైవ, వైష్ణవ మతాల మధ్య బేధాభిప్రాయల గురించిన ప్రస్తావన కనిపిస్తుంది. ముఖ్యంగా 12వ శతాబ్దానికి చెందిన శివ కవుల కాలంలో ఈ

బేధాభిప్రాయాలు ఎక్కువగా కనిపిస్తాయి. శైవులు, వైష్ణవుల' మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమన్న పరిస్థితులున్న విషయం మనందరికీ తెలిసిందే. శివ కవుల తరువాత వచ్చిన తిక్కన సోమయాజి ఆ వైషమ్యాలను తగ్గించడం కోసం హరి హరినాధ తత్త్వాన్ని ప్రతిపాదించి హరిహరులు ఒక్కటేనని ప్రబోధించారు. అయితే ఈ అంశాలు నాటికాలంలోని కొంతమంది మేధావులకే (పండితులకే) పరిమితమయ్యాయి తప్ప కింది స్థాయి ప్రజల వరకు చేరలేక పోయాయి. ఈ పరిస్థితులు ఇలా కొనసాగుతుండగానే మరోపక్క మనువాదం మన భారతీయ సమాజాన్ని కులసమాజంగా స్థిరీకరించిన ఫలితంగా అది భ్రష్టుపట్టిపోయిన దశలో విదేశీ పాలకులు భారతదేశంలో స్థిరపడి వాళ్ళ మతాలకు అనుగుణంగా భారతదేశ ప్రజల్ని మలచుకొంటున్న నేపథ్యంలో రాజులు నిరంకుశులై ప్రజల్ని పట్టించుకోవడం కరువౌతున్న సమయంలో, జనం కుల ప్రాతిపదికన, దైవారాధన ప్రాతిపదికన చీలిపోయి జాతి నిర్వీర్యమౌతున్న సందర్భంలో అన్నమయ్య ఈ ప్రపంచంలోకి అడుగు పెట్టాడు.

ఒకపక్క అన్నమయ్య పదకవిగా రూపుదిద్దుకుంటూనే మరోపక్క 'తనకాలం నాటి పరిస్థితులను, ప్రజాజీవనంలోని సమస్యలను నిశితంగా పరిశీలించాడు. తన కాలంలోని ప్రజా సమస్యలకు సాహిత్యం ద్వారా పరిష్కార మార్గాలను సూచించాలని నిశ్చయించుకున్నాడు. ఆనాటి ప్రధాన సమస్యలలో ఒకటి... మత విబేధాలు. వాటిని తొలగించడానికి తను భక్తిమార్గాన్నే ఎన్నుకున్నాడు'. ఆ భక్తి మార్గాన్ని ప్రజల దగ్గరకు తీసుకెళ్ళటానికి గాను అనువైన వాహికగా పదసాహిత్య ప్రక్రియని ఎన్నుకున్నాడు. అంతేకాదు, ఎన్నుకున్న పదానికి చక్కని సంగీతాన్ని జోడించి పాటల రూపంలో తన భావాల్ని ప్రజల దగ్గరకు చేర్చాడు. ఇలా ఆయన సంకీర్తనలలో సంగీతం, సాహిత్యం జోడు గుఱ్ఱాలుగా పయనించి సమాజంలోని ఎంతోమంది మాన్యుల్ని, సామాన్యుల్ని చైతన్య పరచటంతో పాటు వారి జీవన విధానంలో భాగాలయ్యాయి.

అన్నమయ్య పద సాహిత్య ప్రచారం ద్వారా తానెన్నుకున్న లక్ష్యానికి చేరుకోవటానికి చేసిన ప్రయత్నం ఆలోచించదగింది. అన్నమయ్య సమాజం గురించీ, సమాజంలో మతపరంగా జరుగుతున్న వైషమ్యాలు, ఇతర హెచ్చు తగ్గుల గురించీ పరిశీలించడం గాని వాటికి తనదంట్లూ పరిష్కార మార్గాలనీ ప్రచారం చేయడంగానీ చూస్తే చాలామంది కవి పండితుల్లా అతను రాజాస్థాన కవికాదు. మన ప్రాచీన కవుల్లో ప్రధానంగా రెండు రకాల కవులు కనిపిస్తారు. రాజుల ఆస్థానంలో ఉంటూ, రాజులు కోరిన విధంగా రాజులు మెచ్చే విధంగా కావ్యాలు వ్రాసి రాజుకో లేద రాజుల కిష్టమైన వారికో ఆ కావ్యాలను అంకితం చేసి రాజుల పోషణలో వారు రాజాస్థాన కవులుగా ఉండేవారు. రెండోరకం వారు రాజులను ధిక్కరించి భగవంతుణ్ని నమ్ముకొని స్వశక్తితో జీవిస్తూ కావ్యాలు రాసే రాజాస్థానేతర కవులు. సమాజాన్ని పరిశీలించడంలో గానీ, సమాజాన్ని సరైన రీతిలో ఆవిష్కరించడంలో గాని ఈ ఇరురకాల

కవుల మధ్య చాలా వ్యత్యాసం కనిపిస్తుంది. అన్నమయ్య పాల్కురికి సోమన తరువాత పేర్కొనదగ్గ గొప్ప ఆస్థానేతర కవి. పాల్కురికి సోమన శివున్ని ఇష్టదైవంగా స్వీకరించి, శివభక్తిని కేంద్రంగా చేసుకొని శైవ మత ప్రచారంలో భాగంగా ఎన్నో సంస్కరణ భావాల్ని ప్రచారం చేశాడు. అలాగే అన్నమయ్య విష్ణువునూ, ఆయన మూర్తి అయిన వెంకటేశ్వరుణ్ని మనసా, వాచా, కర్మణా నమ్మి ఆయన మీద భక్తి పారవశ్యాన్ని పదాల రూపంలో మార్చుకొని విష్ణు భక్తితో కలిపి పద సాహిత్య రూపంలో ఎన్నో సంస్కరణ భావాల్ని సమాజానికి ప్రబోధించాడు.

అన్నమయ్య కలం నుండి జాలువారిన సంకీర్తనలు ముప్పయిరెండు వేలన్న విషయం అందరికీ తెలిసిందే. నిజానికివి కలియుగ దైవమైన శ్రీ వేంకటేశ్వర స్వామిని కేంద్రంగా చేసుకొని భక్తి సాహిత్యాన్ని వెలువరించిన ఆయన పదాలలో శరణాగతి, లోకనీతి, ధర్మబోధ, ఇతిహాస వేదాంతపరమైన సూక్తులతో పాటు అనేకమైన సామాజికాంశాల్ని పదకవిత్వంలో పొందుపరిచాడు. మరో రకంగా చెప్పాలంటే మనిషి పుట్టిన దగ్గర నుండి గిట్టేవరకు అనగా మనిషి తన జీవితకాలంలో అన్ని విషయాలలో సర్వావస్థలలో కనిపించే అన్ని అంశాల్ని అన్నమయ్య తన పదకవిత్వంలో పొందుపర్చాడు. ఇలా అన్నమయ్య సృష్టించిన అనంతమైన పదసాహిత్యంలో రెండు మూడు సామాజికాంశాల్ని పరిచయం చేయదలచుకున్నాను. ఎందుకంటే అవి అన్నివిధాలా సార్వకాలికాలు సార్వజనీనాలు.

అందులో మొదటిది మతపరమైన విషయం. అన్నమయ్యది ప్రధానంగా వైష్ణవ భక్తి సంప్రదాయం. విష్ణువును పరమదైవంగా భావించి అతనిని అనేక రూపాలలో కీర్తించాడు. అన్నమయ్య శ్రీరామానుజ సంప్రదాయానుసారమైన భక్తిరసాన్ని సమాజంలోని అన్నివర్గాల ప్రజలతో తాగించడానికి ఎంతగానో కృషి చేసాడు. ఈయన తన ఇష్టదైవాన్ని ఎలా కీర్తించినా, ఏ తీరులో తన భక్తిభావాన్ని వ్యక్తం చేసినా, దేవుణ్ని ఏ రూపంలో నుతించినా అందులో మనకు కనిపించేది మాత్రం ఒక్క శ్రీనివాసుల తత్త్వమే. "మానవులు తమ మనస్సులో వెదికితే అతడే మత్స్యావతారంగా, రసాతాలంలో వెదికితే కూర్మావతారంగా, అడవులలో వెదికితే వరహావతారంగా, కొండగుహల్లో వెదికితే శ్రీ నరసింహావతారంగా, భునభోంతరంలో త్రివిక్రముడుగా, వీరులలో పరుశురాముడిగా, శివపార్వతులకు తారకరాముడిగా, ఆవుల మందలలో బలరామకృష్ణులుగా, అసుర కాంతలలో బుద్ధుడుగా, కాలాంతంలో (కలియుగంలో) కల్కిగా దర్శనమిచ్చే ఆ దేవుడు శ్రీ వేంకటవిభుడే, జీవులందరిలో అంతర్యామై వున్నాడని అభేదం చాటి దేవుడు ఒక్కడే అని సూచించాడు". ఇలా చూస్తే అన్నమయ్య దృష్టిలో ఆ ఏడుకొండల వాడే సర్వాంతర్యామి. ఎక్కడ వెదికినా, ఎలా చూసినా ఆ వెంకటేశ్వరుని తత్త్వమే వివిధ రూపాలలో అన్నమయ్యకు గోచరిస్తుంటుంది. ఈ అంశాన్ని అన్నమయ్య ఓ సంకీర్తనలో ఇలా పొందుపర్చాడు.

**ప॥ ఎండగాని నీడగాని యేమైనా గాని**
**కొండలరాయుడే మా కులదైవము**

ఈ సంకీర్తన ద్వారా అన్నమయ్య ఉద్బోధించేది శివకేశవులకు భేదం లేదన్నది. అంతేకాదు కాలకూట విషాన్ని మింగిన శివుడే అతని దృష్టిలో శ్రీ వేంకటేశ్వరుడు అనే అభిప్రాయాన్ని ఈ సంకీర్తనలో వ్యక్తం చేయడం కనిపిస్తుంది.

రెండో అంశమైన కులం, వర్ణం గురించి పరిశీలిస్తే నేటి మన సమాజంలో మతాన్ని ఆధారం చేసుకొని ఒక పద్ధతిలో, సామాజిక పరిస్థితుల ప్రభావంతో మరొక పద్ధతిలో కుల వ్యవస్థ సమాజంలోని ప్రజాసమూహాన్ని చీల్చి చీలికలు చేస్తున్న విషయాన్ని దృష్టిలో పెట్టుకొని అన్నమయ్య "బ్రహ్మ మొక్కటే" అన్నాడు. ఇలా అనడం నాటి చారిత్రికావసరాన్ని అన్నమయ్య గుర్తించి, గమనించిన తీరు అతనిలోని సమాజ స్పృహకు నిదర్శనం అని చెప్పవచ్చు. ముఖ్యంగా... "కుల వ్యవస్థ వికృతరూపాన్ని సంతరించుకొని, నిరంకుశమై ప్రజల మధ్య సహజంగా ఉండవలసిన సంబంధాలు విచ్ఛిన్నమైపోయాయి. ప్రజలమధ్య సాంఘిక సంబంధాలే గాక ఆర్థిక సంబంధాలు కూడా విచ్ఛిన్నమై ధనిక పేద వైరుధ్యాలు పెరిగిపోయాయి. రాజుకు ప్రజలకు మధ్య ఉండవలసిన సంబంధాలు నిరంకుశ అధికారం కింద నలిగి పోయాయి. అందుకే అన్నమయ్య అనారోగ్య పరమైన ఆర్థిక, సాంఘిక, రాజకీయాంశాలన్నిటినీ ఒక్కపదంలో మూటగట్టి ఉతికేశాడు.

**తందనానా అహి - తందనానా పురె**
**తందనానా భళా - తందనాన ॥పల్లవి॥**

**బ్రహ్మమొక్కటే పర - బ్రహ్మమొక్కటే పర**
**బ్రహ్మమొక్కటే పర - బ్రహ్మమొక్కటే ॥తంద॥**

నేలకు, గాలికి, ఎండకు, కాలానికి, కామానికి, ఆకలికి, నిద్రకు లేని వైరుధ్యం, ఎక్కువ తక్కువ భేదం నేలమీద తిరిగే వాళ్ళకు, కాలంలో బికే వాళ్ళకు, గాలిని పీల్చే వాళ్ళకు, ఎండను అనుభవించే వాళ్ళకు, కామాన్ని అనుభవించే వాళ్ళకు, ఆకలికి అన్నంతినే వాళ్ళకు, నిద్రపోయే వాళ్ళకు, ఎందుకు? అని ప్రశ్నించాడు అన్నమయ్య అందుకే "అందరికీ హరే అంతరాత్మ" అన్నాడు.

అన్నమయ్య పైన పేర్కొన్నట్లుగా కుల, మత పరమైన అంశాలలో తన అభిప్రాయాల్ని నిక్కచ్చిగా తెలియజేశాడు. ఈ సందర్భంగా తనవంటూ పరిష్కార మార్గాల్ని చూపించడంలో ఏమాత్రం కూడా రాజీపడటం కనిపించదు. ఈ అంశాలే కాకుండా ఆయన సంకీర్తనలలో చెప్పుకోదగ్గ మరికొన్ని ముఖ్యమైన సామాజికాంశాలున్నాయి. రాచరికాన్ని ధిక్కరించడం, సమాజంలో ఇతరత్రా అంశాలలో రావలసిన సంస్కరణల విషయంలో కూడా తన ప్రత్యేక అభిప్రాయాల్ని సంకీర్తన సాహిత్యం ద్వారా సమాజానికి తెలియజేసాడు.

మొత్తం మీద సమాజంలో దశాబ్దాలుగా తిష్ఠవేసిన కులమత తత్వాల్నీ, సాంఘిక దురాచారాల్ని ఖండించడంలో అన్నమయ్య ఓ నిబద్ధ కవిగా కనిపిస్తాడు. "ఆస్థాన కవులు కీర్తించిన రాజరికాన్ని అన్నమయ్య ధిక్కరించాడు. ఆస్థానకవులు కీర్తించిన కులవ్యవస్థను అన్నమయ్య విమర్శించాడు. ఏ దేవుని పేరు చెప్పి ఆస్థాన కవులు వర్ణవ్యవస్థను స్థిరం చేయడానికి ప్రయత్నించారో, ఆ దేవుని మీది భక్తితోనే అన్నమయ్య కుల వ్యవస్థలో సంస్కరణలు ప్రవేశపెట్టాడు. దేవుడు మంత్రాలకు, బ్రాహ్మణులకు అధనుడనే వాదాన్ని తిరస్కరించి దేవుడు ప్రజాధీనుడని ప్రచారం చేశాడు. దేవునికి అల్ప సంఖ్యాకుల చెరనుంచి విముక్తి కలిగించి అధిక సంఖ్యాకుల పరం చేయడానికి ప్రయత్నించాడు. దేవుడు ఒక సామాజిక అంశం అయినప్పుడు, ఆ దేవుని విశ్వసించే హక్కు మాత్రమే కాదు ఆ దేవుని ఆరాధించే హక్కు కూడా అందరికీ ఉందన్నాడు. వెంకటేశ్వరునికి భక్తులు కావడానికి కులం అడ్డు కాదని చెప్పాడు. వెంకటేశ్వరునికి భక్తులైన క్రింది కులాల వాళ్ళు, చెడిపోయిన పై కులాల వాళ్ళకన్నా గొప్ప వాళ్ళన్నాడు". నిజానికి కులాల విషయంలో ఇంతగా అభ్యుదయ భావాల్ని పలికిన ప్రాచీనకవులు కనిపించరు.

ఈ అంశాల దృష్ట్యా అన్నమయ్య ఓ కారణజన్ముడు, అవతార పురుషుడు అని చెప్పడం అతిశయోక్తి కాదు. ఈ అంశాల్ని ఆకలింపు చేసుకొనే కాబోలు అన్నమయ్య తరువాత వచ్చిన పదకవులు అన్నమయ్యని "హరియవాతార మీతఁడు" అని కీర్తించడాన్ని బట్టి అన్నమయ్య గొప్పతనమేంటో అర్థమౌతుంది. అన్నమయ్య సాహిత్యంలో చోటుచేసుకున్న ఇంకా ఎన్నో అభ్యుదయాంశాల్ని రాబోవు పరిశోధకులు వెలికి తీయాల్సిన అవసరం ఉందని నా అభిప్రాయం.

***

# తాళ్ళపాక పెదతిరుమలాచార్యుల మధుర కవితా వైభవం

**విశ్రాంత ఆచార్య కె.జె. కృష్ణమూర్తి**
**సమన్వయాధికారి**
**శ్రీ మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ ప్రాజెక్టు**
**తిరుపతి**

ఆంధ్రసారస్వతంలో విలసిల్లిన అనేక కవివంశాలలో అగ్రగణ్యమైనది. తాళ్ళపాక కవుల వంశం. ఈ వంశంలో నాలుగైదు తరాల కవులు వాఙ్మయ ప్రపంచంలో లబ్ధప్రతిష్ఠులుగా తెలియవస్తున్నారు. వీళ్లందరిలోనూ పదకవితా పితామహుడయిన అన్నమాచార్యుడు, ఆయన కుమారుడు పెదతిరుమలాచార్యుడు – ఈతని ప్రథమ,

చతుర్ధ పుత్రులైన చినతిరుమలాచార్య, చిన తిరువేంగళనాథులు - ఈ నల్గురు కవీశ్వరులను 'తాళ్ళపాక కవీశ్వర చతుష్టయం'గా పేర్కొనవచ్చు.

వీరిలో అన్నివిధాలా తండ్రికి తగిన తనయుడు, ఆముష్యాయణుడు, అద్వితీయ సారస్వతమూర్తి పెదతిరుమలాచార్యుడు (1468-1553). ఈయన అన్నమాచార్యులకు ద్వితీయ కళత్రమైన అక్కలాంబయందు జన్మించినాడు.

పెదతిరుమలాచార్యుడు తన తండ్రి ఆనతి ననుసరించి ప్రతిదినం ఒక సంకీర్తన రచించి శ్రీ వేంకటేశ్వరస్వామి వారికి సమర్పిస్తూ వుండేవాడు. ఈ విధంగా అన్నమయ్య ఆరంభించిన సంకీర్తన కైంకర్యాన్ని ఈయన అవిచ్ఛిన్నంగా కొనసాగించాడు. పెక్కు గ్రామాలను, ధనాన్ని స్వామి సన్నిధికి సమర్పించినాడు. ఎన్నో జీర్ణోద్ధరణలు, నూతన నిర్మాణాలు, ఉత్సవాలు - మొదలయిన పలు తెఱగుల కైంకర్యాలను పరమ భక్తితో నెలకొల్పాడు. తన తండ్రీ, తానూ రచించిన సంకీర్తనలను రాగిరేకులపై వ్రాయించి, సంకీర్తన భాండారానికి స్థిరత్వాన్ని నెలకొల్పాడు. శ్రీరంగం లాంటి దివ్యదేశాలను సందర్శించి, ఆయా పుణ్యస్థలాలలో తమ సారస్వతానికి స్థానమూ, చక్కని ప్రచారమూ కల్పించారు.

తాను రాజాశ్రయాన్ని వాంఛింపక పోయినా, విజయనగర చక్రవర్తి అచ్యుతదేవరాయలు ఆయనకు అనేక అగ్రహారాలను దానం చేశాడు. తిరుమలయ్య వాటిని తిరువేంగళనాథ దేవునకే అర్పణ కావించాడు. ఈ తీరున శ్రీ స్వామివారి సకలవిధ కైంకర్యాలలోనూ కర్తగా, కారయితగా విరాజిల్లిన ధన్యశీలి పెద తిరుమల దేశికుడు!

ఈ మహనీయుని కవిత ప్రతిభ అనే పంటపొలంలో పాండిత్యమే సారంగా భక్తిప్రపత్తులనే దోహదక్రియలతో పెద్దగా పెంపొందిన కల్పమహీరుహము! ఆ దివ్య తరువున పండిన మధుర సాహితీ ఫలాలు పదునాలుగు. అవి : 1) చక్రవాళ మంజరి, 2) నీతి సీసశతకము, 3) వేంకటేశ్వరోదాహరణము, 4) సుదర్శన రగడ, 5) రేఫ ఱకార నిర్ణయము, 6) శృంగార దండకము, 7) వైరాగ్య వచన మాలికా గీతాలు, 8) శృంగార వృత్త పద్యాల శతకము, 9) మేలుకొలుపు ద్విపద, 10) అధ్యాత్మ సంకీర్తనలు, 11) శృంగార సంకీర్తనలు, 12) భగవద్గీత తెలుగు వచనము, 13) సంకీర్తన లక్షణ వ్యాఖ్యా (సంస్కృతము), 14) ద్విపద హరివంశము. ఈ పదునాలుగు రచనలలో మొదటి పన్నెండు ముద్రితాలు, చివరి రెండు అలభ్యాలు.

ఇంతటి వైవిధ్యమూ, వైచిత్రీ కలిగిన ఈ మహాకవీశ్వరుని సారస్వతంలో 'యక్షగానా'నికి చోటు లేకపోవడం వింతగా తోచినా అప్పటికి ఒక ప్రసిద్ధ సాహితీ ప్రక్రియగా పరిణతి చెంది వుండలేదనే అభిప్రాయంతో సంతృప్తి పొందవచ్చు.

ఈ వాగ్గేయకార శిరోమణి కవిత 'తేనెవలె తియ్యగా ఉంటుం'దని ఆనాటి శాసనాలు సైతం వేనోళ్ల వెల్లడిస్తున్నాయి. ఇందుకు నిదర్శనంగా ఈ క్రింది పంక్తులు

పరికింపదగి వున్నాయి. ఇవి తమిళ భాషలోని శాసన పంక్తులకు అనువాదంగా ఆంగ్లంలో రచింపబడిన వాక్యాలు:

"The famous poet-Tallapakam Tirumalai Ayyangar, son of Annamayya Ayyangar, **whose poetry is as sweet as honey**, composed several sankirtanas in praise of Lord Sri Venkatesa which were followed by his sons and grandsons for the well-being of all the devotees living in the land sorrounded by the season all sides..."

- T.T.D. Inscriptions Vol. IV, P. 82

పెదతిరుమలాచార్యుల ధర్మపత్ని తిరుమలాంబ. ఈ పుణ్యదంపతులకు ఐదుగురు కొమాళ్ళు. వీరందరి గొప్పతనాన్ని గురించి పెదతిరుమలాచార్యుని మేనల్లుడు రేవణూరి వేంకటార్యుడు "శకుంతలా పరిణయము" - అనే కావ్యం యొక్క అవతారికలో ఈ క్రింది రీతిగా ప్రశంసించి యున్నాడు :

"........ తత్తనూజుండగు పెదతిరుమలాచార్య బిడౌజునకు త్రిపురుష పర్యంతంబుగా ప్రత్యక్షంబును, సప్త పురుష పర్యంతంబుగా మోక్షంబును ఒసంగెదనని వరింబిచ్చి, సచ్చరిత్రులగు తదీయ పౌత్రులకు చినతిరుమల దీక్షిత, అన్నమాచార్య, తిరువేంగళనాథ, కోనేటి తిరువేంగళనాథ, వేంగళార్యులకు విచిత్ర ముక్తాతపత్ర రత్నకవాట ముద్రికా ప్రచండ మణిమండిత మకరకుండలోత్కర అహఃకరదీపికా ప్రాపాదుకాది బహూకరణంబులం గరుణించె...."

– 'శకుంతలా పరిణయము', ఆర్ నం. 520 (కాగితపు వ్రాత ప్రతి), పుట 7, యస్.వి.యు.ఓ.ఆర్. ఇన్స్టిట్యూట్ లైబ్రరి, తిరుపతి.

పై పంక్తులలో పేర్కొన్న విధంగా పెదతిరుమలాచార్యుడు తాను మొదలుకొని తన వంశంలో మూడుతరాల వారికి ప్రత్యక్షాన్నీ, అటు తరువాతి ఏడు తరాల వారలకు మోక్షాన్నీ సాక్షాత్తు శ్రీ స్వామివారి ముఖతః వరంగా పడసిన పెదతిరుమలయ్య ఎంతటి మహాత్ముడో! ఒక్క మాటలో చెబితే "శ్రీ వేంకటప్పని సేవచేయగోరి చేకొన్న తను వీతడు!".

– 'తాళ్లపాక సంకీర్తనలు' నం. 6609 (కాగితపు వ్రాతప్రతి, పుట 17, యస్.వి.యు.ఓ.ఆర్. ఇన్స్టిట్యూట్ లైబ్రరి, తిరుపతి.

పెదతిరుమలాచార్యులు రాచవీటికి (రాయచోటికి) సమీపంలో ఉన్న మండెంకోటకు వెళ్లినప్పుడు, అచ్చట గిట్టనివారెవరో వెనుకనుండి ఆయనపై కత్తిని విసిరారట! అది పూలదండవలె ఆయన వీపుసోకి, తునాతునకలై పడిపోయిందట! మరొక మారు ఇరుకైన కొండ దారిలో వెళ్లుతూవుండగా, దుండగులు కొందరు ఈటెలు గుచ్చిపెట్టి చుట్టుముట్టినారట! కమలనయనుడైన శ్రీ వేంకటేశ్వరుని తలంచిన

మాత్రన ఆ ఆకతాయిమూక కకావికలై పాఱిపోయిందట! ఒకానొక అంధునికి వేంకటేశ్వరుడు ఒక కన్నిచ్చి, తన వద్దకు పంపగా పెదతిరుమలాచార్యులు ఆతనికి పరుషజనులు చూడగా రెండవ కన్ను ప్రసాదించాడట! ఇవన్నీ ఆయన మహాను భావతకు అమలిన నిదర్శనాలు! ఈ మహిమలన్నీ పెదతిరుమలాచార్యుల సుదర్శన చక్ర-ఉపాసనకు ప్రత్యక్ష నిదర్శనాలు!

తిరువేంగళనాథదేవ దివ్య శ్రీపాదపద్మారాధకుడైన పెదతిరుమలాచార్యుడు సృష్టించిన సారస్వతం రాశిలోనూ వాసిలోనూ అద్వితీయమై, ఐహిక, ఆముష్మిక విభూతివిలసితమై ఆంధ్రవాఙ్మయ ప్రపంచంలో అత్యంత ప్రశస్తి వహించివుంది. లౌకిక, పారమార్థిక జీవనరంగాలను రెండింటినీ సారస్వతంతో సమన్వయించి, సముద్దీపింపజేసిన ఆయన కేవలం ఒక వ్యక్తిగా కాక, ఒక మహాసంస్థగా కీర్తిమూర్తితో సహృదయులకు సాక్షాత్కరిస్తారు.

నీతి సీసశతకంలో వెల్లడి అవుతున్న పరిణత రాజనీతి ప్రజ్ఞను బట్టీ, ఆయన సాధించిన పెక్కు ఘనకార్యాలను బట్టీ ఆలోచిస్తే, పెదతిరుమలయ్య, ఒకవేళ ఐహిక జీవితం వైపే గనక మొగ్గు చూపి వుంటే, తనకు సమకాలికుడూ, సమాన వయస్కుడూ అయిన సాళువ తిమ్మరుసు మంత్రివలె ఏదో ఒక సామ్రాజ్యానికి సర్వశిరః ప్రధానిగా విరాజిల్లి, పేరు ప్రతిష్ఠలు గడించి వుండేవాడని తప్పక స్ఫురిస్తుంది. ఇక, ఈయనకు గల "శ్రీమద్వేదమార్గ ప్రతిష్ఠాపనాచార్య, శ్రీ రామానుజ సిద్ధాంత స్థాపనాచార్య, వేదాంతాచార్య, కవితార్కిక కేసరి, శరణాగత వజ్ర పంజరా" - అనే బిరుదాలు విశిష్టాద్వైత సిద్ధాంత ప్రవర్తకులయిన శ్రీమద్వేదాంత దేశకులను జ్ఞాపకానికి తెస్తాయి. ఒక్కమాటలో తాళ్లపాక పెదతిరుమలాచార్య దేశికుడు "ఆంధ్రవేదాంత దేశికుడు"!

**సీ॥ కాంచన పాదముల్, గజ్జెలు, అందియల్,**
**కదుమించు మొల చంద్రకావి దట్టి,**
**పీతాంబరము మీద బిళ్లల మొలనూళ్లు,**
**బిగియించి కట్టిన పెనుకటారి,**
**వరదాన కరము, ఉజ్జ్వల కటిహస్తంబు,**
**పటుశంఖ, చక్రోరు బాహుయుగము,**
**ఒఱపైన నాభియు, ఉదరబంధ,**
**మురంబు, అలమేలుమంగతో హారములును**

**తే॥ శిరసు మకుటంబు, తిరుమణి, చిత్రమకర**
**కుండలమ్ములు గల మిమ్ము గోరి తలంతు,**
**కలిత లక్ష్మీశ! సర్వజగన్నివేశ!**
**విమల రవికోటి సంకాశ! వేంకటేశ"** - నీతి సీసశతకము, 99వ పద్యము

***

# అన్నమయ్య సంకీర్తల్లో మనస్సంబంధ సూక్తులు

డా॥ యం. మాదన్న
తెలుగు అధ్యాపకులు
యస్.జి.యస్. ఆర్ట్స్ కళాశాల
తిరుపతి

భక్తి అనే అమృతసాగరంలో సునిశితంగా పరిశీలించినట్లయితే ఎందరో భక్తులు మనకు సాక్షాత్కరిస్తారు. అకుంఠితదీక్ష, కఠోరశ్రమ, ఎన్నో విషమ పరిస్థితులు, పరీక్షలు, వైరాగ్యం, తాత్వికత ఈ భక్తుల ద్వారా అవగతమవుతాయి. అందులోను ఇక వాగ్గేయకారుల స్థితిగతులను గమనించినట్లయితే పైన ప్రస్తావించిన అంశాలకు మినహాయింపుకాదు. భక్తులు, వాగ్గేయకారులు దేశ సంచారులు. సామాజిక పరిశీలకులు. "వజ్రానికి సానబెడితే వన్నె చేకూరుతుందనే" సామెత ఉపమానానికి అందని హృదయవిదారకమైన సంఘటనల్ని దర్శించి ఉంటారు, ఎదుర్కొని కూడా ఉంటారు.

"జన్మానాం నరజన్మోత్తమం" అంటారు. దేవుడి పూజకు అర్హమైన పుష్ప వంటి మనిషి అని అర్థం. అంతటి అర్హతను సాధించిన వాగ్గేయకారుడు అన్నమయ్య. ఎన్నో ఉలిదెబ్బలకు తట్టుకున్న రాయి అందమైన శిల్పంగా తయారయి ఆకర్షింప బడుతుంది. అన్నమయ్య జీవితం కూడా అలాంటి కోవలోనిదే! మనిషి ఎదిగినా, ఒదిగినా, గెలిచినా, ఓడినా, కష్టించినా, సుఖించినా, చెప్పుకుంటూ పోతే ఇలా ఎన్నో... అన్నిటికి కారణం మనస్సె, "నమ్మితే నీ మనసే నీకు దైవం నమ్మకపోతే అదే నీకు దెయ్యం". కాబట్టి మనసుకు సంబంధించినంతవరకు అది చాలా సుకుమారం. పొగిడితే సంతోషిస్తుంది. తెగిడితే ఘోషిస్తుంది. నిరంతరం "కల్లు తాగిన కోతిలా" భ్రమిస్తూ భ్రమింపజేస్తూ అటూ ఇటూ అత్యంత వేగంగా పరుగులు తీస్తూ ఉంటుంది. మనసు లేనిదె మనిషి లేడు. అందుకే 'బేకన్' అనే పాశ్చాత్య పండితుడు మనిషి అంటే 'మనసే' అని అంటాడు. అలాంటి మనస్సును స్వాధీనంలో పెట్టుకొని కర్తవ్యం నెరవేర్చితే మనిషి ఎంత ఎత్తుకైన ఎదగగలడు. మనసుకు పూర్తిగా లోబడితే స్వాధీనం తప్పి ఎంతటి క్రిందికైనా దిగజారిపోతాడు. మనసన్నది ఎవరికీ కనబడనిది, అర్థమయ్యి కానిది. అందుకే ఓ కవి ఇలా రాశాడు.

**మౌనమే నీభాష ఓ మూగమనసా**
**చింతల చెలినీవు చీకటి గుహనీవు**
**ఉన్నది వలె నీవు లేనిది కోరేవు**
**తలపులు ఎన్నెన్నొ కలలుగ కంటావు** (గుప్పెడు మనసు)

చిత్రంలో పద్మశ్రీ మంగళంపల్లి బాలమురళీకృష్ణగారు పాడినట్లు మనసన్నది ఒక నాటకమే కదా! బ్రతుకన్నది నాటకము. ఆ నాటక మాడించేది మనసు. దీనిని కూడా అన్నమయ్య 'నానాటి బ్రతుకు నాటకము నాటకము' అని తన సంకీర్తనలో పొందుపరిచాడు. ప్రతిమనిషి జీవితము ఒక నాటకము. అందులో వారివారి పాత్రలు అనేక రకాలుగా నిక్షిప్తమై ఉంటాయి. అందుకే విజ్ఞులు కథల ద్వారా, గేయాల ద్వారా, పద్యాల ద్వారా, శ్లోకాల ద్వారా ప్రతి అంశంలోను ఏదో ఒక పరమార్థాన్ని సూచించే విధంగా ప్రాచీనం నుంచి ఆధునికం వరకు నిరంతరం ఈ సూక్తుల ప్రవాహం కొనసాగిస్తూనే ఉన్నారు.

మనిషి జీవితాన్ని మలుపు తిప్పేవి ఎక్కువగా సూక్తులే! చెప్పేవారు, రాసేవారు తమ అనుభవపూర్వకమైన వాస్తవిక జీవిత సత్యాలే. అవి ప్రతి మనిషికి అవసరం. అన్వయం. అన్నమయ్య లిఖించిన మనస్సంబంధ సూక్తులు ఎలాంటివో గ్రహిద్దాం.

కోరికలనే గుర్రాలు మనసును గాడి తప్పేటట్లు చేస్తాయి. దానిని అదుపు చేయకపోతే, ఇష్టానుసారంగా వదిలిపడితే ఎంత దూరమైనా కొలతలు లేకుండా అంతుచిక్కకుండా వెళుతుందని క్రింది సూక్తి ద్వారా గ్రహించవచ్చు.

**"ఇట్టె వదిలితేను యెందైనాఁ బారు మనసు"      (2-24)**

తీవ్రమైన కోపంగా మనసున్నప్పుడు ఊరికే ఉండనీదు. అది అటూ ఇటూ ఏదో ఒకటి చేసే వరకు ఒకచోట ఉండనీదు అంటాడు. ఇది దీర్ఘకాల వైరమున్నవారి స్వభావానికి సంబంధించినది.

**"ఉడికిని చిత్తంబూఁ కోననోపదు"      (26-37)**

మాటలనేవి ఎదుటివారిని ఆనందింపజేసేవి, పరవశింపజేసేవిగా ఉండాలని మాట్లాడితే అలా మాట్లాడాలని అంటాడు. ఎదుటివారిని నొప్పించేటట్లు కాకుండా, తానూ బాధపడేటట్లు కాకుండా మాట్లాడాలి.

**"మనసు రంజిల్లఁగ మాటాడుట మేలు"      (30-338)**

హృదయాలు కరిగి చేతికి వశమైనట్లు వశమై మాట్లాదే కులుకుల పూర్వకమైన మాటలుంటే సంపదలను మించిన సుఖము ఇందులో స్నేహం, ప్రేమ, హాస్యపూరకతకు గీటురాయి.

**"కరిగిన మనసులై కైవశములయితేను**
**సిరులు మించిన యట్టి చెనకులే సుఖము"      (27-66)**

చాలా కావలసినటువంటి వారు అపోహలతో విడిపోయి చాలాకాలం తరువాత అవగాహన కుదిరి తమ తప్పిదాలను సరిచేసుకొని తిరిగి సాధారణ స్థితికి చేరినప్పుడు కలిగే పరవశం. ఇది భార్యాభర్తలు, కుటుంబాలు, బాంధవ్యాలు, తల్లీబిడ్డలు, ప్రేమికులు, స్నేహితులు, సమాజంలోని వివిధరకాల వ్యక్తుల పరిభ్రమణం.

**"కలసినవారు లోలో కరఁగుదురు చిత్తాలు"** **(27-63)**

'జేరి మూర్ఖుల మనసు రంజింపరాదు' అన్నట్లుగా కలుపుగోలుతనం లేని వారు, దుర్మార్గులు, వీరు ఎన్నటికీ కలవరు. కలవాలనే ఆశ కూడా ఉండదు. కాబట్టి అటువంటి పగబట్టిన మనసు పోటుకంటే ఆలోచనలో కలిగే అడియాస, చీకటే మేలు. ఎందుకంటే ఇవి ప్రకృతిపరమైనవి. కలిసీ కలవని మనసు కపటంతో కూడినదని అర్థం.

**"కలసీ కలియని మనసు కసిగాటు కంటేను**
**తలఁపులో నడియస తమకమే మేలు"** **(30-83)**

'కామాతురాణాం నభయం నలజ్జ' కామంతో రగిలే వారికి సిగ్గు ఎగ్గు లుండవు. వారి మనసు అదే ధ్యాసతో నిండిపోయి ఉంటుంది. కొన్ని సందర్భాల్లో వావివరుసలు మరచి ప్రవర్తించే వారున్నారు. రావణుడు, కీచకుడు అతి కాముకతతో రగిలి పతనమయ్యారు. ఎంత బలమున్నా, ఎంత సంపదున్నా, ఎన్ని విద్యలున్నా ఎంత వారలైనా కాంత దాసులే! కాబట్టి కామంతో కళ్లు మూసుకుపోయిన వారికి ఏది కనబడదు. ఏది చెప్పినా వినబడదు. అందుకే ఇలాంటి మనసుకు అంతములేదు, ఆదిలేదు, ఇది యుగాలు మారినా తరాలు మారినా, రాజ్యాలు కూలినా కామం అనే నిప్పుల జ్వాలే కారణం. ఆ మనసు అంతటి ఘోరాన్ని చేయిస్తుంది.

**"కాముకపు మనసునకు కడ మొదలు లేదు"** **(1-328)**

పాపిష్టి ఆలోచనలు మదిలో విస్తరించకుండా అడ్డకట్ట వేస్తే తాను చేసిన దానాలనుబట్టి మంచి ఫలితాలుంటాయి.

**"పాపచింత మదిలోనఁ బారకుండా నిలిపితే**
**చేపట్టి దానము లెల్లాఁ జేసినంత ఫలము** **(1-430)**

అసూయంటే ఏమిటో ఎరుగని వాడు ఆజానుబాహుడు. ఆయనే శ్రీరాముడు. వాల్మీకి విరచితమైన ఆదికావ్యము రామాయణం. అది ఒక కుటుంబ కథ. రాజకుటుంబంలో జన్మించిన రాజు ప్రజాశ్రేయస్సే పరమావధిగా దేనినైనా తృణప్రాయంగా భావించే విధంగా ఉండి రాజ్యపాలన చేసేవాడు. నేటి పరిస్థితుల్లో వారసత్వాలు, కుటుంబాలు రాజపాలనలో భాగమయ్యాయి. సాక్షాత్తు ఇతిహాస కథానాయకుడికే మానసిక క్షోభ సంభవించినా ప్రజాహితమే కాంక్షించాడు. ప్రజావసరాలనే గుర్తించి తీర్చాడు. కారణం మనస్సే.

**"మచ్చరము లేకున్నను మనసే రామరాజ్యము"** **(2-362)**

పుణ్యంకొద్ది పురుషుడు-దానం కొద్ది బిడ్డ, పిండికొద్ది రొట్టి ఈ సామెతలకు నిలువెత్తు నిదర్శనం. మనిషి మనసు. వారివారి ఆలోచనలను బట్టి వారికి శుభములు కలుగుతాయి.

**"మనసు కొలదియే మంగళము"** **(27-369)**

దేవుడికి ప్రతిరూపం మానవుడు. మానవసేవే మాధవసేవ. ఈ సేవాభాగ్యం మనసు చెబితేనే మనిషి చేస్తాడు. అప్పుడు దేవుడుగాని, దేవతగాని అవుతారు. ఉదా॥ తల్లిదండ్రులు, సామాజిక సేవకులు, గురువు, వైద్యుడు, ఇంకా మన కళ్లెదుట మూర్తీభవించిన వారు మదర్‌థెరిసా లాంటివారు. మనసును గట్టిగా విశ్వసిస్తే, దానినొక అలవాటుగా చేసుకుంటే దైవంగా బాసిల్లుతాడు.

**"మనసునమ్మ నేర్చితే మనుజుడే దేవుడౌను"** **(2-352)**

మనసును నిలపడం అసాధ్యమే. అంటూనే సాధ్యం చేయాలంటూ పరోక్షంగా హెచ్చరించాడు. కట్టడి చేసుకోవడం ప్రయత్నపూర్వకమే తప్ప మరొకటి కాదని అర్థం.

**"మనసు నిల్పనలవి కాదు"** **(29-35)**

రహస్యాలు పెదవిదాటినా పృదివి దాటును (తిమ్మరుసు). ఈ రహస్యాలను దాచగలవారు, ప్రచారం చేయగల సమర్థులు స్త్రీలు. 'స్త్రీ నోటిలో నువ్వుగింజ నానదు' అని సామెత. మనసులోని అతి గూఢమైన ఆలోచనలు స్త్రీలతో చెబితే దాని పర్యావసానం ఎన్నో రకాలుగా ఉంటుందని పరోక్షమైన హెచ్చరిక.

**"మనసు లోపలిమాట మగువ కాడఁగరాదు"** **(25-203)**

మాటలు ఎన్నైనా మాట్లాడవచ్చు. ఎముక లేని నాలుక ఏవిధంగానైనా మాట్లాడగలదు. 'నోటికి తలుపా దాలబంద్రమా' అనే సామెతలు కూడా ఇందు మూలంగానే పుట్టుకొచ్చాయి. మనసుకు ఇవేవిలేవు. మనసు ద్వారా ఉత్పన్నమయ్యేవే. కాబట్టి ఈ ఆలోచనలు పట్టుకోలేమని అంటాడు.

**"మాటలాడవచ్చుఁగాని మనసులు పట్టరాదు"** **(2-474)**

మనిషి జీవితంలో ఊహింపశక్యం కానిది, వర్ణనాతీతమైనది ఎడబాటు. ఈ ఎడబాటు మనిషి జీవితంలో ఎప్పుడు ఎలా వచ్చి కృంగదీస్తుందో అర్థంకాదు. అందులో ఇష్టమైన విరహమైతే దానిని సుఖంగా అనుభవించగల మనస్సులు స్త్రీలు.

**"విననేరిచినఁజాలు విరహమైనా సుఖమే**
**మనసు దెలిసినట్టి మగువలకు"** **(27-22)**

దృఢమనస్కుడికి, న్యాయాదీశుడికి, సమభావంగల వాడికి మనసు ఎప్పుడూ ఒకేవిధంగా ఉంటుంది. అంటే మంచిమనసుగల మనిషి. అతడి మనసు చల్లగా పదిలంగా ఉంటుంది. వేరే విధంగా మారదు.

**"సమచిత్తునకు చంచలము గాదు"** **(2-307)**

అన్నమయ్య సంకీర్తనల్లో గల సూక్తులు కోకొల్లలు. సర్వదా స్మరణీయం. ఆచరణీయం, ఆమోదయోగ్యం. మనిషి మనసుకు కలియుగవాసుడి ఆశీస్సులు.

***

# అన్నమయ్య - పోతన

**డా॥ బి. తేజోవాణి**
**తెలుగు అధ్యాపకులు**
**శ్రీ పద్మావతి మహిళా డిగ్రీ మరియు**
**పి.జి. కళాశాల, తిరుపతి**

తెలుగు సాహితీ పుష్పవనంలో విరిసిన పుష్పాలెన్నో, అందులోనూ తెలుగు పరిమళాలను వెదజల్లిన కావ్యాలెన్నో, భాషాభిమానాన్ని ప్రకటించిన కవులెందరో, వారిలో తెలుగు భాషా మాధుర్యాన్ని మన కందించిన మహాభాగవత కర్త అయిన పోతన, శ్రీ వేంకటేశ్వరుణ్ణి తన పదాలతో స్తుతించిన అన్నమయ్య మన స్మృతిపథంలో మెదులుతారు. ఇద్దరూ భక్తిబాట పట్టినవారే. మోక్షమార్గాల్లో భక్తి ఒకటి. ఈ కలియుగంలో అందరికీ అనుసరణీయమైన మార్గం భక్తిమార్గమే. భగవద్భక్తిని సులభగ్రాహ్యంగా మనకందించి ఆ మాధుర్యాన్ని రుచి చూపించిన వారెందరున్నా పోతన, అన్నమయ్యల స్థానం చిరస్మరణీయమే.

పోతన కృతులెన్ని రచించాదని చెప్పినా, భక్తి పారవశ్యాన్ని కలిగించే భాగవతమే ప్రథమగణ్య మనడం అతిశయోక్తి కాదు. మన ఆధ్యాత్మిక సంపదకు మూలమైనది, హిందువుల పూజనీయ మహాగ్రంథం భాగవతము జనులకు భక్తి, జ్ఞాన, వైరాగ్య మార్గాలను తెలియజేసేది. ఇందులో విష్ణుభక్తుల పావన చరిత్రలు, మహావిష్ణువు అవతారాలు, లీలా విశేషాలు పొందుపరచబడినవి. 'భక్త్యా భాగవతం జ్ఞేయం' భక్తికి మూలమైన ఆధ్యాత్మికతను మానవునిలో ప్రేరేపించేది భాగవతం. ఇందులోని ప్రతి పాత్ర, సంఘటను, సన్నివేశము కూడా భక్తి మూలకమైనదే. భక్తి తామస, రాజస, సాత్త్విక భేదములచేత మూడు విధాలుగా చెప్పబడింది. భాగవతంలో ప్రహ్లాదుని ద్వారా నవవిధ భక్తి మార్గాలను చెప్పించాదు పోతన.

**"తను హృద్భాషల సఖ్యమున్ శ్రవణమున్ దాసత్వమున్ వందనా**
**ర్చనముల్ సేవయు నాత్మలో నెరుకయున్ సంకీర్తనల్ చింతనం**
**బను నీ తొమ్మిది భక్తి మార్గముల సర్వాత్మున్ హరిన్నమ్మి స**
**జ్జనుడై యుండుట భద్రమంచు తలతున్ సత్యంబు దైత్యోత్తమాట!"**

ఈ భక్తి మార్గాలలో దేనిని అనుసరించినా, మోక్షప్రాప్తి కలుగుతుందని భాగవతంలోని పాత్రలు మనకు ఋజువులు. శ్రవణం వలన పరీక్షిత్తు, కీర్తనం చేత శుకమహర్షి, స్మరణం చేత ప్రహ్లాదుడు, పాదసేవనము వలన లక్ష్మీదేవి, అర్చన వలన పృథుచక్రవర్తి, వందనాదులచే అక్రూరుడు, దాస్యము వలన ఆంజనేయుడు, సఖ్యము చేత అర్జునుడు, కుచేలుడు , ఆత్మ నివేదనము వలన బలిచక్రవర్తి, గోపికలు మోక్షాన్ని పొందారు.

పోతన తన పాత్రల చేత భగవంతుని స్మరిస్తే, అన్నమయ్య వేంకటేశ్వర తత్త్వాన్ని తనలోనే నింపుకొని అలౌకికానందాన్ని పొందాడు. భక్తి తత్త్వానికి కొత్తరూపు దిద్దిన పదకవితా పితామహుడు, అందరి ఆత్మల్లో శ్రీహరిని నింపినాడు. శ్రీ వేంకటేశ్వరుని తన శృంగార, ఆధ్యాత్మిక సంకీర్తనల ద్వారా స్తుతించాడు. ఆధ్యాత్మిక సంకీర్తనలలోనే కాక తన శృంగార సంకీర్తనల్లోనూ అంతర్లీనంగా భక్తి భావమే ఇమిడి ఉంది. తనను నాయికగా భగవంతుని నాయకునిగా భావించి రచించిన తన రచనల్లో శరణాగతి, లోకనీతి, ధర్మబోధ, భూతదయ, ఇతిహాస వేదాంత పరమైన సూక్తులు వంటి వెన్నో అంశాలు చోటుచేసుకున్నాయి. ఇంద్రియ గోచరం గాని పరమాత్మను పరబ్రహ్మ తత్త్వాన్ని సంకీర్తనల్లో ప్రదర్శింపజేసిన మహనీయు డితడే.

అన్నమయ్య తన జీవితకాలంలో 32,000 సంకీర్తనలు, శతకాది ఇతర రచనలు చేసినా మనకు దొరికిన సంకీర్తనలలో ఎక్కువగా శృంగార సంకీర్తనలే. ఇందులో లౌకిక శృంగార దృష్టి ఏమాత్రమూ లేదు. శృంగారాన్ని భక్తిలో పర్యవసానం చేసి జానపద మనస్తత్వంతో వెలయించిన కావ్యమిది. జానపదుడిగా వైష్ణవతత్త్వాన్ని అవగాహన చేసుకొన్న ఆధ్యాత్మిక కవిగా అవతరించావీ. అందువల్లే అన్నమయ్యలో ముగ్ధ మనోహర భావాలు, సామాజిక ఆలోచనలు, కుల, మత, వర్గాల కతీతమైన విష్ణుభక్తి దర్శనమిస్తాయి.

భాషను వినియోగించు కోవడంలో ఉండే సామర్థ్యాన్ని బట్టి కవి విశ్వరూపం తెలుస్తుంది. తెలుగులో తిక్కన, పోతన, అన్నమయ్య వంటి కవులు భాషకున్న చేవను సంపూర్ణంగా వినియోగించుకోగలిగారు. పండిత పామరులను కూడా మెప్పించగలిగిన సత్తా ఉన్నవారు.

**"కొందరకు తెలుగు గుణమగు**
**కొందరకు సంస్కృతంబు గుణమగు రెండు**
**గొందరకు గుణములగు నే**
**నందర మెప్పింతు నయ్యె యెడలన్"**

భక్తిరస ప్రధానమైన మహాభాగవతమును ఆంధ్రీకరించుట ఆంధ్రుల మహా భాగ్యము.

**"పుట్టంబుట్ట శరంబున న్మాలవ సంభోయాన పాత్రంబున**
**న్నెట్టంగల్గను గాలిఁ గొల్వను బురాణింపం దొరం కొంటి మీఁ**
**దెట్టే వెంటఁజరింతు నాసరణి నాకీవమ్మ యోయమ్మ మేల్**
**పట్టున్నాకగుమమ్మ సమ్మతిఁ జుమీ బ్రాహ్మీ దయాంభోనిధీ"**

అని వాల్మీకి వ్యాస కాళిదాసులలో తానెవ్వరికీ సరిపోలననీ, సరస్వతీదేవి అనుగ్రహమున తాను భాగవత పురాణమును ఆంధ్రీకరింప బూనితినని తెలుపుట చేత అతని సత్త్వగుణము, వినయశీలము వ్యక్తమవుతున్నది.

పోతన భాగవత రచన అతని మహోన్నత వ్యక్తిత్వాన్నే కాక తెలుగుజాతి జీవన విధానాన్ని అడుగడుగునా వ్యక్తపరుస్తున్నది.

**"ఓ యమ్మ నీకుమారుడు**
**మా యిండ్లను పాలు పెరుగు మననీదమ్మా"**

అని కృష్ణుని అల్లరి పనులను తల్లి యశోదతో గోపికలు మొరపెట్టుకోవడం చూస్తే తెలుగు ముంగిళ్ళు తారసపడతాయి.

**"కదులచ్చి కలిగెనేనియు**
**కుడుతురు గట్టుదురు గాక కొడుకుల నగుచున్"**

గోపాలకులతో తెలుగు చద్దులు, ఆవకాయ నోరూరించేటట్లు తినిపించాడు. బొమ్మల పెళ్ళిళ్ళు, గుజ్జనగూళ్ళు, బంతులాటలు ఆడించాడు.

**"లావొక్కింతయు లేదు...."**
**"వీరెవ్వరు కృష్ణులు గాదా...."**
**"ఇంతింతై వటుడింతయై...."**
**"సిరికిం జెప్పదు....."**
**"ఏమి నోము ఫలమొ యింత ప్రొద్దాక వార్తవింటి"**

అని తెలుగు వాతావరణాన్ని చూపించే ఇటువంటి పద్యాలెన్నో తెలుగువారికి ప్రీతిపాత్రమైనవి. అందుకే పోతనను ప్రజాకవిగా పలువురు కీర్తించారు. ఇటువంటి వాతావరణమే అన్నమయ్య పదాలలో కూడా ప్రతిబింబిస్తోంది.

**"తిట్టినఁ దిట్టినదే తప్పా**
**చెట్టమ్మా గుంపెన నీచేత" (12-37)**

అనే ఈ కీర్తనలో ఒకటి రెండు సంస్కృతం మాటలు తప్ప తెలుగు మాటలతోనే సాగుతుంది.

అంగడి చెట్టు (3-108), ఒడిగట్టు కొన్నందుకు (25-160) కన్నుల పండుగ (26-303), కన్నులేసినాదు (3-66), గుండె రాయి చేసుకొని (28-496), మీసాల మీదటి తేనె (2-53) అని అన్నమయ్య వాడిన పలుకుబడులన్నీ నేటి వాడుకలో ఉన్నవే. ఇవి అన్నమయ్య లోకజ్ఞతను, ప్రజలతోడి సన్నిహిత సంబంధాన్ని తెలుపుతాయి.

**"గోరబొయ్యే దానికి గా గొడ్డ లేటికి" (24-120)**
**"గోరు చుట్టపై రోకటి పోటాయ గదమ్మా" (12-238)**
**"తాము గెలియరు తగం జెప్పిన వినరు" (2-142)**
**"నీటముంచు పాలముంచు నీ చిత్తమికను" (9-224)**

ఇటువంటి సామెతలు, పలుకుబళ్ళు, వంటివి మన భాషా ప్రాముఖ్యాన్ని తెలిపే ప్రయోగాలను పదసాహిత్యమంతా సముచితరీతిలో ప్రయోగించాడు.

పోతన భాగవత పీఠికలో భాగవతాన్ని కల్పవృక్షంతో పోల్చాడు. నన్నయ తిక్కనాదులు భాగవతాన్ని అనువదించకుండా వదలిపెట్టడం తన భాగ్యమన్నాడు. హాలికుడుగా జీవనాన్ని గడిపిన పోతన పేదరికం పోగొట్టుకోవడానికి పెన్నిధి దొరికితే ఆనందపడాలి, లేదా తన కవిత్వానికి రాజులిచ్చిన ధన, కనక, వస్తు, వాహనాదులను కోరుకోవాలి. కానీ ఇవేవీ కాక భాగవతాన్ని ముందు తరాలవారు తనకు వదలినందుకు సంతోషపడ్డాడు. భాగవత అనువాదాన్నే నిధిగా భావించి తృప్తి చెందాడు. పోతన ఆధ్యాత్మిక వ్యక్తిత్వానికి ఆదర్శానికి నిదర్శనాలివి. ఆదర్శాన్ని నమ్ముకొని జీవిస్తున్న వ్యక్తికి అర్థ సంపాదన తృణప్రాయంగా తోస్తుంది. అందుకే తన భాగవతాన్ని రాజుల పరం చేయకుండా రామునిపరం చేయాలనే నిర్ణయం, అతని వ్యక్తిత్వాన్ని ఉన్నతి శిఖరాలపై కూర్చో బెట్టింది.

**"పలికెడిది భాగవతమట**
**పలికించెడి వాడు రామభద్రుండట"**

అని కావ్యాన్ని పలికించిన వాడు శ్రీరామచంద్రుడే అని నమ్మాడు. రాజాశ్రయం పొందిన కవులు రాజులను నాయకులుగా చిత్రించేవారు. రాజాశ్రయాన్ని పొందిన కవులెందరో భోగభాగ్యాలను అనుభవించారు. పోతన దీనిని కోరుకోలేదు. పైగా "పుడమి పతుల పడుపుకూడు భుజించడం కంటే హాలికుడుగా హాయిగా బ్రతకడం" మేలన్నాడు. ఆనాడు ఒక సంప్రదాయంగా వస్తున్న పద్ధతిని కాదని అందరికీ మేలు చేకూర్చే హాలికుడుగా ఉంటానని స్వతంత్రతను వ్యక్తం చేశాడు.

**"మందార మకరంద మాధుర్యమునఁదేలు**
**మధుపంబు వోవునే మదనములకు**
**నిర్మల మందాకినీ వీచికలఁదూగు**
**రాయంచ చనునే తరంగిణులకు**
**లలిత రసాల పల్లవ ఖాదియై చొక్కు**
**కోయిల చేరునే కుటజములకు**
**పూర్ణేందు చంద్రికా స్ఫురిత చకోరకంబరగునే**
**సాంద్ర నీహారములకు"**

అని అంటూ...

**"కేశవ చింతనామృతా స్వాద మత్త చిత్తమేరీతి**
**నితరంబు చేరనేర్చు"**

అని ఆకాశమార్గంలో స్వేచ్ఛగా విహరించే తుమ్మెదల్ని, హంసల్ని, కోయిలలను, చకోరపక్షుల్ని ఉదహరించి కావ్య ప్రపంచంలో తన స్వేచ్ఛను ప్రహ్లాదుడి ద్వారా మనకు దర్శింపజేశాడు. ఇందులో తాత్వికత కూడా గోచరిస్తుంది. ఆధ్యాత్మిక జీవితానికి అలవాటు పడ్డవారిని సంసారిక వ్యామోహం కట్టిపడవేసినా మనసు నిరంతరం పరమాత్మనే కోరుకుంటుంది.

**"రాజుల్మత్తులు, వారిసేవ నరక ప్రాయంబు, వారిచ్చు నం**
**భోజాక్షీ చతురంతయాన తురగీ భూషాదు లాత్మవ్యధా**
**బీజంబుల్, తదపేక్షచాలుఁ బరితృప్తిం బొందితిన్ జ్ఞానల**
**క్ష్మీ జాగ్రత్పరిణామ మిమ్ము దయతో శ్రీకాళహస్తీశ్వరా"**

అని ధూర్జటి రాజాశ్రయాన్ని నిరసించినట్లు పోతన కూడా తన వైఖరిని వ్యక్తం చేస్తాడు. అదే విధంగా అన్నమయ్య -

**"మనుజుఁడై పుట్టి మనుజుని సేవించి**
**అనుదినము దుఃఖమందనేలా"** **(1-196)**

అని మానవుని సేవించడం కంటే దుర్భరము మరొకటి లేదన్నాడు.

**"సిరులు రాజైతే నేమి సేసిన నేరమిలేదు**
**పరమాధికారియైనఁ బాపము లేదు"** **(2-29)**

సంపదలతో అహంకారం పెరిగిన రాజు తానేమిచేసినా న్యాయమనే భావనతో ఉంటాడు. అన్నమయ్య ఈ విధంగా రాజుల మీద ధనవంతుల మీదా విముఖతను ప్రకటించాడు.

లోకహితమే కావ్యము యొక్క అంతరార్థము. కాబట్టి మానవుని సరైన మార్గంలో నడిపించే మంచి మాటలను సూక్తులుగా పోతన పద్యాలలో గుదిగుచ్చాడు.

**"మాట తిరుగలేరు మానధనులు"**

**"సంతుష్టుడీ మూడు జగముల పూజ్యుడు"**

వంటివి ఆచరణ యోగ్యమైనవి.

**"వారిజాక్షులందు వైవాహికములందు**
**ప్రాణ విత్తమాన భంగములందు**
**చకిత గోకులాగ్ర జన్మ రక్షణమందు**
**బొంకవచ్చు నఘము పొందదధిప"**

రాక్షస గురువు శుక్రాచార్యులు చెప్పిన ఈ నీతి పద్యంలో కొన్ని కొన్ని సందర్భాలలో అబద్ధం చెప్పినా తప్పు కాదని పాపము అంటదనే వివరణ కనిపిస్తుంది.

**"కారే రాజులు రాజ్యముల్ గలుగవే గర్వోన్నతిం బొందరే**
**వారేరీ సిరి మూట గట్టుకొని పోవం జాలిరే....."**

లోకంలో ధనం కంటే విలువైనది దాన గుణమని చెప్పే ఇటువంటివి పోతన భాగవత సూక్తులకుదాహరణ.

మానవుడు నిజ జీవితంలో అనుసరించాల్సిన మార్గాలెన్నో సూక్తుల రూపంలో గ్రంథాలలో దర్శనమిస్తుంటాయి. నన్నయాది కవులు కూడా సూక్తులను వాడడంలో ఆసక్తిని చూపించారు. నన్నయ కవితా లక్షణాలలో ఒకటి 'నానాకవితార్థ సూక్తి

నిధి', ఎఱ్రనది కూడా సూక్తి వైచిత్రిగా కొనియాడారు. అటువంటి సూక్తులే అన్నమయ్య పదాలలో అప్పటికి, ఇప్పటికి, ఎప్పటికీ అనుసరణీయమైన మార్గాలుగా మనకు తారసపడుతాయి.

**"ఎంత చదివిన నేమి వినిన తన**
**చింతయేల మాను సిరులేల కలుగు"**

మానవుడు ఎన్ని చదువులు చదివి, ఎంత పాండిత్యము ఉన్నా, పెద్దల మాటలు ఎన్ని విన్నా చెడుమార్గం పట్టకుండా మంచి శీల సంపన్నుడైనప్పుడే ఉన్నతుడౌతా నన్నాడు.

పరధనాపేక్ష పనికి రాదని –

**"పరధనముల యాస పాసిన గాక**
**అరిది నిందలు లేని యప్పుడుగాక"**

అని మంచిని పెంచుకుంటే మానవులకు సద్గతి కలుగుతుందని ప్రబోధించాడు.

భగవంతుని సృష్టిలో హెచ్చు తగ్గులు లేవని సర్వస్వమూ బ్రహ్మమయమని–

**"నిండార రాజు నిద్రించు నిద్రయు నొకటే**
**అండనే బంటు నిద్ర నదియు నొకటే"**

ఈ సర్వసమానత్వ భావము ఈనాడెంతైనా అవసరమే.

మానవ జీవితాన్ని ఒక నాటకంగా, అందరికీ అర్థమయ్యే విధంగా జీవి తత్వాన్ని తెలిపాడు. ఎంతవిన్నా, ఎన్ని చదివినా, ఎంత శాస్త్ర చర్చచేసినా, విజ్ఞానవంతులైనా పుట్టడం, గిట్టడం అను రెండు ఘట్టాలు అందరి జీవితంలో సర్వ సాధారణమని, దాని మధ్య కాలమంతా నాటకమని అంటాడు.

**"నానాటి బదుకు నాటకము**
**కానక కన్నది కైవల్యము"**

ఈ బతుకు నుండి విముక్తి పొందాలంటాడు.

**"ఆకటి వేళల నలపైన వేళల**
**లేకువ హరినామమే దిక్కు మరిలేదు"**

అని సర్వకాల సర్వావస్థలలోనూ హరినామస్మరణమే దిక్కని వర్ణించాడు.

ఇంచుమించు ఒకే కాలమునందు, తెలుగునాట తిరగాడిన మహాకవులు, భక్తకవులు విష్ణువు అవతారాలను కొలిచి తరించినవారు. భగవంతుని సేవకులుగా అలౌకికానందాన్ని పొందిన వారు. తెలుగు మాటలు నానుడులు, పలుకుబడులు, సూక్తులు, వర్ణనలను కనులపండువుగా చెవికింపుగా వెలయించినవారు. తెలుగు వారి అదృష్టవశమున భక్తిరస కావ్యాలతో, పదాలతో మన మనో నేత్రాలలో ఇమిడిపోయిన పోతన, అన్నమయ్యలు, ఇద్దరూ రాజాశ్రయాన్ని నిరశించి భగవద్భక్తుల సేవ, భగవంతుని సేవ శాశ్వతమని తలచినవారు. వీరు తెలుగు కృతులను రచించడం తెలుగువారిగా మనందరి భాగ్యం.

***

# తాళ్లపాక పదకవుల సంకీర్తనలలో శ్రావణ భాద్రపదమాస పర్వాది దేవతలు

**శ్రీమతి సి. లత**
**పరిశోధక విద్యార్థిని**
**శ్రీ వేంకటేశ్వర ప్రాచ్య పరిశోధన సంస్థ, తిరుపతి**

గీతాచార్యుడు భగవద్గీత పదియవ అధ్యాయం విభూతియోగంలో

**అక్షరాణామకారోస్మి -**
**ద్వన్ద్వ సామాసికస్య చః**

అని అక్షరాలలో తాను 'అ'కారమని, సమాసాలలో ద్వంద్వ సమాసం తానని ప్రకటించుకున్నాడు. ప్రాపంచిక జీవనమంతా ద్వంద్వాత్మకం. అలాగే భాషలో చాల విశిష్టమైనవి జంటపదాలు, జమిళపదాలు. కష్టసుఖాలు, భార్యాభర్తలు, అన్నదమ్ములు లాగే వెనుకటి రోజుల్లో 'శ్రావణ భాద్రపదాలు' అనేవారు. ఈ రెండూ దక్షిణాయనంలో వచ్చేవి. వర్షర్తు మాసాలు ప్రయాణాలకు అనుకూలం కానివి. ఇంట సర్వం సమకూర్చుకుంటే శ్రావణ భాద్రపదాలలో ఇబ్బందులుండవని భావించేవారు. ఈ భావన సాంసారికమయినా తిరుమల ఆలయోత్సవాల దృష్ట్యా అలాగే శ్రీ వైష్ణవ సంప్రదాయాల దృష్ట్యా శ్రావణ భాద్రపదాలు చాలా ముఖ్యమైనవి.

ద్వాదశమాస పరిగణనంలో 'శ్రావణం' ఐదవది, నక్షత్రాలలో 22 వది శ్రవణనక్షత్రం. శ్రవణ నక్షత్రం గల మాసం కనుక శ్రావణ మాసమని వ్యవహారం. ఇది చాంద్రమాస సంప్రదాయం. ఈ నక్షత్రం మకరరాశికి సంబంధించింది. ఈ సంవత్సరంలో శ్రావణమాస అవధి 27-7-14 నుండి 25-8-14 వరకు. అలాగే భాద్రపదం ఆరవది. పూర్వాభాద్ర, ఉత్తరాభాద్ర నక్షత్రాల మాసం భాద్రపద మాసం. ఈ రెండు నక్షత్రాలు మకర మీన రాశులకు సంబంధించినవి. ఈ సంవత్సరంలో భాద్రపద మాసం 26-8-14 నుండి 24-9-14 వరకు. ఈ రెండు మాసాలలో అనేక దేవతోత్సవాలున్నాయి. శ్రీవైష్ణవ సంబంధిగా పరిశీలిస్తే చక్రత్తాళ్వార్ తిరునక్షత్రం, ఆండాళ్ తిరునక్షత్రం, గరుడపంచమి, వరలక్ష్మీవ్రతం, హయగ్రీవ జయంతి, గోకులాష్టమి, శ్రీజయంతి, శిక్యోత్సవములు శ్రావణ మాస సంబంధమయితే వరాహ, వామన, అనంతపద్మనాభాది వ్రతాదులు భాద్రపద మాస పర్వాలు. వీటిలో చాలా వరకు తాళ్ళపాక పద సాహిత్యంలో దేవతాపరంగా, నక్షత్రపరంగా, ఉత్సవ పరంగా ఉల్లేఖనాలున్నాయి. వీటిలో కొన్నింటిని వివరించడమే ఈ వ్యాస ప్రధానోద్దేశ్యం.

**దేవతాపరం :** చక్రత్తాళ్వార్ అంటే సుదర్శనచక్రం. వైష్ణవులు పంచ సంస్కారాలకు, పంచాయుధాలకు ప్రాధాన్యమిస్తారు. ఉత్సవాలలో సుదర్శన చక్రం స్థానం అతివేలం. అంతేకాదు స్వామి చేతనుండే ఆయుధం. ఎప్పుడు అవసరమయితే అప్పుడు

ప్రయోగింపబడేది. మరల స్వామిని చేరుకొనేది. విష్ణువు, విష్ణు అవతార కథలను పరిశీలిస్తే సుమారు 28 కథలలో చక్రత్తాళ్వార్‌కు ప్రాధాన్యముంది. కేవలం ఆయుధంగా కాకుండా ఉపాసనలో కూడా చక్రాయుధ ధ్వనికి ప్రాధాన్యముంది. తాళ్ళపాక పదకవులు సుదర్శన చక్రోపాసకులు. తాళ్ళపాక పెదతిరుమలయ్య సుదర్శన రగడ వ్రాసినవాడే. తిరుపతి కపిలతీర్థంలో నలుమూలల సుదర్శన శిలాఫలకాలను ప్రతిష్ఠ చేసినవాడే. తాళ్ళపాక వారి పదసాహిత్యంలో సుదర్శన సంబంధి పాటలెన్నో ఉన్నాయి. మచ్చుకు –

**"చక్రమా హరిచక్రమా**
**వక్రమైన దనుజుల వక్కలించవో"** **(1-183)** అలాగే...

**"నమోనమో దానవవినాశ చక్రమా**
**సమరవిజయమైన సర్వేశు చక్రమా"** **(3-282)**

**రెండవది ఆండాళ్ స్తవం** : ఆండాళ్ ఆళ్వారులలో ఒకరు. గోదా నామాంకితురాలు. ఈమె కథనే రాయలు ఆముక్తమాల్యదగా రచించాడు. తాళ్ళపాక పద సాహిత్యంలో ఏకైక కీర్తన చూడరమ్మ సతులాల –

**"చూడరమ్మ సతులాల సోబాన బాడరమ్మ**
**కూడున్నది పతి చూడికుడత నాంచారి"** **(26-246)**

**మూడవది గరుడునికి సంబంధించినవి** : అనంత, గరుడ, విష్వక్సేనాదులను నిత్యసూరులనడం వైష్ణవ పరిభాష. తిరుమల అద్రులలో ఒకటి గరుడాద్రి. బ్రహ్మోత్సవ వాహనాలలో సుప్రసిద్ధం గరుడవాహనం. స్వామికి అత్యంత ఆప్తుడు గరుడాళ్వార్. ఈ గరుడుని తాళ్ళపాక పదకవులు నుతించారు.

**"ఇటు గరుడని నీ వెక్కినను**
**పటపట దిక్కులు బగ్గన బగిలె"** **(1-92)** ఇలాంటివే.

**నాల్గవది** : 'వరలక్ష్మి' అన్నమయ్య కీర్తనలలో పద్మావతికి, క్షీరాబ్ధిజాతకు తేడాలు లేవు. లక్ష్మి అనేక రూపాలలో వర్ణించబడింది. వరలక్ష్మి, వీరలక్ష్మి, రూపాలు మొదలైనవి మచ్చుకు –

**"జయలక్ష్మి వరలక్ష్మి సంగ్రామ వీరలక్ష్మి**
**ప్రియురాలవై హరికి బెరసితివమ్మా"** **(19-520)**

**ఉత్సవపరంగా చెప్పినవి** : వీటిలో గోకులాష్టమి, శ్రీజయంతులు. శ్రీ వైష్ణవులు నక్షత్రానికి ప్రాధాన్య మిస్తారు. అయినా తాళ్ళపాక పదకవుల రచనలలో ఈ రెండు ఉన్నాయి. శ్రీ వైష్ణవులకు రాముని తరువాత కృష్ణుడు ఆరాధ్యదైవం. కారణం ఆ స్వామి పూర్ణావతారుడు. అదీగాక గీతోపదేశం చేసినవాడు. శరణాగతిని బోధించినవాడు. అంతేగాక భారతదేశంలో కృష్ణారాధన 15, 16 శతాబ్దాలలో ఎక్కువగా ఉండేది. కృష్ణకర్ణామృతం లాంటి గ్రంథాల ప్రభావం తాళ్ళపాక వారి మీద వుంది.

ఇతర అవతారాల కంటే కృష్ణావతారంలోని శైశవదశకు ప్రాధాన్యం ఎక్కువ. అందువల్లనే తాళ్ళపాక పదకవులు శ్రీకృష్ణుని బహుదా కీర్తించినారు. తాళ్ళపాక పదకవుల సంకీర్తనల రాశిలో ఇవే ఎక్కువ. అన్నమయ్య, పెదతిరుమలాచార్యులు ప్రధానంగా తిథిని, నక్షత్ర యుక్తమైన రోహిణీ, శ్రీజయంతిని సమానంగా పరిగణించి కీర్తనలు వ్రాశారు. మచ్చుకు –

**అన్నమయ్య: "సతులాల చూడరే శ్రావణ బహుళాష్టమి
గతలాయ నడురేయి గలిగె శ్రీకృష్ణుడు"** **(14-453)**

**"వింటిరటె యీ సుద్దులు వెలదులాల
జంటగా రాముడు ముందె జనియించినాడట"** **(29-30)**

**పెదతిరుమలయ్య: "అవతారమందె నిదె అద్దమరేతిరికాడ
భవహరుడు శ్రావణబహుళాష్టమిని"** **(17-144)**

అలాగే అన్నమయ్య సంకీర్తనల్లో శ్రీజయంతి –

**"దేవతలు గెలువరో తెగి దైత్యులు పారరో
భావించ నింతటిలో భూభారమెల్ల నణగె"** **(2-478)**

**"శిష్టరక్షణమును దుష్టనిగ్రహము
సృష్టించె నొక్క వేళనే శ్రీజయంతినాడు"** **(3-259)**

కృష్ణాష్టమి సంకీర్తనల తరువాత తాళ్ళపాక పదకవులు ఉరి అడి అని చెప్పబడే ఉట్ల పండుగకు ప్రాధాన్యమిచ్చారు. ఇది సామాజికోత్సవం. దక్షిణదేశ సంప్రదాయం. కృష్ణానుభవాన్ని బాలురలకు కూడా ఉద్దీపితం చేయడం ఈ ఉత్సవ వైశిష్ట్యం.

**"ఎచ్చట జూచిన నితడై కృష్ణుడు
మచ్చిక నలమేలుమంగతో వెలసీ"** **(29-31)**

అలాగే...

**"ఎవ్వరింత సేసిరమ్మ యీతడే కాక
రవ్వ జూడబోయి వీని రతికి లోనైతిమే"** **(16-180)**

**పెదతిరుమలయ్య– "బాపురే యెంతటి జాణ బాలకృష్ణుడు చూడ
బాపనివలె నున్నాడు బలరామకృష్ణుడు"** **(17-206)**

**అనంతపద్మనాభ వ్రతం :**

అనంత శబ్దానికి ఆకాశం, ఆదిశేషుడు, అవధిలేనిది అనే అర్థాలున్నాయి. పద్మనాభ శబ్దం పద్మమును నభియందు కలది అని, క్షీరసాగర శయనుడైన శ్రీ మహావిష్ణువుకు సూచిస్తుంది. ఆ స్వామివారికి జరుపు వ్రత ఉత్సవాలలో అనంతపద్మనాభ చతుర్దశీ ఉత్సవం ఒకటి. అన్నమయ్య కాలం నాడు ఈ ఉత్సవానికి ఎంతో ప్రాధాన్యముందని తెలుస్తున్నది.

**"ఎదుటి నిధానమ వెటుచూచిన నీ-**
**వదె వేంకటగిరి యనంతుడా"** **(1-344)**

తాళ్ళపాక వారి సంకీర్తనలలో వరాహ, వామన జయంతులు ప్రత్యేకంగా చెప్పకపోయినా కేశవాది నామాలతో 'వామన' సంబంధి కీర్తనలున్నాయి. వాటిలో ప్రసిద్ధమైనవి -

తాళ్ళపాక పెదతిరుమలయ్య కీర్తన -

**"వద్దు వద్దు సటలింక వామనా నీ**
**వద్దనే వున్నార మిదె వామనా"** **(15-244)**

తాళ్ళపాక పదకవులు క్షేత్రయాదుల్లాగా కేవలం సంచారకవులు మాత్రం కారు. పరిమితంగా కొన్ని క్షేత్రాలను మాత్రం దర్శించినవారు కారు. వారు ఆలయకవులు. ఆలయంలో జరిగే ప్రతి ఉత్సవాన్ని కళ్ళారా దర్శించినవారు. తనివి తీరా తన్మయులై వర్ణించినవారు. తమ అనుభూతిని అక్షరబద్ధం చేసినవారు. వాటిలో శ్రావణ, భాద్రపద పర్వోత్సవాల సంకీర్తనలకు ప్రత్యేక స్థానముందనడం నిర్వివాదాంశం.

***

# అన్నమయ్య కవితా వైభవం

**డా॥ కె. ఆశాజ్యోతి**
**తెలుగు శాఖాధ్యక్షులు**
**బెంగళూరు విశ్వవిద్యాలయం**
**బెంగళూరు**

**"ఆకటి వేళల అలపైన వేళల**
**తేకువ హరినామమే దిక్కు మరి లేరు"**

అన్న అన్నమయ్య కేవలం ఆకలి-అలపు ఈ రెంటి సందర్భంలో గాఢంగా హరి నామ మొక్కటే దిక్కని చెప్పినా మనసా-వాచా-కర్మణా ప్రతి ఘడియలోనూ హరినామం స్మరించాడు. ఆకలి వేళ హరినామం ఎలా సంరక్షిస్తుందో అనుభూతించిన వాడు అన్నమయ్య స్వతహాగా అనుభవించాడు కనుక ఆ తాదాత్మ్యతను అక్షర బద్ధం చేసాడు. అలపైన వేళలు - అన్నపుడు మనిషి తన పరిధిని దాటి, తన శక్తిని మించి నిస్సహాయ స్థితిని అనుభవించే తరుణంలో - నీవే తప్ప ఇతః పరంబెరుగనన్న క్షణంలో భగవంతుడు తప్ప మరిక ఎవ్వరూ రక్షించలేరన్న స్థితిలో నిర్మోహుడైన మనిషి ఆత్మ-పరమాత్మ సంయోగం కోసం వేచి ఉన్న స్థితి! అదే శరణాగతి! ఆత్మనివేదనతో భగవంతుని స్మరణ సదా చేసాడు అన్నమయ్య! అన్నమయ్య సంకీర్తనలన్నీ వైష్ణవ

భక్తి ప్రబోధకత! ఆ భక్తి తత్త్వం తెలుగు భాషా సాహిత్యాలకు కొత్త వన్నె తెచ్చింది. సంకీర్తనా వైభవం తెలుగు సాహిత్యానికి పూలకు తావిలా వైభవ పరిమళాలను వెదజల్లింది.

అన్నమయ్య కవిత్వంలో సారత్వం దేశి పలుకుబడులలోని సొబగు, జానపదంలోని స్వచ్ఛత కనబడతాయి. ఆత్మ ప్రబోధం, ఆత్మావలోకనం, లౌకిక జీవనతత్త్వం, స్వీయానుభూతి లక్షణాల్లు అన్నమయ్య సంకీర్తనలలో కనబడతాయి. దేశికవితా గుబాళింపులు నిత్య పలకరింపులు అన్నమయ్య సంకీర్తనలలో –

**"విన్నపాలు వినవలె వింత వింతలు**
**పన్నగపు దోమతెర పైకెత్తవేలయ్యా"**

**"చందమామ రావే! జాబిల్లి రావే"** అన్నా

**"జో అచ్యుతానంద జోజో ముకుందా"** అన్నా అన్నమయ్య మనోఫలకంపై కదలాడక మానదు.

కవిత్వంపై–భాషపై అన్నమయ్య చేసిన ప్రయోగాలు ఎన్నో! భగవంతుని పట్ల మమేకత్వం–తాదాత్మ్యం అన్నమయ్య భావనాశక్తిని మేరునగధీరత్వానికి చేర్చాయి. ఆ ఔన్నత్యం తెలుగు భాషకు ఎనలేని సౌందర్యాన్ని ఇచ్చింది. నాయికా వర్ణనను కనుమలతో పోల్చడం కొత్తదనమే కాదు ఆశ్చర్యం కూడా!

**"సొంపుల నీ కదనపు సోమశిల కనుమ**
**యింపులెల్ల జేకొనగ నిల్లు నీపతికి"          (12-115)**

అంటూ కనుమల వర్ణన సాగిపోతుంది. ఈ కనుమల ప్రస్తావనలోని ఆంతర్యం చెబుతూ డా॥ గుమాలి సాంబశివరావు "అన్నమాచార్య సంకీర్తనముల లోని వర్ణనలు" గ్రంథంలో "ప్రతి కనుమ దగ్గర ఏదైపునో ఒక వైపున చెన్నకేశవస్వామి ఆలయం వుంది" (పుట 68) అని తెలిపారు.

**"బ్రహ్మ కడిగిన పాదము**
**బ్రహ్మము తానె నీ పాదము"**

అంటూ అన్నమయ్య వెంకటేశ్వరుని పాదారవిందాలను కీర్తిస్తూ

**"పరమ యోగుల బరిపరి విధముల**
**వరమొసగెడి నీ పాదము"**

అంటూ ముగిస్తాడు.

కలికాలపు వైపరీత్యానికి ఆశ్చర్యపోయిన అన్నమయ్య ఇలా అంటారు.

**"కటకటా మీరితివి కలికాలమా, పుణ్య**
**ఘటన గరవైపోయె గలికాలమా"**

అంటూ దిగులుపడ్డాడు.

మనిషి నైజం మారనంత వరకు ప్రయోజనం శూన్యం అని నమ్మిన వాడు అన్నమయ్య అందుకే -

**"ఎంత చదివిన నేమి వినిన కలుగు**
**ఇతర దూషణములు యెడసిన గాక"** **(1-62)**

దుర్లక్షణాలను విడిచి ఆత్మలో హరిని వెదికినప్పుడే మనుగడ సాధ్యమంటారు.

భక్తిని అన్నమయ్య ఎన్ని రకాలుగా చూపాడో ఈ సంకీర్తన తెలుపుతుంది. నవ విధ భక్తులను దాటి అన్నమయ్య ఎంతదూరం ప్రయాణించాడో ఈ సంకీర్తనలో తెలుస్తుంది.

**"నానా భక్తులివి నరుల మార్గములు**
**యే నెపానైనా నాతడియ్యకొను భక్తి"**

హరినామ స్మరణ కష్ట నివారణం అన్న విషయం అన్నమయ్య సంకీర్తనలో విపులంగా తెలుపుతున్నాడు. సృష్టి స్థితి లయలకు హరి మూలకారణం అని తెలిపే సంకీర్తన ఇది.

**"భావములోన బాహ్యమునందును**
**గోవింద గోవిందయని కొలువవో మనసా"** **(3-561)**

బాలకృష్ణుని రూప సౌందర్యంతో పాటు దేవకీ సుతుడు ఎవరెవరికి ఆయా సందర్భాలలో ఎంతటి ఆత్మీయుడో, ప్రియతముతో తెలిపేందుకు మణులను భావనాత్మకంగా ఉపయోగించిన తీరు వన్నె తెచ్చే సౌందర్యం.

**"ముద్దుగారే యశోద ముంగిట ముత్యము వీడు**
**తిద్దరాని మహిమల దేవకీసుతుడు"** **(3-577)**

స్త్రీ మనస్తత్వాన్ని తెలిపే సంకీర్తన ఇది.

**"ఎంత వాడనైన నిన్ను నింతసేసితి**
**యింతిని నాయపరాధా లెట్టోరి చేవయ్యా**
**చేరరమ్ముంటే రానైతి చెక్కులు చేతగిల్లితి"**

ఆత్మీయతను, అనురాగాన్ని కోరి వచ్చే అదృష్టాన్ని కోరుకోమని తిరిగి మళ్ళీ మళ్ళీ తలుచుకొని దిగులు చెందే స్త్రీ మానసిక స్థితిని తెలపడంలో అన్నమయ్య సిద్ధహస్తుడు.

తెలుగువారి పూజా సంస్కృతిని అన్నమయ్య తెలుపుతున్నాడు. బ్రహ్మోత్సవాలలో రోజువారీ ఆరగింపుల ప్రత్యేకతను ఇక్కడ తెలిపాడు.

**"తిరువీధుల మెరసీ దేవదేవుడు**
**గరిమల మించిన సింగారములతోడను"** **(7-102)**

చీరలకు బేహారిని అన్నమయ్య ఎంత నిశితంగా పరిశీలించాడో ఇక్క తెలుస్తుంది.

**"వాడవాడల వెంట పాడివో పాడివో**
**నెడ నుండి చీరలమ్మే నేత బేహారి"** **(1-275)**

దేవదేవుడికి అన్నమయ్య ఆరగింపుతో తెలిపే సంకీర్తన ఇది.

**"వేకువ తిరుపళచ్చి విష్ణునికి జేయరో**
**ఆకటి కొడగినట్టి ఆరగింపులు"** **(3-9)**

భౌతిక జీవితాన్ని ఆధ్యాత్మికతకు జత చేసిన అన్నమయ్య వెంకటేశ్వరుని భార్య అన్ని రాశుల లక్షనాలు కలగలుపుకొని మంగళకర లక్షణ సంయుతురాలై వేంకటేశ్వరునికి తోడై వున్న తీరును ఈ కీర్తన చెబుతుంది.

**"ఇన్ని రాసుల యునికి యింతి చెలువపు రాశి**
**కన్నె నీ రాశి కూటమి గలిగిన రాశి"**

రాశులతో సాదృశ్యాన్ని వర్ణిస్తూ స్త్రీని పోల్చడం అన్నమయ్యకే చేతనైన భక్తి పారవశ్య గుణం.

అన్నమయ్య సంకీర్తనల అక్షింతలలో వేంకటేశ్వరుడు తడిసి ముద్దైపోయాడు. తనవితీరని వేంకటేశ్వరుడు నిరంతరం ఆ సంకీర్తనలకై పరితపిస్తూ కఠంతో నేటికీ మారుమోగుతున్న సంకీర్తనలలో ఇది ఒకటి.

**"జగదపు జనవుల జాజర**
**సగినల మంచపు జాజార"** **(5-274)**

వేంకటేశ్వరుని దర్శనానికై యోజనాలు దాటి కదలి భక్తులు ఎలా వస్తున్నారో తెలిపే సంకీర్తన ఇది.

**"నానా దిక్కుల నరులెల్లా**
**వానలలోననే బరి సరులు బాంధవులు"**

పెండ్లిపిలుపుల వైనం ఇక్కడ కనపడుతుంది. వేంకటపతి అలిమేలుమంగకు జరిగే పెండ్లికి రమ్మని ఈ పిలుపు చూదండి. అన్నమయ్య ఆదరణ తెలుస్తుంది.

**"పసిడి యక్షింతలివె పట్టరో వేగదు రారో**
**దిసల బేరంటాండ్లు దేవుని పెండ్లికిని"**

పురాణ కథల ప్రమేయాన్ని భక్తికి జోడించి అన్నమయ్య రాసిన సంకీర్తనలలో ఇదొకటి.

**"దేవదేవు డెక్కినదె దివ్యరథం**
**మావంటి వారికెల్ల దివ్యరథము"**

ఉట్ల పండుగ వర్ణనతో జానపద మనస్తత్వం అన్నమయ్యకు ఎంత సమీపంలో వుందో తెలుస్తుంది.

**"పచ్చిదేరచు నట్లుపండు గాయను**
**గచ్చులను గొల్లెతలు - కౌగిలించిపట్టగా"**

**ముగింపు :**

**అ అంటే అమ్మ**
**అ అంటే అన్నమయ్య కూడా!**

బిడ్డకు తల్లి ఎంతవసరమో అన్నమయ్య లాలిపాటలు - సంకీర్తనలు అంతే అవసరం. అమ్మను స్మరించే ప్రతి వ్యక్తీ జీవితంలో ఏదో ఒక సందర్భంలో అన్నమయ్య పదాలను పలకవలసిందే! అమ్మనూ-అన్నమయ్యను స్పృశించకుండా - స్మరించకుండా జీవితాన్ని దాటి వెళ్ళలేదు ఏ వ్యక్తైనా!

తన పదాలను వేంకటేశ్వరస్వామి పాదాల కంకితం చేసి - తన సంకీర్తనలతో వేంకటేశ్వర స్వామిని పులకాంకృతుణ్ణి చేసి, తన వాక్కు గేయాలతో వాగ్గేయకారుడై వేంకటేశ్వరుణ్ణి తన్మయుణ్ణి చేసి, భగవద్భక్తి తత్వాన్ని ఎన్నో సంకీర్తనల్లో పొందుపరచి, నిష్కామకర్ముడై నవ విధ భక్తి భేదాలను సంకీర్తనల్లో పొందుపరచిన తాత్వికుడు అన్నమయ్య.

**"తిరువీధుల మెరసీ దేవదేవుడు**
**గరిమల మించిన సింగారములతోడను"**

అంటూ బ్రహ్మోత్సవాలను చిత్రించినా,

**"కంటి నఖిలాండ కర్తనధికుని గంటి**
**కంటి నఘములు వీకొంటి, నిజమూర్తి గంటి"**

అంటు వేంకటేశ్వరుని దివ్యసుందర దర్శన తాదాత్మ్యం తెలిపినా -

**"పరమ యోగులకు పరిపరి విధముల**
**వరమొసగెడి నీ పాదము"**

అంటూ హరిపాదాలను కీర్తించినా -

**"అరయనే జీవుడ నంతర్యామిని**
**యిరవుగ దాసుడ నేలికవు"**

అంటూ భక్తి పారవశ్యంతో ఆత్మనివేదనం చేసుకున్నా -

**"అతిశయంబైన శేషాద్రి శిఖరము గంటి**
**ప్రతిలేని గోపుర ప్రభలు గంటి"**

అంటూ భవబంధాలను తెంచుకున్నా -

**"నిండార రాజు నిద్రించు నిద్రయు నొకటే**
**అండనే బంటు నిద్రదియు నొకటే"**

అన్నా -

**"ఏ కులజుడేమి యెవ్వడైన నేమి**
**ఆకడ నాతడె హరి నెరిగినవాడు"**

అంటూ భగవత్సాక్షాత్కారానికి కులతత్వం అవసరం లేదని తెలిపిన అన్నమయ్య సాక్షాత్తు మానవతావాది నాటి కాలానికే!

అన్నమయ్య మనుమడు తాళ్ళపాక చినతిరుమలాచార్యుడు అన్నమయ్య పదాల గురించి ఇలా తెలిపాడు.

**"వేదంబులు పౌరాణిక**
**నాదంబులు పదకవిత్వ వాణీవీణా"**

అంతేకాదు -

**"పావనములు హరిభక్తి వి**
**భావనములు సర్వమంత్ర పరమ రహస్యో"**

చినతిరుమలయ్య మాటలు అక్షర సత్యాలు. కేవలం తెలుగు కవితా వైభవాలే కాదు భవిష్యత్ - సాహిత్య సోపానాలు కూడా!

**ఉపయుక్త గ్రంథాలు :**

1. భారత సాహిత్య నిర్మాతలు-అన్నమాచార్యులు - అడపా రామకృష్ణారావు, సాహిత్య అకాడమి, న్యూఢిల్లీ.
2. ప్రపత్తి (సాహిత్య వ్యాస సంపుటి) - ఆచార్య డి. కృష్ణకుమారి, నవభారత్ ప్రచురణలు, తిరుపతి.
3. అన్నమయ్య సంకీర్తనలలో సంస్కృతి - డి. కృష్ణకుమారి (అముద్రిత సిద్ధాంత గ్రంథం)
4. అన్నమాచార్య సంకీర్తనములలోని వర్ణనలు - డా॥ గుమ్మ సాంబశివరావు, విజయవాడ.
5. కీర్తనాకౌముది - పొన్నా లీలావతి.
6. అన్నమయ్య అమృతవాణి - పొన్నా లీలావతి.
7. A cultural study of inscriptions of Tallapaka Poetry - రామకృష్ణ.
8. ఉపన్యాస మంజరి - ఆచార్య కె. సర్వోత్తమరావు, పారిజాత ప్రచురణలు, తిరుపతి.

***

# అన్నమయ్య సంకీర్తనల్లో ఆచార వ్యవహారాలు

**డా॥ పి.సి. వెంకటేశ్వర్లు**
**అసిస్టెంట్ ప్రొఫెసర్**
**శ్రీ వేంకటేశ్వర ప్రాచ్య పరిశోధన సంస్థ**
**తిరుపతి**

అరిస్టాటిల్ చెప్పినట్లు మానవుడు సంఘజీవి. సమాజంలో జరిగే సంఘటనలకు, సన్నివేశాలకు అతడే సజీవ సాక్షి. మనిషి ఆటవిక దశలో, చరిత్ర పూర్వ దశలో జంతువులా జీవనం సాగించినా, తన మానసిక వికాసంతో సరికొత్త జీవితాన్ని ప్రారంభించాడు. తనకంటూ ఒక సంఘాన్ని ఏర్పరచుకున్నాడు. కొన్ని కట్టుబాట్లు, ఆచార వ్యవహారాలు, నీతి నియమాలు నిర్ణయించుకున్నాడు. పరిస్థితులు మారినపుడు తాను ఏర్పాటుచేసుకున్న ఆచారాలను కొద్దికొద్దిగా సవరించుకున్నాడు. సమాజంలో అంతర్భాగంగా ఉంటూ సంఘానికి ఇబ్బంది కల్గించే కొన్ని అలవాట్లను వదిలేశాడు. అవసరమనిపించిన కొత్తవాటిని చేర్చుకున్నాడు. వివిధ యుగాల్లో, శతాబ్దాల్లో మానవుని సాంస్కృతిక, సాంఘిక చరిత్రను తెలుసుకోవాలంటే శాసనాలు, నాణేలు, చరిత్ర గ్రంథాలే ఆధారం. అయితే వాటితోపాటు ఆయా కాలాల్లో రాయబడ్డ లభ్యసాహిత్య గ్రంథాల వల్ల కూడా సమకాలీన సామాజిక ఆచార వ్యవహారాలు తెలుస్తాయి.

కవి సమాజంలో భాగమే. అతడు ఎంత ఊహాలోకంలో కావ్యాన్ని నడిపినా అక్కడక్కడా గ్రంథంలో తానుంటున్న సమాజంలోని ఆచారాలను, వ్యవహారాలను, నమ్మకాలను ప్రస్తావిస్తుంటాడు. అయితే సాహిత్యాన్ని సృష్టించిన కవులంతా ఒకే సంఘానికి సంబంధించినవారు. భిన్న కాలాలకు సంబంధించినవాళ్ళే కాకుండా ఒకే కాలంలో భిన్న సాంఘిక నేపథ్యాల్ని కలిగినవారు అంటే కొందరు కవులు ప్రజాబాహుళ్యంలో నివసిస్తూ కావ్యాలు నిర్మిస్తే, మరికొందరు రాజాస్థానాలకే పరిమితమై కావ్య రచన చేసినవారు. ఈ కోణం నుండి పరిశీలిస్తే రాజాస్థానంలో నివసిస్తున్న కవులకంటే రాజస్థానేతర కవులు ఎక్కువ సామాజికాంశాల్ని గ్రంథస్థం చేసే అవకాశం ఉంది. అయితే ప్రతి వాదానికి కొన్ని సవరణలున్నట్లే రాజాస్థానంలో కాదు రాజులుగా వుంటూ సాహిత్యాన్ని సృష్టించిన నన్నెచోడుడు, గోన బుద్ధారెడ్డి, శ్రీకృష్ణ దేవరాయలు వంటివారు రాసిన కావ్యాల్లో ఎక్కువ సామాజిక అంశాలున్న విషయం అందరికీ తెలిసిందే. అయితే ఇది అసాధారణమైన అంశం.

అన్నమయ్య ప్రజాకవి. వాగ్గేయకారుడు. రాజస్థానేతర సంకీర్తనాకారుడు. ఆయన సంకీర్తనలన్నీ సమాజంలో తిరుగుతూ పాడినవే. అందుకే ఆయన ఆలపించిన వేల

సంకీర్తనల్లో ఎన్నో సామాజిక అంశాలతోపాటు, నాటి తెలుగు ప్రజల ఆచార వ్యవహారాలు, నమ్మకాలు కన్పిస్తాయి. అన్నమయ్య ఏ రాజును ఆశ్రయించలేదు. సంకీర్తనల్లోని ఆచార వ్యవహారాల్ని తెలుసుకొనేముందు ఆయన అనుసరించిన ఆచారాన్ని గురించి తెలుసుకోవాలి. ప్రతి కవీ ఎవరో ఒక రాజును ఆశ్రయించి కావ్యం చెప్పడం సంప్రదాయంగా వస్తున్న ఆనాటి ఆచారం. దీనికి భిన్నంగా అన్నమయ్య సదాచార బ్రాహ్మణ కుటుంబంలో పుట్టినా, ప్రజలకు ఏ పద్ధతి ఇష్టమో, వారు తనతో గొంతు కలపాలంటే ఎలాంటి సాహిత్యం అవసరమో గ్రహించాడు. అందుకే తనకు, నాటి ప్రజలకు ఇష్టమైన సంకీర్తనా సాహిత్యాన్ని ఎంచుకున్నాడు. ప్రజా భాషలో కీర్తనలు పాడుతూ వేంకటేశ్వరుని ఆశ్రయించాడు. పాటలు పాడుకోవడం ఆనాటి ప్రజల ఆచారం. అందువల్ల తనకు పాండిత్య ప్రకర్ష ఉన్నప్పటికీ సంకీర్తనా సాహిత్యాన్ని ఎన్నుకోవడాన్నిబట్టి అన్నమయ్య ఆనాటి సంఘంవైపు నిలబడి సమాజం అనుసరిస్తున్న గేయాలు పాడుకొనే ఆచారం వైపు నడక సాగించాడని చెప్పుకోవాలి.

అన్నమయ్య శృంగార, భక్తి, ఆధ్యాత్మ సంకీర్తనల్లో పరవసించినా, ఆయన సంకీర్తనల్లో ఎన్నో సాంఘిక అంశాల్లో భాగంగా ఆచార వ్యవహారాలు, నమ్మకాలు గుడికట్టుకొని జీవించాయి. వదిలిపెడితే ఏదీ ఆచారం కాదు. మంచిచెడ్డలు గుర్తించి చెడును వదలి మంచిని కొనసాగించడమే సరైన ఆచారమని అన్నమయ్య అభిప్రాయపడ్డాడు. ఆచారాలు ఎలాంటివో, మంచి ఆచారాలను మనం ఎలా రక్షించుకోవాలో అన్నమయ్య స్పష్టం చేశాడు. "బట్టబయలు దోలితేను బందెమేయు పసరము పట్టిమేపితేను తన పనులు సేయు" అని చెప్పడంలో ఆచారాల్ని చక్కగా నిర్వచించాడు. దేన్నయినా విచ్చలవిడిగా వదిలెయ్యకుండా ఒక క్రమపద్ధతిలో నడిపించాలని అన్నమయ్య సూచన.

అసలు 'ఆచార వ్యవహారాలు' అనే పదం రూఢ్యర్థంలో వుండిపోయింది. ఇది ఒక జాతీయంగా స్థిరపడిపోయింది. నిఘంటువు మాత్రం ఆచారం అనే పదానికి నడవడి, సంప్రదాయం, వాడుక, మడి వంటి అర్థాల్ని సూచించగా, 'వ్యవహారం' అనే పదానికి ఇచ్చిపుచ్చుకోవడం, న్యాయం, వాడుక వంటి అర్థాలున్నాయి. ఇంకా కొన్ని నిఘంటువులు వ్యాపారాది రంగాలకు సంబంధించిన అంశాల్ని, జూదం, తగవు, బేరం, సొమ్ము వంటి అర్థాల్ని కూడా సూచిస్తున్నాయి. అయితే సాధారణంగా 'ఆచార వ్యవహారాలు' అనే పదాన్ని ఒక సమాజంలోని లేదా ఒక కాలంలోని ప్రజలు అనుసరించిన సంఘ, కుటుంబ, ఆర్థిక, నీతి సంబంధమైన అంశాలకు వర్తింపచేస్తున్నాం.

అన్నమయ్య సంకీర్తనా లాలసుడైనా, భక్తి శృంగార కీర్తనల్లో ఓలలాడినా ఆయన సంకీర్తనల్లో కూడా ఆనాటి సమాజానికి సంబంధించిన ఆచార వ్యవహారాలు కన్పిస్తున్నాయి. అయితే అన్నమయ్య సంకీర్తనల్లో కన్పించే ఆచార వ్యవహారాలన్నీ ఒకే కోవకు చెందినవి కావు. అవి యాదృచ్ఛికంగా, అప్రయత్నంగా, పోలిక కోసం

వచ్చి చేరినవి కొన్నయితే, కావాలని, నాటి సమాజంలోని ఆచారాలను చెప్పాలని సంకీర్తనల్లో చేర్చినవి కొన్ని. అందుకే అన్నమయ్య సంకీర్తనల్లోని ఆచార వ్యవహారాల్ని రెండు రకాలుగా వర్గీకరించుకోవచ్చు.

1. అన్నమయ్య సంకీర్తనల్లో స్పృశించిన ఆచార వ్యవహారాలు
2. అన్నమయ్య వ్యతిరేకించిన ఆచార వ్యవహారాలు

**1. అన్నమయ్య సంకీర్తనల్లో స్పృశించిన ఆచార వ్యవహారాలు :**

అన్నమయ్య భక్తి, శృంగార, ఆధ్యాత్మ సంకీర్తనాపరవశుడైనా ఆయన సంకీర్తనల్లో వృత్తులు, మత. న్యాయ, ధర్మాలు, కౌటుంబిక పద్ధతులు, నమ్మకాలు వంటి ఎన్నో విషయాల్ని గ్రంథస్థం చేశాడు. ఇలాంటి ఆచార వ్యవహారాలు నాటి సమాజంలో ఉన్నాయని అన్నమయ్య తెలిపాడు. అంతేకాదు కొన్ని ఆచారాలు సమాజానికి ఎంత శ్రేయస్కరమో కూడా వివరించాడు.

ప్రాచీన కాలపు సమాజంలో వృత్తులు గ్రామ మనుగడకు ఆధారం. సమాజ నిర్మాణంలో అన్ని వృత్తుల వారిది సమాన ప్రాధాన్యం. ఒక వృత్తి మరో వృత్తితో అవినాభావ సంబంధాన్ని కలిగి ముందుకు సాగేది. అన్నమయ్య సంకీర్తనల్లో అనేక వృత్తులకు సంబంధించిన అంశాలున్నాయి. అంశాలే కాదు అవి ఎలాంటి పద్ధతుల్లో నడిచాయో చెప్పబడ్డాయి. వంశపారంపర్యంగా వృత్తులు వస్తున్నాయని అన్నమయ్య పరోక్షంగా చెప్పాడు. బద్దెల చెన్న శతకం చెప్పినట్లు చేతి విద్యలు ఎన్ని అయినా కుల విద్యకు సాటిరావనే స్థాయిలో అన్నమయ్య సిద్ధాంతీకరించలేదు వృత్తులు చేసుకొనే ఆచారాన్ని సృష్టించాడు. ముఖ్యంగా ఆయన సంకీర్తనల్లో వ్యవసాయ వృత్తికి సంబంధించిన విషయాలు ఎక్కువగా కన్పిస్తున్నాయి. అంటే ఆనాటికే వ్యవసాయం ప్రధాన ఆధారవృత్తి. అన్నమయ్య వంశీకులు కూడా వ్యవసాయాన్ని చేసేవారని చెప్పడానికి

**"కాపులము మేము కర్తవు నీవు**
**దాపుదండై మమ్ము నిట్టే దయ జూడవయ్య" (9-198)**

అని అంటాడు. ఇక్కడ ఒక్క విషయం గమనించాలి. అన్నమయ్య బ్రాహ్మణుడు మరి వారి వంశస్థులు వ్యవసాయం చేసేదేమిటి అనే ప్రశ్న వస్తుంది. అయితే ఆనాడుగాని, నేడుగాని ఏ వృత్తివారు ఆ వృత్తిని నిర్వర్తించినా వ్యవసాయం మాత్రం అన్ని వృత్తులవారు చేసుకొనే ఆచారం వుందని స్పష్టమౌతుంది.

అన్నమయ్యకు కులవృత్తికి సంబంధించిన వ్యవహారాలే కాదు వ్యవసాయ వృత్తికి సంబంధించిన వ్యవహారాలు కూడా తెలుసు. ఆనాటి పొలాల రకాలు, వాటి తత్వం, ఏ నేల ఏ పంటకు అనుకూలం వంటి వ్యవహారాలన్నీ తెలిసినట్లు

"నిండినట్టి మడుగుల నీరువరు పొలము
కొండలు మోచిన పెదగొబ్బురపు పొలము" (10-52)

అనే కీర్తన తెల్పుతుంది. 'పొలము' అనే పదం రాయలసీమ ప్రాంతంలో వాడకంలో లేకున్నా నెల్లూరు, ఒంగోలు ప్రాంతాల్లో అన్నమయ్య సంచరించినపుడు స్వీకరించి వుంటాడు.

వ్యవసాయ వృత్తిలోని వ్యవహారాలన్నిటినీ అన్నమయ్య గ్రంథస్థం చేశాడు. ఏ ఎద్దు వ్యవసాయానికి పనికి వస్తుందో అన్నమయ్య చెప్పాడు. ఊరికే తిని తిరిగే ఎనుబోతు వ్యవసాయానికి పనికిరాదనే విషయం తెల్పాడు. ఒక ఎద్దును ఊర్లో ఎనుబోతుగా వదిలేసే ఆచారం కూడా ఉంది. ఈ రెండు అంశాల్ని తెలుపుతూ అన్నమయ్య

"ఎనుబోతుతో నెద్దు నేరుగట్టియట్లు" అంటాడు.

**సామాజిక ఆచార వ్యవహారాలు :**

అన్నమయ్య తన కాలంలోని సమాజంలో ఉన్న ఆచార వ్యవహారాల్లో కొన్నిటిని కీర్తనల్లో గ్రంథస్థం చేశాడు. అలాంటివాటిలో చెప్పుకోదగ్గవి ఒట్టు వేయడం, ఓలి.

**ఒట్టు వేయడం :**

సమాజంలో ప్రజలందరూ ఏర్పాటుచేసుకొని అనుసరించే ఆచార వ్యవహారాలు కూడా అన్నమయ్య సంకీర్తనల్లో ఎన్నో కన్పిస్తున్నాయి. అలాంటివాటిలో మాటమీద నిలబడడం, అదీ సాధ్యం కాకుంటే ఒట్టు వేయించుకోవడం వంటి ఆచారాలు నేటి జానపదుల్లో మాత్రమే వున్నట్టు అన్నమయ్య కాలం నాటి ప్రజా బాహుళ్యంలో ఉన్నట్లు తెలుస్తుంది. ప్రజల్లోనే కాదు దేవదేవుడైన వేంకటేశ్వరునికి కూడా ఒట్టు వేసే ఆచారం ఉన్నట్లు

"కరితె నానదీవ య్యా కానిదానికి నేమి
చెలరేగి ఆపె మాట చెల్లించె గాని..?" (10-52)

అనే కీర్తన వివరిస్తుంది.

**ఓలి :** ఈనాటి సమాజంలో మనం చూస్తున్న వరకట్నానికి వ్యతిరేకమైందే ఓలి. 'ఓలి తక్కువని గుడ్డిదాన్ని తెచ్చుకుంటే కుండలన్నీ పగలకొట్టినట్లు' అనే సామెత మనకు తెలిసిందే. 19వ శతాబ్దం వరకు ఓలి లేదా కన్యాశుల్కపు ఆచారం ఉన్నట్లు సాహిత్యం చెప్తుంది. ఇది అన్నమయ్య కాలానికే ఉన్నట్లు ఆధారాలున్నాయి.

"మేలిక గల బంటుకు యే విచారము లేదు
ఓలి మగడు గలాలికి వొప్పమిలేదు"

అనే సంకీర్తన వల్ల అధికారి దగ్గర పనిచేసే సేవకుడికి విచారం లేనట్లే ఓలి చెల్లించి పెళ్ళి చేసుకొన్న భర్త దగ్గర భార్యకు ఆర్థికపరమైన ఇబ్బందులుండవని అన్నమయ్య వివరించాడు.

**ఆరాధ్య భావం :** మన సమాజ వారసత్వ సంపదగా వస్తున్న మరో ఆచారం పెద్దల్ని గౌరవించడం. తల్లి, తండ్రి, గురువు తర్వాత దైవానికి కూడా భారతీయ సమాజం ప్రాధాన్యతనిచ్చింది. అయితే అన్నమయ్య కాలంనాటి తల్లిదండ్రుల తర్వాతి స్థానం దాతకు దక్కింది. నాల్గవ స్థానం గురువుది. ఈ విషయాన్నే అన్నమయ్య

**"తల్లిదండ్రి దాత గురువు తానెమైన నాంచారి"      (1-180)**

అంటాడు. అంటే తనకంటే, తన స్వార్థం కంటే ముందు వారికి ప్రాధాన్యమివ్వడం ఆనాటి సమాజంలో వస్తున్న ఆచారమని అర్థమవుతుంది.

**రాజరికం :** అన్నమయ్య కాలం నాటికి రాజరికం వుందని ముందే తెలుసు. పెద్ద రాజవంశాల కనుసన్నల్లో సామంతరాజులు నడుచుకొనేవారు. ఆనాటి రాజవంశాల్లో రాజరికమనేది వంశపారంపర్యంగా రావడం ఆచారం. అయితే ప్రతి ఆచారానికి కొన్ని నియమాలు, పద్ధతులు ఉండేవి. రాజరికం వంశపారం పర్యమైనా అసమర్థతను అందలమెక్కించే ఆచారం లేనట్లు కన్పిస్తుంది. విజయనగరాన్ని పాలించిన సంగమ, సాళువ, తుళువ, ఆరవీటి వంశస్థుల్లో ప్రతిభకే ఎక్కువమంది జేజేలు కొట్టిన విషయం చరిత్ర చెప్తుంది. సింహాసనంపై ఎక్కే వ్యక్తి అన్నివిధాలా తగినవాడై వుండాలనేది ఆనాటి ఆచారంగా కన్పిస్తుంది. ఎవరినంటే వారిని నియమించడాన్ని సమాజం అంగీకరించేది కాదని

**"పరిగలేరేటి వాని బట్టపురాజుగా**
**నిరత భోగములిచ్చి నిలిపినట్లు" (1-212)**

అనే కీర్తన వివరిస్తుంది. అంతేకాదు, ఎవరు ఏ పదవిలో కూర్చోవాలో వారినే కూర్చోబెట్టాలని ప్రజలు కోరుకున్నట్లు

**"పట్టభద్రుడు గూర్చుండే బలుసింహాసనముపై**
**వెట్టి బ ంటుఁ బెట్టెవారు వెఱ్ఱులేకారా"      (2-17)**

అనే కీర్తన వివరిస్తుంది.

**బందె :** గ్రామాల్లోని పశువులు కొన్నిసార్లు పంటపొలాల్లో పడి పంటను నాశనం చేస్తుంటాయి. కొన్ని పశువులకు ఎంత జాగ్రత్తగా కట్టేసినా రాత్రిళ్ళు తాడు తెంచుకొని దొంగతనంగా పంటపొలాల్ని తినడం అలవాటు. అలాంటి పశువుల్ని గ్రామ పెద్ద ఆదేశంతో 'బందెలదొడ్డి'లో బంధిస్తారు. ఆ పశువు గల యజమాని పశువు చేసిన తప్పుకు అపరాధం చెల్లించి విడిపించుకొని వెళ్ళడం పల్లెల్లో ఒక ఆచారం. ఈ విషయాన్ని అన్నమయ్య చాలాచోట్ల ప్రస్తావించాడు.

**"వొంటికాల గుంటికుంటి పూరి బందెల జిక్కి**
**పంటదాకా మన్నె నొక్క పసురము" (1-370)**

అయితే ఈ బందెలదొడ్డి నుండి కొన్ని పశువులకు మినహాయించే ఆచారం ఉంది. గ్రామ దేవతకోసం వదిలిన పశువులకు, ఆబోతులకు ఈ మినహాయింపు వర్తిస్తుంది. ఆ విషయాన్ని అన్నమయ్య "భూమెల్ల మేసినా నాబోతుకు బందెలేదు" (1-23) అనే చరణంలో వివరించాడు.

**వెట్టి :** ఈ పదానికి ఊడిగం, చాకిరీ అనే పదాల్ని సమానార్థాలుగా వాడుతున్నాం. భారత ప్రభుత్వ చట్టం చేసేంతవరకు ఈ వెట్టి అనే ఆచారం దేశమంతా వ్యాపించి ఉండేది. ఇప్పటికీ కొన్ని ప్రాంతాల్లో పరోక్షంగా ఈ దురాచారం కొనసాగుతుంది. కొన్ని కుటుంబాలు వంశపారంపర్యంగా ఉన్నత కుటుంబాలవారికి వెట్టి చేస్తూ గడపవలసిన పరిస్థితి. అయితే ఇది దురాచారమని, దీన్ని రూపుమాపాలని అన్నమయ్య తన కీర్తనల్లో వ్యాఖ్యానించలేదు గాని ఆ ఆచారాన్ని ప్రస్తావించాడు. రాత్రింబవళ్ళు విశ్రాంతి లేకుండా యజమాని చెప్పిన పనుల్ని కాదనకుండా పనిచేసే వెట్టి తత్వాన్ని అన్నమయ్య 'వెట్టి వేమి సేయుమంటా వెన్నడించె అపుడు' (2-370) అని వివరించాడు. అలాగే

**"ఒట్టిన మోపులు మోవదోవక వూరు విడిచి**
**వెట్టివాడు పారిపోగా వెదకినట్టి" (11-23)**

అనే కీర్తన వెట్టి చేసే వ్యక్తి పారిపోతె వెదకి పట్టుకొచ్చే ఆచారాన్ని వివరిస్తుంది.

**పుల్లరి :** ఇది ఒకరకమైన పన్ను. పశువుల మేపుతున్నందుకు చెల్లించాల్సిన పన్నును పుల్లరిగా పిలుస్తారు. ఆంధ్రదేశంలో జరిగిన స్వాతంత్ర్య పోరాటంలో పుల్లరి పన్నుకు వ్యతిరేకంగా పెద్ద ఉద్యమం కన్నెగంటి హనుమంతు ఆధ్వర్యంలో జరిగింది. ఆ పుల్లరి పన్ను తీసుకొనే ఆచారాన్ని గోపికలకు, శ్రీ వేంకటేశ్వరునికి ఆరోపిస్తూ

**"కూడెను మానుతులనే గోకులపుఁగదుపులు**
**యీడుగాఁ బుల్లగొని యేలవయ్యా" (4-241)**

అనే కీర్తనలో వివరించాడు. ఇక్కడ వరకట్నం లాంటిది పుల్లరి.

**సంత :** మార్కెట్ వ్యవస్థకు మూలరూపం సంత. నేటికీ రాయలసీమ ప్రాంతంలో వారంలో ఒకరోజు సంత నిర్వహించే ఆచారం కన్పిస్తుంది. పల్లెల్లోని ప్రజలంతా తమకు కావలసిన వస్తువుల్ని ఒక ప్రధాన పట్టణంలో ఏర్పరచిన సంతలో తీసుకొంటుంటారు. ఈ సంతలో వస్తు వ్యవహారాన్ని అన్నమయ్య

**"యింతలోనె పనియని మెరుగని చేతలెల్లా**
**సంతకూటముల యీ సంసారానికా" (4-344)**

అనే కీర్తనలో స్పృశించాడు. అలాగే "సింతసిగురుదెచ్చి సంతలోనా" అనే గేయం సంత వ్యవహారాన్ని గుర్తుచేస్తుంది.

**సంతపాకలంజ :** అన్నమయ్య ప్రయోగించిన విశిష్ట పదాల్లో ఇదొకటి. అన్నమయ్య పదాన్ని ప్రయోగించేటప్పుడు అశ్లీల పదాలను సంతలోనో, సంత పక్కనో పాకవేసుకొని వుంటూ వచ్చిపోయేవారికి ఉపయోగపడే వ్యక్తిగా చెప్పవచ్చు. ఇలాంటి ఆచారం ఉన్నట్లు 'సంతపాక లంజ వెచ్చి సన్యాసి జేసె' (1-282) అనే చరణంలో పేర్కొన్నాడు.

**కాకి ఎంగిలి :** శుభ్రత అవసరమే. ఉన్నంతలో శుభ్రత పాటించే కొన్ని పద్ధతులు మనకు అలవాటే. బంగారం కాని దాన్ని కాకిబంగారం, వెండి కాని దాన్ని కాకి వెండి అని పిలిచినట్లే ఎంగిలి కానిదాన్ని కాకి ఎంగిలి పేరుతో పిలుస్తుంటాం. ఇది ఈనాటికీ ఆచారమే. ఎవరికైనా మనం తింటున్న దానిలో కొంచెం ఇవ్వాల్సివచ్చినప్పుడు ఒక గుడ్డను అడ్డంపెట్టి కొరికి ఇచ్చి దాన్ని కాకి ఎంగిలిగా పిలుస్తుంటాం. అలాంటిదే 'కాకి జున్ను'. దీన్ని అన్నమయ్య

'కాకి జున్ను జున్నులంటా గంపెడేసి అనిపించి' (2-167) అనే చరణంలో ప్రయోగించాడు. ఈ పదానికి అర్థాన్ని వివరిస్తూ జంగా సుబ్బారామయ్య గారి పెద్దవారికి రాసిన ఉత్తరంలో కాకి జున్ను అంటే పిల్లలు పాలు తాగకుండా మాన్పించడానికి పెట్టే చేదు ఉగ్గు. దీన్ని కలబందపాలు, ముసాబరం కలిపి చేస్తారు. ఇది ఆయుర్వేద వైద్యంలో ఉంది (అన్నమయ్య సంకీర్తనలు మొదటి సంపుటం, పీఠిక).

**సామాజిక ధర్మాలు :** అన్నమయ్య ఆచార వ్యవహారాల్ని సంకీర్తనల్లో చొప్పించే ప్రయత్నంలో భాగంగా ఎంతోకాలంగా వస్తున్న నైతిక, ధార్మిక ఆచారాల్ని, వ్యవహారాల్ని చెప్పాడు. వీటిని ఇలాగే ఆచరించు అని అన్నమయ్య సిద్ధాంతీకరించలేదు. కొన్ని నీతి, ధర్మాల్ని తన ధోరణిలో వ్యాఖ్యానించాడు. సమాజంలో రకరకాల మనస్తత్వాలు గల మనుషులుంటారు. ఒకరి తత్వాన్ని మరొకరు అంగీకరించాలనే నియమం లేదు. అది నాడూ, నేడూ ఉంది. అది సమాజ సహజం. ఒకరి మాటలు మరొకరికి నచ్చకపోవచ్చు. ఎవరివ్యవహారం వారిది. ఈ విషయాన్నే అన్నమయ్య

**"వొక్కరు తలచినట్టు వొకరి తలపు రాదు**
**పక్కన నందరేకిని బహుభావాలు"** **(2-247)**

అని వివరిస్తాడు.

ఎవరినైనా 'దేహి' అని అడిగినపుడు వున్నంతలో లేదనకుండా ఇవ్వడమనేది ఉత్తమ సంస్కారం. దానధర్మాలు చేసే ఆచారం మనకు ఎప్పటినుంచో ఉంది. పుణ్యంపై, స్వర్గంపై ఉన్న నమ్మకంతో ఈ ఆచారం నేటికీ కొనసాగుతూనే ఉంది. అదే విషయాన్ని అన్నమయ్య సమర్థిస్తాడు. "నను జూచి 'దేహి' యంటి 'నాస్తి' యనరాదు" (2-299) అంటాడు. అంతేకాదు

**"కోటిదానముల చేత కోరిలోనుగాని నీవు**
**పాటించి శరంటనే పట్టిలోనైతి" (3-56)** అంటాడు.

మనిషి ఎలా నైతిక నియమాలతో బ్రతకాలి, సదాచార సంపన్నుడిగా జీవించాలి అనే విషయాలపై అన్నమయ్య ఎన్నో సార్వత్రిక సత్యాల్ని చెప్పాడు. అప్పు చేయని, తప్పుగల, జీవితం ధన్యమైందని చెప్పడంలో నాటి సమాజంలో కూడా కొంతవరకు న్యాయ, ధర్మాలకు వెలుపల నడిచే మనుషులున్నారని అర్థమవుతుంది. ఏది మంచి నడవడికో అన్నమయ్య ఈ కీర్తనలో వివరించాడు:

**"అప్పులేని సంసారమైన పాటే చాలు**
**తప్పులేని జీతమొక్క ధారమైఁ జాలు"** **(1-114)**

పైన చెప్పిన అంశాలన్నీ ఆనాటి ప్రజావ్యవహారంలోని ధర్మాలే. అందుకే అలాంటి అధర్మ జీవనం అవసరం లేదని అన్నమయ్య హెచ్చరిస్తున్నాడు.

అన్నమయ్య కొన్ని విషయాల్ని తాత్త్విక ధోరణిలో చెప్పినా అందులో ఎన్నో సామాజిక ధర్మాలుంటాయి. ఆచార వ్యవహారాలు ఇమిడి ఉంటాయి. మనిషి సుఖంగా జీవించకూడదని ఏ ఆచారం చెప్పదు. అయితే అందులో నీటి నియమాలతోకూడి సుఖంగా జీవించడం మన ఆచారమని అన్నమయ్య చెప్తాడు.

**"నిందలకు లోనైన నీరసపు సుఖము**
**బొందికిని లంచంబు పుణికేటి సుఖము"** **(1-135)**

మనకి అవసరం లేదని మన ఆచారం చెప్తుంది. అంతేకాదు కూడు వండేది గంజి కోసం, కుప్పనురిచేది కసువు కోసం, కొలచు దంచుట పొట్టకోసం, కొండదవ్వేదు ఎలుక కోసం కాదని (1-115) అన్నమయ్య వివరించాడు.

సామాజిక వ్యవహారాల్లో భాగంగా అన్నమయ్య కొన్ని వాస్తవాల్ని కూడా వివరించాడు.

**"పతిలేని భూమికి బలవంతుడే రాజు**
**గతిలేని కూటికి గన్నదే కూడి**
**సతిలేని వానికి జరిగినదే యాలు"**

అని చెప్పడంలో నాటి ప్రజల వ్యవహార శైలి కన్పిస్తుంది. ఎన్ని నీతులు చెప్పినా, ఎన్ని ఆచారాన్ని వల్లించినా సమాజం ఒక ప్రవాహం. తరాల తీరాలని ఒరుసుకుంటూ ముందుకెళ్తుంది. ఈ ప్రవాహంలో కొన్ని ఆచారాలు, వ్యవహారాలు కొట్టుకుపోతాయి. కొత్తవి చేరతాయి. ఈ విషయాన్ని అన్నమయ్య గుర్తించాడు. అందుకే :

**"తొడ బుట్టిన మమత తొడిగికొన్నాళ్ళు**
**వాడికె పుత్రుల మీద వలెవుండదు..."** **(2-92)**

అని వివరంగా చెప్పాడు. తెలుగు సమాజపు పోకడలు అప్పటికే ఎలా ఉన్నాయో, సదాచార వ్యవహారాలు అటకెక్కే పరిస్థితులెలా వున్నాయో వృద్ధాశ్రమ ధోరణికి బీజాలు ఎలా పడుతున్నాయో అన్నమయ్య లోతుగా చర్చించాడు.

**సాంస్కృతిక ఆచార వ్యవహారాలు :**

అన్నమయ్య సంకీర్తనల్లో వేలకొద్దీ సాంస్కృతిక ఆచార వ్యవహారాల్ని అవసరంకొద్దీ తెలిపాడు. భక్తి సాహిత్య సృష్టికర్తగా, సంస్కర్తగా కొన్నిటిని సమర్థించాడు, కొన్ని ఛీదరించాడు. ప్రస్తుతం అన్నమయ్య సమర్థించిన, జాతి మనుగడకు అవసరమని భావించిన సంస్కృతి సంబంధమైన ఆచార వ్యవహారాల్ని పరిశీలిద్దాం.

**పెళ్ళి :** భారతీయ సంస్కృతికి పెళ్ళి తరతరాలుగా వస్తున్న గొప్ప ఆచారం. స్త్రీ పురుషులు కలసి సహజీవనం ప్రారంభించడానికి తొలి వేడుక పెళ్ళి. ఈ పెళ్ళిలోని రకాలను మన సాహిత్యం చెప్పింది. అన్నమయ్య పెళ్ళి తంతును, దానిలోని విశిష్టతను ఎన్నో కీర్తనల్లో వివరించాడు. పెళ్ళి ఎప్పుడనేది నిర్ణయించడాన్ని శిష్టులు 'ముహూర్త'మని, జానపదులు 'లగ్గ'మని పిలవడం మనకు తెలిసిందే. అన్నమయ్య అచ్చమైన జానపద బాణీలు "లచ్చి సంసారమునకు లగ్గమచ్చి తీరలేక..." (4-360) అంటాడు. భారతీయులకు పెళ్ళి అంటే ముందు గుర్తొచ్చేది తాళి. దానికున్న విలువ ఎంత గొప్పదో అన్నమయ్య అనేక సందర్భాల్లో చెప్పాడు. "అరుతఁగట్టిన తాళి యవె వీనమాలికలు..." (4-111) అని అంటాడు.

"పిడికెట తలంబ్రాల పెళ్ళికూతురు..." అనే కీర్తనలో పెళ్ళి ఆచారాన్ని పేరంటాళ్ళ సందడిని, తలంబ్రాలు పోసే ఆచారాన్ని పెళ్ళి కూతురు సిగ్గును ఒకటేమిటి సమస్త పెళ్ళి వ్యవహారాన్ని కళ్ళముందుంచాడు.

**మతం :** అన్నమయ్య వైష్ణవుడని తెలిసిన విషయమే. ఆయన వైదిక సంబంధమైన, వైష్ణవ సంబంధమైన ఆచార వ్యవహారాల్ని వివరించాడు. అయితే కొన్ని నర్మగర్భంగాను, కొన్నింటిని వివరంగాను చెప్పాడు. అలాంటివాటిలో 'అగ్నికరణం' అనేది ఒకటి. ఒకే పదంలో సంస్కృతి సంబంధమైన ఆచారాన్ని గోప్యంగా చెప్పాడు. నవనారసింహాల్ని స్తుతించే క్రమంలో

> **"వివిధ జంతువ్రాత భువనమగ్నీకరణ**
> **నవనప్రియ గుణార్ణవనారసింహా..."  (1-281)**

అనే చరణంలో శ్రాద్ధ సమయంలో పితృదేవతలను తృప్తిపరిచేందుకు చేసే హోమమనే ఆచారాన్ని అగ్నీకరణమనేది సూచిస్తుందని మొదటి సంపుటం పీఠికలో గౌరిపెద్ది రామసుబ్బశర్మ గారు వివరించారు.

భగవంతుని రకరకాలుగా పూజించే ఆచారం మనకు అనాదికాలం నుండి వస్తుంది. భక్తి ఎన్ని రకాలనే విషయాన్ని పోతన భాగవతంలో చెప్పాడు. కానీ అన్నమయ్య దృష్టిలో భక్తి వేరుగా ఉంది. ప్రతిదానికి ఒక హద్దు వున్నట్లే పూజించే తత్వాన్నిబట్టి, సేవించే తత్వాన్ని బట్టి భక్తి ఎన్నిరకాలో అన్నమయ్య విశదీకరించాడు.

**"నానాభక్తులివి నరుల మార్గములు**
**హరికిఁగా వాదించుటది ఉన్మాదభక్తి"** **(2-469)**

అనే కీర్తనలో నాటి సమాజంలో రకరకాల వ్యక్తులు ఎంచుకొనే భక్తిని, అనుసరించే భక్తి ఆచారాన్ని విశదీకరించాడు.

అలాగే ఎలాంటి వ్యక్తి వైష్ణవాచార సంపన్నుడవుతాడో కూడా అన్నమయ్య స్పష్టం చేశాడు.

**"సతత దయాచార సంపన్నుడై మతికదా**
**అతిశయ వైష్ణవానకరుహుడౌట..."** **(1-423)**

అని చెప్పడంలో దయతో కూడిన వ్యక్తి వైష్ణవానికి అర్హుడని చెప్పాడు. భక్తి విషయంలో విప్లవాత్మకమైన ఆలోచన. అంతేకాదు 'అకలంక మతితోడ నా జన్మశుద్ధుడై' వైష్ణవాచారాన్ని పొందాలంటాడు అన్నమయ్య.

అన్నమయ్య దైవాన్ని విశ్వసించినా, పవిత్ర మతాచారాన్ని అనుసరించినా, మూర్ఖమైన భక్తిని ఒప్పుకోలేదు. దేవుడున్నాడనే ఆస్థికుడైనా, దేవుడే అన్నీ చేస్తాడని నమ్మేంత మొండి ఆస్థికవాది కాదు. మానవ శక్తి చాలా అవసరమని సిద్ధాంతీకరించిన శాస్త్రీయవాది.

**"యే వలన నరుడు లేక యెద్దీ తాదున్ను నా**
**కుమ్మర వాడు లేక కుండ దాఁబుట్టునా**
**మక్కువ మగడు లేని మనువ్య గలుగునా..."**

అంటాడు. దేవుడే అన్నీ చేస్తాడనేది ఆస్తికత, మనిషి లేనిదే పని జరగదనేది వాస్తవికత. ఇది ఈనాటికీ చాలామంది గ్రహించలేని నిజం.

**వ్రతాలు, మొక్కులు, ఉపవాసాలు** : అన్నమయ్య సంకీర్తనల్లో నాడు ప్రజలు అనుసరిస్తున్న ఆచారాలైన వ్రతాల్ని, మొక్కుబడుల్ని, ఉపవాసాల్ని తెలియజేశాడు. అందులో కొన్ని నేటికీ కొనసాగుతున్నాయి. ఏకాంతంలో చేసే పూజావిధానాన్ని వ్రతమంటారు. ప్రజలు భగవంతుని అనుగ్రహం పొందాలంటే వ్రతాలనే చేయాలనే మన ఆచారాలు చెప్తున్నాయి. అన్నమయ్య కాలం నాటికే ఈ వ్రతాలు చేసే ఆచారమున్నట్లు

**"నెట్టుకొని నడచితే నిజమే మూలధనము**
**పట్టినదే వ్రతమైతే భవమే మేలు..." (2-362)**

అంతేకాదు మొక్కిన వాడిని కరుణించాలేగాని, ఇంకా ఎక్కువ కష్టాలపాలు చేయకూడదని, అది పద్ధతి కాదని అన్నమయ్య దేవుని "పదిలముగ మొక్కిన చేతులు బలిమిఁగోయరాదు" (2-299) అని హెచ్చరించాడు.

కొన్ని పుణ్యదినాల్లో, ప్రత్యేక రోజుల్లో దేవునిపై నమ్మకంతో ఉపవాసం చేస్తే మంచి జరుగుతుందనే నమ్మకం మనది. అందుకే ఉపవాసం చేసే ఆచారం అనేక రకాలుగా వుంది. ఏవిధంగా చేసినా భగవంతుని ద్వారా మేలు పొందదానికి ఉపవాసం చేసే ఆచారాన్ని పాటిస్తున్నట్లు 'వోరిచి వుపవాసములుండుదు నొగి దయదలంతువో యనుచు' (2-296) అనే చరణం వల్ల అర్థమవుతుంది.

**ఇతర సాంస్కృతికాంశాలు :** అన్నమయ్య సంకీర్తనల్లో కన్పించే ఇతర సాంస్కృతిక ఆచారాలు చెప్పుకో దగినవి గురువులకు, ముత్తయిదువులుకు సంబంధించినవి చెప్పుకోవచ్చు.

చదువు నేర్పేవాడు, మంచి మార్గాన్ని నిర్దేశించేవాడు గురువు. గురువును దైవంకన్నా ముందు వుంచి గౌరవించే ఆచారం మనది. ఆయన ఆజ్ఞను దేవుని మాటగా భావించి నడుచుకొనే ఆచారం మనకుందని అన్నమయ్య సంకీర్తనల్లోని చరణాలు మనకు తెలియజేస్తున్నాయి.

**"అన్నిటా నాచార్యుని యానతివలె"** **(4-122)**

**"పోడిమి నాచార్యుని బోధివంకను"** **(4-119)**

**"గురుతెరుగుతునా నేఁగోరి యించక లొల్లి**
**గురుతు చూపిన మా గురువునేకాక"** **(4-184)**

వంటి సంకీర్తనా చరణాలు గురువుకు సమాజమిచ్చే గౌరవాన్ని తెలుపుతున్నాయి.

భర్త గల స్త్రీని ముత్తయిదువు, పుణ్యస్త్రీ అని పిలుస్తారు. వయస్సులో పెద్దదైన సుమంగళి స్త్రీని కాస్త ఎక్కువగా గౌరవించే ఆచారం మనకుంది. అందరికీ మార్గదర్శకురాలిగా జీవనం గడుపుతూ ఉండే అలాంటి స్త్రీని లక్ష్మీదేవితో సమానంగా చూడడం, శుభకార్యాలప్పుడు ఆమెకు అగ్రతాంబూలమివ్వడం మన ఆచారం. ఈ విషయాన్నే అన్నమయ్య:

"మగడుగల సతుల మంచి ముత్తైదువలై
యెగువ నితర మార్గాల లెరఁగనట్టు
నగుతా లక్ష్మీపతి నమ్మిన ప్రపన్నులెల్ల
పగటఁగర్మము మాని బ్రదుకవలదా" అంటాడు.

ఈవిధంగా అన్నమయ్య సంకీర్తనల్లో సామాజిక, సాంస్కృతిక ఆచారాల స్పర్శ కన్పిస్తుంది. ఇవన్నీ వాటిని సమర్థిస్తూ చెప్పిన మాటలు. కొన్ని ఆచార వ్యవహారాలను అన్నమయ్య నిర్దాక్షిణ్యంగా ఖండించాడు. అవి ఎలాంటివో పరిశీలిద్దాం.

**2. అన్నమయ్య వ్యతిరేకించిన ఆచారవ్యవహారాలు :**

భక్తి కవుల్లో ఆధ్యాత్మిక, శృంగారాల్లో ఓలలాడిన కవి, సదాచారాలను సమర్థించిన కవి, సమాజంలో దురాచారాలను తూర్పారబట్టిన సంస్కర్త ఒక్క అన్నమయ్య మాత్రమే. ఆనాటి ఆచార వ్యవహారాలను సంరక్షించడానికే ఉద్భవించామని చెప్పుకొనే బ్రాహ్మణ కుటుంబంలో పుట్టి, తనుంటున్న సమాజపు తీరును, తన కులంవారు ఆచరిస్తున్న పొంతనలేని విధానాల్ని నిక్కచ్చిగా కీర్తనల్లో విమర్శించే అన్నమయ్య పదకవితా సంప్రదాయాన్ని వదిలేసి పదకవితను ఎన్నుకోవడంలోగాని, పండిత భాషకంటే పామరభాషకు ప్రాధాన్యమివ్వడంలోగాని కావ్యకన్యకు, పాలకులకు అంకితమిచ్చే ఆచారాన్ని వ్యతిరేకించడంలోగాని అన్నమయ్య ఒక వైష్ణవవాదిగా కన్పిస్తాడు. ఆనాటి కొన్ని ఆచార వ్యవహారాలమీద తిరుగుబాటుచేసిన శక్తిగా నిలిచాడు. ఆయన తిరస్కరించిన ఆచారవ్యవహారాల్ని గమనిద్దాం.

సమాజంలోను, రాజరిక వ్యవస్థలోను, ధార్మిక జీవనంలోను, మూఢ విశ్వాసాల వంటి వాటి ఆచారవ్యవహారాల్లోని లొసుగుల్ని ఎలా ఖండించాడో పరిశీలిద్దాం.

నాటి సమాజంలో మాంసం తినడమనే అలవాటు. కానీ ఏ జంతువును తినాలి? దేన్ని తినకూడదు అనే దానికి నియమాలున్నాయి. మనిషి తినకూడని మాంసాల్లో కుక్క మాంసం ఒకటి. అలాంటి మాంసాన్ని తినే కులహీనుణ్ణి బ్రాహ్మణీకం చేయించే ఆచారాన్ని అన్నమయ్య విమర్శించాడు.

> **"కుక్కల వండుకుతినే కులహీనునిఁదెచ్చి**
> **ఐక్కసపుఁబాపని గావించినయట్లు"** **(1-282)**

అని బ్రాహ్మణుల్లో కూడా ఉండే అలాంటి హీనుల్ని నిందించాడు. అటువంటి ఆచారం వద్దని చెప్పాడు.

అదేవిధంగా ఆనాటి సమాజంలోనే వేళ్ళూనికొని ఉన్న అసమానత్వం లేని కులవ్యవస్థ ఆచారాన్ని అన్నమయ్య వ్యతిరేకించాడు. చాతుర్వర్ణ వ్యవస్థతోపాటు పంచమ వర్ణాన్ని అవమానకరంగా చూస్తూ, ఊరికి దూరంగా ఉంచే ఆచారాన్ని ఆయన ఖండించాడు.

> **"మెండైన బ్రాహ్మణుడు మెట్టుభూమి యొకటే**
> **చండాలుడుండేటి సరిభూమి యొకటే..."** **(2-385)**

అంటూ ఏన్నో మంచి విషయాల్ని చెప్తూ దురాచారాల్ని వదులుకోవాలని సమాజానికి హితవు చెప్పాడు.

నాటి కులవ్యవస్థ పేరుతో జరుగుతున్న దుర్మార్గపు వ్యవహారాల్ని అన్నమయ్య ప్రశ్నించాడు.

"కులమెంత గలిగె నది కూడించు గర్వంబు" (3-322) అంటూ ఉన్నత కులాల్లో ఉండే గర్వాన్ని నిలదీశాడు. తక్కువ కులంవారు ఉన్నత కులం వారికి అణగిమణిగి వినయంగా వుండడం, ఎదిరించి మాట్లాడకుండా ఉండడం వంటి ఆచార వ్యవహారాల్ని అన్నమయ్య సంకీర్తనలు తెలుపుతున్నాయి. అన్నమయ్య మరో ఆచారాన్ని కూడా స్పృశించాడు. కులవ్యవస్థలో హెచ్చుతగ్గులున్న రాజు మెచ్చి పెళ్ళి చేసుకున్న తక్కువ కులం స్త్రీకి రాజకులం వర్తించే ఆచారాన్ని అన్నమయ్య వివరించాడు.

**"రాజు బెండ్లాడిన యట్టి రమణి యేజాతైనా**
**పూడితమై యిన్నిటాను..."** **(3-449)**

అయితే ఇలాంటి వెసులుబాటు రాజరికంలోనే ఎందుకు మొత్తం సమాజం అంతా ఒకే కులాచారం, గౌరవం ఉండాలనేది అన్నమయ్య ఆవేదన.

అదేవిధంగా సంఘంలో స్త్రీ పురుషుల మధ్య చూపిస్తున్న అసమాన్యతా ఆచారాన్ని అన్నమయ్య వ్యతిరేకించాడు. వేదకాలం నాటికి స్త్రీ పురుషులకు సమాన గౌరవం ఉండేది. అన్నమయ్య కాలానికి స్త్రీని తక్కువచేసి చూసే ఆచారం కన్పిస్తుంది. ఆ సమస్య నేటికీ ఉంది. ఆ విషయాన్ని అన్నమయ్య

**"పొలతులూ జీవులే పురుషూలూ జీవులే**
**తలప బేదభావములేకాని"** **(2-78)**

అని విడమరచి విమర్శించాడు.

అదేవిధంగా ఆనాటి సమాజంలో ప్రజలుగాని, రాజులుగాని దానధర్మాలు చేసే ఆచారం ఉంది. అయితే ఆ ఆచారం మానవతా దృక్పథంతో కాకుండా స్వర్గ, బ్రహ్మాది లోకాలకోసం చేస్తున్నదని అన్నమయ్య విమర్శిస్తాడు.

**"అపములు జపములు దానధర్మములెల్ల**
**మెపుదు బ్రహ్మలకు మీసందివే**
**కాపురులు స్వర్గలోకము కాడివే"** **(4-235)**

అని అసలు విషయాన్ని బయటపెట్టాడు.

నాటి సమాజంలో ఉన్నతవర్గాలు నిష్ట / మైల / అంటు వంటి ఆచారాల్ని క్రమం తప్పకుండా పాటించేవారు. శుభ్రత అవసరమే. కాని దాన్ని అంటు, మైల

వంటి పదాలతో మిగిలిన కులాలవారిని దూరంగా ఉంచే వికృతాచారాన్ని అన్నమయ్య విమర్శించాడు. ప్రకృతిలో ఎంగిలిపడని వస్తువును, మైలకాని పదార్థాన్ని చూపమని ఇలా అన్నాడు :

**"తడిపి వుదికి నట్టి ధౌతవస్త్రము నా**
**యొడలు మోచిన మీద యోగ్యముగాదా"** **(2-80)**

అన్నమయ్య నాటి సమాజంలోని అసంబద్ధ మంత్రతంత్రాల ఆచారాల్ని, మూఢ విశ్వాసాల్ని అనేకచోట్ల ఖండించాడు. మంత్రాలను పలకడానికి అన్ని వర్ణాల వారికి అర్హత లేదని ఒకనాటి సమాజం నిషిద్ధాజ్ఞలు జారీచేసింది. వేదమంత్రాల ఉచ్చారణకు సంబంధించిన ఆంక్షలు నేడు లేకపోవచ్చు గాని అన్నమయ్య కాలంనాటికి ఉన్నాయి. ఆ ఆచారాన్ని అన్నమయ్య వ్యతిరేకించాడు. మంత్రాలు ఎంగిలిపడవని, ఎవరైనా వాటిని పలకవచ్చని స్పష్టం చేశాడు.

**"యేజాతి నోరికైన నెంగిలిలేని మంత్రము**
**తేజాన నొకరికిస్తే దేరిపోసి మంత్రము..."** **(2-153)**

అని వేంకటాద్రిపతి మంత్రియని వివరించాడు.

వేదకాలంనాటికి గోవులను యజ్ఞ యాగాదులప్పుడు చంపే ఆచారం ఉండేది. జైనబౌద్ధుల ఆవిర్భావం తర్వాత అది అంతరించిందని చరిత్ర చెప్తుంది. కానీ, అన్నమయ్య కాలంనాటికి గోహత్య దురాచారం సాగుతున్నట్లు, అన్నమయ్య దాన్ని వ్యతిరేకించినట్లు సంకీర్తనలు చెప్తున్నాయి.

**"అరుదు గోహత్యలు సేయగ దూడలంగలావ్య**
**సరిధర్మ దేవతెట్టు సమ్మతించెనో..."** **(4-428)**

అని దేవుణ్ణి ప్రశ్నించాడు. అంతేకాదు...

**"దేవాలయాలు నానాదేశములెల్లాజొచ్చి**
**దేవగా నెట్లుండిరో దేవతలు"** **(4-421)**

అని ఆవేదన చెందాడు.

ఈవిధంగా అన్నమయ్య తన సంకీర్తనల్లో ఆనాటి ఆచారవ్యవహారాల్ని చెప్పడంగాని, ఖండించడంగాని, ఒక పదంలోగాని, ఒక సూక్తి ద్వారాగాని, చరణం ద్వారా గాని, ఉపమానం ద్వారా గాని సూచించాడు. ఆయన సంకీర్తనల్లో సమకాలీన సమాజ ఆచార వ్యవహారాలను వివరించి సాక్షీభూతంగా నిలిచాడు.

***

# అన్నమయ్య సంకీర్తనల్లో క్రీడా సంస్కృతి

**డా॥ ఎల్. కస్తూరి**
**తెలుగు అధ్యాపకులు**
**శ్రీ పద్మావతి మహిళా డిగ్రీ మరియు పి.జి. కళాశాల**
**తిరుపతి**

తెలుగు సాహిత్యంలో నన్నయకు పూర్వం పద్యకవిత ఉన్నప్పటికీ ప్రామాణిక మైన రూపంలేని తరుణంలో పద్యకవితకు సుస్థిరమైన రూపాన్నిచ్చి భారతాన్ని రచించి ఆదికవిగా కీర్తి గడించాడు. అలాగే జానపద సాహిత్యం లిఖితరూపం దాల్చలేదు. సాహిత్య ప్రవాహంలో కొట్టుకుపోతున్న మౌఖికమైన పదసాహిత్యాన్ని పండితుల సాహిత్యంగా మలచి సంకీర్తన పదకవిత్వానికి ఆద్యుడైనాడు అన్నమయ్య. పదకవిత పామరులనేగాక పండితుల్ని కూడా రంజింపజేసి విశిష్టమైన స్థానాన్ని ఏర్పరచుకున్న సాహిత్య ప్రక్రియగా మనం దర్శించవచ్చు.

భారతీయతత్త్వం అయిన భక్తితోపాటు పదకవిత్వం ప్రారంభమైంది. సంస్కృత పదకారుడైన జయదేవుని అష్టపదుల్లోని గీతగోవిందం, తమిళ పదకారులు, నాయన్మారులు, ఆళ్వారుల మధురగేయ రచనలు, కన్నడంలో ద్వైతులు శ్రీపాదరాయలు, వ్యాసరాయలు, పురంధరదాసుల దాసకూటముల ప్రభావం, జైన బౌద్ధ మతాలకు స్వస్తిచెప్పి ఒకవైపు శైవం, మరోవైపు వైష్ణవమత ప్రాబల్యాలు ప్రబలుతున్న కాలం అన్నమయ్య ఎదిగిన కాలం.

తెలుగు సాహిత్యంలో కృష్ణమాచార్యులు వచన భేదాలైన చూర్ణికలు, సింహగిరి వచనాలు, శఠగోప విన్నపాల్ని రచించి సంకీర్తన వాఙ్మయానికి మూలపురుషుడిగా పేరు గడించాడు. ఇతడు అన్నమయ్యకు పూర్వమున్న వాగ్గేయకారుడు. కాని అన్నమయ్య వేంకటాచల మహాత్మ్యం, సంకీర్తన లక్షణం (సంస్కృతం), ద్విపద రామాయణం, శృంగార మంజరి, వేంకటేశ్వర శతకం రచించడమే గాక శృంగార, ఆధ్యాత్మిక సంకీర్తనలు 32 వేలు రచించి సంకీర్తనా చార్యుడిగా కీర్తిని పొందాడు.

అన్నమయ్య పదాలు నారాయణ తీర్థులు, క్షేత్రయ్య, త్యాగయ్య, రామదాసు వంటి మహామహులైన వాగ్గేయకారులకు మార్గదర్శకాలైనాయి.

శ్రీ వేంకటేశ్వరస్వామిని చూసి తరించి, ఆత్మదర్శనం చేసుకున్న గొప్ప భక్తుడు. భగవంతుని మీద మాత్రమే పదాలల్లిన పదకారుడు అన్నమయ్య.

అన్నమయ్య గ్రామీణ ప్రాంతాల్లో శ్రీనివాసుని దివ్యలీలల్ని భజనల ద్వారా చాటి చెప్పి, వాళ్ళలో భక్తి భావాన్ని కల్గించినవాడు. అంతేగాక వాళ్ళ సంస్కృతి, సంప్రదాయం,

ఆచార వ్యవహారాల్ని దగ్గరగా చూసిన వ్యక్తి. కనుక సంకీర్తనల్లో నాయకుడు శ్రీ వేంకటేశ్వరుడైతే, నాయిక అలమేల్మంగ. కొన్ని సందర్భాల్లో నాయిక తానై కన్పిస్తాడు అన్నమయ్య.

భారతీయ సంస్కృతికి గ్రామీణ ప్రాంతాలే పట్టుగొమ్మలు. వ్యవసాయం, కమ్మరి, కుమ్మరి, వడ్రంగం, నేత, సోది, వర్తకం, వైద్యం మొదలైనవి వృత్తులుగా కలిగిన గ్రామీణ ప్రజలు కాయకష్టం చేసి అలసిన బ్రతుకులకు, శరీర కష్టాన్ని మరపించడానికి హాస్య, శృంగార, భక్తి పరమైన పాటలు పాడుతుంటారు. పండుగలు, ఉత్సవాలు, జాతరల సమయాల్లో మనోల్లాసాన్ని పొందడానికి కొన్ని ఆటలు ఆడుతూ, పాటలు పాడుతూ వుంటారు. ఇవి వినోదాత్మకమైనవి. వినోదభరితమైన ఆటపాటల్ని స్వతహాగా జీవితంలో చవిచూసి లిఖితగేయ సాహిత్యరూపంలో నేటికీ అందరికీ గుర్తుండిపోయే విధంగా అన్నమయ్య సంకీర్తనల ద్వారా మనకు అందించాడు. (అన్నమయ్య కాలంలో దేశీ సాహిత్యంగా జానపద సాహిత్యం విస్తృతస్థాయిలో ఉండేది. అందుకే అన్నమయ్య తన సాహిత్యంలో జానపద రీతులను స్వీకరించారు. అదే స్థాయిలో జానపదుల క్రీడలకు కూడా విలువ నిచ్చి సాహిత్యంలో స్థానం కల్పించాడు). ఈ క్రీడలను వివిధ పాత్రల ద్వారా ఆడించి, గెలిపించాడు.

వీటిలో చిన్నపిల్లలే కాక స్త్రీలు, పురుషులు, ఇరువురు కలిసి ఆడిన ఆటలు కన్పిస్తాయి.

**స్త్రీలు ఆడే ఆటలు :**

కోలాటం, చాంగుభళాలు, గొబ్బిళ్ళు, జాజరలు, బొమ్మలపెండ్లి, అచ్చన గండ్లు, ఉయ్యాల లూగడం, గుజ్జనగూళ్ళు, చెట్టాపట్టాలు, చిందులాట మొదలైనవి ఆడపిల్లలు ఆడినట్లు తెలుస్తుంది.

**కోలాటం :** 'చేతుల కోలలుంచుకొని యాడెడియాట' కోలాటం అని శబ్ద రత్నాకరం పేర్కొంది. పాల్కురికి సోమన బసవ పురాణంలో 'కోలాట' ప్రస్తావన కన్పిస్తుంది. గ్రామీణులు పండుగ, జాతర సమయాల్లో పాటలు పాడుతూ కోలల్ని తడుతూ నృత్యం చేస్తుంటారు. నేటికీ స్వామివారి బ్రహ్మోత్సవ సమయంలో కోలాట మాడడం సంప్రదాయం.

**"వాడే వాడే అల్లరి వాఁడదివో**
**నాఁడు నాఁడు యమునా నదిలోన"** **(19-343)**

యమునా నదిలో గోపికలు వలయాకారంలో నిలబడి కోలల్ని చేతబట్టి తడుతుంటే చేతికున్న కంకణాలు చప్పుడు చేసేవనీ, ఒక్కో గోపిక పక్కన ఒక్కొక్క కృష్ణుడిగా రూపుదాల్చాడనీ, వారి మధ్య చుక్కల్లో చంద్రుడిలాగ నిలిచాడు. శ్రీ వేంకటేశ్వరుని వక్షస్థలాన అలమేల్మంగను మోస్తూ, శరీరమంతా మెరిసే మణుల తేజస్సుతో కనుల బండుడిలాగా వున్నాడనీ స్వామిని కీర్తిస్తూ గోపికల చేత కోలాట మాడించాడు అన్నమయ్య.

**చాంగుభళాలు** : కోలల్ని చేతబట్టి 'లయబద్ధంగా ఆడే ఆట కోవకు చెందినది చాంగుభళా' అనీ, చాంగుభళా అంటే హెచ్చరిక, పరాకు అని వేటూరి ఆనందమూర్తి పేర్కొన్నారు.

**"చక్కని తల్లికి చాంగుబళా తన**
**చెక్కర మోవికి చాంగుబళా"** **(5-107)**

అలమేల్మంగ అందచందాలకు చాంగుభళా అంటూ పాట పాడుతూ కోలాట మాడించాడు.

**గొబ్బిళ్ళు** : ధనుర్మాసంలో స్త్రీలు, బాలికలు ఉదయాన్నే నిద్రలేచి వాకిళ్ళు అలికి ఆవుపేడని ముద్దలు చేసి గుమ్మడి, తంగేడు పూలతో అలంకరించి పూజిస్తారు. సంక్రాంతి పండుగ వచ్చేవరకు విష్ణువుకు సంబంధించిన పాటలతో భజనలు చేయడం, తిరుప్పావైని చదివి వినిపిస్తారు. సంక్రాంతి పండుగ రోజు పసుపుతో గౌరమ్మను చేసి, పూలతో అలంకరించి, దీపం పెట్టి పూజచేసి జల్లెడలో గాని, బుట్టలోగాని వుంచుకొని స్త్రీలు వలయాకారంలో తిరుగుతూ, చేతులు తడుతూ కుడివైపు కొకసారి ఎడమవైపు కొకసారి వంగిలేస్తూ పాటలు పాడతారు. పాదం మొదటగాని, చివరగాని గొబ్బియల్లో, ఉయ్యాలో, తందాన పదాలు పునరావృతం అవుతుంటాయి. నేటికి గ్రామీణ ప్రాంతాల్లో గొబ్బిళ్ళ ఆట ఆడడం సంప్రదాయం.

**"సుబ్బీ గొబ్బెమ్మా సుఖములీయవే**
**తామర పువ్వంటి తమ్ముణ్ణీయవే**
**చేమంతి పువ్వంటి చెల్లెల్నీయవే"**

అంటూ గొబ్బిపాటలు పాడుతుంటారు. రాయలసీమ ప్రాంతానికి చెందిన అన్నమయ్య గొబ్బిళ్ళు పాడినట్లు సంకీర్తనల్లో కన్పిస్తాయి.

**"కొలనిదోపరికి గొబ్బిళ్లో యదు**
**కులస్వామికి గొబ్బిళ్ళు"** **(5-98)**

గోవర్ధనగిరిని చిటికిన వేలితో ఎత్తినవానికి, దుండగాలు చేసే రాక్షసుల తలల్ని గుండు చేసిన గండడికి, శిశుపాలుని తిట్లను సహించక కోపంతో శిరస్సును ఖండించిన వానికి, కంసునిచేత నానా తిప్పలుపడిన గోపబాలునికి, వేంకటగిరిపై నున్న కొండలయ్యకు గొబ్బిళ్ళు పాడాడు అన్నమయ్య.

**జాజరలు** : జాజరలు దేశీరచనకు చెందినవి. సంస్కృతంలోని 'చర్చరీ' గీతాలే జాజర పాటలని వేటూరి ప్రభాకరశాస్త్రి అభిప్రాయం. ప్రాచీన సాహిత్యంలో పాల్కురికి సోమనాథుని బసవపురాణంలో వెన్నెల పాటల్ని -

**"వీణాగానము వెన్నెల తేట .....**
**జాణలు మెత్తురు జాజపాట"** అని పేర్కొన్నాడు.

నాచన సోమన వసంతవిలాసం, శ్రీనాథుని భీమఖండం, దామెరల వెంగళభూపాలుని బహులాశ్వ చరిత్రలో జాజర పాటల ప్రసక్తి కన్పిస్తుంది.

వెన్నెల రాత్రులలో కన్నెపిల్లలు పాడుకునే పాటలు అని తెలుస్తుంది. "ఈ జాజర పాటలను కోలలుతద్దూ పాడతారు. వీటిని పాడేటప్పుడు కస్తూరి, గంధపు పొడి, పుప్పొడి మొదలైన వాటిని చల్లుతారు. ఈ పొడికి జాజర అని పేరు. జాజర పాట శృంగార, హాస్యరస ప్రధానములై వుంటాయి" అని డా॥ ఆర్వి.యస్. సుందరం పేర్కొన్నారు.

దీన్నిబట్టి స్త్రీ పురుషులు వసంతోత్సవ సమయాల్లో సుగంధద్రవ్యాల్ని చల్లుకుంటూ వినోదాన్ని కల్గించేవిధంగా ఆడుతూ పాడే పాటలని చెప్పవచ్చు.

**"జగడపుఁ జనవుల జాజర**
**సగినల మంచపు జాజర"** **(5-274)**

**"చాలు చాలు నీ జాజర నన్ను"** **(5-332)**

నాయికా నాయకులు శరీరానికి పట్టిన చెమటతో దుర్వాసన వస్తుంది. దాన్ని పోగొట్టడానికి సుగంధ పరిమళాల్ని పూసుకుంటారు. పరిమళ ద్రవ్యాల్ని పూసుకున్న నాయిక తలలో మొల్లలు పూలని ధరించడంతో, జడ బరువుగా వుండడంతో నాయకునిపై వాలినపుడు గందపు పొడి జారిందని స్త్రీలు నాయకునిపై సుగంధ ద్రవ్యాల్ని చల్లుతూ శృంగారరస భరితంగా జాజరలు పాడించాదు అన్నమయ్య.

**బొమ్మల పెండ్లి :**

హిందూ సంప్రదాయం ప్రకారం పెద్దవాళ్ళు వధూవరులకు పెండ్లిళ్ళు చేస్తుంటారు. అలాగే పిల్లలు వధువు, వరుడిగా బొమ్మల్ని పెట్టి పెండ్లి చేసి ఆనందాన్ని పొందుతారు.

**"పిన్నదాననై బొమ్మల పెండ్లినే జేయగాను**
**నన్నుఁజూచి నీవు నాదే నవ్వితివి గదరా"** **(20-43)**

అన్నమయ్య ఆడపిల్లలు ఆడే ఆటల్లో బొమ్మలపెండ్లిని వర్ణించాడు.

**"పెంచి యిద్దరము బొమ్మ పెండ్లిందు సేత మంతటే"** **(12-243)**

నాయికలు ఆడిన బొమ్మల పెండ్లి ఈ సంకీర్తనలో కన్పిస్తుంది.

**అచ్చన గండ్లు :**

అచ్చనగండ్లు అంటే అచ్చన గాయలు. ఆడపిల్లలుక రాళ్ళను తీసుకుని పైకి ఎగురవేస్తూ వాటిని పట్టుకుంటూ ఆడే ఆట అచ్చనగండ్లాట. ఈ ఆటలో గెలిచిన వారికి ఓడినవాళ్ళు తీర్చాల్సి వుంటుంది. కాని అన్నమయ్య శృంగార భరితంగా అచ్చనగండ్లను ప్రస్తావించాడు.

**"ఆరిదిఁగుచగిరులు అచ్చన గండ్లాడ**
**వారపాయ నిదివో నిదివో నీకున్న వేమీనేల"** **(23-573)**

స్త్రీల కుచాల్ని అచ్చనగండ్లుగా వర్ణించాడు.

**ఉయ్యాలలూగడం :**

ఉయ్యాలలూగడం అంటే పిల్లలు మొదలుకుని పెద్దల వరకు సరదాగా ఊగుతారు. కానీ తెలుగువాళ్ళు చేసుకునే పండుగలలో అట్లతద్దె ఒకటి. ఈ పండుగరోజు ఆడపిల్లలందరూ ఉయ్యాలలూగడం సంప్రదాయం. దీనికి ఉయ్యాల పండుగ అని పేరు.

**"ఓయి బామలాల ఉయ్యాలా**
**బామలందునూ ఉయ్యాలా"**

అంటు ఆడపిల్లలు అట్లతద్దె రోజు ఉయ్యాలలూగుతూ పాడుతుంటారు.

**"వుయ్యాల మంచము మీద నుంచి వేసారితిమి**
**ముయ్య దించుకయు రెప్పమూసినం దెరచును" (5-662)**

విరహ వేదనతో నిద్రలేమికి గురైన నాయికను చెలికత్తెలు ఉయ్యాల మంచం మీద పడుకోబెట్టి ఆమె పాదాలు చంద్రుణ్ణి తాకేంత వేగంగా వూపారు. స్త్రీలు విరహంతో వున్నప్పుడు వినోదం కోసమూ ఉయ్యాలలూగే వారు అని అన్నమయ్య సంకీర్తనల్లో వ్యక్తమవుతుంది.

**గుజ్జన గూళ్ళు :**

'బాలికలు ఆడుకొనునప్పుడు గురుగులతో వండిన వంటకము' అని శబ్ద రత్నాకరం పేర్కొన్నది. దీన్నే 'గుజ్జుళ్ళ కూడు' అంటారు. ఇది బెల్లంతో వండే వంటకం.

**"పొలసి గుజ్జన గూళ్ళు బువ్వలాడే నన్నుఁజూచి**
**నలువంక నాఁడు నీవు నవ్వితివి గదురా" (20-45)**

**"కోమలపుఁబులకలె కూరిమి గుజ్జనఁగూళ్ళ" (26-43)**

నాయిక చేసిన గుజ్జన గూళ్ళ బువ్వను చిన్ననాడే రుచి చూసిన నాయకుడికి నాయిక తన పులకల ప్రేమ అనే గుజ్జన గూళ్ళను అందించిందని ఇందులో శ్రీ వేంకటేశ్వరుడు నాయకుడిగా అన్నమయ్య నాయికగా కన్పిస్తారు.

**చెట్టాపట్టాలు** : బాలికలు చేయి, చేయి పట్టుకొని ఆడుకునే ఆట చెట్టాపట్టాలాట.

**"పదుచులు నేను చెట్టపట్టాలు పట్టుకాడగా**
**నడుమనే నన్ను జూచి నవ్వితిరి గదరా" (10-45)**

**"చేలలంటి గోపికల చెట్టపట్టలాడితి" (8-179)**

కృష్ణుడు, గోపికలతో కలిసి చేతులు పట్టుకొని చెట్టాపట్టా లాడాడు.

**చిందులాట** : అభినయాన్నికి అనుకూలంగా ఆటపాటలు కలిగి వుండేదే చిందులాట. వెన్నెల సమయాల్లో కాంతలు అభినయానుకూలంగా ఆడుచూ పాడునట్టి పాటయే చిందులాట అని డా॥ జి. రమేశ్ పేర్కొన్నారు.

**"చిందుల పాటల శిరిపాల యాటల**
**అందెల మోతల నాడెనదే"** **(2-24)**

**"చిందులకు నాదేటి సీమంతినీ మణులు**
**చెలఁగి యిరుగడఁగాను"** **(5-228)**

అలమేల్మంగ, శ్రీ వేంకటేశ్వర స్వామి మెచ్చేవిధంగా చాలా అందంగా పాదాలకున్న గజ్జెల చప్పుడుతో చిందులేసింది.

**పురుషులు ఆడే ఆటలు :**

తోలుబొమ్మలాట, ఇంద్రజాలం, నాటకం మొదలైనవి పురుషులు ఆడినట్లు సంకీర్తనల్లో కన్పిస్తాయి.

**తోలుబొమ్మలాట** : గుడ్డ, చెక్క లేదా తోలుతో చేసిన బొమ్మకు దారాల్ని కట్టి తెరవెనుక నుంచి సూత్రధారుడు పాటలు, మాటలు, వాయిద్యాల సహకారంతో బొమ్మల్ని ఆడిస్తాడు.

పాల్కురికి సోమనాథుని కాలం నుంచి చాలామంది కవులు తమ రచనల్లో తోలుబొమ్మలాటల్ని పేర్కొన్నారు.

**"భారతాది కథల జీరమఱుగుల**
**నారంగ బొమ్మల నాడించువారు**
**గడు నద్భుతంబుగ గంబ సూత్రంబు**
**లదరంగ బొమ్మల నాడించువారు"**

(పండితారాధ్య చరిత్రము పర్వత ప్రకరణము)

**"ఆటవారి గూడి తౌరా**
**ఆటవారిఁగూడి అన్నిచోట్ల బొమ్మ**
**లాట లాడించ నధికుండ వైతివి"** **(1-163)**

తోలుబొమ్మలాట వారితో చేరి నాయకుడైన శ్రీ వేంకటేశ్వరుడు బొమ్మలాడించడంలో గొప్పవాడైనాడు. భూమి అనే పెద్ద కొట్టంలో మాయ అనే తెరగట్టి, తెరవెనుక జ్ఞానమనే దీపం వెలిగించి ప్రాణులనే తోలు బొమ్మలకు ఊపిరిపోసి, నవరస భరితంగా మొదట బ్రహ్మదేవుణ్ణి ఆడించి, అతనిచే లోకాన్ని ఆడిస్తాడు. సూత్రధారుడైన వెంకన్నను మెచ్చుకునేవారే కాని, మన్నించే దాతలు లేరు. స్వామి దాసులు ఉన్నతులై పొగిడితే చాలు సంతోషంతో ఆటను రక్తి కట్టిస్తాడు. అంటూ అన్నమయ్య తన ఇష్టదైవమైన శ్రీనివాసుడు తోలుబొమ్మలాటలు ఆడించిన వ్యక్తిగా పేర్కొనడమే గాక, స్వామిని జగన్నాటక సూత్రధారిగా వర్ణించాడు.

**ఇంద్రజాలం** : ఇంద్రజాలం వినోదాన్ని కల్గించే క్రీడ. కనికట్టు విద్య. వినోదాత్మకమై క్రీడ అయినప్పటికీ జీవనాధారమైన వృత్తిగా మారింది. ఉన్నది లేనట్లు, లేనిది ఉన్నట్లు మాయచేసి అందరినీ ఆశ్చర్యచకితుల్ని చేసే ఆట ఇంద్రజాలం.

**"ఇందరూ నేడేట జేసే యింద్ర యోగపు ముద్దలు"** **(2-48)**

**"పామునాడించిన యట్టి బాలజోగి పిన్నవాడు"** **(24-112)**

అన్నమయ్య ఇంద్రజాలాన్ని ప్రస్తావిస్తూ, పల్లెప్రాంతాల్లో జోగులు పాముల్ని బుట్టలో వుంచుకొని వచ్చి నాగస్వరం ఊదుతూ పాముల్ని ఆడిస్తూ జీవనాన్ని గడుపుతున్నట్లు, ఈ జీవితం కూడా మాయతో కూడినదే అని అన్నమయ్య సంకీర్తనల్లో తెలుస్తుంది.

**నాటకం :** గ్రామీణ ప్రాంతాల్లో నాటకాలకు మంచి గుర్తింపు వుంది. పగలంతా కష్టపడి పనిచేసి, రాత్రిపూట నాటకాల్ని ప్రదర్శించేవారు. ఇవి సామాజిక చైతన్యానికి తోడ్పడేవిగా వుంటాయి. చారిత్రక, రాజకీయ, మత, సాంఘీక విషయాలకు సంబంధించిన నాటకాలున్నాయి. మానవ జీవితమే ఒక నాటకరంగం అని అంటారు పెద్దలు.

**"నంటు సేసి నవ్వినవ్వి నాటకాలే పచరించి"** **(12-24)**

**"సంసారపు నాటకశాలలో ప్రతిమనైతి"** **(2-6)**

సంసారమనే నాటకంలో నేను పాత్రను పోషిస్తున్నాను. ప్రపంచంలో మానవుడి జీవితం నాటకమయం. నటించినన్ని రోజులు నటించి గడువు తీరిన వెంటనే వెళ్ళిపోతుంటారు అని అన్నమయ్య పేర్కొన్నాడు.

**స్త్రీ పురుషులు ఆడే ఆటలు :**

వామనగుంటలు, జూదం, పులిజూదం, పొడుపు కథలు, దాయాలాట మొదలైనవి స్త్రీ పురుషులు ఆడినట్లు సంకీర్తనల్లో కన్పిస్తాయి.

**వామనగుంట :** వామనగుంట ఆటని 'పిచ్చల పీట' అని వ్యవహరిస్తారు. రెండు కొయ్యలమీద గుంటలు చెక్కి పిక్కలుగానీ, గోలీలుగానీ, రాళ్ళతోనైనా ఇద్దరు కలిసి ఆడే ఆట. ఎవరు ఎక్కువ గోళీలు గెలుచుకుంటారో వాళ్ళు ఓడిన వాళ్ళను హేళన చేస్తారు. అప్పుడు ఓడినవాళ్ళు కూడా ఎక్కువగా గెల్చుకోవాలని ఆరాటపడతారు.

**"వడిసర సానాతో వాన గుంటలాడగాను"** **(7-201)**

**"వామన గుంటలు"** **(13-167)**

నాయికా నాయకులు, వామనగుంటలు ఆడినట్లు సంకీర్తనల్లో కన్పిస్తుంది.

**జూదం :** దబ్బుపెట్టి ఆడే ఆట జూదం. జూదంలో ఓడిపోయి దబ్బుల్లేక చివరికి దుప్పట్లు సైతం అమ్ముకొని జూదమాడారని క్రీడాభిరామం పేర్కొంటే, కొందరు స్త్రీలు కూడా జూదమాడేవారు అనీ రాయలనాటి రసిక జీవనంలోనూ భోజరాజీయంలోనూ కన్పిస్తుంది.

**"నువ్వు నవ్వి నీతోను నటనలు సేసేనంట**
**యెవ్వలనో జూజ మాడేనేమే సేతును"** **(8-28)**

నాయికా నాయకులు జూదమాడినట్లు ప్రస్తావించారు.

**"ఆడమంటే నీతో దూజ మాడగలదాన"** **(24-329)**

**"జూదమాడవచ్చుగాక సులభాన గెలిచితే"** **(24-585)**

**పులిజూదం :** స్త్రీ పురుషులిరువురు కలిసి ఆడే ఆటగా సంకీర్తనల్లో కన్పిస్తుంది. దీన్ని పులి, మేక ఆట అని కూడా అంటారు.

**"వొలసి పులిజూజము వొడిఁగట్టుకొని రాఁగా**
**అలరి నన్నాడించేవు అందగాఁడా"** **(7-167)**

నాయికా నాయకులు సరసంతో పులిజూదం ఆడినట్లు తెలుస్తుంది.

**పొడుపు కథలు :** పనీపాటలేక పొద్దుగడవని వాళ్ళు, పనులు చేసే వాళ్ళు కష్టం తెలియకుండా వుండడానికి పొడుపు కథలు వేసి దాన్ని విప్పమని మరొకరికి చెబుతారు. విప్పని వాళ్ళు ఓడినట్లు, విప్పినవాళ్ళు గెలిచి మరొక కథను అడుగుతారు. ఈ ఆట చాలా సరదాగానూ, జ్ఞానాన్ని పెంపొందించేదిగా వుంటుంది.

**"కందువనాతడు నాతో గతలు చెప్పగాను**
**సందసుడి నీ మాటలు చవులైనటే"** **(18-247)**

నాయకుడు కథ చెప్పగా -

**"అన్నియు నీయందే అమరెనట**
**కన్నియు ఇందుకు మారుగత చెప్పవే"** **(18-247)**

నాయిక మారు కథ చెప్పినట్లు ప్రస్తావించారు.

**దాయాలాట :** తీరిక సమయాల్లో ఇద్దరూ లేదా నలుగురు కలిసి ఆడే ఆట. చిన్నచిన్న కొయ్యముక్కల్ని కోసుకొని వాటిమీద రంధ్రాలు వేసి వాటిని బాగా దొర్లేటట్లు వేసి, అవచ్చిన సంఖ్యనుబట్టి కాయల్ని కదిలించి, అన్ని కాయలు పళ్ళు అయితే గెలిచినట్లు, గెలిచినవాళ్ళు ఓడినవారి మీద ఇంకో ఆటవేసి ఆటపట్టిస్తారు.

**"చొల్లపు ఉట్టులతోడ సుద్దులెందాకాఁ జెప్పేవు**
**అల్లదె మాయిల్లు దాయాలాడుదాము రావోయి"** **(22-304)**

గోపికలు కృష్ణునితో ఉట్లు గురించి ఎంతసేపు చెబుతావు దాయాలాడుదాము మా ఇంటికి రా అని పిలిచారు. పగడసాలు, బిల్లపుదీపులాట, బొమ్మరిండ్లు, దాగిలి ముచ్చులాటల ప్రస్తావన సంకీర్తనల్లో కన్పిస్తాయి.

**పిల్లలు ఆడే ఆటలు :**

**ఇసుక గూళ్ళు :** చిన్నపిల్లలు ఇసుకతో గూళ్ళు కట్టుకొని అవి తమ ఇండ్లు అని చెప్పి సరదాగా ఆడుతారు. వాటిని ఎవరైనా పడదోస్తే కోపంతో వాళ్ళని తిట్టి, ఏడ్చేస్తారు. మళ్ళీ గూళ్ళు కట్టుకొని సంబరపడతారు.

**"బాలుల యిసుక గూళ్ళు పసంగట్టు కాడినట్టు**
**వీలివెత్తివాడు గంతులేసిన యట్టు"** **(2-37)**

పిల్లలు ఇసుక గూళ్ళు కట్టుకొని ఆడుకునే ఆటలాగా తన కాలమంతా వృథా అయిందని తనను తాను నిందించుకున్నాడు అన్నమయ్య.

కృష్ణుడు బాల్యంలో బిల్లంగోడీ, పుట్టచెండు, సముద్రపు బిల్ల, సిరిసింగన వత్తి, గచ్చకాయలు, కూగూగు మొదలైన ఆటలు ఆడినట్లు సంకీర్తన వల్ల తెలుస్తుంది.

స్త్రీలు, పురుషులు, పిల్లలు ఆడిన ఆటలు మన జానపద సంస్కృతికి నిలువెత్తు నిదర్శనాలు. అన్నమయ్య తన కాలంలో ఆడిన ఆటల్ని శ్రీవేంకటేశ్వర స్వామి, అలమేల్మంగ, గోపికలు చేత ఆడించిన పదకారుడు. జానపద క్రీడా సంస్కృతిని కాలగర్భంలో కలిసిపోకుండా సంకీర్తనల రూపంలో మన కందించిన జానపదులలో జ్ఞానపదుడు అన్నమయ్య.

నేటి అంతర్జాల యుగంలో ఆటపాటలు కనుమరుగవుతున్నాయి. క్రీడలన్నీ కంప్యూటర్, సెల్‌ఫోన్ బాక్సులకే పరిమిత మవుతున్నాయి. అన్నమయ్య సంకీర్తనల్లో 15వ శతాబ్దం కాలం నాటి ఆటలు ఎన్నో ప్రస్తావింపబడ్డాయి. అవి ఆడే విధాన మెలాగో తెలియని పరిస్థితి నేటితరం వారిది. కావున పరిశోధకులకు నాటి క్రీడా సంస్కృతి అధ్యయనానికి అన్నమయ్య సంకీర్తనలు ఒక బాసటగా నిలుస్తాయి.

**ఆధార గ్రంథాలు**

1. తెలుగు జానపద గేయ సాహిత్యము - *డా॥ బి. రామరాజు*
2. ఆంధ్ర యక్షగాన వాఙ్మయ చరిత్ర - *యస్వీ జోగారావు*
3. తాళ్ళపాక కవుల పదకవితలు-భాషా ప్రయోగ విశేషాలు - *వేటూరి ఆనందమూర్తి*
4. తెలుగు-కన్నడ జానపద గేయాలు - *ఆర్వీయస్. సుందరం*
5. తెలుగు జానపద గేయ సాహిత్యము, స్త్రీల గేయాలలో సంప్రదాయం - *జి. వసుంధరాదేవి*
6. పదకవితా పితామహుని సంకీర్తనల శృంగారం - *డా॥ జి. రమేశ్*
7. శబ్దరత్నాకరం - *బహుజనపల్లి సీతారామశాస్త్రి.*

***

# అన్నమయ్య సంకీర్తనల్లో వస్త్ర విశేషాల చిత్రణ

**శ్రీ యం. దేవరాజులు**
**పరిశోధక విద్యార్థి**
**తెలుగు అధ్యయనశాఖ**
**శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం, తిరుపతి**

ఆదిమానవుడు ఆ దశను దాటి నాగరిక స్థాయికి చేరుటకు చాలా సంవత్సరాలు పట్టింది. ఆ క్రమంలో నాగరికుడు అనిపించుకోవడానికి ఆహారం, నివాసం, కుటుంబం, వస్త్రధారణ వంటి వివిధ అభివృద్ధి దశలను దాటుకుంటూ వచ్చాడు. నాగరికతా పరిణామ క్రమంలో ఆదిమానవుడు గుర్తించి వినియోగించుకున్నది వస్త్రధారణే. దిగంబరుడుగా ఉన్న ఆదిమానవుడు మొదటిగా తన శరీరాన్ని ఆకులుతో, మరికొంత కాలానికి జంతు చర్మాలతో కప్పుకున్నాడు. అటు తరువాత ఎన్నో పరిణామాల మూలంగా నేటి ఈ స్థాయికి చేరుకున్నాడు. నాడు-నేడు మనిషి స్థాయిని నిర్దేశించేది వస్త్రమే అనుటలో సందేహం లేదు. అయితే ఈనాడు ఆ స్థాయి వ్యత్యాసాన్ని అన్నివర్గాల ప్రజలకు వర్తింపజేయకున్నా కొన్ని వృత్తుల వారికి అన్వయించక తప్పదు.

పూర్వం రాజు, మంత్రి, దండనాధుడు, కవి, రైతు, వ్యాపారి, పూజారి వంటి వారు వివిధ నిర్ణాయక వస్త్రాలను ధరించేవారు. వారు ధరించే వస్త్రాలను బట్టి వారి స్థాయిని గుర్తించేవారు. రాజు మంత్రి పక్కపక్కనే ఉన్నా వారి వస్త్రధారణ, వేష భూషణాదులను బట్టి వారెవరెవరో గుర్తించేవారు. నేడు కూడా కొన్ని వృత్తుల వారు వివిధ రకాల వస్త్రధారణ చేస్తున్నారు. పోలీసులు, డాక్టర్లు, ఆచార్యులు, సైనికులు వైద్యసేవకులు, ప్రత్యేక రంగుల వస్త్రాలను ధరిస్తున్నారు. విధి నిర్వహణలో వారు ఆ వస్త్రాలను ధరించటం తప్పనిసరి. అందుకే కావచ్చు ప్రాచీనులు పంచాభరణాలలో వస్త్రాలను చేర్చారు.

**శ్లో॥ వస్త్రేణ వపుషా వాచా, విద్యయా వినయేన చ ।**
**వకారైః పంచభిర్హీనః వాసవోపి న పూజ్యతే ॥**

వస్త్రం, చక్కనిరూపం, వాక్కు, విద్య, వినయం అను ఈ ఐదు వకారాలతో హీనుడైనవాడు సాక్షాత్తు వాస్తవుడే అయినా పూజింపబడదు గదా! అంటుంది ఒక సంస్కృత చాటువు. వీటిలో వస్త్రానికే ప్రథమ ప్రాధాన్యం ఇవ్వబడింది. మనిషిని చూడగానే ఆకర్షించేది వస్త్రధారణే. మన గురించి చెప్పుకోవాల్సిన అవసరం లేకుండా ఇతరులకు తెలియజేసేది వస్త్రధారణ. తక్కిన మన విద్య ఆర్థికస్థాయి, ఐశ్వర్యం, స్థిరాస్తులు అన్నీ చెప్పుకుంటే తప్ప ఇతరులకు తెలియవు. ఇంతటి ప్రాధాన్యం కలిగిన వస్త్రధారణ గూర్చి మన కవీశ్వరులు చక్కగా వర్ణించారు. ఆయా కాలాల్లోని ప్రజల వస్త్రధారణ గురించి తెలుసుకోవటానికి ఆ కాలంలో వెలువడిన సాహిత్యమే సజీవ

సాక్ష్యంగా దోహదపడుతుంది. ఆ దృక్పథంతో అన్నమయ్య సంకీర్తనలను పరిశీలించిన ఆనాటి ప్రజల వస్త్రధారణ ఎలా ఉండేదో తెలుస్తుంది. దానినే దైవానికి ఆపాదించి చెప్పాడు అన్నమయ్య.

**1. కోక :** అన్నమయ్య కాలం నాడు ప్రజలు 'కోక' ధరించెడి వారని స్పష్టంగా తెలుస్తున్నది. దానికి ఈ కింది సంకీర్తనే ప్రబలోదారణము.

**"నానాటిబదుకు నాటకము**
**కానక కన్నది కైవల్యము"** **(3-576)**

పై సంకీర్తనలో 'కోక' శబ్దం ప్రయోగించబడింది. ఈ కోకను పురుషులు ధరించెడివారని తిక్కన భారతం ద్వారా తెలుస్తున్నది. ఉత్తరగోగ్రహణమునకు వెళ్తున్న బృహన్నలతో 'ఉత్తర' బొమ్మ పొత్తికలకు కౌరవులు ధరించిన 'కోక'లు తెమ్మంటుంది. కానీ నేడది చీరకు పర్యాయపదంగా మారింది. నేడు స్త్రీలు మాత్రమే ధరించే వస్త్ర విశేషాన్ని 'కోక' అంటున్నాము. అన్నమయ్యకు సమకాలికుడే అయిన శ్రీనాథుడు కూడా "కొల్లాయుంచితి కోక చుట్టితిన్" అంటాడు. ఆ కాలంలో స్త్రీ పురుషులిరువురు ధరించెడి వస్త్రాన్ని కోక అనేవారని సాహిత్యాధారాల ద్వారా చెప్పవచ్చు.

**2. పీతాంబరము :** శ్రీ వేంకటేశ్వర స్వామిని వర్ణిస్తూ అన్నమయ్య 'పీతాంబరము' ధరించా డంటాడు. దానికి ఈ సంకీర్తన చక్కని ఉదాహరణగా ఉంది.

**"కంటి గ్రంటి నిలువు చక్కని మేను దండలును**
**నంటుఁజూపులును జూచేనవ్వు మోము దేవుని ॥"**
(అన్నమాచార్య చరిత్ర పీఠిక - పు. 22)

పై సంకీర్తనలో 'ఘన పీతాంబరము' ధరించాడని అన్నమయ్య తెలిపాడు. త్రిమూర్తులలో 'పీతాంబరధారి' అనే విశేషణము ఒక్క శ్రీమహావిష్ణువుకే ప్రయోగిస్తున్నాము. అది ఆ దేవదేవుని ఘనతకు నిదర్శనము. ప్రజలలో కూడా పీతాంబర ధారులుండబట్టే కవి ఆ ప్రయోగం చేయగలిగాడు. సాహిత్యం ఎప్పుడైనా ఏకాలంలోనైనా సమాజాన్ని వదలిపెట్టి సాము చేయలేదు. అన్నమయ్య కాలంలో రాజులు, ఇతర ధనవంతులు పీతాంబరాలు ధరించి ఉండవచ్చు.

**3. పయ్యెద చెరగు :** స్త్రీలు 'పయ్యెద చెరగు' ధరించేవారని ఈ సంకీర్తన ద్వారా తెలుస్తున్నది.

**"కులుకక నడవరో కొమ్మలాలా**
**జలజలన రాలీని జాజులు మాయమ్మకు"** **(5-73)**

అంటాడు అన్నమయ్య.

అలిమేలు మంగమ్మ అలంకారాన్ని వర్ణిస్తూ పై సంకీర్తన రాశాడు. అదేవిధంగా మరొక సంకీర్తనలో కూడా అన్నమయ్య పీతాంబరాన్ని మొలకు కట్టుకుంటాడని వర్ణించాడు. ఆ సంకీర్తనలో ఇలా ఉంది.

**"చిత్రజు గరుడ నీకు శ్రీమంగళం నా**
**చిత్తములో హరినీకు శ్రీమంగళం!"** **(20-189)**

**4. కొంగు :** అన్నమయ్య మరొక సంకీర్తనలో 'కొంగు' శబ్దాన్ని ప్రయోగించాడు. స్త్రీల వస్త్ర విశేషము 'కొంగు'. ఈ కింది సంకీర్తన పరిశీలిద్దాం.

**"పలుకుఁదేనెల తల్లి పవళించెను**
**కలికి తనముల విభునిఁగలసినది గాన"** **(6-71)**

**5. చీర :** 'చీర'ను తెరగా వాడేవారని ఈ కింది సంకీర్తన ద్వారా తెలుస్తున్నది. కలియుగ లక్షణాలు తెలుపుతూ అన్నమయ్య ఇలా అంటాడు.

**"కలలోని సుఖమే కలియుగమా, వెన్న**
**కలిలో నిక్కడిదె కలియుగమా ॥"** **(1-118)**

అంటాడు. ఆనాడు నాటక ప్రదర్శనలో చీరను తెరగా వాడేవారని తెలుస్తున్నది.

శ్రీకృష్ణుడు గోపికల వస్త్రాలు తస్కరించే సందర్భంలో కూడా అన్నమయ్య 'చీర' శబ్దాన్ని ప్రయోగించాడు.

**"కొండవేల నెత్తినట్టి గోవిందా నిన్నుఁ**
**గొండించేరు యశోదకు గోవిందా ॥"** **(16-325)**

**6. పాతచీర-కొత్తచీర :** మరొక సందర్భంలో అన్నమయ్య 'పాత చీర-కొత్త చీర' శబ్దాలను వైరాగ్య భావానికి అన్వయించి చెప్పాడు.

**"దేహినిత్యుడు దేహములనిత్యాలు**
**యీహ నా మనసా యిది మరవకుమీ"** **(2-419)**

శ్రీకృష్ణభగవానుడు భగవద్గీతలోని 'సాంఖ్యయోగం'లో తెలిపిన అంశాలను అన్నమయ్య పై సంకీర్తనలో సమన్వయించి చెప్పాడు. అర్జునితో శ్రీకృష్ణభగవానుడిలా అంటాడు.

**శ్లో॥ వాసాంచి జీర్ణాని యథా విహాయ । నవాని గృహ్ణాతి నరోపరాణి ।**
**తథా శరీరాణి విహాయ జీర్ణాని । అన్యాని సంయాతి నవాని దేహీ ॥**
(సాంఖ్యయోగం - 22, 23 శ్లోకాలు)

మానవుడు జీర్ణమైన వస్త్రాలను విసర్జించి కొత్త వాటిని ఎలా ధరిస్తాడో, అలాగే దేహధారి జీర్ణమైన శరీరాలను వాటిని స్వీకరిస్తాడు. దీనిని శస్త్రాలు ఛేదించలేవు. అగ్నికాల్చదు. నీరు తడపదు, గాలి ఎండించదు. అటువంటి ఆత్మ శ్రీ వేంకటేశ్వరుని అధీనంలో ఉంటుందంటాడు అన్నమయ్య.

తన కాలం నాటికి ఉన్న వేదాది సర్వ సాహిత్యాన్ని అధ్యయనం చేసిన అన్నమయ్య తన సంకీర్తనల్లో కోక, చీర, కొంగు, పీతాంబరం, పయ్యెద వంటి వస్త్ర విశేషాలను, ఆధ్యాత్మిక పరంగా, శృంగారపరంగా, సౌందర్యపరంగా వివిధ సంకీర్తనల్లో వర్ణించాడు. *

# తాళ్లపాకవారి పదాలలో 'ధరాధిపతుల చిత్రణ'

విశ్రాంత ఆచార్య కె. సర్వోత్తమరావు
శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం
తిరుపతి

శిష్టసాహిత్యానికి జానపదసాహిత్యానికి వారధి లాంటిది పదసాహిత్యం. ఈ పదసాహిత్యానికి తాళ్లపాక అన్నమాచార్యులను పితామహునిగా పరిశోధకు లందరు ముక్తకంఠంతో ఎలుగెత్తి చెప్పినవారే. అన్నమాచార్యుల మార్గంలో పెదతిరుమలాచార్యులు, చినతిరుమలాచార్యులు పయనించి పదసాహిత్యానికి సుస్థిరత్వం కల్పించారు. వీరు ముప్పురు జీవించిన కాలం క్రీ.శ. 1408 నుండి క్రీ.శ. 1562 దాకా. ఇంతటి సుదీర్ఘ కాలంలో ఈ పదకవులెందరో రాజుల వైభవాలు, పతనాలు చూసినవారే. అంతేగాక రాచరికపు వ్యవస్థ కారణంగా సాంఘిక జీవితంలో వచ్చిన మార్పులను కూడా గుర్తించినవారే. వీరెవరూ ఆస్థాన కవులు కారు. మహారాజుల ప్రాపకానికి తహతహలాడినవారుకారు. సాళ్వ నరసింహరాయలు, అచ్యుతదేవరాయలు మొదలయిన వారంతా తాళ్లపాక పదకవుల పట్ల గౌరవాదరాలు ప్రదర్శించి, వారి వ్యక్తిత్వానికి జోహారులర్పిస్తూ శ్రీ వేంకటేశ్వరపదవాఙ్మయాభివృద్ధికి త్రికరణ శుద్ధిగా సాయపడినవారే. తాళ్లపాక పదకవులు కూడా తమ రచనలలో అన్ని వర్గాల, వివిధ వృత్తి జీవనుల స్వరూప స్వభావాలను సునిశితంగా పరిశీలించి వాటిని ఆధ్యాత్మికతతో జోడించి, పదసాహిత్యానికి కొత్త రూపరేఖలు దిద్దినవారే. అలాంటి వాటిల్లో రాజులకు సంబంధించిన అంశాల ప్రకటన విశదం చేయడమే ఈ వ్యాస ప్రధానోద్దేశ్యం.

తాళ్లపాకపదకవులు తమ పదాలలో ఏలిక, దొద్దవాడు, రాజు, పట్టభద్రుడు లాంటి పదాలను విరివిగా వాడారు. ఏలేవాడు ఏలిక. భూసంపద, ధనసంపద, అధికార సంపదలతో ఆధిక్యం కలవాడు, చెలాయించేవాడు దొడ్డవాడు. వీటిని పరిమితార్థంలో తాళ్లపాక పదకవులు ఒకసారి, విస్తృతార్థంలో మరోసారి ప్రయోగించారు. మొత్తానికి వీరు పరస్తుతి విముఖులు. అలాగే పరసేవాసక్తులు కారు. ముప్పది రెండువేళల పరమాత్ముని పాడడమే వీరి స్వభావం. తమ వ్యక్తిత్వాన్ని అనేక సందర్భాలలో వారు వాచ్యం చేశారు.

**"నరహరి కీర్తన నానిన జిహ్వ బరుల నుతింపగ నోపదు జిహ్వ"**

**"దొడ్డవాడ నయ్యేందుకు దొరల కొలువవలెనా"**

**"పుట్టుభోగులము మేము - నట్టనడిమి వారు మాకియ్యవలెనా"**

**"మనుజుండై పుట్టి మనుజుని సేవించి అనుదినమును దుఃఖమందనేలా" 1-196**

**"తల రాయిగఁగ నెందరికి మొక్కెదిని తెలివిమాలిన యట్టి దేహి" 1-201**

**"జగదేకవిభుని సకలాత్ముని వారిఁదెగి కొలువని బుద్ధియును వృథా" 21-7**

**అర్చావతారంలో అభేదత్వం :**

తాళ్లపాకపదకవులు ప్రధానంగా శ్రీ వేంకటేశ్వరస్వామి భక్తులే అయినా వారు ఏ విష్ణావతారాన్ని కీర్తించినా, లేదా తాము దర్శించిన అనేక దివ్యదేశాలలోని అర్చావతారాలను భజించినా తమ పదాలలో చివరి చరణంలో తిరుమలేశునితో అభేదం చేయడం ఒక ప్రత్యేకత. ఈ క్రమం తాళ్లపాక పదకవులు 'రాజసంబంధి' కీర్తనలలో సుస్పష్టం.

తాళ్లపాక పదకవులు తమ పదాలలో దశావతారాలను అనేక రకాలుగా వర్ణించి కవులను మెప్పించారు. పండితులు ప్రశంసించేలా భావుకత్వస్ఫూర్తిని ప్రకాశింపజేశారు. సామాన్యులు ఈ అవతార వర్ణనలలో తమ జీవతానుభవాలను జత చేసుకొని తన్మయత్వం చెందారు. అలాంటి వాటిల్లో ఇన్నియు నుండగ దమకేమి గడమ (17-431) ఒకటి.

**"ఇన్నియునుండఁగ దమకేమి గడమ**
**వున్నవాడు సిరి పురుషోత్తమరాజు" (7-431)**

లోకంలో పిల్లలకు స్వామిపేర్లు నామకరణం చేయడం అలవాటు. ఆ పేరుతోనయినా దైవనామస్మరణం చేసుకోవచ్చనే సంతృప్తి. లేదా ప్రార్థన వల్ల మొక్కుబడివల్ల దేవతానుగ్రహం వల్ల సంతానం కలిగితే ఆ పేర్లు పెట్టుకోవడమూ సంప్రదాయమే. పై కీర్తనలోని వేదమరాజు, కూర్మరాజు లాంటివి రాజులలో, రాజకులాలలో సర్వే సర్వత్ర వినబడేవే. ఈ శబ్దజాలంలో ఆయా అవతారాలు ద్యోతకమవుతాయి. ఈ అవతారాలన్నీ ధర్మసంస్థాపనార్థమే. శిష్ట రక్షణార్థమే. పరిపాలన చేబట్టే ప్రతి రాజులోనూ 'విష్ణ్వంశ' రక్తగతం, పేర్లకు అవతారాలకు అభేదత్వం యాదృచ్ఛికం.

**ధరాధిపతులు - ధార్మిక చింతన :**

లోకంలో 'బలం' అనేక రకాలు. కండబలం, ధనబలం, పదవీబలం, పరివారబలం, బుద్ధిబలం లాంటివి. కాని ఈ బలాలకు ఆయుస్సు తక్కువ. గ్రహబలం మిన్న అన్నిటికి మించి వేంకటేశ్వరానుగ్రహబలం సర్వశ్రేష్ఠం. ఆ చింతన సామాన్య రాజులకు చాలవరకు ఉండకపోవచ్చు. అసలయిన బలమదే. అందుకే రాజు ధర్మచింతనాపరుడు కావలెనని అనుశాసనం. ఆ దృష్టితో తాళ్లపాక పదకవులు. 'దేవుఁడు గలవారికి దిగులుఁ జింతయులేదు' అనే కీర్తనలో 'బలము గల రాజుకు భయమేమియు లేదు' (2-254) అన్నారు. దీనితోబాటు అటువంటి 'యేలిక గల బంటుకు యే విచారము లేదు' అని తేల్చి చెప్పారు.

తాళ్లపాక పదకవులు ధార్మికచింతన, నైతికత లేని రాజులను సమర్థించ లేదు. కేవలం పదవీకాంక్షతో పరస్పరం కలహించుకొని హతమార్చుకోవడాన్ని ఈసడించుకొన్నారు. దేహమిచ్చిన వాని దివిరి చంపెడువాడు దొర కాదు. అతడు ద్రోహి. తోడఁబుట్టిన వానిని తొడరి చంపెడివాఁడు సుకృతి కాలేదు. అతడు పాపాత్ముడు. కొడుకు నున్నతమతి, గోరి చంపెడువాఁడు ఘనుడవుతాడా! కాదు. అతడు కదు పాతకుడు, తల్లి చంపెడువాడు ఎల్లవారల కెల్ల నెక్కుడవుతాడా! కాదు. అతడు దుష్టుడు అని వారి అభిప్రాయము (1-225).

తాళ్లపాకపదకవులు తమ పదాలలో బోయదొరల ఆగడాలను వర్ణించి వాపోయారు. రాజుల ప్రవర్తనలపై వీరికి మరో అభిప్రాయమున్నా వారి సతులకు గలిగే పరాభవాలను చూడలేకపోయారు.

**"కోవిదుల మను దొరల కులరాణివాసములు**
**త్రోవలనె లంజలై తుది మీరిరి" (4-77)**

అని వగచినారు. నిరపరాధులు వధింపబడడం, మానభంగాలు, చౌర్యాదులను చూచి 'తావు లేలే రాజులకు దయ కొంత పుట్టదాయ' అని రాజులు బాధ్యతల నుండి తప్పించుకోవడాన్ని పరోక్షంగా విమర్శించారు.

**నామమాత్రులయిన ధరాధిపతులు :**

రాజుల ఎంపిక పట్ల కూడా తాళ్లపాక కవులకు ఒక నిశ్చితాభిప్రాయం వుంది. సాంఘిక పరిస్థితుల కారణంగా సామాన్యులు ప్రతిభావంతులుగా రాణించవచ్చు. ఆ రాణింపు అన్ని రంగాలకు అన్వయించడం సరికాదు. వీటివల్ల అనర్థాలే అని నమ్మినవారు పదకవులు. ప్రజలు తమకు గల అధికారాలను, చేతగాని వానికి అంటగట్టడం వల్ల ప్రయోజనం లేదు. తాత్కాలికంగా అలాంటి వాడు రాణించగలడేమో గాని 'మనుగడ' ప్రశ్నార్థకమే. ఈ అంశాన్ని -

**"పరిగె లేరేటి వానిఁ బట్టపురాజుగా**
**నిరత భోగము లిచ్చి నిలిపినట్లు" (1-282)**

అన్నారు. ఇటువంటి వారికి జాగరూకత వున్నా అలసత్వం సహజం. ఆ కారణాన 'నట్టనడిమి వారి' దౌర్జన్యం, దాష్టీకం ప్రబలుతాయి. ఈ అంశాన్ని పదకవులు-

**"ఊరేలెడి యతఁడలసత నూరకయుండఁగ నడుముల**
**వారలు నిక్కపుఁ గర్తల వలె నుండిన గతిని" (1-72)**

అన్నారు. ఇలాంటి వారి మాటలు చెల్లుబడి కావడంతో రాజ్యం, రాచరికం 'దొంగల ధర్మాసనమవు' తుందని వారి అభిప్రాయం. ఇటువంటి పరిస్థితికి సామాన్యులు తలూపరాదని అనర్హత అనర్హతే అని -

"పట్టభద్రుడు గూర్చుండే బలుసింహాసనముపై
వెట్టిబంటుఁ బెట్టేవారు వెఱ్ఱులే కారా"

అన్నారు. రాజ్యాధికారం చేబట్టిన వానికి సహజంగా 'అహంకారం' వేళ్ళూరుతుంది. దీనికితోడు చుట్టుగల పరివారం, పెరిగే సంపదలు ఆ అహంకారాల్ని పెంచుతాయి. తనదే న్యాయమని, తన మాట శిరోధార్యమనే పట్టుదల కూడా పెనవేసుకొంటాయి. ఈ అంశాన్ని కూడా

"సిరుల రాజైతే నేమి సేసిన నేరమి లేదు
పరమాధికారియైనఁ బాపము లేదు" (2-29)

అన్నారు. ఆలాగే రాజులు రసికులు. ఆ రసికత్వం కొందరిలో భోగానుభవం వరకు మాత్రమే. కాని కొందరిలో పెళ్ళిదాకా పెరగవచ్చు. ఆ పెళ్ళి రాజుకు నిర్బంధమూ కావచ్చు. ఇష్టమూ కావచ్చు. సామ్రాజ్యసంక్షేమార్థమూ కావచ్చు. ఆలాంటి పరిస్థితులలో ప్రజలకు 'రాజానుమతో ధర్మః' 3-45 తమ మనసులోని భావజాలాన్ని అణచి

"రాజుఁ బెండ్లాడిన యట్టి రమణి యేజాతైనా
పూజితయై యిన్నిటాను భోగించినట్లు" (3-449)

ప్రేక్షక పాత్ర వహించవలసిందే.

**ధరాధిపతులు – ఆశ్రితులు :**

ఏ సమాజంలో గాని 'నిర్లిప్తులు' కొందరుంటారు. వారిది 'రామాయ స్వస్తి రావణాయ స్వస్తి' మనస్తత్వం. ఆలాంటి వారిని మందలించినట్లుగా పదకవులు వర్ణించారు.

"దండితోఁ దనకుఁగాని ధరణీశు రాజ్యంబు
యెండెనేమి యది పండెనేమిరే" (1-456)

నిర్లిప్తుల సంగతి ఈలాగయితే కొందరు అవకాశవాదులు తమ చాకచక్యంతో అసలు వ్యక్తినే వలలో బంధిస్తారు. తమ చెప్పుచేతల్లో నుంచుకొని 'జబర్దస్తీ' చెలాయిస్తారు. అలాంటి వారిని

"యేలికకు ధనమిచ్చి హితభోగాలందేరట
కేల కత్తిఁబూని పగ గెల్చేరట" (2-264)

కత్తి పూనడం తమపై కక్షగట్టిన వారి మీదనే అనడం మరవరాదు. ఇలాంటి వారేగాక కొందరు 'స్వామిభక్తులు' నిజాయితితో కూడ వ్యవహరిస్తారు. పదకవులు వీరిని మరువలేదు. ఆలాంటి వారు రాజపూజితులు కావడమూ సాధ్యమే. ఈ అంశాన్ని

"యేలికకై పగవారి నెదిరించి బంటొకడు
మేలైన పదవులంది మెరసీనట" (2-352)

అన్నారు. ఇది కృతజ్ఞతాలక్షణం. కాని కొందరు 'జీతగాళ్ళు' సోమరులు. వారివల్ల ప్రయోజనం ఆవంతా లేదు. అలాంటి వారి వల్ల రాజుకు ప్రయోజనం శూన్యం.

**"సొమ్ముఁ దినఁ బుట్టినట్టి సోమరి బంటేలికకు**
**ఇమ్ముల నందుకుఁ బ్రతియేమి సేసీని"** **(2-484)**

అన్నది నిలబడి నిలదీసే ప్రశ్న.

రాజాశ్రితులయిన వారు చాలమంది తాము 'రాజులు'గా భావిస్తారు. ఇది స్థానబలం. నీటిలోని మొసలి కథ లాంటిది. అలాంటి వారిని కాస్త ఆలోచించుకోండి బాబూ అన్నట్లు

**"రాజువద్ద నున్న బంటు రాజే తానౌనా**
**రాజసపు చనవరి రచన గాక"** **(2-139)**

అన్నారు. పదకవుల దృష్టిలో నిజమైన బంటు లక్షణం.

**"యేలికను దైవముగా నెంచి కొల్చేవాఁడు బంటు"** **(4-278)**

అలాగే కొందరు రాజులపట్ల తమ భక్తిని చాటుకోవడానికి కానుక లివ్వడాన్ని గుర్తించారు ఈ పదకవులు. ఆ కానుకలకు ఉబ్బితబ్బిబ్బై రాజులు వారికి 'భూములు' ఇవ్వడం, పదవులివ్వడం చూచి నవ్వుకొన్నారు.

**"చిన్న నిమ్మపండే కదా చేతికిచ్చి రాజులచే**
**యెన్నరాని భూములకు నేలికయ్యేది** **(15-282)**

**"పరుల సేవలు చేసి బ్రదికేరటా**
**సిరివరుల దాసులు సిరులందుటరుదా** **(1-390)**

తాళ్లపాక పదకవులకు సామాన్యుల పట్ల కూడా కాసంత కోపముంది. సానుభూతి వుంది. అందుకే రాజసన్మానం, వాజి వాహనాలు, ఇలయెల్ల ఏలడం లాంటి వాటిని 'వేడుకల'న్నారు. ఇవంతా వ్యర్థం. ఇవన్నీ కొరతలే. స్వామిని **కొలువనేరని వెనకఁ గొరతలే గాదే (1-247)** అని ఉద్బోధ. చివరకు రాజులను చూచి మీరింతగా గాసిపడడం

**"యెదుటనే తమ రాజ్యమెక్కుడుగా కలువెల్ల**
**పదపడి తొత్తులకు బంట్లకేకా"** **(15-183)**

అని పరిహసించారు.

**ధరాధిపతుల ఆజ్ఞలు :**

రాచాజ్ఞ అనేది చాలా చిత్రమయింది. ఆ ఆజ్ఞకు పరిమితి వుంది. ప్రాదేశికపు హద్దు ఉంది. ఇతరత్ర ఆ ఆనకు విలువలేదు. ఒక్కొక్క రాజ్యంలో ఒక్కొక్క 'ధనమానం'

ఆ ధనమానాన్ని ఇతరులు అంగీకరించాలని లేదు. తిరస్కరించవచ్చు. కాని స్వదేశంలో దాని 'గిరాకి' సహజం.

**"ధరణీశు నాజ్ఞల తమ దేశములందు**
**సిరుల నాణెపు ముద్ర చెల్లినట"　　　　(1-390)**

అని చెబుతూ వేంకటాద్రి శ్రీ దేవుని ముద్రలు. అన్నిటా చెల్లుతాయన్నారు. ఈ ముద్రలు 'పంచసంస్కారాలు' కావచ్చు.

రాజు సర్వతంత్ర స్వతంత్రుడు. అతని ఆనకు తిరుగులేదు. మంత్రి సామంత పురోహితదండనాయకాదుల ఆనలకు పునస్సమీక్ష ఉండవచ్చు. కాని 'రాజాజ్ఞకు' ఎప్పుడో గాని 'తిరుగుముఖం' పాతకాలంలో లేదు. ఈ అంశాన్ని పదకవులు పురాణకథలతో సమర్థించినారు. అహంకరించిన నారదుని ఆడదానిని చేసి బిడ్డలు కనేలా చేసి బుద్ధి చెప్పినది వైష్ణవ మాయ. స్వామిని మోయగలవాడనని అహంకరించిన గరుడుడు స్వామి హస్తము మోయలేక డీలాపడ చేసింది వైష్ణవమాయ. నేను 'బహుముఖుడను' అని గర్వించిన ఆదిశేషుని గర్వమణచి పడవైచి స్వామి పాన్పుగా చేసినదీ వైష్ణవమాయ. 'స్వామీ నేను మాయాపీడితుడను. ఈ మాయ నీ అధీనము ఈ మాయాధీనము తొలగించే వాడివి నీవు' అన్నారు.

**ధరాధిపతులచిత్రణలో ఆధ్యాత్మికాంశాలు :**

ఆధ్యాత్మిక పరంగా తాళ్లపాక పదకవులు రాజును, దుర్గాన్ని, సేవకగణాన్ని అన్వయించి పాడిన కీర్తనలెన్నో.

**"కాయమనే వూరికిఁ గంతలు తొమ్మిది యాయ**
**పాయక తిరిగాడేరు పాపపు తలారులు**
**కాముడనియెడి రాజు గద్దెమీద నుండఁగాను**
**దీము గోపపు ప్రధాని దిక్కు లేలీని　　　　(1-488)**

దేహాన్ని దేవాలయంగా, దేహాన్ని రాజ్యంగా ఉపమించి ఆధ్యాత్మికతను చెప్పడం ప్రాచీన సంప్రదాయం. దేహమే ఊరు. ఊరు ఒకేరకంగా ఉండదు. చిరుభవనాలు-పెద్దభవంతులు. కలవారు-లేనివారు-వివిధ వర్ణాలవారు. రకరకాల ప్రవృత్తుల వారుంటారు. కాని ఆ ఊరికి కట్టుదిట్టమయిన రక్షణలు లేవు. తొమ్మిది కంతలు అయినా తలారులు తిరుగుతూనే వున్నారు. ఏమరుపాటు కాసంత అయినా ఊరికి ప్రమాదం. పోనీ రాజు బలవంతుడా, కాదు కాముడు. అనేక రకాలయిన కోరికలు కలవాడు. కోరికల్ని అదుపులో పెట్టుకోలేనివాడు. అధుకే అనర్థం. పోనీ మంత్రాంగం బాగుందా. లేదు. అతడు 'కోపి' మంత్రికి ఓపిక అవసరం. రాజును సరిఅయిన మార్గంలో పెట్టదగినవాడు. కాని లాభం లేదు. తన కోపమె తన శత్రువు. అంచేత అనర్థాలు. అరిషడ్వర్గాల అనర్థాలను చెప్పడం పదకవుల లక్ష్యం. అలాంటిదే-

"పదిలము కోటపగవారు
అదనఁగాచు కొందురాఋఁగురు" (1-61)

రాజుల గురించి అనేకాంశాలు చెప్పిన తాళ్లపాక పదకవులు స్వామిభక్తి పరాయణులయిన రాజులను మన్నించారు. తిరుమల బ్రహ్మోత్సవానికి విచ్చేసే వారిని వరుసగా పేర్కొంటూ వారిలో -

"మగుటవర్ధనులు మండలేశ్వరులు
జగదేకపతులుఁ జతురులను" (1-346)

అని శ్లాఘించాడు. లక్ష్మీవిలాసం వల్లనే ఒకరు రాజవుతారని మరొకరు బంటు అవుతాడని (1-458) వర్ణించిన పదకవులు తంధనాన పాటలో -

"నిండార రాజు నిద్రించు నిద్రయు నొకటే
అండనే బంటు నిద్రదియు నొకటే" (2.385)

అని తేల్చి చెప్పారు. చివరగా స్వామి ఒకడే భూపతి అన్నారు. ఎంత రాజయినా తన రాజ్యంలో కొంత భూభాగం ఇవ్వగలడు గాని 'ఉన్నతపదం' ఇవ్వలేడు. ఆ పదం ఇవ్వగలవాడు నారాయణుడు. 'నీవిచ్చేవి ఇంద్రుడుగాని, గరళకంఠుడు గాని, బ్రహ్మగాని ఇవ్వలేడని (15-292) తాళ్ళపాక వారి నిశ్చితాభిప్రాయము. అందుకే వారు 'కొలిచేమనే వారికి కోరిన యేలికవు' అన్నారు. తుదకు దైవనిర్ణయం ఆకళించుకొని

"సురలును నసురలు చూపట్టు రాజులు
అరసి కనక గతమగు వారె" (3-312)

అని ప్రశ్నించి చివరకు

"నెట్టన దేహమనేటి నిర్మల రాజ్యమునకు
పట్టమేలుచుండిన భూపతివి నీవే" (2-274)

అని మొకరిల్లినారు. బహుదేవతాసార్వభౌమ బిరుదము, దేవతాచక్రవర్తి, దేవశిఖామణి, దేవదేవోత్తముడు, దేవరాహుత్తరాయుడు లాంటి బిరుదులన్నీ నీకే తగునని కొనియాడి స్వామినే శరణువేడినారు.

పదకవులలో ధరాధిపతులను గురించి ఇంతగా విస్తృతపరచి చెప్పినవారు లేరు. తాళ్లపాక పదకవులు నైతికతను, ఆధ్యాత్మికతను నేత్రద్వయంగా భావించిన వారనడంలో సందేహం ఏ మాత్రమూ లేదు.

***

# తాళ్ళపాక అన్నమయ్య
# శ్రీ వేంకటేశ్వర శతకం : పరిశీలన

**ఆచార్య గాలి రాధాకృష్ణ**
**శాఖాధ్యక్షులు**
**విదేశీ భాషలు & భాషాశాస్త్ర శాఖ,**
**శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం, తిరుపతి**

ఆంధ్ర సాహిత్యంలో శతకానికి విశిష్ట స్థానం ఉంది. శతక ప్రక్రియలో వెలువడినన్ని గ్రంథాలు మరి ఏ శాఖలోనూ వెలువడలేదంటే అతిశయోక్తి కాదేమో. కవులు మహాకావ్యాన్నో, మరో ఉద్గ్రంథాన్నో రాసేముందు శతకం రాయడం పరిపాటి. ఇందులో రెండు ఉద్దేశ్యాలు కన్పిస్తాయి. ఒకటి కవిత్వాన్ని అభ్యసించటం, రెండు భగవంతుణ్ణి ప్రార్థించి తరువాత రచనలకు దారి సుగమం చేసుకోవడం. ఈ పద్ధతి 12వ శతాబ్దం నుంచి కూడా ఆంధ్ర సాహిత్యంలో ఆనవాయితీగా కొనసాగుతూనే ఉంది.

సంస్కృత వాంజ్మయం నుంచి తెలుగులోనికి తెచ్చుకున్న సాహిత్య ప్రక్రియల్లో శతక ప్రక్రియ ఒకటి. సంస్కృత వాఙ్మయ శతక ప్రక్రియ తెలుగు శతక ప్రక్రియకు ప్రతిరూపమే అయినా, తెలుగులో ఎన్నో విశిష్ట పోకడలు పోయి శతక ప్రక్రియ ఒక ప్రత్యేకతను సంతరించుకుంది. నన్నయనాటి నుంచి నేటిదాకా ఎంతో ఆదరింపబడుతున్న ప్రక్రియ ఈ శతకం.

శతకం అంటే నూరు అని అర్థం. అంటే శతకంలో సాధారణంగా వంద పద్యాలు ఉంటాయి. ఆపై చిలుకు పద్యాలూ ఉండవచ్చు. శతకాలు పురాణాల్లాగా కథ ప్రధానాలు కావు. ప్రబంధాల్లాగా వర్ణన ప్రధానమైనవి కావు. గేయ కృతుల్లాగా సంగీత ప్రధానాలు కావు. ద్విపదల వలె దీర్ఘ పరిమితి ఉన్నవి కావు. ఇవి ముక్తకాలు. అంటే ఏ పద్యానికి ఆ పద్యమే ప్రత్యేకంగా విడివిడిగా ఉంటాయి. కానీ మొత్తం శతకంలో ఏక సూత్రత ఉంటుంది. కవి యొక్క స్వీయానుభవం ప్రతి పద్యంలోనూ ప్రస్ఫుటం అవుతుంది. చాలా శతకాలు సులభ గ్రాహ్యాలుగా ఉంటాయి. అందువల్లనే తెలుగులో శతక రచనకే కాదు పఠనానికి కూడా గొప్ప ప్రచారం వచ్చింది.

తెలుగులో పాల్కురికి సోమన నుంచి అంటే క్రీ.శ. 12వ శతాబ్ది నుంచి శతక రచన సాగింది. ఆ తర్వాత ఎందరో కవులు శతక రచనను చేపట్టినారు, చేపడుతున్నారు. భక్తి తత్త్వాన్ని సంకీర్తనల్లో రంగరించిన మహనీయుడు తాళ్ళపాక అన్నమయ్య. తెలుగు సాహిత్యంలో తొలుత అంతగా గౌరవించబడని పదకవిత్వాన్ని భక్తిపథ కవిత్వంగా

మార్చిన కవి అన్నమయ్య. పదకవుల్లో అన్నమయ్య ఆదికవి. సంగీత సాహిత్యాల్లో, సంస్కృతాంధ్రాల్లో సవ్యసాచి. శ్రీ వేంకటేశ్వరునిపై అనన్యభక్తి పారవశ్యంతో కవితలల్లిన మహానుభావుడు. ఆయనకు హరికీర్తనాచార్యుడనీ, పదకవితా పితామహుడనీ, సంకీర్తనాచార్యుడనీ సార్థకమైన బిరుదులున్నాయి.

అన్నమయ్య 32 వేల సంకీర్తనలను రచించడమే కాకుండా, సంస్కృతంలో 'వేంకటాచల మహాత్మ్యము'ను, 'సంకీర్తన లక్షణము'ను రచించాడు. సంకీర్తన లక్షణము అలభ్యం. అంతేకాకుండా అన్నమయ్య వాల్మీకి రామాయణాన్ని 'ప్రవిమల ద్విపద ప్రబంధ రూపమున నవముగా' రచించినట్టు తాళ్ళపాక చిన్నన్న తన అన్నమాచార్య చరిత్రలో పేర్కొన్నా ఇప్పుడది అలభ్యం. ఈయన రెండు శతకాలను కూడా రచించినట్టుగా తెలుస్తున్నా, అందులో వేంకటేశ్వర శతకం మాత్రమే ప్రస్తుతం లభిస్తున్నది.

శతకాలను వస్తువును బట్టి పలు విధాలుగా వర్గీకరించవచ్చు. అందులో శృంగార శతకాలు ప్రధానమైనవి. మొదట భగవంతుని పరంగా అన్నమాచార్యుడు రచించిన వేంకటేశ్వర శతకం శృంగార శతకంగా ప్రసిద్ధం. వంద పద్యాలు గల ఈ శతకంలో 'వేంకటేశ్వరా' అనే మకుటంతో అన్నమయ్య రచించటం జరిగింది. ఈ శతకంలోని ప్రతి పద్యం అలమేలు మంగ పరంగానే రచింపబడింది. ఈ శతకం అలమేలు మంగపై చెప్పినదే అని ఈ పద్యం వల్ల తెలుస్తున్నది.

**"అమ్మకు తాళ్ళపాకఘనుడన్నడు పద్య శతంబు చెప్పెగో**
**కొమ్మని వాక్సుసూనములు గూరిమితో నలమేలు మంగకున్**
**నెమ్మది నీవు చేకొని అనేక యుగంబులు బ్రహ్మకల్పముల్**
**సమ్మది మంది వర్థిలను జవ్వనలీలలు వేంకటేశ్వరా!"    100**

అంతేకాక ఈ శతకానికి 'శ్రీ (అలమేలుమంగా) వేంకటేశ్వర శతకము' అని కూడా పేర్కొనడం చూడవచ్చు. ఈ శతకంలోని పద్యాలు పురాణ సన్నివేశాత్మకంగాను, అలమేలుమంగ శ్రీ వేంకటేశ్వరుల ప్రణయాత్మకంగాను, అన్నమయ్య మధురభక్తి ప్రదర్శకంగానూ వర్గీకరించవచ్చు. ఈ శతకంలో అలమేలు మంగమ్మకు ప్రాధాన్యత ఉండగా మకుటం మాత్రం వేంకటేశ్వరా అని ఉండటం ఈ శతక విశేషం. తమిళంలో 'అలర్' అంటే 'పుష్పం, పద్మం' అని అర్థం. 'మేల్' అంటే 'పైన' అని అర్థం. 'మంగై' అంటే 'సుందరి' అని అర్థం. అంటే అలమేలు మంగై' అంటే 'పద్మంపై నిలిచిన అందమైన పడతి' అని అర్థం. అమ్మవారికి లక్ష్మి, పద్మావతి వంటి పేర్లుండగా అన్నమయ్య మాత్రం వైష్ణవ తమిళ పరిభాషా రూపమైన .అలమేలుమంగ' పేరునే తన రచనల్లో వాడడం మనం చూడవచ్చు.

అలమేలుమంగను తల్లిగా భావించి అన్నమయ్య ఆ తల్లి పుట్టుకను లోకానందంకోసమే అని చెప్పిన వేంకటేశ్వర శతకంలోని ఈ పద్యాన్ని గమనించండి:

**"నిగిడి పయోధి ద్రచ్చు నెడ నిర్జరసంఘము నిక్కి చూడగా**
**ధగధగ యంచు దిక్కుల నుదగ్రతటిల్లత లుల్లసిల్లగా**
**దగ నుదయించి మించిన సుధా(పతి మీయలమేలుమంగ నీ**
**మగువ యటంచు మెత్తురు సమస్తమునీంద్రులు వేంకటేశ్వరా!" 85**

వేంకటేశ్వరా! పాల సముద్రాన్ని దేవతలు, దానవులు కలిసి చిలికే సమయంలో దేవతలు గుంపు ఆసక్తితో చూస్తుండగా, దిక్కులందు పొడవైన మెరుపు తీగలు పుట్టగా, పాలసముద్రంలో పుట్టిన మా అమ్మ అలమేలు మంగమ్మ చంద్రకాంతిని మించిన కాంతి కలిగినదని అంతరు మునిశ్రేష్ఠులు మెచ్చుకొన్నారని, ఇది లోకానందమేనని అన్నమయ్య వర్ణించాడు.

అన్నమయ్య తన వేంకటేశ్వర శతకంలో అందరి ఆడవారిని లక్ష్మీ స్వరూపులుగా భావించి వారిని గౌరవించే విధానాన్ని ఈ పద్యం ద్వారా గమనించవచ్చు :

**"నదలమేలుమంగ జననంబునకై కలశాబ్ధిద్రచ్చి యీ**
**మూదుజగంబులందును ప్రమోదము నించితి వట్ల నుండుచో**
**నాడుదనంపుబృంద ముదయంబును బొందగ నిత్యసంపదల్**
**నేడిక నేమిటం గడమ నీకృప వారికి వేంకటేశ్వరా!" 81**

వేంకటేశ్వరా! మా అమ్మ అలమేలుమంగ (లక్ష్మి) పుట్టుకకోసం నాడు పాల సముద్రాన్ని దేవ రాక్షసులచే చిలికించి ఆనందాన్ని ఈ లోకంలో వ్యాపింపచేశావు.

ఈనాడు స్త్రీ సమూహాలు అనేకం పుట్టాయి. వారికి నిత్యమైన సంపదలు నీదయవలన కొరత లేకుండానే ఉంటాయి కదా! (ఒక్క ఆడుదాని పుట్టుకకోసం పాల సముద్రాన్ని చిలకటం వంటి పెద్ద ప్రయత్నం చేసి నీ దయ చూపించావు... ఇంతమంది ఆడువారు పుట్టిన ఈ లోకంలో ఇక నీ దయకు లోటు ఉంటుందా? అందరి ఆడువారినీ లక్ష్మీ స్వరూపులుగా నువ్వు చేస్తావని భావం).

అలమేలుమంగ వేంకటేశ్వరుడు ఒక్కటే అన్న విషయాన్ని, భార్య చివరి ప్రాణం భర్తే అని వారిద్దరూ ఏక శరీరంగా ఉండాలని, అలా ఉంటేనే లోకం మెచ్చుకుంటుందని మనకు తెలియజేస్తూ వర్ణించిన ఈ క్రింది పద్యాన్ని పరిశీలించండి:

**"ఓయలమేలుమంగ యిది యొక్కటి పో జగదేక భర్తకున్**
**బాయని నీకునుం గడమ ప్రాణము ప్రాణము నేకమాయె నీ**
**కాయము కాయముం గలిసె గౌగిటకాంక్ష యటంటు నీసతి**
**ప్రాయము నిండుజవ్వనము బల్మఱు మెత్తురు వేంకటేశ్వరా!" 76**

వేంకటేశ్వరా! నీ భార్య అలమేలు మంగమ్మను అనేకమంది ఇలా మెచ్చుకొంటున్నారు. మీరిద్దరూ వేరువేరుగా కనబడుతున్నారు కానీ, ఎల్లప్పుడూ నిన్ను విడువని నీ భర్త, నువ్వు ఒక్కటే. నీ చివరి ప్రాణం (సమానం), నీ భర్త ప్రాణం ఒకటే అయింది. నీ శరీరం, ఆమె శరీరం ఒకటిగా కౌగిళ్ళ కాంక్షలో కలిసిపోయాయి.

అంటూ నీ సతి అలమేలు మంగమ్మ వయస్సును, నిండు యౌవనాన్ని అభిమాన చెలికత్తెలు అనేకమార్లు మెచ్చుకొంటారు.

కొలిచేవారికి నిత్యం ఆశ్చర్యమైన ఐశ్వర్యం కలిగించేది అలమేలుమంగ. అలాంటి అమ్మని భక్తులు కొలిచే విధానాన్ని అన్నమయ్య ఇలా వర్ణించాడు :

**"పరిమళముం బ్రభావము శుభస్థితి నిత్యవిభూతి విభ్రమ**
**స్ఫురణము దివ్యవైభవము భోగము శ్రీయలమేలుమంగ నీ**
**యురమున నంచు సన్మునులు యోగిజనంబులు మెచ్చి మెచ్చి నీ,**
**వరవనితాశిరోమణి నవారణ గొల్తురు వేంకటేశ్వరా!"60**

వేంకటేశ్వరా! నీ వక్షస్థలములో ఉన్న మా అమ్మ అలమేలు మంగమ్మ నిత్య పరిమణయుతమైనది. ప్రభావం కలది. ఎప్పుడూ శుభమైన స్థితిలో ఉండేది. కొలిచేవారికి నిత్యం ఆశ్చర్యకరమైన ఐశ్వర్యం కలిగించేది. శ్రేష్ఠమైన వైభవం కలిగినది, భోగాలు కలిగినది అని యోగి జనులు, మునిశ్రేష్ఠులు నీ వనితారత్నమైన అలమేలుమంగను యధేచ్ఛగా కొలుస్తుంటారు.

అన్నమయ్య అలమేలుమంగ శృంగారానికి ప్రతీకైన ఆమె అందాన్ని వర్ణించిన విధానాన్ని ఈ పద్యం ద్వారా గమనించండి :

**"తొలకెదుకొప్పులో నెరులొ తుమ్మెదదాటులో చూపువంపులో**
**గులుకులొ మించి వెన్నెలల గుంపులో శ్రీయలమేలుమంగకున్**
**బలుకులు పచ్చకప్పురపు బల్కులు తావులె దివ్యగంధముల్**
**పలుచననవ్వులే విరుల పాన్పులు నీకును వేంకటేశ్వరా" 62**

ఓ వేంకటేశ్వరా! మా అమ్మ అలమేలు మంగ చూపు వంపులా? కదిలే కొప్పులో ముంగురులా? నల్ల తుమ్మెదల గంతులా? (అలమేలుమంగ చూపులు నల్లటి తుమ్మెదల్లా ఉన్నాయని భావం) మా అలమేపు మంగమ్మ విలాసాలా? మెరిసే వెన్నెలల గుంపులా? (అలమేలుమంగ విలాసాలు మెరిసే వెన్నెలలా ఉన్నాయని భావం) మా అలమేలుమంగమ్మ మాటలు గుబాళించే పచ్చకర్పూరాలు. ఆమె శరీరం నుండి వచ్చే వాసనలు దివ్యగంధాలు. ఆమె పలుచగా నవ్వే నవ్వులు నీకు పూల పాన్పులు.

అలమేలుమంగ నీకు బాగా సరిపోయిందనీ అన్నమయ్య వారిద్దరి జోడి వర్ణించిన విధానాన్ని చూదండి :

**"తగునలమేలుమంగకును దన్మయమందెదునీకు మేనిలో**
**బగటులు బచ్చి మాటలను బచ్చెనయెచ్చరికల్ వివేకముల్**
**మొగముల లేతనవ్వులను మోపులనాటులుతమ్మితూటులు**
**జగడపుబొందులున్ రతులసంపదవిందులు వేంకటేశ్వరా!" 71**

వేంకటేశ్వరా! మా అమ్మ అలమేలుమంగమ్మకు, నీకు బాగా సరిపోయిందయ్యా! తన్మయత్వాల్లోను, కాంతుల్లోను, ఉత్తుత్తి హెచ్చరికలలోను, మొగాలలో లేత నవ్వులు

చిలకరించడంలోను, పెదవుల విందుల్లోను, రతుల సంపదల్లోను - ఒకరికొకరు తగ్గరు. మా మంచి జోడీ స్వామీ!

లోక కళ్యాణానికి మీరు కలిసి ఉన్న సమయంలో చేసే పూజలు అందరిచేత పొగడబడుతూ, తలచుకున్నవారికి భాగ్యాలైనాయని అన్నమయ్య ప్రస్తావించిన విధానాన్ని చూడండి :

**"మణులవెలుంగు దీపవనమాలికలై పొగడొంద గంకణ**
**క్వణనము మేఖలా వళులఘంటలు శ్రీయలమేలుమంగకు**
**బ్రణయవినోద సంపదకు బాయక నీ కొనరించుపూజకై**
**ప్రణుతనుతప్రభావముల భాగ్యాము లైనవి వేంకటేశ్వరా" 83**

వేంకటేశ్వరా! మా అమ్మ అలమేలుమంగ, నువ్వు కలిసి ఉన్న సమయంలో ఆమె ధరించిన మణుల వెలుగు నీకు నిరంతరం ప్రకాశించే దీప సేవగా, వనమాలగా ప్రసిద్ధిచెందింది (మణుల వెలుగు దీపమని, పొదుగైన వనమాల అని భావం).

మా అమ్మ చేతికి వేసుకొన్న కంకణాల ధ్వనులు, నడుముకు పెట్టుకొన్న మొలనూలు ఘంటల ధ్వనులు - నీ పూజలో చేసే ఘంటానాదంగా పేరుపొందింది. ఈ రకంగా మా అమ్మ - మీ ప్రేమ వర్ధిల్లే సమయంలో చేసే పూజలు అందరి చేత పొగడపడుతూ, తలచుకొన్న వారికి భాగ్యాలైనాయి.

ఈవిధంగా అన్నమయ్య అమ్మవారి పుట్టుకను, సౌందర్యాన్ని, భక్తిని మేళవించి అత్యంత గొప్పగా దివ్యమంగళ స్వరూపమైన శ్రీ వేంకటేశ్వరస్వామిని తన వేంకటేశ్వర శతకంలో చక్కగా స్మరించి తరించాడు.

స్థూలంగా పైన పేర్కొన్న సాహిత్యాంశాలతోపాటు శ్రీ వేంకటేశ్వర శతకంలోని భాషాంశాల్ని కింది పరిశీలనలో చూడవచ్చు.

## 1) ధ్వని మార్పులు

1. హ్రస్వాచ్చు : దీర్ఘాచ్చు
   అ : ఆ; అతఁడు (17) : ఆతఁడు (17)
2. అల్పప్రాణం : మహాప్రాణం
   జ : ఝ; జల్లను (64) : ఝల్లను (61)
3. పదమధ్యాచ్చు లోపం
   ఉ : పదమధ్య ఉలోపం; పలుకు (3) : పల్కు (7)
4. ము : ంబు; జవ్వనము (100) : జవ్వనంబు (50); మొగము (71) : మొగంబు (86)
5. శ్వాసహల్లు : నాదహల్లు
   మొకము (73) : మొగము (71)

2) సంధులు : అచ్చు + అచ్చు; అచ్చు + హల్లు; హల్లు + అచ్చు; హల్లు + హల్లు - రకంగా ఉన్నాయి.

**1. అచ్చు + అచ్చు రకం సంధులు :**

**పూర్వాచ్చుకు పరాచ్చు చేరినప్పుడు పూర్వాచ్చుకు పరాచ్చు ఆదేశం కావడం:**

అ + ఆ → ఆ; వేంకటేశ్వర + ఆ → వేంకటేశ్వరా (20)

అ + ఇ → ఇ; చక్కన + ఇ తల్లి → చక్కని తల్లి (14)

అ + ఒ → ఒ; ఒక్క + ఒక → ఒక్కొక్క (24)

ఇ + ఏ → ఏ; ఎక్కడికి + ఏగి → ఎక్కడికేగి (43)

ఇ + ఓ → ఓ; ఇచ్చినది + ఓ → ఇచ్చినదో (2)

ఉ + అ → అ; నీవు + అలమేలుమంగ → నీవలమేలుమంగ (46)

ఉ + అ → అ; నీ హృదయము + ఆతఁడె → నీ హృదయమాతఁడె (17)

ఉ + ఇ → ఇ; ఎట్టులు + ఇచ్చితివో → ఎట్టులిచ్చినవో (2)

ఉ + ఈ → ఈ; ధ్వనులు + ఈనఁగ → ధ్వనులీనఁగ (20)

ఉ + ఉ → ఉ; ఎట్టులు + ఉండెనో → ఎట్టులుండెనో (2)

ఉ + ఎ → ఎ; చిత్తము + ఎవ్వరికి → చిత్తమెవ్వరికి (4)

ఉ + ఏ → ఏ; మమ్ము + ఏలినతల్లి → మమ్మేలినతల్లి (5)

ఉ + ఐ → ఐ; కొండలు + ఐ → కొండలై (63)

ఉ + ఒ → ఒ; మాయలు + ఒ → మాయలొ (9)

ఉ + ఓ → ఓ; పరిమళము + ఓ → పరిమళమో (31)

**పూర్వరూప అంతాచ్చు పరరూప ఆద్యాచ్చు నడుమ హల్లు చేరడం**

అ + ఇ → అర్ ఇ; బొమ్మ + ఇళ్లు → బొమ్మరిళ్లు (35)

ఆ + అ → ఆయ్ అ; ఆ + అలమేలుమంగ → ఆయలమేలుమంగ (35)

ఈ + ఎ → ఈయ్ ఎ; ఈ + అలమేలుమంగ → ఈయలమేలుమంగ (75)

ఉ + అ → ఉయ్ అ; చెక్కు + అద్దములు → చెక్కుటద్దములు (18)

ఉ + ఉ → ఉయ్ ఉ; తూగు + ఉయ్యేల → తూగుటుయ్యేల (46)

ఐ+అ→ఐయ్ అ; మేలములై+అలమేలుమంగ→మేలములై యలమేలుమంగ(18)

**పూర్వరూప దీర్ఘాచ్చు హ్రస్వం కావడం, ద్విరుక్త హల్లు ఆగమంగా రావడం:**

ఆ + అ → అయ్య్ అ; ఆ + అలమేలుమంగ → అయ్యలమేలుమంగ (24)

**2. అచ్చు + హల్లు రకం సంధులు :**

**పరరూప ఆద్య శ్వాసహల్లు నాదం కావడం :**

ఉ + క్ → ఉగ్; కన్నులు + కల్గి → కన్నులుగల్గి (2)

ఉ + త్ → ఉద్; సిగ్గు + తేఱు → సిగ్గుదేఱు (13)

**పూర్వరూప అంత్యాచ్చు మరో అచ్చు కావడం :**

ఇ + ల్ → ఉల్; జలధి + ల్ → జలధుల్ (25)

**పరరూప ఆద్యహల్లు మహాప్రాణ హల్లుగా ఆదేశం, ఁ ఆగమం, పరరూప ఆద్యశ్వాసహల్లు నాదం కావడం :**

మ్ ఉ+త్→ప్ ఉc-ద్; కుందనము+తీగపయిన్ → కుందనపుc దీగపయిన్ (32)

**పూర్వపర రూపాల నడుమ అరసున్న చేరడం, పరరూప ఆద్యశ్వాసహల్లు నాదం కావడం :**

నిన్ను + చూసి → నిన్నుcజూసి (14)

3. **హల్లు + అచ్చు రకం సంధులు :**

**పూర్వ, రూప అంత్య హల్లులోను, పరరూప ఆద్య అచ్చులోను ఎలాంటి మార్పు లేకపోవడం :**

న్+అ→న్అ; ఉన్నతితోన్ + అలమేలుమంగ → ఉన్నతిలోనలమేలుమంగ (13)

న్ + ఆ → న్ఆ; నీవనగన్ + ఆతcడు → నీవనగనాతcడు (13)

న్ + ఉ → న్ఉ; పగతిన్ + ఉండెనో → పగతినుండెనో (13)

న్ + ఐ→ న్ఐ; అందములున్ + ఐ → అందములునై (63)

4. **హల్లు + హల్లు రకం సంధులు :**

**పూర్వరూప అంత్య హల్లు, పరరూప ఆద్య హల్లు రెండింటిలోనూ ఎలాంటి మార్పు లేకపోవడం :**

న్ + ఘ → న్ఘ; తీగపయిన్ + ఘనచక్రవాకముల్ → తీగపయిన్ ఘనచక్రవాకముల్ (32)

3) **భావార్థకనామం :** అనిర్దిష్ట క్రియకు భావార్థక ప్రత్యయం (-ట) చేర్చి ఏర్పడేది.

వేcడు - వేcడుట, "గోళ్లవడిcజేర్చుచు నీయలపార్చి వేcడుటల్" (43)

4) **కృదంత నామాలు :** నిర్దిష్ట క్రియకు కృత్ ప్రత్యయం చేరి లేదా చేరక ఏర్పడేవి

కృత్ ప్రత్యయం చేరని రూపాలు

1. **క్రియ అలాగే నామంగా కావడం**

నవ్వు - నవ్వు (3)

2. **క్రియ చివరి అద్విరుక్త హల్లు ద్విరుక్తం కావడం**

న్ : న్న్; కను - కన్ను (2)

కృత్ ప్రత్యయం చేరిన రూపాలు

1. **క్రియ, ప్రత్యయం రెండింటిలో ఎలాంటి మార్పు లేకపోవడం**

-వ : - చేరు - చేరువ (8)

2. **క్రియ చివరి అచ్చుగాని, హల్లుగాని, అక్షరంగాని లోపించడం**

ఉ లోపం; -క : - వేడు - వేడ్క (36)

చు లోపం; -పు : - నడచు - నడపు (9)

యు లోపం; -cత : - పూయు - పూcత (29)

రు లోపం; -ట : - చెమరు - చెమట (29)

ఇయు లోపం; -ఉపు : - మెఱియు - మెఱుపు (58)

ఉచు లోపం; -ఇమి : - కూరుచు - కూరిమి (8)

**3. క్రియ చివరి అచ్చు లోపం, చివరి నాదహల్లు శ్వాసం కావడం**

ఉ లోపం; గ్ → క్; –అ : – అలగు – అలక (29)

ఉ లోపం; త్ → ద్; –అ : – చెందు – చెంత (86)

ఉ లోపం; డ్ → ట్; –అమి : – కూడు – కూటమి (69)

**4. క్రియ చివరి అచ్చు లోపం, ఆది హ్రస్వ అచ్చు దీర్ఘం కావడం**

ఉ లోపం; అ → ఆ; –ఇక : – కను – కానిక (51)

**5) తద్ధిత రూపాలు :** నామానికి గాని, నామ విశేషణానికి గాని తద్ధిత ప్రత్యయం చేరి ఏర్పడేవి.

**1. నామం, ప్రత్యయం రెండింటిలోనూ ఎలాంటి మార్పు లేకపోవడం**

– ఁడు : – చెలువు – చెలువుఁడు (64)

**2. నామగతాచ్చు లోపం చెందడం**

– ఉ లోపం; – అము / అంబు : చెలువు – చెలువము (61) / చెలువంబు (82)

**3. నామం, ప్రత్యయం నడుమ హల్లు ఆగమంగా రావడం**

– ర్ ఆగమం; – అము : కాపు – కాపురము (40)

**4. నామగతాక్షరం లోపం, నామం – ప్రత్యయం నడుమ హల్లు రావడం**

– ఁడు లోపం, 'ర్' ఆగమం; – ఆలు : – ప్రియుఁడు – ప్రియురాలు (25)

**5. నామ విశేషణం, ప్రత్యయం రెండింటిలోనూ ఎలాంటి మార్పు లేకపోవడం**

– తనంబు : – తనంబు – కల్కి – కల్కితనంబు (40)

**6. నామవిశేషణ గతాచ్చు లోపం చెందడం**

– అ లోపం; – ఉవ : – మగ – మగువ (85)

**6) లింగ రూపాలు :** స్త్రీ, పురుష, స్త్రీ-పరుషోభయ సామాన్య, నపుంసక లింగ రూపాత్మకం.

**1. స్త్రీలింగ రూపాలు :** ఇంతి (39), తల్లి (55)

**2. పుంలింగ రూపం :** భర్త (76)

**3. స్త్రీ-పురుషోభయ సామాన్య లింగ రూపాలు :** జంతువు (17), చిలుక (27)

**4. నపుంసక లింగ రూపాలు :** అద్దము (18), మాట (26)

**7) వచన రూపాలు :** ఏకవచన, బహువచన రూపాత్మకం.

**1. ఏకవచన రూపాలు :** ఏకత్వాన్ని బోధించేవి – ఔప్పు (46), పాన్పు (22)

**2. బహువచన రూపాలు :** ఒకటికంటె ఎక్కువను బోధించేవి. సామాన్యంగా బహువచన ప్రత్యయం –లు కనిపిస్తూ ఉంది. – కులు ప్రత్యయం కూడా చూడవచ్చు. నామం, ప్రత్యయం రెండింటిలోనూ ఎలాంటి మార్పు లేకపోవడం.

– ల్‌లు :– జగము – జగముల్ (25), ప్రియంబు – ప్రియంబులు (9)

నామగత అచ్చు మరో అచ్చు కావడం

ఇ → ఉ; ల్/లు : చెలులు (3); జలధి - జలధుల్ (25)

నామగతాచ్చు లోపం, గత హల్లు మరో హల్లుగా ఆదేశం చెందడం.

ఇ లోపం, ద్ - ళ్; -లు :- పొడి - పొళ్లు

ఉ లోపం, ద్ - ళ్; -లు :- తాడు - తాళ్లు

నామగతాచ్చు లోపం చెందడం

ఉ లోపం; లు :- ధూళి - ధూళ్లు (22)

ఉ లోపం; ర్ → ళ్; లు :- ఇగురు - ఇగుళ్లు (97)

నామగతాచ్చు లోపం, గత దంత్య దంతమూలీయ అనునాసికం కంఠ్యం కావడం

ఉ లోపం; న్ → ఙ్; కులు :- కెలను - కెలంకులు (30)

నామగతాచ్చులోపం, గత ద్విరుక్త దంత్య మరియు దంతమూలీయ హల్లు అద్విరుక్త మూర్ధన్య హల్లు కావడం

ఉ లోపం; ల్ల్ → ళ్; -లు :- ఇల్లు - ఇళ్లు (35)

నామగతాచ్చు మరో అచ్చుగా పరివర్తన చెందడం

ఇ → ఉ; య్ → త్; -లు :- నేయి - నేతులు (50)

ఆది పై - లు చేరిన రూపం : పద్మభవానులు (5); క్రీడావాచక రూపం : గుజ్జనగూళ్ళు (35); ద్రవ్యవాచక నిత్యబహుమానాలు : నూనె (50); పాలు (50) చూడవచ్చు.

సర్వనామరూపం 'వాఁడు'పై బహువచన ప్రత్యయం -రు చేరి ఏర్పడిన బహుమాన రూపంపై 'వారు' పై -లు చేరి 'వీరలు' అనే మరో బహువచన రూపాన్ని చూడవచ్చు.

వీఁడు + రు → వీరు + లు → వీరలు (1)

8) **విభక్తి రూపాలు :** వీటిని ఔపవిభక్తిక, కేవల విభక్తి రూపాలుగా పేర్కొనవచ్చు.

1. **ఔపవిభక్తిక రూపం** : నామం తర్వాత, కేవల విభక్తి ముందు ఔపవిభక్తిక ప్రత్యయం చూడవచ్చు.
   ఉ లోపం; అ :- కాంతలు - కాంతల - కు (43)
   ఉ లోపం; ఇ :- మేను - మేని - లో (71)
2. **కేవల విభక్తి రూపాలు :** నామం తర్వాత విభక్తి ప్రత్యయం పూర్వం వచ్చేవి.
   కిన్ / కు / కుఁ / కున్ :- తల్లి - కిన్ (49), అమ్మ - కు (100), సంపద - కుఁ (83), అలమేలుమంగ - కున్ (18)
   - కై :- పూజ - కై (83); - చేఁ :- లీల - చేఁ (73);

తో / తోన్ / తోడ : మోము-తో (13), ఉన్నతి - తోన్ (13); కొప్పు - తోడ (13)

- నందున్ :- హస్తము - నందున్ (23); - న్ :- కృప - న్ (73)

- న / నఁ :- పొన్పు - న (22), సౌధము - నఁ (22);
- పైన్ :- మూర్తి - పైన్ (24) - లో / లోన :- విడంబము - లో (21), అందములోన (63); -నుండి :- అంబరము - న - నుండి (31).

**సంబోధనా విభక్తి రూపాలు** : వేంకటేశ్వరా! (59); తరుణీ (12); రామేశ్వర (43); ఓలక్ష్మి (19); ఓ యలమేలుమంగ (12); ఓ చదురాల (27); ఓ చకోరిరో! (27).

**9) సర్వనామ రూపాలు** : నామానికి మార్పుగా వాడబడేవి.

**1. పురుషవాచక సర్వనామాలు :**

ఉత్తమ పురుష - ఏకవచనం - ప్రథమావిభక్తి : నేను (2)

మధ్యమ పురుష - ఏకవచనం - ప్రథమావిభక్తి : నీవు (4)

మధ్యమ పురుష - ఏకవచనం - ద్వితీయా విభక్తి : ని - ను (2) / నిన్ను (22)

మధ్యమ పురుష - బహువచనం - ద్వితీయా విభక్తి : మిమ్ముఁ (21)

ప్రథమ పురుష-మహద్వాచకం - ప్రథమా విభక్తి: వాండు (68); వాండ్లు (68)

**2. ఆత్మార్థక సర్వనామం** : ప్రథమావిభక్తి - ఏకవచనం : తాను (4)

**3. నిర్దేశిత సర్వనామాలు**

దూరవర్తి (-అ) నిర్దేశక సర్వనామం - ప్రథమావిభక్తి : అతఁడు (17) / ఆతఁడు (17) / ఆతను (17) / వాఁడు (68)

సమీపవర్తి (-ఇ) నిర్దేశక సర్వనామం - ప్రథమావిభక్తి : ఇతఁడు (77) / ఈతఁడు (77) / ఈతను (82); వీరలు (1)

**4. ప్రశ్నార్థక సర్వనామం**

మహద్వాచకం - ప్రథమావిభక్తి : ఎవ్వరు (97)

**10) సంఖ్యావాచక రూపాలు** : సంఖ్యల్ని తెలిపే రూపాలు

**1. ప్రాథమిక సంఖ్యావాచకాలు** : ఒక్కటి (76), మూఁడు (81), నాల్గు (98), వేయి (16), కోటి (50)

**2. మహతీ మహద్వాచక బహువచనం** : ఒక్కడు (72)

**3. సంఖ్యావాచక విశేషణాలు** : మూఁడు జంగంబులు (81); నాల్గు వంకలు (98); వేయి చేతులు (17); కోటి కొండలు (63); ఒక యలమేలుమంగ (73); ఒక్కొక్క నాఁడు (24)

**4. బహువచన ప్రత్యయాత్మక సంఖ్యావాచకం** : కోటులు (57)

**5. వచనంతో కూడిన అనుబంధ నామం** : ఇరువులు (72)

**11) నామవిశేషణ రూపాలు** : స్వతస్సిద్ధాలు, నిష్పన్నాలు అని రెండు రకాలు.

**1. స్వతస్సిద్ధ నామ విశేషణాలు** : అఱ - కన్నులు (46) , ఎల - నవ్వు మాటలు (9), నిడు - వాలికలు (17), మంచి - సుధారసంబు (3), చిఱు - నగవు (58), లే - బ్రాయము (9), లేంత నవ్వు (2), ఇట్టి - ప్రపంచము (38)

**2. నిష్పన్న నామ విశేషణాలు :** నామం లేదా నామవిశేషణానికి నిష్పన్న నామవిశేషణం నిష్పన్న ప్రత్యయం చేరకపోవడం.

నామం అలాగే నామవిశేషణం కావడం.

పుత్తడి - బొమ్మ; మొల - నూలు (20); తేనె - పల్కులు (7)

నామగత అక్షరం లోపించడం

-ము లోపం; సమస్తము - సమస్త, సమస్త జీవులు (38)

నామగత హల్లు మరో హల్లుగా ఆదేశం చెందడం

మ్ - ప్; బోనము - బోనపు - బోనపు దొంతులు (35)

ల్ - ట్; కౌఁగిలి - కౌఁగిటి - కౌఁగిటి పాన్పు (22)

నామం తర్వాత అగమంగా హల్లు చేరడం

'ట్' ఆగమం; చెక్కు - ట - ద్దములు (18)

నామం తర్వాత అరసున్న చేరడం, తర్వాతి శ్వాస హల్లు నాదం కావడం

'ఁ' ఆగమం త్ → ద్; పువ్వుఁదేనె (48)

నామగత హల్లు మరో హల్లుగా ఆదేశం, అరసున్న ఆగమం, తర్వాతి శ్వాసహల్లు నాదం కావడం

మ్ → ప్, ఁ ఆగమం, క్ → గ్; చకోరపుఁగన్ను (8)

మ్ → ప్, ఁ ఆగమం, త్ → ద్; మరందపుఁదేనె (7)

మ్ → ప్, ఁ ఆగమం, ప్ → బ్; ముత్తెపుఁబ్రాలు (84)

నామగత హల్లు మరో హల్లుగా ఆదేశం, హల్లు ఆగమం

మ్ → ప్, ట్ ఆగమం, కపటపుటల్కలు (69)

నిష్పన్న నామవిశేషణ ప్రత్యయం చేరడం

నామగతాచ్చు లోపం చెందడం

అ లోపం; - ఇ :- చక్కన - చక్కని 'చక్కని శ్రీయలమేలుమంగ' (34)

ఉ లోపం; - అ :- జాజులు - జాజుల 'జాజులకొప్పు' (92)

- అగు : ఒప్పు - ఒప్పగు - ఒప్పగు తూగుటుయ్యెల (46)

- ఐన : ఉన్నతుఁడు - ఉన్నతుఁడైన - ఉన్నతుఁడైన ఖగేంద్రమూర్తి (24)

- పు : చెలువము - చెలువంపు - చెలువంపుసంపద (30)

నామం, ప్రత్యయం నడుమ హల్లు చేరడం

ట్ ఆగమం - ఇ :- మీఁద - మీఁదటి - మీఁదటి లోకముల్ (68)

నామ విశేషణ గతాచ్చు లోపం చెందడం

అ లోపం; - ఇ :- చిన్న - చిన్ని 'చిన్నిలేఁగురులు' (13)

**3. క్రియాజన్య విశేషణాలు నామవిశేషణాలు కావడం**

భూతకాలిక విశేషణాలు : ఏలిన - తల్లి (5); తాలించిన కూరలు (16)

తద్ధర్మార్థక విశేషణాలు : చల్లెడు - శ్రీయలమేలుమంగ (11); కరంగు - చిత్తములు (48); ఒనరించు - పూజ (83)

**2. నిష్పన్న నామ విశేషణాలు** : నామం లేదా నామవిశేషణానికి నిష్పన్న నామవిశేషణం నిష్పన్న ప్రత్యయం చేరకపోవడం.

వ్యతిరేక విశేషణం : పాయని - జాజిపువ్వులు (26)

**12) పదబంధ రూపాలు** : భాషా సంబంధంగా, కారక సంబంధంగా వర్గీకరించవచ్చు.

**1. భాషా సంబంధ వర్గీకరణం** : తెలుగు + తెలుగు : వేడుక కూటమి (69); తెలుగు + సంస్కృతం : చక్కని తల్లి (14); సంస్కృతం + తెలుగు : ప్రేమపు నవ్వు (26); సంస్కృతం + సంస్కృతం : బ్రహ్మకల్పము (100); పర్షియో - అరబిక్ + తెలుగు : జగడపుఁబొందు (71).

**2. కారక సంబంధ వర్గీకరణం** : తత్పురుష పదబంధాలు : నీళ్ల వసంతము (48); తెప్పల నవ్వు (46)

కర్మధారయ పదబంధాలు : వాడిగోళ్లు (87); క్రొత్త మెఱుంగులు (49); చూచిన చూపులు (27)

ద్విగు పదబంధాలు : మూఁడు జగంబులు (81); నాల్గువంకలు (98).

**13) అన్యదేశ్య రూపాలు :**

**1. తత్సమాలు** : శ్రీ, సతి, జాంబవతి, సత్యభామ, రమణి (1); కన్య (25), మనసు (46), సంపద (30), విభుఁడు (51)

**2. వైకృతాలు** : దెందము (16), జవ్వనము (100), మొకము (72), మొగము (71), ఉంగరము (20), జోనము (35), కస్తురి (22), ఆస (47), కప్పురము (22), దెస (4).

**3. పర్షియో-అరబిక్ రూపం** : జగడము (71)

**4. తమిళ రూపాలు** : అల-మేలు-మంగ (అలర్ - మేల్ - మంగై) (1)

**14) సామాన్య క్రియలు :**

ఏలు (5), ఇచ్చు (2), పలుకు (3), చేయు (1), ఉండు (13), తోఁచు (15), మ్రొక్కు (5), చెప్పు (10).

**15) సంశ్లిష్ట క్రియలు :**

ఇంచు ప్రత్యయాత్మక క్రియలు - కరుణించు (36), చరియించు (85), పరిమళించు (16), తాలించు (16), కౌఁగిలించు (94), నుతించు (32) - ఇల్లు / ఇలు ప్రత్యయాత్మక క్రియలు : ఉల్లసిల్లు (85), వర్ధిల్లు (100).

**16) సంయుక్త క్రియలు** : ధాతు పల్లవ క్రియలు – చెలులు పల్కు (9), వణఁదలువాఱు (98), పెడమరచూచు (34); శబ్దపల్లవ క్రియలు : సిగ్గుదేఱు (73); వేడ్కపడు (30); తల్లడమందు (64); వెదచల్లు (38); వెన్నెలచల్లు (34); కొనియాడు (77); ఆనవెట్టు (97); సానపట్టు (8).

**17) సమాపక క్రియలు :**

1. **సామాన్య సమాపక క్రియలు** : చేసెదను (1); కట్టితి (3); చెప్పుదు (24), ఉందువు (2);, చిక్కవు (2); మ్రొక్కుదురు (5); అచ్చెను (23); పల్కిరి (9), అంద్రు (6).

**18) అసమాపక క్రియలు :**

1. **క్త్వార్థక క్రియలు** : కాంచి (8), కోసి (23), అదిమి (6), కరుణించి (36), పాయక (91)
2. **శత్రర్థక క్రియలు** : నవ్వుచు (25); తేలుచు (6); చరియించుచు (85)
3. **అన్నంత క్రియలు** : ఒప్ప (26), కోయఁ (23)
4. **భూతార్థక ధాతుజ విశేషణ క్రియలు** : మిగిలిన (74), వడ్డించిన (16)
5. **తద్ధర్మార్థక ధాతుజ విశేషణ క్రియలు** : ఒనరించు (83), రాలెడు (75)
6. **వ్యతిరేకార్థక ధాతుజ విశేషణ క్రియ** : పాయని (76)

**19) ఇతరం :**

1. **సకర్మక క్రియలు** : అదలు – అదల్చు (39); తేరు – తేర్చు (4)
2. **క్రియా విశేషణాలు** : ఎక్కువగా (24), అపుడు (69), ఎక్కడ (43), కిలకిల (3), ధగధగ (85), గ్రక్కున (95), ముసిముసి (5), జళజళ (70)
3. **పదకల్పాలు** : పరిమళమో కదంబమొ (31), శక్యమె (4)

తాళ్ళపాక అన్నమయ్య సాహితీ, భాషా వైభవాలు తెలుగు సాహిత్య జగత్తులో అత్యంత విలువైన మహాకవితా సంపద. ఆంధ్రదేశంలోని పెన్న, కృష్ణవేణి, గోదావరి నదీ సమాన ఉత్తుంగ కవితా తరంగాలే రతనాలసీమలో వెలసిన మన తాళ్ళపాక అన్నమయ్య సాహిత్యామృతం. అందులో అమ్మవారైన అలమేలుమంగపైన అన్నమయ్య చెప్పిన శ్రీ వేంకటేశ్వర శతకం తెలుగు కావ్య నదంలో మకుటాయమానమై ఎన్నటికీ శోభిల్లుతూ ఉంటుంది.

***

# భావుక చక్రవర్తి అన్నమయ్య

డా॥ సి.ఆర్. హరినాథ్
తెలుగు అధ్యాపకులు
రీజనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎడ్యుకేషన్
యన్.సి.ఇ.ఆర్.టి., మైసూరు

బ్రతుకును వేంకటేశ్వరార్పణంగా, కవితను వేంకటేశ్వరార్చనంగా సాగించిన భావుకుడు తాళ్లపాక అన్నమాచార్యులు. సంకీర్తనలకు కావ్యస్థాయిని కలిగించిన ఆచార్యుడాయన. తేట మాటలలో తేనెల ఊటలను నింపిన చతురవచోభూషణుడతడు.

కవిత్వానికి దర్శనం, వర్ణనం రెండూ కావాలి. ఎంతోమందికి దృశ్యం ఎదుటనే ఉన్నా దర్శనం కాదు. దర్శనమైన ఎందరికో వర్ణనా శక్తి చాలదు. అంచేత దర్శన వర్ణనాలు కవికి రెండు కళ్లు. ఆ రెండు కళ్ళతో చల్లని వెన్నెలను కురిపించిన సుకుమార భావుకుడు అన్నమయ్య.

ఆయన శృంగార సంకీర్తనమైనా, ఆధ్యాత్మ సంకీర్తనమైనా, వైరాగ్య సంకీర్తనమైనా – ఏదైనా అందులోని అంశం శ్రీ పద్మావతీ శ్రీనివాసమే. సృష్టి సర్వంలోనూ శ్రీ వేంకటేశ్వరుడే. అందుకే అన్నాడు :

**"చూచే చూపొకటి సూటి గురియొకటి**
**తాచి రెండు నొకటైతే దైవమే సుండీ"**

అనడంలో ఆ దర్శనానికి నిదర్శనముంది

పైకి ఒక మామూలు అభివ్యక్తిలాగా అనిపించినా లోపలికి దిగేకొద్దీ లోతులు దొరకని అంభోనిధి లాగా అనిపించే సంకీర్తనలెన్నో ఉన్నాయి.

**"వినరో భాగ్యము విష్ణుకథ**
**వెనుబలమిదివో విష్ణు కథ"**

అనే సంకీర్తనలో మొదటి చరణంలో విష్ణుకథా ప్రాచీనతను చెప్పాడు. ఆదినుంచి సంధ్యాది విధులలో విష్ణుకథ ఉందన్నాడు. నారదాది మహాత్ముల చేత గానం చేయబడిందన్నాడు. రెండో చరణంలో వేదవ్యాసులు చెప్పిన పవిత్రమైన విష్ణు కథ అన్నాడు. ఇలా చెప్తూ వచ్చి, హఠాత్తుగా అధ్యాత్మ వాతావరణం నుండి 'గొల్లెతల' ప్రస్తావన తెచ్చి లౌకికస్థాయికి తెచ్చినట్లు అనిపింపజేశాడు.

**"గొల్లెతలు చల్లలు కొనగొని చిలుకగ**
**వెల్లి విరియాయె విష్ణుకథ"**

అంటాడు. చల్లలు చిలుకుతూ గొల్లస్త్రీలు విష్ణుకథా గానం చేశారని పైకి అనిపిస్తుంది. కానీ సందర్భాన్ని అనుసరించి వ్యాస, నారదాది మహాత్ముల సరసన ఈ అభివ్యక్తికి మరో అర్థమూ కనిపిస్తుంది. గొల్లెతల అంటే మహావిష్ణు భక్తులు. సనాతనులైన మహానుభావులు. మధురభక్తిలో మైమరచిపోయి, తమ తనువులోనూ, తలపులోనూ విష్ణువునే నింపుకున్నవారు ముగ్ధభక్తులు. వారికి నిత్యస్మరణమే చల్లలు చిలకడం. విష్ణుతత్త్వ వివేచనమే వెన్న దొరకడం. భగవంతుడు ముగ్ధభక్తులకు దొరుకుతాడనే మాట ప్రసిద్ధమే కదా!

**"వరమిమ ముపదేశమాద్రి యధ్వం**
**నిగమ వనేషు నితాంత చారఖిన్నాః"**

అని శ్రీకృష్ణ లీలలను కర్ణామృతంగా ప్రవచించిన లీలాశకులు అననే అన్నారు.

"వేదాంతమనే అడవులలో తిరిగి తిరిగి అలసిపోయిన పండితులార! మీకు ఒక ఉపదేశం చేస్తున్నా వినండి. ఇదొక ఉపాయం. వేదాంతాల అర్థం - అదిగో ఆ గోపస్త్రీల ఇండ్లలో రోటికి కట్టివేయబడి ఉంది" ఇది ముగ్ధభక్తులపట్ల భగవంతుని కృప!

దశావతారాలను వర్ణిస్తున్నప్పుడు అన్నమయ్య రకరకాల పోకడలను పోయాడు. కొన్నిచోట్ల సూటిగా చెప్తే, కొన్నిచోట్ల దాచి మాట్లాడతాడు.

**"ఇందరికి అభయమ్ములిచ్చు చేయి"**

అనే సంకీర్తనంలో 'అభయహస్తా'న్ని ఆధారం చేసుకుని దశావతారాలను చెప్పాడు.

**"వెలలేని వేదములు వెదకి తెచ్చిన చేయి**
**కులుకు గుబ్బలిక్రింద చేర్చు చేయి"**

అన్నప్పుడు మత్స్య, కూర్మ అవతారాలు తేలికగానే స్ఫురిస్తున్నాయి. 'అరుదైన భవదూరుడితడు అనే సంకీర్తనలో :

**"కొడుకు టెక్కెము రూపుగోరి కైకొని పెద్ద**
**కొడుకు కొరకుగా గోరపడి"**

అంటాడు అన్నమయ్య. కొడుకుటెక్కెము - అంటే మన్మథుని పతాకం. అందులోన్ని రూపు 'చేప' మీనకేతనుడు కదా! అంటే మత్స్యరూపాన్నిగోని అని. అలాగే పెద్దకొడుకు అంటే బ్రహ్మ. వేదోద్ధరణ కోసం మధుకైటభుల వధను సూచించాడు.

'వ్యాజస్తుతి' అలంకారం వంటి ఈ సంకీర్తనను చిత్తగించండి :

**"పుడమినిందరి బట్టె భూతము - కదు**
**పొడవైన నల్లని భూతము"**

ఇందులోని 'భూతం' శ్రీ వేంకటేశ్వరస్వామి. సాధారణంగా లోకంలో 'భూతం' అనే మాటను నిందార్థకంలో ప్రయోగిస్తారు. ఇక్కడ అన్నమయ్య భక్తిని ప్రకటిస్తూ ప్రయోగించాడు. లోకంలో 'భూతం పట్టింది' అనే మాట ఉంది. ఒక్కసారి దైవభక్తి వంటపట్టాక అది వదలదు - అనడానికి అన్నమయ్య చతురంగా ఇలా చెప్పాడు. మనిషిపై దైవాధిపత్యాన్ని చెప్తూ :

**"కోరిన కోర్కెలు కోయని కట్లు**
**తీరవు నీవవి తెంచక"        (అంతర్యామీ అలసితి సొలసితి - సంకీర్తన)**

కోరికలే బంధనాలు. వాటినుంచి విడిపించాల్సింది దేవుడే. నిజానికి 'తీరితే తప్ప ఆ బంధాలు తెగవు' అని చెప్పాలి. కానీ, ఇక్కడ 'నీవు తెంపితే తప్ప అవి తీరవు' అని వక్రంగా చెప్తాడు కవి.

సర్వం శ్రీ వేంకటేశ్వర మయం అతనికి. అది మెలకువైనా నిద్ర అయినా :

**"ఎండగానీ నీడగానీ ఏమయినాకానీ**
**కొండలరాయడే మా కులదైవమూ"**

అన్నాడు. అంతేకాదు :

**"నిదుర గనవలసినను నీరజాక్షునికి దన**
**హృదయమర్పణ సేయుటది యోగ నిదుర"**

అంటాడు. నిద్రలోకూడా స్వామికే మనసర్పించాలి. అది యోగనిద్ర అంటాడు.

సహాయమనేది ఎవరికి అవసరమో వారికి అందినప్పుడే దానికి సార్థకత. ఈమాట ఎవరికైనా, ఎక్కడైనా అన్వయిస్తుంది. దీన్ని అన్నమయ్య దైవానికే అన్వయించి మాట్లాడతాడు.

**"తెలియ చీకటికి దీపమెత్తక - పెద్ద**
**వెలుగు లోపలికి వెలుగేలా?"**

అని ఇంతవరకూ సాగిన సంకీర్తనను ఒక్కసారిగా శ్రీ వేంకటేశ్వరునికి ముడివేస్తూ

**"ధృతిహీను కృపచూసి తిరువేంకటేశ్వరుడు**
**తతికావకుండిన తానేల"**

అంటాడు. ఒక సత్యాన్ని ప్రకటించడానికి దానికి ఉపబలకంగా నిలిచే ఉపమానాలను వరిసగా గుప్పిస్తాడు.

దైవబలాన్ని, కరుణనూ ప్రకటించడానికి అన్నమయ్య ఎన్నో ఉపమానాలను, విశేషణాలనూ ప్రయోగిస్తాడు. అతి ప్రసిద్ధమైన సంకీర్తన 'పొడగంటిమయ్యా మిమ్ము పురుషోత్తమా' లో :

**"కోరిమమ్ము నేలినట్టి కులదైవమా - చాలా**
**నేరిచి పెద్దలిచ్చిన నిధానమా"**

అంటాడు. ఈ మాటను సాధారణ భక్తుడెవరైనా అనగలడు. తర్వాతి మాటను గమనించాలి.

**"గారవించి దప్పితీర్చు కాలమేఘమా"**

అన్నాడు. దప్పిక తీర్చడానికి ఒక చెంచాడో, బిందెడో నీళ్లు చాలు. కానీ భక్తుని మొరను ఆలకించేవాడు, భక్తుని విన్నపాలను వినేవాడూ, వారి ఆశలను గౌరవించేవాడూ అయిన శ్రీ వేంకటేశ్వరుడు అలా చిన్నచిన్న వరాలతో సరిపెట్టుకోడు. ప్రళయకాలంలోని మేఘం కుంభవృష్టిని కురిసినట్లు వరాలవాన కుపిరిస్తాడు. ఒక చిన్న దప్పిక తీర్చడానికి కాలమేఘం కరుణిస్తే ఎలా ఉంటుంది? మన ఊహకే వదిలిపెట్టి మరో ఉపమానాన్ని అందుకుంటాడు. సంకీర్తనాచార్యుడు ఈ సంకీర్తనలోని ఉపమానాలన్నీ శ్రీ వేంకటేశ్వరుని భక్తపోషణ గురించి, ఆశ్రిత రక్షణ గురించి చెప్పేవే.

శృంగార సంకీర్తనలలో అన్నమయ్య సహస్ర కిరణాలతో ప్రకాశించాడు. శ్రీ పద్మావతీ శ్రీనివాసుల లీలావినోదాలను ఆ మహాభావుకుడు వర్ణించినట్లు ప్రపంచంలో ఏ భాషలోని కవీ వర్ణించలేదు. 'శ్రీ వేంకటపతి క్రీడా రహస్యమ్ములై' విరిసిన 'శ్రుతులు' ఆయన సంకీర్తనలు.

సాధారణంగా నాయకుడు సూర్యుడనీ, నాయిక పద్మమనీ భావించి చెప్పడం రివాజు కానీ, అన్నమయ్య చెప్పిన ఈ అపురూప భావం గమనించదగినది :

**"అతివ జవ్వనము రాయలకుం బెట్టినకోట**
**పతి మదన సుఖ రాజ్యభారంబు నిలుప"**

మదనసుఖమనేది ఒక రాజ్యం. పైగా అది భారమైనా బాధ్యత కూడా. దానిని కాపాడి రాజ్యాన్ని నిలబెట్టాలంటే ఒక కోట కావాలి కదా? ఏమిటీ ఆ కోట. శ్రీ పద్మవతీదేవి యౌవ్వనమే పెట్టనికోట. ఈ మాటను విశ్లేషించే కొద్దీ అర్థాలు దొరుకుతాయి.

తర్వాతి చరణాలలోని ఉపమానాలు మరింత పదునైనవి.

**"కాంత కనుచూపు మేఘంబులోపలి మెఱుంగు**
**కాంతుని మనసు చీకటి వాపను"**

"నాయకుని మనసులో చీకటి కమ్ముకుని ఉంది. దానిని పోగొట్టడానికి ఒక వెలుగు కావాలి. ఏమిటా వెలుగు అంటే - కాంత కనుచూపు. ఆ చూపు ఒక మేఘం. అది చమక్‌మని మెరుస్తుంది. ఆ చూపుల్లోని మెరుపు - ఆయన మనసులోని చీకటిని పోగొట్టగలదు. ఆమె ముఖం ఒక అందమైన చందమామ. ఆయన కళ్లు కలువలు. చంద్రుడు కనిపించగానే కలువలు విచ్చుకుంటాయి. శృంగార క్రీడకు

ఏకాంతం కావాలి కదా! ఆమె కొప్పు అంధకారపు భూమి. కురులు విప్పితే చీకటి". ఇలా సాగే ఈ సంకీర్తనలో అన్నమయ్య భావుకశక్తి తళతళలాడింది.

శబ్ద ప్రయోగౌచిత్యం గురించి ఆలోచించినపుడు కూడా 'కాంత' అనే ఆరంభం అర్థవంతం.

'కామ్యత ఇతి కాంతం' అని అమరం. కాంక్షింపబడేది కాంత. ఈ సందర్భంలో ఆ పదప్రయోగం ఔచిత్యవంతం.

నాయికా సౌందర్యాన్ని చిత్రించడానికి అన్నమయ్య ఉపమానానికి అధిక ప్రాధాన్యమిచ్చాడు.

**"ప్రేమపు నీ యధరమే పెట్టరాని జీతము**
**కోమలి నీ తమ్ములమె కొంగు బత్యము"**

**"లేత నీ నగవులె పళ్లెములో కూడు"**

**"పుయ్యని నీ మేనితావి పువ్వుల చప్పరము**
**తొయ్యలి నీ కౌగిలిది తూగుమంచము"**

అనే భావాలలో నాయికా సౌందర్యాన్ని గగనాలకెత్తాడు కవి. 'ఆమె ఏ పరిమళపు పూతనూ పూసుకోనక్కరలేదు. ఆమె శరీర పరిమళం ఒక పూలపందిరిలా ఉంటుంది' అనడంలో ఒక ప్రబలమైన శృంగార ప్రకటన ఉంది.

'చక్కని తల్లికి చాంగుబళా' అనే ప్రసిద్ధ సంకీర్తనలో శ్రీ పద్మావతీదేవి 'చూపులకు', 'అలుకకు', 'చన్నుమెఱుగులకు', 'నడుముకు', 'చందన గంధికి' చాంగుబళా అనడం కొత్త ఊహ. సంకీర్తన చివరకి వచ్చేసరికి :

**"వాదయి వేంకట విభుం బెనచిన తన**
**సంది దండలకు చాంగుబళా"**

అని మెరిపిస్తాడు. శ్రీ వేంకటేశ్వరుని విందు చేసిన 'సందిదండలకు' ప్రశంసనిస్తాడు.

ఇంతటి శృంగారాన్ని ఒలికిస్తున్నప్పటికీ, నాయికకు హఠాత్తుగా ఒక భక్తిభావం కలిగి శృంగారం వెనకబడటమూ ఉంది. 'ఆయన దేవుడు - నేను. ఆయనపట్ల దోషం చేస్తున్నానా' అన్న తడబాటు నాయికలో తొంగిచూస్తుంది. ఈ సందిగ్ధ స్థితిని చిత్రించిన సంకీర్తన 'అందుకే లోంగే గాక అలిగితినా నేను' (Vol. 12) అన్నది.

**"దీమసపుతోడి తాను దేవరవంటివాడు**
**యీ మేరం దనమోవి యెంగిలెట్టు సేతునే"**

'దైవంలాంటి వాడిని నా పెదవితో ఎంగిలి చేయడమెలా?' అన్న భావం మరింత స్పష్టమై :

**"సొన బట్టిన చూపుల జగము లేలేటివాని**
**కొనలు కొనలు గాగ గ్రుచ్చియెట్టెత్తుదునే"**

అని కనిపిస్తుంది.

ఈ దివ్యమోహన రూపాన్ని చూసి పొంగిపోతూ నాయిక శృంగారం నుంచి భక్తిలోకి యాత్ర చేస్తుంది.

**"మగరూపుగైకొన్న మగువవంటివాడవు**
**నిగిడి నిన్ను గెలువ నేడు మాతరమా"**

అని ప్రశ్నిస్తూనే ప్రశంసిస్తుంది. 'ఆడదాన్ని నేనే ఇంతగా మోహితనై పోతున్నానే ఇక నిన్ను చూసి మగవాళ్ళేమవుతారో?' అంటుంది. 'పుంసాంమోహనరూపాయ' అనే విష్ణు సౌందర్యం ఇక్కడ స్ఫురణకు వస్తుంది.

శృంగార సంకీర్తనలలో అన్నమయ్య ఎన్నో రతిరహస్యాలకు చిత్రిక పట్టాడు. అవి అన్నీ భావచిత్రాలుగా రూపించాడు.

**"పదలి నీ గుబ్బలు పాంచజన్యములుగ**
**కడివోని మొనలొలింగటియ నొత్తి"**

అనడమూ,

**"వెలది వీపిదీకు వీణవాళవుగా**
**ములువాడి కొనగోళ్ల మోపి మోపి"** **(అదే కీర్తన)**

అనడమూ అద్భుత శృంగార భావచిత్రాలు.

సాధారణంగా కావ్యాలలోనూ, కథలలోనూ నాయికలు మన్మథోపాలంబం చేయడం ఉంది. విరహంలో మన్మథోపాలంపన ఒక తప్పనిసరి అంశం. ఇక్కడ నాయికకు అది కూడా ఒక సమస్యగానే మారింది. నాయకుడు మన్మథునిలాంటివాడే ఇక ఎవరిని నిందించేది?

**"తరుణిపై మరునికి దయలేదు - నీవు**
**మరునినే పోలితివి మరియేటి బ్రతుకు"**

అంటాడు.

**"ఏల తిట్టేవే నన్ను" (17-459)**

అనే సంకీర్తనలో :

**"చిక్కని వెన్నెలతోట సెలవినె వుండగాను**
**చక్కని నీ మోమునే చంద్రుదంటిన్"**

అంటాడు. 'చిరునవ్వు వెన్నెలలా ఉంది. అది పెదవుల మీదే వెలుగుతుంది. వెన్నెల ఉంది కాబట్టి ఇది చంద్రుడయి ఉండాలి. కాబట్టి నీ ముఖాన్ని చంద్రుడన్నాను. నన్నెందుకు తిడతావు?' అంటాడు.

మరో సంకీర్తనలో :

**"అలిగితే నేమాయె అట్టె వూరకుండనేలా**
**పలుకుల నైన దూర బాడిగాదా"** **(17-25)**

'కోపం వస్తే రానీలే, ఫరవాలేదు. ఊరికే ఉండడం దేనికి? కనీసం తిట్టవచ్చుగదా!' అంటాడు. ఇది ఎంతటి నవీన భావమంటే – గాలిబ్ గీతాలలో ఈ భావం కనిపించి ఆశ్చర్యపరుస్తుంది.

**"నాల్కలేదె నీకు నన్ను తిట్ట"**

అని దాశరథి అనువాదం.

**"తిట్టితేనే పలుకులే తేనె గారీనే**
**గట్టియాయె నీ పనులు గానీలేవే"**

అన్న సంకీర్తనలోని భావం.

**"ఎంత తియ్యని పెదవులే ఇంతి నీలి**
**తిట్టుచున్నప్పుడున్ కూడ తీపి కురియు"**

అనే గాలిబ్ గీతంలో కనిపించడం విస్మయపరుస్తుంది. అన్నమయ్య భావుకతలోని నవ్యతను వేనోళ్ల చాటుతుంది.

**"పొద్దిక నెన్నడు పొడుచునా**
**పోయిన చెలి రాదాయను"** **(12 - 138)**

'నిమిషం ఒక సంవత్సరంలా దీర్ఘంగా అనిపిస్తుంది' అనేది భావకవితాయుగంలో కనిపించే అభివ్యక్తి.

'తరుణి జవ్వనపు తపము సేయగను' (18 - 167) అనే సంకీర్తనలోని చిత్రణ విశిష్టమైనది. స్త్రీ శరారానికి ప్రయోగించే ఉపమానాలను మాత్రమే పేర్కొని ఉపమేయాలను మన ఊహకు వదిలేస్తాడు కవి. అందులోనూ కవిత్వాన్ని మేళవిస్తాడు.

**"జక్కవ పులుగులు జంట వాయవివె**
**గక్కన వెన్నెల కాసినను"**

చక్రవాక పక్షులు ఎపుడూ కలిసే ఉంటాయని, చీకటి క్రమ్మగానే ఒక్కచోటనే ఉంటాయనీ అంటారు. ఆ చక్రవాకాలకు స్త్రీ వక్షాలతో పోలిక.

వెన్నెల విరిసినా ఈ చక్రవాకాలు విడిపోవడం లేదు. ఆ వెన్నెల ఆమె ముఖచంద్రుడిదైనా కావచ్చు, ప్రియకాంతుడిదైనా కావచ్చు. కోయిల గొంతు ఆమెది.

వాన కురిసినా కోయిల గొంతు చెదరదట. ఏమిటావాన? సంయోగంలోని స్వేదం. దీన్ని వాద్యం చేస్తూ, చివరి పాదాల్లో కవి స్పష్టం చేస్తాడు.

**"చిలుకలు సందడి చేసిన తొలగవు**
**కలసిన సమరతి కయ్యమున"**

తపస్సు చేస్తే ఫలితం ఉంటుంది కదా! ఇక్కడ ఆమె చేసినది 'జవ్వన తపము'. దాని ఫలితం - జాతి వైరములు సమసిపోవడం. ఆ జాతివైరాలున్నది కూడా శృంగార సామగ్రికే. చక్రవాకం - వెన్నెల, కోయిల - వాన, తుమ్మెద - సంపెంగ, ఇలాగ వీటికి ఏనాటి వైరమో ఎఱుగరాదు. అది సమసిపోయింది.

'ఏమిరా నన్ను నేలనేవు నీవు' (12 సం.) అనే సంకీర్తనలు :

**"శ్రీ వేంకటేశ నన్ను చెలరేగి కూడితివి**
**దేవుండవు నీకు నే దేవులనె కానా"**

అని ముగిస్తాడు. 'నీవు దైవానివి. నేను గుడిని. నీవు నాలోనే ఉన్నావు' అనడంలోని సంక్షిప్తతా సౌందర్యం రమణీయమైనది.

అన్నమాచార్యులలో ఆశ్చర్యపరిచే ప్రతిభ ఏమిటంటే, ఆయనకు ఉన్న వస్తువు ఒక్కటే శ్రీ వేంకటేశ్వరుడు. సాధారణంగా కవులు భిన్న వస్తువులను తీసుకుని అనంత సృష్టిని సాగిస్తారు. కానీ అన్నమయ్య ఒకే వస్తువును తీసుకుని భిన్నరీతులలో అద్భుత సృష్టి చేశాడు. వేలకొద్దీ సంకీర్తనలలో వేంకటేశ్వరుడే దాగి ఉన్నాడు. ఆయన లీలాగానం ప్రతి పదంలోనూ ఝళంఝళిస్తుంది. తాకితే మ్రోగే తంత్రీవాద్యంలో, ముట్టుకుంటే ప్రతి సంకీర్తనా మృదుల భావుకతతో మురిపిస్తుంది. అన్నమాచార్యుల సంకీర్తనలలో సర్వత్రా తానే నిండి శ్రీ వేంకటేశ్వరుడు తెలుగువారినీ, తెలుగు భాషనూ కటాక్షించాడు.

'పూచి నీ కీరితి రూపు పుష్పములివియయ్యా' అని అన్నమయ్య అన్నదీ అందుకే. 'పూని నాచే రాయించుకుంటివి' అని అన్నపుడు కూడా కవికి అదే దృష్టి. ఈ రచనకు వెనక నిలిచిన నిలువెత్తు నేపథ్యమూర్తి ఎవరో ఆయనకు స్పష్టంగా తెలుసు. అంతటి వైరాగ్యస్ఫురణ ఉన్నప్పటికీ అన్నమయ్య తన చనువును కొనసాగించాడు.

'బ్రహ్మ కడిగిన పాదము' అని స్వామి పాదాలకు సాష్టాంగ ప్రణామాలు చేసిన మహాభక్తుడూ, 'మనుజుడై పుట్టి మనుజుని సేవించి అనుదినమును దుఃఖమందనేలా' అనిన విరాగీ, స్వామి శృంగార క్రీడా రహస్యాలను కూడా చిత్రించాడు. 'ఆయన నా దైవం - ఇది నా హద్దు' అని ఆయన హద్దులు గీసుకోలేదు. జీవితంలోని ప్రతి రసానుభవంలోనూ శ్రీ వేంకటేశ్వరుణ్ణే దర్శించాడు.

లేనిదే 'పలుకు తేనెల తల్లి' పవళించడాన్ని అంత చనువుగా చెప్పగలడా? పైగా నాయికా సౌందర్యానికి నాయకుడిని దాసుడిగా చేయగలడా?

**"దొరకెగా పూజ కందువపూజ నీ**
**విరహపు తనుతావి విరవాది పూజ"** **(12 - 95)**

ఇదంతా ఒక అపురూప కామోత్కంఠత. విరహంతో మరిగిపోతున్న తనువు - ఆ తనువు నుంచి వెలువడే పరిమళం - అది విరజాజులతో చేస్తున్న పూజ అట. జాజిపరిమళాలతో జాములు గడిపే విరహదాహమే స్వామికి పూజ. ఇక్కడ చెప్పే అంశం శృంగారం. తీసుకున్న ఉపమానం అధ్యాత్మికం. భక్తినీ, శృంగారాన్నీ ముడివేసి అవలీలగా కవితాయాత్ర చేయడం అన్నమయ్యకు ఒక లీల.

**"దైవకృతమెవ్వరికి తప్పింపరాదనుచు**
**భావించి జనులాడు పలుకు నిజమాయ"**

అనే సంకీర్తనలోని చతురత చర్వణ చేసేకొద్దీ చవులూరిస్తుంది.

విధిని ఎవరూ తప్పించలేరు - అన్నది లోకోక్తి. ఈ మాటను సాధారణంగా విరక్తితోనో, నిరాశతోనో ప్రయోగిస్తాము. కవి ఇక్కడ శృంగారానికి లంకె వేసి మాటాడతాడు. చంద్రుడికి మచ్చ ఉంది కదా! అందుకు దిగులు పడ్డాడట. మచ్చ లేకుండా ఉండడానికి వీలున్న చోటుకోసం వెతికాడు. ఆమె ముఖంగా అమరితే మచ్చ ఉండదు కదా - అని నాయిక ముఖంగా మారాడు. కానీ విధి వ్రాత తప్పుతుందా? అక్కడ కూడా మచ్చ వడి పడింది. ఆమె ముఖాన కస్తూరీ తిలకముంచారు. అదే మచ్చ. అది మరీ అందంగా ఉంది.

అలాగే చంద్రుడు తమను చంచలింపచేస్తూంటాడు - ఆయనకు కాస్త దూరంగా ఉందాం అని కలువలు ఆమె కుచాలుగా మారి ఉన్నాయి. 'హమ్మయ్య చంద్రుడికి దూరంగా హాయిగా ఉన్నాం' అనుకున్నాయి. కానీ అక్కడ మాత్రం తప్పిందా? ప్రాణవల్లభుడి గోటి గుర్తులు విదియ చంద్రులై వచ్చిపడాద్యతీ. అయ్యో, విధిని ఎవరు తప్పించగలరు? అంటాడు.

ఈ సంకీర్తనలో శృంగారాన్ని చెప్తున్నాడా? వైరాగ్యాన్ని ప్రకటిస్తున్నాడా? ఎంత చతురంగా జత కలుపుతున్నాడు!

ఆయన భావుక చక్రవర్తి. అనుసరించిన ప్రక్రియనుబట్టి ఆయన 'సంకీర్తనాచార్యుడు', 'పదకవితా పితామహుడు' అని అంటున్నాం. కానీ, ఆయన 'మహాకవి'. ప్రపంచ సాహిత్యంలో ఇంత సృష్టిచేసిన కవి మరొకరు ఉండరు. ఆయన తళతళ మెరిసే నందకఖడ్గం. దానికి అన్నివైపులా పదునే. శృంగార, వైరాగ్య, అధ్యాత్మ విషయాలలో ఏ చోటికాచోటు మెరిసిపోతూనే ఉంటుంది.

అన్నమయ్య భావుకతా వైదగ్ధ్యానికి మురిసిపోయి, సరసుడైన శ్రీవేంకటేశ్వరుడు ప్రకటించిన సల్లాపాలు ఈ సంకీర్తనలు. పులకించిన శ్రీ పద్మావతీదేవి చిలికించిన చిరునవ్వులీ పదకవితలు. ఈ వేడుకలు వెలకందనివి, తులతూగనివి.

***

# అన్నమయ్య - సూక్తినిధి

**శ్రీ ఈ.జి. హేమంతకుమార్,**
**ఆంధ్రోపన్యాసకులు**
**శ్రీ వేంకటేశ్వర ప్రాచ్య కళాశాల**
**తిరుమల తిరుపతి దేవస్థానములు**
**తిరుపతి**

దక్షిణభారతదేశ వాగ్గేయకారుల్లో అన్నమయ్యకు ప్రత్యేక స్థానముంది. వాసిలోను, రాశిలోను ఇతరులకు సాధ్యంకానన్ని సంకీర్తనలు రచించడం ఒక కారణమైతే, ఆ సంకీర్తన వాఙ్మయానికి సంగీతసాహిత్యాలను జోడుగుర్రాలుగా నడిపించడం మరొక పద్ధతిగా కనిపిస్తుంది. భక్తి ఉద్యమానికి ఇతని కీర్తనలు నూతన జవసత్త్వాలను చేకూర్చటం మరొక కారణం.

తనకు పూర్వమున్న పురాణ పద్ధతిని, కావ్యానువాద పద్ధతిని స్పృశించకుండా సరిక్రొత్త ప్రక్రియగా సంకీర్తన సాహిత్యాన్ని సృష్టించిన ప్రతిభాశాలి అన్నమయ్య. శ్రీ వేంకటేశ్వరునికి అంకితంగా, వేంకటవిభుని పదముద్రతో, సరిక్రొత్త స్వతంత్ర భావాలతో, తేటతెల్లమైన తెలుగు మాటలతో, ఒక్కొక్క సంకీర్తన ఒక్కొక్క ప్రబంధానికి సాటిగా, ధీటుగా, ఆలంకారిత ఉట్టిపడేటట్లుగా రచించి సంకీర్తన సాహిత్యానికి ఆద్యుడయ్యాడు. ఈ సంకీర్తనలకు పదాలని కూడా పేరు. భక్తుల కివి మధుర వైష్ణవ ప్రబంధాలు. సంకీర్తనలను విస్తారంగా సృజించి "హరిసంకీర్తనాచార్యు"డని, "పదకవితా పితామహు"డని కీర్తింపబడిన మహనీయుడు "ప్రజాభక్తకవి" అన్నమయ్య. ఆయన సంకీర్తనలలో సమకాలీన ప్రజాజీవనం ప్రతిబింబిస్తుంది. సమాజ నడతను ఎన్నో సూక్తులలో నిబంధించి మానవ స్వభావాన్ని ప్రస్ఫుటం చేశాడు.

సూక్తి అంటే మంచిమాట. ఆప్తవాక్యాలు సూక్తులు. ప్రాచీన కాలంలో సు+ ఉక్తి=సూక్తి అంటేనే కవిత్వమని అర్థం. "సుష్ఠు ఉక్తం సూక్తం" అంటే కేవలం సుభాషితం అని అర్థం కాదు. క్రొత్తగా వ్రాసిన కవిత్వాన్ని కూడా "అభినవసూక్తి" అని పిలిచేవారు. సుభాషితం పదానికి చక్కగా పలుకబడినది, చమత్కారవాక్యం, హితవచనం, ఉపదేశం, ప్రవచనం, హితోక్తి అని పర్యాయపదాలు కనబడుతున్నాయి. సామెతలు, జాతీయాలు, పలుకుబడులు, గూఢోక్తులు, వ్యంగ్యోక్తులు, వక్రోక్తులు మొదలైనవన్నీ సామాజిక స్పృహతో వాడబడినపుడు సూక్తులుగానే పరిగణింప బడతాయి.

"శోభనా చ సా ఉక్తిశ్చ సూక్తిః" అని కూడా వ్యుత్పత్తి చెబుతారు. ఉక్తి విశేషమే కావ్యం. సూక్తులు కవి కవితాశక్తికి నిదర్శనాలు. లోకజ్ఞతకి ప్రతీకలు. భాషపై గల

సాధికారతకు, అభిమానానికి తార్కాణాలు. సూక్తులు సామాజిక చైతన్య శక్తికీ, భావవ్యక్తీకరణకు తోడ్పడుతాయి. సూక్తులు నీతిని బోధిస్తాయి. సామాజిక స్పృహను కల్గిస్తాయి. హితాన్ని కల్గిస్తాయి. నిర్మలత్వాన్ని ప్రతిపాదిస్తాయి. సామాన్యంగా శతకాల్లో సూక్తులు అధికంగా కనిపిస్తాయి. కావ్యాల్లో సందర్భానుసారంగా అవసరమైనచోట ఉంటాయి. తెలుగుభాష స్వరూప స్వభావాలు అన్నమయ్యకు తెలిసినట్లు ఇతర కవులకు తెలియ దనిపిస్తుంది. ఆయన వాడిన తెలుగు మాటలు తెలుగుజాతి సౌరభాన్ని గుభాళింపజేస్తాయి. సమాజపు వ్యవహారంలోని పదాలకు కావ్యగౌరవం కలిగించిన తెలుగుభాషా ప్రియత్వం అన్నమయ్య సొంతం. అటువంటి తెలుగు పదాలలో ఆయన తయారుచేసి మనకందించిన అనేకానేక సూక్తులు వినసొంపుతో ఆలోచనల మధురిమలతో అలరారుతుంటాయి. అన్నమయ్య సూక్తులను కొన్ని విభాగాలుగా చేసి పరిశీలించవచ్చు.

**ధర్మం :**

చతుర్విధపురుషార్థాలలో మొదటిది ధర్మం. ధర్మాన్ని ఆచరించేవాడు ధార్మికుడు. సృష్టిలోని ప్రతిజీవికి ఒక ధర్మముంది. మానవుడు ధర్మబద్ధంగా జీవించాలి. సత్యం, ఇంద్రియనిగ్రహం, తపం, శుచి, సంతోషం, లజ్జ, ఓర్పు, ఋజుత్వం, జ్ఞానం, మనోనిగ్రహం, దయ. ధ్యానం వీటిని కలిగివుండడమే ధర్మబద్ధంగా జీవించడం. అన్నమయ్య కూడా "అహింసా పరమోధర్మః" అని తన సూక్తుల్లో చాటాడు.

**"సకల భూతదయ చాలగ గలుగుట,**
**ప్రకటించి దేహసంభవమైన ఫలము"** **1-223**

దేహియై పుట్టి బతుకుతున్నందుకు ఇతరులపై దయగలిగి ఉండటం చాలా అవసరమని అన్నమయ్య భావం.

**"త్రికరణశుద్ధిగ చేసిన పనులకు దేవుడు మెచ్చును; లోకము మెచ్చును".**
**2-236**

మనోవాక్కాయకర్మలు త్రికరణాలు. త్రికరణాలను లక్ష్యపెట్టకుండా పనులు చేయడంవల్ల తనకేగాక సమాజానికి కూడా అపకారమే జరుగుతుంది.

**"విరతి మా ధనము, విజ్ఞానమే ధనము".**

మానవునికి వైరాగ్యభావం అవసరం. వైరాగ్యమున్నపుడే స్వార్థపరత్వం తగ్గుతుంది. విజ్ఞానార్జన ధనార్జనకంటే గొప్పది.

**"మన్నున పుట్టిన కాయము మన్నున అణగేటిదింతే".** **3-404**

పంచభూతాలతో నిర్మితమైన దేహం మళ్ళీ పంచభూతాలలోనే కలిసిపోతుందన్న సత్యం పై సూక్తిలో ఉంది.

**"విత్తొకటి వెట్టగాను వేరొకటి మొలచీనా".** **4-186**

మంచి చేస్తే మంచి కలుగుతుంది. చెడ్డ చేస్తే చెడ్డ ఫలితమే వస్తుంది. చేసిన పనిని బట్టి కదా ఫలితం.

**"పేర బెట్టితే పాలే పెరుగౌను".** **28-67**

**"పువ్వు తొడమె బాసి వుండునా".** **13-362**

ఆత్మ దేహాన్ని ఆశ్రయించుకొని ఉంటుందనడానికి చెప్పిన సూక్తి ఇది.

**అర్థం :**

చతుర్విధపురుషార్థాలలో రెండవది అర్థం. లోకంలో ప్రధానమైంది ధనం. ఏ పని చెయ్యాలన్నా "ధనం మూలం ఇదం జగత్". పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి కూడా తన కాలజ్ఞాన తత్త్వాల్లో "ధనమేరా అన్నిటికీ మూలం, ఆ ధనము విలువ తెలిసికొనుట మానవ ధర్మం!" అని చెప్పారు. సుభాషితరత్న భాండాగారంలోని ఈ వాక్యాలను గమనించండి. "ఓయీ! మిత్రమా! నే చెప్పు హితమాలింపుము. ధనము లేనిచో తల్లి దూషించును. తండ్రి మెచ్చుకొనదు. సోదరులు మాట్లాడరు. సేవకుడు మిడిసిపడును. కుమారుడు చెప్పిన మాట వినడు. భార్య దగ్గరకు రాదు. బదులు అడుగుతాడనే అనుమానంతో మిత్రులు మాట్లాడరు. కనుక ధనమార్జింపుము. ధనమునకు అందరూ వశులగుదురు". సంపదలు మానవుని అజ్ఞానిగా చేస్తాయంటాడు అన్నమయ్య. సంపదల వలన తృప్తిని పొందినవారు లోకంలో లేరనీ, దానధర్మాలు చేసిన ధనమే స్థిరంగా నిలుస్తుందనీ ప్రబోధించాడు.

**"అతిసంపదలు దేహి నజ్ఞాని చేయు"** **2-267**

**"కనకము దాటితేనే ఘన సుఖమున్నది"** **3-308**

**"సిరులెన్ని కలిగినను చింతలే పెరుగు"** **3-322**

**"తగిలి సంపదలచే తనిసిన వారు లేరు"** **3-343**

**"పలు లంపటముల పడి ఘడియించేటి బహు ధన**
**మిది ఏల"** **4-102**

**"కలిమి ముందు వెనక కాననియ్యదు"** **19-459**

**"కలిమి కొలదియే గర్వము"** **21-369**

**"సిరిగలిగిన దాని చేతలెల్లా చక్కనే"** **22-147**

**"కలిమి గలవారిని కాదు కూడ దనరాదు"** **25-414**

**"మూల నెంత ధనమున్నా మంచి దానధర్మములు**
**తాలిమితో నిచ్చినదే దాపురమై నిల్చును".** **2-260**

ఎంత సంపద ఉన్నా, ఎన్ని భోగాలున్నా మనసును పీడించే అశాంతి కూడా ఉంటుంది. సంపన్నులంతా మనశ్శాంతితోనే ఉంటున్నారా? అన్నది ప్రశ్న. మానసిక ప్రశాంతత లేని అధికారాలు, పదవులు, సంపదలు ఎందుకు? అని అన్నమయ్య

ప్రశ్నిస్తూ గొప్ప సూక్తి చెప్పాడు. "చింతలేని అంబలి ఒక్క చారెడు చాలు (1 - 114)". మనిషి ధనవంతుడయ్యే కొలదీ మానసిక ప్రశాంతతను కోల్పోతాడని భర్తృహరి లాంటి ప్రాచీనులెందరో చెప్పారు. అతి సంపద కలిగినవాడు అజ్ఞానిగా మారతాడని అన్నమయ్య చెప్పిన అంశం ఆయన కాలం నాటిదే కాదు సార్వకాలికమైనది. సిరిగల వారికి అందరూ లోబడతారు. కులగోత్రాలు గలవాళ్ళు, విద్యలలో విర్రవీగేవాళ్ళు, "పసిడి గల్గువారి బానిస కొడుకులు" అన్న వేమన మాటను అన్నమయ్య ఏనాడో చెప్పాడు. "సిరిగల వారి చేతలెల్లా చక్కనే" అనడం ఆనాటి సమాజంలోని ధనవంతుల దర్పాన్ని వ్యక్తం చేయడమే.

**కామం**

పురుషార్థాలలో మూడవది కామం. కోరిక, వాంఛ అని ఈ శబ్దానికి అర్థాలు. లైంగికేచ్ఛను కూడా కామం అని అంటున్నారు. ఈ కామం పురుషార్థాలలోనే కాకుండా అరిషడ్వర్గాల్లో కూడా చోటుచేసికొన్నది. కామరోగానికి భార్యాసంగమమే ఔషధం. అది ధర్మబద్ధం. పరస్త్రీవ్యామోహం, కాముకత్వం సమాజనికి ఎంత హానిని కలిగిస్తాయో అన్నమయ్య చెప్పిన సూక్తులను గమనిస్తే అర్థమవుతుంది.

**"ఎనయ కాముకున కింతులే బ్రహ్మము". 1-457**

**"కాముకులకు మగువలే దైవము". 1-498**

**"పరకాంత నంటకుంటే పలుపుణ్యాలు సేయుట". 2-241**

**"ఇరవగు జీవులకెంత గలిగినా పరధన కాంతలే పలు ప్రియము" 4-96**

**"కాంతల పొందొల్లకుంటే ఘన దుఃఖమే లేదు". 4-196**

**"ఎన్ని వేదాలు చదివి ఎంత సోమయాజియైన**
**కన్నెలు వద్దనుండగా కాంక్ష లేల తీరును?" 16-492**

**"బ్రహ్మచారి కేలే యింతుల పొందు?" 20-135**

**"కాముకునికి సత్యంబులు కలవా ఎందైనా?" 25-386**

**"కాముకునకు నీతి ఎక్కడనైనా కలదా?" 26-264**

అన్నమయ్య నివసించిన సమాజంలో కాముకత్వం నియమ నిబంధనలకు లొంగకుండా ఉన్నట్లు కనిపిస్తుంది. జీవితం కేవలం సుఖానుభవం కోసమేనన్నట్లు అప్పటివాళ్ళు ప్రవర్తించిన కాలమది. ధార్మికత్వం, నైతికత్వం, కాముకత్వంలో మునిగి భక్తిభావనలు కరువౌతున్న సందర్భంలో సమాజపు అవాంఛనీయ నడతను అన్నమయ్య బయటపెట్టాడు. ఆయన సంకీర్తనలలో సంప్రదాయ విలువలపట్ల గౌరవం కలిగి ఉండాలన్న అభిప్రాయం వ్యక్తం కావడమేగాక మనుషులలో కుహనా సంస్కారాన్ని నిరసించడం కూడా కనిపిస్తుంది. కామపరమైన ఆలోచనలు మితిమీరడం వల్లనే సమాజం చుక్కాని లేని నావవలె వెళుతున్నదని, కామంలోని గుట్టు తెలుసుకొంటే

అది అంతగా పట్టించుకోవలసిన అంశం కాదని చెప్పడానికి అన్నమయ్య శృంగారాత్మకమైన సూక్తులెన్నింటినో చెప్పాడు.

**మోక్షం :**

మోక్షమంటే విడుదల. ఈ శరీరం నశించేది అనే గ్రహణ ఉంటే అంతా మోక్షాసక్తులౌతారు.

**"మేటివైరాగ్యముకంటే మిక్కిలి లాభము లేదు". 1-443**

**"ఫలము లందితే బంధము వీడదు". 1-483**

**"పంచేంద్రియాల పుట్టి పరగిన ఈ మేను**
**పంచేంద్రియాల మీది భ్రమ మానీనా?" 2-389**

**"సకలకారణము సంసారము". 3-109**

**"చంచలము మానవలె సతతము దేహికి". 3-158**

మానవ జీవితం అశాశ్వతం. నాటకం. ఈ బ్రతుకు మూణ్ణాళ్ళ ముచ్చట. కాబట్టి ఆడంబరమైన నడతను మానుకో. మోక్షం కోసం పాటుపడు అంటూ ఉపదేశించాడు.

**"నానాటి బదుకు నాటకము కానక కన్నది కైవల్యము;**
**పుట్టుటయు నిజము పోవుటయు నిజము నట్టనడిమిపని నాటకము;**
**ఎట్టఎదుటగలదీ ప్రపంచమును కట్టకడపటిదీ కైవల్యము". 3-576**

మోక్షేచ్ఛ ఉన్నవాడికి సంసార వైముఖ్యం అవసరం. సంసారంలోని అనిత్యను పారమార్థిక భావాల నిత్యతను తెలుసుకోవాలి. దీనికి జ్ఞానం అవసరం. గురువులను సేవించడం ద్వారా జ్ఞానం పొందవచ్చునని తాత్త్వికులందరూ చెప్పారు. జ్ఞానహీనులు ఇంద్రియవశులై ఇంద్రియసౌఖ్యాలే గొప్పగా భావిస్తారు. ఇంద్రియ సుఖాలు మనిషిని బంధిస్తాయి. ఆ బంధాలు మొదట తియ్యని ఫలాలనిస్తున్నట్లు అనిపించి మనిషి ఇహపరాలను గురించి ఆలోచించదు. దానివల్ల బతుకంతా వృథా అవుతుంది. ఈ విషయాలను బోధించడానికి అన్నమయ్య ఎన్నో సూక్తులు చెప్పాడు. "ఫలములందితే బంధము వీడదు" అనే సూక్తి గీతలోని 'కర్మణ్యేవాధికారస్తే' అనే శ్లోకభావాన్ని గుర్తుకుతెస్తుంది. 'నానాటిబదుకు నాటకము' అనే సూక్తి ప్రతి మనిషి తన జీవితాన్ని సింహావలోకనం చేసుకోవాలని చెపుతుంది. నాటకం ముగియగానే పాత్రలు మరుగైనట్లు, మళ్ళీ నాటకం మొదలైతే మళ్ళీ కనిపించినట్లు అనే భావం అర్థం అయితే మానవుడు రాగవిరాగాల ప్రాధాన్యతను అర్థం చేసుకొంటాడు.

సామాజిక అంశాలకు సంబంధించిన సూక్తుల్లో కోపం ఎంత ప్రమాదమో పేర్కొనబడింది. మానవుని అంతశ్శత్రువుల్లో కోపం ఒకటి. "కిమరిభిః క్రోధోఽస్తి చేద్దేహినాం". కోపం ఉంటే మనల్ని నాశనం చేయటానికి వేరే శత్రువులు అవసరం

లేదంటాడు భర్తృహరి. కోపం అసురలక్షణం. కోపం మనిషిని నిలువునా దహిస్తుంది. కోపంవల్ల ఆలోచనా శక్తి నశిస్తుంది. దానివలన జరగకూడని అనర్థాలెన్నో జరుగుతాయి. కోపం లేకుండా ప్రవర్తించడం తాపసిక లక్షణం. కోపరాహిత్య ప్రాశస్త్యాన్ని అన్నమయ్య -

**"కోపము విడిచినట్టి గుణమొక్కటి సుఖము". 2-159**

**"కోపము మానితేనే కోటి జపాలుసేయుట". 2-241**

**"కోటి చదువగ వచ్చు కోపము నిలుపరాదు". 2-474**

అని అనేక సూక్తులలో తెలియజేశాడు. కోపం వచ్చినప్పుడు ఓర్పు నశిస్తుంది. ఓరిమి లేనివాడు దేన్నీ సాధించలేడు. 'క్షణం ఓర్చుకొంటే గుణమొస్తుంది' అనేది ప్రాథమిక సత్యం.

కోపం ఎలాంటి దుర్లక్షణమో చెబుతూ అన్నమయ్య -

**"అట్టే ఆరును అనలము నీటను; ఎట్లైన ఆరదు ఈ కోపంబు".3-325**

**"కోపము విడిచితేనె పాపము తానే పోవు". 4-196**

**"అతికోపమేడనుండు నజ్ఞాన మాడనుండు". 4-351**

**"కోపము దయ ఎఱగదు". 19-459**

మొదలైన సూక్తులు చెప్పాడు. కోపం అజ్ఞానం. కోపం తామసిక లక్షణం. ఎన్నో సుగుణాలు కోపంవల్ల చెడిపోతాయి. కావున, కోప లక్షణాన్ని మానవుడైనవాడు పరిత్యజించాలి.

**మానవ స్వభావం :**

మానవజన్మ విశిష్టమైంది, ఉదాత్తమైంది. మానవ విలువలను పాటించకుంటే జన్మవల్ల ప్రయోజనం లేదు.

**"తలకొని ఒకకొంత ధనము కనిన వాడు**
**వెలలేని గర్వముతో విఱ్ఱవీగిని". 1 - 504**

**"తనకే సంతసమైతే తన భాగ్యము వొగడు**
**తనకు చింత వుట్టితే దైవము దూరు". 3-77**

**"మత్తుడై వుండేదే మనుజుని స్వభావము". 3-515**

**"ఒలసితే నొకమాట వొల్లకుంటే నొకమాట". 9-169**

**"నాలుకలోన బెల్లాలు ఎదలోన కత్తులు". 19-383**

ఇత్యాదీ సూక్తులలో అన్నమయ్య మానవుడెంత అవకాశవాదిగా ఉంటాడో చూపించాడు. ఏమి మాట్లాడినా, ఎవరితో మాట్లాడినా తనకు అనుకూలంగా

మాట్లాడడం మానవనైజం. సమాజంలో ఇది లౌకిక ధర్మమైనా అవాంఛనీయ మైనదే. కాలం అనుకూలంగా ఉన్నప్పుడు గుర్తుకురాని దైవం చింత కలిగినప్పుడు గుర్తుకొస్తుంది. మనస్సులో ఒక భావం ఉంచుకొని పైకి మరొకరకంగా మాట్లాడడం మానవుల్లోనే కనిపించే గుణం.

**కులాన్ని నిరసిస్తూ చెప్పిన సూక్తులు :**

కులమత భేదాలను అన్నమయ్య నిరసించాడు.

**"విజాతు లన్నియు వృథా వృథా అజామిళాదుల కదియే జాతి,**
**జాతిభేదములు శరీర గుణములు జాతి శరీరము సరి తోడనె చెడు**
**ఆతుమ పరిశుద్ధం బెప్పుడును అది నిర్దోషం బనాది**
**యీతల హరి విజ్ఞానపు దాస్యం బిది యొక్కటె పో సుజాతి". 2-383**

జాతి భేదాలను ఎంచడాన్ని అన్నమయ్య తీవ్రంగా నిరసించాడు. అవి కేవలం శరీర గుణాలని, ఆ గుణాలు శరీరం నశించడంతో చెడిపోతాయని, చెడిపోనటువంటి ఆత్మ ఒక్కటే సుజాతి అని అంటూ జాతి భేదములు వృథా అన్నాడు.

**"ఏ కులజుడేమి ఎవ్వడైన నేమి ఆకడ నాతడే హరి నెరిగిన వాడు" 1-292**

జన్మతో సిద్ధించే కులం, కులం కాదని, హరి నెరిగినవాడే హెచ్చైన కులజుడనీ అన్నమయ్య వ్యాఖ్యానించాడు. కులభేదాలను, జాతిభేదాలను నిరసిస్తూ - ఏ జాతి, కులం గొప్పది కాదని, అన్ని కులాలు సమానమేనంటూ అన్నమయ్య -

**"ఆతుమ సకల వ్యాపకమని తలపోసిన పిమ్మట**
**జాతియు కులాభిమానము చర్చింపనె రాదు". 1-47**

**"ఎక్కువ కులజుడైన హీన కులజుడైన**
**నిక్క మెరిగిన మహా నిత్యుడే ఘనుడు". 1-318**

**"మెండైన బ్రాహ్మణుడు మెట్టు భూమి యొకటే**
**చండాలు డుండేటి సరిభూమి యొకటె". 2-385**

కులంవల్ల గొప్పదనం ఆపాదించబడదు. ఏ కులజుడైనా సరే సత్యాన్ని, ధర్మాన్ని తెలుసుకొని ఆచరించేవాడే నిజమైన ఘనుడని అన్నమయ్య ఉపదేశించాడు.

**"పరమాత్ముడొక్కడే పరమ పావనుడు గన**
**పరిపూర్ణుడనెడి యీ భావమే చాలు**
**జాతి యిందే దంత్యజాతి యిందేది**
**జాతులిన్నిటా నాత్మ సర్వేశుడు**
**ఆ తలను అంటు ముట్టనెడి భావన లెల్ల**
**జాతి పడి యెఱగ నోపని వెలితే తనది". 2-136**

పరమాత్ముడొక్కడే. పరమ పావనుడే గాక పరిపూర్ణుడు కూడా అనే భావం మనకుంటే చాలు. అంతేగాని ఇది జాతి, ఇది అంత్యజాతి అని పరిగణించడం శుద్ధ తప్పు. ఎందుకంటే అన్ని జాతులయందు సర్వేశుడు ఆత్మస్వరూపుడై ఉన్నాడు. మరి అలాంటి వారిని చూచి భ్రాంతికి లోనై అంటు, ముట్టు అని భావిస్తే అది వారి వెలితే కాక అజ్ఞానం కూడా అని అన్నమయ్య అస్పృశ్యతపై చురక అంటించాడు.

**"అచ్చుతు శరణమే అన్నిటికిని గురి**
**హెచ్చు కుందు మరి యెంచగ నేది;**
**యోని జనకమగు యొడ లిది యే నెలవైనా నేటి కులము**
**తానును మల మూత్రపు చెలమ నానాచారము నడచీనా". 4-3**

ఈ ప్రపంచంలో హెచ్చుతగ్గులే లేవు. అచ్యుతుని శరణు వేడటమే ఎన్నతగింది. కులం, కులం అంటారు. ఈ శరీరం యోనిలో నుంచి పుట్టింది. దానిది ఏ కులం? ఆచారం, ఆచారం అంటారు. అసలు శరీరమే మలమూత్రాల చెలమ. దానికేమిటి ఆచారం అంటూ – కులమతాల మూర్ఖులకు హితము బోధించాడు.

**"జాతి భేదములు శరీర గుణములు**
**జాతి శరీరము సరితోడనె చెడు". 2 - 383**

జాతులలో గల భేదాలన్నీ నశ్వరమైన శరీరానికి మాత్రమే సంబంధించిన స్వభావాలు. శరీరాలు నశించినంతనే అవి కూడా నశిస్తాయని తేల్చి చెప్పాడు.

అన్నమయ్య అత్యాసను కూడా నిరసించి ఏవగించుకున్నాడు. ఆశకు అంతం లేదు. ఆశించడం తప్పు కాదు గాని ఆశ విఫలమైనపుడు విలపించడం తప్పు. అందువల్ల ఆశను కట్టడి చేసుకోవాలి. ఆశనిరాశలు పక్కపక్కనే ఉంటాయని తెలిస్తే ఆ ద్వంద్వాలలో సమబుద్ధి కలిగివుంటాడు మనిషి. ఈ అంశాలను తెలిపే అన్నమయ్య సూక్తులు –

**"కడుపులోపలి పుండు కడలేని యాస". 1-104**
**"అంగము ఏడు జానలు ఆస కొండల పొడవు". 2-349**
**"చాలా ధనము గలిగి సంతలతిరియనేల?" 3-413**
**"ఇల ఆశ లుడిగితే ఇహమెల్లా సుఖమే". 3-414**
**"ఆస ఒకటి ఎంతయినా తనియదు". 4-95**
**"ఆస విడిచిన గాని అధిక సుఖము లేదు". 4-408**

ఇదే రీతిలో స్త్రీలు పురుషులతో సమానంగా గౌరవాదరాలు పొందాలని భావించాడు అన్నమయ్య –

**"పొలతులు జీవులే పురుషులు జీవులే
తలప భావభేదములే కాని".** **2-78**

అన్నమయ్య జన్మనిచ్చిన తల్లిదండ్రుల యోగక్షేమాలు పట్టించుకోవాలంటాడు. లేనిచో అది కులభ్రష్టతతో సమానమంటాడు.

**"తఱి తఱి ప్రేమపు తల్లిదండ్రులను యెఱగనిదే కులహీన తది". 1-263**

తల్లిదండ్రులు తమ బిడ్డలపై చూపే ప్రేమను ఇలా కీర్తించాడు.

**"ఆడి వచ్చిన బిడ్డని నపరాధిజేసి తల్లి
వోడక యన్నము వెట్టకుండ వచ్చునా?".** **2-214**

**"పేరడి తల్లిదండ్రులు బిడ్డ లేమి సేసినాను
వోరుచుక ముద్దుసేసుకొందురు లోకమున".** **3-97**

అప్పు ముప్పుకు కారణమంటాడు.

**"అప్పులేని సంసారమైన పాటే చాలు
తప్పులేని జీతమొక్క తారమైన చాలు?".** **1-114**

**"తనిసి యప్పులలోన దాగ కుంటే మేలు".** **3-447**

అప్పు లేకుండా సంసారం గడపడం ఉత్తమం. అప్పు లేకుండా వచ్చిన జీతం రవ్వంతైనా చాలు అని అన్నమయ్య అప్పు చెయ్యడం, అప్పు ఇవ్వడం రోత అని బోధించాడు. పాపకర్మలు చేయవద్దంటాడు.

**"పాప చింత మదిలోన పారకుండా నిలిపితే చేపట్టి దానములెల్లా
చేసినంత ఫలము".** **1-430**

**సంసార సంబంధ సూక్తులు :**

సంసారం అనేక భోగాలకు నిలయమైనప్పటికీన్నీ, అన్నమయ్య దానినెందుకో రోతగానే అభిప్రాయపడ్డాడు. సంసారమంటే అనేక బాధలకు నిలయమనీ, అదొక బంధమనీ, రోత పుట్టించే పనిగా ఈసడించుకున్న సందర్భాలు అనేకం. ఈతని సంసార దూషణను వినినచో మహా భోగి కూడా విరక్తుడౌతాడు. ఈతడు సంసారంతో ఎంత బాధ పడ్డాడో కాని, దానిపై ఇతడికేర్పడిన విరక్తి, ఆ విరక్తిని ప్రకటించటానికి ప్రయోగించిన పదబంధం ఏ మాత్రం విజ్ఞానమున్న వానినైనా సాంసారిక జీవితములోనికి చొరనీయదు. ఇతని సూక్తులు లోక మర్మజ్ఞతను ప్రకటించుచున్నవి. సంసారాన్ని గూర్చిన ఈ సూక్తులను గమనించండి.

**"జమునోరిలో బ్రతుకు సంసారము".** **1-199**

**"చమురు తీసిన దివ్వె సంసారము".** **1-199**

**"సంసారపు పొందు పాముతోడి పొత్తు".** **1-494**

"భోగమూలమైనది యీ పొందైన సంసారము". 3-91

"జగతి కట్టనికట్టు సంసారము". 3-551

"సంసారమున అలయికలే పెక్కు". 4-80

**శృంగార సూక్తులు :**

స్త్రీ పురుష సంబంధాలను సున్నితంగా వ్యాఖ్యానించేవి శృంగార సూక్తులు. నాయికా నాయకుల శృంగార భావనకు చెందినట్టివి.

"మగవాడు మాయకాదు ఈ
జగడంపుం చనవులు సతములౌనాయమ్మ". 6-54

"ఆడుజాతెల్లా నొక్కటే అందరికి నొక్కచాలే". 8-128

"జిగురువంటి వాడవు చెలులగంటే విడువవు". 8-192

"వలపు నీరు వంటిది. వాదరాదు తలపు". 8-269

"అలిగేదె సహజము ఆడువారికి
మలగి నీవె తిద్దుక మన్నించవయ్య". 9-6

"మనసుకు మనసే మర్మము గాక'. 9-27

అన్నమయ్య శృంగార సంకీర్తనలలో వ్యక్తమయ్యే భావాలన్నీ యౌవన దశకు సంబంధించినవే. శృంగారం యువతీయువకుల మధ్యనే బతుకుతుంది. ఆనాటి సమాజంలోని యువతీయువకుల మధ్య గమనించిన శృంగారాంశాలనన్నిటిని అన్నమయ్య సంకీర్తనలకెక్కించాడు. శృంగారాంశాలను దాపులేకుండా బాహాటంగా చెప్పి ఆ యంశాలను అలమేలుమంగా శ్రీనివాసులకు సమన్వయపరచడంలో వాళ్లిద్దరూ నిత్యయౌవనులని అన్నమయ్య భావించినట్లుంది. శృంగారంలో మాయా మర్మాలు, ఆడి తప్పడాలు, గిల్లికజ్జాలు మొదలైనవన్నీ ఉంటాయి. అవి ఉంటేనే శృంగారం తాజాగా ఉంటుంది. పై సూక్తులన్నీ సామాజిక శృంగారానికి సంబంధించినవే.

**శ్రీ వైష్ణవ సూక్తులు :**

విష్ణువును స్తుతిస్తూ, కీర్తిస్తూ చాలా సూక్తులు చెప్పాడు అన్నమయ్య. విష్ణువు విశ్వమయుడు. అంటే విశ్వమంతా వ్యాపించినవాడు. విశ్వమంతా తనలోనే కలిగినవాడు. సృష్టి సమస్తం విష్ణుమయం కాబట్టి, సృష్టిలోని వాళ్ళంతా వైష్ణవులే కదా! వైష్ణవుడు ఎలా ఉండాలో, లక్షణాలెలా ఉంటాయో ఈ సూక్తుల్లో వివరించాడు అన్నమయ్య.

"వైష్ణవులుగానివార లెవ్వరులేరు
విష్ణు ప్రభావ మీ విశ్వమంతయు గాన". 1-36

"వట్టి ఆసల బడని వాడు వో వైష్ణవుడు". 1-59

"వావి వర్తన గలవాడు వో వైష్ణవుడు". 1-59

**"జననములన్నిట జనియించి పరమ పా**
**వనుడై మరికదా వైష్ణవుడౌట". 1-144**

**"శ్రీ వేంకటేశ్వరు నామము వదనము చేర్చుట వైష్ణవము". 1-405**

**"నిత్యులు ముక్తులు నిర్మల చిత్తులు నిగమాంత విదులు వైష్ణవులు". 1-414**

**తాత్త్విక సూక్తులు :**

జీవితానుభవాలను నెమరువేసుకొని విచారణ చేయడం తత్త్వచింతన. అటువంటి చింతననుండి పుట్టేవి తాత్త్విక సూక్తులు.

**"తెలియ చీకటికి దీపమెత్తక; పెద్ద వెలుగులోపలికి వెలుగేలా?" 1-18**

ఈ కీర్తన అంతా కూడా తాత్త్విక సూక్తులే. చీకటి అంటే అజ్ఞానం. వెలుగు అంటే జ్ఞానం. అజ్ఞానమనే అంధకారంలో అట్టడుగున పడివున్న వారికి మార్గదర్శకంగా జ్ఞానమనే దీపాన్ని వెలిగించాలి. జ్ఞానికి దీపంతో పనిలేదు.

**"అరయ ఆపన్నుని కభయమీవలె గాక! ఇరవైన సుఖిగావ నేలా?" 1-18**

**"వఱత బోయెడివాని వడి తీయవలె గాక!**
**దరివాని తివియగ తానేలా?" 1-18**

**"అనయము దుర్బలుని కన్న మిడవలెగాక!**
**తనిసిన వానికి తానేలా?" 1-18**

**"ఎంతటివారలు నెవ్వరును హరి చింతించక నిశ్చింతులు గారు". 1-32**

**"నీవన నెవ్వరు నేనన నెవ్వరు; నీవే నేనై యుందు చిలుకా". 1-50**

అన్నమయ్య ఆధ్యాత్మిక తత్త్వవేత్త. మానవ జీవితంపై ప్రగాఢ ముద్ర వేసేది తత్త్వశాస్త్రం. తత్త్వమంటే ఆలోచనారీతి. జీవితానుభవాన్ని విచారణ చేసి తన అనుభవ చింతన నుండి తత్త్వాన్ని అర్థం చేసుకొన్నవాడు అన్నమయ్య. కనుకనే లెక్కలేనన్ని తాత్త్విక సూక్తులు చెప్పగలిగాడు.

బాల్యంలో ఎవరికైన తల్లిమీద ప్రేమ ఉంటుంది. వివాహితులైన తరువాత భార్యమీద ప్రేమ పెరుగుతుంది. అమ్మను కీర్తిస్తూనే భార్యకు దాసుడౌతాడు. ఈ భావాన్నే అన్నమయ్య -

**"తల్లి మీద గల భక్తి తనకే కొన్నాళ్ళకు**
**ఇల్లాలు మీద వలె నింత ఉండదు". 2-92**

"ఓరుపె మూలధనము ఉవిదలకు". స్త్రీలకు ఓర్పు మూలధనమంటాడు అన్నమయ్య. ఓర్పు కలిగి ఉండటం వలన ఎవరికైనా మంచి జరుగుతుంది. ఆడువారికి సహజంగా కోపం రాదు. అది వచ్చినా వలపునకు దారి తీస్తుందంటాడు అన్నమయ్య.

**"వనితల కోపాలు వలపులౌను". 13 - 426**

మరొక సందర్భంలో స్త్రీలకు నచ్చితే లక్క వలె అతుక్కుపోతారనీ, వారు విడదీయరాని బంధాన్ని నింపుకుంటారని "లలనల మనసులు లక్కవంటివి" (16 - 576) అనే సూక్తి ద్వారా పేర్కొన్నారు.

తన జీవితాన్ని జనుల దైనందిన జీవితాన్ని బాగా అధ్యయనం చేసి సందర్భానుకూలంగా అనేక సూక్తులు చెప్పాడు. "విందుమీద విందులైతే వెగటులే కావా!" (7 - 593) అని ఎవరూ చెప్పని భావాన్ని అన్నమయ్య ఆవిష్కరించాడు. "ఆపరాని కోరికలు అంగడి పెట్టగరాదు" (28 - 106) అని అంటాడు అన్నమయ్య. అంగడి అనే పదం రాయలసీమ మాండలికానికి చెందింది. దాన్ని పలుకుబడిగా ఉపయోగిస్తూ చెప్పిన ఈ సూక్తిలో కోరికలను బహిరంగంగా ప్రదర్శించనవసరం లేదన్నది అన్నమయ్య భావన.

ఈ విధంగా అన్నమయ్య తన సంకీర్తనల్లో సంప్రదాయం, ధర్మం, అర్థం, కామం, మోక్షం, మానవ స్వభావం, నైతికం, కుటుంబం, రాజకీయం, సాంస్కృతికం, తాత్త్వికం, సామాజికం, మతం తదితర అంశాలనన్నిటినీ తన సూక్తుల ద్వారా స్పృశించాడు. అన్నమయ్య వ్యక్తి కాదు. ఆధ్యాత్మిక శక్తి. సాధారణంగా శతకాల్లో మానవ జీవితాన్ని చక్కగా ప్రతిబింబించే అనేక సూక్తులుంటాయి. ముఖ్యంగా సుమతి, వేమన, భాస్కర శతకాలు సమకాలీన సమాజాన్ని దృష్టాంత పూర్వకంగా మన కండ్లముందు పెడతాయి. శతక పద్యాలన్నీ ముక్తకాలైనట్లే, అన్నమయ్య సంకీర్తనలన్నీ ఒకదానితో మరొక దానికి సంబంధం లేకుండా ముక్తకాలు గానే అనిపిస్తాయి. వేలకొలదీ ఆయన సంకీర్తనలలో సమానాంశం తిరువేంకటవిభుని కీర్తనే. భక్తితో అలా కీర్తించడం సంకీర్తనలోని చివరి చరణానికే పరిమితమై మిగిలిన చరణాలన్నీ సమాజచిత్రణకే ఉద్దిష్టమైనాయి. సమాజ చిత్రణలో భక్తి శృంగారాలు ప్రధానమైనవైనా మానవ జీవితంలోని ప్రతి పార్శ్వాన్ని ఆయన స్పృశించాడు. ఆ పార్శ్వాలలోని నగ్నతను బయటపెట్టాడు. సామాన్య మానవుడు మొదలుకొని దేశాన్ని పాలించే రాజు వరకు సమాజంలోని వివిధ వ్యక్తుల మనస్తత్త్వాలను, ఆ మనస్తత్త్వాలను నిబంధించే కుహనా సంస్కృతిని చూపుతూ అభిలషణీయమైన మానవత్వం ఎలా ఉండాలో చిత్రించి చూపాడు. ఒక భక్తుడుగా శ్రీ వేంకటేశ్వరుని ఆరాధించడంతోపాటు ఒక కవిగా సమాజంలోని అవకతవకలను ఎత్తి చూపి సంస్కారవంతమైన సమాజాన్ని నిర్మించడానికి సాహిత్య సృజన చేశాడు. సమాజాభ్యుదయ కాంక్షతోనే ప్రతి సంకీర్తనలోను సూక్తులను పేర్కొని అన్నమయ్య సమాజకవిగా ప్రసిద్ధుడయ్యాడు.

***

# రాయలసీమ కవుల్లో అన్నమయ్య ప్రత్యేకత

**యమ్. ఆదిశేషయ్య**
**తెలుగు పరిశోధక విద్యార్థి**
**శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం**
**తిరుపతి**

దేశంలో కరువుకు చిరునామా రాయలసీమ. అయినా ప్రతిభా సంపన్నులకు ఇక్కడ కరువు లేదు. అలాంటి అరుదైనవారిలో అన్నమయ్య కూడా ఒకరు. తొలి తెలుగు వాగ్గేయకారుడిగా ప్రసిద్ధిపొందిన అన్నమయ్య భారతీయ సాహిత్యంలోనే గొప్పకవిగా గుర్తింపు పొందాడు. అయితే అన్నమయ్యను గురించే కాదు, ఏ ప్రాంతానికి సంబంధించిన కవి, రచయిత గురించి మాట్లాడాలన్నా, ఆ ప్రాంత చారిత్రక పరిస్థితులను కొంత పరిశీలించాల్సి ఉంటుంది. ఏ కవిత్వం అయినా ఆయా ప్రాంతాల మట్టిపొరల నుంచే తొలుచుకొని వస్తుంది. ఒక కవి అవగాహన, దృక్పథం, ఆయా కాలాల్లోని సామాజిక, ఆర్థిక, రాజకీయ పరిస్థితుల్లోనే రూపుదిద్దు కొని ఉంటాయి. సాహిత్యపరంగా దేన్ని అర్థం చేసుకోవాలని ప్రయత్నించినా మొదట మనం అనుసరించాల్సిన మౌళిక సూత్రం ఇదే.

భౌగోళికంగా ఉమ్మడి మద్రాసు రాష్ట్రంలోగానీ, ఆ తర్వాత ఏర్పడిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కానీ భాగమైన అనంతపురం, కడప, కర్నూలు, చిత్తూరు జిల్లాలను ప్రస్తుతం రాయలసీమగా మనం వ్యవహరిస్తున్నాం. గతంలో ఇది కాస్త విస్తారంగా ఉండొచ్చు. కర్ణాటకలోని బళ్లారి, తమిళనాడులోని కొంత ప్రాంతం, ప్రకాశం జిల్లాలోని కొంత ప్రాంతమూ గతంలో రాయలసీమ ప్రాంతంలో భాగమై ఉండేవి. ఈ ప్రాంతం ఎందరో కవులకు నెలవు.

సంచారిలా మారిన అన్నమయ్య భక్తితో పాటూ సామాజిక జీవితాన్ని స్పృశిస్తూ సాహిత్యాన్ని సృజించాడు. జానపద బాణీల్లో రాయడం వల్లే అన్నమయ్య సంకీర్తనలకు అంత ప్రాచుర్యం లభించింది. తాళ్లపాక కవులుగా ప్రసిద్ధి పొందిన తిమ్మక్క, పెద్దతిరుమలాచార్యులు, చిన్నన్న రాజాస్థానాలను తిరస్కరించి విలక్షణమైన సాహిత్యాన్ని రాశారు. అష్టదిగ్గజ కవుల్లో ఒకడైన అయ్యలరాజు రామభద్రుడు, రాచరిక వ్యవస్థను ఎదిరించడంలో ఎలాంటి జంకు చూపని ధూర్జటి వంటి వారు ఈ కరువునేల కలగన్న కవులే. సాంప్రదాయ సాహిత్య సృష్టికి భిన్నంగా కల్పనా చాతుర్యంతో కళా పూర్ణోదయం రాసిన పింగళి సూరన, సర్వ సలక్షణ సహిత మనుచరిత్ర పేరుతో తొలి ప్రబంధాన్ని ప్రకటించిన అల్లసాని పెద్దన సీమ ప్రాంత కవే. తన రచనలన్నింటినీ శ్రీశైల మల్లన్నకు అంకితం చేసిన చక్రపాణి రంగన ఈ నేలపైనే శివతత్వాన్ని ప్రచారం చేశాడు. తొలి

జంట కవులుగా గుర్తించబడిన నంది మల్లయ్య, ఘంట సింగన ప్రబోధ చంద్రోదయంతో పాటు వరాహ పురాణం గ్రంథాలను మలిచారు. చిత్తూరు జిల్లా కార్వేటినగరం ఆస్థానంలో కవిగా ఉన్న సారంగపాణి పదాలు కూడా తెలుగులో మంచి ప్రాచుర్యాన్ని పొందాయి. తిరుమల వెంకన్నపై అనేక కీర్తనలు రాసి తెలుగులో స్త్రీ సంకీర్తనాచార్యునిగా ప్రసిద్ధి పొందిన మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ, ఉత్తర హరివంశాన్ని రాసి నవీనగుణనాథునిగా కీర్తి పొందిన నాచన సోమన తదితరులు రాయలసీమ ప్రాంత కవులే.

రాళ్లపల్లి అనంతకృష్ణ శర్మ, విద్వాన్ విశ్వం, పుట్టపర్తి నారాయణాచార్యుల నుంచి నేటి అత్యాధునిక కవులదాకా రాయలసీమ కవిత్వాన్ని సంపద్వంతం చేసిన వారే. ఈ రాయలసీమ కవుల్లో అగ్రశ్రేణి కవి అన్నమయ్య. అన్నమయ్య స్వగ్రామం కడప జిల్లా రాజంపేట తాలూకా తాళ్లపాక. తిరుపతి శ్రీ వేంకటేశ్వరుడిపై వేలాది సంకీర్తనలు రాసి తనలోని భక్తిని సాహిత్య రూపేణా ప్రకటించాడు. అన్నమయ్య రాసిన వాటిలో అత్యంత ఎక్కువగా భక్తి సంకీర్తనలున్నా ఇతర సామాజిక అంశాలను అసలే స్పృశించలేదు అనడానికి వీలులేదు. సమాజం లోని అనేక సామాజిక అంశాలను తన కవిత్వం ద్వారా అన్నమయ్య పరిశీలించాడు. తనదైన ఒక ప్రత్యేక తాత్వికతతో సామాజిక రుగ్మతలపై ఒక దృష్టినీ, దృక్పథాన్ని కలిగివున్నాడు. జీవితానికి అవసరమైనంత సాహిత్యాన్ని సృష్టించాడు. అన్నమయ్య ప్రతిభా సంపత్తికి ఇదే నిదర్శనం. దీనికి అన్నమయ్య కీర్తనల్లో భాగమైన ఒక ఉదాహరణ -

**"పుట్టుటయు నిజము**
**పోవుటయు నిజము**
**నట్టినడిమి పని నాటకము"**

జీవితసారాన్నంతా చిటికె వేసినంత సహజంగా అన్నమయ్య మన కళ్లముందు ఉంచాడు.

ప్రబంధయుగంలో రాయలసీమలో కవిత్వం బాగా వ్యాప్తిలోకి వచ్చింది. 'రాజుల్ మత్తుల్ వారి సేవలు నరకప్రాయంబు' అన్న ధూర్జటిలాంటి ఉద్దండ పండితులు ఈ ప్రాంతం వారే. ఇక్కడ ఒక విషయాన్ని ప్రస్తావించుకోవాలి. అన్నమయ్య వైష్ణవ భక్తుడైతే, ధూర్జటి శివ భక్తుడు. ఇవాళ రాయలసీమలోని కవులు అనేక ఆధునిక రూపాల్లో కవితా ఉద్యమం చేస్తున్నారు. నాటి కవులది దేవుళ్ని స్తుతించే బాధ్యత అయితే, నేటి కవులది రైతులను, కూలీల బతుకులనూ చిత్రించే స్థితికి రాయలసీమలో కవిత్వం ఎదిగింది. సమాజంలో వచ్చే పరిస్థితులను అనుసరించి సాహిత్యరంగంలోనూ మార్పులు వస్తుంటాయి. అంటే మనకు కనిపించని అంశాలను పట్టించుకోవడం నుంచి కళ్లముందు కనిపించే అంశాల దాకా రాయలసీమ కవిత్వం పరిణితి చెందింది. దీనికి ఈ ప్రాంతంలో జరిగిన అనేక సంఘర్షణలు కారణమై ఉంటాయి. గతంలో నుంచే వర్తమానం రూపుదిద్దు కుంటుంది. దీనికి రాయలసీమలో కవితా ప్రక్రియ పరిణామమే సాక్షి.

రాయలసీమ అనేక వైరుధ్యాలతో కూడుకున్న ప్రాంతం. ఈ ప్రాంతంలో అన్నమయ్యకు ముందు, వెనుక కాలాల్లో అనేక మంది కవులు, రచయితలు అనేక రకాల సంస్కరణలకు నడుంకట్టారు. వారిలో వేమన, వీరబ్రహ్మం, అన్నమయ్య ప్రముఖంగా ప్రస్తావించుకోవాలి.

వేమన తన కవిత్వంలో -

**"జాతులందు మిగుల జాతి యేదెక్కువో?**
**యెరుకలేక తిరుగ నేమి ఫలమొ?**
**యెరుక కలుగవాడె, యెచ్చైన కులజుడు"**... అని పలికాడు.

జ్ఞానం ప్రాతిపదికగా కులం విషయంలో ఎక్కువ, తక్కువలు బేరీజు వేసుకోవాలని ఒక కొత్త మార్గాన్ని నిర్దేశించాడు. అంతే తప్ప కులం నేపథ్యంగా మనిషిని చూడకూడదనే పరోక్ష అవగాహనను ఈ పంక్తుల ద్వారా ఉద్బోధించాడు.

వీరబ్రహ్మం తన కవిత్వంలో -

**"ఏ కులమని నను వివరమడిగితే**
**ఏమని తెల్పుదు లోకులకూ**
**లోకులకూ పలుగాకులకు**
**దుష్టులకు, దుర్మార్గులకు"**... అంటూ ఈ వ్యవస్థనే అక్షేపించాడు.

ఇలా తనలోని భావనలనూ, సమాజంలోని కుల అసమానతను కవితా రూపంలో వెల్లడించాడు.

అదే విధంగా -

**"కూడు తినెడికాడ కులమేదమేలనో"** అని అంటూ బ్రహ్మం కులతత్వాన్ని నిరసించాడు.

అన్నమయ్య తన కవిత్వంలో

**"నిండార రాజు నిద్రించు నిద్రయు నొకటే**
**అండనే బంటు నిద్రదియు నొకటే"**... అని తేల్చి చెప్పాడు.

వేమన, వీరబ్రహ్మం, అన్నమయ్యలు వేర్వేరు కాలాలకు చెందినవారు. అయినా వీరి కవిత్వంలోని అభిప్రాయాల్లో ఏక సూత్రత ఉన్నది.

ఈ ముగ్గురు కవులూ తమ సాహిత్యంలో ప్రజా జీవితాన్నీ, నాటి సమకాలీన సమాజాన్ని ప్రతిబింబింపజేశారు. సమాజాన్ని చూసే దృష్టిలో వైవిధ్యం, భిన్నమైన తాత్త్విక నేపథ్యాలు కల్గివున్నా, అంతిమంగా జ్ఞానం, విలువలు, మానవీయ దృక్కోణాలను కూడా వారి సాహిత్యంలో పరిశీలించవచ్చు. వేమన హేతువాద మార్గమూ, వీరబ్రహ్మం కాలజ్ఞాన మార్గమూ, అన్నమయ్య భక్తి మార్గమూ, ఇలా తాము ఎంచుకున్న మార్గంలో తమలోని భావాలను సాహిత్యరూపంలో సమాజానికి అందించారు. సమాజంలో వేగుచుక్కల్లా మెరిశారు.

అన్నమయ్య స్వీకరించిన కవితా వస్తువు ఏదైనా, చివరివరకూ దానికి కట్టుబడి, విస్తృతమైన సాహిత్యకృషి చేసిన విషయాన్ని ఆదర్శంగా స్వీకరించాలి. ఇప్పుడు పలు వాదాలను ముందుకు తీసుకెళుతున్న వారిలో కొందరు అనంతర కాలంలో వెనక్కు వెళుతున్నారు. ఎంచుకున్న రంగం ఏదైనా దానికి నిబద్ధమై ఉండే గుణాన్ని అన్నమయ్య నుంచి నేర్చుకోవాలి. ఎంతో సంక్లిష్ట పరిస్థితులను ఎదుర్కొంటున్న రాయలసీమలో కవులు, రచయితలకు ఈ గుణం ఆదర్శంగా నిలుస్తుంది. ఇవాళ కోస్తా, తెలంగాణా కంటే రాయలసీమ అత్యంత వెనుకబడి ఉన్నది. సీమలో చాలా దయనీయమైన పరిస్థితులు ఉన్నాయి. కరువు దెబ్బకు రైతులు, చేనేత కార్మికులు, ఇతర వృత్తులు ఇలా అన్ని రంగాల్లో రాయలసీమ ధ్వంసానికి గురయ్యింది. ఈ పాపం ఇన్నేళ్లూ రాయలసీమను పాలించిన పాలకులదే. ఈ తరుణంలో సీమ భవిష్యత్తుపై లోతైన చర్చ జరగాలి. మేధావులూ, కవులూ ప్రజలకు పరిష్కారాలనూ సూచించాలి. లేకపోతే ఈ ప్రాంత పండితుడు రాళ్లపల్లి అనంతకృష్ణ శర్మ అన్నట్టు... ఈ ప్రాంత వెనుకబాటుకు ప్రకృతి లయతప్పుట, పాలకుల నిర్లక్ష్యమూ కారణమై ఉంటుంది. ఈ తండ్లాట నుంచి రాయలసీమ ప్రజల జీవితాల్లో మార్పుకు ఈ ప్రాంత సాహిత్యకారులు పనిచేయాల్సి ఉంది.

వేగుచుక్కలైతే చాలా కాలం క్రితమే పొడిచాయి కానీ, ఇంకా సమాజంలో వెలుగులు ప్రసరించలేదనే అభిప్రాయాన్ని ప్రఖ్యాత సాహిత్య విమర్శకులు మేడిపల్లి రవికుమార్ ఒక సందర్భంలో వ్యక్తం చేశారు. ఇలా వెలుగులు ప్రసరింపజేసే బాధ్యతను కవులు అందుకోవాలి. నిరంతరం నమ్మిన లక్ష్యంకోసం సర్వశక్తులూ ఒడ్డి పనిచేయడాన్ని మనం అన్నమయ్య నుంచి స్వీకరించాలి. దీని వల్లా మొత్తం రాయలసీమ కవుల కృషిని మనం గౌరవించినవాళ్లం అవుతాం. అన్నమయ్య జీవితం, సాహిత్యం నుంచి మనం ఏదైనా కొంత నేర్చుకున్నవాళ్లమవుతాం. మొత్తంగా రాయలసీమ సాంస్కృతిక వికాసానికి తోడ్పడినవాళ్లమూ అవుతాం.

**ఆధార గ్రంథాలు :**


1. వేగుచుక్కలు - డా॥ ఎమ్.ఎమ్. వినోదిని.
2. రాయలసీమలో ఆధునిక సాహిత్యం-సామాజిక, సాంస్కృతిక విశ్లేషణ - వల్లంపాటి వెంకటసుబ్బయ్య.
3. నేటి రాయలసీమ - విరసం ప్రచురణ.
4. రాయలసీమ ముఖచిత్రం - భూమన్.
5. అన్నమయ్య బహుముఖ ప్రాభవం, కూర్పు - ఆచార్య సి. గోవిందరాజు.
6. శ్రీ తాళ్లపాక అన్నమాచార్యుల జీవిత చరిత్ర - డా॥ కె. వాణి.
7. రాజ్యం-సంక్షేమం - కె. బాలగోపాల్.
8. సీమ సాహిత్య రత్నాలు - డా॥ కొత్వాలు అమరేంద్ర.


***

# అన్నమయ్య సంకీర్తనలు-సమాపక క్రియలు

**ఆచార్య మూలె విజయలక్ష్మి**
**తెలుగు శాఖాధిపతి**
**శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం**
**తిరుపతి**

తాళ్ళపాక అన్నమాచార్యులు తొలి తెలుగు సంకీర్తనాకర్త. పదకవిత పితామహుడుగా వాసికెక్కిన వాగ్గేయకారుడు. 32 వేల సంకీర్తనల సృష్టికర్త. భగవంతునిపై అనురక్తిని, ఇహలోక బంధాలపై విరక్తిని మనిషిలో పాదుకొల్పడం అన్నమయ్య సంకీర్తనల పరమ ప్రయోజనం. ఇతని సంకీర్తనలు భాషా, సాహిత్య, సంగీత నిధులు. జానపదుల బాణీలను అందిపుచ్చుకుని సంకీర్తనలో అమరించారు. రాయలసీమ పల్లీయుల పలుకుబడులను, సామెతలను, మాండలికాలను సంకీర్తనలలో అందంగా అలంకరించారు. అద్భుతమైన వర్ణన సౌందర్యానికి ఉపమాలంకారాలను ప్రయోగించారు. సంకీర్తనలు ఆకరాలుగా భాష, సాహిత్య, సంగీతాల్లో పరిశోధన గ్రంథాలు వెలువడినాయి. అన్నమయ్య సంకీర్తనల ఆధారంగా పదిహేనోశతాబ్ది భాషా స్వరూపాన్ని అవగాహన చేసుకోవచ్చు. ఈ వ్యాసంలో అన్నమయ్య అధ్యాత్మ సంకీర్తనలు మూడవ సంపుటంలోని సమాపక క్రియలు విశ్లేషించబడినాయి.

సమాపక క్రియలో కాలబోధకతను బట్టి భూతకాల, వర్తమాన, తద్ధర్మార్థక క్రియలున్నాయి. సమాపక క్రియవాక్యాన్ని పూర్తి చేస్తుంది. క్రియ చివర పురుష బోధక ప్రత్యయం ఉంటుంది. ధాతువు కాలబోధకప్రత్యయం, పురుషబోధక ప్రత్యయం సమాపక క్రియా నిర్మాణంలో ఉంటాయి.

**భూతకాల సమాపకక్రియలు**

**ఉత్తమపురుష. ఏకవచనం**

*ధా*కాల*పు

ఎత్తితిని-ఎత్త్-ఇతి-ని-182; జడిసితిని-జడిస్ (జడియు)-ఇతి-ని-265

దిగితిన్-దిగ్-ఇతి-న్-265; చదివితి-చదువ్-ఇతి-Ø-311

ఆడితి-ఆడ్-ఇతి-Ø-192; మొక్కేను-మొక్క్-ఏ-ను-189

***ధాతువు *కాలబోధక ప్రత్యయం *పురుషబోధక ప్రత్యయం**

మురిసేను-మురిస్/మురియు-ఏ-ను-31; ఐతిని-అగు/ఐ-తి-ని-283

ఐతి-అగు/ఐ-తి-Ø-548, 8; ఇట్టి నీదాసుడనైతి యెంగిలెల్లబాసె-8

అంటి-అన్-టి-Ø-410; గైకొంటి-గైకొను-టి-Ø-421

ఇతి, ఏ, తి/టి, ఇ భూతకాల ప్రత్యయాలు. ఉత్తమ పురుష ఏకవచన ప్రత్యయం ను, న్, ని, Ø రూపాంతరాలు. ప్రత్యయ లోపం ఉంది. అన్వాది ధాతువులున్నపుడు త కారం ట కారంగా మారుతుంది.

**ఉత్తమ పురుష, బహువచనం**

కొలచితిమి-కొలచ్-ఇతి-మి-556; చిక్కితిమి-చిక్కిత్-ఇతి-మి-532; తలచేము-తలచ్-ఏ-ము-174

మొక్కేము-మొక్క్-ఏ-ము-194; అంటిమి-అన్-టి-మి-194; వింటిమి-విన్-టి-మి-546

ము/మి ఉత్తమపురుష బహువచన ప్రత్యయ రూపాంతరాలు.

**మధ్యమ పురుష ఏకవచనం**

ఏగితివి-ఏగ్-ఇతి-వి-198; చేసితివి-చేస్-ఇతి-వి-198

తెచ్చితి (తెచ్చితివి)-తెచ్చ్-ఇతి-Ø; సంపద మెరయుచు సంజీవిదెచ్చితి-421

పట్టితి (పట్టితివి)-పట్ట్-ఇతి-Ø; పుట్టినాడే భువనములెరగగ పట్టితి సూర్యునిఁ బండనుచు-421

ఏలేవు-ఏల్-ఏ-వు-413; కొసరేవు-కొసర్-ఏ-వు-334; గైకొంటివి-గైకొన్-టి-వి-421

వు/వి మధ్యమ పురుష ఏకవచన ప్రత్యయాలుగా కన్పిస్తున్నాయి. ప్రతయలోపం విశేషం.

**మధ్యమ పురుష బహువచనం**

చూసితిరి-చూప్-ఇతి-రి-68; చెల్లబెట్టితిరి-చెల్లబెట్ట్-ఇతి-రి-68

మధ్యమ పురుష బహువచన ప్రత్యయం 'రి' ప్రయోగించబడింది.

**ప్రథమ పురుష మహత్ ఏకవచనం**

చిక్కినాడు-చిక్క్-ఇనా-డు-316; కూడినాడు-కూడ్-ఇనా-డు-235; కాచెను-కాచ్-ఎ-ను-241

ఎక్కెను-ఎక్క్-ఎ-Ø-302; పెరిగీని-పెరుగ్-ఈ-ని-153;

నానాటికిఁబెరగీని నరసింహము; ఆనుకవరములిచ్చీ నౌభళపు సింహము-153

ఆడీన్ (ఆడినాడు) - ఆడ్-ఈ-న్; అందమైన రేపల్లెవాడ నాడీనట్టె-316.

చక్కఁబెట్టీన్ (చక్కబెట్టినాడు) చక్కబెట్ట్-ఈ-న్; సందడినాతడే అన్ని చక్కఁబెట్టీఁ బనులు 291

మధ్యమ పురుషేకవచన ప్రత్యయాలు దు, ను/న్/ని. ప్రత్యయ లోపం ఉంది.

భూతకాలబోధక ప్రత్యయాలు ఇనా,ఎ,ఈ.

**ప్రథమ పురుష మహత్‌బహువచనం**

తిరిగేరు-తిరుగ్-ఏ-రు-178; పారాదేరు పారాడ్-ఏ-రు; బాలుల వలెనే వీడిఁ బారాదేరు వారివో-178

వున్నారు-వున్-ఆ-రు; యేకడ చూచిన నీదాసులు నాయెదుటనే వున్నారు-318

కలిగిరి-కలుగ్-ఇ-రి; కలిగిరి నీవల్లనే కడగ బ్రహ్మాదులు-546

బదికిరి-బదిక్-ఇ-రి; బదికిరి నీపాదసేవను-546

తెలిసిరి (తెలిసికొన్నారు) తెలిసి-ఇ-రి; తెలిసిరి మునులెల్లా దేవుడు నీవేయని-546

**ప్రథమ పురుష మహతీ ఏకవచనం**

వుండెను-వుండ్-ఎ-ను; తిన్ననైయిందరి భాగ్యదేవతయై యుండెను-165

మోచెను-మోచ్-ఎ-ను; కావిరిబ్రహ్మాండము కదుపులో నున్నవానని; దేవకి గర్భముననద్ధిర మోచెను-17

నిండె-నిండ్-ఎ; ఆడియై శ్రీవేంకటేశ ఆకెనీవురాననిండె-416

**ప్రథమ పురుష మహతీబహువచనం**

వెదకేరు-వెదక్-ఏ-రు-383; గెలిచేరు-గెలిచ్-ఏ-రు-551; పాడిరి-పాడ్-ఇ-రి-23.

దిద్దిరి-దిద్ద్-ఇ-రి-368; గెలిచినారు-గెలిచ్-ఇనా-రు; యెక్కడిది వివేకమెవ్వరు గెలిచినారు-398

**ప్రథమ పురుష అమహత్ ఏకవచనం**

చెప్పినది-చెప్ప్-ఇన-ది; గదచినది-గడచ్-ఇన-ది-488

వెదలెన్-వెదల్-ఎ-న్-239; కెరల-కెరల్-ఎ-Ø-239; (రథము) వచ్చె-వచ్చెయి-Ø-512

ప్రథమ పురుష అమహత్ బహువచణ కలిగె-కలుగ్-ఎ-Ø-272; (కొండలు) పగిరెను-పగిల్-ఎ-ను-239, కపిసేనలు-కట్టిరి-కట్ట్-ఇ-రి-31

**1.2 భూతకాల వ్యతిరేక క్రియ**

ధాతువుకు లేదు చేరటం వల్ల భూతకాల వ్యతిరేక క్రియ ఏర్పడుతుంది.

ఈలేదు-583; బదుగలేదు-60

**2. వర్తమానకాల సమాపకక్రియలు**

**ప్రథమపురుష మహత్ ఏకవచనం**

నవ్వుచున్నాడు-నవ్వు-చున్నా-డు-235

**ప్రథమపురుష మహత్ బహువచనం**

వోయుచున్నారు-వోయు-చున్నా-రు-359; నవ్వుచున్నారు-నవ్వు-చున్నా-రు-38

**ప్రథమపురుష అమహత్ బహువచనం**

పేరుచున్నవి-పేరు-చున్న-వి-220; పుట్టుచున్నవి-చున్న-వి-220

చున్నా, చున్న వర్తమానకాలబోదక ప్రత్యయాలు

**2.2 వర్తమాన కాల వ్యతిరేక క్రియ**

ధాతువుకు అటం, అడం చేరిస్తే భావార్థకరూపం ఏర్పడుతుంది. భావార్థక రూపానికి లేదు చేరిస్తే వర్తమాన కాల వ్యతిరేక క్రియ యేర్పడుతుంధి. అన్నమయ్య సంకీర్తనలో 'ట' చేరడం గమనించవచ్చు.

మరపుటలేదు-60; వచ్చుటలేదు-60; వుండుటలేదు-541

**3. తద్దర్మార్థక క్రియ**

**ఉత్తమ పురుష ఏకవచనం**

గర్వింతును-గర్వించు-తు-ను-260; తెలిసెద-తెలియు-ఎద-Ø-116; పొరలెదను-పొరలు-ఎద-ను-222

**ఉత్తమ పురుష బహువచనం**

నుతింతుము-నుతించు-తు(దు)-ము-229; కొలుతుము-కొలుచ్-తు(దు)-ము-229;

మ్రింగెదము-మ్రింగు-ఎద-ము-340; దూరెదము-దూరు-ఎద-ము-340

**మధ్యమ పురుష ఏకవచనం**

తీరుతువు-తీరుచు-తు(దు)వు-18; నిలుతువు-నిలుచు-తు-వు-240; కదగుదువు -కదుగు-దు-వు-240

నేర్పుదురు-నేర్పు-దు-వు-240; వోయెదవు-వోయ్-ఎద-వు-397

**ప్రథమ పురుష మహత్ ఏకవచనం**

(తలచినపుదు)-వచ్చు-వచ్చు-Ø-Ø-140; యేమైనా-ఇచ్చు-ఇచ్చు-Ø-Ø-140

కాచుకుందును-కాచుకుందు-Ø-ను 528; ఎక్కించును-ఎక్కించు-Ø-న్-540

(జీవుడు)పొరలును-పొరలు-Ø-ను-560

**ప్రథమ పురుష మహత్ బహువచనం**

వత్తురు-వచ్చు-తు-రు; దేవమునులు వత్తురు-525

**ప్రథమ పురుష మహన్మహతీ బహువచనం**

పొదలెదరు-పొదలు-ఎద-రు-185; భ్రమసెదరు-భ్రమయు-ఎద-రు-185

కుంగుదురు-కుంగు-దు-రు-186; పారుదురు-పారు-దు-రు-186

రచయింతురు-రచియించ్-తు-రు-358; నదుతురు-నదచ్-తు-రు-33

**ప్రథమ పురుష అమహత్ ఏకవచనం**

పొరలును-పొరలు-Ø-ను-560; మొలచును-మొలచు-Ø-ను; వొకవిత్తువెట్టితే వేరొకటేల మొలచును-123

నేరుపును-నేరుపు-Ø-ను నేరకుంటే సంసారము నేరుపును నీమాయ-237

**ప్రథమ పురుష అమహత్ బహువచనం**

పండును-పండు-Ø-ను; పండును భువిఁగల పంటలన్నియును-325

ఎద, దు/తు, Ø తద్ధర్మార్థక ప్రత్యయాలు

**తద్ధర్మార్థక వ్యతిరేక క్రియ**

ధాతువులలో చివర 'ఉ' కారం అకారంగా మారి పురుషబోధక ప్రత్యయాలు చేరి తద్ధర్మార్థక వ్యతిరేక క్రియలు ఏర్పడతాయి.

కానను-కాను-అ-ను-168; ఎఱుగ-(ఎరగను)-ఎఱుగు-అ-Ø-537; యెరగము-యెరగు-అ-ము-340

తలచవు-తలుచు-అ-వు 104; మానదు-మాను-అ-దు-254

కాలక్రమంలో భాషా పరిణామం జరుగుతుంటుంది. పదిహేన శతాబ్ది భాషా స్వరూప నిరూపణకు అన్నమయ్య సంకీర్తనలు ఆటపట్టు. ఆధునిక భాషలో సమాపక క్రియలతో పోల్చిచూస్తే కాలబోధక, పురుషబోధక ప్రత్యయాల్లో మార్పు సుస్పష్టం.

***

# కడప జిల్లాలో అన్నమయ్య దర్శించిన వైష్ణవ క్షేత్రాలు

డా॥ యస్. చిన్న రెడ్డెయ్య
తెలుగు శాఖాధ్యక్షులు
సహాయ ఆచార్యులు
ద్రావిడ విశ్వవిద్యాలయం, కుప్పం

ఏ ఆలోచనా సరళి అయినా ప్రజలలో ప్రచారం పొందాలంటే ప్రచారకులు వారితో కలిపిపోయి వారి బాణీలో చెప్పగల్గిన సమర్థులై ఉండాలి. అటువంటప్పుడే వారికి ప్రజల ఆదరణ తప్పక ఉంటుంది. అటువంటి వ్యక్తులను పాలకులు కూడా పరికించి చూడడం తటస్థమవుతుంటుంది. ఆలోచనా సరళులనేకాలు, అవి రాజకీయాలకు సంబంధించినవి కావచ్చు, సాంఘిక సమస్యలవీ కావచ్చు. మతానికి సంబంధించినవి కావచ్చు. మత ప్రచారానికి రాజస్థానాలు, మఠాలు, ఆలయాలు ప్రధాన కేంద్రాలు. "రాజానుమతో ధర్మః" అనడం బట్టి మతం మారుతూ ఉంటుంది. మఠాలు, మత ప్రవర్తకులు ఆలోచనా సరళికి నిలయాలు, రామానుజకూటం, దాసకూటం, వ్యాసకూటం మొదలగునవి అట్టివి. ఆలయాలు ఇటు రాజులకు, అటు మఠాధిపతులకు, ఇటు ప్రజానీకానికి అవశ్యం సందర్శించవలసిన ప్రదేశాలు. అవి కళలకు కాణాచి. మతప్రచారానికి ఆయువుపట్టు కేంద్రాలు, కనుకనే హైందవ జీవితంలో ఆలయాలకు అగ్రస్థానం ఉంది. ఆంధ్ర వాగ్గేయకారుల్లో అనేక దివ్యస్థలాలను దర్శించి కీర్తించిన ఘనత తాళ్ళపాక అన్నమయ్యది.

**కడప జిల్లా**

చారిత్రకంగా కడప జిల్లా చాలా ప్రసిద్ధికెక్కింది. పల్లవులు, చాళుక్యులు, రాష్ట్రకూటులు, తొలి చోళరాజులు ఈ ప్రాంతాన్ని పాలించారు. క్రీ.శ. 1198లో కాకతీయ గణపతి దేవుడు చోళ సామంతుల్ని ఓడించి కడపను కాకతీయ సామ్రాజ్యంలో కలుపుకున్నాడు. అటు మహమ్మదీయుల పాలనలో కొంతకాలం ఉండి విజయనగర రాజుల వశమైంది. విజయనగర రాజులు ఈ ప్రాంతంలో తమ కళానైపుణ్యాన్ని చాటిచెప్పే అనేక ఆలయాలు నిర్మించారు. కమనీయమైన దర్శనీయ స్థలాలకు ఆటపట్టు కడపజిల్లా. జిల్లాలో ప్రవహించే వివిధ నదీ తీరాలలో పుణ్యక్షేత్రాలు వెలిశాయి. అన్నమయ్య జన్మించిన జిల్లా కూడా ఇదే. పైగా అన్నమయ్య ఆలయ కీర్తనలలో ఎక్కువభాగం కడప జిల్లా దేవాలయాలవే కావడం గమనించదగ్గ అంశం.

**ఒంటిమిట్ట కోదండరాముడు:**

కడప జిల్లాలో చాలా ప్రసిద్ధి పొందిన చారిత్రాత్మక గ్రామం ఒంటిమిట్ట. ఇది మద్రాసు – బొంబాయి రైలు మార్గంలో ఉంది. ఈ గ్రామం మండల కేంద్రం కూడా. ఇది కడపకు 15 మైళ్ళ దూరంలో ఉంది.

**స్థల పురాణం, స్థానిక కథలు:**

ప్రాచీనకాలంలో ఈ ప్రాంతం దొంగలకు నిలయమై కీకారణ్యంగా ఉండేది. ఈ గ్రామాన్ని ఒంటడు, మిట్టడు అనేవారు నిర్మించడం వల్ల దీనికి ఒంటిమిట్ట అనే పేరు వచ్చింది. ఒంటిమిట్ట అంటే ఒకే రాయి అనే అర్థం ఉంది. రామలక్ష్మణ సీతా ప్రతిమలు ఒకే శిలపై చెక్కడం వల్ల దీనికి ఏకశిలా నగరమని కూడా పేరు. ఈ స్వామి త్రేతాయుగంలో స్వయంభువుగా వెలిశాడని జాంబవంతునిచే ప్రతిష్ఠింపబడిందని కథ. ఇక్కడ మార్కండేయుడు పరమేశ్వరుని ధ్యానించి మృత్యుంజయుడైనాడని, శృంగి పరీక్షిత్తుని శపించి తన తొందరపాటుకు చింతించి ఇక్కడ తపం చేసి పాప విముక్తుడైనాడని మరో కథ.

**శాసనాలలో ఆలయ విశేషాలు:**

ఈ ఆలయంలో కనిపించే శాసనాలలో మొదటిది క్రీ.శ. 1554వ సంవత్సరం కల్లూరి లింగరాజు తిమ్మయ్య కుమారుడైన లింగప్ప శాసనం. ఇతడు ఒంటిమిట్ట శ్రీ రఘునాయకుల నిత్య పూజలకు, అంగరంగ వైభవాలకు, మాసోత్సవాలకు మరియు పంచ పర్వాలకు చెలెరసుతూంపల్లె, ఒంటిమిట్టలోని బుగెపల్లె – ఒంటిమిట్టకు చెందే కొంత మడి భూములను కట్టడి చేశాడు. రెండవది 17వ శతాబ్దంలో ఒంటిమిట్ట రామాలయంలో సిద్ధిరాజు ద్వారపాలకులను ప్రతిష్ఠించాడు.

మూడవది శా.శ. 1744వ సంవత్సరంలో తిప్పన సూరారెడ్డి పోలిచెంచు నారాయణరెడ్డి, మడకల శేషారెడ్డి, దామ గంగిరెడ్డి., చంనెల కొండారెడ్డి, కరణం పేరయ అనేవారు ఒంటిమిట్ట కోదండరామస్వామికి అఖండ దీపానికి ప్రతినెలా నెయ్యిని సమర్పించారు. నాల్గవది శా.శ. 1715వ సంవత్సరంలో ముదుపూరు తాలూకాలో 18 గ్రామాల రెడ్లు, కరణాలు ఒంటిమిట్ట కోదండరామస్వామి తళిగ, దీపారాధన, కైంకర్యాలకు నెలకు ఒక్కొక్క గ్రామం ఒక రూపాయి వంతున ఇచ్చేటట్లు ఏర్పాటుచేశారు.

ఒంటిమిట్ట కోదండరామునికి సంబంధించిన ఒక కీర్తన అన్నమయ్య పదాలలో కనిపిస్తుంది.

**"ఇందులోనే కానవద్దా యితడు దైవమని**
**విందువలె వొంటిమిట్ట వీరరఘురాముని** ॥ పల్లవి ॥ **(5 - 302)**

ఒంటిమిట్ట రఘురాముని వీర రఘురామునిగా కీర్తించుట ఇందలి విశేషం. పేరుకు తగ్గట్లే శ్రీరామచంద్రుని వీరోచిత కృత్యాలిందు ప్రస్తావించబడ్డాయి. అన్నమయ్య కాలం నాటికి 'వానర' సంపద ఒంటిమిట్ట, తిరుమలలో ఎక్కువ కావడం వల్లనేయేమో-

**"తెమలి వాసరులై ఈ దైవతలే బంట్లైరి**
**తిమిరి శ్రీ వేంకటపతికి నేడునాడు"**

అని అన్నమయ్య భంగ్యంతరంగా ప్రస్తావించి ఉండవచ్చు.

**కోన చెన్నకేశవుడు:**

ఇది కడపకు దక్షిణంగా నాలుగు మైళ్ళ దూరంలో ఉండే పుణ్యక్షేత్రం. దీన్నే పాలకొండ కోన అంటారు. ఇక్కడ వెలసిన స్వామి చెన్నకేశవుడు. ఈ స్వామిని పాలకొండరాయుడు అని కూడా అంటారు. దట్టమైన పొదలు, కొండ చరియలు, జలాశయాలు ఉన్న ప్రాంతం. ఇది విహారయాత్రకు ప్రసిద్ధి.

**ఆలయ వివరాలు:**

ఆలయం పడమటి ముఖం కలిగి ఉంది. ముఖమంటపం ఉంది. గర్భగుడిపై విమానం ఉంది. ఆలయానికి ప్రాకారం గాని, గోపురాలు గాని లేవు. స్వామివారు నిలబడి భక్తులకు అభయమిస్తున్నాడు. ఈ స్వామివారికి పూజలు, పాంచరాత్ర ఆగమం ప్రకారం జరుగుతున్నాయి. అన్నమయ్య సంకీర్తనలలో చెన్నకేశవులు :

**"నేనొకటి సేయగానునీవొకటి సేసేవు**
**కోనచెన్న రాయడ నీ గుణమింక మానవు ॥ పల్లవి ॥ (17-423)**

**గండికోట చెన్నకేశవుడు:**

కడప జిల్లాలో మైలవరం ఒక మండల కేంద్రం. మైలవరం మండలంలోని గ్రామం గండికోట. ఇది జిల్లాలో ప్రసిద్ధిపొందిన చారిత్రాత్మక దుర్గం. మద్రాసు, బొంబాయి రైలు మార్గంలోని ముద్దనూరు రైల్వేస్టేషనుకు 15 మైళ్ళ దూరంలో ఉంది.

**శాసనాలలో ఆలయ విశేషాలు:**

క్రీ.శ. 21.03.1545వ సంవత్సరం నరసింగయ్య దేవ మహారాజులు గారి పుత్రుడైన తిమ్మదేవ మహారాజు శాసనం. ఇతడు గండికోట రఘునాథ దేవునికి అమృతవడి, అంగరంగ వైభవాలకు శ్రీరామజయంతి పుణ్యకాలమందు కట్టడి చేశాడు. క్రీ.శ. 29.12.1557వ సంవత్సరం ఔభలేశ్వర మహారాజులుంగారి శాసనం. ఇతడు గండికోట రఘునాథ నాయకుల దివ్య తిరువళఇకెకు, తెప్పతిరణాల మహోత్సవం, మకర సంక్రాంతి మహోత్సవం, పారువేటకు తోపు తిరుణఆలకు, కోట తిరునాళ్ళ మహోత్సవానికి, ఊంజల్ తిరణఆలకు, విజయదశమి మహోత్సవానికి, తేరు తిరుణాల మహోత్సవానికి, పల్లకి సేవకు కట్టడి చేశాడు.

**అన్నమయ్య కీర్తనలలో గండికోట చెన్నకేశవుడు:**

అన్నమయ్య ఈ స్వామిని దర్శించి నాలుగు కీర్తనలు రచించి గానం చేశాడు.

**చెల్లునా నీకీ పనులు చెన్నకేశవా**
**కొలవాడ వౌర గండికోట చెన్నకేశా (26 - 50)**

అన్నమయ్య గండికోటలోని శ్రీరామచంద్రునిపై పాడిన కీర్తన :

**"నావంటి నేతను నాగేటి కొనదెచ్చితి**
**రావాడి తమకముతో రామచంద్ర" (26 - 50)**

**గాలివీడు వేంకటేశ్వరుడు:**

కడప జిల్లాలో గాలివీడు ఒక మండల కేంద్రం. ఇది పాకాల-ధర్మవరం రైలుమార్గంలోని కురబలకోట రైల్వేస్టేషనుకు 25 కి.మీ. దూరంలో ఉంది.

**స్థలపురాణం - స్థానిక కథలు:**

పూర్వం ఈ ప్రాంతం పాలేగాండ్రకు కేంద్రం. గాలివీడు అనేది కుటుంబ నామాన్నిబట్టి వచ్చింది. ఇక్కడ గాలి అనే ఇంటిపేరు గల కుటుంబం ఉండేది. ఆ కుటుంబం వారి పేరుతో ఇది గాలివీడుగా పిలువబడింది. వీడు అంటే నగరం, దండు అనే అర్థాలున్నాయి. గాలివీడులో వెలసిన స్వామి వేంకటేశ్వరుడు. ఈ ఆలయానికి సంబంధించిన ప్రాచీన శాసనాధారాలు లభించడం లేదు.

**అన్నమయ్య కీర్తించిన గాలివీడు వేంకటేశ్వరుడు:**

ఈ స్వామిపై అన్నమయ్య ఒక ఆధ్యాత్మిక కీర్తన పాడారు.

**"ఒక్కడవె లోకాన కొడయువు నీవె**
**దిక్కుగా నెవ్వరు లేదు తిమ్మనాయదా" (11 - 4 - 1)**

**చింతకుంట చెన్నకేశవుడు:**

కడప జిల్లాలో ప్రొద్దుటూరు ఒక మండల కేంద్రం. అందులో ఒక గ్రామం చింతకుంట. ఇది మద్రాసు - బొంబాయి రైలు మార్గంలోని ఎఱ్ఱగుంట్ల రైల్వేస్టేషనుకు 25 మైళ్ళ దూరంలో ఉంది.

**స్థల పురాణం, స్థానిక కథలు:**

పూర్వం పెద్దణచోళ మహారాజు అంతఃపురంలో చింతమ్మ అనే బోణకత్తె ఉండేది. ఆమె తన పేరుమీద కుంట కట్టించింది. పల్లె కూడా నిర్మించింది. చింతకుంట అనే నామకరణం చేసింది. పూర్వం ఇది ఒక బ్రాహ్మణ అగ్రహారం. ఒకసారి ఈ గ్రామంలో క్షామం సంభవించింది. చెరువులు, బావులు ఎండిపోయే పరిస్థితి ఏర్పడింది. గ్రామస్థులు

క్షామ ప్రభావం వల్ల చింతాక్రాంతులయ్యారు. అందుచేత అగ్రహారం అనే మాట మాసిపోయింది. క్రమక్రమంగా చింతలకుంట అనేమాట చింతకుంట్లగా మారిందని కథనం. ఒక అత్త చింతను పోగొట్టటానికి కోడలు కట్టించిన ఊరని మరొక ఐతిహ్యం. చింతకుంట, చింతలకుంట, చింతకుంట్ల అని నామాంతరాలు. ఈ గ్రామంలో వెలసిన స్వామి చెన్నకేశవుడు. ఈ ఆలయానికి సంబంధించిన ప్రాచీన శాసనాధారాలు లభించడంలేదు.

**అన్నమయ్య సంకీర్తనల్లో చెన్నకేశవుడు:**

తాళ్ళపాక అన్నమయ్య ఈ స్వామిని కంభం రాయనిగా పేర్కొన్నాడు.

**"ఘనుడవు చింతకుంట కంభమురాయ మము**
**గనుగొని రక్షించు కంభమురాయ"** **(29 - 209)**

కంభంరాయ అన్నది సాధారణంగా నరసింహస్వామిని సూచిస్తుంది. కానీ చింతకుంటలో ప్రస్తుతం చెన్నకేశవ ఆలయం ఉంది. బహుశః అన్నమయ్య కాలం నాటికి కంభంరాయుడు ఉన్నాడేమో, లేదా ఈ ఊరి ప్రాంతంలో మరొక కంభంరాయని గుడి ఉందేమో. ఈ విషయం ఇంకా పరిశీలించదగ్గ అంశం. ఈ దేవాలయంలోని ఒక స్తంభాన్ని కంభంరాయునిగా స్థానికులు భావిస్తున్నారు.

**జల్లావాండ్లపల్లి నృసింహుడు:**

**జల్లావాండ్ల పల్లి గ్రామనాడు విశేషాలు:**

కడప జిల్లాలో చిన్నమండెం మండల కేంద్రం. ఈ మండలంలోని కుగ్రామం జల్లావాండ్లపల్లె. ఇది చిన్నమండెం నుండి 4 కి.మీ. దూరంలో ఉంది. మద్రాసు-బొంబాయి రైలు మార్గంలోని కడప రైల్వేస్టేషనుకు 42 మైళ్ళ దూరంలో ఉంది.

**స్థలపురాణం - స్థానిక కథలు:**

పూర్వకాలంలో ఇక్కడ జల్లవాళ్ళనే కుటుంబం ఉండేది. వారీ ప్రాంతంలో పలుకుబడి కలవారు. అంచేత వారి కుటుంబం పేరుతో ఈ ఊరికి జల్లావాండ్లపల్లె అనే పేరు వచ్చిందని స్థానికుల కథనం. ఇది కుటుంబ నామాన్ని సూచిస్తుంది. పూర్వం చిన్నమండెం నుండి మల్లూరు వరకు ఈ ఊరు ఉండేది. ఈ రెంటికీ మధ్యలో నరసింహస్వామి ఆలయం ఉంది. ఇదంతా ఇప్పటికీ ఒకే వీధిలాగ వరుసలో ఉన్నాయి. మండెంలో ఉండడం వల్ల మండెం రాయడని, మండెం నారసింహుడని ఇప్పటికీ అంటున్నారు. ఈ గ్రామం ఒకప్పుడు పాళెగాండ్రకు కేంద్రంగా ఉండేదని కథనం. జల్లావాండ్లపల్లెకు నరసింహస్వామి ఆలయానికి మధ్య పెద్ద ఏరు ప్రవహిస్తున్నది. ఆలయం ఈ పల్లెకు పడమటి దిక్కుగా కొంత దూరంలో ఉంది.

**శాసనాలలో ఆలయ వివరాలు:**

ఆలయ వివరాలకు సంబంధించి ప్రాచీన శాసనాధారాలు లభించడం లేదు.

**అన్నమయ్య కీర్తనలలో మండెం రాయుడు:**

తాళ్ళపాక అన్నమయ్య ఈ మండెం రాయని దర్శించి తొమ్మిది శృంగార సంకీర్తనలు పాడాడు. దీనినిబట్టి అన్నమయ్య పలుసార్లు ఈ స్వామిని దర్శించినట్లు తెలుస్తున్నది.

**"మమ్మేలతో నీవు నానేరపులెంతు నంటానాదేవు**
**కొమ్మలదోడుత నిట్టె కొనియాడుదువా" (3 - 94)**

**దేవుని కడప - ప్రసన్న వేంకటేశ్వరుడు:**

కడప జిల్లా కేంద్రం. కడప గ్రామీణ మండల క్షేత్రంలోని గ్రామం దేవుని కడప. ఇది మద్రాసు - బొంబాయి రైలు మార్గంలోని కడప రైల్వేస్టేషనుకు 4 మైళ్ళ దూరంలో ఉంది.

**స్థల పురాణం - స్థానిక కథలు:**

ఇది తిరుమల శ్రీనివాసుని క్షేత్రానికి గడపగా ప్రసిద్ధి. తిరుపతి వెళ్ళే యాత్రికులు ముందుగా ఈ స్వామిని దర్శించి వెళ్ళేవారు. అందుచేత ఈ క్షేత్రానికి దేవుని కడప అనే పేరు వచ్చింది. కడపకు దేవుని కడుప, దేవరి కడప, పాత కడప, కృపనగరం, కడప, గడప, నడవ అని నామాంతరాలు. కడప కృశబ్దభవం, వేదాంత దేశికులు దేహళీ పురమని పేర్కొన్నారు. దేహళీ అంటే గడప. దేవుని కడపలో నెలకొన్న స్వామి వేంకటేశ్వరుడు. భక్తులు ఈ స్వామిని ప్రసన్న వేంకటేశ్వరునిగా భావిస్తారు. స్వామిని కృపాచార్యులు ప్రతిష్ఠించారని ప్రతీతి.

**శాసనాలలో ఆలయ వివరాలు:**

కడప దేవాలయానికి సంబంధించిన శాసనాలు నాలుగున్నాయి. మొదటిది క్రీ.శ. 1517వ సంవత్సరం శాసనం. ఈ శాసనంకర్త శ్రీకృష్ణదేవరాయల ప్రధాని అయిన తిమ్మరసు. ఇతడు తిరువేంగళనాథుని ఆరగింపులు, చతుర్మూర్తి హోమం, బలి ప్రధానం మొదలైనవి ఏర్పాటుచేసాడు. రెండవది క్రీ.శ. 1537వ సంవత్సరం ఔభళ మహారాజు శాసనంలో చలివేంద్రం కట్టడి చేశాడు. మూడవది క్రీ.శ. 1553వ సంవత్సరం శాసనం. నంద్యాల పిన ఔభళరాజు శాసనం. ఇతడు తిరువేంగళనాథ దేవునికి ఉద్యానవనం కట్టడి చేశాడు. నాల్గవది 1553వ సంవత్సరం పెద్ద ఔభళరాజు కుమారుడు చిన్న ఔభళరాజు శాసనం. ఇతడు తిరువేంగళనాథ దేవునికి తులసిమాల సమర్పణ, తోమాల కైంకర్యం మొదలైనవి కట్టడి చేశాడు.

**అన్నమయ్య కీర్తనలలో కడప రాయుడు:**

తాళ్ళపాక అన్నమయ్య ఈ స్వామివారిని దర్శించి నలభై కీర్తనలు రచించి గానం చేశాడు. వీటిని రెండు వర్గాలుగా విభజించవచ్చు :

1. ఉత్సవ కీర్తనలు   2. మధురభక్తి కీర్తనలు

**1. ఉత్సవ కీర్తనలు:**

కడపరాయనికి జరిగే ఉత్సవాలలో అన్నమయ్య రథోత్సవం, కళ్యాణోత్సవాలను తన కీర్తనల్లో ప్రస్తావించాడు.

**రథోత్సవం:**

కడప శ్రీనివాసునికి ప్రతి సంవత్సరం రథసప్తమినాడు రథోత్సవం నిర్వహిస్తారు. ఈ రథోత్సవం రథసప్తమినాడు అరుణోదయానికి ముందే నదిలో దీపం వదిలి స్నానం చేయాలి. స్నానం చేసేటప్పుడు ఏడు జిల్లేడు ఆకులు, ఏడు రేగు ఆకులు తలపై పెట్టుకోవాలి. దీనిని ఉత్తరాయణ పుణ్యకాలంగా భావిస్తారు. ఇలాంటి రోజున కడపలో జరిగే రథోత్సవ వైభవాన్ని అన్నమయ్య :

**"కన్నుల పండుగలాయ గడపరాయన తేరు**
**మిన్నునేల శృంగారము మితిమీరినట్లు"  (8 - 93)**

వర్ణించాడు. అలాగే రథంలో ఊరేగే వారిని మరొక కీర్తనలో :

**"కాంతతో శ్రీ వేంకటేశ కడపలో దేరెక్కి**
**యింతనన్ను గూడి వీధులేగితివి నీవూ"  (17 - 4 - 7)**

అని వర్ణించాడు.

**కళ్యాణోత్సవం:**

కడప శ్రీనివాసునికి జరిగే కళ్యాణోత్సవాన్ని అన్నమయ్య తన కీర్తనలలో కీర్తించాడు. కళ్యాణానంతరం స్వామి ఊరేగే ప్రసక్తిని అన్నమయ్య క్రింది కీర్తనలో వర్ణించాడు.

**"సిగ్గరి పెండ్లికొడుక చెలువరాయనన్ను**
**వెగ్గళించకిక నీవు వెస జెలువరాయ"  (14 - 148)**

**కళ్యాణోత్సవం:**

మధురభక్తి శృంగార సమ్మిళితం కావడం ఒక ధర్మం. తాను సేవించే దేవుడు నాయకుడు, భక్తుడు, నాయిక, దేవుడొక్కడే పురుషోత్తముడు. తక్కిన జీవరాశి అంతా స్త్రీ సమూహం. ఆ స్త్రీ – పురుషుల అనంత శృంగార లీలలే మధురభక్తి విశ్వరూపం. మచ్చునకొకటి :

"కాదనకు రా నా మాట కడపరాయ నీవు
గాదె బోసె వలపులు కడపరాయ" (19 - 458)

**నల్లబల్లి చెన్నకేశవుడు:**

కడప జిల్లాలో ముద్దనూరు ఒక మండల కేంద్రం. ఈ మండలంలోని గ్రామం నల్లబల్లె. ఇది మద్రాసు - బొంబాయి రైలు మార్గంలో ముద్దనూరు రైల్వేస్టేషనుకు 3 కి.మీ. దూరంలో ఉంది.

**స్థలపురాణం, స్థానిక కథలు:**

పూర్వం ఈ ప్రాంతంలో కిరాతులు నల్లరాతి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. ఈమె స్త్రీమూర్తి. ఈమెను నలసానెమ్మ, నల్లసానెమ్మ, నల్సానమ్మ, నల్సాలమ్మ అంటారు. కృష్ణ శిలతో చేయబడిన ఈ విగ్రహం చెన్నకేశవస్వామి ఆలయానికి వెనుకభాగంలో ఉంది. ఈమె పేరుమీదుగా ఈ ఊరు నల్లబల్లె అని పిలువబడిందని కథనం. నల్లబల్లెలో సాక్షాత్కరించిన స్వామి చెన్నకేశవుడు. ఈ స్వామిని జనమేజయుడు ప్రతిష్ఠించాడని స్థానికుల కథ. కానీ ప్రస్తుతం ఆలయ ప్రాకార పునాదులు తప్ప మరేమీ లేదు. స్థానికుల అభిప్రాయం ప్రకారం ప్రధాన ఆలయం పూర్తిగా పాడుబడిపోయిందట. కొన్ని వందల సంవత్సరాలుగా వృధాగా ఉన్న స్థలంలో ఈమధ్య ప్రదేశంలో ఇల్లు కట్టుకొన్నారు. ప్రస్తుతం ఆలయ ప్రాంగణంలో ఇల్లు ఉంది. ఇందులో కాపురం ఉన్నారు. ఈ ఆలయానికి సంబంధించిన ప్రాచీన శాసనాధారాలు లభించడం లేదు.

**అన్నమయ్య సంకీర్తనలలో నల్లబల్లి చెన్నుడు:**

అన్నమయ్య నల్లబల్లి చెన్నకేశవుని దర్శించి స్వామిపై అయిదు కీర్తనలు పాడాడు. ఈ చెన్నకేశవ స్వామిని అన్నమయ్య చెన్నుడని, చెన్నరాయడని, చెన్నకేశవుడని, ఆదికేశవుడని కీర్తించాడు.

"నల్లబల్లి చెన్నుడు నాపాలిటి వెన్నుడు
యెల్ల జీవులకు మరి యిన్నిటా ప్రసన్నుడు" (10 - 168)

"కొలవరో మొక్కరో కోరి తలచరో
వేయినామముల వెన్నుడు" (10 - 262)

అన్నమయ్య ఈ చెన్నకేశవుని భక్తితో తాను కొనియాడినాడు. స్వామిని కొలువుడని ప్రజల్ని ఉద్బోధించాడు.

**నందలూరు సౌమ్యనాథుడు:**

కడప జిల్లాలో చారిత్రాత్మక గ్రామం నందలూరు. ఇది మండల కేంద్రం. మద్రాసు - బొంబాయి రైలు మార్గంలో ఉంది. బాహుదా నదీతీరంలో ఉంది.

**స్థలపురాణం, స్థానిక కథలు:**

దృష్టద్యుమ్నుని కుమారుడు నిరంతర మహారాజు, అతడు బాహుదా నదీతీరంలో నిరంతరం పురం అనే అగ్రహారం కట్టించాడు. ఈ అగ్రహారం బాహుదానది వెల్లువ వల్ల కొట్టుకొనిపోయింది. నెలంద అనే ఆమె రాజుగారి ఉంపుడుకత్తె. ఈమె వేశ్య. కొట్టుకుపోయిన ఈ ప్రదేశం సందర్శించింది. ఆ ప్రదేశానికి ఉత్తరంగా ఒక గ్రామం నిర్మించింది. దానికి తన పేరు మీద 'నెలందలూరు' అని నామకరణం చేసింది. దాన్ని సర్వాగ్రహారంగా బ్రాహ్మణులకు దానం ఇచ్చినట్లు స్థానికుల కథనం. ఇది నంద వంశీయులు పాలించిన ప్రాంతం. అంచేత దీనికి నందలూరు అని పేరొచ్చిందని మరో కథ. నందలూరుకు నిరంతరపురం, నెలందలూరు, నెందలూరు, నెలదలూరు, తొండాయ మండలం అనే నామాంతరాలు ఉన్నాయి. ఈ నందలూరులో వెలసిన స్వామి చొక్కనాథుడు. బాహుదా నదికి భృగునది, చెయ్యేరు అని నామాంతరాలు. నారదుడే స్వామిని ప్రతిష్ఠించాడని కథనం.

**శాసనాలలో ఆలయ విశేషాలు:**

ఈ ఆలయంలో కనబడే శాసనాలలో మొదటిది 2-7-1433వ సంవత్సరం. బాహుదానదీ తీరమందు శ్రీ చొక్కానాథ పెరుమాళ్ళ సన్నిధిని సోమగ్రహ పుణ్యకాలమందు పొత్తపాటిలోని పోలినాడు, లేంబాన, తాళ్ళపాక, టంగుటూరు, ఓపిలి మొదలగు గ్రామాలందలి ప్రముఖులు కొందరు వీసబాడిపన్ను, కాసిగప్పాలు మొదలైనవి, నెలదలూరు చొక్కనాథ పెరుమాళుకు నియమం చేశారు. రెండవది క్రీ.శ. 28-6-1501వ సంవత్సరం నాటిది. దేవినేని గారి కుమారుడు పర్వతనాయని గారు వేయించిన శాసనం. ఇతడు నరసానాయని పుణ్యానికిగాను నెలదలూరి చొక్కనాథ దేవునికి ప్రాతఃకాల దధ్యోదన అవసరానికి పొత్తపినాటి రాజ్యంలోని ఆకింపోడనే గ్రామాన్ని ఏర్పాటుచేశాడు. మూడవది క్రీ.శ. 8-1-1537వ సంవత్సరం నాటిది. రాముబట్లయ్యవారు అందువూరు అనే గ్రామాన్ని పూర్వం నందలూరి చొక్కనాథ పెరుమాళ్‌కు ఏర్పాటుచేశాడు. ఈ గ్రామం రాజకీయంగా రద్దయింది. తాళ్ళపాక తిరుమలయ్యంగారు అచ్యుత మహారాయలకు చెప్పి ఆ గ్రామాన్ని యధాతథంగా చొక్కనాథ పెరుమాళుకు సర్వమాన్యంగా ఇప్పించారు.

నాల్గవది క్రీ.శ. 28-12-1556వ సంవత్సరం. నెలదలూరి జక్కుల తిప్పాబత్తుని కూతురు తిమ్మసాని శాసనం. ఈమె చొక్కనాథ దేవునికి నెలందలూరు, పాటూరు, అదువూరు, టంగుటూరు, పొళదలూరు, ఓపిల, తాళ్ళపాక, గండ్లూరు, ఊటుకూరు అనే తొమ్మిది గ్రామాలకు చెందిన మడి కుంటలను (వెట్ ల్యాండ్స్) దాశెలపడికి ఏర్పాటుచేసింది. ఐదవది క్రీ.శ. 1742వ సంవత్సరం. వీరప్ప కుమారుడు వెంకటాచలం శాసనం. సౌమ్యనాథస్వామి దేవాలయ అర్చకుడైన వేంకటాచలం పేరుతో సౌమ్యనాథస్వామికి కర్పూర హారతిని ఏర్పాటుచేశాడు.

**అన్నమయ్య కీర్తనల్లో సౌమ్యనాథుడు:**

తాళ్ళపాక అన్నమయ్య ఈ స్వామిని దర్శించాడు. నాలుగు కీర్తనలు వ్రాశాడు. ఇందులో స్పష్టంగా నెలదలూరు ప్రస్తావన ఒక కీర్తనలో ఉంది.

> **"ఐరి శ్రీ వేంకటగిరి నుండి వచ్చి కూడితివి**
> **మేరతో నెలదలూరి మేటి చొక్కనాథా"          (26 - 175)**

ఈ కీర్తన అన్నమయ్య మధురభక్తి ప్రదర్శకంగా వ్రాశాడు ఇందులో నాయిక అన్నమయ్య. నాయకుడు శ్రీ వేంకటేశుడు. మిగిలిన మూడింటిలో నెలదలూరు ప్రస్తావన లేదు. బహుశః వీటిని కూడా అన్నమయ్య నెలదలూరు చొక్కనాథునిపై వ్రాసి ఉండవచ్చునని ఊహ.

> **"పూనిన శ్రీ వేంకటాద్రి నుండి వచ్చి ననుంగూడె**
> **సూన్యాస్త్ర గురుడైన చొక్కనాథుడు"          (3 - 237)**

> **"సొమ్ములతో విఱ్ఱవీగె చొక్కనాథు పోదు**
> **సుమ్మీ నీకు నాకు జొక్కనాథా"          (27 - 436)**

'సొమ్ములతో విఱ్ఱవీగే చొక్కనాథా' అనడం బట్టి అన్నమయ్య కాలం నాటికి ఈ స్వామికి సకలాభరణాలుండేవని, అంగరంగ వైభవంగా ఉండేదని స్పష్టమవుతుంది.

**పాలిగిరి చెన్నకేశవుడు:**

కడప జిల్లాలోని ఒక మండల కేంద్రం వీరపునాయనిపల్లె. ఈ మండలంలోని గ్రామం పాలగిరి. ఇది మద్రాసు - బొంబాయి రైలు మార్గంలోని ఎర్రగుంట్ల రైల్వేస్టేషనుకు 14 మైళ్ళ దూరంలో ఉంది.

**స్థలపురాణం, స్థానిక కథలు:**

ద్వాపర యుగంలో సాందీపుని ఆశ్రమానికి వాల్మీకాది ఋషులు వచ్చారు. వారి క్షుత్పిపాసలు తీర్చడానికి సాందీపుని నిజాశ్రమమైన పర్వతంలోని పాదపథములను యాచించారు. వాటి శాఖల నుండి క్షీరవృష్టి కురియంచినందువల్ల పర్వతానికి క్షీరగిరి అనే పేరు వచ్చింది. ప్రజల వ్యవహారంలో ఇది పాలగిరి అయిందని స్థానిక చరిత్ర. ఈ ఊరు కట్టుకోవడం వల్ల దీనికి పాలగిరి అనే పేరు వచ్చింది. పాలగిరికి ఉత్తర దిశలో శిథిలమైన దుర్గం కనబడుతుంది. ఇది పాలెగాళ్ళకు పొలిమేరగా ఉంటుందని స్థానికుల కథనం.

పాలగిరిలో వెలసిన స్వామి చెన్నకేశవుడు. ఈ ఆలయం చాలా ప్రాచీనమైనది.

**శాసనాలలో ఆలయ విశేషాలు:**

క్రీ.శ. 1504వ సంవత్సరం విజయనగర రాజుల పాలన కాలంలో పాలగిరి చెన్నకేశవ స్వామికి మడిమాన్యాలను రామదాసు తిమ్మయ్యగారు ఉత్థాన ద్వాదశి రోజున కట్టడి చేశాడు.

**అన్నమయ్య కీర్తనలలో పాలగిరి రాయుడు:**

తాళ్ళపాక అన్నమయ్య చెన్నకేశవస్వామిని దర్శించి ఒక శృంగార సంకీర్తన పాడాదు.

**"కంటిరా నీ గుణమెల్ల కడగడనే**
**పంటి మోపితేనె కాద పాలగిరి రాయదా"** **(30 - 182)**

**పులివెందుల రంగనాయకులు:**

కడప జిల్లాలో పులివెందుల ఒక మండల కేంద్రం. ఇది పాకాల - ధర్మవరం రైలు మార్గంలోని కదిరి రైల్వేస్టేషనుకు 27 మైళ్ళ దూరంలో ఉంది.

**స్థలపురాణం, స్థానిక కథలు:**

పూర్వం ఈ ఊరికి పులిమందలు అని పేరు. ఈ ప్రాంతంలో పులులు మందలు మందలుగా తిరుగాడుతూండేవి. వేటగాళ్ళు పులులు మందలుగా ఉంటే చోట్లకు పోయి పులులను చంపేవారు. అంచేత దీనికి పులిమందల అని పేరు వచ్చింది. పులివెందుల అంటే పులులకు నిలయం అని అర్థం. పూర్వం రంగనాయకుల స్వామి ఆలయానికి 2 కి.మీ. దూరం ఉండేది. ఈ మధ్య ప్రదేశం ఘోరారణ్యం. ఈ పల్లెకు పోలేపల్లి అని పేరు. స్వామి పూజారులు ఈ పల్లెలో నివసిస్తుండేవారు. వారు పులులకు భయపడి చెట్లమీదికి పోయి రంగనాయకులు స్వామికి పూజలు చేసి వస్తుండేవారు. స్వామి అర్చకుల భక్తికి మెచ్చాడు, రంగనాయకుల స్వామి పులివెందుల (పులులు నశించుగాక) అని శపించాడు. పులులు నశించాయి. పూజారులు సంతోషించి స్వామి పలుకులనే ఈ గ్రామ నామంగా పరిగణించినారు. అప్పటినుంచి అది పులివెందులుగా పిలువబడిందని స్థానికుల కథనం. ఈ పోలేపల్లి క్రమంగా జన వ్యవహారంలో పులివెందులుగా మారిందని కథ. పులవెందుల, పిలివిందల, పులివిందళ, పులివందలసీమ, పుల్విందల, వ్యాఘ్రపురి అని నామాంతరాలు. పులివెందలలో వెలసిన స్వామి రంగనాయకుల స్వామి. ఈ ఆలయం పులివెందల గ్రామానికి పడమటి దిశలో పంట పొలాల మధ్యలో ఉంది.

**శాసనాలలో ఆలయ వివరాలు:**

క్రీ.శ. 1509వ సంవత్సరం తిమ్మరాయని కుమారుడైన బసవరాజుగారి తమ్ముడైన నరసయ్య దేవ మహారాజు గారి శాసనం.

**అన్నమయ్య సంకీర్తనలలో రంగనాయకుల స్వామి:**

అన్నమయ్య ఈ స్వామిని దర్శించి ఒక శృంగార కీర్తన పాడాదు.

**"ఇంకనేల వెరపు యెదుటనే వున్నారము**
**వంకలొత్తకిక మతివద్దు వద్దు"** **(20 - 15)**

**పెద్దచెప్పలి చెన్నకేశవుడు:**

కడప జిల్లాలో కమలాపురం అనే మండల కేంద్రం. ఈ మండలంలోని గ్రామం పెద్దచెప్పలి. ఇది కమలాపురం రైల్వేస్టేషనుకు 4 మైళ్ళ దూరంలో ఉంది.

**స్థలపురాణం, స్థానిక కథలు:**

చెప్పలి అనే పేరు గల వ్యక్తి పేరుతో ఈ ఊరు వెలసినట్లు స్థానికుల చరిత్ర. చెప్పల్లె, చప్పలి, చెప్పల్లి, చెప్పలి అని నామాంతరాలు. ఈ ఊరులో వెలసిన స్వామి చెన్నకేశవుడు. అగస్త్యునిచే ప్రతిష్ఠించబడినట్లు స్థానికుల కథనం.

**శాసనాలలో ఆలయ వివరాలు:**

ఈ ఆలయానికి సంబంధించిన ప్రాచీన శాసనాధారాలు లభించడం లేదు.

**అన్నమయ్య సంకీర్తనలలో చెప్పలి చెన్నకేశవుడు:**

తాళ్ళపాక అన్నమయ్య ఈ స్వామిని దర్శించి ఒక కీర్తన పాడాడు.

**"వరుసకు మాపటంత వచ్చేగాని**
**సెరసు దాటకు వోయి కేశవరాయ"** **(13 - 307)**

**పెద్ద ముడియం నృసింహుడు:**

కడప జిల్లాలో, పెద్ద ముడియం ఒక మండల కేంద్రం. ఇది జమ్మలమడుగుకు 12 మైళ్ళ దూరంలో ఉంది. మద్రాసు - బొంబాయి రైలుమార్గంలోని ముద్దనూరు రైల్వేస్టేషనుకు 26 మైళ్ళ దూరంలో ఉంది.

**స్థలపురాణం, స్థానిక కథలు:**

చాళుక్య సామ్రాజ్య స్థాపకుడైన విష్ణువర్ధనుడు ఇక్కడ జన్మించాడని కథ. విష్ణువర్ధనుని తండ్రి త్రిలోచనుడు మరణించాడు. ఆ సమయంలో విష్ణుభట్ట సోమయాజి అనే బ్రాహ్మణుడు స్వామి దేవేరిని కన్నకూతురులాగ సంరక్షించాడు. విష్ణువర్ధనుడు రాజయ్యాడు. తల్లిని ఆపద సమయంలో రక్షించి, పోషించిన బ్రాహ్మణుడికి ఈ ముదివేము గ్రామాన్ని అగ్రహారంగా ఇచ్చాడు. అంచేత దీనికి ముదివేము అగ్రహారం అని పేరు. పూర్వం ఇక్కడ 184 బ్రాహ్మణ కుటుంబాలుండేవని కథ. పెద్ద వేపచెట్టు క్రింద ఈ అగ్రహారం ఉండడం వల్ల దీన్ని పెద్దవేము అనేవారు. ఈ ముదివేమును క్రమంగా ముదయ్యం, ముదివేముల, ముడియంగా రూపాంతరం చెంది ముదయం అయింది. ముడి అంటే చెట్టు అని అర్థం కూడా ఉంది. పెద్ద వేపచెట్టు కింద ఉండడం వల్ల దీనికి ముడియం అని కూడా పేర్లు. పెద్ద ముడియంలో నెలకొన్న స్వామి లక్ష్మీనరసింహుడు. ఈ స్వామిని జనమేజయుడు ప్రతిష్ఠించాడని కథ.

**శాసనాలలో ఆలయ వివరాలు:**

ఇది అసంపూర్తి శాసనం. సంవత్సరం లేదు. పెద్ద ముడియంలోని నరసింహస్వామి దేవాలయ గోపుర శిఖర నిర్మాణఆర్థం బ్రాహ్మణుల ముడియం ఆ అగ్రహార్న్ని మాన్యంగా ఇచ్చారు.

**అన్నమయ్య సంకీర్తనలలో ముడియం నారసింహుడు:**

తాళ్ళపాక అన్నమయ్య ఈ స్వామిని దర్శించి ఒక కీర్తన పాడాడు.

**"జయమాయ నీకు నాదె నురసములూ**
**నయగారి ముడియము నారసింహా" (17 - 139)**

అనే శృంగార సంకీర్తనను బట్టి ఇందులోని స్వామి లక్ష్మీ నరసింహుడని చెప్పాడు అన్నమయ్య.

పై క్షేత్రాలే కాక ప్రొద్దుటూరు చెన్నకేశవాలయం, పోట్లదుర్తి చెన్నకేశవాలయం, మాచనూరు చెన్నకేశవాలయం, మాదుపూరి చెన్నకేశవాలయం, వత్తలూరు చెన్నకేశవాలయం, ఓగునూతుల నారసింహాలయం, సంబటూరు చెన్నకేశవాలయాలను దర్శించి కీర్తించాడు.

**ఆధార గ్రంథాలు:**


1. అన్నమయ్య, తాళ్ళపాక : తాళ్ళపాక పదసాహిత్యము సంపుటములు, అన్నమాచార్య ప్రాజెక్టు, తిరుమల తిరుపతి దేవస్థానములు, 1999.
2. ఆనందమూర్తి, వేటూరి : తాళ్ళపాక కవుల కృతులు – వివిధ సాహితీ ప్రక్రియలు, ప్రభాకర ప్రచురణలు, హైదరాబాదు, 1974.
3. గంగప్ప, ఎస్. : అన్నమాచార్య సంకీర్తన సుధ, శశీ ప్రచురణలు, గుంటూరు, 1995.
4. తిరుపతి క్షేత్రసాహిత్య సమీక్ష, రాంపల్లి నాగభూషణం, 1980.
5. శ్రీ తాళ్ళపాక అన్నమాచార్యుల జీవిత చరిత్ర, డా. కేసర్లవాణి, తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి, 2000.


***

# తాళ్ళపాక కవుల లఘుకృతుల పరిశీలన

'అవధాన కళానిధి'
**శ్రీ ఆముదాల మురళి**
సంస్కృత ఉపన్యాసకులు
విజయకృష్ణ జూనియర్ కళాశాల
రేణిగుంట రోడ్డు, తిరుపతి

శ్రీహరికి బిరుదు టెక్కములుగా 32 వేల సంకీర్తనలు రచించిన అప్పని వరప్రసాది తాళ్ళపాక అన్నమయ్య. తాళ్ళపాక వారిది అచ్చంగా కవుల వంశం. అన్నమాచార్యుల తపఃఫలం కారణంగా ఆ వంశమంతా వాగ్గేయకారులు, కవులు జన్మించారు. విస్తృతంగా రచనలు చేశారు. ప్రత్యేకించి దేశిసాహిత్యానికి వారు చేసిన సేవ నిరుపమానం. అన్నమాచార్యుల భార్య తాళ్ళపాక తిమ్మక్క, ఆయన కుమారుడు పెదతిరుమలాచార్యులు, మనవళ్ళు చినతిరుమలాచార్యుడు, చిన్నన్న, చినతిరుమలాచార్యుని కుమారుడు తిరువేంగళప్ప మొదలగు వారంతా రచనలు చేశారు.

అన్నమయ్య మునిమనవడు, చినతిరుమలాచార్యుని కుమారుడైన తిరువేంగళప్ప మమ్మటుని కావ్యప్రకాశానికి 'సుధానిధి' వ్యాఖ్య, అమరకోశానికి గురుబాల ప్రబోధిక వ్యాఖ్య సంతరించారు.

**కం॥ క్షితిపై నాచంద్రార్క**
**స్థితి మించగఁ దాళ్ళపాక తిరువేంగళ దీ**
**క్షితుఁడమరుకమున్ వేంకట**
**పతికి సమర్పణము గాగ బరువడిఁ జేసెన్**

అనే పద్యాన్ని బట్టి తిరువేంగళప్ప సంస్కృతంలోని అమరుక కావ్యాన్ని తెనిగించినట్లు తెలుస్తున్నది.

"చిన్నన్న ద్విపద కెరుగును" అని ప్రసిద్ధిగాంచిన వాడు పెదతిరుమలాచార్యుల కుమారుడైన తిరువేంగళనాథుడు (1498-1561) చిన్నన్న రచనలు నాలుగూ ద్విపదకావ్యాలే. అష్టమహిషీ కళ్యాణం (7365 ద్విపదలు), పరమయోగి విలాసం (12755 ద్విపదలు), ఉషా కళ్యాణం (ద్విపద), అన్నమాచార్య చరిత్ర (551 ద్విపదలు) ఈ రచనలను లఘుకృతులుగా పరిగణించలేము.

అన్నమాచార్యులు రచించిన శృంగారమంజరి, వేంకటేశ్వర శతకం, పెదతిరుమలాచార్యులు వ్రాసిన చక్రవాళమంజరి, నీతి సీసశతకం, వేంకటేశోదాహరణం, సుదర్శన రగడ, రేఫఱకారములు (కృష్ణ శతకం), శృంగార దండకం,

వైరాగ్య వచన మాలికా గీతాలు, శృంగార వృత్త పద్యాల శతకం, శ్రీ వేంకటేశ్వర ప్రభాతస్తవం, చినతిరుమలాచార్యుల సంకీర్తన లక్షణం, అష్టభాషా దండకాలను ఈ వ్యాసంలో తాళ్ళపాక కవుల లఘుకృతులుగా పరిశీలించడం జరుగుతుంది.

తెలుగు సాహిత్యంలో శతకం యొక్క స్థానం గణనీయమైనది. వాగ్గేయ కారుడుగా వినుతిగన్న అన్నమయ్య రచనలను గూర్చి చిన్నన్న తన అన్నమాచార్య చరిత్రలో పేర్కొంటూ సంకీర్తనలు ముప్పది రెండువేలు కాక -

> **"ప్రవిమల ద్విపద ప్రబంధరూపమున-నవముగారామాయణము, దివ్యభాష నా వేంకటాద్రి మాహాత్మ్య మంతయును-గావించి రుచుల శృంగార మంజరియు శతకముల్ పదిరెండు సకల భాషలను - ప్రతిలేని నానా ప్రబంధముల్ చేసి" (526-532)**

పై ద్విపద పంక్తులను బట్టి రామాయణ ద్విపద, సంస్కృతంలో వేంకటాద్రి మాహాత్మ్యం, శృంగారమంజరి, వివిధ భాషలలో పన్నెండు శతకాలు రచించినట్లు తెలియజేశారు. చిన్నన్న చెప్పిన పన్నెండు శతకాల పేర్లు నేడు తెలియవు. అందులో వేంకటేశ్వర శతకం ఒక్కటి మాత్రం ప్రచురించబడింది. అన్నమయ్య తాళ్ళపాకలోని బుచ్చి కేశవస్వామి పైన; నరసింహస్వామిపైన శతకాలు రచించినట్లు కీ.శే. మైనంపాటి వేంకటసుబ్రహ్మణ్యం గారు 1983 డిసెంబరు, 1986 మే సప్తగిరి సంచికల్లో వ్రాసిన వ్యాసాల్లో పేర్కొన్నారు. అయితే అవికూడా నేటికి అలభ్య రచనలే. అలమేలుమంగపై కూడా అన్నమయ్య శతకాన్ని చెప్పినట్లు "అలమేలు మంగకు నాశుమార్గమున-సలలితంబుగ నొక్క శతకంబు చెప్పె" (204) అని చిన్నన్న పేర్కొన్నాడు. ఇదికూడా అలభ్యమే. "వితత వృత్తంబుల వేంకటపతికి - శతకంబు కుతుకంబు సమకూరజేసి" (276) అని చిన్నన్న చెప్పిన శ్రీ వేంకటేశ్వర శతకాన్ని దివ్యదంపతులైన అలమేల్మంగ - శ్రీ వేంకటేశ్వరులను సంధానించే విధంగా అన్నమయ్య ఆనతిచ్చారు. ఈ శతకంలో 'వేంకటేశ్వరా' అనే మకుటం ఉంది. ఇందులో చివరి పద్యమిది.

> **"అమ్మకుఁ దాళ్ళపాక ఘనుఁడన్నదు పద్యశతంబు జెప్పెఁ గో**
> **కొమ్మని వాక్ప్రసూనములఁ గూరిమితో నలమేలు మంగకున్**
> **నెమ్మది నీవు చేకొని యనేక యుగంబులు బ్రహ్మ కల్పముల్**
> **సమ్మద మంది వర్ధిలుము జవ్వనలీలల వేంకటేశ్వరా!"**

ఈ పద్యంలోని అమ్మకున్, అలమేలు మంగకున్ అను షష్ఠీ విభక్త్యంత ప్రయోగాల వలన చిన్నన్న పేర్కొన్న అలమేలుమంగ శతకము, వేంకటేశ్వర శతకము ఒకటేనని పరిశీలకులు అంటున్నా, చిన్నన్న అన్నమాచార్య చరిత్రలో వాటిని వేర్వేరు చోట్ల పేర్కొన్న కారణం చేత అవి రెండూ ఒకటి కాకపోవచ్చు.

అన్నమయ్య రచించిన లఘుకృతి 'శృంగారమంజరి'. ఇందులో 258 ద్విపద లున్నాయి. ద్విపద లక్షణాలే మంజరీ ద్విపదకు కూడా ఉంటాయి. అయితే ప్రాస నియమం మినహాయింపు. 'వలదు ప్రాసంబంద్రు వరుస మంజరికి' అని లక్షణం. ద్విపదకు వలే ఇందులో కూడా ప్రతి పాదానికి మూడింద్ర గణాలు. ఒక సూర్యగణం ఉంటుంది. మూడోగణం మొదటి అక్షరానికి యతి. పెదతిరుమలాచార్యుల చక్రవాళమంజరి, తాళ్ళపాక తిమ్మక్క 'సుభద్రా కళ్యాణం' కూడా మంజరీ ద్విపదలే.

శృంగారమంజరి వేంకటేశ్వరస్వామికి అంకితంగా వ్రాయబడింది. భగవంతుని చేరడానికి భక్తి, శృంగారం రెండూ సమప్రాధాన్యం కలవనే తన అభిప్రాయాన్ని అన్నమయ్య ఈ రచన ద్వారా వ్యక్తీకరించాడు.

అమరాద్రి మాదిరి నున్న వేంకటాద్రిపైనున్న వేంకటేశ్వరుని గూర్చి కోకిల వాణి, చిగురాకుబోణి వికచాంబుజాక్షియైన ఒక బాల సకల జనానంద సంస్తుతి చేత వినగా ఆమెలో పంచశరాసక్తి ప్రభవించింది. "చిగురంపగమి చికిలి సేయక మున్న-కోకిల మదమెత్తి గొణగకమున్న" ఆ బాలకు ఆరామంబు చూపి మాటల మాటున తిరుపిచ్చిని మాన్పించాలని చెలికత్తెలు ఉద్యానవనానికి తీసుకొని వస్తారు. వనంలో వసంతం ఉత్సవంలా ఉంటుంది. స్వామి కనిపిస్తాడు. ఆమె స్వామిని చూసింది. విరహంతో వేగిపోయింది. ముభావంగా ఉంటుంది. చెలులు స్వామిని ఆమె దగ్గరికి చేరుస్తారు. స్వామి "ఆలింగనాది సౌఖ్యముల నొందించి-కరగించి మరగించి కలికి గావించి" చిత్తజు సామ్రాజ్య సింహాసనమున బాలికా రత్నాన్ని పట్టపురాణిగా నిలుపుతాడు. ఇందులోని శబ్దార్థాలంకారాల సౌందర్యం నిరుపమానం. "లేమా విలాసంబు లేమావిమంచి-లేమావిఁజేచాప లేమా యటంచు, తిలకంబు దీర్ఘక తిలకించి చూడు-తిలకంబు మానినీ తిలకంబు యనుచు" ఇత్యాది పాదాలలో యమకానికి దోహదశాస్త్రం దోహదం చేయడం రమణీయం.

పెదతిరుమలాచార్యుల చక్రవాళమంజరిలో నాయిక కూడా కృష్ణుని గుణములు ఎవరో చెబుతుంటే విన్నదే. విరహాగ్ని నలసిన అబల బలగంబులైనట్టి పడతులు ఆమె చిత్తములోనున్న శ్రీ వేంకటేశ్వని జేరి నీ చింతలపాలైన ఆ యెలనాగను కళ్యాణంబు కమ్మని వేడుకొన్నారు. స్వామి ఆమెను చేపట్టి విరహంబు చల్లార్చి ఆ వామాక్షిని తీసుకొని తన నగరు చేరుకొన్నాడు.

నూటపన్నెండు ద్విపదలు గల ఈ మంజరి శృంగారమంజరికి అనుకరణగా అనిపించి నప్పటికి రెంటికి మధ్య శైలిభేదం ప్రస్ఫుటంగా కనిపిస్తున్నది.

తాళ్ళపాక కవుల్లో పెదతిరుమలాచార్యుడు 'శృంగార దండకం' వ్రాశాడు. శ్రీ వేంకటేశ్వరునికి అంకితం చేయబడిన ఈ దండకంలో పద్మావతీ శ్రీనివాసుల కళ్యాణం వర్ణించబడి ఉన్నది. ఇది తగణ దండకము. దండకము ఉద్దురమాలా వృత్తములలో లాక్షణికులు పేర్కొన్నప్పటికీ వృత్తాలలో వలె దండకానికి పాద నియతి ఉండదు. నన్నయ భారతంలో రచించిన మొదటి దండకం కూడా తగణ దండకమే. లాక్షణికులు

దండకాల్లో పన్నెండు భేదాలున్నట్లు చెప్పినప్పటికీ తగణ దండకానికున్న ప్రాధాన్యత మిగిలిన వాటికి లేదు.

"శ్రీ వేంకటక్ష్మాధరోత్తుంగ శృంగాగ్ర నిత్యస్థిరాగారు, గారుత్మతోదీర్ణ సౌవర్ణ భూషావిశేషోజ్జ్వలాకారు..." అంటూ ప్రారంభమయ్యే శృంగార దండకం అంత్యాను ప్రాస, వృత్త్యనుప్రాస, ముక్తపదగ్రస్తాది అలంకారాలతో సాగుతుంది. కేవలం స్తుతి ప్రాధాన్యత గలదిగా కాక కథాకథనం కూడా ఇందులో ఉండటం చేత ఇది పోతన భోగినీ దండకాన్ని గుర్తు చేస్తుంది. శృంగారమంజరి, చక్రవాళ మంజరుల్లో పేర్కొని నట్లు ఈ దండకంలో కూడా

**"ఆ నీరజాతాక్షి విజ్ఞాపనంబెల్ల నాలించి లాలించి సౌభాగ్య సామ్రాజ్య**
**మేలించి తద్భామినీ రత్నముందాను పక్షీంద్రుపై నెక్కి శ్రీ వేంకటేశుండు"**

గరుత్మంతునెక్కి ఇల్లుజేరినట్లు పెదతిరుమలాచార్యులు వర్ణించారు. స్వామి పరివారంలో ముఖ్యుడైన వైనతేయుణ్ణి విస్మరించక స్మరించడం ప్రతి రచనలోను కనిపిస్తుంది. దండకం ముగిసిన పిమ్మట ఉన్న పద్యం ఇలా ఉంది.

**ఉ॥ సన్నుతి తాళ్ళపాక పురశాసనుఁడన్నయ తిమ్మనార్యుఁడ**
**త్యున్నతిఁ జెప్పె దండకము దుగ్ధ పయోనిధి కన్యకారతి**
**స్ఫిన్నమృగీమదాంకునకు వేంకటభర్తకు నిత్యభోగ సం**
**పన్నున కారవీందు కులపర్వత తారకమై చెలంగఁగాన్"**

దీనిలో పేర్కొన్న దాన్నిబట్టి పెదతిరుమలాచార్యులకు అన్నయ తిమ్మనార్యుడని మరొక వ్యవహార నామం కూడా ఉన్నట్లు తెలుస్తున్నది.

పెదతిరుమలాచార్యుల కుమారుడు చినతిరుమలాచార్యుడు అష్టభాషా దండకాన్ని రచించాడు. ఈ దండకం దొరికిన రాగిరేకుపై చివరనున్న వాక్యాలను బట్టి హేవళంబి సంవత్సర మార్గశిర శుద్ధ పంచమి బుధవారం రాగిరేకులపై వ్రాసినట్లు తెలుస్తున్నది. అది శకసంవత్సరం 1459 అంటే అది క్రీ.శ. 1537 నవంబరు 7వ తేది అవుతుంది. ఈ దండకం ప్రారంభంలో రెండు శ్లోకాలున్నాయి. రెండూ స్రగ్ధర ఛందస్సులో ఉన్నాయి. వీటిలో మొదటి శ్లోకం పూర్తి సంస్కృతం కాగా రెండో శ్లోకం "త్రాయస్వత్రాత భక్తా..." అని సంస్కృతంలో ప్రారంభమై మిగిలిన ఏడు భాషల్లో నడుస్తూ మణిప్రవాళంగా ఉన్నది.

సంస్కృతం, ప్రాకృత, శూరశేన, మాగధ, పైశాచ (అపభ్రంశ), ప్రాచీ, అవంతి, సార్వదేశి (నాగర) అనేవి అష్టభాషా దండకంలోని ఎనిమిది భాషలు. ఇందులో సంస్కృత దండకం సహగణాలతో ప్రారంభం కాకుండా తగణంతో సాగి, చివర ఒక గురువు అదనంగా వచ్చింది. ప్రాకృత భాషలో ఉన్నది రగణ దండకం. మిగిలినవన్నీ తగణదండకాలే. దండకం చివరన మరొక స్రగ్ధర శ్లోక మున్నది. ఆ శ్లోకంలో చినతిరుమలాచార్యులు అన్నమయ్యను వాణీవీణా నినాద ప్రతిమ వాక్కు గలవాడని,

పెదతిరుమలాచార్యుని శేషుని గెల్చెడి వాగ్ధురంధరుడని పేర్కొన్నాడు. నాటక సాహిత్యంలో ప్రాకృత భాషలో సంభాషణలు వ్రాసిన చోట కవులు వాటికి సంస్కృతంలో ఛాయాశ్లోకాలు, సంభాషణలు వ్రాసినట్లు చినతిరుమలాచార్యులు ప్రాకృతాది మిగిలిన ఏదు భాషల్లోని దండక భాగానికి ఛాయ వ్రాసిఉంటే బాగుండేది. ఆయా భాషలు, పండితులు అందుబాటులో ఉన్నప్పుడే 'అన్నమార్య ప్రాజెక్టు' లాంటి సంస్థలు పూనుకొని వాటికి ఛాయలు వ్రాయించాలి.

పెదతిరుమలాచార్యులు శ్రీ తిరువేంకళనాథునికి విన్నపం చేస్తూ వైరాగ్య వచనమాలికా గీతాలు వ్రాశారు. ఇవి మొత్తం 47 ఉన్నాయి. ఈ గీతాలు వాటికి ఉంచిన శీర్షికలోని 'వచన' పదాన్ని ఆధారంగా చేసుకొని గద్య కావ్య విభాగానికి చెందినవని కొందరు పూర్వ పరిశోధకులు భావించారు. అయితే గద్య రచనకు ఇవి సమీపంగా లేవు. 'వచన' శబ్దాన్ని వాక్కునకు పర్యాయంగా తీసుకొని, వస్తులక్షణ నిర్దేశంగా భావిస్తే వీటిశైలి గీతాలకు దగ్గరగా ఉన్నట్లు గమనించవచ్చు. దానికి బలం చేకూర్చే విధంగా ఈ గీతాలకు రాగతాళాలు నిర్ణయించబడి ఉన్నాయి. ప్రతి గీతం చివర 'శ్రీవేంకటేశ్వరా' అనే ముద్ర కనిపిస్తున్నది. కొన్ని గీతాల్లో శ్రీవేంకటేశ్వరా అని సంబోధించి ముద్ర తరువాత 'మఱియును' అన్న పదం ఉంది. అంటే ఏకబిగిని పాడుకొన్న వేర్వేరు గీతాలకు అనుసంధానం కలిగించుటకు ఈ సముచ్చయార్థకాన్ని వాడినట్లు భావించవచ్చు. ఈ గీతాలు అపురూప భావ సంపన్నతకు ఆలవాలాలుగా ఉన్నాయి. శరణాగతి, స్తుతి వినూత్నమార్గంలో నడిచాయి.

> **"శేషాచల నివాసంబుకతన నీ గోత్రం బెఱింగితిమి**
> **పురుషోత్తమ ఖ్యాతిచేత నీ పౌరుషం బెఱింగితిమి**
> **వేణునాద వినోదివని చెప్పంగా నీవంశం బెఱింగితిమి**
> **మత్స్య కూర్మాద్యవతారంబులు విని నీ పుట్టువు లెఱింగితిమి"**

అంటూ సాగే ఈ గీతంలో అచలానికి గోత్రం పర్యాయపదం కావడం, పురుష శబ్ద భావార్థక తద్ధితం పౌరుషం కావడం, వేణువు వంశ (వెదురు) భవం కావడం, అవతారానికి పుట్టువు పర్యాయపదం కావడం వల్ల పుట్టిన చమత్కారం ఆహ్లాదకరంగా ఉన్నది.

"భక్తి, తాత్త్వికత మూర్తీభవించిన ఈ వచనములు విశ్వకవి రవీంద్రుని "గీతాంజలి"ని గుర్తు చేయునని" వేటూరి ప్రభాకరశాస్త్రి గారి అభిప్రాయం. అయితే కన్నడ సాహిత్యంలోని బసవన్న వచనాల కంటే, తెలుగులోని సింహగిరి వచనాలకంటే ఇవి భిన్నమైనవని చెప్పుటకు రాగతాళములే కారణం. వాగ్గేయ కారుడైన పెదతిరుమలాచార్యులు వీటిని ఎలా గానం చేశారో ఊహించదానికి సహజంగా ఉపయోగపడే మాత్రా ఛందస్సు ఈ వచనాల్లో అంతుచిక్కడం లేదు. కాని వారు నిర్దేశించిన రాగాతాళాల్లో వీటిని స్వరపరిస్తే మాత్రం పదసాహిత్యంలో ఒక వినూత్నమైన ఆవిష్కరణ కాగలదు.

పెదతిరుమలాచార్యుడు రచించిన మరొక లఘుకృతి 'సుదర్శన రగడ' పేరులోనే ఛందస్సుద్యోతక మౌతున్నది. ఇందులో 59 రగడలు అంటే 108 పాదాలున్నాయి. అష్టోత్తర శతపాద సమన్వితమైన ఈ రగడ శ్రీమన్నారాయణుని సుదర్శచక్ర మహత్వాన్ని కీర్తించే రచన. ఇందు ప్రతి చరణంలో చివర 'చక్రము' అనే పదం పునరావృత్తమై అంత్యప్రాస లక్షణాన్ని సమకూరుస్తున్నది.

**"ఓంకారాక్షర యుక్తము చక్రము । సాంకమధ్యవలయాంతర చక్రము**
**సర్వఫలప్రద సహజము చక్రము । పూర్వకోణ సంపూర్ణము చక్రము..."**

ఇలా ఈ రగడ ఓంకారంతో మొదలవుతుంది. ప్రతి రగడ పాదము ఒక విశేషణ పూర్వపద కర్మధారయ సమాసమే అవుతుండగా చక్రమనే విశేష్యమునకు మిగిలిన పదమంతా విశేషంగా ఉంటున్నది.

సుదర్శన రగడలో ప్రతి పాదమునందు నాలుగు మాత్రల గణాలు నాలుగున్నాయి. మూడవగణం మొదటి అక్షరానికి యతి చెల్లుతూ చతురస్ర గతిలో సాగుతున్నది. కావున దీనిని మధురగతి రగడగా నిర్ధారించవచ్చు. ఇందులో "నక్రకంఠదళనక్రమ చక్రము । ధిక్కృత దనుజాతి క్రమచక్రము" అన్న రగడలో ఉన్న ప్రాస 'ఋప్రాస'. ఋకారము స్వరము. రేఫ వ్యంజనము ఈ రెంటికి ప్రాస చెల్లునని లక్షణకారులు పేర్కొన్నారు. అందుకు లక్ష్యముగా భారతారణ్య పర్వంలోని ఈ క్రింది పద్యాన్ని పేర్కొన్నారు.

**కం॥ ఆ ఋషి కుమారు గట్టిన**
**చీరలు మృదులములు కదు విచిత్రములు మనో**
**హారము తని బృహత్కటి**
**భారము నందొక్క కనకపట్టము వ్రేలున్ (3-104)**

మరొక రగడ ఇలా ఉన్నది. "విహ్వాలిత నరక వీరము చక్రము । సైంహికేయగళ సంహార చక్రము" ఇందలి ప్రాసను గూర్చి అథోజ్ఞాపికలో పరిష్కర్త పండిట్ వి. విజయరాఘవాచార్య గారు ఇలా అన్నారు. "తామ్ర పత్రమున 'వింహ్వాలిత' యని యున్నది. సైంహికేయ శబ్దముతో ప్రాసము చేయుటకు వింహ్వాలితయని వ్రాసియుండునేమో. వింహ్వాలిత, వింహాలిత రూపములు సాధువులగు నాయని సందేహము కలుగుచున్నది". 'విహ్వాలిత' లోని 'వి' ఉపసర్గ. కావున వింహ్వాలిత కావడానికే వీలులేనప్పుడు దాని సాధుత్వంతో పనిలేదు. కొన్ని పదాలు కొందరి ఉచ్చారణలో భిన్నంగా ఉండటం రివాజే. అలాంటి ఉచ్చారణ వల్లనే ఈ ప్రాస ఘటింపబడి ఉండవచ్చును. ఎలా జరిగినా ఇది లక్షణ సమ్మతమైన ప్రాసకాదు.

తాళ్ళపాక కవుల్లో అన్నమయ్య మాత్రమేకాక పెదతిరుమలయ్య కూడా శతక రచన చేశాడు. నీతి సీసశతకం, శృంగారవృత్త పద్యశతకం, కృష్ణశతకం అనే మూడు

పెదతిరుమలయ్య శతకాలు. ఇవి మూడూ మిక్కిలి వైవిధ్యం కలిగినవి. నీతి సీసశతకంలో లోకంతీరు,.ఉపదేశాలు, నీతులు ఉండగా, శృంగారవృత్త పద్యశతకంలో దక్షిణనాయకుడైన శ్రీ వేంకటేశ్వరుని శృంగార లీలలు వర్ణించబడినవి. కృష్ణశతకం లక్షణగ్రంథం, రేఫఱకారముల నిర్ణయం చేస్తుంది.

నీతిశతకంలో నూరు సీసపద్యాలున్నవి. ప్రతి సీసానికి లక్షణాన్ననుసరించి తేటగీతి చెప్పబడింది. ఆ తేటగీతి లోని చివరి రెండు పాదాలు మకుటంగా ఉన్నాయి. "కలిత లక్ష్మీశ సర్వజగన్నివేశ । విమల రవికోటి సంకాశ వేంకటేశ" అన్నది మకుటం. మొదటి పద్యంలో 'నీమూర్తి దలచి నీకు సీసశతకంబు జెప్పెదఁ జిత్తగించు' అని మొదలిడి చివరి పద్యంలో 'తాళ్ళపాక అన్నమాచార్య సుత తిమ్మయాహ్వయుండ, ప్రణుతి చేసితిఁ జేకొమ్ము పద్యశతకము' అని పెదతిరుమలా చార్యులు శతకాన్ని ముగించారు.

ఈ శతక రచనలోని పెదతిరుమలాచార్యుల ప్రణాళిక మిక్కిలి విశిష్టమైనది. తేటగీతి చివరి రెండు పాదాలు మకుటానికి పోగా మిగిలిన మొదటి రెండు పాదాల్లో తాను ప్రతిపాదించ దలచిన విషయాన్ని చెబుతాడు. సీసంలోని నాలుగు పాదాలు ప్రతిపాదించబోయే విషయానికి ప్రాతిపదికలుగా ఉంటాయి. అవి లోకంలో ఉన్న దృష్టాంతాలో, పౌరాణికాంశాలో ఏవైనా కాని గాక పాఠకుని హృదయక్షేత్రాన్ని కవి చేయబోయే బీజావాపనకు పోషకంగా మారుస్తాయి. ఉదాహరణగా కొన్ని ప్రవచనాలు (Statements) చూద్దాం.

**"సరసునకు గాక వివరింప సద్గుణంబు లెందుజూచిన మూఢున కేలగలుగు"-3**

**"కీడుమేలును మతి వితర్కించి చూచి, భవ్యగుణముల నినుగొల్చి బ్రతుకవలయు"-4**

**"శరణు జొచ్చిన యటువంటి జనులకెల్ల గావ బ్రోవగ దాతవు గలవు నీవు"-5**

**"ఏమిసేయంగ వచ్చు సర్వేశ్వరాజ్ఞ వరుస నెంతటి వారికి వగవవలదు"-18**

**"వారివారికి దగినట్టి వరుస దెలిపి అరయవలయును యజమానుడైనవాడు"-33**

ఈ విధమైన శతకరచనా ప్రణాళిక నరసింహశతకం వ్రాసిన శేషప్పకవిలో కూడా ద్యోతకమౌతున్నది. తన శక్తి ఎంతమాత్రమొ అంత మాత్రము పనుల యొనరించుటకు నరుడు అర్హుడౌతాడు, శక్తికి మించిన పనులు చేయరాదనే నీతిని చెప్పడానికి పెదతిరుమలాచార్యుని ప్రణాళిక చూద్దాం.

**"శక్తికి తగని దుర్జనము సేయగరాదు చదువక తర్కింపజనదు సభల**
**నేనుందుతో వల దేలాట మాదంగ నెనయని బాంధవం బెపుడు వలవ**
**దాయంబు లేని వ్యయము సేయుటఁజెల్లదు సోపద్రవపు భూమి నుండఁజనదు**
**గదుసరి లోభిని నడుగుట కష్టంబు దైవంబు మీదఁ గ్రోధంబు సెల్ల**
**దెంత మాత్రంబు దనశక్తి యంతమాత్రమరసి యొనరించు నాతండెయర్హుడెందు"(35)**

"తాను అదుపు చేయలేని దుర్మార్గులతో స్నేహం చేయకూడదు, సభల్లో తాను చదువని విషయాన్ని గూర్చి తర్కించకూడదు. ఏనుగుతో చెలగాట మాడకూడదు. తనస్థాయికి తగనివారితో బంధుత్వం నెరపరాదు, ఆదాయం లేకుండా వ్యయం చేయకూడదు, ఉపద్రవాలున్నచోట ఉండకూడదు, లోభిని యాచించకూడదు, దైవంపై కోపగించుకోకూడదు – తన శక్తి యెంత మాత్రమొ అంత మాత్రము పనులే చేయాలి".

ఇందులో చివరి వాక్యం ఉపదేశ వాక్యం కాగా అంతకుముందు చెప్పినవి కొన్ని ప్రత్యేకాంశాలకు సంబంధించినవి. వాటివల్ల ఉపదేశ వాక్యానికి బలం చేకూరుతున్నది. అయితే వాటిని ప్రత్యేకంగా తీసుకొన్నప్పుడు అవికూడా ఆయా సందర్భానికి తగిన ఉపదేశాలే! చివరన చెప్పింది సార్వకాలికాంశం. ఒక సార్వకాలిక సత్యాన్ని బోధించడం కోసం కొన్ని ప్రాదేశిక సత్యాలను ఆధారంగా తీసుకొని చెప్పడం ఈ శతకంలోని వినూత్న ప్రణాళిక.

సామాన్యులేకాక భక్తులు, యోగులు, రాజులు, గృహస్థులు, గృహిణులు, యజమానులు, సన్యాసులు, తల్లిదండ్రులు, శిష్యుడు ఎలా నడుచుకోవాలో ఈ శతకంలో తెలియజేశారు. అయితే ఇందులో విశేషమేమిటంటే సుఖదుఃఖాలు కర్మవశాన కలుగుతాయని చెబుతూ 'ఇహము పరము సులభమిన్నింట నినుగొల్చు సుజనులకును' (44) అని తేల్చి చెప్పాడు పెదతిరుమలయ్య. ఈ శతకంలో ఆలంకారికత, విషయాభివ్యక్తి పడుగుపేకల్లా చిక్కగా అల్లుకొని ఉన్నాయి.

**'మగని స్వతంత్రంబు మగువకుఁజెల్లదు'**
**'మంత్రి యున్నట్లు సామాన్యుడండగ రాదు'**
**'మాలవాడలో బాపనిల్లుండునే'**
**'వెలిజాతి వానికి వీరు వారనలేదు'** –

ఇత్యాది అభిప్రాయాలు నేటికి చెల్లవు కాని ఆనాటి సామాజిక స్థితిని దృగ్గోచరం చేస్తాయి. ఈ పద్యాలలో పదేపదే ఎదురయ్యే అచ్చతెనుగు పదాల సౌందర్యం భాషాప్రేమికుల మనస్సుకు విందు భోజనమే.

పెదతిరుమలాచార్యుల మరొక శతకం శంగారవృత్త పద్యాల శతకం. ఇందులో మొత్తం నూటమూడు పద్యాలున్నాయి. అందులో 52 ఉత్పలమాలలు, 30 చంపకమాలలు, 19 మత్తేభాలు, 2 శార్దూలాలున్నాయి. సాధారణంగా శతకం వ్రాసేవారు మకుటాన్ని బట్టి వృత్త నిర్ణయం చేసుకొంటారు. ఉత్పలమాలలోని మొదటి గురువును రెండు లఘువులు చేసి యతిస్థానం ఒకటి పెంచితే (10 నుండి 11 నకు) అది చంపకమాల అవుతుంది. అందుకే ఉత్పల చంపకాలను కవులు ఒకే శతకంలో వ్రాస్తుంటారు. దాశరథీ శతకం దీనికి ఉదాహరణ. అదేవిధంగా శార్దూలంలోని మొదటి గురువును రెండు లఘువులుగా చేసి యతిస్థానం ఒకటి పెంచితే (13 నుండి 14 నకు) అది మత్తేభవృత్త మౌతుంది. ఈ సౌలభ్యం కారణంగా

ఈ రెండు వృత్తాలను ఒకే శతకంలో వాడుకోవచ్చు. శ్రీకాళహస్తీశ్వర శతకం దీనికి ఉదాహరణ. పెదతిరుమలాచార్యులు ఈ నాలుగు వృత్తాలను ఒకే శతకంలో వ్రాయడం వల్ల మకుటంలో మార్పు అనివార్యమైంది. ఉత్పల చంపక వృత్తాలలో మకుటం 'వేంకటేశ్వరా' అని ఉండగా శార్దూల మత్తేభ వృత్తాలలో 'వేంకటాద్రీశ్వరా' అని మార్చబడింది. ఈ రెండు మకుటాల్లో అక్షరభేదమే గాని అర్థభేదం లేదు. పైగా మత్తేభ శార్దూలాలు 'అద్రి'లో ఉండడమే సమంజసంగా ఉన్నది.

వేంకటాద్రీశ్వరుని బాసిన సతి 'ఆళీభూతమరాళికేళిగని మదిలో విరాళిన్ మహోందోళంబందె'ను. ఆమెను కూడి 'కేళిందేల' మని చెప్పుటకై కవి స్వామి దగ్గరకు వచ్చాడు (3వ పద్యం). స్వామికి నమస్కారం చేసి (1 & 2) 4వ పద్యం నుంచి అమ్మవారు చెప్పిన మాటల్ని ప్రత్యక్ష కథనం (Direct speech)లో చెబుతున్నాడు. ఈ శతకంలోని వర్ణనలను బట్టి స్వామి అమ్మవారితో కాక మరెవరితోనో సానుకూలంగా ఉన్నట్లు 'కలరా నాకిల రామలెవ్వరయి నందారీడుగా' (6), 'వరసా యెవ్వరు సాటి నా కనుచు' (25) 'ప్రమదాలికి లోలుడవైతి వంచు' (26), 'సంగడి కాంత పొందులు వెసం గడియించి తినంచు నంటివా' (35) ఇత్యాది వాక్యాల ద్వారా తెలుస్తున్నది. అది అమ్మవారికి అభ్యంతరకరమైన విషయం కాదట. పైగా 'ఇట్టివెల్ల మగవానికి సాజము'లన్నది. కాని 'నన్ను కౌగిట గూడుచు నన్యకాంతలం దలతురె' 'వెతంబొరలించకు' మన్నది. స్వామి అడవిలో వేటాడు నపుడు పద్మావతిని చూశాడు. ఆమె సింహమధ్య, ఇభకుంభజఘన, జక్కువకుచ, రాయంచగమన అని ఆ సింహాన్ని, ఏనుగును, జక్కువలను, రాయంచలను వేటాడకుండా వదిలేశాడట. ఇది స్వామికి అమ్మగారిపై నున్న వలపు. ఈ శతకము శృంగార రస రంజితము, వ్యంజకము. రమణీయమైన ఆ దివ్య శృంగారపు ఊహలు పాఠకులకు గిలిగింతలు పెడతాయి.

పెదతిరుమలాచార్యులు వ్రాసిన కృష్ణశతకం రేఫ ఱకారాలను నిర్ణయించే లక్షణగ్రంథం. ఇందులో కృష్ణా అనే మకుటంతో 108 పద్యాలున్నాయి. వాటిలో 55 రేఫలకు సంబంధించినవి కాగా 53 ఱకారములకు సంబంధించినవి. శకట రేఫాన్ని విస్మరించిన ఈ కాలానికి ఈ గ్రంథం యొక్క ఉపయోగం నామమాత్రమే అయినప్పటికీ శకటరేఫం యొక్క ప్రాధాన్యత మాత్రం గణనీయమైనదే. ప్రత్యేకించి ప్రాచీన సాహిత్య పఠన పాఠన అధ్యయన అనుశీలనల్లో రేఫ ఱకార విజ్ఞానం లేనివారు అర్థ నిర్ణయం చేయడం సాధ్యంకాదు. ఉదాహరణకు కఱ=నలుపు; కర=తీక్ష్ణము; తీఱు=నశించు; తీరు=చక్కని; నీఱు=బూడిద; నీరు=ఉదకము, వేఱు=భేదము; వేరు=మూలము; ఎఱ=వానపాము; ఎర=ఆహారము ఇటువంటి పదాలు మన వాఙ్మయంలో కోకొల్లలుగా ఉన్నాయి. అందువల్ల అర్థ నిర్ణయం కొరకు రేఫ ఱకార విజ్ఞానం అవసరం.

ఈ ఆవశ్యకతను గుర్తించకపోతే శకటరేఫమున్న పదాలు కనుమరుగై పోతాయి. మరొక్క విషయం సంస్కృతంలో శకటరేఫం లేదు. దాన్ని వద్దనుకొంటే పోయేవన్నీ

తెలుగుపదాలే. బండెడు పుస్తకాలు మోసే బడిపిల్లలకు బండి 'ఱ' బరువనుకొంటే జరిగేది మాతృభాషా ద్రోహమే.

రేఫ ఱకార నిర్ణయ ప్రక్రియకు పెదతిరుమలయ్య ఆద్యుడు. అనంతరం వచ్చిన అప్పకవి "తాళ్ళపాకాన్వయోదధి పూర్ణ ధవళదీధితి పెదతిరుమలదేశికుండు – మొదలైన వారలు మునుపు రచించిన యవి యెల్ల జాలవా యనగ వలదు" (అప్పకవీయం 2-198) అని పేర్కొని తాను కూడా రేఫ ఱకార నిర్ణయానికి పూనుకొన్నాడు. ఆపై సాంబ నిఘంటువునందు కస్తూరి రంగడు, గణపవరపు వేంకటకవి తన రేఫ నిర్ణయ తారావళిలో, ఓగిరాల రంగనాథకవి తన ద్విరేఫ వర్ణ దర్పణంనందు, సర్వలక్షణ సార సంగ్రహంలోని తృతీయాశ్వాసంలో కూచిమంచి తిమ్మకవి, కవిసంశయ విచ్ఛేదంలో అడిదం సూరకవి రేఫ ఱకారాలను వింగడించారు.

ఈ గ్రంథం శ్రీ వేంకటేశ్వరునకు అంకితం కావించబడింది. నన్నయాది పూర్వకవుల కృతుల ఆధారంగా అచ్చులు, హల్లుల వరుసలో రేఫ ఱకారాలను వర్ణిస్తున్నట్లు పెదతిరుమలయ్య పేర్కొన్నాడు. మొదట కొన్ని సాధారణ నియమాలను పేర్కొని (3,4,5 పద్యాలు) అటుపై అకారాది క్రమంలో పదాలు, వాటికి వ్యవహృతమైన అర్థాలను ఇచ్చారు.

1) ఇచ్చిరి, తెచ్చిరి మొదలగు అచ్చ తెలుగు క్రియాపదాల చివరన రేఫం వస్తుంది.

2) అచ్చతెలుగు ద్విత్వం (జడ్డ) అయితే 'ఱ'కారం వస్తుంది.

3) **"ఇల ఘోషాక్షరములపై గలుగవు తెలుగునను ఱాలు కడగును రేఫల్**
**తలపగ సంస్కృత పదముల గలిగినవియు రేఫలయ్యె కనుగొన కృష్ణా"**

అని కొన్ని సాధారణ సూత్రాలు తెలిపిన పెదతిరుమలయ్య రేఫ ఱకారములను మిగిలిన పద్యాలలో తెలియజేశారు. ఈ మొత్తం శతకంలో **"ఱట్టు, ఱవికె, ఱంకు ఱాయి ఱిక్కించుట । ఱేపు ఱేవు ఱేను ఱేసి ఱెక్క ఱేదు ఱెప్పమూసి ఱివ్వన నదిదాటి । ఱాచుదనగఁ బెద్దఱాలుకృష్ణ"** అనే ఆటవెలదితో పాటు చివరన ఒక తేటగీతి కూడా ఉన్నది. దానికి మకుటం లేదు. మిగిలినవన్నీ కందపద్యాలే. చివరి తేటగీతిలో క్షీరనీర విభేదంబు చేసినట్లు రేఫ, ఱకారాలను తిరుమలా చార్యులు వేరుపరచారని పరమహంసోత్తమునకు ఇది ఉచితమైనదే గదా అనే అర్థాంతర న్యాసాలంకారంతో ఈ శతకం ముగుస్తుంది.

పెదతిరుమలాచార్యులు 63 ద్విపదలు గల శ్రీవేంకటేశ్వర ప్రభాతస్తవాన్ని కూడా వ్రాశారు. ఇది శ్రీవేంకటేశ్వరస్వామికి మేలుకొలుపు. అదివరకే తొండరప్పొడి ఆళ్వార్ వ్రాసిన 'తిరుప్పళ్ళియళిచ్చి' అణ్ణన్ స్వామి వ్రాసిన సంస్కృత సుప్రభాతం ఉన్నాయి. తెలుగు మేలుకొలుపుగా ఈ ద్విపద స్వామి వాఙ్మయ పదమలంకరించింది.

పెదతిరుమలాచార్యుల మరొక వైవిధ్య రచన శ్రీవేంకటేశ్వరోదాహరణము. ఉదాహరణ కావ్యం మార్గదేశి రచనల సమ్మేళనం. తెలుగులో ఉదాహరణ కావ్యాదు

పాల్కురికి సోమనాథుడు. ఆయన వ్రాసిన బసవోదాహరణం తొలి ఉదాహరణ కావ్యం. రావిపాటి త్రిపురాంతకుని త్రిపురాంత కోదాహరణం కూడా ప్రసిద్ధమైనదే.

శ్రీవేంకటేశోదాహరణము 26 పద్యాల కావ్యం. 'ఉదాహరణ' లక్షణం ప్రకారం అందులో 26 పద్యాలుంటాయి. అందులో సంబుద్ధితో కలిపి ప్రథమాది అష్టవిభక్తులకు ఒక్కొక్క విభక్తికి మూడేసి పద్యాలు చొప్పున మొత్తం 24 పద్యాలుంటాయి. ఈ మూడు పద్యాలలో మొదటిది ఏదో ఒక వృత్తము కావలెను. రెండవది ఏదో ఒక రగడ భేదము కావలెను. మూడవది పై రగడకు అర్ధరగడ కావలెను. రగడను కళిక అని, అర్ధరగడను ఉత్కళిక అని వ్యవహరిస్తారు.

25వ పద్యం సార్వవిభక్తికంగా ఉంటుంది. 26వ పద్యాన్ని 'అంకితాంక' పద్యమంటారు. ఈ పద్యంలో కవిపేరు, 'ఉదాహరణ' ఎవరికి అంకితం చేయబడినదో ఆ వివరాలు ఉంటాయి.

శ్రీవేంకటేశోదాహరణము నందు మొదటి పద్యం ఉత్పలమాల. అందు 'నీరజజాతుని తాతయైన సుశ్లోకుడు వేంకటేశ్వరుడు' అని ప్రథమావిభక్తి ప్రయోగింపబడినది. అటుపై లక్షణానుసారము 'మరియు' పదంతో కళిక ప్రారంభమగుచూ లక్షణ విధేయంగా ఉన్నది. ఇందు 'కల్పభూజము', 'మొదలి తేజము', మహానుభావుడు, దేవదేవుడు, నేర్పరి, తీర్పరి, చెలువుడు, బలువుడు అని ప్రథమాంత పదాలు ప్రయోగింపబడినవి.

ఈ కళిక వృషభగతిరగడ. ఈ రగడలో సప్తమాత్రా గణాలు 4 ఉంటాయి. తృతీయ గణాద్యక్షరం యతి, ప్రాస, అంత్యప్రాస ఉంటాయి. ఇందు మొదటి పాదము **"మఱియు నెఱుకలకెల్ల నెల్లగు మహితహితజన కల్పభూజము"** అని ఉన్నది. దీనిలో 4+3, 3+4, 4+3, 3+4 మాత్రలుగా నాలుగు మాత్రాగణా లున్నవి. మూడవగణం మొదటి అక్షరం 'మ'తో యతి, అకారప్రాస, భూజమునకు తేజము అంత్యానుప్రాసము కలిగియున్నది. ఇందలి ఉత్కళిక వృషభ గతిలో సగమైన హరిణగతి రగడ. దీనికి సప్తమాత్రా గణములు రెండున్నవి. **"దురిత విరహిత గురుడు వేదపు శరధి నురుతరశాస్త్ర వాదపు"** అన్నది మొదటి రగడ ఈ ఉత్కళికలో యతికి బదులుగా ప్రాసయతి వాడబడినది. వేదపు, వాదపు మొదలగు పదాల ద్వారా అంత్యానుప్రాస ఘటింపబడినది. రగడకు ప్రాసయతి లక్షణకారులు పేర్కొనలేదు. పెదతిరుమలాచార్యులు వాగ్గేయకారులు కనుక, ఈ రగడ మిశ్రగతిలో సాగు గేయ ఫణితిని కల్గియుండుట చేత స్వతంత్రించి ప్రాసయతిని వాడి ఉండవచ్చును. అన్ని విభక్తులలోను కళికకు యతి, ఉత్కళికకు ప్రాసయతిని వాడి పెదతిరుమలయ్య ఒక క్రొత్త సంప్రదాయానికి నాంది పలికినారు.

ద్వితియావిభక్తి కళిక 'మఱియు నెఱిగిన బుధుల మనసు లెనసిన వాని' అని ప్రారంభమౌతుంది. పూనినవానిన్, కూడినవానిన్ అంటూ ద్వితియా విభక్త్యంత పదాలతో అంత్యానుప్రాస ఘటింపబడినది. ఈరగడ 4 పంచమాత్రా గణాలతో

ఖండగతిలో సాగుతున్నందున ఇది ద్విరదగతి రగడ మూడవ మాత్రాగణాద్యక్షరం యతి. ఉత్కళిక రెండు పంచమాత్ర గణాలు గల ఎనిమిది పాదాలున్నవి. ఇది కూడా ఖండగతిలో సాగుతున్నందున ఇది ద్విరదగతి రగడ మూడవ మాత్రాగణాద్యక్షరం యతి. ఉత్కళిక రెండు పంచ మాత్రగణాలు గల ఎనిమిది పాదాలున్నవి. ఇది కూడా ఖండగతిలో సాగుతుంది. ఇది అర్థద్విరదగతిరగడ.

తృతీయా విభక్తి ఉత్పలమాలయందు 'సుమనోవిభుచే, తిరువేంకటేశుచే' అని తృతీయాంతములు ప్రయోగింపబడినవి. కళిక ఎనిమిది పాదాల చివర 'చేత' పదం విభక్తి ద్యోతకంగాను అంత్యానుప్రాసంగాను ఉన్నది. ఇందు **"మఱియు వఱలు సుజనభజన మానలేని వానిచేత"** అనునది మొదటి పాదం దీనిలో లగ మినహా ఎనిమిది త్రిమాత్రా గణములున్నవి. ఇది త్ర్యస్ర గతిలో సాగుతుంది. అందువల్ల దీనిని తురగవల్గన రగడగా గుర్తించాలి. ఉత్కళిక ఇందులో సగం అంటే హయప్రచార రగడ. అది **"జనుల మనుపుఘనునిచేత వనజ తనుజుజనకు చేత"** అని ముగుస్తున్నది. ఇందు తృతీయ గణాద్యక్షరమునకు యతి చెల్లించాల్సి ఉండగా వన-జన, జను-ఘను అని ప్రాసయతి చెల్లించారు. ప్రతిపాదంలోను నాల్గేసి త్రిమాత్రా గణములున్నాయి.

చతుర్థీవిభక్తి ఉత్పలమాలయందు 'వేంకటవిహారునకై' అని చతుర్థీ విభక్త్యంతము ప్రయోగింపబడినది. కళిక ఎనిమిది పాదాల చివరన 'అఖిలేశునకై, విజితాశునకై, విష్ణునకై, వర్ధిష్ణునకై, మూర్తికినై, కీర్తికినై' ఇత్యాది పదాలు చతుర్థీ విభక్తికి ద్యోతకంగాను, అంత్యానుప్రాసగాను ఉన్నాయి. ఇందు ప్రథమపాదం **"మఱియును గొఱగల పుడమికి నొడికపుమగడై నెగడెడు నఖిలేశునకై"** అని ఉన్నది. ఇందులో జగణేతరములైన చతుర్మాత్రా గణములు ఎనిమిది ఉంటాయి. పంచమ గణాద్యక్షరమునకు యతి. చతురస్రగతిలో సాగుతున్న కారణంచేత ఇది హరిగతిరగడ. ఉత్కళిక మధురగతి రగడ. ఇందులో నాలుగు చతుర్మాత్రా గణములు ఉండి తృతీయ గణాద్యక్షరమునకు యతి చెల్లవలెను. ఉత్కళిక మొదటి పాదం **"ధారుణి భార నివారణ కలకై శౌరవిహార విచారమనెడికై"** అని ఉన్నది. యతి బదులు ప్రాసయతి చెల్లించబడి ఉన్నది.

పంచమీ విభక్తి ఉత్పలమాలయందు 'వేల్పు వలనన్' అనెడి పంచమీ విభక్తి ప్రత్యయాంత పదమున్నది. కళిక చివరన 'వలన' పదం అటు విభక్తికి ఇటు అంత్యానుప్రాసకు సరిపోవుచున్నది. **"కమలమున తనయుగను గరుడవాహను వలన"** ఇది ద్విరదగతి రగడ. దీని లక్షణాలు ఇదివరకే చర్చించాము. సప్తమీ విభక్తిలోను, సంబోధనలోను ద్విరదగతిరగడలే కళికలుగా ఉన్నాయి. షష్ఠీవిభక్తి కళిక తురగవల్గనరగడ. సార్వవిభక్తిక పద్యం శార్దూల వృత్తము ఇలా ఉన్నది.

**శా॥ నీ వీశుండవు నిన్నుగొల్తు వరముల్ నీచేత గైకొందు నే**
**గైవారం బొనరింతునీ కొఱకు సంకల్పింప నీదేశె మ**
**త్సేవల్ నీ వలనన్ మహాయశము నిల్చెన్ నీకు నీయందు ల**
**క్ష్మీవాల్లభ్యము గంటి భక్తవరదా! శ్రీ వేంకటాద్రీశ్వరా!**

ఈ పద్యంలో భక్తవరదా! శ్రీ వేంకటాద్రీశ్వరా! అనునవి సంబుద్ధికాగా నీవీశుండవు, నిన్ను, నాచేత, నీకొఱకు, నీవలన, నీకు, నీయందు అంటూ ప్రథమాది సప్త విభక్తులు ప్రయుక్తములైనవి. చివరిది అంకితాంక పద్యము, ఉత్పలమాల. చక్రనందక గదాంబుజధారికి, శ్రీవధూమనోహారికి వేంకటాచల విహారికి శౌరికి నంకితంబుగా తాళ్ళపాక పురశాసనుడన్నయ తిమ్మనార్యుడు భక్తివిస్తారతతో ఉదాహరణము ఆరవితారకం ఉండునట్లు రచించినట్లు అంకితాంక పద్యము తెలియజేయుచున్నది. శ్రీవేంకటేశోదాహరణము ఇట్లు సలక్షణమై విరాజిల్లుతున్నది. ఇట్లు పెదతిరుమలాచార్యులు అనేక గ్రంథములను రచించుటయేగాక తన తండ్రి అన్నమయ్య సంస్కృతంలో రచించిన సంకీర్తన లక్షణానికి లఘువ్యాఖ్యని కూడా సంతరించాడు. అయితే నేడవి అలభ్యాలు.

సంకీర్తన లక్షణ గ్రంథాన్ని అన్నమయ్య మనవడైన చినతిరుమలాచార్యుడు తన తండ్రి పెదతిరుమలాచార్యుని అనుమతితో పద్యరూపంలో అనువదించాడు. ఇందులో 71 పద్యాలున్నాయి. ఇందులో భరతముని, మొదలగు వారు నాట్య శాస్త్రాది గ్రంథంబులందు విరచించిన లక్షణములను వాటికి లక్ష్యములను పదకవితా పితామహుడైన అన్నమయ్య వింగడించి గ్రంథాన్ని రచించినట్లు పేర్కొన్నాడు. చినతిరుమలాచార్యుని అభిప్రాయం మేరకు అలంకృతి, చమత్కృతి కలిగినదే కృతిగాని అహంకృతి గలిగినది కృతి కానేరదు. ఇందులో అదివరకే సంకీర్తన పద సంప్రదాయమున్న పూర్వ గ్రంథంబులైన సంగీతరత్నాకరం, సంగీత చంద్రిక, సంగీత చూడామణి, సంగీత సుధాకరం, భరతనాట్య శాస్త్రంలోని పంచదశాధ్యాయముల ప్రస్తావన ఉన్నది. తన తాతగారైన అన్నమాచార్యుల పదాలను గూర్చి ఇలా అన్నారు.

**శృతులై శాస్త్రములై పురాణకథలై సుజ్ఞాన సారంబులై**
**యతిలోకాగమవీధులై వివిధ మంత్రార్థంబులై నీతులై**
**కృతులై వేంకటశైల వల్లభ రతిక్రీడారహస్యంబులై**
**నుతులై తాళులపాక యన్నయవచో నూత్నక్రియల్ చెన్నగున్ (12)**

అంతేగాక చతురక్షరప్రాసతో కందపద్యాలలో అన్నమయ్య పదాలను స్తుతించాడు.

తాళ్ళపాక కవులు లఘుకృతులే వ్రాసినా ఆవామన రచనల్లోని త్రైవిక్రమ స్ఫురణాత్మక భావవిన్యాసం అద్భుతాశ్చర్యాలకు గురిచేస్తుంది. భక్తిరసాత్మకమైన ఈ రచనలు వేంకటపతి పాదాలకు సమర్పించిన అక్షర కుసుమాలు. ఈ రచనలకు మరింత వ్యాప్తికలగాలని ఆకాంక్షించుటే భాషా భారతి వరివస్య.

***

# అన్నమయ్య సంకీర్తనల్లో భావ విలక్షణత

డా॥ నాదెండ్ల శ్రీమన్నారాయణ
తెలుగు అధ్యాపకులు
ఎ.జి.ఎస్. ఎయిడెడ్ జూనియర్ కళాశాల
తిరుపతి

శ్రీ వేంకటేశ్వర స్వామి ఎంతటి అద్భుతదైవమో తాళ్లపాక అన్నమాచార్యులు అంతటి విశిష్ట భక్తాగ్రేసరుడు. కలుయుగ ప్రత్యక్షదైవమైన శ్రీ వేంకటేశ్వర స్వామి లీలావైభవాలను ముప్పది రెండువేల శృంగార, ఆధ్యాత్మ సంకీర్తనలలో వర్ణించి వాటిని సంగీతాత్మకంగా ఆలపించి భారతీయ భక్తి వాఙ్మయంలోనూ, తెలుగు పదకవితా వాఙ్మయంలోనూ వాగ్గేయ కారుల్లోనూ 'నభూతో న భవిష్యతి'గా ప్రసిద్ధికెక్కిన కవి, తాత్వికుడు, సంగీతజ్ఞుడు, జానపదుడు అన్నమయ్య. బ్రహ్మదేవునికి నాలుగు ముఖాలున్నట్లుగా అన్నమయ్య చతుర్విధాంశ పాండితీ గరిష్ఠుడుగా కవిగా, తాత్వికుడుగా, సంగీదజ్ఞుడిగా, జానపదుడిగా తిరుగులేని, ఎదురులేని పాండితీ ప్రజ్ఞను ప్రదర్శించాడు. అందుకే కాబోలు తత్త్వశాస్త్రాచార్యులు ఆచార్య సి. రామయ్య గారు "He is a devotee, a man of letters, a religious and social reformer, a philosopher and a musician of high order" అని అన్నమయ్యను శ్లాఘించారు. అన్నమాచార్యులు ప్రప్రథమంగా వేదవాఙ్మయంలోని విజ్ఞానాన్ని సంకీర్తనలద్వారా లోకానికి అందించాడు. తొలి తెలుగు వాగ్గేయకారుడిగా ప్రసిద్ధిగాంచిన అన్నమారార్యులు విష్ణుభక్తి ప్రచారం, ఆంధ్రసారసత్వ సేవను రెండు కళ్ళుగా భావించాడు. అన్నమయ్య సంకీర్తనల్లో మనకు ఏం కావాలో అది లభిస్తుంది. చూసే చూపునుబట్టి అన్నమయ్య సంకీర్తనలు మనకు సమాచారాన్ని అందిస్తాయి. అందులోని ప్రతి అంశంలోనూ విలక్షణత గోచరిస్తుంది.

పురుషార్థాలు, అరిషడ్వర్గాలు, అష్టసిద్ధులు, ఇహపర సాధనకు కావలసిన అన్ని అంశాలు, పాపపుణ్యాలు, స్వర్గనరకాలు, వివిధ సాంఘిక సామాజిక అంశాలు ఒక్కటేమిటి భగవంతుని సృష్టిలోని అన్ని అంశాలు సోపపత్తికంగా అన్నమయ్య వర్ణించాడు. తాను చెప్పిన ప్రతి అంశంలోనూ విలక్షణతను చూపాడు. భావం, భాష విషయంలో కూడా విలక్షణతను, విశిష్టతను ప్రదర్శించాడు.

ఈ వ్యాసంలో భగవంతుని సేవా విలక్షణత, శ్రీ వేంకటేశ్వర స్వామివారి విలక్షణత, సకల దేవ స్వరూప విలక్షణత, ఇల్లాలి విలక్షణత, హితోపదేశ విలక్షణత, జన్మసాఫలన విలక్షణత, జీవనవిధాన విలక్షణత, సర్వసమానత్వ విలక్షణత వంటి అంశాలు విశ్లేషించబడ్డాయి.

**1. భగవంతుని సేవ :**

భగవంతునికి, భక్తునికి మధ్య బంధాన్ని కలిపేది భక్తి. అది పవిత్రమైంది. కానీ మనిషి తన తోటి మనిషిని సేవించి అనుదినమూ దుఃఖించటమెందుకని అన్నమయ్య ప్రశ్నించాడు. ఈ కింది సంకీర్తనలో ఇలా అంటాడు :

**"మనుజుడై పుట్టి మనుజుని సేవించి**
**అను దినమును దుఃఖమందనేలా ॥ పల్లవి ॥ (1-196)**

అంటాడు. జానెడు కడుపు నింపుకోవటానికి వెళ్ళరాని చోట్లకు వెళ్లటం, పట్టెడు కూటికి బతిమాలటం, జన్మస్థానానికి ఆశపడటం మనిషి చేయరాదంటాడు. శారీరక సుఖం కోసం వెంపర్లాడటం తగదంటాడు. అందరిలో పుట్టి, అందరిలో పెరిగి, అందరి రూపములు తానై వెలుగొందుతున్న అందమైన శ్రీ వేంకటేశ్వరస్వామి వారిని సేవించి, ఆ దేవదేవుని కరుణాకటాక్ష వీక్షణాలతో అందరాని పరమపదాన్ని పొందాలని హితవు పలుకుతూ ఆధ్యాత్మిక తత్త్వోపదేశం చేశాడు.

ముప్పది మూడు కోట్ల దేవతలున్న ఈ భువిలో శ్రీ వేంకటేశ్వర స్వామి వారనే ఎందుకు సేవించాలో కూడా అన్నమయ్య తెలిపాడు మరొక సంకీర్తనలో.

**2. శ్రీ వేంకటేశ్వర స్వామి విలక్షణత :**

శ్రీ వేంకటేశ్వరస్వామి వారి వైశిష్ట్య విలక్షణతను అన్నమయ్య ఈ కింది సంకీర్తనలో ఉగ్గడించాడు :

**చేరి యశోదకు శిశువితడు**
**ధారుణి బ్రహ్మకుం దండ్రియు నితడు** ॥ పల్లవి ॥ (3-485)

అంటాడు. యశస్సు కలిగిన స్త్రీ మూర్తి యశోద. ఆ మూర్తికి శిశువయ్యాడు శ్రీకృష్ణపరమాత్మ. ఆయనే బ్రహ్మదేవునికి తండ్రి అయ్యాడు. సూర్యచంద్రుల తేజోవిలక్షణత కలిగినవాడు. అఖిలదేవతా స్వరూపుడు. సుగుణాల రాశి. అఖిల వేదములకు నిలయుడు. సముద్రంలో నీరున్నట్లుగా ఆ వేంకటేశ్వరస్వామివారిలో అఖిల వేదాలు నిక్షిప్తమై ఉన్నాయి. ఆయనే శరణాగతులను కాపాడే ఆపద్బాంధవుడు.

ఈ సంకీర్తనలో అన్నమయ్య మొదట స్త్రీమూర్తిని, అటు తరువాత ఈ విశ్వానికి దిశానిర్దేశం చేస్తున్న సూర్యచంద్రులను, ఆ పిమ్మట అఖిల దేవతలను, వీటన్నిటినీ గూర్చి తెలియజేస్తున్న వేదాలను ప్రస్తావించి వాటిన్నిటికీ హేతుభూతుడు శ్రీ వేంకటేశ్వరస్వామి అని ఆ దేవదేవుని విలక్షణతను కొనియాడాడు.

**3. సకలదేవ స్వరూప విలక్షణత :**

శ్రీ వేంకటేశ్వరస్వామి సకల దేవ స్వరూపులని వక్కాణించాడు అన్నమయ్య. 'ఏకంసత్ విప్రాబహుధావదంతి' అన్నట్లు ఒకే పదార్థాన్ని పండితులు వివిధ పేర్లతో పిలిచినట్లు – శ్రీ వేంకటేశ్వరస్వామి వారు బహుదేవతా స్వరూపులంటారు అన్నమయ్య ఈ కింది సంకీర్తనలో :

**ఎంత మాత్రమున నెవ్వరు దలఁచిన అంత మాత్రమేనీవు**
**అంతరాంతరము లెంచి చూడఁ బిండంతే నిప్పటి యన్నట్లు ॥ పల్లవి ॥**
**(2-393)**

అంటాడు అన్నమయ్య. శ్రీ స్వామి వారిని వైష్ణవులు విష్ణువని, వేదాంతులు పరబ్రహ్మ అని, శైవులు శివుడని, కాపాలికులు ఆదిభైరవుడని, శాక్తేయులు శక్తిస్వరూపుడని పిలుస్తున్నారంటాడు అన్నమయ్య. అల్పబుద్ధులకు అల్పుడివిగానూ, ఘనులకు ఘనుడివిగానూ ప్రత్యక్షమవుతాయి. 'నీరు కొలది తామర' అన్నట్లు ఎవరు ఎంత కోరితే అంతే ఇస్తావని అన్నమయ్య స్వామిని శ్లాఘించాడు.

గంగానది పరిసరాల్లోని బావుల్లో ఆ నది జలమే ఊరినట్లు ఆ స్వామిని శరణుగోరిన వారికి తన కరుణాకటాక్షాలను ప్రసరింపజేస్తాడంటాడు.

### 4. ఇల్లాలి విలక్షణత

ఇంటికి దీపం ఇల్లాలు అన్నది ఆర్యోక్తి. ఇల్లు చూడు అటుపిమ్మట ఇల్లాలిని చూడు అన్నది సామెత. ప్రతి మగవాని విజయం వెనుక ఒక స్త్రీ ఉంటుందంటుంది సమాజం. భర్తకు గౌరవం తెచ్చిపెట్టినా, ఆ గౌరవం తలపెట్టినా దాని ప్రభావం భార్యపై కూడా బలంగా ఉంటుంది. దీనిని దంపతులు గుర్తించి మసలుకుంటే ఆ కుటుంబం ఎలాంటి ఒడిదుడుకులు లేకుండా ముందుకు సాగిపోతుంటుంది. జీవిత రథానికి భార్యాభర్తలు జోడుగుర్రాల వంటివారు. దానికి భగవంతుడు కూడా అతీతుడు కాడు.

**జయలక్ష్మి వరలక్ష్మి సంగ్రామ వీరలక్ష్మి**
**ప్రియురాలవై హరికిఁబెరసితివమ్మా ॥ పల్లవి ॥ (19-520)**

అని కొనియాడాడు. త్రిమూర్తి స్వరూపుడైన వేంకటేశ్వరస్వామి వారి ధర్మపత్ని అలివేలు మంగమ్మ. ఆ తల్లి గుణగణాలను, వారి దాంపత్యాన్ని అన్నమయ్య పై సంకీర్తనలో అద్భుతంగా చిత్రించాడు. ఆ తల్లిని జయలక్ష్మి, వరలక్ష్మి, సంగ్రామ వీరలక్ష్మి అని కొనియాడాడు. ఇన్ని విశేషణాలు కలిగిన అలివేలు మంగమ్మ హరికి భార్య అయిందంటాడు. ఆ మహాతల్లి వలన స్వామివారి ఔన్నత్యం ఇనుమడించిందంటాడు. ఈ సంకీర్తనలో స్వామి - అమ్మవార్ల దాంపత్య బంధంతో మానవమాత్రులు తమ బంధాన్ని అన్వయించుకొని మసలుకోవాలనే దాంపత్య విలక్షణత చక్కగా చెప్పబడింది.

### 5. హితోపదేశ విలక్షణత :

మనం ఎప్పుడూ ఇతరుల హితం కోరుకోవాలేగాని, ప్రియం కోరరాదు. ప్రియం తాత్కాలికంగా ప్రయోజనం కలిగించవచ్చు కానీ దీర్ఘకాలంలో దాని ద్వారా దుష్ఫలితాలు ఎదురవుతాయి. అయితే హితం అలాంటిది కాదు. వర్తమాన, భవిష్యత్తులకు శుభాన్ని కలుగజేస్తుంది. ఈ సత్యాన్ని గుర్తించే సంస్కృతంలో 'హితోపదేశం' కావ్యమే వెలువడింది. వీటిద్వారా ప్రభావితుడైన అన్నమయ్య హితాన్నిలా ఉపదేశించాడు.

**ఎంత విభవము గలిగె నంతయును నా పదని**
**చింతించినది గదా చెడని జీవనము ॥ పల్లవి ॥ (1-181)**

అంటాడు. సంపదలకు పొంగరాదని, కోపాన్ని త్యజించాలని, పరనింద చేయరాదని, విషయసుఖాలను వదలాలని, అత్యాశ ఎవ్వరికీ తగదు. అదేవిధంగా కోపం కూడా. తన కోపమే తన శత్రువు అంటాడు బద్దెన. విషయసుఖాల వల్ల హాని కలుగుతుందే తప్ప మంచి జరగదంటాడు అన్నమయ్య. వీటివల్ల వచ్చే కష్టనష్టాలను గూర్చి వివిధ సంఘటనలు, సన్నివేశాలు, ఉపాఖ్యానాల ద్వారా మన సాహిత్యం సోదాహరణంగా వివరించింది. వివిధ సందర్భాలలో అన్నమయ్య వాటిని ప్రస్తావించాడు. వీటన్నిటిని వదలి శ్రీ వేంకటేశ్వర స్వామివారి దయకు పాత్రులు కావటమే మిన్న అంటాడు.

**6. జన్మ సాఫల్య విలక్షణత :**

'మానుషోజన్మ దుర్లభః' అంటాయి శాస్త్రాలు. ఎనభై నాలుగు లక్షల జీవరాశులలో మానవజన్మ ఎత్తటం జన్మజన్మల సుకృత విశేషమంటారు పెద్దలు. అంతటి జన్మనెత్తిన మానవులు మంచి పనులు చేయాలి, పరోపకార గుణం కలిగి ఉండాలి. ఈ జన్మను ప్రసాదించినందుకు భగవంతునిపట్ల భక్తివిశ్వాసం కలిగి ఉండాలి. ఈ సందర్భంలో అన్నమయ్య ఇలా అంటాడు :

**ఎక్కడి మానవ జన్మంబెత్తిన ఫలమేమున్నది**
**నిక్కము నిన్నే నమ్మితి నీ చిత్తం బికనూ ॥ పల్లవి ॥ (15-38)**

అంటాడు. వివిధ మాయల్లో చిక్కుకున్న తనను విడిపించాలంటాడు అన్నమయ్య. సంసార సుఖం, ఇంద్రియ భోగాలు శాశ్వతం కాదని, అవి పరమ సుఖాన్ని ప్రసాదించవని స్పష్టం చేసాడు అన్నమయ్య. మానవజన్మ ఎత్తాక శ్రీ వేంకటేశ్వరస్వామి వారి పేరు తలవకపోతే మనశ్శాంతి ఉండదంటాడు. మన కష్టాలు తొలగించి, సుఖాలు ప్రసాదించే దివ్యపురుషుడు శ్రీ వేంకటేశ్వరస్వామియే అన్నది అన్నమయ్య భావదృక్పథం.

**7. జీవనవిధాన విలక్షణత :**

మానవజన్మ ఎత్తిన వ్యక్తి ఎలా జీవించాలో, ఎలా జీవించగూడదో, ఏవిధంగా భవ్యమైన జీవితాన్ని వృథాగా గడుపుతున్నాడో ఈ సంకీర్తనలో అన్నమయ్య చెప్పాడు

**నిమిషమెడతెగక హరి నిన్నుదలచి**
**మమత నీ మీదనే మరపి బదుకుటగాక ॥ పల్లవి ॥ (10-59)**

అంటూ స్పష్టం చేశాడు. మనిషి నిద్దురలో కొన్నాళ్ళు, పొరపాట్లు చేస్తూ కొన్నాళ్ళు, వృద్ధాప్యంలో కొన్నాళ్ళు, మోసపోయి కొన్నాళ్ళు గడిపాక - తరువాత ఎప్పుడో ఏమరిపోయాడని భావించిన ఫలముండదంటాడు అన్నమయ్య. బిడ్డలకు కొంత, వార కాంతలకు కొంత, అత్యాశలకు కొంత ధనం ఖర్చుచేసి - నిజమైన అవసరాలు వచ్చినపుడు ధనం లేదని బాధపడితే ప్రయోజనం ఏమీ ఉండదంటాడు.

అందుకే ధనాన్ని, ధాన్యాన్ని, తనవారిని వదలి శ్రీ వేంకటేశ్వర స్వామి వారినే . అర్చించి తరిస్తానంటాడు అన్నమయ్య.

**8. సర్వసమానత్వ విలక్షణత :**

మానవ జన్మ ఎత్తిన వ్యక్తి జాతిభేదాలు పాటించరాదని స్పష్టంగా ప్రకటించాడు అన్నమయ్య. జాతిభేదాలన్నీ మానవమాత్రుడు కల్పించుకున్నవేనంటాడు :

**విజాతులన్నియు వృథా వృథా**
**అజామిళాదుల కది యే జాతి** ॥ పల్లవి ॥ **(2-383)**

జాతిభేదాలు, శరీర గుణాలు వంటివాటిని తర్కించి వృథాగా కాలం వెళ్ళబుచ్చటం పొరబాటు పని మరొకటి లేదంటాడు. సజ్జనుడైన మానవుడు శ్రీ వేంకటేశ్వర స్వామి నామమును స్మరించునే తప్ప జాతి భేదాలు పాటించదంటాడు.

తాను చెప్పిన ప్రతి సంకీర్తనలోనూ వివిధ సామాజికాంశాల్ని అన్నమయ్య ప్రస్తావించాడు. ఆ అంశాన్ని చెప్పే తీరులో, రీతిలో విలక్షణత పాటించాడు. ఆ గుణమే తరువాతి తెలుగు కవులకు మార్గదర్శకమయిందని చెప్పవచ్చు. అందుకే అన్నమయ్య విలక్షణమైన కవిగా, సంకీర్తనాచార్యుడిగా, పదకర్తగా, చిర యశస్సును ఆర్జించాడు.

తెలుగు సాహిత్యం ఉన్నంతకాలం, కళల్లో సంగీతం ఉన్నంతకాలం అన్నమయ్య ఖ్యాతి పట్టపగటి సూర్యునివలె దశదిశలా వ్యాపిస్తుంది.

***

# అన్నమయ్య కీర్తనలలో శ్రీ నరసింహుని లీలలు

**శ్రీమతి జి. నీలిమ**
**పరిశోధక విద్యార్థిని**
**శ్రీ పద్మావతి మహిళా డిగ్రీ మరియు పి.జి. కళాశాల**
**తిరుపతి**

తొలి తెలుగు వాగ్గేయకారుడు పదకవితా పితామహుడైన అన్నమయ్య తాళ్ళపాక గ్రామంలో 1408 సం॥లో నారాయణసూరి, లక్కమాంబ దంపతులకు జన్మించాడు. చిన్నతనం నుండే వేంకటేశ్వరునపై అచంచలమైన భక్తి విశ్వాసాలు కలవాడు. శ్రీ వేంకటేశ్వర స్వామి మహిమల్ని, భక్తిని సామాన్య ప్రజానీకానికి తెలియచేయడానికి సంకీర్తనల్ని సాధనంగా ఎన్నుకున్నాడు. అంతేకాకుండా వైష్ణవ మతాన్ని ఊరూరా

తిరిగి ప్రచారం చేశారు. స్థానికంగానే కాక వివిధ క్షేత్రాలలోని మూర్తులను వేంకటేశ్వరాత్మకంగా కీర్తించారు. దీనివల్ల వైష్ణవం ఒకే ప్రాంతం వారికి లేదా ఒకే భాష వారికి అనే భావం తొలగిపోయింది.

15వ శతాబ్ది ముందు సాహిత్యాన్ని గమనిస్తే అంతా కావ్యస్పృహకు కొనసాగింపుగ వస్తున్న 'ప్రబంధం' రూపురేఖలు సరిదిద్దుకుంటున్న కాలం. అటువంటి సమయంలో ఆ మార్గంలో పడిపోకుండా విలక్షణంగా పదకవితను రచించడం అంటే కాలానికి ఎదురీదడమే. ఇది అన్నమయ్య స్వతంత్ర వ్యక్తిత్వానికి నిదర్శనం. తేట తెలుగులో కీర్తనలు రచించి ఆనాటి రాజుల, ప్రజల మన్ననలను పొంది పదకవిగా గుర్తింపు పొందాడు.

అన్నమయ్య అహోబల మఠానికి చెందిన శ్రీమాన్ ఆదివన్ శంకర శఠగోప యతీంద్రుల వల్ల వైష్ణవ మంత్రోపదేశం పొందాడు. ఆయన దగ్గర 12 సం॥లు శిష్యరికం చేసి నృసింహ మహామంత్ర సిద్ధిని పొందాడు. 32 బీజాక్షరములు కలిగిన నృసింహ మంత్రసిద్ధికి సంకేతంగా 32000 సంకీర్తనలు రచించాడు. వాటిని తన ఇష్టదైవమైన శ్రీ వేంకటేశ్వరుని పాదాంకితం చేశాడు.

అన్నమయ్య వేంకటేశ్వరుని తర్వాత ఎక్కువ కీర్తనలు రచించింది నృసింహ స్వామిపైనే. అన్నమయ్య 32,000 కీర్తనలు రచించినా మనకు లభించింది చాలా తక్కువ. లభించిన ఆ కీర్తనలలో అందరు దేవతా మూర్తులను కీర్తించినవి ఉన్నాయి. కాని నృసింహునిపైన రచించిన కీర్తనలే అధికంగా ఉన్నాయి.

**"కృతయుగే నారసింహః త్రేతాయుగే రఘునందనః**
**ద్వాపరే వాసుదేవశ్చ కలౌ వేంకట నాయకం"**

కలియుగంలోని శ్రీ వేంకటేశుడే కృతయుగంలో నృసింహ రూపాన్ని కలిగి ఉన్నట్లు ఈ శ్లోకం ద్వారా తెలుస్తోంది. అందుకే అన్నమయ్య వేంకటేశ్వరునికి, నృసింహ స్వామికి అభేదాన్ని పాటించాడు. అన్నమయ్య స్తుతించిన దశావతార దేవతా మూర్తుల్లో నృసింహునిదే అగ్రతాంబూలం. అన్నమయ్య నృసింహస్వామిని అనంత తన్మయత్వంతో కీర్తించాడు. అయితే ఆ తన్మయత్వంలో కూడా నరసింహుడే వేంకటేశ్వరుడని మాత్రం మరవలేదు.

అన్నమయ్య ఆంధ్రదేశంలో ఉన్న నృసింహ క్షేత్రాలన్నీ దర్శించాడు. అహోబలం, ఓబులం శ్రీ నారసింహుడు, బొమ్మిరెడ్డి చెర్ల పెరియపురం, జిల్లావాండ్ల పల్లె, పెద్దమడియం, తిరుమల, కదిరి, సింహాచలం, విజయనగరం, భువనేశ్వరం లోని నారసింహమూర్తుల్ని తనివితీరా కీర్తించి తరించాడు.

**"ఇందుగలడందు లేదని**
**సందేహము వలదు చక్రి సర్వోపగతుం**

**డెందెందు వెదికి చూచినా**
**అందందే కలదు దానవాగ్రణీ వింటే"**

(పోతన భాగవతం-సప్తమ స్కందం-275 పద్యం)

అని విష్ణుమూర్తి ఉనికిని చెప్పించాదు. అన్నమయ్య నారసింహుని ఆకారాన్ని, శృంగారాన్ని, ఆధ్యాత్మికతను, విశిష్టాద్వైతాన్ని మేళవించి కీర్తించాదు.

**అహోబల నరసింహుదు :**

అన్నమయ్య విశిష్టాద్వైత సిద్ధాంతాన్ని అభ్యసించింది అహోబలంలోనే. అన్నమయ్య నృసింహ కీర్తనలలో ఎక్కువ భాగం అహోబల నరసింహుని పైనే ఉన్నాయి. ఈయన దిగువ అహోబలాన్ని, పెద్ద అహోబలాన్ని వేరు వేరుగా కీర్తించాదు.

అహోబలం కర్నూలు జిల్లాలో ఆళ్ళగడ్డకు దగ్గరలో ఉంది. ఈ ప్రాంతాన్ని ఎఱ్ఱన హిరణ్యకశిపుదు నరసింహస్వామిచే చంపబడ్డ ప్రదేశంగా తన నృసింహ పురాణంలో చెప్పారు. హిరణ్యకశిపుని చంపే సందర్భంలో స్వామివారి బలం చూసి దేవతలంతా 'అహా! బలం' అన్నారని అందుకే ఈ క్షేత్రం అహోబలంగా ప్రసిద్ధి చెందుతుందని నరసింహుదు వరం ఇచ్చినట్లు ఈ పురాణంలో కలదు.

**"పెదయౌభళపు గొంద బెరిగీ నిదే**
**వదలక కొలిచితే వరములిచ్చీని"** **(4-309)**

**"అదివో చూడరో ఆదిమపురుషుని**
**పెద యౌభళము మీది పెనుసింహము"** **(1-13)**

అదిగో చూడండి ఆదిమ పురుషుడైన విష్ణుమూర్తి పెద అహోబలంలో పెనుసింహములా, నరసింహావతారంలో ఉన్నాదు అంటూ అన్నమయ్య కీర్తిస్తున్నాదు.

**"అరుదురుదీగలి యహోబలేశ్వర**
**పోరిబోరి దాసులు పొగదుట యెట్టు"** **(3-236)**

**"ఒక్కట మీరిద్దరు నహోబలేశ**
**వుక్కళమై కాచుకొందహోబలేశ"** **(21-202)**

అంటూ దిగువ అహోబలాన్ని కీర్తించారు.

అహోబల క్షేత్రం నవ నారసింహ క్షేత్రాలలో ప్రసిద్ధం. అక్కద వెలసిన నృసింహుదు ప్రసిద్ధమైనవాదు. దీనిని అన్నమయ్య క్రింది కీర్తనలో చెప్పారు.

**"అనిశము దలచరో అహోబలం**
**అనంత ఫలదం అహోబలం"** **(3-520)**

అహోబల క్షేత్రం హరినిలయం. అందులో ఉన్న నారసింహుదు పురాణ పురుషుదు, కాంతాంతకుదు, ఏకాంగ వీరుదు. ఈ భావనను -

**"అహోబలేశ్వరుదఖిల వందితుడు**
**మహినితని గొలిచి మనుడిక జనులు ॥** **(4-271)**

భావం : అహోబలమునకు ప్రభువైనవాడు. త్రిమూర్తులకు మూలమైన వాడు, చక్రాయుధాన్ని ధరించిన వాడు, రాక్షసులను సంహరించే వాడు. ఈ నేలపైనే దివ్యసింహము. విసుగులేని పరాక్రమంగల ఒకేఒక వీరుడు. అన్ని దిశలలో వ్యాపించిన గొప్ప వెలుగు ఈతడు. వేంకటగిరిపై నిలచిన లక్ష్మీపతియైన ఈ స్వామి భక్తులకు సులభుడు. ఇహపరముల నుండి మోక్షము ప్రసాదించు వాడు.

అంటే శ్రీ వేంకటేశుడే అహోబలం నందు నృసింహస్వామి. భక్తసులభుడు. కాబట్టి ప్రజలంతా ఈ స్వామిని సేవించి ఎటువంటి బాధలు లేకుండా హాయిగా జీవిస్తున్నారు. ఇక్కడ అన్నమయ్య నృసింహ వేంకటేశ్వరులను అభేదత్వంతో కీర్తిస్తున్నాడు.

అన్నమయ్య అహోబలం చుట్టూ ఉన్న నవ నారసింహులను కూడా కీర్తించాడు.

**"నవ నారసింహా నమో నమో**
**భవనాశితీర యహోబల నారసింహా"** **(1-453)**

భావం : నరసింహుడు తొమ్మిది క్షేత్రములందున్నాడు. వానిలో భవనాశీ నదీ తీరం ఒకటి. ఈ నది సంసార బంధాలను తొలగించును. ప్రతాపంతో, రౌద్రంతో, ఎగిసిపడే జ్వాలానరసింహుడు, రాక్షసులను చంపే వీరనృసింహుడు, కరుణాతిశయం గల యోగానంద నరసింహుడు, శాంతిమూర్తియైన కానుగ్రమాను నరసింహుడు, భీభత్సమైన మట్టెమళ్ల నరసింహుడు, శృంగార నరసింహుడు, సిరులను ఇచ్చే లక్ష్మీనారసింహుడు, భయమును కలిగించే వరాహ నరసింహుడు అయిన వాడు చెదరని మహిమను గల శ్రీ నారసింహుడు. అంటూ నరసింహుని వివిధ రూపాలను భవనాశి నదీప్రాశస్త్యాన్ని కీర్తిస్తూ అది ఇదీ అని లేదు. పది వేల రూపాలు గల నరసింహుడే శ్రీ వేంకటేశునిగా తిరుమలపై ఉన్నాడు అని చెప్తున్నాడు.

**తిరుమల నృసింహుడు :**

తిరుమల ఆలయంలోని తిరుమామణి మండపం స్తంభాలపై నరసింహస్వామి చిత్రాలు చెక్కబడి ఉన్నాయి. స్తంభం దక్షిణాన వరాహసింహుడు ఉత్తరాన సమర సింహుడు హిరణ్యకశిపునితో యుద్ధం చేయడం, దానికింద స్థంభోద్భవ నరసింహుడు ఉన్నారు. స్తంభాలపై ఉన్న నృసింహమూర్తులతో పాటు ప్రహ్లాద నరసింహుని కూడ అన్నమయ్య కీర్తించాడు.

**"నవరూప ప్రహ్లాద నరసింహా**
**అవిరళతేజ ప్రహ్లాద నరసింహా"** **(4-263)**

భావం : ఈ కీర్తనలో ప్రహ్లాదడు కొత్తదైన రూపం ధరించిన స్వామి బంటు. స్వామి కోపాన్ని పోగొట్టుటకు ఇతడే మందు. ఎవరూ చేరువకు రాలేని కోపాన్ని

స్వామి లక్ష్మీదేవి చూచి విడిచెను. స్వామి బుద్ధి మరలుటకు అమ్మవారే అంకుశము. దేవతలు మొరపెట్టుకోగా ఆ స్వామి కోపం తొలగి పోయింది. అంటూ కీర్తించాడు.

అంటే స్వామి దరికి ఎవరూ చేరలేనంత భయంకరంగా, క్రోదాగ్ని జ్వాలతో ఉన్న స్వామి వారిని శాంతింపచేయడం అనేది అమ్మవారి వల్ల కూడా కాలేదు. అమ్మవారిని చూసి సగం కోపం మాత్రమే పోయింది. కాని తన బంటు అయిన ప్రహ్లాదుని చూచిన తర్వాతనే స్వామివారు శాంతించారని చెప్తున్నాడు.

అన్నమయ్య సంకీర్తనలలో సుగ్రీవ నారసింహుని కీర్తనలు ఎక్కువగా ఉన్నాయి. సుగ్రీవ నారసింహుడు అంటే సుందరమైన నరసింహస్వామి అని అర్థం.

**"సుగ్రీవ నారసింహా సులభుడ వందరికి**
**అగ్రేసరుడ నీవు అవధారుదేవా ॥ (4-469)**

భావం : కొలువు తీర్చుటకు సిద్ధం కమ్మని అన్నమయ్య స్వామిని వేడు చున్నాడు. సనకాదులు 'జయ' అని పలుకుతున్నారు. దేవతలు, మునులు రెండు వైపుల వుండి కొనియాడుతున్నారు. గంగ మొ॥ నదులు స్వామివారి పాదాలను కడుగుతున్నాయి. ఋషులు పూజిస్తున్నారు. వాయువు గాలి విసురుతున్నాడు. వీరందరి మధ్య స్వామి కోటి మన్మథుల అందగాడుగా స్వామిని నారదాదులు కీర్తిస్తుంటే అనేక సిరులు కలిగిన తిరుమల మీద స్వామి ఉన్నాడు.

ముక్కోటి దేవతలు, మునులు, యోగులు అందరు కలసి స్వామి వారిని కీర్తించే విధానాన్ని చెపుతున్నాడు. గంగ వంటి పవిత్రమైన నదులు కూడ స్వామి పాదాల చెంత ఉన్నాయి. అంటే స్వామి పాదాలను ఆశ్రయిస్తే ఎటువంటి పాపాలు అయినా తొలగిపోతాయి అని చెబుతున్నాడు.

**"ఆదిమూర్తి యితడు ప్రహ్లాదవరదుడు**
**ఏదెస చూసిన తానె ఈతడిదె దేవుడు" (4-524)**

పై కీర్తనలో స్వామి లక్ష్మీనారసింహుడై, అభయ హస్తధారియై, ప్రతాపంతో వెలుగొందుతున్నాడు. అతడు ఆదిదేవుడైన శ్రీమన్నారాయణుడు. దాసులకు వరాలిచ్చే దేవుడు అని కీర్తిస్తున్నాడు.

**ఓగునూతుల ఔభళేశుడు :**

కడప జిల్లా చిన్నదాసరిపల్లె సమీపంలోని లోయలో వేయినూతల కోన ఉంది. ఇది కడపవాసులు వనభోజనాలకు వెళ్ళే స్థలం. పూర్వం ఈ ప్రాంతంలో నివసించిన వాల్మీకి మహర్షి ఈ లోయలో వేయి నూతులను తవ్వించి నరసింహస్వామిని ప్రతిష్ఠించాడని అక్కడి ప్రజలు చెబుతారు. వేయి నూతులు ఉండటం వల్ల వేనూతులకోన, ఓగునూతులకోన అనే పేర్లు జన వ్యవహారంలో ఏర్పడ్డాయి. అంతేకాని ఓగునూతుల కోన అని ప్రత్యేకంగా ఊరులేదు. ఇది కడపకు 1½ మైళ్ళ దూరంలో ఉంది.

**"ఇంతకంటె నెవ్వరికి నెచ్చరాదు కుందరాదు**
**వంతల దగ్గరై తాకవచ్చువటవయ్యా"** **(24-178)**

ఇది శృంగార సంకీర్తన లక్ష్మీదేవి స్వామి వారికి చేసిన సేవల ద్వారా, తనకు స్వామిపై గల అనురక్తిని చెపుతున్న విధానాన్ని అన్నమయ్య ఈ కీర్తనలో వినిపించాడు.

**"అంకెకాడ వోగునూతులౌభళేశ**
**పొంకమాయ నీసతి పొందు మఱవకుమీ" (25-134)**

స్వామీ అమ్మవారి పొందు, తను మాట్లాడిన మాటలు, మురిపెము, వినయము, మిక్కుటపు కౌగిలి, చూపు ఏదీ మరవకండి. అని అన్నమయ్య లక్ష్మి, నారసింహుల శృంగార చేష్టలను ఈ కీర్తనలో వివరించాడు.

**కనకగిరి నరసింహుడు :**

ఈ కనకగిరి ప్రాంతం ఎక్కడ ఉంది అనే దానిపై స్పష్టమైన అభిప్రాయాలు లేవు.

**"నంటున గనకగిరి నారసింహా**
**వెంట వెంట నాకుగానే వేడుక పడేవు"** **(25-159)**

పై కీర్తనలో అన్నమయ్య స్వామి వారి చిలిపి చేష్టలను గురించి చెప్పుతున్నాడు. వాటివల్ల అమ్మవారికి సంతోషం ఎంతో ఇబ్బంది కూడా అంతే ఉంటుంది. ఆ ఇబ్బందిని సున్నితంగా ఈ కీర్తనలో వ్యక్తం అయ్యేలా దీనిని అన్నమ్మయ్య రచించాడు.

**బొమ్మిరెడ్డిచర్ల నృసింహుడు :**

బొమ్మిరెడ్డిచర్ల గ్రామం కడప జిల్లాలోనే ఉండవచ్చు. కాని ఖచ్చితంగా తెలియరాలేదు. అన్నమయ్య ఎక్కువగా కడప జిల్లాలోని ఆలయాలనే సందర్శించడం వల్ల ఇది కూడ కడప జిల్లాలోనే ఉండవచ్చు.

**"కొమ్మలాల యిదెమంచి కొలువువేళ**
**చిమ్ముచు విన్నపాలెల్ల జేయరే"** **(7-449)**

అమ్మలారా ఇదే మంచి సమయం. స్వామివారు కోరిన కోర్కెలు తీర్చుటకు. కనుక మీ కోరికలు ఏమైన ఉంటే చెప్పండి. ఇపుడు స్వామివారు లక్ష్మీదేవిని తొడపై ఉంచుకొని సరసములాడు చున్నాడు. కాబట్టి ఈ సమయంలో స్వామి అత్యంత సంతోషంతో ప్రసన్నంగా ఉన్నాడు. మీరు ఏది అడిగినా తప్పక నెరవేరుస్తా దని అన్నమయ్య ఈ కీర్తనలో చెబుతున్నాడు.

**జిల్లావాండ్లపల్లె నృసింహుడు :**

కడప జిల్లా చిన్నమండెం మండలంలో జిల్లావాండ్లపల్లె కలదు. ప్రాచీన కాలంలో జిల్లా వాళ్ళు అనే వారు ఇక్కడ ఉండేవారట. వారి పేరుతోనే ఈ ఊరికి జిల్లావాండ్లపల్లె

అని పేరు ఏర్పడిందని అంటారు. ఇది కడపకు సుమారు 42 మైళ్ళ దూరంలో ఉంది. ఇక్కడే నృసింహాలయం ఉంది. అన్నమయ్య యిక్కడి నృసింహుని దర్శించి కీర్తించాడు. ఇక్కడి నృసింహుని మండెం నృసింహుడు అని కూడ అంటారు.

**"నగధర నందగోప నరసింహ వో**
**నగజవరద శ్రీనారసింహా"** **(1-259)**

నరసింహుని ద్వైత, అద్వైత, విశిష్టాద్వైత మతాల వారందరూ పూజిస్తారు. ఆ పూజించే విధానంలో తేడా ఉంటుంది. అద్వైతులు కంఠం క్రింది భాగాన్ని విష్ణురూపంగా, పైభాగాన్ని శివరూపంగా పేర్కొంటారు. అందుకే పై కీర్తనలో అన్నమయ్య -

**"నమక చమక హిత నారసింహవో**
**నముచి సూదన వంద్య నారసింహా"**

అని కీర్తించాడు. నందగోపనరసింహా, శ్రీనారసింహా, లక్ష్మీనారసింహా, వీరనరసింహా, పుండరీక నరసింహా, వేంకటనరసింహా, మండెము నరసింహా అంటూ వివిధ రూపాలలో ఉన్న నరసింహుని గురించి అన్నమయ్య కీర్తిస్తున్నాడు. ఎన్ని రూపాలు ఉన్నా అవి అన్నీ చివరకు కలిసేది వేంకటేశ్వరునిలోనే అని భావిస్తున్నాడు.

**ఓబులం శ్రీ నారసింహుడు :**

కడప జిల్లా రాజంపేట దగ్గర ఓబులం అనే గ్రామం ఉంది. ఇక్కడ వెలసిన నరసింహుడే ఓబులం శ్రీ నారసింహుడు.

**"కాని కాని మెచ్చుసేసేగానీ నేను**
**సోనల శ్రీ నరసింహా చూడుమీ నేను"** **(21-476)**

అంటూ స్వామీ నీవు ఓబుళం కొండలో ఉన్న సంగతిని, నీవు చేసే ఆగడాలు, అన్నీ నేను అమ్మవారితో చెబుతాను అంటూ స్వామి వారినే అన్నమయ్య హెచ్చరిస్తు న్నాడు. జాగ్రత్తగా ఉండు. లేకపోతే నీ గురించి నేను అమ్మవారికి చెబుతాను అంటున్నాడు.

**పెరియవరం నృసింహుడు :**

పెరియవరం కడప జిల్లా రాజంపేట గ్రామంలో ఉంది. పెరియవరం అంటే పెద్ద గ్రామం అని అర్థం. ఇక్కడ వెలసిన నరసింహస్వామిని ఓబులేసు అని కూడ అంటారు.

**"నిచ్చనిచ్చ జేకొను నివాళి**
**యిచ్చ బేరెవర మోబులేశ నివాళి"** **(22-129)**

**"ఔనయ్య మంచివాడ వప్పుడే యెంత సేసితి**
**పూనె ప్రేమ పేరెవరవోబుళేశనాకు"** **(22-145)**

అన్నమయ్య నృసింహస్వామి వారి శృంగార చేష్టలను గురించి పై కీర్తనలో వర్ణిస్తూ శ్రీ వేంకటేశుడే ఈ పెరియవరాన ఓబులేసుగా వెలసినాడని చెప్తున్నాడు.

**పెద్దముడియం నృసింహుడు :**

కడప జిల్లాలోని జమ్మలమడుగుకు 19 మైళ్ళ దూరంలో పెద్దముడియం మండలం ఉంది. ఇక్కడ వెలసిన స్వామి లక్ష్మీనరసింహుడు. ఈ స్వామిని 'జనమేజయుడు' ప్రతిష్ఠించాడని స్థానికులు చెప్తారు.

**"జయమాయె నీకు నాపె సరసములూ**
**నయగారి ముడియము నారసింహో" (11-139)**

ఇది శృంగార సంకీర్తన. ఇందులో అమ్మవారు స్వామి తొడపై కూర్చుని స్వామి యొక్క అనుగ్రహం కోసం ఎదురుచూస్తోంది. ఆమెను అనుగ్రహించి కాస్త మచ్చిక చేసుకో స్వామి అంటూ అన్నమయ్య ఈ కీర్తనలో చెబుతున్నాడు.

**కదిరి నృసింహుడు :**

అనంతపురం లోని కదిరి పట్టణంలో వెలసిన నృసింహుడే కదిరి లక్ష్మీ నృసింహుడు. అనంతపురం నుండి 89 కి.మీ. దూరంలో ఈ పట్టణం ఉంది. రాయలసీమలోని ప్రసిద్ధ వైష్ణవ దేవాలయాలలో ఇది కూడ ఒకటి. ఇక్కడి స్వామి అత్యంత మహిమ కలవాడు. అందుకే ఈ ఆలయానికి తమిళులు, కన్నడిగులు కూడ వస్తుంటారు. ఈ స్వామిని 'ఖాద్రి' నరసింహుడు అని కూడ అంటారు. ఇక్కడ స్వామి శాంతమూర్తిగా దర్శనమిస్తాడు. ఇక్కడ స్వామి పుట్ట నుండి ఆవిర్భవించాడని స్థానికుల కథనం.

ఆంధ్రదేశంలో నృసింహ క్షేత్రాలు చాలా ఉన్నా నవ నారసింహునిగా స్వామి ఇక్కడ దర్శనమిస్తాడు.

**"నవమూర్తులైనట్టి నరసింహము వీడె**
**నవమైన శ్రీ కదిరి నరసింహము" (4-182)**

అంటు అన్నమయ్య నవ నారసింహులను కీర్తించాడు.

**"కదిరి నృసింహుడు కంభమున వెడలె**
**విదితముగా సేవించరో మునులు" (4-32)**

కంభం నుండి క్షణకాలంలో బయటికి వచ్చిన నరసింహుడు మరుక్షణంలో హిరణ్యకశిపుని సంహరించాడు. ఆ సమయంలో స్వామి వారి ఉద్వేగాన్ని, ఉద్రేకాన్ని, ఆవేశాన్ని చెప్పడానికి పోతన నృసింహావతార ఘట్టాన్ని అద్భుతంగా రచించాడు. ఆ మహోగ్ర రూపాన్ని అన్నమయ్య పై కీర్తనలో చూపించారు.

"చెలగి కదిరిలోన శ్రీ వేంకటాద్రిమీద
మెలగేటి చక్కని లక్ష్మీనారసింహము" (4-182)

అన్నమయ్య నరసింహస్వామికి, శ్రీ వేంకటేశ్వరునికి అభేదాన్ని పాటిస్తూ పై కీర్తనను రచించాడు. లక్ష్మీనరసింహుడే శ్రీ వేంకటేశ్వరుడు అనే భావాన్ని చక్కగా చెప్పారు.

"తన దాసుని కొరకు ధరించె నీ రూపము
దిన దిన వేడుక కదిరి నారసింహుడు" (10-37)

రోజుకొక వేడుకతో స్వామి దర్శనమిస్తున్నాడు. హిరణ్యకశిపుని చర్మాన్ని వలచి శరీరంపై కప్పుకున్న స్వామి అతడు. పేగులను జంధ్యాల వలె ధరించి కంఠరక్తాన్ని వసంతంగా చల్లిన ప్రహ్లాద వరదుడు అలాంటి స్వామిని శరణంటే మిమ్మల్ని కూడ తప్పకుండా కాపాడుతాడు.

**సింహాచల నృసింహస్వామి :**

అన్నమయ్య కడప జిల్లాలోనే కాకుండా ఇతర ప్రాంతాలలోని నరసింహాలను కూడ దర్శించాడు. అలాగే సింహాచలం లోని నరసింహస్వామిని కూడ దర్శించి ఉండవచ్చు అని మనకు ఈ కీర్తన ద్వారా తెలుస్తుంది.

"చిత్తగించి పంచవటి సింహాద్రిలోన నుండి
వత్తుగా లోకము పావనము సేయగను" (1-278)

**విజయనగర నరసింహుడు :**

నాటి విజయనగరమే నేటి హంపి. ఈ ప్రాంతం కర్నాటక రాష్ట్రంలో ఉంది. ఈ ప్రాంతంలో భక్తుల కోసం 12 నృసింహాలయాలను నిర్మించారు. జానపద గాథలకు చెందిన చెంచులక్ష్మి, నరహరి మూర్తుల విగ్రహాలు కూడ ఉన్నాయి. విజయనగరంలోని శిథిలాలయాల్లో "హజారా రామాలయం" ఒకటి. ఇక్కడ సుగ్రీవ నరసింహుని విగ్రహం ఉంది. అన్నమయ్య ఈ సుగ్రీవ నరసింహుని ఇలా కీర్తించారు.

"సులభుడై వున్నాడు సుగ్రీవ నారసింహుడు
నెలకొన్న దాసులకు నిధానము వీడె" (4-512)

తుంగభద్రా నదీ తీరంపై గల ఈ నరసింహుడు భక్త సులభుడు. కోరిన వరాలిచ్చే వాడు.

"సులభుడీతడిదివో సుగ్రీవ నారసింహుడు
చెలగి మొక్కులు మెక్కి సేవించరో" (4-275)

నరసింహుని యొక్క రూపాన్ని వర్ణిస్తూ అతని మహిమలను గురించి చెబుతున్నాడు. 'దేవతలనే రక్షించేవాడు' అంటే ఇక మీలాంటి సామాన్యులను రక్షించకుండా ఉంటాడా? తప్పకుండా రక్షిస్తాడు. తుంగభద్ర దగ్గరి మంది వచ్చి ఈ వేంకటాద్రిని ఏలుచు చున్నాడు. ఇందులో తుంగభద్ర నది గురించి కూడ చెప్పాడు.

**భువనేశ్వర నృసింహుడు :**

ఒరిస్సా రాష్ట్రంలోని భువనేశ్వర్‌లో లింగరాజ్ ఆలయం ఉంది. ఇక్కడ దాదాపు నూరుపైగా గుళ్ళు ఉన్నాయి. అందులో నృసింహాలయం ఒకటి. తాళ్ళపాక అన్నమాచార్యులు క్రింది చరణంలో భువనేశ్వరంలో ఉన్న నృసింహుని మనుజ కేసరిగా కీర్తించాడు.

**"పువ్వులతోటలనీడ భువనేశ్వరములోన**
**జవ్వనపు మనజకేసరి వీడె" (4-512)**

**నరసింహావతార వర్ణన :**

అన్నమయ్య నృసింహావతారాన్ని గూర్చి రెండు సుదీర్ఘమైన కీర్తనలలో వర్ణించాడు.

**"శరణని బ్రదకరో జనులాల**
**గమమెరసి నిదె కనక సింహము"**

పై కీర్తనలో ప్రహ్లాదుడు శ్రీహరిని ధ్యానిస్తూ హిరణ్యకశిపునికి హరి మహిమలు గురించి చెప్పడం, అదివిని హిరణ్యకశిపుడు ప్రహ్లాదుని నానారకాలుగా హింసించడం, చివరికి నృసింహుడు స్తంభం నుండి వచ్చి హిరణ్యకశిపుని సంహరించడం, ప్రహ్లాదుడు నరసింహుని శాంతింప చేయడం ఇలా మొత్తం నృసింహావతార వృత్తాంతాన్ని మొత్తం 11 చరణాలలో చెప్పారు. ప్రతి చరణాంతంలోనూ విజయసింహం, వీరసింహ, విమలసింహం, భయవసింహం, ఉగ్రసింహం, ధీరసింహం, ఘోరసింహం, విష్ణుసింహం అనే సంబోధనలతో కీర్తిస్తూ మురిసిపోయాడు అన్నమయ్య. ఇంతటి ప్రతాపం గల నరసింహుని శరణుజొచ్చి వేడుకోండి అని ప్రజలను ఉద్దేశించి చెప్పాడు.

**"వినరయ్య నరసింహా విజయము జనులాల**
**అనిశము సంపదలు నాయువు నొసగును"(4-513)**

పై కీర్తనలో కూడ 11 చరణాలతో పూర్తి నరసింహావతార ఘట్టాన్ని వర్ణించాడు. దీనిని ప్రజలంతా విని సంపదలను, ఆయుష్షుని పొందమని చెబుతున్నాడు.

**ప్రహ్లాద వరదుడు :**

విష్ణుమూర్తి నరసింహావతారం ఎత్తినదే ప్రహ్లాదుని కాపాడటం కోసం. కనుకనే నరసింహరూపంలో హిరణ్యకశిపుని సంహారం తర్వాత దేవతలు, మునులు, ఋషులు అందరూ దగ్గరకు వెళ్ళడానికే భయపడు సమయంలో ప్రహ్లాదుడే ఆయనను శాంతింప చేశాడు. కనుకనే ఆయనను ప్రహ్లాద వరదుడు అంటారు.

**"ఔనయ్య జాణడవు ప్రహ్లాదవరద**
**అసలు వెట్టకుము ప్రహ్లాదవరద" (4-497)**

స్వామి తన వద్దకు రమ్మని ఆజ్ఞల నీయకుండా, మనలను తన వద్దకు చేర్చుకుంటున్నాడు. లక్ష్మీదేవితో ఉల్లాసంగా నవ్వుచు తనపట్ల ఆమెకు వలపును

కలిగించుచున్నాడు. అక్షతలుంచిన చేతితోనే ఆమె కొంగుపట్టుకుని ప్రేమతో తన తొడపై కూర్చుండ బెట్టుకున్నాడు అంటూ స్వామి యొక్క నేర్పరితనాన్ని అన్నమయ్య చెపుతున్నాడు.

**"ఆదిమూర్తి ఈతడు ప్రహ్లాదవరదుడు**
**ఏదెస జూసినా తానె ఈతడిదె దేవుడు" (4-524)**

భావం : నరసింహుడు మొదటి పురుషుడు. ప్రహ్లాదునికి వరాలిచ్చిన వాడు. నవ్వుమొహంతో తొడపై లక్ష్మీదేవిని ఉంచి సరసమాడుచున్నాడు. పూలదండలు, శంకచక్రములు ధరించి, రెండు కోరలు కలిగి నడుముపై అభయ హస్తాలను ఎత్తి పట్టుకొని ప్రతాపంతో వెలుగుతున్నాడు. దేవతలు, నారదాది మునులు గానం చేస్తుండగా శ్రీ వేంకటాద్రి మీదను, అహోబలము నందును ఆ స్వామియే ఉండి వరాలిస్తున్నాడు.

నరసింహ స్వామి యొక్క రూపాన్ని మనోహరంగా ఈ కీర్తనలో అన్నమయ్య వర్ణించాడు.

**"జయ జయ నృసింహ సర్వేశ**
**భయహర వీర ప్రహ్లాదవరద" (2-289)**

ప్రహ్లాదుని కాపాడిన వాడు, అత్యంత పరాక్రమం గలవాడు. దుష్ట రాక్షసుల సంహరించేవాడు అయిన నృసింహునికి జయము. ఇతని శరనుజొచ్చిన మనకు ఎటువంటి భయాలు ఉండవు అంటూ నృసింహునికి జయము పలుకుతున్నాడు.

**లక్ష్మీ నారసింహుడు :**

లక్ష్మీ సమేతమైన నరసింహమూర్తిని గురించి అన్నమయ్య -

**"ఆరగించి కూచున్నా దల్లవాడె**
**చేరువనే చూడరే లక్ష్మీనారసింహుడు" (26-181)**

లక్ష్మీసమేతుడైన నరసింహుడు అమ్మను తన తొడపై కూర్చుండ బెట్టుకొని సభలో కొలువై వున్న విధానాన్ని అన్నమయ్య ఈ కీర్తనలో వర్ణించాడు. ఉగ్రరూపుడైన నరసింహుడు ప్రసన్నమైన రూపంలో ఇక్కడ దర్శనమిస్తాడు.

భయంకరమైన ఉగ్రరూపంలో స్తంభం నుండి ఆవిర్భవించిన నరసింహుని అన్నమయ్య శబ్దాలంకారయుతంగా వర్ణించాడు.

**"ఘోర విదారణ నారసింహా నీ**
**వీ రూపముతో ఎట్లుండితివో" (1-68)**

భావం : భయంకరంగా దానవులను చీల్చు నరసింహుడీ రూపంలో ఎట్లుండెనో కదా! కోపంతో నరసింహుడు శ్వాస విడువగా కొండలు పొడిపొడియై ఆ దుమ్ము

ఆకాశానికెగెసెను. ఆయన చేసే తీవ్రమైన ధ్వనులకు పిడుగులు పడినవి. స్వామి కనుల నుండి ప్రళయాగ్ని జ్వాలలు ఎగిసి పడుతున్నవి. కంఠం నుండి గుటగుట ధ్వనులు వస్తుండగా, దంతములను గిటగిట కొరుకుతున్నాడు. పెదాలు, దవడలు కోపంతో వణుకుతున్నవి. నోటి నుండి లాలాజలం నీటి తీగవలె ఊరుచున్నది. హిరణ్యకశిపుని బలమును అణచిన వాడై స్వామి మెఱుస్తున్నాడు.

స్వామి యొక్క రౌద్రరూపాన్ని మన కనులకు కట్టినట్లు చక్కగా వర్ణించాడు. ఇందులో వాడిన గుటగుట, గటగట, పొడిపొడి వంటి పదాల వల్ల ఆ స్వామి రూపం మన కనులముందు కనిపిస్తుంది.

**"జయము జయము ఇక జనులాల**
**భయములు వాపెను బ్రతికితిమిపుడు"** **(4-521)**

నరసింహస్వామి హిరణ్యకశిపుని వధించిన నరసింహ స్వామి వారికి జయము. ప్రజలంతా ఇక భయము వదలి ప్రశాంతంగా జీవించండి అంటూ స్వామి వారికి జయమును పలుకుతున్నాడు.

**"చిత్తజ గరుడవో శ్రీనారసింహ**
**బత్తిసే సేరు మునులు పరికించవయ్యా"** **(4-29)**

దేవతల జయజయ ధ్వానాల మధ్య లక్ష్మీదేవిని తన తొడపై కూర్చుండ బెట్టుకొన్నాడు. దేవతలు, మునులు, గంధర్వుల అప్సరసలు అందరూ స్వామివారి శరణుకోరారు. జయజయ ధ్వానాలతో శాంతించిన స్వామి జనుల భయములను తొలగించి ఇహపరాలలో శుభమును చేకూర్చాడు.

**"చేరి మొక్కరో నరులు శ్రీమంతుడీతడు**
**కోరి వరములిచ్చు కొండ వంటి సింహము"** **(15-132)**

ప్రజలంతా నరసింహుని చేరి మొక్కండి. ఆయన మీరు కోరిన వరాలిచ్చే వాడు. అని అన్నమయ్య స్వామివారిని పరిపరి విధాలుగా సుమారు 140 కీర్తనలలో కీర్తించాడు.

**ముగింపు :**

నరసింహ రూపం అంటేనే అటు సింహం ఇటు నరుడు కలిపిన విలక్షణమైన రూపం. అటు రౌద్రం ఇటు శాంతం రెండూ కలపిన స్వభావంతో ఉన్న స్వామిని అన్నమయ్య తనివితీరా కీర్తించి శాంతింప చేశాడు.

యాంత్రికమైన నేటి జీవనంలో ప్రతిది వెలకట్టుకొని జీవిస్తున్నారు. కాని ఒక్క వేంకటేశ్వరుని నామమే వెలకట్టలేనిది. అన్నమయ్య తన కీర్తనల ద్వారా ఈ విషయాన్ని సర్వమానవాళికి స్పష్టం చేశాడు.

**ఆధార గ్రంథాలు**


1. అన్నమయ్య సంకీర్తనా సౌరభం - *ఆర్. శోభాదేవి*
2. అన్నమాచార్యులు ప్రముఖ వాగ్గేయకారులు - *ఎస్. గంగప్ప*
3. అన్నమాచార్యులు భారతీయ వాగ్గేయకారులు - *కె. కుసుమారెడ్డి*
4. అన్నమయ్య పదామృత వర్షిణి - *జి.బి. శంకరరావు*
5. అన్నమయ్య నృసింహ సంకీర్తనం - *శ్రీ గరిమెళ్ళ బాలకృష్ణప్రసాద్*
6. అన్నమయ్య బహుముఖ ప్రాభవం - *ఆచార్య చిట్రాజు గోవిందరాజు*
7. కీర్తనాకిరణం - *పొన్నా లీలావతి*
8. శ్రీ తాళ్ళపాక అన్నమాచార్యుల శృంగార సంకీర్తనలు-మధురభక్తి - *అంగలూరు శ్రీరంగాచారి*
9. పదసాహిత్య వైభవం - *ఆచార్య గల్లా చలపతి*
10. శ్రీ అన్నమయ్య సంకీర్తన సాగరం - *గురుకొండవీటి జ్యోతిర్మయి*
11. తాళ్ళపాక కవుల సాహితీ కిరణాలు - *డా॥ జక్కంపూడి మునిరత్నం.*


***

# అన్నమయ్య సంకీర్తనల్లో అభ్యుదయ భావాలు


**డా॥ మన్యం నరసింహులు**

**తెలుగు అధ్యాపకులు**

**ప్రభుత్వ డిగ్రీ కళాశాల**

**నగరి**


తన జీవితాన్నే హరిమయం చేసుకొన్న అన్నమయ్య తన సంకీర్తనల ద్వారా భక్తిభావాన్ని, ఆధ్యాత్మికతను తెలుగునేలపై వెదజల్లాడు. కులమత భేదాలను నిరసించి సంఘ సంస్కర్తగా కులంకన్నా భక్తి గొప్పదని చాటిన అభ్యుదయవాది. మనిషికీ సమాజానికీ అవినాభావసంబంధం ఉంది. సమాజాన్ని వేధించే సమస్యలు ఇప్పుడు ఉన్నట్టే ప్రతికాలంలో ఉన్నాయి. కొన్ని సమస్యలు వ్యక్తిగత-కృషితో, సమిష్టి కృషితో పరిష్కరింపబడినా మరికొన్ని దురాచారాల పట్ల ప్రజలను చైతన్య పరచే బాధ్యతలను కొందరు మహానుభావులు స్వీకరించిన విషయానికి చరిత్రే సాక్ష్యం. ఎంతటి భక్త్యావేశపరుడైనా, వాగ్గేయకారుడైనా సామాజికాంశాలను స్పృశించకుండా ఉండటం కవియైన వానికి సాధ్యం కాదు. ఏ కవి మీదైనా సామాజిక ప్రభావం లేకుండా

ఉండదు. అన్నమయ్య చాలా కీర్తనల్లో వెంకటవిభుడు, అలవేలమంగమ్మలు నామమాత్రంగా కనిపించి, మిగిలిన భాగం సమాజ చిత్రణే కుప్పలుగా పోసినట్లు కనిపిస్తుంది. వైష్ణవాన్ని మనసా వాచా కర్మణా నమ్ముతూనే ఉదార భావాలను, సంస్కరణ భావాలను వెదజల్లిన చరితార్థుడు అన్నమయ్య.

అభివృద్ధి, అభ్యుదయం అనేవి వాస్తవిక విషయాలు. ఈ దృక్పథం ఆవిర్భవించటానికి అప్పటి రాజకీయ, సాంఘిక పరిస్థితులు మూలమై ఉంటాయి. మానవమేధస్సు అనుక్షణం పరివర్తన శీలంగా ఉంటుంది. ఈనాడు మనం అనుకుంటున్న అభ్యుదయ సాహిత్యం, అభ్యుదయ భావజాలం ఆకస్మికంగా పుట్టినది కాదు. ఒక్కోసారి నిన్నటి అభ్యుదయ భావజాలం నేటికి కాలదోషం పట్టి పాతదై పోవచ్చు. అయితే ఏ రకమైన అభ్యుదయభావజాలమైనా ఒక స్థాయి నుంచి మరొక స్థాయికి జరిగే మార్పు కోసం, సామాజికోన్నతి కోసం ఒక వ్యక్తి ద్వారా, వ్యవస్థ ద్వారా ఉద్భవించవచ్చు.

**భాషాభ్యుదయం :**

తెలుగులో మొట్టమొదటి వ్యవహార భాషావాది అన్నమయ్య. తనకాలంలో ప్రాచుర్యంలో ఉన్న అనేక పలుకుబళ్ళు, జాతీయాలతో పాటు జానపదరీతులను తన కీర్తనల్లోకి తీసుకువచ్చి తన దేశీతత్వాన్ని చాటుకోవడమే ఒక గొప్ప అభ్యుదయం. అన్నమయ్య భాష త్రివేణీ సంగమంలాగా సంస్కృతం, శిష్టవ్యవహారం, పల్లీయుల వ్యవహారం కలగలిసే ఉంటాయి. మార్గ పద్ధతిలో సంస్కృత భూయిష్టమైన తెలుగు భాష నన్నయ నుండి ప్రబలంగా చెలామణీ అవుతున్న సందర్భంలో జానపదుల భాషలో కీర్తనలు వెలయించటం అన్నమయ్యకే చెల్లింది. తనకాలంనాటి జానపదగేయ ఫణతుల్ని ఆసరాగా చేసుకొని మాండలిక భాషకు ఆస్కారం కలిగించిన సంస్కారి, అభ్యుదయవాది అన్నమయ్య. కొత్త కొత్త భావాలలో గోవిందుని కొలవటమే కాదు, కొత్త కొత్త పదాలతో కూడా పూజించాడు. వందలాది సంస్కృత సమాసాలకు తెలుగులో వివరణాత్మక పదాలను సృష్టించాడు. 'దశకంఠుడు' అనడానికి 'పది శిరసుల పెద్ద బొమ్మ రాకాసుడు' అంటాడు. 'శూర్పణఖ'ను 'చుప్పనాతి' అంటాడు.

అన్నమయ్య భాష ఏ వ్యాకరణాలకు లొంగదు. నిజానికి అన్నమయ్య మంచి పండితులు. సంస్కృత అధ్యయనం చేసినవాడు, సంస్కృతంలో అనేక కీర్తనలు కూడా రాసినవారు. అనేక పదాది యకారరూపాలు, వకార రూపాలు అన్నమయ్య కీర్తనల్లో విరివిగా కన్పిస్తాయి. గ్రాంధిక భాషకు విరుద్ధమైన ప్రయోగాలు అన్నమయ్య విరివిగా వాడాడు. తాను రాసే ప్రతికీర్తనా పల్లీయుల ఎదల్లో నిలవడానికి వారి భాషే వాడాడు తప్ప అన్నమయ్యకు తెలియక కాదు. జానపదుల గేయంలోని "పదం" అన్నమయ్య రాకతో అందుకోలేనంత ఎత్తుకు చేరింది.

**సమతావాదము :**

**సమబుద్ధే యిందరికి - సర్వవేద సారము**
**సముడిందరికి హరి - సాధనమో యయ్యా!**

ఎల్లవారికీ సర్వ ప్రాణులయెడ సమబుద్ధి కలుగుటయే అన్నివేదాల సారము. పుడమిలోని జంతురాసులన్నింటికీ పుట్టుకలు, మరణాలు ఒకే మాదిరి నున్నవి. అట్లే ఆహారము, నిద్ర, కామ సుఖములు కూడా అన్నింటికీ సమానములే. ఇంతకంటే ఈ లోకమున ఎవ్వరేమి ఎక్కువగా మూటగట్టుచున్నారు. ఈ అంశాలను గుర్తించని అజ్ఞానులు మాత్రమే జీవులలో ఎక్కువ తక్కువలను పరిగణిస్తారు. సమస్త వేదములు చెప్పిన సమబుద్ధిని కలిగి ఉండవలెనని అన్నమయ్య ప్రబోధించినాడు.

**హీనాధికములింక - నేద నున్నవో కాని**
**ఆనిని దాస్యము పొత్తు - అందరికీ నొకటే**

తా॥ 'భగవంతుని సేవతోడి సంబంధము భక్తులకెల్ల వారికి ఒకే విధముగా నున్నది. అందెట్టి హెచ్చు తగ్గులూ లేవు. (రేకు - 308).

**కులభేద నిరసన :**

ఆధునిక కాలంలో అభ్యుదయ వాదం ప్రవేశించి కావ్యవస్తువులో సామాన్య మానవునికీ, అతని కష్టసుఖాలకూ, మానవుని విముక్తికీ మానవుడు అంతహీనస్థితిలో ఉండటానికి గల కారణాలకూ ప్రాధాన్యం వచ్చింది. కావ్యనాయకత్వం. రాజులనుంచి జారిపోయి సామాన్య ప్రజలకు సంక్రమించింది. ఇది ప్రాచీన సాహిత్యంలోని విలువలను ప్రశ్నించింది.

మానవులందరూ సమానమేనని, తామే కల్పించుకున్న కులమతాలతో బలవంతులు బలహీనులను హింసించడం తగదంటాడు అన్నమయ్య.

అన్నమయ్య కీర్తనలు భక్తి ప్రబోధకాలుగా కన్పిస్తున్నప్పటికీ సమాజంలోని అంతరాలను తొలగించాలనే తపన, సమసమాజ స్థాపనపై ఆసక్తి కనిపిస్తాయి.

**బ్రహ్మమొక్కటే పర - బ్రహ్మ మొకటే పర**
**బ్రహ్మమొకటే పర - బ్రహ్మ మొకటే**

ఈ కీర్తనలో అంతయు బ్రహ్మమయమైన ఈ సృష్టిలో తెగలు తెగలుగా విడదీసి చూపుట, హెచ్చు తగ్గులు చేసి ప్రవర్తించుట తగదని అన్నమయ్య భావన.

**నిండార రాజు నిద్రించు - నిద్రయునొకటే**
**అండనే బంటు నిద్ర - అదియు నొకటే**

ఒక భూపాలుడు హింసతూలికా తల్పముపై నిద్రించును. ఆ చెంతనే అతని భటుడు కటికనేలపై నిద్రించును. శయనములలో భేదమున్నను వారిరువురు నిండుగా నిద్రించు నిద్రలో మాత్రమెట్టి వ్యత్యాసము లేదు.

వేద శాస్త్ర పారంగతుడైన విప్రుడొకడు, చెప్పులు కుట్టి జీవించే చెండాలుడింకొకడు. విద్యా వృత్తులయందు వారిరువురకు వ్యత్యాసమున్నప్పటికీ నిలుచుటకు ఆధారమైన నేల మాత్రమొక్కటే.

**కడగి యేనుగు మీద - గాయు యెండొకటే**
**పుడమి శునకము మీద - బొలయునెండొకటే**

జంతుకోటిలో పెద్దదైన ఏనుగుమీదను, నీచమైన కుక్కపైనను ప్రసరించు సూర్యుని వెలుగులో ఎట్టి వ్యత్యాసములేదు.

**అప్పులేని సంసార - మైన పాటే చాలు**
**తప్పులేని జీతమొక్క - తారమైన జాలు**

అప్పు చేసి ఆదంబరముగా సంసారమును జరుపుట కంటే అప్పులేని కాపురము జరిగినంత వరకే చాలు అంటూనే ధూర్తురాలైన కులస్త్రీ కంటే గుణవతియైన వనిత తక్కువ జాతిదైనా మేలు అని అన్నమయ్య భావన.

**విజాతిలన్నియు వృథావృథా**
**అజామిళాదుల - కదియే జాతి**

- విభిన్నములైన జాతులన్నియు వ్యర్థములు. వాటి వలన ప్రయోజనము ఇసుమంతయు లేదు. జాతులలో గల భేదములన్నియు నశ్వరమైన శరీరమునకు మాత్రమే సంబంధించిన స్వభావములు. శరీరముతోడనే అవియు నశించును. దేహములు ఎలాగున అశాశ్వతమో జాతి భేదములు గూడా అలాగే అశాశ్వతములు. కాబట్టి అవి వ్యర్థములు.

జాతి భేద దృష్టి గల భావము అనేకములైన దురహంకారములకు మూలమగుచున్నది.

4. అన్నమయ్య కేవలం భక్తి మార్గాన్నే బోధించలేదు. సమాజంలో ధర్మాన్ని, మానవతని స్థాపించటానికి, సాంఘిక చైతన్యం కలిగించటానికి కూడా కీర్తనలు రచించాడు.

**నీవు సర్వసముడవు - నీవు దేవ దేవుడవు**
**ఈవల గుణదోషా వెంచనిక నేలా?**

వెన్నెల పూలపై కాయుచున్నది. అట్లే ముండ్లపై కాయుచున్నది. ముండ్లపై ప్రసరించి నందువలన వెన్నెలకేమైనా లోటు వచ్చినదా.

పవిత్రమైన వాయువు గోవుపై విసరుచున్నది. అట్లే కుక్కపై గూడా వేస్తున్నది. కుక్కమీద ప్రసరించి నందువలన గాలికేమైనా పాపమంటినదా.

ఎండ ఉత్తమ కులస్తుని యింట కాయుచున్నది. అదే యెండ కులహీనుని యింట కూడా కాయుచున్నది. అందువలన ఎండకేమైనా హీనత్వము కలిగినదా......

17

అంటూ హెచ్చు తగ్గుల భేదము, కుల భేదముల జోలికి పోరాదని అన్నమయ్య సామ్యవాద భావ జాలాన్ని తెలియచేస్తాడు. భగవంతునికి సర్వసమభావమున్నట్లే జీవునికి కూడా సర్వజీవులయెడ సమభావము వుండాలనేది అన్నమయ్య తత్త్వము.

**పరపీడనం పాపం :**

అన్నమయ్య తాను ఎన్నో శాస్త్రములు చదివి పరపీడనం చేయడం మహాపాపమని, పరోపకారం పుణ్యమని, శాంతం కన్నా స్వధర్మం లేదని అంటాడు.

**కంటినిదే యర్థము ఘనశాస్త్రములు దవ్వి**
**నంటున నిందుకంటెను నాణెమెందూలేదు** **(1-443)**

**అలాగే....**

**కదుపెంత తాగుడుచు కుదుపెంత దీనికై**
**పదని పాట్ల నెల్ల బడిపొరలనేలా ॥** **(1-302)**

అంటూ పరులను బాధపెట్టే వారి బ్రతుకును ఏవగించుకున్నాడు అన్నమయ్య. కులమత భేదాలను నిరసించి సంఘ సంస్కర్తగా కులం కన్నా భక్తి గొప్పదని చాటిన అభ్యుదయవాది అన్నమయ్య.

***

# అన్నమయ్య సంకీర్తనల్లో సామాజిక స్త్రీల చిత్రణ

**ఆచార్య యన్. మునిరత్నమ్మ**
**తెలుగు అధ్యయనశాఖాధిపతి**
**శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం**
**తిరుపతి**

సమాజ శబ్దానికి సభ, ఏనుగు, మనుష్యుల గుంపు అనే అర్థాలున్నాయి. సమాజానికి సంబంధించినది సామాజికం. ఈ సామాజిక శబ్ధం, ఆధునిక భావజాల ప్రకటనతో విరివిగా విన్పిస్తుంది. ఇంతేగాక సామాజిక స్పృహ, సామాజిక న్యాయం, సామాజిక వ్యవస్థ లాంటివి ప్రధానంగా వామపక్ష భావ వ్యక్తీకరణలో వినబడుతున్నాయి.

ప్రాచీనులకు సమాజం తెలిసినా, వారెక్కువగా 'లోక' శబ్దానికి ప్రాధాన్య మిచ్చారు. ప్రాచీనులు 'లోకాః సమస్తాః' అని భావించారు. కర్షక, కార్మిక వర్గమని పరిమితం చేయక 'సర్వజనానాం' అన్నారు.

సమాజానికి అనేక లక్షణాలున్నాయి. మార్పు సమాజానికున్న ప్రత్యేక లక్షణం. ఆలాగే సామాజిక వర్గీకరణ కూడా. వీటివల్ల పరస్పర కలహాలు, అంతర్యుద్ధాలు,

రావణ కాష్ఠంలా అగ్నిపర్వతాల్లా కాలుతుంటాయి. పెట్టుబడి సమాజం విలాసంగా, వినోదంగా చూసే క్రీడల్లో వర్గీకరణ ఒకటి. సమాజంలోని వర్గీకరణను అనేక రకాలుగా పరిశీలించవచ్చు. స్త్రీ, పురుష వర్గీకరణ, కులజాతి వర్గీకరణ, సంపన్న దారిద్ర్య వర్గీకరణ, భూస్వామ్య భూస్వామ్యేతర వర్గీకరణ లాంటివి. సంస్కృతి సాగే నది లాంటిది. ఏ సంస్కృతిలో అయినా ఇవి తప్పవు. మతవిశ్వాసాలు, ప్రచారాల్లో కూడా ఈ వర్గీకరణకు ప్రాధాన్యముంది.

బౌద్ధం స్త్రీని ద్వేషించింది. సుమారం చేసింది. సిద్ధ సంప్రదాయం కూడా అంతే. దానివల్ల సమాజానికి నష్టమే కల్గింది. కానీ వీరశైవం స్త్రీని ఆదరించింది. ప్రచారంలో భాగం చేసింది. శివేతర భక్తిని అగ్రవర్ణాల పట్ల ద్వేషాన్ని మోతాదు కంటే మించి ప్రచారం చేయడంతో క్రమంగా కుంటి నడకలు వేసింది. ఈ దశలోనే వైష్ణవం ఆ లోపాన్ని సరిదిద్ది సరళీకరణ విధానంలో ప్రాచుర్యం పొందింది. అదే సందర్భంలో కులమతాదులను నిరసిస్తూ ఆయా కులాలలో వైష్ణవాన్ని, వైష్ణవవర్గాన్ని తయారు చేసింది. తెలివిని గుర్తిస్తూ భక్తులకు ఆలయం కట్టింది. కానీ కులాలను మాత్రం చేర్చుకొన్నట్టే చేర్చుకొని ఆ దూరాన్ని కాపాడుకొంది.

అన్నమయ్య సంకీర్తనల్లో సామాజిక చింత ఉంది. ఇతర వాగ్గేయకారులలో అనుభూతి ప్రధానమయితే, అన్నమయ్యలో ప్రవచనం, ప్రచారం రెండూ నర్మదా తపతుల్లాగా సాగిపోతాయి. వైష్ణవంలో అందర్ని భాగస్వామ్యం చేయడం ప్రధానోద్దేశం. అందువల్ల ముందు ఆయా కులాలను, వృత్తికారులను గౌరవిస్తూ భగవంతుడు ఆ కులంవాడు అనే 'జిలుగు' కనిపించేటట్లు చేయడం అన్నమయ్య కీర్తనల్లో ప్రత్యేకత. 'పొడవైన శేషగిరి బోయనాయుడు' - వంటి కీర్తనలు ఇందుకు సాక్ష్యం. దేవుడు కేవలం నాయుడు కాడు. కానీ నాయుడు దేవతాంశ అని అగ్రకులాల వారితో చెప్పించడ మన్నమాట.

ప్రాచీన కాలంనుండి ఇప్పటివరకు కుటుంబంలోనూ, సమాజంలోనూ స్త్రీకి చాలామంది నీతిబోధలు చేస్తుంటారు. ఒకవైపు "యత్రనార్యస్తు పూజ్యంతే రమంతే తత్రదేవతా" - అని స్త్రీకి అత్యున్నత స్థానం ఇస్తూనే, చేష్టలలో మాత్రం కొంతమంది గౌరవం ప్రదర్శించలేక పోతున్నారు. సంఘ సంస్కర్తలైన కందుకూరి, గురజాడ లాంటి వాళ్ళ కృషి ఫలితంగా నేటి స్త్రీ విద్యావంతురాలై అనేకరకాలైన కుటుంబ, సామాజిక పరమైన అడ్డంకుల ముళ్ళపొదల్ని 'ధైర్యం' అనే ఖడ్గంతో ఛేదించుకొంటూ పురుషులతో సమానంగానూ, అంతకంటే అధికంగానూ కళ, వైద్య, విద్యారంగాల్లో ముందంజ వేస్తున్నారు. అయినా భారతీయ స్త్రీ కట్టు, బొట్టు, జుట్టు మొదలైన వేషధారణ విధానంలోనూ, సంభాషణా శైలిలోనూ, ప్రవర్తనా తీరుతెన్నుల్లోనూ, నీతి నియమాల్లోనూ, సంప్రదాయబద్ధమైన ఒక విలక్షణమైన సంస్కృతిని కల్గివుంది. ఇదే భారతీయ స్త్రీకి, పాశ్చాత్య స్త్రీకి గల తారతమ్యం.

అన్నమయ్యకు స్త్రీల పట్ల గౌరవం వుంది. పైగా గ్రామీణ సంస్కృతిలో పెరిగినవాడు కావడం, వ్యవసాయం వొదులుకొని అగ్రకుల కుటుంబంలోనివాడు కావడం, వ్యవసాయంలో అందరి సహకారం అవసరమని స్పష్టంగా తెలిసినవాడు కావడం వల్ల శ్రమశక్తిని ఆదరిస్తూ వారిని వైష్ణవంలో భాగస్వామ్యం చేశాడు.

అన్నమయ్య 15 శతాబ్దంలో జన్మించినా అన్ని విషయాల్లోనూ సహేతుకమైన దృష్టిని కనబరచి, నేటి 20 శతాబ్దిలోను స్త్రీ పురుషు లందరికి తలమానిక మయ్యారు. అన్నమయ్యకు స్త్రీ పురుషులిద్దరూ సమానమే. అందుకే -

**"పొలతులు జీవులే, పురుషులు జీవులే"** - అన్నాడు.

సమాజంలో వైశ్యులకు అనాదినుంచి ప్రాధాన్యముంది. వీరిలో చిఱుతొండ నంబి లాంటి శైవులున్నారు. క్రమంగా వీరు వైష్ణవులయ్యారు. వీరిలో వ్యాపారం నడిపేవారు స్త్రీలు కావడం విశేషం. ఆడవారిని అన్నమయ్య వర్ణిస్తూ 'అంగడికెత్తిన దివ్వెలు' అన్నారు.

పూర్వకాలంలో భార్య భర్తకు సేవలు చేయాలనీ, చదువుకుని వూళ్ళేల నక్కరలేదని మన పెద్దలన్నారు. కాని అన్నమయ్య స్త్రీ రాజ్యమేలితే మంచిదనీ, ఆమె ఏదైనా పొరపాటుగా ప్రవర్తించినా అతను గుట్టుగా వుండడం మంచిదని సమాజానికి హితోక్తి నందించాడు. మధురభక్తి సిద్ధాంతం ప్రకారం భగవంతుడొక్కడే పురుషుడు. జీవరాసులందరూ స్త్రీలే. అన్నమయ్య పురుషులపై అనేక విసుర్లు విసిరాడు. భార్య ఉన్నప్పటికీ పురుషుడు అనేక మగువలతో కాలం గడుపుతాడనే విషయం అన్నమయ్య సంకీర్తనల్లో కన్పిస్తుంది.

**"మగవాడెంత చక్కని మగువను కలిగినను**
**మిగుల వేరొకతెతో మేలమాడును"**

అని పురుషాధిక్య సమాజాన్ని విమర్శించాడు. అన్నమయ్య కీర్తనల్లో కన్పించే సామాజిక స్త్రీలను కుటుంబంలోని స్త్రీలు, భర్తను సమర్థించిన స్త్రీలు, భర్తపై అంచెల విశ్వాసం గల స్త్రీలు, భర్త మగసిరిని మెచ్చుకొనే స్త్రీలు, భర్తను నిందించి అలగకుండా సరసాలాడే సర్దుబాటుతనం గల స్త్రీలు, భర్త సుఖమే తన సుఖంగా భావించే స్త్రీలు, వివిధ వృత్తులు లోని స్త్రీలు, వివిధ కులాల్లోని స్త్రీలు, వేశ్యావృత్తి లోని స్త్రీలు, వెట్టిచాకిరి చేసే స్త్రీలు అని విభజించుకొని వారిని గూర్చి అన్నమయ్య తన కీర్తనల్లో ఏ విధంగా చిత్రించారో ఈ పత్రంలో వివరించడం జరిగింది.

**1. కుటుంబంలోని స్త్రీలు :**

**1.1 ఇల్లాలు :** కుటుంబంలో స్త్రీ పురుషులిద్దరిలో ఎవరు జ్ఞానవంతులైతే వారిని అనుసరించి ప్రవర్తించడం సతీపతుల ధర్మం అప్పుడే ఆ సంసారం చక్కగా నిలబడుతుంది. కాపురం కమనీయంగా సాగిపోవాలంటే సతి ఎలాంటిదై వుండాలో అన్నమయ్య తన కీర్తనల్లో చెప్పాడు.

"సతి యిట్టిదైతే సంసార ఫలము
కతలన్నీ నీయందే కలవేవో చెలియా" (28-524)

ఈ కీర్తనలో భర్త చెప్పిన విధంగా చిత్తశుద్ధిగా ప్రవర్తించి, సేవచేస్తూ, అతను కోరిన విధంగా ప్రేమగా సరససల్లాపాలాడి, ఇంటి పనులు చేస్తూ, భర్త మనసెరిగి ప్రవర్తిస్తూ, నిర్మలమైన సుగుణాలతో ఉండేదే ఇల్లాలని అన్నమయ్య మానిని ధర్మాన్ని బోధించారు. భర్త ఎలాంటివాడైనా పతియే ప్రత్యక్షదైవంగా చూడాలన్నది ఆనాటి స్త్రీలకున్న ఆచారాలు-ధర్మాలు.

**1.2 సపత్నీత్వం :** ధర్మార్థకామాలను సాధించుకోవడం కోసం పురుషుడు స్త్రీతో సంసార జీవితం గడపడం ఆనాటి సంప్రదాయం.

భారతదేశంలో మొన్నమొన్నటి వరకు ఒక పురుషుడు ఒకరి కంటే ఎక్కువ మందిని వివాహమాడటం తప్పుగాదు. అన్నమయ్య తన చుట్టూ వున్న సమాజంలోని సపత్నీత్వాన్ని తన సంకీర్తనల్లో స్పష్టం చేశారు.

భర్త అనురాగం ప్రేమ తనకు మాత్రమే దక్కాలన్నది ప్రతి భార్యా కోరుకుంటుంది. భర్త ఇంకొకర్ని పెళ్ళాడి సవతిని తేవడమనేది ఏ ఇల్లాలు సహించదు. అందుకే లోకంలో సవతిపోరు జరుగుతుంటుంది. స్త్రీకి సహజమైన ఈ సపత్నీమాత్సర్యాన్ని అన్నమయ్య కళ్ళకు కట్టినట్లు వర్ణించాడు.

"ఇప్పుడే సవతి తన మురుపడి నాకు నేడు
తప్పలేదు ఇకనన్ను దడవక పోతే" (17-353)

భర్త ఎటువంటి వాడైనా భార్యకు పతివ్రతా ధర్మం ముఖ్యం.

"ఏపున మగడైన వాడేమి సేయించినాను
దాపగు బతివ్రతా ధర్మమే మాలికినీ" (11-183)

"పతి చిత్తమెరింగి తప్పక వూడిగము చేసి
అతనినే తన దైవమని తలచి" (33-57)

**1.3 నైతిక విలువలు** : కుటుంబంలో మహిళ తనకు రక్షణ, పోషణ కల్పించి, సుఖదుఃఖాల్లో తోడునీడగా వుండే తన భక్తిపట్ల ఎంతో అనురక్తితో వుండాలి. ఇతర సభ్యుల పట్ల కూడా సద్భావంతో ప్రవర్తింవలసి వుంటుంది. అలాగే కుటుంబ పరిధిని దాటి బాహ్యప్రపంచంలో బ్రతకవలసిన మహిళకు విశాల దృక్పథం, ఉపకారగుణం, సౌశీల్యం మొదలైన సమున్నత భావాలు, క్రమశిక్షణతో కూడుకొన్న సత్ప్రవర్తన, నిజాయితీ అవసరం. అన్నమయ్య స్త్రీలకు నైతిక విలువలు గూర్చి చెప్పే కీర్తనల్ని చూద్దాం.

"అంగన చేసిన పుణ్యమందక పోదు" (30-6)

"ఎప్పుడు సాధించరాదు ఇల్లాలికి" (30-542)

**"చీటికీ మాటికి అట్టు సేయగ వలెనా"** **(30-573)**

**"ఉచిత మెరగ వద్దావువిదలకు"** **(20-40)**

**1.4 సహనం :** కొంతమంది స్త్రీలు తమ భర్తలు పరస్త్రీలతో సంబంధం చేస్తున్నారని తెలిసినా, ఆ సంబంధాన్ని ప్రోత్సహిస్తారు. ఇలాంటి స్వభావం కల్గిన పాత్ర అన్నమయ్యా శృంగార సంకీర్తనల్లో మనకు కన్పిస్తుంది.

**"మంచి మేలు కలిగితే మానవచ్చునా**
**మెంచక చేకొనవయ్యా ఇంటిదాన నేను"** **(29-253)**

ఈ కీర్తనలో నీకు ఆమెవల్ల మేలు కలిగితే మానవచ్చునా? ఆమెను స్వీకరించు. నేను ఇంటిదానను, ఆమె అన్నీ నేర్పింది. ఆమెను ఇంకా ఇష్టపడు. ప్రేమతో ఇంటికి పిలవవయ్యా. నీమాట ప్రకారం నడచుకొనేదాన్ని, గర్వంలేని దాన్ని, మచ్చికతో ప్రమాణం చేసి ఆమెను నమ్మించవయ్యా? - అంటూ ఇల్లాలు సహనంతో తన భర్తను ప్రియురాలి మీదికి ప్రోత్సహించడంలో ఆమె సహన స్వభావం వ్యక్తమవుతుంది.

**2. బాంధవ్యాలు :**

గ్రామాలలో బాంధవ్యాలు అనేక రకాలుగా ఉంటాయి. కుటుంబంలో మహిళ తనకు రక్షణ, పోషణ కల్పించి, సుఖదుఃఖాల్లో తోడునీడగా వుండే తన భర్త పట్ల ఎంతో అనురక్తితో వుండాలి. ఇతర కుటుంబ సభ్యులపట్ల కూడా ఎంతో సద్భావంతో ప్రవర్తించాలి. అన్నిటికి మించి సత్ప్రవర్తనతో కూడుకొన్న నిజాయితీ అవసరం. అలాగే కుటుంబంలోని వ్యక్తులు కూడా ఆమెపట్ల గౌరవభావం కల్గివుండాలి. అలాగాక కొన్ని సాంఘిక నియమాలకు విరుద్ధంగా వారి ప్రవర్తన ఉంటుంది. కొందరి కంటబడుతుంది. ఆ కుటుంబంలోని స్త్రీలు తనకు జరుగుతున్న అన్యాయాన్ని ఇతరులతో చెప్పుకోవడానికి వీలులేక తమలో తామే కుమిలి పోతుంటారు. అలాంటి బాంధవ్యాల్లో బావా-మరదలు, వదిన-మరిది, మామ-కోడలు, అత్తా-కోడలు మొదలైనవి.

**2.1 బావ-మరదలు :** కుటుంబంలో బావ-మరదలు సంబంధాన్ని తెలియజేసే సంకీర్తనలు అన్నమయ్యలో మనం చూడవచ్చు.

**"ఏలే యేలే మరదలా**
**చాలుచాలు చాలును**
**చాలునీ నీతోడి సరసాలు బావా...** **(12-163)**

ఇది లోక ప్రసిద్ధమైన సంకీర్తన. అన్నమయ్య తన మరదళ్ళతో సరసమాడే సందర్భంలోని కీర్తన.

**2.2 వదిన-మరిది :** అన్నమయ్య సంకీర్తనల్లో వదిన-మరిది మధ్యవున్న సంబంధాన్ని బట్టి సంవాదాత్మక గేయాలు కన్పిస్తాయి.

పురుషాధిక్య సమాజంలో స్త్రీలంటే చులకన సహజం. ఈ చులకన తీవ్రత మగవారి మనస్సుల్లో, మాటల్లో, చేతల్లో కన్పించడం సహజం.

**"వదినంటా పిలిచేవు వద్దుసుమ్మీ యెవ్వరోయి**
**వదినలు వాడ వారి మరిది**
**అత్తనంటా పిలిచేవు అక్కనెక్కడ నీకు**
**అత్తలెవ్వరోయి"**

ఈ కీర్తనల్లో వదినా-మరదుల మధ్య సంబంధం కన్పిస్తుంది.

**2.3 మామ-కోడలు :**

**"మగడు విడిచినా మామ విడువని యట్లు**
**నగి నామనస్సురో సినాలోకులు మానరు" (3-220)**

అని కోడలి హృదయవేదనను తెలియజేశాడు అన్నమయ్య.

**2.4 అత్తా-కోడలు :** సృష్టిలో క్రిమికీటకాదులకు, మనుష్యులకు మధ్య సహజవైరం ఉంటుంది. ఇలాంటి వైరాలకు అత్తా కోడళ్ళను తీసుకోవచ్చు. అత్తా ఒకప్పుడు కోడలే అయినా అత్తస్థానం రాగానే గతంలో తాను అనుభవించిన వేధింపులను మరచిపోయి, కోడలు రాగానే ఆమెను వేధించడం మొదలుపెడుతుంది. అందుకే 'అత్తలేని కోడలుత్తమురాలు, కోడల్లేని అత్త గుణవంతురాలు' - అనే పాట లోకంలో బాగా ప్రచారంలోకి వచ్చింది. అన్నమయ్య దేవతామూర్తుల్లో అత్తాకోడలైన లక్ష్మీసరస్వతుల మధ్య ఒక సంవాదాత్మక గేయాన్ని రచించాడు.

**"రావే కోడలా రట్టడికోడలా"**

**3. వృత్తులు :**

**3.1 మేదరి :** వెదురుబద్దలను చీల్చి, వాటితో గృహానికి, వ్యవసాయానికి సంబంధించిన వస్తువులను తయారు చేస్తారు. మేదరజాతి, దొమ్మరజాతి స్త్రీలలో విశృంఖలత్వం ఉండటం, రసికులు వారి వెంటబడటం అన్నమయ్య కాలం నాటికే ఉందనడానికి క్రింది కీర్తనే నిదర్శనం.

**"మేదరింటి లంజవోయి యేదినీశుదగులగ**
**కోడిలకు విటులెల్ల గుల్లినయట్ట" (11-231)**

అందగత్తెలయిన మేదరవృత్తిలోని వారు అగ్రకులాల కళ్ళలో పడటం, వారి పంచన చేరడం కూడా ఈ కీర్తనలో చూడవచ్చు.

**3.2 గొల్ల :** ఇతర జాతులకన్న గొల్లజాతులకు ప్రాచీనకాలం నుండి గౌరవం ఉంది. ఆదరణ వుంది. కారణం పశుపోషణ. దైవాలయం మీద ఆధారపడిన కులాలకు, యాగాదులకు అవసరమైన వస్తుసామగ్రిని సమకూర్చే బాధ్యత వీరిది. చల్లలమ్మే వారిని వర్ణించాడు అన్నమయ్య.

**"వద చల్లయేని జవ్వని వొకతికదు**
**జడియించు చిలికిన చల్ల"**

ఇటువంటివి తీరు నామములనే తెలంగాణ పాటల్లో కూడా ఉన్నాయి.

**"పెరుగో యమ్మ పెరుగు**
**పెరుగులు తాగిన బల్లలు కరుగు"**

**3.3 చెంచిత / ఎరుకల :** నగరసీమకు దరిదాపుల్లోనివి అరణ్యాలు. నగర సంరక్షణకు అరణ్యకుల అవసరముంది. నగర జీవనానికి అవసరమయిన అనేకం అరణ్యాలే సమకూరుస్తాయి. అరణ్యకులు చాలావరకు అడవులు దాటనివారైనా, ఎరుకలు-ఎరుకతలు అరణ్య ప్రాంతాల నుండి నగరసీమలలోకి ప్రవేశించడం 14 శ. నుండి కన్పిస్తుంది. కనుకనే వర్ణలలో ఎరుకల ప్రార్థన, ఎరుకతెల సోదెలు కన్పిస్తాయి. దీని ప్రభావం ఎంతంటే తిరుమలేశుడు కూడా ఎరుకత వేషం వేయవలసిన వాడయ్యాడు.

అలాగే చెంచులు. వీరి ప్రాధాన్యమెంత పెరిగిందంటే నరసింహుడు చెంచులక్ష్మిని పెండ్లాడినాడని చెప్పేదాక. ఎలాంటి వ్యక్తికయినా ఆయా ప్రదేశాల బట్టి అక్కడివారితో సన్నిహిత సంబంధాలు ఏర్పడతాయి. ఆ సంబంధాలు కొన్ని రాలిపోతాయి. కొన్ని పిందెల దశలో ముదిరిపోతాయి. కొన్ని కసటులవుతాయి. కొన్ని మసిబారుతాయి. ఎదుటి వ్యక్తులు బలవంతులయితే రాజాల ధోరణిలో వివాహ వ్యవస్థకు దారితీస్తాయి. ఈ సర్దుబాటు ఈ కాలంలోనూ ఉన్నది. ఎరుకల, గొల్లల్లో లేని జాగ్రత్త వీరిలో కనిపించడం సహజం.

**"కొంచెము మా కులము**
**గుణము చెంచలము"**

అనడంలో స్త్రీ పురుష సంబంధాలు ఊహించవచ్చు. తాము వలచిన వారిని మనువాడినా తమ స్థితిని బేరీజు చేసుకోగల స్థిరి వీరికి వుంది. అందువల్ల -

**"అడవి చెంచతలము**
**అంతేసివారమి**
**నడుమ నీ గోపికలు నవ్వకుందేరా"**

అని తమ అలంకరణలు, తమ వివాహాలు, తమ చేతలు ఎబ్బెట్టుగానే ఇతరుల కుంటాయని వారికి తెలుసు. అలాగే వీరి తమ ఆర్థిక వ్యవస్థను కూడా మరచిపోరు.

**"చిన్న పొదల మేడలు**
**చిగురాకు గోడలు**
**మన్ను మొకములలోని మా వాడలు**
**పారిటాకు చీరపట్టు**
**పసిడికాకి పెడిబొట్టు"** అని నిక్కచ్చిగా చెబుతారు.

**3.4 బోయ** : రాయలసీమలో బోయల సంఖ్య ఎక్కువ. రాయలవారి సైన్యంలో బోయలెక్కువ. అలాగే బోయదొరల ఆధిపత్యం కారణంగా అలవోకగా సమకూరే సంపద, సంపద కారణంగా ఇంటా బయట తళుకు, బెళుకు, కులుకులు అందువల్లనే అన్నమయ్య బోయనాయకుల వేషాలంకరణలో బోయతులను కూడా వర్ణించాడు.

**"పెనుగప్పు బోయతి"** – ఆధిక్య ప్రకటనకు గుర్తు.

**"కుందపు మేని బోయతి"** - విలాసాలకు చిహ్నం.

**"పొడవైన రచనల బోయతి"** – మాటల చమత్కారం.

ఒక కులం ఉన్నతపథం వైపు పయనిస్తుంటే ఆ కులంలోని వారు కొందరు న్యూనతాభావం వల్లనయితేనేమి, కొన్ని చేతలు గ్రామీణ జీవితంలో సహజమే అనే భావనతో అయితేనేమి 'ఆకు చాటు పిందెలాగ' జీవించడం సహజం. ఒక బోయదానిపై నాయకుడు మనస్సు పడినాడు. బోయది కదా అన్న తేలికభావం కావచ్చు. ఆమె అసహాయత అతనికి కలిసి వచ్చిన అదృష్టం. అంతేకాదు వయసు-మనసు ఆమెను ఊరుకోనివ్వలేదు. ఈ స్థితిలో-

'కిన్నెర కులుకుల.... మూయదు బోయ జవరాలు అయిందట' - ఆర్థికంగా వెనకబడిన ఒక జాతిలో విలాసాలు, వినోదాలు పరిణామం ఈ పంక్తుల్లో చూడవచ్చు. సమాజంలో వ్యక్తులకు కసి ఒక సహజ గుణం. అవసరమైనప్పుడు తమను పీడించిన అగ్రకులాల వారిపై కసితీర్చుకోవడం సహజం. బోయలు అగ్రకులాల స్త్రీలపై అఘాయిత్యం చేయడం, వారిని తమ భార్యలుగా చేసుకోవడం లాంటివి "తతిగాని ఈపాటి దైవమా విచారించవే" - ఈ కీర్తనలో అట్టడుగు స్త్రీలపై అఘాయిత్యం జరిగేవేళ అగ్రకులస్థులకు దైవం గుర్తు వచ్చిందో లేదో తెలియదుగాని, తమ వారిపట్ల జరిగినవేళ దైవం గుర్తు రావడం మానసిక పరిణామంగా సరిపెట్టుకుంటే మంచిది.

**3.5 దొమ్మరులు** : దొమ్మరులలో స్త్రీలకే ప్రాధాన్యం. వారు దొమ్మరులు కారు దిమ్మరులు. దేశదిమ్మరులు.

**దిమ్మర మాటలనే ఆపె**
**దిక్కుల నీసుద్దివింటే** - అని ప్రయోగం

వీరు ఆదిమజాతి వారు. బందిపోటు, దొంగతనం, హత్య మొదలైన నేరాలకు పేరుపొందినవారు. వీరు సంచారజీవనులు. అందువల్ల వీరిని దేశదిమ్మరులు అంటారు. వీరు మైసూరు, ఉత్తర ఆర్కాడు, మధుర, ఒరిస్సా ప్రాంతాల్లోనే గాకుండా ఆంధ్రప్రదేశ్‌లో శ్రీకాకుళం, విజయనగరం, నెల్లూరు, కడప జిల్లాల్లో కనబడతారు. వీరు దొమ్మరి విద్యలు, తాడుపై నడవడం, మొగ్గలు వేయడం, గడపై తిరగడం వంటివి ప్రదర్శించి జీవనం గడుపుతుంటారు. కొంతమంది బుట్టలల్లి, ఈత చాపలు నేసి జీవిస్తుంటారు. అన్నమయ్య సంకీర్తనల్లో వీరి ప్రసక్తి చాలా చోట్ల కన్పిస్తుంది.

అన్నమయ్య కాలం నాటికి వీరు దేశదిమ్మరులుగా ఉంటూ, ఊరూర దొమ్మరి విద్యలు ప్రదర్శిస్తూ, సామాన్యులకు వినోదాలు కల్గించే వారు.

**"వీరపు సాయులుమాని పెద్దగడసాము నేర్చి**
**తోరపు బగతులెల్ల దొమ్మరులైరి"** **(2-246)**

**3.6 చాకలి :** వృత్తిరీత్యా వీరిని చాకలివాళ్ళు అంటారు. ఈ వృత్తిలో స్త్రీ పురుష లిద్దరూ పనిచేస్తారు. ఒకచోట వస్తువు వేసి మరచిపోయి మరోచోట వెదకే ప్రయత్నాన్ని అన్నమయ్య-

**"కోక చాకి యింటవేసి కొక్కిరాల వెంటబోతే**
**అక్కడ పురుషార్థమందినా జీవుడు"** **(8-175)**

**3.7 వేశ్యావృత్తి :** సాధారణంగా ధర్మం లేక ఆచార నియతికి విరుద్ధంగా చరించడం వ్యభిచారం లేక వేశ్యావృత్తి. మనుషుల అజ్ఞానానికి, మూర్ఖత్వానికి నిదర్శనంగా మతం పేరుతో దేవుళ్ళ కొరకు సృష్టించబడిన దేవదాసీ వ్యవస్థ వేశ్యావృత్తి.

మనస్సు చంపుకొని ధనార్జనకోసం చేసే వృత్తిని వేశ్యావృత్తి లేదా పడుపు వృత్తి అంటారు. ఆనాటి సమాజంలో ఉన్న వేశ్యావృత్తిని అన్నమయ్య సంకీర్తనల్లో చాలాచోట్ల కన్పిస్తుంది.

**"సంతపాక లంజదెచ్చి సన్యాసిజేసి"** **(1-282)**

**"సంతపాక లంజవల్లె చల్లుచూపు లేటికి"** **(4-30)**

**"చేసుకొన్న యిల్లాలు చేరువనే వుండగను**
**దేసరాక వెలయాలి వెతికినట్లు"** **(6-5)**

పది ఇరవై ఏళ్ళక్రితం ఒక కులంవారు ఆడవారు ఒళ్ళంతా నగలతో కనబడేవారు. తాము దాబు దర్పం సంపన్నతను సూచించే స్త్రీవర్గం ఆనాటికే ఉందని అర్థం. అన్నమయ్య అలాంటి వారిని చూచి 'మరుని పెద్దవోడ దిగెను - అన్నాడు.

**3.8 వెట్టిచాకిరి :** ఇంటి పనిమనుషులు దంచటం, వంట చేయటం లాంటి పనులు చేసేవారు. ఇంట్లో పని అయ్యాక తమ ఇళ్ళకు వెళ్ళిపోతుంటారు. కాని ఇంటి యజమానులు తమకు తెలియకుండా వస్తువులు పట్టుకెళ్ళుతుంటారని సందేహిస్తుంటారు. అప్పుడు ఆ పనివాళ్ళు చీర దులిపి, పైట దులిపి, తమ దగ్గరున్న వస్తువుల నన్నింటిని చూపించి, ఏదీ తీసుకెళ్ళలేదని నిరూపించి వారి సంశయాన్ని నివృత్తి చేస్తారు. ఇలాంటి సన్నివేశం అన్నమయ్య కీర్తనల్లో ఉంది.

నిప్పట్లు తయారు చేయడంకోసం ఒకావిడ ఇతరుల సహాయం కోరింది. నిప్పట్లు తయారు చేయడం పూర్తయింది. సహాయానికి వచ్చినావిడ తానేమి పట్టుకుపోవడం లేదని చేయి చూపించిందట. ఇదోరకంగా వృత్తుల వారిని అగౌరవించడమన్నమాట.

**3.9 ఊడిగం :** పొట్టకు పట్టెడు కూడుకూడా నోచుకోని పరిస్థితిలో అన్నంకోసం అన్యులను ఆశ్రయించడం జరుగుతుంది. వారు చెప్పిన పనులను భయభక్తులతో చేసిపెట్టడం తప్పదు. చెప్పిందల్లా చేస్తూ, ఇచ్చిన దానితో తృప్తిపడటం ఊడిగం. ఇది అన్ని కాలాల్లోనూ కన్పిస్తుంది. అన్నమయ్య సంకీర్తనల్లో ఊడిగానికి సంబంధించిన పదప్రయోగాలు కన్పిస్తాయి.

'ఊడిగం' - అనేమాట శృంగార సంకీర్తనల్లోనూ, 'వెట్టి' అనేమాట ఆధ్యాత్మ సంకీర్తనల్లోనూ, 'సాకిరి' అనేమాట ఆధ్యాత్మ శృంగార సంకీర్తనల్లోనూ కన్పిస్తుంది.

**"పూని వూడిగేల వారు పొంచి వాకిట నుండిరి" (15-278)**

**"అమరగ నూడిగపు అంగనవాయీడను" (13-397)**

**"వూడిగపు వారి మేను తొరసే నిన్నంటాను" (30-215)**

**"వెట్టిబంట్లు గొందరై వీఁగు దురింతే" (3-14)**

తిండి తింటూ పనిచేసే వారు వెట్టిబంట్లు.

ఇచ్చిన దానితో తృప్తిపడి ఊరకే పని చేస్తుంటారు. వారికి పనులు మరీ ఎక్కువయినపుడు తప్పించుకొని పారిపోవడం సహజం. ఈ విషయాన్నే అన్నమయ్య-

**"వెట్టినమోపులు మోవ నోవక వూరు విడిచి**
**వెట్టివాడు పారిపోగా వెదకినట్టు" (11-231)**

**"బలువుడ నందు మీద పనిగొని నోపుదువు**
**చలివాట మమ్మేల సాకిరి పెట్టేవు" (15-223)**

ఈ విధంగా అన్నమయ్య చిత్రించి సామాజిక స్త్రీలను మనం చూడవచ్చు.

అన్నమయ్య సంచార వాగ్గేయకారుదు కావడం వల్ల సమాజంలోని నిమ్నోన్నతాలు, ఉచ్చనీచాలు, ఆర్థిక స్థితిగతులు, అసమానతలు, మానసిక మనోభావాలు, రాజరికం పట్ల ప్రజలకున్న అనురాగ-అసహ్యాలు, కీర్తనల్లో ప్రత్యక్ష పరోక్ష పద్ధతుల్లో వ్యక్తీకరించాడు. ఈ వ్యక్తీకరణకు పద్యంకంటే పాటలు ఎన్నుకోవడం అన్నమయ్యకే చేతనైంది.

అన్నమయ్య శృంగార సంకీర్తనల్లో ఈనాటి ఆధునిక స్త్రీ మెచ్చే చైతన్యం. తెలివితేటలు, ప్రత్యేక వ్యక్తిత్వం స్త్రీ పాత్రలకు అన్నమయ్య ఆరోపించడం గమనిస్తే, ఈనాటి ఆధునిక కాల పరిస్థితుల్ని అన్నమయ్య ఆనాడే ముందే వూహించిన కాలజ్ఞానిగా తోస్తుంది.

అన్నమయ్య సామాజికవర్గ స్త్రీ వర్ణనలలో ఆయా స్త్రీల సహజ భాషణలు, ఏసలు, అంగిక, వాచిక, ఆహార్యాలు కంపించడం విశేషం. ఈ అంశంలో నంది తిమ్మనకు అన్నమయ్య నిజంగా అన్నయే.

అన్నమయ్య జీవించిన నాటి సమాజా వర్ణాశ్రయ ధర్మాలతో కూడుకొన్నది. కాబట్టి ఆనాటి స్త్రీ పరిస్థితిని, ప్రాచీన నీతుల్ని కొన్నిచోట్ల వ్యక్తపరచినా ఈనాటి ఆధునిక మహిళాలోకం హర్షించి ప్రశంసించే అంశాల్ని కూడా అన్నమయ్య పొందుపరచాడు. అన్నమయ్య సంకీర్తనా సుధారాసిలో మహిళామణికి అపారమైన విలువ, గౌరవం ఆపాదించాడు. స్వతంత్ర ప్రతిపత్తి కల్గిన స్త్రీ సంబంధమైన సూక్తులు విరివిగా కన్పిస్తాయి. ఈ సూక్తుల్లో స్త్రీ సనాతన ధర్మాలకు ప్రవర్తనకు సంబంధించినవి కొన్ని లభ్యమవుతున్నాయి. నేటి ఆధునిక స్త్రీకి సంబంధించిన కీర్తనలు మనకు లభిస్తున్నాయి. అన్నమయ్య సంకీర్తనా సుధాంబుధిని బోధించే కొలది చిత్రవిచిత్రమైన, సత్యసుందరమైన అనేకరకాలైన స్త్రీ సంబంధమైన సూక్తిరత్నాలు వీనుల విందు చేస్తాయి.

***

# అన్నమయ్య సంకీర్తనలు - తెలుగు సాహిత్య వైభవం

**డా॥ విస్తాలి శంకరరావు**
**తెలుగు శాఖ**
**మద్రాసు విశ్వవిద్యాలయం**
**చెన్నై-05**

**పరిచయం :**

**బహు జన్మకృత పుణ్య పరిపాకమున జేసి**
**ఆంధ్రుడై ధాత్రిలో నవతరించు**
**బహు జన్మకృత పుణ్య పరిపాకమున జేసి**
**ఆంధ్ర భాషను మాటలాడుచుండు**
**బహు జన్మకృత పుణ్య పరిపాకమున జేసి**
**ఆంధ్రత్వమున నిద్దియనియెంగు**
**బహు జన్మకృత పుణ్య పరిపాకమున జేసి**
**ఆంధ్రీ మహామూర్తి నైక్యమొందు** - విశ్వనాథ సత్యనారాయణ

ఎన్నో జన్మల పుణ్యం చేసుకుంటేనే ఆంధ్రుడుగా పుట్టడం, ఆంధ్రభాషను మాట్లాడే అదృష్టం లభిస్తుందని కవిసామ్రాట్ విశ్వనాథ సత్యనారాయణ గారు మన నేల గురించి, మన భాష గురించి ఎంతో గొప్పగా తెల్పారు. ఇటువంటి పుణ్యభూమిలో

పుష్టి, అమృతము వంటి తెలుగు భాషను మాట్లాడడం ఎన్నో జన్మల అదృష్టమే. అటువంటి అదృష్టాన్ని పొందిన మనం ఎంత వరకు ఆ తల్లికి, ఆ తల్లి భాషకు తగిన ఋణం తీర్చుకుంటున్నామో ప్రతి ఒక్కరు ఆలోచించవలసిన అవసరం ఉంది. అలా ఋణం తీర్చుకున్న వారిని ప్రస్తావించుకుంటే మొదటి వరుసలో ఉండేవారు, దేశమాత కోసం తమ ప్రాణాలను సైతం లెక్కచేయని అమరవీరులు, ఆ తల్లిభాషా సంస్కృతులను గ్రంథస్థ చేసి భవిష్యత్తు తరాల వారికి అందించిన కవులు, రచయితలు ఉంటారు. ఈ తెలుగు నేలలో ఎందరో ఉద్దండ కవులు ఉద్భవించి తెలుగు భాషా సాహిత్య వికాసంలో తనదైన ప్రత్యేకతతో సేవలందించిన మహాకవులలో ఒకరు శ్రీమాన్ తాళ్ళపాక అన్నమాచార్యుల వారు. వీరిని తెలుగు ప్రజలు ముద్దుగా 'అన్నమయ్య' అని ప్రేమగా పిలుచుకుంటారు.

అన్నమయ్య కలియుగ ప్రత్యక్షదైవం అయిన ఆ శ్రీనివాసుని తన ఇష్టదైవంగా భావించి, ఆ స్వామి మీద వివిధ కోణాలలో 32 వేల సంకీర్తన పుష్పాలతో అర్చించి అపారమైన భక్తి భావాన్ని ప్రకటించారు. సాధారణంగా అన్నమయ్య సాహిత్యం అన్న వెంటనే అది ఒక భక్తి సాహిత్యంగాను, వైష్ణవ మత సాహిత్యంగాను భావిస్తారు. అది సత్యమే. అయితే ఆ భక్తి సాహిత్యాన్ని వ్యక్తీకరించే విధానంలో అనుసరించిన మార్గాలు పలువురిని చైతన్య పరచడమే కాక, తెలుగు భాషా సాహిత్యాల వికాసంలో కూడా నూతన మార్గాలను ఆవిష్కరించాయి. అన్నమయ్య సాహిత్యంలో ఉన్న భక్తితత్వంలోని విశిష్టతను అలా ఉంచితే, ఆ భక్తితత్వాన్ని వెలువరించడానికి అనుసరించిన సాహిత్య మార్గాలు తెలుగు భాషా సాహిత్యాల గొప్పతనాన్ని తెలియజేస్తున్నాయి. అలా అన్నమయ్య సంకీర్తనలను భాషా సాహిత్య వికాస కోణంలో పరిశీలిస్తే తెలుగు భాషా సాహిత్య వైభవాలకు అన్నమయ్య సాహిత్యం తోడ్పడిన విధానం తెలుస్తుంది.

**సాహిత్యం - నిత్య నూతనం :**

సాహిత్యం ఒక జీవనదిలాంటిది. అది నిరంతరం ప్రవహిస్తూనే ఉంటుంది. రకరకాల నూతన మార్గాలలో పరవళ్ళు తొక్కుతూనే ఉంటుంది. ఆ పయనంలో ప్రతి మలుపు ఒక విశిష్టదశే. ఆ కొత్తదనం మరికొంత కాలానికి మరో నూతన కోణాన్ని ఆవిష్కరిస్తుంది. ఇలా సాహిత్యంలో పాత కొత్తల మేలు కలయికలతో నిరంతరం నూతనత్వాన్ని సంతరించుకుంటూనే ఉంటుంది. సాధారణంగా సాహిత్యంలో ఈ నూతనత్వం అనేది ఆయా కవులు ఎన్నుకున్న ప్రక్రియ వైవిధ్యం లోను, ఉపయోగించిన భాషా సాహిత్య మెలుకువలలోను, ఇతివృత్త స్వీకరణలోను ఏర్పడతాయి. ఇలాంటి మార్పులు సాహిత్యంలో నూతన కవుల ప్రవేశంతో రూపుదిద్దుకుంటాయి. ఆ విశిష్ట కవులను నేటి సాహిత్య లోకం యుగకర్తలుగాను, ఆయా ప్రక్రియలకు ఆద్యులుగాను ఇలా అనేక పేర్లతో వారిని, వారి సాహిత్య సేవలను స్మరించుకుంటూ వారిపట్ల ప్రేమాభిమానాలు ప్రకటిస్తారు. అటువంటి తెలుగు సాహితీ ధృవతారలలో ఒక విశిష్ట తార మన అన్నమయ్య.

**అన్నమయ్య సంకీర్తనలు - తెలుగు సాహిత్య వైభవం :**

పదకవితా పితామహుడుగా కీర్తికెక్కిన అన్నమయ్య కాలం క్రీ.శ. 15వ శతాబ్దం. అప్పటికే తెలుగు సాహిత్యం శాఖోపశాఖలుగా విస్తరిస్తూ దినదిన ప్రవర్ధమానంగా వృద్ధి చెందుతుంది. ఎందరో ఉద్ధండకవులు తమ ప్రతిభా పాటవాలతో తెలుగు సాహిత్యాన్ని పరవళ్ళు తొక్కిస్తున్నారు. ఆదికవి, కవిబ్రహ్మ, ప్రబంధపరమేశ్వరుడు, నవీనగుణసనాథుండు ఇలా అనేక గౌరవ పలుకుబడులతో విశిష్టంగా వెలుగొందుతున్నారు. ఇక 15వ శతాబ్దంలో సూర్యచంద్రులుగా కవిసార్వభౌముడు శ్రీనాథుడు. సహజ పాండిత్యుడు పోతన తమ సాహితీ పరిమళాలతో తెలుగు సాహితీ లోకాన్ని పునీతం చేస్తున్నారు. అదే కాలంలో జన్మించినవాడు అన్నమయ్య.

పరిశీలిస్తే 15వ శతాబ్దంలో తెలుగు సాహిత్యం పురాణ అనువాదాలుగా, కావ్య అనువాదాలుగా అనేక రచనలు విరివిగా వెలువడుతున్నాయి. ఆ కాలంలో సాహితీ రంగంలోకి ప్రవేశించిన వారు ఎవరైనా ఆ రచనా పద్ధతులను అనుసరిస్తేనే తగిన గౌరవం, ఆధరణ. అటువంటి సమయంలో అన్నమయ్య తెలుగు సాహితీ రంగప్రవేశం చేశారు. అయితే అన్నమయ్య తనకు పూర్వం ఉన్న పురాణ అనువాద పద్ధతిని కాని, కావ్యానువాద పద్ధతిని కాని అనుసరించక అందుకు భిన్నమైనది, ప్రత్యేక శైలి, సృజనాత్మకతలను ప్రదర్శించడానికి అనువైన పదకవిత్వానికి శ్రీకారం చుట్టారు. అప్పటికి సాహితీలోకంలో అది ఒక సంచలనం. అంతేకాదు దక్షిణాది భాషలో మరెవరు పదాలు రాయక ముందే మొట్టమొదట సంకీర్తన సాహిత్యాన్ని సృష్టించి తొలి సృజనాత్మక వాగ్గేయకారుడుగా, పదకవితా పితామహుడుగా సాహితీలోకం చేత కీర్తించబడినారు. అప్పటి వరకు నడుస్తున్న తెలుగు సాహిత్య ప్రవాహాన్ని సామాన్య జనంవైపు మళ్ళించాడు. అంతేకాక తెలుగు సాహిత్యాన్ని పండిత, పామర, జానపదులకు అందుబాటులోకి తెచ్చి తెలుగు సాహిత్య విస్తృతికి దోహదం చేశాడు. ఇంకా సామాన్య ప్రజల భాషకు తన సాహిత్యంలో పట్టంకట్టి వ్యవహారిక భాషా వికాసానికి మార్గదర్శకుడైయ్యాడు.

అన్నమయ్య మొత్తం 32 వేల సంకీర్తనలను వ్రాసారని తెలుస్తుంది. కాని లభ్యమైనవి 14 వేల పైచిలుకు మాత్రమే లభించిన సంకీర్తనలను పరిశీలిస్తే అన్ని కీర్తనలోను సర్వసామాన్యంగా కనిపించే లక్షణం ఒక్కటే అదే శ్రీ వేంకటేశ్వరుని తత్వం. ఆతత్వం ఎలా ఉంటుందంటే...

**అన్నిమంత్రములు ఇందే ఆవహించెను**
**వెన్నతో నాకు కలిగే వెంకటేశు మంత్రము ॥అన్ని॥**

**నారదుడు జపియించే నారాయణ మంత్రము**
**చేరే ప్రహ్లాదుడు నారసింహా మంత్రము**
**కోరి విభీషణుడు చేకొనె రామ మంత్రము**
**వేరేనాకు గలిగే వెంకటేశు మంత్రము ॥అన్ని॥ సం.4 కీ.438**

అని తన్మయత్వంతో శ్రీ వేంకటేశ్వరుని కొనియాడుతారు. అయితే ఆ సంకీర్తనలను నిశితంగా పరిశీలిస్తే దానిలో ఎన్నో అద్భుత భావనలు కనిపిస్తాయి. నాటికీ, నేటికీ సమాజంలో మా దేవుడు గొప్ప, మా దేవుడు గొప్ప అనే సంవాదాలు ప్రజలలో నడుస్తూ విద్వేషాలు కొనసాగుతున్నాయి. అన్నమయ్య ఈ.సమస్యను గుర్తించి ప్రజలలో ఐక్యతను, సామరస్యత నెలకొల్పే విధంగా తన సంకీర్తనలను తీర్చిదిద్దాడు. దేవుళ్ళంతా ఒక్కటేనని తన సంకీర్తనల ద్వారా సామాజిక సందేశాన్ని అందించాడు. అందుకే అన్నమయ్య సంకీర్తనలో శ్రీరాముని తత్త్వం, శ్రీకృష్ణుని తత్త్వం, ఈశ్వరుని తత్త్వం, నారసింహుని తత్త్వం, హనుమంతిని తత్త్వం ఇలా అనేక భావాలను వ్యక్తం చేసి ప్రజలను ఏకం చేయడానికి తెలుగు సాహిత్యాన్ని ఒక ఆయుధంగా ప్రయోగించాడు.

అంతేకాక ఒక్కదేవుని మీద 32 వేల సంకీర్తనలు వ్రాసినా అవి వేటికవే వైవిధ్య భరితంగా రాయడం కవి ప్రతిభావిశేషాలే కారణం అయినా, అవి ప్రదర్శించుకోవడానికి సాహితీ పరిపుష్టి కలిగిన తెలుగు భాష వేదిక అవడంతో అన్నమయ్య సాహిత్యం మరింత విశిష్టంగా విస్తరించింది.

నేడు ఎన్నో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులో ఉన్నా 2, 3 వేల సాధారణ పాటలు రాయడమే ఎంతో కష్టం. అనుకుంటే, పేపరు పెన్నులేని కాలంలో తాటాకులపై ఘంటంతో 32 వేల సంకీర్తనలు ఇతర రచనలు రాయడం నాటికి, నేటికి, ఏనాటికైనా విశిష్టంగా చెప్పుకోవలసి ఉంటుంది.

అన్నమయ్య సమాజంలో బాగా సంచరించిన వ్యక్తి కనుకనే నాటి సమాజం లోని ప్రజల పలుకుబళ్ళు, జాతీయులతో పాటు అనేక జానపద రీతులను తన కీర్తనల్లోకి తీసుకువచ్చి దేశీయతత్త్వాన్ని చాటాడు. అంటే అన్నమయ్య శృంగారం, ఆధ్యాత్మిక సంకీర్తనల రచనలో శిష్ట, వ్యావహారిక, జానపద శైలిని ఉపయోగిం చాడు. ఇలా గమనిస్తే జాతి జనులకు ప్రాణాధారమైన భాషకు జనం జీవం కలిగించి ఆనాటి ప్రజావ్యవహారంలో ఉన్న అనేక పదాలకు చోటు కల్పించాడు అన్నమయ్య.

మనిషి జీవన వికాసంలో ఇల్లు మొదటి మెట్టు. తాను జీవించడానికి కావలసిన ఉపకరణాలు సమకూర్చుకుని హాయిగా జీవిస్తాడు. నిత్యజీవితంలో కావలసిన వస్తువులను గృహోపకరణాలు, లేక గృహసంపదగా భావించవచ్చు.

గృహోపకరణాల గురించి అన్నమయ్య భక్తి, జ్ఞాన, వైరాగ్య విషయాలను బోధించాడు. మేడ, గుడిసె, అట్టకఉట్టి (17-273), ఉట్టిచిప్ప (24-291), తిత్తి (1-159), దుత్త, గాదె, దివ్వె (29-127), వంటశాల అబక, కుందకంచం, గంప, పళ్లెలు, గొడ్డలి (24-410), మేకు (13-51), చేట, భోజనశాల, బిందె, ముంత, పానుపు, పట్టసరపు ఉయ్యాల మంచం (4-104), అద్దం (2-133) ఇత్యాది వస్తువులు.

మనదేశంలో పూజల సందర్భాలలో వివిధ దేవతలకు రకరకాలయిన వంటకాలను సమర్పించే సంప్రదాయం ఉంది. అదేవిధంగా అన్నమయ్య సంకీర్తనలను పరిశీలిస్తే ఆనాడు ఉండే వివిధ ఆహార వదార్థాలు తెలుసుకోవచ్చు.

**"ఆరగింపవో మాయప్పయివే" - సం.6, కీ.4**

అంటూ సాగే కీర్తనతో తేనె, నూనె బూరెలు, అరిసెలు, గారెలు, కజ్జికాయలు, పూర్ణపు కుడుములతో పాటు వివిధ రకాలైన ఆహారపదార్థాలు బంగారు పళ్లెములో ఉంచి స్వామికి నివేదించినట్లు వర్ణించబడింది. అలాగే వేంకటేశ్వరునికి అర్పించి నైవేద్యంలో అటుకులు, చక్కిలాలు (34-340), క్షీరాన్నము (5-120), పానకం (24-109), పెరుగు (14-59), చింతకాయకజ్జాలు (7-34), అల్లం, బెల్లం (16-16), ఉప్పు (6-39), పొట్టు (2-115), గుగ్గిళ్ళు (6-49), ఇలా అనేక రకాలయిన ఆహార పదార్థాలు ఉపయోగించేవారు.

అలాగే ప్రకృతిని ఆధారంగా చేసుకొని అన్నమయ్య మానవ మనసత్వాన్ని తేటపరిచాడు. అన్నమయ్య నాయిక సౌందర్యాన్ని అందమైన పూలతో సమన్వయ పరిచారు.

**"దొరకెగా పూజ కందువ పూలని" - సం.5, కీ.95**

అనే కీర్తనలో గొజ్జగిపూవు (13-426), తుమ్మపూవు (3-118), పొగడపు పూవు (12-368), మొదుగ, సంపంగి (13-422), దిరిశపుపూవు (21-130), తామరలు, కలువ (18-1), కాకర (27-468) మొదలైవి.

ఇలా చెప్పుకుంటూ పోతే ఆనాటి జన జీవనానికి సంబంధించిన అనేక విషయాలు అత్యంత సులభమైన శైలిలో పదసాహిత్యాన్ని సృష్టించి గొప్ప భాషా శాస్త్రవేత్తగా నిలిచాడు.

అలాగే ఆ కాలంలోని తెలుగు ప్రజల సంస్కృతి, సంప్రదాయాలలో ఆటలు-పాటలు, జీవన విధానాలు వృత్తులు మొదలైన వాటిని సంకీర్తనల రూపంలో పామురులు సైతం పాడుకునే విధంగా గ్రంథస్తం చేసి తెలుగు భాషా వికాసాలకు ఎంతగానే తోడ్పడ్డారు.

నేడు సమాజంలో చర్చించుకుంటున్న వర్ణ వివక్షత అన్నమయ్య కాలంలో ఎలా ఉండేదో వాటి పట్ల అన్నమయ్య ఎలాంటి భావాలను కలిగి ఉన్నారో వారి సంకీర్తనల ద్వారా తెలుసుకోవచ్చు. మనిషికి ఉండవలసిన విలువలను ఎలుగెత్తి చాటుతూ కుల, మత, భేదాలని నిరసిస్తూ బ్రహ్మమొక్కటే తత్త్వంలో ప్రకటించారు.

నిద్రకు రాజు, బంటూ, మరు భూమికి బ్రాహ్మణుడు, చండాలుడు, కామసుఖానికి దేవత, పశువు, రాత్రికి ధనికవాడు, పేద అనే భేదాలు లేవని చాటాడు.

**"నిండారరాజు నిద్రెంచు నిద్రయునొకటే**
**అండనే బంటునిద్ర అదియునొకటే**

మెండైన బ్రాహ్మణుడు మెట్టు భూమి యొకటే
చండాలుడుండేటి సరిభూమి యొకటే"           సం.2, కీ.385

దేవుడొక్కడేనని, కులమత భేదాలకు తావులేదని పంచభూతాలు అందరికి సమానమేనని ఈ సత్యం తెలుసుకోక మానవులంతా వర్గ, వర్ణ, భేదాలన పాటిస్తున్నారని వారి పట్ల నిరసన భావాన్ని వ్యక్తీకరించారు. ప్రజలంతా శాంతి సామరస్యాలతో ఆనందంగా కలిసి మెలిసి ఐక్యంగా ఉండాలని సమాజానికి సందేశం పంపిన ప్రజాకవి అన్నమయ్య అని చెప్పవచ్చు.

ఇలా కుల, మత, వర్గ, వర్ణ, లింగ, ధనిక, పేద, రాజు, భంటూ తారతమ్యాలు తగవని తన సాహిత్యం ద్వారా ఎలుగెత్తిన సంఘ సంస్కర్తగా కూడా దర్శన మిస్తారు.

అన్నమయ్య లక్ష్యం ప్రజలను తన పదాల ద్వారా చైతన్యపరిచి ముక్తిమార్గం వైపు పయనింపజేయాలని నిర్ణయించుకున్నట్లుగా కూడా అర్థం చేసుకోవచ్చు. ఎందుకంటే తానెన్నుకున్న పదానికి చక్కని సంగీతాన్ని జోడించి పాటల రూపంలో ప్రజల దగ్గరకు వెళ్లాడు. పాటగా ఎందుకేళ్లాడు అనే సందేహం రావచ్చు. ఎందుకంటే పాటకుండే శక్తి ఈ ప్రపంచంలో మరి దేనికీలేదు. కనుకనే అన్నమయ్య పదాలు చక్కని పాటలుగా నేటికి ప్రజలను చైతన్య పరుస్తూ అలరిస్తున్నాయంటే ఇంతకన్నా వేరే చెప్పనవసరంలేదు. కనుకనే అన్నమయ్య సాహిత్యంలో సంగీత, సాహిత్యాలు జోడుగుర్రాల్లా పయనిస్తూ ప్రజల నాల్కుల మీద నర్తిస్తూనే ఉన్నాయి.

ఇలా అన్నమయ్య తన సాహిత్యంలో జనసామాన్యంలో ఉన్న పాటలకు వారి బాణీలకు పెద్దపీట వేశారు. "బ్రహ్మ మొకటే పరబ్రహ్మ మొక్కటే" అని పాడుకుంటూ సమాజంలో సామరస్యతను నెలకొల్పడానికి కావలసినంత జ్ఞానాన్ని సృష్టించాడు.

తరచి చూస్తే మనిషి పుట్టిన దగ్గర నుండి గిట్టేవరకు అనగా జీవిత కాలంలోని వివిధ సంఘటనలను ఆధారంగా చేసుకుని అన్నమయ్య సాహిత్యం ఆవిర్భవించింది. అన్నమయ్య సంగీత సాహిత్యాలకు అనువైన పద ప్రక్రియను చేపట్టి ఒక కాలం నాటి మానవ జీవితాన్ని గ్రంథస్తం చేయడమేకాక సకల మానవాళికి విష్ణుభక్తిని, మానవ ధర్మాన్ని అందించి ప్రజలను జీవన్ముక్తులను చేయదానికి ప్రయత్నించారు.

ఇలా అన్నమయ్య సంకీర్తనలు గొప్ప భావ సంపన్నమై సంగీత సంప్రదాయా నికి చక్కని బాటను వేశాయి. తన తరువాతి వారు అయిన క్షేత్రయ్యకు సాహిత్య పరంగాను, త్యాగయ్యకు సంగీతపరంగాను, రామదాసు భజన సంప్రదాయాలలోను స్ఫూర్తిగా నిలిచి తెలుగు సంగీత సాహిత్య వైభవాన్ని ప్రపంచ సాహితీలోకానికి చాటిన తొలి ఆంధ్ర వాగ్గేయకారుడుగా కీర్తికెక్కారు మన అన్నమయ్య.

అన్నమయ్య సాహిత్యాన్ని పరిశీలిస్తుంటే నేటి సమకాలీన కవులు రాసిన సాహిత్యంగా అనిపిస్తుంది. ఈ సాహిత్యం 15వ శతాబ్దం కాలం నాటిది అంటే ఆశ్చర్యం చేస్తుంది. సాహిత్యం సామాన్య ప్రజల చెంతకు చేరని రోజుల్లో అటువంటి

సాహిత్యాన్ని సృష్టించటం, సామాన్య ప్రజల జీవన విధానానికి సాహిత్యంలో చోటు లేనప్పుడు వారి జీవన విధానానికి పట్టంగట్టడం, ఆ కాల సాహిత్య స్వభావానికి భిన్నమైన సాహితీ ప్రక్రియను స్పృశించి విశిష్టంగా రాయడం, తాను సృష్టించిన సాహిత్యానికి చక్కని శిష్ట, జానపద సంగీత ధోరణులను ఆపాదించి ప్రజా వ్యవహార గేయాలుగా తీర్చిదిద్దడం, సమాజంలోని సామాజికాంశాల పట్ల తనదైన శైలిలో స్పందించి ఐక్యతను, సామరస్యతను కలిగించడం, తన సాహిత్యంలో ప్రజా వ్యవహారిక భాషకు అత్యంత గౌరవనీయమైన స్థానాన్ని కల్పించడం, ఇలా అన్నమయ్య తన సాహిత్యాన్ని వైవిధ్యంగా సృష్టించి తెలుగు భాషా సాహిత్య విశిష్టతలను, వైభవాలను మరింతగా విస్తృత పరిచారు.

**ఆధార గ్రంథాలు :**


1. అన్నమయ్య సంకీర్తనల్లో జానపద గేయ ఫణితులు – డా॥ పొన్నా లీలావతి.
2. అన్నమయ్య సంకీర్త సౌరభం – డా॥ ఎస్. గంగప్ప.
3. అన్నమయ్య బహుముఖ ప్రభావం – ఆచార్య చిట్రాజు గోవిందరాజు.
4. తిరుమల (అన్నమయ్య సాహిత్యం) – డా॥ విస్తాలి శంకరరావు.
5. శ్రీ తాళపాక సాహిత్యానుశీలనం – డా॥ కొలకలూరి మధుజ్యోతి.
6. అన్నమయ్య సంకీర్తనలు సం. 3,4,5,6 – తిరుమల తిరుపతి దేవస్థానం.


***

# అన్నమయ్య సంకీర్తనల్లో శ్రీ వేంకటేశ్వరస్వామి వర్ణన


**శ్రీ జె. కొండలరావు**

**తెలుగు అధ్యాపకులు**

**శ్రీ గోవిందరాజస్వామి ఆర్ట్స్ కళాశాల**

**తిరుపతి**


ఒక వ్యక్తి లేదా వస్తువు లేదా పదార్థము వంటి వాటిని గూర్చి ఎదుటివారికి సుబోధకమగునట్లు వివరించి చెప్పుటకు సర్వసాధారణంగా వారికి తెలిసిన మరొక దానిని ఉపమానంగా స్వీకరించి చెప్పటం సాహిత్యంలో తరతరాల నుంచి వస్తున్న సాంప్రదాయం. ప్రాచీన, శిష్ట సాహిత్యంలో వీటిని వర్ణనలు అన్నారు. ఆధునిక సాహిత్యంలో సాదృశ్యాలు అంటున్నారు. అన్నమయ్య శ్రీ వేంకటేశ్వరుని గుణగణాలు, వింతలు, విశేషాలను మన కళ్ళకు కట్టినట్లు చెప్పుటకు చక్కని వర్ణనలు సృజించాడు. వర్ణన కవితాతత్వానికి ఆయువుపట్టు. చక్కని ఉపమానాలతో చెప్పిన విషయం

హృదయానికి హత్తుకుంటుంది. ఈ విషయంలో అన్నమయ్య తన పూర్వపు కవులకంటే మిన్నగా వ్యవహరించాడు. శ్రీ వేంకటేశ్వరస్వామి ధరించిన ఆభరణాలను గూర్చి అన్నమయ్య ఇలా వర్ణించాడు :

**1. ఆభరణాల వర్ణన**

**"వాడివో కంటిరటరే వన్నెలవాడు**
**పైడి మొలము కటారు పరుజులవాడు" ॥ పల్లవి ॥ (7-116)**

అంటూ అద్భుతంగా వర్ణించాడు అన్నమయ్య. శ్రీ వేంకటేశ్వరస్వామి పెద్ద కిరీటము, పీతాంబరము, కౌస్తుభమణి, ముత్యాల నామము, చేతియందు శంఖుచక్రాలు, అందెల గజ్జెలు, మకర కుండలములు, కడియాలు, మొలనూలు ధరించాడని వర్ణించాడు. వస్త్రాలు, ఆభరణాలు ఏ వ్యక్తికైనా అందాన్ని, వర్చస్సును కలుగజేస్తాయని అన్నమయ్య ఆనాడే గుర్తించాడు. అలా తాను గుర్తించిన దానిని మనిషికి అనువర్తింపక స్వామికి అన్వయింపజేశాడు.

**2. లీలా విశేషాలు :** శ్రీ వేంకటేశ్వరస్వామి లీలావిశేషాలను గూర్చి అన్నమయ్య ఇలా వర్ణించాడు. స్వామివారు దేవదేవుడు. అందుకే ఆ దేవుని లీలలను రమ్యంగా వర్ణించాడు అన్నమయ్య.

**"యోగి భోగి ననటం కురువుల్లాసానన మోహన**
**సాగరోద్భవ కన్యకాపతి సారస శ్రీ వేంకటగిరి యోగి॥పల్లవి॥(11-538)**

అన్నమయ్య స్వామివారిని లీలా నక్షత్ర జాలాధికరందుడని, త్రివిక్రమాకార యోగి అని, హాలాహలకర కోలాహలకరుడని, శూలాయుధ వంద్య పరిపూర్ణ యోగి అని, కాళీ వినుత ప్రహేళిత చరితాహి అని, మౌళి ఘనసార విన్యస్త యోగి అని, గరుడపక్షి వాహగమన యోగి అని, మురళీనాద శృంగ మోహన మురారి అని, కరుణానంద సాగరశాయి అని వర్ణించాడు. అవన్నీ ఆ స్వామివారి లీలలే. వాటిని పరమాద్భుతంగా వర్ణించాడు.

**3. రూప వర్ణన :** శ్రీ వేంకటేశ్వరస్వామి శృంగార వర్ణనను అన్నమయ్య ఇలా వర్ణించాడు. నవరసాలలో శృంగారానికి ఒక ప్రత్యేకస్థానం ఉంది. స్త్రీ పురుషుల మధ్య అనుబంధాన్ని నిలుపుతుంది శృంగారం. పురుషార్థాల్లో కామపురుషార్థ సాధనకు మూలకందమైనది శృంగారము. అన్నమయ్య స్వామివారిని శృంగారపరంగా వర్ణించాడు.

**"నానా రూపధరుడు నారాయణుడు వీఁడె**
**పూనిన వుపమల్లెలఁ బొసగ నితనికి ॥ పల్లవి ॥ (17-503)**

శ్రీ వేంకటేశ్వరస్వామివారి శరీరాన్ని ప్రకృతితో అన్వయిస్తూ శృంగారాత్మకంగా చిత్రించాడు. ఆకాశాన్ని మేఘాలు అలుముకొన్నట్లు స్వామి వారి శరీరం నిండా కప్పురము అలుముకున్నదని చక్కగా వర్ణించాడు. శృంగార పురుషుడైన శ్రీ

వేంకటేశ్వరుడు అలమేలుమంగమ్మ పురములో నెలకొన్నాడు. స్వామీ అమ్మవార్లను చాలా సంకీర్తనల్లో శృంగారాత్మకంగా వర్ణించాడు.

**4. వాహన వర్ణన :** శ్రీ వేంకటేశ్వరస్వామి వారు వివిధ కార్య విజయ సాఫల్యత దృష్ట్యా వివిధ వాహనాలెక్కాడని అన్నమయ్య రమ్యంగా చిత్రించాడు. దుష్టశిక్షణ, శిష్ట రక్షణ కోసం భగవంతుడు వివిధ అవతారాలెత్తాడు. వాటితోబాటు భక్తులను ఆదుకొనుటకు వెళ్ళాడు. వాటిలో కొన్నిటిని అన్నమయ్య వర్ణించాడు.

**"ఎట్టు నేరిచితివయ్య యిన్ని వాహనము లెక్క**
**గట్టిగా నిందుకే హరి కదు మెచ్చేమయ్యా ॥పల్లవి॥ (20-105)** అన్నాడు.

స్వామివారు గరుడుడు, పుష్పకవిమానం, వాయుజం, రాతిగుఱ్ఱం, పల్లకి ఎక్కి వివిధ కార్యాలను నిర్విఘ్నంగా నెరవేర్చాడని అన్నమయ్య వర్ణించాడు. వివిధ వాహనాలను ఎక్కి శ్రీ వేంకటేశ్వరస్వామి వారు చేసిన మహిమలను అన్నమయ్య వర్ణించాడు.

**5. మహిమల వర్ణన :** శ్రీ వేంకటేశ్వరస్వామి వారి సౌందర్యాన్ని ఇలా వర్ణించాడు అన్నమయ్య

**"కోటి మన్మథాకార గోవింద కృష్ణ**
**పాటించి నీ మహిమలె పరబ్రహ్మము" ॥పల్లవి॥ (2-280)**

అని వర్ణించాడు.

శ్రీ వేంకటేశ్వరస్వామి వారిని కోటి మన్మథాకారుడని వర్ణించాడు అన్నమయ్య. దానికి గల కారణాలను కూడా పేర్కొన్నాడు. ఆకాశం వంటి శరీరం కలవాడని, చంద్రునికి తన మనస్సులో జన్మనిచ్చాడని, లక్ష్మీపతి అని, నక్షత్రాలు ఆ స్వామికి ఆభరణాలని పేర్కొన్నాడు.

**6. రథ వర్ణన**

శ్రీ వేంకటేశ్వరస్వామి, అలమేలుమంగ కలసి వెళ్ళిన రథాన్ని గూర్చి అన్నమయ్య ఇలా వర్ణించాడు. అమ్మవారితో కలిసి ఉన్నప్పుడే స్వామివారికి పూర్ణత్వం సిద్ధిస్తుందని అన్నమయ్య భావించినట్లుగా తెలుస్తున్నది.

**"దేవదేవుఁ డెక్కెనదె దివ్యరథము**
**మావంటి వారికెల్ల మనోరథము" ॥ పల్లవి ॥ (1-400)**

అంటూ స్వామివారి రథయాత్రను వర్ణించాడు.

అమ్మవారితో కలిసి స్వామివారు వివిధ కార్యార్థమై దివ్యరథము, పైడిరథము, దేవేంద్ర రథము, పుష్పక రథము విష్ణు రథము, కళ్యాణ రథము, ఘనమైన రథములను ఎక్కి విహరించారని అన్నమయ్య పేర్కొన్నాడు. భార్యాభర్తలు అన్యోన్యంగా ఉంటూ

సుహృద్భావంతో సహజీవనం చేయాలనే కౌటుంబిక దృక్పథాన్ని పై సంకీర్తనలో అన్నమయ్య ధ్వనింపజేశాడు.

అదేవిధంగా శ్రీ వేంకటేశ్వరస్వామి వారి దేహాన్ని ఇలా వర్ణించాడు అన్నమయ్య.

**7. దేహ వర్ణన**

**"వందే వాసుదేవం**
**బృందార కాధీశ వందిత పదాబ్జం" ॥పల్లవి॥ (1-53)** అంటూ వర్ణించాడు.

శ్రీ స్వామివారి వక్షస్థలాన్ని, నయనాలను, చేతులను, శరీరఛాయను ఉన్నతంగా వర్ణించాడు. ఇక దేవదేవుడైన ఆ స్వామివారి నామాన్ని అన్నమయ్య ఇలా వర్ణించాడు.

**8. నామవర్ణన**

**"నీ నామమె మాకు నిధియు నిధానము**
**నీ నామమే యాత్మ నిధానాంజనము" ॥ పల్లవి ॥ (4-425)**

అంటూ ఆ స్వామివారికున్న వివిధ నామాలను శ్లాఘించాడు. ఆ స్వామివారికి నారాయణ, గోవింద, మధుసూధన, వామన, హృషీకేశ, దామోదర, వాసుదేవ, అచ్యుత, జనార్ధన, శ్రీ వేంకటేశ అనే నామాదులున్నాయని పేర్కొంటూ ఆ నామాల వైశిష్ట్యాన్ని కూడా అన్నమయ్య వర్ణించాడు.

**9. స్వరూప వర్ణన**

శ్రీ వేంకటేశ్వరస్వామి వారి స్వరూపాన్ని వర్ణించాడు అన్నమయ్య. జానపద బాణీలో, వ్యావహారిక భాషలో శ్రీ స్వామివారి స్వరూపాన్ని చక్కగా వర్ణించాడు అన్నమయ్య.

**"చిఱుత నవ్వులవాఁడు శిన్నెకా వీఁడు**
**వెఱపెఱఁగడు సూడవే సిన్నెకా" ॥ పల్లవి ॥ (5-182)**

అంటాడు అన్నమయ్య. పాలను మేనివాడు, బోరవీపువాడు, సెలసుమోరవాడు, మేటి కురచవాడు, మెడమీద గొద్దలి సీటకాలవాడు, బింకపు మోతల పిల్లగోవివాడు అంటూ శ్రీ వేంకటేశ్వర స్వామి వారి స్వరూపాన్ని జానపద శైలిలో వర్ణించాడు.

మరొక సంకీర్తనలో శ్రీ వేంకటేశ్వరస్వామి వారు గోపాలబాలుడైన రీతిని పరమాద్భుతంగా వర్ణించాడు అన్నమయ్య.

**10. బాలకృష్ణుని వర్ణన**

**"పరమ పురుషుపు గోపాల బాలుడైనాడు**
**మురహరుడు యెదుట ముద్దుగారీ నిదివో" ॥పల్లవి॥ (12-17)**

అంటూ ఆ దేవదేవుడు మానవ రూపమెత్తి గొల్లవారి ఇంట పుట్టాడంటాడు అన్నమయ్య. వేదపురాణాలలో విహరించే దేవుడు, ఆదిమూలమైనట్టి అలబ్రహ్మము, నారదాదులు మొక్కే ఆకారము, జీవులలోని అంతర్యామి, వేంకటాద్రి మీద చేరిన వరదుడు అయిన ఆ దేవాదిదేవుడు మానవ జన్మమెత్తి వివిధ లీలలను ప్రదర్శించినట్లు అన్నమయ్య సుకుమారంగా చిత్రించాడు. అలా గోపాలబాలుడైన బాలకృష్ణుని రూపాన్ని ఇలా వర్ణించాడు అన్నమయ్య.

**"చిన్ని శిశువూ చిన్ని శిశువూ**
**యెన్నడూ జూడమమ్మ యిటువంటి శిశువూ"** ॥పల్లవి॥ **(6-1)**

పై సంకీర్తనల్లో బాలకృష్ణుని రూపలావణ్యాలను ముగ్ధమనోహరంగా చిత్రించాడు అన్నమయ్య. అన్నమయ్య తన సంకీర్తనల్లో అష్టాదశ వర్ణనలతోబాటు భగవంతుని సృష్టిలోని ప్రతి అంశాన్నీ శ్రీ వేంకటేశ్వరస్వామి వారికి అన్వయించి రమ్యంగా వర్ణించాడు.

***

# అన్నమయ్య కీర్తనలలో రామకథ

**డా॥ వై. విజయలక్ష్మి**
**అసిస్టెంట్ ప్రొఫెసరు (తెలుగు)**
**రాష్ట్రీయ సంస్కృత విద్యాపీఠము**
**తిరుపతి**

ఆంధ్ర సాహిత్యంలో భగవత్ భక్తి అనేది తంతర్లీనమై ఉన్నది. భారతీయ సంస్కృతికి కారణభూతములైన, వేదార్థ ప్రతిపాదకములైన వేదార్థ ప్రభోధకములైన రామాయణ, మహాభారతాలలో అన్ని శాస్త్రంలూ అంతర్లీనమై ఉన్ననూ, అందలి ఉత్తమోత్తమము, రమ్యమైన రామాయణమే. రామ రసమును గ్రోలిన వారు మధుర ఝుంకారముల వంటి గానములు సేయక మానరు కదా. జంతు పక్ష్యాదులే రామనామ గానామృతముతో పరవశించినపుడు మనసెరిగిన, మనస్సు గల మానవుని హృదయ స్పందనను గూర్చి యిక చెప్పనవసరంలేదు.

తెలుగు నందు మొదటి సంకీర్తనాచార్యులు శ్రీ తాళ్ళపాక అన్నమాచార్యులు నారాయణసూరికి, లక్కమాంబకు వైశాఖ పూర్ణిమ నాడు విశాఖ నక్షత్రమందు శ్రీ వేంకటేశ్వర స్వామి వరప్రసాదమున ఖడ్గాంశ సంభూతుడిగ శ్రీ అన్నమయ్య జన్మించాడు ప్రప్రథమ వాగ్గేయకారుడైన శ్రీ అన్నమయ్య కలియుగ ఆరాధ్య దైవపురుషుడైన శ్రీ

వేంకటేశ్వరునిపై అనన్య భక్తితో 32 వేల కీర్తనలు రచించాడు. ఇందు త్రేతాయుగ అవతార పురుషుడైన శ్రీరామునిపైనను కీర్తించాడు.

తమిళ ద్రావిడ ప్రబంధం నందు నిమగ్నమైయున్న వైష్ణవభక్తి సాహిత్యంను ఆంధ్ర భాషలో తెలుసుకోవలెనన్న హరి సంకీర్తనాచార్యుడైన అన్నమాచార్యుని కీర్తనలను వినవలసినదే, ఆనందంతో పరవసించ వలసినదే. రాముని నామము నందే సర్వవేద శాస్త్రాంతర్గతమైన తత్వమునకు మూలమైన అష్టాక్షరీ మంత్రమూ, పంచాక్షరీ మంత్రము సహితం కూడి ఉన్నవి. కేవల సాహిత్య దృష్టితో కాక, సంగీత సారస్వతమును ఎరింగిన కీర్తనాచార్యులైన త్యాగయ్య, అన్నమయ్య, రామదాసు మొదలగు వారందరును కూడా రామనామ మహత్యంను ఎరింగిన మహానుభావులే కదా. హరిభక్తుడైన అన్నమాచార్యునికి సంగీత మాత సాధనముగా బలము నిచ్చినది. నాదమే బ్రహ్మమనియు, సంగీత సాధనలో అవస్యమూ అనుసరించ వలసిన ఉశ్వాస, నిశ్వాస నియమాలు, ప్రాణాయామ సాధనలోని కుంభక రేచకాదులతో సమానములే కదా. రామనామ సంకీర్తనమే సత్వర తరుణోపాయంగా యిహపర సాధనంగా కూర్చినారు వాగ్గేయకారు లెందరో. హరి సంకీర్తనా చార్యుడైన అన్నమాచార్యుడు రామక్రియ రాగంలో, త్రిశనడ తాళంలో చేసి ఈ కీర్తనను ఆస్వాదిద్దాము.

**"ఈతడు వో రాముడు ఏకాంగవీరుడు**
**ఏతల జూచినా తానె ఇరవుకొన్నవాడు"** **॥ఈతడు॥**

మోక్షోపాయములతో శీఘ్రసాధనం ఏమనగా భగవన్నామ సంకీర్తనమే. కనుకనే దేవాలయములలో అష్టోత్తర, శత, సహస్ర నామంలను పేర్కొని నమః అనుచున్నారు. నమః అనగా ఏమనగా భగవంతునికి నేను దాసుడను అని అర్థము. అన్నమయ్య గారి నమోకీర్తనలు ఎన్ని ఉన్నను ఈ రామనామ కీర్తనను విందాము.

**"నమో నమో దశరథ నందన రామా**
**కమనీయ యాగ భాగకర్త రామా** **॥నమో॥**

ఈ విధముగా ఎన్నో రామనామ సంకీర్తన లున్నవి. దేవునికన్ననూ ముందు మాతను స్మరించుట శ్రీ వైష్ణవ సంప్రదాయము. శ్రీనివాసుడు అన్న పేరులోనే శ్రీ ముందున్నది కదా. అట్లే సీతారాములను ఒకటిగా పేర్కొంటూ వారికి జయం అగుగాక అంటూ చేసిన ఈ సంకీర్తనను విందాము.

**"జయ జానకీ రామణ"**

అసలు రాముడనే వాడున్నాడా, లేదా అంటూ ఆస్తిక, నాస్తికులు మధనపడుతూ వుండగా అన్నమయ్య తేలికగా యిచ్చిన తీర్పు చూదండి -

**"కలడో లేడో శ్రీరాముడు**
**- నన్ను గన్న శ్రీరాముడు"**

రామా నీవు కనిపించవేమి అందుకు కారణమేమి? అంటూ రామపాద మహిమను కూడా ఎంత చక్కగా తలచారో సంగీతంలో మలచారో ఆస్వాదిద్దాం.

**"కనులకు కనిపించ వేమి"**

మీరెవరనగా రాముని వారము, మాకేమి విచారము స్వామీ నీవే భారము రామా నీవే ఆధారం అని కీర్తించగా రాముడు రాడా, కనరాడా, వినరాడా ఆ దేవుని దేవదేవుని దివ్యప్రభావంను భజే అంటూ చేసిన గానం భగవంతుని సహితం డోలోత్సవంలో ముంచుతున్నది.

**"దేవదేవం భజే దివ్య ప్రభావం**
**రావణాసుర వైరి రఘుపుంగవం"**

ఎవరండీ ఈ రాముడు ఈతని కథ ఏమిటి అన్నదానికి సమాధానంగా ఎంత చక్కగా కీర్తించారో చూడండి.

**"రాముడు రాఘవుడు రవికులు డితడు**
**భూమిజకు పతియైన పురుష నిధానము"**

రాముడు రాముడే కాదు ధాముడు, రణరంగ భీముడు, వరుడు, శరుడు, స్థిరుడు, గురుడు, ధీరుడు, ధారుడు, శూరుడు, సారుడు, బ్రహ్మ సాకారుడు అంటూ చేసిన గానమును విందాము.

**"రాముడు లోకాభిరాముడు త్రైలోక్య**
**ధాముడు రణరంగ భీముడు వాడె"**

రాముని గూర్చి రామకథను గూర్చి ఎంత చక్కగా గానం చేస్తున్నారో వినండి.

**"రామచంద్రుడితడు రఘువీరుడు**
**కామిత ఫలము లియ్య గలిగె నిందరికి"**

రాముడు సత్యకాముడు, సత్యసంకల్పుడూ అయిన పరమాత్మయే. దశరథ రాముడు అంటూ కోదండరాముని యిలా కీర్తిస్తున్నారు అన్నమాచార్యులవారు.

**"రామ దశరథరామ నిజ సత్య**
**కామ నమోనమో కాకుత్థ్సరామ"**

రఘువీరుడు, రఘువంశ తిలకుడు ఐన రామభద్రుడు కామధేనువు వంటివాడు. రామనామమే కామధేనువు అంటూ చేసిన గానము వినవలసినదే. అనవలసినదే. కనవలసినదే. మనము తెలుసుకొనవలసినదే. మనమున నిలుపుకొన వలసినదే.

**"రామభద్ర రఘువీర రవివంశ తిలక నీ**
**నామమే కామధేనువు నమోనమో"**

అందరినీ తరింపజేసే ఆ భగవంతుడు ఎవరనగా ఆ "తారక బ్రహ్మము తానై ఉన్నాడు. ధారుణితో చెలువొందె దశరథ రాముడు" అన్ని కీర్తనలో రామసేవ, రామసేన మనకు కనిపిస్తుంది. వినిపిస్తుంది.

**"తారక బ్రహ్మము తానై వున్నాడు**
**ధారుణితో చెలువొందె దశరథరాముడు ॥తారక॥**

దేవుడు పిలిస్తే పలుకుతాడా రామా అనగానే సమస్త వేదములను, అష్టాక్షరీ, పంచాక్షరీ మంత్రములను ఒక్కసారిగానే జపించినట్లే కదా కనుకనే ప్రతి పంక్తిలోనూ రామ సంభోదన చేస్తూ, రాముని పిలుస్తూ మన హృదయంలో ఉన్న అంతర్యామిని సహితం ఆహ్వానిస్తున్నట్లుగా లలిత మృధుల పదాలతో చేసిన గానము విన్నవారు ధన్యులు కదా.

**"జయజయరామ సమర విజయరామ**
**భయహర నిజ భక్తపారాణ రామా"**

అన్న కీర్తనలో సౌమిత్రి రామా, సీతారామా, అయోధ్యరామా, కౌసల్యరామా, ఆదిత్యకుల రామా, కోదండరామా, దశరథరామా, లోకాభిరామా, మాయామృగాంతక రామా, సుగుణరామా, శ్రీ వేంకటాద్రి రామా, మనువంశ రామా అని కీర్తించాడు అన్నమాచార్యుల వారు.

రాముడు పంపిన హనుమత్ సందేశంను విని సీత యిచ్చిన శిరోమాణిక మును తెచ్చి యిచ్చిన హనుమంతుడు రాముని ఎలా కీర్తిస్తున్నాడో వినండి.

**"ఇదె శిరసు మాణిక్య మిచ్చి పంపె నీకు నాకె**
**అదనెఱిగి తెచ్చితి నవ ధరించవయ్యా ॥ఇదె॥**

**రామ నినుబాసి నీ రామనే చూడగ నా**
**రామమున నిను పాడె రామరామ యనుచు**
**ఆమెలుత సీతయని యపుడునే తెలిసి**
**నీముద్ర వుంగరము నే నిచ్చితిని ॥ఇదె॥**

**కమలాప్తకులుడ నీ కమలాక్షి నీ పాద**
**కమలములు తలపోసి కమలారి దూరె**
**నెమకి యాలేమను నీదేవి యని తెలిసి**
**అమరంగ నీ సేమమటు విన్నవించితిని ॥ఇదె॥**

**దశరథాత్మజ నీవు దశశిరుని చంపి, యా**
**దశమన్న చెలిగావు దశదిశలు పొగడ**
**రసికుడ శ్రీ వేంకట రఘువీరుడా నీవు**
**శశిముఖి చేకొంటివి చక్కనాయ పనులు"** ॥ఇదె॥

ఈ రామనామ గానం వలన సర్వపుణ్య ఫలము కలుగుతుందంటూ శతకోటి విస్తరంగా, విస్తరించి చేస్తున్న యితడే రాముడు, పరబ్రహ్మ యితడే.

**"ఇతడే పరబ్రహ్మ మిదియే రామకథ**
**శతకోటి విస్తరము సర్వపుణ్య ఫలము"**

రాముడు ఎందుకు పుట్టాడు, ఏమి సాధించాడు తెలుసుకోండి అంటూ –

**"అదె లంక సాధించెనవని భారము దించె**
**విదితమై ప్రతాపము వెలయించె నితడు.**

రాతిని స్త్రీగా చేసిన గొప్ప మహనీయుడు ఎవరో కాదు మన శ్రీరాముడే అని అన్నమయ్య ఈ కీర్తనలో కీర్తిస్తున్నాడు.

**"సీతాసమేథ రామ శ్రీరామ**
**రాతి నాతి జేసిన శ్రీరామ రామ"**

రామా, రవికులసోమా చాలుచాలు రామనామమే చాలు. రామనామమే మేలు. రామా నీవు నన్నుయేలు రాముడే చాలు. రామబాటే అందరికీ పాట. రామకోట ఏదనగా రామనామ నిలయమే. రామా ఎన్నడైననూ నిను పాయక లేను. విరాజరాజా, ముఖలిత రాజా నీ భక్తిలో శక్తి అంతయూ విరక్తితో స్తుతి చేయగా నీజభక్తులు పొగడిన వ్యక్తిని చూసి శక్తి కలుగుతుంది కదా. శ్రీరాముని దేవునిగా తెలుసుకొని ఆశ్రయించిన శరణాగతి చేసిన ఎందరో మహానుభావులు రామదాసు లైనారుకదా. బ్రహ్మానంద భరితుడైన రామనామామృతమును గ్రోలిన భక్తునికి రాముని సాక్షాత్కారము సిద్ధమూ, సత్యము. రాముడు అవతారము చాలించి యుగాలు గడిచాయి. అయినా శ్రీరాముని ప్రభావ మెంత మాత్రమూ తగ్గలేదు. ఆంధ్రదేశంలో బడి లేని ఊరు ఉందేమోగాని గుడిలేని (రామాలయం) ఊరు లేదు. ఇంత ఖ్యాతి ఆ దశరథుని కుమారునికి రావడానికి కారణం ఆయనలోని సద్గుణపుంజమే. సకల కళ్యాణగుణ నిలయుడా దేవుడు. ఆ మర్యాదా పురుషోత్తముని గుణాలలో ఏ ఒక్క గుణాన్ని అలవరచుకున్నా మనం ధన్యులమై పోతాము.

**"రామ రామ యన్న రారాదు పాపంబు**
**రామ రామ యన్న రాదు భయము**
**రామ రామ యన్న రారాదు మృత్యువు**
**రామ రామ మమృత రాశి యగును"**

తెలుగునాట జనం నోట వినిపిస్తున్న ఈ పద్యంను ఎవరు ఎప్పుడు చెప్పారో తెలియదు. ఎవరి పద్యం అయినా రామనామం అమృతం అని చాటి చెప్పింది.

శ్రీరాముడు కేవలం రాక్షస సంహారం కోసం అవతరించలేదు. మనుష్యులకు మానవ ధర్మం నేర్పడానికి అవతరించాడు. మానవులకు, సమస్తజీవులకు ఆయన ధర్మోపదేశం చేశాడు. ఆయా జీవుల మర్యాదలకు భంగం కలుగనివ్వలేదు. అందుచే శ్రీరాముని మర్యాద పురుషోత్తముడంటారు. ఎండకు బాగా తపించి పోతున్న వారికి మేఘం ఏవిధంగా సంతోషం కలిగిస్తుందో శ్రీరాముడు తన రూప సౌందర్యముతో ప్రజల దృష్టిని ఔదార్యగుణములతో వారి చిత్తమును ఆకర్షించి, చిత్తదోషములను హరించి ఆనందింపచేసేవారు.

**"ఆపదామపహర్తారం దాతారం సర్వసంపదామ్**
**లోకాభిరామం శ్రీరామం భూయోభూయో నమామ్యహమ్"**

ఆపదలను పోగొట్టువాడును, సమస్త సంపదలను ఇచ్చువాడును, లోకమునకు ఆనందమును కలుగజేయు వాడగు శ్రీరామునకు మరల మరల నమస్కరించు చున్నాను.

**"శ్రీరాఘవం దశరథాత్మజ మప్రమేయం**
**సీతాపతిం రఘుకులాన్వయ రత్నదీపమ్**
**ఆజానుబాహు మరవిందదళాయతాక్షం**
**రామం నిశాచర వినాశకరం నమామి.**

రఘువంశ తిలకుడును, దశరథ పుత్రుడును, అప్రమేయుడును, సీతాపతియు, రఘుకులమునకు రత్నదీపము వంటివాడును, ఆజానుబాహువులు కలవాడును, కమలముల వంటి నేత్రములు కలవాడును, రాక్షసాంతకుడును అగు శ్రీరామునకు నమస్కరించుచున్నాను. ;

**"రామాయ రామభద్రాయ రామచంద్రాయ వెథసే**
**రఘునాథాయ నాథాయ సీతాయః పతయేనమః"**

రామభద్రుడును, రామచంద్రుడును, బ్రహ్మస్వరూపుడును రఘునాథుడును, రాజశ్రేష్ఠుడును, సీతాపతి యగు శ్రీరామచంద్రునకు నమస్కారము.

***

# అన్నమయ్య సంకీర్తనల్లో వృత్తులు

**శ్రీ ఎస్.మణి**
**పరిశోధక విద్యార్థి**
**తెలుగు అధ్యయన శాఖ**
**శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం**
**తిరుపతి**

అన్నమయ్య సంకీర్తన సాహిత్యం సంగీత, సాహిత్య సాగరసంగమం. తెలుగు వాగ్గేయకారుల్లో అన్నమయ్య ఆద్యుడు. సంగీత సాహిత్యాత్మకమైన అన్నమయ్య సంకీర్తన అటు సంగీత శాస్త్రానికి, ఇటు సాహిత్య శాస్త్రానికి, వాటి ప్రయోగ విధానానికి అవకాశాన్ని ఇచ్చింది. భజన సాంప్రదాయంలో సంగీత ప్రాధాన్యంతో ప్రచారాన్ని పొందిన అన్నమయ్య సంకీర్తనలు సాహిత్య దృష్టిలో కూడా ఎంతో విలువను కల్గి ఉంది.

కులం, వర్ణం, జాతి అనే మాటలకు నైఘంటికార్థంలో క్రింది విధంగా కన్పిస్తుంది.

**కులం :** వంశం, తెగ, జల్లు, శరీరం, ఊరు మొదలైనవి.

**వర్ణం :** రూపం, అక్షరం, బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్ర, స్తుతి, గుణం మొదలైనవి.

**జాతి :** బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్ర, క్షారక, రజక, వస్త్ర, చ్ఛేదక, చర్మకార, తిలకాఘాతలుద్దక, చండాల, మాతంగ, వ్యవహారిక, గోరక్షక, పంచాణ, శిల్పక, కుంభకార, తంతువాయ మొదలైనవి.

మొదట్లో ఈ కుల, వర్ణ, జాతులనేవి వ్యక్తులు చేసే వృత్తులను బట్టి ఏర్పడ్డాయే కానీ, వ్యక్తుల్ని బట్టి కాదు. మానవ సమాజాన్ని వారి వారి రంగులను బట్టి గుర్తించే విధంగా ఒకప్పుడు ఉండేది. తెల్లవారు, నల్లవారు అనే వ్యత్యాసం ఇలాంటిదే. అలాగే ఆర్యులంటే పసిమి రంగు గలవారని, ద్రావిడులంటే నల్లవారనేది కూడా ఇలాంటిదే. ఒక కులం వారు వేరొక కులం వారిని, ఒక జాతి వారు వేరొక జాతి వారిని, ఒక వర్ణకుడు వేరొక వర్ణకం వారిని హెచ్చుతగ్గులుగా చూడటం ఎప్పటి నుండో ఉంది. ఈ హెచ్చుతగ్గులను తొలగించడానికి బౌద్ధులు, వీరశైవులు, ఆళ్వారులు కొంత కృషి చేశారు. ఇందుకు సంబంధించి వాగ్గేయకారులు ప్రజల మధ్య తిరుగుతూ వారి బాణీలోనే వారి వృత్తులకు సంబంధించిన పరమార్థాన్ని తెలియజేస్తూ వచ్చారు.

వృత్తి అనే పదానికి నిఘంటువుల్లో జీవనోపాయం, బ్రతుకు, ఉద్యోగం, కాయకం, జీవం, జీవనం, ప్రవర్తనం, ప్రవృత్తి, వర్తనం అనే అర్థాలున్నాయి. ప్రజలు

తమ దైనందిన జీవనమునకు అనేక రకాల పనులను చేస్తారు. వీనినే వృత్తులు అంటారు. ఒకే వృత్తిని స్వీకరించేవారు తమ వృత్తిరక్షణకై సంఘాలుగా ఏర్పడిరి. రాను రాను ఈ వృత్తి బేధములే కుల బేధములుగా మార్పు చెందినవి. ఇందులో ఒక వృత్తిని వంశపారంపర్యముగా ఆ వృత్తికి సంబంధించిన వర్గము వారే నిర్వహింతురు. ఒకే వృత్తిని అనేక కులముల వారు కూడా నిర్వహించుట కలదు. వ్యాపారము, వ్యవసాయము మొదలైన వాటిని కుల వివక్షత లేకుండా బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్రులలో ఉన్న కులాలు మున్నగు వారు చేయడం మనం చూస్తున్నాం. పట్టణాల్లో కంటే గ్రామాల్లో ఈ వృత్తులను వంశపారంపర్యంగా పాటించుట గమనించవచ్చు. గ్రామాల్లో ఆయా కులాలకు సంబంధించిన వారే ఆయా వృత్తులను నిర్వహించుచుంటారు. కానీ పట్టణాల్లో జీవనోపాధికి ఏ పనినైనా ఎవరైనా చేయడానికి వెనుకాడరు. కాబట్టి ఇక్కడ వారు చేసే పనులను బట్టి వారి కులమును నిర్ణయించడానికి వీలుకాదు.

తాళ్ళపాక అన్నమయ్య తన సంకీర్తనల్లో వృత్తికి సంబంధించిన అనేక విషయాలను తెలియపరిచారు.

అన్నమయ్య సంకీర్తనల్లో వృత్తులను (1) స్థిర వృత్తులు (2) సంచార వృత్తులుగా విభజించుకోవచ్చు.

**స్థిర వృత్తులు** : స్థిరంగా ఒక దగ్గర ఉంటూ చేసే వృత్తులను స్థిర వృత్తులు అంటారు.

**వ్యవసాయం** : భారతదేశంలో 75 శాతం ప్రజల ముఖ్యవృత్తి వ్యవసాయం. గ్రామీణ జీవితానికి జీవం వ్యవసాయం. అన్నమయ్య సంకీర్తనల్లో కూడా వ్యవసాయానికి సంబంధించిన విషయాలు కనపడుతాయి. అన్నమయ్య నివశించిన ఊరు తాళ్ళపాక. ఆ గ్రామం యొక్క ప్రజల వృత్తి వ్యవసాయం. అంతేకాకుండా అన్నమయ్య పర్యటించిన ప్రదేశాలు గ్రామాలే కావడం అక్కడి ప్రజల ముఖ్యవృత్తి వ్యవసాయం కావడం ఇందుకు కారణం. వ్యవసాయానికి సంబంధించిన విషయాలు అన్నమయ్య సందర్భోచితంగా వాడారు.

అన్నమయ్య ఆధ్యాత్మికంగా వ్యవసాయానికి సంబంధమున్న విషయాన్ని క్రింది విధంగా చెప్పారు.

**"పంటల భాగ్యులు వీరాబాహు వ్యవసాయులు**
**అంటి ముట్టి యిట్లఁగా పాడుదురు ఘనులు"** **(9-70)**

అన్నమయ్య పొలము శబ్దాన్ని ఎక్కువగా ప్రయోగించడం వల్ల ఆనాడు సాగుకు కావలసిన పొలము అందుబాటులో ఉండేదని తెలుస్తుంది.

**"తిమ్మిరెడ్డి మాకు నిచ్చె దిష్టమైన పొలము**
**బొమ్మిరెడ్డి కప్పగించి పోది సేసె బొలము"** **(10-52)**

పండిన ధాన్యాన్ని నిల్వ చేయుటకు గాదులను ఉపయోగించారు అనే విషయం దిగువ సంకీర్తన ద్వారా తెలుస్తుంది.

**"పంచ మహాపాతకాల భైరు విత్తు దేహాల**
**కంచపు గొలుచులుగా గాదెలుఁబోసి" (11-2-10)**

అప్పుడు సంతలు ధాన్యం అమ్మడానికి విక్రయకేంద్రాలుగా ఉన్నాయి అనడం క్రింది సంకీర్తన ద్వారా సుస్పష్టం.

"సంతలే చొచ్చారి గాని సరకు గాననైతి" (2-27)

అన్నమయ్య కాలంలో ఏఏ పంటలు పండించేవారో తెలుసుకునేందుకు కూడా ఆధారాలున్నాయి.

**"గంపెడుముక దినఁగానొక్క వరిగింజ**
**తెంపునఁ గలసితే తెలియనెట్టు వచ్చు" (2-494)**
**"చక్కిలాలు నదుకులు సనిగె పప్పులు" (1-256)**
**"చుట్టి వరి గురుమతో జొన్న గింజ సరిఁదూగు" (3-14)**
**"గయ్యాళి రతిగన్నదె కంది కుదుమన్నమాట" (13-261)**
**"దొఱ్ఱి పెసలు గొలిచినట్టి దోసమేల పాయను" (1-171)**
**"చెక్కిన మెత్తని తూట చెఱకులును" (1-256)**
**"ఉల్లిదిన్న కోమటూరక వున్నట్లు" (2-494)**
**"జల్లెడ నావాలు జారిపోయినట్టు" (2-494)**

వరి, శనగ, జొన్న, కంది, పెసలు, చెఱకు, ఉల్లి, ఆవాలు మొదలైన పంటలు పండించేవారని అన్నమయ్య సంకీర్తనల్లో తెలుస్తున్నది.

**వైద్యము:** పూర్వకాలంలో ఆయుర్వేదమునకు ఎక్కువ ప్రాధాన్యముండేది. ఇలాంటి వైద్యులు అడవుల్లో, కొండల్లో తిరుగుతూ మూలికలు సమకూర్చి తగుపాళ్ళలో మిళితంచేసి తగు మోతాదులో ఈ ఔషధాన్ని రోగులచే సేవింప చేసేవారు. భయంకరమైన వ్యాధులను సైతం ఆనాడు ఆయుర్వేదంతోనే నయం చేసేవారు.

అన్నమయ్య సంకీర్తనల్లో వైద్యం గూర్చిన అనేక విషయాలు కన్పిస్తాయి. అందుకు సంబంధించి అన్నమయ్యకు నమ్మకానికి సంబంధించిన విషయం పట్ల అవగాహన ఉండటం, అన్నమయ్య ఆధ్యాత్మిక విషయాలు సైతం వైద్యంలో ప్రస్తావించారు.

**శ్రీ హరి పాదతీర్థ మహిమను కీర్తించుట:**

**"శ్రీహరి పాద తీర్థమే చెడని మందు**
**మోహ పాశాల గోసి మోక్షమిచ్చే మందు" (అ.చరిత్ర పు.35)**

'మనోవ్యాధికి మందులేదు' అనే మాటను ప్రస్ఫుటంగా చెప్పారు.

**"మనసులోని నెప్పికి మందు లేదు"** **(13-196)**

వైద్యుని మీద నమ్మకం ఉండాలి అని చెపుతూ భవరోగ వైద్యుని గూర్చి ఇలా చెప్పారు అన్నమయ్య.

**"వేద వేద్యులు వెదకేటి మందు**
**ఆది నంత్యము లేని మందు"** **(5-2)**

**"సకల జీవుల కెల్లా సంజీవి యీ మందు**
**పెకలువై యిందరు సేవించరో యీ మందు"** **(1-468)**

జనపదులు ప్రకృతిలో దొరికే వస్తువులనే వైద్యంగా వాడతారు. అవి వేర్లు, వెల్లంకులు కావచ్చు.

**"వేద మంత్రమిక నేల వేరు వెల్లంకుల నేల**
**పుడమిధరుడు మాకు భోవనౌషధము"** **(5-286)**

ఆయుర్వేదంకు సంబంధించిన విషయాన్ని అన్నమయ్య ప్రస్తావించారు.

**"అడవి మందులు గషాయము నెల్లవారు**
**కదగానక కొగగాను"** **(1-2)**

**కంసాలి:** ఈ వృత్తిని చేసేవారిని కంసాలి లేక అగసాలి వారు అని పిలుస్తారు. కంసాలి అంటే బంగారు, వెండి పని చేసేవారు. స్వర్ణకారుడు అని కూడా అంటారు. కానీ కోస్తాలో కొన్ని ప్రాంతాల్లో (శ్రీకాకుళం, విజయనగరం) లో వడ్రంగిని కూడా కంసాలి అనే పిలుస్తారు. కంసాలి వారు కావలసిన నగలను బంగారు, వెండి మొదలైన లోహములతో తయారుచేస్తారు. వీరు అలంకరించుకొను ఆభరణాలనే కాక వజ్రములు మొదలైన నవరత్నములతో పొదగబడిన వానిని కూడా మిక్కిలి నైపుణ్యంతో చేస్తారు.

**"ఇక లేక యెదరికి యినుమడిచే వారికి**
**తన తగర మదువ దదవయ్యానా"** **(8-61)**

అని అన్నమయ్య తెలిపారు.

**కమ్మరి:** రాగి, ఇత్తడి, కంచు, ఇనుము మొదలైన లోహములతో బిందెలు, తట్టలు, చెంబులు మొదలగు గృహోపకరణాలు, నాగలి, పార వంటి వ్యవసాయ పనిముట్లు, కత్తులు, బల్లెము, కవచాలు వంటి యుద్ధ సంబంధ పరికరాలు చేసే వారిని కమ్మరి అంటారు. సమాజంలో వీరి అవసరం ప్రతి ఒక్కరికి ఆశించదగింది. పూర్వం అద్దములను కూడా కంచుతో తయారు చేయుచున్నట్లు తెలుస్తున్నది. ఈ అద్దము ప్రసక్తి తాళ్ళపాక వారి సాహిత్యంలో కలదు.

**"మాగుదు కప్పిన యుద్ధము దోమితను**
**గట్టిగా విశ్వమెల్లా ప్రకాశించినట్టు"** **(21-327)**

**"తన మలిన మద్దము తా దోముకొనునా**
**కనుగొనేటి యుద్ధము గలవాడు దోముగాక" (21-347)**

**కుమ్మరి** : మట్టిలో రకరకాల వస్తువులను వీరు తయారు చేస్తారు. కుమ్మరి సారెపై మట్టి ముద్ద నుంచి అది గిర గిర తిరుగుతున్నప్పుడు వీరు చూపే హస్తకళా నైపుణ్యం ఆసక్తికరంగా ఉంటుంది. ధనికులు మొదలు అత్యంత నిరుపేద వరకు ఏదో ఒక సందర్భంలో మట్టిపాత్రను వాడవలసిన అవసరం ఉంటుంది. చిన్న పిల్లలు ఆడుకోవడం నుండి పెళ్ళిళ్ల సందర్భంలో, శుభకార్యాలు చేసే సందర్భంలో, మరణానంతరం ఇలా వివిధ సందర్భాలలో కుండలు అవసరం.

అన్నమయ్య సంకీర్తనల్లో కుమ్మరి వారి ప్రసక్తి పలుచోట్ల కన్పిస్తుంది.

ఒక కుమ్మరి అతను స్వామి వారికి రోజూ వంట కుండలు చేసి అర్పించి, అందులో వచ్చిన ఆదాయంతో జీవనం సాగించేవాడు. కుండలు చేయడం ఎక్కువ అయినందువల్ల అతనికి స్వామి దర్శనం లభించేది కాదు. కొయ్యతో శ్రీనివాసున్ని తయారు చేయించి కుండలు చేయుచుండగా మిగిలిన మట్టితో పూవులుగా తయారు చేసి స్వామిని ఆరాధించేవాడు. తొండమానుడనే రాజు స్వామి వారికి రోజూ బంగారు పూవులతో పూజ చేసే వాడు. ఒకరోజు స్వామి పాదాలపై బంగారు పూలు జారి ఉన్నాయి. మట్టిపూలు స్వామివారి పాదాలపై ఉన్నాయి. రాజు ఆ విషయాన్ని విచారించగా కుమ్మరి తనయుడు అర్పించిన పూలు అని తెలుసుకున్నాడు. రాజు 'కురువరతినంబి'ని దర్శించి అలాంటి యోగ్యతను ప్రసాదించమన్నాడు. రాజు అనే అహంకారం తొలగించుకొన్నాడు. స్వామివారి సాన్నిధ్యం చేరుకొన్నాడు. 'కురువరతినంబి' ని గూర్చి అన్నమయ్య ఒక కీర్తనలో ఇలా అన్నారు.

**"కుమ్మర దాసుడైన కురువరతి నంబి**
**యిమ్మన్న వరములెల్లా యిచ్చిన వాడు" (5-93)**

అని కీర్తించారు.

అన్నమయ్య ఆధ్యాత్మిక దృష్టితో ఇలా అన్నారు.

మానవుడు తొలి జన్మమున చేసుకొనిన పుణ్యములు 'దొంతి కడవలలోని కొలచులు' వానిలోని ధాన్యము తరుగుట, పెరుగుట అనేది మానవుని ప్రయత్నం పై ఆధారపడి ఉండును. అలాగే పుణ్యము కూడా మానవుని సుకృత, దుష్కృతములను బట్టి మారుతుంది.

**"ఎంత కాలంబైన దప్పదు యెవ్వరికి నేమనగ వచ్చును**
**దొంతి కడవలలోని కొలుచులు తొలుత పుణ్యములు" (21-275)**

రాజ్యానికి రాజు అయినప్పటికీ కులం మాత్రం కుమ్మరే కదా అనే విషయాన్ని అన్నమయ్య చెప్తూ చక్రం తిప్పే వారి ప్రాశస్త్యంతో పాటు చక్రం తిప్పడమంటే రాజనీతి చాతుర్యాలు తెలిసిన వారు అనే విషయాన్ని సూక్ష్మంగా చెప్పారు.

"ధర జక్రివైతే గుమ్మర వాడవా కాదే" (27-487)

**నేతపని / సాలె :** మానవునికి నిత్యావసరమైనది కూడు, గూడు, గుడ్డ. నిత్యావసరమైన వృత్తులలో నేత వృత్తి కూడా ఒకటి. నూలుతో బట్టలు నేసే వృత్తి చేసేవారిని సాలెవారు అంటారు. వీరిలో సాలె, పద్మసాలె, పటుసాలె, అగసాలె మొదలగు శాఖలు ఉన్నాయి.

అన్నమయ్య ఒక సంకీర్తనలో భగవంతుని నేత బేహారిగా చేసి ఈ వృత్తిని వర్ణించిన తీరు గమనించదగ్గది.

**"వాడ వాడల వెంట వాడెవో వాడెవో**
**నీడ నుండి చీరలమ్మే నేత బేహారి" (1-275)**

ఇచ్చట సర్వాంతర్యామియైన భగవంతుడు వాడవాడలో తిరిగి నీడలో చీరల మూటను దింపి వర్తకము చేయు బేహారి. అతడే నేతగాడైన కారణమున గిట్టుబాటు ధరను చూచుకొని దానికై జీవుల కర్మధనమును బట్టి తన ఇష్టము వచ్చిన ధరకు సరుకును అమ్ముతాడు. పంచభూతాలు అనే పలువన్నె నూలు వంటి వాటితో ఆరోపణ చేసి పచ్చడాలమ్మే నేత బేహారిగా వేంకటేశ్వరుని వర్ణించాడు అన్నమయ్య. గంజి పోయడం, కండెల నూలి గుణములు, పసిడి నీరు, కుచ్చులుగా కట్టడం, మైలు సంతలు, పచ్చడాలు కుట్టడం, వన్నె నూలు వడకడం మొదలైనవి నేత వృత్తికి సంబంధించిన విషయాలు.

అన్నమయ్య రాట్నాల గురించి క్రింది విధంగా చెప్పారు. నేత వృత్తికి సంబంధించిన రాట్నాన్ని కీర్తనల్లో చెప్పారు.

**"వమ్ముల రాట్నము నిలువక గుండ్రలు నిల్చునా" (2-130)**

**ఊడిగం / వెట్టి / సాకిరి :** అన్నమయ్య సంకీర్తనల్లో ఊడిగంకు సంబంధించిన పద ప్రయోగాలు కన్పిస్తాయి. సమన్యాయం లేకుండా పెట్టుబడిదారుడు చెప్పిన పనులను చేస్తూ, పొట్టకూటి కోసం పనిచేసే వారిని ఊడిగం చేసేవారు అంటారు. ఊడిగం, సాకిరి అనే పదాలు శృంగార సంకీర్తనల్లో కన్పిస్తుంది. వెట్టి, సాకిరి అనే పదాలు ఆధ్యాత్మ సంకీర్తనల్లో కూడా కనిపిస్తుంది.

ఊడిగం గూర్చి క్రింది విధంగా కీర్తనల్లో చెప్పారు:

**"పూని వూడిగేల వారు పొంచి వాకిట నుండిరి" (15-278)**

**"మేర మీరి వూడిగపు వారి మీద నింద గట్టి" (31-289)**

**"వూడిగపు వారి మేనులొరసెనిన్నంటాను**
**యేడలేసి యానలు నీవేల పెట్టేవు" (30-215)**

**"అమరుగ నూడిగపు అంగనవాయాడను" (13-397)**

వెట్టి చేసేవారికి ఎక్కువ పనులు చెప్తే వారు తప్పించుకొని తిరుగుతారు అనే విషయాన్ని అన్నమయ్య క్రింది కీర్తనలో చెప్పారు.

"ఒట్టిన మోపులు మోవనోవక వూరు విడిచి
వెట్టివాడు పారిపోగా వెదకినట్టు" (11-2-31)

'సాకిరి' గురించి క్రింది కీర్తనలో సుస్పష్టం.

"బలువుడ నందు మీద పనిగొనినోపుదువు
చలివాసి మమ్మేల సాకిరి వెట్టేవు" (15-223)

**చాకలి:** వృత్తి రీత్యా బట్టలను ఉతికి శుభ్రం చేసి ఇచ్చే వారిని 'చాకలి' వారు అంటారు. వీరినే 'మడవలి' అని కూడా అంటారు. వీరు బట్టలు ఉతికే ప్రదేశమునకు 'చాకిరేవు' అని పేరు. ప్రస్తుతం వీరినే 'రజక' అంటున్నారు. ఊర్లల్లో ఇన్ని ఇండ్లకు ఒక చాకలి కుటుంబంవారు అని ఉంటారు. ఆ ఇండ్లల్లో ఉన్న బట్టలను చాకలి వారు తీసుకొని రేవు దగ్గరకు పోయి ఉతికి అక్కడే ఆరవేస్తారు. మరలా ఏ ఇంటి వారి బట్టలు వారికి ఇస్తారు.

ఒక చోట వస్తువును వేసి మరచి పోయి మరొక చోట వెతకడాన్ని అన్నమయ్య ఈ విధంగా చెప్పారు.

"కోక చాకి యింట వేసి కొక్కిరాల వెంటబోతే
ఆకడ పురుషార్థ మందీనా జీవుడు" (8-175)

అలాగే వృత్తిరీత్యా చెప్పే కీర్తనలో ఇలా చెప్పారు.

"పైకొనినేఁ బిలువగ పలుకఁగ వచ్చేవు
చాకలి వాడవు ముంచవద్దా నీవు" (27-20)

**విప్రవినోది:** విప్రవినోది అంటే విప్ర గృహాలలో వినోదం కల్గించే వారని అర్థం. రాజులను ఆశ్రయిస్తూ సభలో వినోదం కల్గించే వారుగా వీరు ఉన్నందువల్ల వీరు ఒక ప్రత్యేక కులంగా పేర్కొనబడ్డారు. సదాశివరాయల కాలంలో (1547)లో 'విప్రవినోది' అనేమాట శాసనంలో మొదటగా కన్పిస్తుంది. విప్రవినోది మల్ల (క్రీ.శ. 1552), విప్రవినోది పెదకేశవయ్య (క్రీ.శ. 1552) పేర్లు శాసనాల్లో కన్పిస్తాయి. సదాశివరాయలకు పూర్వుడయిన అన్నమయ్య విప్రవినోదుల్ని గూర్చి క్రింది విధంగా చెప్పారు.

"అంచెల విప్రవినోదియై తిరిగేటివాడ" (30-112)

**మంగలి:** వృత్తిరీత్యా ఊర్లలోని ఇళ్ళను పంచుకొని క్షౌరం, క్షుర కర్మ చేసే వారిని మంగలి వారు లేదా నాయి బ్రాహ్మణులు అని అంటారు. వీరు వాయిద్యాలు వాయించే వృత్తి కూడా చేస్తారు. వారు తమ వృత్తి కావలసిన సామాగ్రి కత్తెర, దువ్వెన, అద్దం, గోర్లు తీసుకొనే సాధనం, కత్తి, సల్పు, సానపట్టే నునుపైన రాయి, నునుపైన వస్త్రం మొదలైన పరికరాలను తోలు పెట్టెలో భద్రపర్చుకుంటారు. ఈ తోలు పెట్టెను తీసుకొని వెళ్ళి గ్రామాల్లో ఆసాముల దగ్గర క్షుర కర్మను చేసి వస్తారు.

అన్నమయ్య మంగలి వృత్తిని గూర్చి క్రింది విధంగా చెప్పారు.

**"కాపుటూరి మంగలోజు గడి మీద రాజు గాఁగ**
**కాపు లెల్లా ఁబని మాని కందిన యట్టు"** **(11-2-31)**

**తలారులు:** దొంగతనాలు, మంచి చెడులు, నేరాలు మొదలైనవి చూడటానికి తలారులు ఉంటారు. దొంగతనాలు జరుగకుండా గ్రామాల్లో రాత్రులలో వీధుల్లో తిరుగుతూ కావలికాసే వారిని 'తలారులు' అంటారు. పెద్ద వారు చిన్న చిన్న సభలు ఏర్పాటు చేయాలన్నా, పండుగలు పబ్బాలు చేయాలన్నా, గ్రామ ప్రజలందరూ ఒక చోటికి రావాలన్నా 'తలారి' సాయంతో దండోరా వేయిస్తారు.

తలారుల గూర్చి అన్నమయ్య ఇలా అన్నారు.

**"కాయమనే వూరికి గంతలు తొమ్మిదియాయ**
**పాయక తిరుగాదేరు పాపపు తలారులు"** **(1-487)**

**వద్దెవారు / కాసెపని:** వీరు రాతి పని, మట్టిపని చేస్తారు. రాళ్ళను కొట్టడం, బావులు తవ్వడం లాంటి పనులు చేస్తారు. వీరు భవన నిర్మాణం చేయడంలో నేర్పును కల్గి ఉంటారు. రాయిని నేర్పుగా తొలచి భవన నిర్మాణం చేస్తారు. ఇల్లు, ఆలయాలు సైతం కట్టడంలో నేర్పును ప్రదర్శిస్తారు.

'వద్దె' అనే మాటను అన్నమయ్య ప్రయోగించారు.

**"మొదల జీవుఁడొక్కడే మోపులాయఁదగులు**
**వదలని బంధములు వద్దివారెఁదగులు"** **(1-471)**

**పశువుల కాపరి:** పశువులను పోషించడంలో గ్రామాలకు సంబంధించినంతవరకు వృత్తిపరమైన విషయం. ఈ వృత్తి పోషకులు గొల్లలు అని వ్యవహరించబడతారు. అయితే నేడు అన్ని కులాలవారు పశువులను పోషిస్తున్నారు. అది జీవనోపాధి విషయం అని వేరే చెప్పనక్కరలేదు. వ్యవసాయం, పౌష్టికాహారం, ఎరువులు, ఇలా అడుగడుగునా పశువుల అవసరం ఎంతైనా ఉంది.

పశువుల కాపరిని గూర్చి అన్నమయ్య ప్రస్తావించారు.

**"కాగెడు పెరుగు చాదె కవ్వముతోఁబొడిచి**
**లేగల దోలుకొని అలిగి పోయీని"** **(1-122)**

**"మందలోన నున్న నేము మాపటంతఁగాని రాము**
**విందుపడఁగొంగు వట్టి తియ్యకు వయ్య"** **(17-273)**

ఆవుల మందలోన ఉన్నాము, లేగలు దోలుకొని అనే పదాలు ఇందులో కన్పిస్తాయి.

**సంచార వృత్తులు:** నిలకడగా ఒక దగ్గర ఉండక తిరుగుతూ చేసే వృత్తులను సంచార వృత్తులు అంటారు.

**మేదరి:** అడవిలో చక్కగా, నిటారుగా పెరిగిన పందు వెదురులను తెచ్చి చీల్చి చేటలు, బుట్టలు, జల్లెడలు మొ॥వానిని తయారు చేసి వాని ద్వారా జీవనం సాగిస్తారు. వీరినే 'మేదర' అని కూడా పిలుస్తారు. వీరికి మహేంద్ర అనే పేరు కూడా వాడకంలో కలదు. ఎరుకల వారితో ఎరుక చెప్పడం, ఆయుర్వేద మందులు అమ్మడం లాంటి రకరకాల వృత్తులున్నాయి. ఈ మేదర వృత్తి చేసేవారు కూడా ఎరుకలవారే. మేదరులు దొమ్మరి స్త్రీలతో ఉండటం, రసికులు వారిని వెంబడించడం అన్నమయ్య కాలం నాటికే ఉందనడానికి క్రింది కీర్తనను గమనిద్దాం.

> **"మేదరింటి లంజవోయి మేదినీశుదగులగ**
> **గోదితకు విటులెల్ల గుల్లినయట్టు"** **(11-2-31)**

తాళ్ళపాక వారి కాలంలో ఎరుకలసాని సమాజంలోనే గాక నాటి సాహిత్యంలో కూడా ప్రత్యేక పాత్రగా కన్పిస్తుంది.

> **"ఎఱుక చెప్పేమయ్య యిదిగో నీకు నేడు**
> **మెఱసి నీవు నాకు మేలై వలతువు"** **(19-71, 287)**

**దొమ్మరులు / దిమ్మరులు:** వీరికి స్థిర నివాసముండదు. స్త్రీలు, పురుషులు, పిల్లలు, పెద్దలు అందరూ కలసి తమ వృత్తిని సాగిస్తారు. గారడీ విద్యలు నేర్చి పల్లెలు, పట్టణాల్లోనూ, వీధుల వెంట తిరుగుతూ, తాము నేర్చిన సాము గారడీలు ప్రదర్శిస్తూ ప్రజలను ఆనందింపచేస్తూ వారిచ్చే చిన్న కానుకలతో జీవనం సాగిస్తారు. వీరికి ధైర్య సాహసాలు ఎక్కువ. సిగ్గు, బిడియం తక్కువ. వీరు తాడుపై నడవడం, మొగ్గలు వేయడం, గడపై తిరగడం మొదలైన విద్యలు ప్రదర్శించి జీవనం సాగిస్తారు.

అన్నమయ్య కాలం నాటికే వీరు దేశ దిమ్మరులుగా ఉండి, వీరి విద్యలు ఊరూరూ ప్రదర్శించి సామాన్యులకు వినోదం కల్గించినట్లు తెలుస్తుంది.

దిమ్మరి గూర్చి చెప్తూ వారు ఎక్కువగా తిరుగుతారని, వారి మాటలు నిలకడగా ఉండవని అన్నమయ్య ప్రస్తావించారు.

> **"దిమ్మర మాటలనె యాపె దిక్కుల నీ సుద్ది వింటే"** **(31-13)**

దిమ్మర జన్మ గూర్చి చెపుతూ ఈ విధంగా చెప్పారు.

> **"దిమ్మర జన్మము లేదు తెగని కోరిక లేదు"** **(2-86)**

గడసాము విద్య గూర్చి కీర్తనల్లో ఇలా ప్రస్తావించారు.

> **"బీరపు సాములు మాని పెద్ద గడసాము నేర్చి**
> **తోరపు c బగతులెల్ల దొమ్మరులైరి"** **(2-246)**

**చల్ల అమ్మడం:** వీరు గ్రామీణ ప్రాంతాల నుండి పాలు, పెరుగు మొదలైన చల్ల వస్తువును తీసుకువచ్చి పల్లె, పట్టణాలు మొ॥ ప్రదేశాల్లో సంచరించి అమ్మి జీవనం సాగిస్తారు.

చల్ల అమ్మే గొల్ల పడుచు గూర్చి అన్నమయ్య క్రింది కీర్తనలో ప్రస్తావించారు.

**"పసి చల్లమ్మే గొల్లపడుచా నీవె**
**పసివడి తిరిగేవు బడినాయక"** **(12-197)**

**"జల్లలమ్మే వనిత"** **(4-109)**

అలాగే వీధి వీధి తిరిగి చల్లలమ్మే ప్రస్తావన అన్నమయ్య సంకీర్తనలో కన్పిస్తుంది.

**"మూల మూలనమ్ముదు చల్ల ఇది**
**రేలు బగలు గొనరే చల్ల"** **(3-297)**

**ఉప్పర / ఉప్పమ్మే వారు:** ఉప్పు బస్తాలను గాడిదల మీదనో, బండ్ల మీదనో తీసుకొని వచ్చి ఊరూరా తిరిగి ఉప్పు అమ్ముతారు. వీరిని ఉప్పు బలిజ లేదా ఉప్పర అని పిలుస్తారు.

అన్నమయ్య ఉప్పు అమ్మే వారి ప్రసక్తి పలుచోట్ల కన్పిస్తుంది. ఉప్పును ఒక చోట నిల్వ ఉంచి తర్వాత దాన్ని అమ్మినట్లు క్రింది కీర్తనలో కన్పిస్తుంది.

**"చేరి వుప్పమ్మే వాడు నొకదరి చేరిచి**
**కూడిన యర్థము గాచుకొనీనట"** **(6-39)**

**చౌర్యం / దొంగతనం:** దొంగతనంను వృత్తిగా చేసుకొని జీవించు వారు చోరులు. వీరు మిక్కిలి తెగువ, నేర్పును కల్గి ఉంటారు. వీరు దొంగతనం చేయు గృహము గూర్చి గానీ, పరిసరాల గూర్చి గానీ ముందుగానే అదను పదను కల్గి ఉంటారు. ప్రజలకు ప్రాణ, మాన, ధన రక్షణ లేని రోజుల్లో చోరులకు భయపడడం నాటికీ నేటికీ కన్పిస్తుంది. ఈ దొంగతనం పండిన పంట, ఇంటిలో వస్తువులు మొదలైనవి కావచ్చు. భగవంతుని చోరునిగా చిత్రీకరించడం భాగవతంలో కన్పిస్తుంది. అంటే మాయా కృష్ణుని గూర్చి చెప్పడం. ఈ భావనతోనే అన్నమయ్య శ్రీ కృష్ణుని లీలా విశేషాల్ని చెప్పాడు.

**"ఇటు వెన్న దొంగలటకే మందును"** **(2-31)**

**"వెంట పెరుగుల దొంగ పెండ్లి కొడుకు భూమి"** **(12-186)**

**"అతడితడా వెన్నలంతట దొంగిలునాడు"** **(10-6)**

**"వీడి వోయిదె వింత దొంగ**
**వేడి పాలు వెన్న వెరజిన దొంగ**
**తలగాన నీకు దాగు దొంగ"** **(1-322)**

**"ఎందరోకో రాజుల చోరుల హింసలకు లోనయిన వారు"** **(2-138)**

**"దొంగల గూడిన ద్రోహులను "** **(1-241)**

"తొలుత పంచేంద్రియపు దొంగ వద్దనున్నాడ" (2-5)

"దొంగి దొంగి తిరిగేసి తోలరమ్మా" (12-257)

**సూదులమ్మూట:** పూర్వం కమ్మరులే సూదులను తయారు చేసే వారు. ఇప్పుడయితే యంత్రాల ద్వారా చేస్తారు. ఇనుప లోహాన్ని చిన్న చిన్న ముక్కలుగా చేసి కొలిమిలో బాగా కాల్చి, సూది ఆకారంలో వచ్చేలా కమ్మరులు తయారు చేసే వారు. కమ్మరుల దగ్గర నుండి గ్రామీణులు సూదులను తీసుకొని వారికి ధాన్యాది వస్తువులు ఇచ్చేవారు. అన్నమయ్య ఇరువురి భార్యల మధ్య మెలిగే వ్యక్తిని చిత్రీకరిస్తూ వేంకటేశ్వరుణ్ణి 'ఇరుమొన సూదిని' అన్నాడు. అలాగే సంసారాన్ని 'సూదుల మూట' అన్నాడు.

కొలిమిలో చేసే సూదిని గూర్చి అన్నమయ్య తన కీర్తనలో ప్రస్తావించారు.

"కొమ్మ చూదలే కొలిమి గూటిలో
నమ్మెడి సూదులె యదె వీడు " (12-124)

**పూస / పూత పని:** వీరు బొమ్మలకు పూత వేసి, పూసలతో వివిధ వస్తువులను తయారు చేసి వాటిని విక్రయించి ఆ సొమ్ముతో జీవనం గడుపుతారు. వీరు గుడారాలలో ఉంటూ పూసలు, పూత పని చేస్తూ జీవనం సాగిస్తారు. మానవుడు చేసే సాధారణ వృత్తులే కాకుండా చేతికళావృత్తి విశేషాలను తన సంకీర్తనల్లో అన్నమయ్య చెప్పారు.

పూస పని గూర్చి ఇలా చెప్పారు.

'లక్క పూసకపురులు' (7-34)

పూత పని గూర్చి ఇలా అన్నారు.

'చెంబు మీద కనకపు బూత' (7-1)

**బొమ్మలాట:** బొమ్మలాట అనేది ప్రాచీన కళారూపం. మానవుడు అనాగరికుడుగా ఉన్నప్పటి కాలం నుండి బొమ్మలాట ప్రచారంలో ఉంది. ప్రసార సాధనాలు లేని కాలంలో మానవుని వినోద సాధనం బొమ్మలాట. ప్రజలకు పరమార్థంతో పాటు వినోదాన్ని కల్గించే వారిలో బొమ్మలాటవారు ఒకరు. బొమ్మలాటలోని నేర్పంతా బొమ్మలు ఆడించే వారి చేతిలో ఉంటుంది.

అన్నమయ్య బొమ్మలాటను వేదాంతంతో జోడించి చెప్పాడు.

బొమ్మలాట వారు బొమ్మలను ఆడిస్తే చూచి ఆనందిస్తారు, కానీ వారికి దానం చేయడంలో ముందుకురారు అనే విషయాన్ని అన్నమయ్య చెప్పారు.

"ఆట వారి గూడితౌరా
ఆటవారి గూడి అన్ని చోట్ల బొమ్మ" (1-163)

బొమ్మలాటను అన్నమయ్య ప్రస్తావించారు.

**"బొమ్మలాట నిజమంటా బూచిబూచి మెచ్చినట్టు"　(2-37)**

**"ఆదే బొమ్మలవారు ఆడించే సూత్రము నీవు"　(26-392)**

**"తోలు బొమ్మలము తొదరి యాడింతుగాక"　(31-253)**

**పాముల వారు:** వీరు పాములను మచ్చిక చేసుకోవడంలో సిద్ధహస్తులు. పాముల వారికి ప్రధానంగా సంపద పాములే. పాములను తీసుకొని పోయి ఊరిలో ఆడిస్తూ 'బూర' ఊదుతారు. గ్రామీణులు వినోదంతో చూస్తూ పాముల వారికి బియ్యంగాని, డబ్బులు గాని ఇస్తారు.

ఈ పాముల వారి ప్రస్తావనను అన్నమయ్య తన కీర్తనలో చెప్పారు.

**"పాము నాడించిన యట్టి బాలజోగి పిన్నవాదు**
**వాముల వెన్నలు దినే వలువకాదు"　(30-112)**

**వేశ్యావృత్తి:** ఆచార నియమాలకు, ధర్మానికి విరుద్ధంగా చరించడం వ్యభిచారం లేక వేశ్యావృత్తి. స్త్రీని భగవంతునికి సమర్పించి భోగభాగ్యాలను, మోక్షప్రాప్తిని పొందవచ్చుననే నమ్మకం భారతదేశంలో క్రీ.పూ. 3వ శతాబ్దంలో బాగా ఉండేది. దేవుళ్ళకు, దేవతలకు అంకితం చేసిన కన్నె పిల్లలు దైవసేవలో మునిగి తేలుతూ దేవదాసీలనే పేరుతో పిలువబడినారు. మనిషి తనకు తగని పొందుకోసం ఆలోచించడం, పరితపించడం మనోవ్యభిచారం.

ఆనాటి కొందరి ప్రజల మనస్తత్వాన్ని అన్నమయ్య ఈ విధంగా చెప్పారు.

**"చేసుకొన్న యిల్లాలు చేరువనే వుండగాను**
**వేసరక వెలయాలి వెతకినట్లు"　(6-5)**

**"సంతపాక లంజ వలె చల్లు జూపు లేటికి"　(4-30)**

**"సంత పాక లంజ దెచ్చి సన్యాసి జేసె"　(2-282)**

**ఆటది:** వినోదాలు అనేకం. వినోదాల్లో భోగం జాతి వినోదం ఒకటి. వీరు వేదిక మీద వారి హావభావాలతో నటన సాగిస్తూ ప్రజలను సంతోషింపచేస్తారు.

తాళ్ళపాక అన్నమయ్య భోగం వారినే 'ఆటది'గా చెప్పారు.

**"ఆటది యింత కోపునూ అంటి మోసువంటిది"　(34-38)**

**"సూటి దప్పదింతలోనే చూచిన మాత్రమున"　(17-151)**

అరటిచెట్టు కొట్టినా తిరిగి చిగురు వస్తుంది అనే విషయాన్ని అన్నమయ్య అంతరార్థం స్ఫురించేటట్లు చెప్పారు. ఆటది, ఆటగాళ్ళను ఉద్దేశించి 'ఆడేకాలు, పాడేనోరు ఊరకుండదు కదా' అని అంతర్లీనంగా చెప్పారు.

అన్నమయ్య తన కాలంనాటి వృత్తులు వాటి ధర్మాలను వృత్తి ధర్మాన్ని బట్టి మనస్తత్వాలను తన సంకీర్తనల్లో సుస్పష్టంగా తెలియజేసారు.

**ఉపయుక్త గ్రంథ సూచి:**

1) అన్నమయ్య ఆధ్మాత్మిక సంకీర్తనలు - తి.తి.దే. తిరుపతి
2) అన్నమాచార్యులు - కామిశెట్టి శ్రీనివాసులు
3) అన్నమయ్య శృంగార సంకీర్తనలు - తి.తి.దే. తిరుపతి
4) అన్నమయ్య సంకీర్తనల్లో గ్రామీణ జీవితం - బి. శ్రీరాములు
5) ఆంధ్ర వాగ్గేయకార చరిత్ర - బాలాంత్రపు రజనీకాంత రావు
6) తాళ్ళపాక కవుల సాహిత్య సేవ - ఎ. విద్యావతి
7) తాళ్ళపాక కవుల కృతులు - వివిధ సాహితీ ప్రక్రియలు - వేటూరి ఆనందమూర్తి
8) తాళ్ళపాక కవుల గేయకృతులు-పునఃపరిష్కృతములు - తి.తి.దే. తిరుపతి (1-23 సంపుటాలు)
9) పదకవితా పితామహుడు - ఎస్.గంగప్ప
10) సప్తగిరి మాసపత్రిక, మే 1996 - శ్రీ గౌరిపెద్ది రామసుబ్బశర్మ

***

# అన్నమయ్య సంకీర్తనల్లో జానపదాంశాలు

**ఆచార్య పేట శ్రీనివాసులు రెడ్డి**
**తెలుగు అధ్యయన శాఖ**
**శ్రీ వేంకటేశ్వర యూనివర్శిటీ**
**తిరుపతి**

ఆంధ్ర పదకవితా పితామహుడు అన్నమయ్య తన సంకీర్తనల ద్వారా శ్రీ వేంకటేశ్వరుడ్ని అర్చించినా, ఒక్కొక్క సంకీర్తన ఆంధ్ర సాహిత్య చరిత్రలో ఒక్కో స్వర్ణపుష్పంగా ప్రకాశిస్తోంది. వెలకట్టలేని అన్నమయ్య సంకీర్తనలు చాలా వరకు కాలగర్భంలో కలసిపోయినా ఉన్న సంకీర్తనలు తెలుగు సాహిత్యాన్ని పరిపుష్టం చేస్తూ ఆచంద్రతారార్కం నిలిచిపోతాయి. 32 వేల సంకీర్తనలకు 12 వేల పైచిలుకు సంకీర్తనలు మాత్రమే లభించి మిగిలినవి కాలగర్భంలో కలసిపోయాయంటే ప్రతి తెలుగువాడి గుండె తరుక్కొని పోతుందనడంలో అతిశయోక్తి లేదు. అన్నమయ్య గొప్ప సామాజిక శాస్త్రవేత్త. సమాజాన్ని అన్నమయ్య ప్రతిఫలించినట్లు మరే కవి ప్రతిఫలించలేదు. అన్నమయ్య సంకీర్తనల్లో ముఖ్యంగా ఆనాటి సమాజంతో పాటు నాటి పల్లియులను, వారు పాడుకొనే పాటలను, సామెతలను, జాతీయాలను వారి

మనస్తత్వాన్ని మరచిపోలేదు. ఆనాటి జానపదాంశాలను తన సంకీర్తనల్లో అధికంగా ప్రతిబింబింపజేశాడు.

**1. అన్నమయ్య సంకీర్తనల్లో జానపద గేయాలు :**

అన్నమయ్య కడప జిల్లా రాజంపేట మండలం తాళ్లపాక గ్రామానికి చెందిన వాడైనా ఆయన చిన్నతనంలోనే తిరుపతితో సాన్నిహిత్యం పెంచుకొన్నాడు. నిజానికి అన్నమయ్య తాళ్లపాక గ్రామంలో నివశించిన దానికన్నా జీవితాంతం తిరుపతిలో జీవించిందే ఎక్కువ. అందుకే అన్నమయ్యపై తిరుపతి పరిసర గ్రామాల ప్రభావమే అధికంగా ఉంటుందనడంలో ఎలాంటి అతిశయోక్తి లేదు. అన్నమయ్య సంకీర్తనల్లో ఎన్నో జానపద గేయాలు పరోక్షంగా ప్రవేశించి వాటి ఉనికిని కాపాడుకొన్నాయి. అన్నమయ్య సంకీర్తనల ద్వారా ఆనాటి జానపద గేయాలు ఎలా ఉండేవో తెలుసుకోవచ్చు. అన్నమయ్య సంకీర్తనలను విని జానపదులు పాడుకొన్నారా? లేదా జానపదులు పాడుకొనే పాటలను విని అన్నమయ్య సంకీర్తనల్ని రచించాడా? అనే సందేహం ఎవరికైనా వస్తుంది. అయితే ఒక్కటి మాత్రం వాస్తవం. సంకీర్తనలను, జానపద గేయాలను పరిశీలిస్తే అన్నమయ్య మాత్రం జానపదులు పాడుకొనే పాటలను విని స్ఫూర్తిచెంది అనేక జానపద గేయాలను అనుసరించి సంకీర్తనలుగా మలిచాడనడంలో ఎలాంటి సందేహం లేదు. అన్నమయ్య సంకీర్తనల్లో ప్రతిఫలిస్తున్న జానపద గేయ రీతులను పరిశీలించండి –

అన్నమయ్య సంకీర్తనల్లో అనేక జానపద గేయాలు ప్రతిఫలిస్తున్నాయి. ఆనాడు బహుళ ఆదరణలో ఉన్న జానపద గేయాలను అనుసరించి అన్నమయ్య ఎన్నో సంకీర్తనలను రచించాడనడంలో ఎలాంటి అతిశయోక్తి లేదు. దిగువ పాటలను గమనించండి –

**1.1 మేలుకొలుపు :** మన పల్లెల్లో జానపదులు తెల్లవారుజామునే లేచి తమ ఇష్ట దైవాలను తలుస్తూ మేలుకొలుపు పాటలు పాడడాన్ని మనం నేటికీ చూడొచ్చు. పాల్కురికి కాలంలో ఇవి ప్రభాత పదాలుగా వ్యవహారంలో ఉండేవి. జానపదులు తెల్లవారుజామున చల్ల చేస్తూనో, ఇల్లు అలుకుతూనో, పక్కల పైన్నే కూర్చొనో భూపాళరాగాలతో చుట్టుపక్కల వారిని కూడి పాటలు పాడి మేల్కొల్పుతారు. అన్నమయ్య సంకీర్తనలోని మేలుకొలుపు పాటను గమనించండి –

**"మిన్నక వేసాలు మాని మేలుకోవయ్యా**
**సన్నల నీయోగ నిద్రచాలు మేలుకోవయ్యా"** **(1.374)**

**1.2 ఉగ్గు :** జానపదులు తమ చంటిపిల్లలకు ఉగ్గుపాలతోనే ఎన్నో అభ్యాసాలను చేయిస్తుంటారు. చంటిపిల్లలను కాళ్ళపై పడుకోబెట్టి ఉగ్గు గిన్నె అంటే పాలాడలో నూనె, పాలు, గంజి, ఉప్పుగల్లు వేసి వాటిని బాగా కలిపి తాగిస్తారు. ఆ సమయంలో

పసిపిల్లల దృష్టిని తల్లి తనవైపుకు మళ్ళించుకొని 'ఉగ్గు ఉగ్గు' అంటూ తాగిస్తారు. అప్పుడు పాడే ఉగ్గు పాటను గమనించండి -

**"ఊఁ ఊఁ ఉంగన్న - ఉగ్గుపాలు యిందన్న**
**గుంటెడు ఉగ్గు కమ్మన్న - ఉమ్మక కక్కక మింగన్న"**

అంటూ ఉగ్గు పాటలను జానపదులు పాడుకుంటారు. అలాగే అన్నమయ్య సంకీర్తనల్లో కూడా ఉగ్గుపాట చోటు చేసుకొని ఉంది, చూడండి -

**"ఉగ్గు వెట్టరే వోయమ్మా చె**
**య్యెగ్గినిదె శిశువోయమ్మా"** **(12-97)**

**1.3 లాలి పాటలు** : జానపదులు పాడుకొనే లాలిపాటలను విని అన్నమయ్య పరవశంతో ఎన్నో లాలిపాటల్ని సంకీర్తనలుగా మలిచాడు. పిల్లలను లాలించే టప్పుడు పాడే పాటలను లాలిపాటలంటారు. అన్నమయ్య సంకీర్తనల్లోని లాలి పాటను గమనించండి -

**"లాలనుచు నూఁచేరు లలన తిరుగడల**
**బాల గండవర గోపాల నినుఁజాల"** **(అ.చ.వీ.పు.63)**

**1.4 జోల పాటలు** : ఆనాడు జానపదులు పాడుకొనే జోల పాటలను విని, అన్నమయ్య తన సంకీర్తనల్లో కూడా రచించి తన్మయత్వం చెందాడు. పసిపిల్లలను నిద్ర పుచ్చేటప్పుడు జో కొడుతూ పాడే పాటలను జోల పాటలంటారు. అన్నమయ్య సంకీర్తనల్లోని కింది జోలపాటను గమనించండి -

**"జోవచ్యుతానంద జోజో ముకుంద**
**రావె పరమానంద రామగోవింద"** **(అ.చ.పీ. పు-61)**

**1.5 గొబ్బి పాటలు** : సంక్రాంతి పండుగొచ్చిందంటే మన పల్లెలన్నీ గొబ్బి ఆట పాటలతో హోరెత్తి పోతుంటాయి. పండుగ నెలనే ధనుర్మాసం అని కూడా అంటారు. ఈ నెలంతా స్త్రీలు ఇళ్ళముందు రంగురంగుల ముగ్గులేసి, అందులో ఆవుపేడతో గొబ్బెమ్మను చేసి పెడ్తారు. దానిపై గుమ్మడిపూవును ఉంచుతారు. లేదా తంగెడి పూలతో, బంతిపూలతో కూడా అలంకరిస్తారు. గొబ్బెమ్మ చుట్టూ మహిళలు చేరి గొబ్బి తడ్తూ గొబ్బిపాటలను పాడడాన్ని నేటికి మనం చూడొచ్చు. అన్నమయ్య కూడా తన సంకీర్తనల్లో ఒక గొబ్బి పాటను రచించాడు. చూడండి-

**"కొలని దోఁపరికి గొబ్బిళ్లో యదు**
**కులము స్వామికిని గొబ్బిళ్లో"** **(12-98)**

**1.6 కోలాటం పాటలు** : కోలలతో ఆడే ఆటను కోలాటం అంటారు. క్రీ.శ. 3వ శతాబ్దం నుండే కోలాటం ఉన్నట్లు ఇక్ష్వాకుల కాలం నాటి శిల్పాలు చెబుతున్నాయి. అన్నమయ్య సంకీర్తనల్లో కూడా అనేక కోలాటం పాటలున్నాయి. ఈ కింది కోలాటం పాటను గమనించండి -

"వాడె వాఁడే అల్లరి వాఁడదివో
నాఁడు నాఁడు యమునా నదిలోన" (25-343)

**1.7 సువ్వి పాటలు :** ధాన్యం దంచేటప్పుడు ఉచ్ఛ్వాస నిచ్ఛ్వాసాలకు అనుగుణంగా వచ్చే 'ఇస్ ఇస్' శబ్దమే 'సువ్వి సువ్వి'గా మారిందంటారు. ఇలా 'సువ్వి సువ్వాల' పాటలు ఒకప్పుడు తెలుగువారి నోళ్ళలో ప్రతిధ్వనిస్తూ ఉండేవి. ధాన్యం దంచడానికి యంత్ర పరికరాలు వచ్చాక ఈ పాటలన్నీ కాలగర్భంలో కలసిపోయాయి. అన్నమయ్య సంకీర్తనలను పరిశీలిస్తే సువ్వి పాటలను కూడా మనం చూడొచ్చు-

"సువ్వి సువ్వి సువ్వాలమ్మ
నవ్వుచు దేవకి నందనుఁగనియె" (12-361)

**1.8 శోభనపు పాటలు :** పెళ్లిళ్లు, ఉత్సవాలు వంటి వేడుక సమయాల్లో జానపదులు శోభనపు పాటలు పాడడం వ్యవహారంలో ఉంది. శుభప్రదమైనవి, లేదా మంగళ ప్రదమైనవి శోభనం పాటలు. అలాగే గర్భాదాన సమయంలో పాడే పాటలను కూడా శోభనం పాటలు అని అంటారు. అన్నమయ్య సంకీర్తనల్లో ఎన్నో శోభనపు పాటలున్నాయి. కింది శోభనపు సంకీర్తనను గమనించండి -

"శోభనమే శోభనమే
వైభవముల పావనమూర్తికి" (5-18)

**1.9 ఏల పాటలు :** ఏల పాటల్ని జానపదులు కపిల, మోట తోలేటప్పుడు పాడుతుంటారు. ఇవి చాలా శృంగార భరితంగా ఉంటాయి. కఠినాతి కఠినమైన కాయకష్టం చేసేటప్పుడు జానపదులు పచ్చి శృంగారాన్ని కూడా పాడుకోవడం మామూలే. ఏల పాటలో నాలుగేసి చరణాలుంటాయి. ప్రతి మూడవ చరణం చివర ఒక పదం ఊతపదంగా వస్తుంటుంది. అన్నమయ్య కూడా ఒక ఏల పాటను రచించాడు. గమనించండి -

"మేడలెక్కి నిన్నుఁ జూచి
కూడేననే యాస తోడ" (7-223)

**1.10 తందాన పాటలు :** తందాన పాటల్ని జనులు సామూహికంగా పాడుకునే పాటలని, ఏకతారలాంటి వాద్యం వాయిస్తూ పాడుకొంటారని ఆచార్య ఎస్. గంగప్ప పేర్కొన్నారు. అలాగే బుర్రకథల్ని తందాన పాటలనడమూ కద్దని, బుర్రకథలు సుదీర్ఘంగా కథనాత్మకంగా కొనసాగుతాయని కూడా పేర్కొన్నారు. బుర్రకథలు సుదీర్ఘ కథనాత్మకాలైనా అందులో శ్రావ్యమైన, ఆవేశపూరితమైన గానం ఉంటుంది. ఆ గానాన్ని ఆలపించేటప్పుడు 'తందానతాన' అని అంటూ రకరకాలుగా ప్రధాన కథకుడు పాడితే వంతగాళ్ళు కూడా వంత పాడ్తారు. అన్నమయ్య సంకీర్తనలోని తందాన పాటను పరిశీలించండి -

"తందనాన ఆహి తందనాన పురె
తందనాన భళా తందనాన" (2-385)

ఇవే కాకుండా జాజర, అల్లోనేరేళ్ళు, చందమామ, శోభన, హారతి నివాళి, ధవళ, ఉయ్యాల, సంవాద, మంగళ గీతాలను కూడా అన్నమయ్య జానపదుల ననుసరించి రచించాడు.

ఇలా అన్నమయ్య సంకీర్తనల్లో అనేక జానపద గేయాలు ప్రవేశించి ప్రజల గుండెల్లో గూడు కట్టుకొని పోయాయి. దీనిని బట్టి చూస్తే అన్నమాచార్యులకు జానపద గేయాల మీద ఎంత మక్కువో మనకు ఇట్టే అర్థమవుతుంది.

**2. అన్నమయ్య సంకీర్తనల్లో సామెతలు :**

జానపద సాహిత్యంలో అతి చిన్న రూపంలో ఉండేవి సామెతలు. సామెతల్ని ప్రజలు మాట్లాడేటప్పుడు సందర్భానుసారం ప్రయోగిస్తుంటారు. సామెతలు సాహిత్యాభివ్యక్తి విధానాలే కాకుండా, మన జీవన విధానాన్ని, సంస్కృతినీ, ఆచార వ్యవహారాలను, కట్టుబాట్లను యధాతథంగా ప్రతిఫలిస్తుంటాయి. సామెతలు ఎంతో ప్రాచీనకాలం నుండి వ్యవహారంలో ఉన్నాయి. సామెతల పుట్టుకకు ఆచారాలు, ఆదర్శాలు, ప్రకృతి పరిశీలన, స్వభావ పరిశోధన, చారిత్రక ప్రదేశాలు, ప్రాచీన పురాగాథలు, ప్రతిరోజూ జీవితంలో చూసి, మనం అనుభవించే ప్రతి విషయమూ సామెతల పుట్టుకకు కారణం కావొచ్చు. సామెతల్లో మన సంస్కృతీ, సంప్రదాయాలు, తరతరాల అనుభవాలు, జనజీవనం వంటి విషయాలుంటాయి ఒక జాతి మనస్తత్వాన్ని సామెతల్లో చూడొచ్చు. అన్నమయ్య కూడా తన సంకీర్తనల్లో ఆనాడు జన వ్యవహారంలో ఉన్న అనేక సామెతలను ప్రయోగించాడు. అన్నమయ్య సంకీర్తనల్లో ప్రస్తావించబడిన సామెతలను గమనించండి.-

**అడసు చొరనేల కాళ్ళు కడుగనేల**
**యేటి వంకలు తిద్దవశమా**
**అడవిగాచిన వెన్నెల**
**నిప్పుల మీఁదటఁ దెచ్చి నేయి చల్లిఁ దరుణి**
**గోరుచుట్టు మీఁద రోకటి పోటాయె**
**పుండెరువ మందు నేరిచెనె**
**పువ్వుల వలన నార పొదలి తకెక్కినట్లు**
**పెనుఁబాము పిల్లలకుఁ బాలువోసి పెంచఁజూచీఁదరుణి**
**కోటి విద్యలు కూటి కొరకే**
**ఎరవు గదుసతమాయె**
**అనలమున నీరు జనియించెను**
**ముల్లు ముంటనే తీసినట్లు**
**సున్నపురాతికి జొబ్బిల నుదకము నున్నతిఁ జల్లఁగ నోర్చీనా**
**ఈరుదియ్యఁ బేనువచ్చు**
**పిందంతే నిప్పటి**

ఎంత తొండమున్నా దోమ యేనుగవునటే
కొలిమి గూటిలో సూదులమ్ముట
కలగన్న చోటికి గంప యెత్తినట్లు
కాయపండు సేయబోతే కడుపులు పేకాక యేయెడ తీపుగాదు
కూడులేక యాఁకటికిఁ గూర దిన్నట్లు
చిచ్చు కాగలించుకొంటే చిమిడించకుండునా
మొదలుండ మోచి కొనలకు నీరు పోయనేల
వరిచెడ నూదర బలిసినట్లు
గుడ్డికుక్క సంతకు బోయి తిరిగిన దుడ్డుపెట్లే కాక దొరికేనా
నూతులు దవ్వగబోతే బేతాళములు పుట్టె
పాల కూళ్ళాయను నీ పచ్చి నవ్వులు
వెన్న దిన్న నోటనే వేడిపాలు దాగినట్లు
సిగ్గులు పాలపొంగలి కాబట్టె

ఇలా అన్నమయ్య సంకీర్తనల్లో ఎన్నో సామెతలు చోటుచేసుకొని ఉన్నాయి.

### 3. అన్నమయ్య సంకీర్తనల్లో మాండలికాలు :

భాషకు ఒకే రూపం ఉండదు. ఒకే భాష వివిధ ప్రాంతాలలో, జిల్లాల్లో, భిన్న ప్రదేశాలలో, ఒక్కో రకంగా ఉంటుంది. అన్నమయ్య పుట్టింది కడప జిల్లాలోని రాజంపేట సమీపంలోని తాళ్లపాక గ్రామమైనా ఆయన జీవితాంతం గడిపింది చిత్తూరు జిల్లాలోని తిరుపతిలో అందుకే అన్నమయ్య ప్రయోగించిన మాండలికాలు రాయలసీమ మాండలికంగా గుర్తింపు పొందాయి. అన్నమయ్య సంకీర్తనల్లో ప్రయోగింపబడిన మాండలికాలను గమనించండి –

| మాండలికం | - | అర్థం |
|---|---|---|
| ఉమ్మగించు | - | ఉక్కపోయు |
| కాడ | - | వద్ద |
| నడికి రేయి | - | అర్థరాత్రి |
| ఎకసక్యము | - | ఎగతాళి |
| పొఱాడు | - | దోగాడు |
| ఆడ | - | అక్కడ |
| ఈడ | - | ఇక్కడ |
| ఏడ | - | ఎక్కడ |
| జాణతనాలాడు | - | కపటవర్తన |
| మాపు | - | సాయంత్రం |
| మక్కళించు | - | ఉబ్బునట్లు చేయు |
| లిక్కి | - | గడ్డి వంటి వాటిని కోసే చిన్న కొడవలి |

| | | |
|---|---|---|
| పై | - | దేహం |
| కడప | - | గడప |
| కాఁగు | - | పెద్దబాన |
| వెన్నట్లు | - | వెన్నతో చేసిన అట్లు |

**4. అన్నమయ్య సంకీర్తనల్లో జాతీయాలు :**

జాతీయాలు ఆయా భాషల్లోని ప్రత్యేకతల్ని చాటుతాయి. అవి ఇతర భాషల్లోకి అనువదించడానికి వీలుకానివి. ఒక జాతి అనుభవాలు జాతీయాల్లో దాగి ఉన్నాయి. అన్నమయ్య సంకీర్తనల్లో కూడా అనేక జాతీయాలు ప్రస్తావించబడి ఉన్నాయి. కొన్ని జాతీయాలను గమనించండి -

| జాతీయం | - | అర్థం |
|---|---|---|
| కనుమూయు | - | లోపించు |
| కొంగు బంగారం | - | అవసరానికి దగ్గరుండే ధనం |
| కొండుక పాయము | - | లేత యవ్వనం |
| గుండె జల్లను | - | పరవశంతో గుండె వేగంగా కొట్టుకొను |
| కొల్లఁబోవు | - | సులభంగా లభించడం |
| గుజ్జము వంటి కొడుకు | - | సాహసి అయిన కొడుకు |
| చీకటి మేను | - | నల్లని శరీరం |
| చీఁకటి ద్రవ్వు | - | చీకటిలో ఉండడానికి ఇష్టపడు |
| చదువుల పుట్ట | - | విద్యానిధి |
| చందమామ గుటకలు | - | చందమామను ఆశించడం |
| చెక్కిటఁ జేయి | - | చింతాముద్ర |
| చన్నుఁ గుడుచు | - | పాలుతాగు |
| కంచములోని కూడు | - | చేతిలో ఉన్నది |
| పనిగె చేతి చెరకు | - | సొంతం |
| తల వాకిటికిఁ దెచ్చు | - | అవసానదశకు తేవడం |
| నిప్పులేత్తె | - | నిప్పులు ఏరుగా పారడం |
| నీళ్లు నమలు | - | నీళ్లు నమలడం |
| మూతులు నాకు | - | ముద్దు పెట్టు |
| యెండ చూపులు | - | కోపపు చూపులు |
| కూడు విషమగు | - | భోజనం రుచించక పోవడం |
| వేసాలఁ బోవు | - | కపట నాటకాలాడు |
| సద్ద సేయు | - | లక్ష్యపెట్టు |
| సిరి మొగము దెరచు | - | కళ్లుదెరచు |
| రచనలు మాను | - | అతిశయాలు మానుకొను |

**5. అన్నమయ్య సంకీర్తనల్లో ఆటలు :**

అన్నమయ్య సంకీర్తనల్లో ఆనాడు జానపదుల్లోను, ఇతర జనుల్లోను ఉన్న ఎన్నో ఆటలు ప్రస్తావించబడి ఉన్నాయి. అయితే ఆ ఆటల్లో కొన్ని నేడు కనుమరుగై పోయాయి. కింది సంకీర్తనలో బిల్లఁగోట్లాట, పుట్ట చెండులు, సముద్ర బిల్లలు, సిరి సింగనవత్తి, గచ్చకాయలు వంటి ఆటలు పేర్కొనబడి ఉన్నాయి. గమనించండి-

> **"విచ్చన విడిసీ యాడీ వీఁడె కృష్ణుడు**
> **వొచ్చము లేని వాఁడు వుద్దగిరి కృష్ణుడు"** **(4-172)**

ఇవే కాకుండా వామన గుంటలు (21-45), నెత్తమాడడం (21-344), బొమ్మల పెండ్లి (20-45), చదరంగం (18-91), సరిబేసులు (21-45), దాలి ముచ్చటలాడడం (18-187) వంటి ఆటలెన్నో అన్నమయ్య సంకీర్తనల్లో మనం చూడొచ్చు.

**6. అన్నమయ్య సంకీర్తనల్లో ఆహారపుటలవాట్లు :**

అన్నమయ్య సంకీర్తనల్లో ఆనాడు వ్యవహారంలో ఉన్న అనేక ఆహారపు టలవాట్లను ప్రస్తావించాడు. ఈ ఆహారాన్ని శిష్టులే కాకుండా జానపదులు కూడా తిన్నారు. మన పల్లెల్లో కూడా ఎంతో మంది సంపన్న కుటుంబీకులుండే వారు. వారు కూడా అనేక రకాలైన వంటకాలను చేసుకొనే వారని తెలుస్తోంది. అన్నమయ్య సంకీర్తనల్లో ప్రధానంగా ఆనాటి రాయలసీమ రుచులను మనం చూడొచ్చు. అన్నమయ్య సంకీర్తనల్లోని కింది ఆహారపుటలవాట్లను పరిశీలించండి -

అడుకులు, చక్కిలాలు, అనవాలు నురుగులు, వడపప్పు, వాముల కొలఁదులు (10-27). అలాగే మేరుపర్వతాల్లా మెరిసే ఇడ్డెనలు (ఇడ్లీలు), చుక్కలు రాశిపోసినట్లుండే రాజాన్నాలు, మంచు కొండలంతేసి వెన్నముద్దలు, వెన్నెల రసం అందించినట్లుండే చిలుపాలు, పంచదార, పండిన పంటల్లాగా వుండే పచ్చళ్ళు, కూరలు; అలాగే అప్పాలు, వడలు, అక్కాళ పాశాలు, సద్యోఘృతాలు, దివ్యాన్నాలు, దుగ్ధాన్నాలు, నానబియ్యాలు, పరమాన్నాలు, మిరియపు తాళింపు కూరలు, కుడుములు, కంది కుడుములు, బియ్యాల పొంగలి, పాల పొంగలి వంటి ఆహారాలను అన్నమయ్య తన సంకీర్తనల్లో ప్రస్తావించాడు.

**7. అన్నమయ్య సంకీర్తనల్లో వస్తు సంస్కృతి :**

ప్రాచీనకాలం నుంచి అనేక గృహోపకరణాలు వ్యవహారంలో ఉన్నాయి. సంప్రదాయబద్ధంగా ఒక తరం నుండి మరో తరానికి గృహోపకరణాలు సంక్రమిస్తూనే ఉన్నాయి. అన్నమయ్య సంకీర్తనల్లో కూడా అనేక గృహోపకరణాలను మనం చూడొచ్చు.

అట్టుక, ఉట్టి, తిత్తి, గాదె, దివ్వె, చిప్ప, దుత్త, కంచం, కూటకుండ, గంప, దొంతి గొడ్డలి, పళ్ళేలు, మేకు, చేట, పుట్టె, ముంత, బిందె, అలరుపానుపు, అబక,

పట్టు పరుపు, చప్పర మంచం, ఉయ్యాల మంచం, తూగు మంచం, అద్దము, జంగాళము, నిలువుటద్దము.

**8. అన్నమయ్య సంకీర్తనల్లో వేషభూషణాలు :**

పురుషులు, స్త్రీలు తమ ఆర్థిక పరిస్థితులకు అనుగుణంగా సంప్రదాయ దుస్తులను ధరిస్తారు. అలాగే అలంకరించుకొంటారు. అన్నమయ్య సంకీర్తనల్లోని వేషభూషణాలను గమనిద్దాం.

**8.1 వేషం - దుస్తులు :** అన్నమయ్య సంకీర్తనల్లోని వేషం-దుస్తులను ముందు పరిశీలిద్దాం -

కొప్పు (13-568), జారుకొప్పు (28-195), మూరదంత కొప్పు (28-205), జడ (28-177), నిలువు తురుము (28-232), సవరము (13-432).

పసుపు చీర, చెంగావి చీర, పసిడి చీర, అంచుల తొగరు చీర, నీలి చీర, బంగారు పువ్వుల చీర వంటివి.

**8.2 ఆభరణాలు :** అన్నమయ్య సంకీర్తనల్లో ఆనాటి కాలం నాటి ఎన్నో ఆభరణాలు ప్రస్తావించబడి ఉన్నాయి. ఈ ఆభరణాలను కూడా ఆనాటి జానపదులు సైతం అలంకరించుకొనే వారని చెప్పొచ్చు. అన్నమయ్య సంకీర్తనల్లోని కొన్ని ఆభరణాలను పరిశీలించండి -

జడకుచ్చులు, ముక్కెర, కుండలాలు, కుందనపు ముత్యాల కుచ్చులు, ముత్యాల దండ, శిరోమణి, జడబిళ్ల, పాపిటబిళ్ళ, కొప్పుబిళ్ల, ముత్యాలకుప్పె సవరం, కుందనపు ముత్యాల కుచ్చులు, మామిడిపిందెల హారం, బొబ్బిలి కాయలు, చంద్రాభరణాలు, నవరత్న హారాలు, గాజులు, ఉంగరాలు, వంకీగాజులు, మేఖల గంటల మొలనూలు, వడ్డానం, మాణిక్యాల భుజకీర్తులు, కంచుటుంగరము, వజ్రాలకమ్మలు, ఇలాంటి ఆభరణాలెన్నింటినో అన్నమయ్య తన సంకీర్తనల్లో ప్రస్తావించాడు.

**8.3 ఇతర అలంకరణలు - తాంబూలాదులు :** అన్నమయ్య సంకీర్తనల ఆధారంగా ఆనాటి అలంకారాలను తాంబూలాదులను కూడా పేర్కొనవచ్చు.

అన్నమయ్య కాలంలో స్త్రీ, పురుషులు కేశాలను పెంచుకొని, కొప్పులు ముడుచుకొని పువ్వులను పెట్టుకొనేవారు. ఆభరణాలను స్త్రీలతోపాటు పురుషులు కూడా ధరించేవారు. మైపూతలు పూసుకొనేవారు. ధనవంతులు పన్నీరుతో స్నానం చేసేవారు. చెప్పులు, విసనకర్ర, ఆలవట్టం, గొడుగు వాడుకలో ఉండేవి. ఆనాడు సంపెంగలు, జాజిదండ, మొలవిరులు, మల్లెమొగ్గలు, కలువలు, తామర పూలు, గేదగి, పొగడపూవు, చేమంతి, సురపొన్న వంటి పూలను ఉపయోగించేవారు. ఇక తాంబూలానికి స్త్రీ పురుషుల శృంగారంలో అగ్రస్థానం ఉంది. అన్ని శుభ కార్యాల్లో

తాంబూలానిదే పైచేయి. తాంబూలాలలో విడెము, ఆకుమడుపు, కప్పురపు విడెము, తమ్ములము, మదరాగముల విడెములు ప్రసిద్ధి చెందాయి.

**9. అన్నమయ్య సంకీర్తనల్లో వినోదాలు :**

ఒకప్పుడు ప్రజలకు వినోదాలే కాలక్షేపం. నేడు వినోదాలకు కొదవే లేదు. నేడొచ్చిన ఆధునిక వినోదాల వల్ల మన సంప్రదాయ వినోదాలు కాలగర్భంలో కలసిపోయాయి. అన్నమయ్య సంకీర్తనల్ని పరిశీలిస్తే ఆనాటి వినోదాలను మనం గుర్తించవచ్చు. అన్నమయ్య సంకీర్తనల్లో కనిపించే వినోదాలలో పాముల వాళ్ళు, దొమ్మరివాళ్ళు, బొమ్మలాటవాళ్ళ ప్రదర్శనలను ప్రముఖంగా చెప్పుకోవచ్చు.

**"గడాటాడె వానింగంటె కన్నవారికి వేడుక**
**అడుగడుగు ప్రయాసమటు వానికి**
**పాముల వానిగంటె పడుచుల కానందము"** **(2-294)**

**"అవటించి కీలుబొమ్మ ఆ చేతనమై యుండినా**
**ఆ వేళ సూత్రధారుఁడాడించు గదవయ్యా"** **(7-273)**

అదేవిధంగా బహురూప విద్యలు, నాటకాలు, కనుకట్టు విద్యలు, ఇంద్రజాల విద్యలను (10-190) కూడా అన్నమయ్య తన సంకీర్తనల్లో ప్రస్తావించాడు.

**10. అన్నమయ్య సంకీర్తనల్లో ఇతర ఆచారాలు-వేడుకలు :**

అన్నమయ్య సంకీర్తనల ఆధారంగా ఆనాటి ఆచారాలు, వేడుకలను గమనించవచ్చు. సంతానం కలిగితే 12వ రోజు పురుడు చేసేవారు. మగపిల్లవాడు పుడితే తండ్రి గంధాక్షితలు, తాంబూలం ఇచ్చి పుత్రోత్సాహం పూర్తి చేసుకొనే వాడు. అలాగే పెళ్ళిళ్ళలో ఉంగరం పెట్టడం, కంకణధారణ చేయడం, బాసికాలు కట్టడం, అయిరేణి కుండలు నిలపడం, వధువు కాలు తొక్కడం, తాళి కట్టడం, సేసప్రాలు పోయడం, కొంగుముడి వేసుకోవడం, అగ్నిప్రదక్షిణ చేయడం, వసంతాలు ఆడడం, వధూవరులను రథం మీద ఊరేగించడం వంటి వాటిని అన్నమయ్య సంకీర్తనల్లో చూడొచ్చు. అలాగే మేనరికాలు, కర్మక్రియలు వంటివి కూడా ఆనాడు జన వ్యవహారంలో ఉండేవి. ఇకపోతే ఓలికాశపడి దుర్మార్గులకు, ముసలివాళ్ళకు అమ్మాయిని యిచ్చి పెళ్లి చేసేవారు. బహుభార్యాత్వం ఉండేది. దేవదాసీలు, వాడ వనితలుండేవారు. ఆనాటి వైద్యవిధానంలో మందులు, కషాయం, రసం, తైలం వంటివి ఉండేవి. పుండుకు మందు పూస్తూ రోజూ వేడినీళ్ళతో కడిగే వారు. చల్లకూడు పెట్టి కట్లు కట్టేవారు. కాన్పుల సమయంలో మంత్రసాను లుండేవారు. ఆనాడు సంతలు, అంగళ్ళ ద్వారా వ్యాపారాలు జరిగేవి.

ఇలా అన్నమయ్య సంకీర్తనల్లో అనేక జానపదాంశాలు చోటుచేసుకొని ఉన్నాయి.

20

***

# అన్నమయ్య పదాలు-అలంకార పదప్రయోగాలు

డా॥ టి. మాలకొండయ్య
రీడర్ ఇన్ తెలుగు
యన్.బి.కె.ఆర్. సైన్స్ మరియు ఆర్ట్స్ కాలేజి
కోట మండలం, నెల్లూరు జిల్లా

సంగీతం ముక్తికి పరమసోపానం. ఆ సోపాన మధిరోహించిన పునీతుడు అన్నమయ్య. ఆయనే 'పదకవితా పితామహుడు', 'వాగ్గేయకారుడు', 'సంగీత నిధి', 'భక్తవతంసుల్లో గుణ గరిష్ఠుడు'. ఈయన విష్ణువు నందకాంశంతో పుట్టిన సారమతి, కడప జిల్లా, రాజంపేట తాలూకా, తాళ్లపాక గ్రామ మీరిది.

అన్నమయ్య పాటలు, నాటి జానపదుల పదాలు పొదిగిన వజ్రాలు పదకవితలు. వీరి గేయాలు వైష్ణవ సంప్రదాయాలు. వీరు తెలుగు పదసాహిత్యానికి చేసిన కృషి నిరుపమానం. వీరి వంశీకులు కవిత్రయంగా పేరు పొందారు. అన్నమయ్య, పెదతిరుమలయ్య, చినతిరుమలయ్యలు పదకవితల్ని విస్తరింపచేసిన మహనీయులు. నాటి మన తెలుగు పలుకుబడులు వీరి కవితలో వదిగి పోయిన వనుట విశేషం.

సంగీత సాహిత్యాలకు మిక్కిలి అనంతమైన శక్తి వుంది. అందుకే సరస్వతి రెండు విధాలుగా కవులకు నిండుగా, దండికాదర్శన మివ్వడం ముదావహం.

**"సంగీతమపి సాహిత్యమ్ సరస్వత్యా స్తనద్వయం**
**ఏక మాపాద మధురం యన్యదాలోచనామృతమ్**
**సంగీత సాహిత్యకళా మిహీనః పుచ్ఛ పశూనామ్"**

అన్నారు పెద్దలు. సంగీతం వల్ల రాళ్లు కరుగుతాయి, రోగాలు కుదురుతాయి. కఠిన హృదయాలు కరిగి కరుణ వర్షించును. అంత గొప్ప శక్తి సంగీతాని కున్నది. "గాననమ్ త్రాయేతీతి గాత్రమ్" అన్నారు గదా.

అన్నమయ్యది, త్యాగయ్యదీ మధురభక్తి. తొలి తెలుగు వాగ్గేయకారుడు అన్నమయ్య. ఆయన ప్రియుడు వేంకటేశ్వరుడు. "వాచం గేయంచ, కురుతేయః స వాగ్గేయకారకః" అన్నది సంగీత రత్నాకారం. వీరిది విష్ణుభక్తి ప్రపంచం. "భజ్ సేవాయామ్ భక్తిః", "సర్వం సర్వం స్వాపి యుపాయ దేషు భక్తిరేవ గరీయషి" అన్నది ఆనాటి పెద్దల అభిమతం. "స్వాత్మస్మిన్ పరమ ప్రేమ ప్రేమరూపా" భక్తి. "దర్శనం పరభక్తి స్యాత్ పరజ్ఞానం తు" అంటారు యమునాచార్యులు.

జానపదుల అచ్చమైన స్వచ్ఛమైన జీవన విధానాలే జానపద గీతాలు. అన్నమయ్య వారి జీవన విధానాల్ని తన గేయాల్లో అమ్మవారికి, వెంకటపతికి ఆపాదించి దాదాపు

32 వేల పైచిలుకు గేయాలు రాయడం సంభవించింది. వారి వంశీయులూ అదే మార్గాన్ని అనుసరించారు. తెలుగు ప్రజలకు తరగని గేయ నిధుల్ని వారందించారని చెప్పుటలో సందేహం లేదు.

అన్ని భక్తి మార్గాల్లో ప్రధానమయింది దాస్య భక్తిమార్గం. దానికంటే దగ్గరి మోక్షమార్గం వైరిభక్తి. దానికంటే కుంచం చెప్పుకోదగిన భక్తిమార్గం సంగీత మార్గం. సంగీతం ద్వారా సంగీత ప్రియుల్ని గానం చేసి తరించిన ధన్యజీవి అన్నమయ్య. ఆయనే గాదు వారి మూడు తరాలవారు దేవరసేవలో తరించి ఆంధ్రుల కీర్తిని తరింపచేసిన ధన్యజీవులు.

కన్నడ నాట పురందర దాసాదులు, తమిళనాట దాసరినందుల వంటి వాగ్గేయకారులు, జయదేవ, చైతన్య, మీరాబాయి వంటి సంగీత పండితుల మార్గం వంటి మార్గం అన్నమయ్యది. గానలోలుడు, గానప్రియుడు హరి సన్నుతిని జగద్విదితం చేసిన పుణ్యశాలి అన్నమయ్య. ఈ అన్నమయ్య పదాల్లో కొన్ని అలంకార పదప్రయోగాల్ని ఈ వ్యాసంలో పొందు పరచడం జరిగింది.

సర్వేశ్వరుడిని చేరే మార్గాలు అనేకాలు. "లోకవత్ తల్లీలా కైవల్యం" అని బ్రహ్మసూత్రాలు. సంకీర్తనాచార్యుడుగా ప్రపంచానికి పరిచయం అయిన అన్నమయ్య తెలుగు వారి సంగీత నిధి. "ఆచార్య ప్రబోధలక్షణః", "తేషాం తి బుద్ధిః అచ ఆర్యా ఆచార్య" అన్నది పెద్దల అభిమతం అలాంటి మహోన్నత సంగీత ఘనిమాన అన్నమాచార్యులు 'అన్న', 'మా', చ-ఆర్యులు – అనుటలో సందేహం లేదు. రసికతయే ప్రేయసీప్రియుల గమ్యం. మోక్షరసికతయే భక్తుడు భగవంతుడు కలయిక. అదియే వేదప్రోక్తమైన "రసోవైసః" అన్న సత్యం.

సం॥29, సంపుటం-29, 3వ రేకు లోని

**"ఎంత నేరుచు కుంటువే ఇంతిరో నీవు**
**వింత అందరి ముందర వెల ఇంచిత వేనే"** అను పాటలో

**"బెల్లాల వంటి మాటలు పెదవులపై నాడు"**

మాటల్ని బెల్లంతో పోల్చారు. వేమన కూడ మాటల్ని జున్నుకన్న జుంటి తేనెల కన్న చెలిమాటయే మిన్న అంటారు. మాటల్ని బెల్లంతో పోల్చారు అన్నమయ్య. తియ్యటి మాటలు పల్లె పదాలు.

4వ రేకులో "చక్కని జాణ యిన్నిటా జ్వరాలు – చక్కెర బొమ్మవంటిది జవరాలు" అన్న గేయంలో అమ్మవారిని జవరాలంటూనే చక్కెర బొమ్మతో పోల్చారు. అంటే అన్నయ్య కాలంనాటికి చక్కర బొమ్మలు పోతపోసే ప్రక్రియ వుందని తెలుస్తోంది.

చరణంలో – **"కన్నులఁ దప్పకచూచి కప్పురాన నెన్నువేసి**
**సన్నససే నదివో జవరావు**
**వెన్నెల నవ్వులు నవ్వి వేడుక నీకు బుట్టించి"**

అన్న పట్టున నవ్వుని వెన్నెల తెల్లదనంతో, స్వచ్ఛతలో పోల్చినట్లు మనకి కనిపిస్తోంది.

12వ రేకులో – "ఇంతేసి రట్టు గలదా ఇల్లాండ్లకు – యెంతైనా గుట్టుతోనే యెనయ వలెఁగాక" – అన్న గేయంలో

చెనకి చెనకి మరి "చిగురుఁజేతుల మొక్కి" చేతుల్ని సుతిమెత్తనివిగా, ఏ కౌగిలి చేరని చేతులుగా అలంకార పూరకం చేశారు. చిగురువంటి లేత చేతులంటా రాయన.

13వ రేకులో – **"కొత్త పెండ్లికొడుకవు కొంకనేల నికనేడు
చిత్తగించి రతులను చెలరేగవయ్యా"** గీతంలో
**"కలువరేకులవంటి కన్నులాపె చూచీ నిన్ను"**

కలువ వంటి రేకుల కన్నుల అలవేలు బంధాన్ని బహువ్రీహిని బాహు బంధం చేస్తూ అలంకారాలు పెనవేసుకొన్నారు.

అదే చరణంలో "తలకొని తేనె పదవులాపె విలిచీని" – పెదవుల్ని తేనెతో పోల్చారు. రెండవ చరణంలో కూడా అమ్మ వారికి ఉపమానాలు చెప్పారు.

"మొనసి చందురువంటి మొగమాప నవ్వీని" – అంటూ అమ్మవారి ముఖాన్ని చందమామతో ఉపమానం చెప్పారు. అదే చరణంలో "గునిసి కొండలు వంటిగుబ్బలాపెచెనకీని" అన్న గేయంలో స్థన్యాల్ని కొండల్తో పోల్చారు. నాటి స్త్రీల శరీర పోషకత్వం కూడా ఇక్కడ తెలుస్తోంది.

15వ రేకులో – **"వెలది యీకె ఇదిగో వీడిగో పెండ్లికొడుకు
యెవారు నుపచారాలు ఇన్నియును జేయరే"**

అనే గేయంలో **"అంబుజ పాణికిని హారములు గట్టరే
బింబాధరికి గొప్పు వెట్ట గదరే"**

అన్న చరణ భాగంలో అలంకారాలు వెల్లువ మనకి తెలుస్తోంది. రెండవ చరణంలో కూడా అలంకారాలు వివరించారు.

**"కలువ కంటికి మంచి కాటుక వెట్టగదరే–వేలువ కన్నులు పోలిన
తలిరుఁబోణికి పూలదండ వేయరే"**

అంటూ అలంకారాలు చెపుతూ చివరికి 'కరిగమనకును రాగాలు చేతికాసగరే' అంటారు. ఆడవాళ్ల నడకను మథించించిన ఏనుగుతో పోల్చడం కవి సమయం సహజ సుందరం, సామజవరగమనం.

32వ రేకులో – "ఎంత యెమ్మెలఁ బొరలేవేయే నీవు–మంతుకెక్కు నిన్నాతడు మన్నించీ నంటాను" అనే గేయంలో "కప్పురపు బల్కులెన్ని గాదెఁబోసెవే – అన్న చరణంలో మాటల్ని కప్పురంతో వివరించి అభివర్ణించారు.

34వ రేకు – **"ఇదివో మేలు సుద్ది మీకిన్నిటా–
మదిలోన మఱవక మన్నించుమనెనె**

**కలికి కన్నుల దొక కతకారి-నీకు" అన్న చరణంలో**
**"మొలక చన్నులది-ముద్దులాడి"**

అన్న సందర్భంలో పోట మరించె వయస్సు చిన్నెల్ని మొలకల్తో పోల్చి చెప్పారు. ఇదే గేయంలో "చక్కెర మోమిది యాజవరాలు నీవు" పెదవుల్ని చక్కెరతో వివరించారు. "చెక్కుటద్దాలది వేదు జేతలాడి! తొల్లెన అన్న సందర్భంలో చెక్కిళ్లని అద్దాల వంటి నిగనిగలు ఆపాదించి వర్ణించారు.

41వ రేకులో - **"తప్పక చూడవయ్యా తలయెత్తి యికె దిక్కు**
**వొప్పులన్నియును నీయు విదనే కలిగే"**

గేయంలో "చక్కని చందమామ సతిమోము" అంటూ ప్రేయసి ముఖాన్ని చందమామతో పోల్చి చెప్పారు.

'చిక్కని తేటవెన్నెల చిరునవ్వు' అంటూ చిరునవ్వుని వెన్నెలకాంతితో ఆపాదించి చెప్పారు. "గొప్ప తమ్మిరేకులీ కుమ్మి కన్నులు" అంటూ ఆమె కన్నుల్ని తమ్మిరేకుల్తో పోల్చి తృప్తి చెందారు అన్నమయ్య.

50వ రేకులో - **"ఇదివో విన్నవించితి మిన్నిటా జకావు నీవు**
**రుదిరాక్షి యే లెరిగి మన్నించగదును"**

**"చెలి నీవు వచ్చేవంటా సిగ్గుల ముగ్గులు వెట్టి**
**తళుకుఁజూపుల తమ్మి దండలు గట్టి**
**"పలచని చెమటల పన్నీరు చిలికించి"**
**"వెలయ మోవి తేనెల విందాయితము సేసె"**

అంటూ అన్నమయ్య చక్కటి అలంకారాలు వివరించారు. తరువాత సినీకవుల్ని కూడా "చమటనీరే మంచి గంధమంటూ" అలరించి పులకరింప చేసింది. చెమట పన్నీరుగా చెప్పబడింది.

**చ॥ దొరయ చెక్కుటద్దాల తోరణములుగా గట్టి**
**గరిమఁదొడు లరటి కంబాలు సేసే**
**నిరతిఁబులకలనే నించె ముత్తేలకుచ్చులు**
**పరగ గుబ్బలనే ప్రదికుందలెత్తెను.**

**చ॥ కమ్మని మేని తావుల గంధమట్టె, యమరించె -**

అంటూ అన్నమాచార్యుడు తనివితీరా అలంకారాలు రకరకాల భావాల్తో వివరించారు. అన్నీ కవి సమయాలే జానపదమైనా శిష్టమార్గం "జాన" పదంగా పరిణమించింది. వారి నేర్పు కూర్పు మిక్కిలి అబ్బురులు. పెండ్లి మండపాన్ని స్త్రీ అంగభాగాల్తో పోల్చి చెప్పటం చాలా అలంకార ప్రాయం. అంతేగదా పెళ్లి మండపం అలంకారంగానే గదా వుండేది.

53 గేయంలో **"ఆడదాని కింతగద్దా అగదు సేసెగత**
**జూటిరిదీని విద్యలు చూదరమ్మా సతులు"**

అనే పల్లవిలో సాగిన గేయంలో "చిగురుఁ బెదవిమీద చిన్ని ముద్దుమాటఁలాడీ అంటూ లేతచిగురుటాకు వంటి పెదవుల్ని అభివర్ణించారు.

'తెగని వలపు చల్లి తీగె నవ్వులు నవ్వీ' అంటూ నవ్వుల తీగల్ని పులకరింప చేశారు.

77 గేయంలో **"సుదతుల మెల్లాను సోబానఁ బిపముబాడేము-బాడేము**
**యెదుటనున్న మము నేలితి వపుడే"**

అనే పాటలో "నిండు నిధానము నెలత జవ్వనము" అంటూ నిధి తరగనిది, అమ్మ యవ్వనమూ తరగనిది చెరగనిదని అన్నమయ్య నిత్య జవరాలి తనాన్ని ఆపాదించి వర్ణించడం ముదావహం. ఆమె ధరించింది మరి పారిజాత పువ్వు గదా!

**"కనక వసంతము కామిని సరసము"** అంటూ సరసాన్ని కనకంతో పోల్చి తృప్తి చెందారు పదకవితా పితామహుడు.

**"చినుకుఁదేనియలు చెలగేటి పలుకులు"** అని ఆమె మాటల్ని తియ్యని మాటలుగా మధుర వాక్కులుగా అభివర్ణించటం విశేషం.

**"ముంగిట సంపద ముదిత సింగారము"** ఆమె సంపదలకు నిలయమంటూ గుర్తు చేసి – ఆమె సొగసుల్ని వివరించారు.

**92వ రేకులో -** **"ఏమని నుతింతునమ్మా యిట్టినీ చక్కదనము**
**కాముని బలము లొక్క గాడిఁగట్టితివేనీ"**

అంటూ అలంకార యుక్తంగా అన్నమయ్య గేయాన్ని ఉపమానించారు.

103 రేకు గేయంలో పల్లవిలో ఆమె శరీర సౌకుమార్యాన్ని ఇలా చెప్పారు.

**"నీవు మొదల నన్నిటా నెరజాణవు**
**పూవు వంటి దాన నాతోఁబొందు సేసే విపుడు"**

అంటూ ఆమె శరీర సుకుమారాన్ని వివరించారు.

104 పాట :

**"ఈకె నలుగగ గదా యిన్నియును వెలవెట్టి**
**దాకుని వొండొకటితో దారుకాణ లాయనే"**

అంటూ అన్నమయ్య ఈ గేయంలో అలంకారాలు మిక్కిలిగా పోషించారు. పిరుదుల్ని బండికంట్లుతో వివరించారు. అన్నమయ్యకి ప్రకృతి అలంకార ప్రియ మయింది.

"ఏకోరసఁ శృంగారయేవ" అన్న అలంకారికుల మతం సత్యం. "శృంగార యేవ మధురః పరిప్లాద నోరసః" అన్నదీ యదార్థం. ప్రజల్ని మురిపించేది, ...

మైమరపించేది శృంగారం అదే చెల్లి ప్రేమ, అదే చెలి ప్రేమ, అదే తల్లి ప్రేమ, అదే సకల ప్రాణుల ప్రేమ. అనురాగ లాలనలో, కరుణా తరంగాల్లో జనించిందే దేవుని ప్రేమ. ఆ ప్రేమయే నిత్యం, సత్యం, సర్వజనులకు ముక్తి ప్రదం.

**ఆధ్యాత్మ సంకీర్తనలు :**

16 రేకు - లో వ్రాయబడిన పాటలో అలంకారాల విధానం కన్పిస్తోంది.

"ఇహపర సాధానమిది యొకటే - సహజ ప్రవలరారి సంకీర్తన నొకటే"

"భవసాగరములంబాపెడిది తేప" అనుటచే సాంసార సాగరం అలంకార పద పంక్తులు మనకు కన్పిస్తోంది. ఇదే పాటలో

చరణం॥ "చింతా తిమిరముఁ జెరి చేటి సూర్యుడు" స్వామివారు చింతా దుఃఖపు చీకటిని, శోకతప్త చీకటిని అజ్ఞానాన్ని తొలగించే వెలుగా సూర్యుడిగా భావించడం జరిగింది.

ఇదే పాటలో మరొ కలంకారం కన్పిస్తోంది.

**"మించు దుఃఖములమృత సంజీవని**

**అంచలఁబంచేంద్రియముల కంకుశము".** అంకుశం యొంచక శ్రీ వేంకటేశు దాసులకు బంచిన పాళ్లఁబరగిన దొకటే ॥

అంటూ భవబంధాల పాపపరిహారపు అలంకార వస్తువుల్ని వివరించారు.

23వ రేకులో - అన్నమయ్య పాపప్రక్షాళనకు చెందిన వస్తు సముదాయాన్ని స్వభావ చిత్రీకరణ వివరించారు. "దేహోవ సానే మోక్షం చ" అనే దారానికి విముక్తి పూవుల్ని గుచ్చే మార్గం శుభంకరం.

**"జాలేనే నొక పనికినపుడు నీకును**
**కూళలలో నెంచి చూడ గురి యవుదును"**

అనే పాటలో అలంకారాల వెల్లువ వెలిగింది.

126వ రేకులో- **"కావగి నీకే పోదు కరుణానిధివి గాన**
**దేవనీ బంట్లము మా తెరువేటి తెరుపు"** ॥ప॥

అనే పాటలో "బంటు బండై పూరగల పనులెల్లా జేసము" - అనే చరణంలో "బెండు వంటి వారము" "మా బిగువేటి బిగువు" - అని మనుషుల చిన్నిపాటి జీవితాన్ని బెండుతో సరిపోల్చుకున్నాడు. దీనికోసం మనిషి ప్రయాసపడవలసిన అవసరం లేదనే విషయాన్ని అలంకార పూరితంగా వివరించారు.

453వ రేకు - **"పట్టిన వ్రతము నీవే పరిపాలింతువు గాక**
**బట్టి బయలింతే నేను బలిమున్నదా...**

అనే గేయంలో "పూవవంటి చిత్తమింతే, పొల్లు వంటి కాయ మింతే" అని అంటారు.

**"గంతి వంటిగుణ, మింతే గాలివంటి ప్రాణమింతే"**

అనే ప్రాణానికి గుణానికి చెందిన నిర్వేద భావాన్ని ఆచార్యుల వారు చక్కగా ఉపామానం చేశారు.

**"గచ్చువంటి యిహమింతే గనివంటి పరమింతే"**

అంటూ అదే గేయంలో ఇహపరాల శాశ్విత తాత్కాలిక స్థితుల్ని అందుబాటులో వున్న తెలుగు పాదాల్లో పోల్చారు.

**"కొండలలో నెలకొన్న కోనేటిరాయుడు వాడు**
**కొండలంత వరమూలూ గుప్పెదు వాడు"**

అనే గేయంలో వరాలజల్లె పరమహస్తం కుండగా మారిందంటారు అన్నమాచార్యుడు.

**"అదిగో అల్లదిగో శ్రీహరివాసం శ్రీహరివాసము**
**అదే వెంకటాచల మహిలోనగము...."**

అంటూ సాగే గేయంలో శ్రీహరి వాసమే వేంకటాచలమని పోల్చారు కవి.

శ్రీహరివాసం - పాలకడలి, వైకుంఠం, అయోధ్య, ద్వారక, వెంకటాచల మనే అర్థంలో ఈ పోలిక చెప్పబడింది. హరి వైభవమే జీవన పరమార్ధంగా చెప్పబడింది. స్థూలంగా కొన్ని అలంకార ప్రయోగ పదాల పరిచయం చేయడం జరిగింది.

***

# సుభద్రాకల్యాణంలో కనిపించే తిమ్మక్క

**డా॥ బి. కల్పన**
**తెలుగు అధ్యాపకులు**
**శ్రీ పద్మావతీ మహిళా జూనియర్ కళాశాల**
**తిరుపతి**

ఆంధ్రదేశానికి చెందిన సాహిత్య కుటుంబాల్లో అగ్రశ్రేణికి చెందిన తాళ్ళపాక వారి కుటుంబం. తాళ్ళపాక వారు మొదట వైదికులు. అన్నమయ్య కాలం నుంచి వైష్ణవులు. అందరూ వేంకటేశ్వర భక్తులే. కైంకర్యపరులే. సాహితీమూర్తులే. మూడు తరాలవారు వాగ్గేయకారులు.

తాళ్ళపాక వాగ్గేయకారులకు మూలపురుషులుగా చెప్పుకోదగ్గవాడు తాళ్ళపాక అన్నమాచార్యుడు. ఈయన వేంకటేశ్వరస్వామి మీద 32 వేల కీర్తనలు వెలయించాడు. పోతనవి పదాలను తలపించే పద్యాలు కాగా అన్నమయ్యవి పద్యాలను తలపించే పదాలయ్యాయని సాహితీ విమర్శకుల విశ్వాసం. తెలుగులో సలక్షణమైన సంకీర్తనకు

శ్రీకారం చుట్టడంవల్ల తొలి తెలుగు వాగ్గేయకారుడని సంకీర్తనాచార్యుడని ప్రసిద్ధి వహించాడు. తెలుగులో ఆదికవియైన నన్నయ తెలుగు వ్యాకరణాన్ని 'ఆంధ్రశబ్దచింతామణి' అనే పేరుతో సంస్కృతంలో రచించినట్టే తొలి సంకీర్తనాచార్యుడైన అన్నమయ్య కూడా 'తెలుగు సంకీర్తనా లక్షణా'న్ని సంస్కృతంలో రచించాడు. పదాలేగాక ద్విపదలు కూడా రచించాడు. హృద్య పద్యాలకు ఊపిరులూదాడు.

అన్నమయ్య ఎన్నో మహిమలు ప్రదర్శించాడు. అనేక విష్ణుక్షేత్రాలకు వెళ్లి విష్ణుభక్తిని ప్రచారం చేశాడు. ఈయనకు ఇద్దరు భార్యలు మొదటి భార్య తిమ్మాంబ. ఈమెను తిమ్మక్క అనికూడా వ్యవహరిస్తారు. రెండవ భార్య అక్కలాంబ. ఈమెను అక్కమ్మ అని కూడా అంటారు.

అన్నమయ్య పెద్దభార్య అయిన తిమ్మక్క విదుషీమణి. అన్నమయ్య సాహచర్యం వల్లనో ఏమో ఆమెకు కవిత్వం కూడా అబ్బింది. సుభద్రా కల్యాణమనే ద్విపదకావ్యం రచించి తొలితెలుగు కవయిత్రిగా ప్రసిద్ధి వహించింది. తన మనోమందిరుడైన అన్నమయ్య మరో మగువ మనోమందిరంలోనూ కాపురం చెయ్యడం ఆమె మనస్సును బాగా ప్రభావితంచేసి ఉంటుంది. పర్యవసానంగా తనకు కలిగిన బాధను కొంతైనా తొలగించుకోవాలనిపించి ఉంటుంది. తనలాగే పతివలపును సుభద్రకు పంచి ఇచ్చిన ద్రౌపది ఆమె మదిలో మెదిలి ఉంటుంది. సుభద్రా కల్యాణాన్ని రచించి ద్రౌపది పడిన ఇబ్బందిన ఆవిష్కరిస్తూ తాను కూడా కొంత ఊరట పొంది ఉంటుంది. కాబట్టి సుభద్రాకల్యాణంలో కనిపించే తిమ్మక్కను స్థూలంగా పరియం చేయదానికి ఈ పత్రం ప్రయత్నిస్తుంది.

అన్నమయ్యకు తిమ్మక్క జ్యేష్ఠపత్ని. ఆమెతో ఆగని అన్నమయ్య అక్కలమ్మను కూడా వివాహం చేసుకొన్నాడు. ఆ సందర్భంగా తిమ్మక్క హృదయం క్షోభించి ఉంటుంది. ఆమె హృదయాన్ని ఆవిష్కరించేందుకు అనువైన పరిస్థితులు ఆనాడు లేవు. అన్యాపదేశంగా తన అంతరంగాన్ని అభివ్యక్తం చేసే చిన్నపనికి పెద్ద ప్రయత్నమే చేయవలసివచ్చింది. మనసులో మాట బయటకు వెళ్తేనే మనశ్శాంతి. ఈ కారణం చేత ఏడుకొండలస్వామిని వదలి తన స్వామి తనపట్ల చూపిన అలక్ష్యాన్ని ఆవిష్కరించి ఊరట పొందేందుకే ఈ ప్రయత్నం చేసినట్లుంది.

తిమ్మక్క రచించిన సుభద్రా కల్యాణానికి మహాభారతమే మూలం. కవిత్రయం ఆంధ్రమహాభారతం ఆదిపర్వం అష్టమాశ్వాసంలో 90వ పద్యం నుంచి 223 వ పద్యందాకా వ్యాపించి ఉన్న వృత్తాంతాన్ని తీసుకొని తిమ్మక్క సంక్షిప్తంగా ద్విపద కావ్యంగా వెలయించింది.

తిమ్మక్క రచించిన సుభద్రా కల్యాణంలో ఆమె అనేకచోట్ల కనిపిస్తూవుంది. మొదట తానే ఈ సుభద్రాకల్యాణాన్ని రచించినట్లు తెలియజేయడం ద్వారా గ్రంథ కవయిత్రిగా మొదట కనిపిస్తుంది.

**"తరుణి తిమ్మక చెప్పె - దాసు సుభద్ర**
**కల్యాణమను పాట - కడుమంచి తేట"**

(తాళ్ళపాక తిమ్మక్క సుభద్రా కల్యాణం, పుట. 76)

తన కల్యాణం మసకబారినట్లు గ్రహించిన తిమ్మక్క మనస్సులోని మాట బయటపెట్టి మనశ్శాంతి పొందాలనుకుంది. వైవాహిక జీవితాన్ని మరో మానినితో పంచుకోవాల్సి వచ్చినప్పుడు మనస్సు ఎంతగా క్షోభిస్తుందో పోరాటం నలిగి పోతుందో రుక్మిణీ ద్రౌపది పాత్రల ద్వారా ఆవిష్కరించేందుకు ప్రయత్నించింది.

సుభద్రను అత్తవారింటికి పంపేటప్పుడు రుక్మిణి హితంగా, మితంగా మంచి బుద్దులు చెప్పింది. ముద్దుల మరదలు ముద్దరాలని మురిపెం చూపుతున్నందుకు అర్జునుడి పట్ల అలక్ష్యంగా వ్యవహరించగూడదంది. పురుషులను నమ్మకూడదని వారు నల్లత్రాచు లాంటి వారని హెచ్చరించింది.

**"చనవిచ్చినాదని - సకియరో నీవు**
**పలు మాటలకు నెట్లు - పాలువడవద్దు**
**పొలతి నమ్మగరాదు - పురుషులనెపుడు**
**పలురీతి కృష్ణ స - ర్పమ్ములై యుంద్రు"**

ఇక్కడ పారిజాతాపహరణంలో సత్యభామ తన చెలికత్తెతో చెప్పిన పద్యం మదిలో మెదలుతుంది.

**"పరికింపరు తమ జాడలు**
**తరుణుల తగులములు నమ్మదగదంద్రుమదిన్**
**శరదంబుదచల చిత్తులు**
**పురుషులెపో వారి నమ్మబోలునె? చెలియా"**

(పారిజాతాపహరణము, ప్ర.ఆ. పుట. 87)

పాంచాలితో వంచన లేక మంచిగా మసలుకొమ్మని రుక్మిణి సుభద్రతో భద్రోక్తి పలికింది.

**"కొంచక గృష్ణకు - కూర్మితో నుండు**
**వంచన సేయకు - వనితయెపుడును".**

సపత్నుల ఇబ్బందితో తనలాగే సతమతమవుతున్న పాంచాలిని వంచించ వద్దని చెప్పడం రుక్మిణి అంతఃకరణాన్ని బహిర్గతం చేస్తుంది.

సపత్నీ సమస్యతో సతమతమైన రుక్మిణీదేవిలాగే ద్రౌపది మనస్సు కూడా ద్రవించింది. వలచి వలపించుకున్న అర్జునుడు తనతోబాటు మరో మహిళకు కూడా స్థానం ఇవ్వడాన్ని ద్రౌపది జీర్ణించుకోలేక పోయింది. తట్టుకోలేక పోయింది. తనకు సవతిగా వచ్చే ఉవిద సామాన్య స్త్రీ కాదు. అఖిలాండ కోటి బ్రహ్మాండనాయకు డైన

శ్రీకృష్ణుని చెల్లెలు. శ్రీకృష్ణుడు తనకు చేసిన ఉపకారాన్ని స్మరించి ద్రౌపది సరిపుచ్చుకొంది. పతి జీవితంలోకి వచ్చిన ఆ అతివను కూడా ఆహ్వానించి అక్కున జేర్చుకొంది. ద్రౌపది మనస్సులో సాగిన ఆలోచనా ప్రవాహానికి తిమ్మక్క అద్దం పట్టింది.

**"ఏమి వస్తువులైన - నియవచ్చుగాని**
**ప్రాణేశునిచ్చిమతీ - బ్రతుకంగరాదు"**

(తాళ్ళపాక తిమ్మక్క సుభద్రా కల్యాణం, పుట 73-74)

ఇక్కడ కూడ సత్యభామ చెప్పిన మరొక పద్యం స్మృతి పథంలో మెదులుతుంది.

**"ధనమిచ్చి పుచ్చుకొన్నను**
**మనమున నోర్వంగవచ్చు, మగడింతులకున్**
**జనవిచ్చి పుచ్చుకొన్నను**
**మన వచ్చునె? యింకనేటి మాటలు చెలియా!**

(పారిజాతాపహరణం, ప్ర.ఆ. పద్యం 97)

ఇక్కడ రుక్మిణిలోనూ, ద్రౌపదిలోనూ తిమ్మక్క అనుభూతి ప్రతిబింబించింది. ఆమె స్వయంగా ఆ పాత్రల్లోనుంచి ఆకుచాటు పిందెలా తొంగి చూసి మౌనం వహించింది.

**తిమ్మక్క ఆంధ్రాభిమానం :**

తిమ్మక్క తెలుగింటి ఆడపడుచు, తెలుగింటి కోడలు తెలుగు చదువుకొన్న తెరవ. తెలుగుదేశంలో తిమ్మక్క, తిమ్మక్కలో తెలుగు దేశము విడదీయరాని విధంగా విలసిల్లడం వల్ల ఆమెలోని ఆంధ్రాబిమానం అవధులు దాటింది. కావ్యమంతటా పరిమళించింది. మచ్చుకు కొన్ని అంశాలు పరిశీలించవచ్చు.

తిమ్మక్క ఆంధ్రాభిమానం ఉట్టిపడే విధంగా అర్జునుడి తీర్థయాత్రలో తెలుగు ప్రాంతానికి చెందిన కొన్ని ప్రదేశాలను చేర్చింది. అవి అహోబిలం, తిరుమల, కంచి, శ్రీరంగం.

**"చనుదెంచె పర్వత - స్వామి సన్నిధికి**
**అమర సహోబిలం - బా వెంకటాద్రి"**

(తిమ్మక్క, సుభద్రాకల్యాణం - పుట 25)

సుభద్ర బొమ్మల పెళ్లి చేసింది. అప్పుడామె చేసిన వేడుకలు, ఆంధ్రుల ఆడపిల్లలు దసరాకు చేసే వేడుకలు గానే కనిపిస్తాయి. ఈ వర్ణన గమనిస్తే ఈ అంశం బోధపడుతుంది.

**"పొలుపైన రత్నాల - బొమ్మరింటికిని**
**తళుకైన పగడాల - దార బంధములు"**

(తిమ్మక్క సుభద్రా కల్యాణం, పుట-37)

యాదవులు రైవతకాద్రి మహోత్సవానికి వెళ్ళినప్పుడు వెంట తీసుకెళ్ళిన వంటకాలు కూడా తెలుగు వంటకాలే కానీ గుజరాతీ వంటకాలు కావు. ఇవి గమనించదగ్గవి.

**"పప్పు బూరెలు నెయ్యి - పాయసాన్నములు**
**కాయగూరలు పెక్కు - కల వంటకాలు"**

(తిమ్మక్క, సుభద్రా కల్యాణం, పుట 33)

తిమ్మక్క ద్రౌపదిచేత సుభద్రార్జునుల తొలిరాత్రి పడకటింటిని అలంకరింప జేసింది. తినుబండారాలను కూడా పెట్టించింది. అవి ఆనాటి ఆంధ్రుల తినుబండారాలు కావచ్చు.

**"మదిరాక్షి యునిచెను - మఱియు నచ్చటను**
**చాఱపప్పు గసగ - సాలానవాలు"**

(తిమ్మక్క, సుభద్రా కల్యాణం, పుట 70-71)

**హాస్యప్రియత్వం :**

తిమ్మక్క సుభద్రాకల్యాణంలో పూయించిన హాస్యం హాస్యం పట్ల ఆమెకు గల మక్కువను ఆవిష్కరిస్తుంది. నవ్వుతూ నవ్విస్తూ చింతలనూ వంతలను చిటికెలో దూరం చేయగల ఆమె మనస్తత్వానికి అద్దం పడుతుంది. కపట సన్యాసిగా వచ్చిన అర్జునుణ్ణి కృష్ణుడు ఎగతాళి చేసిన తీరు మనసును ఆకట్టుకొని తీరుతుంది.

**"నిన్న సుతులగని - నెఱతనమ్మునను**
**యింతలో సన్యాసి - వెట్లయిత వయ్య"**

(తాళ్ళపాక తిమ్మక్క సుభద్రా కల్యాణం, పుట 32-33)

కపట సన్యాసి అర్జునుడేనని తెలిసి మౌనంతో మంచమెక్కిన సుభద్రను సమీపించి రుక్మిణి పరియాచకాలాడిన తీరు తిమ్మక్క నేర్పును తేటపరుస్తూ ఉంది.

**"ఆ యంబుజాక్షియు - నచటి కరుదెంచి**
**ఆ మరదలి జూచి - యటు నవ్వి పలికె"**

(తాళ్ళపాక తిమ్మక్క, సుభద్రా కల్యాణం, పుట 57)

భారత ఆదిపర్వంలో అర్జున తీర్థయాత్రలో చోటుచేసుకున్న సుభద్రా కల్యాణాన్ని ఆధారం రీచసుకొని తిమ్మక్క ఒక ద్విపదకావ్యం వెలయించింది. పామరులకు కూడా అర్థమయ్యే విధంగా సులభ సుందరభాషలో రచించింది. తెలుగు వారికి మేనరికం ప్రీతిపాత్రం. అందువల్ల మేనరికం ప్రాతిపదికగా సాగిన ఈ కథను తిమ్మక్క ఇష్టపడి ఉండవచ్చు. కాబట్టే దీన్ని ఇతివృత్తంగా స్వీకరించి ఉండవచ్చు. ఇదేగాక కృష్ణుడు, అర్జునుడు బహుపత్నీవ్రతులు. వారి భార్యలైన రుక్మిణీ, ద్రౌపది సపత్నీ సమస్యతో మానసిక క్షోభ పొంది ఉంటారు. అన్నమయ్య తనను మాత్రమేగాక అక్కలమ్మను

కూడా వివాహం చేసుకోవడం సపత్నీ సమస్యా స్పర్శ తిమ్మక్కకు కూడా తగిలి ఉంటుంది. ఇదికూడా ఈ ఇతివృత్తాన్ని స్వీకరించడానికి ఆమెను పురికొల్పి ఉంటుంది. అందువల్లనే రుక్మిణీ ద్రౌపదుల పాత్రలలో బాగా గమనిస్తే తిమ్మక్క కూడా కనిపించక మానదు.

కవయిత్రిగా తిమ్మక్క సుభద్రాకల్యాణం అంతటా గోచరిస్తుంది. ఆమె ఆంధ్రాభిమానం పరిహాస కుశలత వర్ణనానైపుణ్యం సమకాలీన స్పృహ ద్విపదను పాటగా తీర్చిదిద్ది పాడుకోజాలిన తిమ్మక్క నేర్పు ఈ కావ్యంలో ద్యోతకమౌతాయి. సుభద్రాకల్యాణం ఆనాటి యాదవ, పాండవ కుటుంబాలనే గాక 15వ శతాబ్దపు తెలుగు కుటుంబాలను కూడా దృష్టిలో పెట్టుకొని సాగిన కావ్యం ఆనాటి తెలుగు వారి పిండివంటకాలు, నగలు, ఆచారసాంప్రదాయాలు ఈ కావ్యంలో కనిపిస్తాయి.

**ఆధార గ్రంథాలు :**


1. సుభద్రాకల్యాణం - తాళ్ళపాక తిమ్మక్క.
2. పారిజాతాపహరణం - నంది తిమ్మన.
3. తాళ్ళపాక కవుల సాహితీ కిరణాలు - ఆచార్య జక్కంపూడి మునిరత్నం.


***

# అన్నమయ్య - త్యాగయ్య


**శ్రీమతి జి. నీరజ**
**ఆంగ్ల అధ్యాపకులు**
**శ్రీ పద్మావతి మహిళా డిగ్రీ మరియు**
**పి.జి. కళాశాల, తిరుపతి**


**"శ్రీమత్వదీయ చరితామృత మన్నయార్య**
**పీత్వాపి నైవ సుహితౌ మనుజా భవేయుః**
**త్వం వేంకటాచలపతే రివ భక్తిసారం**
**శ్రీ తాళ్ళపాక గురుదేవ నమో నమస్తే"**

**"రామ పదభక్తి త్యాగయార్య వరునికిని**
**సమము గానేర రెవ్వరీక్ష్మా తలమున**
**ప్రేమ నా ఘనుడొకసారి పిలిచెనేని**
**రాము "డొహో" యనుచును మార్జలుకునంట."**

ఆంధ్ర వాగ్గేయ కారుల్లో ప్రథముడు అన్నమయ్య. ప్రసిద్ధుడు త్యాగయ్య. కొండలమధ్య పుట్టి కోనల్లో పెరిగి కొండలరాయనిపై నిండైన భక్తి నిలుపుకొన్న వాడు అన్నమయ్య. నదీతీరంలో పుట్టి నాదోపాసన చేసి చివరకు నారాయణునిలో లీనమైనవాడు త్యాగయ్య. ఈ వాగ్గేయకారుల జీవితంలో ఎన్నో సారూప్యములు కనబడతాయి.

**1. వారిరువురి జన్మ విశేషాలు :**

క్రీ.శ. 15వ శతాబ్దంలో శ్రీ వేంకటేశ్వర భక్తి సామ్రాజ్యాన్ని నిరాటంకంగా ఏలి ఆ స్వామి వారిపై 32 వేల శృంగార, ఆధ్యాత్మిక సంకీర్తనలు గానం చేసి తరించిన పరమ భక్తాగ్రేసరుడైన తాళ్ళపాక అన్నమాచార్యులు యావదాంధ్ర దేశీయులకు సుపరిచితులు. ఇతని సంకీర్తనలోని శృంగార విషయం 16వ శతాబ్దంలో క్షేత్రయ్యగాను, భక్తిభావం 17వ శతాబ్దంలో రామదాసుగాను, సంగీతాంశం 18వ శతాబ్దంలో త్యాగరాజుగాను అవతరించారని పండితులు చమత్కరించడంలో ఆశ్చర్యమేమి లేదు.

అన్నమయ్య క్రీ.శ. 1408 సం॥ సర్వధారినామ సం॥ము వైశాఖ శుద్ధ పూర్ణిమ నాడు లక్కమాంబ, నారాయణసూరి అను పుణ్యదంపతులకు కడప జిల్లాలోని రాజంపేట తాలూకాలోని తాళ్ళపాక అను గ్రామంలో (9-5-1408) జన్మించాడు. స్వామి ఖడ్గం 'నందకం' అంశతో పుట్టాడని తల్లిదండ్రులు భావించిన అన్నమయ్య పుట్టుకతోనే వేంకటేశ్వర స్వామి భక్తుడయ్యాడు. కవిత్వము, సంగీతము పుట్టుకతోనే సహజంగా అబ్బిన అన్నమయ్య స్వామి గురించి పాటలు కట్టి, భక్తి పారవశ్యంతో ఆలపించాడు.

భారతదేశంలో సంగీత పితామహులుగా భావించే వాగ్గేయకార త్రయంలో త్యాగరాజు ఒకరు. మిగిలిన వారు శ్యామశాస్త్రి, ముత్తుస్వామి దీక్షితులు. త్యాగరాజు, సీతమ్మ, రామబ్రహ్మంగార్ల మూడవ కుమారుడు. ఆంధ్ర బ్రాహ్మణులు, భారద్వాజ సగోత్రులు, కాకర్ల వంశీయులు. శ్రీ సర్వజిత్‌నామ సం॥ము మేషమాసం శుద్ధ షష్ఠి సోమవారం (4-5-1767) తంజావూరు మండలం తిరువయ్యారు అను గ్రామంలో జన్మించాడు.

**బాల్య విశేషాలు :**

అన్నమయ్యది పండిత వంశమో కాదో తెలియదు. కాని తండ్రి పేరు చివర 'సూరి' అనే మాట వుంది. సూరి అంటే పండితుడని అర్థం. అన్నమయ్య తండ్రి వద్ద ఏం నేర్చుకున్నాడో తెలియదు కాని త్యాగయ్య మాత్రం తల్లివద్ద జయదేవుని అష్టపదులు, అన్నమయ్య సంకీర్తనలు ఆలకించేవాడు. తండ్రివద్ద సంస్కృతం, ఆంధ్రభాషలో పోతన భాగవతాన్ని శ్రద్ధగా చదువుకొనేవాడు.

అన్నమయ్యను ఒకసారి ఇంట్లోని వారు కలసికట్టుగా గడ్డి తెమ్మని కోరగా అడవికి వెళ్ళి తిరుపతి కెళ్ళే భక్తబృందంతో కలసిపోయి స్వామిని సందర్శించి ఘన విష్ణువు చలవవల్ల వైష్ణవుడయ్యాడు. ఆ తర్వాత ఆదివన్ 'శఠగోపయతుల' వద్ద వేదవేదాంగాలు నేర్చుకొన్నాడు. అన్నమయ్య సంగీత గురువు లెవరో తెలియదు.

కాని త్యాగయ్య తల్లిదండ్రుల శిక్షణ, ఆచార్య విద్వాన్ శొంఠి వెంకటరమణయ్య గారి వద్ద సంగీత విద్యను అభ్యసించాడు. ఒకసారి తన గురువు తంజావూరులో సంగీత సదస్సు ఏర్పాటు చేయగా త్యాగయ్య "దొరకునా ఇటువంటి సేవ" అన్న కృతిని బిలహరిరాగంలో ఆలపించాడు. సభ హర్షధ్వానాలతో మారుమ్రోగింది. ఆ సందర్భములో అతని గురువు వాత్సల్యంతో ఆలింగనం చేసుకొని "దొరకునా యిటువంటి శిష్యుడు" అని మెచ్చుకున్నారట. త్యాగయ్య గురుభక్తి, శొంఠి వెంకటరమణ్యయ గారి శిష్యవాత్సల్యం మరువరానిది. గురుశిష్యుల సంబంధానికి యిదొక చక్కని ఉదాహరణ.

**గృహస్థాశ్రమ సామ్యాలు :**

ఇక కుటుంబ జీవితమును పరిశీలిస్తే అన్నమయ్యకు ఇద్దరు భార్యలు. అతని తల్లిదండ్రులు శ్రీవారిని వేడుకొని ఇంటికి చేర్చి తిమ్మక్క, అక్కలమ్మలను యిచ్చి వివాహం గావించారు. త్యాగయ్యకు కూడ ఇద్దరు భార్యలు. ప్రథమ కళత్రం పార్వతి పరలోకం చేరుకుంటే, కమలాంబను ద్వితీయ వివాహం చేసుకోవలసి వచ్చింది.

అన్నమయ్య కుమారుడు పెదతిరుమలాచార్యుడు తండ్రికి వారసుడయ్యాడు. త్యాగయ్యకు కుమారులు లేని కొరతను శిష్యులే తీర్చారు. గురువు గారిని గుండెల్లో నిలుపుకొన్నవారు వాలాజీపేట వెంకటరమణ భాగవతార్, కృష్ణభాగవతార్, వీణా కుప్పయ్యర్.

అన్నమయ్య జీవించింది 95 ఏళ్ళు. త్యాగయ్య 80 ఏళ్ళ జీవితం గడిపి తనువు చాలించాడు. అన్నమయ్య భక్తితో ముక్తిని పొందాడు. త్యాగయ్య సన్యాసం స్వీకరించి చతురాశ్రమ ధర్మాన్ని పూర్తి చేశాడు. త్యాగయ్య బృందావనం తిరువాయూర్‌లో నేటికి మనం దర్శించవచ్చు.

**జీవిత సంఘటనల్లో పోలికలు :**

వీరిరువురు భార్యల వలన బాధలు పడినట్లు కనబడదు. కాని వీరికి బంధువుల బాధలు మాత్రం తప్పలేదు. దండెం భుజాన తగిలించుకొని వేళాపాళా లేకుండా పిచ్చిపాటలు పాడుతుంటే అన్నావదినెలు అన్నమయ్యను అనవసరంగా కసిరేవారు. అలాగే ఎప్పుడు పూజా పునస్కారాలేనా అని అన్న త్యాగయ్యను నిందించడం ఇద్దరిలోనూ కనిపించే సామ్యం. త్యాగయ్య అన్నగారైన 'జపేశ' ఆయన కొలుస్తుండిన రాములవారి విగ్రహాలను కావేరి నదిలో పారవేసినపుడు శ్రీరాముడు కలలో కనబడి కావేరి ఘట్టంలో దాగి ఉన్నానని చెప్పి అదృశ్య మయ్యాడు. అపుడు త్యాగయ్య అక్కడికి

వెళ్ళి చూడగా విగ్రహాలు కనబడ్డాయి. సంబరపడిన త్యాగయ్య ఆనందంతో "కనుగొంటిని శ్రీరాముని నేడు" అన్న కృతిని రాశాడు.

అలాగే అన్నమయ్య వేంకటేశస్వామి విగ్రహాలు మాయమై దర్శనము కలుగక మునుపు "ఇందిరా రమణు దెచ్చి యివ్వరో మా కిపుడు" అన్న సంకీర్తన గానం చేశాడు. (అధ్యాత్మ సంకీర్తన రేకు 373). అన్నమయ్య 12 శతకాలు, ద్విపద రామాయణం, 32 వేల సంకీర్తనలు, రచించగా వాటిలో బ్రహ్మోత్సవ సమయంలో అన్నమయ్య ఆరాధనోత్సవాలలో భాగంగా పాడే 7 కీర్తనలు 'సప్తగిరి సంకీర్తనలు'గా వినుతికెక్కాయి.

త్యాగయ్య వాల్మీకి రామాయణ శ్లోక సంఖ్య దృష్ట్యా 24 వేల కీర్తనలు రచించాడని వెల్లడవుతున్నది. వాటిలో ప్రహ్లాద విజయం, నౌకాచరితము, సీతారామ విజయమనే సంగీత రూపకాలు చేరుతాయో లేదో కాని ప్రస్తుతం 700 కృతులు, రెండు సంగీత రూపకాలు మాత్రం లభిస్తున్నాయి. నాదబ్రహ్మలో లీనమయ్యే దాకా కృతులు పండించిన భక్తుడు త్యాగయ్య. ఇతడు రచించిన పంచరత్న కీర్తనలలో "ఎందరో మహానుభావులన్న" కీర్తన బహుప్రాచుర్యం పొందింది.

అన్నమయ్య చంచలబుద్ధి మానలేని అజ్ఞానులైన చదువరులను గూర్చి పామరజన వ్యవహారంలోని పదజాలాన్ని వినియోగించి

**"తనకేడ చదువులు తనకేడ శాస్త్రాలు**
**మనసు చంచల బుద్ధి మానీను"**

అని మూర్ఖులైన మానవులు చదువు నేర్చుకొద్ది ఆశ పెంచుకొని, సంసార వ్యామోహంలో చిక్కుకొని అలమటిస్తారే కాని, ఆశ వదలుకొని ప్రశాంతంగా బ్రతక లేదు అన్న భావం వ్యక్తమవుతున్నది.

లోకంలో మానవులు విద్య నేర్చిన పిమ్మట ఉద్యోగం రాగానే ఫలితం వచ్చిందని మురిసి పోతుంటారు కాని, కుటుంబ జీవనంలో, ఉద్యోగ జీవనంలో సమాజంలో ఎన్నో ఒడిదుడుకులతో కుమిలిపోతున్న వారికి ఈ చదువులు, ఉద్యోగాలు మనశ్శాంతిని సుఖాన్ని యివ్వడంలేదని తర్కిస్తూ చదువుకున్నందుకు నీచగుణాలైన అరిషడ్వర్గాలను జయించి శాంతియుతంగా బ్రతికినప్పుడే ఆ చదువు సార్థక మవుతుందని -

**"తన శాంత మాత్మలో దగిలినప్పుదు గదా**
**పనిగొన్న తన చదువు ఫలియించుట"** అనే సంకీర్తనలో తెలిపాడు.

ఇలాగే త్యాగరాజు కూడా

**"శాంతము లేక సౌఖ్యము లేదు**
**సారసాదళ నయన"**

అనే కృతిలో ఎన్ని శాస్త్రాలు చదివినా, ఎన్ని పదవులు ఏలినా, ఎంత సంపద కలిగినా, వేదాంతులకైనా శాంతం లేకపోతే సుఖమే లేదని హెచ్చరించాడు.

**భక్తితత్వం :**

అన్నమయ్య భక్తి భావాన్ని శృంగారంగా చెప్పినా, వైరాగ్యంగా చెప్పినా అందులోని భావం ఒక్కటే. కలియుగ ప్రత్యక్షదైవమైన శ్రీ వేంకటేశ్వరుని సేవించమని, పండితులు, పామరులు కూడా తమ జన్మలు వృథా కానీయకుండా మోక్షమార్గాన్ని చేరుకోవటానికి కేవలము తన సంకీర్తనలలో అష్టాక్షరీ మంత్ర గానాన్ని ఈ విధంగా తెలిపాడు.

**"చదివి బ్రతుకరో సర్వజనులు మీరు**
**కలసి నారాయణాష్టక్షర మిదియే"** అని,

**"ఏ పురాణములు ఎంతవెదకినా**
**శ్రీపతి దాసులు చెడరెన్నడును"**

అని తెలియజేశాడు. త్రికరణశుద్ధిగా భగవంతునికి తమ హృదయాలను అర్పించిన వాడే నిజమైన భక్తుడు అంటారు అన్నమయ్య. అదే విషయాన్ని –

**"హరినామము కడు ఆనందకరము**
**మరుగవో మరుగవో మరుగవో మనసా"**

అన్న సంకీర్తనలో తెలిపాడు. త్యాగయ్య తన కృతులలో శ్రీరామునిపై అచంచల భక్తి విశ్వాసాన్ని కనబరచాడు. దశావతారాలలో ముఖ్యమైనది రామావతారం. త్రేతాయుగంలో "దుష్టశిక్షణ–శిష్టరక్షణ" కొరకు రామావతారాన్ని దాల్చినపుడు యాగరక్షణకు కార్యార్ధిగా వెళ్ళునపుడు మార్గమధ్యంలో నిద్రించిన శ్రీరాముని మేల్కొలుపుటకు "కౌసల్యా సుప్రజా రామా" అని విశ్వామిత్రుడు సుప్రభాత శ్లోకాలను పాడటంలో రామావతార ఔచిత్యాన్ని గమనించవచ్చు. రమింపజేసేది రామ మంత్రము. త్యాగయ్య తన కృతులలో 'రామ' శబ్ద రహస్యాన్ని ఈ విధంగా తెలిపారు.

**"ఎవరని నిర్ణయించేది రా ని**
**న్నెట్లు రాధించేదిరా నరవరు"**

అన్న కృతిలో 'రామ' శబ్ద వైశిష్ట్యాన్ని తెలిపారు. ఈ శివకేశవాద్వైతమును తెలిసిన వారు ఘనులని, వారికి మ్రొక్కెదనని దేవామృత వర్షిణి రాగంలో కృతి వ్రాసిరి. రామ రహస్యోపనిషత్ ననుసరించి నారాయణ అష్టాక్షరి లోని 'రా', శివ పంచాక్షరి లోని 'మ' అను రెండు అక్షరములు కలసి 'రామ' శబ్దం ఏర్పడినదని ఎటుల ఉచ్చరించినను రాముడు మనలను రక్షించుననన్న భావం వ్యక్తమగుచున్నది.

శ్రీ వేంకటేశ మంత్రమే గొప్ప నిధి అంటూ అన్నమయ్య "అన్ని మంత్రములు యిందే ఆవహించెను – వెన్నతో నాకు కలిగే వేంకటేశు మంత్రము" అన్న సంకీర్తనలో మంత్రం యొక్క విశిష్టతను తెలిపాడు. వీరిద్దరూ భక్తితత్వంలో ఎవరికి వారే సాటి.

త్యాగయ్య - "రామభక్తి సామ్రాజ్యం - ఏ మానవుల కబ్బేనో మనసా
ఆ మానవుల సందర్శన - మత్యంత బ్రహ్మానందమే మనసా"

అని పాడగా, అన్నమయ్య -

**"ఊరకే కలుగునా ఉన్నతంపు మోక్షః
శ్రీ రమణ కృపజేత చేరుమోక్షం"** అన్నాడు.

నవవిధ భక్తులలో ఏదో ఒక భక్తి మార్గాన్ని ఎంచుకొని ఆ దిశగా పయనించే మానవుల మనస్సు భగవంతునిపై లగ్నమై పరవశించిపోతుందో ఆ మానవుడే నిజమైన భక్తుడంటారు వీరిరువురు. భక్తుని హృదయాన్ని సులభంగా తరింపజేసేది సంగీతం. సంగీత జ్ఞాన హీనులకు, జీవన్ముక్తులు కాని వారికి మోక్షం లభించిందని త్యాగయ్య భోదచేస్తూ -

"మోక్షము గలదా భువిలో జీవన్ముక్తులుగాని వారలకు" అని గానం చేయగా, అన్నమయ్య "నానాటి బ్రతుకు నాటకము - కానక కన్నది కైవల్యము" అన్న సంకీర్తన ద్వారా వైరాగ్య భక్తిని ప్రదర్శించాడు.

అన్నమయ్య-త్యాగయ్యలలో రామభక్తి కృష్ణభక్తి భిన్నరూపాల్లో కనిపిస్తుంది. అన్నమయ్య, త్యాగయ్య రాముడిని పరిపూర్ణుడన్నారు. త్యాగయ్య "రఘుపతేరామ" అనే సంకీర్తనలో "పరిపూర్ణావతార వరభామినీ దూర" (2-110) అని పేర్కొన్నారు. వేషములలో రామవేషము బాగు బాగు (2-58) అన్నాడు అన్నమయ్య. "రాముడు రాఘవుడు రవికుల డితడు - భూమిజకు పతియైన పురుష నిదానము" అని రామావతార వైశిష్ట్యాన్ని తెలిపారు. అన్నమయ్య సంకీర్తనలలో బాలకృష్ణ సంకీర్తనలు, రాసలీలాదులెన్నో వర్ణింపబడ్డాయి. త్యాగయ్య నౌకావిజయంలో రాసలీల వర్ణన వుంది. త్యాగయ్య సంకీర్తనల్లో రెండు చోట్ల బాలకృష్ణాభి వర్ణన కనబడుతుంది.

అన్నమయ్య దశావతార కీర్తనలు వర్ణిస్తూ "ఇందరికీ అభయాలు లిచ్చు చేయి - కందువగు మంచి బంగారు చేయి" అని, దశావతారాలను వర్ణించాడు.

**"ఎంత మాత్రమున ఎవ్వరు తలచిన
అంత మాత్రమే నీవు"**

అన్న సంకీర్తనలో ఎవరెవరికి ఎంత శక్తి వున్నదో, ఎవరెవరికి ఏయే అంశాల మీద అభిరుచి వున్నదో అంతంత మాత్రంగానే దర్శనం లభిస్తుందని వివరించారు. ఇంకను వీరిరువురులు జానపద, ఆధ్యాత్మిక, కళ్యాణ, భక్తిరస, సంప్రదాయ కీర్తనలు రచించినట్లు తెలుస్తున్నది.

**భగవదాంకితం :**

అన్నమయ్య, త్యాగయ్య వీరిరువురును తమ రచనలకు రాజాస్థానాలలో వినిపించిన సందర్భాలలో రాజులు వీరి రచనలకు ముగ్ధులై, పరవశించి వాటిని

తమకు అందివ్వమని కోరగా తమపై కూడా కొన్ని కీర్తనలను రచింవలసినదని కోరగా యిరువురును నిర్దాక్షిణ్యంగా నిరాకరించడమే కాక, వాటిని తమ ఆరాధ్య దైవాలకు అంకితం జెయ్యటం గొప్ప విశేషంగా చెప్పవచ్చును.

మొదటగా అన్నమయ్య సంకీర్తనలు విన్న సాళువ నరసింహరాయలు తనపై ఒక సంకీర్తన ఆలపించవలసినదని కోరినపుడు అన్నమయ్య శ్రీహరి, శ్రీహరి అని వేంకటనాధుని స్మరించాడే తప్ప తన కంఠం నుండి ఒక్కమాట కూడా రాజుగారిపై పాడలేదు. అందులకు రాజు కోపించి కారాగారంలో బంధించమని ఆజ్ఞ జారీచేయగా అన్నమయ్య కలత చెందక ప్రహ్లాదుని వలె -

**"ఆకటివేళలవలపైన వేళను**
**వేకువ హరినామమే దిక్కు మరిలేదు"**

అని కీర్తించగా సంకెళ్ళు తెగి క్రింద పడినవట. దాంతో ఆగ్రహావేశాలకు గురియైన రాజు మరల రెండవసారి సంకెళ్ళను వేయించాడు. అప్పుడు అన్నమయ్య అహోబిల నారసింహుని ప్రార్థించి బంధవిముక్తుడయ్యాడు. అతని భక్తి తత్పరతకు పరవశించిన సాళువరాజు తనను శిష్యునిగా స్వీకరించమని ప్రార్థించడమే గాక అన్నమయ్య సంకీర్తనలను రాగిరేకులపై చెక్కించి తన గురుభక్తిని చాటుకొన్నాడు.

ఇక త్యాగయ్య రెండవ శరభోజ మహారాజు ఆస్థానంలో తన కృతులను ఆలపించినపుడు గొప్ప పారితోషికంగా 10 వేల ఎకరాల భూమిని కానుకగా బహూకరిస్తానని తన సేవకులతో కబురు పెట్టాడు. త్యాగయ్య అందుకు నిరాకరించి-

**"నిధి చాల సుఖమా - రాముని**
**సన్నిధి చాలా సుఖమా - నిజము తెల్పుము మనసా!"**

అని తనలో తాను తర్కించుకొని సవినయంగా రాజు పంపిన బహుమానాన్ని తిరస్కరించాడట. అన్నమయ్య తన సంకీర్తనలో "తిరువేంకట" అను ముద్రను వాడగా, త్యాగయ్య "త్యాగరాజ వినుత" అను ముద్రను వాడాడు. ఈ విధంగా అన్నమయ్య, త్యాగయ్యల జీవితాలలో ఒకే విధమైన సంఘటనలు జరిగాయని తెలియుచున్నది.

**ముగింపు :**

ఇట్లు భక్తి, జ్ఞాన, వైరాగ్య తత్వములను ఉపదేశించుచు సకల వేదోపనిషత్తుల సారమును, సనాతన ధర్మమును, తమ సంగీత, సంకీర్తనల శైలియందు అజరామరణములు. ఆణిముత్యాల్లాంటి సంకీర్తనలను, కృతులను అందించి భక్తిని ఉద్ధరించుటకు అవతరించి రాగరూపులు, దైవస్వరూపులు, చిరస్మరణీయులైన 'ఆంధ్రకవితా పితామహు'డైన అన్నమయ్యకు, 'నాదబ్రహ్మ' బిరుదాంకితుండు శ్రీ త్యాగరాజుల వారికి త్రికరణశుద్ధిగా శిరస్సు వంచి పాదాభివందనం జేయడం మన కర్తవ్యం. ఆంధ్ర వాగ్గేయకారుల ఆకాశంలో అన్నమయ్య-త్యాగయ్య సూర్యచంద్రులు.

## అన్నమయ్య-త్యాగయ్యల సామ్యం

| అన్నమయ్య | త్యాగయ్య |
|---|---|
| 1. క్రీ.శ. 15వ శతాబ్దంలోని వారు. | 1. క్రీ.శ. 18వ శతాబ్దంలోని వారు. |
| 2. నారాయణసూరి, లక్కమాంబలకు జన్మించెను. | 2. సీతమ్మ, రామబ్రహ్మంలకు జన్మించెను. |
| 3. బాల్యం నుండి శ్రీ వేంకటేశ్వర స్వామి ఆరాధ్యదైవం. | 3. బాల్యం నుండి శ్రీరామచంద్రమూర్తి ఆరాధ్య దైవం. |
| 4. శఠకోప యతీంద్రుల దగ్గర విద్య నభ్యసించెను. | 4. శొంఠి వేంకటరమణయ్య వద్ద విద్యాభ్యాసం గావించెను. |
| 5. అన్నమయ్య పాటలు 'సంకీర్తనలు'గా పిలువబడ్డాయి. | 5. త్యాగయ్య పాటలు "కృతులు"గా పిలువబడ్డాయి. |
| 6. 32 వేల సంకీర్తనలు రచించాడు. | 6. 24 వేల కృతులను రచించాడు. |
| 7. వీటిలో 7 సంకీర్తనలు "సప్తగిరి సంకీర్తనలు"గా ప్రాచుర్యం పొందింది | 7. వీటిలో 5 కృతులు పంచరత్న కీర్తనలుగా వ్యాప్తి కెక్కింది. |
| 8. భక్తిరస కీర్తనలు-కళ్యాణ కీర్తనలు, ఆధ్యాత్మిక కీర్తనలు, జానపద కీర్తనలు, దశావతార కీర్తనలు, బ్రహ్మోత్సవ కీర్తనలు, శృంగార కీర్తనలు విశేష ఆదరణ పొందాయి. వీటిలో మచ్చుకు కొన్ని.<br>భక్తిరస కీర్తనలు : 1. వినరో భాగ్యము విష్ణుకథ. 2. సేవింపరో జనులాల చేరి యొక్కరో.<br>దశావతార కీర్తనలు : 1. ఇందరికీ అభయంబులిచ్చు చేయి, 2. డోలాయాంచల డోలాయం.<br>పెళ్ళిపాటలు : 1. పిడికిట తలంబ్రాల పెళ్ళికూతురు. 2. నెల మూడు శోభనాలు. | 8. భక్తిరస కీర్తనలు, కళ్యాణ కీర్తనలు, భజన కీర్తనలు, సంప్రదాయ కీర్తనలు, ఆధ్యాత్మిక కీర్తనలు వాడుకలో వున్నవి. అందులో కొన్ని.<br>1. సీతమ్మ మాయమ్మ-శ్రీరాముడు మాకు తండ్రి. 2. వందనం రఘునందన - సేతు బంధన.<br>1. పది వేషములలో రామవేషము బాగు బాగు (2-58).<br>1. మా జానకిని చెట్టబట్టగ - కాంభోజి<br>2. సీతాకళ్యాణం వైభోగమే-రామ కళ్యాణ వైభోగమే. |
| 9. మంత్రోపాసన గుర్తు చేస్తూ "అన్ని మంత్రములు యిందే ఆవహించెను. | 9. ఎవరని నిర్ణయించేదిరా అన్న కృతిలో 'రామ' శబ్ద రహస్యాన్ని వివరించారు. |
| 10. తిరుమలలో గరుడసేవ నుద్దేశించి "ఇటు గరుడని నీవెక్కినను" అన్న కీర్తన ఆలపించారు.<br>'తిరువీధుల మెరసీ దేవదేవుడ'ను | 10. కంచి గరుడసేవ నుద్దేశించి "వినతా సుత వాహనుడై వెడలెను కాంచీ వరదుడు" అన్న కృతిని రచించాడు. |

| | |
|---|---|
| కీర్తనలో బ్రహ్మోత్సవ వైభవాన్ని తెలిపాడు. | |
| 11. 'తిరువేంకట' అన్న ముద్ర. | 11. 'త్యాగరాజ వినుత' అన్న ముద్ర. |
| 12. "ఆంధ్ర పదకవితా పితామహుడు" అన్న బిరుదు కలదు. | 12. 'నాదబ్రహ్మ' బిరుదాంకితుడు. |

**ఆధార గ్రంథములు :**


1. అన్నమయ్య జీవిత చరిత్ర - తాళ్ళపాక చినతిరువెంగళనాథుడు.
2. ఆంధ్రదేశ సంస్థానాలు - సంగీత వాఙ్మయం - సి. విజయలక్ష్మి.
3. ఉపన్యాస మంజరి - డా॥ సర్వోత్తమరావు
4. త్యాగరాజ సారస్వత సర్వస్వం - డా॥ నూకల చినసత్యనారాయణ.
5. త్యాగరాజ గాన సుధాలహరి - కల్లూరి సత్యరామప్రసాద్.
6. తెలుగు వాగ్గేయకారులు - అన్నమయ్య - విలక్షణ వ్యక్తిత్వం - డా॥ సి. నారాయణరెడ్డి.
7. త్యాగయ్య, అన్నమయ్యల ఛాయా చిత్రము - శ్వేత గ్రంథాలయము.
8. పదకవితా వైజయంతి - డా॥ పొన్నా లీలావతమ్మ.
9. వాగ్గేయకారులు - పబ్లికేషన్, డివిజన్, సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ, భారత ప్రభుత్వం.
10. సంగీత సౌరభము - డా॥ శ్రీపాద పినాకపాణి.


***

# అన్నమయ్య సంకీర్తనల్లో బాలకృష్ణుని లీలలు


**కుమారి వై. మంజుల**
**పరిశోధక విద్యార్థిని**
**శ్రీ పద్మావతి మహిళా డిగ్రీ మరియు**
**పి.జి. కళాశాల, తిరుపతి**


క్రీ.శ. 15వ శతాబ్దంలో జన్మించిన హరిభక్తుడు తాళ్లపాక అన్నమాచార్యులు. వైష్ణవతత్త్వాన్ని, ప్రాశస్త్యాన్ని 32,000 సంకీర్తనల్లో రచించాడు. ఇందులో ఎన్నో ఆధ్యాత్మిక, శృంగార పదాలతో కీర్తనలు రచించినప్పటికి వారి కీర్తనల్లోని మాధుర్యాన్ని పండిత పామరులు సహితం సులువుగా అర్థం చేసుకోగలుగు తున్నారు.

ఆంధ్రప్రదేశ్‌లోని కడప జిల్లా రాజంపేట తాలూకాలో తాళ్లపాక గ్రామం ఉంది. ఆ గ్రామంలో వెలసిన చెన్నకేశవస్వామి కృపాకటాక్షములతో నారాయణ సూరి, లక్కమాంబ దంపతులకు క్రీ.శ. 1408లో జన్మించాడు. అన్నమయ్యకు చిన్నతనం నుండే వేంకటపతిపై మక్కువ ఎక్కువ.

తెలుగులో మొట్టమొదటి వాగ్గేయకారుడిగా అన్నమయ్య పేరు పొందాడు. ఈయన రచించిన 32,000 సంకీర్తనల్లో 12 వేలు మాత్రమే దొరుకుతున్నాయి. వీటిని రాళ్లపల్లి అనంతకృష్ణశర్మ, వేటూరి ప్రభాకరశాస్త్రి మొ॥ వారు పరిష్కరించి స్వరపరిచారు. శృంగారమంజరి, వేంకటేశ్వరశతకం మాత్రం లభ్యం. కొన్ని ఇతర రచనలు అలభ్యంగా ఉన్నాయి.

తల్లిప్రేమ అపూర్వం అనిర్వచనం. ఆ ప్రేమను ఇతరులు ఎవ్వరూ అందించలేరు. ఆ తల్లి బిడ్డను లాలించి, ఆడించి మురిపించే సందర్భాలు చాలా ఉంటాయి. ఆ బిడ్డపై ఎన్నో కలలు కంటుంది. అతను పెరిగి పెద్దవాడై మంచి పేరు సంపాదించు కొని జీవించాలని ఆశిస్తుంది.

అన్నమయ్య సంకీర్తనల్లో తల్లిపై చాలా సంకీర్తనలు ఉన్నాయి. దశావాతారాల్లో ఒకటి శ్రీకృష్ణావతారం. ఆ శ్రీకృష్ణుని బాల్య చేష్టల్ని తల్లి స్థానంలో తానుంటూ కొన్ని సంకీర్తనలు రచించాడు. అంతకుముందే పోతన తన భాగవతంలో శ్రీకృష్ణుని బాల్యచేష్టల్ని గురించి రచించారు. జోల పాటను పోతనగారు –

**జోజో కమల దళేక్షణ**
**జోజో మృగరాజ మధ్య**
**జోజో పల్లవ కరపద**
**జోజో పూర్ణేందు వదన జోజో యనుచున్**

అని రచించిన పద్యం కనిపిస్తుంది. లోక వ్యవహారంలో చాలా జోల పాటలు ఉన్నాయి.

అదే విధంగా అన్నమయ్య కూడా తాను తల్లిగా మారి పరమాత్మను బిడ్డగా భావించుకొని వాత్సల్య భక్తితో శ్రీకృష్ణుని బాల్య చేష్టల్ని వర్ణిస్తూ...

**"జోవచ్యుతానంద జోజో ముకుందా**
**రావె పరమానంద రామ గోవిందా"** అంటూ జోలపాట పాడినారు.

చాలామంది తల్లుల దగ్గర పసిపిల్లలు బువ్వ తినకుండా మారాము చేస్తుంటారు. వారి ఆకలి తీర్చి నిద్రపుచ్చడానికి, చందమామను చూపిస్తూ, గోరుముద్దలు పెదుతుంది తల్లి. ఆ సందర్భంలోని పాట.

**"చందమామ రావే జాబిల్లిరావే**
**కొండెక్కిరావే కోటి వేలు తేవే"**

అని పాడుతారు. అన్నమయ్య కూడా మారాము చేస్తున్న చిన్నికృష్ణునికి చందమామను చూపిస్తూ గోరుముద్దలు తినిపించే విధానాన్ని....

**"చందమామ రావో జాబిల్లి రావో మంచి**
**కుందనపు పైడికోర వెన్న పాలు తేవో"**

అనే పాటను రచించాడు. ఈ పాటలో బాలకృష్ణుణ్ని చాలా అందమైన వాడని, సకల లోకాలను రక్షించే వాడని... స్తుతించాడు.

బాలకృష్ణుని చిలిపి చేష్టలయిన రోలును ఈడ్చుకుంటూ వెళ్ళి మద్దిచెట్టును కూల్చడం, గోపికల ఇళ్ళలోకి వెళ్ళి పాలు, వెన్నలు దొంగలించడం, వాటిని తోటి స్నేహితులకు పెట్టడం, గోపికలను ఆటపట్టించడం మొ॥ లీలల్ని వర్ణిస్తూ కొన్ని సంకీర్తనలు రచించారు.

తుంటరయిన బాలకృష్ణుడు పొరుగిండ్లకు వెళ్లి అల్లరిచేష్టలు చేసినప్పుడు, ఆ పొరుగింటి వాళ్ళు వచ్చి తల్లి అయిన యశోదకు ఫిర్యాదు చేయడం, ఆ తల్లి బిడ్డపై గల అమిత ప్రేమవల్ల ఫిర్యాదు చేసిన వారినే తిరిగి మందలించి, కృష్ణున్ని వెనకేసుకొని వస్తుంది. అలాగే అన్నమయ్య సంకీర్తనల్లో **కూడా** గోపికలు చిన్ని కృష్ణుని అల్లరి చేష్టలను భరించలేక

**"ఏమి సేతుమమ్మా నేము యేశోదమ్మా**
**గామిడి తమముల కడcగి బాలుcడు"**

అని ఫిర్యాదు చేయగా, యశోద తన కృష్ణున్ని వెనకేసుకొని వస్తూ, గోపికలతో మీ ఇళ్ళను మీరు జాగ్రత్తగా చూసుకోవాలి. ఏమి తెలియని నా పసిబిడ్డపై ఎందుకు ఇన్ని ఫిర్యాదులు చేస్తారు? చిన్నపిల్లలు వారి చేతికి అందిన పాలు పెరుగు, వెన్న త్రాగకుండా ఉంటారా... అని అన్నమయ్య తల్లులు తమ పిల్లలు చేసే అల్లరి చేష్టలను సమర్థించుకునే తీరును –

**"కానరటె పెంచరటె కట కటా బిడ్డలను**
**నేను మీ వలెనే కంటి నెయ్యమైన బిడ్డని"** అనే సంకీర్తనలో వర్ణించాడు.

చిన్నికృష్ణుని అల్లరి చేష్టలు ఎక్కువవటంతో కోపించిన గోపిక కృష్ణున్ని మందలించ బోతుండగా ఒక గోపికకి జాలి కలిగి అడ్డుపడుతుంది. ఆ సందర్భాన్ని గురించి –

**మొత్తకురే అమ్మలాల - ముద్దులాడు వీcడె**
**ముత్తెము వలె నున్నాడు - ముద్దులాడు**

అని రచించాడు. బాలకృష్ణుని ఆగడాలు అధికమయ్యి గోకులమంతా వ్యాపించాయి. ఆయన చేష్టలోని రహస్యాన్ని అన్నమాచార్యుల వారు –

**"పలువురు వుట్ల - పందుగను**
**చిలుకు చిదుక్కని - చిందగను"**

అని రచించాడు. "అందరికీ అందాల్సినది, ఆస్వాదయోగ్యమైన నవనీతాన్ని ఏ కొందరికో పరిమితం కాకూడదని – ఉట్లమీద పెట్టిన పాలు, వెన్న, నెయ్యి, పెరుగు అందరికీ పంచి పెట్టడంలోని అంతరార్థం అని" అన్నమయ్య వారి సంకీర్తనలో అద్భుతంగా వర్ణించారు.

**ముగింపు :**

శ్రీ మహావిష్ణువు అవతరించిన దశావతారాల్లో రామావతారం, కృష్ణావతారాలు ముఖ్యమైనవి. ఈ అవతారాల్లో పసిపిల్లవానిగా చేసిన అల్లరి ఇంతా అంతా కాదు. ఎన్నో ఆటలు ఆడారు. ఆ ఆటల్లోను ఎన్నో దుష్టశిక్షణలు, శిష్టరక్షణలు చేసి లోక రక్షణార్థం తాను అవతరించినట్లు చాటారు. అంతేకాక తన బాల్యపు చేష్టలతో గోకుల ప్రజలందరిని మంత్రముగ్ధుల్ని చేసిన చిన్ని శిశువు శ్రీకృష్ణువు. వారి బాల్యపు లీలల్ని అన్నమయ్య చాలా అద్భుతంగా వర్ణించాడు.

అన్నమయ్య ఆడిన మాటెల్లా అమృతకావ్యంగా పాడిన పాటెల్ల పరమగానంగా ప్రసిద్ధిచెంది నేటికి ప్రజల నాలుకలపై వినిపిస్తున్నాయి. కాబట్టే ఆంధ్ర సాహితీ అమరకోశంగా అన్నమయ్య పేరు పొందాడు.

**ఆధార గ్రంథాలు :**

1. అన్నమాచార్యుల సంకీర్తనలు - కామిశెట్టి శ్రీనివాసులు శెట్టి.
2. శ్రీ తాళ్లపాక అన్నమాచార్యుల జీవిత చరిత్ర - డా॥ కేసర్ల వాణి.
3. అన్నమాచార్య చరిత్ర పీఠిక - వేటూరి ప్రభాకరశాస్త్రి.
4. పదకవితా వైజయంతి - డా॥ పొన్నా లీలావతమ్మ.

***

# అన్నమయ్య సంకీర్తనలు-సాంఘిక చైతన్యం

**ఆచార్య కొలకలూరి మధుజ్యోతి**
**తెలుగు అధ్యయన శాఖ**
**శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం**
**తిరుపతి**

అన్నమయ్య కాలాలను జయించిన కవి. 1408 - 1503 కాలానికి చెందినవాడయినా, నాటి సమాజానికి కావలసిన చైతన్యాన్ని కల్పించటానికి తన సంకీర్తనల ద్వారా ఎంతో ప్రయత్నించాడు. సమాజానికి సమస్త మానవకోటికి ఇష్టమయిన రసాన్ని, శృంగారాన్ని చెప్పాడు. తద్వారా తాను చెప్పదల్చుకొన్న భక్తిని, ఆధ్యాత్మికతను చొప్పించాడు. ప్రజలకు కావలసిన భావాలతో ఆహ్లాదపరుస్తూనే తాను ఉద్దేశించిన భక్తిని చాటాడు. జనం కోరేది చెప్పిన అన్నమయ్య జనానికి హితాన్ని చేకూర్చే దానిని చెప్పటానికి వెరవలేదు. ప్రజల మనుగడకు ఆటంకం కలిగించే మానవ స్వభావ దుర్లక్షణాలను, సమాజ కల్పిత దుష్ప్రచారాలను నిరసించాడు. వినమ్రంగానూ చెప్పాడు, కటువుగానూ చెప్పాడు. దానిని నీతిగా చూసి స్వీకరించింది

నాటి సమాజం. వైరాగ్యంగానూ భావించింది. ఎవరెలా భావించినా, అన్నమయ్య తను ఉన్న కాలం నాటి సమాజంలో కొరవడిన విలువలను గుర్తుచేశాడు. మనిషి తనను తాను మలచుకోవలసిన దిశను చూపాడు. కల్మషమైన సంకుచితమైన స్థితిని మనిషి దాటాలని చాటాడు. మానవ సేవే మాధవసేవ అని నమ్మిన అన్నమయ్య, మానవుడికి చైతన్యాన్ని కల్పించి మేల్కొల్పటం ద్వారా ముక్తిని అన్వేషించాడు. సమాజం ఎలా ఉండాలో చెప్పాడు. మనిషి మనుగడకు అవసరమేమిటో చాటాడు.

విశేషమేమిటంటే 500 ఏళ్ళకు పూర్వమే అన్నమయ్య కోరిన చైతన్యం, చెప్పిన విలువలు నేటికీ ఆవశ్యకం అవుతూ ఉన్నాయి. ఎంత ముందుగా అన్నమయ్య మానవ సమాజ మార్పును కాంక్షించాడో గుర్తిస్తే, ఆయన ఎంత చైతన్యం కలిగినవాడో, ఎంత చైతన్యాన్ని జనంలో కోరుకొన్నాడో ఆయన అక్షరాలే సాక్ష్యంగా తెలుస్తుంది.

1. అన్నమయ్య పలు అంశాల ద్వారా హెచ్చరికలను చేసి తోటి సమాజాన్ని చైతన్యవంతం చేసే ప్రయత్నం చేశాడు. ధనాశ వద్దన్నాడు. పరోపకారాన్ని అలవర్చుకొమ్మన్నాడు. తమ స్వభావంలోని దుర్లక్షణాలను పోగొట్టుకొమ్మన్నాడు, మానవ జన్మ సార్థకత పొందమన్నాడు.

**"అప్పులేని సంసారమైన పాటే చాలు**
**తప్పులేని జీతమొక్క తారమైన జాలు"** **(1-114)** అన్నాడు.

మానవ జీవిత నైతిక సూత్రాలు బతకటానికి ఆవశ్యకమయినవి. అన్నమయ్య నోట జాలువారాయి. అప్పు ఉండరాదు. బాధ్యతగా చేసే పని చోట తప్పు చేయరాదు. తల దాచుకోవటానికో గుడిసె, కడుపు నిండటానికి అంబలి చాలు. స్త్రీ ఏ జాతి అయినా తోడు నడిస్తే అంతే చాలు. తగిన సంపద చాలు. ధనాశ మనిషిని కుంగదీస్తుంది. అతి లాలసత చాంచల్యం విలాసాలకు పరుగులను నేర్పుతుంది. అందుకే అప్పు వద్దన్నాడు. తప్పు చేయకన్నాడు. కీసావసరాలు తీరితే తృప్తి పడమన్నాడు. అటువంటి నిష్కామకర్ముడికి సహచారిణి అంతే నైర్మల్యంతో దొరికితే ఆమె జాతికుల సంబంధాలు అవసరం అన్నాడు.

ప్రలోభాలు, అత్యాశ, కుల ప్రస్తావన ఉండకూడదనే చైతన్యాన్ని అన్నమయ్య చాటాడు.

**"కడుపెంత తాగుడుచు కడుపెంత దీనికై**
**పడని పాట్లనెల్ల బడి పొరల నేలా"** **(1-302)**

మానవ స్వభావంలో ఉన్న సంకుచితతను ఎండగట్టాడు అన్నమయ్య. పక్కవారికి కీడు చేయాలని నిత్యం యోచించేవాళ్ళూ, పక్కవారికి జరిగే మేలును సహించలేని వాళ్ళు ఎందరెందరో! అటువంటివారిని తనకాలం కంటే ఇప్పటి కాలంలో ఎక్కువ చూస్తాం. అటువంటి వాళ్ళ బ్రతుకే వ్యర్థం అని తీసిపారేశాడు.

ఎదుటివాడికి జరిగే మంచి తనదే అనే భావనను చదువు నేర్పాలన్నాడు. పరోపకార దృష్టి మానవుడిలో పెరగాలని కాంక్షించాడు. జీవన భ్రాంతిలో పడేసే సిరి వద్దంటాడు.

**"ఎంత చదివిననేమి వినిన తన**
**చింతయేల మాను సిరులేల కలుగు"**

మానవ స్వభావంలోని దుర్లక్షణాలు ఇతరులను దూషించటం, కాముకత్వం, చంచలత్వం, పరధనం పట్ల ఆశ, నిందలు మోపటం, విరస ప్రవర్తన - ఇవి మనిషి జయించాలి. అన్నమయ్య భగవత్ సాన్నిధ్యాన్ని ఇస్తుందని చెప్తూనే వీటివల్ల కలిగే ఆపదలూ పోతాయి అంటున్నారు.

**"ఊరులే పొలిమేర పేరుపెంపులేని బ్రతుకు**
**గారవంబు లేని ప్రియము కదియ నేటికే"** **(12-55)**

ఊరు లేకుండా పొలిమేర పేరు లేకుండా బతుకు గౌరవం లేని ప్రేమ, విరహం లేని వేదన, ఎండలేని నీడ తమకం లేని స్నేహం, అర్థభావం ఒకటిగా లేని రచన, మెప్పుదల లేని చోట మేలు, చనువు లేనిచోట మంచి మాట, హెచ్చింప చేసుకోని ప్రియం, కోరికలేని నాటి సొగసులు, మురిపెపు మాటల్లేని చెలికాని పొందు, అనుమానంతో కలిసే చనువు వ్యర్థం అంటాడు. ముందుది ఉంటే రెండవదానికి అందం అని అర్థం. ఎక్కడ ఎలా ఏది ఉండాలో చెప్పకనే చెప్తూ మానవ స్వభావానికి నగిషీ చెక్కాడు అన్నమయ్య.

**"మనుజులై ఫలమేది మతి జ్ఞానియౌదాకా**
**తనువెత్తి ఫలమేది దయగలుగు దాకా"** **(1-437)**

మనిషి జన్మకు సార్థకత జ్ఞాన సంపాదన, దయకలిగి ఉండటం, ధనవంతుడై దానం చేస్తేనే ఫలితం. చదువు మనిషికి శాంతాన్ని నేర్పాలి. మాట మంచిని పెంచాలి. ఇవన్నీ పొందకపోతే ఆయా విషయాలకే విలువలేదు. మనిషి ఎలా ఉండాలో చెప్పాడు అన్నమయ్య. జ్ఞాని కావాలి, దయాత్ముడు కావాలి, దానపరుడు కావాలి, చదువుకోవాలి తద్వారా విచక్షణని, సంస్కారాన్ని, తద్వారా శాంతాన్ని పొందాలి. నరం లేని నాలుక అంటాం. ఉచ్చం నీచం తెలీని తీరును తెల్పుతుంది ఈ నానుడి. కానీ అన్నమయ్య అంటాడు పెదవి కదిపితే ప్రియంగా ఉండాలని. హృదయంలో ప్రేమ ఉంటే పెదవిపై మాటా ప్రేమగానే వస్తుంది.

ఇలా పలు అంశాలను బోధించి మానవ స్వభావాన్ని మార్చుకొమ్మని చెప్పిన అన్నమయ్య సమాజ స్వభావాన్నీ మారాలని కోరాడు.

2. సమానత్వం బోధించే కాంక్ష ఆధునిక కాలానిది మాత్రమే కాదు అన్నమయ్య కాలానికే ఉంది. మనిషి తన ఆత్మగౌరవాన్ని తాకట్టు పెట్టటం తగదన్నాడు. కులాతీత గౌరవం మనిషికి ఉండాలని నాడే కాంక్షించాడు.

**"అనుగు దేవతలకును అలకామ సుఖమొకటే,**
**ఘటకీట పశువులకు కామసుఖమొకటె"** **(2-385)**

దేవతలకైనా, పశుపక్ష్యాదులకైనా కామకాంక్ష సహజం. పేద అయినా ధనికుడయినా ఆహారాత్రాలు సమానమే. పంచభక్ష్యాదులైనా, గంజి అంబలులైనా తీర్చే ఆకలి సమానమే. దుర్గంధాలపై, పరిమళాలపై ప్రసరించే గాలి ఒక్కటే. ఇంతటి సమానత్వం భగవంతుడి దృష్టిలో ఉంటే, మనిషి ధనికుడని, పేద అని విభజించుకొని వేరుపడటాన్ని ఎత్తిచాటాడు.

**"చీచీ నరులకేటి జీవనము**
**కాచుక శ్రీహరి నీవే కరుణింతుగాక"** **(1-397)**

ఇతరులను కొలవటం కంటే అడవిలో మానుగా, ఇంకొకరిని యాచించేకంటే పక్షిగా, ఇతరులను పొగడటంకంటే పశువుగా, ఇంకొకరిని విసిగించే కంటే ఉసిరి చెట్టుగా ఉండటం మెరుగంటాడు. యాచనను, పరులను పొగడటాన్ని, విసిగించటాన్ని నిరసించాడు.

**"పెంచ బెంచ మీద బెరిగేటి చెలిమి**
**ఇంచుకంత తాలముల కెడలేని చెలిమి"** **(1-29)**

స్నేహం గూర్చి అన్నమయ్య చెప్పిన ఈ కీర్తన అందరూ నేర్చుకోవలసిన జీవిత సూక్ష్మం. మనిషిని కుంగదీసే అస్పృశ్యతా జాడ్యాన్ని నిరసించాడు. చెలిమికి అంటు ముట్టు ఉండదన్నాడు. నిష్కళమైన స్నేహం తన వెంట తిప్పుకొంటుంది. అటువంటి చెలిమిని కలిగి ఉండమని సూచించాడు.

**"ఎక్కువ కులజుఁడైన హీన కులజుఁడైన**
**నిక్కమెరిగిన మహా నిత్యుఁడే ఘనుడు"** **(1-31)**

కుల నిరసన అన్నమయ్యలో పదేపదే గోచరిస్తుంది. వేదాలను చదివిన సోమయాజి కంటే విష్ణువుని పూజించే సదాచారుడైన కులహీనుడే గొప్పవాడంటాడు. వేదాంత పఠన చేసే సన్యాసి, విష్ణువు స్మరణ చేసే అంత్య జాతికులజుడు ఘనుడు అన్నాడు. విష్ణుభక్తి పరాయణుడయితే కులసంబంధమే లేకుండా గొప్పవాడు, అది లేని సోమయాజికన్నా, సన్యాసికన్నా కూడానూ అంటూ అన్నమయ్య మనిషిలో సదాచారమే సద్వర్తనమే ఉన్నతంగా భావించాడు, పుట్టుకను కాదు, పుట్టుకతో ఆపాదింపబడే జాతి, కుల మతాలు అనవసర మానవ సృష్టిగానే నమ్మాడు అన్నమయ్య.

'నిమ్న జాతులు, ఉన్నత జాతులు అని జాతుల తేడాను పాటించి తమ జీవితాలను, తద్వారా సమాజాన్ని నరకప్రాయం చేసుకోవడం కనిపిస్తూ ఉంది. జాతి, మత సంఘర్షణలు ప్రపంచ మనుగడకే ప్రమాదకరంగా పరిణమించాయి. ఈ

నేపథ్యంలో అన్నమయ్య ఆలోచనలను గమనించి స్ఫూర్తి పొందటం ఎంతో అవసరం. విశిష్ట జాతులలో పుట్టినవారమని అహంకరించడం అన్నమయ్య వృథా అన్నారు. జాతులు శరీరానికి మాత్రమే అన్నాడు. శరీరం పోతే జాతులు పోతాయి అని అన్నాడు' అంటూ 'అన్నమయ్య సంకీర్తనలలో మానవీయ విలువలు' అనే వ్యాసంలో డా॥ చిట్రాజు గోవిందరాజు (తెలుగు వాగ్గేయకారులు : అన్నమయ్య వ్యక్తిత్వం, సం. డా॥ సి. నారాయణరెడ్డి, పు. 27) ఇదే విషయాన్ని పేర్కొన్నారు. సమస్త ప్రాణకోటి సమానమంటూ భగవత్ సృష్టిలోని, ప్రకృతిలోని సమానతా దృష్టిని రాజు, బంటు, బ్రాహ్మణుడు, చండాలురను సమానంగా అలరించే భూమిని, మరుభూమిని గుర్తుచేశాడు.

**"తందనాన ఆహి తందనాన పురె**
**తందనాన భళా తందనాన" (2-385)**

కుల నిరసన చేసిన అన్నమయ్య మతం విషయంలోనూ ఔన్నత్యాన్ని నాడే చూపాడు. వైష్ణవ భక్తుడైన కూడా

**"ఎంత మాత్రమున నెవ్వరు దలచిన అంతమాత్రమే నీవు**
**అంతరాంతము లెంచి చూడ బిండంతే నిప్పటియున్నట్లు" (2-393)**

అంటూ మానవుడు ఎన్ని రూపాలలో భగవత్ ధ్యానం చేసినా, పూజించినా అది పరతత్త్వాన్ని ఎరిగే మార్గాలే తప్ప ఇతరం కాదంటాడు. ఏ మత మార్గమైనా చివరకు చేరేది, చేర్చేది పరమ భగవత్ తత్త్వాన్నే. మత సహనాన్ని, మత సామరస్యతను చాటాడు. ఇంతకంటే లౌకికవాదిని నాడే సాహిత్యం చూపటం ఎంత ఆశ్చర్యం.

**ముగింపు**

అన్నమయ్యలో అధిక్షేపం ఉంది. సున్నితత్త్వం ఉంది. సాంఘికంగా ఉన్న నిమ్నోన్నతులు భావనను, ఉచ్చనీచ తారతమ్యాలను, ధనిక; పేద వైరుధ్యాలను, మానవుడిలోని లోపాలను, ఆవశ్యకాంశాలను చాటాడు, నిరసించాడు. అన్నమయ్య 'సామాన్యులకు సైతం తెలిసిన అతి సామాన్య విషయాలను చెబుతూ వాటికి తగిన రీతిలో పదప్రయోగం చేస్తూనే' (తెలుగులో పదకవిత, ఎస్. గంగప్ప, పు. 242) తాను చెప్పించగల ఆలోచనను ప్రతిపాదిస్తాడు.

సమకాలిక సమాజానికే కాదు, నేటి సమాజానికీ అసలు చైతన్యాన్ని అందిస్తూనే ఉండటం అన్నమయ్య గొప్పతనం. మారకుండా ఉన్న సమాజానికి దర్పణం అన్నమయ్య. చైతన్యాభిలాష నెరవేరాలని కోరటమే నేడు కోరదగ్గ ఆశ.

***

# అన్నమయ్య సంకీర్తనల్లో హనుమంతుని భక్తి ప్రశంస

డా॥ ఎ. రాజ్యలక్ష్మి
తెలుగు అధ్యాపకులు
శ్రీ పద్మావతి మహిళా మరియు పి.జి. కళాశాల, తిరుపతి

అఖిలాండకోటి బ్రహ్మాండ నాయకుడైన కలియుగ వైకుంఠవాసుడైన కోనేటి రాయుని మనసారా, తనివితీరా వేనోళ్ళ పొగిడిన భక్తాగ్రేసరుడు తాళ్ళపాక అన్నమయ్య. అసాధారణమైన కవిత్వంతో, పరిపూర్ణమైన నిండు భావ విషయంతో, అర్థవంతమైన మెరుగైన రచనలు గావించిన ఘనత అన్నమయ్యదే అని చెప్పవచ్చు. 15వ శతాబ్దంలో వాగ్గేయకారుడుగా వెలుగొందిన అన్నమయ్య సంకీర్తనలు కేవలం ఊహోజనితాలు కావు. భక్తిభావం ఉప్పొంగిన కవితావేశంతో జాలువారిన భక్తి కుసుమాలు అన్నమయ్య సంకీర్తనలు. ఇవి భక్తజన బృందాల గోష్ఠులలో ఆలపించుటయే గాక, అశేష ప్రజాదరణను గాంచినవి. దక్షిణ భారతదేశంలోని ఆంధ్ర వాగ్గేయకారులలో అన్నమయ్య విశేషమైన సముచిత స్థానాన్ని అధిరోహించా డనటం అతిశయోక్తి కాదు.

భరద్వాజ గోత్రుడు, ఆశ్వలాయన సూత్రుడు, నంద వరీకబ్రాహ్మణుడు, ఋగ్వేదియైన నారాయణసూరి, లక్కమాంబలకు శ్రీ వేంకటేశ్వరుని వరప్రసాదాన జన్మించిన వాడు అన్నమయ్య. 1408వ సం॥లో కడప జిల్లా రాజంపేట తాలూకా లోని తాళ్ళపాక గ్రామంలో జన్మించిన అన్నమయ్యకు ఊరి పేరే ఇంటి పేరుగా ప్రసిద్ధిగావటం విశేషం. తాతగారైన అన్నమయ్య జీవిత విశేషాలకు ఆధారం తాళ్ళపాక చిన్నన్న రచించిన "అన్నమాచార్య జీవిత చరిత్ర" కావటం, ఆ ఘనత తాళ్ళపాక చిన్నన్నకే లభించటం ఎంతో జన్మచరితార్థత నొందిన విషయం.

పదకవితా పితామహుని పేరు పొందిన అన్నమయ్య రాసిన 32 వేల సంకీర్తనల్లో 12 వేలకు పైగా మాత్రమే మనకు లభ్యమైనాయి. 1949లో వేటూరి ప్రభాకరశాస్త్రి గారు పరిశోధన చేసి తాళ్ళపాక వారి కవితా ప్రస్థానాన్ని సాహితీ లోకానికి పరిచయం చేసిన ప్రజ్ఞాశాలి.

అన్నమయ్య ఎన్నో పుణ్యక్షేత్రాలు దర్శించి, తరించి, ఆ ప్రాంత దేవతలను తనివితీరా భక్తితో, తన్మయత్వంతో, సంగీత, సాహిత్యాలను మేళవించి స్తుతించి భక్తి కవిత్వానికి జీవం పోసిన భక్తశిఖామణి. అన్నమయ్య సంకీర్తనలు సంగీతం, భక్తి ప్రబోధకం, శృంగారం, నృత్యానికి సంబంధించి అందరినీ ఆకట్టుకొని అలరించాయి. అన్నమయ్య ఏ దేవుని స్తుతించినా, వర్ణించినా మనకు గోచర మయ్యేది ఒకే తత్త్వం. అదే ప్రధానమైన భక్తి తత్త్వం.

ఆంధ్ర సాహిత్యంలో భక్తి కవిత్వానికి వున్నంత ప్రాచుర్యం ఏ ఇతర కవిత్వానికి లేదు. భక్తుడు భగవంతునిపై తనకు గల ప్రేమకు వ్యక్తపరచే సాధనమే భక్తి. భక్తునికి భగవంతునికి గల జన్మజన్మల సంబంధాన్ని విశదపరచే ఆయుధమే భక్తిమార్గం. భక్తి ఇతరులకు గోచరము అయ్యేది కాదు. ఊహించుట కూడ కష్టమైనదే. ఫలాపేక్ష రహితంగా సేవించు యోగ్యమైన అనుభూతియే భక్తి.

అన్నమయ్య తన కీర్తనల్లో ఒక్కొక్క కీర్తన అలతి పదాలతో, అనల్పార్థ రచనతో రసవంతమైన వర్ణనలతో గొప్ప ప్రబంధంగా సంకీర్తన సాహిత్యాన్ని తీర్చిదిద్దిన ప్రతిభాశాలి. శ్రీ వేంకటేశ్వరుని భక్తుడుగా ఖ్యాతిని పొంది, తన్మయత్వంతో ఆ స్వామిని కీర్తించిన పరమభక్త శిఖామణి. స్వామి భక్తుడై ఆ భక్తితో తాను తరించడమేకాక ప్రజలందరిని తరింప చేయాలనే ఆలోచనతో-

**"ఏ వేల్పు సర్వేశుడే వేల్పు పరమేశు**
**డే వేల్పు భువనైక హిత మనోభావకుడు"** – అని వర్ణించాడు.

తెలుగులో భారతీయ సంస్కృతిని తెలియజేయటంలో వెలసినన్ని రామాయణాలు మరే ఇతర భాషల్లో లేవు. హనుమంతుడు లేని రామాయణం కూడా లేదు. అన్నమయ్య శ్రీ వేంకటేశ్వరుని సేవకు అంకితమైనట్లే శ్రీరామచంద్రుని సేవకు అంకితమైన గొప్ప భక్తుడు హనుమంతుడు. రామాయణంలోని హనుమంతుడు ప్రతి ఒక్కరికి ఇష్టదైవం, కులదైవం, గ్రామదైవం అనే రూపాలలో ఆంధ్రుల నిజజీవితంలో పెనవేసుకొని, గొప్ప స్థానాన్ని సుస్థిరత చేసుకొన్నాడు. అన్నమయ్య కీర్తనల్లో విష్ణుతత్వం భక్తితత్వం ప్రధానాంశాలుగా కన్పిస్తాయి.

శ్రీ వైష్ణవులకు గరుడుడు ఆరాధ్యుడైనట్లే హనుమంతుడు కూడా అంతే ఆరాధ్యుడు. వైష్ణవ దేవాలయాలలో స్వామికి ఎదురుగా గరుత్మంతుడు, దగ్గరలోనే హనుమంతుని ఆలయ ముండటం గమనించదగినది. శ్రీవైష్ణవులు మధ్వాచార్యు లను వాయవ్యంశ సంభూతులుగా, హనుమావతారంగా భావించటం గమనార్హం. విజయనగర సామ్రాజ్యంలో రాజ్యరక్షణ కోసం హనుమంతుని ఆలయాలు ఏర్పాటు చేయటం జరిగింది. ఉత్తరాంధ్ర ప్రాంతాలలో హరిదాస సంప్రదాయం వల్ల అక్కడ ఆయా ప్రాంతాలలో చాలా హనుమంతుని దేవాలయాలు వెలిశాయి.

హనుమంతుని భక్తి ఆధ్యాత్మికతతో కూడి, రామకార్యం నెరవేర్చటమే ప్రధాన ధ్యేయంగా గోచరిస్తుంది. నిష్కామకర్మ భక్తుడుగా హనుమంతినికి పేరు. సుగ్రీవుడు, విభీషణుడు రాజ్యాన్ని కోరి, రాజులైనా, ఎటువంటి ఫలాపేక్ష లేకుండా రామకార్యం నెరవేర్చిన మహాభక్తుడు హనుమంతుడు.

అనేక పుణ్యక్షేత్రాలను పర్యటిస్తూ వైష్ణవ దేవుళ్ళను కీర్తిస్తూ వారితో హనుమంతుని గొప్పతనాన్ని కీర్తించి తన జన్మను సార్థకత చేసుకొన్నాడు. భక్తి మత ప్రచారమే తన ధ్యేయంగా తలచి, విస్తృతంగా దేశాటనం చేసి అన్నమయ్య హనుమంతుని రామదూతగా, రామబంటుగా, చిత్రీకరించటం విశేషం. అన్నమయ్య హనుమంతుని

భక్తిని పరిశీలించనట్లయితే శరణాగతునిగా, దాసునిగా, సంస్మరణ పొందిన వాడుగా కీర్తించాడు.

**"రామ దశరథ రామా నిజసత్య**
**విమ(న) తామరస్తోత్ర విజయరామా" (10-156)**
**"శరణు శరణు నీకుఁ జగదేక వందిత**
**కరుణ తోడి మమ్మునేలు కౌసల్య నందన" (10-276)**

ఎటువంటి ఆధారం లేక భగవంతుడే దిక్కు అని భగవంతుని పాదాలు ఆశ్రయించి భక్తితో శరణు పొందటం, 'రామ' నామమే తన సర్వస్వంగా భావించి దానిని ఎవరైతే జపిస్తారో అటువారికి అనుక్షణం ప్రదాతనై కోర్కెలు తీర్చి సంతోషాలు, సుఖాలు ఇచ్చెదను అని రామాయణంలో హనుమంతుడు తెలియపరచినట్లు తెలియును. రాముని స్తుతించిన వారిలో ప్రథముడు హనుమంతుడే అని అన్నమయ్య పై కీర్తనల్లో వర్ణించాడు. భగవంతునికి భక్తుడు ఎల్లవేళలా ప్రియమైనవాడే అని హనుమంతుని శ్రీరామచంద్రునికి ప్రియమైన భక్తుడిగా 'రామ' నామ మహిమను శరణు పొందినవాడిగా శరణాగత విశిష్టతను కీర్తించెదను.

భక్తులు భక్తిభావంతో మనసారా స్మరించి కీర్తిస్తే భగవంతుడు చాలా దగ్గర అవుతాడని పురాణాలలోని అంశం. అయితే భగవంతుడు చేయలేని, సాధించలేనివి ఏవీ లేవు. కానీ భక్తునిచేత చేయించి అతనికి ఎనలేని కీర్తిని ప్రసాదించటమే భగవంతుని మనోభావం. కనుక తన భక్తుడైన హనుమంతుని ద్వారా సముద్రాన్ని లంఘింపజేసి గొప్ప కీర్తి ప్రసాదించిన శ్రీరామచంద్రుని అన్నమయ్య తన కీర్తనలో ఇలా :

**"కలశాపురము కాడ గాచుకున్నాడు**
**వలసిన వరాలిచ్చి వాయు నందనుడు" (9-232)** – వర్ణించాడు.

హనుమంతు విశ్వరూపం కలవాడు. త్రిమూర్తుల లక్షణాలన్నీ హనుమంతునికి రావడం విశేషం. భగవంతుని లక్ష్యమే భక్తానులక్ష్యం. భాగవత లక్షణం కూడా. సీత కోరిక మీద విశ్వరూపం, భీముని కోరిక మేర మరలా విశ్వరూపం చూపి ధ్రువ మండలము ఎత్తు ఎదగడం అతని గొప్పతనానికి ప్రతీక. కనుక భక్తియేకాక భక్తుడైన హనుమంతుడు శాశ్వితుడు, విశ్వవ్యాప్తుడని భాగవతంలోని విష్ణువుకు, ఆంజనేయునకు భేదం లేదని ఇలా కీర్తిస్తూ :

**"విశ్వరూపుఁ జూపి నాడు విష్ణుడుఁ దొల్లయట్టి**
**విశ్వరూపాంజనేయుడి వీడ జూపెను"**
అని వర్ణించాడు. అవతారమూర్తులైన వీరిని స్తుతించారు **(10-145).**

భక్తి వలన సమాజంలో అసమానతలు తొలగి, సమదృష్టి ఏర్పడుతుంది. అద్వైత దృష్టితో జీవితాన్ని చూసే శక్తి భక్తిద్వారానే సులభతరమవుతుంది. కంటికి కనపడకుండా

అలౌక్యంగా వుండేదే భక్తి. నవవనధ భక్తులన్నియు ఒకే పరమార్థాన్ని కలిగినవే కానీ భక్తుల అభిమానం మాత్రం అనేక రూపాలుగా వుంటాయి.

జాతి, కుల భేదం లేకుండా ఎటువంటి వారైనా భక్తుడిగా పూజ్యుడే. వానరజాతిలో పుట్టినా, తన దాస్య భక్తిచే లోకములో గొప్ప భక్తాగ్రేసరుడైనాడు హనుమంతుడు. ఆదర్శసేవకుడెలా ఉండాలో తన గుణగణాల ద్వారా లోకానికి తెలియచెప్పిన గొప్ప సేవకుడు హనుమంతుడు. అలాంటి హనుమంతుని మహత్కార్యాలను శ్రోతలకు, పాఠకులకు లోకం హత్తుకొనేలా ప్రశంసించాడు - వాగ్గేయకారుడైన అన్నమయ్య.

భగవంతుని మీదే మనసును లగ్నం చేసి సేవ చేయడమే దాసుని గొప్పతనం. శ్రీరామచంద్రుని దాసునిగా, రక్షకునిగా కూడా అన్నమయ్య వర్ణించాడు. ఎంతటి రక్షకుడైనా అతనికి రక్షణ లేకుంటే అతను ఏ రకంగా రక్షణ కల్పించగలడని, హనుమంతుని అభిప్రాయం. అందుకే హనుమంతుడు తమకు రక్షణ ఇస్తున్నపుడు అదేవిధంగా హనుమంతుడికి కూడా పలువురు రక్షణ కల్పించాలని అన్నమయ్య ఉద్దేశ్యం. అన్నమయ్య హనుమంతుని రాముని బంటుగా తన కీర్తనలో:

**"ఏలవయ్యా లోకమెల్ల యిట్టె రాము దీవెనచే**
**నీలవర్ణ హనుమంత నీవు మాకు రక్ష" (4-459)**

అంటూ అన్నమయ్య ఎవరెవరు ఏమి భాగాన్ని రక్షించాలో వర్ణించాడు. వాయువు గమనానికి కనుక హనుమంతుని పాదాలను వాదుదేవుడు రక్షించాలంటాడు. ముఖానికి ఇంద్రుని, శిరస్సుకు సూర్యుడు, కన్నులకు గ్రహతారకాలు, చేతులకు గరుడుడు, తొడలకు వరుణదేవుడు, తేజస్సుకు అగ్నిదేవుడు, శృంగారమునకు విష్ణువు రక్షించాలంటూ అన్నమయ్య కీర్తించడం జరిగింది.

ఏవిధమైన ప్రతిఫలాపేక్ష లేకుండా పరోపకారం చేసే హనుమంతుని గుణం శ్లాఘనీయం. సీతాదేవి వార్తను రాముడికి తెలియజేయడం, సంజీవ పర్వతం తెచ్చి లక్ష్మణుడ్ని బ్రతికేటట్లు చెయ్యడం హనుమంతుడు నిష్కామకర్మ భక్తునిగా కీర్తింపబడినాడు. అందుకే కాబోయే బ్రహ్మ పదవికి హనుమంతుడు అర్హుడైనాడు.

సేవకుడు తన యజమాని దగ్గర ఎలా ఉండాలో అన్నమయ్య చక్కగా వర్ణించాడు. హనుమంతుడు మహాజ్ఞాని, మహాబలాఢ్యుడు, గొప్ప మహిమాన్వితుడై మిక్కిలి అణకువతో సేవకునిగానే జీవించాడు. ఒక సేవకుని లక్షణాలు ఓర్పు, నేర్పు పుణికిపుచ్చుకున్న హనుమంతుని అన్నమయ్య వర్ణించాడు.

ఈశ్వరాంశ సంభూతుడైన హనుమంతుని లీలలు చూస్తే భారతయుద్ధంలో అర్జునునికి హనుమంతుడు ధ్వజంలో వుండుట చేతనే అర్జునుడు విజయం సాధించటం, అంటే శ్రీకృష్ణ భగవానునితోపాటే భక్తుడైన హనుమంతుని సహాయం అర్జునునికి లభించటం, హనుమంతుని సహాయంతోనే సుగ్రీవుడు రామునికి పరిచయం ఏర్పడి,

రామభక్తుడుగా రాముని అనుగ్రహానికి పాత్రుడైనాడు. కనుక కిష్కింధకు రాజుగా ఎన్నికైనాడు. భీష్మునికి సహాయపడినవాడు హనుమంతుడే అని ప్రకటించిన అన్నమయ్య తీరు ప్రశంసనీయం. అంతేగాక అవతారమూర్తియైన విష్ణువు, హనుమంతుడు సమానమైనవారని, ఇద్దరూ ఒక్కటే, భేదం లేదని భగవంతుడు, భక్తుడై ఒక్కటే అన్న సత్యాన్ని కూడా వర్ణించాడు.

**"ఇతడే యతడు గాబోలేలిక బంటునువైరి**
**మితిలేని రాఘవుడు మేటి హనుమంతుడు"** **(11-1-148)**

రాముని కోరికపై సీతకోసం సముద్రాన్ని సునాయాసంగా దాటిన ఈ హనుమంతుడు. కోపంతో రావణుని గర్వాన్ని అణచి మైరావణుని దండించి, గోవర్ధన పర్వతమునెత్తిన కృష్ణుడు ఇతడే. సంజీవని కొండనెత్తి తెచ్చినవాడు ఈ హనుమంతుడే. రామపాదానికి రాయి అహల్యగా అగుట హనుమంతుడు పాటపాడగా రాయి కరుగుట, అంజనాచలము మీద ఉండే వేంకటేశ్వరుడే- అంజనా తనయుడైన ఈ హనుమంతుడు. సూర్యకులజుడైన శ్రీరాముడు కూడా ఇతడే. దయాకిరణాలు కలవాడు ఈ మంగాబుధి హనుమంతుడు అని వేంకటేశ్వరుని, ఆంజనేయుని, శ్రీరాముని గొప్పదనాన్ని ఎంతో సుందరంగా వర్ణించాడు.

వైష్ణవ భక్తిమత ప్రచారమే తన ధ్యేయంగా తలచి అన్నమయ్య విస్తృతంగా దేశాటనం చేశాడు. దేశంలో చాలాచోట్ల ఆంజనేయాలయాలు విస్తృతంగా వెలిశాయనటంలో సందేహం లేదు. ఆ ప్రాంతాలలో హనుమంతుని దేవాలయాలను దర్శించి భక్తిభావంతో, తన్మయుడై నోరారా అన్నమయ్య కీర్తించి, అందరినీ ముగ్ధులుగా అలరింపజేశాడు. అన్నమయ్య కీర్తనల్లో 'హనుమంతుని' శబ్దం అనేక రూపాలలో ప్రయోగించటం విశదమగుతుంది. హనుమంతా, హనుమంతరాయండు, హనుమంతరాయ, పెద్ద హనుమంతుడు, దొడ్డ హనుమంతుడు, దివ్య హనుమంతుడు, చొక్కపు హనుమంతుడు, ఉగ్రహనుమంతుడు మొదలగు పదజాలంతో అనేకరకాలుగా తన తృప్తి తీరా మనసారా మనోభావాలను వ్యక్తం చేసిన కవితామహుడు.

అన్నమయ్య సందర్శించిన రామాలయాలు, హనుమంతుని ఆలయాలు, వాటి గురించి అన్నమయ్య కీర్తించిన కీర్తనలో తిరుమల, తిరుపతి, మంగాంబుధి, కలశాపురం, మతంగాద్రి, హంపి, విట్టల క్షేత్రం ప్రాంతాలలో ఉండే హనుమంతుణ్ణి మృదుమధుర శబ్దాలతో వర్ణించాడు.

**తిరుమల హనుమంతుడు**

తిరుమలలోని బేడి ఆంజనేయుడుగా శ్రీ వేంకటేశ్వర స్వామి సన్నిధిలో వెలసి ఉండడం గొప్ప విశేషం. 'బేడి' అంటే కన్నడంలో 'వేడికొనండి' లేదా 'వేడుకొండి' అని అర్థం. అంటే ముందు ఆంజనేయుని తర్వాత శ్రీ వేంకటేశ్వరుని వేడుకొండి

అనే పరమార్థంగా 'బేడి' పదాన్ని ఉపయోగించి ఉండవచ్చు. మరొకవిధంగా శ్రీ వేంకటేశ్వరుని లెక్క చేయక అల్లరిచిల్లరగా తిరుగుతున్న హనుమంతుని గర్వాన్ని అణచుటకు బేడీలు వేయమని స్వామి ఆజ్ఞ ఇస్తే అతనికి బేడీలు వేసినట్లు, బేడి ఆంజనేయునిగా ప్రచారం. ఈ హనుమంతుని అన్నమయ్య తన కీర్తనలో :

**"శరణు శరణు కపీశ్వర శరణంబనిలజ**
**సరవి నెంచ నీసరి యింక లేరి"** **(9-132)**

కవి శ్రేష్ఠుడైన ఓ హనుమంతా నీకు శరణు శరణు. నీ సాటి ఎవరూ లేరు. పుట్టిననాడె ఆకాశంలోని సూర్యుడి పండని ఎగిరితివి. చుక్కలు తాకే వాడివిగా పెరిగితివి, ఇంత ప్రతాపం గల నిన్ను ఎదుర్కొన ఏదీ లేదు. పంపగానే సముద్రం లంఘించితివి. సీతకు అన్ని విషయాలు తెల్పి, సంజీవని తెచ్చి నీ ప్రభుభక్తిని చాటుకున్న నీ పెంపును, సొంపును పేర్కొన నా తరమా! నేడు శ్రీ వేంకటేశ్వరుని సేవించి రాముని కృపగొంటివి. ఓ హనుమంతా! నీ కృప కోసం నీ ఎదుటనే ఇదిగో కాచుకొంటితినని అన్నమయ్య వర్ణించాడు.

**తిరుపతి హనుమంతుడు**

తిరుపతి ఆంజనేయ స్వామిని గూర్చి, అంటే రామాలయం, గోవిందరాజస్వామి ఆలయం, భవానీ నగర్ హనుమదాలయాలు ప్రసిద్ధమైనవి.

**"మగటిమి గల హనమంతరాయ**
**దిగువ పట్టణము లోని దేవ హనుమంత"** **(7-16)**

అన్న కీర్తన తిరుపతి ఆలయమునకు సంబంధించినది కావచ్చు. తిరుపతిలోని హనుమంతుడు గొప్ప ప్రతాపం కలిగిన దేవుడని, రాక్షసులను చంపి, రామునికి తోడై సీతమ్మకు ఉంగరమిచ్చాడు. భూమి, ఆకాశం ఏకమయ్యే విధంగా పెరిగి యక్షుని అణచినవాడు ఈ హనుమంతుడే. దాసులను రక్షించునని తప్పక అభయమిచ్చినవాడు, శ్రీ వేంకటేశ్వరుని నిత్యసేవకు కాచుకొని ఉన్న హనుమంతుడు ఇతడే అని అన్నమయ్య వర్ణించాడు.

**మంగాంబుధి హనుమంతుడు**

'అంబుధి' చివరగల గ్రామం మంగాంబుధి. ఇది మంగాపురమే. కానీ ఏ మంగాపురం అనే సందేహం. మొదటిది తిరుచానూరు, అలమేలు మంగాపురం. రెండవది చంద్రగిరి ప్రాంతం దగ్గర శ్రీనివాస మంగాపురం. వేంకటేశ్వరుడున్నచోట హనుమంతుడుండవచ్చు. కనుక అన్నమయ్య స్తుతించిన హనుమంతుడు మంగాపుర హనుమంతుడే అయివుండవచ్చునని డాక్టర్ కె. సర్వోత్తమ రావు గారి అభిప్రాయం. అన్నమయ్య తన కీర్తనలో :

**"ఆంజనేయ యనిలజ హనుమంత నీ**
**రంజకపుఁజేతలు సురల కెంచ వసమా"** **(11-1-163)** అంటూ -

ఓ ఆంజనేయా! ఓ హనుమంతా! దేవతలకు కూడా నీ చేష్టలను పొగడ వశమా! అర్జునుడు నీ రూపాన్ని పెట్టుకొనే కౌరవులను గెలిచాడు. నీవలననే సుగ్రీవుడు రాముని సేవించి కపిరాజయ్యాడు. నీ వల్లనే రాముడు సీతాదేవిని ప్రేమతో మరలా స్వీకరించాడు. అనేకమంది రాక్షసులను చంపి రామదూతవైన నీవు దేవుడిగా పూజింపదగినవాడివే. అల శ్రీ వేంకటపతి సమీపాన, మంగాంబుధి నివాసంగా వర్ధిల్లిన భక్తాగ్రేసరుడైన హనుమంతుని అన్నమయ్య భక్తితో ప్రశంసించాడు.

**కలశాపుర హనుమంతుడు**

కలశాపురం హంపిలో మాల్యవంతానికి ఎదురుగా కొండలోని దేవుడే కలశాపుర ఆంజనేయుడని మాన్యశ్రీ రాళ్ళపల్లి వారు భావించారు. మరికొందరు అనంతపురం జిల్లా గుంతకల్లు సమీపంలో .కలశాపురంలోని హనుమంతుడే నెట్టికంటి హనుమంతుడని ప్రసిద్ధి అని అంటారు. అన్నమయ్య వర్ణనలో కలశాపుర హనుమంతుని వర్ణనలు కన్పించటం విశేషం. కలశాపుర హనుమంతుడు వీర రసావతారమూర్తి అని డా॥ కె. సర్వోత్తమరావు గారు తన పుస్తకంలో వివరించారు.

కలశాపురం పండ్లతోటలలో పండ్లగెలలు చేత పట్టుకొని, తోకను పైకెత్తుకొని, పెరిగి, పెద్ద జంగచాచిన హనుమంతుని దర్శనీయంగా తాళ్ళపాక వారు చిత్రించిరి. దీనికారణంగా కలశాపురం పండ్లతోటలకు ప్రసిద్ధి గాంచియుండవచ్చునని, వేటూరి ఆనందమూర్తి గారు తన గ్రంథంలో వివరించారు. అన్నమయ్య కలశాపుర హనుమంతుని గూర్చి తన కీర్తనలో:

**"అందరికి నెక్కుడైన హనుమంతుడు**
**అందుకొనె సూర్యఫలమని హనుమంతడు"** **(10-155)**

అందరికి గొప్పవాడైన హనుమంతుడు సూర్యుని ఫలమని అందుకొన్నాడని, బలంతో లంకలో ప్రవేశించి, ఎందరో రాక్షసును కొట్టి అల్లకల్లోలం చేశాడని, రాముని ముద్దుటుంగరం సీతకిచ్చాడని, సీతకు తన గుర్తులు తెల్పి విశ్వరూపం చూపించాడని, సీత చూడామణి తీసుకొని ఆకాశమార్గంలో సముద్రం దాటిన గొప్ప వీరుడని, సంజీవని కొండదెచ్చి హనుమంతుడు శత్రువులకు తలకంటకుడైనాడనియు, శ్రీ వేంకటాద్రి దేవుని మెప్పించినవాడు ఈ కలశాపుర హనుమంతుడని అన్నమయ్య వర్ణించాడు.

**మతంగాద్రి హనుమంతుడు**

బళ్లారి జిల్లా హోస్పేట తాలూకా హంపి ప్రాంతంలో మతంగాది బిలము దగ్గరి పెద్ద హనుమంతుని తాళ్ళపాక వారు కీర్తించారు. హంపీ క్షేత్రమునకు రెండు వైపులా మతంగ, మాల్యవంతాల నడుమ గల హనుమంతుడు పెద్ద హనుమంతుడే విజయనగర దేవుడని వేటూరి ఆనందమూర్తి గారు తన గ్రంథంలో వివరించారు. ఇతడే ఉగ్రహనుమంతుడనియు తాళ్లపాకవారు చెప్పారు. ఈ హనుమంతుని పాత్రను అన్నమయ్య తన వర్ణనలో :

**"అదె చూడురయ్యా పెద్ద హనుమంతుని**
**గుదికొని దేవతలు గొని యారయ్యా"** **(11-1-214)**

అదిగో చూడుడు దేవతలందరు ఏకమై ఆ పెద్ద హనుమంతుని పొగడుతూ తూర్పు పడమర కొండలపై జంగజాచి, ధ్రువ మండలమందు శిరసు వుంచి సూర్యుని వెంట మొగము త్రిప్పుచు చదువుతున్నవాడు, ఈ హనుమంతుని మహిమలేమని చెప్పగలం. అన్ని దిక్కులు నిండు విధంగా శరీరం పెంచి బ్రహ్మాండం వరకు తోకఎత్తి రాక్షసులను కొట్టుటకా అన్నట్లు చేతులెత్తిన ఇతని ప్రతాపం, చాలా ఆశ్చర్యం, అపూర్వమైనది. దేహరోమాలు పెంచి, ఇతర లోకాలకు ప్రాణమై నిల్చిన వాడు ఇతడే. శ్రీ వేంకటేశ్వరునకు హితమును గూర్చు బంటుగా ఉన్న ఈ పెద్ద హనుమంతుని ఏమని చెప్పాలి అని అన్నమయ్య వర్ణించాడు.

**ఉగ్రహనుమంతుని తన భక్తి ప్రశంసతో :**

**"ఎక్కడా నెదురులేక యీరేదు లోకములందు**
**వొక్కడె నిలిచెనమ్మా వుగ్ర హనుమంతుడు"** **(10-85)** - కీర్తిస్తూ

ఎక్కడా ఎదురులేనివాడు ఈ ఉగ్ర హనుమంతుడు. పెద్ద చెవులు, విశాలమైన కన్నులు, శిరస్సుపైకి ఎత్తిన తోక, చుక్కలు మొల పూసలుగా, రోమాలు సూదులుగా ప్రకాశించే రూపం, పుట్టుకతో బంగారు వస్త్రం, కవచకుండలములు, జందెము కలిగి శ్రీ వేంకటేశ్వరుని బంటై విజయనగరంలో ఉగ్ర హనుమంతుడు వెలసాదని అన్నమయ్య తన కీర్తనలో ప్రశంసించాడు.

హనుమంతుని రామబంటుగా, దూతగా ఏ విధంగా తన ప్రభువైన రామునికి సహకరించాడో అన్నమయ్య తన కీర్తనల్లో కీర్తిస్తూ హనుమంతుని గొప్పతనాన్ని, సాహసాన్ని స్తుతిస్తూ ఇలా :

**"అన్నిటా నీ పెంపు వింత హనుమంత నీ**
**వున్నచోటు నిశ్చింత యో హనుమంతా"** **(2-249)**

హనుమంతా! అన్నిచోట్ల నీవె ముఖ్యమైనవాడవు. నీవున్నచోట్ల చింతలుండవు. రాముసు సేనలు కాపాడు రావణుని గర్వాన్ని అణచావు. గొప్ప బలంతో శ్రమ లేకుండా సముద్రం దాటి సంజీవని తెచ్చిన దివ్య హనుమంతుడివి నీవే. చుక్కలు మొల పూసలుగా, సూర్యమండలము దాకా పెరిగిన నీ రూపం సుందరం. సుగ్రీవాదులకు కావలసినదంతా నీవే సమకూర్చి, జంగచాచి, పిడికిలి బిగించి, శరీరం నిక్కించి శ్రీ వేంకటాద్రి రాముని దేవికి మొక్కులు ఇచ్చినవాడవు. అటువంటి హనుమంతుని అన్నమయ్య వర్ణించాడు.

**విట్ఠల హనుమంతుడు**

విజయనగర చక్రవర్తుల కాలంలో విఠలుని ఆలయాలు చాలా వెలశాయి. పందరంగములోని విట్ఠల ఆలయ సమీపంలోని హనుమంతుడే అయి వుండవచ్చు.

"మొక్కరో మొక్కరో వాడె ముందర నిలుచున్నాడు
యెక్కువ రాముని బంటు యే కాంగ వీరుఁడు"          (3-301)

ముందర నిలుచొని వున్నవాడే రాముని బంటు అయిన హనుమంతుడు. అతనికి మొక్కండి అంతేకాదు రాముని బంట్లలో గొప్ప వీరుడు ఈ హనుమంతుడే. పెద్ద జంగచాచి రాక్షసులును కొట్టుటకు తన చేతిని ఎత్తిన బలవంతుడు. ఆకాశమంత దేహమును పెంచి, తోకను వాలుగా శిరసుమీద వంచినవాడు. రౌద్రాకారములో పెద్ద దవడలను పెంచినవాడు. శ్రీ వేంకటాద్రి దేవుని బంటై నిలిచి ఉన్నాడని అంజనేయునికి అన్నమయ్య తన కీర్తనల్లో వర్ణించాడు.

హనుమంతుడు లోకమంతటకీ ఎదురులేని దైవం అని అన్నమయ్య మనోభావన. బ్రహ్మగా, విష్ణువుగా, రుద్రుడుగా, సూర్యుడుగా, శేషుడుగా, వాయుదేవుడుగా, చంద్రుడుగా, అనేక విధాలుగా కనిపించిన హనుమంతుడు వేంకటేశ్వరుని బంటుగా దైవదాసునకంటె ధన్యుడు ఇంకవరు లేరని అన్నమయ్య ఆలోచన ఆనందదాయకం.

హనుమంతుడు రామసేవా దురంధరుడని అనవచ్చు. ఆజన్మాంతరం రామభక్తుడుగా, నమ్మినబంటుగా ఖ్యాతినొందినాడు. భగవంతునికంటె అతని నామమే గొప్పదని భావించటం హనుమంతుని స్వామి భక్తికి తార్కాణం. అంతేకాక రామావతార మూర్తిని తప్ప ఏ ఇతర అవతారమూర్తులను ఎంపిక చేసుకోకపోవడం విశదమవుతుంది. అట్లే అన్ని నామములు భగవంతునివే, త్యాగరాజు, నారాయణ అష్టాక్షరిలోని 'రా', శివ పంచాక్షరిలోని 'మ' కలిపి హరిహరాత్మకమగు 'రామ' నామం తెలియజేసెను. ఈ 'రామ' నామస్మరణ చేయు భక్తులు సద్గతి పొందుతారని నాదబ్రహ్మ త్యాగరాజు వివరించెను. దీనిని తారకనామం, తారకమంత్రం అంటూ ఈ రామనామమును బహుళ ప్రచారం చేసిన భక్తాగ్రేసరుడు రామభక్తుడైన హనుమంతుడే.

మంత్రస్మరణ గొప్పతనాన్ని చాటి, ఎందరు మంత్ర ప్రభావాన్ని ఆకళింపు చేసుకొని సత్ఫలితాన్ని పొందారో వారిని లోకానికి గుర్తుచేసిన మహాజ్ఞాని. నారాయణ మంత్రం ప్రభావం వల్ల నారదుడు దేవర్షిగా, ప్రహ్లాదుని వల్ల నరసింహావతారం, విభీషణుడు 'రామ' మంత్రాన్ని ఉపాసించి లంకాధిపతిగా, ధ్రువుడు వాసుదేవ మంత్రాన్ని జపించి ధ్రువపదాన్ని పొందటం, కృష్ణుడు కృప కారణంగా అర్జునుడు కృష్ణ నామ స్మరణ, శుకుడు విష్ణు మంత్రాన్ని జపించి, ఊర్ధ్వలోకాన్ని ప్రవేశించటం, ఈవిధంగా విష్ణు భక్తులందరినీ స్మరించాడు. వీరందరూ మంత్ర మహాత్మ్యం వల్ల తమ కార్యాలను సాధించారని, లోకానికి తేటతెల్లం చేశాడు. విష్ణు భక్తులందరిలోకెల్లా హనుమంతుడే గొప్ప యశస్సును సాధించాడు.

రామమందిరం లేని గ్రామం లేదు. హనుమంతుని ప్రశంస లేని సాహిత్యం లేదు. తమిళ సాహిత్యం, కన్నడ సాహిత్యం, జానపద సాహిత్యం, విదేశ సాహిత్యాలలో, వివిధ రామాయణాలలో, భారతం, అన్నింటిలో హనుమంతునిపై భక్తి పేర్కొనబడింది. రామకథ చెప్పమంటే హనుమంతుని కథ చెప్పినట్లే. అంతటా, అన్నింటా నిండిపోయి

వున్నవాడు హనుమంతుడు. కర్ణుడు లేని భారతం లేదు అన్నట్లే హనుమంతుడు లేని రామాయణం లేదు అన్నది కూడా పరమ సత్యమే. రాముని తమ ఇలవేల్పుగా కొలిచేవారు హనుమంతునికి కూడా అంతే ప్రాధాన్యతను ఇచ్చి ఆరాధించుటచే అనేక హనుమంతాలయాలు వెలియటం అనేది ఆశ్చర్యకరం కానేకాదు.

హనుమంతుడు, వాయుపుత్రుడు, విశ్వరూపుడు, రామకార్య దురంధరుడు, రామానుగ్రహపాత్రుడు, ధీరోధాత్త చరిత్రుడు, గొప్ప బలసంపన్నుడు, భక్తవత్సలుడు, భక్తవరదుడు అంతేగాక రాముని బంటు, రామభక్తుడుగా పేరుగాంచిన అతనిని శరణు పొందితే ఎటువంటి కష్టాలు, దుఃఖాలు అయినా తొలగిపోతాయని ప్రజల విశ్వాసాన్ని పొందిన పరమపూజ్యుడు హనుమంతుని కథలు తెలుగువారి జీవితాల్లో శాశ్వతంగా సజీవ స్థానాన్ని సంపాదించాయి.

రామభక్తుడైన హనుమంతుని, శ్రీ వేంకటేశ్వరుని పరమ భక్తాగ్రేసరుడు, పదకవితా పితామహుడుగా పేరుగాంచిన అన్నమయ్య అపారమైన, అచంచలమైన భక్తిభావంతో 'పవనుని' పట్ల తనకు గల భక్తిని కీర్తనలలో ప్రశంసించాడు. భగవంతునికంటే భక్తునికి ఎక్కువ ప్రాధాన్యతనిస్తూ రామభక్తికి, రాముని బంటుగా హనుమంతునికే అగ్రతాంబూలమిచ్చి, వేనోళ్ళ కీర్తించి, కీర్తింపబడినాడు, పరమ పునీతుడై శ్రీనివాసుని నందకాంశ సంభవు అన్నమయ్య. వీరి కీర్తనలను అవగాహన చేసుకోవడం వలన మనకు మోక్షం సిద్ధిస్తుంది. కావున అన్నమయ్య జన్మసార్థక మైనది. పరమ పూజ్యనీయుడు ధన్యజీవి మన అన్నమయ్య.

**ఉపయుక్త గ్రంథ సూచిక :**


1. తాళ్ళపాక కవుల సాహితీ కిరణాలు (వ్యాస సంపుటి) – డా॥ జక్కంపూడి మునిరత్నం, తిరుపతి.
2. తాళ్ళపాక కవుల పదకవితలు–భాషా ప్రయోగ విశేషాలు – డా॥ చేటూరి ఆనందమూర్తి, నిజాం కాలేజి, హైదరాబాదు.
3. తాళ్ళపాక అన్నమయ్య సంకీర్తనల్లో గ్రామీణ జీవితం – డా॥ బొందు శ్రీరాములు.
4. అన్నమాచార్య సంకీర్తనములలోని వర్ణనలు – డా॥ గుమ్మా సాంబశివరావు, విజయవాడ.
5. పదకవితా పితామహుడు – డా॥ ఎన్. గంగప్ప.
6. తాళ్ళపాక పదకవుల హనుమత్సంకీర్తనలు – డా॥ కె. సర్వోత్తమ రావు.
7. తాళ్ళపాక అన్నమయ్య పాటలు – కామిశెట్టి శ్రీనివాసులు.
8. అన్నమయ్య పదకవితల్లో రామకథ – డా॥ జూలకంటి బాలసుబ్రహ్మణ్యం.


***

# తాళ్ళపాక అన్నమాచార్య సంకీర్తనలు - భగవ'న్నామ' మహాత్మ్యం

డా॥ యర్రదొడ్డి సుభాషిణి
తెలుగు అధ్యాపకులు
రాజీవ్‌గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయ
ఏపిఐఐఐటి, ఆర్.కె. వ్యాలీ, కడప జిల్లా

1. నిత్యం శ్రీ వేంకటపతి పదారవింద మకరందాన్ని ఆస్వాదించినవాడు అన్నమయ్య. భావంలో, భాహ్యంలో అంతటా గోవింద నామస్మరణ తప్ప మరొకటి పట్టని మహాభక్త కవి. సర్వం వేంకటేశ్వరమయమని భావించిన వ్యక్తి కూడా! పరమపురుషుడు 'పరమాత్ముడు', 'తిరువేంకటవుభుడే'నని గట్టిగా నమ్మిన మహాత్ముడు అన్నమయ్య.

2. 'కీర్తన' అంటేనే 'స్తుతి'. సర్వం 'నారాయణమయ'మని భావించిన అన్నమాచార్య సంకీర్తనలన్నీ స్తుతులే, భగవన్నుతులే! మనిషికి భగవత్ప్రాప్తి ఒక్కటే ముఖ్యలక్ష్యం. దానికి సాధనం భక్తిప్రపత్తులతో గూడిన భగవన్నామ స్మరణమే. భగవంతుడిని స్మరిస్తూ పరమ పురుషార్థమైన భగవత్ప్రాప్తి పొందాలనేదే అన్నమయ్య ధ్యేయం.

3. **'నామ' శబ్ద వ్యుత్పత్తి** :- 'నామ' శబ్దం 'ణమ' ధాతు నిష్పన్నం. ఆనతి (ఆభిముఖ్య) సాధనమని దాని అర్థం. భగవన్నామ ప్రభావాన్ని పురాణాలు, ఇతిహాసాలు మొదలైనవన్నీ ఎన్నోరకాలుగా ప్రతిపాదిస్తున్నాయి. కలి సంతరణాది ఉపనిషత్తులు కూడా ఉద్ఘోషిస్తున్నాయి.

ఐతరేయోపనిషత్తులో ప్రణవమునకు సార్వాత్మకత్వాన్ని ప్రతిపాదించే ప్రకరణంలో 'శబ్దం - అర్థం' అనే రెండు రూపాలలో ఉన్న ప్రపంచంలో అర్థ ప్రపంచమంతా శబ్ద ప్రపంచంలో అంతర్భూతమై ఉన్న విషయాన్ని

> **"తస్య వాక్తన్తిర్నామాని దామాని తదస్యేదం వాచాతన్యా**
> **నామభిర్దామభిస్సర్వం సితం సర్వం హీదం నామాని"** అని వివరించారు.

వర్తకులు పొడవైన తాడొకటి తీసుకొని కిందపరచి దాన్ని అంటి ఉన్న చిన్న తాళ్ళతో పశువులను కట్టివేస్తుంటారు. అదేవిధంగా ప్రణవోపాధికుడైన పరమేశ్వరునకు శబ్దమే దీర్ఘరజ్జుస్థానీయం. రామకృష్ణాది నామాలే పాశస్థానీయాలు. వాటిలో ఈ అర్థ ప్రపంచమంతా ఇమిడి ఉన్నదన్నమాట. కాబట్టే ప్రతి మనిషీ తన నామాన్ని విన్నంతనే ఎంత దూరంలో ఉన్నా తాడుతో లాగినట్లు పరిగెత్తుతాడు. ఈ విషయమందరికీ అనుభవమే. ఇదే న్యాయం భగవన్నామ విషయంలో మాత్రం ఎందుకు వర్తించదు?

కనక భగవన్నామం భగవదాభిముఖ్య సాధనమనడంలో సంశయించాల్సిన పనిలేదు. ఈ విషయం అన్నమయ్య సంకీర్తనలెలా ప్రతిపాదిస్తున్నాయో చూడటమే నా వ్యాస ఉద్దేశ్యం.

4. **రక్షణగా** :- బాల్యంలోనే జీవిత పరమార్థాన్ని అందిపుచ్చుకున్న ధన్యుడు అన్నమయ్య. సర్వపాప ప్రణాశనమైన భగవన్నామ సంకీర్తనమే ఆయనకు తరుణోపాయంగా మారింది. ఆయన వేంకటేశ్వర స్వామి వైభవాన్ని 32 వేల సంకీర్తనలతో కీర్తించాడు. కానీ అందులో ఒక్క సంకీర్తనే తమను రక్షించదానికి చాలు అన్న మహానుభావుడాయన!

**"ఒక్క సంకీర్తనే చాలు - వొద్దికై మమ్ము రక్షించగ**
**తక్కినవి భండారాన - దాచి వుండనీ"**

నీ నామం దుర్లభం. దాని వెల తక్కువ. కాని దాని ఫలం మిక్కిలి గొప్పది. ఆ నామ 'సంకీర్తన ప్రభావంతోనే నాకు దిక్కై నన్ను రక్షించావు. ఇక నీ నామ సంకీర్తనలే నాకు తరిగిపోని సంపదలంటూ కీర్తిస్తున్నాడు. పరమాత్ముని మీదా, ఆయన రాసిన పదాల మీదా ఆయనకున్న విశ్వాసం అంత గాఢమైంది. అందుకే-

**నిన్ను నమ్మి విశ్వాసము - నీపై నిలుపుకొని**
**ఉన్న వాదనిక వేరే - ఉపాయమేమిటికి ?** అని ఆయన చెప్పుకున్నాడు.

పరమపద ప్రాప్తికి భగవద్విశాసాన్ని మించిన ఉపాయం లేదని ఆయన సిద్ధాంతం. ఆ విశ్వాసమే ఆయనను ఆడిపాడించేలా చేసింది. ఆ పదాలనే ఇతరులకూ తారకమంత్రాలుగా నిలిపింది.

5. **శరణన్న వారికి దిక్కుగా** :- పూర్వం గజేంద్రుడు మొసలిచే పట్టుబడి చాలారోజులు పోరాడి ఓడిపోయి చివరకు ధైర్యం కోల్పోయి "నీవే తప్ప నితః పరంబెఱుగ మన్నింపన్ దగున్ దీనునిన్ / రావే యీశ్వర! కావవే వరద! సంరక్షించు భద్రాత్మకా!" (భాగ - 8-90) అని ప్రార్థించగానే భగవంతుడు అతడిని రక్షించినట్లుగానే అన్నమయ్య ఎటువంటి కష్టదశలలోనైనా హరి నామం ఒక్కటే దిక్కు అంటున్నాడిలా !

**"ఆకటి వేళల - నలపైన వేళలను**
**తేకువ హరినామమే - దిక్కు మరిలేదు"**

ఆకలి వేసినా, శ్రమకు గురై అలసిపోయినా ధైర్యాన్నిచ్చి రక్షించేది 'శ్రీహరి' నామమొక్కటే. అది తప్ప వేరే దిక్కు లేదు. తానెందుకూ పనికిరాననే దుస్థితి కల్గినా, కులం చెడినా, ఇతరుల చేతిలో బంధింపబడి కృశించినా 'హరి' నామమొక్కటే గతి, దాన్ని మరిస్తే మరో గతి లేదు.

ఆపద సమయాల్లో, నిందలకు గురైనప్పుడు, భయం వేసినప్పుడు స్మరించదగినది 'హరి' నామమొక్కటే. దాన్ని విడిచి చివరిదాకా ప్రయత్నించినా ఆ కష్టాలనుండి కాపాడటానికి వేరే దారి లేదు.

శత్రువులు సంకెళ్ళతో బంధించినా, చంపటానికి పిలిచినా, అప్పులవాళ్ళు నిలదీసినా విడిపించదానికి శ్రీ వేంకటేశ్వరుని నామమొక్కటే ఉపాయమంటాడు. దాన్ని వదిలి మూర్ఖత్వంతో మనమెంత ప్రయత్నించినా ఎలాంటి మార్గం లేనే లేదంటూ నామ మహాత్మ్యాన్ని చాటుతున్నాడు.

5.1. మరో కీర్తనలో మన భక్తికి లోపమే కాని భగవంతుని దయలో ఎలాంటి కొరత లేదనుచున్నాడు.

**"తలఁచినంతటిలోనె - దైవమెదుటఁగలఁడు**
**కొలువనేరని యట్టి - కొరతేగాని"**

తలచుకోగానే భక్తులను రక్షించడానికి దేవుడు కాచుకొని ఉన్నాడు. శరణంటే చాలు సకల కోరికలను తీర్చడానికి శ్రీహరి సిద్ధంగా ఉన్నాడు. చేయెత్తి మొక్కితే చాలు అన్నివిధాలా భక్తులను కాపాడటానికి ఆ భగవంతుడు సిద్ధంగా ఉన్నాడు. ఆయనలో ఎలాంటి లోపం లేదు. ఆయనని తలవని మనలోనే లోపం ఉంది. శ్రీ వేంకటేశ్వరునికి మొక్కక ఇతరములైన పుణ్యాలెన్ని చేసినా అవి 'అదవిగాచిన వెన్నెల'లా నిష్ప్రయోజనం సుమా! అని కూడా అంటాడన్నమయ్య.

6. **పాప పరిహారం** :- నామసంకీర్తనం మహిమాన్వితమైంది. సకల పాపహరమైన దైవ నామస్మరణ ఇహపరలోకాలలో ఉన్నతికి ఆలవాలం. అన్నమయ్య పలు కీర్తనలలో హరినామ వైభవాన్ని గొప్పగా కీర్తించారు.

**"ఇదియే సాధనమిహపరములకును**
**పదిలము మాపాలి పరమము నామం"**

అంటూ 'హరి'నామ మాహాత్మ్యాన్ని కొనియాడాడు.

6.1 పాపం, కోపం మొదలైన కలియుగ దోషాలు భగవంతుడిని ధ్యానించేవాళ్ళకు లేవంటున్నాడిలా!

**"కలియుగమెటులైనాఁ - గలదుగా నీకరుణ**
**జలజాక్షి! హరిహరీ! - సర్వేశ్వరా!"**

కలియుగం పాపాలకు నెలవైనది. జూదం, మద్యపానం, స్త్రీలోలత, ప్రాణివధ, అసత్యం, మదం, కామం, హింస, వైరం మొదలైన దోషాలతో కూడుకొని ఉన్నప్పటికీ నిన్ను ఆశ్రయించిన వాళ్ళను నువ్వు కాపాడతావు. నీ నామోచ్చారణ చేస్తున్న మమ్మల్ని ఎల్లవేళలా నువ్వు రక్షిస్తుండగా ఇక మాకెందుకు భయమంటున్నాడు.

6.2 'నామ సంకీర్తనం యస్య సర్వపాప ప్రణాశనమ్" (భాగ - 12-13-28) అన్నట్లు భగవంతుడి నామాన్ని కీర్తించిన వారికి పాపమే లేదని భాగవతంలో వర్ణించినట్లుగా, అన్నమయ్య కూడా పాపాలు తొలగిపోయి జన్మబంధాలను వదలిపెట్టదానికి ఒక్కటే సులభోపాయమంటున్నాడిలా :-

**"ఘంచి మందుగొన్నవాఁడు - మహామహారోగముల**
**అంచెలఁబాసి సుఖి - యయ్యీనట"**

పాపాలు పరిహారం కావడానికి, మోక్షాన్ని పొందడానికి మానవులు ఏవేవో పుణ్యకార్యాలు చేస్తూ, దానికోసం మితిమీరిన ద్రవ్యాన్ని ఖర్చు చేస్తూ, లేనిపోని ప్రయాసలకు గురౌతున్నారు. కాని నిజానికి వారి కోరికలు నెరవేరడానికి హరిభక్తి ఒక్కటే సులభోపాయం. కానీ దాన్ని వాళ్ళు నమ్మలేకపోతున్నారంటాడు అన్నమయ్య. నమ్మితే భగవంతుడి నామసంకీర్తనంతోనే ఔన్నత్యం పొందగలరనే సత్యాన్ని 'హరి నామ కథన దావానల జ్వాలచే / కాలవే? ఘోరాఘకాననములు' (భాగ - 1-50) అంటూ భాగవతం నిరూపిస్తోంది.

6.3 ధనంపై కోరిక పుట్టినప్పుడు, భయం, దుఃఖం వంటివి కల్గినప్పుడు, పాపాలకు భవరోగాలకు అతీతుడై నీ నిజస్వరూపాన్ని తెలుసుకొని నిన్ను సేవించినప్పుడే మాకు ఉత్తమ గతి ప్రాప్తిస్తుందంటున్నాడిలా :-

**చెలఁగి పాపములు మిం - చినవేళ హరి మీ**
**నలువు నామోచ్చార - ణంబు గలుగు,**
**బలిమి భవరోగముల - బడలినప్పటివేళ**
**పలుమారు మీసం - ప్రార్థనలు గలుగు**

6.4 భగవచ్చింతనతో పాపాలు, జనన మరణాది సంసార క్లేశాలు భస్మమై పోతాయంటాడు.

**మరణభయంబులు - మదములు మలి నీ**
**కరణము సేయఁగఁ - గలదొకటే**
**హరినామామృత - మందు మీఁది రతి**
**నిరతము నాకిది - నిలువదు గాని**

'హరి' అనే నామాన్ని జపించడంతో మరణభీతి, మదం వంటివి తొలగిపోతాయి. శ్రీ వేంకటేశ్వరునికి సేవచేస్తే బాధలు, దుర్గుణాలు పరిహరించబడతాయి. కానీ ఈ విషయాన్ని మానవులు గ్రహించినా, మాయకు లోనై, వాటిని ఆచరించలేక బాధలు పడుతున్నారు. ఎల్లప్పుడూ భగవంతుడిని స్మరిస్తూ ఉంటే తప్పకుండా ధన్యులవుతారంటాడు అన్నమయ్య. ఇదే మాటను వ్యాసుడు "ఏతావతాఽ లమఘన్నిర్హరణాయ పుంసాం / సంకీర్తనం భగవతో గుణకర్మ నామ్నామ్" (భాగ - 6-3-24) అంటూ భగవంతుని గుణకర్మ నామాలని కీర్తించడమే పాపాలను తొలగించడానికి ఉపాయమంటాడు.

7. **సంసార బంధాల నుండి విముక్తి** :- "నామ స్మరణాధన్యోపాయం నహి పశ్యామో భవతారణే" అని పెద్దలు చెప్పినట్లు సంసారతరణానికి భగవన్నామ కీర్తన కన్నా సులభోపాయం లేదు. ఇంకా తన సర్వస్వాన్ని భగవత్పరం చేయడమే భక్తికి పరమావధి

కాబట్టే ప్రహ్లాదుడు "కమలాక్షు నర్చించు కరములు కరములు / శ్రీనాథు వర్ణించు జిహ్వాజిహ్వ" అంటూ హరిని చేరమనే వాడే తండ్రి అని కూడా అన్నాడు.

ప్రవృత్తి మార్గంలో ఉండే సంసారులు 'హరి' నామ స్మరణతో నివృత్తి మార్గ ఫలం పొందగలరంటున్నాడిలా:

**అంతనటె వచ్చి కాచు - నాపద్బంధుడు హరి**
**వంతుకు వాసికి నతని - వాడcనంటేcజాలు**

లౌకిక మార్గంలో వెళ్ళే సంసారులు ఎల్లప్పుడూ భగవంతుడి ధ్యాసలో ఉండలేకపోయినా కొంతవరకైనా 'మేము భగవద్దాసులం' అంటే చాలు వెంటనే ఆపద్బంధుడైన శ్రీహరి వారిని రక్షిస్తాడు. వరికుప్పలు నురపడానికి బంతిగట్టిన పశువులు అప్పుడప్పుడు ఒక్కొక్క కబళం నుండి గ్రహించి తృప్తి పొందినట్లు సంసారంలో ఉన్న మానవుడు వీలైనప్పుడల్లా పరమాత్మని మనసులో నిల్పితే ధన్యుడగును. భగవంతుని తలచుకోని వాళ్ళు సైతం భగవద్దాసులపై భక్తి నిల్పిచే ధన్యులవుతారు.

8. **అర్థాన్ని చేకూర్చడం** :- భగవంతుడిని మరచిపోకుండా తలచేవారికి సకలార్థాలు చేకూరునంటున్నాడు అన్నమయ్య:

**అతcడే యన్నియునిచ్చు - నడిగిన వల్లాను**
**చేతిలోనే వుండcగాను - చింతించరు హరిని**

భగవంతుడు మన హృదయంలోనే ఉన్నా ఆయనని మూఢులు తలచరు. ఆ పరమాత్ముడిని భక్తితో ప్రార్థిస్తే జీవులు కోరిన కోరికలన్నీ నెరవేరుస్తారు. కనుక ఆశపడి సంపాదించాలనుకుంటే సంపదలు రాక అనేక రకాలుగా శ్రమపడాల్సి వస్తుంది. వాటిపై విసిగి 'నాకీ సిరులేమి వద్దు' అని భగవంతుడినే ధ్యానిస్తే వాటంతటవే దగ్గరికి వచ్చి చేరుతాయనే రహస్యాన్ని తెలుసుకొని హరిని ప్రార్థించమంటాడు. "నారు పోసినవాడే నీరు పోస్తాడ"న్నట్లుగా జీవులను సృష్టించిన ఆ దేవుడే వారికేమి కావాలో సమకూర్చగలడు కనుక ఎల్లప్పుడూ భగవంతుని స్మరణలో పెట్టుండంటాన్నమయ్య!

9. **విద్యను ప్రసాదించడం** :- శరణనగానే కాపాడటం, కోరిన కోరికలను నెరవేర్చడం, పాపాల నుండి విముక్తి కల్గించడమే కాదు విద్యను కూడా ప్రసాదిస్తున్నాడిలా :-

**"చదువు గనవలసినను - శౌరినామము దిరుగc**
**జదువుటే సకల శాస్త్రముల సమ్మతము"**

చదవాలనే కోరిక ఉంటే శ్రీహరి నామాన్ని మాటిమాటికీ నోరారా జపించాలి. అలా చేస్తే సకల శాస్త్ర సమ్మతమైన చదువై విద్యాఫలమైన అమృతత్వాన్ని

సిద్ధింపజేస్తుంది. నిద్రించాలనే భావన కల్గితే హృదయాన్ని ఇతర వస్తువుల నుండి తొలగించి పద్మనేత్రునికి సమర్పించాలి. అలా చేయడమే యోగనిద్ర అంటాడు అన్నమయ్య.

10. **జాతి భేదాలకు అతీతం** :- సర్వజాతి భేదాలను సమానంగా చూడగల సహృదయత గలవాడు అన్నమయ్య. ఆ భావనతో రాసిన కీర్తనలు కొల్లలు. అందులో ఒకటి :-

**"నానా వర్ణముల వారు - నరహరిఁదలఁచేటి**
**ఆ నామ మంత్ర జప - మదియొకటే"**

భగవంతుడిని కొలవడం భక్తులందరికీ ఒకేవిధంగా ఉంది. అందులో ఎలాంటి భేదమూ లేదు. వివిధ వర్ణాలకు చెందిన ప్రజలు నరహరిని తలచడానికి సాధనంగా ఉపయోగించే నామమంత్ర జపం ఒకటే. ఇలలో ఏ జాతికి చెందిన వారైనా చివరకి మౌన నియతితో పొందగల మోక్షం గూడా ఒక్కటే. నామజపం భగవంతుని స్మరించడానికి సాధనం. ఆ జప విధానంలో జాతి భేదాలు లేవు. అలాగే భక్తి మార్గం కూడా. జీవులందరికీ ఒకే పద్ధతిలో విధింపబడి ఉంది గాని జాతి లింగాది భేదాలు ఇందులో పాటించలేదు. భక్తితో చివరికి పొందగలిగింది మోక్షం. ఆ మోక్షసుఖంలో కూడా ఎలాంటి జాతిభేదం లేదు. ఏ జాతివారైనా ఒకేవిధమైన మోక్షాన్ని పొందుతారు. ముక్తిలోనూ, శరణాగతిలోనూ వ్యత్యాసం లేదు. ఇక భక్తులలోనూ వాడు తక్కువ, వీడెక్కువ అనే తరతమభావం ఎక్కడుంది? వైష్ణవమతంలో అలాంటి భేదభావం లేనేలేదు.

11. **భవరోగాలను పోగొట్టే ఔషధం** :- భగవంతుడి 'నామాన్ని' దివ్యౌషధంగా అన్నమయ్య ఎన్నో కీర్తనలు పాడారు. అందులో మచ్చుకు కొన్ని :-

**'వేదవేద్యులు వెదకేటి ఆదినంత్యములేని ఆమందు'**

**'వేదమంత్ర మింకనేల వేరువెల్లంకులు నేల**
**పుడమిధరుడు మాకు భువనౌషధము'**

**'అన్నిటికి నిది పరమౌషధము**
**వెన్నుని నామమె విమలౌషధము'**

హరి, అచ్చుతా, నరసింహా, పురుషోత్తమా, వాసుదేవా మొదలైన దివ్యనామాల్ని జపించడం వల్ల పాపాలు, దుఃఖాలు, బంధాలు, చింతలు, వంతలరోగాలు మొదలైన మానసిక రోగాలు పోతాయని అట్టివానిని పోగొట్టే దివ్యౌషధమైన భగవంతుని స్మరించి ఇహపర సౌఖ్యాల్ని పొందండని ఉద్బోధిస్తున్నాడు.

'శ్రీహరి పాదతీర్థమే చెడని మందు' కీర్తనలో గురుతైన రోగములు గుణము చేసే మందు అని స్పష్టం చేశాడు.

11.1. భవరోగాన్ని పోగొట్టడానికి భగవంతుడే తగిన ఔషధమంటూ ధ్రువుడు, ప్రహ్లాదుడు, నారదుడు, జనకుడు మొదలైనవారంతా భగవంతుని ఆశ్రయించడంతోనే ముక్తులయ్యారంటున్నాడు.

**కొనరో కొనరో మీరు - కూరిమి మందు**
**ఉనికి మనికికెల్ల - నొక్కటే మందు**

మనుషులు వివిధరకాలైన శరీరరోగాలకు అనేకరకాల మందులు వాడుతారు. శరీరం శాశ్వతం కాదు. అది ఎప్పుడైన పతనం కాక మానదు. అజ్ఞానానికి మారురూపమైన సంసారాన్ని రోగమున్నంతదాకా జీవుడు మళ్ళీ శరీరాలు దాలుస్తూ, విడుస్తూ ఉండాల్సిందే కాబట్టి జన్మ జరామరణాలతో కూడిన భవరోగాన్ని దూరం చేయడానికి వివేకవంతుడు ప్రయత్నించాలి. అందుకు తగిన మందు పరమాత్ముడొక్కడే. ఆయన అనుగ్రహానికై పాటుపడుటే ముక్తికి సరైన త్రోవ అంటూ భగవంతుని మహాత్మ్యాన్ని చాటుతున్నాడు.

12. **ముగింపు** :- ఈవిధంగా అన్నమయ్య పల్లవి, చరణాలతో కూడిన తన కీర్తనల్లో భగవన్నామ మహాత్మ్యాన్ని శ్లాఘించాడు. ఐహికమైన కార్యకలాపాలవల్ల మానవులకు జీవనభృతి, కీర్తిప్రతిష్ఠలు లభించవచ్చు. కాని మనశ్శాంతి, జీవిత పరమార్థం చేకూరదు. అది దైవ నామస్మరణ వల్లనే సాధ్యమవుతుందనే విషయాన్ని అన్నమయ్య స్పష్టం చేశాడు. ఇలాంటి కీర్తనలను మనకందించిన అన్నమాచార్యులు చిరస్మరణీయులు.

**ఆధార గ్రంథాలు :**


1. అన్నమాచార్య సంకీర్తనలు - వ్యాజస్తుతి, వ్యాజనింద అలంకార పరిశీలన, డా॥ యర్రదొడ్డి సుభాషిణి, చందన ప్రచురణలు, 2011
2. అన్నమాచార్య సంకీర్తనామృతము - ప్రథమ, ద్వితీయ భాగములు - సముద్రాల లక్ష్మణయ్య, తిరుపతి, 2000
3. అన్నమాచార్య సాహితీ కౌముది - డా॥ మట్టూరి సంగమేశం . తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి, 2003
4. అన్నమాచార్యులు భారతీయ వాగ్గేయకారులు: తులనాత్మక పరిశీలనం- ఆచార్య కె. కుసుమారెడ్డి, హైదరాబాదు, 2007
5. తాళ్ళపాక పదసాహిత్యం I to XXIX - తిరుమల తిరుపతి దేవస్థానములు తిరుపతి, 2003
6. ప్రపత్తి - ఆచార్య దావులూరి కృష్ణకుమారి, నవభారతి ప్రచురణలు, తిరుపతి, 2009
7. భాగవతము
6. సంకీర్తనా సౌరభం - డా॥ పొన్నా లీలావతి, రాజమండ్రి, 2002


***

# అన్నమయ్య పదాలు - పురుషార్థ ఫలాలు

డా॥ వై. పరమేశ్వరయ్య
తెలుగు అధ్యాపకులు
ఎస్.వి. సంగీత నృత్య కళాశాల
తిరుపతి

సంగీత (నాద) సాహిత్య (అక్షర) స్వరూపమైన కీర్తన నిర్మాణం (లిఖిత) చేసిన మొదటి ("తొలుత నెవ్వరికి దొరకనిది" 2-466) వాగ్గేయకారుడు అన్నమయ్య. అందుకే లోకం పదకవితా పితామహుడని ప్రస్తుతించింది. సాహిత్య సంగీత సమ్మిళితమైన కీర్తనతో "సగుణ నిర్గుణము సాక్షాత్కారము" (4-409) పొందాడు. "కలియుగంబునకు గలదిదియే-వెలసిన పంచమ వేదమే గలిగె" (4-2-60) పంచమ వేదంగా చెప్పబడే కీర్తన ప్రాధాన్యతను సమాజానికి తెలియజేయడానికి అవతరించాడు అన్నమయ్య.

పురుషార్థాలను సాధించడానికి "ధర్మార్థకామమోక్షతతులు" 2-426 అయిన తన కీర్తనలు ఉపకరిస్తాయని ప్రకటించాడు. పురుషార్థ ప్రతిపాదితమైన "ఒక్క సంకీర్తనే చాలుమము రక్షింపగ" అని కీర్తన ప్రశంస చేశాడు. ధర్మాచరణతోనే అర్థ కామ మోక్షాలును సాధించాలి. అంటే పురుషార్థాలలో మొదటిదైన ధర్మం, మోక్షం సాధించడానికి ప్రధాన పాత్ర వహిస్తుంది. అట్లే అన్నమయ్య కీర్తనలోని అర్థం పల్లవిలో కేంద్రీభూతమై ఉన్నందువల్ల చరణాలన్నిటికి ఏకవాక్యత కల్గించడానికి ప్రతిచరణం తర్వాత పల్లవి పునరావృతమవుతుంది.

**"పదములు అర్థము పల్లవి**
**వదలక యిన్నిటికినేక వాక్యతసేయన్**
**గుది గ్రుచ్చినట్లు తగులై**
**పదము తుదిన్ మరియు బల్లవియలరున్"**

పల్లవిలో ధర్మాన్ని ప్రతిష్టించి, చరణాలతో అర్థకామ మోక్షలను సాధించడమే అన్నమయ్య కీర్తన ప్రధాన లక్ష్యం. ఏలితివి, కలసితివి, కూడితివి అన్న పదాలు చివరి చరణంలో కన్పిస్తాయి. అంటే జీవాత్మ పరమాత్మలో ఐక్యం కావడమే మోక్షం.

కీర్తనలోని పల్లవి ధర్మంగాను చివరి చరణం మోక్షంగాను మధ్యచరణాలు అర్థకామాదులు గాను ఉన్నట్లు బోధ పడుతుంది. ఈ కీర్తన ద్వారానే మానవుడు జీవిత పరమార్థాన్ని సాధించుకోవాలని సూచించాడు. కీర్తన స్వరూప స్వభావమైన శ్రీ వేంకటేశ్వరుని కీర్తించమన్నాడు.

"నారాయణుడీతడు నరులాల 3-141
మీరు శరణనరో మిమ్ముగాచీని"

"ఈ రచనలనే ఎవ్వరు దలచిన
యిహపరమంత్రము లిందరికి" 1-38

ఆచరణీయం, ఆమోదయోగ్యం, శాస్త్రసమ్మతమైన ధర్మం కీర్తనలో ప్రతిష్ఠించ బడింది ("తల కొని ధర్మము తానై నిలుపుట కలుష విదూరుని గర్వములే" 1-335).

మానవుడు తన జీవిత గమనంలో ధర్మాన్ని ఆచరించడం చాలాకష్టం. అన్నమయ్య కీర్తనలను ఆశ్రయించిన మానవునికి ధర్మాచరణ సాధ్యమవుతుందని తెలిపే సందేశాత్మక కీర్తనలను కొన్నింటిని మాత్రం ఉదాహరణగా ప్రస్తావిస్తాను.

"పరగిన సత్యసంపన్నుడైన వాడు
పరనింద సేయ తత్పరుడు కానివాడు" 1-292

"చలము కోపంబు తను చంపేటి పగతులని
తెలిసినది యదిగదా తెలివి" 1-181

"మనుజుడై ఫలమేది మరిజ్ఞాని యౌదాకా
తను వెత్తి ఫలమైది దయగలుగు దాకా" 1-437

"అనుమానపు బ్రతుకది రోతా తన
మనసెనయని కూటమి మరి రోత" 1-26

"సదాసకలము సంపదలే
తుదతెలియగ వలె దొలగగవలయు" 1-7

"అప్పులేని సంసారమైనపాటే చాలు
తప్పులేని జీతమొక్క తారమైన చాలు" 1-302

"సారె సారె జీవుల చంపకుంటే మేలు
పరకాంతల భంగపరచకుంటే మేలు" 3-562

సత్యం, ధర్మం, భూతదయ, శాంతం కలిగి వుండడం ప్రియంగా మాట్లాడడం, పగ, కోపం, పరనింద, విషయవాంఛ, అత్యాశకు దూరంగా ఉండడం, ఇతరులకు మేలుచేసే గుణం ఉండడం, అపకీర్తి పాలుకాకుండా, అవమాన పడకుండా, అపవాది కాకుండా, స్త్రీలను గౌరవించి బ్రతకాలని కష్టాలు ఆపదలు వచ్చినప్పుడు వాటిని సహించగలిగితే సుఖసౌఖ్యాలు ప్రాప్తిస్తాయని, అప్పులేని జీవనం గడపాలని, తప్పులేని సంపాదన ఆర్జించాలని, జీవహింస చేయకూడదని, తెలియజేస్తున్న పై కీర్తనలు వ్యక్తిత్వవికాసానికి దోహదపడి ధర్మాచరణకు మార్గాన్ని సూచిస్తున్నాయి.

అన్నమయ్య కీర్తనలు సకల సంపదలను ప్రసాదించే మహత్యాన్ని కల్గినవని విశ్వసించడానికి కొన్ని కీర్తనల లోని కొన్ని పాదాలను గమనించవచ్చు.

**సరవి సంపదలిచ్చు సంకీర్తనం**
**సరిలేని దిదియపో సంకీర్తనం** **1-343**

**సిరులొసగే యీ శ్రీ వేంకటేశుడు** **4-298**

**పావనములు అధిక భాగ్యపు సిరులు** **2-88**

**తొలుగుమని దారిద్ర్య దోషంబు చెఋచ** **1-52**

**అంతట దరిద్ర హతపు నిధానము** **4-16**

**అణిమాదిసిరి అంజనాద్రి మీది రూపము** **2-432**

**ముంగిట నల్లదివొ మూలనున్న ధనము**
**భావింప సకల సంపద రూపమదివో** **1-23**

తన కీర్తనలు కోరిన కోర్కెలు తీర్చె శక్తిమంతాలని (కామధేనువు, కల్పవృక్షం) అన్నమయ్య ప్రశంసించిన సందర్భంలో ఉదాహరణకు కొన్ని గమనించవచ్చు.

**"కామధేనువై కలిగె నీ ధరణి"** **2-87**

**"కామధేనువు దేవకల్పితము భువిలోన"** **4-127**

**"కామధేనువిదె కల్పవృక్షమిదె"** **2-488**

**"కావించి కోరికలిచ్చే కామధేనువ" (పొదగంటిమయ్య)**

**"ఎలమి కోరిన వారాలిచ్చే దేవుదే" (వేడుకొందామ)**

**"జగములో కల్ప భూజంబు వలె నుండ** **1-52**

**"అన్ని మంత్రములు యిందే ఆవహించెను" 4-438**

(కోర్కెలు తీర్చె గుణం మంత్రాలకు ఉన్నందువల్ల ప్రస్తావించాను)

తన కీర్తనలు మోక్షప్రదాతలుగా ప్రస్తావిస్తున్న సందర్భంలో "....నీతని సంకీర్తన మోక్షమునకు" (3-63), నళినాక్షుని శ్రీ నామము కలిదోషహరము కైవల్యము" (4-314), "కలిగె నిదె మాకు కైవల్యము" (2-466), అంటూ ప్రశంసించాడు.

మోక్షం అంటే ఏమిటి? అన్న ప్రశ్నకు సమాధానాన్ని సూచిస్తూ, శ్రీ వేంకటేశుని కీర్తనే ముక్తికి మార్గమని తెలియజేస్తున్న క్రింది కీర్తన గమనించదగింది.

**"అరసి వేరొకచో ముక్తదుగవలదు**
**సారపు లౌకిక విమోచనమే ముక్తి"** **2-370**

మోక్షం ఒకచోట దొరికేది కాదని కామితార్థాలను ప్రసాదించే కీర్తన ద్వారా తనలోనే ఉన్న మోక్షాన్ని సాధించవచ్చని తెలియజేస్తున్న క్రింది కీర్తన గమనించ దగింది.

**"కలదందేవో సర్వము గలదు కామితార్థమును గలదు**
**కలదు కలదు శరణాగతులకు హరికైంకర్యంబున మోక్షము గలదు"**

**3-446**

పరబ్రహ్మ స్వరూప స్వభావాన్ని కీర్తనల్లో దర్శించిన అన్నమయ్య పరబ్రహ్మ తత్త్వాన్ని కొనియాడుతూ ఈ లోకంలో ఎక్కువ తక్కువలు లేవని జంతు కులమంతా (సమస్త ప్రాణులు) ఒకటేనని, పంచభూతాలు సమదృష్టి గలవని, ఆకలిదప్పులు, సుఖదుఃఖాలు అన్నినిటికి సమానమని పరబ్రహ్మ స్వరూపమైన శ్రీ వేంకటేశ్వరుడే విశ్వకర్త యని ప్రకటించాడు.

**తందనాన ఆహి తందనాన పురె తందనాన భళా తందనాన**
**బ్రహ్మ మొకటే పరబ్రహ్మ మొకటే పర**
**బ్రహ్మ మొకటే పరబ్రహ్మ మొకటే" 2-385**

ఈ కీర్తన అవగాహన చేసుకున్న వానికి, "విద్యా వినయ సంపన్నే" అన్న భగవద్గీత శ్లోక భావానికి భేదంలేదు. వేదశాస్త్ర పురాణసారం అయిన అన్నమయ్య కీర్తనలను ఆస్వాదించి, జ్ఞానాన్ని సముపార్జించి ధర్మాచరణతో అర్థ కామ మోక్షాలను సాధించాలి.

***

# అన్నమయ్య సంకీర్తనల్లో దశావతార వర్ణనలు

**శ్రీ ఎస్. చంద్రయ్య**
**పరిశోధక విద్యార్థి**
**శ్రీ వేంకటేశ్వర ప్రాచ్య పరిశోధనా విభాగం**
**తిరుపతి**

తాళ్ళపాక పదకవులు శ్రీవేంకటేశ్వరస్వామి వారి పరమ భక్తాగ్రేసరులు. వీరు తమ రచనలన్నింటినీ ఆ స్వామి వారికే అర్పించారు. శ్రీమన్నారాయణుడే శ్రీ వేంకటేశ్వరునిగా ఆనందనిలయంలో కొలువుండి భక్తపరమాణువులను అనుగ్రహిస్తున్నాడని వీరి అచంచల విశ్వాసం. అందువల్ల వారు స్వామి వారిని దశావతారాల్లో కొనియాడారు. ఆయా అవతారాల్లో స్వామి ప్రదర్శించిన లీలా విశేషాలను ప్రస్తుతించారు.

తాళ్ళపాక పదకవులు నృసింహ, రామ, కృష్ణ అవతారాల మీద విడివిడిగా ఎన్నో సంకీర్తనలు రచించారు. ఇవే కాక దశావతారాలను కీర్తించే కీర్తనలు అనేకం

ఉన్నాయి. ఈ వ్యాసం కేవలం దశావతారాలకే పరిమితమై సాగింది. ప్రత్యేక అవతారవర్ణనలను స్పృశించలేదు.

అన్నమయ్య దశావతారాలను వాచ్యంగా స్తుతించలేదు. అందంగా హృద్యంగా వ్యంజించాడు. ఈ దశావతార కీర్తనల్లో వైవిధ్యం, శబ్దసౌందర్యం ఉంది. అర్థగాంభీర్యం కవిత్వపు సొంపు ఉంది. సౌరభాలు ఉన్నాయి.

**హస్తవర్ణనవాజ్యంతో చేసిన కృత్యాల్ని చూపడం :**

దేవాదిదేవతలకు అభయప్రదానం చేసిన చేయి అది! దశావతారాల్లో దుష్టశిక్షణ, శిష్టరక్షణ చేసినప్పుడది నిర్వహించిన పాత్ర అనన్యం. అనుపమానం. అపురూపం.

**"ఇందరికి నభయంబు లిచ్చు చేయి**
**కందువగు మంచి బంగారు చేయి"** **(1-4)**

అని స్వామివారి చేతి చలువను అత్యద్భుతంగా వర్ణించారు. ఆ దొడ్డచేయి చేయని చెయిదములు లేవు, అది -

1) మత్స్యావతారంలో వేదాల్ని తీసుకుని వచ్చింది. 2) కూర్మావతారంలో పాల సముద్రాన్ని చిలికే మందర పర్వతం యొక్క అడుగుభాగాన్ని పట్టుకుంది. 3) వరాహావతారంలో భూదేవిని కౌగిలించుకొంది. 4) నరసింహావతారంలో వాడిగోళ్ళతో హిరణ్యకశిపుని సంహరించింది. 5) అది బలిని పాతాళానికి అణగద్రొక్కడానికి దానమడిగింది. 6) పరశురామావతారంలో క్షత్రియులందరినీ జయించి, భూదానం చేసింది. 7) రామావతారంలో సముద్రానికి సేతుబంధనం గావించింది. 8) బలరామావతారంలో నాగేటిని ధరించింది. 9) బుద్ధావతారంలో పురసతుల మానాన్ని పొల్లజేసింది. 10) కల్కి అవతారంలో తురగాన్ని పరపుతున్నది.

**పరమాత్ముని దివ్యహస్తం ప్రపన్నులైన వారికి అభయము లొసంగేది.**

వైష్ణవ భక్తితత్త్వం దశావతారాలతో అవిచ్ఛిన్న సంబంధాన్ని కల్గిఉంది. అందుకే విశిష్టాద్వైతి అయిన అన్నమయ్య దశావతార మూర్తుల్ని ఎన్నో కీర్తనల్లో వర్ణించాడు. దశావతారాలు అంటే ఎవరెవరు? ఆ అవతారాల్లో బలరామ, బుద్ధులలో ఎవరిని పరిగణన లోనికి తీసుకోవాలి అని చర్చించడం ఈ వ్యాసోద్దేశం కాదు. అన్నమయ్య కొన్నిచోట్ల బలరాముని, మరికొన్నిచోట్ల బుద్ధుని దశావతారాల్లో చేర్చారు. మొత్తం మీద ఆయన దశావతార మూర్తుల్ని ఆధ్యాత్మిక దృష్టితో కీర్తించాడు. అన్నమయ్య తనభక్తి తత్త్వ లోతును 'పల్లవి' లోనే చూపిస్తాడు. ఆయన స్తుతించేది ఎవర్నో మొదట అంతుపట్టదు. అనంతదూరంలో ఉన్న వ్యక్తిని గురించి ప్రారంభిస్తాడు. కానీ తీరాచూస్తే మదిలోని వ్యక్తే. ఆ వ్యక్తి ఎవరంటే ఒకరు కాదు. పది అవతారాల్లో మనకు అంతర్లీనంగా కన్పించే విష్ణుమూర్తి.

**"ఇతనికంటె మరి దైవము గానము యెక్కడ వెదకిన నితడే**
**అతిశయమగు మహిమలతో వెలసెను అన్నిటికాదారము దానె" (3-370)**

అంటూ వరుసగా దశావతార మూర్తుల్ని ఒక్కొక్క చరణంలో స్తుతించాడు. అంతేగాదు దశావతార మూర్తుల్ని నర్మగర్భంగా కీర్తిస్తూ పాడిన కీర్తనలు ఎన్నో కలవు. విష్ణుమూర్తి ఏయే అవతారాల్లో ఏమి చేశాడో ఇలా చెప్పాడు.

**"వింతనానేఁ దనకు వేసాల వాడు**
**కంతునికి గురుడన గలిగినవాడు" (4-352)**

**ఉత్సవాత్మకాలు - దశావతారాలభంగ్యంతర వర్ణనలు :**

తిరుమల ఆలయ శ్రీనివాసునికి సంవత్సరం పొడవునా అనేక ఉత్సవాలు జరుగుతున్నాయి. ఇవి నిత్య, వార, పక్ష, మాస, సంవత్సరోత్సవాలు. ఈ ఉత్సవాలను అన్నమయ్య అనేక సంకీర్తనలలో వర్ణించాడు. వాటిలో దశావతారాలను భంగ్యంతరంగా వర్ణించడం గుర్తించవచ్చు.

**శుక్రవారాభిషేకం :**

సాధారణంగా స్త్రీమూర్తికి శుక్రవారం, పురుషమూర్తికి శనివారం అభిషేకం చేయడం సంప్రదాయంగా కనిపిస్తుంది. కానీ తిరుమల శ్రీనివాసునికి శుక్రవారం అభిషేకం వారోత్సవంగా నిర్వహిస్తారు.

**"పదియుఁ బదియుఁగాను పరమాత్ముఁ డితనికి**
**వెదకి చవులు దెచ్చి విందు లిట్టె సేయరే"**

భగవంతునికి పన్నీటి అభిషేకం, కప్పురధూళి కప్పడం, పునుగు పూయడం వంటివి అభిషేక సమయాల్లో చేసే కృత్యాలు. కానీ. ఆయా అభిషేకాలు చేయడానికి కారణాల్ని అతికిన విధంగా చెప్పడంలోనే అందం ఉంది. పొలసు పారడం, బురద అంటడం, మన్ను మోయడం, రక్తపుమడుగులో దోగడం మొదలైనవి దేహానికి పట్టిన కల్మషాలు, మలినాలు. ఈ మలినం అసహ్యమైయింది. దుర్వాసన యుక్తమైంది. తలచుకుంటేనే రోత కలిగించేది. వీటిని మామూలు స్నానంతోగాక పన్నీటిస్నానంతోనే పూర్తిగా మాయం చేసుకోవచ్చు. పైక్రియలన్నీ మత్స్య, కూర్మ, వరాహ, నారసింహ దశావతారాల్లో చేసిన లోకోత్తరక్రియల్ని స్పష్టం చేస్తాయి.

అన్నమయ్య పదేపదే శ్రీవేంకటేశ్వరునికి దశావతార తత్త్వాన్ని అన్వయిస్తూ సంకీర్తనలు రచించాడు. పొలుసుపై బారెనట అంటూ మత్స్యావతారాన్ని, ఇల మన్ను మోచెనట అంటూ వరాహావతారాన్ని, నెలవైన రాకాసినెత్తుట దోగినాడట అంటూ కృష్ణావతారాన్ని, బాపన జిడ్డంటెనట అంటూ వామనావతారాన్ని, కైపగు నల్లనికోక కట్టినాడంటూ బలరామావతారాన్ని, జెంచుదాని సంగడిదిరిగెనట అంటూ నృసింహావతారాన్ని, కాంతలను గూడాడనడంలో బుద్ధావతారాన్ని అన్నమయ్య పై సంకీర్తనలో మార్మికంగా తెలియజేశాడు.

ఈ కీర్తనల్లో ప్రతి శుక్రవారం జరిగే అభిషేకోత్సవాలు వర్ణించబడ్డాయి. స్వామివారి విగ్రహాన్ని సుగంధతైలంతో అభ్యంజనం చేసి, కుంకుమపూవు మొదలైన వాటిలో నలుగుపెట్టి, పన్నీటితోనూ, శుద్ధోదకంతోనూ జలకంచేసి, ఆరిన తరువాత కర్పూరపు పొడిని చల్లి, దానిపై మంచి సుగంధతైలం దిద్ది ముత్యాల తిరునామం మొదలైన దివ్యాభరణాలను అలంకరించడం తాళ్ళపాక వారికాలం నాటి శుక్రవారపు అభిషేక సంప్రదాయం. అభిషేకానికి సంబంధించిన సంకీర్తనలు తాళ్లపాకవారి సంకీర్తనలలో చాలా కనిపిస్తాయి.

**కర్మసిద్ధాంత ప్రతిపాదన :**

**"ఏమిసేయవచ్చుఁ గర్మ మిచ్చినంతేకాని లేదు**
**తాము సేసినంత వట్టు తమకుఁ బోరాదు"**

పై సంకీర్తనలో కర్మసిద్ధాంతం – దశావతారాలను ఉటంకిస్తూ ఎంతో అందంగా రచింపబడింది. మిట్టిపడటం చేప స్వభావం. వీపు బట్టకట్టేటట్టు మోపు మోయడం కూర్మస్వభావం. త్రవ్వడం వరాహ నైజం. నోరు తెరవడం సింహాన్ని సంకేతిస్తూంది. నరసింహావతారాన్ని ఇది స్ఫురింపచేస్తూంది. ఇలాగే తక్కిన అవతారాలన్నీ!

లోకంలో వ్యక్తులకు సంప్రాప్తించే సుఖాలు తాము చేసుకున్నంత తమకు దక్కుతూ ఉంటాయి. చేపల్లాగా మిడిసిపడినా, తాబేలు లాగా ఎంత మోత మోచినా, వరాహం లాగా పాతాళం వరకు తవ్వుకున్న, సింహంలాగా నోరెంత తెరచుకున్నా శత్రువులను సంహరించినా, అడవులన్నీ తిరిగి అలమటించినా, వనితలను ఎందరినో వలపించుకొన్నా, మెచ్చుల గుఱ్ఱమెక్కి మేరమీర తిరిగినా – ఎవడికి ప్రాప్తించే సుఖాలు వాడికి దక్కుతాయి తప్ప ఎక్కువగా ఏవీ సిద్ధించవు – అనే ఒక వేదాంత విషయాన్ని దశావతార తత్త్వానికి అన్వయించి, అన్నమయ్య మార్మికంగా రచించిన మంచి సంకీర్తన ఇది.

**కీర్తనల్లో పొడుపు కథలు :**

జానపద సాహిత్యంలో పొడుపుకథల కోప్రత్యేకస్థానం ఉంది. కథ పొడవడం, విడవడం, జానపదుల కెంతో ముచ్చటైన సంగతి. ఈ సరదా సంకీర్తనల్లోకి వ్యాపించింది.

**"ఒడలి నిండ కన్నులుండు ఇంద్రుడు కాదు**
**కంఠమందు నలుపు కాదు శివుడు**
**ఘనుల బట్టి చంపు పక్షీంద్రుడును కాదు**
**దీనిభావమేమి తెలుసుకొనుడు"**

ఇలాంటి పొడుపుకథలు అన్నమయ్య సంకీర్తనల్లోకి ప్రాకాయి. దశావతారాలను సైతం ఇలా పొడుపుకథల ద్వారా ప్రశంసించడం శ్లాఘనీయం.

అన్నమయ్య తన వైష్ణవ భక్తితత్వాన్ని ప్రచారం చేయడానికి సంకీర్తనలను ఎన్నుకొని వాటిలో జానపద బాణీలను మేళవించాడు. అందుకే ఆయన కీర్తనలు ప్రజలకు చేరువైనాయి. జానపదుల్లోని పొడుపు కథల ప్రక్రియను కీర్తనలో కలిపి దశావతార తత్వాన్ని ఎలా రంగరించాడో చూడండి.

**"ఎవ్వడో కాని యెరగరాదు కదు**
**దవ్వులనే వుండు తలపులో నుండు"** **(1-74)**

దశావతార మూర్తుల్ని ఒక్కొక్కర్ని ఒక్కొక్క చరణంలో వర్ణిస్తూ అనేక సంకీర్తనలు పాడినా ఆ దశావతారాల్లోని నృసింహ, శ్రీరామ, శ్రీకృష్ణ అవతార దేవతామూర్తులకు ప్రత్యేక ప్రాధాన్యతనిచ్చి ఎన్నో వందల కీర్తనల్లో స్తుతించాడు అన్నమయ్య. ఇలా ముగ్గురు అవతారమూర్తుల్ని వందల సంకీర్తనల్లో కీర్తించి మిగిలినవారిని చరణాల్లో కీర్తించడానికి కారణాలు లేకపోలేదు. నృసింహ, శ్రీరామ, శ్రీకృష్ణులకు ప్రత్యేక క్షేత్రాలున్నాయి. గొప్ప గొప్ప ఆలయాలున్నాయి. ఆయా క్షేత్రాల్లో, దేవాలయాల్లో వీరు అర్చామూర్తులుగా పూజింపబడుతున్నారు. అందువల్ల అన్నమయ్య వారిని ప్రత్యేకంగా ఆయా క్షేత్రాల్ని దర్శించినప్పుడుగాని, ఆయా దేవతల స్ఫురణ కల్గినప్పుడు గాని కీర్తించి ఉండవచ్చు. అయితే తిరుమలలో వరాహస్వామికి, అత్తిరాలలో పరుశురామునికి ప్రత్యేక ఆలయాలున్నాయి కదా అని ప్రశ్నిస్తే అవి ఆయా దేవతామూర్తుల పేరుమీద వెలసిన గొప్ప క్షేత్రాలు కాదు కదా. ఇంకా దశావతార దేవతామూర్తుల ఆలయాలు ఎక్కడైనా ఉన్నప్పటికీ అన్నమయ్య ఆ దేవతామూర్తుల్ని దర్శించక పోవడం వల్ల కీర్తించలేదని తెలుస్తోంది.

1) రెక్కలున్నప్పటికీ అవి ఎగరడానికి ఉపయోగపడవు. - మత్స్యావతారం.
2) దాగి ఉంటాడు గాని దొంగకాదు - కూర్మావతారం.
3) క్రింద పడతాడుగాని సేవకుడు గాదు - వరాహావతారం
4) గోళ్ళు పెంచుతాడు గాని విటుడు కాడు - నరసింహావతారం.
5) పొట్టివాడేకాని ఆకాశాన్ని మించిన పొడగరి - వామనుడు.
6) వేషమేమో తపసి...స్వభావమేమో కలహించడం - పరశురాముడు.
7) స్త్రీకోసం పోరాడతాడు అయితే విషయలంపటుడు కాడు - శ్రీరాముడు.
8) చేసేది రౌతుపని...అంతా తెల్లదనం - బలరాముడు.
9) స్త్రీలను వలపిస్తాడే కానీ తానా వలపుల గురికానివాడు - బుద్ధుడు.
10) గుర్రాన్ని నడుపుతాడుకాని రౌతు కాదు - కల్కి అవతారం.

సృష్టికర్త అవాఙ్మమానసగోచరి తత్త్వాన్ని అన్నమయ్య అవతార తత్త్వాలకు అనుసంధించి, ఈ దశావతార కీర్తనలో చమత్కరిస్తాడు. అతను మానసంలోనే దాగుకొని ఉంటాడు కానీ దొంగకాడు. భక్తులకు లొంగి ఉంటాడు కానీ సేవకుడు గాదు. వాడి అయినగోళ్ళు పెంచుకొని ఉంటాడు గానీ విటుడు గాదు. చాలా అల్పుడుగా అంతుపట్టడు. తరుణులను వలపించు కొంటాడు గానీ తగులముల జోలికిపోడు. గుఱ్ఱంపై విహరిస్తూ ఉంటాడు గానీ, అతను రౌతు కాదు అంటూ భగవంతుని వైవిధ్యభరిత తత్త్వాన్ని వేంకటాద్రిపై ఉన్న తిరుమలేశునికి ఆపాదిస్తూ ఇలా సంచరించే దేవుడు ఇక్కడ నిశ్చలంగా నిలబడి ఉన్నాడంటాడు.

***

# అన్నమయ్య - వేమన

**డా॥ జి. పార్వతి**
**అసిస్టెంట్ ప్రొఫెసర్**
**తెలుగుశాఖ**
**యోగివేమన విశ్వవిద్యాలయం, కడప**

ఆంధ్ర అనుంగు సంతానంగా అసంఖ్యాకులు ప్రసిద్ధి వహించారు. వారిలో తమ రచనా కుసుమాలతో ఆంధ్ర జనని అభిషేకించి, అలరించిన వారి అనుపమయశఃకాయులు ఎందరో. అలాంటివారిలో నిత్య స్మరణీయులుగా పరిగణింపదగినవారు ఇద్దరు. వారే అన్నమయ్య, వేమన.

అన్నమయ్య, వేమనలిద్దరు కడప జిల్లాకే చెందినవారిగానే భావింపబడుతున్నారు. తాళ్ళపాక అన్నమాచార్యులు బ్రాహ్మణుడు. వేమన కాపు కులస్తుడని తెలుస్తూ ఉంది. అన్నమయ్య అనుపమ విష్ణుభక్తుడు. వేమన భక్తి గురించి తెలుసుకొనేందుకు స్పష్టమైన ఆధారాలు కనిపించడంలేదు. వీరిద్దరిలోనూ తాత్వికచింతన మెండుగా ఉన్నట్లు వారి రచనలను బట్టి తెలుస్తున్నది. అన్నమయ్య, వేమన పదాలలోనూ, దృక్పథాలలోనూ ఎంతో వైవిధ్యం ఉన్నప్పటికీ మౌలికత కూడా మనసుకు ఆకట్టుకునేలా ఉంది. అన్నమయ్య, వేమన ప్రతిపాదన కాంతిరేఖలను తులనాత్మకంగా పరిచయం చేసేందుకు ఈ పత్రం ప్రయత్నిస్తుంది.

**నీతి:**

ఈవిధంగా నడుచుకోవాలి, ఈవిధంగా నడుచుకోకూడదని మనిషికి నియమాన్ని విధించేదే నియతి. అది నీతిగా ఖ్యాతి వహించింది. స్వీయ అనుభవాలు, ఇతరుల

అనుభవాలు, లోకరీతులు, నీతులకు ఆధారం. కవులు, వాగ్గేయకారులు నీతులకు ఆధారం. కవులు, వాగ్గేయకారులు తమకు తెలిసినవాటిని ఇతరులకు బోధించి వారి బుద్ధి వికాసానికి తోడ్పడ్డారు.

అన్నమయ్య కీర్తనల్లో భక్తిపరిమళిస్తున్నప్పటికీ, విష్ణు ఘనత విలసిల్లుతున్నప్పటికీ, నీతులు, లోకరీతులు అధికంగానే అలరిస్తున్నాయి. అన్నమయ్య దృష్టిలో అప్పులు, తప్పులు అపాయకరాలే. కానీ అపేక్షించదగినవి కావు, ఉపేక్షించదగ్గవి కావు. చిన్న ఇల్లైనా కంతలేకుంటే చాలని అన్నమయ్య అభిప్రాయం. ఇలాగే వివిధ అంశాలకు చెందిన అనేక నీతులను, రీతులను తెలియజేశాడు.

**"అప్పులేని సంసారమైనపాటే చాలు**
**తప్పులేని జీతమొక్కతారమైనఁజాల"** (అధ్యాత్మిక సంకీర్తన 1-14)

వేమన పద్యాల్లో దాదాపు అన్నీ నీతులే, లోకరీతులే. మూర్ఖుడికి ఎంత చెప్పినా గ్రహించలేడు. పైగా చెప్పిన వారిమీద విరుచుకపడతాడు. ఇది సమంజసం కాదు. ఇతరుల నుంచి గ్రహించి తగినవిధంగా మసలుకోవడమే తగవు అని వేమన ధ్వనింపజేశాడు. పెద్దల మాటను పెడచెవిన పెట్టేవారిని పశుప్రాయులని దుయ్యబట్టాడు. వారికి మంచి చెప్పినా చెడుగానేపరిగణిస్తారని వేమన విమర్శించాడు.

**"తనదు మేలు గోరి ధర్మంబు చెప్పిన**
**దిట్టు చంద్రుమొరకు లెట్టయెదుట**
**గద్దివేయ పోట్లగొద్దు కొమ్మాడించు**
**విశ్వదాభిరామ వినురవేమ"**

ఉపకారం చేసిన వారికి ప్రత్యుపకారం చేయడం మంచి సంస్కారమే కాని గొప్ప సంగతి కాదు. అపకారం చేసిన వారికి కూడా ఉపకారం చేయడం అభినందనీయమైన అనుపమ సద్గుణం. ఈ అంశాన్ని సుమతి శతకకారుడు చక్కగా తెలియజేశాడు.

**"ఉపకారికి నుపకారము**
**విపరీతముగాదు చేయ వివరింబపంగా**
**నపకారికి నుపకారము**
**నెపమెన్నక చేయువాడు నేర్పరి సుమతీ"**

ఈ అంశాన్నే వేమన కొంత ముందుకువెళ్ళి చెప్పాడు. శత్రువు చంపదగిన వాడైనప్పటికీ అతనికి మేలు చేయడమే సముచితమన్నాడు.

**"చంపదగినయట్టి శత్రువు తనచేత**
**చిక్కినేని కీడు చేయరాదు**
**పొసగమేలుజేసి పొమ్మనుటే చాలు"**

ఎప్పుడూ విడవని పట్టుదల, గుప్తదానం, అజ్ఞాని సేవావిముఖత ప్రశంసనీయ కృత్యాలని వేమన ప్రగాఢ విశ్వాసం ఈ శతకంలో ఉద్ఘాటించాడు.

**"పట్టి విడువరాదు పదిలక్షలకునైన**
**పెట్టి చెప్పరాదు పేదకైన**
**వెట్టి కొలువరాదు విభుడెట్టి ఘనుడైన"**

(లోకకవి వేమన, పుట - 232, పద్యం - 1082)

**కులం :**

సమాజంలో మొదట వ్యవహార సౌలభ్యం కోసమే ఏర్పడిన కులాలు, మనిషికి మనిషికి మధ్య ఉక్కుతో నిర్మింపబడిన అడ్డుగోడలా తయారైంది. కులాలను అడ్డం పెట్టుకొని స్వప్రయోజనాపరులెంతో స్వైరవిహారం చేశారు. సామాజిక జీవితాన్ని గందరగోళం చేశారు. విజ్ఞులు, విషయజ్ఞులు కులవ్యవస్థను కూకటివేళ్ళతో పెకలించి నశింపజేయాలన్నారు. జాతి వివక్షత ఎంతో రోత అని అన్నమయ్య అభిప్రాయం. జాతిభేదాలు శరీరగుణాలు. శరీరాలు నశించగానే జాతులు కూడా నశిస్తాయి. కాబట్టి జాతుల పట్టుకుప్రేలాడడం అవాంఛనీయం, హాస్యాస్పదం అని అన్నమయ్య అభిప్రాయం.

హరిభక్తి లేని సోమయాజి కంటే హరి భక్తి కలిగిన హరిజనుడే ఘనుడన్నాడు. సర్వేశ్వర భక్తిలేని సన్యాసికంటే, అనంతుని అన్వేషించే అంత్య కులజుడే అధికుడని అన్నమయ్య అభిప్రాయం. 'కులం కంటే గుణమే ప్రధానమని' కుల ప్రస్తావన హాస్యాస్పదమని తన రచనల ద్వారా అన్నమయ్య వెల్లడిచేశాడు.

**"విజాతులన్నియు వృథా వృథా.**
**అజామిళాదుల కదియే జాతి"** (2-383)

కులం ప్రధానం కాదు. గుణం ముఖ్యమని మిక్కిలి చక్కగా వివరించాడు అన్నమయ్య.

**"ఎక్కువ కులజుడైన హీనకులజుడైన**
**నిక్కమెరిగిన మహానిత్యుడే ఘనుడు"** (అధ్యాత్మిక సంకీర్తన 1-318)

**"ఏ కులజుఁడేమి యెవ్వఁడైననేమి**
**ఆకడ నాఁతడె హరినెఱిఁగినవాఁడు"** (అధ్యాత్మిక సంకీర్తన 1-292)

కుల వ్యవస్థ నశింపజేసి విశ్వమంతా ఏకకులంగా విలసిల్లేటట్లు చూడమని వేమన విజ్ఞప్తి.

**"ఉర్విజనులకెల్ల నొక్క కంచముబెట్టి**
**పొత్తుగుడిపి కులము పొలయుజేసి**
**తలను చేయిబెట్టి తగనమ్మజెప్పరా**
**విశ్వదాభిరామ వినురవేమ"** (లోకకవి వేమన, పుట-104, పద్యం-210)

బ్రహ్మ సృష్టిని పరికిస్తే కులాలన్నీ ఒకేవిధంగా ఏర్పడ్డాయని అందువల్ల అందరూ అన్నదమ్ములుగానే పరిగణింపదగ్గవారని వేమన విశ్వాసం.

**"పరగ బొమ్మగుడ్డ పరికించి చూచిన**
**కులములన్ని అందెకూడిపుట్టి**
**నందరొకటి కలియ నన్నదములెకదా**
**విశ్వదాభిరామ వినురవేమ"** (లోకకవి వేమన, పుట-185, పద్యం-777)

హరిజనులు అస్పృశ్యులుగా పరిగణించబడుచున్నారు. అది హాస్యాస్పదమని వేమన భావించాడు. సహేతుకంగా దాన్ని ఖండించాడు.

**"మాలవానినంటి మరి నీట మునిగేరు**
**కాటికేగునపుడు కాల్చుమాల**
**అప్పుడంటిన యంటు ఇప్పుడెందేగెనో**
**విశ్వదాభిరామ వినురవేమ"**

**వైరాగ్యం :**

మానవునికి సుఖదుఃఖాలు మారి మారి వస్తూ ఒత్తిడిని పెంచుతూ ఉంటాయి. ఒత్తిడి నుంచి బయటపడాలని ప్రతివారూ అనుకుంటారు. శరీరాద్యవస్థలు ఉండే వరకు ఒత్తిడి తప్పదు. అందువల్ల అందరూ మోక్షాన్ని కాంక్షిస్తారు. మోక్షసాధనలో ముఖ్యాంగాలుగా పరిగణింపదగినవి భక్తి, జ్ఞాన, వైరాగ్యాలు. వైరాగ్యం అన్నింటికంటే ప్రధానమైనది. విరాగం యొక్క భావమే వైరాగ్యం. స్త్రీలపట్ల, ధనధాన్యాదులపట్ల, గృహ వసతి మొదలైన సంపదపట్ల ఆసక్తి లేకుండా ఉండడమే వైరాగ్యం. వైరాగ్యాన్ని ఆశ్రయించి ఐహిక సుఖాలను తృణప్రాయంగా భావించి దైవాన్ని ఆశ్రయిస్తారు. ఈ వైరాగ్యాన్ని ఎంతోమంది కవులు శ్లాఘించారు.

సతులు, సుతులు, హితులు, ఇతరులు బంధప్రాయులేకాని ఉపయోగపడేవారు కాదు. వీరిపట్ల గల స్పృహ విసర్జించి వేంకటేశ్వరుని శరణు కోరడమే కర్తవ్యమని అన్నమయ్య సూచించాడు. ఈ కీర్తనలో వైరాగ్యంపాలు ఎక్కువ :

**"అయ్యో పోయఁబాయము గాలము**
**ముయ్యంచు మనసుననే మోహమతినైతి"** (అధ్యాత్మక సంకీర్తన 1-179)

వేమన స్త్రీ సౌఖ్యవైముఖ్య పరమార్థాన్ని పొందవలసిందిగా పరోక్షంగా సూచించాడు. స్త్రీల మాయవల్ల ఉన్నతగతులు పొందలేరని వేమన హెచ్చరించాడు. వారిపట్ల జాగ్రత్తగా మసలుకోమని ధ్వనింపజేశాడు.

**"సతుల మాయనమ్మి సౌఖ్యంబు గలదను**
**మతిహీనులైరి మనుజులెల్ల**
**గతులు సతులవలన కానంగలేరయా**
**విశ్వదాభిరామ వినురవేమ"** (విశ్వకవి వేమన, పుట-220, పద్యం-997)

స్త్రీ సౌందర్యానికి ముగ్ధుడై వెంటబడుతున్నారేతప్ప ఆమె శరీరంలో ఉన్న ఏహ్య పదార్థాన్ని ఎవ్వరూ పట్టించుకోలేదని వేమన విమర్శించాడు.

**"కాంతమేను జూచి కలవరపడెదరు**
**కడపులోని రోతగానలేక**
**ఇంతరోతగల్గు నీదేహమేలరా**
**విశ్వదాభిరామ వినురవేమ"** (లోకకవి వేమన, పుట-222, పద్యం-1025)

**తాత్త్వికం :**

ఆధ్యాత్మికంగా ఆలోచించగల మహాకవులు అందరికీ అర్థంకాని విధంగా తత్త్వబోధ చేస్తారు. ఇవి పైకి ఒక అర్థంలోనూ, అంతరంలో మరో అర్థంలోనూ ఉంటాయి. అన్నమయ్య సంకీర్తనల్లో తాత్త్విక ధోరణిని ఆవిష్కరించే అనేక సంకీర్తనలు కన్పిస్తాయి. హంస వైభవాన్ని ఆవిష్కరించే ఈ సంకీర్తన ఆలోచనకు పదునుపెడుతూ ఉంది.

**"దిబ్బెలు వెట్టుచుఁదేలిన దిదివో**
**ఉబ్బు నీటిపై నొక హంస"** (అధ్యాత్మక సంకీర్తన 1-16)

వేమన త్రిమూర్తులకు సంబంధించి రాసిన పద్యంలో తత్త్వచింతన కన్పిస్తుంది.

**"బ్రహ్మజంపి విష్ణుభాగంలోగల్పి**
**విష్ణుజంపి శివుని వెలయగలిపి**
**శివుని జంపి తాను శివయోగి కావలె**
**విశ్వదాభిరామ వినురవేమ"** (పద్యం - 235)

జంగం ఎవరో, యోగి ఎవరో, సుజ్ఞాని ఎవరో తాత్త్విక ధోరణిలోనే వేమన తెలియజేశాడు.

**"కుక్కదిన్నవాడు గురులింగ జంగంబు**
**పంది దిన్నవాడు పరమయోగి**
**ఏన్గుదిన్నవాడు ఎంత సుజ్ఞానిరా**
**విశ్వదాభిరామ వినురవేమ"** (పద్యం - 1168)

**అత్యాచారం :**

అన్నమయ్య కాలంలో అత్యాచారాలు జరిగాయి. దుష్కృత్యాలు సాగాయి. వీటిని ఖండిస్తూ అన్నమయ్య సంకీర్తనలు అనేకం. ఆయా భీభత్స దృశ్యాలను అన్నమయ్య అద్భుతంగా చిత్రించాడు.

**"హీనదశలఁబొంది యిట్లనుండుటకంటె**
**నానా విధులను నున్ననాఁడే మేలు"** (అధ్యాత్మక సంకీర్తన 1-3)

స్త్రీలను అపహరించడం, అత్యాచారాలు సాగించడం వంటి దుష్కృత్యాలను వేమన తీవ్రంగా నిరసించాడు. కీచకుడు పడినపాటును, రావణ వినాశనాన్ని గుర్తుచేశాడు. తద్వారా వారి మార్గంలోనే పయనించేవారికి చేటు తప్పదని ధ్వనిపూర్వకంగా హెచ్చరించాడు.

**"కోరి ద్రుపదుపట్టి కొప్పుబట్టీడ్చిన**
**సింహబలుని చావు చెప్పదరమే**
**ముగియు కాలమునకు మొనగాడు నీల్గడా"**
(లోకకవి వేమన, పుట - 130, పద్యం - 389)

**"లంకయేలినట్టి లంకాధిపతి పురి**
**పిల్లకోతి ఫౌజు కొల్లబెట్టె**
**చేటుకాలమునకు చెరుప సల్పులె చాలు"** (లోకకవి వేమన, పుట-113)

నిష్కారణంగా దుర్బలులను హతమార్చడం, వారి సొమ్ములను దోచుకోవడం మంచిది కాదని కూడా వేమన స్పష్టం చేసాడు.

**"కరకంఠుని చాపము వలె**
**పరగౌతము శాపమట్లు వర్తిల్లంగా**
**చిరకష్టజీవులై తగునరులును**
మదినొచ్చి తిట్ట నాశము వేమా"** **(లోకకవి వేమన, పుట - 114)**

అన్నమయ్య సామాన్య ప్రజలను దృష్టిలో పెట్టుకొని వారి భాషను, యాసను, శ్వాసను ప్రతిబింబించేవిధంగా ఎన్నో కీర్తనలు రచించి కీర్తికాయుడయ్యాడు. వేమన తాను చెప్పదలుచుకున్న దాన్ని ప్రజల భాషలోనే సులభంగా అర్థమయ్యేలా పద్యాలు రచించి ప్రజాకవిగా ప్రసిద్ధుడయ్యాడు. ఇద్దరి రచనల్లోనూ కడప జిల్లాగాలులకు స్థానం ఉంది. ఇద్దరూ మానవత్వాన్ని అభిమానించి, ఆరాధించినవారే. దౌష్ట్యాన్ని వేడి వాడి మాటలతో నిరసించినవారే.

**ఆధార గ్రంథాలు :**


1. ఆధ్యాత్మిక సంకీర్తనలు : తాళ్లపాక అన్నమాచార్య 1 నుంచి 3 సంపుటాలు.
2. లోకకవి వేమన : కళాప్రపూర్ణ మరుపూరు కోదండరామిరెడ్డి.
3. విశ్వకవి వేమన : గుర్రం వెంకట రెడ్డి, పోచన రామిరెడ్డి.
4. అన్నమాచార్య సంకీర్తన సుధ : ఆచార్య ఎస్. గంగప్ప.


***

# అన్నమయ్య - నవవిధ భక్తి వైశిష్ట్యం

**డా॥ టి. సునీత**
**అధ్యాపకులు**
**వాణిజ్య విభాగం**
**శ్రీ పద్మావతి మహిళా డిగ్రీ మరియు పి.జి. కళాశాల**
**తిరుపతి**

వేదార్థాలను సంకీర్తనలుగా గానంచేసి పండితులనే కాక పామరులను కూడా పరవశింపజేసిన మహానుభావుడు తాళ్ళపాక అన్నమయ్య. జీవిత పరమార్థాన్ని తాను చవిచూచి ఇతరులకు కూడా దాని రుచి అందించాలన్న దృష్టితో ఆయన వేలకొలది పదాల ద్వారా భగవత్తత్త్వాన్ని ప్రచారం చేశాడు.

క్రీ.శ. 15వ శతాబ్దము తెలుగు వాఙ్మయ చరిత్రలో ప్రబంధాలు వెలువడుతున్న సమయం, ఆ దశలో తేట తెలుగులో శ్రీ వేంకటేశ్వరునిపై కీర్తనలు రచించి ఆనాటి రాజుల, ప్రజల మన్ననలను పొంది పదకవిగా గుర్తింపు పొందినవాడు అన్నమయ్య, శఠగోపముని వద్ద వేదాంత రహస్యాలను అభ్యసించిన అన్నమయ్య సకల వేదసారాన్ని సంకీర్తనలుగా రచించినాడు. అన్నమయ్య సంకీర్తన రచనా నైపుణ్యం అద్భుతం, అనుపమానం. అన్నమయ్య సంకీర్తనల్లో మనకు ఏం కావాలో అది లభిస్తుంది. చూసే చూపును బట్టి అన్నమయ్య సంకీర్తనలు మనకు సమాచారాన్ని అందిస్తాయి.

ఎవరైనా తననుతాను, తానుగా తెలుసుకోవటమే గొప్ప విద్య. అదే ఆత్మజ్ఞానం. భగవంతుడు రూపం ధరిస్తే అది జగత్తు. ఈ జగత్తు రూపరహితమైతే భగవంతుడు. అరూపం, రూపం కావడమే ఈ సృష్టి వెనుక దాగిన రహస్యం. ఈ రహస్యాన్ని ఛేదించటానికే మన ఋషులు భక్తి, జ్ఞాన, కర్మ యోగాలు మార్గాలుగా సూచించారు. మూడు మోక్షానికి తెరువులే. సాధకుని సామర్థ్యాన్ని బట్టి ఆ మూడింటిలో ఒకటి ఎంచుకోవటమో, లేకుంటే ఈ మూడింటిని సోపానాలుగా, దశావస్థలుగా చేసుకుని ఎదగడమో కనిపిస్తుంది. భక్తి, జ్ఞాన, కర్మ మార్గాలలో ఏదైనా సరే సాధన చేయడంలో సాధకుని ప్రయత్నం యొక్క తీవ్రతను బట్టి గమ్యం చేరువవుతుంది. ప్రతి యోగంలోను ఆత్మసాక్షాత్కారాన్ని కలిగించే బీజం దాగి ఉంది. మోక్ష సిద్ధి అణురూపంలో అణిగి ఉంది.

భగవంతుడు అంతటా ఉన్నాడు. నామ రూపాత్మకమైన జగత్తుకు ఆధారమై సచ్చిదానందమయుడై ఉన్నాడు. కనుక పరమాత్మను సామాన్య మానవులు దర్శించలేరు. అందువలన మహాత్ములైన మహర్షులు సాధకుల క్షేమం కోసం భగవంతునికి ఒక రూపాన్ని, ఒక నామాన్ని కల్పించారు. భగవంతునికి తాము

కల్పించిన రూపాన్ని ఒక ప్రదేశంలో స్థాపించి, షోడశోపచారాలతో పూజించడం నేర్పారు. దీనివలన చిత్తం ఏకాగ్రమై, చిత్తం పరిశుద్ధమై జ్ఞానం ప్రాప్తించేందుకు వీలు కలిగింది. భక్తిమార్గంలో ఇది ప్రారంభసాధన.

భక్తికి చిట్టచివరి ఫలం మోక్షం లేక ఆత్మసాక్షాత్కారం. ఇది ఆధ్యాత్మికం! వైయక్తికం! దీనితోపాటు బాహ్య సంబంధాల నుండి (Attachments), విముక్తి (Liberation). కాబట్టి భక్తి ఒక భావంగా, ఒక తత్త్వంగా, ఒక యోగంగా, ఒక రసంగా ఇలా ఎన్నోరకాలుగా పరిణమించింది. జ్ఞానానికి తల్లి భక్తి, అందువల్లనే భక్తిని 'జ్ఞానగర్భిణి' అని అన్నారు. అన్నమయ్యకు పూర్వమే భక్తి ఒక భావంగా, తత్త్వంగా, యోగంగా మహాకవులచే నిరూపింపబడింది. పాల్కురికి సోమన వీరశైవభక్తిని, పోతనామాత్యుడు వైష్ణవ భక్తిని బహుముఖాలుగా నిరూపించారు. విశేషించి భక్తిని ఒక రసత్వ స్థాయికి తీసుకొని రావడంలో అన్నమయ్య చూపిన మౌలిక ప్రజ్ఞ విస్తృతమైనది. అన్నమయ్య ప్రథమాంధ్ర వాగ్గేయకారులుగా, శ్రీపతి పదభక్తిని పదసాహిత్యంలో నిరూపించిన 'భక్తి' కూడా రసప్రధానమైనది.

భక్తియొక్క పరమార్థం భగవంతుని 'కరుణ'ను పొందడమే. తత్ఫలితంగా భగవంతునిలో లీనం కావడమే లేదా ఆనందస్వరూపమైన పరమాత్మ యందు కలిసి దుఃఖం ఏమాత్రములేని ఆనందస్థితిలో వుండిపోవడమే. భగవంతుడు ప్రేమమయుడు. 'భక్తి అంటే భగవంతునిపైనున్న ప్రేమే'.

**అన్నమయ్య అనన్య భక్తి**

అన్నమయ్య పుట్టుకతో 'అద్వైతి'యైనా, శ్రీ వైష్ణవ దీక్షను స్వీకరించినా, ఆయన భక్తిమార్గం అత్యంత విలక్షణమైనది. పోతన భాగవతాన్ని ప్రారంభిస్తూ 'శ్రీ కైవల్యపదంబు జేరుటకునై చింతించెదన్' అని తన ఆధ్యాత్మ చింతనను ప్రకటించగా - అన్నమయ్య

**"కలిగె నిదె మాకు కైవల్యము"**

**ఎన్నడూ ఎవరికీ దొరకనిదీ!** అని విస్పష్టంగా కైవల్యప్రాప్తి అయిందని చెప్పాడు. అన్నమయ్య తన భక్తిమార్గం 'నవ్యమార్గం' అంటూ -

**"నడవరో జలియక నవ్యమార్గమిదె**
**మదుంగిది వైష్ణవ మార్గమిదె"**

అన్నమయ్య భక్తిమార్గానికి స్ఫూర్తిదాతలు, మార్గదర్శకులు వీరు : 1. శుకుడు 2. జనకుడు 3. సనత్కుమారుడు 4. మనువులు 5. వశిష్ఠుడు 6. వేదవ్యాసుడు 7. ధ్రువుడు. భాగవత భక్తిమార్గానికే అన్నమయ్య పెద్ద పీట వేశాడు. 'భాగవతం శ్రవణం చేతనే ముక్తినిచ్చేది', ఆ విధంగా అన్నమయ్య పాటలు కూడా విన్నంతనే 'శ్రీ వేంకటేశు పదములు చూపేది' అన్న భావన కలుగుతుంది.

అన్ని భక్తిమార్గాలకు కీలకమైన మంత్రమొక్కటే, అదే శ్రీ వేంకటేశు మంత్రము.

**"అన్ని మంత్రములు నిందే యావహించెను**
**వెన్నతో నాకు గలిగె వేంకటేశు మంత్రము".**

మొదటి కీర్తన 'నవ్యమార్గం'లో చెప్పిన – 'గురుమార్గంబిదె గోప్యమిదె' అనే పాదంలో గురుపాదం అంటే రెండర్థాలు వస్తాయి : 1. గొప్ప మార్గము, ఘనమార్గము, 2. గురువైన ఘన విష్ణువు చూపిన వైష్ణవ భక్తిమార్గము.

ఈ విధంగా వైష్ణవభక్తియే, శ్రీ వేంకటేశ్వర మంత్రమే తనకు సకలశాస్త్రాలు, సంధ్య, జపం, బ్రహ్మవిద్యోపాసన (గాయత్రీమంత్రం), దుఃఖవిరహిత మార్గంగా అభివర్ణించాడు అన్నమయ్య.

**"ఇదియె తిరు వేంకటేశ్వర సంస్మరణ**
**ఇదియె ఇదియె ఇన్నియు నటుగాన"**

అని అన్నమయ్య శ్రీ వేంకటేశునిపై తనకుగల 'అనన్యభక్తి'ని నిరూపించాడు.

**భక్తి రకాలు**

భక్తి రకాల గురించి భిన్న అభిప్రాయాలు వ్యాప్తిలో ఉన్నాయి. గుణభేదాలనుబట్టి భక్తి మూడు రకాలు :– సాత్త్విక భక్తి, రాజసభక్తి, తామసభక్తి. శ్రీ కృష్ణ భగవానుడు నాలుగురకాల భక్తుల గురించి తెలియజేశాడు. ఆర్తుడు, జిజ్ఞాసువు, అర్థార్థి, జ్ఞాని. ఆ నలుగురూ కృష్ణుడు పేర్కొన్న భక్తులు. నారదుడు పదకొండు రకాల భక్తిని పేర్కొన్నాడు. విజ్ఞాన సర్వస్వం ఐదురకాల భక్తిని పేర్కొంది. అవి 1. శాంత భక్తి, 2. దాస్య భక్తి, 3. సఖ్య భక్తి, 4. వాత్సల్య భక్తి, 5. మధుర భక్తి. అన్నమయ్య కూడా పదకొండు రకాల భక్తిభేదాలను పేర్కొంటూ ఒక కీర్తన రచించాడు.

**"నానా భక్తులివి నరుల మార్గములు**
**యే నెపానైనా నాతడియ్య కొనుభక్తి"**

ఈ కీర్తన ద్వారా అన్నమయ్య వెల్లడించిన భక్తిరకాలు (ఉన్మాదభక్తి, పతివ్రతా భక్తి, విజ్ఞానభక్తి, ఆనందభక్తి, రాక్షస భక్తి, తురియభక్తి, తామసభక్తి, వైరాగ్య భక్తి, రాజస భక్తి, నిర్మలభక్తి, నిజభక్తి).

**నవవిధ భక్తి మార్గాలు**

నవవిధ భక్తి మార్గాలను తెలియజేసే సంస్కృత శ్లోకం ప్రహ్లాదుడు పేర్కొన్నాడు.

**శ్రవణం, కీర్తనం విష్ణోః స్మరణం పాదసేవనం ।**
**అర్చనం వందనం దాస్యం సఖ్యమాత్మ నివేదం ॥**

ప్రహ్లాదుడు పేర్కొన్న భక్తి రకాలు శ్రవణ భక్తి, కీర్తన భక్తి, స్మరణ భక్తి, పాదసేవన భక్తి, అర్చన భక్తి, వందన భక్తి, దాస్య భక్తి, సఖ్య భక్తి, ఆత్మనివేదనాభక్తి.

అన్నమయ్య రచించిన కీర్తనలన్నిటిలోను భక్తి తొణికిసలాడటం నిర్వివాదాంశం.

## 1. శ్రవణం

భాగవతం ప్రతిపాదించిన నవవిధ భక్తిమార్గాల్లో శ్రవణ భక్తి ప్రథమం, ప్రధానం. ఆరాధ్య దేవతల మహిమలను, లీలలను, గుణాలను, ఘనతను వినడం శ్రవణ భక్తి లక్షణం. భక్త రక్షణకోసం భగవంతుడు ఈ లోకంలో వివిధరూపాలలో జన్మించి, భక్తులను కాపాడిన వైనం, అందుకోసం ఆయన ప్రదర్శించిన లీలలు వినడం వలన భగవంతుని ఉనికిపై విశ్వాసం, ఆయనపై భక్తిశ్రద్ధలు కలుగుతాయి.

ఉపనిషత్తులు కూడా "ఆత్మవా అరే । శ్రోతవ్యః మంత్రవ్యః, నిధిద్యాసితవ్య" అని శ్రవణానికి మిక్కిలి ప్రాధాన్యత ఇచ్చింది. ఆత్మసాక్షాత్కారం కోసం చేసే సాధనల్లో శ్రవణం, మననం, నిధి ధ్యాసలనేవి మూడు అతి ప్రాధాన్యతను సంతరించుకున్నవి. వ్యయప్రయాసలు లేని శ్రవణ భక్తిని అలవరచుకోవడం ఏమంత శ్రమతో కూడిన పనికాదు.

శ్రవణ భక్తిని అనుసరించి, సిద్ధిపొందిన వారిలో పరీక్షిత్తు అనబడే కురువంశ సార్వభౌముడు ఎన్నదగినవాడు. విష్ణుకీర్తన వినని వీనులు ఎంత వ్యర్థమైనవో కూడా భాగవతం వాక్రునిచ్చింది.

**"విష్ణుకీర్తనములు వినని కర్ణంబులు**
**కొండల జిలములు కువలయేశ"**

అన్నమయ్య సౌభాగ్యకరమైన విష్ణుకథను విని తరించుమని విశ్వజనులను ఉద్బోధించాడు. వైనుబలమనేది విస్పష్టం చేశాడు.

**"వినరోభాగ్యము విష్ణు కథ**
**వెనుబలమిదివో విష్ణుకథ"**

## 2. కీర్తనం

కీర్తించడం అంటే పొగడడం, కొనియాడడం, వినుతించడం, భగవత్ కీర్తిని గానం చేయడమే కీర్తనభక్తి ప్రధాన లక్షణం. కనుక భగవంతుని భవ్యగుణాలను కొనియాడడం కీర్తనం అవుతుంది. గొంతెత్తి గానం చేయడం కీర్తనం అవుతుంది. స్తోత్రపాఠాలు, సహస్రనామ పారాయణాలు, భగవల్లీలలను హరికథలుగా గానం చేయడం ఇవన్నీ కీర్తనం క్రిందికే రాగలవు. కీర్తనం అనబడే భక్తిమార్గాన్ని ఆశ్రయించి, కడతేరిన వారిలో శుకమహర్షి ఎన్నదగినవాడు. తుకారాం వంటి సంకీర్తన పరాయణులు పెక్కురు హరి కరుణకు పాత్రులు కాగలగినారు. కీర్తనం చేసినవాడు తాను కృతార్థుడు కావడమేకాక, శ్రవణం చేసినవారిని కూడా కృతార్థులను చేయగలడు. వైకుంఠుని కొనియాడని వక్త్రాన్ని వక్త్రమనడంకంటే ఢక్క అనడం సమంజసమని ప్రహ్లాదుని అభిప్రాయం.

"వైకుంఠు బొగడని వక్త్రంబు వక్త్రమే
ధమధమ ధ్వనితోడి ధక్క గాక"

విష్ణుదేవుని వినుతించకపోతే విపత్ పరంపర వైదొలిగే వీలు లేదని

"ఘనవిపద్గాఢాంధకారంబు లడగునే
పద్మాక్షునుతి లేని ప్రభలు లేక?"

అని భాగవతం తెలియజేస్తుంది.

"విందుల కుదు పులు విష్ణుకీర్తనము
చందపు వైకుంఠ సంబళము"

"తగు సంకీర్తన గురి తపమునకు"

"సంకీర్తనేధనము" అని అన్నమాచార్యులవారు సుస్పష్టం చేశారు.

**3. స్మరణము**

నిరంతరమూ భగవంతుని మనసారా స్మరించడమే స్మరణ భక్తి. భగవంతుని రూపం, చేష్టలను స్మరించడం వల్ల మనసు ఏకాగ్రమవుతుంది. తన్మయత్వం కలుగుతుంది. జపం, స్మరణం రెండూ దాదాపు ఒకే అర్థంలో ప్రయోగించబడుతున్నాయి. పరిశీలన చేసి చూస్తే వీటి మధ్య సూక్ష్మమైన భేదం వున్నట్లు కనిపిస్తుంది. జపం తీవ్రం కాగా అది స్మరణగా మారుతుంది. స్మరణం చిత్తంతో చేసే పని (చిత్తం స్మరణాత్మకం) కనుక తన ఇష్టదైవం యొక్క నామాన్ని నిరంతరం చిత్తంలో జ్ఞాపకం చేసుకోవడం స్మరణం అవుతుంది.

ఐహిక విషయాలతో కూడి ఉన్నా, జాగ్రదవస్థలో నిమగ్నమై వున్నా చిత్తాన్ని స్మరణాయత్తం చేయడం అలవరచుకోవాలి. అనేకులు దైవస్మరణ ఆవశ్యకతను తెలియజేస్తూ రచనలు చేశారు. ప్రహ్లాదుడు హిరణ్యకశ్యపునితో "దేవదేవుని చింతించు దినము దినము" అన్నాడు. ప్రహ్లాదుడు నీరు త్రాగుతున్నా, తింటున్నా, హసలీలా విలాసాదులయందు వున్నా, నారాయణ నామస్మరణయందే మనస్సు లగ్నం చేసి వుండేవాడని భాగవతం చెప్తున్నది.

అన్నమయ్య కూడా భగవంతుని స్మరించవలసిన ఆవశ్యకతను తెలుపుతూ అనేక కీర్తనలు రచించాడు. ఇందిరేశుని స్మరించేవారికి వైకుంఠం కరతలామలక మన్నాడు. జపతపాలకన్నా స్మరణే శ్రేష్ఠమన్నాడు.

"యెవ్వరు మనసులోన నిందిరేశుదలచిన
అవ్వల బాయక వుండు నదియే వైకుంఠము"

హరిస్మరణ లేని ఇతర సుఖాలు సుఖాభాసాలేకాని సుఖాలు కావని అన్నమయ్య సుస్పష్టం చేశాడు.

**"ఆతుమ గల వేంకటపతి నాత్మదలచి సుఖింపక**
**యేతరి సుఖముల దిరిగిన నింపులు దనకౌనా"**

ఇతర పనులను కట్టిపెట్టి వేంకటేశ్వరుని స్మరించవలసినదిగా తన మనసును ఉద్బోధించాడు.

**"విడువుము మనసా వీరిది చేతలు**
**తడయక శ్రీహరి దలచవోయికను"**

"స్మరణం మరవని వానికి మరణం లేదు" అన్న సూక్తి స్మరణ భక్తుడు ముక్తుడవుతాడని సూచిస్తున్నది. వ్యయప్రయాసలు ఏమాత్రం లేని సులభోపాయం స్మరణం అందుకే మనం

**స్మరణం + శరణం : కైవల్యమ్**

**4. పాదసేవనమ్**

త్రికరణశుద్ధిగా భగవంతుని పాదాలను సేవిస్తూ జీవించడమే పాదసేవనభక్తి. పరమాత్మ పాదపద్మాలను రెండింటినీ రెండు చేతి వ్రేళ్ళతో తాకి కన్నులకద్దుకోవడం, పాదసేవన సందర్భంలో భక్తులు చేస్తున్న పని.

**"శ్రీ వేంకటేశ చరణౌశరణం ప్రపద్యే"**

శ్రీ అనగా లక్ష్మీ సంపన్నుడైన వేంకటేశ్వరస్వామి వారి రెండు చరణాలను శరణుజొచ్చుచున్నాను అని పలికి సమర్పణ భావంతో శరణాగతులమవుతున్నాము. దీనివలన పరమాత్మ మహోన్నతుడు, నేను ఆయన పాదదాసుణ్ణి అన్న భావం స్ఫురించి 'అహంకారం' హతమవుతుంది. అహంకార నాశమే అజ్ఞాన వినాశం. అజ్ఞాన వినాశనం వలన జ్ఞానం ఉదయించి, మోక్షం సంప్రాప్తమవుతున్నది.

విష్ణు సేవా భాగ్యం లేకపోతే తాపత్రయాలు నశించవని ప్రహ్లాదుడు తెలియజేశాడు. తద్వారా విష్ణుసేవా విశిష్టతను విశదం చేశాడు.

**...తాపత్రయా భీలదావాగ్నులాఱునే**
**విష్ణుసేవామృత వృష్టిలేక"**

భగవత్పాదసేవ చేయవలసిందిగా అన్నమయ్య తన మనసును ఉద్బోధించాడు. తద్వారా ప్రపంచానికి బోధించాడు.

**"చెన్ను మీఱ హరిపాద సేవసేయు మనసా"**

వేంకటేశ్వరుని సేవ విశ్వవిజయాన్ని సంపాదించిపెట్టడమేగాక మోక్షాన్ని గూడా కలిగిస్తుందని అన్నమయ్య అభిప్రాయం.

**"శ్రీ వేంకటేశ్వరు సేవ చేతిలోని మోక్షమై**
**కేవలపు ప్రపంచము గెలిపించును"**

శ్రీ మహావిష్ణువు పాదాలకు అధిష్ఠానదేవత. అందువలన పాదాలు పూజాస్థానం అయ్యాయి. పాదాలకు వందనం చేశామంటే, దేవాధిదేవుడైన విష్ణువుకు నమస్కరించినట్లు. భగవంతుని పాదసేవకులలో ఆంజనేయస్వామి అగ్రగణ్యుడు.

**5. అర్చనం**

విశ్వమంతటా వ్యాపించిన నిరాకారుడైన భగవంతుని ఉపాసించడం చాలా కష్టమైన పని. "సాధకానాం హితార్థాయ బ్రహ్మణో రూపకల్పనా" అన్న సూక్తి విశ్వవ్యాపీ, విశ్వరూపుడూ అయిన పరమాత్మకు ఒక రూపాన్ని కల్పించి, ఆ విగ్రహాన్నే భగవంతునిగా భావించి, షోడశోపచార పూజావిధానంతో ఉపాసించే పద్ధతి ఆచరణలోకి వచ్చింది. తాను ఉపాసించే భగవన్మూర్తినే సాక్షాత్ భగవంతునిగా భావించి అర్చిస్తే మానసిక ఏకాగ్రత కుదురుతుంది. తద్వారా మానవుడు ఉన్నత స్థితికి చేరుకొనేందుకు వీలవుతుంది. ప్రీతితో తనకు సమర్పించే పత్ర, పుష్ప, ఫల, తోయాలను తాను గ్రహిస్తున్నట్లు భగవంతుడు చెప్పాడు.

**"పత్రం పుష్పం ఫలం తోయం యోమేభక్త్యాప్రయచ్ఛతి**
**తదహం భక్త్యుపహృత మశ్నామి ప్రయతాత్మనః"**

అర్చనా విశిష్టతను కొనియాడుతూ, దాని విముఖతను తులనాడుతూ భాగవతం అర్చనను బలపరిచింది. ప్రహ్లాదుడు హరిని పూజించడమే చేతులకు పరమ ప్రయోజనమని అభిప్రాయపడ్డాడు.

**"కమలాక్షునర్చించు కరములు కరములు**
**హరి పూజనములేని హస్తంబు హస్తమే**
**తరుశాఖ నిర్మిత దర్విగాక"**

అన్నమాచార్యుడు కూడా అర్చనకు సంబంధించి ఎన్నో కీర్తనలు రచించాడు. వాటిలో అర్చనా విశిష్టతను అనేకరీతులుగా వ్యక్తం చేశాడు. హరి పూజలు ఔన్నత్యాన్ని అందించి అలరిస్తాయని అన్నమయ్య తెలియజేశాడు.

**"పొందుగ నచ్యుతు బూజించు పూజలు**
**కిందట గొనకెక్కడి నిచ్చెనలు"**

ఇంద్రాదుల ఔన్నత్యానికి వారు చేసుకున్న ఇందిరేశుని పూజలే కారణమని, హరి పూజా విశిష్టతను ఆయన ఆవిష్కరించారు.

**"పూని దేవేంద్రాదులై పొడవు కెక్కినవారు**
**శ్రీనాథ మిమ్మునే పూజించినవారు హరి"**

కుంకుమార్చనలు, లక్షబిల్వార్చనలు, తైలాభిషేకాలు, పాలాభిషేకాలు, ఆకు పూజలు, పుష్పయాగాలు ఇలా ఎన్నో విధానాలు అర్చనలో చోటుచేసుకున్నాయి.

"భావగ్రాహీ జనార్ధన", నిర్మలమైన భావాలని గ్రహించేవాడు జనార్ధనుడు. అందుచేత భావసంశుద్ధి వున్న వారి ఇంట, వెంట, జంటా వుంటాడు పరమాత్మ. అర్చనద్వారా భగవదనుగ్రహం పొంది ఆయన్ను ప్రత్యక్షం చేసుకున్నవారిలో పృధు మహారాజు ఒకరు. ఆయన శతాశ్వమేధాలు ఏగబిగిని చేసి శ్రీహరి కరుణకు పాత్రుడైనాడు.

## 6. వందనం

వందనం అంటే 'నమస్కారం' అని అర్థం. భగవంతునికి భక్తుడు వేసే బంధనమే వందనం. భగవంతుణ్ణి స్తుతించి, ఆయన పాదపద్మాలకు వందనం చేయడం వలన భక్తునిలోని అహంకారం నశిస్తుంది. సర్వశక్తిసంపన్నుడైన పరమాత్మకు శరణాగతునిపై కరుణ కలుగుతుంది. కరుణ వలన భవబంధ విచ్ఛేదం జరిగి ముక్తి లభిస్తుంది. భగవంతుడికి నమస్కరించే తలమాత్రమే తల తక్కినవి కావు అని అభిప్రాయం.

**"శేషశాయికి మ్రొక్కు శిరము శిరము"**

అన్నమయ్య ఇందిరేశునికి నమస్కరించుమని ఇలాతలవాసులకు హితవు చెప్పాడు. దాని సత్ఫలితాన్ని కూడా తెలియజేసి ప్రోత్సహించాడు.

**"మొక్కరో మీరు మోసపోక మీకు**
**దిక్కు దైసైన ఆదిదేవునికి"**

**"నలినాక్ష నీకు నమస్కరించిన**
**ఫలము వొగడనికి బ్రహ్మకు వశమా"**

రెండు చేతులు జోడించి, హృదయం వద్ద నిలిపి, తలవాల్చి చేసే నమస్కారం హృదయపూర్వక నమస్కారం. భగవంతుడు హృదయంలో వున్నాడు. నా హృదయంలో ఉన్న పరమాత్మే నీ హృదయంలోను వున్నాడు. నా హృదయంలో వున్న పరమాత్మను ముందుంచుకొని, ఆయన సాక్షిగా నీలో వున్న ఆత్మకు ఆత్మ స్వరూపుడవైన నీకు నమస్కారం చేస్తున్నాను అని నమస్కారం తెలియజేస్తున్నది. ఇలా వందనం చేసేవారిలోను, వందనం పొందేవారిలోను ఆత్మనిష్ఠాభావం జాగృతమవుతున్నది. వందనం ద్వారా పరమాత్మ కృపకు పాత్రులైన వారిలో అక్రూరుడు ఒకడు.

## 7. దాస్యం

దాస్యం అంటే దాసుడు చేసే పని అర్థం. దాసునికి ఆజ్ఞానువర్తియై ప్రభువు యొక్క అధీనంలో ఉండేవాడు దాసుడు. దాసునికి తనకంటూ వేరే ఆలోచన ఏదీ ఉండదు. భగవంతుని చిత్తం ప్రకారం నడుచుకోవడమే దాసుని పరమధర్మం. దాసభక్తులలో అగ్రగణ్యుడు ఆంజనేయస్వామి. ఎడబాయక, ఏమరుపాటు లేక నిరంతరం రామపాద సేవలో నిమగ్నుడై వుంటాడు. ప్రహ్లాదుడు కూడా దాస్యభక్తి ఆవశ్యకతను నొక్కివక్కాణించాడు.

**"సంసారజీమూత సంఘంబులిచ్చునే**
**చక్రిదాస్య ప్రభంజనము లేక"**

అన్నమయ్య హరిదాస్య ఘనతను అనేకరకాలుగా చాటాడు. వేంకటేశ్వర దాస్యం వల్లనే తన జన్మ సార్థకమైందని తెలియజేశాడు.

**"యెంచగ నీదాస్యము నాకినామిచ్చితిగాన**
**పంచల నాపుట్టుగు సఫల మాయ నిదివో"**

హరిదాస్యమే సర్వోత్కృష్టమని ఎరుగజేశాడు.

**"బంతుల బాత్రా పాత్రము వెదికిన**
**అంతట హరిదాస్యమే పోఘనము"**

భగవద్దాసుడు భగవంతుని వంటివాడే కనుక చేస్తున్న ప్రతి పనినీ, భగవంతుడాదేశించిన పనిగా తన్ను తాను భగవంతుని దాసునిగా తలంచి కార్యనిర్వహణ చేయడం దాసభావం కలవాని లక్షణం.

**8. సఖ్యం**

భగవంతుణ్ణి మిత్రునిగా భావించి మన కష్టసుఖాలు అతనికి నివేదించి సంతృప్తి చెందే విధానాన్నే సఖ్యభక్తి అంటారు. సఖుడు అంటే స్నేహితుడు. సఖి అంటే స్నేహితురాలు. సఖ్యం అంటే స్నేహభావం. సఖ్యం మిత్రుల మధ్య, భార్యాభర్తల మధ్య, ప్రేయసీప్రియుల మధ్య వుండవచ్చు. అందువలన భగవంతున్ని స్నేహితునిగాను, భర్తగాను, ప్రియునిగాను భావించి సఖ్యం నెరపడం కూడా ఒకానొక భక్తిమార్గమే అవుతుంది. ఈ భక్తినవలంబించి కృతకృత్యులైనవారిలో అర్జునుడు ప్రథముడు. సఖ్యభక్తిలో భగవంతునికి, భక్తునికి సమానత్వమే నెలకొంటుంది. కాబట్టి తనకు ఏలికగా, ఆత్మేశ్వరుడుగా భావించిన అన్నమయ్య సఖ్యభక్తి జోలికి వెళ్ళలేదేమో. శ్రీకృష్ణునికి, కుచేలునికి మధ్యన ఉన్నది సఖ్య భక్తి. మీరాబాయి శ్రీకృష్ణుణ్ణి ప్రాణపతిగా ప్రేమించింది. బృందావన వాసులైన గోపికలున్నూ శ్రీకృష్ణుని ప్రాణేశ్వరునిగా ప్రేమించారు. ఈ భక్తిని "మధురాభక్తి" అని అంటారు.

**9. ఆత్మనివేదనం**

ఆత్మ నివేదనం అంటే తన్నుతాను భగవంతునికి సమర్పించుకోవడం. దీన్నే 'సంపూర్ణ శరణాగతి' అని అంటారు. శరణాగతిని మించిన ధర్మం మరొకటి లేదు. ఈ విషయాన్ని "సర్వ ధర్మాన్ పరిత్యజ్య మామేకం శరణంవ్రజ" అన్ని ధర్మాలను వదిలిపెట్టి నన్ను ఒక్కడినే శరణుపొందుము.

**"అనన్యాశ్చింతయంతోమాం యే జనాః పర్యుపాసతే**
**తేషాం నిత్యాభియుక్తానాం యోగక్షేమం వహామ్యహమ్"**

అన్ని ధర్మాలనూ పరిత్యజించి తనను శరణుజొచ్చిన వారిని అన్ని పాపాల నుంచి విముక్తులుగా చేస్తానని కృష్ణుడు తెలియజేయడం విశేషం.

అన్నమయ్య శరణాగతిని గురించి అనేకవిధాలుగా వివరించాడు. తన కీర్తనలెన్నిటిలోనో దాన్ని బలపరిచాడు. భగవంతుని శరణుజొచ్చిన వారికి విజ్ఞానము తద్వారా మోక్షము సిద్ధిస్తాయని అన్నమయ్య అచంచల విశ్వాసము.

**"శరణన్న వారికి విజ్ఞానము రగులు**
**గరిమ నిందువల్లనే ఘన మోక్షమూదగులు"**

భవబంధాల నుండి విముక్తులై మోక్షం పొందటానికి సత్సంగులు అనుసరించాల్సిన మార్గం 'భక్తిమార్గం'. మనోనిరోధం, ఇంద్రియ జయం మొదలైన చర్యల వల్ల పరమపదాన్ని పొందాలనుకోవడం కంటే సర్వమయుడైన సర్వేశ్వరుణ్ణి నేరుగా శరణు పొందడమే మేలని అన్నమయ్య బోధిస్తున్నాడు.

**"ఏదుపాయము - యే నిన్ను జేరుటకు**
**ఆది నంత్యము లేని - అచ్యుత మూరితివి"**

**ఉపయుక్త గ్రంథాలు**

1. అన్నమయ్య బహుముఖ ప్రాభవం - ఆచార్య చిట్రాజు గోవిందరాజు, ప్రాచ్య పరిశోధనా సంస్థ, శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం, తిరుపతి
2. సాధక సంజీవని - సద్గురు బ్రహ్మాజీ, శ్రీ సాయికృష్ణ సత్సంగ సేవా పీఠమ్, కొమరోలు.
3. అన్నమాచార్య సంకీర్తనామృతము - సముద్రాల లక్ష్మణయ్య, కపిలతీర్థం రోడ్డు, తిరుపతి.
4. అన్నమాచార్యులు, తాళ్ళపాక - ఆధ్యాత్మ సంకీర్తనలు, అన్నమాచార్య ప్రాజెక్టు, తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి.
5. భాగవతం - తెలుగు, బమ్మెర పోతన, తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి, 2005.
6. అన్నమాచార్య సంకీర్తన సౌరభం - 2002.

***

# అన్నమయ్య సంకీర్తనల్లో చిన్నికృష్ణుడు

**డా॥ గెంజి అరుణ**
**అసిస్టెంట్ ప్రొఫెసర్**
**డిపార్ట్‌మెంట్ ఆఫ్ లింగ్విస్టిక్స్**
**ఎస్.వి. యూనివర్శిటీ, తిరుపతి**

శ్రీ వేంకటేశ్వరస్వామి కీర్తిని దశదిశలా తన సంకీర్తనల చేత వ్యాపింప చేసినవాడు అన్నమయ్య. అన్నమయ్య శ్రీనివాసుడిని తన మనస్సులో నిలుపుకొని ముప్పైరెండు వేల సంకీర్తనలను రచించాడు. అతని ప్రతి కీర్తనలోను శ్రీనివాసుడు ఉట్టిపడుతాడు. అన్నమయ్య కీర్తనలు పండితపామరులు అందరూ అర్థం చేసుకొని, అందరూ పాడుకొనే విధంగా రచించడం విశేషం. అన్నమయ్య కీర్తన రాని తెలుగువాడు ఉండడు. ఎక్కడయినా అన్నమాచార్య కీర్తన పాడుతూ ఉంటే చెవులు అటువైపేసి వినడం తప్పక జరుగుతుంది. అన్నమయ్య రచించిన కీర్తనలను ఎన్నికోణాల్లో అయినా పరిశోధన చేసుకోవచ్చు. అనేక పరిశోధనలు వచ్చాయి వస్తూనే ఉన్నాయి. అన్నమయ్య సంకీర్తనల పరిశోధన ఒక తరగని ఘని. తవ్వేకొద్దీ వస్తూనే ఉంటుంది. ఇందులో పరిశోధనలు ఒక అక్షయపాత్రగా చెప్పుకోవచ్చు. అన్నమయ్య ఏ కీర్తన రచించినా అది శ్రీ వేంకటేశుడి మీదనే రచించడం విశేషం. రాముడిపైన, కృష్ణుడిపైన నరసింహస్వామిపైన ఇలా అనేకమంది దేవతా మూర్తులను తన కీర్తనల ద్వారా స్తుతించాడు. ఇలా ఎవరిని స్తుతించినా అందులో శ్రీనివాసుడినే చూసుకోవడం విశేషంగా చెప్పుకోవచ్చు.

అన్నమయ్య తన భక్తితో రచించిన సంకీర్తనల్లో చిన్నికృష్ణుడి ప్రస్తావనను మనం కొంత తెలుసుకొందాం.

**చిన్నకృష్ణుడి జననం :**

శ్రీకృష్ణుడు శ్రావణమాసంలో బహుళ అష్టమి నాడు జన్మించాడు. అతని తల్లిదండ్రులు దేవకి వసుదేవులు. శ్రీకృష్ణుడి జననానికి సంబంధించిన కీర్తనలను అన్నమయ్య తన కీర్తనల్లో కింది విధంగా రచించాడు.

> **"సతులాల చూడరే శ్రావణ బహుళాష్టమి**
> **సతలాయా నడిరేయి కలిగె శ్రీకృష్ణుడు"** **(20-453)**

ఇలా అన్నమయ్య కృష్ణుడు శ్రావణ బహుళాష్టమి నాడు జన్మించాడని అతను పుట్టేటప్పుడే చతుర్భుజాలను, శంఖు చక్రాలను ధరించి ఉన్నాడని అలాగే కిరీటం కూడా ధరించి ఉన్నాడని చెప్తూ నందుడికి యశోదకు బిడ్డ అయినాడని తన సంకీర్తనలో తెలియజేస్తున్నాడు. అన్నమయ్య సంకీర్తనల్లో తెలియజేసే విషయాలు మామూలైనవి

కావు. ఇందులో భారత, భాగవత, రామాయణ విశేషాలు చాలా కనిపిస్తాయి. ఒక్క సంకీర్తనలోనే చాలా విషయం దాగి ఉంటుంది.

**చిన్నికృష్ణుడి అందచందాలు :**

చిన్నికృష్ణుడి అందచందాలను అన్నమయ్య తన సంకీర్తనల్లో చాలా హృద్యంగా రచించాడు. కీర్తన విన్నా, చదివినా కంటిముందు చిన్నికృష్ణుడు ప్రత్యక్షమయినాడా అనే భావన కలిగే విధంగా ఉంటాయి. కింది కీర్తన చూడండి.

**"చిన్ని శిశువూ చిన్ని శిశువూ**
**ఎన్నడుం జూడమమ్మ యిటువంటి శిశువూ"** **(సం.6, కీ.1)**

పై కీర్తనలో చిన్నికృష్ణుడి అందచందాలను కీర్తిస్తూ ఇంతటి అందం ఎన్నడూ చూడలేదు అని అంటాడు. ఒత్తయిన కురులు కలిగి రింగురింగుల వెంట్రుకలతోడి అందంగా ఉన్నాడు ఈ శిశువు. అలాగే పాదాలకు బంగారు గజ్జెలను ధరించి పాకుతూ పాకుతూ యశోద వెంట పారాడుతున్నాడు. ముద్దుముద్దు వ్రేళ్లు కలిగి వాటికి వుంగరాలు ధరించి ఉన్నాడట. పాలుగారె చెక్కిళ్లతో పొట్టపైన పాలచారలు కలిగి నోటికంతా వెన్న రాసుకొని ఉన్నాడు చిన్నిశిశువు అని చిన్నిశిశువు ముగ్ధమనోహర రూపాన్ని ఈ కీర్తనలో తెలియజేశాడు. తన బిడ్డల్లో కృష్ణయ్యను చూసుకొనే తల్లులు ఇప్పటికీ ఉన్నారు. వారి పిలుపులో తమ బిడ్డలను కన్నయ్య, కిట్టయ్య, కృష్ణయ్య అని ముద్దుముద్దుగా ప్రస్తుతం కూడా పిలవడం మనకు కనబడుతూ ఉంది.

**చిన్నికృష్ణుడి అల్లరిచేష్టలు :**

చిన్నికృష్ణుడి అల్లరికి అంతులేదు. వుట్టుకొట్టడం, వెన్న, పెరుగు, పాలు దొంగలించి స్నేహితులతో గూడి తినడం, గోకులంలోని గోపికలను ఆట పట్టించడం, వారి పాలు, పెరుగు కుండలను పగులగొట్టడం ఒకటేమిటి అనేకం ఉన్నాయి. అన్నమయ్య సంకీర్తనల్లో కింది సంకీర్తనలో యశోదతో రేపల్లెలోని గోపికలు వచ్చి నీ కొడుకు పాలు పెరుగులన్నింటిని ఆరగించి వెళ్తున్నాడని చెప్తున్నారు.

**"పన్నారు దొంతుల పాలు పెరుగులు**
**యిన్ని నారగించె యీతడు గదవె"** **(సం.4-కీ.228)**

అలాగే మరొక సంకీర్తన చూడండి.

**"పాలకడవలును బానల వెన్నలును**
**ఒలింబెట్టి వుట్లపై నుండగాను"** **(సం.6-కీ.114)**

**"గుఱుతెఱిగిన దొంగకూ గూగుపీడె**
**గుడిలోనె దాగేని కూగూగు"** **(సం6-కీ.16)**

ఇంకనూ గోపికలను ఆటపట్టిస్తూ అల్లరిచేస్తూ ఉన్న శ్రీకృష్ణుడిని అన్నమయ్య ఇలా క్తీర్తించాడు.

"జాణతనాలాడేవేలే జంపుగొల్లెతావోరి
ఆణిముత్యముల చల్లలవి నీకు గొల్లలా" (సం.6-కీ.113)

**చిన్నికృష్ణుని మహిమలు :**

చిన్నికృష్ణుడు చిరుప్రాయంలోనే అనేక మహిమలను చూపించాడు. తన మామ అయిన కంసుడు దేవకి అష్టమ సంతానం ద్వారా మరణిస్తాడని ఆకాశవాణి చెప్పగా విని కృష్ణుడిని చంపడానికి అనేకమందిని పంపుతాడు. వారినందరినీ శ్రీకృష్ణుడు చాకచక్యంతో చంపివేస్తాడు. పూతన రాక్షసిని చంపడం, కాళీయ మర్దనం, కంసుని సంహరించడం, గోవర్ధన పర్వతాన్ని ఎత్తి గోవులను, రేపల్లె ప్రజలను కాపాడడం వంటి అనేక మహిమలను చూపిస్తాడు బాలకృష్ణుడు. ఈ విషయాలన్నింటిని అన్నమయ్య తన సంకీర్తనల్లో తెలియజేశాడు. కింది సంకీర్తన చూడండి.

"ముద్దుగారే యశోద ముంగిట ముత్తెము వీడు
తిద్దరాని మహిమల దేవకీ సుతుడు" (ఎన్.ఒ.ఎ. 182)

ఈ విధంగా అన్నమయ్య శ్రీకృష్ణుడి మహిమలను కొనియాడాడు.

అన్నమయ్య సంకీర్తనల్లో భారత భాగవత రామాయణ విశేషాలు ఎన్నో ఎన్నెన్నో కనిపిస్తాయి. అన్నమయ్య శ్రీనివాసుడిని రాముడిగా, కృష్ణుడిగా, నరసింహ స్వామిగా ఇలా అనేక విధాలుగా నిలువెత్తున తన సంకీర్తనల ద్వార రచించి కీర్తించి తరించాడు. అచ్చు తెలుగుదనం ఉట్టిపడే విధంగా ఆయన సంకీర్తనలు ఉన్నాయి. అన్నమయ్య సంకీర్తనలు వినగానే మనస్సుకు ప్రశాంతత చేకూరుతుంది. భక్తిభావం పెరుగుతుంది. మనిషి ఆధ్యాత్మిక చింతనవైపు నడవడానికి మార్గం ఏర్పడుతుంది. సంగీతం మనిషి ఆయువును పెంచుతుంది అని అంటారు. అన్నమయ్య సంకీర్తనలు కూడా మనిషి ఆయువును పెంచుతాయనడంలో అతిశయోక్తిలేదు.

***

# అన్నమాచార్య సంకీర్తనల్లో ఆత్మానుభూతి

**డా॥ చిట్టే స్వర్ణలత**
**తిరుపతి**
**తెలుగు ఉపాధ్యాయురాలు**
**జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల**
**మైదుకూరు**

శ్రీ వేంకటేశ్వరునికి సారస్వతార్చన చేసి, స్వామి శ్రీ పాదాలను చేరుకొన్న వాగ్గేయకారుడు అన్నమయ్య 32 వేల సంకీర్తనలతో తెలుగు సాహితీ సరస్వతికి

పదకవితా పట్టాభిషేకం చేసి, సంగీత సాహిత్యాలను సమపాళ్ళలో రంగరించిన తొలి తెలుగు వాగ్గేయకారుడు అన్నమయ్య. 15వ శతాబ్దానికొక ప్రత్యేకతను సంతరించి పెట్టిన మహనీయుడు.

అన్నమయ్య సామాన్యుడా? వైకుంఠనాథుని ఆయుధాలతో ఒకటైన నందకం అంశగా అవతరించిన దివ్యపురుషుడు.

**ఆత్మ - పరమాత్మ :**

అనంతాకాశం పరమాత్మ, ఘటాకాశం జీవాత్మ. కుండ పగిలితే ఘటాకాశం అనంతాకాశంలో కలుస్తుంది. పరమాత్మ పూర్ణాత్మ. ప్రతి శరీరంలోని ఆత్మలు ప్రత్యగాత్మలు పరమాత్మ భగవంతుడు, జీవుడు ఒక ప్రేమికురాలు పరమాత్మ నాయకుడిగా, అన్నమయ్య తనను నాయికగా భావించి ఆత్మానుభూతితో ఇంద్రియ గోచరంకాని పరమాత్మను పరబ్రహ్మతత్వాన్ని సంకీర్తనల్లో ప్రదర్శింపచేసి పారవశ్యంతో పరవశించి పోయాడు అన్నమయ్య.

ఆత్మగుణాలు ఎనిమిది. దయ, క్షాంతి, అసూయ, శౌచమ్, అనాయాస, మాంగల్యమ్, అకార్పణ్యమ్, అస్పృహ, వీటిల్ని గూర్చి గౌతమ ధర్మసూత్రాలు వివరించాయి. ఈ ఎనిమిది ఆత్మగుణాలు ఆచరిస్తే తప్పక చిత్తశుద్ధి కల్గుతుంది.

ఈ ఎనిమిది ఆత్మగుణాలు కలిగిన వాడు బ్రహ్మలోకాన్ని పొంది, బ్రహ్మ సాయుజ్యం చెందగలడు. ఇక్కడ ఆత్మ అంటే పరమాత్మ కాదు. శరీరాన్ని నడిపించే జీవాత్మ జీవుడు. కనుక జీవుడు జ్ఞాని కావడానికీ, పురుషుడు పురుషోత్తముడు కావడానికీ ఈ గుణాలు చాలా ముఖ్యమైనవి. ఇలాంటి ఆత్మగుణాలను తన సంకీర్తనల ద్వారా లోకానికి తెలియజేసి ఆత్మానుభూతిని పొందిన లోకజ్ఞాని అన్నమయ్య.

**సంకీర్తనలు - ఆత్మానుభూతి :**

అన్నమయ్య తన ఆత్మానుభూతిని సంకీర్తనల ద్వారా ఆ దేవదేవుని లీలలను వివరించాడు.

> **"జో అచ్యుతానంద జోజో ముకుందా**
> **రావె పరమానంద రామ గోవిందా..."**

అంటూ పారవశ్యంతో జోల పాడి బాలుని నిద్రపుచ్చుతాడు. ఆ బాలుణ్ణి పడుకోబెట్టిన ఉయ్యాలను వర్ణిస్తూ -

> **"పవనమందుండ నీ భావంబు దెలిపె ఉయ్యాల" (1-67)**

అంటూ కీర్తిస్తాడు అన్నమయ్య. పరంధాముడు పవళించిన ఉయ్యాల వైశిష్ట్యాన్ని గురించి చెప్పాడు. ఇదొక అద్భుతమైన వర్ణన. ఇలాంటి శిశువును -

> **"చిన్ని శిశువు - చిన్ని శిశువు**
> **ఎన్నడూ చూడనమ్మ ఇటువంటి శిశువు" (6-1)**

అంటూ కొనియాడుతాడు. శిశువును అందంగా చిత్రించి, మనలని ధన్యుల్ని చేసిన ధన్యమూర్తి అన్నమయ్య.

**"గురుతెరిగిన దొంగ కూగూగు వీడె**
**గురిలోనే దాగేని కూగూగు"** **(6-56)**

అన్నమయ్య శ్రీ వేంకటేశ్వరున్ని చిన్ని కిట్టయ్యగా భావించి, పిల్లవాడిగా మారిన స్వామిని, భుజాల మీదకు ఎక్కించుకొని ఆడిస్తున్న మధురమైన అనుభూతిలో తేలియాడుతూ పాడిన పాట ఇది.

ఇక్కడ 'కూగూగు' అనగా మనస్సును ఊగించే ఒక అందమైన పదం. చిన్నపిల్లలను ఆడించేటప్పుడు 'దో బూచి, దో బూచి' అంటుంటాం అలాంటిదే! ఈ 'కూగూగు' పదం ఇలాంటి పదాలు తన సంకీర్తనల్లో మనోహరంగా కోకొల్లలు వాడాడు అన్నమయ్య.

**"పరమ పురుషుడు గోపాల బాలుడైనాడు**
**మురహరుడు ఎదుట ముద్దుగారీ నిదివో"** **(12-17)**

గోపికలు భగవంతుడైన శ్రీకృష్ణున్ని ఆత్మేశ్వరునిగా భావించి మధుర భక్తితో తరించిన వైనాన్ని, జగన్నాయకుడైన శ్రీకృష్ణున్ని తల్లిగా లాలించి పాలించిన యశోద వాత్సల్య భక్తిని, అనేకరకాల సంకీర్తనల్లో వివరించాడు అన్నమయ్య.

నిద్రలేచింది మొదలు నిద్రకు ఉపక్రమించే వరకు ప్రతిక్షణం ఆ దేవాధి దేవుని స్మరిస్తూ, తరిస్తూ పారవశ్యంతో పాడిన మరొక సంకీర్తనం.

**"విన్నపాలు వినవలె వింత వింతలు**
**పన్నగపు దోమతెర పైకెత్తవేలయ్యా"** **(6-25)**

**"అంతర్యామి అలసితి సొలసితి**
**యింతట నీ శరణదె చొచ్చితిని"**

స్వామి దర్శనం కోసం మనస్సు తపన పడుతుంటే హృదయం ఆర్తితో కరుగుతుంటే, ఆ తపన, ఆర్తి కలసి అన్నమయ్య కీర్తనలో అక్షరాలుగా మారాయి.

"స్వామి! నాలో ఉండి నన్ను నడిపించే పరమాత్మా మాయతో కలిసిన దేవా ఈ జీవన ప్రయాణంలో బాగా అలసి పోయానయ్య! నువ్వు కనిపించలేదని బాధపడుతున్నాను. ఇక నువ్వే దిక్కని శరణు కోరుతున్నాను" అని స్వామిని అన్నమయ్య అభ్యర్థిస్తున్నాడు.

పై కీర్తనలో మనస్సు తనని తాను మరచిపోయి ఇతర విషయాల్లో ఏమాత్రం ప్రవేశింపని స్థితి. అన్నమయ్య భక్తి గోపురం ఈ కీర్తన.

పరమాత్మపై చూపై పరమ ప్రేమ భక్తి, స్వామి లీలా విలాసా లెన్నింటినో ప్రత్యక్షీకరించుకున్నాడు, పరవశించి పోయాడు. పరమాత్మను నాయకునిగా సర్వస్పష్టి

జీవాత్మలను నాయికలుగా భావించి పదాలను రచించి, పదకవిత్వ సంకీర్తనా సాహిత్యానికి పట్టంగట్టి పదకవితా పితామహుడని పించుకున్నాడు అన్నమయ్య.

ఈ రకంగా అన్నమాచార్యుడు ఒక భక్తుడిగా తనకు కలిగిన తన్మయ భావాన్ని సుందరంగా అభివ్యక్తం చేయగల నేర్పుగలవాడిగా తెలుస్తుంది. అంతేగాక తనలో కలిగిన ఈ అక్షయానందభావాన్ని, అనన్య భక్తి జ్ఞానాన్ని జనాళికి అందించే నిమిత్తం సంకీర్తనలనే వాహిక చేసుకొని, సారస్వత మూర్తిమత్వాన్ని సంతరించిన శిల్పి అన్నమయ్య.

ఆత్మ దోలికల్లో పరమాత్ముని నింపుకొని తనవితీరా ఆనందానుభూతి పొందిన గొప్ప భక్తాగ్రేసరుడు అన్నమయ్య తెలుగు సాహితి సరస్వతి ముద్దుబిడ్డ అన్నమయ్య.

***

# అన్నమయ్య సంకీర్తనల్లో అష్టవిధ నాయికలు

**డా॥ సి. చిన్నపాపమ్మ**
**తెలుగు అధ్యాపకులు**
**ప్రభుత్వ డిగ్రీ కళాశాల, పుత్తూరు**

పదకవితకు పట్టం గట్టి తెలుగు సాహిత్యాన్ని సుసంపన్నం చేసిన వాగ్గేయ కారుల్లో అన్నమయ్య మొట్టమొదటి వ్యవహార భాషావాది. భక్తి, సంగీత, సాహిత్యాల సమ్మేళనంతో శ్రీ వేంకటేశ్వరస్వామి వైభవాన్ని గానం చేసి తన జన్మను చరితార్థం చేసుకొన్న మహా భక్తాగ్రేసరుడు అన్నమయ్య.

సాహిత్యం సమాజానికి దర్పణం అన్న నానుడికి నిదర్శనం అన్నమయ్య సంకీర్తనలు. అన్నమయ్య సంకీర్తనలన్నీ భక్తి ప్రధానాలై ఉన్నా, అందులో సామాజికత కూడా కొట్టొచ్చినట్లు కనిపిస్తుంది. ప్రకృతి, పురుషుల కలయికలో సృష్టి తత్త్వం ఇమిడి ఉన్నట్లు, అన్నమయ్య సంకీర్తనల్లో సృష్టికి మూలాధారమైన శృంగారతత్త్వానికి ప్రాధాన్యం ఇవ్వబడింది. అయితే అన్నమయ్య కీర్తనల్లో ఒలికించిన శృంగారం భక్తిరస ప్రధానమైన అలౌకిక శృంగారం.

సృష్టిలోని అణువు నుండి బ్రహ్మాండము వరకు సర్వమూ పరమ పూజ్యనీయమే అని భావించిన అన్నమయ్య శృంగార భావాన్ని భగవద్రతిలో పర్యవసింప చేయడమే పరమార్థమని భావించాడు. శృంగారాన్ని కొత్త కోణాలతో దర్శించి, నాయిక అవస్థలను తానే అనుభవించి ఆ ఆనందలహరిలో భగవంతుని దర్శించాడు. విశిష్టాద్వైత భావాన్ని అన్నమయ్య తన కీర్తనలలో నాయిక నాయకుల ద్వారా ప్రదర్శించాడు. తాను నాయిక రూపం ధరించి నాయకుడైన శ్రీనివాసునితో అలౌకిక శృంగారం సాగించాడు.

శ్రీహరి అంతరంగ, స్వీయ నాయిక అయిన అమ్మ అలమేలు మంగాదేవి శృంగారాన్ని అన్నమయ్య కవితా వస్తువుగా స్వీకరించాడు. ఆ రమణీ రమణుల అలౌకిక శృంగారాన్ని అన్నమయ్య తన కీర్తనల్లో కదు రమ్యంగా వర్ణిస్తూ, ఆ తల్లిలో అష్టవిధ నాయికల్ని దర్శింపచేసిన తీరును పరిశీలిద్దాం.

**1. స్వాధీన పతిక :** ఈమెకే 'స్వాధీన భర్తృక' అని మరోపేరు. పరస్త్రీలను కాంక్షింపక తనయందే అనురాగము కల్గి తనకు అధీనుడైన భర్తగలది. మన్మధ పూజలు చేయడం, వనవిహారం, జలక్రీడ వంటివి ఈ నాయిక లక్షణాలు.

అన్నమయ్య వర్ణించిన ఈ స్వాధీన భర్తృక పతిని తన వశం చేసుకున్న తీరును గమనించండి.

**"మించి దేవాంగన లిట్టె మెచ్చేరమ్మా**
**ఎంచ నలమేల్మంగ ఎంత దానవమ్మా"** (సంపుటి 26-124)

ఈ నాయిక తన నేర్పుతో, జాణతనంతో పతిని వశం చేసుకొంది. మాటలతో వూరడించి, మచ్చికలతో పొద్దుపుచ్చి, పాటలతో పతిని కరిగించి, పంతాలతో అతన్ని మరిగించి చాటుగ పతిని కూడిన జాణ ఈమె. అంతటితో ఆగక నవ్వుతూనే తన దగ్గరకు రప్పించి, తన నటనలతో అతన్ని మెప్పించి పతి చిత్తములో తన పట్ల ప్రేమను చిగురింపచేసుకుంది. చివరికి ఆ వేంకటనాథుడి పట్టపురాణి అయి అతని వక్షస్థలాన్నే ఆక్రమించుకుంది.

**2. వాసక సజ్జిక :** ప్రియుడు వచ్చేవేళకు తాను అలంకరించుకొని, కేళీగృహాన్ని అలంకరించి సిద్ధంగా వుండేది వాసక సజ్జిక. అన్నమయ్య ఈమె అంతరంగాన్ని మిక్కిలి మనోజ్ఞంగా చిత్రించాడు.

**"ఎప్పుడుగాని రాడో ఎంత తడవాయకాని**
**చప్పుడాలకించి మతి జల్లురనెనమ్మ..."** **(12-46)**

ఇందులో నాయిక తన నాయకుడు ఏకాంతంలో చేసిన పనులు తలచుకొని, తన దగ్గరకు ఎవరు వచ్చినా తన నాయకుడని భ్రమిస్తుంది. అలా భ్రమ చెందడం వాసక సజ్జిక లక్షణం.

అలాగే మరో కీర్తనలో ఈ నాయిక తన్ను బాగా అలంకరించుకొని ప్రియుని కొరకు చూసే యెదురుచూపును కళ్ళెదుట సాక్షాత్కరింపచేశాడు.

**"అడుగుతా నున్నది అంగనల నీ సుద్దులు**
**అదరి తానుస్సురుస్సు రంటా నున్నది"**

నాయిక సొమ్ముల్ని అలంకరించుకొని పదేపదే వాటిని చూసుకొంటూ, నాయకుడు ఎప్పుడు వస్తాడో అని అతని పదాలు పాడుకొంటూ నిరీక్షిస్తోంది.

**3. విరహోత్కంఠిత :** తాను అనుకున్న సమయానికి తన ప్రియుడు రాకపోతే విరహంతో చింతించి నాయకునికి రాయభారం పంపే లలన ఈమె.

**"పొద్దిక నెన్నడు పొడుచునో పోయిన చెలి రాదాయెను**
**నిద్దుర కంటికి దోపదు నిముషంబొకడు..."**

ఈ కీర్తనలో నాయిక చెలితో రాయభారం పంపింది. ఆమె ఎంతకూరాలేదని చింతిస్తూ నిద్రరాక నిముషమొక ఏడుగా భావించి కళ్ళలో నీరు నింపుకుంటుంది.

మరో కీర్తనలో అన్నమయ్య విరహోత్కంఠిత విరహాన్ని ఎలా సాక్షాత్కరింప జేశాడో చూడండి.

**"ఎటువంటి మోహమో ఎట్టి తమకమొగాని**
**తటుకునను దేహమంతయు మరచె చెలియ" (6-70)**

పై కీర్తనలో నాయిక బంగారు కిన్నెర మీటుతూ నన్నని స్వరంతో తన నాయకున్ని గురించి పాడి పాడి బంగారు వన్నె పయ్యెదపై కలికి కన్నీరు ఒలికిస్తుంది. విరహతాపంతో పరుపుమీద దొర్లుతుంటే ఆమె మేని పూతలు జవ్వాది చెమటతో చేరి జారిపోతుంది. తాపంతో నిట్టూరుస్తూ వుసూరుమంటుందీ నాయిక. పై కీర్తనలో అన్నమయ్య నాయిక విరహతాపాన్ని మనోజ్ఞంగా వర్ణించాడు.

**4. విప్రలబ్ధ :** ప్రియుడు సంకేత స్థలంలో కనిపించనప్పుడు తాను నాయకునిచే వంచింప బడ్డానని భావించి మదిలో వ్యాకులత పొందే నాయిక ఈమె. అన్నమయ్య తన కీర్తనల్లో ఈమె అంతరంగాన్ని ఎలా ఆవిష్కరించాడో చూడండి.

**"తరుణిపై మరునికి దయలేదు నీవు**
**మరునిచే పోలితి మరియేటి బ్రదుకు" (12-160)**

ఓ సఖీ! ఆ మన్మధునికి నీమీద దయలేదు. నీవు అతణ్ణే అనుసరిస్తున్నావు. ఇది ఏమి బ్రతుకు. నాయిక సంకేత స్థలమైన పొదలతీగల యింటిలో నాయకుని కోసం వేచి ఉందని, అతనికోసం ఎదురుచూచి చూచి ఆమె ఏమౌతుందో అని నాయిక వ్యాకులతను అన్నమయ్య మన కళ్ళెదుట నిలిపాడు. "...మలసి వెన్నెల మంట" అనడంలో విప్రలబ్ధ అయిన ఆమె నాయకుని కోసం యెంతగా ఆర్తి చెందుతుందో అర్థమౌతుంది.

**5. ఖండిత :** ప్రియుడిలో ఇతర స్త్రీ సంభోగ చిహ్నాలు చూసి ఈర్ష్య పొంది కుందునది ఖండిత. పరస్త్రీ పొందుకోరి వెళ్ళిన నాయకున్ని ఈ ఖండిత ఎలా ఈసడిస్తుందో అన్నమయ్య ఈ కీర్తనలో తెలిపాడు.

**"ఆపరాని తమకాన నానజేసెగాక ఇంత**
**మాపుదాన నీతోడి మాటలేలరా" (12-29)**

నాయకుడు ఎవరో కాంతతో రాత్రంతా గడిపి ఇంటికి వచ్చాడు. అతన్ని చూచి ఇంతటి మోసానికి గురియైన నా ప్రాణమెందుకని కోపిస్తుంది. నన్ను మోసం చేసి ఎవతెకో అమ్ముడు బోయావంటూ నిలదీస్తుంది. నీ శరీరం మీద బహిరంగంగా కనిపించే మదన ముద్రలు నిన్ను వశపరచుకొని ఎవ్వతో వేసినవి అంటుంది.

స్త్రీకి సహజ సిద్ధమైన ఈర్ష్య, ఆమె మాటల్లో, ప్రియునిపై తనకు గల ప్రేమను చేతల్లో ఎంత బాగా తెలియచేస్తుందో అన్నమయ్య మరో కీర్తనలో చూడండి.

**"అంత మమ్ము జోలిఁబెట్టకవులే నీవు నీ**
**అంతరంగమే యెఱుఁగు నంటకురా నీవు"** **(26-24)**

నాయిక నాయకున్ని చూసి అతని చెక్కిలి చెమరించి ఉందని, ఊర్పులు రేగాయని, కొప్పువీడి ఉందని, ఇన్ని సంభోగ చిహ్నాలు చూసిన నాయిక తన నాయకుడు పరస్త్రీతో గడపి వచ్చాడని నిర్ధారించుకొని అతన్ని నిలదీసి అడుగుతోంది. నీ అంతరంగం నాకు బాగా తెలుసులే అంటూ ఈ ఖండిక దెప్పి పొడుస్తుంది.

**6. కలహాంతరిత :** పతిని మొదట అనుమానించి తరువాత పశ్చాత్తాప పడే నాయిక 'కలహం తరిత'. నాయిక తాను పూర్వం చేసిన పనులకు పశ్చాత్తాప హృదయంతో తన అపరాధాలు మన్నించమని వేడుకొంటుంది.

**"ఎఱగక నిన్ననంటి నిందాకాను నీ**
**కెఱుక సేసితి నిఁక నీవింటికి రావయ్యా"** **(26-107)**

పై కీర్తనలో నాయిక తన నాయకుడు పరకాంతతో రాత్రి గడిపి వచ్చాడని మొదట అనుమానిస్తుంది. పరిపరివిధాల అతన్ని ప్రశ్నించి, నిందించి యింటినుండి వెడలగొడుతుంది. తర్వాత తన అనుమానం నిరాధారమని తెలుసుకొంటుంది. పశ్చాత్తాప హృదయంతో నీ దోషమేమీ లేదంటూ, నిన్ను అనవసరంగా తప్పు పట్టానని తన తప్పును తెలుసుకొని నాయకున్ని ఇంటికి తిరిగి రమ్మంటుంది. కంటికి కునుకురాదు, నీమీద నా వలపు రెట్టింపు అయ్యిందని నాయకునికి తన ప్రేమను వెల్లడిస్తుంది. నా అపరాధాలు మన్నించి, నీవు ఇంటికి రావయ్యా అంటూ ఈ కలహాంతరిత తన నాయకునికి కబురు పెట్టింది.

**7. ప్రోషిత భర్తృక :** పతి దేశాంతరము వెళ్ళినప్పుడు వియోగంతో చింతించే నాయిక ఈమె. ఈ నాయిక విరహ వియోగ బాధను అన్నమయ్య ఈ కీర్తనలో ఎంత అద్భుతంగా ఆవిష్కరించాడో చూడండి.

**"తానెట్లున్నాడో తరుణి వివిపించ నే**
**కానక నిన్నుగన్న అతని గన్నట్లు నాయెనే..."** **(15-76)**

పై కీర్తనలో నాయిక తన స్వామి ఎట్లున్నాడో చప్పవే అని చెలికత్తెతో మొరపెట్టుకుంటుంది. శకునాలు బాగున్నాయని ప్రేమలేఖలు రాస్తుంది. అతని చిత్తరువునే చూస్తూ పొద్దు గడుపుతుంది.

**8. అభిసారిక :** మదనార్తియైన ఈ నాయిక ప్రియుని వద్దకు తానే స్వయంగా బోవునది. ఈ అభిసారికను అన్నమయ్య తన కీర్తనల్లో ఎలా ఆవిష్కరించాడో చూడండి.

**"కామించి నీవరుగ కలయు నాయకుడు నే**
**దేమి భాగ్యము సేసెనే తరుణి"** **(12-93)**

విరహంతో నాయిక స్వామి వద్దకు వెళ్తోంది. ఆయన ఎంత పుణ్యం చేసుకొన్నాడో. ఆసమయంలో చెమటతో తడిసిన కుచద్వయంతో ఆమె పయ్యెద తూలింది. కొప్పులో పూలు తురిమింది. శిరస్సుపై గుభాళించిన జవ్వాది చెక్కుల మీదికి చేరింది. దేహానికి పూసిన కస్తూరి రాలిపోయింది. ఆమె ధరించిన మొలనూలు వూడిపోయి, తలలోని పూలు కొంత వాడిపోయి నాయిక వెళ్తోంది. ఆ స్థితిలో వెళ్తున్న ఆమెను చూసి చెలికత్తె ఎక్కడికి వెళ్తున్నావని ప్రశ్నిస్తోంది.

పై కీర్తనలో అన్నమయ్య నాయకుని సమాగమం కోసం అభిసారిక చేసుకొన్న అలంకారాన్ని, అతణ్ణి త్వరగా చేరుకోవాలన్న ఆమె ఆతృతను వర్ణించాడు.

**ముగింపు :** అన్నమయ్య వినిన, చూచిన, అనుభవ పూర్వకంగా తెలుసుకున్న అన్ని విషయాలు అలతి అలతి పదాలతో అలవోకగా తన సంకీర్తనల్లో తెలియచెప్పాడు. స్త్రీ స్వభావాన్ని, జాణతనాన్ని పదాల రూపంలో కూర్చాడు. అన్నమయ్య మొదటి రెండు చరణాల్లో చెప్పిన లౌకిక శృంగారం చివరి చరణంలో అమ్మ అలమేలుమంగా, శ్రీనివాసుల కలయికతో సమన్వయం పొంది దివ్యమైన, అమలిన అలౌకిక శృంగారంగా ఆవిష్కరిస్తుంది.

అన్నమయ్య శృంగార కీర్తనల్లో ఆధ్యాత్మికత తొంగి చూస్తుంది. "కామిగాక మోక్షగామి కాదు" అనే తత్త్వం ఆయన కీర్తనలకు సరిపోతుంది. శృంగార, ఆధ్యాత్మ భావ సమ్మేళనమే మానవ జీవితం. ఆ జీవితాన్ని చివరగా శరణాగతి తత్త్వంతో పండించుకున్న ధన్యజీవి అన్నమయ్య.

***

# అన్నమయ్య సంకీర్తనల్లో వర్ణనాత్మక దృష్టి

**డా॥ టి. రఘునాథ్**
**తెలుగు అధ్యాపకులు**
**వాణీ జూనియర్ కళాశాల**
**వి.కోట**

నిజమైన భక్తుడంటే భేదభావములు లేనివాడు. "యద్భావం తద్భవతి". మనం ఏ దృష్టితో చూస్తే అదే దృగ్గోచరమవుతుంది. అంటే భగవంతుణ్ణి సద్భావనా దృష్టితో దర్శించాడు కాబట్టి అన్నమయ్య సద్భావి అయ్యాడు. తాను ఆ వేంకట నాథుణ్ణి హృదయ మందిరంలో బంధించి వెలయించిన భక్తిపదసుమాలు 32,000. శృంగారపరంగా పరిశీలించినా, ఆధ్యాత్మికపరంగా పరిశీలించినా ఒక్కొక్క సంకీర్తన

ప్రబంధాత్మకంగానే గోచరిస్తుంది. అన్నమయ్యకు భగవంతుడైన భూలోక వైకుంఠ వాసుడు వర్ణనీయుడు. తనను నాయికగా భావించి శ్రీ వేంకటేశ్వర స్వామిని నాయకుడిగా భావించుకొని పరవశంతో వలచి వలపించుకున్న వాగ్గేయ సంపన్న కారుడు అన్నమయ్య.

వెంకన్న వరప్రసాదితమైన అన్నమయ్య తెలుగువారి సాహిత్య పసిడిపంట. పదసాహిత్య భాండాగారానికి త్రిమూర్తులు త్రిజగన్మాతలు సృష్టించిన భక్తిపద సౌరభవం అందుకేనేమొ కలిమాయా ప్రభావంతో సతమతమయ్యే జనులకు అన్నమయ్య సంకీర్తనలు విన్నా చదివినా పండితపామరు లిరువురు స్వామిని వర్ణిస్తూ వెలయించిన తీరుకు మంత్రముగ్ధులవడమే కాకుండా ఎంతటి వారైనా దాసోహం. స్వామి వెలసిన చోటుకు, రూపానికి, పరిసర ప్రాంతానికి ప్రపంచ వ్యాప్త జనజీవన స్రవంతి, సకల జీవరాశులు తమ భక్తిప్రపత్తులను చాటుకోవడమే కాక ప్రణమిల్లుతూ పరిడవిల్లుచున్నారు. అన్నమయ్య సంకీర్తనల్లో వర్ణనాత్మక దృష్టిని గ్రహించడానికి సాధారణ వ్యాసంలో సాహసం చేయడం అసాధ్యం. కొన్ని సంకీర్తనల్లో పరిశీలించినట్లయితే అవగతమవుతుంది.

బండలాంటి హృదయులైనా కొండలోని కొండయ్యను దర్శించాలంటే ఆ కొండ విశిష్టతను తెలుసుకోవాలి. 'తిరు' అంటే తమిళంలోని శబ్దానికి తెలుగులో 'శ్రీ' అని అర్థం. 'మల' అనేది కూడా తమిళం. అంటే 'కొండ' అని భావం. 'శ్రీ' (లక్ష్మి) యొక్క భర్త వెలసిన కొండ అని గ్రహించాలి. అన్నమయ్య తిరుమల కొండను ఎలా వర్ణించాడో క్రింది సంకీర్తనలో గమనిద్దాం.

**"కట్టెదుర వైకుంఠము కాణాచయనకొండ**
**తెట్టెలాయ మహిమలే తిరుమలకొండ"**

(అన్నమాచార్య జీవిత చరిత్ర పీఠిక-అధ్యా. 262, తేకు, వే.ప్ర.శాస్త్రి,పుట-10)

ఈ కొండలో వేదాలే శిలలై వెలుగులను ప్రసరిస్తుంటాయి. ఏదిక్కు చూసినా పుణ్యాలే ఏరులై ప్రవహిస్తుంటాయి. బ్రహ్మలోకం మొదలు 14 లోకాలకంటే గొప్పదై ప్రకాశించేది. దేవతలు మృగాలై, తిరుగుతుంటారు. సముద్రాలే చరులు (కదులుతూ) ఉన్నది. కొండమీద వెలసిన ప్రతీ చెట్టు ఋషులకు ప్రతిరూపం. వరాలకు ఈ కొండ కొటారు (ధాన్యరాశులుండే చోటు). ఆశ్చర్యకరములైన మహిమలు ఇక్కడ తెట్టెలుగట్టి ఉంటాయి. వైకుంఠానికి ఈ పర్వతం కాణాచి – అనగా వైకుంఠమే ఇదని భావం. చతుర్భుజుడైన శ్రీహరి నివసించే శుభప్రదమైన కొండిది. ప్రతిష్టతో కూడి పాపాన్ని దహించేది కాబట్టి ఈ కొండ తిరువేంగడ మయింది.

తిరుపతి నగరవర్ణనను కడు హృద్యముగా వర్ణించాడు.

**"అదెచూడు తిరువేంకటాద్రి నాలుగు యుగము**
**లందు వెలుగొందీ ప్రభ మీరఁగాను"**

(ఆధ్యాత్మ సంకీర్తనలు : తి.తి.దే. సం-1, కీ-227)

అదిగో చూడు మూడు నామాలుగల స్వామి. పాపాలను సంహరించే కొండ. నాలుగు యుగాల్లోనూ వెలుగుతూ ప్రకాశిస్తున్నది. నూట ఎనిమిది తిరుపతులలో స్థానికంగా చక్రవర్తి పీఠాన్ని సొంతం చేసుకొని లెక్కలేనన్ని మఠములతో అలరారుతున్నది. మేడలు, మదుగులు, దివ్యత్వం గల తపస్వులున్న గృహాలు, ఆలవాలంగా ఉన్నాయి. అరయోజనము పొడవు, పదకొండు యోజనములు ఏ దిక్కున చూచినా మహావృక్షములు. సింహాలు, పులులు, దైవాంశ సంభూతులైన కిన్నరులు, కింపురుషులు, గరుడ గంధర్వులు, యక్షులు, పండితులతో విశ్రాంత దేశములాగా వేడుకలతో భూలోక వైకుంఠముగా పరిడవిల్లుచున్నది.

స్వామిని తలచుకుంటూ కొండెక్కుతూ మోకాళ్ళ పర్వతం మీదుగా వెళుతుంటే అక్కడక్కడా వేంకటాద్రీశుడి సంపదలు గుర్తుగా దర్శనమిస్తున్నాయి. సువాసనలు వెదజల్లే పూలతోటలు, చూడముచ్చటైన రకరకాల వనములు, నిటారుగా, గుంపుగా పెరిగిన పెద్దపెద్ద వృక్షాల నీడలు, ఆ నీడలక్రింద నిలిచి నిలిచి చూస్తుంటే బంగారుమయమైన గోపురాలు, ఆకాశాన్ని తాకుచున్నట్లుగా శృంగార రసభరితంగా జగతినేలే దివ్యసంపదలు గల కొండ కనిపిస్తుంది. పాపవినాశం, ఆకాశగంగ, కోనేరులు, పాశుపతులతో లెక్కలేనన్ని వైష్ణవాగమాలతో స్వామి విహరిస్తున్నట్లు వర్ణించాడు.

ప్రకృతిరూపుడు విష్ణువు అని కొనియాడుతూ స్వామి శరీరభాగాలు ప్రకృతి సంబంధితాలుగా అన్నమయ్య వర్ణించాడు.

**"అహోబలేశ్వరునకు నాదిమూర్తికి**
**విహారమే పంతము వీరసింహామునకు"**

(ఆధ్యాత్మ సంకీర్తనలు: సం-2, కీ-243)

| | | |
|---|---|---|
| చుక్కలు | - | మొలపూసలు |
| సూర్యచంద్రులు | - | కన్నులు |
| దిక్కులు | - | చేతులు |
| ఎండలు | - | దివ్యాయుధాలు |
| వేదములు | - | మించుకొన వెంట్రుకలు |
| శైలములు | - | పాదములు |
| జానువులు | - | లోకములు |
| కాలచక్రము | - | నోరు |

25

| | | |
|---|---|---|
| గ్రహాలు | - | పండ్లు |
| మేఘములు | - | సకల దివ్యాంబరాలు |
| అంతరిక్షం | - | నడుము |
| భూమి | - | పిరుదు |

ఉయ్యాల : ఉయ్యాలలో సహజంగా శిశువులను పడుకోబెట్టి ఊపుతూ పాటపాడినట్లే అన్నమయ్య కూడా స్వామికి ఉయ్యాల ఊపిన తీరు వర్ణన అద్భుతంగా కానవస్తుంది.

**"అలర చంచలమైన ఆత్మలందుండ నీ**
**యలవాటు సేసెనీ ఉయ్యాల**

(అన్నమయ్య ఆధ్యాత్మిక సంకీర్తనలు, తి.తి.దే. 1-67 కీర్తన)

స్థితికార్యరూపమైన విరాడ్రూపాన్ని, విభవాన్ని వర్ణించాడు. పూర్వ పశ్చిమాద్రులే కంబాలుగా, ఆకాశం అద్దదూలంగా, నాలుగు వేదాలు బంగారు చేరులుగా దాన్ని ధర్మదేవత పీఠంగా భావించాడు. ఒక ఊపులో శ్రీదేవిని, ఒక ఊపులో భూదేవిని కౌగిలించుకునే తీరులో అమరాంగనల హావభావ విలాసాన్ని చూపుతూ ఉయ్యాల ఊచబడిందని కమల సనాధి దేవతలకు ఇది ముదావహ మైందని ఇది వేంకటపతి ఉయ్యాల అని వర్ణించాడు. ఇది ఉచ్వాస, నిశ్వాస రూపంగా ఉందని ప్రాణ చైతన్యాన్ని ధ్వనింప చేశాడు. ఉయ్యాల ఊపులు దీర్ఘాలైన ఉశ్వాస, నిశ్వాసలుగా భావించాడు.

అన్నమయ్య సంకీర్తనల్లో వర్ణనాత్మక దృష్టిని పరిశీలించినట్లయితే భగవంతు డొక్కడే కథానాయకుడు. ఆయనే సర్వదా పూజ్యనీయుడు, ఆరాధనీయుడు, ప్రకృతి నియామాలను అనుసరించిన అవతారపురుషుడు. అన్నిటికి ఆధారమైన ఆధ్యాత్మిక స్మరణీయుడు. అన్నమయ్య పదాలు ఆధ్యాత్మిక భావాలు. ఒక్కొక్క సంకీర్తనలో ఒక్కొక్క వర్ణన ప్రస్తావించాడు. అన్నమయ్య సంకీర్తన కళ్యాణోత్సవ వర్ణనకు సంబంధించిన వర్ణన వధూవరుల వేషధారణలు, అలంకరణలు, వారి విలాసాదుల్ని పరిహాసపూర్వకంగా వర్ణిస్తూ యువతులు పాడే పాటను పరిశీలిద్దాం.

**"పిడికిట తలంబ్రాల పెండ్లికూతురు కొంత**
**పెడమరలి నవ్వీనె పెండ్లికూతురు"**

ఇందులో పెండ్లికూతురు అనేమాట ఆ వృత్తి అయింది. ఇందులో పేరంటాండ్ల మధ్య కూర్చొని సిగ్గుపడుతున్న పెండ్లికుమార్తెను మగనిపేరు చెప్పమని యువతీజనం వుడికించడం వర్ణించబడింది.

అన్నమయ్య సంకీర్తనలు ఆచంద్రతార్కాలు.

***

# అన్నమయ్య దృక్పథంలో శ్రీ వేంకటేశ్వరస్వామి స్వరూపం

**డా॥ డి. మస్తానమ్మ**
**పి.డి.ఎఫ్. (యు.జి.సి.)**
**తెలుగు అధ్యయనశాఖ**
**శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం**
**తిరుపతి**

అన్నమయ్య బహుముఖ ప్రజ్ఞావంతుడైన కవి, సంకీర్తనాచార్యుడు, తాత్వికుడు, విమర్శకుడు, విశ్లేషకుడు. వేదాలు, పురాణాలు, శ్రుతులు, స్మృతులు, రామాయణ, భారతాది ఇదిహాసాలు ఔపోసన పట్టాడు. అన్ని గ్రంథాల సారాంశాన్ని ఒకచోట రాశిగా పోశాడు. ఆ రాశియే శ్రీ వేంకటేశ్వరస్వామి అని ఉగ్గడించాడు. ఈ విషయం వారి సంకీర్తనలను అధ్యయనం చేసిన వారందరికీ తెలుస్తుంది. వివిధ గ్రంథాల్లోని అంశాన్ని తన సంకీర్తనల్లో చక్కగా విశ్లేషిస్తూ వచ్చి, వాటికి మూలం శ్రీ వేంకటేశ్వరస్వామియే అని అన్వయం కుదురుస్తాడు. అది అన్నమయ్య ప్రజ్ఞకు నికషోఫలంగా నిలుస్తున్నది. అన్నమయ్య సాహిత్యాన్ని అధ్యయనం చేసిన వారికి సామాజిక, పౌరాణిక చారిత్రకాది విషయ పరిజ్ఞానం స్పష్టంగా బోధపడుతుంది.

హిందూమత శాస్త్రాల ప్రకారం మన దేవతల సంఖ్య ముప్పది మూడు కోట్లు. ఆ అంశలన్నిటికి మూలము శ్రీ వేంకటేశ్వరస్వామియే అంటాడు అన్నమయ్య. ఈ కింది సంకీర్తన దానికి ప్రబల నిదర్శనంగా చెప్పవచ్చు.

**1. హరి అవతారములు :**

**"భావములోనా బాహ్యమునందును**
**గోవింద గోవింద యని కొలువవో మనసా"** **(3-561)**

అంటాడు అన్నమయ్య.

దేవతలందరూ హరి అవతారాలేనని, ఆ హరిలోనే బ్రహ్మాండాలు ఇమిడి ఉన్నాయని, విష్ణువొక్కడే విశ్వాంతరాత్ముడని అన్నమయ్య అంటాడు. ఆ విష్ణువు అవతారమే శ్రీ వేంకటేశ్వరస్వామి. ఆ దేవదేవునికి గోవిందుడనే పేరు కూడా ఉంది. అందుకే అన్నమయ్య పల్లవిలోనే శ్రీ వేంకటేశ్వరస్వామి వారి నామాంతర మైన 'గోవింద' శబ్దాన్ని ప్రయోగించాడు. మరొక సంకీర్తనలో దశావతారాలన్నీ శ్రీ వేంకటేశ్వర స్వామియే నంటాడు. ఆ సంకీర్తన ఇలా ఉంది.

**"డోలాయాం చల డోలాయాం హరే డోలాయం** **(2-374)**

అంటూ వర్ణించాడు.

పై సంకీర్తనలో మీన, కూర్మ, వరాహ, వామన, పరశురామ, శ్రీరామ, బలరామ, శ్రీకృష్ణ, బుద్ధ, కల్కి అనే దశావతారాలు పేర్కొనబడ్డాయి. ఈ అవతారా లన్నిటికీ శ్రీ వేంకటగిరికూట నిలయుడైన శ్రీ వేంకటేశ్వర స్వామియే మూల మంటాడు అన్నమయ్య. కలియుగ ప్రత్యక్షదైవంగా శ్రీ వేంకటేశ్వరస్వామి వారు వెలుగొందుచుండుటయే దానికి నిదర్శనం.

**2. స్వామివారి అవతార లీలలు :**

శ్రీ వేంకటేశ్వరస్వామి దశావతారాలు ఎత్తిన సంగతే గాక, ఆయా అవతారాల్లోని లీలలను కూడా అద్భుతంగా వర్ణించాడు అన్నమయ్య. మచ్చుకు రామావతార లీలలను పరిశీలిద్దాం.

**"దేవం భజే దివ్య ప్రభావం**
**రావణాసుర వైరి రఘుపుంగవం" (1-314)**

రాజవరశేఖరుడని, రవికుల సుధాకరుడని, ఆజానుబాహుడని, కోదండాన్ని చేబూనిన వాడని, రాజీవలోచనుడని, నీలమేఘశ్యామ శరీరం కలవాడని, ధర్మ సంస్థాపకుడని, జనకుని చాపాన్ని విరిచిన వాడని, లంకను జయించిన వాడని, విభీషణుని లాలించిన వాడని వర్ణిస్తూ చివరిలో వేంకటేశం సాధు విబుధ వినుతం అని శ్రీ వేంకటేశ్వరస్వామి వారితో రామున్ని అన్వయించాడు.

అదేవిధంగా నృసింహావతారానికి - శ్రీ వేంకటేశ్వరస్వామి వారికి అన్వయం కుదిర్చి ఇలా చక్కని సంకీర్తన చెప్పాడు తాళ్లపాక అన్నమయ్య.

**"కదిరి నృసింహుడు కంభమున వెడలె**
**విదితముగ సేవించరో మునులు" (4-32)**

అన్నమయ్య దృక్పథం ప్రకారం కదిరిలో నరసింహావతారం జరిగింది. ఆ నరసింహస్వామి ముఖము చూడడానికి భయంగా, ఉద్రగంగా ఉంటుందని, కేసరాలు జ్వాలా మయంగా ఉంటాయని, దంతాలు కాలరౌద్ర సంఘటితంగా ఉంటాయని, ఆ అవతారపురుషుని చేతిలో సకలాయుధాలు, సహస్ర భుజాలతో అమరి ఉన్నాయని - ఆ భీకరస్వరూపుడు ఎవరోకాదు సాక్షాత్తు శ్రీ వేంకటేశ్వర స్వామియే అంటాడు అన్నమయ్య. నృసింహావతారం తెలంగాణలోని యాదగిరి గుట్టలో జరిగిందని అక్కడి స్థలపురాణం చెబుతోంది. అయితే రాయలసీమ ప్రాంతం వాడైన అన్నమయ్య కదిరిలో జరిగిందని ప్రస్తావించాడు. అంతా ఆ భగవంతుని సృజనే కాబట్టి దానికి ప్రాంతీయ భేదాలు పాటించరాదు.

**3. హరితత్వం - అన్నమయ్య :**

హరియవతారములే అఖిల దేవతలు అని వక్కాణించిన అన్నమయ్య - హరి నెరిగిన వాడే ధన్యాత్ముడంటాడు. దీనికి ఈ కింది సంకీర్తన గట్టి నిదర్శనంగా

నిలుస్తుందనవచ్చు. హరి సర్వాంతర్యామి కాబట్టి సృష్టిలోని సర్వస్వమూ వేంకటేశ్వరస్వామి లీలావిశేషమే నంటాడు అన్నమయ్య.

**"ఏ కులజుఁడేమి యెవ్వఁడైన నేమి**
**ఆకడ నాఁతడె హరి నెఱిగిన వాడు"** **(1-292)**

ఏ కులంవాడైనా, ఎవ్వడైనా హరిని గూర్చి తెలిసికున్నవాడె ధన్యాత్ముడంటాడు. ఈ సంకీర్తనలో శ్రీ వేంకటేశ్వరస్వామి వారి దాసుని కుండవలసిన లక్షణాలను గూర్చి కూడా వివరిస్తాడు అన్నమయ్య. సత్యసంపన్నుడు, పరనింద సేయనివాడు, భూతదయ కలిగినవాడు, పరులను తానుగానే భావించువాడు, నిర్మలమైన ఆత్మ నియతి కలిగినవాడు, ధర్మ తత్పర బుద్ధి కలిగినవాడు, కర్మమార్గాలలో పోనట్టి వాడు, హరిభక్తిని మరవనివాడు, ఇతరుల హితము కోరువాడు, పగబుద్ధి లేకుండా బ్రతుకువాడు మాత్రమే శ్రీ వేంకటేశ్వరస్వామి సేవకు తగినవాడని అన్నమయ్య అంటాడు. ఇన్ని గుణాలు కలిగిన వారిలో ఆ దేవదేవుడు ఉంటాడన్నది అన్నమయ్య భావన. అఖిల దేవతా స్వరూపాలే కాకుండా సజ్జనులలో కూడా శ్రీ వేంకటేశ్వర స్వామి ఉంటాడంటాడు అన్నమయ్య.

**4. సకల జీవుల్లో నివాసుడు స్వామి :**

మరొక సంకీర్తనలో సకల జీవులలోను నిగూఢంగా ఉన్న పరమాత్ముడు శ్రీ వేంకటేశ్వరస్వామియే నంటాడు అన్నమయ్య.

**"భక్తి కొలది వాడే పరమాత్ముడు**
**భుక్తి ముక్తిఁ దానే యిచ్చు భువిఁబరమాత్ముడు"** **(1-410)**

- అంటాడు అన్నమయ్య.

ఈ భువిలో భుక్తిని ముక్తిని ఇచ్చువాడు పరమాత్ముడంటాడు అన్నమయ్య. మరి ఆ పరమాత్మ దెవ్వరంటే శ్రీ వేంకటేశ్వరస్వామి వారు. ఆయన సకల జీవులకు ప్రాణమంటాడు అన్నమయ్య. అంటే శ్రీ వేంకటేశ్వర ఆ స్వామివారి స్వరూపం కానిది ఈ సృష్టిలో ఏదీ లేదన్నది అన్నమయ్య భావన. అందువల్ల ఆ స్వామి పాదసేవకు అంకితం కావడం మన గమ్యం, లక్ష్యం కావాలంటాడు అన్నమయ్య. మనమేకాదు మనకంటే ముందు ఆ దేవదేవుని పాదాలను కొలిచి పునీతులైన వారి వివరాలను కూడా అన్నమయ్య పట్టిక కట్టి చూపాడు ఈకింది సంకీర్తనలో-

**"ఈ పాదమె కదా యిలయెల్లఁ గొలిచినది**
**ఈ పాదమె కదా ఇందిరా హస్తముల కితవైనది'** - అంటాడు. **(1-66)**

ఎన్నెన్నో మహిమలు చూపిన ఈ పాదము చివరికి తిరుమల కొండపై నిలిచింది. ఆ పాదాన్ని దర్శించి, స్పర్శించి, తరించటం మన ధర్మం.

**5. శ్రీ వేంకటేశ్వర స్వామివారి మంత్రం :**

ఒక్కో దేవతను స్మరిస్తూ ఆధ్యాత్మిక విదులు ఒక్కొక్క మంత్రాన్ని ఉపదేశించారు. అయితే సకల దేవతల మంత్రాలు శ్రీ వేంకటేశ్వరస్వామి మంత్రంలోనే దాగి ఉన్నాయంటాడు అన్నమయ్య. దానికి నిదర్శనమే ఈ కింది సంకీర్తన.

**"అన్ని మంత్రములు నిందే యావహించెను**
**వెన్నతో నాకుఁ గలిగె వేంకటేశు మంత్రము"** - అంటాడు. **(4-438)**

'ఓం నమో వేంకటేశాయ' అన్నది శ్రీ వేంకటేశ్వరస్వామి వారి అష్టాక్షరీ మంత్రం. నారాయణ, నారసింహ, రామ, వాసుదేవ, కృష్ణ, విష్ణు, పరబ్రహ్మ వంటి వివిధ దేవతా స్వరూపాలు చక్కని మంత్రాలు కలిగి ఉన్నాయి. అవన్నీ ఎంతో మహిమ కలిగినవి. ఆ మంత్రాలను జపించి ఎందరో తమ ఇష్టకామ్యార్థ ఫలాలను పొందారు. అయితే వాటన్నిటి కంటే విశిష్టమైనది శ్రీ వేంకటేశ్వర మంత్రమంటాడు అన్నమయ్య. ఎందుకంటే సకల దేవతలకు అధిపతి వేంకటేశ్వరు దేనని, ఆయన లీలా విశేషాదులే ఈ సృష్టియని అన్నమయ్య భావన. అన్నమయ్యే కాదు వివిధ పురాణాలు కూడా ఈ విషయాన్నే నొక్కిచెప్పి బలపరుస్తున్నాయి. ఆధ్యాత్మిక ఋషీశ్వరులు సంస్కృతంలో ఈ విషయాన్ని చెప్పగా, దానిని అన్నమయ్య సరళశైలిలో జానపదబాణీలో సామాన్య ప్రజలను దృష్టిలో ఉంచుకొని చెప్పాడు.

అందువల్లనే వివిధ పురాణాలు, శాస్త్రాలు 'కలౌ వేంకట నాయకః' అని వక్కానిస్తున్నాయి.

***

# అన్నమయ్య కీర్తనలు-సామాజిక సందేశం

**శ్రీమతి యం. హేమలత**
**చరిత్ర విభాగాధిపతి**
**శ్రీ పద్మావతి మహిళా డిగ్రీ మరియు**
**పి.జి. కళాశాల, తిరుపతి**

శ్రీ తాళ్ళపాక అన్నమయ్య క్రీ.శ. 1408-1503 కాలం నాటి వారు. రాయలసీమ నివాసి, కడప జిల్లా తాళ్ళపాక గ్రామంలో తాళ్ళపాక మండలం నారాయణసూరి, తిక్కమాంబలకు జన్మించిన కుమార రత్నం. తన 16హారవ ఏటనే శ్రీ వేంకటేశ్వరస్వామి వారి యొక్క కటాక్షం పొందిన ఏకైక జానపద వాగ్గేయకారుడు. అన్నమయ్య ఒక గొప్ప సందేశకుడు, ఒక మహాకవి, గొప్ప జానపద వాగ్గేయకారుడు "కామికాని వాడు మోక్షగామి కాదు" అన్న పెద్దల మాట ఎంత నిజమో అంతే

వాస్తవం శ్రీ తాళ్ళపాక అన్నమయ్య జీవితం. ఆయన సృచించని విషయములు లేవు. గొప్ప తత్త్వవేత్త. శృంగార ఆధ్యాత్మిక సంకీర్తనలనే గాక ఆయన రచనలలో గొప్ప సామాజిక సందేశమున్నది.

శ్రీమన్నారాయణునికి ప్రసిద్ధమైన పది అవతారాలున్నట్లు, అన్నమయ్య సంకీర్తనలకు కూడా పది స్వరూపాలున్నాయి. అన్నమయ్య సంకీర్తనలు –

| | |
|---|---|
| 1. శ్రుతులు | 6. విపుల మంత్రార్థాలు |
| 2. శాస్త్రాలు | 7. నీతులు |
| 3. పురాణ కథలు | 8. కృతులు |
| 4. సుజ్ఞాన సారాలు | 9. మతులు |
| 5. యితిలోకాగమ వీధులు | 10. వేంకటపతి రతి క్రీడా రహస్యాలు |

అన్నమయ్య తన సంకీర్తనలను కృతులుగా కూడా భావించాడు. మరియు పదములని, జావళీలని మరియొక పేర్లు కూడా కలవు.

అన్నమయ్య కవితకు ఆలంబనం సమాజం. ఆయన కవిత్వం సమాజం కోసమే. క్రీ.శ. 15వ శతాబ్దిలో తాళ్ళపాక అన్నమాచార్యులు శ్రీ వేంకటేశ్వ రాంకితంగా 32,000 సంకీర్తనల్ని రచించాడు. అన్నమయ్య పండిత పామర జనరంజకుడైన వాగ్గేయకారుడు లోకజ్ఞుడు సమాజంలో తాను రచించిన విషయాలను ప్రజలకు సులభంగా అర్థమయ్యే రీతిలో తెలియజెప్పాలని ఆయన సంకల్పం. ఈయన సాహిత్యం పైకి తేటగా కనిపించినా లోతుల దిగితే అనితర సాధ్యమైన భావ పరంపరలు దొంతరల దొంతరులుగా మానసాన్ని తాకుతాయి. వేదోపనిషత్తుల సారాన్ని సామాన్య ప్రజలకు ఆధ్యాత్మిక సంకీర్తనల ద్వారా అందించాడు.

గ్రామంలో జన్మించిన అన్నమయ్యకు సమాజం గూర్చి అవగాహన ఎక్కువ అని ఈ సంకీర్తన ద్వారా తెలుస్తుంది.

**“వేదంబులు పౌరాణిక**
**వాదంబులు వరకవిత్వ వాణీ వీణ**
**నాదంబులు కృత సుజనా**
**హ్లాదంబులు తాళ్ళపాక యన్నయ పదముల్”**

సమాజం పట్ల ఆయనకున్న అవగాహన మరెవరికి లేదనే చెప్పాలి. సమాజంలో జరిగే ప్రతి విషయంపై తన దృష్టి నిలిపాడు. ప్రజలతో కలసి చిందులు తొక్కాడు. ఏలలు పాడాడు. అల్లో నేరేల్లు అందుకున్నాడు. తన జానపాద గేయాలతో వారి ఆలోచనా పద్ధతిలో తత్త్వాన్ని విశదీకరించాడు. ఇంతగా ప్రజలతో కలసిపోయి, ముఖ్యంగా గ్రామీణులకోసం సంకీర్తనలు వ్రాసిన వాగ్గేయకారులు మరెవ్వరూ కనిపించరు. ఈ విషయంలో అన్నమయ్యకు అన్నమయ్యే సాటి.

**ఆహారం** : మనిషి మనుగడకు ఆహారం చాలా ముఖ్యం. తన సంకీర్తనల ద్వారా ఆహారంలోని వివిధ రకముల గూర్చి పేర్కొన్నారు.

1) కూడు, 2) గంజి, 3) చద్ది, 4) చల్ల, 5)పెరుగు, 6) పాలు, 7) అంబలి, 8) పచ్చితేనె, 9) కెళంగులను వర్ణించాడు.

ఆధ్యాత్మిక అంశాలలో ఆహార పదార్థాలను పేర్కొన్నాడు. "ఆకలి రుచి ఎరుగదు, నిద్ర చోటెరుగదు" అని "అన్నం పరబ్రహ్మ స్వరూపమని" "కూటి కోసం కోటి విద్యలని" అని పేర్కొన్నాడు. ఆహార పదార్థాల రకాల గురించి పేర్కొంటూ -

**"గుఱుతు గల రత్నంబు గుగ్గిళ్ళు జానగశెల**
**పఱచుటచే తన బుద్ధి పాడాటగాదా"**

మధుర భక్తి అంశాలలో ఆహార పదార్థాల గురించి పేర్కొన్నారు. అంబళ్ళు, ఆకుపచ్చడి, ఉప్పు, కంది, కుడుము, కజ్జాలోలము, కారం, చింతల పులుగులు, తారిబియ్యం, నిప్పటి, పెరుగు, విందు, వేడికూరలు పేర్కొన్నారు.

స్వామి. వారి నైవేద్యాల గురించి, ఆనాటి సమాజంలో అంబాళపు గాయలు, జున్ను, అప్పాలు, వడలు, గారెలు, లడ్లు, మొదలైన వాటి గురించి పేర్కొన్నాడు.

**ఆభరణములు** : మనిషికి ఆహారము ఎంత ముఖ్యమో అంతే అవసరం ఆభరణాలు అని పేర్కొన్నాడు. ప్రాంతీయ భేదాలను బట్టి రాయలసీమ, సాగరసీమ, తెలంగాణసీమ అని, స్త్రీ పురుష భేదం బట్టి కూడా ఆభరణాలు, ఆభరణాల అలంకరణలు మారుతాయని పేర్కొన్నాడు. అలాగే అంతస్తు, వయస్సు, వృత్తుల బట్టి మారుతాయి, సమయ సందర్భాలను బట్టి గూడా ఆభరణాలు ధరించడంలో మార్పులుంటా యని పేర్కొన్నాడు. అన్నమయ్య ఏడువారాల సొమ్ములు గూర్చి, స్వామి వారి ఆభరణాల గూర్చి ప్రస్తావించాడు.

కంచుటుంగరం, కంచుమట్టెలు, వెండికుప్పె కడియాలు, కమ్మలు, గజ్జెలు, గాజులు, అందెలు, ఉంగరాలు, ఒడ్డాణం, మువ్వలు, ముత్తెపు సరములు, మణులు మాణిక్యాల హారాలు, నీల మణిహారములు గూర్చి ప్రస్తావించాడు.

అన్నమయ్య కీర్తనలలో దేవతల ఆభరణాల గూర్చి కఠారు, కిరీటం, చక్రము, భుజకీర్తులు, ముత్తెపునామము, అంటూ స్వామివారి అలంకరణల వర్ణనలకే ప్రాధాన్యమిచ్చాడు.

**"పెట్టెగ వజ్రపు టెండెపు తళులు**
**అట్టిట్ల చిమ్ముచొ నలమేల్ మంగ"**

అని అలమేలు మంగమ్మ అలంకరణను గూర్చి తన సంకీర్తనలలో పేర్కొన్నాడు.

ఆధ్యాత్మిక భావనలు అలంకరణాల ప్రసక్తిగా పాతచీరను ఒడిలి కొత్త చీరను ధరించినట్లు -

**"పాత చీరమ్మని కొత్తచీర కట్టినట్లు**
**ముదిమీను మావిదేహి మొగి కత్తెకుని మోదు"** అని పేర్కొన్నారు.

**అలంకరణలు :** వస్త్రాలంకరణ, వేపనాలంకరణ-నాగరిక-అనాగరిక వ్యక్తుల అలంకరణల్ని వర్ణించాడు. కొన్ని అలంకరణలలో మధురభక్తికి ప్రాధాన్యమిచ్చాడు.

సామాన్య స్త్రీ పురుషులు పావడ, రవిక, కోక, పంచ ప్రస్తావిస్తే ధనవంతులు పట్టుచీర, పట్టుపంచల వస్త్రాలంకరణ పేర్కొన్నాడు. అన్నమయ్య సంకీర్తనలలో తాంబూలాన్ని ఔసమ్య రూపంలో వాడడం కూడా కనిపిస్తుంది.

దైనందిన జీవితంలో చివరిఘట్టం నిద్రించడం. పగలంతా అలసి, సొలసి హాయిగా నిద్రించడం అందరికీ అలవాటే.

**"చంగన దోబవ్వళించే శయ్యపై బొరలితే**
**రంగుగా గళలు దాకె రతినది చాలదా"** అని పేర్కొన్నాడు.

దోమల నుంచి రక్షణ పొందేందుకు దోమెతరల వాడకం గురించి -

**"చేరి దోమతెరలోని శ్రీ వేంకటేశ నిన్ను**
**గోరనూది కౌగలించి కొసరీ దాపె"** అని పేర్కొన్నాడు.

"ధనమూల మిదమ్ జగత్" అని. మనిషికి ఆర్థిక కార్యకలాపాలను చర్చించే విధంగా సందేశాన్నిచ్చాడు. ఈ ప్రపంచం ఒక నాటకం భగవంతుడే సూత్రధారుడు. ఇల్లు అనేది ఎలా ఉండాలని, ఆ ఇళ్ళలలో కూడా ఇల్లు, కొట్టం, గుడిశ అని రకరకాలుగా వివరించాడు రుక్మిణి శ్రీకృష్ణుల సరస సమయంలో అన్నమయ్య సామాన్య కుటుంబంలో జరిగే విషయాలను సమన్వయిస్తూ పేర్కొన్నాడు.

**"లకిమమ్మకేమైనా లంచము లిమ్మరో**
**శుకవాణి తలపు మూసుక తియ్యదు"** అని వివరించాడు.

దేహం పెద్ద చారడి, దేహి దానిలో కొలువుండే అధికారి. ఎప్పుడు జీవిని వెంటనే దండు విషయేంద్రియాలను అధికారి పరివారం ఈ విషయాన్నే అన్నమయ్య.

**"ఉప్పదమయి దేహమనే వూరపెద్ద చావడి**
**ఉప్పతిల్లి దేహి కొలువున్నపుడు"** అని తెలియజేశాడు.

ఆనాటి సమాజంలో పెద్దవారు ఇంటిముందు అరుగులపై కూర్చొని మంచిచెడ్డలు మాట్లాడ్డం, న్యాయనిర్ణేతలుగా వ్యవహరించడం, వైద్యసలహాలు చెప్పడం, పిచ్చాపాటీ మాట్లాడ్డం చేస్తున్న సమయాలలో స్త్రీలు ఎలా వుండాలని పేర్కొన్నాడు.

**"వాకిట నందరుండ కావడిగే లోనికి నేగి**
**యేకతాన నున్న పతినెట్లు చెలికితివే"**

దేహాన్ని గృహమని, దేహిని గృహస్థుడని, నవద్వారాలు కలిగిన ఈ దేహాన్ని వెలిగింతల కొంప అని అన్నమయ్య -

**"వెలిగింతల కొంపలు వీడు బట్లు చూపేరా**
**తలవదులెందులో నాదప్పు వెదకేరు"** అని వివరించాడు.

వంటగది ప్రాముఖ్యతను అన్నమయ్య గృహోపకరణాల్ని ఆధ్యాత్మిక శృంగార సంబంధిగా అన్వయించి కీర్తనలు వ్రాశాడు.

ఇంటికి వంటశాల ప్రధాన కేంద్రం లాగా ఆలయంలో ఉన్న స్వామి ప్రధాన కేంద్రం. వేడి అయిన ఆహార పదార్థాల్లో అబక పెడితే వేడెక్కుతుంది కాని అబకను పట్టిన చేయి వేడెక్కదు. కర్మలు దేహానికి గాని దేహికి కావు. దేహం కూడా పుణ్యపాపాలు కారణంగా రోగాలకు నిలయంగా మారవచ్చు. రూపు చెడనూ వచ్చు. దేహానికి పట్టిన గతి ఆత్మకు లేదు. దేహం అనిత్యం. ఆత్మ నిత్యం. అబకం వాడుతున్నంత కాలం దానికి శీతోష్ణ బాధలు తప్పవు. అలాగే దేహము మోచినంత కాలం బాధలు తప్పవని సందేశాన్ని అందించాడు.

అన్నమయ్య సమాజంలో నిత్యం వాడే వస్తువుల గురించి కూడా పేర్కొన్నాడు. అవే ఉట్టి, కుండ, కూటికుండ, చిల్లువ కడవ, చెంబు, తెడ్డు, మూకుడు, గొడుగు, చిప్ప, రోకలి, సురటి (విసనకర్ర), గడ్డపార, గొడ్డలి, చేట, దాలి ల గురించి వాటి ప్రాముఖ్యతను తెలియజేశాడు.

**వృత్తులు-జాతులు** : అన్నమయ్య తన సంకీర్తనలలో వర్ణములు, జాతులను పేర్కొన్నాడు. విష్ణువు సర్వాంతర్యామి, మనుష్యులంతా విష్ణువు సంతతి. విష్ణువు సర్వత్రా సంపూర్ణుడు. సర్వాత్మకుడైన విష్ణువునే దర్శించాలని అన్నమయ్య సందేశం. "ఎవరి జాతి వారి కింపు" అన్న విషయాన్ని తెలియజేశాడు. మన సమాజ వ్యవస్థలో చతుర్వర్ణాలు ప్రధానంగా పేర్కొనబడ్డాయి. వెనుకబడిన జాతి వారి గురించి అన్నమయ్య-

**"తందనాన ఆహి తందనాన పురె**
**తందనాన భళా తందనాన"**

అని సామాజిక స్పృహతో పేర్కొనడం అతని సాహసం అని తెలుపవచ్చు. సమాజంలోని నాలుగు వర్ణాలతో పాటు పంచములు, ఎరుకసోది, చెంచుల గూర్చి కూడా పేర్కొన్నాడు.

అన్నమయ్య సంకీర్తనాలలో - పండిత పామర వాగ్గేయకారుడుగా ఆయన వృత్త్యాత్మ సంకీర్తనల కెంతో ప్రాధాన్యమిచ్చాడు.

అన్నమయ్య సమాజంలో సాంస్కృతిక జీవన విధానం ఎలా ఉండాలో తన సంకీర్తనల ద్వారా సందేశమిచ్చాడు. మనిషి జీవనవిధానం ఎలా ఉండాలని కౌమారము, యవ్వనం, గృహస్థు, వానప్రస్థముల గురించి వివరించాడు.

సమాజంలో కుటుంబం కీలక మయినదని, సంప్రదాయాలతో పాటుగా సంస్కృతిని కూడా చవి చూపించేది కుటుంబమేనని పేర్కొన్నాడు. భారతదేశంలో సమిష్టి కుటుంబాలున్నాయని ఉండాలని పేర్కొంటూనే, భార్యభర్తల మధ్య గల

సంబంధాన్ని పేర్కొన్నారు. భార్యాభర్తలు సంసార శకటానికి రెండు చక్రాలు అని, కుటుంబ వ్యవస్థకు స్త్రీ మూలస్తంభం. సంసారంలో స్త్రీకే ఎక్కువ ప్రాధాన్యం అని తన కీర్తనల ద్వారా తెలిపాడు. కుటుంబంలోని సభ్యుల మధ్య గల అనురాగాన్ని, ఆత్మీయతను, బంధాలను, అనుబంధాలను, బాధ్యతలను గూర్చి చక్కటి వివరణలు తెలిపాడు. మానవుడు సంఘజీవి. సంఘంలో వ్యక్తి ఒక యంత్రంలోని మరవంటి వాడని పేర్కొన్నాడు. జంతువుల గూర్చి, వాటి ప్రాముఖ్యతను గూర్చి పేర్కొన్నాడు. ఆవు, దూడ, పొట్టేలు, మేక, చిలుక, నెమలి, హంస, ఎలుక, చీమ, తేలు, ఏనుగు, జింక, సింహం జంతుల గూర్చి పేర్కొన్నారు.

అన్నమయ్య సంకీర్తనలలో - పండుగలు సామాజిక ప్రయోజనం కోసం ఏర్పడినవే అన్నాడు. ఉగాది, దీపావళి, కృష్ణ జయంతి, విజయదశమి, లక్ష్మీదేవి పండగ, నోములు గురించి ప్రస్తావించాడు.

**వినోదం :** క్రీడ, వేడుకలు, వేటకు వెళ్ళడం, ఇంద్రజాలం, తోలుబొమ్మలాట, నాటకం, చదరంగం, పాచికలాట, పురాణగాథలు చెప్పుకోవడం, 64 కళల గురించి, మూఢనమ్మకాలపై నమ్మకం, సామెతల గూర్చి తన సంకీర్తనలలో పేర్కొన్నాడు.

**శృంగారం :**

జీవితాన్ని అందంగా ఆకర్షణంగా మలచుకోవడంలో శృంగారానికున్న ప్రాధాన్యతను, అవసరాన్ని తన శృంగార సంకీర్తనలలో తెలిపాడు. అన్నమయ్య సమాజంలో దర్శించిన శృంగారం మూడు విధాలుగా శృంగార సంకీర్తనల కెక్కింది. 1) దాంపత్య శృంగారం, 2) పుంశ్చలీ శృంగారం, 3) సమయానుకూల శృంగారం అని పేర్కొన్నారు.

**ఆధ్యాత్మిక జీవనం :** అమావాస్య పౌర్ణమిల లాగా జీవితంలో సుఖము, దుఃఖము మారిమారి వస్తుంటాయి. ఏది శాశ్వతంగా నిలవదు. ఆధ్యాత్మిక జీవితానికి మతం ఆయువు పట్టు. మతం అంటే అభిప్రాయం సమ్మతి, శాస్త్ర సమ్మతం తెలియబడింది. పూజింపబడింది. అన్నమయ్య కీర్తనలు మూడు కోణాలుగా తెలుస్తాయి. 1) దేవతాస్తుతి, 2) అద్వైత సిద్ధాంతాలు, 3) అద్వైత పరిభాష.

అన్నమయ్య తన భక్తి వలన ప్రచారం కోసం ఎన్నో గ్రామాలు సందర్శించి ఆయా ప్రాంతాలలో జరిగే పూజా విధానాలూ ప్రజలను 'తన సంకీర్తనల ద్వారా తెలియచేశాడు. అన్నమయ్య కాలంలో వ్యాప్తిలో ఉన్న ఆధ్యాత్మిక నమ్మకాలను అక్షరబద్ధం చేసి అన్నమయ్య తరువాత వారికందించాడు. ప్రతి చిన్న విషయాన్ని కూడా అన్నమయ్య తన సంకీర్తనల ద్వారానే నాటి తరానికి, నేటి తరానికి సందేశాన్ని అందించిన ఏకైక వాగ్గేయకారుడు.

***

# అన్నమయ్య సంకీర్తనలలో ఆటపాటలు

**శ్రీమతి యం. ఉషారాణి**
**వ్యాయామ శాఖాధిపతి**
**శ్రీ పద్మావతి మహిళా డిగ్రీ మరియు పి.జి. కళాశాల**
**తిరుపతి**

బ్రహ్మ, విష్ణువు, మహేశ్వరులు త్రిమూర్తులు. వీరిలో "విష్ణువు" అవతారాలను పురాణాలు వర్ణించాయి. పరమపదం లోకి స్వామి తనలోకం నుంచి ఈలోకానికి అవతరించడం అవతార స్వరూపం. విష్ణువు అవతారాలను అంశాన తారాలు, కళావతరాలు అని కొందరు వర్గీకరించారు. ఏది ఏమయినా భగవంతుడు దుష్ట శిక్షణార్థం, శిష్టరక్షణార్థం అవతరించడం అవతారం. ఈ అవతారాలను కవులు భక్తితో, రక్తితో, ఆట పాటలతో వర్ణించడం అలవాటు. వారిలో పదకవులది విశిష్టస్థానం.

శ్రీ తాళ్లపాక అన్నమాచార్యులు 15వ శతాబ్దంలో శ్రీ వేంకటేశ్వరస్వామిని 32,000 సంకీర్తనలలో కీర్తించి సంకీర్తన పెన్నిధిగా భక్తిని లోకానికి అందించి నటువంటి మహాభాగవతోత్తముడు. అన్నమయ్య తన సంకీర్తనలలో భగవంతుని చేరడానికి వివిధ మార్గాలను అందించారు. ఆటపాటలతో భగవంతుని కీర్తించడం సంకీర్తనాచార్యుల విభిన్న పథం ఆ దారిలో అన్నమయ్య తన కీర్తనలలో ఆటపాటలకు స్థానం కల్పించారు. శరీరానికి వ్యాయామం ఆవశ్యం కనుక ఈ ఆటపాటల గురించి పరిశీలించడం ముఖ్యమైన అంశం. కొన్ని ప్రత్యేక సందర్భములందు ఆటలు ఆడుకుంటూ పాడుకొను పాటలు.

**గొబ్బిళ్ళ పాటలు** : ప్రాచీనమైన గేయ రచనలలో ఇవి ముఖ్యమైనవి 'గొబ్బి' అనగ నమస్కారము, బాల్యక్రీడా విశేషముగా నిఘంటువులు పేర్కొనుచున్నవి. గొబ్బెమ్మ పదము 'గోపెమ్మ' పదభవము. అరవమున గొబ్బియళ్ళో అని వాడుక.

అన్నమయ్య పదాలలో గొబ్బిపాట ప్రసిద్ధమైనది. ఈ పాటలో గోపికలు శ్రీకృష్ణుని నాయకునిగ జేసి, తమ ఊహల ఉయ్యాలలో ఊగిన వీర శృంగార మూర్తిని తన్మయత్వములో గానము చేసినారు.

**"కొలని దోపరికి గొబ్బిళ్ళో యదు**
**కులము స్వామికి గొబ్బిళ్లో"**

అల్లో నేరేళ్ళు : ఇలి కూడ దేశీయమైన రచనలే. వెన్నెల రాత్రులందు ఆరుబయట కన్యలు రెండు జట్లుగా వేరుపడి ఆడుతు పాడే పాటలే అల్లో నేరేళ్ళు. ఇందు వైష్ణవ సంబంధమైనవి, శైవసంబంధమైన పాటలు కూడ ఉన్నవి. వేంకటేశ్వరుడు సాక్షాత్తు

విష్ణుమూర్తి యొక్క అవతారము. శ్రీమన్నారాయణుడు నీలమేఘశ్యాముడు, అల్లో నేరేడు పండు రంగున బోలిన చాయగల వేంకటేశ్వరుని కీర్తించుచు అన్నమయ్య బహుశ "అల్లో నేరేళ్ళు" అని పదమును వాడి యుండును.

అల్లనేరేళ్ళు అల్లోనేరేళ్ళుగా మారియుండును నేరేళ్ళు రెండు రకాలు. పెద్దవైన మంచి నేరేళ్ళను అల్లనేరేళ్ళందురు. చిన్నవానిని కుక్కనేరేళ్ళని అందురు. అన్నమయ్య రచించిన ప్రసిద్ధమైన అల్లో నేరేడు పదము.

**రాగం : దేసాళం**

"నెయ్యములల్లో నేరేళ్ళో
వొయ్యన పూరెడి వువ్విళ్ళో"

**రాగం : హిందోళ వసంతం**

**"జగడపు జనవుల జాజర**
సగినల మంచపు జాజర"

అన్నమయ్యగారి ఈ జాజర పాటను పరిశీలించినపుడు వసంతోత్సవము లందు స్త్రీలు పుప్పొడి, గంధము పొడులను తమ ప్రియుల మేనులపై చల్లినప్పటి పాట యని తెలియుచున్నది. ఈ పాట కోలాటం ఆటకు చాలా గుర్తింపబడినవి. భర్త అనురాగము, ప్రేమ తమకు మాత్రమే దక్కవలెనని అన్నమయ్యపై సంకీర్తనము నందు అత్యంత సహజముగ చిత్రించినాడు. అన్నమయ్య రచించిన పదాలతో ఇట్టివి ఎన్నియో కలవు, అవి అన్నియు వెంకటేశ్వరుని కీర్తించుచు అత్యంత సహజముగ అందిస్తున్నాయి.

***

# అన్నమయ్య సంకీర్తనల్లో సుగంధ ద్రవ్యాలు, పుష్పాల ప్రాధాన్యం

**డా॥ పి. మాధవి**
**సంస్కృత అధ్యాపకులు**
**గేట్ కళాశాల, తిరుపతి**

అన్నమయ్య సహజకవి. పదకవితలను పండితులు ఈసడించుకుంటున్న కాలంలో అన్నమయ్య అవతరించి, పదంకు పట్టంకట్టి చదువురాని పల్లీయుల నోళ్ళలో సంకీర్తనలు పలికించిన పదకవితా పితామహుడు అన్నమయ్య. ఆనాడు జానపదుల వాడుకలో ఉన్న జాజరులు, చందమామ, తుమ్మెద, సువ్వి, గొబ్బి, ఉయ్యాల, లాలి,

లాలి, జోల, శోభన, తందనాలు, చాంగుభళాలు మొదలైనవి ఎన్నింటినో తన పదాల్లో ఉపయోగించాడు.

అన్నమాచార్యులవారు తన కాలంనాటి ప్రజల భాషను, వారి పలుకుబళ్ళను, నానుళ్ళను, సామెతలను తన రచనల్లో ఉపయోగించటంలోనే ఆయన సామాజిక దృక్పథమేమిటో అర్థమవుతున్నది. రచనకు సామాజిక ప్రయోజనం ఉందని రాసిన ప్రతి పదం అందరికీ అర్థమయ్యే రీతిలో ఉండాలన్నది అన్నమయ్య సిద్ధాంతం. ఐదువందల సంవత్సరాల క్రితం అన్నమయ్య ప్రజల భాషలో రాయటం, భక్త సామాన్యుడికి చేరువలో ఉండాలని లక్ష్యంగా పెట్టుకోవడం గొప్ప విప్లవంగా భావించాలి.

అన్నమయ్య తన సాహిత్యంలో స్పృశించని సామాజిక అంశం లేదు. భక్తిని, రక్తిని తన సంకీర్తనల్లో జోడు గుర్రాల్లాగా నడిపించాడు. శ్రీ వేంకటేశ్వర స్వామివారి పట్ల తనకున్న ప్రగాఢ భక్తిప్రపత్తులను అడుగడుగునా ప్రదర్శించాడు. నిత్యజీవితంలో మానవుడు సాధించాల్సిన లక్ష్యాలను భగవంతునికి అన్వయించి మనకు చెప్పాడు. ఈ నేపథ్యంలో పరిశీలించినపుడు శ్రీ స్వామివారి సుందర రూపానికి అలదిన సుగంధ ద్రవ్యాలను, పుష్పాలంకరణలను అనేక సంకీర్తనల్లో ప్రస్తావించాడు. వాటిని స్వామివారు ధరించినపుడు ఎలా ప్రకాశించేవారో కూడా చక్కని ఉపమానాలలో పేర్కొన్నాడు. స్వామివారికి పన్నీటితో స్నానం చేయించి, పుణుగును సెంటులాగా శరీరానికి అలదేవారని, కప్పురపు కాపు పట్టేవారని, కొన్ని సందర్భాలలో పచ్చ కర్పూరాన్ని శరీరానికి అలదేవారని, అదేవిధంగా గంధము, కస్తూరిని కూడా వాడేవారని, పుష్పాలతో యాగం చేసేవారని, తులసి దండలు ధరింపజేసేవారని అన్నమయ్య తన సంకీర్తనల్లో పేర్కొన్నాడు.

15వ శతాబ్దంలో అన్నమయ్య పేర్కొన్న పూజా, అలంకార, వస్తు విశేషాలతో నేడుకూడా శ్రీ స్వామిపరంగా నేడుకూడా నిరవధికంగా, నిరాఘాటంగా, సత్సంప్రదాయబద్ధంగా జరుగుతున్నాయి. ఆగమశాస్త్రం ప్రకారం విష్ణువు అలంకారప్రియుడు. అందుకే కాబోలు విష్ణువు అవతారమైన శ్రీ వేంకటేశ్వర స్వామిని వివిధ చందనాదులతో, పుష్పాలతో అనునిత్యం అర్చిస్తున్నారు. ఆ అంశాలను అన్నమయ్య తన సంకీర్తనల్లో ప్రతిబింబింపజేశాడు. వాటిని ఈ వ్యాసంలో విశ్లేషించటం జరిగింది.

**1. పన్నీరు – పుణుగు :** శ్రీ వేంకటేశ్వర స్వామివారు పన్నీటితో జలకమాడి పుణుగును అలదుకున్నాడని అన్నమయ్య తెలిపాడు. పవిత్రమైన నీరు పన్నీరు, సువాసన ద్రవ్యం పుణుగు. నేడు దానినే 'సెంటు' అంటున్నాము.

> **"దేవదుందుభీలతోడ తేటతెల్లమైనాడు**
> సేవించరో యిదే వీఁడే సింగార దేవుడు" **(3-125)**

ఆ దేవదేవుడు బంగారు మేడలో, పన్నీటిలో స్నానం చేసి శరీరావయవాలను తుడుచుకొని ఉంటే చూడదానికి కడిగిన ముత్యంవలే ఉన్నాడంట. అప్పటి ఆ దేవుని రూపం దర్శించినవారికి అమృతం పోగైనట్లు దర్శనమిచ్చాడట. ఎంత సంపద కుప్పపోసినా ఆ దేవదేవునికి సరిసమానం కావంటాడు. ఆ కొండవంటి దేవుడు రాజసంతో మాణిక్యం వలె మెరిసిపోయాడు.

**2. కప్పురకాపు :** నారాయణుడు నానారూపధరుడని అన్ని ఉపమానాలు అతనికే వర్తిస్తాయని అన్నమయ్య పేర్కొన్నాడు. ప్రకృతి పరిణామాలను ఆ భగవానునికి అన్వయిస్తూ ఇలా అంటాడు అన్నమయ్య :

**"నానారూపధరుడు నారాయణుడు వీఁడె**
**పూనినవుపమలెల్లఁ బొసగె నితనికి"** **(17-503)**

వర్షాకాలంలో ఏరులు పొంగి పార్లి సముద్రాన్ని చేరినట్లు పురుష సూక్తములో విప్రులు చేసిన మజ్జనము వలె ఆ హరికి ఆ నీరు పన్నీరైందట. ఆకాశాన్ని వేలమేఘాలు ఆవరించినట్లు తట్టు పుణుగు ఆ పరమపురుషుని శరీరంపై అమరిందట. ఇంక ఆ దేవదేవుని ఉరముపైన అలిమేలు మంగమ్మ వాలిందట. మరొక సంకీర్తనలో పచ్చ కప్పురపు ప్రస్తావన తెచ్చాడు అన్నమయ్య.

**3. పచ్చకప్పురము :** ఈ సంకీర్తనలో పరమ పురుషునికి పచ్చకప్పురము అలదినట్లు చెప్పబడింది.

**"భావించి చూడరే పడతులాల**
**చేవదేరి మహిమలు చెలగినట్టుండెను"** **(23-154)**

పరమపురుషుడైన శ్రీ వేంకటేశ్వరస్వామి శరీరానికి పచ్చకప్పురము అలదినారట. అప్పుడాయన శరీరం తెల్లగా మెరిసిపోయిందట. పాల సముద్రంలో ముంచి తీసినట్లుండెనని సమయ సందర్భోచిత ఉపమానాన్ని ప్రయోగించాడు అన్నమయ్య. అటు తరువాత తట్టుపుణుగు కాపు పెట్టారట. అప్పుడతని శరీరం నల్లగా మెరిసిందట. ఆ దేవునికి సింగారించిన సొమ్ముల మూలంగా ఆయన శరీరం బంగారుకాంతితో మెరిసిపోయిందట.

**4. గందము - కస్తూరి :** అలమేలుమంగమ్మ - శ్రీ వేంకటేశ్వర స్వామిల మధ్య చిరు తగవు పుడుతుంది. ఆ సందర్భంలో వారి శరీర సౌందర్య సాధనాల గురించి అన్నమయ్య ఇలా అంటాడు :

**"కలలోనె యిరువురము నలిగి వేగ**
**కలయనుచుఁ దెలిసి నినుఁగౌగిలించితిరా"** **(5-21)**

అలమేలు మంగమ్మ శ్రీ స్వామితో ఇలా అంటుంది. భర్తలు భార్యలపై అలగవచ్చునా! అందులోనూ ఊరకనే అలిగిందంటుంది. కోనేటివిభుడా నీవు అలా

నాపై అలిగితే ఈ దేహాన్ని నేనెట్లా నిలుపుకొనేది అని ప్రార్థనా పూర్వకంగా అడుగుతుంది.

ఈ సంకీర్తనలో పూవులు, గంధము, కస్తూరి ప్రస్తావించబడ్డాయి. ఈ మూడింటికి మనం జరుపుకొనే శుభకార్యాల్లో విశిష్ట స్థానం ఉంది. సుగంధ ద్రవ్యాలు పైకి కనిపించవు. కానీ వాటి ప్రభావం కనిపిస్తుంటుంది. అయితే సువాసనతోబాటు సౌందర్యాన్ని కళ్ళకు కట్టినట్లు దృశ్యాత్మకంగా భావించేవి పుష్పాలు, ఆ పుష్పాలంకరణ ఒక యాగంలాగా జరిగేదంటాడు అన్నమయ్య.

**5. పుష్పములు :** ఆ దేవదేవుని వివిధ దేవతలు పుష్పాలతో అర్చించారట. అందులో సకల లోకేశ్వరులు కూడా ఉన్నారు.

**"సకల లోకేశ్వరులు సరుసఁజేకొనువాడు**
**అకలంకముగఁబుష్ప యాగంబు"** **(24-291, 209)**

శ్రీ వేంకటేశ్వరస్వామి వారికి పుష్పయాగం జరిపించారు. ఘనచందనాదులతో కర్పూరపు హారతులిచ్చారు. ఆ పుష్పయాగం కన్నులపండువగ జరిగిందట. నేడుకూడా స్వామివారికి పుష్పయాగం చేయిస్తున్నారు. తిరుమలలో ఎవ్వరూ పూలు వాడరాదని దేవస్థానం నిబంధన విధించింది. అక్కడున్న పూలన్నీ స్వామివారి సేవకే వాడాలన్నది ఆగమశాస్త్ర నియమం.

నాడు అన్నమయ్య చెప్పిన అంశానికి సాక్షీభూతంగా నేడూ తిరుమలలో పుష్పయాగం అత్యంత వైభవంగా జరుపబడుతున్నది.

**6. తులసి దండలు :** శ్రీ వేంకటేశ్వరస్వామి వారికి అలంకార ప్రాయంగా తులసి దండలు ధరింపజేశారంటాడు అన్నమయ్య.

**"బంగారు మేడలలోన పరమాత్ముడు వాడె**
**సింగారాలు మీదమీద సేయరె చెలులు"** **(23-330)** .

అంటాడు అన్నమయ్య.తట్టుపుణుగుల నూనె స్వామి వారి శరీరానికి అలిదారని కస్తూరి పూశారని, పన్నీటితో స్నానం చేయించారని పేర్కొన్నాడు. అలమేలుమంగమ్మను ఉరముపై ఉంచుకొన్నాడని శృంగారాత్మకంగా వర్ణించాడు.

ప్రకృతిలోని ప్రతిదీ సౌందార్యాత్మకమైనదే. అది భగవంతుని సృష్టి రహస్యం. అటువంటి దానిని మనం వికృతిగా మార్చేస్తున్నాం. అలా చేయరాదని దానిని తనివితీరా చూచి ఆస్వాదించాలని సందేశమిస్తున్నాడా అన్నట్లు ఆ దేవదేవుడు ఏడుకొండలపై నెలకొన్నాడు. అక్కడ భక్తుల చేత వివిధ పూజలందుకొంటున్నాడు. ఆ పరంపరలోనివే సుగంధ ద్రవ్యాలు, పుష్పార్చనలు.

***

# అన్నమయ్య-త్యాగయ్యల రచనా సామ్యాలు

**శ్రీ సి.యన్. కృష్ణారెడ్డి**
**పరిశోధక విద్యార్థి**
**తెలుగు అధ్యయన శాఖ**
**శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం, తిరుపతి**

ప్రకృతిలో మానవ జీవితం ఉత్కృష్టమైంది. లోకంలో వ్యక్తుల మధ్య సామ్య భేదాలుండటం సహజం. వ్యక్తుల ఆలోచనల్లోనూ ఆకారాల్లోనూ, అభిరుచుల్లోనూ, గుణవిశేషణాల్లోనూ, అలవాట్లలోనూ జీవిత సంఘటనల్లోనూ ప్రాంతీయ భేదాల్లోనూ ఈ సామ్యాలు ఉంటాయి.

అలాగే కవులు, రచయితలు, వాగ్గేయకారులు, కథకులు, నవలాకారులు మొదలగు వారి మధ్య కూడా రచనా శైలిలోనూ, పదప్రయోగాల్లోనూ, ఇతి వృత్తాల్లోనూ, వర్ణనా ప్రయోగాల్లోనూ సామ్యాలు, భేదాలుండటం పరిపాటి.

**ఉపమా కాళిదాసస్య**
**భారవే అర్థ గౌరవం**
**దండిన పదలాలిత్యం**
**మాఘే సన్తి త్రయోగుణా**

అన్న శ్లోకం వివిధ కవుల సామ్యభేదాలను తెలుపుతుంది.

అలాగే తెలుగునాడులో పుట్టి పెరిగిన అన్నమయ్యకూ, తమిళనాడు రాష్ట్రంలో పుట్టి పెరిగిన త్యాగయ్యకు మధ్య సామ్య భేదాలు కనిపిస్తాయి. అన్నమయ్య, త్యాగయ్యల సంకీర్తనల్లోని సామ్యాలను గ్రహించి తులనాత్మకంగా విశ్లేషించడం ఈ పత్రం యొక్క ఉద్దేశ్యం.

**అన్నమయ్య-త్యాగయ్యల జీవిత సామ్యాలు :**

తెలుగు వాగ్గేయకారుల్లో అగ్రగణ్యుడు అన్నమయ్య. కర్ణాటక సంగీత ప్రపంచంలో సుప్రసిద్ధుడు త్యాగయ్య. అన్నమయ్య త్యాగయ్య పూర్వీకులు రాయలసీమ ప్రాంతంవారు. అన్నమయ్య పూర్వీకులు తాళ్ళపాక గ్రామానికి చెందిన వారైతే త్యాగయ్య పూర్వీకులు కర్నూలు జిల్లా కంభం తాలూకా కాకర్ల గ్రామానికి చెందినవారు. అన్నమయ్య త్యాగయ్య లిద్దరూ బ్రాహ్మణ కుటుంబంలో జన్మించినవారు. అన్నమయ్య వంశీకులు నందవరీకులు, భరద్వాజ గోత్రులు. త్యాగయ్య వంశీకులు వైదిక శాఖకు చెందిన ములకనాటి బ్రాహ్మణులు భరద్వాజ గోత్రులు.

అన్నమయ్య సర్వధారినామ సంవత్సరం వైశాఖ మాసం విశాఖ నక్షత్రం పూర్ణిమ తిథినాడు లక్కమాంబ, నారాయణసూరీ అనే పుణ్యదంపతుల గర్భాన జన్మించాడు. త్యాగయ్య సర్వజిత్తునామ సంవత్సరం మేషమాసం శుద్ధ షష్ఠీ సోమవారం నాడు సీతమ్మ రామబ్రహ్మం అనే దంపతుల గర్భాన జన్మించాడు.

అన్నమయ్య బాల్యం గురించి మనకు ఆధారాలు తక్కువ. కానీ శ్రీనివాసుని ప్రసాదమని చెబితే పాలు తాగేవాడని, వేంకటపతి మీద జోల పాటలు పాడితే నిద్రపోయేవాడని తెలుస్తుంది. త్యాగయ్య బాల్యం నుండి భక్తుడైనట్లు తెలుస్తుంది. తండ్రి చేసే శ్రీరాముని పూజల్లో పాల్గొనేవాడు. అందువల్ల పసితనం నుండే శ్రీరామచంద్రుని మీద అపారమైన భక్తి పెరిగింది.

**బంధువుల వల్ల బాధలు :**

అన్నమయ్య త్యాగయ్య లిద్దరూ బంధు బాధలు అనుభవించారు. దండె భుజానికి తగిలించుకొని ఎప్పుడూ పాటలు పాడుతూ తిరిగే అన్నమయ్యను అన్నా వదినెలు ఈసడించుకున్నారు.

**"అన్నలంటా తమ్ములంటా ఆండ్లంటా బిడ్డలంటా**
**పన్నుకొని తిరిగేరు బహురూపాలు"**

అని అన్నమయ్య తన బంధువుల వల్ల ఎదురయ్యే సమస్యలను వివరించారు.

త్యాగయ్య కూడా దాయాదుల వల్ల ఇతరుల వల్ల పడిన బాధలను తన కృతుల్లో ప్రస్తావించాడు.

**"నాయెడ వంచన సేయకురా...**
**దాయాదుల పోరైనగాని**
**తల్లిదండ్రి భక్తి నొసగి రక్షించిరి**
**తక్కిన వారలెంతో హింసించిరి"**

అన్నమయ్య, త్యాగయ్యలు ఇద్దరూ తెలుగులోనూ, సంస్కృతంలోనూ సంకీర్తనలు రాశారు.

ఉదాహరణకు సంస్కృతంలో

**"సామజవరగమన"** - త్యాగయ్య
**"దేవదేవం భజే"** - అన్నమయ్య

తెలుగులో

**"బ్రహ్మ కడిగిన పాదము"** - అన్నమయ్య
**"మరుగేలరా ఓ రాఘవా"** - త్యాగయ్య రచించారు.

అన్నమయ్య, త్యాగయ్య లిద్దరూ రకరకాల ప్రక్రియలను చేపట్టారు. ఉదాహరణకు ఉంది.

**పెండ్లి పాటలు :**

**"పిడికిట తలంబ్రాల పెండ్లికూతురు కొంత**
**పెదమరలి నవ్వీని పెండ్లికూతురు"** - అన్నమయ్య

**"సీతా కళ్యాణ వైభోగమే**
**రామా కళ్యాణ వైభోగమే"** - త్యాగయ్య రచించారు

**జోల పాటలు :**

**"జో అచ్యుతానంద జోజో ముకుందా"** అని అన్నమయ్య
**"జోజో రామ ఆనంద ఘన జోజో రామ"** అని త్యాగయ్యలు జోల పాదారు.

**గురు మంత్రోపదేశం :**

అన్నమయ్య, త్యాగయ్య లిద్దరూ తమతమ గురువుల ద్వారా మంత్రోపదేశాన్ని పొందారు. శఠగోపయతి చేసిన మంత్రోపదేశం వల్ల అన్నమయ్య, రామకృష్ణానంద యతి చేసిన మంత్రోపదేశం వల్ల త్యాగయ్య గొప్ప వాగ్గేయకారులయ్యారు.

**"అన్ని మంత్రములు ఇందే ఆవహించెను**
**వెన్నెతో నాకు కలిగె వేంకటేశు మంత్రము"**

అని అన్నమయ్య తనకు గురుడుపదేశించిన వేంకటేశ్వర మంత్రము తనను ఉద్ధరించ గల్గిందని చెప్పాడు.

**"రామనామము - జన్మ రక్షక మంత్రము**
**తామసము సేయక భజింపవే మనసా"**

అని త్యాగయ్య తన గురువు ఉపదేశించిన రామ మంత్రము తన జన్మనే చరితార్థం చేసిందని చెప్పాడు.

రాజాజ్ఞను దిక్కరించడం అన్నమయ్య-త్యాగయ్య లిద్దరి జీవితాల్లో సామ్యంగా చెప్పవచ్చు.

శ్రీ వేంకటేశ్వరుని మీద గానం చేసిన శృంగార కీర్తనలను విన్న సాళువ నరసింహరాయలు సంతృప్తి చెందక తనమీద కూడా అలాంటి కీర్తనలు పాడమన్నారు. అందుకు అన్నమయ్య -

**"నరహరి కీర్తన నానిన జిహ్వా**
**వొరల నుతింపగ నోపదు జిహ్వా"**

అని రాజాజ్ఞను దిక్కరించాదు.

త్యాగయ్యను తంజావూరు ప్రభువు రెండవ శరభోజి మహారాజు తన సమక్షంలో కృతులు పాడితే శ[illegible]వసతిని బంగారాన్ని కానుకగా ఇస్తానని ఆశ చెప్పి పంపాడు. అందుకు త్యాగయ్య –

**"నిధి చాలా సుఖమా రాముని స-**
**న్నిధి సేవ సుఖమా నిజముగబల్కు మనసా"**

అని రాజాజ్ఞను దిక్కరించాడు.

**అన్నమయ్య–త్యాగయ్యల రచనలు :**

అన్నమయ్య 12 శతకాలు, "ద్విపద రామాయణం", "శృంగారమంజరి", సంస్కృతంలో "వేంకటాచల మహత్మ్యం", "సంకీర్తన లక్షణం", "32 వేల సంకీర్తనలు" రచించినట్లు తెలుస్తుంది. వీటిలో శ్రీ వేంకటేశ్వర మకుటంతో అలమేల్మంగమ్మ మీద చెప్పిన శతకం, "శృంగారమంజరి" 14 వేల సంకీర్తనలు మాత్రమే లభ్యం.

త్యాగయ్య వాల్మీకి రామాయణ శ్లోకాల సంఖ్యను అనుసరించి 24 వేల కృతులను రచించినట్లు తెలుస్తుంది. వీటితోపాటు "నౌకా చరితం", "ప్రహ్లాద భక్తి విజయం", "సీతారామ విజయం" అనే మూడు సంగీత రూపకాలను కూడా రచించాడు. వీటిలో 711 కృతులు స్వరసహితంగా లభిస్తున్నాయి. "ప్రహ్లాద భక్తి విజయం", "నౌకాచరిత్రం" అనే రెండు సంగీత రూపకాలు మాత్రం లభ్యమవు తున్నాయి.

**మేలుకొలుపు పాటలు :**

**"మిన్నక వేసాలు మాని మేలుకోవయ్యా**
**సన్నల నీయోగ నిద్రచాలు మేలుకోవయ్యా"** – అన్నమయ్య

"మేలుకోవయ్య మమ్మేలుకో శ్రీరామ" – త్యాగయ్య

**మూఢాచారాల ఖండన :**

భగవంతుని అనుగ్రహం వుంటే చాలు గ్రహబలంతో పనిలేదని అన్నమయ్య, త్యాగయ్యల భావన.

**"కనుగొను నీ విగ్రహమే గ్రహబలము నాకు"** – అని అన్నమయ్య

**"గ్రహబలమేమి శ్రీరామానుగ్రహ బలమే బలము"** – అని త్యాగయ్య వివరించారు.

**సందేశాలు :**

**"నానాటి బదుకు నాటకము**
**కానక కన్నది కైవల్యము**

**పుట్టుట నిజము పోవుటయు నిజము**
**నట్టనడిమి పని నాటకము"**

అని అన్నమయ్య జీవితం, ధనం, ఆస్తుపాస్తులు అశాశ్వతం అని, పుట్టడం గిట్టడం మనిషికి సహజమని అన్నమయ్య వివరించాడు.

**"చక్కని రాజమార్గము లుండగ**
**సందుల దూరనేల? ఓ మనసా**
**చిక్కని పాలు మీగడ యుండగ**
**చీయన గంగా సాగరమేల"**

అని త్యాగయ్య మానవుడు తరించడానికి మంచి మార్గాలుండగా అడ్డదారుల్లో సంచరించడం ఎందుకని ప్రశ్నిస్తూ సందేశమిచ్చాడు.

**స్త్రీమూర్తులు** : అన్నమయ్య లక్ష్మీ, అలమేల్మంగలను, త్యాగయ్య త్రిపురసుందరీ అమ్మవారిని కీర్తించారు.

**"చూదరమ్మ సతులారా సోబాన పాదరమ్మ**
**కూడున్నది పతి చూడి కుడుత నాంచారి...**
**సోముని తోబుట్టువట సొంపుకళల కేమరుదు**
**కోలమాంగి ఈ చూడి కుడుత నాంచారి"** - అన్నమయ్య

**"సుందరి నీ దివ్యరూపము"**
**"దరిని తెలుకుంటి త్రిపురసుందరిని"**
**"కన్నతల్లి నీవు నా"**
**"సుందరి నిను వర్ణింప"**
**"సుందరి నన్నిందరిలో"** అనే ఐదు పంచరత్నాలతో త్యాగయ్య కీర్తించాడు.

**ముగింపు :**

అన్నమయ్య-త్యాగయ్యల కీర్తనలను, కృతులను గమనిస్తూ పోతే వీరిద్దరి మధ్య రచనా సామ్యాలు ఎక్కువగా గమనించవచ్చు. భక్తి అనేది శక్తి అని అదే అమృత ప్రాయమని దీన్ని సేవించినవాడు చిరంజీవుడవుతాడని వీరిరువురి కీర్తన కృతుల్లో గమనించవచ్చు. సర్వమానవుల పట్ల సమబుద్ధి కలిగి వుండటం వీరి రచనల్లో కనిపిస్తుంది. గమన మార్గాలు వేరువేరైనా గమ్యం మాత్రం త్యాగయ్య అన్నమయ్యలది ఒక్కటే అదే భక్తిమార్గం సూర్యచంద్రులున్నంత కాలం భక్తకోటి మనస్సుల్లో ఈ కవి రేడులు సజీవులై నిలిచిఉంటారు.

***

# అన్నమాచార్య సంకీర్తనలు-వాత్సల్య భక్తి

**శ్రీమతి నూతంకి గౌరి**
**పరిశోధక విద్యార్థిని**
**శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం**
**తెలుగు అధ్యయనశాఖ, తిరుపతి**

మానవ జీవితంలో వాత్సల్యం ఒక ప్రముఖ స్థానాన్ని వహిస్తుంది. అదే కవితలో ఒక రసం. దీన్నే వత్సల రసమని పెద్దలు అన్నారు. మాతృత్వ భావం స్త్రీ పొందే ఒక అనుభూతి ఇలాంటి అనుభూతి భగవద్విషయంలో కూడా కనిపిస్తుంది. ఈ వాత్సల్యం కూడా భక్తిలో ఒక భాగమే.

తాళ్ళపాక అన్నమయ్య భగవంతుడిని బాలునిగా భావించి వాత్సల్య భక్తితో కీర్తించి రచించిన ఉగ్గుపాట, లాలిపాట, ఉయ్యాల పాట, జోలపాట, చందమామ పాట, దోబూచి పాట, మేలుకొలుపు పాటలు ఈ కోవకు చెందినవి. అన్నమయ్య తన సంకీర్తనల్లో యశోద ద్వారా వాత్సల్యమహితమైన భావ పరంపరను ప్రసరింప జేశాడు. కొన్నిచోట్ల తానే యశోదగా మారాడు. నందుడైనాడు. దేవకిగా, వసుదేవుడిగా భావించుకొన్నాడు. ఇన్ని రూపాల్లో అన్నమయ్య గోపబాలునిపై వాత్సల్య రసామృతాన్ని చిందించాడు.

**1. ఉగ్గుపాట :**

సకల చరాచర సృష్టికి మూలకారణమైన భగవంతుడిని పసిపాపగా ఊహించి తానే యశోదగా తదాత్మ్యం చెందాడు అన్నమయ్య.

**"ఉగ్గువెట్టరే వోయమ్మా-చె**
**య్యొగ్గినిదే శిశువోయమ్మ"** **(12-97, రాగం-భైరవి)**

ఇందులో పరమాత్మ స్వరూపుడైన బాలకృష్ణుణ్ణి బ్రహ్మాండ భాండోదరుడిగా భావించాడు. వేంకటేశ్వరుడిగా రూపించాడు. అందుకే యశోద గోపకాంతలను 'అయ్యో! కడుపులో బ్రహ్మాండాలు కదలిపోతాయి' అలా బిడ్డను కదపకండి అని మందలిస్తుంది.

**2. ఉయ్యాల (లాలి) పాటలు :**

భక్తులు తమతమ ఇష్టదైవాలకు ఎన్నోరకాలుగా సేవచేస్తారు. అలాగే అన్నమయ్య భగవంతుడికే లాలి పాడాడు. అన్నమయ్య రాసిన ఉయ్యాల పాటలే లాలి పాటలుగా కూడా కీర్తనల్లో కనిపిస్తాయి. ప్రతి పాదాంతంలో 'ఉయ్యాల' అనే శబ్దం ఊతపదంగా ఆ వృత్తి కావడం వల్ల ఇవి ఉయ్యాల పాటలుగా ప్రచారం పొందాయి.

**"అలరజంచలమైన ఆత్మలందుండ నీ యలవాటు సేసెనీ వుయ్యాల**
**పలుమారు నుచ్ఛ్వాస పవనమందుండ నీ భావంబు దెలిపెనీ వుయ్యాల" ॥పల్లవి॥**

'అలరజంచలమైన' అనే పల్లవితో కూడిన 'ఆహిరి' రాగంలో సాగిన ఈ కీర్తనలో కమలాదేవిని, భూదేవిని కూడా చేర్చి అన్నమయ్య స్వామిని ఉయ్యాలలో ఉన్నట్లు భావించాడు, కీర్తించాడు.

మరో సంకీర్తనలో అన్నమయ్య 'శ్రీరంగ శిశువు'కు, వెంకటేశుడికీ అభేదాన్ని పాటించి పాడిన ఉయ్యాల పాట రమణీయంగా ఉంది.

**"తొల్లియును, మఱ్ఱాకు తొట్టెలనెయూగె గన**
**చెల్లుబడి నూగీని శ్రీరంగ శిశువు"**
(రాగం-ఆహిరి, సంపు-11,రెం.భా, సంకీ-1, రేకు-నిదురేకు 4, ఆ.సం.)

మఱ్రాకు తొట్టెలో శ్రీరంగ శిశువు ఊగినట్లు భావించాడు. కావేరీ నదిని ఒక కలికిగా భావించి తరగల బాహు లతల్లో రంగమధ్యపు తొట్టిలో చిలపాల సెలవితో ఊగినట్టి రంగ శిశువును అన్నమయ్య దర్శించాడు. అంతేగాక వేదాలే చేరులుగా శేషుడే పాదుకొన్న తొట్టిగా శ్రీదేవితో కూడిన వెంకటేశుడు సేదతీరాడని అన్నమయ్య ఈ సంకీర్తనలో పరవశంతో వర్ణించాడు.

అలాగే అన్నమయ్య ఉయ్యాల పదాన్ని, పల్లవికి ముందుంచి పాడాడు. ఇది రేపల్లె బాలునికి సంబంధించిన లాలి పాట. ఇందులో బాలయువ్వనులైన సుందరాంగులు పాట పాడారు. పాట మొత్తం ఉయ్యాల లాగా ఉయ్యాల పాట వలె నడిచింది.

**"ఉయ్యాలా బాలు నూచెదరు కదు**
**నొయ్యనొయ్య నొయ్యనుచు"** **(12-246)**

**3. జోలపాట :**

అన్నమయ్య జోలపాటని సాధారణంగా ప్రతి తెలుగు తల్లి తన బిడ్డను జోకొట్టడానికి పాడింది, పాడుతూ ఉంది. ఈ పాట బహుళ ప్రచారం పొందింది.

**"జో అచ్యుతానంద - జోజో ముకుందా**
**రావె పరమానంద - రామ గోవిందా"**

లోకాలనేలే లోకేశ్వరునికే జోలపాడి అన్నమయ్య ఈ పాటలో మాతృమూర్తిగా మారాడు.

**4. చందమామ పాట :**

అన్నమయ్య తన చందమామ పాటలో, బాలకృష్ణుడి వైష్ణవ విభవాన్ని స్మరిస్తూ వేంకటేశ్వరుడికి అభేదాన్ని పాటించి చందమామ వెన్నపాలు "చందనపు పైడి కోరలో" తెమ్మంటాడు. ఈ పాట కూడా చాలా ప్రసిద్ధి పొందింది.

"చందమామ రావె జాబిల్లిరావొ మంచి
కుందనపు పైడి కోరవెన్న చాలుదేవొ" (సౌరాష్ట్ర రాగం)

వాత్సల్య భక్తి వస్తువుగా కలిగిన ఈ పాటలో అన్నమయ్య చిన్నికృష్ణుడు మారాము చేయగా, చందమామను చూపించి గోరుముద్దలు తినిపించాడు.

**5. దోబూచి పాట :**

అన్నమయ్య బాలకృష్ణ సంకీర్తనల్లో 'దోబూచి' పాట కనిపిస్తుంది. ఇది చతురస్రగతిలో సాగింది. ఇందులో కనిపించేది కృష్ణలీలలే.

"బండి విరిచి పిన్నపాపలతో నాడి
దుండ గీడు వచ్చె దోబూచి" (12-227) (రాగం-ధన్యాసి)

**6. మేలుకొలుపు పాటలు :**

భక్తి గేయ సాహిత్యంలో మేలుకొలుపు పాటలకు ఎంతో ప్రాధాన్యం ఉంది. భక్తులు తమ తమ ఇష్ట దైవారాధనను ఉదయాత్పూర్వమే చేస్తారు. భగవంతున్ని ఉషోదయానికి ముందే మేలుకొలుపుతూ భక్తి రసాత్మకంగా పాట పాడుతారు. కాబట్టి వీటికి మేలుకొలుపు పాటలు అని పేరు వచ్చింది.

"మిన్నక వేసాలు మాని మేలుకోవయ్యా
సన్నల నీ యోగనిద్ర చాలు మేలుకోవయ్యా" (1-374) (రాగం-భూపాలం)

ఆవుల వద్దకు దూడల్ని విడిచి పాలు పిదకాలని, పడుచులు తోవ కాచుకున్నారన్నీ, వాడ వాడల నుండి గోపికలు ముద్దాడడానికి వచ్చారని, యశోద పెరుగు వంటకాలు తెచ్చిందని, వేంకటాద్రి మీద ఉన్న బాలకృష్ణా! మా మాటలు విన్నావు కదా మేలుకోవయ్యా అని అన్నమయ్య బాలకృష్ణుణ్ణి మేలుకోమంటాడు. భగవంతుని విషయంలో సేవాపూర్వకమైన భక్తికి నిదర్శం ఈ సంకీర్తన. "మిన్నక వేసాలు మాని" అనే ప్రయోగం వల్ల అనన్య భక్తి తత్పరుడైన అన్నమయ్యకు, భగవంతునికి మధ్య గల అత్యంత దగ్గరి సంబంధాన్ని గమనించవచ్చు. చిన్నపిల్లల్ని 'నీ వేషాలింక చాల్లే' అన్నట్లుగా భగవంతున్ని వాత్సల్య పూర్వక భక్తి పరాయణత్వంలో మేల్కొల్పడంలో అన్నమయ్య భక్తి తత్పరత విదితమవుతోంది.

మరొక సంకీర్తనలో ఇలా –

"హరి కృష్ణ మేలుకొను ఆదిపురుషా
తరువాత నా మోము తప్పకిటు చూడు" (9-254) (రాగం-భూపాలం)

తన తోటి బాలురు పిలుస్తున్నారని, నిద్రలిక చాలని, 'చద్దికూళ్ళ పొద్దు వేళాయె నాతండ్రి వేగ లేవె' అని, 'నిన్ను ముద్దాడే దానికి నీ తండ్రి నందుడు నిలిచాడనీ', 'వేంకటాద్రి పతి శ్రీ రమణా లేవె నా తండ్రి అని' అన్నమయ్య ఈ కీర్తనలో ఆలపించాడు.

ఆదిపురుషుడైన భగవంతున్ని మేలుకొల్పుతూ కన్నులు విప్పుతూనే, తన మోమును తప్పక చూడమన్నాడు. దీనివల్ల ఇది వాత్సల్య భక్తి భావనాన్ని వ్యక్త పరుస్తోంది.

ఈ కీర్తనలన్నింటిలో వాత్సల్య భక్తిని ప్రదర్శించాడు అన్నమయ్య. తల్లిలోని ఆప్యాయతా అనురాగాలను మేళవించి భగవంతునికి ఆపాదించి తన కీర్తనల ద్వారా వ్యక్తపరచాడు. భగవంతున్ని బిడ్డగా లాలించి కీర్తించాడు. కన్నతల్లి బిడ్డను చూసి ఏవిధంగా అయితే మురిసిపోయి, మైమరచిపోయి తన్మయత్వం చెందుతుందో అదే విధంగా అన్నమయ్య భగవంతున్ని చూసి మైమరచిపోయి భక్తి భావాలతో కూడిన వాత్సల్యాన్ని ప్రదర్శించాడు. అన్నమయ్య ప్రతి సంకీర్తనలోనూ ప్రధాన వస్తువు భక్తే అయినా వాత్సల్య భక్తికి ప్రత్యేక స్థానం ఉంది. భగవంతుడైనా, భక్తుడైనా తల్లి ప్రేమ లాలిత్యాల ముందు తలొగ్గక తప్పదు. అలాగే భగవద్భక్తి మార్గంలో భాగంగా అన్నమయ్య వాత్సల్య భక్తి కూడా కనిపిస్తోంది. లాలి పాడినా, జోలపాడినా, చందమామను చూపినా, దోబూచులాడినా, మేలుకొల్పినా అందులో అంతర్లీనంగా కనిపిస్తోంది మాతృత్వ పూర్వక భక్తితత్పరతే.

***

# అన్నమయ్య - తరిగొండ వెంగమాంబ

**డా॥ వి. లోకేశ్వరి**
**పరిశోధక విద్యార్థిని**
**శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం**
**తిరుపతి**

తెలుగులో ప్రప్రథమ వాగ్గేయకారుడు అన్నమయ్య. ఈయనను పదకవితా పితామహుడనీ, సంకీర్తనాచార్యుడనీ అన్నమయ్యకు బిరుదులు వున్నాయి. ఆ వాగ్గేయకారుని తరువాత అంతటి గొప్ప తపస్సు కలిగిన వ్యక్తి మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ. ఇరువురి మధ్య కొన్ని వందల సంవత్సరాలు తేడా వున్నా ఇద్దరిలోనూ సామ్యాలు, సాధర్మ్యాలు అనేకం. భావంలో, భావనలో పదరచనా శిల్పంలో వర్ణనలో అలంకార ప్రయోగంలో భక్తి, రక్తి, మధురభక్తితో, రసభావాలను వ్యంజించడంలో అత్యంత సన్నిహితంగా ఉంటూనే మరింత ముందుకు వెళ్లి అన్నమయ్య కంటే మరింత అద్భుతంగా రచనలను కొనసాగించింది మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ. శ్రీనివాసుని భక్తాగ్రణ్యుల్లో పదకవితా పితామహుడైన తాళ్ళపాక అన్నమాచార్యులది అద్వితీయమైన

స్థానం. ఆ శ్రేణిలో ఆ హరికీర్తనా చార్యుని అనంతరం పేర్కొనదగిన మహిమ కలిగిన సాహితీమూర్తి మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ.

తాళ్ళపాక అన్నమాచార్యులు క్రీ.శ. 15వ శతాబ్ది ప్రారంభంలో కడప జిల్లాలోని తాళ్ళపాక గ్రామంలో జన్మించారు. తరిగొండ వెంగమాంబ ఒకప్పటి కడప మండలానికి చెందిన, నేటి చిత్తూరు జిల్లాలో తరిగొండలో క్రీ.శ. 1730లో జన్మించింది. అన్నమాచార్యుని తల్లిదండ్రులు తిరుమల యాత్ర చేసిన తర్వాత శ్రీ స్వామివారి నందక ఖడ్గం యొక్క అంశతో అన్నమయ్య అవతిరించినట్లే, వెంగమాంబ జన్మించింది. ఈ ఇరువురు నందవరశాఖీయులై ఉండటం మరొక చారిత్రక విశేషంగా పరిగణించవచ్చు.

శ్రీనివాసుని సన్నిధిలో తిరుమల తిరుపతి పరిసరాలల్లో నివసిస్తూ ఆ స్వామి మీద శ్రీ వేంకటేశ్వర ముద్రతో 32 వేల సంకీర్తనలు రచించిన మహనీయుడు. అవి శృంగార సంకీర్తనలు, ఆధ్యాత్మిక సంకీర్తనలని రెండు విధాలు. అలిమేలిమంగ, శ్రీ వేంకటేశ్వరుల అలౌకిక శృంగారాన్ని అభివర్ణిస్తూ, ఆధ్యాత్మ సంకీర్తనల్లో ఆధ్యాత్మిక సంపదనంతా కలబోసి, శృంగార, ఆధ్యాత్మిక సంకీర్తనలను ఆడిపాడి తాను తరించి, ప్రజలను తరింప జేయదానికి సంకీర్తనా వాఙ్మయాన్ని సృష్టించిన మహాదార్శనిక స్రష్ట అన్నమయ్య.

తెలుగు సాహిత్యంలో మహాకవులకు దీటు కాగలిగిన మహాకవయిత్రి వెంగమాంబ. విస్తృతమైన రచనలే ఈమె వైదుష్యానికి అక్షర నిదర్శనాలై అలరారు తున్నాయి. 'అక్షర శిక్ష' మొదలుకొని పద్యవిద్య వరకు గల విజ్ఞానాన్నంతా వెంగమాంబ స్వయం కృషితో సాధించింది. చిన్నవయస్సులోనే ఆధ్యాత్మికోపదేశము ఆ తరువాత కాలంలో తిరుమల క్షేత్రంలో పొందిన హయగ్రీవ మంత్రోపదేశం అన్నింటినీ మించి ఆమెలో నిబిడీకృతమై వున్న నిర్మల భక్తితత్త్వం ఇవన్నీ వెంగమాంబలో జన్మాంతర సంస్కార రూపంలో నిక్షిప్తమై వున్న సారస్వత విజ్ఞానాన్ని సర్వతోముఖంగా వికసించడానికి దోహదపడ్డాయి.

ఇరువురికీ దైవానుగ్రహం కారణంగానే విద్యలు లభించాయి. "అన్నమాచార్యుని కహినాయకాద్రి వెన్నుని వరముచే విద్యలన్నియును అమితంబులగుచు జిహ్వారంగ సీమ తముదాము సొచ్చి నర్తనమాండ దొడఁగె". అని చిన్నన్న అన్నమాచార్య చరిత్రములో రచించినారు. అదే విధంగా మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ వేంకటాచల మహాత్మ్యకావ్యంలో సరస్వతీదేవి అక్షరాల రూపంలో సాక్షాత్కరించి తన ముఖంలో ప్రవేశించినట్లు పేర్కొంది.

**"అలఘునభంబు నుండి విమలాక్షర పంక్తుల రీతి వచ్చినే**
**నలసతఁ జెందియున్న తతి నాననమందు వసించి, జ్ఞానమున్**
**కలుగఁగఁ జేసి, మానస వికారములన్ తొలగించి, జిహ్వపై**
**నిలిచి నటించు శారదను నిత్యము సన్నుతి సేయుచుండెదన్"**

**"అక్షీణాక్షర పంక్తిరీతిమును మధ్యాహ్నంబునన్ నాకుఁ బ్ర**
**త్యక్షంబై గురునాది పూరుషునిఁ బ్రత్యక్షంబు గావించి, చిత్**
**సాక్షీ బ్రహ్మమటంచుఁ జూపుచు, తదర్థంబున్ కృపంజెప్పినన్**
**రక్షింపన్ పనిఁబూను భారతిని గీర్వాణిన్ ప్రశంసించెదన్"**

అంటూ వెంగమాంబ తన రచనల్లో చెప్పుకొంది. ఇరువురును దైవికంగానే ఒక ఆకస్మిక సంఘటన మూలంగా స్వస్థలాన్ని వీడి తిరుమల క్షేత్రాన్ని చేరుకొన్నారు. పొలంలో పశువులకు గడ్డికోస్తూ వుండగా కొడవలి తగిలి వ్రేలు తెగిన బాధతో విరక్తుడైన అన్నమయ్య ఆ సమీపంలో గోవింద నామస్మరణతో తిరుమల క్షేత్రానికి వెళ్లుతున్న ఒక గుంపుతో అన్నమయ్య కలిసి తిరుమల క్షేత్రానికి చేరుకొన్నాడు. అదేవిధంగా మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ తరిగొండలోని లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో ఆంజనేయస్వామి విగ్రహం వెనుకప్రక్క యోగసమాధిలో లీనమైవున్న వెంగమాంబని ఆ ఆలయ అర్చకుడు "ఏ క్షేత్రానికో వెళ్లి తపస్సు చేసుకోక మా ప్రాణం తింటున్నావు గదే" అంటూ ఆమె తలజుట్టు పట్టుకొని బయటికి ఈడ్చినాడు. ధ్యాన భంగమై ఆమె చూచిన చూపులకు బిక్కచచ్చిన అర్చకులు ఆమె పాదాలపై పడి శరణు వేడాడు. అర్చకుని నోటి నుండి వెలువడిన పలుకులు దైవప్రేరితాలుగా భావించి 20 సం॥రాల అమ్మాయి అయిన వెంగమాంబ తరిగొండను విడిచిపెట్టి తిరుమల యాత్ర ప్రారంభించింది. ఆకలి, దప్పికలను లక్ష్యపెట్టకుండా, క్రూర జంతువుల సంచారాలకు భయపడకుండా, ఇష్టదైవమైన లక్ష్మీనృసింహుని స్మరించుకుంటూ రెండు రోజులు అడవిలో ప్రయాణించి 'సందెకాపు మొగిలిపెంట' అనే పేరుగల కోనకు చేరుకుంది.

అన్నమయ్య తిరుమలలో శ్రీ వైష్ణవదీక్షను స్వీకరించినట్లే వెంగమాంబ తిరుమలలో హయగ్రీవ మంత్రోపదేశాన్ని పొందింది.

అన్నమయ్య దేశకాల పరిస్థితులను అనుసరించి, సాళువ నరసింహరాయల ఆగ్రహానికి గురియై, శ్రీ వేంకటేశ్వరుని దివ్యానుగ్రహం వల్ల కష్టాలన్నింటిని అధిగమించినట్లే, వెంగమాంబ పుష్పగిరి పీఠాధిపతి మొదలుకొని, అర్చకుల పెద్దయైన అక్కారాం వెంకట్రామదీక్షితుల వరకు అనేకులచే జీవితంలో చాలా బాధలను పొందింది అందువల్లనే 'శ్రీకృష్ణమంజరి'లో

**"చెలరేఁగి నాకు వచ్చిన యాపదలకు**
**పరఁగ నీవుండఁగా బ్రదికితి కృష్ణ!**
**తల్లిదండ్రులు సహోదరులైన లీల,**
**నీకరణ లాలింపరే! కృష్ణ!!"**

అని ఇష్టదైవానికి విన్నవించుకొన్నది.

స్మార్తుడై ఉండి – ఘన విష్ణువనీ యతీంద్రుని వలన అన్నమయ్య ఒక్క తిరుమల దివ్యక్షేత్ర మాత్రమేకాక అనేక దివ్య తీర్థక్షేత్రాలను సందర్శించి, ఆయా దేవతామూర్తులపై శ్రీ వేంకటేశ్వరునికి అభేదంగా – ఆశువుగా కీర్తనలను ఆలపించాదు.

**"బ్రహ్మ పూజించె రఘుపతి విభీషణునకిచ్చె!**
**బ్రహ్మణ్యుడే రంగపతి గొలువరో ॥**

**కావేరీ మధ్య రంగక్షేత్ర మదివో**
**శ్రీ వీవిమాన మదివో శేష పర్యంకమదే**
**దేవుండల్లదే వాడే దేవీ శ్రీలక్ష్మీ అదే**
**సేవించరో నాభిం జిగురించెనజుండు ॥ (ధన్యాసి రాగం)**

అంటూ కళ్ళకు కట్టినట్లు వర్ణించాడు. భజనకూటాల ద్వారా అన్నమయ్య సంకీర్తన ఆయన జీవించిన కాలం నాటి నుంచి నేటివరకూ వినిపిస్తూనే ఉంది. వెంగమాంబ కూడా ఇలాంటి తత్త్వాన్నే పాటించింది. శ్రీనివాసునికి ఇతర దేవతలకు మధ్య అభేదభావాన్ని పాటించింది.

**"శివుడంటే నేమి కేశవుడంటే నేమి**
**శివకేశవులఁ చిత్తస్థితి భేదమేమి"**

వెంగమాంబ తిరుమల చేరిన తొలినాళ్లలో అప్పటి మహంతు ఆత్మారాందాస్‌జీ ఆమె నివసించటానికి ఒక కుటీరాన్ని ఏర్పాటు చేయించి, స్వామివారి ఉగ్రాణం (కోవెల వీధి) నుండి వకుళమాలిక పేర 'హారవెచ్చం' అనే నెలసరి బత్యాన్ని పంపే ఏర్పాటు కావించారు. తరువాత కొన్నాళ్లకు తాళ్ళపాక చిన్నన్న వంశీయులు తమ యింటి ప్రక్కన ఉన్న చిన్న యింటిని ఆమెకు ఉచితంగా ఇచ్చి సత్కరించారు.

వెంగమాంబ అన్నమాచార్యుల వలెనే దైవదత్తమయిన వాక్శుద్ధి, వాక్సిద్ధి కలది. ఈ విషయమై ఈ మహనీయులిద్దరి జీవితగాథల్లో ఎన్నో నిదర్శనాలు గోచరిస్తూవున్నాయి.

తాళ్ళపాక వారి ఇంటి ప్రక్కన చేరటంతో వెంగమాంబకు ఆ వంశ కవీశ్వరులైన అన్నమాచార్యులు, పెదతిరుమలాచార్యులు, చినతిరుమలాచార్యులు, చిన్నన్న, అన్నమాచార్యుల ధర్మపత్ని తిమ్మాక్క మొదలైనవారి రచనలను పరిశీలించే సదవకాశం స్వామి సంకల్పం చేత వెంగమాంబకు లభించాయి.

తాళ్ళపాక తిమ్మక్క రచించిన 'సుభద్రా కల్యాణం' అనే కృతిచేత ప్రేరణ పొందిన వెంగమాంబ 'రమాపరిణయం' అనే పెండ్లి పాటను ద్విపదలో రచించింది. అదేవిధంగా అన్నమయ్య రచించిన 'శృంగార మంజరి' యొక్క శైలిలోనే భక్తిరస భరితంగా 'శ్రీకృష్ణమంజరి' అన కమనీయ స్తోత్రాన్ని వెంగమాంబ రచించింది.

అన్నమయ్య విరచించిన ఆధ్యాత్మిక సంకీర్తనలను, శృంగార సంకీర్తనలను అనుసరించి, పదకవితలను ఆశువుగా అల్లే నైపుణ్యం ఉన్నప్పటికీ, వెంగమాంబ ఆ ప్రయత్నం చెయ్యలేదు. ఇందుకు రెండు కారణాలు. ఒకటి అన్నమయ్య సంకీర్తనలపై వెంగమాంబకు గల భక్తిభావం, రెండవది వేంకటేశ్వరస్వామియే అన్నమయ్యతో ఇలా పల్కినాడట! "భవదీయ సంకీర్తనంబు లాలించిన కర్ణంబుం నితర సంకీర్తనంబు లాలింపనని ప్రతిజ్ఞాపించే - ఈ వాక్యాలు అన్నమయ్య దౌహిత్రుడైన రేవణూరి వేంకటార్యుడు రచించిన 'శకుంతలా పరిణయ' అనే అముద్రిత ప్రబంధం యొక్క అవతారికలో ఉన్నాయి. ఈ అభిప్రాయాన్నే అన్నమయ్య పౌత్రుండైన చినతిరుమలాచార్యులు 'సంకీర్తన లక్షణం' లోని క్రింది పద్యంలో ప్రకటించాడు.

**"నక్తంచరారి తనకును భక్తుండైనట్టి తాళ్లపాకన్నయ చా**
**టూక్తి పదబంధ కవితారక్తుండై ఇతర వాగ్విరక్తుండయ్యెన్"**

అందుకే వెంగమాంబ సంకీర్తనలు రాయకుండా యక్షగానాలు, శతకాలు, ద్విపద, పద్యకావ్యాలు మొ॥ రచించింది. అయితే ఈ కవయిత్రి తాను రచించిన యక్షగానాల్లో తాళ్ళపాక వారి భజన సంప్రదాయ పద్ధతికి చెందిన సంకీర్తనలను "నారాయణ! తే నమోనమో, శరణు శరణు సురేంద్ర సన్నుత! శరణం శ్రీసతి వల్లభా" వంటి బాణీలను సమర్థవంతంగా అనుసరించింది. అలాగే అన్నమయ్య ద్విపదలో నూతనంగా రామాయణ కావ్యాన్ని రచింపగా, వెంగమాంబ ద్విపదలోనే 'వాసిష్ఠ రామాయణాన్ని' వెలయించింది.

అన్నమాచార్యులు సంస్కృతంలో వేంకటాచల మహాత్మ్యాన్ని రచింపగా, వెంగమాంబ తెలుగులో వేంకటాచల మహాత్మ్యము అనే ఆరు ఆశ్వాసాల పద్యకావ్యాన్ని రచించింది. ఈ కావ్య అవతారికలో ఈ కవయిత్రి పూర్వ కవీశ్వరులను స్తుతించే సన్నివేశంలో అన్నమయ్యను ప్రాచీన కవుల పంక్తిలో విశిష్టంగా పేర్కొంది.

**సీ॥ ఆది కవీశ్వరుడైన వాల్మీకి కి**
**వ్యాసమౌనికిఁ గాళిదాస కవిక**
**అరయంగ వరలబ్ధ మన్నమాచార్యున**
**కాంధ్రభాషా కవిత్వాఢ్యులగుచుఁ**
**దనరు నన్నయకుఁ దిక్కన సోమయాజికిఁ**
**బోతరాజునకు, సునీతలయిన**
**కవులకుఁ బండితాగ్రణులకుఁ, బౌరాణి**
**కులకు భక్తిని మ్రొక్కి కొనుచు నేను"** - వేంకటాచలమహాత్మ్యము

పై సీసపద్యంలో అన్నమయ్యకు సంస్కృత కవులకు పిమ్మట తెనుగు కవులకు ముందు 'వరలబ్ధము' అనే సార్థకమైన విశ్లేషణంతో వెంగమాంబ ప్రశంసించింది. అంటే అన్నమాచార్యుడు శ్రీ వేంకటేశ్వర వరలబ్ధమైన సంస్కృతాంధ్ర కవితా ప్రావీణ్యం

గల మహాకవియని వెంగమాంబ అభిప్రాయమైనట్లు వెల్లడౌతుంది. వెంగమాంబ తప్ప ఇంకెవ్వరూ అన్నమయ్యను ఇలా పూర్వకవిగా స్తుతించిన వారు లేరనేది మనం గమనించవచ్చు.

వేంకటేశ్వరుడు అన్నమయ్యతో సంభాషించిన సన్నివేశం. చిన్నన్న రచించిన అన్నమాచార్య చరిత్రలోనిది. వేంకటేశ్వరస్వామి అన్నమయ్యతో ఇలా పల్కినాడట!

**"ఆ కృష్ణమాచార్యు నధ్యాత్మ వినుత**
**రాక గొన్నాళ్లు విరక్తుండనైతి**
**జగతి నీ శృంగార సంకీర్తనములు**
**కగపడి మంచి ప్రాయపు వాడనైతి-"**

పలికే వీణలోపలి శ్రావ్యమైన చక్కదనం వీణను పలికించే వాడిదే కాని, ఆ వీణకు స్వతంత్రంగా పలికే శక్తి లేదు - అని అభిప్రాయం. ఇటువంటి భావాన్నే వెంగమాంబ వెంకటాచల మహాత్మ్యంలో ఇలా ప్రకటించింది.

**"దారునిర్మిత వీణ నారూడిఁ బలికించు**
**గాయక పురుషుని కరుణిగాను**
**పురుషోత్తముఁడు దయాపూర్ణుఁడై నా జిహ్వా**
**యందుఁదా వసియించి యరుదుగాను**
**పలికించుఁ గావున భాగవత పురాణ**
**మమరనే ద్విపద కావ్యంబు 'గాను"** - వెంగమాంబ

పై సీసపద్య పంక్తులు "పలికెడిది భాగవతమఁట! పలికించు విభుండు రామభద్రుండట" అనే పోతన అభిప్రాయాన్ని జ్ఞాపకపరుస్తాయి.

అన్నమాచార్యులు తన సంకీర్తనలచే శ్రీ స్వామివారి కొలువులో హరికీర్తనాచార్యుడుగా నెలకొనగా, వెంగమాంబ బంగారు వాకిలికి అల్లంత దూరాన్నుండే నిలుచుండి, ఆ గురుశేషగిరివాసుణ్ణి ప్రసన్నుణ్ణి గావించుకొని, తాను సృజించిన సువిశాల సారస్వతంలో ఆ దేవదేవుణ్ణి సుప్రతిష్ఠితుణ్ణి కావించింది.

ఒక్కమాటలో, ఈ యిరువురు సాహితీమూర్తులు ప్రజలకొఱకై ప్రజానీకానికి సుబోధమయ్యే భాషలో సహజశైలిలో కవితా సృష్టి కావించిన ప్రజాకవులు. ఇరువురూ జీవితంలో సహస్ర చంద్ర దర్శనం కావించిన పరమ భాగవతోత్తములు అలాగే జీవితంలో అత్యధిక కాలం తిరుమల క్షేత్రంలో నివసించి, సారస్వత సృష్టిచే స్వామి నారాధించి, ఆ పుణ్యక్షేత్రంలోనే సిద్ధి పొందినారు.

అన్నమయ్య సృజించిన సారస్వతంలోని ప్రతిపదము స్వామివారి కర్పించిన సంపెంగపూవు. అలాగే వెంగమాంబ సృష్టించిన వాఙ్మయంలోని ప్రతిపలుకూ శ్రీనివాసునికి సమర్పించిన తులసీదళం! శ్రీ వేంకటేశ్వరస్వామి యొక్క కోమల దరహాసం ఈ యిద్దరి సాహితీ సృష్టికీ స్ఫూర్తి కేంద్రం.

శ్రీ వేంకటేశ్వరస్వామి వారి నిత్యసేవలలో చిట్టచివరిది 'ఏకాంతసేవ'. ఈ సేవ ఆధారంగానే తాళ్ళపాకవారి లాలి, తరిగొండ వారి 'ముత్యాలహారతి' అనే సూక్తి ఆవిర్భవించింది. ఈ సూక్తి యందలి మొదటి భాగానికి అన్నమయ్య మూలకారణం కాగా, రెండవ భాగానికి వెంగమాంబ ఏర్పరచిన కైంకర్యమే కారణం. ఈ భక్త శిఖామణుల సేవలను సమానంగా ఒకే సమయంలో స్వీకరిస్తూ వున్న శ్రీనివాసుడే వీరిరువురి సమానత్వానికి సాక్షి!

మొత్తం మీద ఈ యిరువురు మహనీయమూర్తుల జీవితాల సాహిత్యాల వల్ల వెల్లడియౌతున్న సందేశ పరమార్థాలు ఒకటే.

ఒక్కమాటలో, ఆంధ్ర వాఙ్మయ ప్రపంచంలో మరే ఇరువురు మహాకవుల మధ్య గోచరింపని సన్నిహితమైన సాదృశ్యం ఈ యిద్దరు సాహితీమూర్తుల జీవితాల్లోనూ, సృజించిన సాహిత్యలోనూ సాక్షాత్కరిస్తూ వుండటం యథార్థమైన విశేషం.

***

# అన్నమాచార్య సంకీర్తనలలో - స్త్రీ స్వభావం

**శ్రీమతి కె. అరుణ**
**పరిశోధక విద్యార్థిని**
**శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం**
**తిరుపతి**

తెలుగులో మొట్టమొదటి వాగ్గేయకారుడైన అన్నమయ్య కడప జిల్లా రాజంపేట తాలూకా తాళ్ళపాక గ్రామంలో జన్మించాడు. నారాయణసూరి, లక్కమాంబ దంపతులకు క్రీ.శ. 1408న అన్నమయ్య జన్మించాడు. ఆయన 16వ సంవత్సరంలో శ్రీ వేంకటేశ్వర స్వామి సాక్షాత్కారం పొందినాడు. పదకవితా పితామహుడైన అన్నమయ్య 32వేల సంకీర్తనలు రాసినా, 12వేల కీర్తనలు మాత్రమే లభిస్తున్నాయి. ఆ కీర్తనలను రాళ్ళపల్లి, వేటూరి మొదలైనటువంటివారు పరిష్కరించి స్వరపరిచారు. అన్నమయ్య శృంగారమంజరి, వేంకటేశ్వర శతకం కూడా రాసి వుంటాడని పరిశోధకులు భావిస్తున్నారు.

**స్త్రీ స్వభావము**

భారతీయ సమాజంలో పూర్వకాలం నుండి స్త్రీకి ప్రాధాన్యం తక్కువ. గృహిణిగా మాత్రం ఆమెకు ఎంతో ప్రాధాన్యం ఉందనేది వాస్తవం. పితృస్వామ్య వ్యవస్థ వల్ల స్త్రీ గృహానికి పరిమితమై ఉండేది. ఇలా జరగటానికి కారణం పురుషాధిక్యం లేదా

పురుషాహంకారం అనే జభావన ఉండటం, ఇదే కాకుండా పురాణాలలో, ఇతిహాసాలలో స్త్రీ పురుషుడి ఆధీనంలో, అతడి చెప్పుచేతల్లో ఉండే కట్టుబాట్ల వలన స్త్రీ గృహానికే పరిమితం అయ్యింది. ఇవేకాకుండా ఆర్థిక స్థితిగతుల మీద ఆధారపడి వుంది. ఆర్థిక సంబంధ విషయాలలో పురుషుడిదే పై అధికారం. స్త్రీకి పురుషుడితో సమానమైన హోదా వుండేది లేదు. ఆర్థిక స్వేచ్ఛ స్త్రీకి లేదు. స్త్రీకి నియమ నిబంధనలు, కట్టుబాట్లు వుంటే పురుషుడికి అలాంటి నిషేధాలు ఏవీ లేవు. స్వేచ్ఛాజీవిగా పురుషుడు వుండేవాడు. స్త్రీ మాత్రం ఇంటిపట్టునే ఉండి పతివ్రతగా పేరు తెచ్చుకోవాల్సి ఉండేది. ఆకాలంలో బహు భార్యత్వం, వేశ్యావృత్తి సమాజంలో అధికంగా వుండేవి. తనకు నచ్చిన స్త్రీలను పురుషుడు వివాహమాడేవాడు. పురుషునికి ఇతర విలాసా వస్తువులలాగా స్త్రీ కూడా భోగవస్తువైంది. అలాంటి సమయంలో సమాజాన్ని చైతన్యపరచటం కోసం అన్నమయ్య కృషి చేశారు.

అన్నమాచార్యులు తన సంకీర్తనలలో స్త్రీ స్వభావాన్ని అనేకరకాలైన ఆమె హావభావాలను చిత్రించాడు. ఈయన సంకీర్తనలలో ప్రధానంలా కనిపించేవి స్త్రీ పాత్రలు. స్త్రీ అంటే నాయిక. ఈయన కీర్తనలలో నాయికలందరూ పడుచువారు. వారిలో కొందరు వివాహితులు, మరికొంతమంది కన్యలు. ఆ రోజుల్లో బహుభార్యత్వం నిషిద్ధం, దక్షిణ నాయకత్వంలో బహుభార్యత్వం చలామణి అయ్యేది. బహుభార్యత్వం వలన సపత్నులు లేదా సవతులు ఏర్పడ్డారు. ఈ సపత్నుల మధ్య పోటీ కలిగింది. ఈ పోటీలో కొందరు గెలవటం, కొందరు ఓడిపోవటం, కొందరు సంతోషించటం, కొందరు బాధపడటం, మరికొందరు రాజీ పడటం. ఉన్నదాంతో తృప్తిపడేవాళ్ళు, కొందరు గొణిగేవారు, కొందరు చెప్పుడు మాటలు విని బాధపడేవారు. కొందరు భర్తల్ని సాధించేవారు, దెప్పిపొడిచేవారు, కొందరు అనుమానంతో, కొందరు ఆవేశం వెళ్ళగక్కేవారు, పశ్చాత్తాపపడటం, కొందరు సందేహించేవాళ్ళు, సాకులు చెప్పేవారు, ఒట్లు వేసేవారు కొందరు, కన్నీరు కార్చేవారు కొందరు, విరహాన్ని తట్టుకోలేక భయపడేవారు కొందరు, భర్తను తమ చెప్పుచేతల్లో వుంచుకోవటానికి ఎన్నో పాట్లు పడ్డారు.

అన్నమయ్య కాలంలోని స్త్రీల స్వభావం యీ వైవిధ్య, వైరుధ్యాలు కొన్నింటిని చూడవచ్చు. వాటిలో ఈర్ష్య, చెప్పుడు మాటలు వినడం, అనుమానించటం, సాధించటం, దెప్పిపొడుపు, సాకులు చెప్పటం, ఒట్టు వేసుకోవటం, కోపం తెచ్చుకోవటం, పశ్చాత్తాప పడటం, సందేహించటం, గుడ్డిగా నమ్మటం, ఆత్మాభిమానం, అతిశయం, సహనం, తృప్తి - ఇలా ఇద్దరు స్త్రీల మధ్య పోటీని అన్నమయ్య తన కీర్తనలలో చిత్రించాడు.

**1. అసూయ**

ఈర్ష్య అనేది ఒకరు పొందలేనిది, ఇతరులు పొందినపుడు తన స్వంతం అనుకొన్నదాని విషయంలో ఇతరులు జోక్యం చేసుకొన్నప్పుడు, మనిషి మనసులో పుట్టే భావము ఈర్ష్యగా చెప్పవచ్చు. ఇది ముఖ్యంగా ఇద్దరు సవతుల మధ్య ఇంకాస్త

ఎక్కువగా వుంటుంది. భర్త అభిమానం పొందటం కోసం సవతుల మధ్య ఈర్ష్యాభావం హద్దులు దాటిపోతుంది. ఎంతటికైనా తెగిస్తుంది. దేనికైనా సిద్ధపడుతుంది.

**"పొత్తులు మగఁడవు పొరుగున నుండగ**
**తత్తర మింతేసి తమకేలయ్యా"** **(22-391)**

నాయిక తన పతినే చూస్తోంది. ఆ చూపులు చురుక్కున ఆమె సవతికి తాకాయి. సవతి తన భర్తతో తీయగా మాట్లాడితే ఆ మాటలు తన సవతికి చేదుగా, ఆమె నవ్వు చీకటిగా వుంటాయి.

ఏ భార్యకు అయినా తన భార్య సర్వస్వం. తనకు సంబంధించిన ఏ వస్తువు అయినా ఇతరులతో పంచుకొంటుందేమో కానీ తన భర్తను మాత్రం పంచుకోవటానికి ఏ స్త్రీ కూడా ఒప్పుకోదు.

**2. అనుమానించటం**

ఎవరికైనా అనుమానం ఎదుటివారిమీద కలిగితే అది ఒటపట్టాన వదలదు. 'అనుమానం పెద్ద పెనుభూతం' అనే సామెత ఊరకే రాలేదు. అనుమానం వల్ల ఇద్దరి మనుషుల మధ్య మంచితనం పోతుంది. ఏది చెప్పినా ఆ విషయాన్ని నమ్మక అనుమానించటం జరుగుతుంది. అనుమానించే స్త్రీకి ప్రేమతో చూసే భర్త ప్రేమను కూడా అనుమానంగానే చూస్తుంది.

**"చుట్టరికము నేసుక సుద్దులెల్ల జెప్పేవు**
**నెట్టన నీ రచనలు నిజమాయిది"** **(27-175)**

బంధుత్వాలు కలిపి భర్త చెప్పే మాటలను స్త్రీ నమ్మదు. ఆ మాటలు కథలని ఆమె అనుమానం, నీ మాటలన్నీ నిజమేనా! అని భర్తను నిలదీస్తుంది.

**3. దెప్పిపొడుపు**

ఇది స్త్రీలలో ఎక్కువగా కనిపిస్తుంది. సాధారణంగా స్త్రీలు తమ భర్త ఏ విషయం అయినా చెప్పి అది చేయకుండా వుంటే దెప్పిపొడవటం చేస్తారు లేదా కొన్ని సందర్భాలలో తప్పు చేస్తే ఆ తప్పు క్షమించలేక, తప్పును అనుక్షణం గుర్తుచేసుకొని ఎదుటివారిని దెప్పిపొడుస్తూ వుంటారు.

**"అవునయ్య నీ సుద్దులటువంటివి**
**జవళితో నంటిన బచ్చలి వంటి వాడవు"** **(25-20)**

అని స్త్రీ, భర్త గుణాలను వీధిలో చేయకూడని పనులను చేసి నన్ను వేడుకొంటావని దెప్పిపొడుస్తుంది. అందుకే భర్తచేత ఒట్టు వేయించుకోవాలంటే ఆమె భయపడుతుంది. స్త్రీల విషయంలో చంచల స్వభావం గలవారిని దెప్పిపొడుస్తుంది.

**4. సందేహించటం**

ఏ పనినైనా చేయటానికి ముందు అది జరుగుతుందో లేదో అనే సందేహం, ఆ పనిచేస్తే ఎవరైనా, ఏమైనా అనుకుంటారేమో అనే సందేహం, నాయిక తాను

ఏ పనిచేసినా నాయకుడు దాన్ని యిష్టపడతాడో లేదో అనే సందేహంలో వుండిపోతుంది.

**5. పోటీతత్వం**

బహుభార్యత్వం అమలులో ఉన్నచోట సవతుల మధ్య పోటీ కూడా సహజమే. ఆ పోటీ వెర్రిగా మారితే వాళ్ళు చేసే పనులు, వాళ్ళు పడే పాట్లు ఆ భగవంతుడికె తెలియాలి. భర్తను ప్రసన్నం చేసుకోవటంకోసం స్త్రీ తనను తాను అలంకరించుకోవటంలో పోటీపడుతుంది. ఆమె తనను అలంకరించుకోవటానికి తన సొమ్ముల్నే కాకుండా పరుల సొమ్ములను కూడా తను ధరిస్తుంది. స్త్రీ నాయకుడిని తన వశం చేసుకోవటానికి పరుల సొమ్మును ధరించడానికి అయినా సిద్ధపడుతుంది.

**6. నమ్మకం**

స్త్రీకి సహజంగా అలవడే లక్షణం నమ్మకం. తనకు ఎవరిపట్ల అయితే మంచి అభిప్రాయం వుంటుందో వారినే నమ్ముతుంది. నమ్మినవాళ్ళు అబద్ధాలు చెప్పినా సులభంగా నమ్మేస్తుంది. నమ్మకస్తులు ఏ విషయం చెప్పినా గుడ్డిగా నమ్ముతుంది. అందులోనూ భర్త ఏమి చెప్పినా అంతా నమ్మేస్తుంది. ఏ పని చేసినా అతడిష్టమని చెప్తుంది. నీటముంచినా, పాలముంచినా నీదే భారమంటుంది. తమ భర్త ఆనందంగా వుండాలని, అతడిపట్ల అధిక విశ్వాసాన్ని కలిగివుంటారు.

**7. అహంభావం**

ఇతరులకు లేకుండా తనకు మాత్రమే ఏదైనా విశిష్టత వుంటే కొంతమంది అహంభావానికి లోనవుతారు. తామే గొప్పవారమని భావిస్తారు. అందంగా ఉన్న భార్య దొరికిన పురుషుడు అయితే ఆమె కొంగు పట్టుకు తిరుగుతాడు. ఆమె ఎలా చెబితే అలావింటాడు. అది తనకు అనుకూలంగా మార్చుకొని స్త్రీ గర్వపడుతుంది. భర్తను తన చెప్పుచేతల్లో పెట్టుకుంటానని, అతని గర్వాన్ని అణచివేస్తానని శపథం చేస్తుంది. అంతేగాకుండా భర్తపై అధికారాన్ని చెలాయిస్తుంది.

**8. ఆత్మాభిమానం**

ఆత్మాభిమానం గల స్త్రీలు ఎవరైనా తమను కించపరిస్తే భరించలేరు. నాయకుడు నాయిక దగ్గరికి రానప్పుడు తనకుతానుగా అతడి దగ్గరకు వెళ్ళడానికి ఇష్టపడదు. తన ఆత్మాభిమానం దెబ్బతిన్నట్లుగా స్త్రీ భావిస్తుంది.

**"మనసుకు మనసే మర్మము గాక**
**వినికి వలె దనకు విన్నవించవలెనా"**

కలువ పువ్వుకు చంద్రుడి రాక తెలపాలా? ప్రియుడైనవాడు మనసు గ్రహించి పిలవకనే రావాలి. రాని భర్త కోసం నాయిక పరితపించింది. తను నాయకుడి దగ్గరకు వెళ్ళటానికి ఆత్మాభిమానం అడ్డువస్తుంది. తనలోని ప్రేమను బయటకు

పెట్టటానికి ఆత్మాభిమానంతో చెప్పలేని పరిస్థితి, ఇలాంటి విషయాన్ని అన్నమయ్య యీ సంకీర్తనద్వారా తెలిపాడు.

**9. ఓర్పు**

స్త్రీకి వుండాల్సిన వాటిలో ఓర్పు ఒకటి. అందుకే అంటారు స్త్రీకి భూదేవి అంత ఓర్పు వుండాలని. సహనానికి మారుపేరుగా స్త్రీని పేర్కొనటం జరుగుతుంది. సహనానికి కూడా ఒక హద్దుంటుంది. స్త్రీకి ఉండే ఓర్పును చెలికత్తె వర్ణించే తీరు చూస్తే ఎలాంటి ఓర్పు వుంటుందో తెలుస్తుంది.

**"ఎంత వోర్పు గలదానవేమి నీవు**
**కాంతలెల్లా నీ సుద్దులు కతలుగాఁ జెప్పేరే"** **(22-53)**

అంటూ విరహంతో ఉన్న తన భర్త మనస్సుకు బాధకలుగకుండా, నొప్పించకుండా మాట్లాడుతుంది. మరునిచే దెబ్బతిన్నా కూడా అతనితో స్నేహం చేస్తుంది. నవ్వుతూనే భర్తకు సేవలు చేసే స్వభావం కలిగివుంది.

**10. తృప్తి**

కోరుకున్నది దొరికినపుడు కలిగేది తృప్తి అలాగే ఉన్నవాటితో సర్దుకుపోవడం కూడా తృప్తిని కలుగజేస్తుంది. అత్యాశకు పోయి ఉన్నదానికంటే ఇంకా ఎక్కువ కావాలని కోరటం వలన సుఖమయ జీవితాన్ని దుఃఖమయం చేసుకొంటారు కొందరు. స్త్రీ విషయంలో అయితే నగలు, చీరలు ఇలాంటివి ఎన్నివున్నా కూడా కొన్నిసార్లు తృప్తిపొందరు. అందరూ అలా వుంటారని చెప్పలేం. మరికొందరు వున్నదాంట్లోనే సంతృప్తిగా వుంటారు. వాళ్ళు ఆనందంగా వుంటారు, ఎదుటివారిని ఆనందంగా వుంచుతారు.

**"వంచుక అనుభవించు పదఁతుల మిందరము**
**ముంచి నీ మన్నన నాపై మోహము గలంతే"** **(13-517)**

ఇందులో నాయిక నీవు చూపించే ప్రేమ చాలు, పదహారు వేలమంది భార్యలు, నాయకుడు ఒక్కడే. అందుకే నాయికా 'మనసిచ్చి నాతోనూ మాటాడుటే పదివేలు' అని అంటుంది.

**ముగింపు :** ఇలా అన్నమయ్య తన సంకీర్తనలలో స్త్రీల స్వభావం ఎలా వుంటుందో చిత్రించాడు. అనేక విధాలయిన హావభావాలను అన్నమయ్య సంకీర్తనలలో మనం చూడవచ్చు. అన్నమయ్య సంకీర్తనలలో పనులు, నిత్యజీవితంలో ఎదురయ్యే పాటలు ఉంటాయి. ఆధ్యాత్మిక కీర్తనలే కాదు, భక్తి, శృంగార ధోరణులలో ప్రవహించి, చందమామ రావే జాబిల్లి రావే, జో అచ్యుతానంద జోజో ముకుందా అంటూ పిల్లలను లాలించటం ఏ తెలుగువారు మరువలేనిది. అన్నమయ్య కీర్తి ఎప్పటికీ, ఎన్నటికీ తరగనిదిగా చెప్పవచ్చు.

***

# అన్నమయ్య - భక్తితత్త్వం

డా॥ సి. సరళాదేవి, పి.ఐ.ఎఫ్.
తెలుగు అధ్యయన శాఖ
శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం
తిరుపతి

తాళ్ళపాక అన్నమాచార్యులు (1408-1503) వరకు. అన్నమయ్య 1424లో జన్మించి 1503లో దివ్యధామం చేరినట్లు ప్రభాకరశాస్త్రి గారు నిర్ణయించారు. చిన్నన్న చరిత్ర, శాసనం అన్నమాచార్యుల జన్మ తిథిని గురించి మాస నక్షత్ర నామాలనే తెలుపుతున్నవి. భేదాభిప్రాయాలున్నప్పటికి అన్నమాచార్యులు శ్రీ వేంకటేశ్వరునిపై రోజుకొక్క సంకీర్తన రచియించి అతని జీవిత కాలంలో 32 వేల సంకీర్తనలు రచించాడని, అతని జీవితకాలం 1408-1503 అని స్పష్టమవుతుంది.

అన్నమయ్య ఉత్తమ వాగ్గేయకారుడు. శ్రీ వేంకటేశ్వరుని దివ్య చరణారవిందములనే మనసా వాచా కొలిచిన పరమభక్తుడు. ఇతని సంకీర్తనలలోని భక్తి, సంకీర్తనల భక్తి మార్గాన్ని ఎన్నుకున్నారు. నవవిధ భక్తి మార్గాలలో అతని భక్తిమార్గం తనదైన శైలిని చాటారు. శృంగార సంకీర్తనలోనూ, అధ్యాత్మిక సంకీర్తనలోను భక్తిమార్గాన్ని చాటి సామాన్య ప్రజలను కూడా తన పదలాలిత్యంతో ఆకట్టుకున్నాడు.

'భక్తి' అన్నది 'భజ్' అనే ధాతువు నుంచి పుట్టింది. భజ్-భజించడం, భగవంతుని భజయించడం, భగవద్భజనమని అర్థం. నారదమహర్షి భక్తిని గురించి చెబుతూ "సాతస్మిన్ పరమ ప్రేమ రూపా" ఆ భక్తి పరమేశ్వరుని పరమ ప్రేమ రూపంగా ఉందని చెప్పబడింది. "భక్తిరేవ గరీయసీ" - భక్తికి ఒక నిర్వచనం. 'భజనం అంతః కరణస్య భగవదాకారతా రూపం భక్తిః' అని కానీ 'భజ్యజే సేవ్యత్ భగవతాకార మతః కరణం క్రియతే అనయా ఇతి భక్తిః' అని భక్తికి వ్యుత్పత్తి అర్థాలు అని చెప్పవచ్చును.

శాండిల్య భక్తి సూత్రాలలోను "రసాపనురక్తిరీశ్వరే" అంటే భగవంతుని యెడల ప్రీతి అదే భక్తి అని చెప్పబడింది.

> "శ్రవణం కీర్తనం విష్ణోః స్మరణం పాదసేవనం
> అర్చనం వందనం దాస్యం సఖ్యమాత్మ నివేదనం
> ఇతి పుంసార్పితా విష్ణుభక్తిశ్చేన్నవ లక్షణా
> క్రియతే భగవత్యద్ధాం తన్మన్యే ధీత ముత్తమమ్"

(భాగవతము 7 స్క. 0-5)

ఈ నవవిధ భక్తిమార్గాల్లో అన్నమయ్య చూపిన భక్తిమార్గము సంకీర్తన భక్తి. శ్రీ వేంకటేశ్వరుడు అలమేలుమంగపై ఆధ్యాత్మిక శృంగార సంకీర్తనలు ద్వారా ఆ శ్రీహరిని కొనియాడిన అన్నమయ్య "హరికీర్తనాచార్యుడని" "సంకీర్తనా చార్యుడను" "పదకవితా పితామహుడని" బిరుదాంకితుడయ్యాడు.

అన్నమయ్యకు భగవంతుని యందు భక్తి భావం బాల్యం నుండి వచ్చినది. తల్లి లక్కమాంబ వేంకటపతి మీద జోలపాట పడనిదే అన్నమయ్య నిద్రపోయేవాడు కాదట. వెంకన్న పేరు చెబితేనే ఉగ్గుపాలు తాగేవాడట. ఈ విధంగా అన్నమయ్య తల్లి ఆ భగవంతునిపైనే భక్తిని ఉగ్గుపాలతో రంగరించి పసినది. మొదటిసారిగ అన్నమయ్య తిరుపతికి చేరినప్పుడు అలమేలుమంగమ్మ ప్రత్యక్షమై సాలగ్రామ మయైన ఈకొండను చెప్పులతో ఎక్కరాదని చెప్పింది. ఆ శ్రీనివాసుని చేరుకునే మార్గము చెప్పి అంతర్ధానమైనది.

అన్నమయ్య శ్రీ వేంకటేశుని దివ్యమంగళ విగ్రహంను దర్శించి పులకించి నపుడు,

**"అలమేలు మంగకు నాశు మార్గమున**
**సలలితంబుగ నొక్కా శతకంబు జెప్పె."**
**"కంటినయ్యఖిలాండ కర్తనే నధికుగంటి**
**నాయఘము నిక్కము వేదుకొంటి"**

అన్నమయ్య తనలో వున్న భక్తితో పరవశించి పాడుకున్న పాట.

అన్నమయ్య సామాన్య మానవునిలో కూడ తాను నమ్మిన దైవాన్ని దర్శించిన పరమభక్తుడు. ఆయన జానపదులలో జానపదుడు. ఆ పదాలలో అన్నమయ్య నవవిధ భక్తులను అభివర్ణించిన తీరు తెలుగు జనుల దైనందిన జీవితానికి అద్దం పట్టింది.

అన్నమయ్య సంకీర్తనలో హరిభక్తిని విని ప్రజలందరూ –

**"తుంబురుడో నారదుడో కాక యీవి**
**ధంబునఁ దిరుగు గంధర్వుడో కాక"**

అని భక్తి పరాయణుడు అన్నమయ్య.

భగవంతుని పవిత్ర చరిత్ర, గుణ మహిమాదుల్ని వినడం శ్రవణం. తరువాత కీర్తించడం, లిమ రూప స్వరూపాల్ని స్మరించడం, పాదాల్ని సేవించడం, నమస్కరించడం, సేవించడం, సామ్యగుణాల్ని పొంది సక&? మొనరించడం చివరికి ఆత్మను భగవంతుని యందు చేర్చడం. ఈ నవవిధ భక్తి మార్గాలను ఒకదాని కంటె మరొకటి గొప్పదై చివరికి ఆత్మ నివేదనంతో భక్తిమార్గం పూర్తి అవుతుంది.

అన్నమాచార్యులు శృంగార, ఆధ్యాత్మ సంకీర్తనలు రచించాడు. భక్తితత్వంలో అధ్యాత్మిక సంకీర్తనల్లో నీతి వైరాగ్యాలు కూడా సంకీర్తన లక్షణంలో ఒకటి -

**"దేహాత్మశ వివేకో**
**త్సాహము నులోకవేద ధరాధర్మో"**

దేహం, ఆత్మ, పరమాత్మలకు గల సంబంధాన్ని, లోక, వేద, ధర్మాదుల వివేచనాదులు సంబంధాన్ని వివరించే హరి సంకీర్తనలో అధ్యాత్మ సంకీర్తనలు.

అన్నమాచార్యులు నామ సంకీర్తనాన్ని కలియుగంలో పంచమ వేదమని చెబుతూ-

**"కలియుగంబునకుఁ గలదిదియే**
**వెలసిన పంచమ వేదమె కలిగె"**

ఈ నామ సంకీర్తన తన వేలపదాలలో సంకీర్తన చేసి తరించాడు. 'అధ్యాత్మ పదాలు అగ్రామ్యారమ్య విష్ణు చరిలోదారములైవ ఉండాలని సంకీర్తన లక్షణంలో నిర్వచనమే ఉంది.

శ్రవణం : "వినరో భాగ్యము విష్ణుకథ
వెనుబల మిదివో విష్ణుకథ" **(అధ్యా. సం. 3-35)**

కీర్తనం : చాలదా బ్రహ్మమిది సంకీర్తన మీకు
జావెల్ల నడగించు సంకీర్తనం
సంతోషకరమైన సంకీర్తనం
సంతాప మణగించు సంకీర్తనం
జంతువుల రక్షించు సంకీర్తనం
సంతతముఁ దలచుఁడీ సంకీర్తనం.

పాదసేవనం: శ్రీమన్నారాయణ శ్రీమన్నారాయణ
శ్రీమన్నారాయణ శ్రీపాదమే శరణు.
విడువ విడువనికి విష్ణుఁడు నీ పాదములు
కడఁగి సంసారవార్ధి కడుముంచు కొనిన.

అర్చనం : పరమాత్ముఁడ వని భక్తి సేసి నిను
నరహరి వని ధ్యానము సేతు
సరవులఁ జరిత చర్వణ మనకు మీ
అరయఁగ గురి యంతరాత్మవుగాను.

వందనం: ఉన్న సుద్దులేల మాకు వూర విచారములెల్ల
వెన్నునికి మొక్కుటే వేవేలు మాకు.

స్మరణం : గోవింద నామ మొకటే కూడపోసెఁబుణ్యములు
వేవేలు నామములకు వెలలున్న వా
శ్రీవిష్ణు నామమొకటే చేతికిచ్చె వైకుంఠము
తావై యున్న నామములు తమకించే నీవికి.

దాస్యం : పనిగొను వారల భాగ్యమిది
వెనక ముందరికి వివేక మొకటే
బలు పుణ్యములకు బాపములకు గురి
కలియుగ మొకటే కలది
చెలఁగి చేయుటకు చేయించుటకును
తలఁపూ నొకటే తనలోఁ గలది.

సఖ్యం : మగుడఁగ కులధర్మములు బుణ్యములు
తెగి పార్థున కుపదేశించెన్
నగుచు నతనితో నానాగరులను
నిగమము నియమము నిజమెరిఁగించెన్.

అన్నమాచార్యుల భక్తిప్రపత్తి, శరనాగతి అతని అధ్యాత్మిక సంకీర్తనలన్నింటా స్పష్టం అవుతుంది.

"ఇంతటఁ గావఁగదే యిందిరా నాయక నన్ను
పంతానఁ గాకాసురునిఁ బాలించినట్లు"

భక్తితత్వాన్ని పునాదిగా శ్రీ మద్రామానుజులు విశిష్టాద్వైత మతాన్ని నిరూపించడం వల్ల అందులో ప్రధానంగా శరణాగతి, ప్రపత్తి, హరిదాసు మొదలైన అంశాలు ప్రముఖంగా పరిగణించబడతాయి.

భగవంతుని ప్రాణనాథునిగా తన్ను నాయికగా భావించుకొని, భగవంతుని కీర్తించుటయే మధురభక్తి. మధురభక్తి వస్తువుగా కలిగిన అనేక శృంగార సంకీర్తనలను అన్నమయ్య రచించెను.

అందులో అన్నమయ్య వర్ణించి శృంగార్ ఆధ్యాత్మికమైన దివ్యశృంగారం. మధురభక్తి వస్తువుగా గల సంకీర్తనలు మానవుడు గమ్యము చేరుటకు ప్రయత్నించు మార్గమే ముక్తి.

***

# అన్నమయ్య సంకీర్తనలు - పుష్ప వర్ణన

**శ్రీమతి జి. సుభాషిణి**
**పరిశోధక విద్యార్థిని**
**తెలుగు అధ్యయన శాఖ**
**శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం, తిరుపతి**

అన్నమాచార్యులు కడప జిల్లా, తాళ్ళపాక గ్రామవాసి. తాతముత్తాతలు కూడా అక్కడే నివసించారు. అన్నమయ్య నందవరీక బ్రాహ్మణులు, ఋగ్వేదులు, అశ్వలియన సూత్రులు భారద్వాజ గోత్రానికి చెందిన నారాయణసూరి, లక్కమాంబ పుణ్యదంపతులకు జన్మించాడు. అనేక చర్యలు, వాదోపవాదాలు జరిగిన మీదట అన్నమయ్య జననం 1408 మే నెల 9 తేదీగా నిర్ధారించారు.

చిన్న వయస్సులోనే శ్రీ వేంకటేశ్వరుని దర్శనార్థం తిరుపతి వెళ్తున్న భక్తబృందంలో కలిసి కాలినడకన వెళతాడు. కొండెక్కి వెళ్ళలేక అలసి అక్కడే రాతి బండపై నిద్రపోతాడు. అలిమేలుమంగమ్మ వచ్చి అతని అలుపు తీర్చి ప్రసాదం ఇవ్వగానే అతడు సరస సాహిత్య పారీణుడై అశువుగా అలమేలుమంగపై శతకం చెప్తాడు. కొండకి చేరి స్వామిని దర్శించదానికి వెళ్ళగా అచ్చట తలుపులు బిగించి ఉంటాయి. అంతకు ముందు చెప్పిన శతకంలోని పద్యాలు చెప్పగానే తలుపులు వాటికవే తెరుచుకుంటాయి. అప్పుడచ్చట ఉన్నవారు అన్నమయ్య సామాన్యుడు కాదని, అవతార పురుషుడనీ కీర్తిస్తారు.

**పుష్ప ప్రాముఖ్యత :**

దైవ సృష్టిలోని రకరకాల రంగురంగుల పుషాపలు వింతవింత పరిమళాలతో, చిత్రవిచిత్ర స్వరూపాలతో ఒప్పారుతుంటాయి. శ్రీమహావిష్ణువు నాభి 'పద్మ' మని ఆ పద్మంలో నుంచి బ్రహ్మ ఆవిర్భవించి సమస్త లోకాల్ని సృష్టి చేశాదని పురాణాలు చెబుతాయి. సృష్టికి కారకుడైన బ్రహ్మ పువ్వు నుంచి ఆవిర్భ వించినప్పుడు ఈ ప్రపంచానికీ పువ్వులకూ ఎంతటి అవ్యాజానుబంధం వుంటుందే ఆలోచిస్తే అవగాహన అవుతుంది.

మానవ జీవితానికి పువ్వులు అత్యంతావశ్యకం. పువ్వులు చక్షురింద్రియం ద్వారాను, పరిమళాలు ఘ్రాణేంద్రియం ద్వారాను శారీరకంగా హాయిని, మానసిక ఉల్లాసాన్ని, తన్మయత్వాన్ని కలిగిస్తాయి. ప్రతి నిత్యం స్త్రీల శిరోజ సౌందర్యానికి, గృహాలంకరణలకు, శుభాశుభ కార్యాలకు, గౌరవ సన్మానాలకు, పూజలకు, అలంకరణలకు, మానవ అంతియయాత్రలకు అన్నింటికి పువ్వులు అవసరం. కొన్ని

రకాల పువ్వులను అత్తరలుగా, ఔషధాలుగా ఉపయోగిస్తారు, ఇలా పువ్వులు మానవజీవితంలో ప్రముఖస్థానం వహిస్తున్నాయి.

విరిబోడి, పూబోడి, పద్మవీథి, కుందరదన, పద్మనేత్ర, పద్మహృదయ అంటూ స్త్రీలను, స్త్రీల అవయవాలను, హృదయాన్ని పోల్చడం ప్రసిద్ధమయింది. రకరకాల పువ్వుల ఆకారాల్లో వస్త్రాభరణాన్ని తయారు చేసుకుంటారు. పొన్న, కలువ మొదలైన పువ్వుల పేర్లతో ఇంటిపేర్లు కూడా ఉన్నాయి. మల్లి, మొగలి, చామంతి, రోజా, వనిజ, జలజ మొదలైన పువ్వుల పేర్లను అమ్మాయిలకు పెడుతుంటారు.

**సాహిత్యంలో పుష్ప ప్రాముఖ్యం :**

మానవ జీవితాన్ని, ప్రకృతిని సుందరంగా, మధురంగా ప్రతిబింబించేది సాహిత్యం. తెలుగు సాహిత్యంలో పదకొండవ శతాబ్దంలో నన్నయ మొదలు నేటి కవుల వరకు వెలువడిన కావ్యాల్లో పువ్వుల వర్ణనలు అపారంగా కనిపిస్తాయి. పురాణాల్లో పద్మపురాణం, నందితిమ్మన పారిజాతాపహరణం అనే ప్రబంధం, శ్రీకృష్ణదేవరాయల ఆముక్తమాల్యద అనే ప్రబంధం, గణపవరపు వేంకటకవి రచించిన పుష్పకోదండం అనే దండక విశేషం, గడియారం వేంకటశేషశాస్త్రి రచించిన పుష్పబాణ విలాసం అనే పద్యకావ్యానువాదం, గుడిపాటి వేంకటాచలం గారి ఓ పువ్వు పూసింది, కళాప్రపూర్ణ బాలాంత్రపు రజనీకాంతరావు గారి శతపత్ర సుందరి. కృష్ణారావుగారి పూదోట, దువ్వూరి రామిరెడ్డిగారి గులాబితోట, కరుణశ్రీ జంధ్యాల పాపయ్యశాస్త్రిగారి పుష్పవిలాపం, ఆచార్య ఎన్. గోపిగారి తంగెడుపూలు, డా॥ చిట్టిమల్లె శంకరయ్య రుద్రశ్రీ గారి బర్డ్ ఆఫ్ ప్యారడైజ్ (పువ్వుల మీదే వచ్చిన కవితా సంపుటి). ఆచార్య కె. మలయవాసిని గారి పువ్వులు, శ్రీ గూడ శంకరశర్మ గారి పూలయాల, నేను (డా॥ పొన్నా లీలావతి) రచించిన కరుణకమలం మొదలైన ఎన్నో కావ్యాలు పువ్వుల పేర్లమీదుగా వెలువడిన కావ్యాలు.

జానపద సాహిత్యంలో మల్లెపూల ప్రాధాన్యం గూర్చి మైసూర్ విశ్వవిద్యాలయంలో పరిశోధన జరిగింది. పువ్వుల మీద ప్రత్యేకంగా ఎన్నో పాటలు కూడా వెలువడ్డాయి. 'ఎందుకే మల్లెపువ్వా నవ్వుతావు' అనే పాట, శంకరంబాడి సుందరాచార్యులు రచించిన "మా తెలుగుతల్లికి మల్లెపూదండ" అనే పాట. డా॥ సి. నారాయణరెడ్డిగారు రచించిన "గులాబి పువ్వు చూడగానే భలేగా మురిసిపోకు" వంటి ఎన్నో పాటలు గాయనీ గాయకుల గళాలనుంచి సినిమా, రేడియో, టెలివిజన్ ద్వారా లోకప్రసిద్ధమయ్యాయి. పువ్వుల మీదుగా వెలువడిన ఈ పాటల్లో కేవలం పువ్వులకు సంబంధించే కాక పువ్వుల ద్వారా మానవ జీవితానుభవాలను, సందేశాలను, దేశభక్తి, దైవభక్తి మొదలైన అంశాలను వ్యక్తం చేయడం విశేషం.

పువ్వుల పేర్లతో కొన్ని పత్రికలు కూడా వెలశాయి. "పుష్పమాల" అనే పేరుతో సి. హెచ్. హనుమంతరావుగారు 1927లో బందరులో ఒక మాసపత్రికను స్థాపించిరి.

శ్రీపాద కృష్ణమూర్తిగారు 1927లో మద్రాసు, రాజమండ్రి నగరాల్లో "పుష్పాంజలి" అనే మాసపత్రికను స్థాపించారు.

తెలుగు సాహిత్యంలో పువ్వుల ప్రసక్తులు, వర్ణనలు అధికంగా కనిపించే ఋతువుల పేర్లమీదుగా కూడా అనేక కావ్యాలు వెలువడ్డాయి. సంస్కృతంలో కాళిదాసు రచించిన ఋతుసంహారం, తెలుగులో నందుల గోపాలకృష్ణమూర్తి గారి ఋతుసూక్తము, అద్దేపల్లి లక్ష్మణస్వామి రచించిన ఋతువిలాసం, పైడిపాడి సుబ్బరామశాస్త్రిగారి ఋతుప్రబంధం, కోవెల సుప్రసన్నాచార్యగారి ఋతుంభర, గుణ్ణం వేంకట సుబ్రహ్మణ్యం గారి ఋతుమంగళం మొదలైనవి.

తెలుగు సాహిత్యంలో ప్రాచీనకాలం నుంచీ ఆయా కవుల కావ్యాల్లో పువ్వుల ప్రసక్తులు కనిపిస్తాయి. నన్నయ ఆదిపర్వంలో మాద్రీ పాండు రాజులు విహరించిన వసంతోద్యానవన వర్ణనలో

**"కూర్మిని లతాంశములకుమ్మొనసినచ్చు యదుపమ్ముల**
**సంగీత నినదమ్ము లెసగెం**
**చందనతమావ తరులందు నగరు**
**ద్రుమయులందుఁగదళీ వనములందు"**

అనే పద్యాల్లో అశోకపుష్పం, చంపకం, అరవిందం మొదలైన పరిమళ భరితమైన అనేక రకాల పుష్పాల ప్రసక్తులు కనిపిస్తాయి.

నన్నెచోడుడు కుమారసంభవ కావ్యంలో వసంతఋతువు వర్ణనా సందర్భంలో ఉక్తి చమత్కారంతో రచించిన-

**"పొన్నలుపూచెఁబొన్నలాగిఁ బూవకముందఱఁ బూచుగోగులా**
**పొన్నలుఁగొండ గోగులను బూవకముందఱఁ బూచెబూరువుల్**
**పొన్నలుఁ గొందగోఁగులును బూరువులున్నాగిఁబూవకుండఁగా**
**మున్న వనంబు లంగలయ మోఁదుగు లొప్పగ బూచె నాయనిన్"**

అనే పద్యంలో వసంతఋతువులో పొన్నలు పూచాయని, వాటికన్నా ముందుగా గోగులు, వాటికన్నా ముందు బూరుగులు, వాటికన్నా ముందు మోదుగులు, పూచాయని కవి పేర్కొనడం జరిగింది. పద్యం ప్రారంభంలో పాఠకులకు మొదట పొన్నలు పూచినట్లు అనిపిస్తుంది. పద్యం పూర్తిగా చదివిన తర్వాత పొన్నలు చివర్లో పూచాయని తెలుస్తుంది. ఈ పద్యంలో ఈ విధమైన ఉక్తి చమత్కారం గోచరిస్తుంది.

**పుష్పవర్ణన - ప్రస్తావన :**

తెలుగు సాహిత్యంలో లోకంలో పదిహేనవ శతాబ్దంలో రాయలసీమ ప్రాంతంలోని కడప మండలంలో వెలసిన తాళ్ళపాక కవి కుటుంబానికి ఒక ప్రత్యేకస్థానం వుంది. తాళ్ళపాక వంశంలో తొలికవి పండిత వాగ్గేయకారుడు అన్నాచార్యులు. తొలి తెలుగు కవయిత్రి కూడా అన్నమాచార్యుల మొదటి భార్య

తిమ్మక్క కావడం విశేషం. ఈమె సుభద్రా కళ్యాణం అనే మంజరీ ద్విపద కావ్యాన్ని రచించింది. చేమకూర వేంకటకవి తన విజయవిలాస కావ్యంలో అర్జునుని రూపాన్ని వర్ణించేటప్పుడు తిమ్మక్క గావించిన అర్జునుని రూప వర్ణనను అనుసరించాడు. అన్నమయ్య తరువాత వరుసగా మూడు తరాల వరకు అందరూ కవులు. సంస్కృతాంధ్రా భాషా పండితులు శ్రీ వేంకటేశ్వర స్వామివారి పరమభక్తులు.

ప్రజల్లో విష్ణుభక్తిని, వైష్ణవ మతాన్ని, మానవత్వాన్ని, సద్గుణాలను పెంపొందించడానికి వీరు వచనాలు, ద్విపదలు, దండకాలు, లక్షణ గ్రంథాలు, స్తవాలు, శతకాలు, ఉదాహరణలు, జీవిత చరిత్ర మొదలైన అనేక సాహితీ ప్రక్రియల్లో రచనలు చేశారు. వీరిలో అన్నమయ్య తరువాత అతని కుమారుడు పెదతిరుమలయ్య కూడా పదాలు రచించాడు. "పన్నుగ పెదతిరుమలయ్య పదమున కెఱుగున్" అని తెనాలి రామకృష్ణుడు పెదతిరుమలయ్యను ప్రశంసించడం విశేషం. పెదతిరుమలయ్య తరువాత అతని పెద్ద కుమారుడు చినతిరుమలయ్య కూడా సంకీర్తనలు రచించాడు.

అన్నమయ్య సంస్కృత భాషలో రచించిన సంకీర్తన లక్షణ గ్రంథం నేడు లభించలేదు. కానీ అన్నమయ్య మనువడు చినతిరుమలయ్య తన తాతగారి సంస్కృత లక్షణ గ్రంథాన్ని తెలుగులోకి అనువాదం చేశాడు. ప్రస్తుతం సుమారు అన్నమయ్య శృంగార ఆధ్యాత్మ సంకీర్తనలు 15 వేలు లభించాయి. పెదతిరుమలయ్య రచించిన శృంగార సంకీర్తనలు ఐదువందల నలభై నాలుగు. ఆధ్యాత్మ సంకీర్తనలు నాలుగు వందల అరవైమూడు. చినతిరుమలయ్య సంకీర్తనలు నూట పందొమ్మిది, ఆధ్యాత్మ సంకీర్తనలు అరవై లభించాయి. శ్రీ వేంకటేశ్వర ముద్రాంకితంగా రచించిన ఈ సంకీర్తనల్ని తిరుమల తిరుపతి దేవస్థానం వారు రాగిరేకుల్లో లిఖితమైన తాళ్ళపాక కవుల కృతులన్నింటిని లభించినంత వరకు పండితులచే పరిష్కరింపచేసి ముద్రించి లోక ప్రసిద్ధి గావించారు.[1]

ఈ తాళ్ళపాక కవుల సంకీర్తనల్లో పుష్పాభివర్ణన పుష్ప ప్రాధాన్యం పుష్ప వినియోగం విరివిగా కనిపిస్తుంది. వీరి సంకీర్తనల్లో ఎన్నో రకాల పుష్పాలు కనిపిస్తాయి. ఆధ్యాత్మ సంకీర్తనలకన్నా శృంగార సంకీర్తనల్లో పుష్పాభి వర్ణన అధికంగా కనిపిస్తుంది. శృంగార సంకీర్తనల్లో నాయికా నాయకులు పద్మావతీ వేంకటేశ్వరులు. వీరి సౌందర్యాన్ని వర్ణించేటప్పుడు అవయవాలను పోలిక చెప్పడానికి వీరి ప్రణయ భావాలను ఉద్దీపింప చేయడానికి కోపతాపాలను పోగొట్టడానికి కొన్ని రకాల పుష్పాలను తాళ్లపాక కవులు ప్రయోగించారు.

అన్నమయ్య పద్మావతిని వర్ణించేటప్పుడు -

**"తామర కన్నులదాన తామెర చేతులదాన**<br>
**తామెర మోముదాన తడవే దేమి"**

అని పేర్కొన్నాడు. అలాగే వేంకటేశ్వరుని పాదాలను వర్ణించేటప్పుడు-

**'పొంచి తామర పువ్వులంబోలిన పాదాల వాడు'** అని పేర్కొన్నాడు.

**పుష్పాభి వర్ణన - సౌందర్య పోషణ :**

తాళ్ళపాక కవుల శృంగార సంకీర్తనల్లో పుష్పాభి వర్ణనకు సంబంధించిన సంకీర్తనలు అధికంగా కనిపిస్తాయి. తాళ్ళపాక కవుల శృంగార సంకీర్తనల్లో దివ్య నాయికా నాయకులు పద్మావతీ, శ్రీ వేంకటేశ్వరులు. వీరు సహజ సిద్ధమైన అపురూప సౌందర్య రకరకాల పువ్వులను వినియోగించారు. తాళ్ళపాక కవులైన అన్నమయ్య, పెదతిరుమలయ్య, చినతిరుమలయ్య కాలాల్లో స్త్రీ పురుషులిద్దరూ తమతమ కొప్పుల్లో పువ్వులను ధరించేవారు. అందువల్ల తాళ్ళపాక కవులు పద్మావతి కొప్పులోనే కాక శ్రీ వేంకటేశ్వరుని కొప్పులో కూడా పువ్వులను ముడిచి సౌందర్యాన్ని పోషించినట్లు తెలుస్తుంది. అంతేకాక పద్మావతీ శ్రీ వేంకటేశ్వరులు తమ సౌందర్య పోషణకోసం మెడల్లో, చేతుల్లో పూలహారాలను అలంకరించు కున్నట్లు వర్ణించారు.

పద్మావతీదేవి, శ్రీ వేంకటేశ్వరుల సౌందర్యాన్ని, అవయవాలను పువ్వులతో సమన్వయించి వర్ణించిన సన్నివేశాలు, నాయికా నాయకులు ఇద్దరూ ఒకరికొకరు ప్రేమోద్దీపన కోసం పువ్వులను విసురుకోవడం నాయికానాయకుల విరహావస్థలో పువ్వుల ప్రసక్తులు, పువ్వులతో సమన్వయం మొదలైన అంశాలను తాళ్ళపాక కవులు తమ సంకీర్తనల్లో విశేషంగా వర్ణించారు. వీటిని గురించి పేర్కొని వివరించడం జరిగింది.

***

# మోక్షమార్గము-అన్నమయ్య సంకీర్తనలు

**కుమారి యస్. వరలక్ష్మి**
**జీవ రసాయనశాస్త్ర అధ్యాపకులు**
**శ్రీ పద్మావతి మహిళా డిగ్రీ మరియు**
**పి.జి. కళాశాల, తిరుపతి**

మోక్ష మార్గాలలో భక్తిమార్గం ఒకటి. కలియుగంలో అన్నివర్గాల వారికి అనుసరణీయమైన మార్గం - భక్తిమార్గం. ఆరాధ్య దైవం బట్టి భక్తిలో తేడాలు కొన్ని కనిపిస్తాయి. అలంకార ప్రియుడు, స్తోత్రప్రియుడు విష్ణువు కావడంతో వైష్ణవ ఆలయాలలో భక్తి ప్రదర్శనకు అవకాశం స్పష్టంగా కనబడుతుంది. శ్రీమంతులు ధన, కనక వస్తు వాహనాదులు సమర్పిస్తే, కవిపండితులు, వాగ్గేయకారులు తమ రచనలలో సేవా కార్యక్రమాలను ప్రశంసించారు. వీరిలో తాళ్ళపాక కవులు ప్రథములు. తాళ్ళపాక అన్నమయ్య, పెద్దతిరుమలయ్య, చిన తిరుమలయ్యలు పదకవులు. వీరందరు

తాళ్ళపాక కుటుంబీకులు. అటువంటి తాళ్ళపాక పదకవులలో అన్నమయ్య శ్రీ వేంకటేశ్వరస్వామి వారికి వివిధ అవతార మూర్తులైన నరసింహ, రామ, కృష్ణుల అభేదత్వాన్ని పాటిస్తూ ఎన్నో సంకీర్తనలు రచించాడు. ప్రత్యేకించి దశావతారాలను వాటి విశిష్టతను, ప్రాధాన్యతను తెలియ జేస్తూ అవతార నిర్దేశకత్వం చేసే సంకీర్తనలను రచించాడు. భక్తితో, అనురక్తితో శ్రీ వేంకటేశ్వరాకితంగా రచింపబడిన అనేక సంకీర్తనలు దశావతార సంకీర్తనల రూపంగా ప్రాచుర్యం పొందినవి. భక్తి భావ విలసితాలైన పదప్రక్రియలోను దశావతార వర్ణనలకు ఎంతో ప్రాధాన్యం ఇవ్వబడినది. క్రీ.శ. 15 శ॥లో వైష్ణవ మత ప్రచారం కోసం శ్రీ వేంకటేశ్వర తత్త్వాన్ని మహత్త్వాన్ని 32,000 పదాల్లో వెలయించిన పదకవి తాళ్ళపాక అన్నమాచార్యులు. పండితులను, పామరులను అలరించడం కోసం పదప్రక్రియలో భిన్నరీతుల్లో శ్రీ వేంకటేశ్వరుణ్ణి కీర్తించాడు. ఇందులో దుష్టశిక్షణ, శిష్టరక్షణార్థమై భగవంతుడు ఎత్తిన దశావతారాలను కీర్తించాడు. అన్నమయ్య దశావతార సంకీర్తనలు స్పష్టమైన వర్ణనలతో కూడినవి గాను, పామరులను అలరించే జానపద గేయ రీతుల్లోను మనకు కన్పిస్తాయి. భక్తి మార్గాన్ని, మోక్షమార్గాన్ని చూపిస్తాయి.

1. **దశ విధాచరణం తన్న భవతి**
   **దశ విధావస్థార్థం తే తత్ర**
   **స్థాపయిష్యామి వేదానితి వ్యాజేన**
   **దీపితోయం మత్స్య దేహః పురా**
   **వ్యాపారోయ మేవం నచ తరుణ్యా**
   **రూపజలధౌ కేళిరుచయే తత్ర**

2. **డోలాయాం చల డోలాయాం హరే డోలాయాం**
   **మీన కూర్మ వరాహ మృగపతి అవతారా**
   **దానవారే గుణశౌరే ధరణిధర మరుజనక**
   **వామన రామ రామ వరకృష్ణ అవతారా**
   **శ్యామలాంగా రంగ రంగా సామజవరద మురహరణ**
   **దారుణ బుద్ధ కలికి దశ విధ అవతారా**
   **శీరపాణే గోసమాణే శ్రీ వేంకటగిరి కూట నిలయ**

3. **శ్రీ విష్ణో రర్చనం యేతు - ప్రకుర్వన్తి నరాభువి**
   **తే యఆంతి శాశ్వతం విష్ణో - రానందం పరమం పదమ్.**

ఏ నరుడు శ్రీ విష్ణువును అర్చిచునో వాడు శాశ్వతమైన ఆనందకరమైన పరమపదమును పొందును. ఇదే భక్తికి, మోక్షానికి పరమపద మార్గము.

***

# తెలుగు పదకవులలో అన్నమాచార్యుల-ప్రత్యేకత

**శ్రీమతి టి.కె. పద్మజ**
**జీవరసాయన శాస్త్ర అధ్యాపకులు**
**శ్రీ పద్మావతి మహిళా డిగ్రీ మరియు**
**పి.జి. కళాశాల, తిరుపతి**

ప్రపంచ సాహిత్యాలన్నింటిలోను పదమే మొదట పుట్టింది. అలాగే తెలుగు లోను పదమే మొదట ఆవిర్భవించింది. పదమంటే పాట. పాడుకోడానికి ఉపకరించేది. మానవుడు ప్రాచీనకాలంలో మాట నేర్చిన తర్వాత, తనలోని భావోద్రేక ఆర్ద్రతలను, ఆవేశకావేశాలను భక్తి ప్రేమలను, వలపు తలపులను వ్యక్తీకరించడానికి పదములతో కూర్చిన పాటను నేర్చుకొన్నాడు. పదం పామర ప్రజల్లో మాత్రమే బ్రతికి బట్టకట్టింది. రాజాదరణ లభించలేదు. రాజపోషణతో పదం పద్యంగా, పాటగా పరిణమించింది.

తెలుగులోని "పదకవిత్వాలయానికి" మూలవిరాట్టు "తాళ్ళపాక అన్నమాచార్యులు" (1408-1503). అన్నమాచార్యులు తెలుగులో మొట్టమొదటి వాగ్గేయకారుడు. తెలుగులోని వాగ్గేయకారులందరికీ ఆదర్శప్రాయుడు. ఈ సంకీర్తనాచార్యుడు రెండు విధాలైన శృంగార, ఆధ్యాత్మిక సంకీర్తనల్లో ఏ పద్య కవి పోని పోకడలు పోయాడు.

అన్నమయ్య అలిమేలుమంగా శ్రీ వేంకటేశ్వరుల అలౌకిక ప్రణయాన్ని వర్ణించి, తన మధుర భక్తితత్వాన్ని, నిరూపించుకొన్నాడు. ఆధ్యాత్మికత, భక్తి, నీతి, వైరాగ్యాలను ప్రబోధించాడు. శృంగారంలోని వివిధ రీతుల్ని విశదీకరించాడు.

"ఆళ్వారులను", "రామానుజాచార్యుల" నుంచి వారసత్వంగా గ్రహించిన "విశిష్టాద్వైత మతాన్ని", "జయదేవుని" గీతరీతిని సైతం గ్రహించి పదరచన చేసి ఆడిపాడి తరించాడు.

**ఏ కులజుండేమి? ఎవ్వడైననేమి?**
**ఆకడ నాతడె.హరి నెఱిగిన వాడు.**

కులం ప్రధానం కాదు, గుణమే మిన్న అని హరిభక్తే ప్రధానమని ప్రబోధిస్తూ వైష్ణవభక్తి ప్రాధాన్యాన్ని వివరించాడు. నీతితోపాటు, భక్తిని, వైరాగ్యాన్ని ప్రభోదించాడు.

సంకీర్తనాచార్యుడు అన్నమయ్య పదకవితా జనకుడు క్షేత్రయ్య. క్షేత్రయ్య పదానికి అన్నివిధాల మూలమేమో అన్నమయ్య పదకవిత అని భావించక పోయినా ఇద్దరి పదకవితలలో పౌరుష్యం ఉండడం విశేషం. వీరిద్దరి భాష తేనెలూరు తేటతెలుగు మాటల మూట. తెలుగుదనాన్ని పరిరక్షించిన మొదటి పదకర్త అన్నమయ్య.

సమకాలికంగా అన్నమాచార్యుల పుత్రపౌత్రులు ఈ మార్గాన్ని అనుసరించారు. అనేకరీతుల శ్రీ వేంకటేశ్వరుని అనన్య సామాన్యంగా తన శృంగార, ఆధ్యాత్మ సంకీర్తనల్లో వర్ణించి తరించాడు. ప్రజలను తరింపజేసాడు అన్నమయ్య.

పదసాహిత్యాలయానికి మూలస్తంభం అన్నమాచార్యులు తర్వాతి కాలంలోని పదకర్తలందరికీ ఆదర్శం అన్నమయ్య. పెదతిరుమలాచార్యుడు, చినతిరుమలాచార్యుడు, క్షేత్రయ్య, సారంగపాణి, రామదాసు, మునిపల్లె సుబ్రహ్మణ్యం కవి, త్యాగరాజు మొదలగువారు ఈ మహనీయుని యొక్క పదరచనలను అనుసరించి స్ఫూర్తిని పొందినవారు.

మహా పదకర్తల్లో మణిమాణిక్యంలా దేదీప్యమానంగా ప్రజల నాలుకలపై నిత్యం నర్తిస్తున్న పదకవితల సృష్టికర్త అన్నమయ్య! తెలుగు సాహిత్యమనే వినీలాకాశంలో చల్లని వెన్నెల కురిపించే పున్నమిచంద్రుడు అన్నమాచార్యులు.

***

# ఆదర్శప్రాయుడు - అన్నమయ్య

**డా॥ జి. శైలమ్మ**
**ఎడిటోరియల్ అసిస్టెంట్**
**ప్రచురణల కేంద్రం**
**ద్రావిడ విశ్వవిద్యాలయం**
**కుప్పం**

మనకు తాళ్ళపాక అన్నమాచార్యులుగారు భగవత్ ప్రసాదం ఆయన్ని తెలుగువారు కలిగుండటం ఒక అదృష్టం. అన్నమయ్య పదాలు పాడుకోడానికి వీలుగా పల్లవి చరణాలు రూపకల్పన చేసిన వారిలో ప్రథములు. ఇంతటి గొప్ప వ్యక్తి ఎప్పుడు పుట్టాడో స్పష్టంగా తెలియక పోవడం దురదృష్టం. ఈయన ఏ మాసంలో, ఏ నక్షత్రంలో పుట్టాడో తెలిసినా సంవత్సరం స్పష్టంగా తెలియదు. ఈయన పుట్టిన సంవత్సరం ఏదో తెలుసుకోడానికి పండితుల మధ్య చర్చలు జరిగాయి. ఎక్కువ మంది అభిప్రాయం మేరకు క్రీ.శ.1424-1503 సంవత్సరం అయివుంటుందని నిర్ణయించారు. అన్నమయ్య శ్రీ వేంకటేశ్వర స్వామి భక్తుడు స్వయంగా కవి. ఈయన సులభశైలిలో అచ్చ తెలుగు పదాలతో ముప్పయి రెండు వేల సంకీర్తనలు రాశాడు. దురదృష్టం ఏమిటంటే అవన్నీ లభ్యంకాకపోడమే. ఆనందాన్ని కలిగించే విషయమేమిటంటే అవన్నీ మృగ్యమైపోకుండా పన్నెండు వేల సంకీర్తనలు లభ్యమవడమే. అన్నమయ్య సంకీర్తనలపై దృష్టి సారించి పదిహేను, పదహారు శతాబ్దకాలం నాటి వాడుకలో ఉన్న తెలుగు వ్యవహారిక భాషా పదాలు వెలుగులోకి తీసుకువచ్చే బాధ్యతతో తిరుమల తిరుపతి

దేవస్థానం వారి కృషి అనిర్వచనీయం. కేవలం తిరుమల తిరుపతి దేవస్థానం వారి బాధ్యతేకాక తెలుగు వ్యవహారిక భాషా వ్యవహర్తలందరిపై ఉందని నా అభిప్రాయం.

కొంతమంది పుట్టుకతో ప్రతిభావంతులుగా పుడతారు. అలా అన్నమయ్య పుట్టుకతోనే ప్రతిభావంతుడని చెప్పుటలో సందేహం లేదు. ఒకరోజు అన్నమయ్య పదహారవయేట తన ఈడు వారితో కలసి దైవదర్శనం చేసుకోడానికి తిరుపతికి కాలినడకన బయలుదేరాడు. అన్నమయ్య చెప్పులు కాళ్లకు ధరించి కొండపైకి ఎక్కుతుంటే పద్మావతి దేవిగారు కలలోకి వచ్చి "చెప్పులు వదిలి కొండ పైకి రానాయనా అని చెప్పిందంట" అంతే వెంటనే ఆ దేవిని స్మరిస్తూ 'వేంకటేశ్వరా' అన్న మకుటంతో శతకాన్ని ఆశువుగా చెప్పేశాడు. స్వామిపై ఉన్న భక్తి వలననే చెప్పగలిగాడు. ఇప్పటి వరకు చూస్తే స్వామి వారిని ఎంతోమంది దర్శించుకొంటున్నారు వారిలో ఏ ఒక్కరు అన్నమయ్యలా ప్రాచుర్యం పొందలేక పోయారు. అన్నమయ్య దైవంపట్ల ఉన్న అనురక్తి ఎంతో గొప్పది మనకు దేవుడనుగ్రహించిన అపారమేధో సంపన్నుడే అన్నమయ్య అని నిక్కచ్చిగా చెప్పొచ్చు.

తాళ్లపాక వంశంలోని వారందరు పండితులే. ఈయన పెద్ద కొడుకు పెదతిరుమలాచార్యుడు కవి, భక్తుడు, దాత, స్వతంత్రుడు రాజుల కొలువులను ఆశ్రయించలేదు. తండ్రి తాళపత్రాలపై రాసిన కీర్తనలను రాగి రేకులపై రాయించి భద్రపరిచారు.

అన్నమయ్య గారు రాసిన సంకీర్తనలను ఊరికే ఆషామాషీగా చదవకూడదు. భగవంతుడ్ని మనస్సులో నింపుకొని చదివితేనే మానసికానందంతోపాటు ఆత్మీయ ఆహారం లభిస్తుంది. అన్నమయ్య భావకుడు ప్రతిభావంతుడు ఆయన నోటి వెంట వచ్చిన పదాలు చిలక పలుకుల్లా చెప్పలేదు. ఆయన చెప్పే ప్రతి పదానికి ఒక అర్థం ఉంది. చెప్పిన పదాన్నే మళ్లీ మళ్లీ చెప్పినా వినడానికి ఇంపుగా ఉంటుంది. పదాలను చదువుతున్నప్పుడు అర్థవంతంగా పాడుతున్నపుడు రాగయుక్తంగా ఉంటాయి. పదం వింటుండగానే హృదయానికి హత్తుకొనేలా ఉంటుంది. అన్నమయ్య పదాలు వల్లించడంలో నేర్పరి. అన్నమయ్య ఎంతో ప్రతిభావంతుడైనప్పటికి తనను తగ్గించుకొని పదాలను వల్లించాడు. అన్నీ ఉన్న ఆకు అణగి మణగి ఉంటుంది. ఏమిలేని ఆకు మిడిసి పడుతుంది. అఖండ జ్ఞాన సంపన్నుడు రాసిన పదం చూడండి.

**"ఏడ సుజ్ఞాన మేడ తెలివి నాకు**
**బూడిదలో హోమమై పోయకాలము"**

ఇందులో ఉపయోగించిన చిన్న చిన్న పదాలు పూలకారుడు పూలను దండకు కావాల్సిన మంచి మంచి పూలను ఏరి దండకుట్టినట్టు అన్నమయ్య పదాలను పేర్చాడు. జ్ఞానం, తెలివి కాలంతోపాటు కరిగిపోయాయని శాశ్వితం కాదని అవి నిరంతరం మార్పుకు గురవుతుందని చక్కగా పోల్చి చెప్పాడు.

అన్నమయ్య శ్రీ వేంకటేశ్వర స్వామిని శరణువేడుకొన్నాడు. రాజులను ఆశ్రయించుట కంటె ఆ రాజులను సృష్టించిన ఆ దేవదేవుణ్ని నమ్ముకొనుటే మేలని భావించాడు.

**"సర్వ ధర్మాన్ పరిత్యజ్య మామేకం శరణం వ్రజ**
**అహం త్వాం సర్వపాపేభ్యో మోక్షయిష్యామి మాశుచః"**

అనే చరమ శ్లోకాన్ని భగవంతుని వాగ్దానంగా విశిష్టాద్వైతులు భావించి భగవంతుని చరణాలనే శరణు వేడుకొంటారు. తన భాషా కౌశలాన్ని పెంచుకోడానికి వేదాలను ధ్యానించాడు. అహోబలంలో వన్ శఠకోపయతీంద్రుని వద్ద వేదాంతాన్ని అభ్యసించాడు.

**మనస్సు:** భగవంతునిపై దృష్టి నిలపాలంటే ఇంద్రియాలను జయించాలి. ఇంద్రియాలను జయించాలంటే మనస్సును వశపరచుకోవాలి. మనస్సు అధీనంలో ఉంటే ఏది కావాలంటే అది పొందవచ్చు. ఏది జరగాలంటే అది జరిగి తీరుతుంది. పరిపరి విధాలుగా పోయే మనస్సుపై రాసిన పదం.

**"ఇన్నిటికి నోపునా యీ మనసు నన్ను**
**మన్నించి నీ మనసు మరిగించు మన్న"**

మనస్సు నిత్యం మార్పుకు గురైనపుడు భగవంతునిపై నిత్యం దృష్టి సారించలేక పోవచ్చు. మనస్సులో కలిగిన కోరికలు త్యజించినపుడు భగవంతునిపై దృష్టి నిలపడం సాధ్యమవుతుంది. భగవంతుడు కేంద్ర బిందువుగా ఉన్నపుడు ఇహపరమైన ఆలోచనలు తగ్గిపోతాయి. అయితే మనస్సు ఇలా చేయడానికి ఇష్టపడదు. చదువుకొనే విద్యార్థికి అల్లర చిల్లరగా తిరగకుండా అల్లరితో కూడిన ఆటపాటలు వినకుండా పుస్తకం తీసి రోజుకు ఐదుగంటలు చదివితే మంచి మార్కులు వస్తాయి అని పెద్దలు చెప్తే పిల్లలు అలా చేయడానికి ఇష్టపడరు. అన్నమయ్య కూడా ఇంద్రియాలను జయించలేక పడిన వేదనను ఇలా తెలియజేస్తాడు.

**"ఏలొకొ కర్మమా యిందుకు బాలైతివి**
**పాలుపడిన యీ జలభ్రమణము వలెను"**

ఈ లోకం అశాశ్వితం భగవంతుని సృష్టి అయిన మానవులు చనిపోయి భగవంతునిలో లీనమవలసిందే కాని అశ్వాతమైన వాటిని వెదుకుతూ కాలాన్ని వెళ్లదీస్తుంటాం అని అన్నమయ్య మనస్సు చేసే ఆగడాలను వివరిస్తాడు.

**భక్తి:** భగవంతుని దగ్గరకు చేర్చేది భక్తి. భక్తి కలిగుంటేనే దైవాన్ని ప్రసన్నం చేసుకోగలం. భక్తి వల్ల భగవంతునికి అనేక రకాల కానుకలిచ్చి ప్రసన్నం చేసుకొంటాం. మనస్సుంటేనే భక్తి కలిగుంటాం. మనస్సు దైవం పట్ల అనురాగం భక్తివల్లనే కలుగుతుంది. భగవంతుని శరణు వేడితే భక్తునికి కావాల్సినవన్నీ భగవంతుడే స్వయంగా సమకూరుస్తాడు. అన్నమయ్య శరణు వేడుటలో గమ్మత్తు ఏమిటంటే

పలానిది కావాలని దేవుడ్ని అడిగితే చాలు అది ఇచ్చి తీరుతాదని నమ్ముతాడు. శరణు వేడుటలో అంతటి మహాత్మ్యం ఉందని విశ్వసిస్తాడు. మానవులం కనుక నిరంతరం తప్పిపోతుంటాం. ఇష్టానుసారంగా ఉండి భయభక్తులు లేకుండా విచ్చల విడిగా తిరిగి శ్రీ వేంకటేశ్వర స్వామిని క్షమించమని శరణు వేడితే క్షమించేస్తాడు. అన్నమయ్య దీన్ని బాగా విశ్వసిస్తాడు. సంసారసుఖాన్ని అనుభవించాడు. స్వామి వారి వలె ఇద్దరు భార్యలను కలిగున్నాడు. ఇలాంటివి చూస్తే అన్నమయ్య కూడా మామూలూ మనిషే. భగవంతుడున్నాడు నాకేం అని నిబ్బరంగా ఉండకలిగాడు. నాకేమి భయంలేదు నన్ను రక్షించడానికి ఆ దేవదేవుడున్నాడు. శరణు వేడితే తప్పక ప్రత్యక్షమై తన బిడ్డలను ప్రేమిస్తాడని భావించిన ధన్యజీవి అన్నమయ్య.

**"శతాపరాధములు సహస్ర దండనలు లేవు**
**గతి నీవని వుండగ కావకుందరాదు"**

అన్నమయ్య ఇలా రాశాడు గాని అన్నమయ్య అహింస, సత్యవాక్కు కల్గిన రుజు ప్రవర్తకకుడు, సున్నిత మనస్కుడు. మంచి గుణాల కలబోలే అన్నమయ్య.

అన్నమయ్య శరణాగత భక్తితోపాటుపాటు శృంగార భక్తితో కూడా పదాలను రాశాడు. దేవుడి దృష్టిలో మానవులందరు సమానమే. ఎండ, వాన, గాలి మంచి వారికి, చెడ్డవారికి ఇస్తున్నాడు. భక్తి భావంతో భగవంతునికి అనేక రకాల కానుకలు ఇస్తుంటారు. భగవంతుని పట్ల ఉన్న అనురాగాన్ని వివిధ రూపాల్లో ప్రదర్శిస్తుంటారు. భగవంతుడ్ని ఆరాధించే క్రమంలో రచయిత అయితే దైవాన్ని భార్యగాను, కవయిత్రి అయితే భర్తగాను, సోదరుడిగాను, తల్లిగాను, చెల్లిగాను, అక్కగాను ఊహించుకొని రచనలు చేస్తుంటారు. భార్యా భర్తల మధ్య ఏర్పడిన అనురాగం కారణంగా ఒకర్ని విడిచి ఒకరు వదిలి ఉండలేరు. అలాంటి విడదీయరాని ప్రేమతో అన్నమయ్య స్వామి వారిని భార్యగా ఊహించుకొని కలలో కూడా పలకరిస్తూ వుండే ప్రేయసిగా అన్నమయ్య రాసిన పదం

**"కాంతుని వేగలలోన కౌగలించినట్లాయె**
**నంతలోనే పులకించి నట్లాయెను"**

భగవంతునిపై ప్రేమను హెచ్చుగా పెట్టుకొని నాయికగా వర్ణించిన మరో కీర్తన

**"అవని గొల్చిన ప్రాయంపుటందకాడు**
**అతి మనోహర లలిత బింబాధరుండు"**

భగవంతుని వలననే ఈ పరిస్థితి నాయికకు వచ్చిందని అంటాడు. అన్నమయ్య శ్రీ వేంకటేశర స్వామి యెడల ఉన్న భక్తిని ఆ విధంగా వెలిబుచ్చాడు.

**మహాత్మ్యం:**

భక్తులను రక్షించుటలో భాగంగా భగవంతుడు అనేక రూపాలుగా దర్శనమిస్తాడు. ఆయన చేసిన మంచికార్యాలను భక్తులు నిత్యం స్తుతిస్తుంటారు. భగవంతునిలో

లీనమైన భక్త కోటి భగవంతుని లీల్లలు వర్ణిస్తుంటారు. భగవంతుడ్ని చిన్నపిల్లవాడిగా భావించి రాసిన సంకీర్తన

**"ఉగ్గు వెట్టరే వోయమ్మా చెయ్యెగ్గినిదె శిశువోయమ్మా**
**కడుపులోని లోకమ్ములు గదలీ - నొడలూచకురే వోయమ్మా"**

శ్రీకృష్ణుని బాల్య క్రీడల్లో భాగంగా శ్రీకృష్ణుడు చేసిన ఆగడాలను వివరించడానికి వచ్చిన గొల్లెతలతో ఇలా అంటాడు.

**"కానరటె పెంచరటె కటకటా బిడ్డలను**
**నేను మీ వలెనే కంటి నెయ్యమైన బిడ్డని"**

అన్నమయ్య ఆ దేవదేవుని లీలలు ఎన్నో రకాలుగా వర్ణించినప్పటికీ తృప్తి అనేది లేకుండా ఇంకా ఇంకా వర్ణించాలని తపనపడ్డాడు. ఆడుకొనే వయస్సున్న చిన్న పిల్లలు పాలతో వచ్చే ఆహార పదార్థాలను ఇష్టపడటం సహజం. ఈ సహజమైన కార్యాన్ని చేసిన చిన్న కృష్ణుని నిందిస్తారా అని తల్లి బిడ్డను వెనకేసుకొస్తుంది.

భగవంతుడికి ఇష్టంగా ఉంటే భక్తులు కోరిన వరాలు ఇచ్చి తృప్తి పరుస్తాడు. భగవంతుని మహాత్మ్యం వర్ణనాతీతం.

**"ఎవ్వడో కాని మెరుగరాదు కడు**
**దవ్వులనే యుండు తలపులో నుండు"**

వేంకటేశ్వర స్వామికి భక్తులు రకరకాల సేవలు చేస్తుంటారు. ఆ సేవలన్నిటిని కూడా ఆయన చేసిన లీలలుగా వర్ణిస్తారు. ప్రకృతి ఒకరోజు ఉన్నట్టు మరొక రోజు ఉండదు. నిరంతరం మారుతుంటుంది. ఇలా మారడం కూడా హరిలీలలే కారణం ప్రకృతిలో చీమ చిటుక్కుమన్నా ఆకు కదిలినా దేవుని శక్తివల్లే కదులుతాయి.

**"కటకట హరిమాయా కల్పవెట్టిదో**
**తటకున బారవేసే తలపెందు లేదు"**

ప్రకృతి నిరంతరం మారినట్లు బుద్ధి కూడా నిరంతరం మారుతుంది. ఇది కూడా హరిమాయేనని వర్ణిస్తాడు.

శ్రీ వేంకటేశ్వర స్వామిని నమ్మిన అన్నమయ్య కేవలం తన స్వార్థం చూసుకోలేదు. ఎంతో మంది భగవంతుని ధరిచేరలేక పోతున్నారని చింతించాడు. మనస్సు చంచలమైంది. దాన్ని అదుపులో ఉంచుకోవాలి. ఈ ప్రపంచంలో భగవంతుడ్ని ఎరగని అజ్ఞానులు, పామరులు, మూర్ఖులు ఉన్నారు. వారికి భక్తితో ముక్తి మార్గాన్ని ఉద్బోధించాడు. వాళ్లు వినకపోవడం కూడా భగవంతుని చిత్తమేనని అంటాడు.

**"జీవు డెంతటి వాడు చిత్త యెంతటిది**
**దైవికము గదవనెంతటివాడు దాను"**

నిరంతరం హరి నామస్మరణ చేస్తూ ఉంటే చాలు ఆ మనిషికి అవసరమైన పనులన్నీ జరుగుతాయని అని అంటాడు. ఇది విన్నవాళ్లకు నమ్మకం కలుగదు పైగా హేళన చేస్తారు. నిశితంగా చూస్తే నువ్వు చెయ్యాల్సిన పని చేసి భగవంతునిపై భారం వెయ్యి ఫలితం ఇచ్చేవాడు ఆ దేవదేవుడే అని చెప్పడం అన్నమయ్య విశ్వాసం.

**"అంతరంగమున దానుహరి దలచిన జాలు**
**అంతటి మీద పనులాతడే యెరుగు"**

అన్నమయ్య భక్తి పరుడు సంసార సుఖాన్ని అనుభవించాడు. అందులోని లాభనష్టాలు తెలుసుకొన్నాడు. ఈ సమస్తము వ్యర్థమనుకొన్నాడు. భగవంతుడే దిక్కు అనుకొన్నాడు. భగవంతునిపై దృష్టి సారించాలనుకొన్నాడు. భగవంతుని ధ్యానించడానికి మనస్సును వశపరచుకొన్నాడు. భక్తి ద్వారా దేన్నైనా సాధించవచ్చని అనుకొన్నాడు. భక్తిని కలిగి భగవంతునిలో తదాత్మ్యం చెందాడు. భగవత్ జ్ఞానం పొందినప్పటి నుండి సమాజంలో ఉన్న వారందరు దేవదేవుడ్ని తెలుసుకోవాలనుకొన్నాడు. అందుకు అవసరమైన వేదాధ్యయనం చేశాడు. భగవంతుడు ఏమి బోధించాడో సంఘంలో మనిషి ఎలా జీవించాలో భగవంతునిలో ఎలా తదాత్మ్యం చెందాలో సులభమైన అచ్చ తెలుగు వాడుక పదాలను ఎంచుకొని వినసొంపుగా పాడుకోడానికి అనువైనవిగా వీనులకు విందులు చేసే సంకీర్తనా కారుడిగా ఆదర్శప్రాయుడిగా వెలొగొంతున్నాడు.

***

# శ్రీ వేంకటేశ్వరస్వామి వారి శతక ఆవిర్భావము

**శ్రీమతి పి. యామిని**
**రసాయనశాస్త్ర అధ్యాపకులు**
**శ్రీ పద్మావతి మహిళా డిగ్రీ మరియు**
**పి.జి. కళాశాల, తిరుపతి**

క్రీ.శ. 15వ శతాబ్దంలో కలియుగ ప్రత్యక్ష దైవమైన శ్రీ వేంకటేశ్వరుణ్ణి సంకీర్తనమనే భక్తిమార్గం ద్వారా కీర్తించి, తరించిన "తొలి తెలుగు వాగ్గేయకారుడు" అని ప్రసిద్ధి పొందిన వాడు శ్రీ తాళ్లపాక అన్నమాచార్యులు. అన్నమాచార్యులు శ్రీ వేంకటేశ్వరస్వామి వారి నందకాంశ సంభూతుడుగా జన్మించిన మహాభక్తుడు. వైష్ణవతత్వాన్ని, ప్రాశస్త్యాన్ని 32,000 సంకీర్తనల్లో రచించి హరి సంకీర్తనాచార్యుడని కీర్తి గడించిన మహాభక్తుడు.

సర్వపాపాలను కడిగివేయగల భగవన్నామ పరమార్థాన్ని విశాలపద సాహిత్యంలో వెలయించిన అన్నమాచార్యుల జీవిత చరిత్ర ఎందరికో మార్గదర్శకం. "అన్నమాచార్యుల జీవిత చరిత్ర"ను అన్నమయ్య మనుమడైన తాళ్ళపాక చినతిరువేంగళనాథుడు (చిన్నన్న) ద్విపద కావ్యంగా రచించాడు.

ఆంధ్రప్రదేశ్‌లోని కడప జిల్లా రాజంపేట తాలూకాలో తాళ్లపాక గ్రామంలో వెలసిన చెన్నకేశవస్వామి కృపాకటాక్షములతో ఆ గ్రామ జనులు సుఖ జీవనం సాగించేవారు. అన్నమయ్యకు ముందు నాలుగోతరంలో జన్మించిన నారాయణయ్య కథతో అన్నమాచార్య జీవిత చరిత్ర ప్రారంభమవుతుంది. నారాయణయ్యకు చిన్నతనంలో చదువు సంధ్యలు అబ్బలేదు. పాఠశాలలో గురువులు చాలా రకాలుగా శిక్షలకు గురిచేశారు. నారాయణయ్య లేత మనస్సు గాయపడింది. చింతలమ్మ గుడి సమీపాన పుట్టలో చెయ్యి పెట్టగా చింతలమ్మ ప్రత్యక్షమైంది. తాళ్ళపాక చిన్నకేశవుని వలన సకల విద్యలు అబ్బుతాయని అతని మూడోతరంలో గొప్ప హరిభక్తుడు జన్మిస్తాడని, అతని వల్ల ఆ వంశమే తరిస్తుందని అనుగ్రహిస్తారు అమ్మవారు.

నారాయణయ్య కుమారుడు నారాయణసూరి, గొప్పకవి, పండితుడు. వారి ధర్మపత్ని లక్కమాంబ. భాగవత సేవా పరాయణులైన నారాయణసూరి, లక్కమాంబలకు సంతానము కలుగలేదు. ఆపదమొక్కుల వాడైన శ్రీ వేంకటేశ్వర స్వామికి మ్రొక్కుకున్నారు. నారాయణసూరి, లక్కమాంబలు తిరుమల చేరి స్వామి మందిరం గరుడగంభం వద్ద సాగిలి మ్రొక్కారు. స్వామి ఆ పుణ్యదంపతులకు కలలో తన ఖడ్గమైన నందకాన్ని ప్రసాదించాడు. స్వామి అనుగ్రహించే క్రీ.శ. 1408లో వైశాఖ మాసం, విశాఖ నక్షత్రంలో మూడు గ్రహాలు ఉన్నతదశలో వుండగా పుత్రోదయమైనది. ఆ పుత్రునకు అన్నమయ్య అని నామకరణ చేశారు. ఉగ్గుపాల నుండి జోలపాటతో సహా వేంకటపతి మీద ధ్యాసతో ప్రొద్దులు గడిపేవాడు బాలుడయిన అన్నమయ్య. ఈయనకు 5 సం॥ నిండినాక ఉపనయనం చేయించారు. స్వామి వరప్రసాది కనుక బాల్యంలోనే అన్ని విద్యలు అభ్యసించ గలిగాడు. అన్నమయ్య ఆడినమాటెల్లా అమృతకావ్యంగా, పాడిన పాట్లు వేంకటపతి మీద సంకీర్తనలుగా ఆలపించేవాడు.

ఒకరోజు పశువులకు పచ్చిక తెమ్మని అన్నమయ్యని అడవికి పంపారు. శ్రీహరి మీద ధ్యాసలో పచ్చిక కోస్తున్న అన్నమయ్యకు కడవ్రేలు తెగి రక్తం కారింది. వేదన కలిగింది. ఆ వేదనలో విరక్తి, భక్తి కలిగాయి. ఆ సమయాన తిరుమలకు వెళ్ళే యాత్రికుల గుంపుతో కలసి తిరుమలకు పయనమయ్యాడు. తిరుమల దారిలోని అలిపిరి, తలయేరుగుండు, పెద్దఎక్కుడు, కప్పురపు కాలుదును చూసుకొంటూ మోకాళ్ళ ముడుపు చేరుకుంటాడు. పసిబాలుడైన అన్నమయ్య ఎండకు అలిసిపోయి ఒక బండపై శయనిస్తాడు. బాల అన్నమయ్య అలసటను జగదాంబ అలుమేలుమంగ గమనించి పెద్ద ముత్తైదువ వలె బాలుడున్న ప్రదేశాన్ని చేరి సేద తీరుస్తుంది. బాలుడు తిరుమలకు చేరే మార్గం చెప్పమని వేడుకొంటాడు. అపుడు అమ్మ, కొండను చెప్పుల కాళ్ళతో

ఎక్కరాదని చెప్పి అన్నమయ్యకు దివ్య ప్రసాదాలను తినిపిస్తుంది. అమ్మవారి ఆశీర్వాద బలంతో అన్నమయ్య అమ్మవారికి ఒక శతకం సమర్పించి తిరుమల చేరుకొంటాడు. అదే 'శ్రీవేంకటేశ్వర శతకం'.

ఈ శతకంలోని నాలుగు పద్యాలను ఉదహరిస్తూ కీ.శే. వేటూరి ప్రభాకర శాస్త్రి గారు "వేంకటేశ్వరాయని పద్యాంత సంబోధనా మున్నను ఇందు ప్రతి పద్యమును అలుమేలుమంగాంబికా ప్రస్తుతి పరమే. చివరి పద్యములో కవి కూడ అమ్మకు అలమేల్మంగకు పద్యశతకము చెప్పితిననెను. కనుక ఇది అలుమేలుమంగాంబికా స్తుతి శతకమేనని అనదగినది.

శతకం పేరు శ్రీ వేంకటేశ్వర శతకమయినా పద్యాలన్నీ అమ్మవారికి అంకిత మివ్వడం ఈ శతకం ప్రత్యేకత.

***

# అన్నమయ్య నవ్వులు

**శ్రీమతి కె. విజయకుమారి**
**రాజనీతిశాస్త్ర విభాగ అధ్యాపకులు**
**శ్రీ పద్మావతి మహిళా డిగ్రీ మరియు**
**పి.జి. కళాశాల, తిరుపతి**

మానవుల్ని రెండురకాలుగా వర్గీకరించవచ్చు. 'సామాన్యులు', 'మహాత్ములని' సామాన్యుల జీవితం సాధారణంగా ఉంటుంది. మహాత్ముల జీవితం "ఇంతింతై వటుడింత"గా సీమలు దాటిపోయిన జీవితం. మానవజన్మ యెత్తినవాడు ఇహపరాలకు లోనుగాక శ్రీనివాసుని పట్ల భక్తితత్పరుడై ఉండాలనేదే అన్నమయ్య ప్రబోధించిన జీవిత తత్త్వం. అన్నమయ్య తన కీర్తనల ద్వారా ఎన్నో సామాజికాంశాలను మరియు పరిహాసపు జల్లులను కూడా కురిపించేసేశాడు.

అన్నమయ్య అనేకరకాలయిన నవ్వుల్ని కీర్తనల్లో పొందుపరచడం జరిగింది. అన్నమయ్య నవ్వుల్ని పరిచయం చేయడం ఈ వ్యాసంలోని ప్రధానాంశం.

అన్నమయ్య ఆనందంగా బతుకు ఈదమన్నాడు. మనసారా ఏడవడం, నోరార నవ్వడం దేవుడు మనిషికి ప్రసాదించిన వరాలు. పురాణాలలో నవ్వి చెడ్డవారెందరో వున్నారు. సామెతలలో నవ్వుకు సంబంధించి చాలా వున్నాయి. 'నవ్వు నాలుగు విధాల చేటు', 'నవ్విన నాపచేను పండుతుంది', 'నవ్విన పల్లెలే పట్నాలవుతాయి', 'సిగ్గుమాలిన వానికి నవ్వే సింగారం' మొ॥వి. ఉన్నంతలో హాయిగా జీవించగలిగిన

స్థైర్యం అన్నమయ్య కుండడం వల్ల హాయిగా నవ్వగలిగాడు. తనచుట్టూ వున్న వారి నవ్వుల్ని చూసి తాను పరవశించాడు.

అన్నమయ్య నవ్వుల్లో కొన్ని సామాన్య ధర్మాలున్నాయి. ఎపుడు నవ్వాలి, నవ్వులు ఏ భావాన్ని వ్యక్తం చేస్తాయి అనదాన్ని అన్నమయ్య కొన్నిచోట్ల వాచ్యం చేశారు. ఉదా॥

**"చొట్టిరిగి నవ్వుటొప్పు**
**చిలుకు ముదములకు చిరునవ్వులె సరి"**

అన్నమయ్య స్త్రీలు నవ్వే హాస్యపు జల్లుల రకాలను తెలియజేసాడు.

**"నవ్వితేనే చాలదా నాతుల మనసులలో**
**అవ్వల పంచబాణములై నాటును"**

అన్నమయ్య తన సంకీర్తనలలో కొన్ని హాస్యపు సవ్వడులను తెలియజేశాడు. వాటిలో కలకలనగవు, పకపకనవ్వు, సందడినవ్వు, వెకిలినవ్వు, పక్కున నవ్వు, కదునవ్వు, వికవికనవ్వు మొదలయినవి కొన్ని చెప్పవచ్చును.

**కలకల నగవులు** : కలకల నగవులు కాతాళపు తగవులు.

**సందడి నవ్వు** : సందడి నవ్వు నవ్వేవు సారె సారెకు.

**వెకిలి నవ్వు** : వెకిలి నవ్వులనె వెన్నెలు కాసె.

**పక్కున నవ్వు** : పక్కున నవ్వగానే పైకొని వంతమాడేవు.

**పకపక నవ్వు** : పంతము నీవాడగాను పకపక నవ్వు వచ్చె. అశక్తులయిన వారు పంతమాడితే ఎదుటి వారికి వచ్చే నవ్వు పకపక నవ్వు.

**వికవిక నవ్వు** : వికవిక నవ్వుకురా నలుగడ.

**కదునవ్వు** : కనుపట్టెనా నీకు నేడు నవ్వు వచ్చేనీ లోకంలో మనం ఎవరయినా నవ్వితే ఏం కనబడిందని నవ్వుతారు అని ప్రశ్నించడం.

**ముసిముసి నవ్వు** : నానబట్టి ముసిముసి నవ్వులు నవ్వినాపై.

**చిరునవ్వు** : చెలరేగి చెలరేగి చిరునవ్వులు నవ్వేవు.

**గుట్టున నవ్వు** : రట్టుసేసి యిదిగాక గుట్టున నవ్వేవంటే దిట్ట.

**పలచని నవ్వు** : చలువైన నెమ్మోము చందురు వెన్నెలే కాదా
పలచని నవ్వులై వెచ్చదేరీని
పలచని నవ్వులు పయ్యద కప్పము
చెలియ నీకైతే సింగారము

**సన్నల నవ్వు** : మన్నింతువంటా నీతో మనవి విన్నవించితే
సన్నల నవ్వేవు నీవు సారె సారెకు.

అన్నమయ్య సంకీర్తనలో ఇంకా మొలక నవ్వు, విషపు నవ్వు, తీగె నవ్వు, పాలవంటి నవ్వు, తప్పురపు నగవు, పూరి నవ్వు, వెన్నెల నవ్వు, ఆమని నవ్వులు చెప్పుకోదగ్గవి.

**"సిగ్గులకే తెరవేసి చిరునవ్వు తలంబ్రాలు**
**సన్నపు నడిమిదాన సళుపు చూపులదాన**
**వెన్నెల నవ్వులతోడి వీరిడిదాన**
**కందువ నవ్వులు నవ్వి కదు పచ్చడము గప్పి**
**చక్కని నవ్వుల సానరాయివే"**

అన్నమయ్య హాస్యంలో పరిహాస వాతావరణం కూడ కనిపిస్తుంది. కొందరి నవ్వులు గుట్టుగా ఉంటాయి, మరి కొందరి నవ్వుల్లో ఆర్భాటం, అట్టహాసం చూడవచ్చు. ఏ నవ్వైన సరే మనిషికి ఆనందం గొలుపే విధంగా ఉండాలి. అలాంటి నవ్వుల రకాలను అన్నమయ్య తన సంకీర్తనలలో తెలియజేసాడు. అందుకే అన్నమయ్య సంకీర్తనలను నవ్వులగని అని కూడా చెప్పవచ్చు.

భగవంతుడు ఆనందించాలంటే : నాలుగు రకాలు మనుషులు లోకంలో ఉన్నారు.

1) బొంగరం తనచుట్టూ తాను తిరుగనట్లు, స్వార్థపరుడు నిరంతరం తన బాగోగుల గురించే ఆలోచిస్తాడు. 2) సర్కస్‌లో గుఱ్ఱం మైదానం చుట్టూ పరుగెత్తినట్లు, ఈ కోవకు చెందినవారి ఆలోచనలు కేవలం తన కుటుంబం వరకే పరిమితమై ఉంటుంది. 3) భూమి తనచుట్టూ తాను తిరుగుతూ, సూర్యుని చుట్టూ కూడా తిరుగుతూ అనేక మందికి మేలు చేస్తున్నట్లు కొందరు తన గురించి తన కుటుంబం గురించి ఆలోచించడమే కాకుండా తోటివారికి కూడా మేలు చేస్తారు. 4) సూర్యుడు తనకోసం ఏమాత్రం ఆలోచించకుండా సర్వజీవులకు హితాన్నే చేకూర్చినట్లు, ఈ కోవకు చెందినవారు తమ సర్వస్వాన్ని ఇతరుల హితానికే సమర్పిస్తారు.

భగవంతుడు మొదటి రెండు కోవలకు చెందిన వారిని చూసి నవ్వుకుంటాడు. మిగతా రెండు కోవలకు చెందిన వారిని చూసి ఆనందిస్తాడు.

"నవ్వుతూ బతుకూ అంతేగాని ఇతరులు నవ్వేటట్టు బతకవద్దు".

నేడు మానవుల యాంత్రిక జీవన విధానంలో చిన్న ఓ చిరునవ్వు ఓ గొప్ప వరం లాంటిది.

నవ్వు - మానసిక ఆనందాన్నిస్తుంది.
నవ్వు - శత్రుత్వాన్ని దూరం చేస్తుంది.
నవ్వు - అనురాగాన్ని పంచుతుంది.

కావున అన్నమయ్య అందించిన నవ్వుతూ బ్రతకమని.

***

# అన్నమయ్య బాల్య జీవితంలోని భక్తి విశేషాలు

**డా॥ యన్. కల్పలత**
**గ్రంథాలయ విభాగము**
**శ్రీ పద్మావతి మహిళా డిగ్రీ మరియు**
**పి.జి. కళాశాల, తిరుపతి**

ఒక వ్యక్తి జీవితాన్ని స్థూలంగా తెలుసుకోవడానికి ఉపకరించే సాధనం వంశాధికం. ఇది మనిషిని తీర్చి దిద్దడానికి వుపకరిస్తుంది. అన్నమయ్య అంత గొప్పవాడు కావడానికి అతని వంశం కూడా కారణం. తాత నారాయణయ్య గ్రామదేవత "చింతలమ్మ" అనుగ్రహం పొందినవాడు. ఆ శక్తి –

**"అలరుచు సకల విద్యలు నీకు వచ్చు**
**అదియునుగాక మూడవ తరంబునను**
**వదలని కీర్తి మీ వంశంబునందు**
**పరమభాగవతుడు ప్రభవించు శౌరి"**

వ్యక్తుల వ్యక్తిత్వ వికాసంలో సంఘటనలకెంతో ప్రాధాన్యం వున్నది. ఇందులో క్రమ పరిణతి, ఉచ్ఛ నీచాలుంటాయి. అయితే మహాత్ముల విషయంలో ఔన్నత్యమే వుంటుంది. కాకపోతే "బాల్యంనాటి" సంఘటనలకు కొంత విలువ వుంటుంది. ధ్రువ, ప్రహ్లాదులు, ఆధునికులలో రమణ మహర్షి బాల్యజీవితం గమనించి నట్లయితే అన్నమయ్య జీవితంలో కూడ "బాల్య సంఘటనే" ఒక మలుపు.

**"ఇంటి వారలు పిల్చి యేమి చెప్పినను**
**గెంటనాడక పరికించి సేయుచును..."**

అన్నమయ్య పందషరీకుడయినా ఆత్మానుభూతిని పెంచుకొన్నది వైష్ణవంలోనే. వైష్ణవమంటే రామానుజ మతమనే అభిప్రాయం ఆంధ్రదేశంలో ఉండేది. కాని వైష్ణవుల దివ్యదేశాలలో రెండు తప్ప తతిమావి తమిళనాడులోనే ఉన్నాయి. తమది కాని మతం, తమ ప్రాంతంలో లేని వేల్పుల మతమనే భావన కొద్దో గొప్పో సామాన్యులకు ఉండి ఉండాలి. అందుచేత అన్నమయ్య ఆళ్వారులలానే ఆంధ్రదేశమంతా తిరుగుతూ కనబడిన ఆలయాలు చుదుతూ పాటలు పాడుతూ దివ్యదేశాల సంఖ్య పెంచి ఇది మన మతమనే భావననూ, భక్తిని ప్రజల్లో కలిగించాడు. ఈలాంటి కృషి అన్నమయ్య, ఆంధ్రదేశంలో అడుగుపెట్టిన రాధామాధవ ఆరాధన, విఠలారాధన, హనుమదారాధన లాంటి వాటిని ఆదరించాడు. ఈ కృషి వల్ల ప్రజల మధ్య సాహిత్యం పెరగడానికి వీలు అయినది.

"ఈ మూరితా పాండురంగయుండు ఇరవై వున్నవాడు" లాంటి వాక్యాలు నిదర్శనాలు. అన్నమయ్య సంస్కృతి సంకీర్తనల్లో బహుళ ప్రచారమందినవి.

**"గోవిందాశ్రిత గోకుల బృందా" (21-260)**

**"దేవదేవం భజే దివ్యప్రభావం" (4-299)**

అన్నమయ్య 12 శతకాలు, ద్విపద రామాయణం, 32 వేల సంకీర్తనలు ఇంకా సంస్కృతంలో వేంకటాచల మాహాత్మ్యం, సంకీర్తన లక్షణాలు వ్రాశాడు. కాని వీటిలో శ్రీ వెంకటేశ్వర శతకం, సుమారు 14 వేల సంకీర్తనలు మాత్రం లభ్యం. రోజుకు ఒక్క కీర్తన వంతున జీవితాంతం రచనలు చేపట్టిన భక్తుడు అన్నమయ్య.

## అన్నమయ్య

తెలుగు వాగ్గేయకారుల్లో ప్రథముడు అన్నమయ్య. కొండల మధ్య పుట్టి కోనల్లో పెరిగి కొండల రాయనిపై నిండైన భక్తి నిలుపుకొన్నవాడు అన్నమయ్య. అన్నమయ్య తల్లిదండ్రులు లక్కమాంబా, నారాయనసూరులు. వీరు నందవంశీకులు, ఈ వంశము వారు ఋగ్వేదులు, అశ్వలాయన సూత్రులు, భరద్వాజగోత్రులు. ఈ పుణ్యదంపతులకు నందకాంశంతో అన్నమయ్య సర్వధారీ నామ సంవత్సరం వైశాఖ మాసం పూర్ణిమ విశాఖా నక్షత్రంలో (9-5-1408) జన్మించాడు. అన్నమయ్య తాత గిరిరాజబ్రహ్మం వేదవేదాంగ పండితుడు. తండ్రి రెండవ తులజాజి మెప్పు పొందినవాడు.

అన్నమయ్య బాల్యంలో వున్నప్పుడు ఒకసారి ఇంట్లోని వారు కలసి కట్టుగా గడ్డి తెమ్మని కసిరితే అడివికి వెళ్ళి తిరుపతికెళ్ళే పురుషగుంపులో కలసిపోయి స్వామిని సందర్శించి ఘనవిష్ణువు చలవవల్ల వైష్ణవుడయ్యాడు. ఆపై ఆదివన్ శఠగోపయతుల దగ్గర వేదవేదాంగాలు నేర్చాడు. ఒక్కమాటలో చెప్పాలంటే అన్నమయ్య స్వయంశిక్షణతో సుశిక్షితుడయ్యాడని చెప్పవచ్చు.

అన్నమయ్య వరాల వల్లనే సామాన్య దండనాథుడు సాళ్వ నరసింహరాయలు సార్వభౌముడయ్యాడు. స్వామికి పుల్లమామిడి నైవేద్యం పెట్టాననే ఆవేదనవల్ల తియ్యమామిడయింది. ఈ మహిమలు జనుల్లో ప్రాకడంలో ఆహునికి పాటుపడే అలగా జనం ఎక్కువ కావడంతో

**"తగిలేరు పొగిలేరు దైన్యమే చూపేరు,**
**కొనరేరు మునరేరు కోరిక తీర్చుమనేరు**
**తడవేరు తగిలేరు కడిగి వేడుకొన్నాగానిమ్మరు లోకుల"**

అని అన్నమయ్య దైవంతో మొరపెట్టు కోవలసిన పరిస్థితి వచ్చింది.

సుగణోపాసకులయిన భక్తుల యావదాస్తి పూజావిగ్రహాలే, ఆ విగ్రహాలు మాయమయితే పడే ఆవేదన అన్నమయ్య కనిపించే సన్నివేశసౌమ్యం.

దుష్టశిక్షణ శిష్టరక్షణ కోసం భగవంతుడు పశుపక్ష్యాది మనుష్య రూపాలలో భూమిపై అవతరిస్తాడని మన విశ్వాసం. భూదేవి, ఇంద్రాది దేవతలు తమకు దానవుల

వల్ల కష్టాలు కలిగినపుడు విష్ణువుతో మొరపెట్టుకోవడం, తగిన సమయంలో మహావిష్ణువు అవతారమెత్తి దుష్టులను సంహరించడం విష్ణ్వవతారాల్లోని వైశిష్ట్యం. పురాణాల్లో విష్ణువు యొక్క అవతారాలు పది అని ప్రసిద్ధిగాంచాయి. ఈ దశావతార మహిమలే కావ్యాల్లో, గేయాల్లో అనేకానేక సందర్భాల్లో ప్రస్తావింపబడ్డాయి. పదకవితా పితామహుడైన శ్రీ తాళ్లపాక అన్నమాచార్యులు శ్రీ వేంకటేశ్వర స్వామి వారికి వివిధ అవతారమూర్తులైనా నరసింహ, రామ, కృష్ణులకు అభేదత్వాన్ని పాటిస్తూ ఎన్నో సంకీర్తనలు రచించాడు. భక్తితో, అనురక్తితో శ్రీ వేంకటేశ్వరాంకితంగా రచింపబడిన తాళ్లపాక పదకవుల దశావతార సంకీర్తనల వలన ప్రజలలో భక్తి భావనను పెంపొందించుకొనుటకు వీలుకల్గినది.

అన్నమయ్య నమ్ముకొన్న దేవుడు వేంకటేశ్వరుడు అవాగ్గేయకారుడు తాను దర్శించిన వివిధమూర్తుల్లోనూ వేంకటేశ్వరుణ్ణి దర్శించాడు. కాకపోతే అతడు దర్శించిన వన్నీ వైష్ణవ క్షేత్రాలు. అతని రచనల్లో విశిష్టాద్వైతం కొన్నిచోట్ల వీరవైష్ణవం తప్పనిసరి అయినది. అందువల్లనే శివనింద మోతాదు హెచ్చినట్లుగా కనిపిస్తుంది.

అన్నమయ్య రచనల్లో కంచి వరదరాజస్వామి, రంగనాథ కీర్తనలు కీర్తిస్తూ కరాలు జోడించి నమస్కరించాడు.

**"తెర తీయగ రాదా లోని**
**తిరుపతి వేంకటరమణ మచ్చరమను"** **(1-450)**

**"వెంకటేశ! నిను సేవింపను పది**
**వేల కనులు కావలెనయ్య"** **(2-179)**

అనేవి తిరుపతిలో పాడిన కీర్తనలు.

తాళ్లపాక వంశఖ్యాతికి మూలపురుషుడు తాళ్ళపాక అన్నమాచార్యులు క్రీ.శ. 15 శతాబ్దంలో శ్రీ వేంకటేశ్వరాంకితంగా 32,000 పదాలను రచించి ఆంధ్ర వాఙ్మయ చరిత్రలో పదప్రక్రియకు ఒక సుస్థిర స్థానాన్ని కల్పించి "పదకవితా పితామహుడు" అని కీర్తి పొందాడు.

శ్రీ వెంకటేశ్వరస్వామిపై అచంచలమైన భక్తి విశ్వాసంతో వేద ప్రమాణాలను దేహాత్మశనిచారాదులను, జీవాత్మ పరమాత్మల సంయోగాన్ని గూర్చి అన్నమయ్య రచించిన ఆధ్యాత్మ, శృంగార సంకీర్తనలు ఈనాడు లోకవ్యాప్తం చెందాయి. భక్తిమార్గం ద్వార కీర్తించి తరించిన "తొలి తెలుగు వాగ్గేయకారుడు" అని ప్రసిద్ధి పొందినవారు శ్రీ తాళ్లపాక అన్నమాచార్యులు.

ఇలాంటి అనేక భక్తి సంకీర్తనలలో కనిపించే అన్నమయ్య భావుకత ఆయన నొక రససిద్ధుడుగా, జరామరణములు లేని కవిగా రూపొందించింది.

అన్నమయ్య జీవించింది 95 ఏళ్ళు. అన్నమయ్య భక్తితో ముక్తిని పొందాడు.

***

# తాళ్ళపాక పదసాహిత్యము - ఆధ్యాత్మ, శృంగార సంకీర్తనలు

డా॥ డి. సుజాత
జంతుశాస్త్ర అధ్యాపకులు
విశ్వోదయ డిగ్రీ కాలేజి
వెంకటగిరి

డా॥ డి. ఉమామహేశ్వరి
భౌతికశాస్త్ర అధ్యాపకురాలు
శ్రీ పద్మావతి మహిళా డిగ్రీ
మరియు పి.జి. కళాశాల, తిరుపతి

కలియుగ ప్రత్యక్ష దైవమైన శ్రీ వేంకటేశ్వరుని వైభవాన్ని, మహాత్యాన్ని, తత్వాన్ని అధ్యాత్మ శృంగార సంకీర్తనలుగా రచించిన వారు తాళ్ళపాక అన్నమాచార్యులు. సకల దేవతా స్వరూపమైన శ్రీ వేంకటేశ్వరస్వామి తత్వాన్ని ఎన్నో వేల సంకీర్తనల ద్వారా లోక విదితం చేసి ఆత్మకళ్యాణముతో పాటు లోక కళ్యాణము సాధించిన వారు తాళ్ళపాక అన్నమాచార్యులు. భక్తి, ప్రవృత్తి దేహాత్మేశ విచారాదులను తెలిపే అధ్యాత్మ సంకీర్తనలు, జీవాత్మ పరమాత్మల ఐక్యాన్నిచాటే అమలిన దివ్య శృంగార సంకీర్తనలు రచించిన వారు తాళ్ళపాక అన్నమాచార్యులు. పల్లవి, చరణాలతో కూడిన సంకీర్తన రచనలకు మార్గదర్శకుడై "పదకవితా పితామహుడని" కీర్తి గడించాడు. ఆంధ్ర వాగ్గేయకారుల్లో అనేక వైష్ణవ క్షేత్రాలను సందర్శించి ఆయా క్షేత్ర మూర్తులపై వివిధ సంకీర్తనలను రచించిన ఘనత తాళ్ళపాక అన్నమాచార్యులదే. అన్నమయ్య పదాలు శ్రీ వేంకటేశ్వర ముద్రాంకితాలు.

తాళ్ళపాక కవుల వాఙ్మయమునందు గ్రాంధిక వ్యవహారిక బాషలు రెండింటికి విడివిడిగ రెండు సింహాసనములు గలవు. వీనిలో ఒకదానికి ఒకటి తీసిపోదు. అయితే సంకీర్తనములందు మాత్రమే గ్రాంధిక వ్యవహారిక భాషల సాంకర్యము. తక్కిన పద్య గద్య రచనల యందంతటను గ్రాంధికమునకే పట్టాభిషేకము. భారత కవులను, శైవకవులను దాటిన మీదట తెనుగునకు ప్రాణము పోసినది తాళ్ళపాక కవులే. తిక్కన వీరికి ఆదర్శమూర్తి వ్యవహారిక భాషకు పెద్దరికము కూర్చిన తొలి తెలుగు సాహసికుడు తాళ్ళపాక అన్నమాచార్యులే. అన్నమయ్య కీర్తనలను చదివిన, చదువుచున్న, చదువగల తెలుగు రసికులందరు ఆ తెగువకు మెచ్చుకొనుటయే గాక, వ్యావహారిక పదముల వాడకములో గల చురుకును, రుచిని, మర్మజ్ఞతను నెచ్చుకొని మురియక మానరు. గ్రాంధిక భాషకు సన్నిహితమై వ్యాకరణ లక్షణములకు దూరము కాని వ్యవహారభాష అర్థముగా కనబడినది. అందు "అయినన్+కూడ" అను స్థలమున అయినన్"కు మారుగా 'అయితే' అను వ్యవహారిక పదము, దాని ద్రుతాంతత్వము లోపింపక 'అయితే గూడ' అనే ప్రయోగములు కూర్చబడినవి. ఇంకన్, చాలన్ మొదలగు గ్రాంధిక రూపములు "ఇంకా", "చాలా"గా దీర్ఘాంతములయినపుడు కూడా

ద్రుతాంతత నాటికి నేటికి సుప్రసిద్ధమే. అట్టులే "మెఱయు" "ప్రీఱు" "పాఱు" మొదలగు ధాతువులందును, చెఱకు, మొదలగు సుబంతములయందును శకటరేఫ పట్టుదప్పలేదు. "వలదు" అను శబ్దము కొంతకాలానికి "వొద్దు"గా మతిస్థానములలో అన్నమయ్య భాషగా మిగిలినది.

శృంగారమునందు కృష్ణుని చిలిపి చేష్టలుగా ఉదాత్తత దిగువమెట్టుగా సాగిన పాటలు కొన్ని కలవు. ఉదాహరణకు -

**"మేలురా నీకతలకు మెచ్చితినేను**
**మేలములాడితి నీవు మెచ్చులాడిఁడివంటానే"**

దీనిలో కృష్ణుడు పరబ్రహ్మమే యైనను, తాను స్వీకరించిన మానవత్వము, గొల్లకులము-దోమటి, చిన్న వయసు చిలిపితనమూ, ప్రతిఫలించునటు అన్నమయ్య వర్ణించినాడు. లోతుగా పరిశీలించిన కృష్ణరూపియగు శ్రీ వేంకటేశ్వర కీర్తనమే దీని పరమార్థము.

**"తరుణి జవ్వనపుఁదపము సేయఁగన్**
**వరుసతోడ జాతి వైరము లుడిగె"**

ఈ కీర్తనము నందు శృంగారము గుబాలించుచున్నను, వెన్నెల కాచినను జక్కవలు (చన్నులు) జోడు వీడకుండంట, రతిస్వేదవర్షమున్నను వాసంతికములగు కోయిలలు కూయుచుండుట, సంపెంగ వంటి ముక్కున బట్టిన నిట్టూర్పులు సందడించినను చికుర భ్రమరములు బెదరకుండుట మొదలగు సహజ వైర త్యాగములు వర్ణించబడినవి. ఇది చాలా ఉదాత్తమైన భావన.

తిరువేంగళనాథుని అంకితముగాను తాళ్ళపాక అన్నమాచార్యులు విన్నపము చేసిన శృంగార సంకీర్తన మచ్చుతునకలు.

**"కంటిమి కొత్తలుగొన్ని కన్నుల పండుగగాను**
**అంటితివో లేదో నాతో నానతీవయ్యా"**

కావున అన్నమయ్య దృష్టి, పరమేశ్వరార్చనగా సాగించిన యీ సంకీర్తనల రాశిలో ఉత్తమాధమ భేదబుద్ధి భావములందైనను బాషయందైనను తగదనియే. వాటి నేటి వ్యావహారిక భాష మేళవింపుగా, కొన్నింటి యందు మనము భావించే శృంగారమూ పరమార్థమైన అధ్యాత్మిక విద్యగా, కావ్యములలోని శృంగారరస సంప్రదాయమును పై కప్పుకొన్న యోగి మర్యాదలుగా భాసించినది అని భావించ వచ్చును. అలా పదకవితా పితామహుడిగా ప్రసిద్ధికెక్కి చాలామంది ప్రబంధ కవులకు సాహిత్య భిక్ష పెట్టి ఉభయ విభూతి నాయకుడుయైన ఆ స్వామి కళ్యాణ గుణాలను ఎన్నో వేల సంకీర్తనల్లో కీర్తించారు. శరణాగతి తత్త్వాన్ని ప్రబోధించారు.

***

# అన్నమయ్య పదసాహిత్యంలో జానపదాలు

డా॥ పొక్కళ్ళ సుభద్ర
పురాణ పండిట్
ధర్మప్రచార పరిషత్, తిరుపతి

తెలుగులో తమ కవితాలంకారాలతో సాహితీ సరస్వతికి సొబగును చేకూర్చిన కవులు లెక్కకు మించే ఉన్నారు. అందులో కొందరు రాజాశ్రయంలో భోగాలనుభవిస్తూ కవితా స్రవంతులను జాలువార్చిన వారు. మరికొందరు విద్యా విజయాన్ని ఆకాంక్షించి పోటీపడినవారు. ఇంకొందరు రాజాశ్రయాలను తృణప్రాయంగా త్రోసిపుచ్చి భగవత్ భక్తితో రచనలు చేసినవారు. అలాంటి కోవకు చెందినవారే తాళ్ళపాక కవులలో ఆద్యుడు, పదకవితా పితామహుడు మన అన్నమయ్య సంగీత కళాకారులకు ఆరాధ్యుడు ఈయనే.

ఆనాటి సాహిత్యంలో శిష్టసాహిత్యం, జానపద సాహిత్యం, గ్రామ్యం, లోకాచారం లాంటి మాటలు వ్యవహారంలో ఉండేవి. జానపద సాహిత్య వేత్తలలో శిష్టసాహిత్యం పరిచయం మెండు. కాని శిష్టసాహిత్యకారులకు మాత్రం జానపద సాహిత్య పరిచయం కొంచెమే. పై రెండు సాహిత్యాలకు వారధియే ఈ పదసాహిత్య మని మనం భావించవచ్చు. తెలుగు పదకవులలో శ్రేష్ఠుడు తాళ్ళపాక అన్నమయ్యే. అన్నమయ్య బ్రాహ్మణుడైన సామాన్య వ్యవసాయ కుటుంబంలోని వ్యక్తిగా, గ్రామంలో పుట్టడం, ఆ గ్రామ వాతావరణంలో పెరగడంవల్ల గ్రామీణుల వృత్తులు, ప్రవృత్తులు, ఆచార, వ్యవహారాలన్నింటిని చక్కగా ఆకళింపు చేసుకొన్నాడు. అన్నమయ్య సామాన్య ప్రజలకు వైష్ణవమతం మనందరిదని తెలియజేయడానికి వైష్ణవాలయాలున్న ఊర్లకెళ్ళి తన సంకీర్తనలచే ప్రజలను చైతన్య పరచాడు. అందులో భాగంగానే భక్తకవైన అన్నమయ్య ప్రజలకు నచ్చేలా చెప్పడం కోసం జానపదాంశా లను విరివిగా వాడడం యదార్థమే. వాటిని పరికిస్తే జానపద కథలు, బాణీలు, సంగీతం, వాతావరణాన్ని గూర్చి ప్రస్తావించినట్లు తెలుస్తుంది.

శిష్టసాహిత్యంలో లేని కథలు, సన్నివేశాలు కొన్ని జానపద సాహిత్యంలో మంచి ప్రాచుర్యం పొందాయి. ఉదా॥ రామాయణంలో ఉడుతపాత్ర, లక్ష్మణదేవర నవ్వు, ఊర్మిళాదేవి నిద్ర మొ॥ ప్రజల ఆదరాన్ని పొందాయి. అలాగే భారతం, భాగవతం, ఇతర పురాణ ఇతిహాసాలలోని సన్నివేశాలు జానపదులు తమ జీవితాలకు అన్వయించుకొని కథలను కొంత మార్పు చేర్పులతో ప్రచారం చేసుకొంటారు.

భాగవతంలో శ్రీకృష్ణపరమాత్ముని లీలలున్నాయి. అందులో లేని కొన్ని సన్నివేశాలు మనం అన్నమయ్య సాహిత్యంలో కానవచ్చు. వాటిని గమనిద్దాం.

"చందమామ రావే". అంటూ తల్లిపాట పాడి బిడ్డను లాలిస్తుంది. శ్రీకృష్ణుడు చంద్రుని చూసి సైగచేయగా దివినుండి చంద్రుడు రావడం వల్ల యశోద దిగ్భ్రాంతు రాలైంది. పిలిస్తే వ్యక్తి రావడం సహజం, అందులో వింతలేదు కాని చంద్రుని రాకతో యశోద ఎందుకు పిలిచానో అని వాపోయిందట. ఈ భావాలున్న కీర్తన.

**"చందమామ పాడి తల్లి సరిపొత్తుకు రమ్మంటే**
**చందురు చూచి కృష్ణుడు సన్నజేసెను"**

అట్లే మరో ప్రస్థావన -

**"నీరాట లోన తన నీడ చూచి బాలుండట**
**రారమ్మని పిలిచి రాకుండగా"**

రాయలసీమలో నాడు, నేడు నీటికొరత కావున వాగుల్లో, బానల్లో, కడవల్లో, ముంతల్లో కూడా నీటిని ఉంచడం అలవాటే. అదే విధంగా రేపల్లెవాడలోని పిల్లలు ఎన్నోరకాల ఆటలు ఆడుతుంటారు. కృష్ణుడు 'నీరాట' కాగుల వెనుక దాగి నిక్కి నిక్కి చూచి తన ప్రతిబింబాన్ని రారా అని పిలిచాడట, కాని వాడు రాలేదు. అందుకు కృష్ణునికి కోపం వచ్చి నీళ్ళను కదలించాడు. నీళ్ళు కదలక మరల తన ప్రతిబింబం కనిపించింది.

అన్నమయ్యకు జానపద గేయ బాణీలు చాలా బాగా నచ్చినట్టున్నాయి. అందుకే అన్నమయ్య ఆళ్వారుల పాశురాలు అందరికి అర్థం కావని గ్రహించాడేమో. తను మేలుకొలుపు, సువ్విపాటలు, అల్లోనేరేళ్ళు, గొబ్బి, జాజర, సోది, తందాన, కోలాట పాటలు, చందమామ పాటలు, శోభనం పాటలు, మంగళ హారతులు, నివాళి, ధవళ, ఉయ్యాల పాటలు, లాలి, జోల పాటలతో పాటు మంగళ గీతాలు మొదలైనవి తన సంకీర్తనల్లో ఇమిడించాడు. రాజప్రసాదాల చుట్టూ ప్రహరి తిరిగే వారు పాడే పాట 'జాలి' పాట అని కొందరి భావన.

**"గాములు వారెడి పొద్దు, కావలి కొండ్లాల**
**జాముజాము తిరగరో జాలోజాలి"**

కులానికి సంబంధించిన జాతి పాటలు -

**"పొదల గంధపు మేని బోయతి వచ్చి**
**పొడికప్పురపు బూత బోయతి"**

**జానపదుల సంగీతం :**

ఈ కాలానికి సంగీతం అంత ప్రాచుర్యంలో లేదు. అప్పటికి భజన సంప్రదాయమే మెండుగా దండిగా ఉండేది. మన అన్నమయ్య సంకీర్తనల్లో పాడేందుకు వీలులేనివి ఉన్నాయనడానికి ఉదా:

**"బాపు దైవమా ముపాలి భవమా**
**తాపురాకాసి నెత్తురు ధీం ధోం ధోం ధోం ధోం ధోం ధోం"**

దీనిని బట్టి అన్నమయ్య రచనల్లో శాస్త్రీయ సంగీత లక్షణాల కన్నా జానపద సంగీత ధర్మాలెక్కువనేది గమనార్హం. అన్నమయ్య సంగీత బాణీలతో ద్రావిడభైరవి, తెలుగు కాంభోది, చెంచు, మలహరి మొదలైన 95 రాగాలను ప్రయోగించినట్లు పండితుల అభిప్రాయం.

ఇక చివరగా జానపదుల చిత్తవృత్తుల ప్రాముఖ్యతను గ్రహిద్దాం! మచ్చుకు-

**"పెక్కు పురుషులలోన పెరసోకసలి యుంటే**
**మక్కువై యంటే నాటునిందరి చూపు"**

**"మగవాడెంత చక్కని మగువ కలిగినను**
**మిగుల వేరొక సతితో మేలమాడును"**

అందుకే మన పెద్దలు సీతట్లా పెళ్ళామున్నా కోతట్లా లంజ వుంటుందంటారు.

**పతిలేని భూమికి బలవంతుడే రాజు**
**గతిలేని కూటికి కన్నదే కూడు**

నాయికను చెలికత్తెలు ఆటపట్టిస్తూ అందాన్ని ప్రశంసించడంతో ఆనందిస్తున్న విషయం అన్నమయ్య విశదీకరించాడు. ఇలాంటి ఎన్నెన్నో విషయాలను ఆనాటి రాజకీయ, ఆర్థిక, ఆచార వ్యవహారాలు, సామాజిక వ్యవస్థను, కట్టు, బొట్టు, తిండి మొదలైన వివరాలను, వింగడించిన ఘనత మన తాళ్ళపాక అన్నమాచార్యుల వారికే దక్కిందనేది యదార్థ సత్యం.

***

# అన్నమయ్య శరణాగతి తత్త్వం

**శ్రీ పి. జయచంద్రుదు**
**అసిస్టెంట్ ప్రొఫెసర్**
**ప్రభుత్వ డిగ్రీ కళాశాల, పీలేరు**

ఆంధ్ర సాహితీ నందనవనంలో వికసించిన పారిజాతం పదకవిత్వం. ఆ పదకవితా పారిజాతం పైనుండి కంఠమెత్తి కూసిన తొలి అమరకోయిల మన అన్నమయ్య. సంకీర్తనాచార్యుడు, మహా వాగ్గేయకారుడు, పదకవితా పితామహునిగా కీర్తింపబడిన అన్నమయ్య ముప్పైరెండు వేల సంకీర్తనలు రచించాడు. నేడు అందులో పదమూడు వేలు సంకీర్తనలు మాత్రం లభ్యమౌతున్నాయి. ఈ సంకీర్తనలు ఆత్మాశ్రయ

ధోరణిలో కలియుగ ప్రత్యక్షదైవమైన శ్రీ వేంకటేశ్వరునిపై రచింప బడినవే. ఆ కీర్తనలలో ఆధ్యాత్మికత, తత్వ, శృంగార, జానపద, వైరాగ్యం వంటి అనేక అంశాలు చోటుచేసుకొన్నాయి. ఎన్ని అంశాలున్నా అందులో అంతస్సూత్రం మాత్రం కోనేటిరాయుని భక్తే. ఈ భక్తి మధురభక్తి.

నవవిధ భక్తిమార్గాలు వైష్ణవ సంప్రదాయం. అందులో ఆత్మనివేదనా భక్త శాఖకు సంబంధించినదే శరణాగత తత్త్వం. భక్తుడు తాను అజ్ఞానాంధకారంలో చిక్కుకొని పరితపించినపుడు భగవంతుని శరణువేడటం సాధారణం. పరమ భాగవతోత్తముడైన గజేంద్రుడు తన సాయశక్తుల ప్రయత్నించి ఆ లక్ష్మీపతిని శరణువేడుకున్నాడు. ఇలా ఏ భక్తుడైన చివరకు భగవంతుని శరణుకోరడం సహజం. అలానే శేషశైలవాసుని యందు గొప్ప భక్తికల అన్నమయ్య పరిపరివిధాల శరణు వేడడం ఆయన సంకీర్తనలలో మనం కానవచ్చు.

ఆపదలో ఉన్నప్పుడు రక్షించమని సంసారంలో కూరుకుపోయినప్పుడు సంసారం నుండి విముక్తి కల్గించమని, అజ్ఞాన స్థితి నుండి విజ్ఞానం కల్గించమని పరిపరి విధాలుగా భక్తుడు భగవంతుని స్మరించుకోవడం, శరణుకోరడం జరుగు తుంది. అన్నమయ్య కూడా అలా పలువిధాలుగా శరణుకోరాడు. అన్నమయ్య తనలోని కోనేటిరాయుని తలపోయకపోవడం తన అపరాధంగా భావిస్తున్నాడు. భక్తుడు భగవంతుని శరణుకోరునపుడు తొలుత తన అపరాధంను గుర్తిస్తారు. అటుపిమ్మట శరణువేడుతారు.

**"జీవాత్మునిగాఁ జింతింపఁ దలచుట**
**యావంక నది నా యపరాధము**
**సేవించు నిను నాత్మఁ జింతింపకుండుట**
**ఆవల నిది నా యపరాదు"**

అన్నమయ్య ముందు తనలోని దైవాన్ని గుర్తించకపోవడాన్ని తన అపరాధంగా భావిస్తున్నాడు. తన అపరాధమును గుర్తించిన భక్తుడు అన్నమయ్య తన సర్వం ఆ సర్వాంతర్యామియే అని భావిస్తున్నాడు. తల్లి, తండ్రి, గురువు, దైవం సర్వం ఆ శ్రీవేంకటేశ్వరే యని తలపోస్తున్నాడు.

**"గతినీవే మతినీవే కర్తవు భర్తవు నీవే**
**పతియునీవే ఏ పట్టునా మాకు"**

శరణువేడితే ఆ పురుషోత్తముడు తప్పక రక్షిస్తాడని ఆ దేవదేవుడు పురుషలలో ఉత్తముడని, నరులలో నరనారాయణుడని, పరదైవములలో పరమేశ్వరుడని కొనియాడినాడు. కాని మూఢులు అతని తత్వాన్ని ఎరగరని భావించాడు.

**"పురుషుల లోపల పురుషోత్తముడు**
**నరులలోన నరనారాయణుడు**
**పరదైవములకు పరమేశ్వరుడు**
**వరుస మూధుల కెవ్వరో యితడు"**

అని అన్నమయ్య దేవదేవుడైన వేంకటేశ్వరుని స్మరించుకొంటున్నాడు. అజ్ఞానం ఒక కూపస్థం. ఆ అంధకార కూపస్థం నుండి పైకి చేర్చువాడు ఆ దయాహృదయుడు శ్రీమన్నారాయణుడు. జ్ఞానమనే పంజరంలో నిలుపువాడు. అజ్ఞానాన్ని దరికి రానీయని వాడు ఆ శ్రీనివాసుదని అన్నమయ్య ఇలా కీర్తిస్తున్నాడు.

**"శరణాగత వజ్ర పంజరుడీతడు**
**సరిలేని అసురభంజకుడీతడు**
**వరదుడు శ్రీవేంకటేశ్వరు డితడు"**

జీవి కర్మములను తొలగించుటకు, భవరోగ హరణమునకు, హరి పాదజలమె ఔషధమని అన్నమయ్య ఇలా వక్కాణిస్తున్నాడు.

**"పరిపరి విధముల భవరోగములకు**
**హరిపాదజలమే ఔషధము"**

అన్నమయ్య తాను ధీనుడనని తనకు జనన మరణాలు తెలియవని, ఈ భవసాగరాన్ని ఈదడానికి దయతలచమని ప్రాధేయపడుతున్నాడు.

**"ధీనుడనేను దేవుడవు నీను**
**నీ నిజమహిమే నెరపుటకు గాక"**

అన్నమయ్య తాను శరణాగతుడని, అధముడని భావించి సర్వాంతర్యామియైన, సర్వాంతరాత్ముడైన దేవదేవున్ని ఆరాధిస్తున్నాడు. తన బుద్ధి సంసారమాయచే కప్పినా ఎల్లప్పుడూ శ్రీవేంకటపతినే తలుస్తానని ప్రకటించాడు.

**"మతి సంసారపు మాయగప్పినను**
**అతికాంక్ష జారనిదది తలపు**
**గతియై శ్రీవేంకటాపతిగాచిన**
**సతతము నితని శరణమే తలపు"**

ప్రజ్ఞాహీనం పాపకార్యంతో సమానం. అటువంటి ప్రజ్ఞా హీనత్వం నుండి రక్షించమని శరణువేడుతున్నాడు. ఎన్నో విజ్ఞానాలు విన్నానని, ఎన్నో సుజ్ఞానాలు చూసానని కాని తాను నడిచేది ఎల్లప్పుడూ అజ్ఞానంలోనేనని, అటువంటి అజ్ఞానం నుండి రక్షించమని శరణు వేడుకుంటున్నాడు. ఆ జ్ఞానవరదుణ్ణి అన్నమయ్య ఇలా...

**"నీకే శరణంటి నిన్నే నమ్మితినయ్య**
**పైకొని శ్రీహరి నీవే పరిహరించవే"**

శరణాగతుడైన భక్తుడు నిరతమూ భగవంతుని నామస్మరణే చేస్తుంటాడు. అలానే అన్నమయ్య కూడా ఆ అలమేలుమంగపతి నామాన్నే జపిస్తూ, ఆ శ్రీనివాసుని కథామృతాన్ని నిరతమూ సేవిస్తూ పరమానందభరితు డవుతున్నాడు.

**"నీ నామమే మాకు నిధియు నిధానము**
**నీ నామమే ఆత్మ నిధానాంజనము"**

అన్నమయ్య తనకు అన్నివిధాలుగా శ్రీమన్నారాయణుడే దిక్కని, జీవులకెల్ల సిరుల వరమిచ్చే, ప్రపంచానంతా రక్షించే సర్వరక్షకుడైన శ్రీనివాసుని కంటే అధికులు లేరని ఆ దేవదేవున్ని కొలిచాడు.

**"నీకే శరణు నీవు నన్ను కరుణించు**
**యీకడ నాకడ దిక్కు యెవ్వరున్నారికను"**

దిక్కుతోచని భక్తునికి భగవంతుడే దిక్కౌచి. అటువంటి శ్రీనివాసుడే తనకు అన్ని విధాల దిక్కయని, తన నేరాన్ని కరుణించమని సూర్యుని వలె, చంద్రుని వలె కాపాడమని ప్రాధేయపడుతున్నాడు.

**"నీవె మాకు దిక్కు నినే తలతుము**
**కావు మా నేరమెంచక కరుణానిధి"**

ఇలా అన్నమయ్య శ్రీ వేంకటేశ్వరుని అజ్ఞానం నుంచి, సంసారబంధముల నుంచి శరణుకోరాడు. అన్నమయ్య సంకీర్తనలో శరణాగత సంకీర్తనలు అతని విశిష్టభక్తికి చక్కని తార్కాణం.

**"శరణు శరణు సురేంద్ర సన్నుత**
**శరణు శ్రీసతి వల్లభ**
**శరణు రాక్షస గర్వసంహార**
**శరణు వేంకటనాయక".**

***

# అన్నమయ్య - సారంగపాణి

**డా॥ జి. నాగమణి**
**అధ్యాపకులు, గృహవిజ్ఞాన శాస్త్ర విభాగము**
**శ్రీ పద్మావతి మహిళా డిగ్రీ మరియు పి.జి. కళాశాల**
**తిరుపతి**

అన్నమయ్య పదకవితా పితామహుడు. ఆయన చేతిలో పదం వింత సొగసులు సంతరించుకొన్నది. వీటితోపాటు అన్నమయ్యలో కనిపించే మరొక ప్రధానాంశం ప్రాపంచిక విషయాలతోపాటు సామాన్యుల నడవడిని చక్కదిద్దడానికి కావలసిన ఎన్నో లౌకిక విషయాలు కూడ అన్నమయ్య సాహిత్యంలో కుప్పలుగా కనిపిస్తాయి. ఇంతటి విశిష్టతను సంతరించుకొన్న అన్నమయ్యతో పోల్చదగిన వాగ్గేయకారులు అనంతర కాలంలో ఎక్కువమంది లేరు. ఆయన దారిలో పయనిస్తూ పదరచనలు చేసిన కొందరిలో క్షేత్రయ్య, సారంగపాణి ముఖ్యులు. వీళ్ళిద్దరూ అన్నమయ్యకు, త్యాగరాజుకు మధ్యకాలంలో పదకర్తలుగా పేరుపొందారు.

సారంగపాణి అన్నమయ్యకు అర్వాచీనుడు. తెలుగు పదకవిత్వంలో ప్రసిద్ధిగాంచిన పదకర్తల్లో సారంగపాణి ఒకరు. ఇతడు 1830 సంవత్సరంనాటి చిన్నయసూరికి సమకాలికుడు. సారంగపాణి చిత్తూరు జిల్లా, పుత్తూరు మండలం, కార్వేటినగరంలో వెలిసిన వేణుగోపాలస్వామి వారిపై పదాలు రచించాడు. ఇతడు తన పదాలను శృంగారం, దేశీయం, జాతీయం, భక్తివైరాగ్యం అని నాలుగు భాగాలుగా విభజించాడు. మొదటి భాగంలో స్వీయ, పరకీయ, సామాన్య మొదలైన నాయికాభేద శృంగారాన్ని, రెండవ భాగంలో కేవల సామాన్య శృంగారాన్ని, మూడవ భాగంలో పామరజనుల జాతీయ భావాలను, నాల్గవ భాగంలో భక్తి, నీతి, వైరాగ్య సంబంధమైన విషయాలను గూర్చి వివరించాడు. సమాజంలో ఏమాత్రం అక్షర పరిజ్ఞానం లేని పామరులు కూడా విని అర్థం చేసుకోగల్గిన అతి సామాన్యమైన వ్యావహారిక భాషనే పదరచనలలో ప్రయోగించాడు. సారంగపాణి పదాలలోని నాల్గవ భాగంలో భక్తిబోధక విషయాలతోపాటు ఎన్నో సాంఘిక నీతులు కూడ చోటుచేసుకున్నాయి.

అన్నమయ్య, సారంగపాణి మధ్య మూడు వందల సంవత్సరాల కాల వ్యత్యాసముంది పదసాహిత్య సృష్టిలో మేరునగధీరుడైన అన్నమయ్యతో సారంగపాణిని పోల్చి చూడడం అంత సబబు కాదు. ఇప్పటికి దొరికి, ప్రచురించబడిన సారంగపాణి పదాలు రెండు వందలాపది. ముప్పై రెండువేల సంకీర్తనలెక్కడ? ఈ రెండు వందలా పది సంకీర్తనలు ఎక్కడ? అయితే విషయ విశ్లేషణ దృష్టితో పరిశీలిస్తే ఈ రెండు

వందలా పది పదాలలో అన్నమయ్య తన సంకీర్తన వాఙ్మయంలో ప్రదర్శించిన విషయ విన్యాసం కొంత అద్దంలో కనిపించినట్లు కనిపిస్తుంది. సాధారణంగా పదకర్తలందరూ భక్తి సింధువులో మునిగి పవిత్రులైన తరువాతనే రచనలు చేయడం వల్ల వాళ్ళు ఏమి చెప్పినా, ఎలా చెప్పినా అందులో భక్తి అంతర్వాహినిగానే ఉంటుంది. శృంగారాన్ని వర్ణించినా, వైరాగ్యాన్ని వర్ణించినా భక్తిభావమే పునాదిగా ఉంటుంది. లోకనీతులు చెప్పడానికి కారణం మానవుల నడతను మార్చి పారమార్థిక దశకు తీసికొని పోవాలనుకోవడం. ఈ దృష్టిలో పచ్చి శృంగారం నిండిన జావళీలుగా క్షేత్రయ్య పదాలను పేర్కొన్నా ఆ శృంగారం వెనుక ఆధ్యాత్మ వాసనలు గుభాళిస్తాయని కూడా అభిప్రాయపడేవాళ్ళున్నారు. పదకవితా ఉద్దేశ్యమే ఇది. ఈ రకంగా చూసినపుడు అన్నమయ్యకు, సారంగపాణికి సామ్యాలు కనిపిస్తాయి. అన్నమయ్య వేలకొలదీ శృంగార సంకీర్తనలు చెబితే సారంగపాణి డెబ్బై అయిదు శృంగార పదాలు చెప్పాడు. అన్నమయ్య వేలకొలదీ ఆధ్యాత్మిక సంకీర్తనలు చెబితే సారంగపాణి 72 కీర్తనలు చెప్పాడు. ఇవికాక సారంగపాణి 66 దేశీయ పదాలను, 17 జాతీయపదాలను రచించాడు.

వస్తువును దర్శించడంలో వీళ్ళిద్దరికీ భేదముంది. సర్వం శ్రీ వేంకటేశ్వరమయంగా కనిపిస్తుంది అన్నమయ్యకి. ఆయన ఏ విషయాన్ని ఎలా చెప్పినా అందులో శ్రీనివాసతత్త్వాన్నే దర్శిస్తాడు. సారంగపాణి ఏ విషయం చెప్పినా దాన్ని సమకాలీన దృష్టితోను, భవిష్యదృష్టితోను చూస్తాడు. ఆరకంగా ఆయన భావాలు రంజకమయినాయి. అన్నమయ్యకు సమకాలీన దృష్టి మెండుగా ఉన్నా ఆయన శ్రీనివాసుని కొలువులోని కవి కావడం వల్ల లౌకిక విషయాలను కూడ ఆధ్యాత్మికంగానే సమన్వయించడం కనిపిస్తుంది. అయితే వర్ణ్య వస్తువులో ఈ ఇరువురు కవులు పొందే భావం చాలా తీవ్రంగా ఉంటుంది. దీనికి ప్రధాన కారణం వీళ్ళు నివసించిన సమాజాలు వేరువేరు కావడం. అన్నమయ్య నివసించినది నిష్ఠురమైన రాచరికవ్యవస్థలో శిథిలమైపోయింది. ఆంగ్లేయుల పాలన వచ్చింది. పాశ్చాత్య సంస్కృతి ఫలితంగా సమాజంలో సంప్రదాయం చెడింది. అనూహ్యమైన మార్పులు చోటుచేసుకున్నాయి. కవిగా సారంగపాణి ఆ వ్యవస్థను జీర్ణం చేసుకోలేకపోయాడు.

పదకర్తలుగా, భక్తులుగా వీరిద్దరికి సామ్యముంది. అన్నమయ్య సంకీర్తనలన్నీ శ్రీ వేంకటేశ్వర నామముద్రాంకితాలైతే, సారంగపాణి పదాలు కార్వేటినగరంలో (చిత్తూరు జిల్లా) వెలసిన రుక్మిణీ సత్యభామా సమేతుడైన శ్రీ వేణుగోపాలస్వామి నామాంకితాలు. ఇద్దరూ వైష్ణవ కవులే. సారంగపాణి కార్వేటినగర సంస్థానాధీశుడైన మాకరాజు వేంకట పెరుమాళ్రాజు (క్రీ.శ. 1800) ఆస్థానంలో విద్యాధికారి, వైణిక విద్వాంసుడు. అభినయాచార్యుడు పైగా వాగ్గేయకారుడు. ఈ రాజుమీద కూడా సారంగపాణి మూడు శృంగార పదాలు చెప్పాడు. రాజాస్థానంలో ఉంటూ రాజుల మనస్తత్వాలను గ్రహించడమేగాక ఆనాటి రాచవ్యవస్థ చుట్టూ పడుగు పేకవలె అల్లుకొనిపోయిన సామాజిక శృంగారపు వింత పోకడలను గమనించినవాడు

సారంగపాణి. రాజుల ప్రాపకం పొందినవారి దాబుసరితనాన్ని, సామాన్యుల అసహాయతను గుర్తించడమేకాక సారంగపాణి ఆనాటి కుంఫిణీ అధికారుల సంస్కృతి తమ ప్రాంతాన్ని ఎలా ప్రభావితం చేసిందో చూశాడు. సంఘంలో వేశ్యావ్యవస్థ, సంసార వ్యవస్థ ఎలా కలవరపరిచిందో గమనించాడు. ఈయన శృంగార పదాలు, దేశీయ పదాలు ఈ సాంఘిక నేపథ్యం ఆధారంగా రచింపబడినాయి. అందువల్ల ఈ వాగ్గేయకారుని పదాలలో శృంగారం అతివేలంగా కనిపిస్తుంది. ఇలా ఇరువురి సాహిత్యంలో పచ్చి శృంగారం కనిపిస్తున్నది.

శృంగారంలో భక్తి, భక్తితో శృంగారం పడుగుపేకగా అల్లుకొనిపోయిన అన్నమయ్య సంకీర్తనలో సంస్కరణ భావాలు ఉన్నాయి కానీ సంస్కరణకు ఒక ఉద్యమంగా నడపవలసిన అవసరం ఆయనకు కలుగలేదు. సమాజంలో అందరూ సమానమని, ధర్మంగాని, నీతిగాని అందరికీ ఒకేరకంగా ఉండాలని అనేక సంకీర్తనలలో అన్నమయ్య బోధించాడు. పరబ్రహ్మ దృష్టిలో సమానమైన మానవులలో ఏర్పడిన వృత్తిభేదాలు, సాంస్కృతిక భేదాలు సారంగపాణి దృష్టిలో పడి ఆయా పదాలకు వస్తువులయినాయి. సంప్రదాయ విచ్ఛేదకంగా పరిణమించిన మార్పులను సారంగపాణి తీవ్రంగా గర్హించాడు. అన్నమయ్యకు, సారంగపాణికి గల ప్రధానమైన దృష్టి భేదమిదే.

కీర్తనల విభాగంలోని పదాలలో సారంగపాణి లౌకిక విషయాలెన్నిటినో చేర్చి సమకాలీన సమాజస్థితిని మన కండ్లముందు నిలబెట్టినాడు. ఈ దృష్టితో పరిశీలిస్తే అన్నమయ్య సంకీర్తనలలో కూడ ఎన్నో లౌకిక విషయాలు కనిపిస్తాయి.

**"తలచినవన్నియు తనకొరకే**
**సూదుల మాటల సుఖములివి"**

ఇత్యాది నీతి వాక్యాలుగా కనిపించే విషయాలన్నీ అన్నమయ్య ఆధ్యాత్మ సంకీర్తనలలో కనిపిస్తాయి. సంఘంలో మానవుడు మంచివాడుగా జీవించడం ఎంత కష్టమో సారంగపాణికి తెలుసు. కుటుంబ వ్యవస్థను గురించి వేణుగోపాలుని పరంగా సారంగపాణి చెప్పిన ఈ పదం అప్పటి సమాజ దృష్టిలో చాలా ముఖ్యమైంది.

**"నీవారి నడతలన్నియు నేనేయెరుగనా**
**బావజ జనక వేణుగోపాలా నాతో దాచితేనే**
**వల్లి నిన్ను రోలగట్టె తండ్రి యావుల మేప బంపె"**

ఈ పదంలో వర్ణతమైన సంసారం సారంగపాణి కాలంనాటి సంసారాలలో ఒక నమూనా సంసారం. వ్యక్తికి వ్యక్తికి మధ్యగల సంబంధం సక్రమంగా ఉంటే సంసారం సారవంతంగా ఉంటుంది. ఇలాంటి సంసారపు వ్యవస్థను మార్చడానికి ప్రయత్నించిన సంస్కరణాభిలాషి సారంగపాణి. సారంగపాణి పదాలలో ఆయనలోని కవి, విమర్శకుడు, సంస్కరణాభిలాషి ఒకరిని తోసుకొంటూ మరొకరు ప్రత్యక్షమవుతారు.

భాషా విషయంగా ఏ పదకర్తకూ రాని గొప్ప ఖ్యాతి సారంగపాణికి కలిగింది. దీనికి కారణం ఆయన వాడిన పామరభాష. విద్యాగంధం లేనివాళ్ళు పామరులు. వాళ్ళు ఎలాంటి భాష మాట్లాడుతారో అలాంటి భాషలోనే రాయడం పాత్రోచితభాష అనే మాటకర్థం. వ్యవహార భాష వేరు, పామర భాష వేరు. పదకర్తలలో అన్నమయ్య గ్రామ్య బాషలో రాయవచ్చునని చెప్పినట్లు సంకీర్తన లక్షణంలోని –

**"పల్లవ నారీ మ్లేచ్ఛా, ద్యుల్లాస మనోజ్ఞ బంధురోక్తులు చవియై**
**చెల్లును గ్రామ్యములైనను, హల్లీసక ముఖ్య నాటకాదిక ఫణితిన్"**

అనే పదం సాక్ష్యం. పల్లవులు, స్త్రీలు, మ్లేచ్ఛులు వారి వారికి సహజమైన భాషలో మాట్లాడితే వినసొంపుగా ఉంటుంది. ప్రాచీన కాలం నుండి సంస్కృత నాటకాలలో ఈ పద్ధతి ఉంది. తానుచెప్పిన లక్షణానికి అనుగుణంగానే అన్నమయ్య తన సంకీర్తనలలో అప్పటి ప్రజలెలా మాట్లాడేవారో ఆవిధంగానే రాశాడు. ఏమిర, ఏమిరే రూపాలు ఇప్పటికీ రాయలసీమ వ్యవహార భాషలో ఉన్నాయి.

**"తలచి రాగలమేలు తానే వచ్చురే**
**పోగల వెల్లవడిఁ దానే పోవురే"**

ఇత్యాది వాక్యాలలో ఈ ప్రయోగం ఉంది. మనుజలాలి, తమ్ములాల, అన్నలాల, అమ్మలాల వంటి ప్రయోగాలు అన్నమయ్య సాహిత్యంలో కొల్లలుగా కనిపిస్తాయి. అన్నమయ్య కడప జిల్లావాడు కాబట్టి ఆ ప్రాంతపు ఎన్నో వ్యావహారిక, గ్రామ్య ప్రయోగాలు సంకీర్తనలకెక్కినాయి. పెదతిరుమలయ్య భగవద్గీతా వ్యాఖ్యానంలో కూడా రాయలసీమ గ్రామ్య భాష కనిపిస్తుంది. తాళ్ళపాక కవుల తరువాత గ్రామ్యభాషను ఎక్కువగా ఆదరించినవాడు సారంగపాణి. అన్నమయ్య, సారంగపాణి ఇద్దరూ రాయలసీమవాళ్ళు కావడం వల్ల, రాయలసీమలో వెలువడిన పదసాహిత్యం పాత్రోచిత భాషలోనే రావడం వల్ల, ఈ ప్రాంతంలో ఇలాంటి భాషా సంప్రదాయం అన్నమయ్య కాలం నుండి కొనసాగిందని చెప్పవచ్చు.

సారంగపాణి జాతీయపదాలుగా పేర్కొనిన 17 పదాలలో ఆనాటి పల్లె ప్రజలు మాట్లాడే భాష యథాతథంగా వాడబడింది. పామర ప్రజల భాషను ప్రత్యేకంగా గ్రంథస్థం చేసినవారు ఆయనకంటె ముందు ఎవరూ కనిపించరు. ఈ 17 పదాలు చదివినపుడు మనకు వెంటనే అర్థంకావు. పామర భాషలో సహజంగా దొరికే పదాలు, పదబంధాలు, ఈనాటి వ్యావహార భాషలో కనిపించవు. పదాల స్వరూపాన్ని, ప్రజల సాంస్కృతిక జీవితాన్ని అర్థం చేసుకొంటే తప్ప సారంగపాణి వాడిన భాష అర్థం కాదు. సారంగపాణి వాడిన భాష ఎలా ఉన్నదో చూపడానికి ఒక పదాన్ని పరిశీలించడం అవసరం.

**"నగరాన తెప్పతిర్నాల్ల యేడిక సూన్ను**
**నాగు నూరాలేదంటే అపిడె"**

ఈ పదంలో కనిపించే యేడికి, సూన్ను, ఎగ్రి, రెయ్యి, చరచు, చామి, యేట, బేమనమూక, వొరుతుకుల, యేశగార్ల, ఊబేదె, వాశేదే ఇత్యాది పదబంధాలన్నీ పామరుల వ్యవహారంలోనివి. ఇతర పదాలలో కనిపించే పాయం, సాంబ్రాణి, మారాముళ్ళు, మచ్చు, చీటి, తెగువ, దేవర, బూటకం, సందేల, మిద్దియిల్లు, సొమ్ములు, వడ్డి, విటుకులాడి, వేటగొట్టు, రూక, రాకడి, దుడ్డు, కబ్జాయం, ఉప్పుచట్టి, అంబలి, దండిగ, తిరిపం, సున్నపాకు, వేకటి, పిడచ మొదలైన పదాలన్నీ ఆనాటి వ్యవహారంలోనివే. ఆనాటి ప్రజల సామాజిక స్థితిగతులను తెలుసుకొని ఈ పదాలను గురించి ఆలోచిస్తే అప్పటి సామాజిక వ్యవస్థ అర్థమవుతుంది.

భాషా విషయంలో సారంగపాణిని ఉన్నత శిఖరంపై నిలిపినది జాతీయ పదాలలో ఆయన వాడిన పామరభాష. గ్రామాలలో తిరునాళ్ళు జరుపుకోవడం, సంతలకెళ్ళడం, పామరులకు రుచించినట్లు పండితులకు రుచించదు. పామరులు వాళ్ళకలవాటైన భాషలోనే మాట్లాడుకుంటారు. సారంగపాణి మాత్రం పట్టుబట్టి జాతీయ పదాలను పామరభాషలో రచించి తన పాత్రోచిత భాషాప్రియత్వాన్ని ప్రకటించుకొన్నాడు. స్నేహితులు సుఖాలతోపాటు కష్టాల్లో కూడా భాగస్వాములు కావాలి. అలాకాక కొంతమంది సుఖాలకు, అవసరాలకు చేరువై ఎదుటివాళ్ళకు కష్టాలు వచ్చినప్పుడు తప్పించుకుంటారు. అలాంటి స్వార్థపరులైన స్నేహితుల్ని సారంగపాణి "అక్కర కొదగని సఖుదేమిటికి" అని ప్రశ్నించారు. స్నేహితులు కష్టాల్లో అవసరం వచ్చినప్పుడు తోడ్పడాలనే నీతిని ఈ పదకవి తెలిపారు.

ఏ పనికైనా డబ్బు అత్యంత అవసరం. అందుకే మన పెద్దలు "ధన మూలం ఇదం జగత్" అని ప్రకటించారు. ఈ విషయాన్నే సారంగపాణి అచ్చ తెనుగు భాషలో "అన్నిటికి కాసుకదా దొడ్డది" అన్ని పనులకు డబ్బే ముఖ్యం అని పేర్కొన్నారు. మానవుడు ధర్మబద్ధంగా ఎంత సంపాదిస్తాడో అంతవరకే ఖర్చు చేసి సంతృప్తిగా జీవించాలి. అలాకాక అప్పుల చేసి సుఖాలు అనుభవిస్తే ముప్పులు తప్పవు. ఈ విషయాన్నే సారంగపాణి "అప్పులు మెండుగ సేయగరాదు" అని హెచ్చరించారు.

ఏదైనా నేర్చుకుంటే దాని అర్థం, పరమార్థం కూడ తెలుసుకోవాలి. అలాకాక అర్థం తెలుసుకోకుండా చదువుకున్నందువల్ల ఫలితం లేదని, అలాంటి చదువు ఎందుకు? అంటూ సారంగపాణి "అర్థము తెలియని చదువేమిటికి" అని ప్రశ్నించారు. చదువుకున్నవారు అర్థ వివరాలను తప్పనిసరిగా తెలుసుకోవాలని సూచించారు. అజ్ఞానమనే చీకట్లను పారద్రోలి జ్ఞానమనే వెలుగుల్ని ప్రసాదించి తీర్చిదిద్దే గురువులను మనసులో పూజించాలని, అలా పూజించని వారి బ్రతుకేనా? అని సారంగపాణి ఆక్షేపించారు. ఆచార్య దేవోభవ అనే వేదసూక్తిని పాటించాలని సారంగపాణి తద్వారా ధ్వనింపజేశారు.

బంధువులు అంటే కష్టసమయాల్లో, అవసరాల్లో ఆదుకోవాలి. పొందిన మేలును మరవకుండా విశ్వాసంగా ఉండాలి. అలాకాక కొంతమంది తప్పులు వెదకుతుంటారు.

అలాంటి బంధువులు అనవసరం అని సారంగపాణి "సొద్దు బెట్టు చుట్టాలేమిటికి" అనే కీర్తన ద్వారా ఆక్షేపించారు. మానవుడు సాటి మనిషిని బాధపెట్టే పాపపు పనులు చెయ్యడానికి సాహసించకూడదంటూ "ఘాతుకానికి ఒడిగట్టరాదు" అని సారంగపాణి సందేశమిచ్చారు. మానవుడు కష్టపడి సంపాదించి ఆనందంగా జీవించాలని, ఇతరులకు కూడా పెట్టాలని, అలా ఇతరులకు ఇవ్వనివారు అధములని, అలాంటి అధముల బ్రతుకు ఒక బ్రతుకేనా? అంటూ "హాయిగ తా దిని యొకిరికి పెట్టని యధమునిదొక బ్రతుకా" అనే సంకీర్తన ద్వారా లోభి మనిషిని సారంగపాణి నిరసించారు.

మాటలు నిర్మలంగా ఉండాలని, ఇతరులకు మేలు చేసేవిగా ఉండాలని, కపటం, మోసం ఉండకూడదని సారంగపాణి "వంచన మానవే మంచి మాటాడవే" అనే కీర్తన ద్వారా తెలిపారు. కొంతమంది స్వార్థం కోసం ఇతరుల మాటల్ని చాటుగా విని బట్టబయలు చేస్తుంటారు. అలాంటి తప్పు పనులు చేయకూడదని – "పొంచులు విని బైట చెప్పరాదు" అనే కీర్తన ద్వారా ప్రకటించారు. భగవంతునికి మనసులో స్థానం ఇవ్వాలని, భగవంతుడే రక్షకుడు అనుకోవాలంటూ సారంగపాణి–

**"పరంధాముని మదిలో బంధించవలె"**
**దేవుడే రక్షకుడనుకోవలె"**

అనే ఈ రెండు కీర్తనల ద్వారా భక్తి ప్రబోధం చేశారు. భగవంతుడు, సమస్త జీవరాసులు సంగీత కళకు పరవశులవుతారు. చెవులకు ఇంపైన పాట పల్లవిని విన్నా కూడా అదే చాలు అని, పాట పాడితే లోకనాథుడైన భగవంతుని గూర్చే పాడాలంటూ –

**"చెవులకు రక్తిగా హితవైన పాట పల్లవి విన్నా చాలు**
**పాడితె జగన్నాథునిపై పదము పాడుచుండవలెను"**

అనే కీర్తనల ద్వారా సారంగపాణి సంగీతం, దైవభక్తి ప్రాధాన్యం తెలిపారు.

పెద్దపెద్ద ప్రసంగాలకన్నా, పెద్దపెద్ద వివరణలకన్నా చిన్నచిన్న సూక్తులు మనసుకు సూటిగా తాకుతాయి, ఆలోచింపజేస్తాయి. అవి మనిషి ప్రవర్తనపై ఎంతో ప్రభావాన్ని చూపిస్తాయి. ఈ పదాల్లో భక్తి, నీతి, ప్రేమ, వైరాగ్యం, వేశ్యావృత్తి నిరసన మొదలైన అంశాలకు సంబంధించిన సూక్తులు విస్తారంగా కనిపిస్తాయి.

**"అక్కర కొదగని సఖుదేమిటి**
**భారత కథ, ఔరా యెన్నెనింతలే"**

**"హరి నామస్మరణ సేయకుంటె అవతల గతియేమి**
**హరినారాయణ గోవిందాయని స్మరణ సేయవేవో మనసా"**

ఈవిధంగా సారంగపాణి పదాల్లో మానవ జీవితానికి ఉపయుక్తమయ్యే అనేకరకాల సూక్తి సుమాలు నిత్యనూతనంగా గుబాళిస్తున్నాయి. పదకవి సారంగపాణి

పదాల్లో అనేకరకాలైన వర్ణనలు కనిపిస్తాయి. నాయికా నాయకుల నామ, రూప, గుణ, ప్రవర్తనలకు, వారి సంయోగ వియోగాలకు సంబంధించిన విషయాలను సారంగపాణి ఎంతో రమ్యంగా వర్ణించాడు.

హరిపాదములపై ఆపవెట్టడం, గౌరిపూజ చేయడం మొదలైనవి దేశ ప్రజల విశ్వాసాలను, ఆచారాలను తెలియజేస్తాయి. నాయిక అపూర్వమైన ప్రేమను చెలికత్తె నాయకునికి తెలియజెప్పే పదాల్లో సంగీత సప్తస్వరాలను సమన్వయించి వ్రాయడం సారంగపాణికి ఉన్న సంగీత పరిజ్ఞానానికి నిదర్శనం. భగవంతుడు ఒక్కడే పురుషుడని భావించినప్పుడు, భక్తులు స్త్రీలుగా ఒకరినొకరు సపత్నులుగా భావించుకోవటం జరుగుతుంది. అప్పుడు వారిలోకూడా మాత్సర్యం, ఆవేదన చెలరేగుతుంది.

**"ఏమిటికే నీపేరేమని యడిగితివి**
**కోమలి నను వేణుగోపాలడని దెలిసి"**

నాయకుడు నాయికతో - నాపేరు వేణుగోపాలుడని తెలిసి కూడా ఎందుకు అడిగావు అని ఆప్యాయంగా ప్రశ్నించాడు. నీ కారణంగానే నాకు కొన్ని పేర్లు సిద్ధించాయనిచెప్పి ఆ కారణాలను పేర్కొన్నాడు. నీ ముఖాన్ని ముద్దుపెట్టుకున్నప్పటి నుంచీ నన్ను పద్మాక్షుడని, నీకు జడవేసింది మొదలు శేషశయనుడని, నీ పెదవిని క్రోలినప్పటి నుంచీ మధుసూధనుడని, నీ వక్షస్థలాన్ని పట్టుకోవడం వల్ల మంధరధరుడని, నీతో మన్మధకేళి జరిపినప్పటి నుంచి మదనజనకుడని, పరిమళంతో కూడిన నీ బంగారువన్నె శరీరంతో కలిసిన నా వస్త్రం పసుపుగా మారింది మొదలు నన్ను పీతాంబరధరుడని లోకాలు కీర్తిస్తున్నాయని, తన పేర్లకు తన దేవేరితో కలిగిన ప్రేమానుబంధమే కారణమని వివరించాడు. ఈ పదంలో సారంగపాణి తన వర్ణనా చాతుర్యాన్ని వ్యక్తం చేశాడు. కవులు ముఖాన్ని పద్మంతో, జడను పాముతో, అధరాన్ని మధువుతో, స్తనాన్ని పర్వతాలతో, మరుకేళిని మన్మధుడితో, పసుపు కాంతి శరీరాన్ని బంగారంతో సాదృశ్యం చెప్పినట్టే సారంగపాణి కూడా పోలికలు చెప్పాడు. అయితే ఇక్కడ నాయికకు ఆధిక్యత కలిగకిస్తూ ఆమె కారణంగా నాయకునికి ఈ పేర్లు ప్రభవించి ప్రసిద్ధమయ్యాయని అన్వయించి చెప్పడం విశేషం. పదకవితా పితామహుడు అన్నమయ్య కూడా నాయిక చంద్రముఖి కాబట్టి నాయకుడు రామచంద్రుడయ్యాడని ఇలా కొన్ని పేర్లను పేర్కొన్నాడు. ఈవిధంగా సారంగపాణి పదాల్లో నాయికా నాయకుల విరహానికి, అపూర్వమైన ప్రేమకు, వారి ప్రణయ కలహాలకు, చెలికత్తెల ఓదార్పులకు, సందేశాలకు సంబంధించి వర్ణనలు కనిపిస్తాయి. సారంగపాణి ఈ పదాల్లో అనేకరకాలైన రాగాలను, స్వరాలను, రకరకాల కొమ్మలను, ఔషధాలను, మానులను ఆయా భావాలతో సమన్వయించాడు. కొన్నిచోట్ల పదాల విరుపు వల్ల వేరువేరు అర్థాలు వచ్చేవిధంగా శబ్దచమత్కారం నిరూపించాడు. సారంగపాణి పదాలలో ఎన్నో సాంఘిక నీతులు కూడ చోటుచేసుకొన్నాయి.

భక్తి, నీతి, త్యాగం, సత్యం, ధర్మం, న్యాయం మొదలైన సద్గుణాలు కలిగిన మహానుభావుల మాటలు, సందేశాలు, ఇంచుమించు ఒకేవిధంగా ఉంటాయి. అందువల్ల ఒకరి గ్రంథాలు ఒకరు చూచి ఉన్నా, చూడకపోయినా ఇలాంటి సాదృశ్యాలు వారి రచనలలో కనబడడం ఆశ్చర్యం కాదు.

పదకవులందరూ సంఘశ్రేయస్సు కేసమే పదాలను దైవాంకితం చేసి రచించారు. ప్రజలను నిత్యానిత్య వివేక జ్ఞానాన్ని, భక్తి తత్త్వాన్ని, భగవన్మహిమలను బోధించి వారిని తరింపజేసి తామూ తరించడమే వారి ప్రధాన ధ్యేయం. సారంగపాణి కూడా అదే ధ్యేయంతో తన ఇష్టదైవమైన వేణుగోపాలస్వామి పైన భక్తి, శృంగారాత్మకంగా, నీతి బోధకంగా పదాలను రచించి ప్రసిద్ధుడయ్యాడు.

***

# అన్నమాచార్య సంకీర్తనలలో సాంఘిక జీవన విధానం

**శ్రీ వి. ఢిల్లిబాబు**
**పరిశోధక విద్యార్థి**
**తెలుగు అధ్యయన శాఖ**
**శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం,**
**తిరుపతి**

అన్నమయ్య పదకవితా పితామహుడు. మహాకవి. గొప్ప భక్తుడు. సంస్కృతం బాగా చదువుకొన్నప్పటికీ తెలుగు భాషపై మమకారాన్ని పెంచుకున్నాడు. వేద వేదాంగాలు వల్లెవేసినా జానపద ధోరణులు అవలంబించి సులభశైలిలో మోక్షాన్ని ఉపదేసించిన మహాకవి అన్నమయ్య.

దక్షిణ భారతదేశ వాగ్గేయకారులలో తాళ్ళపాక అన్నమయ్యకు ప్రత్యేక స్థానముంది. అన్నమయ్య సంకీర్తనల్లో నృత్యానికి అనువైనవి. సంగీత ప్రధానమైనవి. భక్తి ప్రబోధకమైనవి. శృంగారాత్మకమైనవి. అందుకే అన్నమయ్య కీర్తనలు అందరినీ ఆకట్టుకోగలుగుతున్నాయి. అన్నమయ్య అవతరణతో ఆంధ్ర సాహిత్యంలో భక్తి తత్త్వం వెల్లివిరిసింది. తనకు పూర్వమున్న పురాణ పద్ధతి కాని, కావ్యానువాద విధానం కాని స్వీకరించక సరికొత్త రీతిలో సంకీర్తన సాహిత్యాన్ని సృష్టించిన ప్రతిభాశాలి అన్నమయ్య.

అన్నమయ్య సంకీర్తనలు సాంఘిక జీవనానికి సమకాలీన సమాజానికి తర్పణం లాంటివి అందులో కొన్ని అంశాలు.

**సంత :** గ్రామాల్లో సామాన్యంగా సంతలు జరుగుతుంటాయి. రైతులు తాము పండించిన కూరగాయలు ఈ సంతలకు తీసుకొనిపోయి అమ్ముతారు. ఈ సంతల్లో కూరగాయల్తో పాటు నిత్యావసర వస్తువులు లభిస్తాయి. పొట్టేళ్ళ సంత, పశువుల సంత నేడున్నాయి. ఈ పశువుల సంతనే 'పరస' అని కూడా అంటారు. ఆనాడు 'మైలసంతలు' (5-178) కూడా ఉన్నట్లు తెలుస్తుంది.

**"చింత చిగురు దెచ్చి సంతలోనమ్ము"** **(4-116)**

**వడ్డీ వ్యాపారం :** ఆనాడు వడ్డీకి డబ్బు పుచ్చుకున్నప్పుడు పత్రం రాసి ఇచ్చే ఆనవాయితి. దాన్నే నేడు "బాండు" అంటారు. వడ్డీ వ్యాపారంతో పాటు కుదువ వ్యాపారం కూడా ఆనాడు వుండేదని అన్నమయ్య కీర్తనల (10-142) ద్వారా తెలుస్తుంది. (తాటియాకు మీద వ్రాయడం (ప్రామిసరీ నోట్)

**వెట్టి :** "వెట్టి" శబ్దానికి కూలి లేక చేసెడు పని అని నిఘంటు అర్థం. ప్రాచీన కాలంలో గ్రామాధికారి ఆజ్ఞల్ని శిరసావహించి రాత్రింబవళ్ళు విరామం లేక కష్టం చేసేవాడు వెట్టివాడు. ఈ పనికి ప్రతిఫలం లేదు. గ్రామ ప్రాంతాల్లో "తోటివాడు" అని ఉంటాడు. 'తోటి' అనగా మాల, చండాలుడని నిఘంటు అర్థం.

పండుగ రోజుల్లో ఈ తోటివాడు ఉన్నత కుటుంబాల వారికి ఇండ్లు పూసుకోవడానికి ఎర్రమట్టి, పండుగ రోజుకు సరిపడే వంటచెఱకు తెచ్చిచ్చే ఆచారముంది. అలాగే ఈ తోటివాడు మట్టి పాత్రల క్రింద.వేసే చుట్టకుదుర్లు చేసి ఇస్తాడు. దీనికి ప్రతిఫలంగా వానికి పండుగ రోజు భోజనం, పంట వచ్చిన రోజు తిరిపెం లభిస్తాయి. ఇప్పటికీ కొన్ని ప్రాంతాల్లో ఈ తోటి పనివారు ఉన్నారు. వెట్టి వానికి, తోటి వానికి కొంత వ్యత్యాసం కనిపిస్తుంది. తోటివాడు కొన్ని రైతు కుటుంబాల నాశ్రయించి బ్రతుకుతుంటాడు. వాడు ఆశ్రయించుకొన్న ఇళ్ళల్లో ఎవరైనా మరణిస్తే బంధువర్గాని కంతటికీ ఈ తోటివాడు పోయి చెప్పి రావడం సంప్రదాయం.

వెట్టి కేవలం గ్రామాధికారి ఆజ్ఞను మాత్రమే నిర్వర్తిస్తాడు. కాబట్టి ప్రత్యేకమైన గుర్తింపు లేకుండా పోయినాడు. వెట్టి బరువుల్ని మోసినట్లుగా జీవుడు ఈ శరీరాన్ని మోస్తున్నాడని వర్ణింపబడింది (5-11/5).

**జాతర :** శక్తిని సంతృప్తి పరచి అమ్మవారి మన్ననల్ని పొందడానికై మారు చేతులు మామూళ్ళివ్వడం. గుండెలు కోసివ్వడం, జంతు బలివ్వడం, హింసాత్మక మైన కైంకర్యాలు ఆనాటి జాతరలోని భాగాలు. అన్నమయ్య ఈ జాతర వర్ణన తిరుపతి గంగజాతర్ను తలపిస్తుంది. ఎనుబోతును బలివ్వడం. ఆ బలికి ముందు ఆ ఎనబోతును గుడిచుట్టూ ఊరేగింపుగా తిప్పడం ఆనవాయితి. దీన్తో పాటు మేకలు, మేకపోతులు, గొర్రెలు, పొట్టేళ్ళు, కోళ్ళు మొదలగు వాటిని బలివ్వడం జరిగేది. అన్నమయ్య వర్ణనల ద్వారా ఆనాటి జాతరల విధానం మనం తెలుసు కోవచ్చు. (తిరునాళ్ళు, తెప్పోత్సవం, వసంతా లాడడం).

**నేతగాండ్రు** : ఈ నేత వారినే సాలెలని, తొగట్లని గ్రామాల్లో పిలుస్తుంటారు. వస్త్రాలు నేయుట వీరి వృత్తి. ఈ నేతవారు అన్నమయ్య కాలంలో వున్నారని ఈ క్రింది ప్రయోగం ద్వారా తెలుస్తుంది.

**"పంచభూతములనే పలువన్నెల నూలును**
**చంచలమనే గంజిలో ముంచి చీరను నేచియిమ్ము" (5-178)**

**ఓడ వ్యాపారం** : అన్నమయ్య సంకీర్తన లాధారంగా అన్నమయ్య కాలంలో ఓడ వ్యాపారం సాగుచుండేదని. అంతేగాక ఓడ వ్యాపారానికి సుంకం చెల్లించుట కూడా వుండేదని తెలుస్తుంది.

**"సంసారమనే సముద్రము నందు**
**దేహమను ఓడ వ్యాపారి పాప" (9-35)**

దీన్ని ఆధారంగా ఓడ వ్యాపారులు ఎదురుకొను విపరీత వాతావరణం ఆనాటి వారికి సుపరిచిత మనిపిస్తుంది. ఉప్పు మొదలైన వాటిని ఎద్దుల మీద, గాడిదల మీద, ఎనబోతుల మీద వేసుకొని వచ్చి గ్రామాల్లో విక్రయిస్తారు.

**దొమ్మరులు** : గడసాము చేసి తమ ఆటల్తో ప్రేక్షకులకు వినోదాన్ని కలిగించే వారు దొమ్మరులు. వీరు సామాన్యంగా రైతులకు పంటలు చేతికందే నప్పుడు గ్రామాల్లో విరివిగా తమ ఆటల్ని ప్రదర్శించి ధాన్యాన్ని సంపాదిస్తారు.

**కమ్మరి** : కమ్మరి పనిచేసి బ్రతికేవాడు కమ్మరి. గ్రామాల్లో ఈ కమ్మరి పని చేసేవార్ని కంసాలి అంటారు. వీరు ఇనుముతో అనేక పనిముట్లు చేస్తుంటారు. రైతులకు వీరికి విడదీయరాని బంధం ఉంది. పొలం దున్నే నాగల్ని, గొడ్డల్ని, రాట్నం, పార, కత్తి మొదలగు పనిముట్లన్నీ కమ్మరి తయారుచేసి రైతుకిస్తాడు. పంటలు వచ్చినపుడు ఈ రైతులు కమ్మరికి "మేర" అను పేర కొంత ధాన్యాన్నిస్తారు. అంతేగాక కమ్మరి తాను చేసిన పనిముట్లు గ్రామ సంతలో విక్రయిస్తుంటాడు.

**బందె** : గ్రామాల్లో పశువులు పంట పొలాల్లో పడి పంటను నాశనం చేస్తే క్షేత్రాధికారి ఆ పశువుల్ని గ్రామాధికారి కప్పగిస్తాడు. గ్రామాధికారి వానిని ఒకచోట ఉంచి నిర్ణీత శుల్కాన్ని పశువుల ఆసామి చెల్లించిన ఆ పశువుల్ని విడిచి పెడ్తాడు. ఈ పశువుల్ని గ్రామాధికారి నిర్బందించిన స్థలాన్ని "బందెల దొడ్డి" అంటారు.

**"పసరము వంట మాటు పాపపు బందెలు దెత్తు" (10-23)**

**"పసిమి పాపము నేటి బందె మేయు పసరము" (7-107)**

**కానుకలు** : కానుక, కానిక అని కూడా కలదు. పెళ్ళిళ్ళలో వధూవరులకి మనమిచ్చే బహుమానాల్ని పెళ్లికానుక లంటారు. దేవునికి కానుకలు సమర్పించడం ఆచారం. ఇది వారివారి శక్తిని బట్టి వుంటుంది. పూలు, పండ్లు, ధనం, కనకం వస్తు వాహనాదులు దేవునికి కానుకగా అర్పిస్తారు. అన్నమయ్య కీర్తనల్లో శ్రీ తిరుపతి

వేంకటేశ్వరుడు దొండపండు, పూలగుత్తి తన ప్రియురాంద్ర కిచ్చినట్లుగా వర్ణింపబడి ఉంది (15-177). ఆ ప్రియురాంద్రు వేంకటేశ్వరునికి వెలగపండు, టెంకాయ కానుకగా ఇచ్చినట్లు వర్ణితం (12-35). ఈ కానుకల్లో టెంకాయ, పూలు నేటికి కూడా ఉన్నాయి.

**ఆభరణాలు** : పూర్వం పురుషులు కూడా ఆభరణాలు ధరించేవారు. అట్లే పురుషులు జడవేసి పూలు పెట్టుకొను పద్ధతి 30 సంవత్సరాల ముందు కూడా గ్రామాల్లో ఉండేది. చుక్కల వలె ప్రకాశవంతాలగు పూసలు (7-15, 10-85), చిరుగంటల మువ్వల గజ్జెలు (12-302), సూర్య చంద్రుల వంటి మొలపూసలు, మొలగంట నాడు పురుషులు ధరించు ఆభరణాలుగా తెలియనగును. అట్లే మొలనూళ్ళు (12-297, 12-4), బరువైన మొలనూళ్ళు (4-148). తీగ వడ్డాణం అను ఆభరణాలు స్త్రీలు ధరించునవిగా తెలియుచున్నవి. మరియు సంకుచేరులు, ముత్యాల కుచ్చులు (8-164) కుచ్చుల ముత్యాలు (4-108), ముత్యాల కంకణాలు స్త్రీల ఆభరణాలుగా తెలుస్తుంది. సంధి దండలు సంకు కడియం (4-108). ఇది పురుషుల హస్తాభరణంగా తెలుస్తుంది. ముంగ మురువులు, చేమ పూకడియాలు (11-2120), ఉంగరాలు (పూర్వం ప్రేమకు చిహ్నంగా ఉంగరం పెట్టడం ఉంది). ఇది చిన్నపిల్లల చేతికి వేసే ఆభరణ విశేషం కావచ్చు. ఇంకా ఇత్తడిపై బంగారు నేరూదుట ఆనాటి వారికి కొత్త కాదని "చెంబు మీది కుప్పబొంత (7-1) వల్ల తెలుస్తుంది. మరియు పాదికెత్తు మెరుగారు బంగారు గుండు" (12-278) అను ప్రయోగం వల్ల ఆనాటి వారు బంగారాన్ని పాతిక విభాగాలుగా తూచి వ్యవహరించే వారని తెలుస్తుంది.

**ఆహారం** : అన్నమయ్య సంకీర్తన లాధారంగా ఆనాడు వారు వరి అన్నం ఎక్కువగా భుజించే వారని తెలుసుకోవచ్చు. అరసి రాజన్నాలు సూర్యచంద్ర బింబాలవలె ప్రకాశవంతాలైన పళ్ళాల్లో వడ్డించగా అవి రాశి పోసిన చుక్కల వలె ఉందని (9-10) అన్నమయ్య వర్ణించాడు. అట్లే బంగారు పళ్ళె మందు రాజాన్నాలు వడ్డించినట్లు (4-4) అనియు కొండవలె రాశిగా పోసిన దివ్యాన్నాలు (5-22) అని అన్నమయ్య వర్ణించడం గమనార్హం.

**జున్ను** : ఆవుగాని, బర్రెగాని ఈనిన మొదటి రెండు రోజుల్లో పాలను బాగా కాచిన జున్ను ఏర్పడుతుంది. ఈ జున్నులో (బెల్లం) పంచదార కలుపుకొని తింటారు.

**కొప్పు, తిలకం** : అన్నమయ్య కాలం నాటి స్త్రీలు తమ వెంట్రుకల్ని కొప్పుగా ముడుచుకొని చేమంతాది పువ్వుల్ని పెట్టుకొన్నట్లు (4-134), అంతేగాక వారు సవరాన్ని కూడా ధరించినట్లు (12), కుప్పు సవరము (24-290, 26-3)ను ధరించినట్లు గ్రహించవచ్చు. కమ్మని వాసనగల కస్తూరికి చంద్రవంక వంటి తిలకాన్ని (15-90) ఆనాటి స్త్రీలు పెట్టుకున్నట్లు గుర్తింపవచ్చు. ముఖానికి లత్తుకను పూసుకొనుట (4-28) ఆనాడు కలదని తెలుస్తుంది.

**వస్త్రాలు :** స్త్రీలు సామాన్యంగా సున్నితమైన వస్త్రాల్ని ధరించే వారని చెప్పవచ్చు. అన్నమయ్య కీర్తనల్లో దానిమ్మపూవు వన్నె కలిగిన సున్నితాలైన వస్త్రాలని (4-42) ఆనాటి స్త్రీలు ధరించినట్లు తెలుస్తుంది.

**ఆటలు :** కోలాటం, తోలుబొమ్మలు, వామనగుంటలు, నెత్తమాడడం, బొమ్మల పెండ్లి, సరిజేసులు, చదరంగం, అల్లో నేరెళ్ళు. దారి ముచ్చటలాడడం (దాగుడుమూతలు) మొదలైన ఆటల్ని అన్నమయ్య కీర్తనల్లో గ్రహించవచ్చు.

మనం సాంఘిక దృష్టితో అన్నమాచార్యుల కీర్తనల్ని పరిశీలిస్తే ఆనాటి తెలుగు వారి రాజకీయాలు, మత పరిస్థితులు, రాజాస్థానాలు, దండనలు, జీతం, కులి, తిట్లను వ్యక్తపరచి ఎన్నో విషయాలను తేటతెల్లబరచిన మహనీయుడు మన అన్నమయ్యని తెలుస్తుంది.

***

# అన్నమయ్య కీర్తనలలో దాగివున్న హరినామ వైశిష్ట్యము

**డా॥ కె. పద్మిని**
**వాణిజ్య శాఖ అధ్యాపకులు**
**శ్రీ పద్మావతి మహిళా డిగ్రీ & పి.జి. కళాశాల**
**తిరుపతి**

పదకవితా పితామహుడు తాళ్ళపాక అన్నమాచార్యులు వారు విధిగా సంగీత జ్ఞానాన్ని ఎక్కడా అభ్యసించలేదు. ఇతర వాగ్గేయకారులు త్యాగయ్య, ముత్తుస్వామి దీక్షితులు, శ్యామశాస్త్రి అన్నమయ్య తరువాతి తరంవారు వీరంతా తమ గురువుల వద్ద సంగీత శిక్షణ పొంది, ఆ జ్ఞానంతో అనేక కీర్తనలను దైవానుగ్రహం చేత రాగ, తాళ, లయబద్ధంగా రచించారు. అందువల్ల అన్నమయ్య సంకీర్తనలు, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలలో తక్కువగా ఆలపించడం జరిగింది. అన్నమాచార్యుల గురించి తక్కువ మందికి ప్రాచురమయి ఉండవచ్చు. కానీ, తిరుమల తిరుపతి దేవస్థానము, అన్నమాచార్య ప్రాజెక్టు ద్వారా అన్నమాచార్యుల వారి కీర్తనలు బహుళ ప్రాచుర్యంలోకి వచ్చాయి. తి.తి.దే. ఇంకా ఎన్నో క్రొత్త కీర్తనలు ముందు తరాల వారికి అందించే ప్రయత్నం చేస్తున్నది. నేదునూరి కృష్ణమూర్తిగారు, బాలకృష్ణప్రసాద్ గారు, బాలమురళీకృష్ణగారు, యం.యస్. సుబ్బలక్ష్మిగారు, పద్మశ్రీ శోభారాజ్ గారు వంటి

ఎందరో గాయకులు ఎన్నో కీర్తనలకు స్వరకల్పన చేసారు. అన్నమయ్య గొప్ప సంఘ సంస్కర్త అని చెప్పవచ్చు. తన యొక్క సాహిత్య పదఝరులచే పండిత పామరులను కూడా, ఓలలాడించిన మహా వాగ్గేయకారుడు.

ఆనాటి సమాజంలోని పోకడలను పసిగట్టి, ప్రజలలో దైవభక్తి, పాపభీతి రెండునూ కలిగేటట్లు కృషి చేసారు. ప్రతి యుగంలో కైవల్య ప్రాప్తి, మోక్షాన్ని పొందాలంటే యుగధర్మం వుండేది. కృతయుగంలో యజ్ఞయాగాది క్రతువుల ద్వారా మోక్షాన్ని పొందేవారు. ద్వాపరయుగంలో విగ్రహారాధన ప్రధానంగా సాగేది. కానీ, కలియుగంలో నామ సంకీర్తనల ద్వారా కూడా మోక్షన్ని పొందవచ్చు. అన్నమయ్య రచించిన అనేక కీర్తనలు నామ సంకీర్తనలు చేయడం చాలా సులభంగా వుంటుంది. అన్నమాచార్యులవారు రచించిన అనేక కీర్తనలలో జ్ఞాన, భక్తి, వైరాగ్యాలు ముఖ్యంగా కనిపిస్తాయి. కైవల్యప్రాప్తి పొందుటకు ఈ మూడును ముఖ్యమైనవి.

కేవలం ఒక్క హరినామస్మరణ ద్వారా ఎటువంటి ఆపదలనుండైనా బంధ విమోచనం కలుగుతుందని అన్నమయ్య క్రింది కీర్తనలో వివరించారు. తనయొక్క స్వయానుభవం ద్వారా హరినామ స్మరణలో దాగివున్న అద్భుతశక్తిని ఈ కీర్తనలో పొందుపరిచారు అన్నమయ్య.

సాళువ నరసింగరాయలు అన్నమయ్య పదకవితల విశిష్టతను తెలుసుకొని, తన వద్దకు పిలిచి, ఏదైన కీర్తనను ఆలపించమని అడిగినప్పుడు –

"ఏమకో చిగురుటధరమున" అను కీర్తనను పద్మావతి అమ్మవారిని ఉద్దేశించి ఆలపించారు. దానికి ముగ్ధుడైన రాజు తనపై కూడా కీర్తనలను రచింపమని అడగగా 'నారాయణుని స్తుతించిన నాలుకలో నరులను స్తుతించనని" పల్కెను. కోపోద్రిక్తుడైన రాజు అన్నమయ్యకు సంకెళ్ళు వేసెను. అట్టి సమయంలో కూడా అన్నమయ్య నారాయణుని కీర్తింపసాగెను. అంతట సంకెళ్ళు వాటంతటవే తెగిపడెను. రాజు తన తప్పును గ్రహించి క్షమింపమని ప్రార్థించెను.

**పల్లవి : "ఆకటి వేళల అలపైన వేళల**
**తేకువ హరినామమే దిక్కుమరి లేదు"**

ఆకలి కల్గినప్పుడు, ఆపద కలిగినప్పుడు, ధైర్యము చేకూర్చి రక్షించునది శ్రీహరి నామ మొక్కటే. అది తప్ప మరొక దిక్కు లేదు.

తాను ఎందుకు కొఱగాని దుఃస్థితి ఏర్పడినప్పుడు, కులము చెడినప్పుడు ఇతరులచే చెఱలు బంధింపబడి కృషించనప్పుడు, హరినామ మొక్కటే గతి, దానిని మరచినచో మరొక గతి లేదు.

ఆపద గలిగినప్పుడు, నిందకు లోనైనప్పుడు పాపముపైకొన్నప్పుడు, భయపడి నప్పుడు, చాలినంతగా స్మరింపబడిన హరినామ మొక్కటే గతి. దానిని విడిచి కడవరకు ప్రయత్నించినను ఆ దుర్దశల నుండి కాపాడుటకు మరొక మార్గము లేదు.

శత్రువు సంకెళ్ళతో బంధించినప్పుడు, చంపుటకు బిలిచినప్పుడు, అప్పుల వారు అడ్డగించినప్పుడు, విడిపించుటకు శ్రీ వేంకటేశ్వరుని నామ మొక్కటే ఉపాయము. దానిని వదలి మూర్ఖత్వముతో ఎంత ప్రయత్నించినను మరొక దారి లేనేలేదు.

"ఎట్టి కష్ట దశల యందైనను హరినామ మొక్కటే దిక్కు".

అర్థాలు : తేకువ=ధైర్యము; ఒఱపైన=అందమైన, ధృఢమైన, ప్రకాశవంతమైన; అఱడి=నింద; అంకిరి=అడ్డగింత; ఆగిన=నిలబెట్టిన; మంకుబుద్ధి=మూర్ఖత్వం.

**"ఎంచి చూడరో ఘనులార - యిందీవరాక్షుడు రక్షకుడు**
**సంచితముగ నీతని శరణంచే - సర్వఫలప్రద మిందరికి"**

అని అన్నమయ్య వివరించాడు.

ఈ విధంగా హరినామ సంకీర్తనము యొక్క వైశిష్ట్యమును అనేక సంకీర్తనలలో బోధించినాడు.

**ముగింపు :** కళలన్నీ భగవంతుని విభూతులే. వాటిని భగవంతుని ఆరాధనకే వినియోగించాలి. దాని ద్వారా భగవంతుని కృపకు పాత్రులై ధన్యాత్ములు కావాలి. ఈ విషయంలో అన్నమయ్య తన జీవితాన్ని అంకితం చేశారు. పదకవితా పితామహుడుగా ప్రసిద్ధుడైన ఈ భక్త కవిశేఖరుడు సంగీత సాహిత్యాల రాశి అనదగిన తన సంకీర్తన వాఙ్మయాన్ని కలియుగ ప్రత్యక్షదైవమైన శ్రీ వేంకటేశ్వరుని కంకితం చేశాడు. సంకీర్తనలు భగవంతుని పాదాల కర్పించిన పూజాపుష్పాలుగా భావించిన మహానుభావుడు అన్నమయ్య, శ్రవణాదులైన తొమ్మిదింటిలో కీర్తనం రెండవది. కీర్తనలో శ్రవణ స్మరణాలు గూడ గర్భితమై ఉంటాయి. ఇది ముక్తికి అత్యంత సులభాపాయం. విశేషించి కలియుగంలో ప్రముఖ మోక్ష సాధనమని పేర్కొనబడినది. అన్నమయ్య ఈ సంకీర్తన మార్గాన్నే ఒక యోగంగా చేపట్టాడు. జన్మభోగాలలో ఆసక్తి గల వారికి హితము కల్గించేది శ్రీహరి సంకీర్తనమే. మరణ పరాభవానికి గురిఅయిన వారికి శేషశయనుని సేవయే విధి, అదే ఇహపర సాధనం. సంసార పీడితులకు హింసలేని మార్గం శ్రీ వేంకటేశ్వరుని ప్రశంసయే.

**హరేర్నామ హరేర్నామ హరేర్నామైవ కేవలమ్ ।**
**నాతః పరతలోపాయః సర్వ వేదేషు దృశ్యతే ॥**

హరినామాన్ని మించిన ఉపాయం సమస్త వేదాలలో కనిపించడం లేదన్న వచనం పై సంకీర్తనలో అన్నమయ్య కీర్తించినారు. భగవంతుని నామానికి అంతటి శక్తి ఉంది. ఎవరైతే తాను నమ్మిన భగవంతుని నామాన్ని త్రికరణశుద్ధిగా కీర్తనం, లేక జపం చేస్తారో వారు తప్పక భగవంతున్ని దర్శిస్తారు.

***

# అన్నమయ్య - పాదార్చన

**డా॥ రాజేంద్ర అనురాధ**
**తెలుగు అధ్యయన శాఖ**
**ఎస్.వి. యూనివర్శిటీ**
**తిరుపతి**

జ్ఞానమున్న ప్రతిజీవి మోక్షాన్ని పొందాలనే తపన పడతారు. ఆ మోక్షం కోసం తమవంతు ప్రయత్నం చేస్తారు. అదే మార్గంలో పయనించి తాళ్ళపాక అన్నమయ్య వేంకటేశ్వర స్వామిని తన సంకీర్తనామృతంతో మెప్పించి, మోక్షాన్ని పొందాలనుకొన్నాడు. అనేక వేంకటేశ్వరస్వామి దేవాలయాలున్నా, తిరుపతి తిరుమల వెంకన్నకు ఒక ప్రత్యేకత ఉంది. స్వామి అభయహస్తం అన్ని దేవాలయాల్లో మోక్షం ఎక్కడో ఉందని పైకి చూపిస్తే, తిరుమల వెంకన్న మాత్రం కలియుగంలో మోక్షం తన పాదాల చెంతనే ఉందనే విషయాన్ని స్వామి అభయహస్తం చెబుతుంది.

తల్లితండ్రులకు, గురువుకు, దైవానికే కాక, వృద్ధులకు, పూజ్యులకు శిరస్సు వంచి పాదాభివందనం చేయడం మన సంప్రదాయం. పాదాలను కడిగి ఆ నీటిని తలపై చల్లుకోవడం కూడా పెద్దల పట్ల గౌరవాన్ని, పూజ్యభావాన్ని తెలియ జేస్తుంది. పాదాలకు నమస్కరిస్తే ఎలాంటి వారికైనా అనిర్వచనీయమైన అనుభూతి కలిగి వారు మనసారా ఆశీర్వదిస్తారని పెద్దల అనుభవం. శత్రువైనా పాదాలను శరణు వేడితే మన్నించడం జరుగుతుంది. ఈ విషయాలను పసిగట్టిన అన్నమయ్య కైవల్యాన్ని పొందాలంటే స్వామి పాదాలే మోక్షసాధనాలుగా గుర్తించాడు. అన్నమయ్య వేంకటేశుని చరణదాసుడినని చెప్పుకొన్నాడు. రోజుకొక్క సంకీర్తన మనే పుష్పంతో మాలవేశాడు. శ్రీనివాసుని తప్ప ఇతరులను సేవించనని ఖచ్చితంగా పేర్కొన్నాడు. అన్నమయ్య తన జీవితాన్ని స్వామి సేవకే అంకితం చేశాడు. స్వామి పాదాలను వదలకుండా ఆయన కృపకటాక్షాలకు పాత్రుడైనాడు.

శ్రీనివాసుని పాదాల పవిత్రతను గూర్చి వివరించే కీర్తననుగమనించండి -

**"యీ పాదమే కదా యిలయెల్ల గొలచినది**
**యీ పాదమే కదా ఇందిరా హస్తముల కితవైనది"**

ఇందులో గజేంద్రుడు పిలిచినంతనే విష్ణువు అతన్ని కాపాడాడు. ఇంద్రుడు మొదలైన దేవతలు కొలిచేదీ, బ్రహ్మ కూడా పవిత్రంగా భావించి, కడిగి, కొలిచిన పాదాలు బ్రహ్మాండాన్నంతా ఆక్రమించి ఉన్నాయి. అహల్య శాపవిమోచనం కలిగించడమే

కాక, పవిత్రమైన గంగాదేవికి జన్మనిచ్చిన పాదాలు కొలిస్తే, ఇహపర సుఖాలను ఇవ్వడమే కాక, మోక్షాన్ని ప్రసాదిస్తుందని తెలుపబడింది. మరో కీర్తనలో -

దశావతారాల్లో ఒకటైన వామనావతారంలో విష్ణుమూర్తి మూడడుగుల నేల ఇమ్మని బలిచక్రవర్తిని అడుగుతాడు. వామనుడు "ఇంతింతై వటుడింతై..." అన్న చెందాన విశ్వరూపుడై భూమిని ఒక పాదంతో, ఆకాశాన్ని మరో పాదంతో కొలిచిన సమయంలో బ్రహ్మ లోకానికి వచ్చిన విష్ణు పాదాన్ని బ్రహ్మ పూజించిన విషయాన్ని అన్నమయ్య ప్రస్తావించాడు. చూడండి -

**"బ్రహ్మ గడిగిన పాదము**
**బ్రహ్మము దానె నీ పాదము"**

ఈ కీర్తనలో ఒక్కో యుగంలో దుష్టశిక్షణార్థం, శిష్టరక్షణార్థం విష్ణుమూర్తి ఒక్కో అవతారాన్ని ఎత్తాడు. వామనావతారంలో బలిచక్రవర్తిని మూడడుగుల నేల దానంగా కోరి, భూమిని, ఆకాశాన్ని ఒక్కో పాదంగా కొలిచి మూడో అడుగు బలి తలమీద మోపి, అతన్ని పాతాళానికి అణచి దుష్టశిక్షణ చేశాడు. రామావతారంలో స్వామి పాదధూళితో అహల్య శాపాన్ని బాపాడు, కృష్ణావతారంలో కాళింగుని తలపై నాట్యం చేశాడు. పాదసేవా భాగ్యంతోనే భక్తులకు ముక్తిని ప్రసాదించే స్వామిని గూర్చి వివరించబడింది.

వేంకటేశుని పాదాలు తప్ప ఇతర దేవతలను కొలవడం అనవసరమని తెలిపే కీర్తనను చూడండి -

**"నీ వొక్కడవే నాకు జాలు నీరజాక్ష నారాయణ**
**నీవే నాకు గతియని తెలిసితి నెక్కొని యితరము వృథా వృథా..."**

పై సంకీర్తనలో ఇతర దేవతలను కొలవడం కంటే స్వామి సేవా దురంధురులవడమే మేలని చెప్తూ, శ్రీనివాసుని నామాన్ని జపించడమే సర్వ దుఃఖ నివారణం. శుభకరం. పురాణ శరనానందం. అంతేగాక, స్వామి పాదాల చెంతనే సమస్త లోకాలున్నాయని, సఖల జీవరాసులు, సమస్త ప్రపంచం స్వామి పాదాల చెంతనే ఉందని, స్థితి లయకారకుడు వేంకటేశ్వరుడని తెలుపబడింది.

త్రిమూర్తులలో ఒకరైన విష్ణుమూర్తి పాదాలే అన్ని సౌభాగ్యాలకూ కారణమని చెప్తూ -

**"విష్ణుదేవు పాదాలే విద్యాబుద్ధీ మాకు**
**వైష్ణవుల మైతి మింక వదలవో కర్మమా"**

ఈ కీర్తనలో ఇహపర సుఖాలను ఇచ్చేదీ, కైవల్యాన్ని పొందే మార్గాన్ని చూపేదీ, భోగభాగ్యాలనిచ్చేదీ, ఆయుష్యుని ప్రసాదించేదీ ఆ దేవదేవుని పాదాలే. ఆ స్వామి పాదాలను నమ్మిన వారికి పాపాలు పటాపంచలై పోతాయి. వెంకటేశ్వరుని పాదాలను

శరణన్న వారికి జన్మతః వచ్చిన దుఃఖాలు సమసి పోతాయి. భవబంధాలు తొలగి పోయి పరలోక సుఖాలు పొందుతారని వివరించ బడింది.

ప్రతి జీవి సంసారమనే బంధానికి లోబడి ప్రవర్తిస్తుంది. అటువంటి భవబంధాలనే సముద్రాన్ని వేంకటేశుని పాదాలపై భక్తి అనే నావతోనే దాటాలని తెలిపే సంకీర్తనను గమనించండి -

**"నారాయణ నిను నమ్మిన నాకును**
**మేరతో నీ పాదమే గతి గలిగె"**

ఈ కీర్తనలో పాపాలనే బురద నుండి స్వామి పాదాలనే ఆకాశగంగతో పరిశుద్ధుడౌతాడు. సంసార కర్మమనే నిప్పును సాపాద్రవ్రతమనే వర్షం వల్ల ఆర్పాలని, అజ్ఞానమనే చీకటిని పారద్రోలేందుకు స్వామిపాద సూర్యోదయం కలుగుతుంది. చింత ఉనే సముద్రాన్ని దాటించే తెప్పగా, భవబంధాలను తెంచే గండ్రగొడ్డలిగా శ్రీనివాసుని పాదాలను శరణంటే ముక్తి కలుగుతుందని పేర్కొన బడింది.

ఈ విధంగా తాళ్ళపాక అన్నమయ్య స్వామి పాదాలను కొలిచి, శ్రీనివాసుని పాదాల చెంత స్థానాన్ని సంపాదించాడు.

***

# అన్నమయ్య సంకీర్తనలు - కుటుంబ సమస్యలు

**డా॥ ఎస్. కాంచనలత**
**సమాజశాస్త్ర అధ్యాపకులు**
**శ్రీ పద్మావతి డిగ్రీ & పి.జి. కళాశాల**
**తిరుపతి**

మానవుడు తన జీవితకాలంలో ఎలా ఉండాలో నిర్దేశించడం "అన్నమయ్య జీవిత తత్వం"లో ఒక భాగమవుతుంది. వాగ్గేయకారులలో దీర్ఘాయుష్మంతుడు, సంచారశీలి, పద్య పదకవితల్ని అభిమానించిన వారిలో అన్నమయ్యకు సాటి మరెవరూ లేరు. ప్రజల మధ్య తిరుగుతూ ప్రజలకోసం పదాలు పాడినవాడు. అతని రచనలలో రైతులు, వైద్యులు, వివిధ వస్తువులు అమ్మేవాళ్ళు, కమ్మరి, కుమ్మరి, చాకలి, గొల్ల, బొమ్మలాట లాడేవారు. ఇతర నిమ్నజాతులు కనిపిస్తారు. వారి వారి స్వభావాల గురించే కాకుండా వారి కుటుంబ జీవనం, కుటుంబ సమస్యలను కూడా తన భక్తితో అనుసంధానం చేసిన వాడు అన్నమయ్య.

సమాజంలో సమస్యలు మూడు రకాలు. వ్యక్తి సమస్యలు, కుటుంబ సమస్యలు, సాంఘిక సమస్యలు. వీనిలో కుటుంబ సమస్యలు అత్యంత ప్రధాన మైనవి. కుటుంబ సమస్యలను 3 రకాలుగా వర్గీకరించవచ్చు. 1) ఆర్థిక సమస్యలు 2) బంధువుల వలన తలెత్తే సమస్యలు 3) ఆలుమగలకు సంబంధించిన సమస్యలు.

ధనవంతులయినా, పేదవారయినా ఆర్థిక సమస్యలు ఉండనే ఉంటాయి. ఆ సమస్యల నెలా ఎదుర్కోవాలో, ఎలా ఉండాలో అన్నమయ్య -

**"అప్పులేని సంసారమైన పాటే చాలు**
**కంతలేని గుడి సొక్క గంపంతయిన చాలు**
**చింతలేని మంబలొక్కచేరడే మేలు"**

అని తృప్తిని చేరే మార్గం నిర్దేశించాడు.

దబ్బుంటే అన్ని సాధించే వాళ్ళం కదా అనే వ్యక్తుల్ని చూసి -

**"సిరుల కల్గిన ఫలము చింత పొరలనె కాని**
**పొంది సంతోష మించుకైన లేదు"**

అన్నాడు. అది ఈనాటి నాగరిక జీవితానికి కూడా అన్వయించే విషయం.

**వెతల పొరలె మన విభవము కంటే**
**అతి పేదరిక మీది "సుఖము"** అన్నదే అతని నిర్ణయం.

ఇక బంధుజనాదుల వల్ల కలిగే సమస్యలు. అన్నమయ్య ఈ విషయంలో కూడా ప్రజలకు హెచ్చరిక చేశాడు. కలిగిన నాడే చుట్టరికంబుల తిరుగులివి.

**పొట్ట పొరుగు చుట్టాలు భోజన సహాయాలే**
**"అంత హితులా తనకు నన్నలును తమ్ములును**
**వంతు వాసికి పెనగు వారేగాక"**

**ఆలుమగలకు సంబంధించిన సమస్యలు :**

అన్నమయ్య మగవాడయినా సంకీర్తనలలో చాలచోట్ల మగవారిపై కొన్ని విసురులు విసిరాడు.

**"నీవు మగవాడవు నీవెట్టుండినా చెల్లు**
**మగవాడెంత చక్కని మగువ కలిగినను"**

ఏవో కొన్ని పొరపొచ్చాల వల్ల సంసారంలో తుపాను గాలులు వీచవచ్చు. ఆ సందర్భంలో "పెద్దమనిషి"గా అన్నమయ్య హితబోధ చేసిన సందర్భాలెన్నో కనిపిస్తాయి.

**"పతితోడ సతికి పంతము లాడందగదు**
**మితిమీరి గర్వమున మించంగ దగదు**
**తతితోడం గాతరించి తప్పులు సేయం దగదు**
**చతురత సారె సారె సాధించతగదు"**

అని ఆడవారిని మందలిస్తూ –

**"వలచిన ఆడవారు వాదులాటకు వచ్చిన**
**చలము సాధించువాడు జాణలాడాదు"** అని

**"మగవాడిని యెరిగి మగువల నేలవలె"**

అని హితోక్తులు పలికాడు.

మానవుని సామాజిక జీవనంలో కుటుంబము అత్యంత ప్రధానమైన సంస్థ. కుటుంబ వాతావరణంలో సమస్యలు చోటుచేసుకోవడం వలన కుటుంబంలో వ్యక్తుల పరస్పర సంబంధాలు దెబ్బతింటాయి. కుటుంబ విచ్ఛిన్నతకు ఒక్కోసారి దారి తీయడం జరుగుతుంది. అన్నమయ్య కుటుంబ సమస్యలను ప్రజలు ఎలా సామరస్యంగా ఎదుర్కోవాలో సున్నితంగా తన కవిత్వంలో స్పృశించడ జరిగింది.

***

# అన్నమయ్య సంకీర్తనలలో సామాన్య మానవుడు

**డా|| సి. అరుణ కుమారి**
**ఆంత్రోపోలజీ అధ్యాపకులు**
**శ్రీ పద్మావతి డిగ్రీ & పి.జి. కళాశాల**
**తిరుపతి**

మానవుడు సంఘజీవి. సంఘమనే పెద్ద యంత్రంలో ప్రతి వ్యక్తి ఒక మరలాంటి వాడే. ఇటువంటి సంఘంలో ఒకడు సామాన్యుడు మరొకడు సామాన్యుడు కాదని విడదీయడానికి కొలబద్దలేవయినా ఉన్నాయా? అన్నది ఆలోచించవలసిన విషయం. ఒకప్పుడు అగ్రవర్ణేతరులు సామాన్యులనే ఆలోచన ఉండేది.

ఈ రోజుల్లో 'సామాన్యుని కోసం సాహిత్యం' అనే నినాదం వినబడుతుంది. సమాజంలో నలుగురి మధ్య పాడుతూ వారి అభిప్రాయాల్ని అందంగా స్పష్టంగా చెప్పే వ్యక్తి ఈ దృష్టితో పరిశీలిస్తే ముప్ఫయి రెండువేల కీర్తనలు వ్రాసిన అన్నమయ్య సామాన్యుడే. అన్నమయ్య తన సంకీర్తనల్లో సామాన్య మానవుని ఆలోచనా సరళిని ఎంతో చక్కగా వివరించాడు.

భారతదేశంలో నాటికీ నేటికీ మతం, భాష రెండూ శక్తివంతమయిన సాధనాలు. మతం గురించి అన్నమయ్య చేసిన వ్యాఖ్యలు కలవు.

**మతములు పెక్కు కర్మ భేదంబులగుచు (8-255)**

అన్నమయ్య వివిధ ప్రాంతాలు తిరుగుతూ కనబడిన ఆలయాలు చుదుతూ పాటలు పాడుతూ అన్ని మూర్తుల్ని శ్రీ వేంకటేశ్వరస్వామి ప్రతిరూపాలుగా భావించి, ఇదియే మన మతమనే భావన ప్రజల్లో కలిగించాడు.

కులాలు, జాతులు మానవులు కల్పించు కొన్నవే అనదాన్ని నిరూపించడాని కోసం అన్నట్టు కుల ప్రసక్తి ఉన్న కీర్తనలెన్నో వ్రాశాడు. వాస్తవానికి కులం మరులో ఉన్న పరబ్రహ్మాను కీర్తించాడు.

బాపడు : **ఎవ్వారు ఎరుగని ఎముకల గూటిలో**
**పవ్వళింపుచుమన్న బ్రాహ్మడు**
**ఎంత బాపనా సోదమింత కలదా**
**అనితయు నీ మహిమే హరిభట్లు... (4-90)**

రెడ్డి : **తిమ్మిరెడ్డి మాకు నిచ్చె దిష్టమైన పొలము**
**బొమ్మిరెడ్డి కప్పగించి పోదిసేసె పొలము (19-57)**

ఈ కులవ్యవస్థను కూకటి వేళ్ళతో పెకలించడాని కోసం అన్నమయ్య లౌకికోపమానాలు చెప్పాడు. వ్యక్తి అంతరాల్ని బయట పెట్టాడు.

**నీవు సర్వసముడవు**
**పువ్వులపై కాసీ పోరి ముండ్లపై కాసీని (2-129)**

ప్రకృతికి లేని అంతరం పామరుల కెందుకని ప్రశ్నించాడు. అలాగే వేదాలు చదివి ఒంట బట్టించుకోక హరిభక్తి ఆవంతలేని వానికంటె కులహీనుడయినా విష్ణు పాదాలు సేవించే భక్తుడు ఘనుడని ధైర్యం అన్నమయ్యకే చెల్లు.

కులం తరువాత సంఘంలో వృత్తికి ప్రాధాన్యం ఉంది. కొన్ని వృత్తులు శ్రేష్ఠమని, మరికొన్ని కావనే భావన ఆనాటికీ ఈనాటికీ ఉంది. ఈ వృత్తి ప్రాధాన్యాన్ని గుర్తించిన అన్నమయ్య ఏవీ తక్కువ కావని ఎన్నో వృత్తుల్ని సంకీర్తనలో ప్రస్తావించాడు. తాను రైతు కాదవం వల్ల దేశానికి, రైతన్న ముఖ్యుడు కావడం వల్ల హలిక వృత్తికి సంబంధించిన విషయాల్ని చెబుతూ ఆధ్యాత్మిక జిజ్ఞాస కలిగించాడు.

**కాపులము మేము కర్తవు నీవు**
**దాపు దండై మమ్ము నిట్టి దయచూడవయ్యా (9-198)**

రైతన్న తరువాత సమాజంలోని వ్యక్తులకు దగ్గరివాడు చేనేతగాడు. నాటికి నేటికి వీధుల్లో చీరలమ్మే వారిని చూస్తూనే ఉన్నాం. వారి వర్ణనలలో ఆధ్యాత్మికతను చెప్పడం అన్నమయ్య ఆశయం.

**వాడల వాడల వెంట వాడివో వాడివో**
**నీడ నుండి చీరలమ్మే నేత బేహారె... (5-178)**

పరమాత్మునికి రైతన్న వేషం, వర్తక వేషం ఈలోగా రకరకాల వేషాలు వేసి తమవాడన్న భావం కలిగించడం అన్నమయ్యకే సరిపోతుంది.

సంఘాన్ని సునితంగా పరిశీలించిన వాడే కవి, రాజకీయవేత్త, తత్త్వవేత్త. ఆ పరిశీలన వస్తువులదీ కావచ్చు, వ్యక్తులదీ కావచ్చు. వ్యక్తులలో రక్తసంబంధమూ ఉంది, కారణ బంధుత్వమూ ఉన్నది. కుటుంబం లోని వ్యక్తుల చిత్తప్రవృత్తుల్ని సంకీర్తనలలో కళ్ళకు కట్టాడు అన్నమయ్య.

**కలిగిన నాడే చుట్టరికంబుల తిరుగులని... (8-68)**

**పొట్ట పొరుగు చుట్టాలు భోజన సహాయులే... (2-306)**

ఉత్తమ సాహిత్యమన్నది సామాన్యుల ఆలోచనా సరళిని వ్యక్తం చేస్తూ ముందుకు నడిపిస్తుంది. సామాన్య భాషలో, సామాన్యుల కర్థమయ్యే విషయాలనే వ్యక్తం చేస్తూ జానపద గేయ ధోరణులతో రచన సాగించిన శ్రీ అన్నమయ్య సామాన్యులలో అసామాన్యులు.

***

# అన్నమయ్య సంకీర్తనల్లో జానపదుల పాటలు

**కుమారి కె.సి. లావణ్య**

**పరిశోధనా విద్యార్థి, తెలుగు అధ్యయన శాఖ**

**శ్రీ వేంకటేశ్వరా విశ్వవిద్యాలయం**

**తిరుపతి**

పదకవితా పితామహుడుగా ప్రఖ్యాతిగాంచిన ప్రథమ భక్తాగ్రేసరుడు అన్నమయ్య. అన్నమయ్య గొప్ప సంగీతకారుడు, కవి, భక్తుడు. కడప జిల్లా, రాజంపేట మండలంలో తాళ్ళపాక గ్రామంలో పుట్టాడు. ఈయనకి పదకవితా పితామహుడు, సంకీర్తనాచార్యుడు అనే బిరుదులున్నాయి. ఆంధ్రవాఙ్మయంలో వెలసిన వాగ్గేయకారులలో అగ్రగణ్యుడు అన్నమయ్య. తన సంగీత సాహిత్య కళలచే కొండలలో నెలకొన్న కోనేటిరాయన్ని కైవసం చేసుకున్న కళా తపస్వి.

అన్నమయ్య సంకీర్తనములు వేదాంత సంబంధాలు సంకీర్తనములు శృంగారము లయిననూ వాని యందు అంతర్వాహినిగా తొణికిసలాడుతుంది. ఈయన 3,200 ఆధ్యాత్మ శృంగార సంకీర్తనలతో వేంకటేశ్వరస్వామి కీర్తిని గానం చేసి తరించాడు. మానవాళికి తరుణోపాయం చూపించి అనంతర వాగ్గేయకారులకు మార్గదర్శకుడయ్యాడు. తెలుగు మాటల తియ్యదనాన్ని తేటదనాన్ని ఉట్టిపడేలా చేశాడు.

పలు రాయలసీమ ప్రాంతాలను దర్శించిన అన్నమయ్య తిరుమల వేంకటేశ్వరుని సన్నిధిలోనే భగవత్ కైంకర్యం చేస్తూ పదరచనతోనే జీవితాన్ని సాగించాడు. కాబట్టి

ఆయన భాష ప్రధానంగా రాయలసీమలో వాడుకలో ఉండి జీవిస్తున్న భాష అన్నమయ్య ప్రజల భాషలో సంకీర్తనలు రచించాడు. అందుకే ఆయన ప్రజాకవి అయ్యాడు. ప్రజలు నిత్యం పాడుకునే పాటల ధోరణిలో అంటే జానపద గేయ ధోరణిలో సంకీర్తనలు రచించడం వల్ల లోకంలో అవి బాగా ప్రచారాన్ని పొందాయి.

భారతీయ జీవన విధానాన్ని ప్రతిబింబింపజేసేవి గ్రామాలు. అట్టి గ్రామ ప్రజల సాంఘిక జీవనాన్ని అన్నమయ్య వాఙ్మయంలో కన్పిస్తుంది. జానపద జీవితంనందు అభినివేశము మికుటము. గ్రామీణ జీవితాన్ని కనులారా గాంచి అనుభవించిన అన్నమయ్య రాజాస్థానాలకే పరిమితమైన సాహిత్యాన్ని ప్రజా హృదయా స్థానాలకు తీసుకువెళ్ళాడు. తన సంకీర్తన రచనలన్నీ వేంకటేశ్వరుని ఉద్దేశించినవే అయినా సామాన్య ప్రజానికానికి స్పష్టంగా అర్థమయ్యే రీతిలో రచించాడు.

అన్నమయ్య సంకీర్తనల సమూహం ఫలించిన వృక్షం. ఈ వృక్షఫలాన్ని అందుకోగలిగిన సామర్థ్యం వున్నవారికి అనుభవించగలిగిన సమర్థత ఉన్నవారికి అవి తప్పకుండా అందుతాయి. జోలపాటలు, లాలిపాటలు, గొబ్బిపాటలు ఇంకా అన్నమయ్య కీర్తనలో మేలుకొలుపు పాటలు, నీరాజనాలు, శోభనాలు, పెళ్ళిపాటలు ఎన్నో వున్నాయి.

**జోలపాట :**

తెలుగుదేశంలో అందరి నాలుకల మీద నాట్యం చేస్తుంటుంది ఈ పాట. చాలా ప్రసిద్ధమైనది.

**"జోవచ్చుయతానంద జోజోముకుంద**
**రావె పరమానంద రామగోవింద"**

పై పాటలోని పల్లవిలో అచ్యుత, ఆనంద, ముకుంద, పరమానంద, రామ, గోవింద శబ్దాలు. అతడు అచ్యుతమైన ఆనందాన్నిచ్చే వాదని, పరమానంద స్వరూపుదని, మనోహరమైన వాడని, గోవిందుదని అతని తాత్త్విక భావన.

నందుడి ఇంటిలో చేరి చంద్రవదనలు సేవచేయగా వారిండ్లలో ముద్దు రంగడ్ని అన్నమయ్య మనస్సా దర్శించాడు. పాలవారాశిలో పవళించాదని, బాలుడిగా మునులకు అభయం ఇచ్చాడని, వసుదేవునికి ఉదయించాదని అన్నమయ్య బాలుడి లీలల్ని మధురంగా వర్ణించాయి.

**ఉయ్యాల పాట (లేదా) లాలిపాట :**

ఏడుకొండల వారి అశేష ఉత్సవాల్లో 'డోలోత్సవం' కూడా ఉంది. స్వామికి జరిగే బ్రహ్మోత్సవాల్లో ఊరేగింపుకు పూర్వమే డోలోత్సవం నిర్వహించడం ఒక ఆచారం. తమిళంలో దీన్ని 'ఊంజల్ సేవ'గా ప్రసిద్ధం. తిరుమలలో అద్దాలమేడలో డోలోత్సవం జరుగుతుంది. ఉయ్యాల పాటలనే లాలిపాటలుగా కూడా అన్నమయ్య కీర్తనలో కన్పిస్తుంది.

**"అలరజంచలమైన ఆత్మలందుడ నీ యలవాటుసేసెనీ ఉయ్యాల**
**పలుమారు నుచ్ఛ్వాసపవనమందుండ నీ భావంబు దెలిపెనీ వుయ్యాల"**

"అలరజంచలమైన నీ అలవాటు సేసెనీ ఉయ్యాల" ప్రయోగం ఆత్మ చాంచల్యాన్ని ఉయ్యాల అలవాటు చేసిందనీ, రెండవ చరణం వల్ల అది ఉచ్ఛ్వాస నిశ్వాసాలుగా ఉందనీ ప్రాణ చైతన్యాన్ని అన్నమయ్య ధ్వనింపచేశాడు.

**చందమామ పాట :**

పిల్లలు మారాం చేసినపుడు గోరుముద్దలు తినిపించేటపుడు తల్లులు పిల్లల నెత్తుకొని చందమామను చూపుతూ పిల్లలకు ఉల్లాసాన్ని కల్పిస్తూ పాట పాడతారు.

**"చందమామ రావో జాబిల్లి రావో మంచి**
**కుందనపు పైడి కోరవెన్న పాలుదేవో"**

పల్లెలో పాడుకునే చందమామ పాట అన్నమయ్య సొత్తే. పై కీర్తనలో అన్నమయ్య బాలకృష్ణుడికి చతుర్వింశతి షష్టిలో ఉపయోగించి అలాంటి వానికి "కుందనపు పైడికోరలో వెన్నపాలు తెమ్మని" చందమామను పిలుస్తాడు.

ఇందులో బాలకృష్ణుడిలో అందం, మహిమ, రక్షణ మొ॥న అంశాల్ని అన్నమయ్య చెప్పాడు. వేంకటనాధునికి అని అంటూ శ్రీకృష్ణుడిలో అభేదాన్ని పాటించాడు.

**పెండ్లిపాట :**

**"పిడికిటి తలంబ్రాల పెండ్లి కూతురు, కొంత**
**పెదమరలి నవ్వెనె పెండ్లి కూతురు"**

ఇందులో పెళ్ళి కూతురైన అలమేలుమంగ యొక్క అలంకారాల్ని, హావభావ విలాసాల్ని అన్నమయ్య అద్భుతంగా వర్ణించాడు. అలమేలుమంగ యొక్క అలంకారాన్ని, హావభావ విలాసాల్ని అన్నమయ్య అద్భుతంగా వర్ణించాడు.

**చాంగుభళా :** **"చక్కని తల్లికి చాంగుభళా, తన**
**చక్కెర మోవికి చాంగుభళా"**

రాజు నిద్ర, బంటు నిద్ర ఒకటే అని అన్నమయ్య అద్భుతంగా చెప్పాడు.

**గొబ్బి పాటలు :** మార్గశిర మాసంలో బాలికలు గుమ్మాల ముందు గౌరమ్మను పెట్టి దానిచుట్టూ చప్పట్లతో తిరుగుతూ పాడతారు.

"కొలనిదోపరికి గొబ్బిళ్ళో యదు
కులస్వామికిని గొబ్బిళ్ళు"

శ్రీకృష్ణునకు కొండల రాయనికి అభేదం పాటించబడింది.

***

# అన్నమయ్య సంకీర్తనలలో భక్తి

**శ్రీమతి యం. వెంకటలక్ష్మమ్మ**
**పరిశోధక విద్యార్థిని, తెలుగు విభాగము**
**శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం, తిరుపతి**

**"ఏ వేల్పు సర్వేశుఁడేవేల్పు పరమేశుఁ**
**డేవేల్పు భువనైక హితమనోభావకుఁడు**
**యేవేల్పు కడు సూక్ష్మమే వేల్పుకడు ఘనము**
**ఆ వేల్పు తిరువెంకటాద్రి విభుఁడు"**

అని తన్మయత్వంవీతో శ్రీ వేంకటేశ్వరుని కొనియాడిన పరమభక్త శిఖామణి తాళ్ళపాక అన్నమయ్య. ఆయన జీవిత కాలమున భారతీయ సాహిత్యాకాశమంతయు భక్తి గీతములతో మారుమ్రోగినది. ఆనాడు ఏ ప్రాంతమున పరికించినను ఆయా ప్రాంతీయ భాషలలో మధురాతి మధురములైన భక్తి గీతములను అసంఖ్యాకముగ రచించిన భక్త కవులెందరో దర్శనమిస్తారు. తనకు పూర్వమున్న పురాణ అనువాద పద్ధతికాని, కావ్యానువాద విధానమును కాని స్వీకరింపక సరిక్రొత్త రీతిలో సంకీర్తన సాహిత్యమును సృష్టించిన సౌమ్యశీలి అన్నమయ్య.

అన్నమయ్య కడప జిల్లా రాజంపేట తాలూకా తాళ్ళపాక గ్రామంలో జన్మించాడు. నారాయణమూర్తి లక్కమాంబ దంపతులకు 9-5-1408న జన్మించాడు. తెలుగులో మొట్టమొదటి వాగ్గేయకారుడైన అన్నమయ్య 16వ యేటనే వేంకటేశ్వరుని సాక్షాత్కారం పొందిన "పదకవితా పితామహుడు" మొత్తం 32 వేల సంకీర్తనలు రచించాడు.

అన్నమయ్య బాల్యము నుండియే భగవద్భక్తి పరాయణుడు. అన్నమయ్యకు పదునారవయేట నుండియే "ఆడిన మాటెల్ల నమృత కావ్యమును పాడిన పాటెల్ల పరమగామాయెను.

**"నామ సంకీర్తనం యన్య**
**సర్వపాప ప్రణాశనమ్"** అన్నారు.

నామసంకీర్తనల వల్ల సర్వపాపాలు తొలగి పోతాయని, అందుకే ఈయన భక్తి కవిత్వానికి పెద్ద పీట వేశారు. సంగీత సాహిత్యాల సమ్మేళనం పదకవిత్వం. సృష్టికి సహజ లక్షణం గానం. పదకవిత్వం సహజమైన గానం అని చెప్పవచ్చు. అందుకే అన్నమాచార్యుల వారు తాత్త్విక దృష్టితో, వైరాగ్య చింతనతో భగవంతుని దివ్యలీలను, మహిమలను, గుణాలను విపులంగా వర్ణించాడు. భగవంతునిలో లీనమై తానొక

బంటుగా, సఖుడుగా మారి ఆరాదించాడు. చెడు వాసనలను పోగొట్టి అజ్ఞానాన్ని తొలగించి, ధర్మాన్ని నిలబెట్టేది భక్తి ఒక్కటే అని ప్రభోదించాడు. అందుకే పోతన భాగవతమునందు ప్రస్తావించిన "నవవిధ భక్తులను" ఈయన కూడ రాసి తరించాడని చెప్పుకోవచ్చు. అందుకే నవవిధ భక్తులలో మొదటిది

**శ్రవణము :**

**"ఎంత పుణ్యమో యిటుమాకు గలిగె**
**చెంతనె నీ కృప సిద్దించ బోలు**
**శ్రీపతి మీకథ చెవులను వింటిమి**
**పాపము లణగెను భయముడిగే"**

అంటూ శ్రీపతి కథా శ్రవణము వలన పుణ్యము కలిగి, పాపము అంతరించి పోవునని చెప్పెను.

**2. కీర్తనము :**

**"వొక్క సంకీర్తనే చాలు వొద్దికై మమ్ము రక్షించగ**
**తక్కినవి భండరాన దాచివుండనీ"**

అంటూ భక్తులను రక్షించుటకు ఒక్క సంకీర్తనయే చాలని, భక్తుడు చేసిన పూజలను భగవంతుడు దాచుకోవలనని చెప్పడం జరిగింది.

**3. స్మరణము :**

**అందుకే నే జింతించెదను అచ్యుత ని శరణాగతుడ"**
**సందడి నాభవమింద వల్లనే సఫలం బాపనయ్యా"**

అని భగవంతున్ని స్మరణము చేసి చింతించుట వలన జన్మము సఫలమవుతుందని చెప్పాడు. ఇక నాలుగవది

**అర్చనము :**

**"నిన్ను పూజించే వారి నిజ పరమతత్వమవు**
**యిన్నిటా నీ దాసులకు నేతికేవు**
**యెన్నగ శ్రీ వెంకటేశ ఇహపరములకు**
**పన్ని కాచుకున్న వారి ఫలదాయకుండవు"**

అంటూ దాసులకు ప్రభువైన శ్రీ వేంకటేశ్వరుని పూజించుట వలన నిజ పరతత్త్వము భగవంతుడు ఫలమును చేకూర్చుతాడని చెప్పడం జరిగింది. ఇక

**వందనము :**

**"నమో నమో లక్ష్మీ నరసింహా**
**నమోనమో సుగ్రీవ నరసింహా"**

అంటూ భక్తుడైన అన్నమయ్య భగవంతునికి నిరంతరము వందనములు సమర్పించాలంటారు. ఇక -

**దాస్యము :**

**"ఇలని దాస్యం బిది యొకటే**
**సిలుగుల భవముల జిలుగు మాన్పగదె**
**చిత్తము తహదీర యెలమిని శ్రీ వేంకటేశ్వరనీవిదె**
**తలపున బాయక దక్కితివయ్యా"**

అంటూ భక్తుడు భగవంతునికి ఎప్పుడు దాస్యము చేయాలని అలాచేసి నట్లైతే భగవంతుడై భక్తునికి దాసుడవుతాడట. ఇక -

**సఖ్యము :**

**"పాండవ రక్షణ పరుడై నరునకు**
**నీండనే తెలిపె మహామహిమ**
**దండి విడిచి తన దయతో నర్జును**
**దుండగ మగటిమి వొద బడ బలికె"**

ఇందు నరునకు, శ్రీకృష్ణుడు గీతోపదేశము చేశాడు. నరనారాయణులు జన్మ మిత్రులు. అర్జునుడు అధైర్యముతో నుండగ శ్రీకృష్ణుడు కులధర్మములను, పుణ్యము లను ఉపదేశించెను.. కావున సఖ్యము అనునది చాల ముఖ్యము అని చెప్పాడు. ఇక చివరది -

**ఆత్మనివేదనము :**

**"సర్వసాక్షిని నీవు సర్వాంత రంగుడవు**
**సర్వం సర్వం సహచక్రవర్తి**
**నిర్వాణమూర్తి నిగమాంత కీర్తి**
**సర్వాపరాధములు క్షమియింపవే...."**

అంటూ భగవంతున్ని నిరంతరం ఆత్మలో నివేదించుకోవలనని చెప్పాడు.

హరిపూజ, హరిసేవ, హరి కీర్తనము, హరి మననము, హరి దాస్యము, హరి ధ్యానము మనస్సులను నిరంతరం సకల భోగభాగ్యములను దయచేయునని చెప్పాడు. అదేవిధముగ కృతయుగమున ధ్యానమునకు, త్రేతాయుగమున క్రతువునకు, ద్వాపరయుగమున అర్చనలకు ప్రాముఖ్యం ఇవ్వాలని చెప్పడం.

***

# తాళ్ళపాక అన్నమాచార్యుల ఉత్సవ సంకీర్తనలు

**సి. దుర్గ**
**పరిశోధక విద్యార్థిని**
**తెలుగు అధ్యయన శాఖ**
**శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం, తిరుపతి**

దేవదేవుడు, అఖిలాండకోటి బ్రహ్మాండనాయకుడైన శ్రీమన్నారాయణుడు పర, వ్యూహ, విభవ, అంతర్యామి, అర్చావతారం అనే పంచస్వరూపాలలో అర్చావతారస్వరూపానికి ఆలంబనగా దివ్యక్షేత్రమైన తిరుమలలో శ్రీమద్వేంకటేశ్వర స్వామిగా వెలిశాడు.

**సర్వపాపాని 'వేం' ప్రాహుః కటస్తద్దాహ ఉచ్యతే ।**
**సర్వపాపహరిత్వాత్ వేంకటాద్రిరితిస్మృతః ॥**

'వేం' అంటే పాపాలు, 'కట' అంటే పాపాలను దహించేది అని అర్థం. వేంకటాద్రి సమస్త జీవుల పాపాలను దహించే పుణ్యక్షేత్రం. అందుకే నమ్మాళ్వారు తన 'తిరువాయి మొళి'లో వేంకటాద్రిని వేం కడజ్గల్ అని కీర్తించాడు. వకారం అమృతబీజం 'కట' శబ్దం ఐశ్వర్యబోధకం. అమృతత్వము, ఐశ్వర్యము శ్రీనివాసుని కటాక్షంవల్ల లభిస్తున్నాయి. ఇంతటి పవిత్రమైన వేంకటాద్రిపై వెలసిన శ్రీనివాసునికి నిరంతరం ఉత్సవాలు జరుగుతూనే ఉంటాయి. ఆ ఉత్సవాలను ప్రత్యక్షంగా దర్శించి పరవశత్వంతో పదాలు పాడిన వాగ్గేయకారుడు తాళ్ళపాక అన్నమయ్య.

క్రీ.శ. 9వ శతాబ్ది నుండే స్వామివారికి నిత్యోత్సవ, వారోత్సవ, పక్షోత్సవ, మాసోత్సవ, సంవత్సరోత్సవాలు జరుగుతున్నట్లు శాసనాల ద్వారా తెలుస్తున్నది. క్రీ.శ. 830లో పల్లవ కోవిజయదంతి విక్రమవర్మ, పదవ శతాబ్దంలో పల్లవరాణి సామవైలు తిరుమల మూలమూర్తికి ఉత్సవమూర్తులను ఏర్పాటు చేయడంతో ఆ ఉత్సవ మూర్తులను ఊరేగించుటకు ఉత్సవాలు ఏర్పాటు గావించబడినవి.

ఈ ఉత్సవాలను గూర్చి అన్నమయ్య "నానా దిక్కుల నరులెల్ల వానలలోననె వత్తురు గదలి" అన్న కీర్తనలో తెలియజేసి ఉన్నారు. తిరుమలలో స్వామివారి నిత్యార్చనా విధానము వైఖనసాగమము ననుసరించి జరుగుతుంది. స్వామివారి నిత్యార్చన ప్రత్యూషకాలమున సుప్రభాతముతో మొదలవుతుంది. ఆపై విశ్వరూపదర్శనము, తోమాలసేవ, కొలువు, సహస్రనామార్చన, నైవేద్యము (మొదటిగంట), అపరాహ్నపూజ, సంగ్రహార్చన, నైవేద్యము (రెండవగంట), ఆర్జితోత్సవాలు, సాయాహ్నపూజ,

ఏకాంతసేవలు వరుసగా జరుగుతాయి. ఇలా జరుగడానికి ఆధారం వైఖానస ఆగమంలోని మంత్రాసన, స్నానాసన, అలంకారాసన, భోజ్యాసన, యాత్రాసన, శయనాసన అనే షడాసనపూజావిధానం ఆధారం.

సుప్రభాత సేవను తెలిపే తాళ్ళపాక వారి కీర్తనలు చాలా ఉన్నాయి.

**"వారిధిశయన వోవటపత్ర పరియంక**
**గారవాన మేలుకొని కన్నులు దెరవవే"**

వటపత్రంపై పడుకొన్న క్షీరసాగరశయనున్ని మేలుకొని వాకిలి తెరువమని ఈ కీర్తనలో గానం చేశారు.

సుప్రభాత సేవ తరువాత జరిగే షోడశోపచారములను అన్నమయ్య క్రింది కీర్తనలో వర్ణించారు.

**"షోడశకళానిధికి షోడశోపచారములు**
**జాడతోడ నిచ్చలును సమర్పయామి"**

ఈ కీర్తనలో ఆవాహన, ఆసన, అర్ఘ్య, పాద్య, మజ్జన, వస్త్రభూషణ, గంధ, పుష్ప, ధూప, నైవేద్యములతోపాటు కప్పురపు విడెమును కూడా అందించినట్లు వర్ణించబడినది.

తిరుమలలో జరుగు వారోత్సవాలలో శుక్రవారం జరిగే అభిషేకం ప్రసిద్ధమైనది. దానిని గూర్చి అన్నమయ్య వర్ణించిన కీర్తన చూడండి.

**"కంటి శుక్రవారము గడియలేడింట**
**అంటి అలమేల్మంగ అండనుండే స్వామిని"**

స్వామివారికి జరిగే కళ్యాణోత్సవాన్ని అన్నమయ్య కళ్ళకు కట్టేటట్లు వర్ణించారు.

**"కందర్పజనకునికిఁగమలాదేవికిఁబెండ్లి**
**పందిలి లోపలందలఁబ్రాలు నేఁడు"**

అంటూ స్వామివారి పెండ్లికి అందరినీ ఆహ్వానించడం "పసిడి అక్షంతలివె పట్టరొ వేగవేరారో" అని మొదలయ్యే కీర్తనలోను, ఆ ఆహ్వానాన్ని అందుకొని దేవతలెల్లరు విచ్చేసిన వైనాన్ని

**"గరుడధ్వజంబెక్కె కమలాక్షి పెండ్లికి**
**పరుషలదివో వచ్చె పైపై సేవించను"**
**వేడుకలు మీఱగ శ్రీవిభుని పెండ్లికిని"**

అనే కీర్తనలో వర్ణించారు. శ్రీవారి పవళింపుసేవను వర్ణిస్తూ అన్నమయ్య వ్రాసిన ప్రసిద్ధమైన పాటను తెలుగు తల్లులు వారి పిల్లలకు పాడి నిద్రపుచ్చడం మనం గమనించవచ్చు. ఆ కీర్తన

**జోఅచ్చుతానంద జోజోముకుంద**

**'లాలి పరమానంద రామగోవింద జోజో** అని ప్రారంభమౌతుంది. అంతేకాక

**ఉయ్యాల బాలునూచెదరు కదు**

**నొయ్య నొయ్య నొయ్యనుచు అనే కీర్తన** "నాటకపు నిన్ను జూచి నవ్వు వచ్చీని, యేటికి వచ్చితి నేను యేమి సేసేపు" అనే కీర్తనలు కూడా స్వామివారి పవళింపు సేవను వర్ణించేవే...

స్వామివారికి అన్నిటికంటే మకుటాయమానమైన ఉత్సవాలు బ్రహ్మోత్సవాలు స్వామివారి ఉత్సవమూర్తియైన మలయప్పస్వామి ఉదయము, రాత్రి వివిధ వాహనాలపై తిరుమల నాలుగు మాఢ వీధుల్లో ఊరేగి భక్తులకు దర్శనమిస్తాడు. ఈ ఉత్సవాలకు రాజులు, మండలేశ్వరులు, ప్రజలు సతీసుతపరివారంగా శతసహస్రయోజనవాసులు ముడుపులతో, మూటలతో వేంకటపతిని దర్శింపగ నానాదిక్కులనుండి వానలను కూడా లెక్క చేయక సువ్రతులై వస్తారని అన్నమయ్య పేర్కొన్నారు. ఈ ఉత్సవాలు జరిగే క్రమాన్ని అన్నమయ్య ఇలా వర్ణించాడు.

**"తిరువీధుల మెఱసీనిదేవదేవుడు**
**గరిమల మించిన సింగారములతోడను"**

అంటూ స్వామి ఐదవనాడు గరుడుని మీద, ఆరవనాడు ఏనుగుమీద, ఏడవనాడు సూర్యప్రభపై, ఎనిమిదోనాడు రథము, గుఱ్ఱములపై తొమ్మిదోనాడు బంగారుపల్లకి, పదోనాడు కళ్యాణపు పీటలపై అధిరోహించి భక్తులను అనుగ్రహిస్తాడని అన్నమయ్య పేర్కొన్నాడు. ఈ ఉత్సవాలను సామూహికంగానే కాకుండా కొన్నింటిని ప్రత్యేకంగా కూడా వర్ణించాడు.

**"ఇటు గరుడుని నీవెక్కినను**
**పటబటదిక్కులు ఒగ్గన పగిలె"** అనే కీర్తనలోను

**"ఎక్కడ నీ వుద్యోగ మెటు విచ్చేసేవయ్యా**
**ఇక్కువ నీ మహిమకు నెవ్వరెదురయ్య"**

అనే కీర్తనలోను గరుడోత్సవాన్ని అన్నమయ్య నయనానందకరంగా వర్ణించారు. బ్రహ్మోత్సవాలలో మరో ప్రత్యేకోత్సవం రథోత్సవం. దానిని వర్ణిస్తూ అన్నమయ్య

**"దేవదేవుడెక్కెనదె దివ్యరథము**
**మావంటివారికెల్ల మనోరథము"** అన్నారు.

స్వామివారు మాఢవీధుల్లో ఊరేగేటప్పుడు ఇచ్చే హారతులను గూర్చి

**"ఎత్తరే హారతులు యియ్యరే కానుకలు**
**యిత్తలనేగివచ్చీని యిందిరానాథుడు"** అనే కీర్తనలో వర్ణించాడు.

ఈ విధంగా అన్నమాచార్యులవారు ప్రతి ఉత్సవాన్ని ప్రత్యేక కీర్తనలో శ్రవణసుభగంగా గానం చేశారు. నాటికీ నేటికి ఉత్సవాల్లో కొన్ని కొన్ని

మార్పులున్నాయనడానికి తాళ్ళపాక వారి కీర్తనలే తార్కాణం. అన్నమయ్య ఉత్సవకీర్తనలు భక్తిప్రపత్తులకేకాక చరిత్రకు కూడా ఆలంబనగా నిలుస్తున్నవి.

***

# తాళ్లపాక పదకవుల మంగళాత్మక సంకీర్తనలు

**డా॥ వి. స్వర్ణలత యాదవ్**
**శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం, తిరుపతి**

శుభప్రదమయిన, శ్రవణానందకరమయిన మానసికోల్లాసాన్ని కలిగించే శబ్దాలలో 'మంగళ శబ్దమొకటి'. సంస్కృత భాషలో మలోళశబ్దజాలం చాలా కనిపిస్తాయి. మంగళ, సర్వమంగళ అంటే పార్వతి. మంగళవారమంటే అంగారకవాకం. రాగాలలో 'మంగళకైశికి', ఛందోరీతులలో మంగళమహాశ్రీ వృత్తం. అష్టకాలలో 'మంగళాష్టకం'. వివాహ మంత్రాలలో 'మాంగళ్యం తంతునా దేనా' ఒకటి. తెరపట్టేవేళ చదివే శ్లోకాలన్నీ తరువాత 'ధ్రువం మంగళమ్'తో పూర్తవుతాయి వ్రతాలలో మంగళగౌరి వ్రతం.

భారతీయులు ఎపుడూ శుభాన్ని కోరుతారు. అందుకే మంగాళాదీవి, మంగళమధ్వని, మంగళాంతేని అని నియమాలు విధించారు. ఈ కారణం వల్లనే విషాదాంత రూపకాలను ప్రోత్సహించలేదు. ఇక జానపదగేయ వరుసలలో తుమ్మెద, చిలుక, మనసా, ఏలలున్నట్లే మంగళగేయాలున్నాయి. ఈ గేయాలు శైవంలోనూ సమానమే. అయితే వైష్ణవంలో 'మంగళశాసనమ్' ఒక పవిత్ర పరిభాష. అర్చావతారమూర్తిని ఆళ్వారులు కీర్తించడం "మంగళాశాసనమ్".

మంగళాశాసనమ్ చేసేవారు ఎవరయినా కావచ్చు. రామాయణంలో కౌసల్య అడవికి వెళ్ళే శ్రీరామునికి మంగళశాసనం చేసింది. ముత్తయిదువులు పాటల రూపేణ మంగళం ఆశిస్తారు. అలాగే తాళ్లపాక పదకవులు భక్త్యాత్మకంగా పాడారు. వారిలో అన్నమయ్య చెప్పుల కాళ్ళతో మోకాలిమిట్ట ఎక్కుతూ సొమ్మశిల్లాడు. ఆకలి, అలసట, ఆర్తి అన్నీ జతగూడాయి. అలమేలు మంగమ్మ అన్నమయ్యను చేరదీసింది. ప్రసాదం ఇచ్చి ఆకలి తీర్చింది. అనునయ వాక్యాలతో ఆర్తిని బాసింది. చెప్పుల కాళ్ళతో ఎక్కవద్దని బోధ చేసింది. ఆ సమయంలో అన్నమయ్య వేంకటేశ్వర మకుటంతో ఒక శతకం చెప్పాడు. వాటిలో ఒకటి 'మంగళ పద్యం'.

"మంగళమమ్మకున్ సకల
మంగళ మంజునేత్రికన్ జయా
మంగళ మిందిరా సతికి
మంగళమీ యలమేలుమంగకున్
మంగళమంచునే మఱియు
మంగళ మందును దేవలోకది
వ్యాంగన పెల్ల న సతికి
నారతి లిత్తురు వేంకటేశ్వరా"

అలాగే కీర్తనలలోనూ మంగళాత్మకాలు కనిపిస్తాయి.

"చిత్తజగరుడు నీకు శ్రీమంగళం నా
చిత్తములో హరి నీకు శ్రీమంగళం నా
బంగారు బొమ్మవంటి పడతి నూరము మీద
సింగారించిన నీకు శ్రీమంగళం"

ఈ కీర్తనలో అమ్మవారికే ప్రాధాన్యం.

"మంగళము గోవిందునకు జయమంగళము గరుడధ్వజునకును
మంగళము సర్వాత్మనకు ధర్మస్వరూపునకూ జయజయ
ఆదికిని నాదైన కచ్యుతున కంభోజ నాభున
కది కూర్మంబైన జగదాధరమూర్తికిని
హరికిఁ బరమేశ్వరునకు శ్రీధరునకునుఁ నాలాంతకునకును పరమ
పరుషోత్తమునకును బహుబంధదూరునకు సురముని స్తోత్తునకు
దేవాసురగణశ్రేష్ఠునకు కరుణా కరునకుఁ కాత్యాయనీ మత కలితనామునకు
పంకజాసన వరదునకు భవపంకవిచ్ఛేదునకు భవునకు
శంకరున కవ్యక్తునకు నాశ్చర్య రూపనకు"

పై పాటలో 32 షష్ఠ్యంత శబ్దాలున్నాయి. అన్నమయ్య నరసింహ ఉపాసకుడు. నారసింహమంత్రం 32 అక్షరాలు. అన్నమయ్య రచించిన కీర్తనలు 32 వేలు.

ఈ కీర్తనలో అన్నమయ్య 'శంతరునకు' అని చెప్పడం. శివకేశవాభేదాన్ని విశదం చేస్తుంది.

ఈ కీర్తన లలితం. అందుకే లలితరాగంలో పాడబడింది. అన్నిటికన్నా నేడు బాగా ప్రచారం పొందిన పాట.

"జయమంగళము నీకు సర్వేశ్వరా
జయమంగళము నీకు జలజవాసినికి".

***

# అన్నమయ్య సంకీర్తనలలో దశావతారాల వర్ణన

**యం. మల్లమ్మ**
**పరిశోధక విద్యార్థిని**
**తెలుగు అధ్యయన శాఖ**
**శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం, తిరుపతి**

తేట తెలుగు మాటల కూర్పుతో పండిత పామర జనరంజికంగా సాహిత్యాన్ని తీర్చిదిద్దటానికి ప్రయత్నించిన దిట్ట. ఈయన వేంకటేశ్వర భక్తుడై వీనులవిందు గొలిపే మధుర గీతాలతో విష్ణుభక్తి తత్త్వాన్ని విశ్వవ్యాప్తం చేయడంలో పరిశ్రమించిన పదకవితా పితామహుడు, అన్నమయ్య.

దశావతారాలకు సంబంధించి అన్నమయ్య సంకీర్తనల్లో ఉన్న ఒక శ్లోకం చూద్దాం.

**"మత్స్యః కూర్మోవరాహశ్చ**
**నార సింహశ్చ వామనః**
**రామోరామశ్చ రామశ్చ**
**బద్ధః కల్కి రేవ చ"**

పై శ్లోకంలో కృష్ణావతారం ప్రసక్తిలేదు. బలరామ ప్రసక్తి వుంది. కృష్ణుడు పరబ్రహ్మ స్వరూపమనే దివ్యజ్ఞానం కలిగి ఉన్నాడని ఆయనను అవతార పురుషునిగా గాక సాక్షాత్తు మహావిష్ణువుగా సమర్థించడం సమంజసంగా ఉంటుందని అభిప్రాయం కాబట్టి కృష్ణావతారాన్ని దశావతారాల్లో చేర్చకపోయి వుండవచ్చు. శ్రీకృష్ణుని బదులుగా బలరాముని చేర్చి వుండవచ్చు.

అన్నమయ్య ఆధ్యాత్మిక సంకీర్తన ఒకటి పరిశీలించడం జరిగింది.

**"ఇందరికి నభయంబులిచ్చు జేయు**
**కందువగు మంచి బంగారము చేయు**
**వెలలేని వేదములు వెదకి తెచ్చిన చేయు**
**చిలుకు గుబ్బం కింద జేర్చు"**

ఈ విధంగా మహిమలతో కూడిన వర్ణనతో దశావతారాలను ప్రస్తావిస్తూ అన్నమయ్య మత్స్యావతారుని మహాత్మ్యాన్ని తన పాటలో ఒక మాటలో చెప్పడానికి వీలుపడక పదపితామహుడు అల్ప వాక్యాలతో అనల్పార్థాన్ని ఆవిష్కరిస్తూ అద్భుతంగా ప్రస్తావించాడు.

అదే తీరులో మరో ప్రస్థావన.

**కూర్మావతారం :** దశావతారాల్లో కూర్మావతారం రెండవది విష్ణువు దేవహితార్థమే అవతారం ధరించాడు.

అవతార సమయంలో సురాసురులందరికి కూడా సమాదరణీయు డయ్యాడు. అన్నమయ్య పలు కీర్తనల్లో వరాహ ప్రశంస చేసి యున్నాడు. వరాహావతార ప్రయోజనాలైన హిరణ్యాక్ష వధ, మహీతల పునస్థాపనం సంగ్రహంగా వెల్లడిస్తూ రచించిన ఈ కీర్తనాంశం మధురభావ భరితం.

**"చలమున హిరణ్యాజక్కాది యుటు భూ**
**వలయము నిలిపిన వరాహమా (84)**

అనేకచోట్ల పలు పుణ్యక్షేత్రాలను సందర్శిస్తూ అహోబిల క్షేత్రంను సందర్శించుట జరిగింది. నరసింహుని వినుతిస్తూ అసంఖ్యాకంగా కీర్తనలు రచించి ఉండడం సహజమే నరసింహావిర్భావ హిరణ్యకశిప వదలను అద్భుతంగా చిత్రించడమే కాక నరసింహావతార సమయాన్ని కూడా చక్కగా చిత్రిస్తూ రచించాడని తెలుస్తున్నది. ఇందులకు -

**"శరణని బదకు జమలాల**
**గరిమ మెరసె నిదె కనక సింహము"** ఇక

**వామనావతారం :** వామనుడు కూడా అన్నమయ్య ప్రీతికి స్తుతికి పాత్రుడైన వాడేనని అన్నివిధాలా అతని కంటె ఉన్నతుడే కావలసి వచ్చింది. కాబట్టి వామనుడు త్రివిక్రమాకృతి దరించాడేమో.

**"అరుదుగ బలిమదమడంపంగ నాక సమంటిన రూపము**
**సరుగన భూమంతయు నొక చరణంబున గొలచి" (107)**

ఇదే తీరులో పరశురాముని అవతారగాథను ప్రత్యేకించి కీర్తించిన దశావతారాలను పేర్కొనేటప్పుడు ప్రస్తావన మాత్రంగానే కీర్తించినట్లు తెలుస్తుంది.

**"బలువీరులలో వెదకి చూచితే పరుశురాముండొకండైనాండు**
**బలసి మునుల యాపదలు వాపుటకు**
**బల నృపభంజసుపరిణతలే" (112)**

అని కీర్తించడం జరిగింది.

పదకవితా పితామహుడు సంకీర్తనల్లో రామావతార కథనంతో సంక్షిప్తంగా నిక్షిప్తం చేయబడిన అనేకములున్నాయి. ఏ ఒకటి రెండు సంఘటనల్లో మినహా అన్ని ఘట్టాలు ఆ కీర్తనలో పొందుపరచబడి ఉన్నాయి. పరశురామ గర్వభంగం, శూర్పణఖ అవయవ చేదనం మినహా రామాయణ ప్రధాన సంఘటలన్నీ ఒకే కీర్తనలో పొందుపరచి ఉండటం గమనించవచ్చు.

అదే విధంగా -

**"చెప్పితే నాశ్చర్యము చేసిన చేఁతలితఁడు**
**మిప్పిరి మనుజవేషమున బుట్టె నీతఁడు" (124)**

అదే విధంగా రామాయణ మంత ఒక్క కీర్తనలో ఇమిడ్చడం ఒక ప్రత్యేకత.

**కృష్ణావతారం :** శ్రీకృష్ణుడు శృంగార రసాది దేవత. దక్షిణ నాయకుడుగా తన జ్ఞాన మహిమలను ప్రదర్శించి సాక్షాత్తు మహావిష్ణువు అనిపించుకొన్నాడు.

పై అంశాల వల్ల కృష్ణునికి తక్కిన అవతారాల కన్నా ఒక ప్రత్యేకత వుంది. అందుకే ఈ కృష్ణావతార కథ. అన్నమయ్యను విశేషించి ఆకర్షించినట్లుంది. తర్వాత అవతారం బుద్ధావతారాన్ని బుద్ధిపూర్వకంగా నోరార కీర్తించాడు. ఇతి వృత్తాన్నంత చెప్పకపోయినా చిన్న కథాంశాన్నే అనేక చోట్ల అన్నమయ్య వెల్లడించడం జరిగింది. దశవతారాలను వరుసగా కీర్తించినప్పుడల్లా బుద్ధావతారాన్ని విధిగా ప్రస్తావించాడు.

ఈయన బుద్ధావతార ప్రశంసలో ఎంచుకొన్న అంశమే అధికంగా చోటు చేసుకొని ఉండటం గమనార్హం.

**"వారి తిరుగనట్టి దైత్యవరుల మోహవతుల నెల్ల**
**మూల మూల దోసి ముసుఁగుపాలు సేసే నాతఁడు**
**వేల సంఖ్యలైన సతుల వేడుకలరఁజేసి యొంటి**
**యాలి మగసిరీతిఁగూడి యనుభవించే నాతఁడు" (146)**

**చివరిగా కల్కి అవతారం :**

దశావతారాల్లో బుద్ధావతారాల వరకు జరిగినవి గాను కల్కి అవతారం జరుగనున్నది గాను భావించబడుతు వుంది. అవతార కథ విపులంగా గాక సంగ్రహంగా మాత్రమే ప్రభావంలో వుంది.

కలియుగాంతంలో ధర్మం అంతరిస్తుంది. అధర్మం అధికమవుతుంది. కల్కి ప్రభావం వల్ల ప్రజల చిత్తవృత్తుల్లోనూ ఆచార వ్యవహారాల్లోనూ విపరీతమైన మార్పు కనిపిస్తుంది.

అన్నమయ్య మహావిష్ణుని దశావతారాలను అనేకచోట్ల కీర్తించి ఉన్నాడు. ఆ సందర్భంగా కల్కి అవతారాన్ని కూడా అనేకసార్లు స్పృశించాడు.

**"మించిన కాలము కడపట వెదకిన మీదట కల్కి**
**అవతారము తురగంబుఁబరటిడి దొడ్డచేయి"**

కీర్తనలో ప్రస్తావించడం జరిగింది. కలియుగ శ్రీ వేంకటేశ్వరుడు ఆయా కాలాల్లో ఆయా అవతారాలు ఎత్తి దుష్టశిక్షణ శిష్టరక్షణ గావించునని మన పురాణాలు తెలియచేస్తున్నాయి.

***

# వాగ్గేయకారుల్లో అన్నమయ్య స్థానం

**డా॥ సంగుల సునీల్ కుమార్**
**పోస్ట్‌డాక్టరల్ ఫెలో**
**తెలుగు అధ్యయన శాఖ**
**శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం, తిరుపతి**

ఆంధ్రదేశంలో ఈనాడు ఆబాలగోపాలాన్నీ మధుర సంకీర్తనా శీకరాలతో పరవశుల్ని చేస్తున్న మహనీయుడు అన్నమాచార్యులు. శ్రీ వేంకటేశ్వర పద పద్మారాధన కోసం సంకీర్తనామార్గాన్ని ఎన్నుకొన్న ఆ మహనీయుని గూర్చి ఆంధ్ర లోకానికున్న పరిచయం పాతికేళ్ళ క్రితం వరకు తక్కువే. తిరుమల తిరుపతి దేవస్థానం వారి నిరంతర, నిర్విరామ కృషి ఫలితంగా ఏర్పడ్డ అన్నమాచార్య ప్రాజెక్టు ద్వారా ఇప్పుడిప్పుడు ఆయనను గూర్చి లోకం తెలుసుకుంటూ ఉంది. మొదట్లో ఆయన ఒక సంకీర్తనాకారుడుగా పరిచయం చేయబడినా, ఆయన కవితామూర్తి, స్ఫూర్తి, భావజాల దీప్తి క్రమక్రమంగా వెలుగులోకి వచ్చాయి. వ్యక్తి నిష్ఠమైన మధుర భక్తిభావాలే కాదు, ఆ నేపథ్యంలో ఉన్న సామాజిక స్పృహ ప్రతీయమానమయింది. ఆయనపై జరిగిన పరిశోధన మరే కవిపై జరగలేదు అన్నంతవరకు వెళ్ళింది.

ఏ దృశ్యం చూసినా స్పందించటం కవి లక్షణం. సమాజ శ్రేయస్సును అన్ని కోణాల్లోంచి దర్శించి సమగ్రదృష్టితో సమస్యా పరిష్కారాన్ని సూచించే తపన పడడం మహాకవుల లక్షణం. మహాభారతం చివర అంటాడు వ్యాసుడు :

**"ఊర్ధ్వబాహుర్విరౌమ్యేష నచకశ్చిచ్ఛృణోతిమాం**
**ధర్మాదర్థశ్చ కామశ్చ స కిమర్థం న సేవ్యతే"**

ఈ మాటలవల్ల వ్యాస భగవానునికి గల ఆర్తి, సర్వమానవకోటి పట్ల ఆయనకుండే వాత్సల్యం ప్రతీయమానం అవుతుంది. అందుకే 'నా నృషిః కురుతే కావ్యం' అన్నారు.

ప్రాయశః ఆంధ్ర సాహిత్యం మతం తదంగమైన భక్తి తత్త్వాలలో ముడిపడి ప్రారంభమయింది. ఆ మాటకొస్తే ఏ సాహిత్యమైనా అంతే. మానవ జీవిత పరమార్థానికి సాధనం భక్తి. సమాజంలో అన్నివర్గాల వారిని చేతనపరుస్తూ నిత్యనూతనం చేసేది భక్తి. 'మానవులందరినీ ఏకం చేసే ఏకైక బంధం భక్తి' అని అన్నమయ్య చాటిచెప్పాడు. ఆంధ్ర సాహిత్యం ప్రారంభంలో శైవానికి ప్రాధాన్యత ఇచ్చినా, 14వ శతాబ్దం నాటికి వైష్ణవం వైపు మరలింది. వైష్ణవానికి విశిష్టత నాపాదించిన మహనీయుడు రామానుజుడు. ఆయనననుసరించి వైష్ణవాన్ని త్రికరణశుద్ధిగా భావిస్తూ భక్తితో సమాజ

సంస్కరణ భావాలను వెదజల్లిన మానవతావాది అన్నమయ్య. పలికిన ముప్పది రెండువేల సంకీర్తనలు తనకోసమే పాడుకోలేదు. తొలిరోజుల్లో ఆయనకోసం పాడుకొన్నాడేమోగానీ, తరువాత రోజుల్లో సమాజ శ్రేయస్సే ధ్యేయంగా పాడాడు.

సమాజ సంస్కరణ కోసం ఒక్కొక్కరు ఒక్కో మార్గాన్ని ఎన్నుకుంటారు. భక్తిమార్గాన్ని ఎన్నుకున్నవారు వాగ్గేయకారులు. వాగ్గేయకారులు అనగానే భగవంతుని మీద ఆత్మసంతృప్తి కోసం కీర్తనలు పాడుకునేవారని అపోహ ఒకటుంది. కానీ వారి కీర్తనల్ని అనుశీలిస్తే అందులో భక్తితత్త్వముతోపాటు సామాజిక స్పృహ ప్రతీయమానమవుతుంది. "అన్నమయ్య, వేమన, రామదాసు, త్యాగయ్య వీళ్ళంతా ఒక మతాన్ని ప్రచారం చెయ్యడానికి కవిత్వం చేపట్టలేదు. అందుకే ఒక నియమావళి కనిపించదు. తన అనుభవాలను, స్పందనలను, లోకరీతిని భగవంతునికి నివేదించి అభ్యుదయాన్ని నెలకొల్పడం వీరి లక్ష్యంగా తెలుస్తుంది. అందుకే వీళ్ళని 'సామాజిక స్పృహ గల తొలి తెలుగు కవులు' అనవచ్చు (తెలుగులో కవిత్వోద్యమాలు, పుట 28). వీరు దీనికోసం ఎన్నుకొన్న కవితామార్గం పదసాహిత్యం. ఆంధ్ర సాహిత్యాన్ని శిష్ట కవిత మ్రింగివేయగా శల్యప్రాయంగా నిలిచి నిరాదరణ పాలైన పదకవితకు పట్టం కట్టారు ఈ కవులు. పదకవితలో సంకీర్తనలు ఒక విధానం. ఒక పాటలోని మాటల సంవిధానం, సయ్యాసంవిధానం కలిసి పాడేవారిని వాగ్గేయకారులంటారు.

**"వాఙ్మాతురుచ్యతే గేయం ధాతురిత్యభిధీయతే**
**వాచం గేయం చకురుతేయః సవాగేయకారకః"**

అని నమ్మిన కాలంలో, అవి కేవలం రాజాధీనాలు అని తెలిసిన వైనంలో భక్తికవులు లౌకిక జీవితానురక్తులు కాక రాజాశ్రయాన్ని నిరసించారు. ఈ భావనలో వీరికి 'ఇమ్మనుజేశ్వరాధములకిచ్చి....." అన్న పోతన మార్గదర్శకుడు. ఇదే భావనను అన్నమయ్య :

**"హరిముకుందునిఁగొనియాడు నా జిహ్వ**
**నినుఁగొనియాడంగ నేరదు"** **(3-456)**

**"నరహరి కీర్తన నానిన జిహ్వ**
**నొరుల నుతింపఁగ నోపదు జిహ్వ"**

అంటూ 'రాజాల్మత్తుల్ వారి సేవ నరకప్రాయంబు' అన్న ధూర్జటికి వలె :

**"పల్లకీలు నందలాలు పడివాగెలేజీలు**
**వెల్లివిరి మహాలక్ష్మి విలాసములు**
**వొల్లఁగేమాకే సిరులు వొరులియ్యవలెనా"**

అని నిందిస్తాడు.

**"మనుజుడై పుట్టి మనుజుని సేవించి**
**అనుదినమును దుఃఖమందనేలా"**

అని ప్రశ్నిస్తాడు. రామదాసు కూడ

**"మానము విడిచి కసుమాల పాంటకొరకై**
**మానవుల వెంబడింతునె ఓ రామ"**

అనగా త్యాగయ్య పోతనకువలె 'కోటీశుల గని సాటిలేని పలుకు చోటిని నొసగి ముమ్మాటికి వేదను' అని ఖచ్చితంగా చెప్పాడు. వీరందరూ తొలుత రాజాశ్రయాన్ని పొందినవారే. కానీ ఆ రాజులు వీరి మార్గానికి ఆలంబనగా నిలబడిన దాఖలాలు లేవు. అన్నమయ్య మార్గానికి ఆసరాగా సాళువ నరసింహరాయలు నిలబడ్డం అన్నమయ్య ప్రత్యేకత.

సమాజంలోని రుగ్మతను రూపుమాపటంకోసం ఒక్కొక్కరు ఒక్కోవిధమైన మార్గాన్ని ఎన్నుకొంటారని చెప్పాం. సమాజంలో కుహనాభక్తులు, భక్తితత్త్వం తెలియనివాళ్ళ సందడి అధికమయింది. అసలు భక్తి అంటే ఏమిటి? 'స్వస్వరూపో దర్శనో భక్తిః' అని ఉపనిషద్వాక్యం. ఇది కాని బాహ్యవిషయ ప్రాధాన్యం భక్తిగా సంతరించుకోవటం ఇప్పుడే కాదు ఆ కాలంలో కూడా సంభవించింది. అందుకే వేమనాది కవులు ఆ మార్గాన్ని ఖండించారు. వేమన సమాజ రుగ్మతాక్షాళనకు వ్యంగ్య, హాస్య మార్గాన్ని ఎన్నుకొంటాడు. వేమన పలుకులో కాఠిన్యం కొరడా ఝళింపు వలె ఉంటుంది. సమాజ రుగ్మతాక్షాళనలో భాగంగా తీర్థ సేవ, యోగాభ్యాసం, గురువుకోసం వెతకడం వంటి అనేక విషయాలు అతని ఖండనకు పాత్రమయ్యాయి.

**"గుహలలోన జొచ్చి గురువును వెదుకంగా...**
**నీళ్ళమునుగనేల నిధులు మెట్టగనేల..."**

నిత్యం స్నానమాడే బాతులకు మోక్షం ఎందుకు రాదంటాడు.

**"ఆకులెల్లఁదిన్న మేకపోతులకెల్ల**
**గాకపోయెనయ్య కార్యసిద్ధి**
**లోకులెల్ల. వెర్రిపోకళ్ల పోదురు"**

అని ఈసడిస్తాడు.

భగవత్తత్త్వం తెలిసిన అనమయ్యది ఈ దృక్పథమే.

**"మిక్కిలి నీట మునింగే మీను కది స్నానమా**
**కొర్కెర ధ్యానము చేసుకోరి అది యోగమా"**

అంటాడు. ఈ విషయంలో భక్తి కవులందరిదీ ఒకేదారి.

**"నీళ్లలో మునిగి గొణుగుచు నుంటే**
**నిలకడ చెదునుర బరే బరే"**

అని వీరబ్రహ్మం

**"నీట కాకి మునుగు - నిరతము దయస్నానమా**
**తేట కనులు కొంగ గూర్చు - దేవ ధ్యానమా**
**పత్రములను మేయు మేక - బలమైన యుపాసమా"**

అని త్యాగయ్య భావన. ఎన్ని ఖండనలు జరిగినా ఈ భావాలన్నీ ఇప్పటికీ ఉన్నాయి కదా సమాజంలో. అనుసరించేవారేరి, పెద్దల మాటలను మనం గౌరవించడం లేదు. పెద్దలను గౌరవిస్తున్నాం. అది సులభం కదా! అన్నమయ్య పై భావాల్ని సంకీర్తనల ద్వారా సమాజంలో ప్రచారం చేశాడు.

భక్తి కవులలో అన్నమయ్యది ఒక ప్రత్యేక స్థానం. సర్వమానవ సమానత్వం ఆయన ఆశయం. ఆయన విశాల భావాలు ఆశ్చర్యపరుస్తాయి.

**"బ్రహ్మమొకటె పరబ్రహ్మమొకటె పర**
**బ్రహ్మమొకటె - పరబ్రహ్మమొకటె"**

అని ఎలుగెత్తి చాటాడు. మానవులే కాదు సర్వప్రాణులు సమానమే. మహారాజు నిద్రకు ప్రక్కనే బంటు నిద్రకు తేడాలేదు. 'కదగి ఏనుగుమీద గాయు యెండొకటే, పుదమి శునకము మీద బొలయునెండొకటే' శ్రీ వేంకటేశ్వరుని కరుణ కూడా పాపపుణ్యాల మీద సమంగా ప్రసరిస్తుందనడం అన్నమయ్య జాతి, వర్ణ, కుల, మత భేదాలకతీతమైన సమానత్వానికి నిదర్శనం.

చదువులలో మర్మమెల్ల చదవాలంటాడు పోతన గారు. చదువుల పరమార్థం శాంతమేనంటాడు అన్నమయ్య.

**"తనకేడ చదువులు తనకేడశాస్త్రాలు**
**మనసు చంచల బుద్ధి మానీ నా**
**చదివియు ఫలమేది శాంతము గలుగుదాకా"**

పూర్వం దైవజ్ఞత కోసం చదువులుండేవని కానీ నేడు దైవం లేదని చెప్పడానికి చదువులున్నాయని అంటాడు. 'విజాతులన్నియు వృథా వృథా' - జాతిభేదాలు అర్థరహితమైనవని ఆయన భావన. అన్నమయ్య ఔన్నత్యానికి, విశాల దృక్పథానికి ఈ క్రింది పాదాలే నిదర్శనం.

**"కొంచెమును ఘనముం గనుగొన నేల హరి దలంచు**
**పంచ మహాపాతకుండె బ్రాహ్మణోత్తముండు"**

అంటూ కులభేదాలు అర్థరహితమంటాడు.

అన్నమయ్య మరొక విశిష్టత జానపద సాహిత్యానికి విశిష్ట స్థానం కల్పించడం. 'ఏ వాఙ్మయంలోనైనా పద్యంకంటే పదమే ముందు పుట్టిందనడం నిర్వివాదం. జానపదులు కష్టసుఖాల్లో భావావేశాలకు లోనయినపుడు ఏ గుండెలోతుల్లోంచి అప్రయత్నంగా వెలువడే పాటలే జానపద గేయాలు'. అన్నమయ్య ప్రధానోద్దేశం వైష్ణవభక్తి ప్రచారమే కాదు, సామాజిక చైతన్యం కూడ. దీనికోసం అతను ఎన్నుకొన్న మార్గం జానపద రీతి. అన్నమయ్య పదం ఎలా ఉందో చెప్తాడు చిన్నన్న :

**"తేనెలపై తేట తిన్నని చెఱకు**
**పానకముల నేరు పరచిన మేలు"**

పదమే కాదు ఏ కవిత్వమైనా ఇట్లుంటేనే సజీవత. దేశికవితా ప్రక్రియకు చెందిన మేలుకొలుపు పాటలు, కోలాటం, గొబ్బి, తుమ్మెద, చందమామ, లాలి, జోల వంటి జానపద గేయఫంతులు అన్నమయ్య పదవాఙ్మయంలో కన్పిస్తాయి. ఆంధ్రలో కాస్త చిరపరిచితమైన చందమామ రావె, 'జో అచ్యుతానంద జోజో ముకుంద' వంటి పాటలకర్త అన్నమాచార్యులే. మరే వాగ్గేయకారుని పదాలు ప్రజలలోకి చొచ్చుకుపోకపోవడానికి కారణం వారు ఈ జానపదగీతి మార్గాన్ని అనుసరించకపోవడమే. అందుకే అన్నమయ్య కీర్తనలు సార్వజనీనతను సాధించాయి. ఆయన చేసిన దేశ సంచారమే ఇటువంటి మార్గాన్ని ఏర్పరచి ఉండాలి.

జానపద గేయ మార్గంలో మరో అంశం భాష. అన్నమయ్య ఉపయోగించిన భాష ఆయా భాషలకనుగుణంగా శిష్ట వ్యావహారికం, గ్రాంధికం, గ్రామ్యం అని మూడు విధాలుగా ఉంటుంది. ముఖ్యంగా జానపదులకోసం గ్రామ్యాన్ని వాడి సారళ్యాన్ని సాధించాడు. ఆనాటి సామాన్య జనుల జీవద్భాషను గ్రంథస్థము చేసిన ఘనత అన్నమయ్యదే. దేశ సంచారంలో అక్కడి దైవాలను కీర్తించడమేగాక ఆయా మాండలికాల్ని వాడడం వాటి సార్వజనీనతకు కారణం.

అన్నమయ్య మరో విశిష్టత తదనంతర కవులకు మార్గదర్శకుడు కావడం. వర్ణనాత్మకమైన ప్రబంధాల పుట్టుకకు అనువైన మార్గం ఏర్పడబోతున్న కాలంలో అన్నమయ్య అవతరించాడు. ఆంధ్ర సాహిత్యంలో ప్రబంధం ఒక విశిష్ట ప్రక్రియ. అయితే ప్రబంధావతరణం హఠాత్సంభూతం కాదు. నన్నయాదుల కాలం నుండే ప్రబంధ బీజాలు కన్పడుతున్నాయని విమర్శకుల ఉద్దేశం. విశేషించి అన్నమాచార్యులు ప్రబంధ యుగానికి బాగా సమీపస్థుడు. అన్నమయ్య కీర్తనల్లో వర్ణనాత్మకత ప్రత్యేకంగా పేర్కొనవలసిన అంశం. బాలకృష్ణుని నవరత్నాలుగా వర్ణిస్తాడు. దశావతారాలను మరోచోట వర్ణిస్తాడు. వేంకటేశుని అనేక ఏండ్లగా వర్ణిస్తాడు. అలమేలు మంగను వర్ణిస్తూ :

**"ఇన్ని రాసులయునికి ఇంతి చెలువపురాశి**
**కన్నె నీ రాశి కూటమి కలిగిన రాశి"** **(శృంగార సంకీర్తన, ఆరుద్ర)**

ఈ కీర్తన వినగానే వసు చరిత్ర గుర్తుకురాక మానదు.

**"అళిఘట మీన కేసరి శరాసన గోమకరంబులంగచం**
**బులంగుచనేత్ర మధ్యముల భ్రూకటి జంఘికలన్ జయించిని"**

అన్నమయ్య వివిధ సంకీర్తనలలోని భావాలు ప్రబంధాల్లో చోటుచేసుకోవడం పరిశోధనాత్మక అంశం.

అన్నమయ్య రచించినన్ని కీర్తనలు మరో వాగ్గేయకారుడు రచించకపోవడం ఒక ప్రత్యేకత అయితే తెలుగులోనేకాక సంస్కృతంలో కూడ సంకీర్తన చేయడం

మరో ప్రత్యేకత. ఆధ్యాత్మిక కీర్తనలేకాక మధుర భక్తి ప్రాధాన్యత కలిగిన కీర్తనలు మరో ప్రత్యేకత. అందుకే మార్గదేశికవిత్వాల సంగమం అన్నమయ్య రచనలు అంటారు.

ఆంధ్ర సాహిత్యం అనువాదంతో ప్రారంభం కావడమేకాదు ఎదుగుదల కూడ అనువాదమే. క్వాచితంగా ఒకటి రెండు గ్రంథాలున్నా దాదాపు అనువాదాలే, అనుసరణలే, అనుకరణలే. ఒక సామాజిక వ్యక్తిని, అంశాన్ని తీసుకొని కావ్యరచన చేసే తలంపు వారికి లేదు. ఆంధ్రావళి మోదం కోసమే రాసినా అందులో ప్రత్యక్షంగా వారి సమస్యలు ప్రస్తావన లేదు కదా! కాకపోతే వారి దృష్టి పారమార్థికం. ఏమైనా మన సాహిత్యంలో స్వతంత్రంగా కావ్య కవిత్వ రచన చేయడం స్వల్పం. ప్రజా సమస్యలు గూర్చి రాస్తే రాజాశ్రయం లభించదు కదా! ఇటువంటి స్థిర సాహిత్యంలో ఒక స్వతంత్ర సృజన ప్రారంభించడం అన్నమాచార్యుల విశిష్టత.

ఇన్ని విశిష్టతలను సాధించిన హరికీర్తనాచార్యుడు, పదకవితా పితామహుడు, పంచమాగమ సార్వభౌమ బిరుదాంకితుడు తాళ్లపాక అన్నమాచార్యులు మహాభక్తుడు. కాని కేవలం భక్తి పాటలు పాడుకొన్న సామాన్యుడు కాదు. సంగీతవేత్త అయినప్పటికీ నాదప్రధానమాన రచనలు చేయలేదు. మహాకవి అయినప్పటికీ కేవలం కావ్యాలు అల్లినవాడు కాదు. భక్తుడు, గాయకుడు, కవి అయిన అన్నమయ్య తదనంతరం వాగ్గేయకారులైన క్షేత్రయ్య, రామదాసు, త్యాగయ్య వంటి నాదోపాసకులకు మార్గదర్శకుడైనాడు. కేవలం విశిష్టాద్వైత మత ప్రవర్తకుడుగా మాత్రమేగాక సామాజిక చైతన్య ప్రబోధకుడుగా అజరామర కీర్తిని ఆర్జించిన మహనీయుడు అన్నమాచార్యులు.

***

# సామాజిక స్పృహతో అన్నమయ్య పదసాహిత్యం

**డా॥ మానమ మునిరత్నం**
**పరిశోధక విద్యార్థి**
**మద్రాసు యూనివర్శిటీ, చెన్నై**

ఏ కవి సమాజానికి దూరంగా ఉండి రచన చేయడం అసాధ్యం. సామాజిక స్పృహ అన్నమయ్య పదసాహిత్యంలో ఎలా వెలసింది అన్న విషయాన్ని గురించి తెలుసుకొనే మునుపు అన్నమయ్యకు పద సాహిత్యం ఎలా వంటపట్టిందనే విషయాన్ని ఖచ్చితంగా తెలుసుకోవాలి. పదసాహిత్యం ఎలా పుట్టి పాటగా, ఆటగా పామరజనానికి ఏవిధంగా ఉపయోగపడింది. ఆంధ్రదేశ నలుమూలల అన్నమయ్య పదసాహిత్యం ఏవిధంగా వెలసింది తదితర విషయాలతోపాటు సమాజంలో వున్న అసమానతలను అన్నమయ్య ఎలా పసిగట్టి వడగట్టాడో ఈనాటికి కూడా అన్నమయ్య పదసాహిత్యం

ఆబాలగోపాలానికి ఏవిధంగా ఉపకరిస్తుందనే విషయాలు ఈ వ్యాసంలో పొందుపరచడం జరిగింది.

పదమంటే పాట, పాడుకోవడానికి ఉపకరించేది. పదపద్య సాహిత్యాల్లో పదసాహిత్యమే ముందు పుట్టింది. మానవుడు అతి ప్రాచీనకాలంలో మాటనేర్చిన వెంటనే తనలోని ఆవేశకావేశాలకు, భావోద్రేకార్ద్రతలను, భక్తి ప్రేమలను, వలపుతలపులను అభివ్యక్తీకరించడానికి పాట నేర్చుకొన్నాడు. పాటతోపాటు ఆట నేర్చుకొన్నాడు. మాట-పాట-ఆట క్రమంగా మానవుని వ్యక్తిత్వాన్ని ఎంచాయి. అయితే ఆ పాటలు మౌఖికం మాత్రమే. తరువాతి కాలంలో సాహిత్య ప్రకర్ష పెరిగాక పద్యమై పండితులకు పరిమితమైంది. ఇదంతా లిఖిత సాహిత్యం. మౌఖికమైన జానపద సాహిత్యం అనాది, అది అన్ని సాహిత్యాలకు పునాది. ఇది మన తెలుగు సాహిత్యానికి మాత్రమే పరిమతం కాదు. ప్రపంచంలో ఉన్న అన్ని సాహిత్యాలకు వర్తించే లక్షణం.

అన్నమయ్య జనన కాలానికి తెలుగుదేశంలో ఏకఛత్రాధిపత్యం లేదు. తెలుగు దేశ చరిత్రలో క్రీ.శ. పదిహేనవ శతాబ్ది కాలం చాలా ప్రాముఖ్యతను కలిగివుంది. ఆకాలం నాటికి ఉత్తరాన గజపతులు, రాజమహేంద్రవరంలో రెడ్డిరాజులు, తెలంగాణాలో బహమనీలు, రాయలసీమలో విజయనగర రాజుల ప్రాబల్యం వహిస్తూ ఉండినారు. వీరందరిలోనూ విజయనగర రాజుల కాలానికి ఒక ప్రత్యేకత ఉందనవచ్చు. విక్రమశాలురై సమర్థులై రాజ్య విస్తరణ చేసినట్లుగానే కళలను కూడా పోషించి సాహితీ సమరాంగణ సార్వభౌములని పిలుచుకున్నారు. కళలలో ముఖ్యంగా సంగీత సాహిత్యాలు అనూహ్యంగా అభివృద్ధిని పొందినాయి. పదిహేనవ శతాబ్దపు సాహిత్యాన్ని ప్రబంధ కవిత, నిబంధ కవిత అని రెండు రకాలుగా విభజించవచ్చు. వానిలో ప్రబంధ కవిత, మార్గ కవిత కాగా, నిబంధ కవిత దేశీయ కవితను సంతరించుకొంది. అయితే ప్రపంధ కవిత క్రమేణా సమాజంలోని ఉన్నత వర్గాలకు పరిమితమైంది. నిబంధ కవిత చదువురాని వారికి కూడా వేదాంతాన్ని వెన్నముద్దలా చేసి ప్రజల హృదయాలలోకి చొచ్చుకొనిపోయి అపరిమిత ఆదరణను పొందింది. ఈ వేదాంతాన్నే లక్కమ్మ లేకలేక పుట్టిన తన బిడ్డగు ఉగ్గు పోస్తూ, ఉయ్యాలలూపుతూ, పాలు పడుతూ, లాలపోస్తూ, పాటలు పాడుతుంటే అన్నమయ్య మంత్రముగ్ధుడై వినేవాడు. ఆ కోనేటిరాయుడి పాటలే అతనికి వంటబట్టాయి. ఈ పాటలే సామాజిక స్పృహ కలిగి ప్రజల్ని చైతన్యవంతుల్ని చేసి మార్పు తీసుకొచ్చాయి.

కవులు మూడు రకాలు. (1) తమకు కలిగిన సామాజిక స్పృహతో సమాజాన్ని చైతన్యం చేయడానికి కలం పట్టేవాళ్ళు, వీళ్ళని సామాజిక నిబద్ధ కవులు అంటారు. (2) ప్రజల్ని అక్కడే ఉంచి తాము మాత్రం ముందుకు పోవడానికి రచనలు చేస్తారు. వీరిని సామాజిక అబద్ధపు కవులు అంటారు. (3) ఏ లక్ష్య సాధనకు కలం పట్టారో, ఆ దోవలోనే ప్రజల్ని కూడా నడిపించుకు వెడతారు. మన అన్నమయ్య ఈ కోవకి చెందినవారే.

ఆయన లక్ష్యం పారమార్థిక చింతనతో దైవసన్నిధిని చేరుకోవడం. ఆ లక్ష్యాన్ని తానొక్కడు మాత్రం చేరుకుంటే చాలదు. ప్రతి మనిషి చేరుకోవాలన్నదే ఆయన అభిప్రాయం. అందుకే ఆయన పాటలు రాసేసి నా పని అయిపోయిందని చేతులు దులిపేసుకోలేదు. ఊరూరా తిరిగి పాటలు పాడి ప్రజలను మేలుకొలపడానికి ప్రయత్నించాడు. అందుకు ఆయన ఎన్నుకొన్న భాష, భావం, రూపం మూడూ ప్రజలవే.

**రూపం :**

అన్నమయ్య కాలానికి తెలుగులో దేశి, మార్గ కవిత్వాలూ రెండూ ఉత్కృష్ట స్థాయిలోనే ఉన్నాయి. దేశ కవితకు పదం, మార్గకవితకు పద్యం మాధ్యమాలుగా ఉన్నాయి. అయితే దేశ కవిత పండితుల మన్ననలు పొందలేదు. దానిక్కారణం దేశి కవి తారూపమయిన పదాల్ని, పామరులు కూడా సలభంగా అల్లగలగడమే కావచ్చు. పనిపాటలు ఒకదానితో ఒకటి మిళితమై సాగిపోతాయి. పనిచేసేవాళ్ళందరూ పాడేది పాట. పనిచేస్తూ పాట పాడుతారు, పాటపాడుతూ పనిచేస్తారు. కాబట్టి, పనికి, పాటకు అవినాభావ సంబంధం ఏర్పడింది. బహుశా పని – పాట లేనివాళ్ళు రాసేది పద్యం అయి ఉండవచ్చు. అందుకనే పద్యం పండితులది, పాట ప్రజలది అయింది. అన్నమయ్య పాటను ఎంచుకోవడంలో ఆయన లక్ష్యశుద్ధి, సామాజిక స్పృహ అర్థమవుతుంది.

అన్నమయ్యకు పద్యం రాయడం చేతకాక కాదు, పాటయితే ప్రజలు సులభంగా గ్రహించగలరు, పాడుకోగలరు, అందుకని పాటను ఎంచుకున్నారు. పాట సంగీత ప్రధానమయింది. సంగీతం పామర జనరంజకం. అందుకనే శిశుర్వేత్తి, పశుర్వేత్తి వేత్తిగాన రసం ఫణిః అన్నారు. సంగీతాన్ని శిశువులు, పశువులు కూడా విని ఆనందించగలవు. పాములు కూడా వింటాయంటరు గాని, వాటికి చెవులుండవు కాబట్టి వినే అవకాశం లేదని సైన్స్ ధ్రువీకరించింది. చెవులు లేకపోయినా సంగీతాన్ని ఆస్వాదించవచ్చునన్న అభిప్రాయంతో అతిశయోక్తిగా చెప్పి ఉండవచ్చు. సంగీతాన్వితమయిన పాటను తన అభిప్రాయ వ్యక్తీకరణకు ఎన్నుకొన్నాడు. ఆయన పద్యరచన చేసి ఉంటే, ఆయన సాహిత్యం కేవలం పండితులకే పరిమితమై ఉండేది. ఆయన ఉద్దేశించిన సామాజిక లక్ష్యం నెరవేరి ఉండేది కాదు. ప్రజల నోళ్ళలో నలుగుతున్న పదాన్నే తన కవితారూపంగా ఎంచుకోవడం ద్వారా ఆయన సాహిత్యాన్ని సులభంగా ప్రజలవద్దకు తీసుకెళ్ళగలిగాడు. వాగ్మూలంగా మాత్రమే ఉన్న పదానికి లిఖిత రూపం ఇవ్వడం ద్వారా పదకవితా పితామహుడు కూడా అయ్యాడు. ఇవన్నీ అప్రయత్నాంగానో, అనాలోచితంగానో జరిగిపోయినవి కావు. సామాన్య కుటుంబంలో పుట్టి, సామాజికులతో కలసిమెలసి తిరగడం వల్ల ఆయనకు కలిగిన స్పృహకు నిదర్శనం. అన్నమయ్య పాటలు కేవలం సంగీతమయమే కాదు, అభినయ భరితం కూడా. అందుకనే ఆయన పాటలను ఆడుతూ పాడుకోవచ్చు. పాఠ్యంతోపాటు అర్థం

లక్ష్యంల్లా నిమగ్నం కావడానికి మరింత దోహదం చేస్తుంది. పాటకు ఎంత సామూహిక శక్తి ఉందో, ఆటకు కూడా అంత సామూహిక శక్తి ఉంది. సామూహిక శక్తి అన్నది లక్ష్యసాధనకు సులభమైన మార్గం. సమూహం మొత్తాన్ని ఒకేసారి లక్ష్యంవైపు తీసుకెళ్ళడానికి ఉపయోగపడేది ఆట, పాట. సామాజికుల్లో అప్పటికే ప్రాచుర్యం పొంది ఉన్న 'భజన' రూపాన్నే అన్నమయ్య స్వీకరించాడు. భజనపాటల్లో పాటతోపాటు ఆటకు కూడా ప్రాధాన్యం ఉంటుంది. ఆటపాటలకు వ్యక్తుల్ని సామూహిక శక్తులుగా మార్చే గుణం ఉంది.

సామాజికుల్ని లక్ష్యంగా ఎంచుకొన్న కవులందరూ పదకవితకు, గేయకవితకు పూనుకోవడానికి కారణం అవి హృదయాల్ని ఉద్రేకపరిచి లక్ష్యంవైపు పరుగు తీయించేట్టు చేయడమే. అన్నమయ్య కాలం నుంచి ఆధునిక కాలం వరకు సామాజికులను చైతన్యవంతుల్ని చేయదలచిన కవులందరూ పద్యానికన్నా, పదానికే – గేయానికే ఎక్కువ ప్రాధాన్యం ఇచ్చారు. అన్నమయ్య పదాల్లో జానపద ధోరణులు విరివిగా కనిపించడానికి ఆయనకు సామాన్య జనంతో ఉన్న అనుబంధం ఒక కారణమయితే, సామాన్య జనం కోసం తాను పాటలు రాస్తున్నానన్న సామాజిక స్పృహ ఆయన మనసులో ఎప్పుడూ మెదలుతూనే ఉండడం రెండో కారణం.

**భావం:**

కేవలం రూపంలోనే కాదు, భావంలో కూడా ఆయన ప్రజలకు దగ్గరగానే ఉన్నాడు. ఆయన ప్రధానంగా భక్తితత్పరుడు. వైష్ణవ మత ప్రచారకుడు. అయితే ఈ రెంటికోసం ఆయన నేలవిడిచి సాము చేయలేదు. శ్రీ వేంకటేశ్వర వైభవం పేరుతో ఒక ప్రౌఢకావ్యం రాసిపడేసి, పండితుల ప్రశంసలను అందుకొని ఉండవచ్చు.

సామాన్య ప్రజల నోళ్ళలో జానపద గేయాలుగా నానుతున్న జోలపాటలు, లాలిపాటలు, మేలుకొలుపు పాటలు, జాజరలు, తందనాన పాటలు మొదలయినవన్నీ అన్నమయ్య చేతిలో భక్తి పాటలుగా మారి మళ్ళీ సామాన్య ప్రజల నోళ్ళలోకి వెళ్ళాయి. భావం మార్చుకొని ప్రజల నుంచి ప్రజల్లోకి వెళ్ళిన అన్నమయ్య పాటలు అత్యంత సులభంగా ప్రజారంజకంగా కాగలిగాయి. సామాన్యులకు అందుబాటులో లేని వేదాలు, భగవద్గీత, పురాణాలలోని అనేక తాత్విక, మౌలికాంశాలను అన్నమయ్య పాటలుగా మార్చి ప్రజలకు అందించాడు. అలా వేదాలనో, భగవద్గీతనో చదివే అవకాశాన్ని ఆయన పామర జనానికి కలిగించాడు. భగవద్గీతలోని 'వాసాంసి జీర్ణాని...'[*] అనే శ్లోకాన్ని యథాతథంగా ఒక పాటగా రాశాడు :

> **"దేహినిత్యుడు దేహముల నిత్యాలు**
> **ఈహల నామనసా యిది మరువకుమీ!!"**

భగవద్గీతలోని ఈ శ్లోకం భావాన్ని ఒక సామాన్యుడు తెలుసుకోవాలంటే కనీసం అయిదు శతాబ్దాలు వేచి ఉండాలి. నిజానికి ఈనాటికి కూడా సామాన్యులకు చదువు

అందుబాటులోకి వచ్చినా భగవద్గీతను అర్థం చేసుకొనే స్థాయి మాత్రం రాలేదు. అన్నమయ్య ఆ పనిని నాలుగైదు వందల ఏళ్ళకు ముందే చేశాడు. అప్పుడు అది భగవద్గీతలోనిది అని తెలియకపోయినా, దాని భావమయినా తెలుసుకొనే అవకాశం ఎత్తు ఎదిగిన అన్నమయ్యను పండితులు అక్కున చేర్చుకోవాలనుకొంటున్నారు తప్ప, ఆ యువ భావజాలాన్ని ఆదరించలేకపోతున్నారు, ఆచరించలేకపోతున్నారు.

ధనబలం, బుద్ధిబలం, కండబలం, కులబలం ఇలా ఏదో ఒక బలాన్ని చూసుకొని మిడిసిపడుతున్న వీళ్ళు మనకు అడుగడుగునా కనిపిస్తారు. ఇలాంటివాళ్ళను

"ఎంత చదివిననేమి వినిన తన చింతయేల మాను సిరులే కలుగు" అనే పల్లవితో సాగే పాటలో అన్నమయ్య తీవ్రంగా నిరసిస్తారు.

ఇప్పటికీ మనల్ని గట్టిగా అంటిపెట్టుకొని కులాన్ని తోసిరమ్మని ఆయన అప్పుడు పిలుపునిచ్చాడు. "మనుజులందున మంచిచెడ్డలు రెండె కులములు" అని ఇరవయ్యో శతాబ్దంలో గురజాడ చెప్పిన భావాల్నే అన్నమయ్య మరోవిధంగా,

**"ఎక్కువ కులజుడైన హీనకులజుడైన**
**నిక్కమెరిగిన మహాత్ముడే ఘనుడు"**

అని చాటాడు.

రాజుకు, బంటుకు నిద్రలో తేడా లేదని, బ్రాహ్మణుడు, చండాలుడు ఉండే భూమి ఒకటేనని వర్గ, కుల భేదాలు మానవ కల్పితాలన్న అక్షరసత్యాలను తిరుగులేని ఉపమానాలతో ఉదహరించాడు. పాండిత్యం, తపస్సు, యజ్ఞయాగాదులు, పూజలు, పునస్కారాలులాంటి డాంబికాల కలవారే నేటికీ భక్తులుగా చెలామణి అవుతున్నారు. అయితే భక్తికి ఇవేవి అవసరం లేదని -

**"వేదములు చదివియును విముఖుడై హరిభక్తి**
**యాచరించని సోమయాజికంటె"**

ఒక మాటలో చెప్పాలంటే గాలి, నీరు అందరికీ ఎలా సమానమో అలాగే భక్తి కూడా కుల, వర్గాలకతీతంగా అందరికీ సమానమని వీధివీధి తిరిగి చాటిన ఘనత అన్నమయ్యది. కాబట్టి ఆయన్ని కేవలం భక్తి కవిగా మాత్రమే చూడ్డానికి వీల్లేదు.

జీవిత సత్యాన్ని కూడా అన్నమయ్య అద్భుతంగా చెప్పాడు. సంపాదన కోసం మనిషి ఎంత తాపత్రయపడుతాడో, ఎన్ని అఘాయిత్యాలు చేయిస్తున్నాడో చూస్తున్నాం. ఇంత చేసి ఏం సాధించబోతారన్నది ఆయన ప్రశ్న.

జీవితం బుద్బుతప్రాయమయింది. ఈ జీవితం కోసం అధికారాలు, పదవులు, సంపాదన, హత్యలు ఇన్ని గొడవలెందుకు?

"కన్నుదెరుచుటొకటి, కన్ను మూయుటొకటి" మనం జీవితంలో చేసేవి రెండే. ఈ రెండే సత్యాలు, మిగిలినవన్నీ నాటకాలే. అయితే మనిషి ఈ రెండు సత్యాలను వదలిపెట్టి, నాటకాన్నే నిజంగా భ్రమిస్తున్నాడని ఆవేదన పడతాడు.

**"జన్మించినప్పుడు ఏమీ తీసుకొనిరాము**
**మరణించినప్పుడు ఏమీ తీసుకొనిపోము"**

మధ్యలో ఎన్నో నాటకాలు ఆడి ఎంతో సంపాదిస్తాం. దాన్నే నడమంత్రపుసిరి అంటాడు అన్నమయ్య. పైకి ఇదంతా వైరాగ్యంలాగానే, వేదాంతంలాగానే కనిపిస్తుంది.

అయితే ఇందులో సామాజిక బావాజాలం ఒకటుంది. అందరూ కష్టపడాలి, అందరూ తినాలి. ఈ కష్టపడడానికి, తినడానికి మధ్య రెండోకంటికి కనిపించకుండా జేబులో వేసుకొని ఎవరూ సంపదనను పెంచుకోకూడదన్న సామాజికనీతి అంతర్లీనంగా ఉంది. ఎవరు ఎంతపనిచేస్తారో వాళ్ళకు అంతే ఫలితం దక్కాలన్న భావంతో కూడా ఆయన ఒక పాట రాశారు. సామాజికులతో సంబంధం లేకుండా, సామాజిక స్పృహ లేకుండా కేవలం భక్తి, వైరాగ్యాలను ప్రబోధించే కవి ఇలా రాయడం సాధ్యం కాదు. ఇలా రాయాల్సిన అవసరం కూడా లేదు. ఆయన రాసిన భక్తి, శృంగార కీర్తనలముందు సామాజిక కీర్తనలు సంఖ్యాపరంగా నిలవకపోవచ్చు. ఆ మాత్రంచేత ఆయన సామాజిక స్పృహను శంకించాల్సిన పనిలేదు.

**భాష:**

అన్నమయ్య భాష కూడా సామాన్యులదే. ఆయన మత ప్రచారం చేస్తున్నా, ఆయన పాటల్లో అడుగడుగునా పల్లె ప్రజల భాష తొణికిసలాడుతూ ఉంటుంది. సామెతలు, జాతీయాలు ఆయన పాటల్లో కొల్లలుగా ఉన్నాయి. సామెతలు, జాతీయాలతోనే పాటరాసి ఆయన ఒక ప్రయోగం చేశారు. రాయలసీమ ప్రాంతంలోని ప్రజలు వాడే పదాలు ఆయన పాటకు జీవం. ఇప్పుడు అన్నమయ్య పాటల్లోని భావాన్ని అర్థం చేసుకోవాలంటే రాయలసీమ ప్రాంతవాసుల భాష తెలిసి ఉండాలి. పండితులకు గోచరించని అన్నమయ్య ప్రయోగాలెన్నిటికో అర్థాలను పామరులు సులభంగా చెప్పగలగడానికి కారణం ఆయన భాష పామరులది కావడమే. అలా పామరరంజకంగా పాటరాసి స్వామి కార్యం, ప్రజాకార్యం తీర్చిన అన్నమయ్య ధన్యుడు.

చందమామను పిలవాలన్నా, జోల పాటలు పాడాలన్నా, సమాజంలో అస్పృశ్యత పోవాలన్నా అన్నమయ్యను తలవాల్సిందే. భక్తికి, ముక్తికి అన్నిటికీ ప్రత్యక్షంగానో లేదా పరోక్షంగానో అన్నమయ్య కవిత్వాన్ని రుచి చూడవలసిందే. ప్రజల నాలుకలపై నిరంతరం ఆయన రచించిన పండిత పామర జనరంజక పామర భాష వాడుకోవలసిందేనోయ్.

***

# అన్నమయ్య సంకీర్తనల్లో విష్ణుతత్త్వం

**డా॥ డి. యువశ్రీ**
**తెలుగు అధ్యాపకులు**
**గాయత్రీ డిగ్రీ మరియు పి.జి. కళాశాల**
**తిరుపతి**

ఆంధ్ర పద సాహిత్య చరిత్రలో నూతన శఖానికి శ్రీకారం చుట్టినవాడు తాళ్ళపాక అన్నమాచార్యుడు. తొలి తెలుగు వాగ్గేయకారుడుగా, సంకీర్తనాచార్యుడుగా, వేంకటేశ్వర భక్తి వ్యాపకుడుగా, విష్ణుతత్త్వ ప్రచారకుడుగా అనేక విధాలుగా ప్రసిద్ధి వహించిన అమర యశస్వి ఆయన.

కడప జిల్లా రాజంపేట మండలం తాళ్ళపాక గ్రామానికి చెందిన అన్నమయ్యకు గ్రామనామమే గృహనామంగా కూడా పరిణమించింది. అందువల్లనే అన్నమయ్య పూర్వులు నందవరీకులైనప్పటికీ అన్నమయ్య, ఆయన తరువాతివారు తాళ్ళపాక వారుగా ప్రసిద్ధులయ్యారు.

అన్నమయ్య పూర్వులు ఋగ్వేదశాఖకు చెందిన వైదికులు. అన్నమయ్య నుంచి వారంతా వైష్ణవులయ్యారు. ఆచార్యవాచ్చులుగా కొనసాగారు. అన్నమయ్య తిరుమలకు వచ్చి ఘనవిష్ణువు చేత వైష్ణవ దీక్ష పొందాడు. అహోబిలానికి వెళ్ళి ఆదివన్ శఠకోపయతి ద్వారా వైష్ణవాగమాలను అభ్యసించాడు. బాల్యమాదిగా అతనికి సంక్రమించిన వేంకటేశ్వర భక్తి క్రమంగా బలపడింది. రోజుకు ఒక కీర్తనకు తక్కువ కాకుండా తనమీద కీర్తన రచించమని ఆదేశించిన వేంకటేశ్వరుని అనుగ్రహంచేత 32వేల కీర్తనలు రచించాడు. వాటిలో అనేకాంశాలున్నాయి. భక్తి, మధుర భక్తి, విష్ణుస్తుతి, విష్ణుతత్త్వం, ప్రబోధము మొదలైనవి వాటిలో ప్రధానమైనవి. అన్నమయ్య సంకీర్తనల్లో వ్యక్తమయ్యే విష్ణుతత్త్వాన్ని గుర్తించడమే ప్రస్తుత పత్ర ప్రయత్నం.

హిందూ మతంలో అనేక అంతర్విభాగాలున్నాయి. వాటిలో అద్వైతం, విశిష్టాద్వైతం, ద్వైతం అనబడేవి త్రిమతాలుగా ప్రసిద్ధి వహించాయి. శైవం, వైష్ణవం, శాక్తం, గాణాపత్యం, కౌమారం, సౌరం అనేవి హిందూమత శాఖలుగా గణనకెక్కాయి. వీటిలో శైవం, వైష్ణవం భారతదేశమంతటా వ్యాపించి బాగా నిలదొక్కుకున్నాయి. శైవులు శివుణ్ణి, వైష్ణవులు విష్ణువుని పరదేవతలుగా భావించి ఆరాధిస్తారు. వీరే మోక్షప్రదాతలని విశ్వసిస్తారు.

వైష్ణవులకు ఆరాధ్యుడైన శ్రీ మహావిష్ణువు విశ్వవ్యాపకుడని, ఆదిమధ్యాంతరహితుడని వైష్ణవుల దృఢ విశ్వాసం. విష్ణువు త్రిమూర్తులలో ఒకడుగానూ

పరిగణింపబడుతున్నాడు. పదునాలుగు లోకాలను పరిపాలించే విష్ణువును వైష్ణవులు అనేక విధాలుగా ఆరాధిస్తారు. విశ్వవ్యాపకమైన విష్ణుతత్త్వాన్ని అర్థం చేసుకోవడం, ఆరాధించడం సులభం కాదు. విష్ణువు అయిదు స్థితులలో వుంటూ తనను ఆరాధించిన వారిని అనుగ్రహిస్తాడని వైష్ణవుల విశ్వాసం. పర, వ్యూహ, విభవ, అంతర్యామి, అర్చ అనేవే ఆ ఐదు స్థితులు. ఈ పరత్వాది పంచకంతోపాటు మరెన్నో లక్షణాలు విష్ణువుకాపాదించబడ్డాయి. వాటిలో కొన్ని సర్వజన సమాదరణీయాలై ఎంతో ప్రాముఖ్యాన్ని వహించాయి. అటువంటి వాటిలో సర్వమయత్వం, సర్వ నియంతృత్వం, కారుణ్యం, రూపం, రక్షణ మొదలైనవి పేర్కొనదగినవి. కాబట్టి "పర, వ్యూహ, విభవ, అంతర్యామి, అర్చ, సర్వమయత్వం, సర్వనియంతృత్వం, కారుణ్యం, రూపం, రక్షణ" – ఇవన్నీ విష్ణుతత్త్వ ప్రధాన లక్షణాలుగా చెప్పుకోవచ్చు. వీటిని పరిశీలిస్తే విష్ణుతత్త్వాన్ని స్థూలంగా పరిశీలించినట్లవుతుంది.

**పర :**

విష్ణు పరలోకవాస స్థితిని వైష్ణవులు "పర" అని వ్యవహరిస్తారు. విష్ణువు సర్వలోక పాలకుడు. సర్వ లోకాలు విష్ణు సామ్రాజ్యమనుకుంటే వైకుంఠం ఆతని రాజధాని. విష్ణువక్కడ నివసిస్తూ దిక్పాలురు, తక్కిన దేవతల సహాయంతోనూ, స్వీయ మహిమతోనూ, సర్వభువనపాలనం కొనసాగిస్తాడు. సారూప్య, సామీప్య, సాలోక్య గరిమను పొంది నిత్య సూరులతోబాటు విష్ణుదాసదాసీజనము వైకుంఠంలో విహరిస్తారు. వాళ్ళందరిచేత సేవింపబడుతూ వనజవాసయోగ్య వనమాలాలంకృత వక్షుడై వాసుదేవుడు వైకుంఠంలో వాసం చేస్తున్న వైనం తెలియజేసేదే "పర".

**అన్నమయ్య**

అన్నమయ్య తన రచనలో పలుచోట్ల వైకుంఠుని ప్రస్తావించాడు.

**"కలవి రెండే భూమి కానునిధానంబులు**
**జలజాక్షుడు నతని శరణాగతియును"** **(3-412)**

అన్నమయ్య వైకుంఠుని పేర్కొని అతనిపట్ల తమ భక్తి ప్రపత్తులను ప్రకటించి పరత్వాన్ని గుర్తించాడు.

**వ్యూహ**

నిరంతర భువనపాలనాది సమస్త కార్యభారాన్ని వహించి వున్న మహావిష్ణువు పాలసముద్రంలో విశ్రమిస్తాడని వైష్ణవుల విశ్వాసం. ఆదిశేషుడు క్షీరసాగరంలో ఒక పానుపయ్యాడని, విష్ణువతని మీద శయనించి యోగనిద్రలో ఉన్నాడని చెబుతారు. ఈ స్థితినే "వ్యూహ" అని వైష్ణవులు వ్యవహరిస్తారు. ప్రతి సంవత్సరం ఆషాఢ శుద్ధ ఏకాదశి శయనైకాదశి అనీ, కార్తీక శుద్ధ ఏకాదశి ఉత్థానైకాదశి అనీ వ్యవహరించబడుతూ వుంది. శయనైకాదశి నాడు మహావిష్ణువు పాల కడలిలో

శయనించి ఉత్థానైకాదశి నాడు నిదురలేస్తాడని కూడా చెబుతారు. ఈ విషయాన్ని ప్రస్తుతం స్మృతికి తెచ్చుకోవడమావశ్యకం.

**అన్నమయ్య**

అన్నమయ్య కూడా తన కీర్తనల్లో వ్యూహను హృద్యంగా కీర్తించాడు. ఏకాంతంగా క్షీరాబ్ధిలో శయనించే మహావిష్ణువు దగ్గరకు ఆయన ఇల్లాంద్రతోబాటు బ్రహ్మాది దేవతలను కూడా పంపి సేవింపజేసి తన సేవాసక్తిని ప్రకటించుకున్నాడు.

**"ఆదిమ పురుషుఁడచ్యుతుఁడచలుఁడనంతుండమలుఁడు**
**ఆ దేవుఁడీతఁడేపో హరి వేంకట విభుఁడు"** **(1-80)**

అన్నమయ్య విష్ణుదేవుని వ్యూహస్థితిని పేర్కొని ప్రశంసించి పెంపుగాంచాడు.

**విభవ**

విష్ణుదేవుని రామకృష్ణాద్యవతార విభవమే విభవస్థితి అని వైష్ణవులు భావిస్తారు. విష్ణువు వివిధ అవతారాలు ధరించిన విషయం విశ్వవిదితమే. దాటడం, దాటించడం అని అవతార శబ్దానికి అర్థం. భగవంతుడు కష్టాల్లో ఉన్నవాళ్ళ మధ్యకు వచ్చి వాళ్ళను ఉద్ధరించడానికి ప్రయత్నించడం, తాను ఆ కష్టాలు దాటడమేగాక వాటిలో కూరుకుపోయిన ఇతరులను కూడా దాటించడం అవతారం అనబడుతుంది.

'అవతారం' అంటే దిగడం. పైనుండి క్రిందికి రావడం. దేవుడు మనుష్యాది రూపములను ధరించడం అవతారమనబడుతుంది. ఊర్ధ్వ లోకంలో వున్న భగవంతుడు క్రిందికి వచ్చి ఇక్కడ శోకవ్యాకులమగ్నులై ఉన్న ప్రాణుల దుఃఖాన్ని నిర్మూలించి వాళ్ళను ఉద్ధరిస్తాడనీ ఇదియే అవతార ప్రయోజనమనీ, అభిజ్ఞుల అభిప్రాయం. సర్వశక్తిమంతుడైన విష్ణువు మరి ఏ శక్తి ప్రేరణా లేకనే స్వీయ సంకల్పంతోనే అవతరిస్తాడు. అధర్మం పెరిగినప్పుడు, ధర్మగ్లాని సంభవించినప్పుడు, దుష్టులు ప్రబలి శిష్టులను దుర్భర హింసకు గురిచేసినప్పుడు విష్ణువవతరిస్తాడు. ఈ విధంగానే పూర్వం అవతరించినట్లు మన పౌరాణిక గాథలు చెబుతాయి.

**॥ కం ॥ ఎప్పుడు ధర్మక్షయ మగు**
**నెప్పుడు పాపంబు వొడము నీలోకములో**
**నప్పుడు విశ్వేశుడు హరి**
**దప్పక విభుడయ్యుదన్ను దాసృజియించున్.**

శ్రీమద్భగవద్గీత నాల్గవ అధ్యాయంలో 7, 8 శ్లోకాల్లో కృష్ణుడు తన అవతారాలను గురించి తెలిపిన విషయం పై అభిప్రాయాన్ని బలపరుస్తూ ఉంది.

**॥ శ్లో ॥ యదాయదాహి ధర్మస్యగ్లానిర్భవతి భారత ।**
**అభ్యుత్థానమధర్మస్య తదాత్మానం సృజామ్యహమ్ ॥**

॥ శ్లో ॥ పరిత్రాణాయ సాధూనాం వినాశాయచ దుష్కృతామ్ ।
ధర్మసంస్థాపనార్థాయ సంభవామి యుగేయుగే ॥

లోక క్షేమార్థమై విష్ణువు ధరించిన అవతారాలు అసంఖ్యాకం. భాగవతం విష్ణుదేవుని అవతారాలు ఇరవై మూడు అని స్థూలంగా పేర్కొంది. అవి :

1. యజ్ఞవరాహ అవతారం
2. సుయజ్ఞావతారం
3. కపిల మహర్షి అవతారం
4. దత్తాత్త్రేయావతారం
5. సనకాద్యవతారం
6. నరనారాయణావతారం
7. ధ్రువావతారం
8. పృథుని అవతారం
9. వృషభావతారం
10. హయగ్రీవావతారం
11. మత్స్యావతారం
12. కూర్మావతారం
13. నృసింహావతారం
14. ఆదిమూలావతారం
15. వామనావతారం
16. హంసావతారం
17. ధన్వంతరి అవతారం
18. పరశురామావతారం
19. రామావతారం
20. కృష్ణావతారం
21. వ్యాసావతారం
22. బుద్ధావతారం
23. కల్కావతారం

ఈ ఇరవై మూడు అవతారాల్లోనూ పది అవతారాలు చాలా ప్రసిద్ధమైనవి, ముఖ్యమైనవని విజ్ఞులు విశ్వసిస్తారు. "ధారుణి బుద్ధ కలికి దశవిధ అవతార" అని అన్నమయ్య విష్ణుదేవుని దశావతారాలను ప్రస్తావించాడు.

దశావతారాలకు సంబంధించిన శ్లోకం ఒకటి ప్రస్తుతం పరిశీలించదగి ఉంది:

**"మత్స్యః కూర్మో వరాహశ్చ**
**నారసింహశ్చ వామనః**
**రామోరామశ్చ కృష్ణశ్చ**
**బుద్ధః కల్కిరేవచ"**

ఈ శ్లోకానికనుగుణంగా కూడా అన్నమయ్య కీర్తన ఒకటి ఉండటం గమనించదగి ఉంది.

**"ఇట్టి మమ్ము రక్షించుట యేమిదొడ్డ నీకు నేఁడు**
**బట్ట బాయిటనే నీవు పదిరూపులైతివి"** **(2-503)**

**మత్స్యావతారం**

దశావతారాల్లో మొదటి అవతారంగా పేర్కొనబడేది మత్స్యావతారం. ఇది సంపూర్ణ జలచరం. విశ్వమంతా ఏకార్ణవమైనప్పుడు దానిలో దాగిన లోకకంఠకుణ్ణి పరిమార్చేందుకు వేదాలను, సప్తర్షులను. బీజాలను, మానితీగలను పరిరక్షించేందుకు

తద్వారా సృష్టి నిరాఘాటంగా సాగడానికి దోహదం చేసేందుకు విష్ణువు మత్స్యావతారం ధరించాడు. ఈ విషయాలన్నీ ఇమిడేవిధంగా అన్నమయ్య కీర్తన రూపుదిద్దుకోవడం గమనార్హం.

**'పేరు నారాయణుఁడవు బెంబాడిచేఁతలు నీవి**
**నోరు మూసుకున్నఁబోదు నున్నని నీసుద్దులు (2-162)**

**కూర్మావతారం**

విష్ణుదేవుని దశావతారాల్లో కూర్మావతారం రెండవది. దేవతలకు జరామరణాలు లేని జీవితాన్ని ప్రదానం చేసేందుకు విష్ణువు క్షీరసాగర మధనం సూచించాడు. దేవతలు, రాక్షసులు మందర పర్వతాన్ని కవ్వంగా చేసుకొని పాలసముద్రాన్ని చిలికే పనికి ఉపక్రమించారు. కొండ సముద్రంలో మునిగిపోవడంతో దాన్ని పట్టి నిలిపేందుకు విష్ణువు కూర్మరూపం ధరించాడు. ఈ అవతారాన్ని అన్నమయ్య అనేకచోట్ల కొనియాడాడు. మచ్చుకు

**"ఇతనికంటే మరిదైవముఁగానము యెక్కడ వెదకిననితఁడే**
**అతిశయమగు మహిమలతో వెలసెను అన్నిటికాధారము దానే" (3-270)**

**వరాహావతారం**

అన్నమయ్య పలు కీర్తనల్లో వరాహ ప్రశంస చేసి ఉన్నాడు. వరాహావతార ప్రయోజనాలైన హిరణ్యాక్ష వధ, మహీతల పునస్థాపనం సంగ్రహంగా వెల్లడిస్తూ రచించిన ఈ కీర్తనాంశం మధురభావభరితం.

**"నేఁడు నీమహిమ నెరపెడి సమయము**
**వాఁడి మెరసి యిటు వరదుఁడ రావే" (3-184)**

**నరసింహావతారం**

అహోబిల క్షేత్రంలో కొన్నాళ్ళు నివసించునట్లు చెప్పబడే అన్నమయ్య నరసింహుని వినుతిస్తూ అసంఖ్యాకంగా కీర్తనలు రచించి ఉండడం సహజదూరమేమీ కాదు. కొన్ని కీర్తనల్లో నరసింహ దేవుని అవతార వృత్తాంతం చోటుచేసుకుంటే, మరికొన్ని కీర్తనల్లో ఆ దేవుని వైభవం ఆవిష్కృతమవుతుంది. హిరణ్యకశిప వధ, ప్రహ్లాద పాలన, లక్ష్మీదేవిని తొడపై నిడుకుని గద్దెమీద కూర్చోవడం మొదలైన అంశాలతో క్లుప్తంగా, ఉదాత్తంగా ఉన్న ఈ కీర్తన నరసింహావతారానికి పరిశీలించదగి వుంది.

**"విటిగిరి దానవవీరులదె**
**అతిముతి దేవతలాదేరదె (2-91)**

**వామనావతారం**

వామనుడు కూడా అన్నమయ్య ప్రీతికి, స్తుతికి పాత్రుడైనవాడే. బలి మదమణిగేందుకు అన్నివిధాలా అతనికంటే ఉన్నతుడే కావలసి వచ్చింది. కాబట్టి

వామనుడు త్రివిక్రమాకృతి ధరించాదేమోనన్న భావం ధ్వనించేట్టు అన్నమయ్య చక్కని రచన చేశాడు.

**"ఆదిమపూరుషుఁడచ్యుతుఁడచలుఁడనంతుండమలుఁడు**
**ఆదేవుఁడీతఁడేపో హరి వేంకట విభుఁడు"** **(1-80)**

**పరశురామావతారం**

అన్నమయ్య దశావతారాలలో పరశురామావతారాన్ని ప్రస్తావించాదేగానీ సమగ్ర పరశురామ వృత్తాంత గర్భితంగా సుదీర్ఘ కీర్తన రచించినట్లు తోచదు. క్షత్రియ భంజనం, మునిజనరక్షణ ప్రస్తావించే కీర్తనాంశాలు ఇక్కడ పరిశీలించదగి ఉన్నాయి.

**"అందరి బ్రదుకులు నాతనివే**
**కందువెల్ల శ్రీకాంతునిదే"** **(1-335)**

**రామావతారం**

ఆదర్శ మానవ జీవితాన్ని ఆవిష్కరించేందుకు విష్ణువు రామావతారం ధరించాడు. మానవీయ విలువల సమాహారంగా మానవత్వానికి లభించిన ఆకారంగా రాముణ్ణి చెప్పుకోవచ్చు. అన్నమయ్య రాముణ్ణి కీర్తిస్తూ అధిక సంఖ్యలోనే కీర్తనలు రచించాడు. వాటిలో కొన్ని రాముని జీవిత సంఘటనలను అక్కడక్కడా స్పృశిస్తే మరికొన్ని రాముని జీవితానికి దర్పణాలయ్యాయి. ఇంకొన్ని రాముని ఘనతను ఆవిష్కరించేందుకు ప్రయత్నించాయి. వీటిలో పరశురాముని భంగపాటు, శూర్పణఖ అవయవ ఛేదనం మినహా రాముని జీవితంలో చోటుచేసుకున్న దాదాపు అన్ని ముఖ్య సంఘటనలను వెల్లడి చేసేవిధంగా అన్నమయ్య రచించిన నకీర్తన ఇక్కడ పరిశీలించదగి ఉంది. ఈ కీర్తనలో వాల్మీకి రామాయణంలోని ఏడు కాండలు చోటుచేసుకోవడం గమనార్హం.

**"చెప్పితే నాశ్చర్యము సేసిన చేఁతలితఁడు**
**ముప్పిరి మనుజవేషమునఁ బుట్టెనీతఁడు"** **(4-477)**

**కృష్ణావతారం**

శ్రీ కృష్ణుడు శృంగార రసాధిదేవత, దక్షిణ నాయకుడు. తక్కిన ఏ అవతారాల్లోనూ లేని చక్రాది పంచాయుధాలను ఈ అవతారంలో ధరించి తన జ్ఞాన మహిమలను ప్రదర్శించి సాక్షాత్మహావిష్ణువనిపించుకొన్నవాడు. అన్నమయ్యకు వేంకటేశ్వరుడు ఎంత ముఖ్యమో కృష్ణుడు కూడా అంతే ముఖ్యం. కృష్ణుడికి సంబంధించి వేలకొలది కీర్తనలు అన్నమయ్యలో కనిపించే అవకాశం ఉంది. శ్రీకృష్ణుని దుష్టశిక్షణ, బాల్యక్రీడాదులు వస్తువుగా ఆధ్యాత్మిక పరంగానూ, గోపికలతో శ్రీకృష్ణుని క్రీడావిలాసాలు వస్తువుగా శృంగార పరంగానూ అన్నమయ్య అసంఖ్యాకంగా సంకీర్తనలు రాశాడు. శ్రీకృష్ణుని బాల్య సంఘటనలను తనలో ఇముడ్చుకున్న అన్నమయ్య కీర్తన కృష్ణావతార విశిష్టతను తెలియజేస్తూవుంది.

**"కనియు గానరు నీ మహిమ కౌరవ కంస జరాసంధాదులు**
**మనుజులు దనుజులఁ జంపిరనఁగ వినిమరి నీ శరణము చొరవలదా**
**(3-277)**

**బుద్ధావతారం**

అన్నమయ్య బుద్ధావతారాన్ని బుద్ధిపూర్వకంగా నోరార కీర్తించాడు. ఇతివృత్తాన్నంతా చెప్పకపోయినా చిన్న కథాంశాన్నే అనేకచోట్ల, అనేకసార్లు అన్నమయ్య వెల్లడించడం జరిగింది. దశావతారాలను వరుసగా కీర్తించినప్పుడల్లా బుద్ధావతారాన్ని విధిగా ప్రస్తావించాడు. ఈయన బుద్ధావతార ప్రశంసలో అసురాంగనల మానం కొల్లగొన్న అంశమే అధికంగా చోటుచేసుకొని ఉండటం గమనార్హం.

**"ఇతనికంటే మరిదైవముఁగానము యెక్కడ వెదకిన నితఁడే**
**అతిశయమగు మహిమలతో వెలసెను అన్నిటికాధారముదానె" (3-370)**

**కల్క్యవతారం**

దశావతారాల్లో చివరి అవతారంగా పరిగణింపబడేది కల్క్యవతారం. తక్కిన అవతారాలు తొమ్మిది జరిగిన అవతారాలు కాగా రానున్న అవతారం కల్క్యవతారం. అన్నమయ్య తాను పేర్కొనే దశావతారాల జాబితాలోనే కల్క్యవతారాన్ని కూడా పేర్కొన్నాడు. ఆ ఉదంతాన్ని నామమాత్రంగా కొనియాడాడు. కల్కి వాహనం గుఱ్ఱం. కాబట్టి గుఱ్ఱాన్ని నడిపేచేయి అని స్వామి హస్తాన్ని అభివర్ణించాడు.

**"ఇందరికి నభయంబు లిచ్చుఁజేయి**
**కందువగు మంచి బంగారు చేయి" (1-334)**

**అంతర్యామి**

వైష్ణవుల అభిప్రాయం మేరకు మహావిష్ణు మరోస్థితి అంతర్యామి. విష్ణువు ప్రాణులందరిలోనూ వ్యాపించి ఉంటాడని బుధులు భావిస్తారు. అయితే వైష్ణవులు విష్ణుదేవుని అంతర్యామిత్వాన్ని మహర్షుల హృదయాలకే పరిమితం చేశారు. నిరంతరం తన్ను ధ్యానించే మహర్షుల హృదయాల్లో విష్ణువు నిత్యనివాసం చేస్తుంటాడు. ఆతని ఈ స్థితినే వైష్ణవులు అంతర్యామిత్వమని వ్యవహరిస్తారు.

**అన్నమయ్య**

అనంతశయనుని అంతర్యామిత్వాన్ని అన్నమయ్య తన రచనల్లో అనేకసార్లు ప్రస్తావించాడు.

**యోగీశ్వరుల మతినుండేటి దేవుఁడు** అని విష్ణుదేవుని కొనియాడి వైష్ణవుల అంతర్యామిత్వ సిద్ధాంతానికి తన ఆదరణను తెలియజేశాడు.

**అర్చ**

విష్ణుదేవుని స్థితి పంచకంలో 'అర్చ' కూడా ఒకటి. కలియుగంలో దీనికెక్కువ ప్రాముఖ్యముంది. దారు, లోహ, పాషాణ, విగ్రహరూపంగా అర్చనీయంగా ఆలయాల్లో వుంటూ తన కటాక్ష వీక్షణాలతోనే భక్తుల మనోరథాలు సిద్ధింపజేస్తూ జగత్పాలనం చేసే విష్ణుదేవుని స్థితినే వైష్ణవులు 'అర్చ' అంటారు. దీన్నే అర్చావతార సమాధి అని కూడా వ్యవహరిస్తారు. మంత్రపూర్వకంగా ప్రాణప్రతిష్ఠ చేయబడిన విగ్రహంలో భగవంతుడు ఉంటాడనే విశ్వాసం నాటినుంచి నేటిదాకా ప్రజల్లో ఉంది. ఈ విశ్వాసంతోనే విగ్రహాలనర్చించి, సేవించి విశిష్ట స్థాయికి చేరుకోవాలని భక్తులు ప్రయత్నిస్తారు.

**అన్నమయ్య**

అన్నమయ్య అనేక పుణ్యక్షేత్రాలకు వెళ్ళాడు. అక్కడి అర్చామూర్తులను దర్శించి సేవించాడు. ఆయా మూర్తులనుద్దేశించి అప్పటికప్పుడే ఆశువుగా సంకీర్తనలు రచించి గానం చేశాడు. ఆలయాలకు వచ్చే భక్తజనానీకాన్ని పరవశింపజేశాడు. పలు పుణ్యక్షేత్రాల్లో వివిధ అర్చామూర్తులుగా వెలసిన మహావిష్ణువే శేషాద్రిమీద వేంకటేశ్వరుడుగా నెలకొన్నాడనే భావం ధ్వనించేలా రచింపబడ్డ ఈయన కీర్తన అర్చామూర్తులనుద్దేశించి ఈయన వ్రాసిన కీర్తనల్లో తలమానికమనిపించుకోదగి వుంది.

**"అన్నిచోట్లఁబరమాత్మ నీవు**
**యిన్నిరూపుల భ్రమయింతువుగా"** **(1-278)**

విష్ణుతత్త్వంలో తర్వాత పేర్కోదగిన అంశం 'సర్వమయత్వం'.

**సర్వమయత్వం**

విష్ణుదేవుడు సర్వదా సర్వత్రా వ్యాపించి ఉన్నాడని బుధులు చెబుతారు.

**అన్నమయ్య**

వైకుంఠుడు సర్వమయుడనే తలపుతో అన్నమయ్య ఎన్నో రచనలు చేశాడు. విష్ణువు విశ్వమయుడని, విరాట్ స్వరూపుడని ఎలుగెత్తి చాటాడు.

**"విశ్వమెల్ల నీ విరాడ్రూపము**
**శాశ్వత హరి నీ శరణులము"** **(3-530)**

**సర్వనియంతృత్వం**

మహావిష్ణువు సర్వనియంత. సర్వలోకాలలోని ప్రతి కదలిక అతని సంకల్పానుసారమే జరుగుతుంది. అన్నిలోకాలకు అతడే పాలకుడు. పై అంశాలను తనలో ఇముడ్చుకొని విష్ణువు సర్వనియామకుడు అనే అభిప్రాయం వ్యాప్తిలో ఉంది.

**అన్నమయ్య**

అన్నమయ్య మహావిష్ణు సర్వనియంతృత్వాన్ని మనసారా గానం చేశాడు. అనంతశయనుడే సర్వలోకేశుడని, అతని ఆజ్ఞ వలనే అంతా జరుగుతూవుందని ఎలుగెత్తి చాటాడు.

**"ఈతని నెఱంగకుంటే నిల స్వామిద్రోహము**
**ఘాతల నేఖు గుడిచి కాలువ పొగడుట"** **(3-536)**

**కారుణ్యం**

మహావిష్ణువు కరుణామయుడు. అతని కారుణ్యం నిరుపమానం. అనంతం. ఇది రెండు విధాలు. ఒకటి నిర్హేతుకము, రెండు సహేతుకము.

**నిర్హేతుక కారుణ్యం**

నిర్హేతుక కారుణ్యమంటే హేతువు లేకనే కారుణ్యం కనబరచడం. భక్తుడు లేక ఆపన్నుడు కోరకనే అతనిపట్ల భగవంతుడు ప్రదర్శించే అవ్యాజకృప ఈ కోవకు చెందింది. విష్ణుదేవునిలో వున్న ఈ రకపు దయను అన్నమయ్య కొనియాడిన విధం ప్రశంసనీయం.

**"నీకు నీసహజ మిది నాకు నా సహజమిది**
**యేకదా నీవే నిరుహేతుకబంధుఁడవు"** **(3-387)**

**సహేతుక కారుణ్యం**

హేతువుతో కూడిన కారుణ్యాన్నే సహేతుక కారుణ్యమని, వ్యాజకృప అని వ్యవహరిస్తారు. ఆపన్నుడు మొరపెట్టుకొన్న కారణం వల్ల భగవంతుడు తన కారుణ్యాన్ని అతనిమీద ప్రసరింపజేయడం సహేతుక కారుణ్యమనిపించు కుంటుంది. ఇటువంటి కారుణ్యాన్ని మహావిష్ణువు అనేకసార్లు ప్రదర్శించి భక్తులను, ఆర్తులను రక్షించాడు. ఇందుకు సంబంధించి కథలు మన సాహిత్యంలో విరివిగా లభిస్తాయి. ఈ అంశాలను దృష్టిలో ఉంచుకుని అన్నమయ్య శ్రీమన్నారాయణుని సహేతుక కృపను భక్తి పారవశ్యంతో అనేకవిధాలుగా కీర్తించాడు.

**"త్రిజగముల నెరుఁగు దేవదేవుఁడు**
**అనుజుని జనకుఁడైన ఆదినారాయణుఁడు"** **(3-523)**

**రూపం**

భగవంతుడు సగుణుడని, నిర్గుణుడని, సాకారుడని, నిరాకారుడని, అనాదినుంచి వివాదం వుంది. వైష్ణవులు విష్ణువు సాకారుడని భావిస్తారు. ఆయన ఆకారాన్ని మదిలో నిలిపి తదేక ధ్యానంతో ఏకాగ్రచిత్తులై తరిస్తారు. కమలాలను తలపించే పాదాలు, పీతాంబరం, బొడ్డులో తామర, ఉరములో లక్ష్మి, కౌస్తుభ శ్రీ వత్సాలు, చతుర్భుజాలు,

మెడలో తులసి పేరు, కెమ్మోవి, తామరల వంటి కన్నులు. తలమీద మెరిసే కిరీటం, నీలమేఘచ్ఛాయను పోలిన దేహం, చేతులలో పంచాయుధాలు, గొప్ప తేజస్సు, వీటన్నింటితో కూడిన ఆకారం విష్ణువుది. ఈ ఆకారం గాక కావలసినప్పుడల్లా ఎన్నో రకాలైన ఆకారాలు ధరిస్తుంటాడా మహానుభావుడు. చూడవేడుక గొలుపుతూ ఎంత చూసినా తనివితీరని ఆ దివ్యమంగళ విగ్రహం పట్ల వైష్ణవులకు ప్రత్యేకమైన భక్తి ప్రపత్తులున్నాయి. అన్నమయ్య ఈ మూర్తిని అక్కడక్కడ కీర్తించి వున్నాడు.

**"దేవ నమో దేవా**
**పావనగుణ గణభావా"** **(2-377)**

**రక్షణ**

త్రిమూర్తులైన బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులు మూడు కార్యాలు నిర్వహిస్తారని మన పురాణాలు చెబుతాయి. వాటిప్రకారం బ్రహ్మలోకాలను సృష్టిస్తాడు. విష్ణువు రక్షిస్తాడు. మహేశ్వరుడు సంహరిస్తాడు. విష్ణువు సర్వరక్షకుడని, తమనుకూడా కంటికి రెప్పలా సర్వదా కనిపెట్టుకొని కాపాడుతుంటాడని వైష్ణవులు భావిస్తారు. ఆయనే తమకు రక్షణ కాబట్టి భయపడవలసిన పనిలేదని వారు భావిస్తారు. ఈ భావనను బలపరిచేవిధంగా అన్నమయ్య రచనలు చేశాడు.

**"ఆదిమూలమే మాకు నంగరక్ష**
**శ్రీదేవుఁడే మాకు జీవరక్ష"** **(4-49)**

ఈ అంశాలన్నిటినీ అన్నమయ్య తన సంకీర్తనల్లో ప్రస్తావించి బలపరిచాడు. అన్నమయ్య అంతరంగాన్ని ఆకట్టుకున్న అనంతశయనుడు, అనంతుడు, విరాట్ స్వరూపుడు. అనేకాంశాలతో అలరారేవాడు. కాబట్టి అన్నమయ్య దర్శించిన విష్ణుతత్త్వాన్ని మనం కూడా అర్థం చేసుకుని, ఆకళింపుచేసుకుని తరించడమే తరుణోపాయం.

***